14606

అనువాదవాఙ్మయం
చరిత్ర

నా సభ్యతుల్లోని ప్రముఖులు

(1, 2 భాగాలు)

ప్రొఫెసర్ యన్.జి. రంగా

14606

అనువాదవాఙ్మయం
చరిత్ర

నా స్మృతుల్లోని ప్రముఖులు

(1, 2 భాగాలు)

ప్రొఫెసర్ యన్.జి. రంగా





అన్నమయ్య 14606 ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6

అనువాదవాఙ్మయం-77

చరిత్ర

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-8

నా స్మృతుల్లోని ప్రముఖులు

(1-2 భాగాలు)

ఆంగ్లమూలం
ఆచార్య యన్.జి. రంగా
రంగాభావన్, 3-6-116, హిమాయత్‌నగర్,
హైదరాబాదు -.500 029.
అనువాదం
వడ్డెంపూడి హనుమంతరావు
ప్రెసిడెంట్,
ది గుంటూరు ప్రెస్‌క్లబ్, కలెక్టర్ ఆఫీస్ కాంపౌండ్, గుంటూరు-4.

పరిష్కర్త
శ్రీ దరువూరి వీరయ్య,
ఎడిటర్,
కిసాన్ పబ్లికేషన్స్, 4వ లైన్, చంద్రమౌళినగర్, గుంటూరు-7

తెలుగు అకాడమి
హైదరాబాదు
1993

అన్నమయ్య అధ్యాత్మిక గ్రంథాలయం

Translation : Naa smruthullooni pramukhulu (Distinguished Acquaitances); **Author:** Prof. N.G. Ranga; **Translator:** Sri Vaddempudi Hanumantha Rao; **Scrutiniser:** Sri Daruvuri Veeraiah; First Edition 1993; pp. 20 + 612.

©English Version
PROF. N.G. RANGA

©Telugu Version
TELUGU AKADEMI
Hyderabad.

First Published, 1993
Copies : 1,000

All rights reserved. No part of this publication may be reproduced, stored in a retrieval system, or transmitted, in any form or by any means, electronic, mechanical, photo-copying, recording or otherwise, without the prior permission of the copyright owners.

This book is the Telugu translation of the English original entitled "Distinguished Acquaintances" by Prof. N.G. Ranga. The translation rights were obtained by the Telugu Akademi, Hyderabad. It has been brought out under the Scheme of Production of University level books sponsored by Government of India, Ministry of Human Resource Development, New Delhi.

Price : Rs. 51=00

Printed in India
Lasertypeset at M/s International Graphics, Hyderabad,
Printed at M/s Kanthi Printing Press, Vijayawada,
Andhra Pradesh.



అన్నమయ్య 14606 ఆధ్యాత్మిక గ్రంథాలయము
అన్నమయ్యవీధి, గుంటూరు-6
920

భూమిక

స్వాతంత్ర్యానంతరం దేశకాల పరిస్థితుల దృష్ట్యా కళాశాలలోగూడా విద్యాబోధన మాతృభాషలోనే జరపడం అభిలషణీయమని అధిక సంఖ్యాకులైన విజ్ఞులు, విద్యావేత్తలు, అధికార అనధికార ప్రముఖులు భావించారు. తత్పర్యవసానంగా మనరాష్ట్రంలో మొదట ఇంటర్మీడియట్ స్థాయిలో, ఆ తరవాత డిగ్రీస్థాయిలో తెలుగును బోధన భాష చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాలు ప్రగతిశీలమైన చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంలో విద్యార్థులకు, అధ్యాపకులకు అవసరమైన పాఠ్యగ్రంథాలు (text books) పఠనీయ గ్రంథాలు (reading material) ప్రచురించే బాధ్యత తెలుగు అకాడమీకి అప్పగించారు.

ఈ బాధ్యతను విజయవంతంగా నిర్వహించడంలో ఉండే సాధక బాధకాలు సహృదయులకు తెలియనివి కావు. మొదటిసారిగా తెలుగులో విభిన్న శాస్త్ర విషయాలపై గ్రంథ రచన చేయించాలంటే సమర్థులైన రచయితలను, సంపాదకులను నియమించి, వారు సకాలంలో నిర్దుష్టమైన రాతప్రతులను మాకు అందించే విధంగా కార్యక్రమాలను రూపొందించి, వారికి సముచిత రీతిని పారిభాషిక పదాలను అందించడం, పుస్తకాలకు చిత్రాలు తయారుచేయడం వంటి పనులన్నింటినీ సక్రమంగా సమన్వయించవలె. తరవాత అందంగా ముద్రించవలె. అప్పుడే విద్యార్థులకు సకాలంలో పుస్తకాలను అందజేయడం సాధ్యమవుతుంది. వీటి అన్నింటికీ మాకు లభించిన వ్యవధి చాల తక్కువ అనే విషయంతోబాటుగా మనరాష్ట్రాన్ని సంక్షోభస్థితి ఆవరించి ఉన్నదనే సంగతి కూడా అందరికి తెలిసినదే. అయినా, శక్తియుక్తులన్నింటినీ కేంద్రీకరించి అకాడమీ చాల వరకు విజయవంతంగానే ఆ సవాలును ఎదుర్కొనగలిగింది.

విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగులో శాస్త్ర గ్రంథాలను ప్రచురించే కార్యక్రమాన్ని మేం మూడు దశలుగా విభజించుకొన్నాం. అవి :

1. మౌలికమయిన పాఠ్య గ్రంథాలు (Original text-books and reading material) ప్రచురించడం.
2. ఆంగ్లభాషలో ఉన్న కొన్ని ప్రామాణిక శాస్త్ర గ్రంథాలకు తెలుగు అనువాదాలను ప్రకటించడం.
3. కొన్ని శాస్త్రాంశాలపైన మౌలికాలైన బృహద్వ్యాసాలు (monographs) రచింపజేసి ప్రకటించడం.

వీటిలో మొదటి అంచెగా ఇంటర్మీడియట్, డిగ్రీస్థాయి పాఠ్య, పఠనీయ గ్రంథాల ప్రచురణ దాదాపు ముగియవచ్చింది.

ఇంటర్మీడియట్ స్థాయిలో మొత్తం 12 శాస్త్రాలలో రమారమి 60 మౌలికమయిన పాఠ్య గ్రంథాలు ప్రచురించడమే కాకుండా, రాష్ట్రంలో విభిన్న ప్రాంతాలలో అధ్యాపకుల ప్రతినిధులను సమావేశపరిచి ఆయా గ్రంథాలను కూలంకషంగా విమర్శింపజేసినాం. చర్చా ఫలితాల నిపుణుల, సంపాదకులను, రయితల దృష్టికి తెచ్చిన మీదట ఆయా గ్రంథాలను పరిష్కరించి పునర్ముద్రించినాం.

డిగ్రీస్థాయిలో 2 శాస్త్రాలలో దాదాపు 300 మౌలికమయిన పఠనీయ గ్రంథాల ప్రచురణ కూడా మేం చేబట్టినాం. మూడు విశ్వవిద్యాలయాలలో అమలులో ఉన్న పాఠ్య ప్రణాళికలను సమన్వయ పరచి కొందరు సామాన్య విషయం (general study) గా, మరి కొందరు ఐచ్చిక విషయం (Optional or elective) చదివే శాస్త్ర విషయాలను సంబద్ధం చేసి గ్రంథాలు తయారుచేయించవలసి వచ్చింది. ఇంతవరకు మొదటి రెండవ సంవత్సరాలలో కావలసిన దాదాపు 200 పుస్తకాలను వెలువరించడం జరిగింది. తక్కిన గ్రంథాల ప్రచురణ కూడా త్వరలోనే పూర్తి కాగలదని ఆశిస్తున్నాం. పూర్తి అయిన వెంటనే వీటిని క్షుణ్ణంగా పునర్విమర్శించే కార్యక్రమాన్ని రూపొందించడం జరుగుతుంది.

ఉన్నత పాఠశాల స్థాయిలో కూడా విద్యార్థుల పరిశ్రమ పాఠ్య గ్రంథాలకు మాత్రమే పరిమితం కారాదని, ఆయా పాఠ్యాంశాల మీద విస్తృతాధ్యయనం (extensive study) గా, చేయించడం అత్యావశ్యకమని విద్యావేత్తల అభిప్రాయం. అటువంటప్పుడు కళాశాల స్థాయిలో విస్తృతాధ్యయనం ఎంత ముఖ్యమో వేరే చెప్పనక్కరలేదు. ఈ స్థాయిలో విస్తృతాధ్యయనాన్ని ప్రామాణిక గ్రంథాలు విధివిగా లభింపజేయడం అకాడమి ధ్యేయం. ఈ దృష్టితోనే కొన్ని ప్రామాణిక గ్రంథాల అనువాదాలూ, కొన్ని ముఖ్య శాస్త్రాంశాలపై బృహద్గ్యాసాలూ ప్రచురించవలెనని అకాడమి తలపెట్టింది. ఒక పక్క పఠనీయ గ్రంథాలను సిద్ధంచేయిస్తూనే ఇందుకు కూడా ప్రయత్నాలు ఆరంభించినాము. దీనివల్ల తెలుగులో శాస్త్ర విద్యాభ్యాసం చేసే విద్యార్థికి శాస్త్రబోధన చేసే అధ్యాపకునకు ఎంతో మేలు సమకూరగలదని మా విశ్వాసం.

మేం చేపట్టిన అనువాదాల కార్యక్రమం ఈ విధంగా ఉంది. శాస్త్ర గ్రంథాలు అనువాదం చేయగోరేవారిని ఆయాశాస్త్రాలలో ఎన్నుకొన్న ఒక్కటో రెండో ప్రామాణిక గ్రంథాలలోనుంచి కొన్ని పుటలు అనువదించి పంపవలసిందిగా మేం కోరినాం. ఆ విధంగా వచ్చిన నమూనా అనువాదాలను నిపుణులైన విశ్వవిద్యాలయాచార్యులకు పంపి ఎన్నిక చేయించినాం. ఒక్కొక్క గ్రంథానికి విస్తృతిని బట్టి, ఒకరిని మించి అనువాదకులు ఉండవచ్చు. కాని ఒక్కొక్క గ్రంథానికి ఒక్కొక్క పర్యవేక్షకుడు మాత్రమే ఉంటాడు. ఆయా ప్రత్యేక గ్రంథాలలో ఉండే సాధక బాధకాలను దృష్టిలో ఉంచుకొని ఈ పర్యవేక్షకులను నియమించడం జరిగింది.

ఉన్నత విద్యాబోధన భాషగా తెలుగు సుప్రతిష్ఠితం కావలెనన్న కొర్కెతో శక్తివంచన లేకుండా మేం చేస్తున్న పని విజయవంతం చేయడంలో మాకు ఎంతోమంది అండదండలు

లభించాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఔదార్యం, అకాడమీ పాలక వర్గం చేదోడు వాదోడు, విశ్వవిద్యాలయాల తోడ్పాటు, వివిధ కళాశాలాధికారులు, రచయితలు నిపుణులు, సంపాదకులు, ముద్రాపకులు, బ్లాక్ మేకర్స్ అందజేస్తున్న సహాయ సహకారాలు, విధి నిర్వహణలో మా ఉద్యోగ బృందం చూపుతున్న శ్రద్ధాసక్తులు ఇవన్నీ మా విజయ హేతువులే. వీరందరికీ మా కృతజ్ఞతలు.

అప్పుడప్పుడు అంతో ఇంతో మారుతూ ఉండే పాఠ్య ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని, మా ప్రచురణలపై సహృదయులైన విజ్ఞులు, అనుభవంగల అధ్యాపకులు చేసే సూచనలను గమనించి, సముచిత రీతిని ఈ గ్రంథాలను పరిష్కరించి పునర్ముద్రించే విషయంలో మేమెప్పుడూ సావధానులమయ్యే ఉన్నాం. మునుపటివలెనే మునుముందు కూడా విద్యార్థులు, అధ్యాపకులు, విజ్ఞులు మాకు సహాయ సహకారాలను అందించగలరనే మా విశ్వాసం.

తెలుగువారికి తుదిపల్కులు

ఋషితుల్యులు, త్యాగరాజ సంగీత భాగవతారు అన్నారు – "ఎందరో మహానుభావులు..". ఆ హెచ్చరిక మాటలను ప్రభావితులను గావించినది. కనుకనే యీ పుస్తకాన్ని చేర్చినాను.

క్రిందటి సప్త దశాబ్దములలో నేనూ, శ్రీమతి భారతీ దేవి పాల్గొన్న సేవా వ్రతమందు మాకెందరో అందిరి తీర్చిదిద్దిరి. మమ్ము ప్రోత్సాహ పరచిరి, మమ్మానంద పరచిరి. సేవా వ్రతానుష్ఠానమందు ఉల్లసం, ఉద్రేకం, ఓదార్పులందించినవారెందరో స్త్రీ, పురుష ప్రయోజకులు.

ఆ పెద్దలు, పిన్నలు, సమాచార సన్మానితులు, మాన్య మిత్రులు, ప్రఖ్యాత పెద్దలు, అందరు ఆదరణీయులలో కొందరిని మాత్రమే యీ గ్రంథములో సంస్మరించగల్గితిని. మరెందరికో నా కృతజ్ఞత తెల్పుకుంటూ ప్రేమంపు పల్కులు ప్రచురించినా, యీ పుస్తకము ప్రచురించిన తరువాత ఆ మాన్య మిత్రులలో శ్రీయుతులు బులుసు సాంబమూర్తి, పట్టాభి, వావిరాల గోపాల కృష్ణయ్య, శంకరన్ నంబూద్రిపాదు, రాజకుమారి అమృత కౌరు, సుశీలా నాయర్, దుర్గాబాయి, త్రిపాఠీ, ఆర్.దివాకరు, రామానంద తీర్థ, వారి శిష్యులు పి.వి.నరసింహా రావు, కోదాడ నారాయణ రావు, సుందరయ్య, శీల భద్రయాజి, సుందర రావు, గాడ్గిల్, నిజలింగప్ప, దరువూరి వీరయ్య, పల్నాటి గాంధీ వెంకయ్య, గాంధీ కృష్ణయ్య, పి. రాజన్న, మునిరత్నం (రాయలసీమ సేవాశ్రమం), కల్లూరి సుబ్బారావు, కళా వెంకట్రావు, రామభక్త చంద్రమౌళి, కొల్లా తాయారమ్మ, దివిసీమ కృష్ణారావు, భట్రాజు కృష్ణమూర్తి, కూర్మయ్య, బ్రహ్మయ్య, అన్నపూర్ణా దేవి, షణ్ముగం, వినయాశ్రమ తుమ్మల దంపతులు, తెలుగు వెంకా, మరెందరో నాకు అందినవారికి నా కృతజ్ఞతలు ప్రకటించితిని. వాటిని యీ గ్రంథమందు చేర్చజాలము కదా! మరో గ్రంథము ద్వారా ప్రచురించుటకు రైతాంగ పరిషత్తు ద్వారా కాని, తెలుగు సామాన్య పరిషత్తు ద్వారా గాని, శ్రీ సుబ్బారావు (ఆంధ్ర కిసాన్ కాంగ్రెసు) శ్రీ దరువూరి వీరయ్య ప్రచురింప ప్రయత్నింతురు.

నేను సాగిస్తున్న సేవావ్రత యాత్ర ప్రజాభ్యుదయము కొరకే! దీన జన రక్షణ కొరకే! ఈ యాత్రలో ఎవరెవరు, ఎంతెంతగా సంపోలు, సహాయాన్నందిస్తున్నారో తెలుసుకొనుచున్నాను. వారు ఎల్లెట్లు నాకు తోడ్పడుతూ ప్రజా సేవలు చేస్తున్నారో తెల్సుకొను అదృష్టము యీ విధంగా కల్గినది.

యీ ఇంగ్లీషు గ్రంథమును తెలుగులోనికి తర్జుమా చేయించాలని శ్రీ వీరయ్యతలచారు. వారికి తోడై రి, ఆంధ్ర కిసాను కాంగ్రెసు అధ్యక్షులు డాక్టరు సుబ్బారావు. వారిద్దరి ప్రయత్నాన్ని బలపరుస్తూ, తెలుగు అకాడమీ వారు, అధ్యక్షులు శ్రీ జనార్దన రెడ్డి, కార్యదర్శి, ప్రచురణకు పూనుకున్నారు. వారందరికి నేను కృతజ్ఞుడను.

తర్జుమా బహు కష్టమైన కృషి. ప్రసిద్ధ సంపాదకులు శ్రీ వడ్డెంపూడి హనుమంతరావు యీ సేవలనందించిరి. వారికివే నా వందనములు.

యీ గ్రంథమును ఇంగ్లీషులో వ్రాసితిని. 1976లోనే ప్రచురించితిని. ఇప్పుడీ తెలుగులో యీ ప్రచురణ ఎందులకు?

ఈ పుస్తకపు ప్రథమ ప్రకరణయందే సమాధానము కలదు. ఆ విజ్ఞాన చంద్రికా మండలి వారు, సంపాదకులు శ్రీ కొమర్రాజు లక్ష్మణ రావు, వారిలాగే, వయోజన విద్యా ప్రచారం చేసినవారే! ఆ రోజుల్లో (1920 కి ముందే) సరస్వతీ పూజలు చేసినారు కనుకనే, మా దంపతులం, మాతో చేరుతూ, ప్రజాస్వామిక రైతు కూలీ ప్రజారాజ్యాశయ ప్రచారం చేస్తూ గాంధేయ ధోరణిలో రాణిస్తున్న సంఘసేవాతత్పరులింతగా అందుచుండగల్గినారు. అలాగే యీనాడునూ యీ గ్రంథ ప్రచార సరళి యీ విధంగా సాగించి, వయోజన విద్యా విజ్ఞానం పెంచాలని కంకణధారులగుచున్నారు, శ్రీ దరువూరి వీరయ్య! వారికి నేను కృతజ్ఞుడను.

ప్రజాసేవకులకు 1967కు ముందే ఎన్నో ఇబ్బందులు కలుగుచుండెను. ఈ గడచిన 25 సంవత్సరాలలో ప్రజా సేవారంగములో మరెన్నెన్నో కష్టాలు, కార్పణ్యాలు, నష్టాలు పెరిగిపోతున్నవి. ఏ విధమైన ప్రజాసేవ చేయాలన్నా, ఏ సంస్థ ద్వారా త్యాగములు, సేవలు అర్పించాలన్నా, పోటీలు, ఎన్నికలు, భాష్యాలు అడ్డమగుచున్నవి. స్వార్థ త్యాగులెవ్వరో తేల్చుకొనుట ప్రజలకు కష్టమగుచున్నది.

అందువల్ల ప్రజాసేవా రంగమందు పోటీలు, స్పర్ధలు, ఎన్నికలు, విజయాపజయాలు ప్రజాసేవాపరాయణులను ఎదుర్కొనుచున్నవి.

ఇట్టి ఇబ్బందులనెదుర్కొని, యెటులో ఇంతింతగా సేవలనందిస్తూ, తోడి సేవకులను ప్రోత్సహిస్తూ, తాము నిరుత్సాహపడక నిలుచుంటూ, దశాబ్దాల పర్యంతం ప్రజాసేవారాధన చేయగలుగుచున్నవారిని గుర్తించి, అభిమానంతో ఆదరించి, ప్రేమించే, పూజించే తపోధనులు యీ రోజుల్లో కావాలి, అత్యవసరము! కనుకనే, యీలాంటి గ్రంథాల ద్వారా, వివిధ రంగాలలో శ్రమించుచున్న ప్రజా సేవకులు, నాయకులను ద్వేషాసూయలకు అతీతంగా, ఆత్మీయులుగా ఆలింగనం చేయుట ప్రజలకు వారి నాయకులకు, సేవావ్రతానుష్ఠానులకు అవసరం. కనుక వివిధ ప్రజాసేవా రంగాలలో వేర్వేరు రీతుల సమయానుకూలంగా ఎవరెవరు ఎంతెంతగా విజయులై తమ సేవా వ్రత ఆశయ సిద్ధి పొందగల్గారో తెలుగు బిడ్డలకు తెల్పుట ఆంధ్ర ప్రజా సేవావ్రతానుష్ఠానులకు అవసరం.

అందుకే ఇంత శ్రమ చేయబూనిన తెలుగు అకాడమీ వారు, వారి అధ్యక్ష కార్యదర్శులకు, వారికి తోడైన శ్రీ జనార్దన రెడ్డి, వీరయ్య, సుబ్బారావు, హనుమంతరావు, కార్యదర్శి శ్రీ రెడ్డి, అందరికీ నా కృతజ్ఞతాభివందనములు.

రంగా

12-3-92.

భారత రైతాంగ విద్యాలయం,

నిడుబ్రోలు:

ముందుమాట

స్వామి వివేకానంద, రామతీర్థ, గాంధి, బాలగంగాధరతిలక్, గోఖలే, మదన్‌మోహన మాలవ్యా, వీరేశలింగం గార్లు చేసిన ఉత్తమ కృషిని ఆదర్శంగా తీసుకొని, ప్రజాసేవారంగంలో ప్రవేశించవలసిందిగా, విద్యావంతులు, దేశభక్తులు ముందుచూపుగల ఆత్మగౌరవాభిమానులైన రైతు శ్రీ జంపని ఆంజనేయులు నన్ను ప్రోత్సహించారు. శైవ, వైష్ణవ భక్తుల త్యాగాలు, సేవలు, ఆయన చెబుతూ ఉంటే నాలో ఉత్సాహం ఉప్పొంగుతూ ఉండేది. 1917వ సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాలలో తమ బిడ్డలను పాఠశాలలకు పంపేందుకు – తల్లిదండ్రులను ప్రోత్సాహపరుస్తూ, గ్రామీణ గ్రంథాలయాలను నిర్వహిస్తూ, బీదకుటుంబాలనుంచి వచ్చిన గ్రామీణ విద్యార్థులకు పాఠశాల రుసుం చెల్లించేందుకు చందాలు వసూలు చేస్తూ, నా ప్రజాజీవితం ప్రారంభమైంది. హోమ్‌రూలు ఉద్యమాన్ని ప్రారంభించినందుకు మిస్ అనిబిసెంటును బ్రిటీషు ప్రభుత్వం వారు నిర్బంధించినందుకు నిరసనగా, మా రైతులనుంచి, కాంగ్రెసు లక్ష్యప్రకటనను సమర్థిస్తూ సంతకాలు సేకరించి, అప్పటి ప్రభుత్వ కార్యదర్శి "ఎడ్విన్ మాంటిగో" కు సంపడం ద్వారా నా రాజకీయ సాహసంలోని తొలి అనుభవాన్ని చవిచూశాను.

అప్పటినుంచి గాంధేయ శకంలోని, ఈ ఆరుదశాబ్దాల కాలంలో, తమ జాతికి రాజకీయ స్వాతంత్ర్యాన్ని లభింపజేసేందుకు, సాంఘిక అసమానతల నుంచి విముక్తి చేసేందుకు, ఎన్నో పోరాటాలుచేసి బాధలపాలైన ఉత్తమ భారత మాత పుత్రులూ, పుత్రికలు అనేకమందితో నాకు కలిగిన సంబంధాల ద్వారా, అనేక సందర్భాలలో నైతికంగా స్థాయిని, సమర్థనను పొందే అవకాశం నాకు కలిగింది.

ప్రజాసేవారంగంలో వారు చేసిన ఆత్మ త్యాగాన్ని నేను గ్రహించినప్పటికీ, బాధలు జెందుతున్న మానవజాతికి, బుద్ధుని – గాంధేయ మార్గంలో వారు చేసిన సేవలు యువతరానికి విప్పిజెప్పేందుకు నేను ఇందుకు పూనుకొంటున్నాను. సాధారణ ప్రజల కొరకై వారు సాగించిన ప్రజాహిత కార్యక్రమాలను, ప్రేరణ కలిగించే ప్రయత్నాలను వివరించటం ద్వారా విద్యావంతులైన యువకులను, యోధుల లాగా ధైర్యంతో ప్రజాసేవారంగంలోనికి విస్పార్థబుద్ధితో అడుగు వేయించడమే నా లక్ష్యం.

ఈ శతాబ్దంలోని రెండో అర్థభాగంలోని ప్రధానమైన యువతరం, ఉత్సాహవంతులైన విద్యార్థులు, శీఘ్రంగా అన్ని దేశాలు సామ్రాజ్యవాదపు దోపిడీనుంచి, బానిసత్వంనుంచి విముక్తినిపొంది, స్వాతంత్ర్యం పొందటాన్ని చూశారు. ఇప్పుడు వారు అశేష ప్రజానీకాన్ని దేశీయమైన ప్రతిఘాతశక్తులు, సాంఘిక, ఆర్థిక, మత, రాజకీయ రంగాల్లో అణచివేయటాన్ని గూడా చూస్తున్నారు.

ఈ యుగపు ప్రజాసేవకుల అభిమాన గురువైన గాంధీజీ, "ప్రముఖ పార్లమెంటేరియన్ లేదా శక్తివంతుడైన మంత్రిసేవలు ఎంత విలువైనవో ప్రజాసేవలో ఒక సాధారణ గ్రామీణ కార్యకర్త సేవలు గూడా అంతే విలువైనవ"ని చెప్పారు. స్వాతంత్ర్యం పొందిన నాటినుంచి మనం పొందిన వైఫల్యాలను చూసిన తరువాత, నిర్మాణ కార్యకర్తల విషయంలోను సాంఘిక విప్లవకారుల విషయంలోను ముందుచూపుతో ఆయన చెప్పిన ఆ భాష్యాలు ఎంత విలువైనవో మనం అర్థంచేసుకోగలం. అందువల్ల నిగర్వులూ,

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

నిరహంకారులైన అలాంటి అనేకమంది సామాజిక సేవకులకు ఈ గ్రంథం ద్వారా నేను నా అభివందనాలను తెలుపుకొంటున్నాను.

ప్రముఖులైన అనేకమంది ఈ ఉత్తమ వ్యక్తుల గురించి నా మాతృభాష అయిన తెలుగులోనే వ్రాశాను. శతాబ్ది లేదా షష్ట్యబ్ది పూర్తి ఉత్సవాలు దేశభక్తులచే నిర్వహించడం మొదలైన తరవాత ఇందులో కొందరి గురించి ఇంగ్లీషులో కూడా రాయసాగాను. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జిల్లా, గ్రామ స్థాయిలలో స్వయంసేవచేస్తూ త్యాగపూరితమైన కృషి సాగిస్తూ, ప్రత్యేకించి తరతరాలుగా సామాన్య ప్రజలు సామాజిక వ్యత్యాసాలతో జీవిస్తూ ఉండడాన్ని అంతంచేసేందుకు గ్రామీణ ప్రాంతాలలో నడుం బిగించి పనిచేయటానికి యువతరం నాముద్దాగా భావిస్తున్న తరుణంలో, మన జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు "గరీబీ హఠావో" నినాదం ద్వారా పేదరికాన్ని తొలగించటానికి కృషిచేసిన, నా సమకాలీనులైన అనేకమందిని గురించి ఇంగ్లీషులో రాసేందుకు ప్రజాస్వామ్య సంస్థల పట్ల క్రమేణా పెరుగుతున్న విశ్వాసం నన్ను పురికొల్పింది. నేను రాసిన వారి సేవలను, త్యాగాలను తెలుసుకోవడం ద్వారా, ఆంజనేయులు గారి ద్వారా నేను ప్రభావితం అయినట్లే, యువకులు జాతీయ నాయకుల జీవితాలను తెలుసుకొని, చైతన్యం కావాలని నేను కోరుకొంటున్నాను. ఈ సందర్భంలో నేను చాలా అదృష్టవంతుణ్ణనుకొంటున్నాను.

అభ్యుదయగాములైన దేశభక్తుల మధ్య, జాతీయస్థాయిలో దేశసేవా ప్రాధాన్యాన్ని గురించి ప్రధానంగా, సాంఘికన్యాయం, సర్వసమానత్వం, పునర్వికాసం, రాజకీయ స్వాతంత్ర్యం, జాతీయార్థిక విధానాల గురించి దేశవ్యాప్తంగా చర్చలు జరుగుతున్నాయి. మొదటి ప్రాధాన్యతల నెంచుకున్నవారు, అంటరానితనానికి వ్యతిరేకంగాను, స్త్రీల సమానహక్కులకోసం, కిందిస్థాయిలో ఉన్న వర్గాల సముద్ధరణ కోసం పోరాడారు. రెండో ప్రాధాన్య క్రమాన్ననుసరించినవారు దేశరాజకీయ స్వాతంత్ర సాధన కోసం పోరాడారు.

జాతీయ అవసరాల్లో ప్రత్యర్థులైన వేర్వేరు వర్గాల ముఖ్యనాయకులు పరస్పరం, ఒకరిని మరొకరు విప్లవ ప్రతీఘాత శక్తులని పేరుబెట్టి, తమ ప్రయోజనాలకోసం పోటీపడి నిందించుకోవడం దురదృష్టకరం. రాజకీయ అవసరం వారిని తొలగిపోవటానికి వీలులేని అలాంటి శత్రుత్వంలోకి నెడుతున్నది.

మహాత్మాగాంధీగారు వారికి మధ్యలో ఉండి సమతూకాన్ని సాధిస్తూ, దాదాపు అందరికీ అంగీకారమైన వ్యక్తిగా నిలిచారు. భారత రాజకీయ రంగం ముఖ్యంగా ఆర్థిక, సాంఘిక విషయాల్లో ముందున్న వారి చేతుల్లోనే ఉందనే విషయాన్ని ఆయన గ్రహించారు. అయితే బ్రిటీషు సామ్రాజ్యవాదం చేతుల్లోనుంచి, దేశానికి స్వాతంత్ర్యం లభించినిదే, లభించేంతవరకు, మనం సామాజిక విప్లవ పరిణామాన్ని అవసరమైన విధంగా సాధించలేమని ఆయన గుర్తించారు. సాంఘిక పునర్నిర్మాణపు పట్టామీద రాజకీయ విప్లవరథాన్ని నడిపించాలని ఆయన గ్రహించి అందుకు చిత్తశుద్ధితో కృషిచేశారు. అందువల్ల ఆయన నిర్మాణ కార్యక్రమాలపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించి, అస్పృశ్యతా నిర్మూలన కార్యక్రమం, ఖాదీ, గ్రామీణ పునర్నిర్మాణ కార్యక్రమాలు, స్త్రీజన సముద్ధరణ, స్త్రీ, రైతు, కూలీల దాస్యవిమోచనం, కుల,

మత వ్యత్యాసాలు లేకుండా, సంఘర్షణ లేకుండా సమానంగా జీవించడం కోసం శ్రద్ధవహించారు. నాలాంటి వారు అనేకమంది శ్రమజీవులైన రైతాంగంలోనుంచి, సామాన్య ప్రజలలో నుంచి వచ్చిన వారం, భారతదేశంలో సంపూర్ణ విప్లవం రావాల్సిన అవసరాన్ని గుర్తించి, సాంఘిక పరిణామం కోసం, రాజకీయ స్వాతంత్ర్యం కోసం జరిపే పోరాటంలో మనస్ఫూర్తిగా బాపూజీకి తోడుగా నిలిచి పనిచేసేందుకు పూనుకొన్నాం. అందులో నాలాంటి కొద్దిమంది మాత్రము అసహనంతో, భూస్వాముల, పారిశ్రామిక వేత్తల దోపిడీని వ్యతిరేకిస్తూ, వారికి వ్యతిరేకంగా రైతు, కూలీ, చేతిపనుల వారితో పోరాటాలు నడిపిస్తూ, మన రాజకీయ విప్లవాన్ని విస్తృతంగా సాగించసాగాం.

స్వాతంత్ర్యం సిద్ధించిన ముప్పైసంవత్సరాల తరవాత, సాంఘిక విప్లవ కార్యక్రమంలో, జాతీయ పునర్వికాసంలో తగిన శ్రద్ధతీసుకోలేనందువల్ల గాంధేయవాదులు, ఆత్మ గౌరవవాదులు, అంబేద్కర్ అనుయాయులు, కోరుకొన్న విధంగా కాకుండా, సామాన్య భారత ప్రజలు అన్ని కోణాల్లోనూ, "గరీబీలు" గానే బ్రతుకు తున్నారు. హరిజనులు, అణగార్చబడిన తరగతుల ప్రజలు, అవిద్యావంతులు, అమాయకులైన సాధారణ జనాలకు ఇంకా పూర్తిగా స్వాతంత్ర్యం సిద్ధించలేదు. తరతరాలుగా వారనుభవిస్తున్న దారిద్ర్యం, సామాజిక అసమానతలనుంచి వారిని బయటపడవేయాలంటే అవిశ్రాంతిగా సాంఘిక ఆర్థిక పోరాటాలను కొనసాగించినప్పుడు మాత్రమే అది సాధ్యం! అత్యవసరమైన ఈ సవాలు నెదుర్కొనేందుకు విప్లవ దృక్పథం కలిగిన మన యువకులు, గత అర్ధశతాబ్దంలో వేలాదిమంది విప్లవకారులు చేసిన సాంఘిక ప్రయోగాలను విప్లవాత్మకమైన త్యాగాలను, ధైర్యసాహసాలను తెలుసుకొని ఎక్కువ ఉత్సాహాన్ని పొందవలసిన అవసరం ఉంది. ప్రజాసేవారంగంలో గొప్పగా శ్రమించి, త్యాగధనులైన వారి ఉత్తమ జీవితాలను మీముందుంచి, నేను కానుకగా సమర్పిస్తున్నాను.

ఈ గ్రంథం రెండో సంపుటాన్ని పీలైనంతవరకు అచ్చుతప్పులు లేకుండా మీకందించాలని నేనాశిస్తున్నాను.

నిడుబ్రోలుకు చెందిన శ్రీ కావూరి సుబ్బారావు, రైతాంగ విద్యాలయానికి, గ్రామీణ ప్రజాసమాఖ్యకు గౌరవకార్యదర్శి, ఇండియన్ కౌన్సిల్-ఆఫ్ ఎగ్రికల్చరల్ రీసెర్చిలో పైపిస్టుగా పనిచేస్తున్నవారు, ఈ పుస్తకంలోని ప్రతి పదాన్ని, 1975వ సంవత్సరంలో వెలువడిన 'ఎగనీ అండ్ సొలేస్' అనే నా గ్రంథాన్ని అతిశ్రద్ధగా పైపుచేసి, తనకు వ్యక్తిగతంగా ఉన్న ప్రజాసేవానురక్తిని తన కాలాన్ని, శక్తిని మాకు ధారపోయటం ద్వారా, కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య ప్రజాస్వామ్య సిద్ధాంత ప్రచారం కోసం వినియోగించారు.

ఇందులో ప్రముఖంగా సంపాదక బాధ్యతలు నిర్వహించిన శ్రీ పి. రాజగోపాలనాయుడు యం.యల్.సి, కి నేను చాలా రుణపడి యున్నాను. స్థానిక పి.బి.యన్. కాలేజి, రైతాంగ విద్యాలయాలకు చెందిన శ్రీయుతులు సి.హెచ్.అమరయ్య, యం.ఎ (ఇంగ్లీషు), ఉమామహేశ్వరరావు యం.యస్.సి (ఫిజిక్స్), శివరామక్రిష్ణయ్య, యం.ఎ (ఇంగ్లీషు) ప్రిన్సిపాల్ జి.శ్రీమన్నారాయణ యం.ఎ. (ఎకనామిక్స్), సి.హెచ్.పూర్ణచంద్రరావు, యం.ఎ, వి.కె.పుష్ప,యం.ఎ, జి.యన్.రావు యం.బి.ఎ (యు.యస్.ఎ) గారలు ఇందులోని అనేక అధ్యాయాలను చదివి మన పౌరులకు అవసరమైన విధంగా, ఇవి ఎలా ఉపయోజన

విజ్ఞాన వ్యాప్తిని చేయగలవో సూచించినందుకు, ప్రత్యేకించి శ్రీ అమరయ్య, ఉమామహేశ్వర రావుగారలు దీనికి విషయసూచికను, పీఠికను సిద్ధపరిచినందుకు వారందరకు నేను కృతజ్ఞుడనై ఉన్నాను. ఆల్ ఇండియా రేడియో, లోక్‌సభ సెక్రటేరియట్, "భవాన్స్ జర్నల్" లకు వాటికి సంబంధించిన కొన్ని విభాగాలను ఇందులో ఉపయోగించుకునేందుకు అనుమతించినందుకు నా అభివందనాలు! హైద్రాబాద్, విజయవాడలకు సంబంధించిన దేశీబుక్స్ నేత శ్రీ బి.శివరామకృష్ణలకు ఈ మొదటి సంపుటాన్ని వెలువరించే కష్టతరమైన బాధ్యతను పైన వేసుకొన్నందుకు నా ప్రత్యేకాభివందనాలు.

నా సహచరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు రైతాంగ నాయకులు, కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య ప్రజాస్వామ్య సిద్ధాంత ప్రచారకులైన జి.లక్ష్మీనారాయణకు ఈసంపుటాన్ని అంకితమివ్వటం నాకర్తవ్యంగా నేను భావిస్తున్నాను.

నిడుబ్రోలు

యన్.జి.రంగ

సంపాదక వివరణము

ప్రజాసేవా రంగంలో ఆయనకు సంబంధం ఉన్న, ఆయనతో కలిసి పనిచేసిన అనేకమంది ప్రజాసేవకులను గురించి రంగాజీ ఇంగ్లీషులోను లేదా తెలుగులోను, అనేక సందర్భాలలో అభినందనలు తెలుపుతూ సంక్షిప్త చరిత్రలను వ్రాశారు. దృష్టాంతంగా లజపతిరాయ్, అనిబిసెంట్, శంకరన్, నంబూద్రిపాద్, మృదుల సారాబాయ్, సరూ, జయకర్, బి.పి.సింగ్, హెచ్.యస్.ద్వివేది, గాయత్రీదేవి, ఓ.పి.రామస్వామి రెడ్డియార్, పుల్లెల శ్యాంబాబు, ఆచార్య నరేంద్ర, శ్రీమన్నారాయణ్, కవులు జాషువా, తుమ్మల, అడవి, శ్రీ అండ్ శ్రీమతి జీవరాజ్ మెహతా, మహారూయ ప్రసాద్‌సిన్హా, జైసు ఖలాల్ హతీ, నిజలింగప్ప, డాక్టర్ బి.సి.రాయ్, రాజ్యలక్ష్మీదేవి, శ్రీనివాస అయ్యంగార్ అనంతశయనం, వై.బి.చవన్, సి.సుబ్రహ్మణ్యం, సంత్ ఫతేసింగ్, శ్రీనివాసశాస్త్రి, రుక్మిణి అరండేల్, ఆర్.ఆర్.దివాకర్, డి.బారువా, మోటూరి సత్యనారాయణ, కె.రఘురామయ్య, బి.గోపాలరెడ్డి, డాll స్వామినాధన్, మాస్టర్ తురుసింగ్, వంటి వారలను గురించిన ఆయన జ్ఞాపకాలు, జరిపిన సమాచేశాలు, యింకా అనేక మందికి సంబంధించినవి ఇందులో చోటుచేసుకోలేదు. అలాగే డాll పట్టాభి, కె.బ్రహ్మానందరెడ్డి, గారల గురించి ప్రపంచ తమిళ, తెలుగు మహాసభల గురించి ఇందులో రాలేదు. ప్రింటింగ్ ప్రెస్‌లో కాలనిర్ణయం వంటి కారణాల కారణంగాను, అక్షర క్రమంలో సంకలనం చేస్తున్నందున మధ్యలో మార్చడం కుదరదు, గనుక ఇందుకు సంబంధించిన కలం వ్యాఖ్యాలను ఇందులో చోటివ్వడం సాధ్యం కాలేదు. అందువల్ల మూడో సంపుటంలో వీటిని ప్రజలకు అందించగలమని సంపాదకులు తెలుపుకొంటున్నారు.

ఈ సంక్షిప్త కలం చిత్రీకరణలు, ఆయన ఆలోచనలతోపాటు, అనేక ఆసక్తికరమైన వ్యక్తిగత రాజకీయ అనుభవాలు, రంగాజీ కార్యక్రమాలను మనకు తెలియజేస్తున్నప్పటికీ వాటి పూర్తి పరిజ్ఞానాన్ని మనం సంపాదించుకోవాలంటే, ఆయన పుస్తకాలు "ఫైట్ ఫర్ ఫ్రీడమ్" (ఆయన స్వీయ చరిత్రలోని అధ్యాయాలు) 1957, "బాపూ బ్లెసెస్" (మహాత్మా గాంధీగారితో జరిపిన సంప్రతింపులు 1925-48), "ఎగసి అండ్ సాలోస్" (1935-1972) సంవత్సరాల మధ్య స్వదేశంలోనూ, విదేశాలలోని మిత్రులతో ఆయన జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాలు) "వై రంగా రిజైన్డ్ ఇన్ 1959", "వై హి హెయిల్డ్ రివల్యూషన్", "రిజర్టెంట్ మూసెస్" చదవటం మంచిది.

సూచన

ఇందులో తెలియజేసిన పేర్లలోని అక్షర క్రమంలో, మేము ఎలాంటి క్రమాన్ని పాటించలేదు. స్థలాలకు సంబంధించి, ప్రజలకు సంబంధించిన పేర్లను తెలియజేసేప్పుడు, సహజంగా మన వాడుకలో ఉన్న రీతిని అనుసరించాం. ఉదాహరణకు, కొందరు "REDDI" అని సంతకం చేస్తుంటే, మరికొందరు "REDDY"అని వ్రాస్తుంటారు. "LAKSHMINARAYANA" అన్న పేరును కూడా కొందరు " LAXMINARAYANA" అని వ్రాయడం కద్దు. పోస్టలు వారు NIDUBROLE అని వ్రాస్తుంటే స్థానిక ప్రజలు అదే వూరును " NIDUBROLU" అని వ్రాస్తుంటారు. ఆంగ్ల భాషలోను, ఇతర స్థానిక భాషలలోనూ, విభిన్నంగా ప్రజలు, పేర్లు, స్థలాల గురించి అక్షరక్రమాన్ని పాటిస్తుండడం వల్ల ఈ వ్యత్యాసం కలుగుతూ ఉంటుంది.

రంగాజీ తన మిత్రులు, సహచరుల గురించి చక్కటి ప్రేమతోను, సన్నిహితత్వంతోనూ రాశారనేది మనం గ్రహించవలసి ఉంటుంది. అందువల్ల గాంధీగారిని "బాపూజీ"గాను, సుభాష్ చంద్ర బోసును "నేతాజీ" గాను, రాజ్‌గోపాల్‌ను "రాజన్న"గాను, రాజగోపాలాచారిని "రాజాజీ"గాను, రఫీ అహ్మద్ కిద్వాయ్ ని "రఫీ"గాను, శ్రీ కె. నాగేశ్వరరావును "దేశోద్ధారక" అని, శ్రీ కొండా వెంకటప్పయ్యను "దేశభక్త" అని చదువరులతో ప్రస్తావించారు. అందువల్ల పాఠకులు మిగతా వ్యక్తుల విషయంలో యిలాగే ఆయన ప్రేమతో ఉపయోగించిన పదాలను సులభంగా గ్రహించగలరు.

(సంపాదకులు)

విషయ సూచిక

మొదటి భాగము

1.	మాన్య మిత్రులు	 1-8
2.	డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్	 9-16
3.	బాపూజీ యం.యస్. ఆనే	 17-21
4.	మహోన్నత సాంఘిక విప్లవకారులు - "అన్నా"	 21-29
5.	శ్రీమతి అరుణా అసఫాలీ	 30-32
6.	శ్రీ అసఫాలీ	 33-35
7.	శ్రీ బాపినీడు	 36-39
8.	శ్రీమతి భారతీ దేవి	 40-46
9.	శ్రీ ఠాకూర్ దాస్ భార్గవ్	 47-50
10.	శ్రీ యం. చలపతిరావు	 51-54
11.	శ్రీ దివాన్ చమన్ లాల్	 55-56
12.	దేవ్ వగైరాలు - ఒరిస్సా	 57-57
13.	శ్రీ భూలాభాయ్ దేశాయ్	 58-62
14.	శ్రీ మొరార్జీ దేశాయ్	 63-67
15.	శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్	 68-71
16.	శ్రీ ఈశ్వరదత్తు	 72-74
17.	గాంధీజీ	 75-87
18.	శ్రీ వి.వి.గిరి	 88-94
19.	శ్రీ గోపీచంద్	 95-97
20.	గుజరాత్ నాయకులు	 98-105
21.	శ్రీ హనుమంతయ్య	 106-108
22.	శ్రీమతి ఇందిరాగాంధీ	 109-123
23.	శ్రీ జవహర్లాల్ నెహ్రూ	 124-135
24.	శ్రీ జయప్రకాష్ నారాయణ్	 136-143
25.	శ్రీ యన్.యం.జోషి	 144-148
26.	డాహుమాయూన్ కబీర్	 149-151
27.	శ్రీమతి కమలాదేవి	 152-155

28. శ్రీ. హెచ్.వి. కామత్ 156-159
29. శ్రీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ 160-163
30. శ్రీ ఖాసా సుబ్బారావు 164-168
31. శ్రీ జె.బి. కృపలానీ 169-175
32. శ్రీ జి.వి.కృపానిధి 176-177
33. డాక్టర్ కుంజ్రూ 178-180
34. గౌతు లచ్చన్న 181-185
35. శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ 186-192
36. శ్రీ రామ మనోహర్ లోహియా 193-198
37. యర్.ఆర్.మసానీ 199-201
38. స్పీకర్ శ్రీ మౌలంకర్ 202-207
39. శ్రీ ఆశోక్ మెహతా 208-210
40. శ్రీ వి. పి. మీనన్ 211-215
41. శ్రీ మౌలానా అజాద్ 216-219
42. మదలియార్ సోదరులు 220-222
43. శ్రీ హిరేన్ ముఖర్జీ 223-227
44. శ్రీ శ్యాంప్రసాద్ ముఖర్జీ 228-231
45. శ్రీ కె.యం.మున్షీ 232-238
46. శ్రీ కామరాజ నాడార్ 239-244
47. శ్రీ పాతూరి నాగభూషణం 245-248
48. శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు 249-253
49. శ్రీ గుల్జారీలాల్ నందా 254-257
50. శ్రీ నార్ల వెంకటేశ్వరరావు
ఆయన మిత్రులు శ్రీ ఆచార్య 258-262
51. శ్రీనాధ్ పాయ్ 263-265

విషయ సూచిక

రెండవ భాగము

1. నేతాజీ సుభాష్ చంద్రబోసు 1-11
2. ఒరిస్సా నాయకులు 12-17
3. ఆక్సఫర్డ్ యూనివర్సిటీ - మైత్రిసంబంధాలు 18-24
4. శ్రీ యస్.కె.డి.పాలీవాల్ 25-27
5. శ్రీ గోవిందవల్లభ్ పంత్ 28-34
6. సర్దార్ వల్లభాయిపటేల్ 35-47
7. శ్రీ యస్.కె.పాటిల్ 48-51
8. శ్రీ ప్రగడ కోటయ్య 52-59
9. శ్రీ టంగుటూరి ప్రకాశం 60-66
10. పంజాబ్ రైతునాయకులు 67-75
11. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 76-82
12. శ్రీ రఫీ అహమ్మద్ కిద్వాయ్ 83-87
13. శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడు 88-90
14. శ్రీమతి లక్ష్మీరఘురామ్ 91-96
15. శ్రీ పి. రాజగోపాలనాయుడు 97-102
16. శ్రీ రాజాజీ 103-113
17. డాక్టర్ రాజేంద్రప్రసాద్ 114-119
18. శ్రీ రాజమహేంద్రప్రతాప్ 120-121
19. శ్రీ దండు నారాయణరాజు 122-126
20. కల్నల్ డి.యస్.రాజు. 127-129
21. రాజ్యసభ; శ్రీ దయాభాయ్‌పటేల్, శ్రీ రత్నస్వామి 130-133
22. కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యం 134-151
23. శ్రీ జగజ్జీవన్‌రాం. 152-155
24. శ్రీ గూడవల్లి రామబ్రహ్మం 156-160
25. శ్రీ వెంగపూడి రామకృష్ణ 161-166
26. శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి 167-171
27. శ్రీ నెల్లూరి వెంకట్రామానాయుడు 172-177
28. శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి 178-183

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-8

29. డాక్టర్ యం. చెన్నారెడ్డి 184-187
30. శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి 188-189
31. డా॥ కె. సదాశివరావు 190-191
32. స్వామి సహజానంద సరస్వతి 192-197
33. శ్రీ దామోదరం సంజీవయ్య 198-201
34. శ్రీమతి సరోజినీ నాయుడు 202-206
35. శ్రీ పట్టపర్తి స్వామిజీ - శ్రీ సత్యసాయిబాబా 207-216
36. శ్రీ సత్యమూర్తి 217-221
37. డాక్టర్ సి. నారాయణ రెడ్డి 222-226
38. శ్రీ షేక్ అబ్దుల్లా 227-232
39. శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి 233-237
40. శ్రీ బి. శివరావు 238-241
41. శ్రీ చౌధురి చరణ్ సింగ్ 242-245
42. శ్రీ జయపాల్ సింగ్ 246-249
43. శ్రీ శ్రీ ప్రకాశ 250-253
44. శ్రీ గొర్రెపాటి వెంకట సుబ్బయ్య 254-262
45. శ్రీమతి సుచేతా కృపలానీ 263-265
46. శ్రీ జి.కె.సుందరం 266-268
47. శ్రీ పురుషోత్తమదాస్ టాండన్ 269-272
48. స్వరాజ్యవాదులు 273-292
49. శ్రీ మహవీర్ త్యాగి 293-295
50. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ 296-302
51. వాహిని 303-306
52. వెలుగు రైతునిధి - శ్రీ వెలగా సుబ్బయ్య 307-309
53. శ్రీ కొండా వెంకటప్పయ్య 310-313
54. శ్రీ కందుకూరి వీరేశలింగం 314-318
55. శ్రీమతి విజయలక్ష్మి పండిట్ 319-322
56. వినయాశ్రమం 323-326
57. తెన్నేటి విశ్వనాధం 327-329
58. శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య 330-334
59. శ్రీ ఇందులాల్ యాగ్నిక్ 335-339
60. చిత్రకారులు శ్రీ యలవర్తి లక్ష్మయ్య 340-341

1వ భాగము



1

మాన్యమిత్రులు

వయోజన విద్య – ఆంధ్రవైతాళికులు

ఈ శతాబ్దంలోని తొలి పాదమంటే, జాతీయభావాలు తలెత్తిన భారతయులు తమ దేశానికి ప్రజాస్వామిక వ్యవస్థ రూపొందాలని, కలలు కంటూ ఉండేవారు.మనదేశంలో ఇంచుమించు 650 మంది సంస్థానాధీశులు వున్నారు. వారు ప్రాచీన సాంప్రదాయాన్ననుసరించి, అనువంశికమైన రాజరిక వ్యవస్థ ప్రాతిపదికతో రాజ్యాధీశులుగావారు వ్యవహరించబడుతున్నప్పటికీ, బ్రిటిష్ సామ్రాజ్య పరిధికి లోబడి మాత్రమే, తమ సంస్థానాలలో పరిపాలనను కొనసాగిస్తూ వస్తున్నారు. ప్రజాస్వామ్యయుతంగా ఓటు హక్కుపొంది, స్వతంత్ర భారతదేశం అవతరించి, సర్వసత్తాక ప్రతిపత్తి కలిగిన ప్రజాపాలన కలిగియుండటానికిగానీ, బ్రిటిష్ పాలనలోనే ఉండటాన్నిగానీ వారు బలపరచలేదు. సంస్థానాలపై తమ ఆధిపత్యాన్ని వదలుకోవడానికి వాళ్లు సిద్ధంగా లేరు. "అందరికీ కనీస ప్రాథమిక విద్య" అవసరమనే వినాదాన్ని గోపాలకృష్ణగోఖలే లేవదీసి, ఆ ప్రతిపాదనను "ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్"లో ఒక బిల్లును ప్రతిపాదించారు. అయితే ఆ బిల్లు ఆమోదం పొందలేదు.

సంస్కరణలతో కూడిన కొత్త రాజ్యాంగంలో పరిపాలనా వ్యవహారాల్లో పరిమిత భాగస్వామ్యాన్ని బ్రిటిష్ ప్రభుత్వం భారతీయులకు కల్పించడంతో,సంపన్నులైన భూస్వాములు, పట్టణ ప్రాంతాలలోని ప్రముఖులతో పాటు ఓటు హక్కు ఆదనంగా మధ్యతరగతి మేధావులకుసైతం లభించింది. రాజకీయ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొంటున్న అభ్యుదయ దృక్పథం కలిగిన యువకుల్లో కొందరు దేశభక్తిగల ఉదారుల వితరణతో గ్రంథ ప్రచురణ సంస్థలను ప్రారంభించసాగారు. చరిత్ర, ఆర్థికశాస్త్రం, రాజకీయాలు, ఆధునిక విజ్ఞాన శాస్త్రం తదితర అంశాల పట్ల యువకుల్లో ఆసక్తిని రేకెత్తించి, వారిని విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడమే యీ ప్రచురణ సంస్థల స్థాపనోద్దేశ్యం! బెంగాల్ రాష్ట్రం ఈ విషయంలో ముందంజలో ఉంది. బ్రిటిష్ పాలనకు అనువైన కుటిల పద్ధతిని లార్డ్‌కర్జను చట్టపరమైన చర్యల ద్వారా వేపట్టినప్పటికీ, తద్వారా ప్రజల్లో జాతీయ భావాలు పెల్లుబికాయి. ఇందుకు కారకుడైన కర్జనును ఒక విధంగా అభినందించవలసిందే. ఆంధ్ర, మహారాష్ట్ర, పంజాబ్ రాష్ట్రాలు తమ తమ ప్రాంతీయ భాషల్లో గ్రంథ ప్రచురణలను ప్రారంభించి,ప్రజలను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతూ, ఈ మార్గాన్ని ముందుకు తీసుకెళ్లాయి. విజ్ఞాన దాయకమైన గ్రంథ ప్రచురణల ద్వారా ఇందుకు పూనుకున్న ప్రచురణ కర్తలు, ప్రజల్ని చైతన్యవంతులుగా, విద్యావంతులుగా తీర్చిదిద్దడం ద్వారా, వారిలో సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాట సమాచారాన్ని, దేశభక్తినీ నెలకొల్పేందుకు గ్రంథ ప్రచురణ ఉద్యమాన్ని తక్షణకార్యక్రమంగా స్వీకరించడం జరిగింది.

కొమర్రాజు వెంకటలక్ష్మణరావు

శ్రీ కొమర్రాజు వేంకటలక్ష్మణరావు యం.ఎగారు కృష్ణా జిల్లాలో చిన్నపాటి మునగాల జమిందారీకి దివాన్‌గా ఉండేవారు. మహారాష్ట్రవంశస్థులైన ఈయన చరిత్ర పరిశోధనలో ఆసక్తి

కలిగిన గొప్ప చరిత్రకారులు! తమ రచనల ద్వారా తెలుగు భాషను సుసంపన్నంగావించేందుకు తాను జీవితాన్ని అంకితం చేసారు. వీరు గొప్ప దేశభక్తి గలవారు. ఆధునిక శాస్త్రాలనూ, చరిత్రగ్రంధాలను ప్రచురించి, ప్రజలను చైతన్యపరచి, వారిని దేశభక్తి పరులు గావించేందుకు. ఈయన శ్రీ కందుకూరి వీరేశలింగంగారిని ఆదర్శంగా తీసుకున్నారు. ఈ ఉద్యమంలో కృతకృత్యులుగావడానికి,వీరు పలువురి విద్యాచేత్తల సహకారాన్ని సంపాదించగలిగారు. శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుతో సహకరించినవారిలో ఒకరైన శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1883లో జన్మించారు. శ్రీ గాడిచర్ల కర్నూలుకు చెందినవారు. రెండవవారు డాక్టరు ఆచంట లక్ష్మీపతి ఈయన 1881లో జన్మించారు. మూడోవారు శ్రీ అయ్యదేవరకాళేశ్వరరావు. వీరు కూడా 1881 లోనే జన్మించారు. విజయవాడకు చెందినవారు. వీరంతా 1907-1908లో 'విజ్ఞాన చంద్రికాగ్రంథమండలి'ని స్థాపించి, ఆధునిక విషయాలపై సామాన్య ప్రజలకు అర్థమయ్యే శైలిలో, తెలుగు భాషలో సంభైకి పైగా గ్రంథాలను ప్రచురించారు. సనాతన గ్రాంథిక భాషావేత్తలపై ధ్వజమెత్తి, తెలుగువాఙ్మయంలో విప్లవాన్ని రేకెత్తించిన వ్యావహారిక భాషా ఉద్యమకారులైన సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగంగారు, విజ్ఞాన చంద్రికా గ్రంథ మండలి ప్రచురణోద్యమాన్ని ఎంతగానో ప్రోత్సహించారు. ఈ గ్రంథ ప్రచురణోద్యమానికి ప్రభావితులై మచిలీపట్నం జాతీయ కళాశాల ప్రధానాచార్యులైన శ్రీ కోపల్లె వసుమంతరావు, కృష్ణపత్రిక సంపాదకులైన శ్రీ ముట్నూరి కృష్ణారావుగారలు ఇద్దరూ ఈ ఉద్యమ కార్యక్రమంలో ప్రవేశించి, దానిని మరింత పరిపుష్టంగావించారు. వీరు గొప్ప జాతీయవాదులు. వారి ప్రచురణలు నన్నూ, మామగారైన శ్రీ రామస్వామినీ, నా మార్గదర్శి శ్రీ జె. అంజయ్య (మా గ్రామానికి చెందినవారు) గారినీ ఎంతగానో ఉత్తేజపరచి ఉత్సాహపరిచాయి. సనాతన ఛాందస భావాలకు వ్యతిరేకంగా నూతన తెలుగుదారులవైపు పయనించేందుకు మమ్ములను సమాయత్త పరచి, పాతబావాలకు స్వస్తిపలికి, వాస్తవ పూరితమైన, ఆధునిక దృక్పథాన్ని కలిగించి, చైతన్య పూరితమైన సామాజిక జీవన విధానాన్ని అన్వేషించేందుకు మమ్ములను సువిశాల విశ్వంలోకి నడిపించాయి. అప్పట్లోనే గొప్ప దూరదృష్టికలిగి,సంఘ ప్రయోజనాన్ని ఆశించిన, వయోజన విద్యామార్గదర్శి శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారి శతజయంతి ఉత్సవాలను ఈనాడు జరుపుకుంటున్నందుకు, ఆంధ్రులు ఎంతగానో గర్వించవలసి ఉంది.

శ్రీ హరిసర్వోత్తమరావు

1908లో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా 'స్వరాజ్య' తెలుగువార పత్రికలో వ్యాసాలను వ్రాసి నందుకు 8 సంవత్సరాల జైలుశిక్షకు గురిఅయినధైర్య శాలి, మేధావి శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు. రచయితలో బ్రిటిష్ దమనకాండకు గురి అయిన వారిలో శ్రీ గాడిచర్ల ప్రథములు. అంతేగాదు దక్షిణ దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు ఎదురొడ్డి నిలిచిన తొలి దేశభక్తుడాయన! తెలుగు భాషలో ప్రచురింపబడుతున్న తొలి తెలుగుదినపత్రిక 'ఆంధ్రపత్రిక'కు సంపాదకత్వం వహించిన సాహసోపేతుడైన పత్రికా సంపాదకుడు శ్రీ గాడిచర్ల! ఆంధ్ర, ఆంగ్ల భాషలలో రెండింటిలోనూ ఆయన అనర్గళమైన ఉపన్యాసకుడు! భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణం కోసం ప్రాంతీయ భాషల అభివృద్ధికి ఆయన గట్టిగా కృషి చేసారు. సర్వజనాభ్యుదయాన్ని,

సంక్షేమాన్ని కోరే, ప్రజాస్వామికవాది! దక్షిణభారతదేశంలో వయోజనవిద్యోద్యమానికి పితామహుడు శ్రీ గాడిచర్ల!

అబ్రహాంలింకన్‌ను గురించి శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావు గొప్ప గ్రంథాన్ని రచించారు. ప్రజాస్వామికభావాలను పుణికి పుచ్చుకొని, మానవతా దృష్టితో తెల్ల, నల్లరంగు జాతుల మధ్య సమానత్వ సాధన, బానిసత్వ నిర్మూలనకొరకు లింకన్ మహాశయుడు సాగించిన పోరాటం శ్రీ హరిసర్వోత్తమరావుని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదే సమయంలో భారతీయులు తమ బానిస సంకెళ్లను త్రెంచుకునేందుకు బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాటాన్ని కొనసాగిస్తున్నారు. వర్ణవిచక్షణ రంగు భేదం మన దేశంలో కూడా ఉంది. వర్ణ వ్యవస్థ పేరిట ప్రజల మధ్య హెచ్చుతగ్గులూ, దారుణమైన సాంఘిక పీడన సాగుతున్నది. బానిసత్వ నిర్మూలనలో, వర్ణవిచక్షణను వ్యతిరేకించడంలోనూ ఈ ఇద్దరి భావాల్లో సమన్వయం ఉన్నందున, శ్రీ గాడిచర్ల తన భావాలను లింకన్ మహాశయునితో పోల్చుకున్నట్లు విదితమవుతున్నది. ఉన్నత వ్యక్తుల మనోభావాలు పరస్పర ఆశ్రయంగా, పారూప్యంగా ఉంటాయని ఈ ఇద్దరిభావ పీఠికలు నిరూపిస్తున్నాయి. అప్పట్లో హైస్కూలు విద్యార్థిగాఉన్న నేను, శ్రీ గాడిచర్ల రచించిన లింకన్ జీవిత చరిత్ర గ్రంథాన్ని చదివిఎంతగానో ఉత్తేజితుడినైనాను.

శ్రీ రామకోటేశ్వరరావు

నరసరావుపేటవారైన శ్రీ కోనెన్నురామకోటేశ్వరరావు, యం.ఎ.బి.యల్ గారు, పంజాబ్‌కు చెందిన గొప్ప జాతీయ నాయకులైన శ్రీ లాలాలజపతిరాయ్‌గారి వరవడిలో, ఆంధ్ర యువకులకు రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించాలనిప్రయత్నించారు. నరసరావుపేట నుంచి ప్రచురింపబడుతున్న ప్రముఖ ఆంగ్లమాసపత్రిక "త్రివేణి"కి ఆయన సంపాదకులు! ఆయన కొన్నాళ్లు శాసనసభ్యులుగా కూడా ఉన్నారు. 1920లో రామకోటేశ్వరరావుగారు విజయవాడలో రాజకీయశిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు.

సంస్కరణల ద్వారా లభించనున్న రాజ్యాంగ వ్యవహారాల గురించి ఓటు హక్కు, విధులు, బాధ్యతలు, చట్టాలు, వాటి స్వరూప స్వభావాల గురించి శిక్షణా శిబిరంలో యువకులకు బోధించేవారు. 1900లో వీరేశలింగం పంతులుగారు అందించిన స్ఫూర్తితో, పట్టణాలు, గ్రామీణప్రాంతాలలో గ్రంథాలయ ఉద్యమం ద్వారా చైతన్యవంతులైన కొద్దిమంది యువకులు మాత్రమే, ఈ శిక్షణ శిబిరాల పట్ల ఆకర్షితులైనారు. విజయవాడకు చెందిన జాతీయవాది శ్రీ అయ్యంకి వెంకట రమణయ్యగారు స్థాపించిన రామమోహనలైబ్రరీ యువకుల్లో చైతన్యశక్తి పెంపొందడానికి ఎంతగానో దోహదపడింది. దక్షిణదేశంలో గ్రంథాలయోద్యమం విస్తరించడానికి, గ్రామీణప్రాంతాలలో వయోజన విద్య వ్యాప్తిచెందడానికి శ్రీ అయ్యంకి తీవ్రంగా కృషి చేశారు. అయ్యంకి ప్రారంభించినగ్రంథాలయోద్యమాన్ని నేటికీ పాతూరి నాగభూషణంగారు కుంటుపడకుండా నడిపిస్తూనే ఉన్నారు.

1924 నాటికి శ్రీ చెరుకువాడ నరసింహం, శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్య, పి. రామాచారిగారు, శ్రీ మాగంటి బాపినీడు, ఆదే సమయంలో పాశ్చాత్య దేశాల్లో యుద్ధానంతరం నూతనంగా తలెత్తిన మానవతా దృక్పథం, రాజకీయ పరిణామాలు, నానాజాతి సమితి ద్వారా

పెల్లుబికిన వివిన్న జాతీయోద్యమాలను బాగా ఆకలింపుచేసుకొన్న నేనూ, శ్రీ అయ్యంకి, వారి అనుచరులు కొనసాగించిన వయోజన విద్య, గ్రంథాలయోద్యమానికి గ్రామీణ ప్రాంతాల్లో మలివునాదుల్ని వేశాం! విధీదీపాల ముందుకూచుని విద్యనభ్యసించే అద్భుతమైన ప్రక్రియను ప్రవేశపెట్టి 'వీడు' మాకృషికి మరింత ఊపందించారు.

శ్రీ చెరుకువాడ నరసింహం

తదుపరి మేమంతా రాజకీయ, అర్థశాస్త్రాలను ప్రజలలో ప్రచారం చేసేందుకు సాహిత్యరంగాన్ని ఎంచుకుని, వివిధ ప్రక్రియలను చేపట్టినాము. అవిశ్రాంత కార్యక్రమాల్లో మునిగితేలుతున్న విజయవాడ పురపాలక సంఘాధ్యక్షులు శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు,దిగవల్లి శివరావు, ముదిగంటి జగ్గన్నశాస్త్రి వంటి గాంధేయవాదులు చిన్నచిన్న గ్రంథాలను రచించి, ప్రచురించడం మొదలెట్టారు. మహాపురుషుల గాథలు, జీవిత చరిత్రలు వంటి గ్రంథాలను తెలుగులో వెలువరించడం ద్వారా, ఆంధ్ర ప్రజలు విజ్ఞానవంతులు, చైతన్యవంతులవడానికి దోహదపడుతూ, ప్రజలను జాతీయోద్యమం వైపు ఆకర్షించగలిగారు.

మధ్యతరగతి యువకులను తన ఉపన్యాసాల ద్వారా చైతన్యపరుస్తూ జాతీయోద్యమం వైపువారిని మళ్లిస్తూ, వారి నరనరాల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చి, సాంఘిక, రాజకీయ ఆలోచనా మార్గం వెంటవారిని పరుగులు తీయిస్తూ, శ్రీ చెరుకువాడ తన కృషిని కొనసాగించారు. ఆయన గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, కాంగ్రెసు సంస్థకు ప్రముఖులైన ప్రచారకార్యకర్త! చిరునవ్వులతో, హాస్యం తొణికిసలాడే ఉపన్యాసాలూ, పురాణగాథలతో, సామెతలను జోడిస్తూ, గ్రామీణ మాండలిక భాషలో, లక్ష్యంవైపువారిని శ్రీ చెరుకువాడ ముందుకు నడిపిస్తూ ఉండేవారు. 1920-45 మధ్య కాలంలో శ్రీ చెరుకువాడ ఉపన్యాసాలు లక్షలాది ఆంధ్రులను దేశభక్తులుగా సమాయత్తం చేసాయి. మరో ప్రముఖ వక్త శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు ఉపన్యాసకులేగాక, గొప్పరచయితగా పటిష్ఠమైన తన రచనలద్వారా ప్రజలను ఉర్రూతలూగిస్తూ ఉండేవారు.

గ్రామీణ విద్యాలయాలు

1933వ సంవత్సరంలో, నిడుబ్రోలులో శ్రీ రామానీడు విద్యాలయానికి నేను శ్రీకారం చుట్టి ప్రారంభించాను. దీనికి మహాత్మాగాంధీగారు ప్రారంభోత్సవం జరిపారు. దీని వరవడిలోనే గాంధీజీ సబర్మతిలోనూ,లాలాలజపతిరాయ్ లాహోర్‌లోనూ, కోవెల్లె వసుమంతరావుగారు మచిలిపట్టణంలోనూజాతీయ విద్యాలయాలూ, కళాశాలలూ స్థాపించడం జరిగింది. గ్రామీణ యువకులలో విద్యావ్యాప్తికిఈ ప్రక్రియ నాందిపలికింది.

శ్రీ యుతులు గాడిచర్ల, బాపనీడు, చెరకువాడ గారలు మా విద్యాలయానికి ఎంతగానో సహకరిస్తూ వచ్చారు. జాతీయ, ప్రజాస్వామ్య, సామ్యవాద సిద్ధాంతాలను, వాటి లక్ష్యాలను విద్యార్థులకు మా విద్యాలయం విపులంగా బోధిస్తూ, జాతీయోద్యమం వైపు ఆకర్షిస్తూ ఉండేది. శ్రీ గోగినేని లక్ష్మినారాయణ ఈ విద్యాలయానికి వ్యవహర్తగా ఉండేవారు. గ్రామీణ ప్రాంతాల్లోని తరగతులకు చెందిన యువకులకు ప్రజాసేవారంగంలో ఈ విద్యాలయం శిక్షణగరుపుతూ ఉండేది. అట్టడుగు వర్గాల ప్రజల సముద్ధరణకోసం యువప్రజానీకం నడుం బిగించికృషి

నలిసేందుకు ఈ విద్యాలయం నన్నార్తినిచ్చింది. ఈ విద్యాలయంలో చదువుకొని,ఉన్నతవిద్యనభ్యసించిన వారెందరో దక్షిణ భారత దేశమంతటా, విప్లవాత్మకమూ, అభ్యుదయకరమూ అయిన అన్ని సాంఘిక ఉద్యమాలలోనూ, రాజకీయ పార్టీలలోనూ ప్రసిద్ధులుగా ప్రజాసేవచేస్తున్నారు. వేలాది మందిగ్రామీణ యువకులకూ, వెనకబడిన తరగతుల వారికీ ప్రజాసేవాకార్యక్రమాలను నిర్వహించటంలో ఈ విద్యాలయం శిక్షణ గరిపి విశిష్టమైన కృషి చేసింది.

1937 లో రాజకీయ శిక్షణా విద్యాలయాన్ని నిర్వహించిన అనుభవంలో నాతోపాటు, మరికొందరిఅనుచరులతో కలిసి అఖిల భారత స్థాయిలో 'వయోజనవిద్యా సంస్థ' నొకదాన్ని నెలకొల్పాం! ఈ సంస్థ వివిధ రాష్ట్రాల్లోని సాంఘిక సేవాసంస్థలు, గ్రంథాలయ సంస్థలు, వయోజన కేంద్రాల కార్యకలాపాల్లో, నిర్వహణలో అనుసంధానకర్తగా వ్యవహరిస్తూ ఉండేది.బహిన వర్గాల, పేద మధ్యతరగతులనుండి చదువుకొన్న లక్షలాది మంది విద్యావంతుల ఉన్నత విద్యాభ్యాసానికి ఈ సంస్థ ఎంత గానో ఉపయోగపడింది. అప్పట్లో ఆ సంస్థ అఖిల భారతస్థాయికార్యదర్శులలో నేనూ ఒకడిని!

శ్రీ శనివారపు సుబ్బారావు

సైతాంగ విద్యాలయాన్ని నిర్వహిస్తూ, విదేశాలలోని వయోజన విద్యారంగాలను గురించి నేను వ్రాసిన గ్రంథాల ద్వారా ప్రభావితుడైన కొవ్వూరుకు చెందిన శ్రీ శనివారపు సుబ్బారావు నాకు అతి సన్నిహితులయ్యారు. శ్రీసుబ్బారావు బి.ఎ వరకు చదువుకున్నారు. ఆయన గాంధేయ వాది. నిష్కళంకమైన కాంగ్రేసు సేవాకార్యకర్తగా, స్వయంకృషి ద్వారా విజ్ఞాన వంతులుగా, నిష్కళంకమైన కాంగ్రేసు సేవా కార్యకర్త. స్వయంకృషి ద్వారా విజ్ఞాన వంతులుగా, జాతీయ వాదులుగా పరిణతి చెంది, దేశస్వాతంత్ర్య పోరాటానికి తమవంతు కర్తవ్యం నిర్వహించడానికి యువకులనుప్రోత్సహించి, స్వీయజీవితాన్ని ఆదర్శంగా యువకులు పాటించేందుకు శ్రీ సుబ్బారావు అవిరళకృషి సలిపారు. పాశ్చాత్యదేశాల్లోని గ్రంథాలయోద్యమ ప్రగతి ఆయనను ఎంతగానో ఉత్సాహపర్చింది. తాలూకా బోర్డుల ద్వారా ఉపాధ్యాయులకు వేసవి పాఠశాలను నిర్వహించేందుకు ఆయన పూనుకున్నారు. వేసవి పాఠశాలల్లో శిక్షణపొందిన ఉపాధ్యాయుల ద్వారా యువకులను, విద్యావంతులుగాను చైతన్యవంతులుగాను తయారుచేసేందుకు వీలుంటుందని ఆయన భావించి, ఈకార్యక్రమాలను నిర్వహించారు."ఆంధ్రవయోజన విద్యాసంస్థ"నొకదాన్ని స్థాపించి,తద్వారాతాలూకా బోర్డులవంటి స్థానిక సంస్థలను సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ఆయన కృషి చేసారు. పురపాలక సంఘాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులతో, విజ్ఞానంతులైన యువకులచేత వయోజనవిద్యా బోధనాతరగతులను నిర్వహించారు. "ఆంధ్ర వయోజన విద్యా సంస్థ"కు డాక్టర్ పట్టాభి అధ్యక్షులుగా ఉండేవారు. నేను ఉపాధ్యక్షుడను. శనివారపు సుబ్బారావు దానికి కార్యదర్శి. ఈ సంస్థకు తగు ఆర్థికసహాయాన్ని చేకూర్చవలసిందిగా మేము మద్రాసు ప్రభుత్వాన్ని అర్థించాం! ఆంగ్లంలో నేను వ్రాసిన "ఇండియన్ ఎడల్ట్ ఎడ్యుకేషన్ మూవ్‌మెంట్" అనే గ్రంథాన్ని సుబ్బారావుగారు ప్రచురించి, దాన్ని రాష్ట్ర ప్రభుత్వ విద్యాధికారుల ద్వారా పంపిణీచేయించారు. సైశవదశలో ఉన్న వయోజనవిద్యా

ఉద్యమాన్ని సుబ్బారావుగారు బలోపేతంగావించారు.

అప్పట్లో రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న కాంగ్రెసుప్రభుత్వాలు వయోజన విద్యాబోధనా కార్యక్రమం ప్రజాస్వామ్య పరిరక్షణకు దోహదం చేయగలదని విశ్వసించాయి. రాజ్యాంగవ్యవహారాలను ఆకళింపు చేసుకునేందుకు, పంచాయితీ రాజ్ సంస్థలను న్యాయంగా నిర్వహించుకునేందుకు, చట్ట సభలలో పాల్గొనేందుకు ప్రజలలో వయోజన విద్యాబోధన తప్పనిసరి అని కాంగ్రెసునేతలు గ్రహించారు.

మేము నిర్వహిస్తున్న ఈ ఉద్యమానికిక తగు పూర్తి సహకారాన్ని అందించేందుకు శ్రీ గాడిచర్ల న్యాయంగా ముందుకు వచ్చారు. తరవాత అప్పటి మద్రాసుప్రభుత్వ విద్యాశాఖామాత్యులైన అవినాశలింగం చెట్టియార్ మా పథకాలకు స్వాగతం పలికారు. ఆయన ప్రముఖస్వాతంత్ర్య సమరయోధుడుకూడా. వయోజన విద్యా ఉద్యమఅవసరాన్ని ఆయన గుర్తించారు.

దక్షిణాది రాష్ట్రాల్లో వయోజన విద్యా ఉద్యమానికి అంకితమై, శ్రీ అయ్యంకి, పాతూరి నాగభూషణంగారలు తమశక్తి సామర్థ్యాలను పూరిగా వినియోగిస్తూ వచ్చారు. నిరక్షరాస్యతానిర్మూలనకు, గ్రంథాలయాల వ్యాప్తికి ప్రాంతీయ భాషలలో స్వల్ప ధరకు పుస్తకాలను అందించే కార్యక్రమానికి, ప్రాచీన సాహిత్యానికి భిన్నంగా విజ్ఞానదాయకమైనఅంశాలను పాఠ్యగ్రంథాలలో చేర్పించేందుకు మా కృషి దోహదకారి అయింది.మైసూరు ప్రభుత్వంవారు ఈ ఉద్యమాన్ని చేపట్టి ముందుకు తీసుకపోయారు. నేటికి తెలుగులో నాలుగు దినపత్రికలు, మరెన్నోవారపత్రికల్ని ఆంధ్రులు వెలువరిస్తున్నారు. మన కంటే అధికంగాకన్నడిగులు, అందరికంటే ఎక్కువగా తమిళ, మళయాళీలు పత్రికా ప్రచురణలో ముందంజలో ఉండి లక్షలాది పాఠకులలో విజ్ఞానాభివృద్ధికి పాటుపడుతున్నారు.

శ్రీ దిగవల్లి వెంకటశివరావు, ఆయ్యదేవర కాళేశ్వరరావు గారలు డబుల్ గ్రాడ్యుయేట్స్! శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారితో సహా విజయవాడకు చెందిన ఈ ముగ్గురూ ప్రసిద్ధి చెందిన స్వాతంత్ర్య సమరయోధులు. టర్కీ, ఫ్రాన్స్, యునైటెడ్ స్టేట్స్, చైనా, ఐర్లాండ్ దేశాల స్వాతంత్ర్య పోరాట చరిత్రలను రచించి,ప్రచురింపజేసారు. బౌద్ధమతాన్ని గురించి, నూతన సాంస్కృతిక పునరుజ్జీవనం గురించీ శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్య ఎన్నో గ్రంధాలను రచించారు. జాతీయ నాయకుల జీవితచరిత్రలూ, మానవహక్కుల కోసం పోరాడిన ప్రసిద్ధ సాంఘిక సేవా పరాయణుల జీవిత గాధలనెన్నింటినో వీరు వెలువరించారు.

జాతీమోద్యమ రచయితలు

శ్రీ జగ్గన్నశాస్త్రి, పండిత గారైపాటి!

డిగ్రీ చదువులు లేకుండా మహా పండితీవేత్తగా ప్రసిద్ధికెక్కిన స్వాతంత్ర్యసమరయోధులు శ్రీ ముదిగంటి జగ్గన్నశాస్త్రి. గ్రామీణ ప్రాంతంలోంచి గణుతికెక్కిన విద్వాంసుడు. స్వాతంత్ర్య సమరయోధుడు శ్రీ గొరైపాటి వేంకట సుబ్బయ్య. ఈయన 1-7-1898లో జన్మించారు. ఇద్దరూ సుంభైలిలో, తెలుగులో ఎన్నో గ్రంథాలను వ్రాసి ఆంధ్రులకు ఎంతగానో సేవలందించారు.

గత నలభై సంవత్సరాలుగా వీరిద్దరూ అందించిన సాహితీ సేవలు విలువకట్టలేనివి. దేశ,

దేశాల స్వాతంత్రోద్యమ చరిత్రలను విరివిగా రాసి పండితులకు, పామరులకు సైతం యివి విజ్ఞానాన్ని సంతరించిపెట్టాయి. శాస్త్రిగారి రచనలు వేలాదిమంది యువకులను ఉత్తేజపరచి, జైలు శిక్షలను కూడాశాతరు చేయకుండా, దేశ సేవలో పాల్గొనేట్టు పురిగొల్పాయి.పండిత గొరైపాటివారు రచించిన జీవితచరిత్రలు సామ్యవాద సిద్ధాంతంలో ఆసక్తి కలిగిన జాతీయ వాదులను సమసమాజనిర్మాణం కోసం కృషిసాగించేందుకు ప్రోత్సాహపరిచాయి. వీరిద్దరూ గ్రామీణ ప్రాంతంలోనే తమ జీవితాలను గడిపారు. శాస్త్రిగారు తణుకులోనూ, గొరైపాటివారు ఘంటసాలలోనూ నివసిస్తూ, నవతరాన్ని సాంఘిక పురోభివృద్ధి కై నడుంకట్టి పాటుపడేలా తమ రచనల ద్వారా ఉత్సాహపరిచారు.వీరు ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు తమ రచనలను కొనసాగించారు, కానీ బ్రతుకు తెరువుకు రచనా వ్యాసంగాన్ని ఉపయోగించుకోలేదు. సాహితీ సరస్వతిని ఆరాధిస్తూ, వయోజనవిద్యా ఉద్యమానికి స్వయంసేవకులుగా కృషిచేసారు.

గాంధీయుగంలోని 1920-40 నాటి మొదటి దశ ఘట్టాలు శాస్త్రిగారి రచనలలో ప్రతిఫలించగా, ద్వితీయ ఘట్టంనాటి సంఘటనలు పండిత గొరైపాటి వారి రచనలలోఉద్గాతలుగాయి.వీరిరచనల ద్వారా విశ్వవిఖ్యాత మానవతావాది యమర్షన్, వీరసావర్కార్, మహాత్మాగాంధీ, లోకమాన్యతిలక్, ఝాన్సీరాణి, లాలాలజపతిరాయ్, దేశోద్ధారక నాగేశ్వరరావు పంతులు, సరోజినినాయుడు, మోతీలాల్, జవహర్ లాల్ నెహ్రూ వైస్ ఛాన్సలర్ సి.ఆర్.రెడ్డి, తాత్త్వికుడూ, సంపాదకులూ,రచయిత నార్ల,గోపీచంద్, చలం, శరత్చంద్ర, సంఘసంస్కర్తలు త్రిపురనేని రామస్వామి, వీరేశలింగం తదితర ప్రముఖులందరూనేటియువతరానికి పరిచయం చేయబడినారు.

1945-46లో పండిత గొరైపాటి నా జీవితచరిత్రను వ్రాయడం ద్వారా, తొలిసారిగా జీవితచరిత్రం రచయితగా తెలుగులోకి వచ్చారు. నేను1946 లో రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షులుగానూ, 1947 లో అఖిలభారత కాంగ్రెసు సంస్థ కార్యవర్గ సభ్యుడుగానూ ఉన్నాను. నా జీవిత చరిత్ర గ్రంథ ప్రకరణ ద్వారా పండిత గొరైపాటి ఆంధ్రతాంగలోకంలో విస్తృతంగా పరిచయం అయ్యారు. గాంధేయ మార్గంలో నడుస్తున్న రైతులు, చేతివృత్తులవారికి అనేకమందికి నా జీవిత చరిత్ర గ్రంథ రచయితగా గొరైపాటి పూజనీయుడైనాడు. తరువాత అయన పేరెన్నికగన్న జీవిత చరిత్రల రచయితగా సాహితీలోకంలో ప్రస్తుతించబడినారు. గొరైపాటి వారి గ్రంథం ద్వారా సామాన్యప్రజానికంలోనా ఆశయ ఆదర్శాలు బహుళప్రచారం పొంది నందుకు ఎంతగానో ఆయనకు నేను కృతజ్ఞుడినై ఉన్నాను.

నా జీవిత చరిత్రగ్రంథాన్ని స్వీయధనంతో ప్రచురించడమేగాక, పండిత, గొరైపాటి సంభై సంవత్సరాల పాటు ఈ గ్రంథ రచనకు తనకాలాన్ని వినియోగించి గొప్ప సాహిత్యసేవచేశారు.

నేటికి గ్రంథాలయాల స్థాపన, పుస్తకప్రచురణలు ప్రభుత్వ విధుల్లో ఒక అంశంగారూపుదిద్దుకొని, శిక్షణ పొందిన ఉద్యోగులచే నిర్వహించబడే స్థాయికి చేరాయి. "ఆంధ్ర లైబ్రరీ అసోసియేషన్" వంటి స్వచ్ఛంద సేవా సంస్థ ఇప్పటికీ వయోజన విద్యావ్యాప్తికి, గ్రంథాయోద్యమానికి కృషిచేస్తూనే ఉంది. ప్రముఖ వయోజన విద్యావేత్త అయిన శ్రీ పాతూరి నాగభూషణం, శ్రీ శ్రీ నివాసరావు, తెలంగాణాకు చెందిన శ్రీ కోదాటి నారాయణరావు తదితరులూ,

గాడిచర్ల వారు,శనివారపు సుబ్బారావుగారులు చూపెట్టిన మార్గంలో నడుస్తూ, నిర్విరామకృషిని కొనసాగిస్తూనే ఉన్నారు.

నేటి తరం చైతన్యవంతులయ్యేందుకు, ఇలాంటి రచయితల రచనలు ఎంతగానో అవసరమై ఉన్నాయి. సంఖ్యాపరంగా ఎక్కువగా గ్రంధాలయాలను స్థాపించడంతోనే సరిపోదు. సాంఘికంగా, నైతికంగా, రాజకీయంగా ప్రజల్ని విజ్ఞానవంతులుగా తీర్చి దిద్దగల గ్రంధాలు వాటిలో చోటుచేసుకున్నప్పుడే, గ్రంధాలయాల ప్రయోజనం సిద్ధించినట్లవుతుంది. ఉత్తమగ్రంధాలతోపాటు, అనుభవంతో అంకితభావంతో, తమ విధుల్ని నిర్వర్తించగల లైబ్రేరియన్లు కలిగి ఉన్ననాడే, మనకు ఉన్నత భావసంపద చేకూరే అవకాశం వీర్పడగలదు.

పండిత గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారి అల్లుడే శ్రీ బొందలపాటి శివరామకృష్ణ బి.ఎ.గారు. వీరు 'దేశీపబ్లికేషన్' స్థాపించడంతో, ప్రచురణకర్తగా వెలుగులోకి వచ్చారు. నా జీవిత చరిత్ర గ్రంధాన్ని ప్రచురించి, దాన్ని శ్రీమతి భారతీదేవికి అంకితమిస్తూ ఆమెను సైతాంగమాతగా వీరు ప్రస్తుతించారు. ఆంధ్ర 'సాహిత్య అకాడమి'వారు పండిత గొర్రెపాటి రచించిన జీవిత చరిత్రలలో మూడింటిని ప్రచురించి, వీరిని గౌరవించింది. 1957వ సంవత్సరంలో హరిజన క్రైస్తవ కవి శ్రీజోసెఫ్ పద్యకావ్యంగా, నా జీవితచరిత్రను, పండిత గొర్రెపాటి వారి గ్రంధం ఆధారంగా వ్రాసారు. ఆ పద్యకావ్యంలో 1958వరకు జరిగిన సంఘటనలు క్రోడీకరించబడ్డాయి. 1950 లో శ్రీజాస్తి వెంకట నరసయ్యగారు విద్యార్థుల కోసం వచనంలో పండిత గొర్రెపాటివారి నా జీవిత గ్రంధం ఆధారంగానే ఒక చిన్న గ్రంధాన్ని రచించారు. వీటి అన్నిటికీమూలం పండిత గొర్రెపాటివారి గ్రంధమే!

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

డాక్టర్ అంబేద్కర్ 1891లో జన్మించారు. బరోడాలోనూ, యు.కె.లోనూ, యు.యస్.ఎ.లోనూ విద్యాభ్యాసం చేసి పి.హెచ్.డి., బారిష్టరు హోదాలను పొందారు. నిమ్నజాతుల సమాఖ్యను స్థాపించారు. 1930-33 మధ్య రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌కు ప్రతినిధిగానూ, 1944-46 సంవత్సరాలలో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో లేబరు కమిటి మెంబరుగానూ, 1947-51 సంవత్సరాల మధ్య కానిస్టిట్యూటివ్ కౌన్సిల్‌లో లేబరుకమిటి మెంబరుగానూ, 1947-51 సంవత్సరాల మధ్య కానిస్టిట్యూటివ్ అసెంబ్లి సభ్యులుగానూ, రాజ్యాంగము సాయిదాకు ప్రధానరచయితగానూ ఉన్నారు. 1951లో లోక్‌సభకు ఇండిపెండెంట్‌గా నిలిచి ఓడిపోయారు. 1952లో రాజ్యసభ సభ్యులుగా ఎంపిక అయ్యారు. 1956 లో మరణించారు.

డాక్టర్ అంబేద్కర్ మంచి పండితులు, విప్లవవాది. దేశభక్తిపరులు. ఇన్ని ఉత్తమగుణాలు ఒక వ్యక్తిలోనే మూర్తీభవించి ఉండడం అరుదు. తన ఉద్యమాలను, భారతజీవి ఎంతగానో గౌరవించే మహాత్మాగాంధీని వ్యతిరేకిస్తూ, ప్రారంభించడంతో, ఆయన రాజకీయ జీవితం తొలిదశలోనే అందరి దృష్టిలోకి వచ్చింది. స్వాతంత్ర్య పోరాటం జరుగుతున్న తరుణంలోనే, మానవాభ్యుదేయ దృష్టితో కూడిన ఉన్నత విలువల కోసం, మహాత్మాగాంధీని వ్యతిరేకించి, పోరాడుతూ అంబేద్కర్ ముందునిలబడ్డారు. అనుకోకుండా ఆయనకు లభించిన, న్యాయశాఖామంత్రిపదవి ఆయనకు న్యాయశాస్త్రంలో విశేషపాండిత్యాన్ని సంపాదించుకోగలిగేలా, సహాయపడింది. తరతరాలుగా అణచి వేయబడిన వర్గాల నాయకునిగా, ఆయన జరుపుతున్న పోరాటం, స్వతంత్ర భారత కానిస్టిట్యూటివ్ అసెంబ్లీకి రాజ్యాంగ ముసాయిదా బిల్లును, తయారుచేసేందుకు ప్రధానకర్తనుగా చేసింది. భారతదేశచరిత్రలో ఆ విధంగా అంబేద్కర్ స్థానం పదిల పరచబడి, భారత రాజ్యాంగ రచనలో ఆయన ముద్ర శాశ్వతమైంది. హైందవ సమాజంలో వర్ణీవ్యవస్థను రూపాందించి, మనుషుల మధ్య హెచ్చుతగ్గుల్ని ఏర్పరచి, మానవజాతి పట్లక్షమింపరాని అపచారాలకు కారణభూతమైన, మనుస్మృతిని తోసిరాజని, దానివల్ల న్యూనతబెంది, అవమానాలకు గురి అవుతున్న అట్టడుగు ప్రజల న్యాయపరమైన సాంఘిక హక్కుల కోసం పోరాడే అపరమనువుగా అంబేద్కర్ అవతరించాడు.

ఒకే విధమైన ఆశయ సాధనకు కృషి చేస్తున్న, మా వంటి అనేకమంది నాయకులలోనే, వయోజన విద్యాబోధనలో అంబేద్కర్ గట్టి నమ్మకం గలవారు. అందువల్ల ఈ అంశాన్ని ఆయన రాజ్యాంగంలో పొందుపరిచారు. తమాషా ఏమంటే, ఏ ప్రజలకోసం నిరంతరం శ్రమిస్తూ, ఆ ప్రజలందరికీ ప్రాతినిధ్యం అభించేలా వయోజన ఓటు హక్కును అంబేద్కర్ రాజ్యాంగంలో ప్రతిపత్తిని కల్పించి పెట్టగా, ఆ వయోజన ఓటు హక్కు ప్రాతిపదికగా జరిగిన తొలిసార్వత్రిక ఎన్నికల్లో, ఆ ప్రజలచేతనే అంబేద్కర్ ఓడించబడ్డారు. చారిత్రకంగా దొర్లిన క్రూరమైన ఆ

పారపాటు జరిగిన ఇరవై అయిదు సంవత్సరాల తర్వాత ఈనాడు దేశం మేల్కొన్నది. ఆయన మార్గంలో పయనిస్తూ రాజకీయ, సాంఘిక స్థితిగతుల్లో చైతన్యవంతమై, శక్తివంతమైన న్యూక్లియస్‌తో, ఆయనను గౌరవించగలిగిన స్థితికి దేశం చేరుకున్నది.

1928వ సంవత్సరంలో అంబేద్కర్ రచించిన 'ప్రాబ్లెం ఆఫ్ రూపీ' చదివినప్పుడే ఆర్థిక శాస్త్రంలో ఆయనకున్న ప్రావీణ్యతను గమనించి ఎంతగానో ఆశ్చర్యపోయాను. ఆ తరవాత 'ఫెడరేషన్', 'స్టేట్స్' 'రైట్స్' అనే అంశాలపై ఆయన రచించిన గ్రంథాలను చదివి, మహదానందభరితుడనైనాను.

మొదటి రౌండ్‌టేబిల్ సమావేశంలో అంబేద్కర్ చేసి ప్రసంగాలు ఆయనకు జాతీయ స్థాయిలోకి చేర్చాయి. అప్పుడు మేమంతా అనుకున్నాం, "ఆయన గొప్ప దేశభక్తుడని"! శతాబ్దాల తరబడి, ఉన్నత వర్గాలు, అగ్రకులాల వారి దౌష్ట్యానికి గురిఅవుతూ, హీనంగా చూపబడుతున్న శూద్ర, నిమ్నజాతులకు అప్పట్లో నాయకత్వంవహిస్తున్న హరిజన, బ్రాహ్మణేతర నాయకులవలే, డాక్టర్ అంబేద్కర్ భారతజాతియోద్యమాన్ని వ్యతిరేకించలేదు. "భారత దేశ సాంఘిక, మత, ధార్మిక విషయాల్లో బ్రిటిష్ ప్రభుత్వం జోక్యం చేసుకోరాదంటూ" విక్టోరియా రాణి 1857లో చేసిన ప్రకటన వల్ల, నిమ్న జాతుల వారు పడుతున్న బాధలూ, కష్టాలపట్ల ప్రభుత్వం ఉదాసీనత వహించినట్లయింది. బ్రిటిష్ ప్రభుత్వం చూపుతున్న ఈ అలసత్వ విధానాల వల్ల, సమాజంలో నిమ్నజాతుల కడగండ్ల నివారణకు పరిష్కారం లేకపోగా, మరింతగా నిమ్నజాతులు వివక్షకు గురికావడానికి దోహదం చేస్తున్నాయని అంబేద్కర్ ఆరోపణ చేసారు. అందువల్ల భారత దేశానికి స్వాతంత్ర్యం అవసరమనీ, బ్రిటిష్ పాలకులు ఈ దేశాన్ని వదలి పెట్టిపోవాలనీ, అట్టడుగువర్గాలు, నిమ్నజాతుల తరపున అంబేద్కర్ ధైర్యంగా ప్రకటన చేసారు.

ఇతర బ్రాహ్మణేతర నాయకుల మాదిరిగా, కాంగ్రెసు సిద్ధాంతాలకూ, విధానాలకూ అంబేద్కర్ తలవొగ్గి ఉండకపోవడంతో, స్వరాజ్య ఉద్యమానికి వ్యతిరేకంగా నిలవగలరనే ఆశతో, బ్రిటిష్ ప్రభుత్వం ఆయనను రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్స్‌కు ప్రతినిధిగా ఆహ్వానించింది. అయితే రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ ప్రథమ సమావేశంలోనే, సంపూర్ణ స్వరాజ్యం గురించి అంబేద్కర్ మాట్లాడడంతో బ్రిటిష్ ప్రభుత్వం నివ్వెరపోయింది. అసెంబ్లీలో ఉపన్యాసాల ద్వారా, బ్రిటిష్ పాలనను నేను పూర్తిగా ఎదుర్కొన్నాను. ఆ తరవాత గాంధీజీ జైలుకు వెళ్లడంతో, రౌండ్ టేబిల్ సమావేశాలకు కాంగ్రెసు పక్షాన, నేను హాజరైనాను. ఆ విధంగా కాంగ్రెసు ప్రచారం కోసం కూడా, ఆ సమయంలో నేను ఇంగ్లండు వెళ్లవలసి వచ్చింది.

రౌండ్‌టేబిల్ కాన్ఫరెన్స్‌లో అంబేద్కర్ చేసిన చారిత్రాత్మకమైన ఉపన్యాసం మమ్మల్నిద్దరినీ సన్నిహితుల్ని చేసింది. ఏ ఆదర్శాల కోసం అంబేద్కర్ కృషిచేస్తున్నారో, అవే ఆదర్శాలు నన్ను బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంలోనూ, సభలలోనూ పాల్గొనేలా చేశాయి, మరొక పక్క దేశస్వాతంత్ర్యం కోసం కాంగ్రెసు సంస్థ తరపున స్వాతంత్ర్య పోరాటంలో సైతం నేను పాల్గొనేట్టు పురిగొల్పాయి. ఆ తరవాత మేమిద్దరం తరచుగా లండన్‌లో కలుసుకుంటూ అనేక విషయాలపైన, ముఖ్యంగా చరిత్ర, రాజకీయాలను గురించి చర్చించుకుంటూ ఉండేవాళ్లం.

భారతదేశానికి సోషలిస్టు విధానం సరైనదని మేమిద్దరం నమ్ముతూ ఉండేవాళ్లం. సాంఘిక, రాజకీయ హక్కులు ప్రజలందరికీ సమానంగా ఉండాలనీ, అంటరానితనం, నిర్బంధకార్మిక విధానం పూర్తిగా నిర్మూలించబడాలని మేము కోరుతూ ఉండేవాళ్లం. గాంధీజీ సనాతన ధర్మాన్ని ఆదరిస్తూ, నిమ్న జాతిప్రజల సాంఘిక చైతన్యానికి అడ్డుగా ఉంటున్నారని, అంబేద్కర్ అంటూ ఉండేవారు. గాంధీజీ "సనాతన, ప్రాచీన విశ్వాసాలకు, ఆచారాలకు దూరం కాలేకపోయినప్పటికీ, ఇతర సాంఘిక సంస్కరణం కోసం కృషిసలిపే సాంఘిక విప్లవకర్త గాంధీజీ " అని నేను అంటూ ఉండేవాడిని. అంబేద్కర్ ఈ అంశంలో నాతో ఏకీభవించేవారు కాదు. అది కారణంగా మేమిద్దరం తరుచు కలుసుకోవడంగానీ, సంప్రతించుకోవడంగానీ మానుకోలేదు. ఎందుకంటే ఏకాభిప్రాయం కలిగిన రెండు భిన్న శక్తులం మేము.

అస్పృశ్యతా నివారణ కోసం, హరిజనోద్ధరణ కోసం గాంధీజీ సాగిస్తున్న కృషిని అంబేద్కర్ హర్షించి, సంతృప్తి చెందలేదు. హరిజనులకు (పంచమ, లేదా ఆది ద్రావిడులుగా పిలువబడుతూ హిందూ మతంలో ఉన్నవారు) ప్రత్యేక ఓటరు జాబితాను ప్రవేశపెట్టాలని అంబేద్కర్ కోరగా, గాంధీజీ తీవ్రంగా వ్యతిరేకించారు. రాంసే మేక్డోనాల్డ్ ప్రకటించిన 'కమ్యూనల్ అవార్డు'ను వ్యతిరేకిస్తూ గాంధీజీ పూనాలో ఆమరణ నిరాహారదీక్షను ప్రారంభించాడు. ఈ అవార్డు ప్రకారం హరిజనులకు ప్రత్యేక నియోజక వర్గాలు, ఓటరు జాబితాలు ఏర్పడతాయి. ఇది మొత్తం జాతీయ నాయకులందర్ని కలవరపర్చింది. తుదకు ప్రత్యేక ఓటరు లిస్టులు లేకుండా, నియోజక వర్గాలు మాత్రం ఉండేలాగున రాజీ జరిగింది. ఇందుకు అంబేద్కర్ కూడా అంగీకరించాడు. ఈ పరిష్కారంలో గాంధీజీ విశాలదృష్టికి, రాజాజీ రాజకీయ చతురతకు, అంబేద్కర్ తలవొగ్గి పూనాయాక్టు పైన తాను సంతకం చేసిన కలాన్ని రాజాజీకి బహూకరించారు. ఆ సమయంలో వెల్లూరు జైలులో ఉన్న నేను, బాధాకరమైన స్థితిలో అంబేద్కర్ అభిప్రాయాలను సమర్థిస్తూ, నా తోటి స్వాతంత్ర్య పోరాటయోధులకు సంజాయిషీ ఇవ్వాల్సి వచ్చింది. ఈ ఒప్పందం వల్ల గాంధీజీ ప్రాణంకాపాడ బడింది. సమిష్టి ఓటరు జాబితాలు యథాతథంగా ఉండేందుకు అంగీకారం కుదిరింది. హరిజనోద్ధరణ కోసం ఎక్కువగా కృషి జరపాలనే అంశాన్ని అందరూ సంతోషంతో అంగీకరించారు.

యుద్ధ సమయంలో వైస్రాయి కౌన్సిల్ లో సభ్యునిగా చేరేందుకు అంబేద్కర్‌ను నిమ్నజాతుల నాయకునిగా గాక సమర్థుడైన స్థాయి కలిగిన రాజకీయ నాయకునిగా మాత్రమే బ్రిటిష్ ప్రభుత్వం ఆహ్వానించింది. ఆ సమయంలో ఆయన కార్మిక శాఖామంత్రిగా ఉండేవారు.

మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, అంబేద్కర్‌ను సెంట్రల్ క్యాబినెట్‌లోకి ఆహ్వానించవలసిన ఆవశ్యకతను గురించి అనేక మంది జాతీయ నాయకులతో నేను వాదించాను. నూతన భారత రాజ్యాంగ ముసాయిదా నిర్మాణం కోసం, కాన్‌స్టిట్యూటివ్ అసెంబ్లీలోకి అంబేద్కర్‌ను జాతీయ నాయకులు ఆహ్వానించిన సందర్భంలో నేను ఆ నిర్ణయాన్ని పూర్తిగా సమర్థించాను. వైస్రాయి కౌన్సిల్‌లోకి బ్రిటిషువారు ఆహ్వానించినప్పుడు, అంబేద్కర్ మౌనం వహించినప్పటికీ, జవహర్లాల్, సర్దార్ పటేల్, రాజాజీ, రాజేంద్రప్రసాద్ తదితర నాయకులు

గౌరవప్రదమైన ఈ బాధ్యతను ఆయనకు అప్పగించడం ద్వారా సమంజసమైన నిర్ణయాన్ని గైకొన్నారని చెప్పవలసి ఉంది. భారత రాజ్యాంగ ముసాయిదా తయారు చేయడంవంటి చారిత్రాత్మకమైన కృషికి మహోదాత్తంగా తోడ్పడి, అంబేద్కర్ భారతదేశచరిత్రలో తన స్థానాన్ని విశిష్టంగా పదిలపరచుకున్నారు.

భారతీయ పురాణేతిహాసాలూ, ప్రాచీన కావ్యాలను గురించి, మరో ఆంధ్ర ప్రముఖుడూ, సంఘసంస్కర్త, విమర్శకుడూ అయిన బారిష్టరు త్రిపురనేని రామస్వామి వలెనే, అంబేద్కర్ కూడా సునిశిత పరిశోధనలు సాగించి వాటిపై తీవ్రమైన వ్యాఖ్యానాలు రాశారు. ద్రావిడులపై ఆర్యులు సాగించిన దండయాత్రలు, బౌద్ధంపై బ్రాహ్మణ హిందూమత తత్త్వవాదులు జరిపిన అత్యాచారాలు, క్రూరదమనకాండ ద్వారా పాశవికంగా అణగద్రొక్కారని అంబేద్కర్ గ్రహించారు. ఆదిమ ద్రవిడజాతి ప్రజలూ, ఆటవిక జాతులూ, తమపై ఆర్యులు కొనసాగించిన దండయాత్రలకు తట్టుకొని, తమ ఉనికిని కాపాడుకొన్న దయనీయ పరిస్థితులను పరిశీలించి అంబేద్కర్ విచలితుడైనాడు. సాంఘికంగా, ఆర్థికంగా అణగద్రొక్కబడిన వర్గాల దుస్థితిని, హృదయవిదారకమైన వారి జీవనస్థితి గతుల్ని చూసి అంబేద్కర్ ఆవేదన చెంది, పతనావస్థలో ఉన్న, అట్టడుగు వర్గాల సాంఘిక ప్రతిపత్తికోసం, వారిని చైతన్యవంతుల్ని చేయటానికి నిర్ణయించుకున్నారు.

ఆంధ్రప్రాంతానికి చెందిన బారిష్టరు రామస్వామి, తమిళనాడుకు చెందిన ఇ.వి.ఆర్. అన్నాదురై లవరవడిలో, శూద్రులూ, అట్టడుగు వర్గాలసముద్ధరణ, సాంఘిక సమానతల కోసం తిరుగుబాటు మార్గం చైపునడిపించేందుకు అంబేద్కర్ తన కృషిని కొనసాగించారు. కర్మనీ, బానిసత్వాన్నీ, అంటరానితనాన్నీ, సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలో నెలకొని ఉన్న హెచ్చుతగ్గుల్నీ, కొందరు పెచ్చు, మరి కొందరు లొజ్జ, అనే భావనను ఈ ముగ్గురు సాంఘిక విప్లవకారులు నిర్వ్యంద్యంగా ఖండించారు. బద్దలు కావడానికి సిద్ధంగా ఉన్న అగ్ని పర్వతంలాంటి చైతన్యపూరితమైన కృషిని దేశమంతటా విస్తరింపజేయాలనే ధృఢనిర్ణయానికి అంబేద్కర్ వచ్చాడు.

చైప్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యత్వంగానీ, క్యాబినెట్ మంత్రి పదవిగానీ, తాన కొనసాగించే హరిజనుల, అణగారిన ప్రజల సముద్ధరణ కోసం, సాంఘిక అసమానతల నిర్మూలనకోసం జరుపుతున్న సాంఘిక ఉద్యమాల ఆలోచనాధోరణులనుంచిగానీ, రచనలనుంచిగానీ అంబేద్కర్‌ను వెనక్కి నడిపించలేకపోయాయి. కేంద్ర ప్రభుత్వంలో మంత్రి పదవి నిర్వహిస్తూనే, శూద్రుల ప్రాచీనత, చారిత్రకంగా వారి స్థితి గతులను గురించి అంబేద్కర్ రాసిన పరిశోధనాత్మక గ్రంధం పలువురు చరిత్రకారులను, పండిత ప్రకాండులను సైతం సంభ్రమాశ్చార్యాలలో ముంచెత్తింది.

నాకంటె అనేకమంది ఆలోచనాపరులు భావిస్తున్నట్టుగా, శతాబ్దాల తరబడి సాంఘిక హీనత్వంతో అణగారిఉన్న వర్గాల దుస్థితిని కేవలం సాంఘికంగా వారిని చైతన్యవంతులుగా చేసినంత మాత్రాన, వారిస్థితిగతుల్ని సరిదిద్దలేము. అట్టడుగువర్గాల ప్రజలకు ఆర్థిక, రాజకీయ పరమైన హక్కుల్ని కల్పించడం తప్పనిసరియని అంబేద్కర్ భావిస్తూ వచ్చారు. అందుకే వారికి రాజ్యాంగపరమైన బాధ్యతలు, ప్రాధమిక హక్కుల్ని కల్పించేందుకు కాంగ్రెసు సాగిస్తున్న

కృషితో అంబేద్కర్ మనస్మూర్తిగా ఏకీభవించారు.

అంటరానివారుగా, హీనకులజులుగా పరిగణింపబడుతున్న ప్రజలు హిందువులుగా హైందవమతంలో కొనసాగుతున్నంత కాలం, తరతరాలుగా, నరనరాల్లో జీర్ణించుకుపోయిన భావదాస్యంనుంచి, పురాణేతిహాసాల ద్వారా సంక్రమించిన అంధవిశ్వాసాలనుంచి, వారిని సముద్ధరించడం తనకుగానీ, తనలాంటి ఏ ఇతర సంస్కర్తలకైనా సాధ్యపడదని అంబేద్కర్ గ్రహించాడు. బానిస మనస్తత్వంతో క్రుగ్గి ఉన్న ఈ వర్గాలను హైందవమత కర్కశ బంధనాలనుంచి విముక్తి చేయాలని నిశ్చయించుకొని, తనకు అత్యంత గౌరవభాజనమైన, అనుకూలమైన బౌద్ధమతస్వీకారంతో, సాంఘిక పరివర్తనను కల్పించి వెళ్ళాలని అంబేద్కర్ నిర్ణయించుకున్నారు. బౌద్ధ ధర్మస్వీకారంతో అంబేద్కర్ బౌద్ధునిగా పరివర్తనచెంది, లక్షలాది మంది నిమ్నజాతి ప్రజలను బౌద్ధులుగా మార్చారు. ముఖ్యంగా మహారాష్ట్ర ప్రజలను బౌద్ధ ధర్మస్వీకారం చేయిస్తూ వారిని బౌద్ధంవైపు మరల్చి, ప్రజలందరి మధ్య సమానతను కల్పించేబౌద్ధమత చైతన్యాన్ని అట్టడుగు వర్గాల ప్రజల్లో పాదుకొల్పి, సాంఘిక రాజకీయ చైతన్యపరులుగా వారిని తీర్చిదిద్ది, తన విప్లవ పూరితమైన ఆలోచనా మార్గంవైపు వారిని అంబేద్కర్ నడిపించాడు.

డాక్టర్ అంబేద్కర్, త్రిపురనేని రామస్వామి, ఇ.వి.ఆర్.అన్నాదురైలు సాగించిన చారిత్రాత్మకమైన సాంఘిక తిరుగుబాటును, అభ్యుదయ దృష్టిగలిగిన వారంతా శ్లాఘించారు. గాంధేయ మార్గాన్ని అనుసరించే నాలాంటి వారంతా వీరితో సహకరిస్తూ వచ్చాం. అయితే మేము దైవభావననుగానీ, హైందవమతాన్నిగానీ వదలిపెట్టలేదు. ప్రజలందరినీ ఏకత్రాటిపై నిలిపేందుకు ప్రస్తుతం నడుపుతున్న సామాజిక చైతన్యపోరాటానికి ఆటంకంగా పరిణమించే దైవభావనకు, హైందవమతం పట్ల వ్యతిరేకంగా సాగే ఉద్యమాన్ని మేము అంగీకరించలేదు. ఈ సందర్భంలో ఈ అంశం పట్ల అంబేద్కర్ భిన్నంగా ఆలోచించారు. ఈ ఆలోచనా విధానం అంబేద్కర్ విప్లవాత్మకమైన ఎత్తుగడ కావచ్చు. కమ్యూనిస్టులకు, ఆయనకూ మధ్య కుదిరిన అంగీకారమైన పరిస్థితి అది. అయితే కమ్యూనిస్టులకున్న అంతర్జాతీయ దృక్పథాన్ని, తుపాకీద్వారా నియంత్రత్వ రాజ్యపాలనా విధానాన్ని అంబేద్కర్ అంగీకరించలేదు. అందువల్ల అఖిలభారతస్థాయిలో కమ్యూనిస్టు కార్మికోద్యమంతో కలిసి అంబేద్కర్ పనిచేయలేకపోయారు. ఈ సందర్భంలో మేమిద్దరం ఏకాభిప్రాయంతో కార్మికోద్యమంలోనూ, లేబరు యూనియన్ల నిర్వహణలోనూ దేశవ్యాప్తంగా కలసిమెలిసి పనిచేసాం.

అమెరికా నగరాల్లో నీగ్రోలకు మురికివాడలున్నట్లుగా, మనదేశంలో శతాబ్దాల తరబడి గ్రామాల్లో ఎడంగా హరిజన వాడలుండడాన్ని అంబేద్కర్ అసహ్యించుకున్నారు. సామాజికంగా వెలివేయబడిన హరిజన వాడల దైన్యస్థితికి, సాంఘిక అసమానతకు ఆయన నిరసన తెలియజేశారు. అంటరానితనానికి వ్యతిరేకంగా, అస్పృశ్యతానివారణకు గాంధీజీ స్వయంగా భంగీకాలనీలో నివసిస్తూ, గాంధేయవాదులందరినీ హరిజన వాడల్లోనే నివసించవలసిందిగా కోరుతూ, సాంఘిక అసమానతను నిర్మూలించేందుకు, కార్యక్రమాన్ని కొనసాగించారు. హరిజనుల పట్ల గాంధీజీ నిర్వహిస్తున్న ఉద్యమాలు కేవలం సంస్కరణల స్థాయికి చెందుతాయనీ, అమెరికాలో నీగ్రో

చెర్రరిస్టుల విప్లవాత్మకమైన కార్యక్రమాలే ఇందుకు పరిష్కారమార్గాలు కాగలవని నమ్ముతూ, అంబేద్కర్ గాంధీజీ సంస్కరణోద్యమాలపట్ల సంతోషాన్ని వ్యక్తం చేయలేదు. పైగా ఇలాంటి ఉదారవాద ఉద్యమాలపట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శతాబ్దాల తరబడి కొనసాగుతున్న వర్ణవ్యవస్థకు, అంటరానితనానికి వ్యతిరేకంగా అంబేద్కర్ తీసుకున్న విప్లవాత్మకమైన కార్యాచరణకు మేమంతా వందనాలర్పించాం. ఈనాడు దేశంలో ప్రభుత్వపరంగా పంచవర్షప్రణాళికా సంఘం సర్వమానవ సమానత్వాన్ని, కులాల మధ్య సమన్వయాన్ని సాధించేందుకు, బీదల కాలనీలు నిర్మిస్తూ, వ్యూహాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

సాంఘిక సమానత్వ సాధనకు, అస్పృశ్యతా నివారణకు దీర్ఘకాలం అవసరం కాగలదని అంబేద్కర్ గ్రహించారు. హరిజనులలో ఎక్కువమంది ఏరోజుకారోజు కూలీనాలీ చేసుకొని జీవించే క్రిందిస్థాయి సామాన్య ప్రజలు మాత్రమే, కష్టించి పనిచేసే ఈ నిరుపేదల జీవనస్థితి గతులను మెరుగుపరిచి, తద్వారావారి జీవితాల్లో మార్పులు తీసుకొని రావచ్చునని అంబేద్కర్ ఊహించారు. అందుకోసం ఆయన కార్మికసంఘాలను స్థాపించి, కార్మికుల అభ్యుదయం కోసం చట్టాలను రూపొందిస్తూ, కార్మిక నాయకునిగా ముందువరసలో నిలబడ్డారు.

చాలా సంవత్సరాంపాటు బొంబాయి నగరంలో కార్మిక తరఫతుల సంక్షేమం కోసం అంబేద్కర్ పాటుపడ్డారు. ఆ సమయంలో ఐ.యల్.ఓలో కార్మిక సంక్షేమం కోసం నేను తెచ్చిన వాదాలను, వ్యవసాయకూలీల కోసం పారిశ్రామిక, చేతివృత్తులపై జీవించే కార్మికులకోసం కొనసాగించే ఉద్యమాలను, కాంట్రాక్టు కూలీ పద్ధతి రద్దుకు విజయవంతంగా సాగించిన నా పోరాటాన్ని అంబేద్కర్ గమనించారు. ఆయన లేబర్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలరుగా ఉన్న సమయంలో త్రైపాక్షిక కార్మిక సభలో పాల్గొని సహకరించవలసిందిగా నన్ను ఆహ్వానించారు. మాగ్రామస్థుడైన, మరో హరిజన సహచరుడూ, కీర్తిశేషుడూ బి.మాణిక్యాలరావుగారిని అంబేద్కర్ ప్రోత్సహించి, తన కార్యక్రమాలకు అనుగుణంగా తీర్చిదిద్దారు. శ్రీ మాణిక్యాలరావు ఇంగ్లండులో శిక్షణ పొందిన ఉత్తమ సాంకేతిక నిపుణుడు.

అంబేద్కరు, ఇటు నేనూ తొలి లోక్‌సభ ఎన్నికలలో ఓటమిని చవిచూశాం. స్వరాజ్యం వచ్చిన తరవాత కూడా, కాంగ్రెసు ఏకచ్ఛత్రాధిపత్యంగా కొనసాగడాన్ని, పండిట్ నెహ్రూను వ్యతిరేకించిన కారణంగానుమా ఉభయులకు ఈ అనుభవం ఎదురైంది. ముఖ్యంగా ఉద్యోగ వ్యవహారాల్లో, గృహనిర్మాణం, ఆరోగ్యం, విద్య, భూమికి సంబంధించిన కార్యక్రమాల్లోనూ మేమిద్దరం నెహ్రూ విధానాలతో ఏకీభవించలేకపోయాం. ఆ తరవాత ఉభయలం మా స్వరాష్ట్రంలో కాంగ్రెసేతర పార్టీల సభ్యుల సహకారంతో మాత్రమే రాజ్యసభకు ఎంపిక అయ్యాం. ఎక్కువమంది ఇండిపెండెంట్ పార్లమెంటు సభ్యులు అంబేద్కర్ సంపాలు తీసుకుంటూ, ఒక వర్గంగా కలిసి మెలసి ఉండేవారు. అప్పట్లో తన ఆరోగ్య పరిస్థితి సరిగాలేదనీ, రాజ్యసభలో పార్లమెంటరీ పార్టీ బాధ్యతను నిర్వహించలేననీ అంబేద్కర్ చెప్పారు. ఇండిపెండెంట్ సభ్యులందరూ ఒక వర్గంగా వ్యవహరించలేరనే అభిప్రాయంతో, తరవాత వారినందర్నీ నాతో కలిసి పని చేయవలసిందిగా, అంబేద్కర్ సలహా ఇచ్చారు. మేమిద్దరం అనేక విషయాల్లో ఏకాభిప్రాయం కలిగి ఉండడమే

ఇందుకు కారణం. నేను "కృషికార్ లోక్ పార్టీ"ని స్థాపించినప్పుడు ఆయనకు ముఖ్యులైన ముగ్గురు అనుచరులను (అందులో ఒకరు మాజీమంత్రి) అంబేద్కర్ కె.యల్.పి.లో చేర్చారు. జవహర్లాల్ వ్యతిరేకతను తట్టుకొని, స్వతంత్రమైన ఒక పార్లమెంటరీ వేదికను ప్రారంభించడం ఎంతో శుభదాయకమంటూ అంబేద్కర్, నన్ను శ్లాఘించారు. ఆయన మాత్రం ఇండిపెండెంట్ సభ్యుడిగానే కొనసాగుతూ వచ్చారు. తన ఉపన్యాసాలద్వారా బలోపేతమైన శక్తిగా రూపొందారు. రైతుకూలీల కోసం నేను సాగించే ఉద్యమాల్లో ఎప్పుడు, ఎక్కడ అవసరం వచ్చినా అంబేద్కర్ నా మిత్రునిగా నన్ను వెన్నుతట్టి తన సహకారాన్ని అందిస్తూ వచ్చారు. డాక్టర్ అంబేద్కర్ నాకు అత్యంత ఆప్తుడు. నా యెడ ప్రేమకలిగిన మిత్రుడు.

కాంగ్రెసు పార్టీకి రాజీనామాచేసి, ఇండిపెండెంట్‌గా పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేయడానికి పూర్వమే, ఆయన ఆరోగ్యం క్షీణించసాగింది. ఆయన రాజ్య సభకు ఎన్నికైన కొద్ది మాసాల్లోనే అస్వస్థతకు గురి అయ్యారు. కొలంబియా యూనివర్శిటీలో గౌరవ యల్.యల్.బి. డిగ్రీ పుచ్చుకోవడానికి వెళ్లి, పట్టా పొందిన వెంటనే అమెరికా నుంచి తిరిగివచ్చారు. వారి మరణానికి కొద్దిరోజుల ముందు "రంగా! ఇంకనేను ఎక్కువ కాలం బ్రతక్కి పోవచ్చు. నేను చాలా అనారోగ్యంగా ఉన్నాను." అని అన్నారు. గొప్ప మనో నిబ్బరం కలిగిన పాండితీవేత్తను, విప్లవమూర్తిని, ఆయనలోనే చూసాను. నేను ఎరిగిన ఒక మహోన్నత వ్యక్తి అంబేద్కర్. ఆయన ఒక మహాశక్తి! ఎంతో గొప్ప నిగ్రహం, అభ్యుదయ దృక్పథం కలిగిన మహామనీషి!

భావి భారత సంతతికి దారిచూపెట్టిన యుగకర్త అంబేద్కర్.

భారతజాతి అభ్యుదయంకోసం, ఎందరో మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, తమ మేధాసంపత్తితో ఆలోచించి, భారత రాజ్యాంగాన్ని నిర్వచించి ఆవిష్కరించారనే నగ్నసత్యాన్ని మనం కాదనలేం. భారత రాజ్యాంగ స్వరూప స్వభావాన్ని, దానిలోని చట్టపరమైన శబ్ద సముదాయాన్ని వేరెన్నికగన్న న్యాయమూర్తులైన జస్టిస్ అల్లాడి, మున్షీ, వంటి దిగ్దిగంతులు కలిసి రూపొందించారు. అయితే అంబేద్కర్ ప్రవేశపెట్టిన సాంఘిక పరిణామం, సామాన్యజనుల జీవన పరిస్థితుల సముద్ధరణకు కావలసిన అంశాలు చట్టపరమైన అధ్యాయాలు, ముందుచూపున అభ్యుదయాన్ని కాంక్షించే రాజకీయ వేత్తలు, సాంఘిక పరివర్తనకోరే విప్లవశక్తులూ ప్రస్తుతించాయి. ఆయన సంపూర్ణ ప్రజాస్వామ్యవాది. తన ఆశయ సాధనలో పట్టుదల, దీక్ష కలిగి ఉంటూనే, కాన్‌స్టిట్యూయెంట్ అసెంబ్లీలో ఉన్న మా అందరిని అంగీకరింప జేసిన తరవాతనే, తన అభిప్రాయాలకు రూపకల్పన జేసేవారు. ఏ క్లాజుమీద్దా నా ఉపయోగించిన శబ్దాన్ని ఆయన అంగీకరించని స్థితిలో, తన అభిప్రాయాన్ని వాదించి, సకారణంగా నిరూపించి, అందర్నీ ఒప్పించి దానిని అందులో ప్రవేశపెట్టేవారు. నిజానికి ఆయన "నవయుగ మనువు"! ఎందుకంటే బడుగువర్గాల సంక్షేమం కోసం అవసరమైనంత దాకా ఎలాంటి రాజీపడకుండా రాజ్యాంగంలో చట్టపరమైన అంశాలను పొందుపరిచారు.

స్వతంత్ర భారత రాజ్యాంగానికి, ఆయన సరియైన సృష్టికర్త. తరతరాలుగా హైందవసమాజం అనుభవించిన దురదృష్టకర జీవన విధానానికి అడ్డుకట్టవేసి, స్వతంత్ర భారత ప్రజాస్వామ్యాన్ని కొత్త దారులవెంట మళ్లించిన స్రష్ట.

ఆయన నిలువెత్తు కంచు విగ్రహాలను బొంబాయిలోనూ, హైదరాబాదులోనూ, మానిడుబ్రోలులోనూ, విజయవాడలోనూ ప్రతిష్ఠించారు. కొన్ని విశ్వ విద్యాలయాలను ఆయనపేరిట నెలకొల్పారు. 1990లో ఆయన శతజయంతి ఉత్సవాలు ఢిల్లీలోనూ, దేశమంతటా జరుపుకొన్నారు.

3

బాపూజీ యం.యస్.ఆనే

1935లో కేంద్ర శాసన సభలో నేను ప్రవేశించే నాటికి బాపూజీ ఆనే సీనియర్ సభ్యులుగా ఉన్నారు. మోతీలాల్, వల్లభాయి పటేల్, ప్రకాశం, మదనమోహన మాంవ్యాగార్లతో ఆయన 1923-30లో కేంద్రశాసన సభలో సహసభ్యులుగా ఉండేవారు. ఆయన ఎల్లప్పుడూ మహారాష్ట్రులకు అలవాటైన ఆకూ, వక్కా నములుతూ ఇతరులకు కొంత ఇబ్బందికరంగా ఉండేవారు. ఆయినప్పటికీ తన ఉత్తమమైన ఆలోచనాసరళిద్వారా, ఉపన్యాసాంద్వారా, చెప్పేపద్ధతి ద్వారా ప్రముఖుల్లో ఒకరుగా పరిగణింప బడుతూ వచ్చారు.

1933లో కలకత్తా కాంగ్రెసు ప్రత్యేక సభ జరిగినప్పుడూ, తిరిగి 1933 జూలైలో పూనాలో జాతీయ నాయకుల సమావేశ సందర్భంలోనూ (ఎ.ఐ.సి.సి. ఇష్టాగోష్ఠి సమావేశం) మేమిద్దరం సన్నిహిత మిత్రులు కాగలిగాం. గాంధీ గారి వ్యక్తి సత్యాగ్రహాన్ని గురించి చర్చించేందుకు, గోఖలే హాలులో నేను సంధానకర్తగా ఉండి, సోషలిస్టు ఆలోచనా ధోరణిగల కాంగ్రెసు కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశాను.

ఆనేగారు తిలక్ మహాశయుని అనుచరులు! డాక్టర్ మనోజ్, పరంజపే, కేల్కర్, అభయంకర్ లవలెనే, ఆనే కూడా కేవలం సత్యాగ్రహాలు స్వరాజ్యాన్ని సాధించలేవని భావిస్తూ ఉండేవారు. సహాయ నిరాకరణోద్యమం పాటించబడిన తరవాత వీరు గాంధీజీతో కలిసి ఉద్యమాల్లో పని చేయడానికి నిర్ణయించుకున్నారు. కాంగ్రెసు వాదులు కొందరు 'స్వరాజ్య పార్టీ' ని స్థాపించగానే, దానిలో శాసన సభ్యులనేకులు చేరిన తరవాత 'ఆనే' కూడా తన అనుచరులంతో సహా అందులో ప్రవేశించారు.

1935లో గాంధీజీ ముస్లింమత తత్వవాదులకు ఇచ్చిన రాయితీలను అంగీకరించలేక, కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా నేషనలిస్టు పార్టీని ఆనే ప్రారంభించారు. ఆనేగారి నేషనలిస్టు పార్టీ, కాంగ్రెసుతో పోరాటానికిదిగి, కాంగ్రెసు అభ్యర్థులను ఓడించి, బెంగాల్‌లో మెజారిటీ స్థానాలను సంపాదించగలిగింది. నేషనలిస్టు పార్టీకి అసెంబ్లీలో శ్రీ లక్ష్మీ కాంతమైత్రా కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. అతను ఆపార్టీకి నాయకుడిగా వ్యవహరించారు. నేను అసెంబ్లీలోకి ప్రవేశించినప్పుడు తొలి బడ్జెట్ సెషన్ జరుగుతూ ఉంది. 'ఆనే' మొదటి వరుసలో ఉండేవారు. బడ్జెట్‌పై జరుగుతున్న చర్చల్లో పాల్గొంటూ ఆనే ప్రసంగించేప్పుడు నన్ను గురించి మంచిగా మాట్లాడారు. సర్ రాంక్‌నోయిసీ నా సీటును ముందుకు మార్చుకోవాల్సిందిగా కోరారు.ఎందుకంటే ప్రసీడింగ్స్‌లో ఆసక్తి కనపరుస్తూ, ఎక్కువ విలువైన ఉపన్యాసాలను ఇవ్వగలుగుతున్న నేను వెనుక సీట్లల్లో ఉండడం మంచిదిగాదని వారు అన్నారు. శ్రీ 'ఆనే' దాన్ని బలపరిచారు. ఆ తరవాత నా స్థానం రెండో బెంచీ మీదకు మారింది.

1935-39 సంవత్సరాల మధ్య అయిదుసంవత్సరాల కాలం కాంగ్రెసు పార్టీకి

ప్రతిద్వందిగా శ్రీ ఆనే పార్టీ నిలిచి ఉంది. గోవింద వల్లభపంత్ పట్ల, నా పట్ల శ్రీ ఆనే ఎంతో విశ్వాసాన్ని కనబరిచేవారు. జిన్నా, ఆయన ఇండిపెండెంట్ పార్టీ దేశవ్యవహారాల్లో మాకు పూర్తి వ్యతిరేకంగా ఉంటూ వచ్చాయి. అలాంటి సందర్భాల్లో నేను, బాపూజీ ఆనే సహాయాన్ని అడిగేవాడిని. తాను మాతో సహకరించడమే గాకుండా, జిన్నాను సవ్యమైన దారిలో పెట్టేందుకు ఇతరపక్షాలవారికి కూడా నచ్చజెబుతూ, వారందరి సహకారాన్ని కూడా మాకు లభించేలా ప్రయత్నిస్తూ ఉండేవారు.

ప్రపంచ యుద్ధంలో తప్పనిసరై భారత దేశం ప్రవేశించినప్పుడు, బ్రిటిషువారి ఈ నిర్ణయానికి నిరసనగా కాంగ్రెసువాదులను మంత్రివర్గాల నుంచి వైదొలగమని కాంగ్రెసు పార్టీ ఆదేశించగా, తిరిగి శ్రీ ఆనే కాంగ్రెసు పార్టీ నిర్ణయాన్ని వ్యతిరేకించి, విభేధించారు. కాంగ్రెసు అధికార పదవులను విసర్జించడం ద్వారా, అనుకోకుండా ముస్లింలీగు అధికార పదవులను పొందేందుకు అవకాశాన్ని కలుగజేస్తూ పరోక్షంగా సహాయపడినట్లవుతుందని ఆయన భావించారు. జాతీయ ప్రభుత్వ స్థాపనా ప్రతిపాదనను అంగీకరించకుండా, బ్రిటిషుప్రభుత్వం "లీగ్స్ కంట్రోలు'ను ఏర్పరిచినందుకు, తన నిరసన తెలియజేస్తూనే, బ్రిటిషు ప్రభుత్వంతో సహకరించడానికి శ్రీ ఆనే అంగీకరించారు. ఆయన వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సభ్యత్వాన్ని ఆమోదించారు. ఆయనతో పాటుగా శ్రీ హెచ్.పి.మోడీ, యన్.ఆర్.సర్కార్‌లు ఆయనను అనుసరించారు. 1943లో భారతీయుల కోర్కెలను అంగీకరించకుండా, దీక్షలో ఉన్నగాంధీజీ ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లినా ఖాతరు జేయని మొండివైఖరిని బ్రిటిషు ప్రభుత్వం అవలంబించినప్పుడు, శ్రీ ఆనే, ఆయన అనుచరులు బ్రిటిషు ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా రాజీనామాలు చేసి, తమ దేశభక్తిని చాటుకున్నారు.

శ్రీ ఆనే ప్రభుత్వంలో ఉన్న కాలంలో, బర్మా కాందిశీకుల సహాయక చర్యలలో నాకెంతగానో తోడ్పడ్డారు.

బ్రిటిషువారికి వ్యతిరేకంగా సహాయనిరాకరణ ఉద్యమాన్ని గాంధీజీ తీవ్రతరంచేసి, బ్రిటిషు ప్రభుత్వాన్ని స్థంబింప జేసే కార్యక్రమాలకు పూనుకొని "చేయండి! లేదా చావునైనా ఎదుర్కోండి." అని గాంధీజీ ఇచ్చిన పిలుపును ఆచరణలో పెడుతూ నేను రహస్య శిబిరాలలో పని చేస్తున్నప్పుడు శ్రీ ఆనే వారి ఇంట్లో కొంతకాలం నాకు ఆశ్రయం కల్పించారు కూడా.

శ్రీలంకలో భారతకౌన్సలేట్‌గా ఉన్నప్పుడు శ్రీ ఆనే అక్కడస్థిరపడిన భారతీయులకు చాలా సహాయపడ్డారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఆయన బీహార్ రాష్ట్రానికి గవర్నరుగా నియమింపబడినారు. నేను బీహార్ వెళ్లినప్పుడు ఒకసారి ఆయనను కలవడం జరిగింది. ఆ సందర్భంలో రైతుల రక్షణకు అవసరమైన జమీందారీ రద్దు బిల్లు విషయమై ఆయనతో చర్చించడం జరిగింది. తర్వాత ఆ బిల్లును కాంగ్రెసు పార్టీ ప్రవేశపెట్టింది.

గవర్నరుగా ఆయన భోజనం చేసేప్పుడు, భోజనం బల్లమీద ముందుగా దేవతలకు తొలినివేదనను సమర్పిస్తూ, ఆహ్వానం చేసే తీరు నన్ను విచలితుడ్ని చేసింది. ఆధ్యాత్మికంగా

ఇలాంటి ఆచారాన్ని పాటించే అలవాటు ప్రముఖ జాతీయ నాయకుడైన శ్రీ గోవింద వల్లభ పంత్‌గారికి కూడా ఉన్నది.

గవర్నరుగా పదవీ విరమణ చేసిన తర్వాత, శ్రీ ఆనే పూర్తిగా స్వంత జీవితంలోకి ప్రవేశించారు. చాలాకాలంనుంచీ ఉన్న వెన్ను నొప్పి వ్యాధితో ఆయన బాధ పడుతూ ఉండేవారు. అందుకు వైద్యం కోసం ఆయన పెద్ద మొత్తాన్ని వెచ్చించవలసి రావడంతో, వారి కుటుంబం ఆర్థికంగా కొంతమేరకు దెబ్బతిన్నది. తరవాత కొంతవరకు ఆయన స్వస్థతను పొందగలిగారు.

ఒకసారి ఆయనా, నేనూ కలిసి ఢిల్లీనుంచి బెంగుళూరుకు ప్రయాణం చేస్తూ ఉన్నాం. అప్పట్లో ఆయన నాగపూర్ నియోజక వర్గంనుంచి ఎన్నికై పార్లమెంటు మెంబరుగా ఉన్నారు. ప్రయాణంలో వెన్ను నొప్పిరాగా, గంటసేపు ఆయన దైవాన్ని ప్రార్థిస్తూ, ధ్యానంలోగడిపారు. దైవబలమో, మనోబలమోగానీ వారికి వెంటనే స్వస్థత చేకూరింది. ఈ విషయాన్ని గురించి చెబుతూ "చికిత్స మీదకంటే, తనకు మానసిక ధ్యానం మీదే ఎక్కువ శ్రద్ధ" అని వివరించారు.

ప్రత్యేక విదర్భ రాష్ట్రం కోసం బాపూజీ ఆనే చాలా కృషి చేసారు. కాంగ్రెసు పార్టీ చేత దాన్ని అంగీకరింప జేసి, 'ప్రత్యేక విదర్భ రాష్ట్ర కాంగ్రెసు కమిటీ'ని ఏర్పరిచేలా, ఆయన కృతకృత్యులయ్యారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత, ఆంధ్రులు ప్రత్యేక రాష్ట్రం కోసం వత్తిడి చేయసాగారు. బాపూజీ ఆనే ఇరవై సంవత్సరాలుగా, తాను కోరుతున్న విదర్భరాష్ట్ర నిర్మాణాన్ని సమర్థించుకుంటూ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ కమీషను ముందు సాక్ష్యాన్ని ఇచ్చారు. యస్.ఆర్.సి ఆయన కోరికకు అనుకూలతను కనపరిచింది. ఎనభై సంవత్సరాల వయస్సులో పూర్తిగా ఆరోగ్యాన్ని కోల్పోయిన పరిస్థితుల్లో, కాంగ్రెసు అభ్యర్థిని ఓడించి, విదర్భ రాష్ట్ర నినాదం మీద, ప్రజాభిమానాన్ని సాధించి పార్లమెంటుకు ఎన్నిక కాగలిగారు. ఆ సమయంలో ఆయన ఆఖరు ఎన్నికల ప్రచార సభలలో పాల్గొని, తన ప్రత్యేక విదర్భ కోర్కెకు అనుకూలంగా ప్రచారం చేయవలసిందిగా నన్ను కోరారు. ఆయనకు ఏ సందర్భంలో ఏ సహాయం కావలసి వచ్చినా, తాను సంతోషంతో నిర్వహించగలనంటూ ఆయన ఆహ్వానానికి అంగీకరించాను. ఆయన గొప్ప దయార్ద్ర హృదయుడు వయస్సులో పెద్దవారు. అనుభవంలో ఉన్నతులు. అలాంటి ఉన్నతమైన వ్యక్తికి సంతోషకరమైన దాన్ని చేయడంకంటే ఆనందమేముంటుంది?

జవహర్లాల్ నెహ్రూ కంటే, పోలికల్లో ఆయన మదనమోహన మాలవ్యా, మహాత్మాగాంధీ గార్లకు ఎక్కువ సారూప్యంగా కనిపిస్తారు. చైనా దురాక్రమణ సమయంలో ఆయన మాతో పూర్తిగా ఏకీభవించారు. జవహర్లాల్ నెహ్రూ పట్ల ఆయనకు తగని ప్రేమ ఉన్నప్పటికీ, వ్యక్తిగత సంబంధాలకన్నా, దేశ ప్రయోజనాలు మిన్న అంటూ, పరిపాలనా వ్యవహారాల్లో నెహ్రూ విధానంలోని పరాజయాలను తప్పులను ఒక జాతీయ నాయకునిగా ఆయన ఎత్తి చూపెట్టారు.

చూడడానికి ఆయన చాలా పాట్టిగా కనిపించినప్పటికీ, ఆయన గుండె ఎంతోగట్టిది. మహారాష్ట్ర యోధలక్షణాలు ఆయనలో పూర్తిగా నిబిడీకృతమై ఉన్నాయి. మహామేధావి ఆయన శ్రీ ఆనే సంస్కృత భాషలో గొప్ప పండితుడు. అందువల్లనే ఆయన సాంప్రదాయక, ఆచార

వ్యవహారాలకు అంకితమైనాడని చెప్పవచ్చు.

పార్లమెంటులో ఆయనకు శ్రద్ధాంజలి ఘటిస్తూ "ఈ సభకు అతి చురుకైన తొలి సభ్యుడు ఆయన యువకుల కంటే కూడా కర్తవ్య నిర్వహణలో ఎక్కువ ఓపికతో పనిచేసే వ్యక్తి" అని అన్నాను.

మహోన్నత సాంఘిక విప్లవకారులు – "అన్నా"

అన్నాదురై 1907వ సంవత్సరంలో జన్మించారు. 1969 ఫిబ్రవరి మాసంలో మృత్యువుపాలైనారు. ఆయన మదరాసు పచ్చయప్ప కళాశాలలో రాజకీయ శాస్త్రాన్ని అభ్యసించారు. పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్ ప్రారంభించిన ఆత్మగౌరవ ఉద్యమం (సెల్ఫ్ రెస్పెక్ట్ మూమెంట్)లో పాల్గొని ఒక దశాబ్దం పాటు ఆయనకు కుడిభుజంగా మెలిగారు. 1933లో ఇ.వి.ఆర్. ద్రవిడ కజగం పార్టీని వదిలి, ద్రవిడ మున్నేట్రకజగం పార్టీని అన్నాదురై స్థాపించారు. స్వరాజ్యం వచ్చిన తరవాత కాంగ్రెసు ప్రభుత్వాల కార్యక్రమాలను వ్యతిరేకిస్తూ, అన్నాదురై ప్రజా ఉద్యమాలను నడిపారు. ముఖ్యంగా హిందీ వ్యతిరేకోద్యమం, ప్రత్యేక తమిళనాడు కోసం ఆందోళన, ఆయన ఉద్యమాల్లో గమనించతగ్గవి, స్వతంత్ర – కమ్యూనిస్టు పక్షాల సమోధ్యతో 1967 ఎన్నికల్లో డి.యం.కె పక్షానికి మెజారిటీని సాధించి, మదరాసు రాష్ట్రంలో డి.యం.కె పాలనను నెలకొల్పారు. కొద్దికాలం పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు. ఆంగ్ల, తమిళభాషల్లో గొప్ప వ్యక్తి.

'అన్నా' ప్రఖ్యాతి చెందిన పచ్చయప్ప కళాశాలలో బి.ఎ తరగతి చదువుతున్నప్పుడు ఆయనకు చరిత్ర రాజకీయశాస్త్ర, ఆర్థికాంశాలలో నేను ఆచార్యునిగా ఉండేవాడను. అది మా ఇద్దరకూ ఎంతో సంతోషకరమైన అనుభవం.తరవాత ఆయన నూతన తమిళ భాషా ప్రభవానికి వై తాళికులు కాగలిగారు. శ్రమైకజీవుల నాయకునిగా మహోన్నతంగా ఎదగగలిగారు. దీర్ఘకాలంగా సమాజంలో అట్టడుగున జీవిస్తూ అణగారిపోతున్న ప్రజలనాయకునిగా అన్నాదురై 1967లో విజయాన్ని సాధించినప్పుడు, నేను ఆయనను అభినందించాను. ఆ క్షణం ఆయన మౌనంగా చిరునవ్వులొలికిస్తూ జ్ఞానియైన ఓ విద్యార్థిలాగానే కనిపించాడు.

దేశ సాంఘిక పురోభివృద్ధి కోసం, భారతరైతు వర్గాలు, వివిధ చేతివృత్తుల వారు చేసిన కృషిని నేను వివరిస్తున్నప్పుడు ఆయన కళ్లు మెరిసేవి. ఆయన ముఖం కాంతివంతంగా కనిపించేది. ప్లెబియన్స్‌కు గ్రేషియస్ రోమనుసోదరులు చేసిన త్యాగాలను వివరిస్తూ, తుదకు ప్లెబియన్ ప్రజలు, ఆ ఇరువురు సోదరులను ఎలా దుర్మరణం పాలుచేసారో చెప్పాను. శ్రమజీవులకోసం వారు చేసి కృషిని మరిచిపోయి, వారిని మోసగాళ్లుగా భావించడంవల్లనే ఇది జరిగిందనే సంగతి గమనించమని చెప్పాను. ఆ తరవాత నాతో మాట్లాడడానికి మరికొంతమంది విద్యార్థులతో ట్రిప్లికేన్ సముద్రతీరానికి వచ్చిన 'అన్నా' తమిళనాడులో గూడా, ఒక సైవమతజ్ఞానిని ఇలాగే చేయడం జరిగిందని చెప్పారు.

అప్పట్లో ఇంగ్లీషు దినపత్రిక 'స్వరాజ్య'లో, జాతీయ యువజన సంఘాలను వ్యతిరేకిస్తూ, బ్రాహ్మణేతర యువకులు కొందరు, యువజన సంఘాలను నిర్మించే ప్రయత్నం సరైందికాదని వివరిస్తూ, నేను వ్యాసాలు రాసాను. 'అన్నా', ఆయన మిత్రులు ఎందుకిలా వ్రాసారని నన్ను ప్రశ్నించారు. నేను అప్పుడు వారికి ఇలా సలహా ఇచ్చాను. మిగతా జనంతో వేరు

కాకుండా బ్రాహ్మణేతర యువకులు కూడా, అందులోనే ఉంటూ, జాతీయ యువశక్తికి తమ సహకారాన్ని అందిస్తూ, తమ శక్తి సామర్థ్యాలను చూపించడం విడిగా ఉండేదానికన్నా గొప్ప సంగతి అని చెప్పాను. ఆత్మ విశ్వాసంతో కూడిన నామార్థాన్ని అంగీకరించిన మొదటి శ్రేణిలోనే "అన్నా" ఉన్నారు.

మన పురాణగాథలపై నా పరిశీలనాత్మకమైన అధ్యయనాన్ని గొప్పగా కొనియాడుతూ, అప్పటికే తమిళనాడులో బాగా వ్యాప్తిలోకి వచ్చిన 'ఆత్మగౌరవోద్యమం' గురించి మీ అభిప్రాయమేమిటని 'అన్నా' నన్ను అడిగారు. అప్పుడు ఆయనకు ప్రముఖ సాంఘిక విప్లవకర్త త్రిపురనేని రామస్వామి చౌదరిగారి గురించి నేను చెప్పాను. ఆర్య, ద్రావిడ ఘర్షణలు, ఆ పరంగా రూపొందిన పురాణాలు వీటిపై రామస్వామి చౌదరిగారి దృక్పథాన్ని ఆయనకు వివరించి, 1917నుంచి ఆంధ్రలో మాలాంటి వారమంతా ఆత్మగౌరవ నిర్దేశితమైన నవజీవనం వైపు సమాజాన్ని నడిపించేందుకు ఎలా నడుంకట్టామో, ఆయనకు తెలియజెప్పాను. ఆ తరవాత ఆ ఉద్యమాన్ని గురించి తెలుసుకునేందుకు ఆయన ఎంతగానో ఆసక్తిని కనబరిచారు.

మిత్రులతో కలిసి తరచు నా వద్దకు వస్తూ, ఆయన నాతో చర్చిస్తూ ఉండేవాడు. మామూలుగా ఆదివారాలలో సాయంత్రం పూట ట్రిప్లికేన్ సముద్రతీరంలో కలుస్తూ ఉండేవాళ్ళం. శూద్రులుగా ఉన్న బౌద్ధులు జైనులు, శైవులు, ఎట్లా ఏ విధంగా హిందూమతంలో చేరారు? హైందవ పండితుల ఆంక్షలకు తలవొగ్గి, చాతుర్వర్ణ ప్రాతిపదికలో కూడిన హైందవ సామాజిక వ్యవస్థలో ఉండి పోయేందుకు ఎలా అంగీకరించారు? అనే సందేహాలను వెలిబుచ్చుతూ ఉండేవారు. యువకుడైన ఆయన ఒకోసారి ఉద్రేకంతో "సార్! ఇటువంటి తప్పుడు ఆచారాలకు, పద్ధతులకు వ్యతిరేకంగా మనం పోరాడి తీరాలి! ఆత్మగౌరవ ఉద్యమం మాత్రమే దీనికి తగిన జవాబు" అని అంటూ వుండేవాడు. మరోమారు వారు నాతో కలిసినప్పుడు "ఆంధ్ర దేశంలో స్త్రీలు, శూద్రులు పంచముల కోసం సంస్కృత పాఠశాలను ప్రారంభించి, వారికి వేదాలలో, ఉపనిషత్తులలో శిక్షణ ఇస్తున్న విషయాన్ని, బ్రాహ్మణేతర యువకులకు వివాహవిధి, కర్మకాండల నిర్వహణలో గూడా శిక్షణగరపుతూ వస్తున్న సంగతిని వివరించాను. "వివాహ విధులు, కర్మకాండలను శూద్రులు నిర్వహించడం శాస్త్రసమ్మతం కాదనే విశ్వాసాలను తరతరాలుగా నమ్ముతున్న మన ప్రజలను ఈ మార్గంవైపు ఎలా మళ్లించగలరని" కొందరు నన్ను ప్రశ్నించారు. పురాణాల్లో, శాస్త్రాల్లో పాండిత్యం సంపాదించిన బారిష్టరు రామస్వామి చౌదరి, సరస్వతీ స్వామి ఈ విషయంలో ప్రజలను ఒప్పించగలరని, ఇలాంటి సంస్కరణలు, ఘటనలెన్నో పురాణాల్లోనే కలవనే సంగతిని, వారు ప్రజలకు వివరించి ఒప్పించగలరని నేను చెప్పాను.

ఓ రోజు ఆయన మరికొందరు విద్యార్థి మిత్రులతో కలిసి నా దగ్గరికొచ్చి " కొద్ది రోజుల్లో కాంచీపురంలో ఆత్మ గౌరవ ఉద్యమ సభ జరుగనున్నదనీ, దానికి హాజరు కావలసిందిగా నన్ను కోరుతూ, ఆహ్వానించారు, "నేను కాంగ్రెసు పక్షానికి చెందిన జాతీయవాదిని, ఈ సభను నిర్వహిస్తున్నవారు పూర్తి కాంగ్రెసు వ్యతిరేకులు. దీనికి నేను ఎలా రాగలనని ఆశ్చర్యపడుతూ అడిగాను. 'అన్నా', ఆయనమిత్రులు "ఇది జస్టిస్ పార్టీ రాజకీయ వేదిక కాదనీ, ఈ సభ బ్రిటిష్

పాలనను సమర్థించడం లేదనీ, కనుక మీరు రావచ్చుననీ" అన్నారు. పానగల్ రాజా బ్రిటిష్ గవర్నరు పదవిని తిరస్కరించారని కూడా 'అన్నా' అన్నట్టు గుర్తు. "సాంఘిక సమానత్వానికి ఆటంకంగా ఉన్న అష్టాదశ ఆంక్షలకు, బ్రాహ్మణ ప్రేరితమైన కులతత్వ వ్యవస్థకు నేను పూర్తి వ్యతిరేకిని. జస్టిస్ పార్టీ కార్యకర్తలు కూడా ఇందుకోసం పోరాడుతూనే, వారి నాయకత్వం బ్రిటిష్ ప్రభుత్వానికి బానిసగా ఉండడాన్ని నేను అంగీకరించలేను", అని చెప్పాను. దేశానికి స్వాతంత్ర్యం ఎంతముఖ్యమో, మతపరమైన బానిసత్వంనుంచి విముక్తి, సామాజిక అసమానతల తొలగింపు కూడా అంతే అవసరమని, నేను విదేశాలు పర్యటించి, అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి గమనించానని చెప్పాను. ఎలాగైనా నన్ను ఒప్పించి, కాంచీ పురం సభలకు తీసుకెళ్లగలమనే నమ్మకంతో, ఆరోజు నా దగ్గరకొచ్చిన 'అన్నా' ఆయన మిత్రుల ఆత్మవిశ్వాసానికి నేను ముగ్ధుడినైనాను. ఆ సభ సాంఘిక న్యాయం కోసం, దేశస్వాతంత్ర్యం కోసం కూడా సమంగా పోరాడుతూ, కులాల మధ్య తేడాలను, హెచ్చు తగ్గులను రూపుమాపేందుకు కృషి చేయగలదని నేను పూర్తిగా విశ్వసించారు. 'పయోజన ఓటు హక్కు'ను గురించిన నా వ్యాసం 'త్రివేణి' ఆంగ్ల మాసపత్రికలోనూ, 'అణగదొక్కబడిన కులాల సముద్ధరణ' గురించి స్వరాజ్య దినపత్రికలోనూ ప్రచురింపబడిన వెంటనే, 'అన్నా' తో సహా, అనేక మంది విద్యార్థులు తమ సంతోషాన్ని తెలిపేందుకు నా వద్దకు వచ్చారు. మన ప్రజలు ముందుకెళ్లేందుకు ఇవి 'అభ్యుదయ మార్గాల'ని 'అన్నా' అన్నాడు. అంతే, ఇలాంటి కార్యక్రమాల్లో తాను పూర్తిగా సహకరించగలనని చెప్పాడు. ఆ తర్వాత మదరాసు పరిసర ప్రాంతాల మురికివాడల్లో నేను పర్యటించే ప్రతి సందర్భంలోనూ ఆయనను తీసుకెళ్లాను. అభాగ్యులైన ఆ జనాల ఆర్థిక, సాంఘిక పరిస్థితులను గురించి, ఇల్లు, వసతి, పరిసరాల గురించి మేము తెలుసుకుంటూ ఉండేవాళ్లం! ఆయా అంశాలపై నోట్సు తయారీ, వ్యాసాలకూర్పువంటి పనుల్లో ఆయన నాకు సహాయ పడుతూ ఉండేవాడు. నా వ్యాసాలను 'స్వరాజ్య' ఆంగ్లదినపత్రికకూ, రిపోర్టులను వై.యం.బి.ఎ స్టడీ గ్రూపులకు నేను పంపుతూ ఉండేవాడను. 'అన్నా' అలాంటి సాంఘిక సేవాభిలాషులైన విప్లవ యువకుల కారణంగా "పచ్చయప్పాస్ స్కూల్ ఆఫ్ సోషల్ స్టడీస్" ఆవిర్భవించింది.

గాంధీజీ ఉప్పు సత్యాగ్రహానికి పిలుపునివ్వడంతో, పచ్చయప్ప కళాశాలో నా వద్ద సాంఘిక శాస్త్రాన్ని అభ్యసిస్తూ "ఆత్మగౌరవ ఉద్యమం"లో కలిసి పాల్గొంటున్న పూర్వ, ప్రస్తుత విద్యార్థులను, గోఖలే హాలుకు చెందిన వై.యం.బి.ఎ విద్యార్థి పార్లమెంటు సభ్యులను, నాతో కలిసి జాతీయోద్యమంలో పనిచేయవలసిందిగా కోరాను. ముఖ్యంగా 'అన్నా'ను నాతో అట్టిపెట్టుకోవడం నాకెంతో ఇష్టంగా ఉండేది. ఎందుకంటే దేశం పట్ల అతనికున్న మమతానురాగాలకు నేను ముగ్ధుడినయ్యాను. "అణగదొక్కబడిన ప్రజల సాంఘిక పురోభివృద్ధే తనకు అన్నిటికంటే మొదటి ఆశయమనీ, అందువల్ల తాను ఈ ఉద్యమంలోకి రాలేనని, అందుకు మన్నించవలసిందిగా 'అన్నా' కోరాడు. ప్రధానంగా కాంగ్రెసు సంస్థ ఉన్నతవర్గాల, అగ్రకులాల వారి చేతుల్లో మాత్రమే ఉందని ఆయన భావించాడు. అప్పటికింకా ఆయనపై పెరియార్ పూర్తి ప్రభావం పడలేదు. ప్రత్యేకంగా సాంఘిక న్యాయం. హైందవమతంలోని అసమానతల తొలగింపు, మత స్వేచ్ఛ కోసం పోరాడవలసిన అవసరం ఉందని ఆయన తలపోయడం కారణంగానే ఇందులో కలిసి

రాలేదు. పచ్చయప్ప కళాశాలలో ఆచార్య పదవికి రాజీనామాచేసి, నేను గాంధీజీ ఉద్యమంలో చేరటంతో "ఆత్మగౌరవ ఉద్యమం ఒక గట్టి నాయకుడిని, తాను ఓ మంచి మిత్రుడిని కోల్పోయామని 'అన్నా' ఎక్కువగా బాధపడ్డాడు.

బారిష్టరు త్రిపురనేని రామస్వామి, పెరియార్ ఇ.వి.ఆర్.నాయకర్, అతి చురుకైన వారి అనుచరుడు అన్నాదురైగారలు ఆత్మగౌరవ ఉద్యమం ద్వారా పుక్కిటి పురాణాల భావదాస్యంనుంచి, పౌరోహిత వర్గాల కబంధహస్తాలనుంచి భారత ప్రజలను గౌరవప్రదమైన, స్వేచ్ఛాయుతమైన ఆలోచనలవైపు మళ్లించేందుకు కలిసికట్టుగా పనిచేస్తూ, వారి విప్లవాత్మకమైన ఆశయాలు నెరవేరేందుకు, తీవ్రమైన కృషి సాగించారు. తన నిర్భయమైన తీవ్రమైన పురాణేతిహాసాంపై తిరుగుబాటు విమర్శలతో, దేవుడు లేదా దేవత పేరిట కొనసాగుతున్న దురాచారాల, మూఢ విశ్వాసాలను అడ్డుకోగలమని, దురదృష్టవశాత్తూ మోసపోయిన జనాలను మేల్కొలిపి, ఊపు నిచ్చి పౌరోహిత, ఛాందసవర్గాల నోళ్లు మూయించగలమని త్రిపురనేని రామస్వామి భావించాడు.

1917-30 సంవత్సరాల మధ్య సాంఘిక సమానత్వాన్ని కాంక్షించే అనేకమంది శూద్రకవులు, రాజకీయనాయకులు ఇటు ఆంధ్రలోనూ, అటు తమిళనాడులోనూ, బహుజనులైన శూద్రులు, హరిజనులు, ఆదివాసుల నరనరాల్లో, ఆచారాల పేరిట, సాంప్రదాయాలపేరిట ఎక్కించిన హైందవ చాతుర్వర్ణ్య దురహంకారాన్ని, అప్పటిదాకా ప్రజల్లో పాతుకుపోయిన పుక్కిటి పురాణాలను, అంగీకరించక, ఎదిరించి నిలిచిన వారెందరో ఉన్నారు. ఇలాంటి వారందరికీ స్వామీ సరస్వతి, బారిష్టరు రామస్వామి, రాఘవయ్య చౌదరి ఆంధ్రనుంచి, స్వామి రామలింగం తమిళనాడు నుంచి, డాక్టర్ అంబేద్కర్ బొంబాయి నుంచి నాయకత్వం వహించారు. బుద్ధుని నుంచి, రామానుజాచార్యులనుంచి, వీరశైవ మతస్థాపకులైన బసవేశ్వరుల నుంచి, కవి, వేదాంతి వేమననుంచి వారంతా భావస్ఫూర్తిని సంపాదించుకున్నారు. ప్రజలను అగ్ర, నీచవర్గాలుగా విభజించడాన్ని వారు వ్యతిరేకించారు.వర్ణాశ్రమ ధర్మాన్ననుసరించి విధించిన కుల వ్యవస్థకు వ్యతిరేకంగా వారు నడుం బిగించారు. ఇలాంటి న్యాయవిరుద్ధమైన స్వాభావికం కాని, కాలంచెల్లిన ఛాందస భావాలనుంచి బయటపడి, సనాతన వాదాలనుంచి ప్రక్కకు తొలగి, మాతో కలిసి రావలసిందిగా, గాంధీజీని వారు కోరారు. పురాణేతిహాసాల ద్వారా ప్రజల మనస్సులలో నాటబడి, అప్పటికి దట్టంగా నెలకొని ఉన్న సాంఘిక, రాజకీయ అవలక్షణాలను తొలగించాలని వారు గట్టి పట్టుదలతో నిలిచారు. అందుకు వారి ఆశయ సాధన కోసం ఆత్మగౌరవ ఉద్యమాన్ని వారు ప్రారంభించారు. అయితే మార్క్సిస్టులవలె నూతన సామాజిక దృక్పథంవైపు జనాన్ని తీసుకెళ్ళేందుకువారు గట్టిగా ప్రయత్నించలేదు. ఆర్య, ద్రావిడ జాతుల మధ్య జరిగిన ఘర్షణలు, సాంఘికంగా, సాంస్కృతికంగా నాడు జరిగిన పోరాటాల విశ్లేషణలను, తెలుపుతూ వారిభావాలకు అనుగుణంగా పాతపురాణాలనే ప్రాతిపదికగా తీసుకొని కొత్తగా వాటికి భాష్యం చెబుతూ, ఛాందస భావాలను నిందిస్తూ ప్రజలను మేల్కొల్పటానికి ప్రయత్నించారు.

తాపీగా నడుస్తున్న గాంధేయమార్గంలో ఇమడలేని పెరియార్ తనకు తానుగా 'ఆత్మగౌరవ ఉద్యమానికి' ప్రధానకర్తగా నిలిచారు.

పౌరోహిత్య మత భాండనవాదులు సృష్టించిన వర్ణవ్యవస్థ చట్రంలోని అన్యాయాలకు వ్యతిరేకంగా, ప్రజల అజ్ఞాన అంధవిశ్వాసాల బారినుంచి వారిని బయటపడేసేందుకు, చైతన్యవంతులను చేయటానికి పెరియార్ తిరుగులేని తన వాగ్ధాటితో సామెతలతో, చలోక్తులతో తన ప్రసంగాల ద్వారా ప్రజలను ఉర్రూతలూగిస్తూ, అవిశ్రాంతంగా తమిళనాట జైత్రయాత్ర చేశారు.

'అన్నా' నిర్మాణ సాధనసంపత్తిని, రాజకీయ దక్షతను తమ భావాలకు అనుగుణంగా, ప్రచారకార్యక్రమాల్లో ప్రజలను మేళవించి, ఉద్యమానికి బలం సమకూర్చిపెట్టాడు. ఆ విధంగా ఆయన ప్రజాఉద్యమాన్ని, తన సహచరుల అభిలాషలకనువుగా దీర్ఘకాలికమైన, శక్తివంతమైన రాజకీయపార్టీగా తీర్చిదిద్దారు.

పెరియార్ నాయత్వంలోని ద్రవిడకజగం పార్టీ, ఆ తరువాత రూపు దిద్దుకొన్న తన నాయకత్వంలోని ద్రవిడమున్నేట్రకజగం పార్టీలు రెండూ కూడా అన్నాదురై సామర్థ్యానికి ఆనవాళ్లే. 1930 నుండి నాలుగు దశాబ్దాల పాటు దేశంలో తలెత్తిన అన్ని రాజకీయ ఉద్యమాలు అఖిలభారత స్థాయిలో వచ్చినవే. అయితే జాతీయ దృష్టి కలిగిన సాంఘిక, రాజకీయ ఉద్యమాల వైపు మాత్రమే స్పందించగల స్థితిని ప్రజలలోకి చొప్పించగలిగిన శక్తి మహాత్మాగాంధీది మాత్రమే. అందుకు ఆయనను అభినందించవలసిందే.

"తమిళనాడు మాత్రమే తమకు భౌగోళికంగా ఆవాసప్రాంతమైన దేశం. తమిళం తమ స్వభాష, ప్రాచీన తమిళసాహిత్యం తమకు మార్గదర్శకత్వం. తమ సాంఘిక, రాజకీయ లక్ష్యాలకు పునాది సాధారణ తమిళప్రజలు. ఇంతటి పటిష్టవంతమైన రాజకీయ లక్ష్యాలను ఆనాడు కాంగ్రెసు పక్షంగానీ, కమ్యూనిస్టు పక్షంగానీ కలిగి ఉండలేదు. ప్రపంచ సాంఘిక సంస్కరణ ఉద్యమాల కృషిలోనే ఈ దృష్టి అగ్రగణ్యమైనది. పెరియార్ కన్నకలలకు 'అన్నా' ఈ ప్రాతిపదికతో నిర్మాణ స్వరూపాన్ని కల్పించి, ఉద్యమాన్ని గొప్ప రాజకీయ శక్తిగా ఆవిర్భవింపజేసాడు. ఈ ఆలోచన వెలువడడంతోనే అనేకానేక రాజకీశక్తులన్నీ తమిళ ఉద్యమ ధాటికి తట్టుకోలేక భయంతో కుంచించుకుపోయాయి.

తన అనుచరులను సమర్థులుగా తయారుచేసి, 'అన్నా' తమ పార్టీకి రాజకీయాధికారాన్ని సాధించుకున్నారు. ముందు పెరియార్ ఆ తరవాత 'అన్నా', ఆ తర్వాత వారి అనుచరులందరూ, ఆంధ్రలో రామస్వామి చౌదరి పురాణేతిహాసాలపై తిరుగుబాటు సాహితీ కార్యక్రమాలను రూపొందించినట్లుగానే, హైందవ పురాణ కథలను తమ స్వంత బాణీతో విమర్శిస్తూ, తమ ఆశయసాధనక్రమంలో సాంఘిక పునరుజ్జీవనం వైపు తమిళ ప్రజలను నడిపించసాగారు. ప్రజల్లో పాతుకపోయిన పాతనమ్మకాలు, అంధవిశ్వాసాలు, పూజలు, మొక్కుబడులు, తదితర వైదికకర్మకాండల తంతునుంచి ప్రజలను వెనక్కు మరలించి, వాటిపట్ల వైముఖ్యాన్ని కలిగించి, రామస్వామి చౌదరి సాధించిన నవజీవన విధానం మాదిరిగా, తమిళ ప్రజలను సరికొత్త జీవన విధానంవైపు, తమదైన నూతన ఆలోచనా సరళివైపు మళ్లించగలిగారు. ఈ నూతన జీవన విధానాన్ని తమిళ ప్రజలలో వేలాది కుటుంబాలు ఆచరించేలా, ప్రజలను మార్చగలిగారు.

నంభై సంవత్సరాల స్వల్పవ్యధిలోనే శ్రమజీవులైన తమిళ ప్రజల్లో హెచ్చుమందిని

తమదారిలోనికి వారు తీసుకురాగలిగారు. ఇదెలా సాధ్యపడింది? ఐసినాల్మీకి, వ్యాసుని వంటివారు తమ ఆలోచనా పరంపరల ద్వారా, కావ్యాల ద్వారా, ఏ విధంగా ఆర్యసమాజాన్ని ఆకట్టుకున్నారో, అలాగే వర్ణదురహంకార బాధా సర్పద్రష్టులైన తమిళ ప్రజలను తమ నూతన భావసంపద ద్వారా ప్రభావితుల్ని చేసి వీరు ఆకట్టుకోగలిగారు. అనాదిగా సమాజంలో పాతుకుపోయిన పాత పద్ధతులకు, సంప్రదాయాలకు ప్రత్యామ్నాయంగా ఆవిర్భవించిన ఈ నూతన జీవన విధానంవైపు తమిళ ప్రజలు పాతమ్మకాలన్నిటికీ ప్రతిగా స్పందించారా? ఈ నూతనదృష్టిలో భాగంగా, తమ జీవనవిధానాన్ని కొనసాగించేందుకు ఆమోదించారా? అలా అని చెప్పలేము. మన గ్రామాల్లో భిన్న, భిన్నమైన చేతి వృత్తులు వేటికవి జీవిస్తూ, అన్నీ కలసిమెలసి ఎలా సహజీవనం సాగిస్తున్నాయో, అలాగే పౌరోహిత బ్రాహ్మణ తత్వం తాలూకు వైదిక రీతులొకవైపు. అన్నాదురై, పెరియార్‌లు ప్రవేశ పెట్టిన ఈ కొత్త రీతులొకవైపు రెండూ ప్రక్కి ప్రక్కినే నిలబడి బ్రతుకసాగాయి. దీర్ఘకాలంగా అక్కడి జనాలను పీడిస్తున్న కర్మ, పాపభీతి, మూఢవిశ్వాసాల కర్మకాండల ద్వారా క్రిందికి త్రొక్కబడిన ప్రజలు, వర్ణవ్యవస్థకు ప్రతిగా రూపొందిన ఈ కొత్త ఆలోచనా మార్గంలో కొంతగాలి పీల్చుకోగలిగారనేది మాత్రం వాస్తవం. లక్షలాది అమాయక ప్రజల మరణంతో వచ్చిన చైనా సాంస్కృతిక విప్లవం, లేదా రష్యామార్క్సు నిషాతో గాకుండా, ఇది నిజంగా ఓ కొత్త దారిలో వచ్చిన, ఓ నూతన ప్రయోగం. హేతువాద దృష్టితో గూడిన, ఈ సాంఘిక పరివర్తనా కార్యక్రమం ఇంకా తన పూర్తి లక్ష్యం వైపు పయనిస్తూనే ఉంది. 'అన్నా' తన పూర్తి శక్తితో దీనిని ముందుకు నడిపిస్తున్నాడు. బారిష్టరు, కవి, హేతువాది కే.శే. త్రిపురనేని రామస్వామి చౌదరిగారికి శ్రద్ధాంజలి ఘటించేందుకు అన్నాదురై రెండుసార్లు తెనాలి వచ్చారు. ఆ సందర్భంలో చౌదరిగారు ప్రారంభించిన కృషిని డి.యం.కె. పూర్తి చేయగలదని ఆయన అన్నారు. ఆంధ్రకవులను, రచయితలను, ఉపాధ్యాయులను ఈ సాంఘిక విప్లవానికి తోడ్పడ వలసిందిగా ఆయన కోరారు.

గాంధీజీ నాయకత్వంలో నడుస్తున్న స్వరాజ్యపోరాటం, ఎన్నికల ప్రచారకార్యక్రమాలకు దీటుగా, ఈ సాంఘిక విప్లవ కార్యక్రమాన్ని రాజకీయాలలో సమన్వయం చేస్తే తప్ప, దీనిని నిర్వహించడం సాధ్యం కాదనే సంగతిని వారు గ్రహించారు. దూరదృష్టితో ఆయన అందుకు పూనుకున్న వెంటనే భూమిలేని పేదలు, సాంఘికంగా వెనుకబడిన వర్గాల ప్రజలు ఆయనవెంట నడిచారు. ధనవంతులు, భూస్వామ్య వర్గాలు శ్రీ కామరాజ్ నాడార్ నాయకత్వంలో కాంగ్రెసు పక్షాన ఉన్నారు.

అన్నాదురై ప్రభావం అతి వేగంగా తమిళనాడును చుట్టుముడుతున్న తరుణంలో, ఆయన ఎంతగానో అభిమానించే నాయకుడు పెరియార్ శ్రీ కామరాజనాడార్‌ను, ఆయన ద్వారా కాంగ్రెసును సమర్థించడం మొదలు పెట్టారు. పెరియార్‌ను ఎక్కడైనా చూచినప్పుడు అన్నాదురై కోపంతో మెలికలు తిరిగిపోతూ ఉండేవారు. తిరిగి 1967-68 సంవత్సరాల్లో వారిద్దరి కలయిక సంభవించినప్పుడు, పెరియార్ పై అన్నాదురై చూపిన భక్తి విశ్వాసాలు దైవ సంకల్పమేననవచ్చును.

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

భారతదేశంపై చైనా దురాక్రమణ జరిపినప్పుడు ఆయన కనబర్చిన దేశభక్తి అపూర్వం. రాజ్యాంగ వ్యతిరేకతను, ప్రత్యేక తమిళనాడు వాదాన్ని ఆయన విసర్జించి, భారత జాతీయత పరిధిలోనే తమిళ ప్రజలు సాంఘిక అసమానతలపై పోరాటం సాగించగలరని ప్రకటించాడు. ప్రత్యేక తమిళరాష్ట్రం కోసం నినదించిన అన్నాదురై, భారత రిపబ్లిక్ లో భాగంగానే, తమిళనాడు ఉండగలదని అంటూ, గొప్ప జాతీయ నాయకునిగా ఎదిగారు. ఆయన దేశభక్తికి ఈ సంఘటన ఒక గొప్ప తార్కాణం.

'అన్నా' అంటే నాకెంతో ప్రేమ. నిష్కపటమైన శక్తిమంతమైన ఆయన నాయకత్వంపై నాకు గొప్ప గౌరవం ఉంది. తమిళనాట సాంఘికంగా, ఆర్థికంగా అణచివేయబడిన వర్గాల ప్రజల అభ్యుదయం కోసం ఆయన చేస్తున్న ప్రయత్నాలు దెబ్బతినకూడదనే సంకల్పంతో, ఆ సమయంలో నాకు అంగీకారం కాని అనేక అంశాలపై విభేదాలు పొడచూపకుండా, మద్రాసులోని నా పర్యటనలను దాటవేస్తూ ఉండేవాడు. స్వయంగా, నేను పాటిస్తున్న ఈ నిశ్శబ్దమైన సంయమనానికి ఆయన ఎంతగానో ఆనందిస్తుండేవారు.

1972లో చిత్తూరు పార్లమెంటు స్థానానికి ఉప ఎన్నికలో నేను పాల్గొంటున్నప్పుడు, దక్షిణాది రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న అన్ని కాంగ్రెసు మంత్రివర్గాలు నాకు వ్యతిరేకంగా పనిచేశాయి. చిత్తూరులో ఉన్న అన్నాదురై అభిమానులు కొందరు ఆ సందర్భంలో ఆయనను కలువగా "నేను ఆయనకు ఆచార్యుడనని, తప్పక అందరూ నా గెలుపుకు కృషి చేయవలసిందిగా చెప్పారు. అప్పుడు ఆయన జైలులో ఉండే, నా గెలుపుకు తగు విధంగా సహకరించవలసిందిగా, మదరాసులో ఉన్న ఇతర నాయకులను కోరారు. జైలు నుండే తన సందేశాన్ని నాకు పంపారు.

రాజకీయ పరిస్థితులను గురించి, ఎన్నికల సర్దుబాట్ల గురించి పరిశీలించవలసిందిగా అన్నాదురై తన అనుచరులను కోరాడు. డి.యం.కె.తో కలిసి ఎన్నికల్లో కాంగ్రెసుకు వ్యతిరేకంగా మేమూ (స్వతంత్ర పార్టీ) డి.యం.కె.వారు ఎక్కువగా గెలుపొందాం. మదరాసు కార్పోరేషన్ ఎన్నికల్లో రాజాజీ ఎలాంటి షరతులు లేకుండా డి.యం.కె పార్టీకి తోడ్పాటు నందించి, తిరిగి వారు మెజారిటీ సంపాదించుకునేలా చేయగలిగారు. ఆ అనుభవంతో అన్నాదురై స్వతంత్ర పార్టీ (రాజాజీ) తో ఎన్నికల సర్దుబాటు చేసుకుంటూ, తమ కార్యకర్తలను కలిసి పని చేయవలసిందిగా కోరారు. 'అన్నా' లౌకిక దృష్టి, రాజాజీ కలయిక 1967లో డి.యం.కె పార్టీకి అధికారం చేకూరేలా చేయగలిగాయి.

ఆ రోజున 'అన్నా' సాధించిన దానిని, దూరదృష్టి కలిగిన కాంగ్రెసు నాయకులు కూడ ముందుగా గమనించలేకపోయారు. 1966-67లో నెలకొని ఉన్న రాజకీయ పరిస్థితుల్లో అది సాధ్యపడుతుందని వారు అనుకోలేదు. హెచ్చుతేడాతో ఆనాడు కాంగ్రెసు పక్షం ఓడించబడింది. 1946లోనూ, 1971లోనూ చవిచూసిన అనుభవాన్ని ఆనాడు కాంగ్రెసు తిరిగి పొందిందని చెప్పవచ్చు. ఆ కాలంలో ఎలాంటి స్వలాభాపేక్షకు లోనుకాకుండా పరిపాలన సాగించిన శ్రీ కామరాజనాడార్‌ను సుదీర్ఘకాలంగా ఉన్నాడనే కారణంతో రాష్ట్రముఖ్యమంత్రిగా తప్పించారు. వారి స్థాయికి తగ్గని మరొకరు ఆ స్థానంలో ఉన్నారు. పంజాబ్, రాజస్థాన్, బీహార్, యు.పి, కేరళ,

మైసూరు, మధ్యప్రదేశ్ లలోవలె ఇక్కడి కాంగ్రెసు పాలనపై ఎలాంటి అవినీతి ఆరోపణలు చేసి ఉండలేదు. అయినా ప్రజలు కాంగ్రెసును ఓడించారు.

ముఖ్యమంత్రి అయిన తరవాత 'అన్నా' ఒక సంవత్సరం దాటి కొద్దికాలం మాత్రమే జీవించారు. పరిపాలనలోని లోతుపాతులను తెలుపుతూ, అధికారవ్యామోహం దరిజేరకుండా ఉండేందుకు వీలుగా తన అనుచరులకు ఆయన, ఆకాలంలోనే చక్కని శిక్షణ గరిపారు. కాన్సరు రూపంలో మృత్యువు ఆయనను కబళించడం ఈ జాతికి సంభవించిన ఒక తీరని లోటు. అతి కొద్ది కాలంలోనే ఆయన గతించినా పూర్తి మర్యాదలతో నిష్క్రమించగలిగారు. పార్టీని అతిశక్తిమంతమైన వ్యవస్థగా ఆయన రూపొందించారు. 1971 ఎన్నికల్లో శ్రీమతి ఇందిరాగాంధీ ఎంత ప్రయత్నించినా డి.యం.కెను అధికారంనుంచి తప్పించలేకపోయారు. బాధిత ప్రజల మద్దత్తుతో వచ్చిన గట్టి పునాదితో డి.యం.కె. తిరిగి అధికారానికి రాగలిగింది. ఉభయ కాంగ్రెసు పక్షాలు బలహీనమైన ప్రతిపక్ష స్థానంలో ఉండిపోవలసి వచ్చింది. 1972 వచ్చేటప్పటికి భారతదేశంలో విస్తృతంగా వ్యాపిస్తున్న అవినీతి, నియంతృత్వ లక్షణాలు డి.యం.కెను డి.యం.కె, అన్నడి.యం.కెలుగా విభజించాయి. ఒకరిపై మరొకరు పోరాడుకుంటూ, ఇతరపక్షాలతో పాటు, తమలో తామే పోరాడుకునే స్థితికి ఇరువర్గాలు దిగజారాయి.

<u>పార్లమెంటులో అన్నాదురై సంస్మరణ సందర్భంలో నా ప్రసంగంనుంచి</u>

పార్లమెంటులో అన్నాదురై స్మృతికి అంజలి ఘటిస్తూ నేను ఇలా అన్నాను. "దేశమంతటా 'అన్నా' గా పిలిపించుకోగలిగిన అన్నాదురై మన జాతీయ నాయకుల్లో ఒకరిగా ఎదగగలిగారు. ఆయన పేరెన్నికగన్న సాంఘిక సేవాకార్యకర్త. తమిళ సాహిత్యానికి ఆయన చేసిన సేవలు అనితరసాధ్యం, దక్షిణ భారతదేశంలోని క్రిందకు త్రోసి వేయబడిన జాతుల నాయకులు ప్రారంభించిన మదరాసు విశ్వవిద్యాలయంలో పేరెన్నికగన్న పచ్చయప్ప కళాశాలలో ఆయన నాకు అత్యంత ప్రియమైన విద్యార్థి కావడం జరిగింది. ఆయన తన జీవితాన్ని ఎన్నిగాలులెదురై నా తట్టుకొని, నించి వెనకబడిన తరగతుల సమద్ధరణకు, స్వేచ్ఛకు అంకితమొనర్చారు.

బుద్ధుని దగ్గరనుంచి, మహాత్మాగాంధివరకు రామమోహనరాయ్, త్రిపురనేని రామస్వామి చౌదరి, అంబేద్కర్ ఎందరో ప్రముఖులు సామాజిక పరివర్తన కోసం సంస్కర్తలుగా కృషి చేయగలగడం ఎంతో గొప్ప అదృష్టం. శ్రీ అన్నాదురై వారివలెనే, సాంఘిక సంస్కర్తలలో, సామాజిక విప్లవకారుల్లో అనన్యమైన కృషిని సాగించి, గగనతలంలో మరో ధ్రువతారగా నిలవగలిగాడు. హెచ్చుమంది ప్రజానీకం మీద కులతత్వ సంకుచిత దృష్టి ప్రవేశించి, వారిని ఎలా అణగార్చిందో గ్రహించి, ఆ దుస్థితినుంచి అణగారిన ప్రజలను బయటకు లాగడానికి వీరంతాకృషిచేసారు.

ప్రపంచ మానవాళికి, మానవతా లక్ష్యాలకు అన్నాదురై చేసిన సేవ గుర్తించదగినది. వెనకబడిన కులాలను, అట్టడుక్కు నెట్టివేయబడిన ప్రజలను పైకి తీసుకురావడం అంత సులభం కాదు. మహాత్మాగాంధి ఇక్కడ ఉన్న మనలో అనేకమందిని, అంబరానితనమనే మహమ్మారిని వెడలనడిపే కృషికై ముందుకు నడిపారు. మానవత్వంతో, దూరదృష్టితో

ఇలాంటి చర్యకుగాను మనందరను ప్రేరేపించారు. అయితే ఆ దురదృష్టకరమైన పరిస్థితి ఇంకా కొన సాగుతూనే ఉంది. మరికొంతకాలం కూడా దీని నిర్మూలనకు మనకు సమయం పట్టవచ్చు.

తమ దుస్థితికి, మరొకొందరి అగ్రస్థితికి తమతమ కర్మలే కారణమని, తరతరాలుగా తమ మనస్సులలో జీర్ణించుకుపోయిన భావదాస్యం నుంచి బయటపడడానికి ఈ ప్రజలకు ఎంతోకాలం పడుతుంది. ఇది తమ కర్మ అనుకునే కొందరు, జన్మతో ఇది తమకు లభించిన హక్కు అనుకునే మరికొందరను మార్చి నూతన మార్గంవైపు తీసుకురావడం, నిజానికి అంత సులువైన పనికాదు.

ఇలాంటి ప్రజలను మానసిక దుస్థితినుంచి బయటపడవేసేందుకు, అన్నాదురై సాంఘిక విప్లవోద్యమాన్ని ప్రారంభించారు. తనకంటే పెద్దవారు పండితులు, నాయకులైన పెరియార్ నుంచి పుణికి పుచ్చుకున్న భావసంపదతో శ్రీ అన్నాదురై ఈ ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తూ, భారత ప్రజానీకానికి మహాత్మా గాంధీ ద్వారా లభించిన వయోజన ఓటింగ్ ద్వారా దీనిని తమిళనాడులో ముందుకు తీసుకెళ్లగలిగి, తమిళప్రజను భావదాస్యంనుంచి మేల్కొలపగలిగాడు. మేము బ్రిటిషుపాలనకు వ్యతిరేకంగా పోరాడిన దినాలలో ప్రజలు ఎంతగా చైతన్యవంతులై ముందుకు వచ్చారో, అలాగే మొన్నటి ఎన్నికలలో తమిళనాట ఈ విప్లవ ప్రభావం ఉవ్వెత్తుగాలేచి, విజయాన్ని సాధించి, అన్నాదురైకృషికి నీరాజనాలర్పించింది. ఈ సామాజిక విప్లవ కారులందరిలో నేనూ ఒకడినై ఆయనకు అభివందనలర్పిస్తున్నాను.

వాల్యూమ్ X X IV లోకసభలోని ప్రసంగం
కాలమ్స్ 27-31 తేది 17-2-1969

5

శ్రీమతి అరుణా అసఫాలీ

ప్రముఖ స్వాతంత్ర్య సమరాంగణ కార్యకర్త, ఢిల్లీకి చెందిన శ్రీమతి అరుణా అసఫాలీ 1910లో జన్మించారు. ఆమె క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో అజ్ఞాతంగా ఉంటూ ఉద్యమ కార్యకర్తగా పనిచేసారు. ఆమె సోషలిస్టులతోనూ, కమ్యూనిస్టులతోనూ సహచర్యం నెరపారు. ఢిల్లా నగరానికి తొలిమేయర్‌గా ఎన్నికైనారు. అఖిలభారత మహిళా సంఘానికి నాయకురాలిగా, జాతీయ మహిళా సమాఖ్య తరపున ఆమె ప్రపంచమంతటా పర్యటించారు. సోవియట్‌రష్యా లెనిన్ శాంతి బహుమతి ప్రదానంచేసి, ఆమెను గౌరవించింది. పేట్రియాట్ దినపత్రికకు ఆమె సంస్థాపకురాలు.

ఆనాటి క్విట్ ఇండియా ఉద్యమంలో రహస్యంగా ఉంటూ పనిచేసిన వారిలో, నా ముఖ్య స్నేహితురాలు ఢిల్లీకి చెందిన శ్రీమతి అరుణా అసఫాలీ, బొంబాయికి చెందిన శ్రీమతి మృదులా సారాబాయి, నాగపూర్‌కు చెందిన అనసూయా బాయిగారు బీహార్‌కు చెందిన శ్రీ శీలభద్రయాజీ, ఆంధ్రకు చెందిన శ్రీమతి భారతీదేవి, ఆంధ్ర, ఒరిస్సా ప్రాంతానికి చెందిన లచ్చన్నగారు, మహారాష్ట్రకు సంబంధించిన శ్రీ అచ్యుతపట్వర్ధన్ గారలు. వీరంతా యువకులుగా ఉంటూ, పట్టుదలతో స్వతంత్ర పోరాటం కోసం గొప్పగా పని చేసివారు. ఆ పోరాట కాలమంతా అందులోనే ఉంటూ తీవ్రమైన కృషి చేసిన 'అరుణ' ఆ సందర్భంలో ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నది.

శ్రీమతి అనసూయాబెన్ అనుమానంపై ఎవరి ఆస్తులనైనా స్వాధీనం చేసుకునేందుకు, కనిపించిన తోడనే కాల్చి వేసేందుకు యుద్ధసమయంలో జారీచేసిన బ్రిటిష్ శాసనాలను ధైర్యంగా ఎదుర్కొన గలిగింది. చాందా జిల్లా జైలీలను చక్కెట్లు శిక్షించిన ప్రభుత్వ చర్యలపై పోరాటం నడిపేలాగు చేయగలిగింది. భారతీదేవి అలాగే మందసారైతులపై పోలీసు కాల్పులకు వ్యతిరేకంగా శ్యాంబాబు, లచ్చన్నగారల తోడ్పాటుతో పోరాటం జరిపింది. ఆమె బెంగాల్, బీహార్ రాష్ట్రాలకు చెందిన అనేక మంది విప్లవకారులకు ఆరోజుల్లో ఆశ్రయం ఇవ్వగలిగింది. అలాంటి వారిలో నేతాజీగా పిలిపించుకోబడే ప్రముఖ విప్లవకారుడు శీల భద్రయాజీ ముఖ్యులు. భారతీదేవి ఇల్లు - మాగోభూమి ఆ రోజుల్లో రెండుమార్లు విప్లవకారులను పట్టుకునే నిమిత్తం సోదా చేయబడింది. అయినా ఎవరూ వారికి దొరకలేదు. అచ్యుత పట్వర్ధన్, సతారా చుట్టుప్రక్కల ప్రాంతాల్లో తుఫాన్‌ను సృష్టించగలిగాడు. నేను బొంబాయిలో ఆయన నాకమారు కలుసుకోవడం జరిగింది, సుచేత కృపలానీ ఢిల్లీలోనూ, బొంబాయిలోనూ పనిచేస్తూ నిధులను రహస్యంగా సేకరిస్తూ వుండేవారు. బహుశా అది మృదుల సహాయంతో జరుపుతూ ఉండి ఉండవచ్చు.

జైలునుంచి బయటకు వచ్చిన తరవాత జవహర్లాల్ నెహ్రూ, అరుణను అభినందిస్తూ బహిరంగంగా వచ్చి పనిచేయవలసిందిగా ఆమెను కోరారు.

అరుణ, భారతీదేవి చక్కటి వారి ఆదరసత్కారాల ద్వారా ఢిల్లీ, సిమ్లాలలోని కాంగ్రెసు యం.యల్.ఎ ల మధ్య ఎంతో గౌరవమైన స్థానాన్ని సంపాదించుకోగలిగారు. సంస్కారులైన ఈ మహిళలిరువురూ ఇంతటి కఠినమైన రహస్య ఉద్యమాల్లో పాల్గొనడాన్ని చూసి, వైస్రాయి చుట్టు ప్రక్కలవారు ఆశ్చర్యపోతూ ఉండేవారు. 'వీరు ఇంతటి కష్టమైన పనుల్లో ఎలా పాల్గొంటున్నారా' అని విస్తుపోతూ ఉండేవారు.

ఆ సమయంలోనూ కొంచెం, ఆ తరవాతనూ బహుశా 1946-47 సంవత్సరాల మధ్య ఆమె రాజకీయ సంబంధాలు ఇంకొంచెం ముందుకు వెళ్లి ఆమె భర్తకు దూరంగా సోషలిస్టులకు, కమ్యూనిస్టులకు దగ్గరైంది. ప్రముఖ వ్యక్తులైన శ్రీ అసఫాలీ అప్పుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్‌కు సహచరులుగా ఉంటూ, అఖిల భారత కాంగ్రెసుకు కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు.

ఈ విషయాన్ని మేము, ఆమె మీరట్ కాంగ్రెసు సభల ప్రసంగంనుంచే గమనించగలిగాం. జాతీయ వాదులైన ఉద్యమ కార్యకర్తలంతా బ్రిటిష్ ప్రభుత్వ యుద్ధ కార్యాకలాపాలకు వ్యతిరేకంగా ఉన్న సమయంలో కమ్యూనిస్టులు తమ మాతృభూమిగా భావించే రష్యాకు కొంగు కాచే సంకల్పంతో ప్రారంభించిన 'ప్రజాయుద్ధ' నినాదాలతో ఆమె గొంతు కలపడంతో మాకీ అభిప్రాయం కలిగింది. మరొక ప్రక్క భారతీ దేవి కాంగ్రెసు జాతీయ వాదానికే కట్టుబడి ప్రపంచ యుద్ధం ఇండియా వ్యతిరేక పరిధిలో భాగమేనని దాన్ని వ్యతిరేకించవలసిందిగా ముందుకు వచ్చారు. అఖిల భారత కిసాన్ సభలోని కమ్యూనిస్టులు ఎంతగా వత్తిడి తీసుకొచ్చినప్పటికీ దానికామె తల వొగ్గక, యుద్ధ వ్యతిరేక నినాదంతో దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని కిసాన్ సభవంటి విస్తృత రంగంలోకి ప్రజాయుద్ధ నినాదాన్ని చేరుస్తూ దాని పరిధిని కించపరచరాదని త్రిప్పికొట్టారు. ఆ విధంగా దక్షిణాదికి చెందిన ఒకరు, ఉత్తరాదికి చెందిన మరొకర ప్రముఖులైన ఈ మిత్రురాళ్లు ఇద్దరూ భిన్నధ్రువాలుగా మారారు. చిన్నదైన భారతీ దేవి గాంధీయిజంవైపు, ఆమెకంటే పెద్దదైన అరుణకమ్యూనిజం వైపు మారారు.

అరుణ, ఆమె భర్త అసఫాలీ 1947-49 సంవత్సరాల మధ్య రెండు భిన్న ధ్రువాలుగా నిలబడి పోయారు. ఆ సమయంలో కమ్యూనిస్టుల తీవ్రవాదరాజకీయ పద్ధతులను ఆమె సమర్థించడంతో ఈ మార్పు సంభవించింది. శ్రీ అసఫాలీ మొదట అమెరికా రాయబారిగానూ, ఆ తరవాత ఒరిస్సా గవర్నరుగానూ అప్పట్లో నియమితులయ్యారు. అసఫాలీ మరణించడంతో ఆమెపై ఉన్న ఆ కొద్ది పాటి పట్టుకూడా తప్పిపోయి, ఆమె కమ్యూనిస్టు మిత్రులకు బాగా సన్నిహితం కాగలిగారు. జవహర్లాల్ నెహ్రూ తోడ్పాటుతో కమ్యూనిస్టుల అనుబంధసంస్థ భారతశాంతి సంఘంలో చేరి, ఆమె దాని శాఖలను దేశమంతా విస్తరింపజేయగలిగారు. ఇందుకు ఆ సమయంలో రష్యా అరుణకు శాంతి బహుమతులను అందజేసింది. ఆ కాలమంతా ప్రపంచ శాంతికి రష్యా విధానాలే తోడ్పడగలవని ప్రచారం చేస్తూ వచ్చారు. డల్లస్ పద్ధతులొకవైపు స్టాలిన్ ఇనుపచట్రం మరొక వైపు ప్రపంచాన్ని ఊపుతున్న ఆ సమయంలో జవహర్లాల్ అలీన విధానంతో ప్రపంచ రాజ్యాలను వారివద్ద మోకరిల్లకుండా చేసేందుకు ప్రయత్నించారు.

అదే సమయంలో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం, ఢిల్లీ - న్యూ ఢిల్లీల మధ్య ప్రధానమైన కూడలి స్థలమైన దరియాగంజ్ లో అసఫాలీ కంచు విగ్రహాన్ని ఏర్పాటు చేయడంద్వారా గౌరవించింది.

అరుణను ఢిల్లీ మొదటి మేయరుగా ఎంపిక చేయించడం ద్వారా నెహ్రూ ఆమెను గౌరవించారు. ఈ ఇద్దరు స్వాతంత్ర్య సమరయోధులకు ఒకేమారు ఈరకంగా సత్కరించి వారికి తగు గౌరవాన్ని ఇవ్వటం జరిగింది.

శ్రీ వి.కె.కృష్ణమోహన్, శ్రీ కె.డి.మాలవ్యాల తోడ్పాటుతో ఆమె 'పేట్రియాట్' ఇంగ్లీషు దినపత్రికను 'లింక్' ఇంగ్లీషు వార పత్రికను ప్రారంభించడం జరిగింది. ప్రముఖ సోషలిస్టు సంపాదకులు నారాయణీ వీటికి సంపాదకులుగా పనిచేసారు. వీటి ద్వారా కమ్యూనిస్టులకు ఆమె శక్తివంతమైన ప్రచార సాధనాలను సమకూర్చడం జరిగింది. ఇప్పుడు ఆమె కమ్యూనిస్టులకు పెద్ద దిక్కులాగా ఉంటూ కాంగ్రెసు నాయకత్వంలోని కేంద్ర మంత్రులలో కమ్యూనిస్టులకు సత్సంబంధాలను కల్పిస్తూ అటుకూ, ఇటుకూ మధ్య సంధానంగా వ్యవహరిస్తున్న సంగతి అందరకూ తెలిసిందే.

అరుణ స్త్రీ జనాభ్యుదయం కోసం కూడా నిలిచి పనిచేస్తూ సాంఘికంగా మహిళా పురోభివృద్ధి కార్యక్రమాల్లో తనవలెనే పాల్గొంటున్న కమలాదేవి, లీలావతి, భారతీ దేవిగారలతో స్త్రీ జనాభ్యుదయం కోసం కలిసి పనిచేయగలుగుతున్నారు. డాక్టర్ అంబేద్కర్, జవహర్లాల్ నెహ్రూగారల ప్రోద్బలంతో ఆమె భారత స్త్రీల ఆస్తిహక్కుల కోసం విడాకుల చట్టాన్ని సులభతరం చేయటం కోసం పని చేసారు. అఖిలభారత మహిళా సంస్థల స్థాపకుల్లో ఆమె ఒకరు. శ్రీమతి అచ్చమాంబ వంటి వారలకు గ్రామీణ మహిళాసంఘాల నిర్వహణలో ఆమె సహకరించారు.

ఆమె ఏ ఉద్యమంలో ఉన్నా, లేదా కమిటీల్లో ఉన్నా మంచిసహచరిగా ఉంటూ ఉండేది. శ్రీ శివరావు, వారిసతీమణి, శ్రీమతి లీలావతీ మున్షీ, శ్రీమతి కమలాదేవి, మృదుల మరి ఇతరులతో కలిసి స్త్రీల కోసం అనేక మంది పార్లమెంటు సభ్యులతో చర్చిస్తూ ఉండేది. వయోజన విద్యా వ్యాప్తికై మేము జరుపుతున్న కృషిలో వారు ఎంతగానో సహకరిస్తూ ఉండేవారు. దేశవిభజన ద్వారా తలెత్తిన కాందిశీక సమస్యాపరిష్కార కృషిలోనూ, కాందీశీకుల కోసం మృదుల, సుచేత చేస్తున్న మానవతా ప్రయత్నాలకు ఆమె తోడ్పడుతూ, విభజన వల్ల అనాధలైన వారి కోసం ఎంతగానో శ్రమించింది.

6

శ్రీ అసఫాలీ

1935వ సంవత్సరంలో సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నికయిన 35 మంది కాంగ్రెసు యం.యల్.ఎ లలో శ్రీ అసఫాలీ నాలుగోవారు. అప్పట్లో ఆయన పార్టీ చీఫ్‌విప్‌గా ఉండేవారు. స్వాతంత్ర్యపోరాట కాలం అది. అట్టి సమయంలో క్రమశిక్షణను కాపాడడంలోనూ, అత్యవసర కార్యకలాపాలను సమర్థవంతంగా నిర్వహించడంలోనూ సమర్థుడైన 'చీఫ్‌విప్' అని ప్రశంసింపబడినారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదుల అహంభావాన్ని, ఆంగ్ల ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ల నాజూకుతనాన్ని, అడ్డుకొనడంలో, ఢిల్లీపాదుషాల వారసత్వదర్పంతో, అసఫాలీ వ్యవహరిస్తూ, మన జాతీయావసరాలకు అనుగుణంగా, శక్తియుక్తులను ప్రదర్శిస్తూ, ఉదాత్తంగా కార్యకలాపాలను నిర్వహిస్తూ ఉండేవారు. సభలో ఆయన విలక్షణ పద్ధతిలో ఉండేవారు. ఉపన్యసించేప్పుడు ఆయన భుజాలనెగరవేస్తూ కళ్లద్దాలను సవరించుకుంటూ, ఉన్నతమైన భాషాపరిజ్ఞానంతో, చక్కని ఉచ్చారణతో, వాగ్బాణాలకు అగ్నిశిఖలను అమర్చినట్టి తీవ్ర పదజాలాన్ని ప్రయోగిస్తూ ఉండేవారు. ఆయన ప్రసంగం శ్రోతలకు వీనులవిందుగానూ, ఉత్తేజకరంగానూ సాగుతూ ఉండేది.

అఖిల భారతకాంగ్రెసు కమిటీ సమావేశాల్లో ఆయన ఉర్దూలో ప్రసంగించేప్పుడు, ఉర్దూలో ప్రవేశం ఉన్న సభికులు వింటూ, ఆంగ్లంలో కంటే, అసఫాలీ ఉర్దూలోనే ప్రసంగించడం అద్భుతంగా ఉంటుందని అంటూ ఉంటారు.

చక్కని స్నేహపాత్రునిగా, ఆయన ప్రతివారితో ఉత్సాహంగా కలివిడిగా ఉండేవారు. నాయకునిగా తాపీగా, దృఢంగా వ్యవహరించేవారు. కాంగ్రెసు వాదిగా ప్రత్యేకంగా, హుందాగా కనిపించేవారు. ఒక దేశభక్తునిగా తనను ముస్లిం ఛాందస వాదులు చులకనగా చూస్తూ ఉంటే, వారిపట్ల నిర్లక్ష్య భావంతో ప్రవర్తిస్తూ, ఒక భారతీయునిగా, ప్రముఖ ముస్లిం జాతీయవాదిగా, గర్వంగా రొమ్ము విరుచుకొని, నలుగురి ముందు తలెత్తుకొని నిలిచేవారు. భారతీయునిగా జన్మించినందుకు ఆయన ఎంతగానో గర్వించేవారు. అదే సమయంలో ఇతరులెవరైనా తనను మహమ్మదీయునిగా పరిగణిస్తే, వారి పట్ల చులకన భావంతో వ్యవహరించేవారు. నేను చాలా సులభంగానే ఆయన అభిమానాన్ని చూరగొనగలిగాను. సంస్థలో నిర్వాహక కార్యదర్శిగా ఉంటూ, ఆయన ఆలోచనల్లో భాగస్వామిని అవుతూ ఆయనతో కలిసి పనిచేసాను. పార్టీ సభ్యులకు కావలసిన సమాచారాన్ని ముందుగా తయారుచేసి ఇచ్చేందుకుగాను, నన్ను కార్యదర్శిగా నియమించడం జరిగింది. సాటివారిని ఆయన ఆదరంతో సత్కరించగల ఉదాత్తగుణం గలవారు. ఆయన భార్య శ్రీమతి అరుణ అతిథులను ఆయనకంటే మిన్నగా గౌరవించి, ఆదరించగలదు. ఆ భార్యాభర్తలిద్దరూ, మా సభ్యులందర్నీ ఉల్లాసకరమైన మొగల్ సాంప్రదాయక పద్ధతితో, సంతోషంతో ముంచెత్తుతూ ఉండేవారు.

ప్రధానంగా రైల్వేబడ్జెట్‌పై అసఫాలీ, మాలో ప్రధాన వక్తగా ఉండేవారు. రైల్వేలపై చక్కని అనుభవాన్ని గడించి ఉన్న లీగు నాయకుడైన శ్రీ జియావుద్దీన్ భావజాలంకంటే కూడా, అసఫాలీ ప్రసంగం అందర్నీ ఆకట్టుకొనేది. అప్పట్లో రైల్వేశాఖలో నేను ఆశించే మూడో తరగతి ప్రయాణీకుల వసతి సౌకర్యాల పెంపు, ముఖ్యంగాసీట్ల మధ్య ఉండే స్థలం విస్తరింపజేయడం, కరెంటు, పంకాల ఏర్పాటు, మేలైన మరుగుదొడ్ల నిర్మాణం, తరుచుగా పెట్టెలను శుభ్రపరచడం, విశాలమైన విశ్రాంతి శాలల నిర్మాణం, మంచినీరు, పారిశుద్ధ్యపు ఏర్పాట్లు, సీజను టిక్కెట్లు అమలు చేయడం, వంటి సంస్కరణలను అసఫాలీ తన ప్రసంగంలో చేర్చి, వాటికి ప్రముఖ స్థానాన్ని కల్పించి, పోరాడి వాటిని సాధించేందుకు దోహదం చేసారు. రైల్వేల నిర్వహణకు అవసరమైన బొగ్గు గనులను జాతీయం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని అసఫాలీ గట్టిగా వాదించారు. శ్రీ వి.వి.గిరి నేనూ, జోషీ కోరిన విధంగా, మొదటి జాతీయ ప్రభుత్వంలో రైల్వేశాఖకు మంత్రిగా ఉన్న వ్యక్తి, రైల్వేకార్మికుల కోర్కెలను బలపరిచారు. రైల్వే మంత్రి అప్పట్లో రైలు ఇంజన్లు, వ్యాగన్లు, పెట్టెల తయారీకి కావలసిన వనరులను కల్పించి ఈ రంగంలో దేశం స్వయం సమృద్ధంగావడానికి దారి చూపారు.

క్విట్ ఇండియా ఉద్యమకాలంలో, తనతోటి వర్కింగ్ కమిటీ సభ్యులతో పాటు, ఆయన అహమ్మదాబాద్ క్యాంపులో నిర్బంధింప బడినారు. ఆయన శ్రీమతి అయిన అరుణ ఆ సమయంలో అజ్ఞాతవాసంలోకి వెళ్లి, ఉత్తర భారతదేశంలో ఒకవర్గంవారి జాతీయ పోరాట కార్యక్రమాలకు మార్గదర్శకురాలిగా వ్యవహరించారు. నేను ఢిల్లీ పరిసరాల్లో ఉన్నప్పుడు, ఆమెతో కలిసి పనిచేసే అవకాశం వచ్చింది. తన చుట్టూ ఉన్న కార్యకర్తలను క్రమశిక్షణతో నడిపిస్తూ, ఆటంకాలను అధిగమిస్తూ, సాహసంతో ముందుకు నడిపిస్తున్న ఆమె సామర్థ్యాన్ని నేను గమనించాను. సంవత్సరాల తరబడి ఉద్యమ నిర్వహణలో ఆమె ఎత్తుకుపై ఎత్తులు వేస్తూ, చాకచక్యంతో సాగిపోయారు. కొన్ని సందర్భాలలో ఉన్నత పదవుల్లో ఉన్న భారతీయ ప్రభుత్వోద్యోగుల సర్వెంట్ క్వార్టర్స్‌లో ఆమె ఆశ్రయం పొందుతూ ఉండేది. జైలునుంచి విడుదలై వచ్చిన జవహర్లాల్‌కు, ఆమె సాహసకృత్యాలను వివరించడం జరిగింది. ఆమె సాహసాన్ని, నాయకత్వాన్ని ఆయన కొనియాడుతూ బహిరంగంగా ఇలా అన్నారు. "అరుణా! నీవెక్కడున్నా, అక్కడ నీ కోసం మా అభిమానం నీకు తోడుగా నిలిచి ఉంటుంది".

మనదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత, అమెరికా రాయబారిగా నియమించేందుకు, ఆమెకు అవకాశం వచ్చినప్పుడు, పండిట్ నెహ్రూ ఆస్థానానికి అసఫాలీని ఎంపిక చేసారు. తమ మొగల్ పాదుషా సాంప్రదాయపు అలవాట్లతో, హుందాతనంతో, అత్యంత శక్తిమంతమైన అమెరికా దేశాన్ని, అక్కడ ప్రజల్నీ మెప్పించగలిగారు. అందుకు అందరమూ సంతోషిద్దాం. అయితే అమెరికా వారితో, వారి అధికార దర్పంతో అసఫాలీ సర్దుబాటు కాలేకపోయారు. జవహర్లాల్, అసఫాలీ ఇద్దరూ అమెరికా విదేశాంగ శాఖ కల్పించే ఆటంకాలను అధిగమించి, వైట్ హౌస్‌తోగానీ, విదేశాంగ శాఖతో గానీ సయోధ్యను సాధించలేక పోయారు.

ఆ కారణంగా అసఫాలీ తిరిగి భారతదేశం రావాలని అనుకున్నారు. భారతదేశానికి వచ్చిన తరవాత అసఫాలీని ఒరిస్సా గవర్నరుగా నియమించడం, అక్కడ ప్రభుత్వ వసతి గృహంలో

ఆయనను, నేను తిరిగి కలుసుకోవడం జరిగింది. అటు రాయబారి పదివిగానీ, ఇటు గవర్నరు గిరీగానీ ఆయనలో ఎలాంటి మార్పును తీసుకురాలేదు. కాంగ్రెసు పార్టీ చీఫ్‌విప్‌గా పనిచేస్తున్న రోజుల్లో, ఎంతటి ఆత్మీయులుగా, స్నేహశీలిగా ఉండేవారో, అదే మృదుస్వభావంతో ఇప్పటికీ ప్రవర్తించారు. మహాత్మాగాంధీకి అసఫాలీ అంకితమైన అనుచరులుగా ఉండేవారు. జవహర్లాల్ పట్ల గౌరవభావం కలిగి ఉన్నప్పటికీ, అసఫాలీకి భూలాభాయ్ అంటే తగని ప్రేమ! సామ్యవాద సిద్ధాంతాలకు అనుగుణంగా దేశాన్ని తీర్చిదిద్దాలనే నెహ్రూ విధానాలు ఆయనకు నచ్చినప్పటికీ, దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని చిన్నా భిన్నం చేసే ఎలాంటి సిద్ధాంత వైరుధ్యాలకు కూడా తావు ఇవ్వరాదని ఆయన అభిప్రాయపడుతూ ఉండేవారు. ఆయనకు సామ్యవాద సిద్ధాంతం పట్ల ఎలాంటి వ్యతిరేకతాలేదు. ఆయన భార్య అరుణ కేవలం సామ్యవాది మాత్రమే కాదు. అంతకంటే తీవ్రమైన కమ్యూనిజాన్ని ఆమె అభిమానిస్తూ ఉండేది. ఆమె ప్రభావం వల్ల అసఫాలీ కమ్యూనిజానికి సన్నిహితులై, దేశాభివృద్ధికి కమ్యూనిజం తప్పనిసరి అనే స్థితికి వచ్చారు. సోషలిస్టు విధానాలను ప్రవేశపెట్టేబోయేముందు, యుద్ధం ద్వారా ఏర్పడిన దెబ్బతిన్న పరిస్థితులనుంచి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు, దేశ ఆర్థిక వ్యవస్థకు కొంత వెసులుబాటు కల్పించడం అవసరమని ఆయన భావించారు. తన చివరి ఘడియల్లో అరుణ కమ్యూనిస్టులకు మరింత సన్నిహితం కావటాన్ని ఆయన గమనించారు. స్త్రీ హక్కుల్నీ, వారి స్వేచ్ఛా సమానతల్నీ ఆయన ఎంతగానో గౌరవించేవాడు. ఉదాహరణకు అరుణ మార్గం ఆయనకు ఇష్టంలేకపోయినప్పటికీ, ఏ సందర్భంలో కూడా ఆమె అభిమతానికి విరుద్ధంగా తన అభిప్రాయాలను ఆమెకు అంటగట్టడానికి ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు.డాక్టర్ అన్సారీ, మౌలానా ఆజాద్‌గార్లకు అసఫాలీ అతి సన్నిహిత సహచరునిగా ఉండేవారు. దేశవిభజనను ఆయన పూర్తిగా వ్యతిరేకించాడు. పాకిస్తాన్ ఏర్పాటు పట్ల ఆయన తన అసంతృప్తిని ప్రకటించారు. ఆజాద్ కోరినట్లుగా భారతదేశాన్ని విభజించకుండా ఫెడరల్ పద్ధతిలో సర్దుబాటు చేసుకోవాలనే ఆలోచనను అసఫాలీ బలపరిచారు. అయితే జవహర్లాల్, పటేల్, రాజాజీ, రాజేన్ బాబుగార్లు దేశవిభజనకు అంగీకరించడంతో, ఆజాద్‌గానీ, అసఫాలీగానీ ఎలాంటి వ్యతిరేకతను చూపకుండా, మిన్నకుండిపోయారు. ఢిల్లీనగరం మతకలహాల రక్తపుటేరులలో ఓలలాడుతున్నప్పుడు, జవహర్లాల్, పటేల్ గార్లకు ఆయన ఎలాంటి తోడ్పాటును అందించలేని, నిస్సహాయస్థితిలో సాటి ముస్లింజాతీయ నాయకులతోపాటు చూస్తూ ఉండిపోవలసి వచ్చింది.

ఆ దురదదృష్టకర పరిస్థితులనుంచి బయటపడిన తరవాత, రామలీలామైదానం వద్ద నిలువెత్తు ఆయన కాంస్య విగ్రహాన్ని స్థాపించుకొని ఢిల్లీ నగరం ఆయనను గౌరవించింది. ఆ మార్గాన్ని నేడు అసఫాలీరోడ్డుగా పిలుస్తున్నారు.

ఆసఫ్ కాంగ్రెసు సంస్థలో ఒక మహోన్నత నాయకుడు. మన జ్ఞాపకాల్లో ఓ గొప్ప స్వాతంత్ర్య సమరయోధునిగా ఆసఫ్ చిరకాలం జీవించి ఉంటాడు.

శ్రీ మాగంటి బాపినీడు

మంచి చురుకైన నిర్మాణ కార్యకర్త

1966-70 సంవత్సరాలలో గాంధి శత జయంత్యుత్సవ కమిటీవారు నిర్వహించిన అఖిల భారత గాంధి దర్శన్ ప్రదర్శనం లోని ఆంధ్ర విభాగంలో కీ॥ శే॥ మాగంటి బాపినీడు (జననం 14-8-1895) గారి ఫొటో ప్రముఖంగా ప్రదర్శింపబడింది. గాంధీజీకి సన్నిహితులుగా ఉండి, హరిజనులు, స్త్రీలు, కుటీర పరిశ్రమల పరంగా చక్కటి కృషి చేసిన నిర్మాణ కార్యకర్త బాపినీడుకు ఈ గౌరవం లభించడం నాకెంతో సంతోషం కలిగించింది. ఇటీవల (జులై 1971లో) ఏలూరు పట్టణంలో బాపినీడు పేరుమీద ఒక కాలనీని నిర్మించుకోవటం కూడా సంతోషకరమైన విషయం.

నేను మొట్టమొదటగా బాపినీడును మద్రాసులోని క్రైస్తవ్ హాస్టల్ లో కలుసుకున్నాను. నేను సచ్చయప్ప కళాశాలలో చేరేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన నేను - నింగిని ఏకంచేసేంతగా కృషిచేసి నాకు పాస్‌పోర్టును సంపాదించగలిగారు. బ్రిటిష్ పాలకుల నుంచి ఆ రోజుల్లో పాస్‌పోర్టును సంపాదించటమంటే నింగిన నేలమీదకు తీసుకురావడం లాంటిదే. ఆయన కలకత్తా విశ్వ విద్యాలయంలో తన విద్యాభ్యాసం పూర్తిచేసి డిగ్రీ పుచ్చుకున్నారు. అక్కడ ఆయన బ్రహ్మ సమాజికుల సంపర్కంతో సాంఘిక సంస్కరణలను, కాంగ్రెస్ జాతీయ కార్యక్రమాల రీతులను బెంగాలీ వాతావరణంలో వంట బట్టించుకున్నారు. ఉన్నత విద్య కోసం యూరపు వెళ్లాలనే నా తలంపుకు ఆయన ఇచ్చిన ప్రోద్బలం మరువలేనిది. నీవు ఇలా సన్నగా ఉన్నప్పటికీ ఇంగ్లండులోని చలి పరిస్థితులకు తట్టుకోగలవు ఫర్వాలేదులే అని నన్ను ప్రోత్సాహపరిచారు.

అమెరికా విశ్వ విద్యాలయాలు కాలిఫోర్నియా, కార్నెల్ రెండింటిలోనూ బాపినీడు విద్యార్థిగా ఉన్నారు. 1923లో అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో మూడు సంవత్సరాలపాటు విద్యాభ్యాసం చేసి బాపినీడు భారతదేశానికి తిరిగి వచ్చారు. 1917-18 సంవత్సరాల కాలంలో టాగూర్ ప్రభావంతో బ్రహ్మసమాజం కలకత్తా విశ్వ విద్యాలయంలో చేపట్టిన సేవాకార్యక్రమాలలో తిరిగి పాల్గొనేందుకు ఆయన వచ్చారు. 1969లో ఆయన దివంగతులయ్యేటంతవరకు యాభై సంవత్సరాల సుదీర్ఘకాలం ఆయన శక్తి యుక్తుల నన్నింటిని ప్రజాసేవకే అంకితం చేసారు. వారు మొదటి శ్రేణి స్వాతంత్ర సమరయోధులు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, రాకముందుకూడా జాతీయసేవలో ఆయన విశేషంగా గడిపారు.

బాపినీడు తన మేనకోడలు అన్నపూర్ణను వివాహమాడారు. ఆమె తల్లి దండ్రులు కూడా ప్రజా సేవకు అంకితమైన వారే. జాతీయ సేవా కార్యక్రమాల్లో తన కృషి ద్వారా ఆమె గాంధీజీ అభిమానాన్ని సంపాదించుకో గలిగారు. మహాత్మాగాంధి పిలుపు మేరకు ఖద్దరు ధారణ, విదేశీ వస్తు

బహిష్కరణ కృషితో ఆమె సిల్కుచీరలను తగులబెట్టి, విలువైన ఆభరణాలను త్యాగం చేసిన తొలి భారతస్త్రీ. బాపనీడు భారతదేశానికి వచ్చిన కొద్ది సంవత్సరాలలోనే ఆమె కాలధర్మం చెందింది. తన భర్త దేశసేవకు అంకితమైన ఉత్తమ కార్యకర్త అనే సంతృప్తితో ఆమెతుది శ్వాసను విడచింది.

బాపనీడు ఆంధ్రాలో పశ్చిమ గోదావరి జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో ప్రముఖ పాత్ర వహించారు. చాలాకాలం ఆయన ప్రకాశంగారి అనుచరులుగా ఉన్నారు. అయితే ఆయన ఆఖరుకు మద్రాసులో రాజాజీ నాయకత్వాన్ని అంగీకరించారు. రాజాజీ ఏర్పాటు చేసిన మొదటి కాంగ్రెసు మంత్రి వర్గంలో పార్లమెంటరీ కార్యదర్శిగా నియమితులయినపుడు నిర్మాణ కార్యక్రమాలలో ఆయన చూపెట్టిన శ్రద్ధ, ఆయన దేశభక్తిని మనకు చాటి చెప్పింది. అన్ని జిల్లా కేంద్రాలలో, ఎక్కువ ప్రభుత్వ వ్యయం లేకుండా స్థానిక పారిశ్రామికుల, ప్రముఖుల తోడ్పాటుతో పారిశ్రామిక వాటికలను ఆయన ఏర్పాటు చేశాడు. నిజానికి అదొక గొప్ప తిరుగులేని కృషి.

ప్రముఖ సాంఘిక సేవా కార్యకర్త తక్కర్ బాబాకు 1933-48 సంవత్సరాల కాలంలో మహాత్మాగాంధీ అఖిలభారత హరిజన సేవా సంఘ కార్యక్రమాలను అప్పగించారు. ఆయన బాపనీడులో మంచి నిర్వహణా సామర్థ్యం కలదని, లక్ష్యంవైపు పట్టుదలతో క్రమశిక్షణ కలిగి కృషి చేయగలవారని భావించి వారి సేవలను కోరుకున్నారు. ఆయన తిరిగి వివాహం చేసుకున్న కొద్ది మాసాలకే జైలునుంచి తిరిగి వచ్చిన వెంటనే ఆయన ఆంధ్ర హరిజన సేవా సంఘానికి తన సేవలను వాగ్దానం చేసారు. నాకు ఆయనతో అతి సన్నిహితంగా ఉండి పనిచేసే భాగ్యం కలిగింది. అప్పుడు నేను ఆయనలో ఒక మంచి సహచరుడిని చూడగలిగాను. 1933-34లో గాంధీ గారి ఆంధ్ర పర్యటన సందర్భంలో వీరికి ప్రత్యేకమైన గుర్తింపు లభించింది. బాపూ చూసే స్థలాల నిర్ణయం, విశ్రాంతి స్థలాలు, భోజన ఏర్పాట్లు, ప్రత్యేక వ్యక్తిగతమైన ఇంటర్వ్యూలు, సభలు, ఆయన వాహనాలు ఆగవలసిన స్థలాల గురించి నిర్ణయించేసే బాధ్యత బాపనీడుకు లభించింది.

వారు ఏ పదవిలో ఉన్నా ఆంధ్రలోని ప్రముఖులందరూ మహాత్మాగాంధీ కార్యక్రమంలో తాము పాల్గొనేందుకు వీలుగా బాపనీడు నుంచి మంచిని సంపాదించడానికి ప్రయత్నించిన వారే. అంతటి కఠినతరమైన బాధ్యతను నిర్వహించినందుకుగాను బాపూ కార్యదర్శుల నుంచి బాపనీడు ప్రశంసను సంపాదించుకోగలిగాడు. అయితే అదే సమయంలో ఎంతోమంది తోటి కార్యకర్తలు అసంతృప్తిని వెలిబుచ్చారు. లౌకిక వ్యవహారాలు వంటబట్టక పోవటంవల్ల ఈ సందర్భంలో ఆయన ఎన్నో రీతుల నష్టపోవలసి వచ్చింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత రాజకీయ అధికారం చేపట్టిన వారు ఈ పర్యటనలో జరిగిన దానికి ప్రతీకారంగా బాపనీడుపై కక్షగట్టి బాధించారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత ఆయన ప్రకాశంగారికి ఎడమయ్యారు. అప్పటి మంత్రి వర్గాల్లో ఆయనకు స్థానం లభించగలదని భావించారు. మారుతున్న రాజకీయ పరిస్థితులు ఆయన శక్తి సామర్థ్యాలకు గుర్తింపు నివ్వలేదు. ప్రణాళికా సంఘం గ్రామీణాభివృద్ధి

కోసం ఎన్నుకొన్న జాతీయ విస్తరణ కార్యక్రమాల్లో ఒకదానికి నేను ఆయన పేరును సూచిస్తూ రాజాజీకి సంపా ఇచ్చాను. ఆయన దానికి పునాదులు వేసారు. అదే ఆ తరవాత గ్రామీణాభివృద్ధికోసం యన్.ఇ.యస్.గా అవతరించింది. విద్యార్థుల అవసరాల కోసం వారిలో జాతీయ భావాలను నెలకొల్పేందుకు వీలుగా ప్రత్యేకమైన పుస్తకాలు తీసుకురావాలనుకునే కొద్దిమందిలో ఆయన ఒకరు. చిన్న చిన్న పిల్లలకు ఉపయుక్తమైన రీతిలో ఆయన సంపాదకత్వంలో ఎన్నో పుస్తకాలను ప్రచురించారు. మహాత్మాగాంధీ జీవితంపై వెలువడిన ఆయన పుస్తకం ఎంతో ఆదరణను పొందింది.

వయోజన విద్యాకృషిలో మేమిద్దరం కలసి పని చేసాం. ప్రతి సంవత్సరం వేసవిలో తన స్వంత ఖర్చులతో వచ్చి మూడైతాంగ విద్యాలయంలో విద్యార్థులకు తన వింత లాంతరు (మాజిక్ లాంటరన్) సహాయంతో ఉపన్యాసాలు చేస్తుండేవాడు. కాంగ్రెసు మహాసభలను నిర్వహిస్తుండేవారు. ఆంధ్రవిశ్వ విద్యాలయంలో దాని ప్రారంభకాలం నాటి నుంచి సెనేట్ సభ్యులుగా, సిండికేట్ సభ్యులుగా ఉంటూ, రెండు దశాబ్దాల కాలం ఆయన తన సేవలనందించారు. తన జన్మస్థలమైన ఏలూరు పట్టణంలో సి.ఆర్.రెడ్డి కాలేజి మొదటిశ్రేణి కళాశాలగా అభివృద్ధి చెందడానికి ఆయన తోడ్పడ్డారు. 1926వ సంవత్సరంలో "గ్రామాలకు తిరిగి వెళ్లండి" అన్న మహాత్మాగాంధి వినాదాన్ని మారు మ్రోగించడంలో ఆయన నాతోను, శ్రీ మోటూరు సత్యనారాయణతోను కలిశారు.

1928లో ఏర్పాటు అయిన "ఆంధ్రా కిసాన్ సమ్మేళన్" కు మేమిద్దరం సహాయ కార్యదర్శులం. 1931-32 సంవత్సరాల్లో భూమిశిస్తు వ్యతిరేక పోరాటం నిర్వహణలో కిసాన్ ఉద్యమానికి ఆయన బాగా సహకరించారు.

బాపనీడు చాలామంది రాజకీయ ఖైదీలను నిరాశకులోను గానివ్వకుండా ఉత్సాహపరుస్తూ ఉల్లాసంగా గడిపేలా చేస్తుండేవారు. నెల్లూరు, తిరుచునాపల్లి, అమ్రోతి మరికొన్ని చోట్ల ఆయనతో కలిసి మేమంతా జైలు జీవితాన్ని గడిపాం. చాలా సందర్భాలలో రాజాజీ కూడా మాజైలు జీవితకాలంలో మాతో కలిసి ఉండడం జరిగింది. జైలు జీవితాల్లో మేము కలిసి ఉన్న ప్రతి సందర్భంలోనూ ఆయన నన్ను ఉల్లాస పరుస్తూ, నా పరిశోధనల్లో నన్ను ప్రోత్సాహ పరుస్తుండేవారు. ఆయన శ్లోక్తుల పుట్ట. పిట్టకథల మాష్టరు. బహు సరదాయైన మనిషి.

నీడు గొప్ప సాంఘిక సంస్కర్త. ఆయన స్వయంగా వర్ణాంతర వివాహం చేసుకోవడం ద్వారా అది సాంస్కృతిక పురోభివృద్ధికి, సామాజిక ఐక్యతకు ఎలా దోహదపడగలదో ఆచరణలో చూపెట్టారు. ఆయన కుమార్తెలు కూడా ఇదే మార్గాన్ని ఎన్నుకొని తమ తల్లిదండ్రులకు భిన్నమైన కులాలనుంచి తమ భర్తలను ఎన్నుకొన్నారు. స్త్రీల రాజకీయ పురోభివృద్ధి కోసం ఆయన చాలా గొప్పకృషి చేసారు. విద్యావేత్తల మధ్య ఆయన గొప్ప వక్త. వేదికల మీద కూడా ఆంధ్రాంగ్ల భాషలో ఆయన అనర్గళంగా ఉపన్యసించగలరు. బోధనాశైలిలో మెళుకువతో మాట్లాడడంలో ఆయన దిట్ట. ఆయన జీవితకాలంలోని ఆఖరి రెండు సంవత్సరాలు ఆయన మద్రాసు, హైదరాబాదులలోని అనేక సాంఘిక సేవా సంస్థలలో సహకారం నెరపారు. బాపనీడు

ఒక గొప్ప దేశభక్తునిగా, మంచి ప్రజా సేవకునిగా, విద్యావేత్తగా రైతాంగ యోధునిగా మరణించేంతవరకు పనిచేస్తూ జీవించారు. ఆయన మరణంతో మొత్తం దక్షిణ భారతదేశం, అందులో దశాబ్దాల పాటు ఆయనతో కలిసి పనిచేసిన నాలాంటి వాళ్ళం ముఖ్యంగా విలువైన ఓ సహచరుడిని, అంతకంటె విలువైన ఓ హితవరిని పోగొట్టుకున్నాం.

శ్రీమతి భారతీదేవి

హరిజన, చేనేత, మహిళా ఉద్యమాల నాయకురాలు శ్రీమతి భారతీదేవి సంస్మరణ సందర్భంలో రాజాజీ ఇలా అన్నారు. "1972 సెప్టెంబరు 27న భారతమహిళామణులలో మేటి అవదగ్గ ఓ మహిళారత్నం మనల్ని వదలి వెళ్లిపోయింది. రంగాజీ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన సతీమణి శ్రీమతి భారతీదేవి పట్ల మరెంతో గౌరవం ఉంది. అంతేకాదు. గౌరవంతో కూడిన అభిమానం ఉండేది. ఆచార్య రంగా తాను చేనేత బిడ్డనని గర్వంగా చెబుతూ ఉంటారు. కానీ నిజమైన చేనేత పుత్రిక శ్రీమతి భారతీదేవి రంగాయే! స్వాతంత్ర్య ఉద్యమంలో ఆమె జైలుకు వెళ్లారు. కొందరు ఈ త్యాగాన్ని స్వీయ ప్రయోజనాలకు వినియోగించుకోగా, ఆమె ఏనాడూ అందుకు ప్రయత్నించలేదు. ఆమె మరణం నన్ను అపారమైన దుఃఖ సముద్రంలో ముంచివేసింది".

1933-34లో గాంధీజీ విడుదలలు సందర్శించిన సమయంలో భారతీదేవి చేసిన సేవలకు, ఆమె సంస్కారానికి ఆయన ముగ్ధులైనారు. వ్యావసాయక కార్యక్రమాలు, గ్రామీణ మహిళాభ్యుదయం పట్ల భారతీదేవికి గల అభిరుచి ప్రత్యేకంగా గాంధీజీని ఆకట్టుకున్నాయి. ఆ సమయంలో ఆమె వెంకటగిరి ఎస్టేట్‌లోని చేనేత మహిళలను చైతన్యపరిచి, పరదాల చాటున పడివున్న స్త్రీలను బయటపడేలా బోధించి, ప్రజాసేవలో పడుం బిగించి ముందుకు వచ్చేలా భారతీదేవి చేస్తున్న ప్రయత్నాలను తెలుసుకొని, స్త్రీ జనోద్ధరణ కృషిలో ఆమె ఘటికురాలని గాంధీజీ అర్థం చేసుకున్నారు. భారతీదేవి కొనసాగిస్తున్న సాంఘిక విప్లవకార్యక్రమాలను బాపూజీ గమనించి, తన ఆశీస్సులను అందజేస్తూ "భారతీదేవిని నా దత్తపుత్రికగా స్వీకరిస్తున్నాను", అని ప్రకటించారు. భారతీయ మహిళా సమాజాల సంస్థాపకురాలైన శ్రీమతి కజిన్స్, స్త్రీ జనోద్యమనాయకురాలిగా భారతీదేవి చేస్తున్న మహిళాభ్యుదయ కృషిని ఆయన ప్రస్తుతించారు.

శ్రీమతి భారతీదేవి రంగా ఆంధ్రప్రదేశ్‌లో, గుంటూరు జిల్లాలోని మాచవరం గ్రామంలో, 1908 ఆగస్టులో మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. 1924లో మా వివాహం జరిగింది.ప్రసిద్ధి చెందిన గుంటూరు శారదానికేతన్‌లోనూ, మదరాసు విద్యోదయలోనూ ఆమె విద్యాభ్యాసం చేశారు. పచ్చయప్ప కళాశాలలో నేను ఆర్థిక శాస్త్ర ప్రధానాచార్యులుగా ఉన్న రోజుల్లో, 1926-30 సంవత్సరాల మధ్య ఆమె మద్రాసులో నాతో పాటు ఉంటూ తమిళం నేర్చుకున్నారు. 1925లో ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం నేను ఇంగ్లండు వెళ్లినప్పుడు ఆమె నాతో పాటు వచ్చింది. అక్కడ 1925-26లో ఆమె ఆక్సఫర్డ్‌లోని రస్కిన్ స్కూలు ఆఫ్ ఆర్ట్స్‌లో కళలను అభ్యసించింది. భారతదేశానికి మేము తిరిగి వచ్చిన తరవాత, గాంధీజీ నేతృత్వంలో సాగుతున్న స్వాతంత్ర్య పోరాటంలో ఆమె ప్రవేశించి, 1930మంచి సామూహిక సత్యాగ్రహ కార్యకలాపాల్లో పాల్గొంటూ వచ్చారు.

ఆ రోజుల్లో భారతదేశమంతటా హరిజనులు అంటరానివారుగా పరిగణింపబడుతూ ఉండేవారు. అందునా గ్రామీణ ప్రాంతాలలో ఈ అస్పృశ్యతను మరింత కఠినంగా పాటిస్తూ ఉండేవారు. ఈ దురాచారాన్ని రూపుమాపేందుకు నెల్లూరు, కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలలో 1931లో ఆమె హరిజనుల చేత బావులలోనీరు తోడించడం, సహపంక్తి భోజనాలు నిర్వహించడం, సామూహిక భజన కార్యక్రమాలు, సభలు, సమావేశాలను నిర్వహించారు.

కిసాన్ కాంగ్రెసు ఆధ్వర్యంలో మేము నిర్వహించిన శిస్తు నిరాకరణ ఉద్యమంలో 1931 నవంబరులోనూ, 1932 ఫిబ్రవరిలోనూ ఆమె పాల్గొన్నారు. కిసాన్ సత్యాగ్రహానికి ఆమె మహిళా విభాగాలను సమకూర్చారు. 1932లో జాతీయ పోరాటంలో కావూరు వినయాశ్రమ నిర్వాహకులైన దుర్గాంబ, బసవయ్యగార్లతో కలిసి ఆమె పాల్గొన్నారు. గుంటూరు, కృష్ణా, గోదావరి జిల్లాల్లో మహిళా సత్యాగ్రహాలను సమీకరించి, సత్యాగ్రహాలను నిర్వహించినందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఆమెకు ఒక సంవత్సరం జైలుశిక్ష, అదనంగా రు 500.00 ల జరిమానా విధించింది. అప్పటిదాకా గడపదాటని వందలాది మంది మహిళలను, పరదాలను దాటి వచ్చి సత్యాగ్రహంలో పాల్గొనేలా చేసి, అహింసాయుత స్వాతంత్ర్య పోరాటానికి ఆమె బలాన్ని చేకూర్చింది. వల్లెపట్టులో నాలుగు గోడల మధ్య జీవిస్తూ, గృహకృత్యాలకు పరిమితమై ఉన్న సున్నితమైన స్త్రీలను, స్వేచ్ఛాయుతమైన జీవన సరళికి తెచ్చి, వారిచేత భూ ఆదాయస్థిరీకరణ, పన్నుచెంపుదలకు 1933, 1934లలో నిరసన తెలియజేయిస్తూ, కలెక్టరు కార్యాలయాల వద్దకు భారతీ దేవి యాత్రలను నిర్వహించి, విప్లవాత్మక కృషిని సాగించారు. ఆ ఒరవడిలో వేలకొలది మహిళలను ముందుకు నడిపిస్తూ, స్వాతంత్ర్య సమరంలో, రైతాంగ ఉద్యమాల్లో గ్రామీణ స్త్రీలు పాల్గొనేలా ఆమె కృషి చేసారు. సర్వసమానత్వం కోసం ఆంధ్రదేశమంతటా ఆమె ఉద్యమాన్ని నడిపి, హరిజన దినోత్సవాలను జరిపారు. మతపరమైన దురాచారంగా తరతరాలనుంచి సమాజంలో పాతుకుపోయిన అంటరానితనాన్ని నిర్మూలించేందుకు, అస్పృశ్యతను పాటించకుండా ఉండేందుకు ఆమె అనేకమంది మహిళలచేత ప్రతిజ్ఞ చేయించారు. కులవ్యత్యాసాలనుండి, పారోహిత వర్గం విధించిన ఆంక్షల నుండి ప్రజలను బయట పడవేసేందుకు సాగిస్తున్న కృషిలో, ఆమె నాకు ధైర్యాన్ని నూరిపోసారు.

పెట్టుబడిదారీ మార్కెట్టుకు ఆలంబన అయిన ఆర్థికశాస్త్ర వేత్తల ఆలోచనా రీతికి వ్యతిరేకంగా నేను ప్రారంభించిన సామాజిక, ఆర్థిక సిద్ధాంతానికి మొట్టమొదట పరివర్తన చెందిన వారు శ్రీమతి భారతీదేవి. కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆర్థిక శాస్త్రంలో యం.ఎ. డిగ్రీపొందిన శ్రీ గోగినేని లక్ష్మీనారాయణగారలు నా సిద్ధాంతంలోని వాస్తవికతను గ్రహించారు. పారిశ్రామిక రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకంటే, వ్యవసాయరంగంలో జీవనం సాగిస్తున్న రైతులు, కూలీలు, ఇతర, చేతివృత్తుల వారూ తమకు న్యాయంగా లభించిన దాన్ని పొందలేక, ఎక్కువ అన్యాయానికి గురి అవుతున్నారనే, నావాదనను వారు అంగీకరించారు. జాతీయాభివృద్ధికి తోడ్పడుతున్న కృషికి తగిన ప్రతిఫలాన్ని పరిశ్రమలు, వాణిజ్యం, ప్రభుత్వరంగాలలో ఉన్న వర్గాలు ఎక్కువగా పొందుతుండగా, వ్యవసాయ రంగంలో జీవిస్తున్నవారికి అలాంటి ప్రతిఫలాన్ని ముట్టజెప్పడంలో నిర్లక్ష్యమై ఫలితంగా వారు తక్కువ ప్రతిఫలాన్ని మాత్రమే పొందగలుగుతున్నారనే

నా వాదనతో వారు ఏకీభవించారు. ఆ తరవాత వారు రైతాంగ విద్యాలయాలద్వారా, సెమినార్ల ద్వారా పాఠశాలలోనూ, పౌరహక్కులనుసాధించడంలోనూ, కళాశాలలోనూ వ్యవసాయదారుల ముఖ్య ఆదాయాన్ని చూపించే గిట్టుబాటు ధరలకోసం, కూలీల కనీస వేతనాలకోసం ప్రచారం చేయసాగారు. అతిముఖ్యమైన రైలు-రోడ్డు రవాణాలో వ్యవసాయ ఉత్పత్తులను సరళమైన రేట్లుకు రవాణా చేయాలనీ, మార్కెటింగ్ సంస్థలకు అప్పులు మంజూరు చేయాలనీ, ఉత్పత్తి దారులకు అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు, సిమెంటు, డీజిలు, ఇతర మూలాలు ఇంకా అవసరమైన సామగ్రిని తక్కువ ధరలకు అందించాలని వత్తిడి చేయమొదలు పెట్టారు. చేనేత పనివాళ్ళకు రక్షణ కల్పించాలని, జీవన సౌకర్యాలు అభివృద్ధిచేయాలని ఆమె కోరారు.

నేను, భారతీదేవి, లక్ష్మీనారాయణ, కూడా మద్రాసు, గుంటూరు, కలకత్తా నగరాలను విడిచి 1930-34లో నిడుబ్రోలు లోనే ఉంటూ వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకొని జీవించసాగాము. అప్పట్లో వ్యవసాయ రంగంలో ఎదురయ్యే అతివృష్టి అనావృష్టి వరదలు పంటతెగుళ్లతో వ్యావసాయికంగా నష్టాల్ని ఎదుర్కొంటూ, ప్రకృతివై పరీత్యాలను చవిచూస్తూ గిట్టుబాటుకాని ధరలకు లెవీ ధాన్యాన్ని ఇవ్వవలసి వస్తూ అన్నిరకాలైన శాపాలను చవిచూసి అనుభవించాం. మాతో పాటు, మా చుట్టు ప్రక్కల ఉండే రైతు కుటుంబాలు కూడా ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నారు. రైతు ఉద్యమపరంగా దేశంలోని వివిధ ప్రాంతాలలో మేము పర్యటిస్తున్నప్పుడు, దేశమంతటా ఏ ప్రాంతంలోని రైతాంగం అయినా, కొంచెం ఇంచుమించుగా ఇలాంటి ఇబ్బందులనే ఎదుర్కొంటున్నట్టు మేం తెలుసుకున్నాం. ఆ అనుభవం ద్వారా, ఆమె నా సిద్ధాంతాలలోని యదార్థాన్ని గ్రహించగలిగారు. వ్యవసాయదారులకు నష్టంకలిగిస్తూ, పట్టణవాసులకు అనుకూలంగా ఉంటున్న తప్పుడు మార్కెటింగ్ విధానం స్థానంలో, వ్యవసాయ, పారిశ్రామిక, వాణిజ్య, ప్రభుత్వరంగాల్లోని వారందరకూ సమానమైన న్యాయం కలిగేరీతిలో మార్కెటింగ్ వ్యవస్థను రూపొందించాలని ఆమె కోరారు. మా అనుభవాల ద్వారా మేము పొందుపరిచిన అంశాలన్నిటికీ బాపూజీ తన ఆమోదాన్ని తెలిపినందుకు, మేం ఎంతగానో సంతోషించాం. డాక్టర్ జె.కుమరప్పగారి గ్రామీణోద్యమం, అఖిలభారత గ్రామీణ పరిశ్రమల సంస్థల ద్వారా వెలువరించిన ఆర్థిక సిద్ధాంత వ్యాసాలు మా కృషికి పరిపుష్టిని చేకూర్చాయి. సంవత్సరమంతా పనిపాటలు దొరకని వ్యవసాయ కూలీలకు అదనపు వేతనాలు ఉండాలని, ప్రకృతి వైపరీత్యాలవల్ల నష్టపోతున్న రైతాంగానికి తగిన ధరలు రావాలని, చేతి వృత్తుల వారికి లభించే ప్రతిఫలం తగువిధంగా ఉండాలని, శ్రీమతి భారతీదేవి గట్టిగా అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు దినభత్యంపై పని చేసేవారుగానీ, స్వయం కృషితో పాలుపంచుకోవాలనేవారుగానీ, ఎలాంటి సౌకర్యాలు పొందలేక కనీసంప్రసూతి సమయానికి ముందు విశ్రాంతికీ, ఆ సమయంలో వైద్య సహాయానికి కూడా నోచుకొనక, పూర్తిగా దోపిడీకి గురిఅవుతూ కనీన ప్రాథమిక, సాంఘిక రక్షణలను కూడా పొందలేక నిర్లక్ష్యం చేయబడుతున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ, పాలాల్లో పనిచేస్తున్న వయోవృద్ధులైన స్త్రీలను, గర్భవతులైనవారిని, బాలికలను ప్రత్యక్షంగా చూసినప్పుడు, ఆమె హృదయం బాధతో విలవిలలాడేది. ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశ్రమల్లో, షాపుల్లో పనిచేసేవారు, తగు రక్షణ కలిగిన

భవనాంలో, షెడ్లలో పనిచేస్తూ, అలాంటి రక్షణలు వీరికి లేకుండా ఉండటాన్ని గమనిస్తూ, రెంటినీ పోల్చి చూస్తుండేవారు. రైతాంగ విద్యాలయంలోనూ, దాని అనుచర సంస్థలలోనూ, శాసన సభలలోనూ, వేదికల మీద ఎక్కడ ఉన్నా, ఈ గ్రామీణ ప్రజల శ్రమకు వెలకట్టడంలో చూపిస్తున్న వ్యత్యాసాన్ని గురించే, ఆమె వాదిస్తూ ఉండేవారు. రైతులు, చేనేత కార్మికులు, కూలీలకు సానుభూతిని చూపిస్తూ, వారిని చైతన్యపరుస్తూ, మృదువైన సంభాషణాచాతుర్యంతో, స్వంత వ్యవసాయాన్ని కలిగిన వ్యవసాయ దారుగా ఆమె పొందిన అనుభవాలు, ప్రతి ఒక్కరికీ శ్రేయోభిలాషిగా అందరి ప్రశంసల్ని అందుకోగలిగాయి. ఆ విధంగా గ్రామీణ ప్రజానీకానికి ఆమె ఉత్తమ నాయకురాలిగా గుర్తింపు పొందారు. అంతేగాక, చేనేత పనివార్ల హస్తకళల గురించి ప్రచారం చేస్తూ వారి మన్ననలను పొందారు. వ్యవసాయ దారులకూ ఇతర వృత్తులలోని వారికీ మధ్య సమతూకాన్ని సాధించాలని, మా సిద్ధాంతాలకు అనుగుణంగా, విరివిగా ప్రచారంచేస్తూ, అందరి మన్ననలను పొందారు. కమ్యూనిస్టుల నియంతృత్వానికి వ్యతిరేకంగా, సాంఘిక ఆర్థిక సమానత్వంతో కూడిన ప్రజాస్వామ్యం కోసం తన పూర్తికాలాన్ని వినియోగిస్తూ, ఆ రోజుల్లో ఆమె గట్టిగా నిలిచారు. "రామానీడు విద్యాలయం" స్థాపనలో నాతోనూ, మా సోదరులు వెంకటప్పయ్య, లక్ష్మీనారాయణ, నా బావమరిది బుచ్చి నాయుడుగార్లతో కలిసి సహకరించి ఆమె బాగా కృషి చేసారు. తరవాత ఆ విద్యాలయమే చేరెన్నికగన్న రైతాంగ విద్యాలయంగా రూపొందింది. ఈ భారతరైతాంగ విద్యాలయంలో గ్రామీణ యువకులకు, స్వాతంత్ర్య పోరాట పద్ధతుల్లో, శిక్షణ, సిద్ధాంత పరమైన బోధనను, నిడుబ్రోలులోను, మరికొన్ని చోట్ల వేసవి తరగతుల ద్వారా ప్రతి సంవత్సరం ఇస్తూ ఉండేవారు. చేబ్రోలులోని మహిళా సత్యాగ్రహులను ప్రోత్సాహ పరిచి, వారిచేత ఆంధ్ర మహిళల కోసం, ప్రత్యేక రాజకీయ పాఠశాలను, నిర్వహించేట్టుచేసింది. 1933నుంచి 1970 వరకూ అక్కడ శిక్షణ పొందిన వారందరకూ ఆమె ఆదరణ పూర్వకమైన మాతృమూర్తిగా ఉండేది.

అఖిలభారత కాంగ్రెసు కమిటీ సభ్యురాలిగా, ఆమె 1935లో ఎంపికయ్యారు. 1946లో ఒంగోలు జిల్లా బోర్డు సభ్యురాలిగా, ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కిసాన్ ఉద్యమానికి మూలస్తంభాలుగా ఉన్న వారిలో ఆమె ఒకరు. అంతే కాదు, ఆంధ్రరాష్ట్ర రైతు సంఘానికి, దాని స్థాపన కాలమైన 1928నుంచి రైతాంగ రక్షణ సంఘానికి, 1931నుంచి కార్యవర్గ సభ్యురాలిగా ఉండేవారు. 1936-37 సంవత్సరాలనికి అఖిలభారత కిసాన్ కాంగ్రెసు కార్యవర్గానికి సభ్యురాలిగా ఆమెను ఎన్నుకొన్నారు. 1936-39లో ఉత్తరప్రదేశ్, బీహార్, ఆంధ్ర, పంజాబు, గుజరాత్‌లలో ఆమె విస్తృతంగా పర్యటించారు. గయ, పలాసా, బిహ్తాలలో జరిగిన అఖిలభారతకిసాన్ మహాసభలలో ఆమె ముఖ్యభూమికను నిర్వహించారు.

అఖిలభారత కిసాన్ కాంగ్రెసుకు 1940లో కార్యదర్శిగానూ, 1941లో అధ్యక్షురాలిగానూ ఆమె వ్యవహరించారు. ఆ హోదాలో ఆమె ఆంధ్ర, బీహారు, బెంగాల్, ఒరిస్సా, తమిళనాడు, మైసూరు ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించారు. ప్రముఖ బీహార్ రైతు నాయకులు స్వామి సహజానాంద సరస్వతి ఆమె నాయకత్వాన్ని కొనియాడారు. పలాసా, మందసా, శ్రీకాకుళం, రైతాంగంపై తీవ్రమైన నిర్బంధాలను బ్రిటిష్ ప్రభుత్వం కొనసాగిస్తున్న రోజుల్లో నిర్వహించ

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-8

బడిన అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ పలాసా మహాసభల సందర్భంలో శ్రీమతి భారతీదేవి నిర్వహించిన పాత్ర చారిత్రాత్మకమైనది. 1940లో బ్రిటిష్ ప్రభుత్వం మందసా రైతాంగంపై పెట్టిన తప్పుడు కుట్రకేసులను ఎదుర్కొనేందుకు ఆమె నిధులను ప్రోగుచేసారు. బ్రిటిష్‌వారి కాల్పులకు గురై, బలైపోయిన రైతాంగ మాత 'వీరగున్నమ్మ' సాహసాన్ని ఆమె కీర్తించారు. యుద్ధ సమయంలో, గ్రామాల్లో పోలీసులు సాగిస్తున్న దురాగతాలను ఎదుర్కొనేందుకు పురుషులతో పాటు పోటీపడి త్యాగం జేయాల్సిందిగా, వీరగున్నమ్మను ఆదర్శంగా తీసుకొన మహిళలు ముందుకు రావల్సిందిగా ఆమె ఉద్బోధించారు.

1940-41లో గోదావరి జిల్లా ఏజన్సీ ప్రాంతాల్లో వరదలు సంభవించినప్పుడు, 1941-42లోనూ, ఆ తరవాత 1952-53లోనూ సంభవించిన రాయలసీమ కరువు సందర్భంలోనూ ఆమె సహాయక కార్యక్రమాలను చేపట్టారు. రామక్రిష్ణమిషన్ ద్వారా ఆహారధాన్యాలు, బట్టలు, పశుగ్రాసం, నిర్మాణ సామగ్రిని సరఫరా చేయించి, పంపిణీలో దుర్వినియోగం కాకుండా చూశారు. ఆ పద్ధతిని ముదరాసు ప్రభుత్వం తాను చేపట్టిన అన్ని సహాయక చర్యల్లోనూ అనుసరించింది. ఈ విషయంలో భారతీదేవి చూపెట్టిన శ్రద్ధను, అప్పటిమద్రాసు ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారి అభినందించారు. అంతేగాక ఆ తరవాత మదరాసు ప్రభుత్వం చేపట్టిన ప్రతి సహాయక చర్యలలోనూ, రామక్రిష్ణమిషన్ సేవలను వినియోగించుకోగలిగేలా, ఆమె ఒక మార్గాన్ని చూపెట్టింది.

ప్రముఖ తెలుగు వారపత్రిక "వాహిని"ని ఆమె ప్రారంభించి, ప్రచురించసాగింది. బ్రిటిష్ ప్రభుత్వం దాన్ని నిషేధించిన తరవాత, స్వాతంత్ర్య పోరాటాన్ని ముందుకు తీసుకేళ్లేందుకు 'క్రాంతి', 'గోభూమి' వారపత్రికలను ఆమె ప్రారంభించి, సమర్థవంతంగా నడిపింది. వ్యవసాయపరంగా ఆమెకు లభించిన ఆదాయాన్నంతా ఒక దశాబ్దం పాటు 'వాహిని' పత్రికా నిర్వహణకే ఆమె వినియోగించింది. వ్యవసాయం మీద వచ్చే ఆదాయం తగ్గిపోవడంతో గృహనిర్వహణకు, నిత్యజీవన పరిస్థితులకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు మహాత్మాగాంధీ సిద్ధపడగా, ఆమె తిరస్కరించింది.

దక్షిణ భారతదేశంలోని సుప్రసిద్ధ మహిళా నాయకమణులలో ఆమె ప్రముఖంగా కనిపిస్తూ ఉండేది. 1953లో ఘంటసాలలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర మహిళాసభకు ఆమె అధ్యక్షత వహించారు. కాకినాడలో జరిగిన ఆంధ్ర మహిళారాజకీయ మహాసభకు ఆమె ప్రారంభకులుగా ఉన్నారు. భజనలలోనూ, వయోజన విద్యాకేంద్రాలలోనూ, చర్కాగోష్ఠులలోనూ మహిళలు పాల్గొనేలా ఆమె వారిని ప్రోత్సహిస్తూ ఉండేవారు. హరిజనుల, వెనకబడిన వర్గాల స్త్రీల కోసం రాత్రి పాఠశాలను నిర్వహించడానికి ఆమె ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ ఉండేవారు.

చేనేత పని వారి ఇళ్ళలోనూ, కష్టించి జీవనం సాగించే వ్యవసాయ కూలీల ఇళ్ళలోనూ పురుషులతో పాటు సమాన స్థాయిలో స్త్రీలు ఉండేవారని ఆమె గ్రహించారు. అంతేగాకుండా ఇక్కడి స్త్రీలు ఆర్థికంగాకూడా మగవారితోపాటు పూర్తి స్వేచ్ఛనుకలిగి, పనిపాటలలోనూ, గృహనిర్వహణలోనూ గ్రామీణ ప్రాంతాల స్త్రీలు కాయకష్టంచేస్తూ, వేడినీళ్లకు చన్నీళ్ల చందంగా

తోడ్పడుతూ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని, స్వయం నిర్ణయహక్కుల్ని కలిగి ఉంటారని, తన 30 సంవత్సరాల వ్యవసాయ కమతం ద్వారా భారతీదేవి చూపెట్టారు.

స్త్రీ ఆర్థిక హక్కుల కోసం, తల్లి దండ్రుల ఆస్తిలో ఆడపిల్లలు వాటాపొందేందుకు ఆమె వాదించేవారు. తమకోసం, పిల్లల అభివృద్ధి నిమిత్తం భర్తల సంపాదనలో వాటాను పొందే హక్కు కూడా ఉండాలని ఆమె కోరారు. మహిళల చిన్న మొత్తాల పొదుపు కృషిలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్‌తో కలిసి పనిచేస్తూ, ఆంధ్రలో రాష్ట్రస్థాయి సంస్థగా దానిని అభివృద్ధి చేశారు. బాలికల పాఠశాలల స్థాపన, వయోజనులకు విద్య నేర్పే కార్యక్రమం, రైతు, చేనేత మహిళా సమ్మేళనాల నిర్వహణవంటి ఇతర కార్యక్రమాల్లో కూడా ఆమె శ్రద్ధ తీసుకున్నారు.

సాంఘిక, రాజకీయ రంగాల్లో చేస్తున్న కృషికి, నిర్వహిస్తున్న బాధ్యతల పరికే ఆమె సంతృప్తిచెందారు. వాటిపై ఆధిపత్యానికిగానీ, వ్యక్తిగత ప్రయోజనాల నిమిత్తం వాటిని వాడుకునేందుకు గానీ ఆమె ఏనాడూ ప్రయత్నించలేదు. 1957లో యం.యల్.సిగా ఆమె పేరు ప్రస్తావనలోకి వచ్చినప్పుడు ఆమె అందుకోసం ప్రచారం చేసుకోవడంగానీ, హైద్రాబాద్ చుట్టూ ప్రదక్షిణలు చేయడంగానీ చేయలేదు. శాసనమండలికి ఎన్నికై, ఆమె గెలుపొందినప్పుడు మంత్రిమండలిలో చేరవలసిందిగా ఆహ్వానం వచ్చినప్పుడు, ఆమె తిరస్కరించారు. శాసన మండలిలో ఆమె మంచి వక్తగా పేరు గాంచారు. వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను అభింపజేయవలసిందిగానూ, వ్యవసాయ కూలీలకు కనీసవేతనాలను ఇప్పించవలసిందిగానూ ఆమె వాదించారు. పల్లె పట్టులలోని స్త్రీల కోసం విద్యా, వైద్య, ప్రసూతి సౌకర్యాలను సమకూర్చాలని, స్త్రీలకు మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టాలనీ ఆమె పోరాడారు. నిర్బంధ వ్యవసాయానికి, 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా ఆమె అందించిన సూచనలు దక్షిణ భారతదేశమంతటా వ్యాప్తిలోకి వచ్చాయి. ఉన్నత పార్లమెంటరీ సాంప్రదాయాలకనుగుణంగా బోధనా శైలిలో ఉండే ఆమె ఉపన్యాసాలు విశ్వవిఖ్యాతి పొందాయి.

బరోపా సామాజిక అలవాట్లను బాగా ఎరిగి ఉన్నప్పటికీ, భారతీదేవి అలంకరణలోనూ, అలవాట్లలోనూ నిరాడంబరంగా ఉంటుంది. డాంబికమైన జీవితమంటే ఆమెకు గిట్టదికాదు. ఆలోచనల్లోనూ, ఆచరణలోనూ ఆమె పూర్తిగా గాంధేయవాది.

నూతన పద్ధతుల్లో కమతాన్ని కొనసాగించి, ఆమె ఉత్తమ వ్యవసాయ దారుగా పేరు తెచ్చుకున్నారు. అనేక చోట్ల జరిగిన వ్యవసాయ ప్రదర్శనలలో ఆమె పండించిన పంటలు పెంచిన పశువులు బహుమతులను గెలుచుకొన్నాయి.

ఆమెకి ఇష్టం గాకపోయినప్పటికీ, అప్పటి రాజకీయ పార్టీలకూటమి '1971 పార్లమెంటు ఎన్నికలలో ఒంగోలు స్థానానికి ఆమెను సరియైన అభ్యర్థిగా భావించి నిలబెట్టింది. అయితే ఇందిరా ప్రభంజనం ధాటికి ఆ ఎన్నికలలో ఆమె ఓడిపోయింది. అయినప్పటికీ ఆంధ్రదేశంలో పోటీచేసిన ప్రతిపక్ష అభ్యర్థులందరికంటే, ఆమె అధికంగా ఓట్లను సంపాదించుకున్నది. ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తూ గరీబీహఠావో నినాదానికి అనుకూలంగా ప్రజలు ఇచ్చిన ఈ తీర్పును ఆమె సంతోషంతో స్వీకరించారు.

ఆమె ఆరోగ్యం క్రమేణా క్షీణిస్తున్నప్పటికీ 1957 నవంబరులో ఆంధ్రమహిళాసభవారు ప్రచురించిన సాంవత్సరిక ప్రత్యేక సంచికలో వివాహితులుగా ఉంటూ ప్రముఖులైన ఆరు జతల దేశనాయకులగురించి ప్రముఖంగా తెలియజేస్తూ ప్రచురించారు. యు.పి మాజీ ముఖ్యమంత్రి శ్రీమతి సుచేతకృపలానీతో పాటు శ్రీమతి భారతీదేవికూడా ఇందులో ప్రముఖంగా అభినందించబడ్డారు. స్వాతంత్ర్యోద్యమంలో, కమలానెహ్రూ, కమలాదేవి చటోపాధ్యాయ, మాలతి నవకృష్ణ, దుర్గాబాయిలవలెనే, భారతీదేవికూడా ముందంజలో ఉండి కృషి చేసింది. జాతీయ ఉద్యమకార్యకలాపాల్లో తనకు సోదరిలాగా ఉన్న శ్రీమతి సరోజినీ నాయుడు అభిమానానికి ఆమె పాత్రురాలైంది. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, ప్రకాశం పంతులు, సి.ఆర్.రెడ్డి, వి.వి.గిరి, శ్రీమతి కజిన్స్‌వంటి గొప్పవారిచే అభ్యుదయకరమైన మహిళా నాయకురాలిగా ఆమె కొనియాడబడింది. ఆమె ప్రజా జీవితంలో గడిపిన నాలుగు దశాబ్దాల కాలం, అఖిలభారతస్థాయిలో, జాతీయ ఉద్యమాలలో, రైతాంగ, చేనేత, మజ్‌దూర్ రంగాలలో ఉత్తమ సహచారి, సంపాదారుగా నాకు మాత్రమేగాక, నా తోటి మిత్రులందరికీ కూడా తోడ్పాటునందిస్తూ ఉండేది.

1926 నుంచి 1948 వరకు మహాత్మాగాంధితో జరిపిన నా సంభాషణల జ్ఞాపకాలను "బాపూడైలెన్స్" (1970) అనే గ్రంథాన్ని 1936-72 సంవత్సరాల మధ్య జాతీయ, అంతర్జాతీయ స్థాయి నాయకులతో నేను జరిపిన ఉత్తర ప్రత్యుత్తరాల భాగాలతో "ఎగనీ అండ్ సాల్స్" అనే గ్రంథాన్ని, 1974 సెప్టెంబరు 27న ఆమెకు అంకితమివ్వడాన్ని నేను సరియైన నివాళిగా భావిస్తున్నాను.

శ్రీ ఠాకూర్‌దాస్ భార్గవ్

శ్రీ ఠాకూర్ దాస్ భార్గవ్ 1886 నవంబరు 15న పంజాబ్ లోని రేవారిలో జన్మించారు. ఆయన ప్రసిద్ధ న్యాయవాదిగా పేరుగాంచారు. 1926-30 సంవత్సరాల మధ్య కేంద్ర లెజిస్లేటివ్ అసెంబ్లీలో మోతీలాల్ నెహ్రూకు సహ సభ్యులుగా ఉండేవారు. హిందూ బాలికల వివాహ వయోపరిమితిని పెంచేందుకు ఉద్దేశించిన బిల్లుపై ఏర్పరచబడిన కమిటీ కార్యకలాపాల్లో హరివిలాస్ శారదకు తనతోడ్పాటును అందించారు. రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యులుగా వ్యవహరించడమేగాక, 1947 నుంచి ఆయన మరణించేంతవరకూ పార్లమెంటు సభ్యులుగా కూడా ఉన్నారు. స్వరాజ్యం వచ్చిన తరవాత పంజాబ్ తొలి ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ గోకుల్ చంద్ భార్గవ్ వీరికి సోదరులే. ఠాకూర్ దాస్ భార్గవ్ విద్యావేత్త, మానవతావాది, వీరు హరిజన విద్యాభివృద్ధికోసం చక్కటి కృషిచేసారు. అవిభక్త హిందూ కుటుంబ వ్యవస్థ కొనసాగేందుకు ఆయన దానిని ఒక ఆదర్శంగా భావించి కృషిచేసారు. పార్లమెంటరీ వ్యవహారాలలో గొప్ప ప్రావీణ్యం గలవారు, మంచివక్త.

మనకు ఉన్న ప్రముఖ పార్లమెంటరీయన్లలో ఠాకూర్ దాస్ భార్గవ ఒకరు. ప్రజాసేవారంగంలో కృషి చేసే వారిలో నైతిక విలువలకు కట్టుబడి ఉండాలని ఆయన భావించేవారు. తన తరువాత రాజకీయ రంగంలో ప్రవేశించిన హరిశ్చంద్రమాధుర్, కామత్, పి.కె.దేవ్, దయాభాయ్‌పటేల్ గార్లకు ఉత్తమ పరిపాలనా పద్ధతులు అవలంభించడానికి ఆయన జీవితం ఆదర్శం అయింది.

ఆయన సుందరరూపి. పాడువుగా, సన్నగా ఉండేవారు. మీసకట్టుతో పురాతన ఆర్య సాంప్రదాయికంగా కనిపిస్తారు. ఆయన చాలా మృదువుగానూ, హుందాగానూ ప్రవర్తించేవారు. సభలో ఉద్రేకపూరితంగా వాదిస్తున్నప్పుడుకూడా, గ్రామీణ ప్రాంత పెద్దరికాన్ని విడిచిపెట్టేవారుకాదు. పార్లమెంటులో ప్రముఖ వక్తగా పేరుగాంచారు. పంజాబ్ హైకోర్టులో పేరుపొందిన న్యాయవాదిగా ఉండేవారు. ఇన్ని ఉత్తమలక్షణాలకు మించి ఆయన మరపురాని ఒక మంచిస్నేహితునిగా మెలిగేవారు.

ఠాకూర్‌దాస్ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో మోతిలాల్ నెహ్రూగారిలో పాటు సభ్యులుగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన పశుగణాభివృద్ధికి చక్కటి కృషిచేశారు. రెండోసారి తిరిగి పార్లమెంటుకు ఎన్నికైన తరువాతకూడా, ఆయన ఈ కృషిని తిరిగి కొనసాగించారు. ఆహార, వ్యవసాయశాఖమంత్రులనుంచి, రాజేంద్రప్రసాద్, జైరామ్‌దాస్ దౌలత్‌రామ్, కె.యం.మున్షీ తదితరుల తోడ్పాటును, సానుకూలవైఖరిని ఈ కృషిలో ఆయన సాధించుకున్నారు. గో సంరక్షణ కమిటీలను ప్రభుత్వం చేత ఆయన ఏర్పాటుచేయించారు. ఆ సమయంలో వారికి తోడ్పాటునందించడం నా బాధ్యతగా నేను భావించాను.

"పార్లమెంటు సభ్యులకు లాభదాయకమైన అవకాశాల్నీ పదవులనూ కల్పించి, పార్లమెంటులో ప్రభుత్వ విధానాలను విమర్శించకుండా వారినోళ్లను కట్టివేసి, రాజకీయంగా వారు దిగజారిపోయే

విధానాలను ప్రభుత్వం అవలంభించరాదని డాక్టర్ అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్తులోనూ, పార్లమెంటులోనూ ప్రసంగిస్తూ అన్నారు.

డాక్టర్ అంబేద్కర్ చేసిన వాఖ్యానాలు, ఠాకూర్‌జీ ఆశయాలకు ప్రాణంపోశాయి. ఆయనతో నేనూ ఏకీభవించాను. ఈ అంశంపై ఆయనతో కలిసి కృషిచేసాను. వ్యక్తిగత ఆర్థిక ప్రయోజనాలను పొందే ఎలాంటి పదవులనుకూడా పార్లమెంటు సభ్యులు పొందరాదని, ప్రభుత్వం వారికి కల్పించరాదనీ, అందుకు ప్రభుత్వం ఒక చట్టాన్ని తయారుచేయాలనీ, శ్రీ భార్గవ్ పార్లమెంటులో తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఆర్థికంగా లాభించే ఆ పదవులేవి? వాటిని ఏ విధంగా కల్పించి పెడతారు? వాటికి చట్టబద్ధత కల్పించి, కొన్ని సంస్థలను, కార్యాలయాలను ఏర్పరిచి, పార్లమెంటు సభ్యులకు, ప్రజానాయకులకు ఏవిధంగా ధారాదత్తంచేస్తారు?

స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, పరిపాలనాక్రమంలో అనేక ప్రజాహిత సంస్థలను నెలకొల్పవలసిన అవసరం ఏర్పడింది. అలాంటి ప్రజాహిత సంస్థల నిర్వహణకు, మేనేజ్‌మెంటు కమిటీల, బోర్డులు, చైర్మన్‌లు, డైరెక్టరులను నియమించడానికి, ప్రభుత్వం పూనుకొని, అందుకు అర్హులైనవారిని, అన్వేషిస్తూ, అనేకమంది ప్రజారంగంలోని వ్యక్తులను నియమించినప్పటికీ, ఇంకా అలాంటి నాయకుల అవసరం ఏర్పడింది. ఈ పరిస్థితిని ఆసరాచేసుకొని, ప్రభుత్వాపాలకులు, తమపరిపాలనను సమర్థించడానికి, అవసరమైనప్పుడు తమకు మద్దతునిచ్చి, అండదండలుగా నిలబడడానికి, మంత్రులు కావాలని పార్లమెంటు సభ్యులకు సైతం ప్రజారంగసంస్థలలో పదవులు కల్పించి పెట్టి, ఆవిధంగా వారు ఆర్థికంగా లబ్ధిపొందడానికి సహకరిస్తున్నారని, ఠాకూర్‌దాస్ ఆరోపించారు.

1952 సార్వత్రిక ఎన్నికల తరవాత, పరాజయం పాలైన అనేకమంది కాంగ్రెసువాదులు, పరోక్షంగా పదవులు పొందుతూఉండేవారు. ఎన్నికలు రాబోయేముందు ఇలాంటి అవకాశాలు కల్పించడం, వారిని ప్రలోభపెట్టేందుకు కాదని అనగలరా? సీట్ల ఎంపికలో పాటిపడకుండా, మంత్రులు చెప్పినట్లు వింటూ, ప్రక్కాకు తొలిగి, అవసరమైనవారికి సీట్లు దక్కడానికి అవకాశాలు ఏర్పరిచే కొందరు పార్లమెంటు సభ్యులకు ఇలాంటి ఎరలువేయడాన్ని సవ్యమైన పద్ధతిగా మనం భావించగలమా?

ఇందుకు ఒక ముసాయిదా బిల్లును తయారుచేసి పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు, పత్తిడితెచ్చి, ప్రభుత్వంచేత అంగీకరింపజేసేందుకు ఠాకూర్‌దాస్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్న సమయంలో, నేను రాజ్యసభ సభ్యునిగా ఉన్నాను. అప్పటి జాయింట్ సెలెక్టు కమిటీలో మేము అందరం సభ్యులమే! ఆ కమిటీలో చిత్తశుద్ధితో, దీక్షతో ఠాకూర్‌దాస్ కృషిచేయడం నేను గమనించాను. ఠాకూర్‌దాస్ రూపొందించిన బిల్లుకు తుదకు ఆమోదం లభించింది. ఠాకూర్‌జీ కృషికి గుర్తింపుగా, తుదకు పార్లమెంటరీ స్థాయీ సంఘాన్ని ఏర్పాటుచేశారు. తిరిగి లోక్‌సభ సభ్యునిగా ఆయనతో కలిసి కృషిచేసే అవకాశం నాకు లభించింది. ఆ కమిటీలో సంత్సరాల తరబడి, ఆయనతోకలిసిఉండడం నాకు సంతోషాన్ని కలిగించింది. ఆయన చాలా నెమ్మదస్తుడు! ప్రజాస్వామ్యవాది! తనవాదాన్ని చట్టబద్ధంగా, సమర్థవంతంగా, వాక్చాతుర్యంతో

ఎదుటివారిచేత ఒప్పించడానికి ప్రయత్నిస్తారు. ఒక్కోసమయంలో ఎక్కువమంది ఆయన వాదాన్ని వ్యతిరేకిస్తే, ఆయన చిరునవ్వుతో దాన్ని వదిలివేసి, మిగతా అంశాలపై చర్చకొనసాగించేవారు.

భార్గవ్ జీ చొరవతో, మేము తీసుకొన్న కొన్ని నిర్ణయాలను తిరిగి పరిశీలించవలసిందని, అప్పటి న్యాయశాఖమంత్రి మమ్మల్ని కోరారు. అయితే నెహ్రూజీకి సన్నిహితులైన మరిముగ్గురు మంత్రులు ఆయనను సమర్థించారు. కాంగ్రెసుపార్టీ సమావేశ ఎజండాలో ఈ పునర్విచారణను చేర్చవలసిందిగా; కాంగ్రెసుపార్టీ కాంగ్రెసు కార్యదర్శిగా ఉన్ననన్ను, న్యాయశాఖ మంత్రి కోరాడు. అందుకు నేను తిరస్కరించాను. తిరిగి దీనిని ఎజండాలో చేర్పించేందుకు ఆయన ప్రధాన మంత్రిపై వత్తిడి తెచ్చాడు. ఈ అంశం కార్యవర్గం ముందుకు వచ్చినప్పుడు, భార్గవ్ జీ వాదాన్ని నేను పూర్తిగా సమర్థించాను. ఈ అంశంపై నెహ్రూశారకాటంలో పడ్డారు. ఒకవంక ముఠారాజకీయాంకు భిన్నంగాఉండే నిష్కల్మషమైన రాజకీయ వ్యవస్థకోసం ఠాకర్ జీ వాదన, మరొకవైపు పదవుల కాంక్షతో ముఠారాజకీయాంను కొరే పార్లమెంటు సభ్యుల ముఠా ఎత్తుగడల మధ్య నెహ్రూ కొంత తటపటాయించినప్పటికీ, చివరకు నెహ్రూ, ఆయన మంత్రివర్గ సహచరులు మా వత్తిడికి లొంగక తప్పలేదు.

ఠాకూర్ దాస్ ప్రసంగించడంలో బహునేర్పరి. ఆయన మాటలు నిధుల మూటలు. అవి చిన్నవైనా, పెద్దలైనా, స్థానిక సమస్యలైనా, జాతీయ సమస్యలైనా అన్నిటిమీదా ఒకే రీతిలో తన వాగ్ఝరిలో, న్యాయవాదిగా ఉన్న అనుభవ చాతుర్యంతో, వాదనా పటిమతో, నిప్పులు కురిపిస్తూ ఉపన్యసిస్తూ ఉండేవారు. ఆయన విమర్శల తాకిడికి ఆయన వాదించే అంశాలు ఎక్కువ ప్రాధాన్యత కలిగి ఉన్నప్పటికీ, సభికులలో తగినంత పరిగణ లభించేదికాదు. ఏ పార్టీలోతో సంబంధంలేకుండా ఆయన ఒంటరిగా ఉన్నప్పటికీ, ప్రతి ఒక్కరూ ఆయన వ్యక్తిత్వాన్ని గౌరవించేవారు.

పార్లమెంటులో మంత్రులు బిల్లులను ప్రవేశపెట్టే సందర్భంలో సభలో ఆయన కనిపిస్తే, జంకుతూ ఉండేవారు. ఏదైనా బిల్లుపై భార్గవ్‌కు ఆసక్తి ఉన్నట్టు తెలిస్తే మంత్రులు ముందుగానే బిల్లు పూర్వాపరాలను గురించిన సమాచారంతో పోజరవుతూ ఉండేవారు. ఎందుకంటే బిల్లుపై సవరణలను ఆయన ప్రతిపాదించదలచుకుంటే, ఆయన అందుకు ఆయత్తమై తీవ్రమైన ప్రతిఘటనను ఇచ్చేవారు. దాన్ని తట్టుకునేందుకు మంత్రులు ముందుజాగ్రత్త తీసుకుంటారు.

గుర్తింపు కోసం ఆయన ఎప్పుడూ తాపత్రయపడేవారు కాదు. లాయర్‌గా హైకోర్టులో ఎంత పట్టుదలతో పనిచేస్తారో, పార్లమెంటులో కూడా అంతే దీక్షతో కృషి చేస్తూ ఉండేవారు. నిజానికి ఆయన ఉదారవాది. హేతువాద దృష్టితో కూడిన మానవతావాది.

గడచిన 70 సంవత్సరాల కంటే, చివరిరెండు సంవత్సరాల్లో ఆయన ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. అయినప్పటికీ బద్దకించకుండా చివరిదాకా పట్టుదలతో కృషిచేస్తూనే ఉండేవారు. న్యాయవాద వృత్తిలో ఉంటూ, పార్లమెంటు సభ్యులుగా ఉన్నవారు పట్టుదలతో తమ వాదనల్లో

విజయం సాధించడానికి, భార్గవ్ ఉపన్యాసాలను ప్రాతిపదికగా చేసుకునేవారు.

పంజాబ్ ముఖ్యమంత్రి గోపీచంద్ భార్గవ్, ఈయనకు సోదరులైనప్పటికీ, సోదరుని పలుకుబడిని తనకోసం ఆయనెప్పుడూ ఉపయోగించుకోలేదు. అంతటి నిజాయితీ గలవ్యక్తి భార్గవ్! దేశవిభజన తర్వాత వచ్చిన కాందీశీకుల కోసం కృషి చేసిన ఆరుగురు ప్రముఖులలో శ్రీ అచింతరామ్, శ్రీమతి సుచేత కృపలానీ గార్లతో పాటు వీరూ ఒకరుగా ఉన్నారు. ఆయన హృదయం కాందీశీకుల బాధలను విని ద్రవించింది. ధాన్యాల గిట్టుబాటు ధరల విషయంలో మేము ఉభయులం చివరలో ఏకాభిప్రాయంతో మెలగలేకపోయాం. ఆయన పట్టుణవాసులైన వినియోగదారుల కోసం కృషిచేయగా, నేను ఉత్పత్తిదారులైన రైతుల రక్షణ కోసం గట్టిగా నిలిచాను.

శ్రీ యం. చలపతిరావు

నేషనల్ హెరాల్డ్ సంపాదకులు

జవహర్లాల్ నెహ్రూచే ప్రారంభింపబడిన "నేషనల్ హెరాల్డ్" పత్రికా సంపాదకులుగా శ్రీ యం.చలపతిరావు ప్రతి ఒక్కరికీ సుపరిచితులే! గాంధీ , నెహ్రూల ఆలోచనలకు అక్షర రూపాన్నిచ్చే, శ్రీ చలపతిరావు సుప్రసిద్ధ రచయిత, మేధావి.

మహామనీషి, మేధావి అయిన శ్రీ జవహర్లాల్ పట్ల, ఆయన ఎనలేని అభిమానంతో ఉండేవారు. అయినప్పటికీ నెహ్రూజీ పరిపాలనలో దొర్లిన పొరపాట్లను, శ్రీ చలపతిరావు చూస్తూ మిన్నకుండలేదు. గట్టిగా వాటిని దుయ్యపట్టారు.

శ్రీ చలపతిరావు సిద్ధాంత పరంగా నిగ్గుతేలిన సోషలిస్టు! తాను మేధావినన్న గర్వం ఆయనకు ఏ కోశానా ఉండేదికాదు. భారతదేశసమస్యలను, సోషలిస్టు పంథాలో పరిష్కరింపబడాలనీ, భారత ప్రభుత్వం సోషలిస్టు తరహా పరిపాలనను అందించాలని, శ్రీ చలపతిరావు కోరుతూ ఉండేవారు. ప్రతి విషయాన్ని సామ్యవాద సిద్ధాంత దృక్పథంతో పరిశీలిస్తూ, వాటి పరిష్కారమార్గాలను కూడా సోషలిస్టు పంథాలో తెలియజెబుతూ ఉండేవారు. అత్యవసర పరిస్థితిని విధించిన సమయంలో రూపొందిచబడ్డ, 20 సూత్రాల పథకంవల్ల శ్రీ చలపతిరావు హర్షాన్ని ప్రకటించారు.

ఆయన హృదయ కవాటాలను తెరచి చూస్తే, అక్కడ మనకు, "నా తొలి సోషలిస్టు ప్రొఫెసరు రంగా" అని రాసుకున్న ఆయన వాక్యం కనిపిస్తుంది. సాటి పత్రికా రచయితలవలె, కేవలం స్వరాజ్య సాధనకు మాత్రమే పరిమితం కాకుండా, శ్రీ చలపతి రావు సోషలిజాన్ని ప్రచారం చేసే లక్ష్యంతో, ముప్పయి సంవత్సరాల యౌవన దశలోనే, జర్నలిజాన్ని వృత్తిగా స్వీకరించి, సామ్యవాద సిద్ధాంతానికి అంకితమైనాడు. ఆయనలో రూపు దిద్దుకొన్న ఈ లక్ష్యసాధన, ఉత్తరభారతదేశంలోని పత్రికాసంపాదకులందరిలో విశిష్టమైన గుర్తింపునిచ్చింది.

ఉత్తరప్రదేశ్, డిల్లీలోని కాంగ్రెసు మంత్రివర్గాల పరిపాలనా పద్ధతులను, సోషలిస్టు దృక్పథానికి అన్వయించి, చలపతిరావుగారు, సాహసోపేతమైన విమర్శనలను, వ్యాఖ్యానాలను చేసేవారు. చలపతిరావు గారి వ్యాఖ్యానాలు, నెహ్రూ అనుచరులకు బలాన్ని చేకూర్చడమేగాక, కాంగ్రెసులోని సోషలిస్టులకు ఊపు నిచ్చాయి.

పత్రికా వ్యాసంగంలో ఖాసా సుబ్బారావుగారిని తనకు ఆదర్శంగా చలపతిరావుగారు పెట్టుకున్నారు. తనకు అత్యంత ఇష్టులైన టంగుటూరి ప్రకాశం పంతులు, రాజాజీల విధానాలలోని తప్పుడు పద్ధతులను ఖాసా ఎలా విమర్శించేవారో, అదే పరవడిలో చలపతిరావుగారు

నెహ్రూ విధానాలను, ఉత్తర ప్రదేశ్, తదితర ప్రాంతాల ఆయన అనుచరుల పారపాట్లను తీవ్రంగా దుయ్యపట్టేవారు. శ్రీమతి ఇందిరా గాంధీని ఇతర ముఖ్యమంత్రులను సైతం అవసవ్యధోరణులు తలెత్తినప్పుడు ఆయన నిర్ద్వంద్వంగా ఖండించేవారు.

శ్రీ చలపతిరావు హేతువాది. సనాతన ఛాందసవాదులనుగానీ, రాజకీయ వాదులనుగానీ ఆయన అంతగా గౌరవించే వారుకాదు. ఆయన నిగ్గుతేలిన జాతీయ వాది! అయినప్పటికీ ప్రాంతీయ భాషా దురభిమానుల పీడివాదాన్ని ఏనాడూ ఆయన సహించలేదు. కాశ్మీరు భారత దేశ అంతర్భాగంగా ఉండాలని ఆయన భావించారు. అందుకు అనువుగా ప్రముఖ కాశ్మీరీ నాయకులైన శ్రీ షేక్ అబ్దుల్లా తన మనస్సు మార్చుకొని, దేశ సమగ్రతకు సహకరించాలని ఆయన కోరుతూ ఉండేవారు. భారత జాతీయ స్రవంతిలో భాగంగానే నాగాలాండ్, మిజోరం, మేఘాలయాలు కొనసాగాలని చెబుతూ ఉండేవారు. ఆయా రాష్ట్రాలలోని ప్రజల అభిమతానుసారం, వారి ప్రాంతీయ సాంప్రదాయాలను గౌరవించి, తగు హామీలను ఇచ్చి, భారత పార్లమెంటు అందుకు పూనుకోవాలని చలపతిరావు కోరారు.

అగ్రరాజ్యాల కూటమిలో దేనిలోనూ చేరకుండా భారతదేశం తటస్థ విధానాన్ని అనుసరించడం సమంజసంగా ఉంటుందని ఆయన భావించేవారు. సోవియట్ రష్యాతో మనకు స్నేహసంబంధాలు ఉండితీరాలని ఆయన వాదిస్తూ ఉండేవారు. భారత్‌తో సమతుల్యంగా పాకిస్తాన్‌ను రూపొందించి, ఉపఖండంలో అశాంతి పరిస్థితులను కల్పించే అమెరికా దుష్ట విధానాలను ఆయన ఖండించేవారు. ఇదే భావన సర్వత్రా వినబడుతూ ఉంది. ఒకవైపు చైనా, రష్యా, అమెరికాల మధ్య స్నేహసంబంధాలు ఏర్పడడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. నా అభిప్రాయాల సరళిలోనే, చలపతిరావుగారు కూడా ఇండో-సోవియట్ స్నేహం' భారతదేశ దీర్ఘకాలిక ప్రయోజనాలకు ఎంతగానో అవసరం అంటే ఆయన ప్రశంసించారు. ఆంగ్లో, అమెరికా వర్గాలు మన దేశాభివృద్ధికి ప్రతికారశక్తులుగా వ్యవహరిస్తునప్పటికీ, ఇటీవల కొనసాగుతున్న భారత్ అమెరికా దేశాల సాంస్కృతిక, ఆర్థిక సంబంధాలలోని కృషిపట్ల ఆయన సంతృప్తి చెందుతూ, ఇండో!యు.యస్.ఎ కమీషన్ ఏర్పాటు పట్ల ఆయన ఆమోదాన్ని తెలిపారు. రష్యా అనుకూలవాదులతోగానీ, అమెరికా వ్యతిరేకులతో గానీ ఆయన పెనవేసుకొని ఉండేవారుకాదు. కారణమేమంటే స్నేహసంబంధాలూ, సంస్థల కార్యకలాపాలూ నిర్ద్వంద్వంగా భారతదేశ స్వాతంత్ర్య పరిరక్షణకు, దేశ పురోగతికి, ప్రపంచ శాంతికి దోహదం చేసేవిగా ఉండాలని చలపతి రావుగారు అభిభాషిస్తూ ఉండేవారు. అప్పట్లో నేను కూడా అలాంటి అభిప్రాయాలనే కలిగి ఉండేవాడిని! డల్లెస్-కృష్ణ మీన్‌ల మధ్య తలెత్తిన వాదోపవాదాలు, పోటాపోటీతో ఏర్పడుతున్న అగ్రరాజ్యాల కూటములతో కూడిన ప్రచ్ఛన్న యుద్ధవాతావరణంలో ఏ కూటమితో పాత్తులేకుండా ఉన్న మన అలీనవిధానం మన దేశానికి ముప్పుతేగలదని నేను భావిస్తూ ఉండేవాడ్ని. అప్పట్లో ఏర్పడిన ప్రపంచ రాజకీయ పరిణామాలు మా ఇద్దరినీ ఏకాభిప్రాయంతో సన్నిహితులను చేసినందుకు, నేనెంతో సంతోషించాను.

పార్లమెంటు సభ్యులైన శ్రీ కె.రామారావు, మరికొందరి తోడ్పాటుతో, వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమానికి చలపతిరావుగారు తీవ్రమైన కృషి సలిపారు. అప్పట్లో ఏర్పడిన అఖిల

భారత వర్కింగ్ జర్నలిస్టుల మహాసభకు ఆయన అధ్యక్షత వహించారు. ఆ మహాసభ తరవాత "ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్' స్థాపనకు పునాది అయింది. దాని తొలి అధ్యక్షులు కూడా చలపతిరావుగారే! ఆ సంస్థ నిర్వహణలోని అయిదు సంవత్సరాల పదవీకాలంలో ప్రెస్ కమిషన్ ఏర్పాటుకు, వర్కింగ్ జర్నలిస్టుల యాక్టు పాస్ చేయించడానికి కృషి చేసారు. (ఈ కృషిలో చలపతిరావుగారికి, శ్రీ కె.రామారావు మూర్తి తోడ్పాటును అందించారు. చలపతిరావుగారు అధ్యక్షులుగా ఉన్న కాలంలో, రామారావుగారు ఉపాధ్యక్షులుగా ఉండేవారు. తదనంతరం చలపతిరావుగారి ప్రోద్బలంతో రామారావుగారు అధ్యక్షులయ్యారు.)

చలపతిరావుగారు మిత్రరాజ్య సమితి సర్వప్రతినిధి సభలో ఒక సంవత్సరకాలం పూర్తి సభ్యునిగా కొనసాగారు. పత్రికా వ్యాసంగానికి దూరం కావడం ఇష్టం లేక, తిరిగి తనను నామినేషన్ చేయడానికి ఆయన అంగీకరించలేదు. అనేక అంతర్జాతీయ సమావేశాల్లోనూ, యునెస్కోలోనూ భారత ప్రతినిధిగా ఆయన పాల్గొన్నారు. పత్రికారంగంలోని గుత్తాధిపత్యాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించాడు. నెహ్రూజీ యాజమాన్యంలోని ప్రముఖ ఆంగ్ల దినపత్రిక సంపాదకునిగా ఆయన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో తన బాధ్యతలను నిర్వర్తించారు. అదే ఒరవడిలో మిగతా పత్రికల సంపాదకులు కూడా అలాంటి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలనే పొందేందుకు, ఆయనగట్టిగా కృషి చేశారు.

దినపత్రికల్లో పనిచేసే సంపాదకులు, రిపోర్టర్లు, సంపాదక సిబ్బందిపైన కర్రపెత్తనంచేసే, మేనేజింగ్ ఎడిటర్ల వైఖరిని ఆయన వ్యతిరేకించారు. అంతేకాదు, పత్రికా వ్యాసంగంలో కృషి ఒకరిదైతే, పేరు మరొకరికి దక్కే షాడో ఎడిటర్లనుండి, పాత్రికేయులకు రక్షణ కల్పించేందుకు ఆయన పటుతరమైన కృషిచేశారు.

పారిశ్రామిక జాతీయకరణ విధానంపై ఆయన అభిప్రాయాలు జడప్రాయమైనవికావు. యుగోస్లోవియా దేశంలో అమలు జరుగుతున్న యాజమాన్య పద్ధతిని అధ్యయనం చేయాల్సిన అవసరంకలదని ఆయన భావించారు. కార్మిక వర్గాల పద్ధతిని అధ్యయనం చేయాల్సిన అవసరం కలదని ఆయన భావించారు. కార్మిక వర్గాల వారందరికీ మానవతా దృక్పథంతో కూడిన వసతులను కల్పించి వారి శ్రేయస్సుకు పూనుకోవాలని ఆయన గట్టిగా వాదించారు. జాతీయ భావం పట్ల ఆయన గౌరవ భావనను కలిగి ఉండేవారు. జాతీయ కర్తవ్యాన్ని గుర్తించి, అధికోత్పత్తిని సాధించాలనీ, విపరీతమైన కోర్కెలతో జాతీయాదాయాన్ని నష్టపరచకూడదని కార్మికులకు నిర్మొగమాటంగా హితవు చెప్పారు. అదే సమయంలో కార్మికులపై పోలీసు బలగాన్ని వినియోగించి దమనకాండ సాగించరాదని కూడా గట్టిగా చెప్పారు. పబ్లిక్ రంగంలోగానీ, ప్రైవేటు రంగంలోకానీ రాష్ట్ర ప్రభుత్వాలు తన అధికార బలంతో, చట్టాన్ని అడ్డం పెట్టుకొని, సంస్కారరహితంగా కార్మికులను అణగద్రొక్కే విధానాన్ని ఆయన ఖండించారు. శ్రీమతి ఇందిరా గాంధీ 'అత్యవసర పరిస్థితి'ని విధించడం పార్లమెంటరీ సాంప్రదాయకంగానే జరిగిందని ఆయన సమర్థించారు. నిర్దిష్టమైన సోషలిస్టు దృక్పథంతో, సంస్కారవంతమైన వ్యాఖ్యల్ని అందిస్తూ, ఆయన ప్రతిఒక్కరి ప్రశంసల్ని పొందారు.

గాంధీజీ, నెహ్రూల వ్యక్తిత్వాల మీద వ్యాసాలను చక్కని శైలి, పటుతరమైన భాషా, పాండితీ ప్రకర్షణలతో రూపొందించి, వెలువరిస్తూ ఉండేవారు. వాటిని ప్రతి ఒక్కరూ చదివి, అవగాహన చేసుకునే విధంగా, సులభమైన పదజాలంతో, కొద్దిపాటి ఆంగ్లభాషా పరిజ్ఞానం ఉన్నవారుకూడా అర్థం చేసుకునే విధానంతో ఆయన రాసేవారు. గంగాతీరంలోని విద్వాంసుల్ని గతమూడు దశాబ్దాల రచనావ్యాసంగంతో ఆయన ఆకట్టుకున్నారు.

పలుసమస్యలపై ఎప్పటికప్పుడు ఆయనతో కలిసి చర్చించడం నాకెంతో ఇష్టంగా ఉండేది. నెహ్రూగారి సహకార వ్యవసాయ విధానాన్ని నేను పూర్తిగా వ్యతిరేకించిన సందర్భంలో ఆయన నా విధానాన్ని హర్షించారే తప్ప నా నిజాయితీని శంకించలేదు. స్వతంత్ర పార్టీలోని కొందరు అనుచరులు స్వేచ్ఛా వాణిజ్యాన్ని, ప్రైవేటు పరిశ్రామీకరణను మొండివైఖరితో సమర్థించినప్పుడు ఆయన ఇలా వ్యాఖ్యానించారు. "నా తొలి ఆచార్యులు రంగా ఇందుకు అంగీకరిస్తాడని నేను అనుకోను. రైతాంగ సమస్యలలో సమర్థింపుకొరకు రంగా వారితో లాలూచీ పడ్డారని నేను భావించాను. రంగా ఎప్పుడూ ఇలాంటి రాజీ విధానాన్ని అంగీకరించరు" చలపతిరావుగారు చేసిన ఈ వ్యాఖ్యానం నిజాయితీతో కూడి ఉంది.

ప్రధాని జవహర్లాల్‌తో తనకున్న సన్నిహిత సంబంధాలను ఆయన తన స్వీయ ప్రయోజనాలకు ఏనాడూ ఉపయోగించుకోలేదు. శ్రీమతి ఇందిరా గాంధీ కార్యక్రమ నిర్వహణకు చలపతిరావుగారు అమూల్యమైన సలహాలనిస్తూ, తోడ్పడుతూ వచ్చారు. తద్వారా ఆయన ఎట్టి ప్రతిఫలాన్ని ఆశించలేదు. ప్రభుత్వ కార్యనిర్వహణకు, మంత్రుల కార్యకలాపాలకు దూరంగా ఉంటూ, వారితో మమేకం కాకుండా వారి చర్యలను గమనిస్తూ, రాగద్వేషాలకు అతీతంగా తన విమర్శలను కొనసాగిస్తూ ఉండేవారు. సామాన్యప్రజలకు సన్నిహితంగా ఉండే కొద్దిమందిలో చలపతిరావుగారు ఒకరు. గొప్పతనంతోనూ, పెద్దరికంతోనూ ప్రమేయంలేకుండా, మంత్రుల శక్తిస్తోమతులను లెక్కచేయకుండా నిర్భయంగా ప్రజావసరాలను ఎత్తిచూపి, ప్రజలకొరకు వ్రాయగలిగే సమర్థుడైన రచయిత! నా దృష్టిలో అలాంటివారు బహుకొద్దిమంది మాత్రమే ఉంటారు.

"చలపతిరావుగారిసుగుణాలన్నింటిలో గుర్తుపెట్టుకోదగిన అంశం విశ్వసనీయత, స్నేహితుల పట్ల అపారమైన నమ్మకం, నమ్మిన సిద్ధాంతాల పట్ల అంకిత భావం పేర్కొనదగ్గవి".

ఈశ్వరదత్తు "మై పోర్ట్రయిట్ గ్యాలరీ" 1957.

11

శ్రీ దివాన్ చమన్‌లాల్

దివాన్ చమన్ లాల్ మరణంతో మనం ఒక గొప్ప దేశభక్తుడిని, నలబయి సంవత్సరాలుగా మనకు లభించిన ఉన్నతమైన పార్లమెంటేరియన్‌ను కోల్పోయినట్లయింది. 1925లో సెంట్రల్ అసెంబ్లీలో ప్రసంగిస్తూ బ్రిటిషువారికి ఆయన వినిపించిన భవిష్యవాణిని దేశభక్తులైన వారెవ్వరూ మరువలేదు. ఢిల్లీ నగరం ఇప్పటి వరకు 12మంది విదేశీపాలకులకు రాజధానిగా ఉంటూ వారికి ఘోరీల స్థలంగా గూడా అయ్యింది. తుదకు బ్రిటిషు పాలనకు గూడా ఇదే స్మశానవాటిక కాగలదని ఆరోజు ఆయన ఒక నవాలుగా ప్రకటించారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ లోనికి ఆయన రావటం ఓ తుఫాను వచ్చినట్లుండేది. హాస్యచతురతతో తడుముకోకుండా మాటకుమాట అందించడంలో ఆయనకు ఆయనే సాటి.

చమన్ లాల్ మతాతీతమైన జాతీయవాది. పెర్షియన్, ఉర్దూ, ఇంగ్లీసు భాషల్లోనూ, సంస్కృత సాహిత్యంలోనూ ఆయనకు చక్కటి ప్రవేశమున్నది. ఆయన మోతీలాల్ నెహ్రూ స్వరాజ్యపార్టీ తరపున లాలా లజపతిరాయ్ మీద పోటీ చేసి ఓడిపోయారు. పంజాబ్ కేసరి లజపతి రాయ్ అప్పుడు ముస్లిం లీగ్‌కు వ్యతిరేకంగా హిందూ జాతీయవాదిగా పోటీలో పాల్గొన్నారు.

చమన్ లాల్ ఉమర్ ఖయ్యాం లాగా జీవించారు. ఖయ్యాం రుబాయతులను కంఠస్థంచేసి సంతోషంగా గానం చేస్తుండేవారు. వారి తాతగారు ఆష్టన్ దేశస్తులు. వారి తండ్రి హరికిషన్ లాల్ పారిశ్రామిక వేత్త. లక్ష్మీ ఇన్సూరెన్సు కంపెనీ వ్యవస్థాపకులు. అంతేగాక సాహసవంతుడైన జాతీయవాది. ఆయన తన నాయకుడైన లజపతిరాయ్‌తో కలసి కొంతకాలం బ్రిటిషుపాలకులచేత నిర్బంధంలో ఉంచబడ్డారు. అయినా భారతదేశం అవసరాలకు సోషలిజం మాత్రమే తగు సమాధానం చెప్పగలదని ఆయన విశ్వసిస్తూ ఉండేవారు.

ఆయనతో కలసి ఉండడానికి నెహ్రూజీ చాలా సంతోషం వ్యక్తపరుస్తూ ఉండేవారు. స్వాతంత్రం వచ్చిన తరవాత ఆయన టర్కీ దేశానికి రాయబారిగా పంపబడ్డారు. అనేక అంతర్జాతీయ సమావేశాల్లో పాల్గొని, అక్కడ చక్కటి తన వాగ్ధోరణితోనూ, మాటల చాతుర్యంతోనూ, యుద్ధానంతర పశ్చిమదేశాలలోని నాయకులతో ఉల్లాసకరమైన తన ప్రవర్తనతోనూ, ప్రపంచశాంతికొరకు తనకున్న ఆకాంక్షతోనూ, భారతదేశానికి గౌరవ ప్రతిష్ఠలను సంపాదించి పెట్టగలిగారు.

మేమిద్దరం కలిసి 1955లో సోవియట్ రష్యా, యుగొస్లేవియా, దేశాలు తిరిగాం. రైతాంగ స్వేచ్ఛను, స్వయంవృత్తులను త్రొక్కివేసేందుకు వారవలంబించిన కఠినమైన విధానాలు మమ్ము బాధించాయి. అయితే త్వరితగతిన సోవియట్ రష్యా సాధించిన పారిశ్రామిక అభివృద్ధికి సంతోషపడుతూ, భారతదేశం కూడా సోషలిస్టు విధానంలో ఇలాంటి అభివృద్ధిని పొందాలని మేం వాంఛించాము. సోషలిస్టు సభలద్వారా క్రింది తరగతి ప్రజలు స్వయంగా

నడుపుకునే కార్యాలను, స్వయం వృత్తులవారికి ముఖ్యంగా రైతులను కదిలించకుండా యుగోస్లేవియా కమ్యూనిస్టు పాలన సాధించిన వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధిని చూసి మేం సంతోషపడ్డాం. ఆయన తాను చూసిన సోవియట్ రష్యా అనుభవాల క్రోడీకరణలో మేము ఉభయులం కలసి పంచుకున్న ఈ అనుభవాల సన్నివేశాలను జతపరిచారు.

భారత విదేశ వ్యవహారాల సంస్థ వేదికను ఆయన మాతో కలసి పంచుకొన్నారు. కెన్యా స్వాతంత్ర పోరాట సందర్భంలో "మావ్ మావ్" ఉద్యమ సందర్భంగా ఇప్పటి కెన్యా రిపబ్లిక్ అధ్యక్షులు జోమోకెన్యాట్టాపై అప్పటి వలసపాలకులు తప్పుడుకేసులు బనాయించి వేధిస్తున్నపుడు, చమన్‌లాల్ ఒక న్యాయవాదిగా విశేషమైన సేవలు అందించారు. ఆ తరువాత కెన్యారిపబ్లిక్ ఏర్పడినపుడు దాని ప్రారంభోత్సవాలకు ఆయన ప్రత్యేకంగా ఆహ్వానించబడ్డారు.

ఇటీవల సంవత్సరాలలో ఆయన ప్రపంచశాంతికి ముఖ్య దూతగా మారి, శాంతి సంఘంద్వారాను, మిత్రరాజ్య సమితివద్దను దానికొరకు బాగా కృషి చేసారు. ఆ రకంగా ఆయన రష్యా - అమెరికా కూటముల మధ్య తనదైన స్వంతమార్గాన్ని ఏర్పుకొని, భారత-రష్యా స్నేహ సంబంధాల పెంపుదలకు కృషి చేసారు. జాతీయ అంతర్జాతీయ సమావేశాలలో ఎక్కడైనా గాని చమన్‌లాల్ ఉంటే అది చాలా బాగా కనిపించేది. ఆయన ఉన్నచోట ఉర్దూ, పర్షియన్, సంస్కృతం, ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలనుండి చక్కటి కొటేషన్స్ మృదు మధురమైన శైలిలో చదివి వినిపిస్తూ ఉంటే ఎన్నో దేశాలవారు, సాంస్కృతిక సాహిత్యాభిలాష కలిగిన వారెందరో కొత్త మిత్రులుగా తయారవుతూ ఉండేవారు. చక్కటి సంభాషణా చాతుర్యం కలిగిన శ్రీమతి సరోజినీనాయుడు వలెనే ఆయన అందరినీ ఆలరింపజేస్తుండేవారు. శ్రీమతి సరోజినీ నాయుడువలె ఆయన కవికాకపోయినప్పటికి షేక్‌స్పియర్, బైరన్, కీట్స్, టెన్నిసన్ గార్ల సందర్భ సహితమైన కవితా ఖండికలను ఆలపిస్తూ ఉండేవారు. తనతో పాటు పార్లమెంటులో ఉన్న మోతీలాల్ జీ, మాలవ్యాజీ, లాలా లజపతిరాయ్, జవహర్‌లాల్, షౌకత్ ఆలీ, బూలాభాయ్, జిల్లావంటి వారల అనుభవాలు, ఆనాటి పార్లమెంటులోని బ్రిటిషువారి రీతులు, వారి జ్ఞాపకాలు, అనుభవాలు ఆయన మనకు వినిపిస్తున్నపుడు ఓ విందు చేస్తున్నట్లుగానే ఉండేది.

దేవ్ వగైరాలు : ఒరిస్సా

ఆర్.ఎన్.సింగ్‌దేవ్ ఒరిస్సాలో 31-3-1912న జన్మించారు. అజ్మీరులో విద్యాభ్యాసం చేసారు. తన పాలనలో ఉన్న ప్రాంతాన్ని భారత్‌లో సంలీనం చేస్తూ సంతకం చేసిన మొట్టమొదటి సంస్థాన పాలకుడాయన. 1952నుండి 1957 వరకు ఆయన పార్లమెంటు సభ్యులు. 1957 నుండి శాసనసభ్యులు. గణతంత్ర పార్టీ నాయకులు. 1962 నుండి ఒరిస్సాశాసన సభలో స్వతంత్ర పార్టీ నాయకులు. 1959-62 సంవత్సరాల మధ్య కాంగ్రెస్-గణతంత్ర మిశ్రమ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి. 1967-70 సంవత్సరాల కాలంలో ఏర్పడిన మిశ్రమ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి అఖిల భారత స్వతంత్రపార్టీకి ఉపాధ్యక్షులు. 1974లో మరణించారు.

ఒరిస్సా పార్లమెంటు సభ్యులైన పి.కె.దేవ్ 5-10-1919న జన్మించారు. 1957నుండి పార్లమెంటు సభ్యులు. ముందు గణతంత్ర తరపున, ఆ తరవాత స్వతంత్ర పార్టీలోను ఉన్నారు. 1974లో పార్లమెంటులో భారతీయ లోక్‌దళ్‌కు నాయకులుగా ఉన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్సుకు భారతీయ ప్రతినిధివర్గానికి నాయకులుగా హాజరయ్యారు. 1952-56 సంవత్సరాలలో ఒరిస్సా శాసనసభలో గణతంత్ర నాయకులుగా వ్యవహరించారు. 1962లో లోక్‌సభలో స్వతంత్ర పార్టీ నాయకులుగా ఉన్నారు. ప్రపంచ దేశాలన్నింటా పర్యటించారు.

పవిత్ర మోహన్ ప్రధాన్ 8-2-1910న ఒరిస్సాలో జననమొందారు. బి.ఏ, ఉపాధ్యాయులు. రాష్ట్రంలో ప్రజానాయకులు. తాల్చర్‌లో సత్యాగ్రహం చేసారు. సంస్థాన పాలకుల చేత ప్రజా ఉద్యమాలు అణచివేయబడటాన్ని గురించి గాంధీజీకి అందించేందుకు నివేదికను తయారు చేయటంలో నాకు (రంగా) సహకారాన్ని అందజేసారు. సుభాష్ చంద్రబోస్‌కు అనుచరులు. చాలాసార్లు జైళ్లకు వెళ్లారు. జైలునుండి తప్పించుకొని అజ్ఞాతవాసంలో గడిపారు. 1950లో శాసన సభ్యులు. 1951-55లో మంత్రి వర్గ సభ్యులు. 1967లో హరిక్రుష్ణ మెహతాబ్‌గారితో కలసి కాంగ్రెస్‌ను వదలిపెట్టి జన కాంగ్రెస్‌ను ఏర్పరచారు. 1967-70 సంవత్సరాలలో ఉపముఖ్యమంత్రిగా ఉన్నారు.

శ్రీ భూలాభాయ్ దేశాయ్

శ్రీ భూలాభాయ్ దేశాయ్ 1877లో జన్మించారు. 1895 నాటికి డిగ్రీ తీసుకున్నారు. 1905నాటికి బొంబాయి హైకోర్టులో న్యాయవాది. 1918కి హోమ్‌రూల్ ఉద్యమంలో ప్రవేశించారు. గవర్నరుగారి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యత్వం 1922లో ఇవ్వజూపబడింది. 1926లో బొంబాయిలో అడ్వొకేట్ జనరల్. 1928లో టాక్సు ఎంక్వయిరీ కమిషన్‌కు వ్యతిరేకంగా బార్డోలీ రైతుల పక్షాన న్యాయవాదిగా పనిచేసారు. 25-7-1932న అరెస్టు చేయబడి 6-7-1933న విడుదల చేయించబడ్డారు. సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో 52మంది ఎం.ఎల్.ఏలున్న కాంగ్రెసు పక్షానికి 1935-45 సంవత్సరాల సమయంలో నాయకులుగా ఉన్నారు. యూరపు, అమెరికాలలో విస్తృతంగా పర్యటనలు చేసారు. ఐ.ఎన్.ఎ ఖైదీలకు న్యాయవాదిగా ఉన్నారు.

నేను 1934-35లో గుంటూరు-నెల్లూరు జిల్లాలనుండి, భూస్వాములు, జమీందారులు, వడ్డీ వ్యాపారులంతో కూడిన జస్టిస్ పార్టీ దానికి అండగా ఉన్న బ్రిటిషు పరిపాలకులు తీవ్రంగా నన్నెదుర్కొన్నప్పటికీ, కాంగ్రెస్ ఎం.ఎల్.ఎగా సెంట్రల్ అసెంబ్లీకి ఎన్నికకాగలిగారు. ఢిల్లీలో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎం.ఎల్.ఎలలో అప్పటికే రైల్వే కార్మికనాయకులుగా ఉన్న వి.వి.గిరిగారు మాత్రమే నాకు తెలుసు. దక్షిణ భారతదేశంనుండి వచ్చినవారిలో మదరాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో కాంగ్రెసునాయకులుగా గౌరవ ప్రతిష్టలనార్జించిన శ్రీ సత్యమూర్తి, ఏకైక తెలుగు దిన పత్రిక "ఆంధ్రపత్రిక" వ్యవస్థాపకులు, సంపాదకులు దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారలు తెలుసు. భూలాభాయ్ దేశాయ్ మినహా ప్రముఖులుగా ఉన్న మిగిలిన ఉత్తరాది ఎం.ఎల్.ఎలంతా నాకు కొత్తవారే. శ్రీ దేశాయ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎంపిక చేసే కృషిలో భాగంగా ప్రాధమిక విచారణ జరిపేందుకు పార్లమెంటరీ బోర్డు తరపున ఆంధ్రదేశం వచ్చినపుడు నన్ను కలిసి మాట్లాడారు. వారిలో కొంతమంది నన్ను అఖిలభారత కాంగ్రెస్ కమిటీ వేదికమీద చూచారు.

భూలాభాయ్ దేశాయ్ నాయకులుగాను, గోవింద వల్లభపంత్ ఉపనాయకులుగాను, సత్యమూర్తి కార్యదర్శిగాను అసఫ్ ఆలీ చీఫ్‌విప్‌గాను సెంట్రల్ అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీకి ఎన్నికయ్యారు.

భూలాభాయ్ బొంబాయి హైకోర్టులో అడ్వొకేట్ జనరల్‌గా ఉన్నారు. బ్రూమ్ ఫీల్ట్ కమీషను ముందు బోర్డోలీ రైతుల పక్షాన వాదించి యోధులుగా ప్రఖ్యాతి చెందారు. ఆయన తొలి ప్రసంగం, మా కాంగ్రెస్ అభ్యర్థి స్వాతంత్ర సమరయోధులు ఎం.షేర్వాణి గారిని ఓడించి స్పీకర్‌గా ఆయనపై గెలుపొందిన అబ్దుల్ రహీం గారిని అభినందిస్తూ చేసినట్టిది. బ్రిటిషు పరిపాలకులపై పోరాటంలో కాంగ్రెస్ అనుసరించబోయే నైతిక మార్గాన్ని అది ముందుగా చూపినట్లయింది. భూలాభాయ్ మాట్లాడడానికి ఎప్పుడూ తొందరపడేవారు గాదు. అయితే

మాట్లాడడం ప్రారంభిస్తే మాత్రం కాంగ్రెస్ రాజకీయ ధోరణిని పూర్తిగా సమర్థవంతంగా తెలియజెప్పేటంతవరకు ఆగేవారు కాదు. ఇతరులను ఒప్పించగలిగే వాగ్ధాటి ఆయనది. ప్రతిపక్షం ఉండేదికాదు ఆయన ప్రసంగ ధోరణికి. దేశాన్ని పాలిస్తున్న బ్రిటిష్ పరిపాలకులకు వ్యతిరేకంగా న్యాయమైన కోర్కెలను వివరిస్తూ ఆయన మాట్లాడుతూ ఉంటే సభ్యులంతా నిశ్చేష్టులై చూస్తుండేవారు. ఆయన వాదన మర్యాదతో కూడి ఉండేది. ఆయన విమర్శలు ముళ్లు గ్రుచ్చినట్లుగా అనిపించేవి. ఆయన ప్రసంగానికి ముగింపు వాక్యాలు పలికిన తరవాత అధికార పక్షంలోనివారు ఇకమాట్లాడేటందుకు ఏమీ లేక నిస్సహాయులుగా మిగిలిపోయేవారు.

బడ్జెట్ సమావేశపు చర్చల్లో ఆయన ఒక గంటసేపు మాట్లాడి సభను తనవైపు త్రిప్పుకొనేవారు. వాయిదా తీర్మానం మీద ఒక్క పదిహేను నిమిషాలు మాత్రమే మాట్లాడి సభను సంభ్రమంలో పడవేసి, చర్చను మహోన్నత స్థాయిలోకి తీసుకెళ్లి ముగించేవారు. ఆయన జ్ఞాపకంలో విలువైన ఎంతో సమాచారమున్నా ఒక్కసారిగా దానినంతా ముందు పడవేసేవారువారు. ఒకదానివెంట మరొక దానిని ప్రవేశపెడుతూ అధికార పక్ష సభ్యులను గాలిపీల్చుకోకుండా చేసేవారు. ఆయన మాట ఎంత గంభీరము! ఎంత మృదువైనది! ఏమి తమాషా? తేలిక పాటి గూని ఒక ప్రక్కకు వంచివేస్తుంటే నమ్మకాల వత్తిళ్లు మరొక ప్రక్కకు లాగుతున్నట్లుగా ముఖం ఇంకో ప్రక్కకు తిరిగి ఉండేది. నడిచేటప్పుడు బాగా వదులైన అంగీ, చెవులవరకు ఉండే కొద్దిపాటి తెల్లని జుట్టు, విశాలమైన బాగా వెనకకు ఉండే గుజరాతీయ తలభాగం మాచినప్పుడు దేశభక్తుని చిత్రానికి ఉత్తమ ప్రతిక్రృతా? అన్నట్లుండేవారు. మరొక ప్రక్క తెలివిగా వాదిస్తూ, హెచ్చరిస్తూ, బెదరిస్తూ సవాల్ చేస్తూ తిరిగి తిరిగి వాదిస్తూ అగ్నిపీఠంపై నిలబడి విధినిర్వహణ చేస్తున్న ఉన్నత మూర్తిలా కనుపించేవారు. సభకు పెద్ద దిక్కై కాంగ్రెస్ సింహంలా ఆయన గర్జిస్తుంటే ఏనుగులాంటి అధికార బెంచీలు ప్రాణభయంతో వణుకుతుండేవి.

బడ్జెట్ సమావేశాలు ముగిసిన వెంటనే, భూలాభాయ్, సమావేశాల్లో నేను చేస్తున్న ప్రసంగాలకు సంతసించి, పార్టీ సభ్యులమధ్య నాకున్న ఆదరణను గమనించి, దేశ వ్యాప్తంగా ఉన్న రైతుకూలీ సంఘాలు, నాయకులతో పెరుగుతున్న నా సంబంధాలను దృష్టిలో పెట్టుకొని, నన్ను పార్టీ గౌరవకార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించవలసిందిగా కోరారు. తరువాత సంవత్సరంలో కార్యవర్గానికి ఎన్నికలు జరుగుతున్నపుడు ఆయన అభిమతంమేరకు నన్ను కార్యదర్శులలో ఒకరుగా ఎన్నుకొన్నారు. ఆయన పూనికకు, ప్రోత్సాహానికి నా అభివందనాలు. 1951 సంవత్సరం దాకా నేనా పదవిలో కొనసాగాను. శరత్ చంద్రబోస్, జవహర్లాల్ నెహ్రూ గార్లవంటి ప్రముఖులు ఆ కాలంలో నాయకులుగా పనిచేసారు.

రైతులు, చేనేత పనివారు, కార్మికులు సమస్యలకోసం నాయకత్వం వహించి నేను పోరాడుతున్నపుడు, భూలాభాయ్ నాతో విభేదించిన సందర్భాలు చాలా కలవు. ఆ సందర్భాల్లో ఆయన ముఖం ఎర్రగా తయారై కోపంతో జేవురించినట్లుండేది. ఇతర సందర్భాల్లో ఆయన తన సహజమైన హాస్యోక్తులతో నవ్విస్తూ, తన సహకారాన్ని అందిస్తూ నాతో ఎప్పటిలాగానే ఉండేవాడు. అంతకుముందు మామధ్య పొడచూపిన విభేదాలు మచ్చుకైనా బయట పడేవికావు. నా అనుభవంతో ఆయన నాకు అంతటి అభిమాన పాత్రమైన నాయకుడు.

ఆ రోజుల్లో మేం దేశావసరాలకు అవసరమైన పరిశ్రమలను భారతదేశంలోనే ఏర్పాటు చేసుకొని, దిగుమతి చేసుకొన్న విదేశీయంత్రాలపై ఆధారపడటాన్ని వీలైనంతగా తగ్గించుకోవాలని, వత్తిడి తీసుకు రాసాగాం. ఆ విధంగా మేం రైలు ఇంజన్ల తయారీని, మోటారు కార్ల పరిశ్రమలను, నూనె శుద్ధి కర్మాగారాలను ఏర్పాటు చేయాలని కోరగా, అధికార వర్గాలు ఆర్థికంగా అవి లాభదాయకం కావని చెప్పసాగాయి. రైలు మార్గాల జాతీయీకరణను మేం కోరగా బ్రిటిషువారు దానికి జాప్యం చేయసాగారు. సకలార్థ సాధకమైన టి.వి.ఎ. ద్వారా అమెరికా అభివృద్ధిపథంలో ఎలా ముందుకు వెళుతుందో, ప్రణాళికల పరంగా సోవియట్ రష్యా శీఘ్రపురోభివృద్ధిని ఎలా సాధిస్తుందో మేం చూచాం. భారతీయ పరిశ్రమలను ప్రణాళికాబద్ధమైన కృషి ద్వారా అభివృద్ధి చేయాలనే విశ్వేశ్వరయ్య కోర్కెను మేం సమర్థించగా అందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. మన బొగ్గుగనులను, కాఫీ, టీ తోటలను బ్రిటిషు వారు దోపిడీ చేయడాన్ని చూచి బాధచెంది మేం వాటిని భారతీయం చేయాలని కోరాము. మా ఈ కోర్కెలన్నింటిలో భూలాభాయ్ ఎదురులేని తన వాదనాపటిమతో మమ్ము సమర్థించారు. పరిశ్రమలు, కంపెనీ వ్యవహారాలు, బీమా పరిధిలోనికి తీసుకొచ్చినపుడు, ప్రజా ప్రయోజనాలను కాపాడే విషయంలో ప్రభుత్వ బాధ్యత పెరిగింది. కార్మికుల పాలసీహోల్డర్ల ప్రయోజనాలకు మాత్రమే పరిమితం కాకుండా, ఈ సందర్భంలో కాంగ్రెస్ పార్టీ భారతీయ పారిశ్రామికుల ప్రయోజనాల రక్షణకు కూడా పూనుకొంది. ఈ సందర్భంలో నేను కార్మికుల ప్రయోజనాల గురించి వాదించగా, భూలాభాయ్ బ్రిటిషు పెట్టుబడులకు ప్రతిగా భారతీయ పెట్టుబడిదారుల రక్షణకు కృషి చేయాలని అన్నారు. భారత జాతి ప్రయోజనాలను కాపాడడంలో మేం అప్పుడు ప్రయోజనవంతమైన ముందడుగు వేయగలిగాం. విదేశాలలో ఉంటున్న భారతీయుల ప్రయోజనాలను కాపాడేందుకు గూడా మేం ఎక్కువ శ్రద్ధ తీసుకొన్నాం. వారిలో ఎక్కువమంది బ్రిటిషు పరిపాలనలో స్థిరపడినవారే. తమ కాలనీలలో కూలీలుగా పనిచేస్తూ తమ అభివృద్ధికి ఉపయోగపడుతున్న భారతీయులకు రకరకాల ఆశలు చూపిస్తూ, వారిని తమ స్వార్థంకోసం వాడుకుంటున్న బ్రిటిషువారి సిగ్గులేని చర్యలకు వ్యతిరేకంగా నేను సేఠ్ గోవిందదాస్, అవినాశ లింగం చెట్టియార్ లము ఎలా చెలిగే అలా తీవ్రమైన ఆరోపణలతో వారిని ఎదుర్కొంటూ ఉండేవారు భూలాభాయ్.

ఆయన వాడే ఆంగ్లభాషలో తప్పులు దొర్లుతూ ఉండేవని,వాడే వాక్యాలు పూర్తిగా ఉండవని అనేకమంది పత్రికా రచయితలు అంటూ ఉండేవారు. పండితులు ఆయన పాండిత్య స్థాయిని ప్రశ్నించేవారు. ఆయన ఆంగ్లభాషా పదకోశం ఆయన స్వంతం. అది ఆయన వాదనలతో పరిగెడుతూ, తీవ్రమైన వారిభావాలను ఆలోచనలను ముందు కురికించటానికి అనువుగా ఉండేది. ఆయన ప్రసంగాల్లో ఉండే తీవ్రతను, ఆయన ఉపయోగించే ఆ మాటలు మాత్రమే సరిగా వ్యక్తపరచగలవనే సంగతిని అందరూ అంగీకరిస్తారు.

ఆయన రాజకీయరంగంలో అతి త్వరితంగా ప్రాముఖ్యతలోకి వచ్చి మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్ గారలకు విశ్వాసపాత్రులు కాగలిగారు. కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులుగాను పార్లమెంటరీ బోర్డు సభ్యులుగాను ఉంటూ సర్దార్ పటేల్‌కు అత్యంత విశ్వాసపాత్రమైన సలహాదారుగా ఉండే స్థితికి ఆయన ఎదగగలిగారు. ఇది పార్లమెంటరీ బోర్డులోని మిగతా

సభ్యులకు బాధాకరమైంది. ఎందుకంటే చాలా సంవత్సరాలు తాము కష్టపడి పనిచేస్తూగూడా అంతటి ప్రాధాన్యతను పొందలేక పోయినందుకు వారు బాధపడుతూ ఉండేవారు.

కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుల్లో అత్యంత ప్రముఖస్థానంలో ఉంటున్న ఆయన, భవిష్యత్తులో కాంగ్రెస్‌పార్టీ జాతీయ ప్రభుత్వస్థాపన బాధ్యతలను చేపట్టినప్పుడు దానికి నాయకులు కాగలరని దాదాపు అందరూ భావించారు. అయితే రెండవ ప్రపంచయుద్ధం, బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత దేశం కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న పోరాటం, జిన్నా దేశ విభజన పోరాటాలు ఏకమై బ్రిటిష్ వారి ఆలోచనలకు అనుసంధానమై కాంగ్రెసుకు వ్యతిరేకంగా కుట్ర జరిగేందుకు తోడ్పడ్డాయి. ఆ సంక్లిష్టమైన తరుణంలో భూలాభాయ్ కాంగ్రెస్ పార్టీ కష్టాలను ధైర్యంగా తనచేతులలోకి తీసుకొన్నారు. కాంగ్రెసు పెద్దలు ఇతని కెంత ధైర్యం? అనుకొన్నారు. భూలాభాయ్ అభిమానులు అయితే ఏమి? అని సరిపెట్టారు.

భూలాభాయ్ గొప్ప స్థితిపరుడు. పూర్తికాలం పనిచేసే కార్యకర్తగా, ఆయన కాంగ్రెస్‌లో ప్రవేశించేనాటికి, జిన్నాకన్నా గొప్ప పేరు ప్రఖ్యాతులు కలిగిన న్యాయవాది. ఈ మార్గంలో ఆయన సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూ, శ్రీ నివాస అయ్యంగార్ల వలెనే బారులో ప్రముఖునిగా ఉంటూ రాజకీయాలలో ప్రవేశించడం పై మెట్టుమీదనుండే ప్రారంభించారు. వారివలెనే భూలాభాయ్‌గారు కూడా గొప్ప ఆత్మగౌరవం అంతకంటె ఎక్కువగా ఆత్మ విశ్వాసం కలవారు. కాంగ్రెస్ అగ్రశ్రేణి నాయకత్వంలో తానూ ఒకరిగా ఉండేందుకు ఆయన గట్టి కృషి చేసారు. ఆ రోజుల్లో తిరుగులేని మహానాయకులు మహాత్మాగాంధీగారి తోనూ, సమర్థుడు శక్తివంతుడూ అయిన జవహర్లాల్ నెహ్రూగారితోనూ ఒకే తీరుగా వ్యవహరిస్తూ ఇద్దరి అభిమానానికి పాత్రంగావటమనేది అంతసులభంగాదు.

జాతీయ ప్రభుత్వ స్థాపనకు వీలుగా, కాంగ్రెస్ ముస్లింలీగ్‌ల మధ్య ఒక అవగాహనను సాధించేందుకు ఆయన లియాఖత్ ఆలీఖాన్ గారితో చర్చలకు పూనుకొన్నారు. అది కాంగ్రెస్ పెద్దలకు కోపకారణమైంది. అహమ్మద్ నగర నిర్బంధ శిబిరంలో ఉన్న నెహ్రూ, పటేల్, ఇతరులు ఆయన ప్రయత్నాలను అనుమానించటానికి కారణమైంది. అనుకోని సంఘటనల ఫలితంగా దురదృష్టకరస్థితిలో ఇరుక్కుపోయిన భూలాభాయ్‌కి, ఈ వ్యవహారంలో ఏమాత్రం ఆసక్తి కనబరచని గాంధీజీ, చేయూత నొసంగి నానుతున్న ఈ రాజకీయ విభేదంనుండి ఆయనను బయట పడవేయలేకపోయారు. నెహ్రూజీ, పటేల్‌గార్ల విశ్వాసాన్ని కోల్పోయిన తరవాత భూలాభాయ్‌గారు నాయకత్వ స్థానం నుండి తొలగి పోవలసి వచ్చింది. అదిచాలా బాధాకరమైన సంగతైనప్పటికీ, ఈయన భారత ప్రభుత్వ ప్రధాని కాగలరేమోననే శంక మరొక సీనియర్ కాంగ్రెస్ నాయకుడిని పీడించకుండా ఉంటే బహుశా ఇది నివారించబడి ఉండేదేమో! పార్టీ బాధ్యతల నుండి ఆయన తిరిగి జాతీయ కార్యకలాపాలలో ప్రవేశించారు. ఢిల్లీ ఎర్రకోటలో ఐ.ఎన్.ఎ. ఖైదీలపై విచారణ జరుగుతున్నప్పుడు ఆయన వారి తరపున న్యాయవాదిగా వచ్చారు. ఆ సామర్థ్యం ఆయనకు మాత్రమే ఉంది. చరిత్రాత్మకమైన ఆ సందర్భంలో భూలాభాయ్ తన కంచుకంఠాన్ని మ్రోగిస్తూ ఇలా అన్నారు. "బానిసత్వానికి, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగే యుద్ధం రాజద్రోహం కాదు" ఆ విధంగా భూలాభాయ్ మన జ్ఞాపకాల్లో

పట్టుదల కలిగిన ఉన్నతమైన ఒక మహోయోధునిగా స్థిరమైన స్థానాన్ని సంపాదించుకొన్నారు.

భూలాభాయ్ వలెనే సర్వ సమభావంకల కుమారుడు ధీరేన్ స్విట్జర్లాండులో భారత రాయబారిగా పనిచేసారు. ఆ దేశంలోనికన్సర్వేటివ్ రాజకీయ నాయకులతో స్నేహసంబంధాలను పెంపుదల చేయటం, అక్కడి పెట్టుబడిదారీ వర్గాలను ఆకట్టుకురావడంలోనూ ఆయన చూపిన ప్రతిభ జవహర్లాల్ నెహ్రూగారి ప్రశంసలకు పాత్రమైంది. సంస్కారం కలిగిన సౌకుమార్యవంతురాలైన ఆయన భార్య భూలాభాయ్ దేశాయ్‌ని ఆదర్శంగా పెట్టుకొని అన్నింటా ధీరేన్‌కు చేదోడు వాదోడుగా నిలిచింది. ఆకస్మాత్తుగా ధీరేన్ అనువులు బాయటంతో ఆమె తన పూర్తి కాలాన్ని ప్రజాహిత కార్యక్రమాల వైపు మళ్లించింది. భూలాభాయ్ స్మృతి చిహ్నంగా బొంబాయిలో సముద్రపు ఒడ్డున మంచి స్థలంలో ఆమె ఒక చక్కటి మ్యూజియంను నిర్మించింది. దానిని ఆ తరువాత లలితకళల సాంఘిక సేవాకేంద్రంగా ఆమె మలచింది.

14

శ్రీ మొరార్జీ దేశాయ్

పాడగరియైన శ్రీ మొరార్జీ దేశాయ్, కోలముఖంతో పూర్తి ఖద్దరు ధారణలో చూచేందుకు ఒక మహాయోధునిలా కనిపించేవారు. ఆయన నడుస్తూ ఉంటే ఆయన వేసే ప్రతి అడుగూ ఎంతో ఆత్మవిశ్వాసంతో ముందుకు పడుతుండేది. ఆయన ఎప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ కనుపించేవారు. అలా ఎప్పుడైనా ఆయన కనుపించకపోతే ఆ సమయంలో ఆయన దగ్గరకు పోవడానికి ఎవరైనా సరే జంకేవారు. ప్రతి అంశాన్ని అతి శ్రద్ధగా పరిశీలించి దానిని వీలైనంత సందేహరహితంగా తయారు చేసుకునేవారు. ఒకసారి ఆయన ఒక నిర్ణయానికివస్తే దానినుండి ఆయనను మరల్చటం సాధ్యమయ్యేదికాదు. ఆ సమయంలో ఆయన ఏపాటి లౌకిక జ్ఞానంలేని సర్దుబాటుకాని బహుముండి మనిషిలా కనుపించేవారు.

ఆయన పూర్తి శాఖాహారి. పండ్లను అతి ఇష్టంగా తింటూ ఉండేవారు. తన వద్దకు వచ్చిన వారికీ తానే పండ్లను ముక్కలుగా తరిగి, ఎంతో ప్రేమ పూర్వకంగా పంచి పెడుతూ, చక్కటి ఆతిధ్యం ఇచ్చేవారు. ఎవరి గురించైనా మంచివారని ఆయన అభిప్రాయపడితే అటువంటి వారి యెడల చాలా నమ్మకంగానూ, ఆదర పూర్వకంగాను ఉండేవారు. ప్రజా సమస్యలపైగాని ప్రజారంగంలో ఉండే వ్యక్తులపైగాని తన అభిప్రాయాలను ఆయన నిర్మొహమాటంగా తెలియజేస్తూ ఉండేవారు. అదే తన ప్రత్యర్థులను గురించి మాట్లాడవలసి వస్తే సంశయిస్తూ మౌనం పాటించేవారు. కాళ్లకింద గుంతలు తవ్వే విధానాలను ఆయన చాలా అసహ్యించుకునేవారు.

ఆనాటి కాంగ్రెస్ ముఖ్యమంత్రులందరిలోనూ చాలాగట్టి మనిషిగా మొరార్జీ దేశాయ్ పేరు తెచ్చుకున్నారు. బహుభాషాప్రాంతమైన బొంబాయి రాష్ట్రంలో శాసన సభ్యులందరను కలిపి నడిపించటంలోనూ ఆ రాష్ట్రంలో మూడు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలను, మంత్రివర్గాన్ని సయోధ్యతో నడిపించటంలోను ఆయన చూపిన ప్రజ్ఞ ఆయనకు ఎనలేని గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఎవరూ పెత్తనం సాగించలేని అంతర్జాతీయ స్థాయి నగరం బొంబాయిలో, పేరొందిన దొంగ వ్యాపారుల, పార్సీ-పెట్టుబడిదారీ వర్గాల, గొంతులమీద నిర్బంధంగా ఆయన ప్రవేశపెట్టిన మధ్యనిషేధం కత్తి పెట్టినట్లయింది. ఇదే విధానాన్ని గ్రుడ్డిగా కొలదారీచట్టం విషయంలో అమలుచేయటం ద్వారా ఆయన సేద్యం చేసుకొంటూ స్వయంగా జీవనయాత్ర సాగిస్తున్న గుజరాత్ రైతులను, మహారాష్ట్ర భూకామందులను వారు తాత్కాలికంగా భూములను ఇతరులకు కౌలుకు ఇచ్చిన సందర్భంలో కూడా, వారి యాజమాన్యహక్కులను హరించి బెదరింపుకు గురిచేసారు.

నెహ్రూగారిచే పిలువబడి ఆయన కేంద్రంలో ఆర్థిక శాఖామాత్యులుగా బాధ్యతలు చేపట్టినప్పుడు, బంగారపు దొంగ వ్యాపారాన్ని అరికట్టాలనే తలంపుతో, అహంతో గ్రుడ్డిగా ప్రవేశపెట్టిన స్వర్ణ నియంత్రణ చట్టం, రేవుల్లో పట్టణాల్లో తిష్టవేసి ఉంటున్న నేరస్తులైన దొంగ

వ్యాపారం సరసన-స్వయం వృత్తులద్వారా జీవిస్తూ, మనదేశ ప్రజలందరకూ అలంకరణలనందించే లక్షలాది చెండి, బంగారు పనివారలను దోమలుగా నిలిపింది. ప్రజల ఆలవాట్లలో తెచ్చిన ఈ మార్పుకు వ్యతిరేకంగా వచ్చిన ప్రజా విప్లవానికి ఆయన ఇచ్చిన జవాబు ఇది. దేశంలో కొన్ని మార్పులు తీసుకురావాలంటే, ఆ విషయంలో నేరస్తులతో పాటు కొందరు మంచివారుగూడ కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనక తప్పదని గుజరాత్ మహారాష్ట్ర రైతాంగం విషయంలో తన్నుతాను సమర్థించుకొన్నట్లుగానే వారు ఈ సందర్భంలోనూ చేశారు. ప్రజావసరాలను గమనించి ఆయన తన ధోరణిని మార్చుకోవటంగానీ, లేదా తలవంచటంగానీ, లేదా దాని నుండి నేర్చుకోవటంగానీ చేయలేకపోయారు. ఆ తరువాత ఆయన స్థానంలో ఆర్థిక మంత్రిగా వచ్చిన శ్రీ.టి.టి.కృష్ణమాచారి ఆయన మూర్ఖపువైఖరి స్థానంలో అవసరానికి తగు విధంగా, దుస్థితికి లోనైన స్వర్ణకారులకు కొన్ని వెసులుబాట్లు కల్పించారు.

మొరార్జీదేశాయ్ గారు జాతీయ ప్రణళికా ప్రయోజనాల కోసం బ్యాంకుల నిర్వహణపై ఆదుపును కలిగి ఉండాలని అనుకున్నప్పుడు గతంలో ఇన్సూరెన్సు కంపెనీల జాతీయీకరణ సందర్భంలో సంభవించినట్లుగా, ఈ సారి జాతీయకరణ ద్వారా ఏర్పడుతున్న లోటుపాట్లను రాసీయకుండా చేయాలని భావించారు. తక్కువ సోషల్ కంట్రోలును ఉంచటం ద్వారా దానిని ఎక్కువ ఉపయోగకరంగా రూపొందించాలని తలచారు. అయితే దానికి బ్యాంకర్లు, వారి సహచరులనుండి ఒకవైపు, సోషలిస్టులనుండి మరొకవైపు తీవ్రమైన వ్యతిరేకత వచ్చింది. ఇరువాదాలలో ఆయన దేనికీ లొంగక తన అభిమతానుగుణమైన మార్పుకు శ్రీకారం చుట్టి విజయులు కాగలిగారు.

ఆయన విశ్వాసపాత్రులుగా ఉండవలసిన ప్రధానమంత్రి బ్యాంకులను జాతీయం చేయాలన్నప్పుడు అంతకుముందే తాను వేసిన ఒక అడుగునుండి మరొక అడుగు ముందుకువేసి తెలివిగా ప్రవర్తించలేకపోయారు.

స్వర్ణ నియంత్రణ ద్వారా సంభవించిన అపశ్రుతులను సరిదిద్దేందుకు రాజాజీ తన ప్రయత్నాలలో విసుగుచెంది, మొరార్జీ మూర్ఖపుటాలోచనను సహించలేక "మొరార్జీ పోక తప్పదు" అయితే ఆయన పోరు అన్నారు. ఆయన అహంభావ శిఖరాల నుండి అదృష్టం ఆయనను కిందకు త్రోసి వేయబోతున్న సమయంలో గూడ ఆయన ఈ మార్పుకు కనీసం తన నిర్ణయానికి సన్నిహితంగా ఉండి, వీరందరికి నష్టం లేని రీతిలో సవరించుకునేందుకు గూడా సిద్ధం కాలేకపోయారు. ఆ అదృష్టాన్ని చేతబుచ్చుకున్న వనిత శ్రీమతి ఇందిరాగాంధి.

మొరార్జీ దేశాయ్ తన రాజకీయపుటాలోచనలో ఎక్కువ సర్దుబాటుతనం కలిగిఉండి, తనతో సమానులైనవారిపై పెత్తనం చేసే పద్ధతిని మానుకొని, స్నేహధోరణిలో సత్సంబంధాలను పెంచుకొని ఉంటే అప్పట్లోనే భారతప్రధాని కాగలిగేవారు. తాను పట్టిన కుందేటికి మూడే కాళ్లు అంటూరే తప్ప మొరార్జీ దేశాయ్ ఏరకంగాను సర్దుబాటు కాని వ్యక్తి అనే భయం అప్పటి కాంగ్రెస్ అధ్యక్షులు, కింగ్‌మేకర్‌గా పేరుగాంచిన శ్రీ కామరాజ నాడార్‌ను పట్టి వేధించి ఉండకపోతే ఆనాడు ఆయన స్థానం ఉన్నతస్థితిలో ఉండేది. జవహర్లాల్ తన తరువాత తన వారసునిగా తనను

ప్రకటించగలరని ఆయన అనుకొంటూ ఉండేవారు. తాను దీర్ఘకాలం జీవించగలిగితే ముందు ముందు జయప్రకాశ్ నారాయణ్ గారు అలాంటి ఆశతో ఉండకుండా చేయటానికి అది ఉపకరించగలదని ఆయన నమ్మిక. ప్రస్తుతం మొరార్జీ జయప్రకాశ్ మిత్రులు. కాబోయే భారతప్రధానిపేరు సూచించగల స్థితిలో ఇప్పుడు జయప్రకాశ్ గారున్నారు. తనముందు పరిపాలించిన వారికంటే తాను సమర్థుడైన ప్రధానిని కాగలనని మొరార్జీ దేశాయ్‌కి గట్టి నమ్మకం. కాలానుగుణమైన నిర్ణయాలు చేయటంలో, అప్రజాస్వామికమైన ఆయన అహం, ప్రధానియైనప్పటికీ ఆయనను ప్రజా నేతగా ఎలా తీర్చిదిద్దగలుగుతుంది?

ప్రధానమంత్రి పదవిని అవినీతికి అతీతంగా గాంధేయ మార్గంలో పై స్థాయిలో నిలిపి పరిపాలించగలరనే సంగతి మాత్రం ఆయన విషయంలో నిస్సందేహమైనది. ఎంతటి వ్యతిరేకులైనా ఆయనకు కళంకాన్ని ఆపాదించరుగాని స్నేహరహితమైన ఆయన దృష్టినిగాని మొండి పద్ధతును గాని హర్షించరు.

ప్రధాని పదవిని పొందడంలో ఆయన రెండుమార్లు వైఫల్యం చెందారు. ప్రధాని పదవికై జరిగిన ప్రయత్నంలో ఓటమి పాలైన తర్వాత మంత్రి వర్గంలోగాక వెలుపలనే ఉండాలని ఆయన అనుకున్నారు. మంత్రుల మధ్య తన ఆధిక్యత తగ్గుతుందనే భావం తప్ప ఇందుకు ఏ ఇతర కారణం కానరాదు. రెండవమారు ఓటమిపాలైన తరువాత ఉపప్రధాని పదవిని ఆశించి, దెబ్బతిన్న తనగౌరవ ప్రతిష్ఠను నిలుపుకొనేందుకు దానికి తన ఆమోదాన్ని తెలివిగా తెలియజేశారు. అయితే శ్రీమతి ఇందిరాగాంధి ఇది మంత్రులవరుసలో పద్ధతి ప్రకారం ముందు ప్రాధాన్యతను చూపించటానికే తప్ప దీనికి వేరే ప్రత్యేక ప్రాధాన్యత లేదన్నారు. ఆయన ప్రజాస్వామ్యరీతిలో ఆలోచించి ఉంటే ఆమె ఎడ తనపూర్తి విశ్వాసాన్ని ప్రకటించి ఉండేవారు. నిస్సంకోచంగా ఆయన అలాచేసి ఉన్నట్లయితే ఆ తరువాత ఆయనను ప్రధానిగా చేసి ఉండేది.

అధికారం, ఆధిక్యతల ఎడ ఆయనకు ఎంత ఇష్టమో కష్టించి పనిచేసే సిబ్బంది ఉన్నతమైన పరిపాలనా పద్ధతుల మీద ఆయనకు అంత మమకారం. పరిపాలనా సంస్కరణల సంఘానికి చైర్మన్‌గా ఉండడానికి ఆయన అంగీకరించిన తరవాత ఆ కమీషన్ పరంగా లోక్‌పాల్, లోకాయుక్త బిల్లులను తీసుకొచ్చేందుకు, పరిపాలనా రంగంలో మొదటి స్థానంలో ఉన్న వారిపై తగు న్యాయ విచారణలకు ప్రత్యేక ఏర్పాట్లు జరగటానికి ఆవిధంగా ఒక పూర్తి రూపం కల్పించటానికి ఆయన తన శక్తి వంచన లేకుండా కృషిచేసారు. ఈ ప్రయత్నం గూడా ఆయనకు నిరాశనే మిగిల్చింది. సోషలిస్టు నాయకులు హెచ్.వి.కామత్ గారి సమర్థతను తాను కోరి పార్లమెంటు సపోర్టును పొందినప్పటికీ ఈ సంస్థలు ఇంతవరకు ఏర్పడి ఉండలేదు.

స్వభావసిద్ధంగా మొరార్జీ యోధుడు. ఒక హీరోలాగా ఆయన కాంగ్రెస్‌లో చేతులు కలిపి బ్రిటిష్ కలెక్టరు క్యాడరు నుండి తనను బర్తరఫ్ చేయవలసిందిగా తనకు తానై ముందుకు దూకాడు. గాంధీ శతజయంతి సంవత్సరంలో గూడా మైనారిటీల ప్రాణాలకు రక్షణ నిచ్చే కృషిలో విఫలమైన అహ్మదాబాదు ప్రజలపై కోపంతో తనకుతానై కఠోరమైన కాలనిర్ణయంలేని నిరాహారదీక్షకు పూనుకొన్నారు. ఆయన రెండవమారు అలాంటి దీక్షకు పూనుకొని గుజరాత్

విద్యార్థి యువజన సంస్థ నవనిర్మాణ సమితి 1974లో కోరిన విధంగా తిరిగి శాసన సభ రద్దుకు డిమాండుచేసి విజయం సాధించగలిగారు. 1975లో ఆయన ఆమరణ నిరాహారదీక్షను ప్రభుత్వ గుజరాత్ పాలసీకి వ్యతిరేకంగా ప్రారంభించారు. అత్యున్నత నైతిక స్థాయిగలిగిన గాంధేయవాది. నిశ్చితాభిప్రాయం గలిగిన వ్యక్తి. మాజీ మంత్రి మండలి సభ్యులు అయిన ఆయన ఈ సందర్భంలో ప్రధాన మంత్రి కన్నా శక్తిమంతులే. ప్రధానిగూడా ఈ విషయంలో ఆయనను ఏమీ చేయలేని స్థితిలో యుండి పోవలసి వచ్చింది. అంతకుముందే అక్కడ అధ్యక్షపాలనను ప్రవేశపెట్టేందుకు పార్లమెంటు ఆమోదం పొంది ఉన్నప్పటికి గూడ, ప్రభుత్వం చేత తక్షణమే ఎన్నికలు జరపడానికి ఆమోదాన్ని పొందగలిగారు. ఒకవంక గాంధేయవాది, ఖ్యాతి వహించిన మాజీ మంత్రి మరొక ప్రక్క భారత ప్రధానిపై విజయం సాధించడం, భారత ప్రజాస్వామ్య చరిత్రలో గాంధేయవాదానికి లభించిన సువర్ణ పత్రం. ప్రజా స్వామ్య ప్రతిష్టానికి అత్యంత విలువనార్జించిన మహోన్నత వ్యక్తిగా మొరార్జీదేశాయ్ ఆరోజు నిలబడ్డారు. గాంధేయమార్గంలో ఇది గొప్ప అనుభవం. భారతప్రధాని, ఉపప్రధాని, చెరొకవైపు ప్రత్యర్థులుగా ఒకరికి ఎదురు ఒకరు నిలబడి, దీర్ఘకాలంగా వారి మధ్య ఉన్న విభేదాలను పురస్కరించుకొని అధికార బాధ్యతతో ఒకరు, ప్రతిపక్ష నాయకత్వ స్థానంనుండి మరొకరు భారత పార్లమెంటులో విజయవంతంగా పరస్పరం ఢీ కొన్న ఈ సంఘటన గాంధేయమార్గంలోని ఒక ప్రత్యేకమైన అనుభవం. పార్లమెంటులోని గత రెండు దశాబ్దాలు మా ఇద్దరి సంబంధానికి సంబంధించినంతవరకు ఆయన, బంగారు నగల తయారీ పనివారల విషయంలోను, వ్యవసాయ ఉత్పత్తులు కిరోసిన్ వంటి వాటిపై పన్నుల ప్రతిపాదన విషయంలోను, నాతో ఏకీభవించకున్నా అంతర్జాతీయ సమావేశాల్లో నాతో చాలా ప్రేమపూర్వకంగా ఉంటుండేవారు. ఒకసారి ఆంధ్రదేశంలోని శ్రీకాకుళం జిల్లాలోను, ఒరిస్సాలోని గంజాం జిల్లాలోను తుఫాను నష్టం సంభవించినపుడు వారికి తక్షణ సహాయ కార్యక్రమాలను అమలు జేయవలసిందిగా కోరుతూ నేను ఆయన వద్దకు వెళ్లాను. నేను గట్టిగా కోరుతూ ఉంటే సీటుకు అలాగే అట్టిపెట్టుకొని ఉండి వారు అంగీకరించిందీ లేనిదీ గూడ నాకు అర్థం కాలేదు. ఆయన అలా నిస్సహాయంగా కూర్చొని ఉన్నంతవరకు నేను ఆయనతో వాదనకు దిగలేదు. అంతా విన్న తరువాత ఆ తుఫానుబాధితులకు కావలసిన సహాయాన్నంతా ఆయన అందించారు. ఆయన మానవతాదృష్టి అలాంటిది. న్యూజిలాండ్‌లోని విల్లింగ్‌టన్ నగరంలో జరిగిన కామన్వెల్త్ కాన్ఫరెన్సులో అవినీతి గురించి చర్చ జరిగింది. అవినీతి ఆరోపణలు చేయబడినవారిలో ఒక మంత్రిని గూడాచూచిన తరువాత భారత ప్రజాస్వామ్యం గూడా క్రమేణా అవినీతి కోరల్లో ఇరుక్కుపోతుందనే మాటను నేననక తప్పలేదు. నిజాయితీపరుడైన మంత్రి మొరార్జీదేశాయ్ నా మాటలకు ఎలాంటి అభ్యంతరాన్ని చెప్పలేదు. అటువంటి విషయాల్లో ఆయన మంచి స్నేహపాత్రుడు. ఆయనతోటి నమ్మకస్తులలో నన్నూ ఒకరిగా పరిగణించారనేందుకు నాకదో ఉదాహరణ. పార్లమెంటులో ప్రతిపక్షస్థానాల్లో ముందువరుసలో మేమిద్దరం ప్రక్కప్రక్కనే కూర్చుండేవారం. ఆయన నాతో స్వేచ్ఛగా సంభాషణలు జరుపుతూ, నమ్మకంగాను సన్నిహితంగాను మెలగేవారు. మనిషిగా ఆయన చాలామంచివారేగాని మంత్రిగా చాలాకఠినుడు. మొరార్జీదేశాయ్ మంత్రివర్గంలో నుండి బైటకువచ్చి పార్లమెంటులోని ప్రతిపక్ష స్థానాల్లో కూర్చున్నపుడు

మేమిద్దరం మంచి స్నేహితులం. ఆయనా నేనూ ప్రక్కి-ప్రక్కినే కూర్చుంటూ ఉండేవారం. న్యూజిలాండ్ లో పార్లమెంటరీ కామన్వెల్త్ కాన్ఫరెన్సు జరిగినపుడు కూడా మేమిరువురం మంచి మిత్రులం. దశాబ్దాల తరబడి అధికార స్థానాల్లో ఉండి ప్రసంగించిన ఆయన ప్రతిపక్ష స్థానంలోనికి వచ్చి ప్రసంగించబోయేటప్పటికి ఆయన గొంతే మూగపోయిందేమోననిపిస్తుండేది.

ఆయన రాజకీయాల్లోను, వ్యక్తిగత జీవితంలో గూడ గాంధేయవాదిగా ఉండడానికి పూర్తి శ్రద్ధ తీసుకునేవారు. ఆయన నిరసన దీక్షలకు పూనుకొని కోర్కెలను నెరవేర్చుకోగలుగుతుండేవారు. ఆయన కృషికి తగినంత ప్రచారం లభించేదికాదు.

1973లో శ్రీమతి ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా అలహాబాదు హైకోర్టు తీర్పు ఇచ్చినప్పుడు, దానిపై సుప్రీంకోర్టు ఇచ్చిన తాత్కాలిక నిలుపుదల ఉత్తర్వును గమనించకుండానే, దేశాయ్ ఇందిరాగాంధీ వ్యతిరేక వర్గాలతో చేతులు కలిపి సమిష్టి ఉద్యమంలో పాల్గొన్నారు. ఆయనా, జనతా ఫ్రంటులోని ఆయన సహచరులు 1975 జూన్ 24వ తేదీన భారత ప్రజలను ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయవలసిందని పిలుపునిచ్చారు. భారతదేశాన్ని అత్యవసరపరిస్థితిలోనికి నెట్టవలసిన అవసరం లేదని ప్రజా తిరుగుబాటుకు వారు పిలుపు నిచ్చారు.

గాంధేయవాది మంచి మిత్రుడూ అయిన మొరార్జీదేశాయ్ రాజకీయ జీవితం ముగింపుదశలో ఇలాంటి మలుపుతిరిగింది.

శ్రీమతి దుర్గాభాయ్‌దేశ్‌ముఖ్
శక్తిమంతమైన మహిళా నాయకురాలు –

గాంధీ యుగారంభంతో దేశంలో ప్రారంభమైన నవజీవన కృషిలో మహిళలు ఎక్కువ ప్రయోజనాన్ని పొందారు. బ్రహ్మసమాజ వాదులు, ఈశ్వర తత్వజ్ఞులు (థియోసాఫిస్ట్స్) సాంఘిక, మతవ్యవహారాల్లో తమతో సమంగా పాల్గొనేందుకు స్త్రీలకు ఎక్కువ స్వాతంత్ర్యాన్ని కల్పించారు. అయితే ఈ విషయంలో ఎక్కువ మంది హిందువులను వారిలో బాగా విద్యావంతులైనవారినైనా అంగీకరింపజేయలేకపోయారు. గాంధీజీ పిలుపు సందుకున్న తరువాతనే స్త్రీలు ముఖ్యంగా ఆచారవంతులైన వారు, సాంప్రదాయబద్ధమైన హిందూ కుటుంబాల నుంచి వచ్చినవారు, బాలికలతో సహా గృహ పరదాలను దాటి ముందుకు వచ్చి 1930 నాటి జాతీయ సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షలను, లాఠీ ఛార్జీలను, అరెస్టులను ధైర్యంగా ఎదిరిస్తూ నిలిచారు. విదేశీ వస్త్ర దహన కార్యక్రమంలో పాల్గొన్న మొట్టమొదటి మహిళ శ్రీమతి మాగంటి అన్నపూర్ణ (బాపనీడు గారి సతీమణి). 1921–24 సంవత్సరాల మధ్య సత్యాగ్రహ సమరంలో పాల్గొనేందుకు ముందుకు వచ్చిన స్త్రీలలో శ్రీమతి దువ్వూరి సుబ్బాయమ్మ, శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ గారలు మొదటి వరసలోనే ఉన్నారు. గుంటూరు నుంచి శ్రీమతి భారతీదేవి రంగా, నెల్లూరు నుంచి పానకా కనకమ్మ, కృష్ణా నుంచి రామసీతమ్మ, పశ్చిమగోదావరి నుంచి చుక్కమ్మ, విశాఖపట్నంనుంచి లక్ష్మీబాయమ్మ గారలు వారి సహచరులతో సహా 1930–45 సంవత్సరాలలో సత్యాగ్రహోద్యమంలో ప్రవేశించారు.

దుర్గాబాయమ్మ, కామేశ్వరి, తూర్పుగోదావరి నుంచి కమలమ్మ, పశ్చిమ గోదావరి నుంచి అన్నపూర్ణ, నెల్లూరు నుంచి కనకమ్మగారలు వారి సహచర కార్యకర్తలు పట్టణాలు పల్లెలనుంచి, మధ్యతరగతి బ్రాహ్మణ, బ్రాహ్మణేతర కుటుంబాల స్త్రీలు సత్యాగ్రహోద్యమంలో పాల్గొనేందుకు ముందుకు వచ్చేందుకు దారిచూపారు. వారి త్యాగాలు బాధలు, కష్టాలు, దేశ స్వాతంత్ర్య సమరాంగణంలో ఇతరులకెవ్వరికీ తీసిపోని వారి త్యాగనిరతి ఇతరులను ఉత్సాహంతో ముందుకు నడిపించేవి. ప్రభుత్వంలో దుర్గాభాయ్, అఖిలభారత మహిళా సంఘంలో కామేశ్వరి, రైతు ఉద్యమంలో భారతీదేవి జాతీయస్థాయిలో పనిచేసారు. సరోజినీదేవి, కస్తూర్బా, కమలాదేవి, సుచేతా కృపలానీ, విజయలక్ష్మీపండిట్, లీలావతి మున్షీ, కుట్టియమ్మాళ్, మృదులాసారాభాయ్ గార్లవంటి జాతీయ నాయకురాండ్ర అడుగుజాడలలో వీరు నడచారు. వీరూ, వీరితో పాటు వేలాదిమంది ఇతర మహిళలు తల్లులూ–చెల్లెళ్లు చేసిన త్యాగాల ఫలితంగానే ఆ తరువాత కాంగ్రెసు అధ్యక్షురాలిగా, దేశప్రధానిగా శ్రీమతి ఇందిరాగాంధీ కాగలిగే అవకాశం కలిగింది. అయినప్పటికీ జాతీయ పునర్నిర్మాణ కృషిలో పురుషులతో పాటు సమానంగా పాల్గొనేందుకు గ్రామీణస్త్రీలు స్వేచ్ఛగా ముందుకు రావలసిన అవసరం ఇంకా ఉంది.

మొట్టమొదటి సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గా దుర్గాబాయ్ అఖిలభారత స్థాయిలో కీర్తి నార్జించింది. స్వాతంత్ర్యానికి పూర్వం ఆమె భారతదేశంలో శక్తిమంతురాలైన మహిళా నాయకురాలిగా తయారు కాగలిగింది. ఆమె ఆలోచనా దక్షత కలిగిన నిర్మాణ కార్యకర్త. సంస్థల నిర్వహణలో ఆమె ఒక సైనిక నియంతలాగా అన్ని వ్యవహారాలను ఒకే మాటపై నడిపిస్తూ ఉండేవారు. సోషల్ వెల్ఫేరు బోర్డును నిర్మాణం చేసి, అన్ని విధాలా దాని అభివృద్ధికి కావలసిన ప్రణాళికలను ఆమె సిద్ధంచేసింది. నిర్లక్ష్యానికి గురి అవుతున్న సాంఘిక సంక్షేమ రంగంలో ప్రభుత్వ పరమైన కృషికి దీనిని ఓ ప్రధానమైన అనుబంధ సంస్థగా నెలకొల్పాలని ఆమె సంకల్పించారు. జాతీయవాది ప్రముఖ ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు బులుసుసాంబమూర్తిగారి ప్రోద్బలంతో ఆమె మదరాసులో ఆంధ్ర మహిళా సోషల్ సర్వీస్ కాంప్లెక్స్‌ను నిర్మించారు. అలాగే హైదరాబాదులో మరొక మహిళా సోషల్ సర్వీసు కాంప్లెక్సును నిర్మించారు. న్యూఢిల్లీలో ఆంధ్రా ఎడ్యుకేషనల్ సొసైటీని, దాని తరపున ఒక హైస్కూలును కాలేజీని గూడా నిర్మించారు. ఈ కార్యక్రమాలన్నింటా ఆమె భర్త ప్రముఖ వ్యక్తులైన శ్రీ సి.డి.దేశముఖ్‌గారు ఆమెకన్నింటా తనసహకారాన్నందించారు. విద్యాలయాలు, కళాశాలు, హాస్టళ్లలో స్త్రీవిద్యావకాశాల పెంపుదలకోసం ముందు దృష్టితో ఆమె ఒక నివేదికను తయారుచేసి దానిని ఆమోదింపజేయటానికై ప్రణాళికా సంఘంమీద తీవ్రమైన వత్తిడిని తీసుకొచ్చారు. స్త్రీవిద్యకు అన్ని రకాలైన ప్రోత్సాహాన్ని అందించాలనే నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం వచ్చింది. అందుకు దోహదపడిన దుర్గాభాయ్ కృషికి నా అభివందనలు. దుర్గాభాయ్ ఆంధ్రప్రాంతం గోదావరి జిల్లాలోని విద్యావంతులైన సాంప్రదాయక, మధ్యతరగతి కుటుంబంలో నుంచి వచ్చారు. ఆమె చదువు నేర్చుకునే రోజులనుంచే దక్షిణ భారతదేశంలోని హిందీ ప్రచారోద్యమంలో పాల్గొన్నారు. 1923 కాకినాడ కాంగ్రెస్ మహాసభల సందర్భంలో పనిచేసిన మహిళా కార్యకర్తలకు నాయకురాళ్లగా పనిచేసిన ముగ్గురిలో ఆమె ఒకరు. మిగతా ఇద్దరు కాకినాడ వేదాంతం కమలాదేవి, రాజమండ్రి కామేశ్వరి గారలు. నా మేనగోడలు అనసూయ ఆమె వాలంటీర్లలో ఒకరుగా పనిచేసారు. గోదావరి కృష్ణా జిల్లాలలో గాంధీజీ హిందీ ప్రసంగాలను తర్జుమా చేయటానికి ఆమె ముందుకువచ్చి ప్రజలలో తనగౌరవాన్ని పెంచుకున్నారు. ఉప్పు సత్యాగ్రహోద్యమంలో ఆమె మద్రాసు మెరీనాబీచ్ వద్దకు సత్యాగ్రహులను నడిపించి అక్కడ పోలీసు హెచ్చరికలను లెక్కచేయకుండా సాహసోపేతంగా ఉప్పు తయారీకి పూనుకొన్నారు. ఆ సమయంలో ఆమె జైలు పాలు కావలసి వచ్చింది. దక్షిణభారతదేశ మందంతటా ఆమె ఆనాడు "జోన్ ఆఫ్ ఆర్క్" గా కీర్తించబడ్డారు. శ్రీమతి భారతీదేవి రంగా జైలులో ఆమెను కలుసుకొన్నారు. ఆమె చేస్తున్న అవిశ్రాంతమైన కృషిని తెలుసుకొని ఆమె స్నేహాన్ని అక్కడ సంపాదించుకోగలిగారు. టంగుటూరి ప్రకాశం, బులుసు సాంబమూర్తిగారలు కూడా ఆమెకు తమ అండదండలనొసగి చదువులో ముందుకెళ్లడానికి తగినంత ప్రోత్సాహాన్ని అందజేసారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో మొదటి శ్రేణి యం.ఎ.డిగ్రీని ఆమె పొందేంతవరకు ఈ ప్రోత్సాహం కొనసాగింది. మదరాసులో ఉంటున్న ఆంధ్రుల కోసం పాఠశాలలు, వైద్యాలయాలు, గ్రంథాలయాలు పునరావాస కేంద్రాలను అభివృద్ధి పరచటంలో ఆమె తన శక్తి సామర్థ్యాలను పూర్తిగా వినియోగించారు.

ఆమె మద్రాసు శాసన సభనుంచి రాజ్యాంగ సభకు ఎన్నికైంది. తాత్కాలిక పార్లమెంటు అధ్యక్షుల జాబితాలో ఆమె పేరు చేర్చబడి అక్కడ పనిచేస్తున్నపుడు, పార్లమెంటరీ విధానంలో నేను గట్టి నమ్మకం కలిగిన దానను అని అన్నారు. అవసరమైన తెలివైన విద్యార్థులకు వారికులంతోగాని, సాంఘిక స్థితిగతులతోగాని ప్రమేయం లేకుండా అవసరమైన వారందరకు విద్యకోసం ఉపకారవేతనాలను ఇవ్వాలని ఆమె ప్రభుత్వాన్ని గట్టిగా కోరారు.

జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులను కలిగి ఉండడమేగాక ఆమె యుద్ధానంతరం కమ్యూనిస్టు చైనా పర్యటనలో, శ్రీమతి విజయలక్ష్మి పండిట్ దృష్టిని ఆకర్షించ గలిగారు. అందువల్ల ఆమెను జవహర్లాల్ నెహ్రూగారు ప్రణాళికా సంఘంలో తొలి మహిళా సభ్యురాలిగా నియమించారు. నిర్భయంగా అత్యుత్సాహంతో పనిచేస్తూ అక్కడ ఆమె ఆర్థిక శాఖామాత్యులు ప్రణాళికా సంఘ అధికార సభ్యులూ ఐన శ్రీ సి.డి.దేశముఖ్ గారి దృష్టిని ఆకర్షించగలిగారు. అప్పటికి వారిద్దరూ గత వివాహబంధాల నుంచి బైటపడి పూర్తి స్వతంత్రులై ఉన్నందున, ఆమె శ్రేయోభిలాషి ప్రముఖ ఆంధ్ర దేశభక్తుడూనైన శ్రీ బులుసు సాంబమూర్తిగారి ఆశీస్సులతో వివాహం చేసుకొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో అలవాటుగా జరిగే ఆలస్యాన్ని ఆమె సహించలేకపోయింది. ఉప్పెనగాలిలాగా ఆమె దేశమంతా తిరిగింది.గాంధీయుగంలో ప్రారంభించబడిన అన్ని సేవా సంస్థలను ఆమె దర్శించి వాటి నిర్వాహకులకు కావలసిన పూర్తి సహకారాన్ని అందిస్తూ వాటిని సంస్కరించి అభివృద్ధి పరచటానికి కావలసిన పథకాలను తయారుచేసి సాధ్యమైనంత ఎక్కువ సహాయాన్ని వారి కందించటానికి వాగ్దానాలు చేసింది. రాష్ట్రాలలో అందుకు సంబంధించిన మంత్రులనుకలుస్తూ కేంద్రంనుంచి మ్యాచింగ్ గ్రాంటును ప్రకటిస్తూ అందుకనుగుణంగా తగినంత మేరకు గ్రాంటు మంజూరు చేయవలసిందిగా వారిపై వత్తిడి తెచ్చింది.

కావూరు వినయాశ్రమం, రాజమండ్రి మహిళా సేవా సదనం, గుంటూరు శారదా నికేతనం, సీతానగరం సత్యాగ్రహాశ్రమం, నెల్లూరు కస్తూరిదేవి పాఠశాలలు చేసిన త్యాగాలు, పడుతున్న బాధలు ఆమెకు తెలుసు. సాధారణ నిర్వహణాభారాన్ని మోయటానికి తగినంత సహాయమై నా ఈ సంస్థలకు తక్షణమే అందవలసి ఉండగా, సకాలంలో సహాయం అందకుండా నిబంధనలు ఎలా అడ్డు నిలుస్తున్నాయో ఆమె గ్రహించారు. ఇంతకు ముందే స్థాపించబడిన సేవా సంస్థల నిర్వహణ కుంటుపడకుండా ఉండటానికి, నిజాయితీ పరులైన నిర్వాహకులకు తోడ్పడేటందుకుగాను ఆమె అప్పటివరకూ అనుసరిస్తూ ఉన్న నిబంధనలను ప్రక్కకు నెట్టి తక్షణ సహాయాన్ని అందించటానికి పూనుకొన్నారు. స్వరాజ్యమొచ్చిన తరవాత ప్రజలందించే విరాళాలు ఆగిపోవటంతో ఇబ్బందులపాలైన ఈ సేవాసంస్థల సహాయానికి జరిగిన తొలి ప్రయత్నం ఇది.

నిష్కామంగా ప్రజలకు సేవలనందిస్తూ, ఆర్థిక తోడ్పాటు లభించవలసిన స్థితిలో ఉన్న సంస్థలకు కావలసిన నిధులను సమకూర్చవలసిందని ఆమె కేంద్రంలోని మంత్రులతో అనేక సందర్భాలలో ఘర్షణపడ్డారు. సాంప్రదాయాలను లెక్కించకుండా ఆమె చేస్తున్న

ఖర్చులమీద ఆడిటర్-జనరల్ అనేకమార్లు విరుచుకు పడటం జరిగింది. పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉన్న నేను ఆయా సందర్భాలలో ఆమెను ఆ విమర్శలనుంచి ఆదుకునేందుకు ముందుకు రావలసి వచ్చింది.

కార్యదర్శులు, పరిపాలనా విభాగం, నిబంధనల పేరుతో కాలయాపన చేస్తుంటే విసుగు చెందిన ఆమె రాజీనామాకు సిద్ధపడింది. ఒక మంత్రివర్గ సభ్యుడు దానిని అడ్డుకొనగా రాజీనామా ఆమోదింపబడలేదు. అయితే తన మంత్రివర్గ సహచరులతోను కార్యదర్శులతోను సేచీపడకుండా ఉండేందుకుగాను జవహర్లాల్ నెహ్రూగారు ఆమె రాజీనామాను తుదకు ఆమోదించారు. మన జాతీయ ప్రణాళికలో సాంఘిక సంక్షేమం స్థానం చాలా గొప్పది. అందుకు కారణం ముందాలోచన, ఉన్నత మానవతా విలువలు కలిగిన సమర్థురాలైన సోషల్ వెల్ఫేర్ బోర్డు తొలి అధ్యక్షురాలు శ్రీమతి దుర్గాభాయ్ గారే.

మధ్యతరగతి కుటుంబాలలోని స్త్రీలు డబ్బును ఎంత పొదుపుగా వాడుకుంటారో, వడ్డీ వ్యాపారుల మూలకంగా వారు ఎంత నష్టపోతుంటారో, ఎంతో అపురూపంగా తాము భావించుకొనే విలువైన తమ ఆభరణాలను పెండ్లిండ్లకు, పండుగలకు తాకట్టు పెట్టవలసిరావటం తమకు ఎంత హృదయవిదారకమైన సంగతో ఎక్కువగా వారిమధ్య గడిపిన దుర్గాభాయ్‌కి తెలుసు. అందుకు మార్గంగా ఆమె 1953-54 సంవత్సరాలలో "నేషనల్ కౌన్సిల్ ఫర్ ఉమెన్స్ సేవింగ్స్"ను ఏర్పరచింది. ప్రముఖ సంఘసేవకురాలు, తనతో కలిసిజైలు జీవితం గడిపిన శ్రీమతి భారతీదేవి రంగాగారిని ఈ విషయంలో తనకు తోడ్పడవలసిందని కోరగా సంతోషంగా ముందుకు వచ్చి ఆంధ్రా బ్రాంచిని ఏర్పరచారు. శ్రీమతి దుర్గాభాయ్ దేశాభిమానులైన స్నేహితుల నుంచి, గాంధేయవాదులైన సహచరుల నుంచి ఎక్కువ తోడ్పాటును పొంది "మహిళల చిన్న మొత్తాల పొదుపు" ఉద్యమాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లటమే గాకుండా ఇటు మహిళలకు అటు ఆర్థిక మంత్రిత్వానికి కూడా చెప్పుకోదగినంతగా ఉపయోగపడ్డారు.

మనదేశం చూడటానికి వచ్చే మేధావులు కలసుకోవటానికి ఒక జాతీయ కూడలి స్థలంగా "ఇండియా - ఇంటర్నేషనల్ సెంటర్"ను ఏర్పరచేందుకు దుర్గాభాయ్, దేశముఖ్ గారలు ఇద్దరూ కలసి పథకాన్ని తయారు చేసారు. వారు ఇందుకుగాను భారతదేశంలోని అనేక ప్రభుత్వ సంస్థల నుంచి, ఇతర స్వచ్ఛంద సంస్థలనుంచి, విదేశాల నుంచి విరాళాలను ప్రోగుచేసి, లోడీ గార్డెన్స్ ప్రక్కన పెద్ద కేంద్రాన్ని నిర్మించారు. దక్షిణ భారతదేశ అవసరంకోసం ఇలాంటి మరో కేంద్రాన్ని హైదరాబాదులో నిర్మించటానికి వారు పూనికతో పనిచేశారు. డజన్లకొద్ది పేరుగాంచిన ఆయా పండితులు ఆచార్యులు, శాస్త్ర పరిశోధకులు ఇక్కడకు వచ్చి ఈ దేశంలో ఆయా రంగాలలో ప్రముఖులైనవారితో సంబంధాలనేర్పరచుకుంటూ ఉండేవారు.

ఆ అదృష్టమేమో కాని అర్హులైన ఈ ఇద్దరూ భారత దేశాధ్యక్షునిచే "పద్మ విభూషణ్" బిరుదాంకితులు కాగలిగారు.

16

ఈశ్వరదత్తు

శ్రీ ఈశ్వరదత్తు స్వభావరీత్యా వృత్తిరీత్యా గూడా మంచి పట్టుగలిగిన పత్రికా రచయిత. 1926లో ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగారి వద్ద సహాయకులుగా ఉన్నప్పుడు, ఆ తరువాత సి.ఆర్.రెడ్డిగారు ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్నప్పుడు గూడా ఆయనను నేను కలుసుకున్నాను. జరుగుతున్న సంఘటనలపై రచయితగా ఆయన వ్యాఖ్యలు, ప్రముఖ జాతీయ నాయకుల గురించిన ఆసక్తిదాయకమైన కబుర్లు, పార్లమెంటు సభ్యులను గురించి ఉత్తేజపరిచే సంగతులు, పండితుల భావ ఛాందసాల గురించి పత్రికా రచయితగా ఆయన మాట్లాడుతుంటే, ఎంతో ఆనందంగా నేను వినేవాడను. పత్రికా రచయిత శ్రీ ఈశ్వరదత్తు ఏ రంగంలోనైనా సరే ఆయన తెలుసుకొన్న విశేషాలను, నాయకుల లోటుపాట్లను, ఏ విషయంలోనైనా ఆయన ముఖ్య మనుకొన్నవాటిని జ్ఞాపకాల పారల్లో అలాగే ఉంచి టేప్ రికార్డర్ లాగా భద్రపరచి ఎప్పుడైనా తడుముకోకుండా వివరించగలగడం ఆయనకో వరం. ఆ తరవాత చింతామణిగారు అలాగే ఉండేవారు. శక్తిమంతమైన "సైసీర్" ఆంగ్ల దినపత్రికకు సంపాదకులుగా మంచి పేరు తెచ్చుకొన్న తరవాత, ఆయనను అలహాబాదునుంచి వెలువడే ఆంగ్లదినపత్రిక "ది లీడర్" కు సంపాదకులుగా పనిచేయవలసిందిగా ఆహ్వానించారు.

అలహాబాదులో ఉండేటప్పుడు సర్ తేజ బహద్దూర్ సప్రూ శ్రీ సి.వై.చింతామణి గార్లతో సన్నిహితంగా మెలుగుతూ అవసరమైన అనేక విషయాలను గ్రహిస్తూ ఉండేవారు. సప్రూ ఆస్థానంలో, నెహ్రూల, కట్జూల, కుంజ్రూల, టాండన్ల మరి అనేకమంది ఇతర రాజకీయ నాయకులకు సంబంధించిన ఆసక్తిదాయకమైన ముఖ్యాంశాలను తెలుసుకొంటూ ఉండేవారు.

ఆ రెండు దశాబ్దాల కాలంలో ప్రముఖ పత్రికా సంపాదకులైన కోటంరాజు సోదరులు, పున్నయ్య, రామారావులు వేధింపులకు గురౌతూ జైలుశిక్షలను భరిస్తూ బ్రిటిష్ పాలనను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పక్షాన నిలిచి పోరాడారు. ఈశ్వరదత్తు స్వరాజ్యంకోసం తన వాదనను కొనసాగించారు. అది లిబరల్ వర్గ నాయకులు శ్రీ సప్రూ జయకర్ తానూ కలసి ఐక్యంగా చేసిన పని లిబరల్స్ దేశభక్తిమీద ఈశ్వర్‌కు పూర్తి విశ్వాసముంది. బ్రిటిష్‌వారు కల్పించిన చట్టాలకు లోబడి వారి పరిమిత స్వాతంత్ర్య పద్ధతిలో పది సంవత్సరాలపాటు కొనసాగించిన లిబరల్స్ రాజకీయాధికారాన్నిగూడా ఆయన మనస్ఫూర్తిగానే సమర్థించారు. దేవ స్వాతంత్ర్య కృషిలో, తన ధీశక్తి ద్వారా, పత్రికా రచయితగా పొందిన సామర్థ్యం ద్వారా, లిబరల్స్ చేస్తున్న ప్రయత్నాలకు తన పూర్తి తోడ్పాటు నందించారు. భారత దేశం కోసం వారు చేస్తున్న ప్రయత్నాలలో తనకున్న పూర్తి విశ్వాసాన్ని, దేశభక్తులైన లిబరల్స్ మధ్య ఉన్న గొప్పవారిని గురించి పరిశుద్ధమైన ఆంగ్లభాషలో చక్కని చిత్రీకరణంతో కూడిన వ్యాసాలను, వ్యాఖ్యలను ఆయన ప్రచురించారు.

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, రాజకీయ రంగాన్ని గురించి, అక్కడ పని చేస్తున్న వ్యక్తుల గురించి ఓటరుకు సరైన రాజకీయ అవగాహనను కలిగించేందుకు పత్రికారంగంలో ప్రముఖులైన పత్రికారచయితల అవసరం ఎంతైనా పెరిగింది. ఈ స్థితిలో ఈశ్వరదత్తు, రామారావు గార్లపై పెక్కుమంది దృష్టి పడింది. ఢిల్లీ నుంచి వెలవడే శక్తివంతమైన పత్రిక "హిందూస్తాన్ టైమ్స్" పత్రిక సంపాదకవర్గంలోనికి వీరిద్దరినీ ఆహ్వానించారు. కృపానిధి, దుర్గాదాస్‌గారలు కాంగ్రెస్ మంత్రి వర్గంమీద, నాయకులమీద స్నేహపూర్వకమైన విమర్శనందిస్తూ, స్వతంత్రపథంలో వారు చూపిన విధానాన్నే అనుసరిస్తూ ముఖ్యరచయితలుగా గొప్పగుర్తింపును పొందగలిగారు. ఈశ్వరదత్తు లఘువ్యాఖ్యలను అందించటంలో, మంగళకరమైన వాక్యాలను సంధించటంలో, భవిష్యత్కాధనాలను కూర్చటంలో, ప్రజారంగంలో ఉన్నవారి ఆలోచనలపై పనులపై వ్యాఖ్యల నందించటంలో సిద్ధహస్తుడు. ఆయనకు అభిమానం ఉన్న వారితోనే గాకుండా అందరితో గూడ అభిమానపూర్వకంగా వ్యవహరిస్తూ ఉండేవారు. యువకులను ఉత్సాహపరుస్తూ వారికి మార్గదర్శకులుగా ఉండేరీతిలో తన కలంతో చక్కటి రచనం నందిస్తూ ఉండేవారు. ఈశ్వరదత్తు ఈ భూమిమీద తానున్న ఆఖరిరోజులవరకు, పార్లమెంటు చర్చలపై అత్యంత అభిమానంతో, పార్లమెంటులోని ప్రత్యర్థులైన ఒకరిపై మరొకరు వాదప్రతివాదాలను విసురుకొంటూ పరస్పరం కలహిస్తూ కాలంగడపకుండా చేయటానికి తగు పరిష్కార మార్గాలను, ఆ సమయానికి కావలసిన వాటిని అన్వేషిస్తూనే గడిపారు. ఆయన తనను అభిమానించే వారితోను, వ్యతిరేకించేవారితోను గూడా సామరస్యంగా స్నేహపూర్వకంగా మెలగుతూ సర్వజన సమ్మతంగా ఉండేవారు. తన స్నేహితులతోను, రాజకీయాభిమానులతోను ఆయన సర్వసమభావంతో మెలగుతూ ఉండేవారు. జాతీయభాషగా ఇంగ్లీషు స్థానాన్ని బలపరుస్తూ ఫ్రాంక్ ఆంథోని పార్లమెంటులో చూపెట్టిన నైపుణ్యాన్ని, రైతాంగంతో నిండిఉన్న గ్రామీణ ప్రాంతాలలోని నా ప్రయత్నాలను ఆయన కొనియాడారు. ఆయన ఎప్పుడూ క్రొత్త అభిమానులను సంపాదించుకోవటానికి ప్రయత్నిస్తూ ఉండేవారు. క్రొత్తనాయకులను ముందుకు తెస్తుండేవారు. ఆయన సామర్థ్యం అంతటిది. కొన్ని సమయాలలో ఆయన గదులలో నేను, వారి విధానాలతో నేను అంగీకరించలేని మంత్రులతో కలుసుకోవలసి వచ్చేది. ఏ ఒక్కరికి ఇబ్బంది కలుగని రీతిలో ఆయా సందర్భాలలో ఆయన వ్యవహరిస్తూ ఉండేవారు. నామీద అన్నివేళలా ఆయన సదభిప్రాయంతో ఉండేవారు. తనకభిమానులైన మంత్రులవద్ద ఆయన పార్లమెంటులోని నా ప్రసంగాలను పొగడుతూ వారిని కవ్విస్తూ ఉండేవారు. అలా వారిని రెచ్చగొడుతూ తనకు కావలసిన సమాచారాన్ని రాబట్టుకొనేందుకు ప్రయత్నిస్తూ ఉండేవారు. ఆయన కది ఇష్టం ఎందుకంటే స్వతహాగా ఆయనే పత్రికా రచయిత.

"మై పోర్ట్రయిట్ గ్యాలరీ" 1959 అన్న ఆయన గ్రంథంలో నుంచి తీసుకొన్న ఈ క్రింద ఉదహరించిన సంగతులు, ఆయన చెప్పిన దానిలోని గొప్పతనానికే కాక "ఒక మాటలో, ఒక దృశ్యంలో" అన్నట్లు ఆయన మాటల్లో ఆనాటి ప్రముఖ హీరోలను దీపం పెట్టి ఆ పుస్తకం మనముందుంచుతుంది.

ఆయన "పోర్ట్రయిట్ గ్యాలరీ" లో కలం చిందించిన ప్రేమ వెలుగుల మిశ్రమపు సాగసైన విసుర్లలో ఇవి కొన్ని.

1. ఖాసాగారి గురించి : "భారతదేశంలో ప్రస్తుతమున్న సంపాదకులలో ఆయనతో సమానులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు. అధికులెవరూ లేరు. పాండిత్యపరమైన వస్తు సామగ్రితో, నిపుణత్వంతో కూడిన చేతి కదలికతో ఆలోచించే వాడి సహజరూపాన్ని పట్టుగలిగిన మహాశిల్పిలాగా ఆయన మన ముందుకువస్తాడు. ఆయన వ్రాతల్లో ప్రత్యేకంగా మనకు కనిపించే అరుదైన వస్తువు - శీలం (పేజి 154-5)

2. కృపానిధి గారి గురించి : "ఆయన శాంతమే ఆయనకో నిధి. శుభ్రమైన వినోదం, భావప్రకటనలోని తేటదనం, ఇంపైన రీతి, చమత్కారంతో కూడిన హాస్యం, తీవ్రమైన అభిప్రాయాలను కూడ మృదువైన మాటల్లో చెప్పగలిగే చమత్కృతి - ఆయన ముఖ్యసుగుణం యదార్థం; ఆయన అందించే గొప్ప బహుమానం స్నేహం". (పేజి 154)

3. సి.ఆర్.రెడ్డిగారి గురించి : "ఆంగ్ల భాషా నిష్ణాతులైన ఆయన చమత్కార శబ్దాలను, పిట్ట కథలను చెప్పటంలో ఆయనకు ఆయనే సాటి. స్వంత ఆలోచనతో విజ్ఞానదాయకమైన ఆలోచనను ఆయన మనముందుకు తీసుకొచ్చారు. ఆయన భావప్రకటనా రీతి అసమానం" (పేజి 145)

4. దేశోద్ధారక నాగేశ్వరరావుగారి గురించి : "పూర్తిగా స్వయంకృషితో పైకొచ్చిన మనిషి. సంపదను చూసి ఆయన ఎప్పుడూ పొంగిపోలేదు. దానధర్మాలు ఆయనను క్రుంగదీయలేదు. ఆయన పేరు ప్రతి ఇంటా అనుకునే ఒకమాట" (పేజి 142)

5. వీరేశలింగంగారి గురించి : "వేదరికంతోను ఒంటరిగానూ ఉన్న ఆయనను ఆదుకునేందుకు ఏశక్తి ముందుకు రాలేదు. ఆయన బాధలన్నింటిలోను, ఆత్మ విశ్వాసంతో దృఢచిత్తంతో ఎదురీదారు" (పేజి 139)

6. సర్వేపల్లి రాధాకృష్ణగారి గురించి : "యుగ యుగాల్లో సంభవిస్తున్న మార్పులను గమనించి ఆయనకున్న పాత విశ్వాసాలలోనుంచి క్రొత్త దనానికి తగు విధంగా మారగలగటం ద్వారా ఆయన ముందుకునడిచారు. ఎక్కడో అరుదుగా మాత్రమే కనుపించే దీర్ఘదృష్టిలోచనాధోరణి, లోతైన అవగాహనాశక్తి ఆయనను గొప్ప ప్రయోజనాల కోసం ఉన్నతమైన ఆలోచనలవైపు నడిపించాయి." (పేజి 101-102)

7. శ్రీమతి సరోజని నాయుడుగారి గురించి : "ఆమె భారతదేశంలో అవతరించిన ఒక శక్తి స్వరూపం". ఒక ప్రీకరుగా ఆమె మనకందనంత ఎత్తుకు ఎదిగారు. మాటకారితనంలో ఆమెకు తోడు ఆమె. గాంధీజీ మాటల్లో "ఆమె వీణను - అవతల పారవైచి శిలువను నెత్తికెత్తుకున్నారు" (పేజి 135)

8. సర్దార్ పటేల్ గారి గురించి : "అధికారంలో ఉన్నప్పుడు తిరుగులేని శక్తిగా, ఒక మెరుపులాగా ప్రకాశించిన మనిషి సర్దార్ పటేల్"

17

గాంధీజీ

(నా దృష్టి పథంలో బాపు)

ప్రార్థన సమయాల్లో మనమధ్య ఉన్నప్పటి, గాంధీజీ మాత్రమే మనకు "బాపూ" లా దర్శనమిస్తారు. మిగతా సమయాల్లో, సాధారణ రీతిలో అందరిలాగే, చమత్కారాంతో, హాస్యోక్తులతో నవ్విస్తూ, ప్రతి ఒక్కరినీ ప్రేమతో పలకరిస్తూ ఉండేవారు. ప్రార్థనకు ఉపక్రమించగానే, ఆయన మననుంచి విడివడి, ఒక ఉపాసకునిలా, ఆత్మసంశోధనలో ఐక్యం అవుతూ ఉండేవారు.

ఒక్కొక్కప్పుడు ప్రార్థనా స్థలానికి ఆయనవెంట, నేనూ నడిచివెళుతూ ఉంటాను. ఇతర సమయాల్లో అభిమానులమధ్య, నేనూ ఒకడిగా కూర్చుంటూ ఉండేవాడిని. మాస్థలాల్లో మేము కూర్చున్న తరవాత, జేగంట మ్రోగి ప్రార్థనా సమయాన్ని తెలియజేసేది.

దివ్యత్వం మూర్తీభవించిన మహామనీషి !

రాంధున్ వంటి భజనగీతాలు, పాటలవంటి కార్యక్రమాల్లో గాంధీజీ మనమధ్య ఎక్కువ సమయాన్ని గడుపుతూ ఉండేవారు. నిశ్శబ్దత పాటించే ప్రార్థనల మధ్యమాతో పాటే, కలిసేవారు. భక్తబృందంలో "భక్తాగ్రేసరుని"లా ఆయన ఉంటూఉండేవారు.

ధ్యానంలో ఉండగా గాంధీజీని, నేను చాలాసార్లు చూడడం జరిగింది. ఆయన ఆ సమయంలో శుష్కించిన వయోవృద్ధునిలా గాకుండా, ధ్యానముద్రలో కూర్చుని ఉన్న స్థితినుంచి మూడడుగుల ఎత్తులో, దివ్యతేజంతో, ఉదాత్తభావనతో సంలీనమై, నిశ్చలస్థితిలో కనిపిస్తూ ఉండేవారు. "బాపూబ్లెసన్" అనే నా గ్రంథం నుంచి ఈ క్రింది మాటలను మీ ముందు ఉంచుతున్నాను.

"తన కరద్వయాన్ని దాని అంచుల వరకూ జాపి, ప్రాతఃకాలపు దివ్యకాంతుల్ని ఆయన తాకగలిగారు. కంచు విగ్రహపు ఆయన ముఖాకృతిలో సాయం సంధ్యలోని సప్తవర్ణాలూ ప్రసరించి, మనపై వెలుగురేకల్ని విరజిమ్ముతూ ఉండేవి".

"మన ప్రజల భావావేశాన్ని, జాతీయ భావనలో పెనవేసి మనలను, ముందుకు నడిపించిన మహాత్ముడాయన!" అందువల్లనే, ఆయన సహచర్యంతో నేను ధైర్యవంతునిగా, దృఢంగా రూపొందగలిగాను.

ప్రతిదినమూ ప్రార్థన చేసే సమయంలో 'బాపూ' నా మదిలో మెదులుతూ ఉంటారు. ఆ పాటల్లోని మాధుర్యం ఇప్పటికీ, నా చెవుల్లో మారుమ్రోగుతూనే ఉంటుంది.

హరిజనోద్ధరణ, హరిజనుల దేవాలయ ప్రవేశం, అంటరానితనం నిర్మూలన, ఖాదీ ఉత్పత్తి, గ్రామీణ పరిశ్రమలను గురించి ప్రచారంచేస్తూ, స్వరాజ్య సాధనకు, సహాయనిరాకరణ

ఉద్యమాన్ని తీవ్రతరంచేస్తూ, గాంధీజీ దేశమంతటా విస్తృతంగా పలుమార్లు పర్యటించారు. గాంధీజీ సాగించిన ఈ సుదీర్ఘయాత్రలు, భారతజాతి నాడీకేంద్రాలైన గ్రామీణప్రాంతాలపై ప్రత్యేక ముద్రనువేశాయి. పల్లెపల్లెలో గాంధీజీ బోధనలు సర్వత్రా వినిపించాయి.

గ్రామీణప్రాంతాలలోని రెండు మూడు తరాల జనం ఆయనను చూడగలిగే అదృష్టానికి నోచుకున్నారు. నేటితరం యువకులూ, విద్యార్థులూ గాంధీజీని గురించిన కథలను, గాథలను, జాతికి ఆయన తెలియజెప్పిన కఠోర సత్యాలను తమ తల్లితండ్రులద్వారా వింటూ తరించగలుగుతున్నారు.

గాంధీజీలో ఉన్న గొప్ప ప్రత్యేకత

నా స్వగ్రామమైన నిడుబ్రోలుకు ఆయన 1929లోనూ, 1933లోనూ వచ్చారు. అదొక మహద్భాగ్యం! నేనూ, నా శ్రీమతి భారతీదేవి, మా గ్రామస్థులతోపాటు, ఆయనకు స్వాగత సత్కారాలు అందించేందుకు మద్రాసు నుంచి వచ్చాం. మా యింటికి ప్రత్యేకంగా విచ్చేసి, తానూ, తన బిడ్డలు అందజేసిన పూలదండలను, ధనాన్ని గాంధీజీ స్వీకరించినప్పుడు మా తల్లిగారు ఎంతగానో ఆనందించింది. ఆయన అడుగుబెట్టిన అన్ని గ్రామాలలోని, కుటుంబాల ప్రజలందరూ ఇలాగే ఆనందించారు.

ఆయన మాట్లాడే హిందీభాష మన ప్రజల్లో ఎక్కువమందికి అర్థమయ్యేదికాదు. అయినప్పటికీ ప్రజలు అదేమీ పట్టించుకునేవారుకాదు. "ఆయన మన మధ్య ఉన్నాడు. అంతే చాలు. ఆయన్ని దర్శించాం!" అని సంతృప్తిపడేవారు. గాంధీజీ కొనసాగిస్తున్న స్వాతంత్ర్య సమరం, అట్టడుగు వర్గాల సముద్ధరణకై సాగిస్తున్న కృషి, ఆయనలోని మానవతావాదం ప్రజలందరికీ తెలుసు. ప్రతి ఒక్కరికీ జీవనభృతి, వసతి, తిండి, బట్ట, స్వతంత్రత, చేకూరాలనీ, ప్రజలందరూ సాంఘిక స్వేచ్ఛా, సమానత్వాలతో జీవించడం గాంధీజీ ఆశయం. శ్రీరాముని వంటి మహాపురుషులు బోధించి, ఆచరించిన ధర్మాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలని, గాంధీజీ మనందరకూ ఉద్బోధించారు.

గాంధీజీ కాలినడకన వెడుతున్నా, కారులో ప్రయాణిస్తున్నా వేలాది మంది ప్రజలు రోడ్లవెంట బారులు తీరి, ఆయన దర్శనం కోసం నిలిచిఉండేవారు.

ఆయన బోధించిన అనేక ప్రవచనాలు ఇప్పటికీ నిలిచి ప్రవర్థమానంగా వర్ధిల్లుతూనే ఉన్నాయి. దాచుకోకుండా, ఇవ్వడం ఎలాగో చిన్నవారికి నేర్పవలసిందిగా, పెద్దవారిని ఆయన కోరుతూ ఉండేవారు. ఎందరో బాల బాలికలు తమ వద్దనున్న బంగారు నాణేలను స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాలకు తనకు సమర్పించడాన్ని ఈసందర్భంలో మహాత్మాగాంధీ గమనించారు.

ఒక సారి మేము రైలులో ప్రయాణంచేస్తూ, విజయవాడ సమీపిస్తూ ఉండగా 'మనీ' అనే మాటను తెలుగులో ఏమంటారని గాంధీజీ నన్ను అడిగారు. దాన్ని 'డబ్బు', 'డబ్బు' అని మహాత్ముడు అడిగినంతనే, ప్రజలు మంత్రముగ్ధుల్లా తమ దగ్గర ఉన్నదంతా దానం చేసారు. అవి కొన్ని వేలరూపాయలయ్యాయి.

బుద్ధుని అవతారం

భారతదేశమంతటా నేను పర్యటిస్తున్నప్పుడు, గాంధీజీ పట్ల ప్రజలలో వీర్పడివున్న భావాలను రకరకాల వారి అభిప్రాయాలను ఆయన దర్శించిన ప్రాంతాలను, గర్వంగా చెప్పుకోవడాన్ని నేను గమనించాను. ఏ ఏ ప్రదేశాల్లో గాంధీజీ ఆగి, ప్రసంగించారో, బుద్ధభగవానుని వలె మానవతా వాదాన్ని ప్రబోధిస్తూ, తన అమృత వాక్కులను నలుదిశలా ఎలా వ్యాపింపజేసారో, ప్రజలు కథలు కథలుగా చెప్పుకునేవారు. రాముడు జన్మించిన ఈ పవిత్ర భూమిలో గాంధీజీ పాదయాత్రలు జరిపి, ప్రేమభావంతో కూడిన ధర్మాన్ని 'మానవసేవే మాధవసేవ' అనే బంగారు బీజాలు ఆయన బోధనల ద్వారా దేశమంతటా నాటబడ్డాయి. ఆయన అడుగుజాడలు పడ్డ ప్రతిచోటా స్వాతంత్ర్యం, సోదరభావం, మానవతావాదం అనే ముద్రలు ప్రజలు హృదయాలపై వత్తుకొని వారిని సౌభ్రాతృత్వం వైపు నడిపించాయి.

గాంధీజీ హైందవ ధర్మశాస్త్రాలను, పురాణసంహితలను విశ్వసించేవారు. అయితే తామే అందరికంటే అధికులమనే అహంకారధోరణిని అంగీకరించేవారుకాదు. ఎవరైనా పాండితీవేత్తలు అస్పృశ్యత శాస్త్ర బద్ధమేనంటూ వాదించినప్పుడు గాంధీజీ వారిని తీవ్రంగా ఎదుర్కొనేవారు. "ఆ విధంగా మీరు విశ్వసిస్తున్న మతం హిందూమతం కాదు, కాకూడదని", గాంధీజీ ప్రకటించారు. "సర్వేజనా స్సుఖినోభవంతు" అన్నదే సర్వసమ్మతంగావాలని ఆయన విశ్వసించేవారు. ప్రజలందరూ మతసహనాన్ని అలవర్చుకోవాలని ఆయన కోరేవారు. ముస్లింల మతపరమైన విశ్వాసాలను కాపాడేందుకు, వారి మతాచారాలకు హాని జరక్కుండా ఉండేందుకు గాంధీజీ అనేకమార్లు ప్రాణత్యాగానికి కూడా సిద్ధమైనారు. కొన్ని సందర్భాలలో నిరాహార దీక్షలకు కూడా పూనుకున్నారు. ప్రజలందరికీ జీవనభృతి ఉండాలనీ, స్వయం ఉపాధికలిగి, చేతి వృత్తులను చేపట్టాలనీ, అప్పుడే ఆత్మగౌరవం దెబ్బతినకుండా, స్వయం సమృద్ధిని సాధించగలరనీ, గాంధీజీ విశ్వసిస్తూ ఉండేవారు. అందుకు ఆయన కుటీరపరిశ్రమలను ఖాదీ, వృత్తులను ప్రోత్సహించారు. ఖద్దరు ఉత్పత్తిబాగా అభివృద్ధి పరచాలనీ, చేనేత కార్మికులను సైతం ఆయన ఆదుకున్నారు. ఆధునిక మూలయంత్రాం ధాటికి తట్టుకోలేక, వృత్తులు కోల్పోయిన చేనేత కార్మికులకు ఆయన అండదండలనిచ్చారు.

గాంధీజీ కంటికి నచ్చిన ఫలం – రైతు !

రైతు, ఆయనకు నేత్రానందాన్ని కలిగించిన 'ఫలం' వంటివాడు. గాంధీజీ దృష్టిలో రైతులక్షేమం అంతటి విలువైనది. ఎలాంటి రాజకీయ విధానాన్ని ఆయన అవలంబించదలచుకున్నా, ఆ విధానం రైతులకు మేలు చేస్తుందా, నష్టాన్ని కలిగిస్తుందా అనే ప్రాతిపదికలో మాత్రమే దాన్ని ప్రశ్నించుకొని, సరియైన సమాధానం లభించిన తరవాతనే ఆయన ముందుకెళ్లేవాడు.

రైతు సంక్షేమానికి, స్వయం ఉపాధికి, ఆత్మగౌరవానికి ఉపయోగపడే అంశం తన ముందు ప్రతిపాదించినప్పుడు, గాంధీజీ దాన్ని నిర్ద్వంద్వంగా బలపరిచేవారు.

సంస్థాపరంగాగానీ, వ్యక్తిపరంగాగానీ, ఏ రూపంలోనైనా 'దోపిడీ' చేయడాన్ని ఆయన పూర్తిగా వ్యతిరేకించేవారు. అందువల్లనే జమిందారీ విధానాన్ని రద్దుచేయడం, వెట్టిచాకిరీ పద్ధతిని తొలగించడంవంటి మా కోర్కెలకు ఆయన మద్దతునిచ్చారు.

పేదరికంతో క్రుంగిపోతున్న రైతాంగంపైగానీ, కూలీలపైగానీ ఎలాంటి అదనపు భారాన్ని మోపరాదనీ, ఆ విధానం అన్యాయమైనదనీ గాంధీజీ భావించేవారు. అందుకే ఆయన భూమిశిస్తును, ఉప్పు పన్నును వ్యతిరేకించారు. వ్యవసాయ ఉత్పత్తులను, గిట్టుబాటు ధరలకు మార్కెట్‌లో స్వేచ్ఛగా అమ్ముకునేందుకు వీలుపడని కంట్రోలు విధానాన్ని ఆయన వ్యతిరేకించారు. నిత్యావసర వస్తువులను పండించే రైతులపై అధికారుల జులుం, పేదలైన వినియోగదారులనుంచి అదనంగా దోపిడీ చేయడం, ప్రభుత్వయంత్రాంగం అవినీతికి పాలుపడే కంట్రోలు విధానం సర్వత్రా అరిష్టదాయకమని ఆయన గుర్తించారు. అదే సందర్భంలో వ్యాపారవర్గాల, వడ్డీ వ్యాపారుల దోపిడీ నుంచి రైతాంగాన్ని రక్షించాలని కూడా ఆయన కోరారు. కాంగ్రెసు ప్రభుత్వాలు చేపట్టిన రుణ విమోచన చట్టాలను, నేను సూచించిన వ్యవసాయ రుణాల మాఫీ డిమాండ్‌ను ఆయన ప్రశంసించారు.

భూములను రైతు కౌలుకు తీసుకునే సందర్భంలో, కౌలు నిర్ధారణ, కౌలుకాలం, చట్టబద్ధంగా ఉండేట్లు తగు ఏర్పాట్లు జరగాలని కూడా గాంధీజీ సూచించారు. జమిందారీ విధానం అంతరించిన తరువాత కూడా, భూమిపై యాజమాన్యం కలిగి, స్వంతంగా సాగు చేయకుండా, భూములను కౌలుకుయిస్తూ, కౌలు దారులనుంచి మోయలేని కౌలురేట్లు వసూలు చేసే భూకామందుల విపరీతమైన కోర్కెలను గాంధీజీ వ్యతిరేకించారు. సమంజసమైన కౌలు రేట్లు మాత్రమే నిర్ధారించాలన్న కౌలు దార్ల న్యాయమైన కోర్కెలను ఆయన బలపరిచారు. వ్యవసాయ కూలీలకు పని హక్కుకు గ్యారంటీ ఉండాలనీ, న్యాయమైన కూలిరేట్లు ముట్టజెప్పాలనీ, పని సమయంలో మానవునికి అవసరమైన కనీసపు అవసరాలు కల్పించాలనీ ఆయన భావించేవారు. అందుకు ఆయన రూపొందించిన కిసాన్, మజ్‌దూర్ ప్రజారాజ్య ఆదర్శాలను ప్రకటించారు.

స్వయవృత్తులలో జీవించే రైతులకు భూములపై యాజమాన్య హక్కులు ఉండాలని మొత్తం మీద గాంధీజీ అంగీకరించారు.

పారిశ్రామిక కార్మికులను గురించి.....!

పారిశ్రామిక కార్మికులకు, పరిశ్రమలలో మెరుగైన పనివిధానాన్ని కల్పించాలనీ, యజమానుల దోపిడీకి గురికాకుండా తగు రక్షణలు ఏర్పరచాలనీ, పరిశ్రమల లాభాల్లోకూడా వారికి భాగస్వామ్యం కల్పించాలనీ, గాంధీజీ ఎంతగానో పాటుపడ్డారు. యజమానులు, కార్మికుల సంయుక్త కమిటీలద్వారా, పరస్పర సంప్రతింపులద్వారా, మధ్యవర్తిత్వం ద్వారా కార్మికులకు జీతాలు, ఇతర సౌకర్యాలు నిర్ణయింపబడాలని ఆయన భావించారు. ఒక్కమాటలో చెప్పాలంటే దోపిడీ విధానానికి దూరంగా పరిశ్రమలు నిర్వహింపబడాలనీ, న్యాయమైన పద్ధతిలో అభివృద్ధి చెందాలనీ, ఆయన ఆకాంక్షించారు.

అహింసాయుత పద్ధతిద్వారా భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని సంపాదించిన గాంధీ విధానం ప్రపంచ ప్రజల ప్రశంసలను పొందింది. ప్రపంచ యుద్ధం ముగిసిన తరవాత ఆసియా, ఆఫ్రికా ఖండాల్లో సాగిన స్వాతంత్ర్య పోరాటాలకు గాంధేయమార్గాన్ని ఆదర్శంగా స్వీకరించారు. స్వాతంత్ర్యం కోసం మానవ హక్కులకోసం పోరాడుతున్న దేశదేశాల్లోని స్వాతంత్ర్య ప్రియులకు గాంధీ మార్గం ప్రేరణనిచ్చింది. అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో మార్టిన్ లూథర్ కింగ్ నాయకత్వాన స్వేచ్ఛ కోసం పోరాడుతున్న నల్లజాతులవారికి, ఆసియా, యూరపు ఖండాల్లో నియంతృత్వ రాజ్యాలకు వ్యతిరేకంగా పోరాటం నిర్వహిస్తున్న ప్రజలకు గాంధేయ మార్గం మార్గదర్శకమైంది.

నలుదెసలా ప్రవహించిన రక్తపుటేర్లు!

దురదృష్టకరమైన ఆ జనవరి 30కి కొద్దిరోజాలముందు గాంధీజీని, నేను కలుసుకున్నప్పుడు, ఆయన ఆశ్చర్యపడ్డారు. 'బాపూ బ్లైనస్' అను నా గ్రంధంలో ఆ సందర్భాన్ని గురించి ఇలా వివరించాను.

"ప్రజలు అనుభవిస్తున్న ఈ బాధను గుడ్లప్పగించి చూస్తూ, మీ మధ్య ఎక్కువకాలం, నేను ఇలాగే జీవించాలని అనుకోవడం లేదు. ఈ హత్యలు, దోపిడీలు నన్ను గాయపరుస్తున్నాయి. నా శరీరమంతా రక్తం చెమరుస్తూ ఉంది."

"ఈ కష్టాల్లో మీతోపాటు, మేమంతా పాలుపంచుకుంటామని" నేను వాగ్దానం చేస్తుంటే, బాపూజీ ఆగకుండా తిరిగి ఈ క్రింది మాటలు అన్నారు. "మీ భావాలు మన తోటి వారి నిర్ణయాలు మృదువుగా చల్లగా ఉన్నప్పటికీ, నా హృదయం నిప్పులమధ్య దొర్లుతున్నది. ఈ మంటల్ని ఆపగలిగే శక్తి ఏదీ కనిపించడంలేదు. ఈ దురదృష్టకర ఘడియల్లో ప్రాణం వదులుతున్న ప్రతిజీవీ నెత్తురోడుస్తూ, కోపంతో భగ్నమంటున్న ఆర్తనాదం నా హృదయ తంత్రులపై కన్నీటి చుక్కల్ని రాలుస్తున్నది. ఈ సందర్భంలో నేను కళ్లుమూసుకోవాలనుకున్నాను. కానీ ఎంత ప్రయత్నించినా నా కళ్లు మూతపడడంలేదు. ఈ హఠాత్ పరిణామానికి ఉహించని విభ్రమంవల్ల నా కన్నులలో తడి ఆరిపోయి, కనురెప్పలు బరువెక్కి ఆలా జరిగిఉండవచ్చు. అందుకే కళ్లుమూత బడడం లేదు. అయినా యీ మానసిక వ్యధను తట్టుకోలేక, నిద్రపోవాలనుకుంటున్నాను. అయినా నిద్రపోలేను. కానీ మేలుకొనే నిద్రబోతున్నాను".

ఎప్పటికీ గెలుపు ఆయనదే!

బాపూ విజయాలను నేను మనస్ఫూర్తిగా అంగీకరిస్తాను. సర్దార్ పటేల్ ఆధ్వర్యంలో స్వదేశీ సంస్థానాలు భారత్‌లో విలీనంకావడం బాపూజీ గెలుపే. అణుయుద్ధపు అంచులనుంచి క్రుశ్చేవ్, కెనడీలు తుదిక్షణంలో ఉపసంహరించుకోవడం కూడా బాపూజీ గెలిచినట్లే. గాంధీజీ శాంతి సంఘం ఆధ్వర్యంలో శ్రీ రాజగోపాలాచారి అణుపరీక్షలను నిలుపుచేయించడంకూడా గాంధీజీ విజయాలలోని భాగమే. మార్టిన్ లూథర్ కింగ్ గాంధీమార్గంలో పయనిస్తూ, స్వాతంత్ర్యేచ్ఛకు తనరక్తాన్ని ధారపోయడంకూడా గాంధీజీ గెలుపే! బుద్ధుని నిర్వాణానంతరం, 2500 సంవత్సరాలకు "మహాపరి నిర్వాణాన్ని ఉత్సవంగా జరుపుకున్నట్లే, గాంధీజీ బోధించిన

దయ, స్వేచ్ఛ, మానవత్వం మానవ జాతి ఉన్నంతకాలం ఉంటూనే ఉంటాయి. టాగోర్ అన్నట్లుగా "మనిషిమీద తనకున్న విశ్వాసాన్ని, దేవుడు పుట్టబోయే ప్రతి బిడ్డలో తిరిగి నింపుతూ ఉంటాడు".

మహాత్మాగాంధీ 2

గాంధీజీ పాటించిన అహింసావ్రతదీక్ష శాశ్వతమైనదికానప్పటికీ చాలాశక్తివంతమైనది. గాంధీజీ ఒక వ్యక్తియేనా అని కొంతమంది ఆశ్చర్యపోతూ ఉండేవారు. నా దృష్టిలో మాత్రం ఆయన ఒక వ్యక్తిమాత్రమేకాదు, అంతకుమించి ప్రజలను నడిపించే శక్తికూడాను! అహింసామార్గాన్ని గాంధీజీ స్వయంగా ఆచరించడమే గాకుండా, అనేకమంది ప్రజలకు శిక్షణనిచ్చి, అహింసాదృక్పథానికి వారు బద్దులు కాకపోయినప్పటికీ, సత్యాగ్రహ కార్యక్రమాల్లో పాల్గొనేలా సమాయత్తపరిచి, ఈ మార్గానికి సన్నిహితంగా తెచ్చారు.

గాంధీజీ చేపట్టిన సహాయ నిరాకరణం చాలా శక్తివంతమైన ప్రక్రియ. 1920లో సహాయ నిరాకరణోద్యమాన్ని ఆయన ప్రారంభించి ప్రజలచేత శాసనసభలను, ఎన్నికలను బహిష్కరింపజేశారు. 1924లో బ్రిటిష్ ప్రభుత్వంచే ఏర్పాటు చేయబడిన కౌన్సిల్లలో ప్రవేశించేందుకు కాంగ్రెసు సంస్థకు ఆయన అనుమతి ఇచ్చారు. 1946నాటికి శాసన సభల ద్వారా అధికారాన్ని చేపట్టగలిగే స్థితికి కాంగ్రెసు పార్టీ చేరుకుంది. స్వాతంత్ర్యసమరంలో ప్రతి సందర్భానికి ఒకే పద్ధతిలో సహాయ నిరాకరణాన్ని ఆయన ఉపయోగించలేదు.

బౌద్ధ మతం నుంచి గాంధీజీ ఏమేరకు స్వీకరించారు? అనే ప్రశ్న తలెత్తింది. బౌద్ధం లేకుండా ఇప్పటి హిందూ మతానికి అర్థం ఏమిటి? నేటి హైందవమతం, బౌద్ధమత ధర్మాలను, ఆచారాలను ఎక్కువగా తనలో ఇముడ్చుకొని నడుస్తున్నది. కేవలం బుద్ధుని నుంచిమాత్రమే గాకుండా, ఆయన తరవాత వచ్చిన బౌద్ధమతాచార్యులనుంచి కూడా హైందవం చాలా స్వీకరించింది. హైందవం, బౌద్ధాన్ని తనలో సంలీనం చేసుకున్నది.

మహాత్ముడు హైందవ మత తాత్త్విక చింతనకు బలం చేకూర్చారా? ఉపవాస దీక్షను ఉదాహరణగా తీసుకుంటే, దానిని ఆయన తన తల్లిగారినుంచి స్వీకరించినట్లుగా, తన స్వీయ చరిత్రలో వ్రాసుకున్నారు. ఉపవాసం ఉండే ఆచారం హిందువులకు మాత్రమే ప్రత్యేకమైనదా? క్రైస్తవులు, మహమ్మదీయులు, మాత్రం ఉపవాసం ఉండడంలేదా? దీన్ని అన్ని దేశాలో, అన్ని మతాల ప్రజలు ఆచరిస్తూనే ఉన్నారు. తమ ఆత్మశుద్ధిని పొందడానికి, తమ బంధువుల, మిత్రుల పరిశుద్ధతకొరకు, వారి అభ్యున్నతి కొరకు అన్ని మతాలవారూ ఆచరిస్తున్న విశ్వ వ్యాప్తమైన ఆచారం ఇది.

ఇక మిగిలిన అంశం అహింస! అహింస అంటే ఏమిటి? తనకు సాటిరాగల మహనీయులందరిలో తనకు ఒక ప్రత్యేకతను ఆపాదించి పెట్టిన ఈ అహింసావిధానాన్ని పాటించాలని గాంధీజీకి ఎలా ప్రేరణ కలిగింది? తన చుట్టూరా ఏర్పడిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గాంధీజీ ఈ పద్ధతిని అనుసరించాడని చెప్పబడింది. ఒక విధంగా ఇది నిజంకావచ్చునేమో,

కానీ ఆయనలోని ఆత్మనిగ్రహశక్తి, బలీయంగా మరొకవైపు లంగరు వేసి ఉంచింది. వియత్నాంలోని బౌద్ధులు ప్రాణ త్యాగం చేసుకున్నారు. కమ్యూనిస్టుగా మారిన ఓ క్రైస్తవ యువకుడు, ఆ తరవాత జకోస్లోవేకియాలో ఆత్మబలిదానానికి పాల్పడ్డాడు. ప్రపంచ వ్యాప్తంగా ఇలాంటి ఘటనలెన్నో జరుగుతూనే ఉన్నాయి. అందువల్ల అహింసాసూత్రం భారతదేశ పరిస్థితులకనుగుణంగా, భారతదేశంలో మాత్రమే ప్రారంభంకాలేదు. అంతేగాక అహింసాసూత్రం ఏదో ఒక ప్రత్యేకమైన ప్రాంతానికే పరిమితమై ఉండక, ప్రపంచమంతటా అవసరమై ఉంది.

భారతదేశంలో తాను నడిపిన అనేక ఉద్యమాల ద్వారా, అనుభవాల ద్వారా, వ్యక్తులను, సంస్థలను, ప్రజలందరినూ కూడా అహింసాసిద్ధతికి అనుగుణంగా మలిచేందుకు అవకాశమున్నదని గాంధీజీ నిదర్శనాపూర్వకంగా నిరూపించారు. అహింసను ఒక ఆశయంగా భావించే వారికి, దాన్ని ఓ ముఖ్య నియమంగా ఆచరించేవారికి మధ్యగల తేడాను ఆయన విడమరచిచూపారు. వ్యక్తిగతంగా సత్యాగ్రహాన్ని నిర్వహించేవారు. దీనిని ఒక నియమంగానే ఆచరించాలనీ, సామూహిక సత్యాగ్రహాలు ప్రజా ఉద్యమాల సాఫల్యత కొరకు అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఒక సూత్రంగా మాత్రమే పాటించవచ్చుననీ గాంధీజీ నిర్వచించారు. అహింసా విధానం విధిగా అనుసరించవలసిన ఒక నియమం, ఆచరణకు అనువైన సాధనం కూడా! మానసిక నిర్మలతకు, ఉద్దీపనకు, తన్నుతాను ఆత్మావలోకనం చేసుకోవడానికి ఉపయోగపడే ఉత్తమ సాధనం! అంతేగాదు సాంఘిక, రాజకీయ వ్యవహారాల్లో ప్రజలు తమకుతామే వినియోగించుకునేందుకు వీలైన ఒక ఆయుధంకూడా. గాంధీజీ నాయకత్వంక్రింద తరవాతకాలాల్లో కూడా వ్యక్తిగతంగానూ, సామూహికంగానూ, సత్యాగ్రహాల నిర్వహకునిగా నా అనుభవాలను బట్టి ఈ విషయాన్ని యదార్థమని ఘంటాపథంగా చెప్పగలను. అహింస శక్తివంతమైన, ఆచరణయోగ్యమైన ఉత్తమ సాధనం. బ్రిటిషువారు ప్రగాఢంగా విశ్వసించేక్రైస్తవ మతానికి ఆలంబన అయిన మానవతా విలువల వల్ల వారికి ఉన్న గౌరవ భావం వల్లనే, భారత దేశంలో తమ పాలన క్రింద సాగుతున్న అహింసా విధానం ఉత్తమ ఫలితాలను సాధించడానికి అవకాశం ఏర్పడిందా? అయితే ఇక్కడ ఒక సందేహం తలెత్తుతున్నది. అమెరికన్లు కూడా క్రైస్తవ మతాన్ని ఆచరించేవారే. అయినప్పుడు వారిపాలన క్రింద మగ్గుతున్న వియత్నాంలో బౌద్ధసన్యాసులు తాము కోరుకున్న దాన్ని సాధించుకోవడానికి ఇక్కడి క్రైస్తవ మతవిశ్వాసం ఎందుకు సహకరించలేదు? ఇవి ఈ నాటికీ జవాబు చెప్పవలసిన ప్రశ్నలే.

యజమానులు – కార్మికుల మధ్య పరస్పర ఘర్షణలతో నేటి ప్రపంచం నిండి ఉంది. యాజమాన్యం పెట్టుబడిదారుల చేతుల్లో ఉన్నా, ప్రభుత్వం చేతుల్లో ఉన్నా, ప్రభుత్వం, పెట్టుబడిదారుల సంయుక్త ఆధ్వర్యంలో ఉన్నా, ఈ రెండు వర్గాల మధ్య ఘర్షణలు తప్పనిసరిగా తలెత్తుతూనే ఉంటున్నాయి. అయితే యజమానులకు, కార్మికులకు మధ్య ఉన్న ఈ వైరుధ్య భావాల్ని ఎలా పరిష్కరించాలి? వర్తమాన ప్రపంచంలో రష్యా విధానం, ఒకటి, ఇంగ్లాండులో కొనసాగుతున్న విధానం మరొకటి అమలులో ఉండగా, మూడో పద్ధతి యుగోస్లోవియాలో కొనసాగుతున్నది. యుగోస్లోవియాలో కార్మికులకు, యజమానులకు మధ్య ఘర్షణలు తలెత్తకుండా అక్కడి ప్రభుత్వం మధ్యే మార్గాన్ని అవలంబిస్తున్నది. ఎలాగంటే కార్మికుల జీవన

పరిస్థితుల మెరుగుదల నిమిత్తం మానవతా దృష్టితో పరిశీలిస్తూ, కమ్యూనిస్టు వర్గ దృక్పథాన్ని దానికి మేళవించి అమలు చేస్తున్నారు.

గాంధీజీ దృష్టిలో ఈ సమస్యాపరిష్కారానికి రెండు మార్గాలు ఉన్నవి. త్రైపాక్షిక సంప్రతింపుల ద్వారా అంగీకారానికి వచ్చి, తమ సమస్యలను తమలో తామే పరిష్కరించుకోవడం ఒక పద్ధతి కాగా, సంప్రతింపులు విఫలమైన సందర్భంలో ప్రభుత్వమే అందుకు పూనుకొని పరిష్కరించడం రెండో పద్ధతి. అంతర్జాతీయ కార్మికసంస్థ (ఐ.యల్.ఓ) అనుసరించదలచిన మార్గం ఇదే.

అహమ్మదాబాద్‌లో ట్రేడ్ యూనియన్ నాయకునిగా ఒకసారి గాంధీజీ కార్మికులకు సారథ్యం వహించారు. కార్మికులు సమ్మెకు పూనుకున్నప్పుడు, గాంధీజీ వారిని బలపర్చారు. వారిలో కొంతమంది సమ్మెనుంచి విరమించుకోవడానికి సిద్ధపడగా అందుకు నిరసనగా 'బాపూ' నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈ సంఘటన కార్మికులకూ గాంధీజీకి బాధాకరంగా తోచినప్పటికీ, పెట్టుబడి దారులు దిగివచ్చి, కార్మికులతో ఒప్పందానికి రాగలిగేలా చేసింది. ఆ మార్గాన్నే ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు చేపట్టింది.

ఈ సందర్భంలో మనం గమనించవలసిన ముఖ్యమైన విషయం మరొకటి ఉన్నది. ప్రపంచంలో రెండు వర్గాలు ప్రధానంగా నిలిచి ఉన్నాయి. "యజమానులు - కార్మికులు" పేరిట ఉన్న ఈ రెండు వర్గాలు ఎప్పటికీ సమాజంలో ఇలా ఉండవలసిందేనా? పని చేసుకొని జీవించేవర్గం ఎప్పుడూ ఒకరిక్రింద కూలికి పనిచేస్తూ, గడిపే దానికి బదులు, స్వీయవృత్తిని అవలంభించి, స్వతంత్రంగా జీవించడానికి, వారికి అవకాశాలను కల్పించవలసిన అవసరంలేదా? చేతి వృత్తులతో జీవనం సాగించేవారికి, తగిన అవకాశాలను కల్పించవలసిన బాధ్యత మనకు లేదా? పశ్చిమ దేశాల్లో కూడా చేతివృత్తుల పై జీవించేవారున్నారు. అయితే అక్కడ వాళ్లు నిర్లక్ష్యం చేయబడి ఉన్నారు. బానిస పద్ధతి ఆ దేశాల్లో బాగా అమల్లో ఉంది. 'యజమాని-కూలి' విధానం అమల్లో ఉంటున్నందున, స్వీయ వృత్తులతో జీవనం సాగించేవారి పట్ల చిన్న చూపు చూడడం జరుగుతున్నది. తూర్పు దేశాల్లో గాని, దక్షిణ అమెరికాలోగాని, అలా జరగడంలేదు. కమ్యూనిస్టు దేశమైన యుగోస్లావియా ఈనాడు స్వయంవృత్తులతో జీవించే ప్రజలను ప్రోత్సహిస్తున్నది. సహకారం సంఘాలను ఏర్పాటు చేసుకొన్న కలంకారీ పనివారికి అన్నిరకాల సహాయం అక్కడ అందించబడుతున్నది. అయితే ఇంగ్లండులో మాత్రం చేతివృత్తుల వారిని ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో నిరుత్సాహపరుస్తున్నది. ఎందుకంటే అక్కడ వ్యక్తి మీద ప్రభుత్వ అజమాయిషీ ఉండాలని భావించడంవల్ల అలా జరుగుతున్నది. ఒకరి మీద ఆధారపడకుండా, తమకాళ్లమీద తామే నిలబడగలిగే, ఈ స్వయంవృత్తుల వారి పట్లఅక్కడి ప్రభుత్వం సహించలేని విధానాన్ని అవలంభిస్తూ, నిర్లక్ష్య వైఖరితో ఉంటున్నది.

భారతదేశంలో రెండునుంచి అయిదెకరాల వరకు మాత్రమే కలిగి, స్వీయవృత్తితో బ్రతికే రైతాంగం కోట్లాదిగా ఉంది. ఎక్కడ రైతు స్వామ్యం ఉంటుందో, అక్కడ స్వయంవృత్తి ఉన్నట్లే. స్వీయ జీవనంలో జీతభత్యాలు, వెట్టిచాకిరి, యజమాని - కార్మికునికి మధ్య ఘర్షణ

– ఇవేమీ ఉండవు. స్వయజీవన విధానం దోపిడీరహితమైన వృత్తి. ఈ వ్యవస్థలో ఇక్కడ ఎవరికి వారే పనిచేసుకుంటూ, అందుకు సహాయకంగా ఇద్దరు, ముగ్గుర్ని పనిలో నియమించుకుంటారు. అవసరమైనప్పుడు మాత్రమే ఒకటి, రెండు సందర్భాలలో ఇరవైనుంచి ఏభైమంది వరకు బృందంగా పనిచేస్తారు. ఇక్కడకూడా వ్యవసాయ కూలీలకు తగునహాయం లభించేందుకు మార్గాలను మనం తప్పక వెతకాలి. గాంధీజీ, వ్యవసాయకూలీల జీవనావసరాల నిమిత్తం కనీస వేతనాలను ఇప్పించేందుకు పూనుకొని, తద్వారా వారిశ్రమశక్తి దోపిడీకి గురి కాకుండా ఉండేందుకు కృషి చేసారు. రైతులలో కొందరు తమ భూములను వ్యవసాయకూలీలకు కౌలుకు ఇస్తారు. అందుకే కౌలుదారీ చట్టం తీసుకురావాలనే ఆలోచన వచ్చింది. గాంధీజీ అలాంటి చట్టానికి అనుకూలంగా ఉన్నారు.

ప్రస్తుతం చేయవలసిన కర్తవ్యం ఒకటున్నది. యాజమాన్య విధానానికి ప్రత్యామ్నాయంగా, స్వీయ వృత్తితో జీవించే స్వయం ఉపాధిని ప్రోత్సహించడం అవసరం. ఈ విధానం అంతర్జాతీయ సమాజాభివృద్ధికి అనుగుణంగా ఉండగలదా, అంటే తప్పకుండా విజయాన్ని సాధించగలదు. ఇతర మార్గాలలో భిన్న విధానాలు అమల్లో ఉన్నప్పటికీ అనేక కమ్యూనిస్టుదేశాలలో నేడు రైతు స్వామ్యం పునరుద్ధరించబడుతూ, తిరిగి బలాన్ని పుంజుకుంటున్నది. అయితే ఇంకా ఈ పునరుద్ధరణ కార్యక్రమం పూర్తిగా జరగవలసి ఉంది. సమిష్టిక్షేత్రాలూ సమిష్టి వ్యవసాయ రంగంలోని సహకారక్షేత్రాలూ ఇంకా ఆ దేశాల్లో అమల్లో ఉన్నాయి. అనేక కమ్యూనిస్టుదేశాలు చిన్న చిన్న స్వంత కమతాలను రైతులు కలిగి ఉండడాన్ని ఆమోదిస్తున్నాయి. అయితే భూమిపైన యాజమాన్యపు హక్కు అలాంటి సందర్భాలలో పునరుద్ధరింపబడనప్పటికీ, వాటిని వారు స్వయంగా సేద్యం చేసుకుంటూ అందువల్ల వచ్చే ఫలితాన్ని తమకు తామే అనుభవించే అవకాశం నేడు కల్పించబడింది. ఈ పద్ధతిలో కమ్యూనిస్టు, సోషలిస్టు రాజ్యాలలో స్వయం వృత్తులు విదానంగా తిరిగి ప్రవేశిస్తున్నాయి.

వ్యవసాయ రంగానికి మాత్రమే స్వయంవృత్తి విధానం పరిమితం కావాలని అనడంలేదు. అంతటితో నేను సంతృప్తిపడనుకూడా! ఈ విధానాన్ని పారిశ్రామిక రంగానికి కూడా విస్తరింపజేయాల్సిన అవసరం ఉంది. ఇంగ్లండులో దాదాపు పరిశ్రమలన్నీ భారీ సంస్థల యాజమాన్యంలో ఉంటూనే, వాటిల్లో చాలావరకు చిన్న చిన్న ఉప సంస్థలుగా ఉంటూ, స్వయం పోషక విధానంలో స్వీయ వృత్తితో నిర్వహించబడుతున్నాయని జాన్ స్ట్రాచీ తెలియజేసారు.

మార్క్స్ సందేశం ఏమిటి? స్వీయవృత్తులులేక, జీవనంకొరకు పరాధీనంగా, ఒకరి క్రింద పనిచేస్తూ, చాలీచాలని జీత భత్యాలతో బ్రతుకీడ్చే అశేష కార్మిక, కూలీ జనాలకు ఆశాకిరణంగా ఆయన ఒక దారి చూపాడు. ఉత్పత్తి రంగంపై అధికారాన్ని కైవసం చేసుకొని కార్మికులకు, కూలీలకు సహాయపడాలని ప్రవచించాడు. ప్రభుత్వాధికారాన్ని వస్తగతంచేసుకొని, తద్వారా పారిశ్రామిక పునర్నిర్మాణం జరగాలని ఆయన కోరారు. ఎందుకంటే చేతివృత్తులవారు, స్వయం ఉపాధితో జీవించేవారు. తమవృత్తులనుంచి నెట్టివేయబడ్డారు. కాబట్టి వారి జీవనభృతికి

గ్యారంటీ ఉండాలని మార్క్స్ మహాశయుడు తలపోసాడు. ప్రైవేటు యాజమాన్యం ఒకవైపు, వారి దోపిడీ మరొకవైపు వెనవేసుకుని కొనసాగే దారుణవ్యవస్థనుంచి వ్యవసాయకూలీలను, పారిశ్రామిక కార్మికులను కాపాడడానికి గాంధీ మహాత్ముడు స్వీయవృత్తిదారులను ప్రోత్సహించారు. ఆయన అనుచరులమైన మేమందరం ఆదే విధానాన్ని బలపరచాం! గాంధీ సిద్ధాంతాల్లో ఈ అంశం తీవ్రమైన ఆలోచనను రేకెత్తించగలదు.

మూడోది, నేటి రాజకీయాల్లో గాంధీజీ ఇమడగలుగుతారా? గాంధేయవాదం నేటి రాజకీయ స్థితిగతులకు ఉపయోగకారి కాగలదా? గాంధీమార్గాన్ని భారతదేశం వదిలివేసిందనే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తున్నది. అయితే అది యదార్థంకాదు. ఆటంబాంబును గురించి ఆలోచిద్దాం. ఆటంబాంబును నిర్మించాలనుకుంటే, చేయగలిగే శక్తి భారతదేశానికి ఉందనే సంగతి అందరూ అంగీకరించినదే. పదిహేను సంవత్సరాలకు పూర్వంకంటే, ఈనాడు భారతదేశానికి సాంకేతిక సామర్థ్యం మరింత ఎక్కువగా ఉంది. అయినప్పుడు భారతదేశం తనకున్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని యుద్ధావసరాల నిమిత్తం ఎందుకు ఉపయోగించుకోవడంలేదు. ఇందుకు చాలా కారణాలు కనిపించవచ్చు. కానీ అన్నింటిలోనూ ముఖ్యమైన కారణం, భారతదేశం ఇప్పటికీ గాంధీ మార్గానికి అంకితమై ఉండడమేనని చెప్పవలసిఉంది. శాశ్వతంగా అధికార పార్టీని అంటి పెట్టుకొని ఉండని మావంటి అనేకమంది రాజకీయ నాయకులు కూడా, బాంబు తయారీ విషయంలో ప్రభుత్వ విధానాన్ని సమర్థిస్తూనే ఉన్నాం. ఈ కారణంగా నేను రాజకీయపరంగా గాంధీజీ మరణించలేదనీ, గాంధేయదృక్పథాన్ని గతంలోనే కాకుండా, నేటికీ కూడా భారతదేశం మననం చేసుకుంటూనే ఉన్నదని చెబుతున్నాను. అంతేగాక తనబోధనలద్వారా, భారతదేశంలో గాంధీజీ పూర్తిగా జీవించే ఉన్నారు.

చివరిమాట : గాంధీజీ భారతదేశానికి మాత్రమే పరిమితమైన వ్యక్తి మాత్రమేనా? లేక విశ్వవ్యాప్తమైన శక్తిగా రూపొందినారా? అనే సంగతి పరిశీలిస్తే, మిస్టర్ పర్‌హదీ అన్నట్లుగా "మిత్రరాజ్యసమితి ప్రణాళిక తయారీకి, నెదర్లాండ్ మానవహక్కుల ప్రణాళికను రూపొందించడానికి కూడా గాంధీజీ ప్రేరకులై ఊపిరి పోశారని" చెప్పవలసి ఉంది. అంతేగాదు అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.యల్.ఓ.) నిర్మాణానికీ, మిత్రరాజ్య సమితి ఆవిర్భావానికి కూడా అనుకూల పరిస్థితులను కల్పించి పెట్టిన ప్రపంచశక్తులలో గాంధీజీ ఒకరుగా ఉన్నారు. ఏ ఆశయ, ఆదర్శాల కొరకు ఈ అంతర్జాతీయ సంస్థలు నెలకొల్పబడ్డాయో, వాటిని విజయవంతంగా నిర్వహించడానికి తోడ్పడిన మహాశక్తులలో గాంధీజీ ఒకరు అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

భారతదేశంలోని కోట్లాదిమంది అస్పృశ్యులకు, సమాజంలో సమాన ప్రతిపత్తిని కల్పించిపెట్టి, వారికి సంపూర్ణమైన పౌరహక్కుల్ని సంతరించిపెట్టడానికి, గాంధీజీ జరిపిన పోరాటం, ఆ కార్యక్రమంలో ఆయన అనుభవించిన బాధలు నన్ను ఆశ్చర్యచకితుడిని చేసాయి.

గాంధీమహాత్ముడు 3

1969 గాంధీజీ శతజయంతి సంవత్సరంలో జరిపిన ప్రపంచ పర్యటనలో అక్కడక్కడా, ఈ గ్రంధరచయిత వెలిబుచ్చిన అభిప్రాయాలు!

ప్రతిచోటా శాంతి నెలకొనాలనీ, జీవితంలోని ప్రతి అంశంలోనూ శాంతి కావాలనీ, గాంధీజీ విశ్వసిస్తూ ఉండేవారు. శాంతియుత విధానంలో మాత్రమే అణచివేయబడ్డ జాతులు, బడుగుదేశాలు, కొద్దిపాటి వ్యయ ప్రయాసలతో త్వరితగతిని అభివృద్ధిని సాధించగలవని, ఆయన భావించేవారు. పేదప్రజలు అభివృద్ధి చెందని వలసదేశాల జనావళికి శాంతికావాలనీ, శాంతియుత పరిస్థితులు మాత్రమే, వారిని ముందుకు తీసుకెళ్లగలవనీ ఆయన చెబుతూ ఉండేవారు.

వర్గ, వర్ణ, సాంఘిక, జాతీయ వ్యత్యాసాలులేని, దోపిడీ లేని, మానవతా విలువలతో కూడిన, నూతన శ్రేయోరాజ్య స్థాపన గురించి, విశ్వశాంతిని ఆశించి, ఆయన ప్రచారం చేసారు. అభివృద్ధి చెందిన దేశాల్లో పాలకులు, ఉన్నతవర్గాల వారిపై బాధ్యతలు ఎక్కువగా ఉండి, సామాన్యవర్గాల ప్రజలకు ఎక్కువ హక్కులు కల్పింపబడాలని ఆయనకోరారు.

అన్నిరకాల దోపిడీని, అసాధారణ హక్కుల్నీ గాంధీజీ తృణీకరించారు. పురుషులతో పాటు స్త్రీలకు సమానహక్కులు ఉండాలని ఆయన వాదించారు. బలహీనులు అట్టడుగువర్గాల ప్రజల కోసం గాంధీజీ కృషి చేశారు. పాలకుల ఆధిక్యతా భావాన్ని, జన్మచేతనే తాము గొప్పవారని భావించే మనస్తత్వాన్ని ఆయన నిరసించారు. భారత దేశంలో శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధానిగా, శ్రీమతి సుచేత కృపలానీ, శ్రీమతి నందినీ సత్పతి రాష్ట్రాల ముఖ్యమంత్రులుగా, శ్రీమతి సరోజినీ నాయుడు, కుమారి పద్మజానాయుడు గవర్నర్లుగా శ్రీమతి విజయలక్ష్మిపండిట్ విదేశరాయబారిగా వివిధ రాష్ట్రాల్లో ఎందరో మహిళలు మంత్రిణులుగా పదవులనలంకరించగలగడం, గాంధీజీ బోధనల ఫలితమేనని చెప్పవలసి ఉంది.

బలోపేతమైన సామ్రాజ్యాలూ, నియంతలకంటే తిరుగులేని పెద్దరికాన్ని అనుపంశికంగా అనుభవించే పౌరోహిత, పీఠాధిపతులకంటే, రాజులూ, ఇతర బలాఢ్యులకంటే కూడా, మానవునిలోని ఆత్మ నిగ్రహశక్తి చాలా ఉన్నతమైనదని, లక్షలాది మంది ప్రజలను సమీకరించి, సత్యాగ్రహ ఉద్యమానికి సమీకరించి, గాంధీజీ ఆచరణలో నిరూపించారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్య శక్తియుక్తులు, ఆత్మబలం ముందు తలవంచక తప్పలేదు.

లక్షలాదిమంది ప్రజలను అంటరానివారుగా పరిగణిస్తున్న అగ్రవర్ణాలవారినీ, హైందవపౌరోహిత వర్గాన్ని సక్రమమార్గంలో పెట్టేందుకు అనేకమార్లు గాంధీజీ ఉపవాసదీక్షలను చేపట్టారు. కొన్ని సందర్భాల్లో 21 రోజులవరకూ కూడా దీక్ష కొనసాగుతూ ఉండేది.

ఎక్కువమందిని హీనంగా చూస్తూ, కొద్దిమంది మాత్రమే పుట్టకతోనే ఆధిక్యతను పొందే దౌర్భాగ్య విధానాన్ని పోనాడి, సర్వసమానత్వాన్ని పాదుకొల్పే సమసమాజంవైపు అందర్నీ నడిపించడానికి ఆయన దీక్షలకు పూనుకున్నారు. అంటరానివారుగా పరిగణింపబడుతున్న ఆరుకోట్లమంది ప్రజలు, మరో మూడు కోట్లమంది గిరిజనులు, గాంధీజీ కృషి ఫలితంగా, సమాన పౌరహక్కుల్ని పొంది, వారిలో కొందరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రులుగా కూడా బాధ్యతల్ని నిర్వహించగలుగుతున్నారు. మరికొందరు ముఖ్యమంత్రులుగా, రాయబారులుగా కూడా ఉన్నత పదవుల్ని పొందగలిగారు. డాక్టర్ అంబేద్కర్ కేంద్ర ప్రభుత్వంలో న్యాయ శాఖామంత్రిగా దేశ రాజ్యాంగ నిర్మాతగా వ్యవహరించారు. ఆయన కృషి ఫలితంగా వెట్టిచాకిరి, అర్థబానిసత్వం, అంటరానితనం వంటి దురాచారాలు చట్టబద్ధంగా నిషేధింపబడ్డాయి.

ప్రజల్లో పరస్పర ఘర్షణలు, ప్రజలకూ, ప్రభుత్వానికీ మధ్య ఘర్షణలు, ఉన్నవారికీ, లేనివారికీ మధ్య సాగే వర్గపోరాటాలూ, వైరుధ్యాలన్నింటికీ పరిష్కారమార్గంగా ప్రపంచమానవాళికి గాంధీజీ అందించిన సత్యాగ్రహం నిజానికి ఒక వరంలాంటిదని భావించాలి. ఆత్మబలంతో దేనినైనా ఎదిరించగలిగే అంతశ్శక్తి అఖిల ప్రపంచానికి గాంధీజీ అందించిన ఆయుధంగా పేర్కొనవచ్చు.

ఆటంబాంబును ప్రయోగించినప్పుడు దానికి గురైనవాడెంతగా వినాశానికి లోనవుతాడో, దాన్ని ప్రయోగించినవాడు కూడా మరొకరకమైన హింసకు గురిఅవుతాడు.జపాన్‌పై ఆటంబాంబును అమెరికా ప్రయోగించినప్పుడు, లక్షలాదిమంది జపానీయులు దారుణమైన దుష్పరిణామాలను అనుభవించారు. అయితే ప్రపంచ సభ్య ప్రజాభిప్రాయంముందు అమెరికా ఈ దుష్కృత్యానికి సిగ్గుతో తలవంచుకొని, దోషిలా నిలబడలవలసి వచ్చింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా, బాపూజీ పలుమార్లు సత్యాగ్రహాలను నిర్వహించి, ఆత్మశక్తి ముందు, ఆయుధశక్తి తలవంచుకొనేలా చేయగలిగారు. తరవాత భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని ఇవ్వడమే గాకుండా, ఇతర వలస దేశాలన్నిటికీ స్వాతంత్ర్యాన్ని ఇవ్వవలసివచ్చింది. ఈ రోజు బ్రిటిష్‌వారు మనకు మిత్రులుగూడా. బ్రిటిష్‌వారిలాగే, ఫ్రెంచి, పోర్చుగీసు, డచ్చి దేశాల సామ్రాజ్యవాదులు సైతం తమ వలస దేశాలకు స్వాతంత్ర్యాన్ని ఇచ్చి, వెళ్లిపోవలసివచ్చింది. సత్యాగ్రహ ఆయుధానికి ఉన్న ఈ మహత్తరశక్తిని మనం అభినందించి తీరవలసిందే.

ఆటంబాంబును కనిపెట్టిన శాస్త్రజ్ఞులకంటే కూడా, అభ్యుదయకరమూ, ఆదర్శవంతమూ అయిన పరిశోధకునిగా ఈ సందర్భంలో గాంధీజీ మనకు కనిపిస్తారు. ఆటంబాంబును నిర్మించిన వారి పరిశోధన వారివరకే పరిమితం కాగా, గాంధీజీ ప్రయోగం భారతదేశానికేగాక, ప్రపంచ దేశాలన్నింటికీ ఉపయోగకరంగా భాసించింది.

గాంధీజీ కేవలం భారతదేశానికి మాత్రమే దత్తం కాదు. గాంధీజీ సిద్ధాంతాలు భారతదేశంలో మాత్రమే పాదుకొని నిలిచిపోలేదు. ఆయన ప్రపంచ పురుషుడు. విశ్వజనీనత సంతరించుకున్న విశ్వమానవుడు. గాంధేయ మార్గం ప్రపంచమానవాళికి అభ్యుదయకరమైన ఆకాశకిరణం.

నిత్యం బలిసిపోతున్న పారిశ్రామిక విస్తరణవాదంతో గాంధీజీ ముఖాముఖి తలపడ్డారు. గ్రామాల్లో, బస్తీల్లో జీవిస్తున్న కోట్లాదిమంది ప్రజల స్వయం ఉపాధిని దెబ్బతీసే భారీ పరిశ్రమల విస్తరణను ఆయన అంగీకరించలేదు. నేడో, రేపో పారిశ్రామికీకరణ విధానం అశేష ప్రజలను తమ కబంధ హస్తాల్లో ఇరికించుకొని, బానిసత్వంలోకి దిగజార్చగలదని గాంధీజీ భావించారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా రైతుల, వృత్తిపనివారల సహకార సంఘాలను ఏర్పరచాల్సిన ఆవశ్యకత ఉన్నదని ఆయన అభిలషించారు. ఇందువల్ల వికేంద్రీకరణ జరిగి, పట్టణ ప్రాంత పరిశ్రమల దయాదాక్షిణ్యాలపై దినభత్యం లభించే దుర్భరనుంచి ప్రజలు కాపాడబడతారని గాంధీజీ వివరించారు. ఈ విధానం స్వయంవృత్తులను ప్రోత్సహించి, స్వావలంబనను కల్పించిపెడుతుంది.

మహాత్ముడు ఈ శతాబ్దంలో దూరదృష్టికలిగిన గొప్ప ప్రణాళికా రూపశిల్పి. ఇంతకు ముందు లెనిన్, స్టాలిన్‌లు రష్యాలో జాతీయస్థాయి ప్రణాళికలను గురించి ఆలోచించారు. బాపూజీ అలా కాకుండా వలస దేశాల్లోని ప్రజలందర్నీ, వారి సాంఘిక ఆర్థిక పరిస్థితుల మెరుగుదలకు తమ దేశాల్లో లభ్యమయ్యే ముడిసరుకులను పట్టణాల్లోని పరిశ్రమల వినియోగానికి తరలించడం మానుకొని, అసంఖ్యాకమైన చేతివృత్తులకు ముడి పదార్థాలను వినియోగించి, కోట్లాది ప్రజల జీవన పరిస్థితుల్ని మెరుగు పరచాలని సూచించారు. అంతేగాక, సామ్రాజ్యవాదులు తమ కుటిల ప్రయత్నాలతో బడుగుదేశాలను శాశ్వతంగా వెనకబాటుతనంలోనే ఉంచే ఆర్థిక విధానాలకు భిన్నంగా స్వతంత్రమైన విధానాన్ని అనుసరించాలని బోధించారు. పెట్టుబడిదారీ దేశాలను గుర్రెదాటుగా అనుసరించకుండా, తమ సాంప్రదాయబద్ధమైన చేతివృత్తులను ప్రోత్సహించి, సహకార సంఘాలద్వారా, స్వంత యాజమాన్యం ద్వారా, నూతన పద్ధతులను ప్రవేశపెట్టుకుంటూ ఆర్థిక స్వాతంత్ర్యాన్ని సాధించవలసిందిగా వెనకబడిన దేశాలకు గాంధీజీ పిలుపునిచ్చారు. ఆయా దేశాల్లోని ప్రజలు స్వయంకృషితోనూ, ప్రభుత్వ తోడ్పాటుతోనూ ముందుకు నడిచి, స్వావలంబనను సాధించవలసిందిగా ఆయన కోరారు. ప్రపంచ ప్రజానీకాన్ని స్వీయార్జన కలిగిన జీవన విధానాన్ని పొందవలసిందిగా ఉద్బోధించారు.

18

శ్రీ వి. వి. గిరి

శ్రీ వి.వి.గిరి బరంపురంలో 10-8-1894లో జన్మించారు. ఐర్లండులో విద్యాభ్యాసంగావించి, బారిష్టరు డిగ్రీ పుచ్చుకున్నారు. ఐరిష్ సిన్-ఫెయిన్ మూవ్‌మెంట్‌లో పాల్గొన్నారు. 1921లో గాంధీజీ ఆధ్వర్యంలో సాగుతున్న సహాయ నిరాకరణ ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. జైలుకు వెళ్లారు. బి.యన్.ఆర్ రైల్వే పనివారల లేబరు యూనియన్‌కు శ్రీ వి.వి.గిరి వ్యవస్థాపక అధ్యక్షులు. 1927లో జరిగిన వారి సమ్మెకు ఆయన సారధ్యం వహించారు. 1934లో సెంట్రల్ అసెంబ్లీకి ఎన్నిక అయ్యారు. 1936లో మద్రాసు శాసన సభకు ఎన్నికై, 1937-39లోనూ, ఆ తరవాత 1946లోనూ మంత్రిగా ఉన్నారు. 1941-45 సంవత్సరాల కాలంలో, యుద్ధసమయంలో, రంగాతో కలిసి తాను అమోఘ జైలులో నిర్బంధింప బడినారు. 1952లోనూ, 1957లోనూ పార్లమెంటు సభ్యులుగా ఎన్నికైనారు. కేంద్ర ప్రభుత్వంలో కార్మిక శాఖామంత్రిగా, శ్రీ లంకలో భారత హైకమీషనరుగా, యు.పి, కేరళ, మైసూరులకు 1957-67సంవత్సరాల మధ్య గవర్నరుగా పనిచేసారు. 1967-69లో భారత ఉపరాష్ట్రపతిగా ఉన్నారు. గిరి, రంగా ఇరువురూ సామాన్య ప్రజానీకానికి లభించిన కవలనాయకులని రాజాజీ ప్రస్తుతించారు. "భారత రత్న"గా దేశం ఆయన్ను గౌరవించింది - (ఎడిటర్)

ప్రజలమనిషిగా గిరిగారిని దేశం గౌరవించినంత గొప్పగా, భారతదేశాధ్యక్షులుగా, ఆయన ఉన్నత సాంప్రదాయాలతో జీవించారు.

శ్రీ గిరి, శ్రీమతి ఇందిరాగాంధీలు 'గరీబీ హఠావో' నినాదంతో కలిసి "లక్షలాదిమంది ప్రజలకు ఉద్యోగాలు" అనే నినాదంతో భారత ప్రజలకు కావలసిన పని కల్పించాల్సిన అవసరాన్ని గట్టిగా ముందుకు తీసుకురావడం ద్వారా, గిరిగారు దేశాధ్యక్షులుగా ప్రత్యేక ప్రాధాన్యతను సంపాదించుకున్నారు.

శ్రీ గిరి తన జీవితకాలమంతా పారిశ్రామిక కార్మికుల కోసం పోరాడిన నాయకులు. పరిశ్రమల అభివృద్ధిలోనూ, యాజమాన్యంలోనూ భాగాన్ని పొందడానికి జరిపే పోరాటంలో, కార్మికుల మధ్య ఐక్యత ప్రధానమైన అంశంగా ఆయన గుర్తించారు. కార్మిక సంఘాలన్నీ పరస్పర విభేదాలను మరచిపోయి ఒక్కో పరిశ్రమకు, ఒక్కో కార్మిక సంఘం ఉండేలా సర్దుబాటు చేసుకోవాలని ఆయన సలహా ఇచ్చారు.

భారత దేశాభివృద్ధికి ఉత్పత్తి ముఖ్యమైంది. అది ఇంకా, ఇంకా ఎక్కువగా పెరగాలి. అలా జరగాలంటే పారిశ్రామిక శాంతి వీర్యడి తీరాలి. పేదరికం నిర్మూలనకు, ఇందిరాజీ చేపట్టిన కార్యక్రమం ఫలవంతం కావడానికి జాతీయ ఉత్పత్తి సామర్థ్యం పెరగాలి. అప్పుడే మనం అదనంగా ఒనగూడే ఉత్పత్తులను అందరకూ పంచి ఇవ్వగలం. అధికోత్పత్తి జరిగిననాడే, ధరలు కూడా తగ్గుముఖం పట్టగలవు.

పెద్ద, మధ్యతరహా, చిన్నరకం పరిశ్రమలు అన్నీ సమంగా అభివృద్ధి చెందాలన్నదే, ఆయన నమ్మకం. అవి పెరుగుతూ, ఉత్పత్తి నాణ్యత పెంచుకుంటూ, ఉద్యోగావకాశాలను ఎక్కువ చేసుకుంటూ, కార్మికుల సంక్షేమం కోసం చక్కటి కృషి చేయాలని గిరిగారు ఆశిస్తూ ఉండేవారు. 1936-39 సంవత్సరాల కాలంలో, ఆయన మద్రాసులో మంత్రి పదవి నిర్వహిస్తున్నప్పుడు, కార్మిక, పరిశ్రమల శాఖను స్వీకరించి, కార్మికుల ప్రయోజనాలను అభివృద్ధి పరచడానికి తన శక్తి సామర్థ్యాలను వినియోగించారు. అదే పద్ధతిలో దేశాధ్యక్షులైనప్పటికీ గిరి గారు పారిశ్రామిక యజమానులను, ఫ్యాక్టరీ యంత్రాల నిర్వహణ పద్ధతులను మెరుగు పరచుకోవలసిందిగా, కార్మికులకు తగుప్రతిఫలాన్నిస్తూ, ఉత్పత్తి పెంపుదలకు కృషి చేయవలసిందిగా కోరారు.

తమకు కావలసిన వాటిని పొందుతూ, సమ్మెలకు దిగకుండా, కలిసికట్టుగా పనిచేస్తూ, అధికోత్పత్తి సాధనకు ఎక్కువ కృషి చేస్తూ దేశాభివృద్ధి సాధనలో తోడ్పడవలసిందిగా, ఆయన కార్మికులను కోరారు.

ఈ కార్మికనేత పారిశ్రామిక సంబంధాలలో సయోధ్యను ఉత్పత్తి కృషితో శాంతిని ఎక్కువగా కోరారు. పరిశ్రమలు ప్రభుత్వ నిర్వహణలోనివి కానివ్వండి, ప్రైవేటు వ్యక్తుల యాజమాన్యంలోనివి కానివ్వండి, కలిసికట్టుగా ఉండి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలోని పారిశ్రామిక కార్మిక శాఖామంత్రుల సహకారం తీసుకుంటూ, పారిశ్రామిక శాంతిని ఉత్పత్తి కృషిలో దేశీయమైన భాగసామ్యాన్ని కలిగి ఉండవలసిన అవసరం ఉందని, ఇందుకు కార్మిక నాయకులు, యజమానులు పరస్పర విశ్వాసంతో పనిచేసుకోవాలని ఆయన చెప్పారు.

కార్మికుల సమస్యల పరిష్కారం విషయంలో త్రైపాక్షిక సంప్రతింపుల ద్వారా, పరిష్కరించుకోవడంపై ఆయనకు విశ్వాసం ఉంది. లేబర్ ట్రిబ్యునల్స్‌ను ఏర్పాటుచేసి, వాటి ద్వారా పక్షపాత రహితమైన, పరస్పర అంగీకారాన్ని సాధించడంతో లేదా అవసరమైన సందర్భాలలో, తీర్పును ఇవ్వడం ద్వారా పారిశ్రామిక-కార్మిక వివాదాల చిక్కుముడిని విడగొట్టాలని ఆయన ఉద్దేశం. అందులో తనకున్న విశ్వాసాన్ని సడలించుకోలేక, ఒకమారు ఆయన నెహ్రూగారి మంత్రివర్గంనుంచి రాజీనామా కూడా చేసారు. లేబర్ ట్రిబ్యునల్ అవార్డును అమలు జరపడంలో ప్రభుత్వం విఫలమైనప్పుడు అందుకు నిరసనగా ఆయన రాజీనామా ఇవ్వడానికి నిశ్చయించుకున్నప్పుడు ఆయన కుటుంబంలోనూ, బయటా, ఆయన శ్రేయోభిలాషులెందరో వ్యతిరేకించిన విషయం నాకు తెలుసు. సుశిక్షితుడైన ఒక కార్మికుడు తన యూనియన్ పిలుపుమేరకు, పనిముట్లు అవతల పారవైచి వెళ్ళినట్లు, ఆయన తన పదవిని విసర్జించి, ప్రభుత్వంనుంచి బయటకు వచ్చారు. ఆ నైతిక బలంతో, ఆయన పరిశ్రమల రంగంలో యజమానుల-కార్మికుల మధ్య శాంతి స్థాపన కోసం అన్ని రాజకీయ పక్షాలపై వత్తిడి తెచ్చి, సంప్రతింపులు జరుపగలిగారు. ఇవి కొన్ని సంవత్సరాలవరకు పారిశ్రామిక శాంతిని కాపాడగలిగాయి.

దీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆర్థిక మాంద్యం యొక్క చెడు ఫలితాల వల్ల దేశం వెనకంజవేసింది. కనుచూపు మేరలో ఈ దుస్థితి నుంచి బయటపడే అవకాశం భారతదేశానికి

కనిపించలేదు. ఎందుకంటే ప్రపంచమంతా ఆర్థిక దుస్థితి దుష్ప్రభావంతో కమ్ముకొని ఉన్నది. కాబట్టి ఈ పరిస్థితిని అనివార్యంగా ఎదుక్కోవలసి వచ్చింది. ఉత్పత్తి దేశాలు నూనె ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో ఈ బాధ ఇంకా పెరిగింది. ముందు దృష్టితో ఈచరిస్థితులను గమనించగలిగిన శ్రీ గిరి పారిశ్రామిక అశాంతికి దోహదంచేసే కార్యక్రమాలకు పాల్పడకుండా ఉండవలసిందని హితవు చెప్పారు. దేశ ఆర్థికాభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని ఒక కార్మిక నాయకునిగా గతంలో ఆయన చేసిన సేవలు కారణంగా భారత కార్మికవర్గాన్ని ఇలా ధైర్యంగా కోరగలిగిన వ్యక్తి ఆయన ఒక్కరే.

అన్ని విభాగాల్లో పని చేసున్న కార్మికులు, అధిక వేతనాలకోసం, డి.ఎ.లకోసం, బోనస్ పెంపుదలకోసం పెరుగుతున్న ధరలతోపాటు పోటీపడి డిమాండ్ చేయసాగారు. ఒకవైపు ధరలపెరుగుదల – మరోవైపు అధిక వేతనాల కోసం ఆందోళన, ఈ విషవలయంనుంచి దేశాన్ని రక్షించేందుకు ఎవరో ఒకరు ముందుకు వచ్చి ఈ పోటీని ఆపవలసిందిగా కోరవలసిన పరిస్థితి వచ్చింది. భారత రాష్ట్ర పతిగా ఉన్న శ్రీ గిరి ఈ సందర్భంలో ముందుకొచ్చి, తమ కోర్కెలను కొంతకాలం పాటు వాయిదా వేసుకొని దేశాభివృద్ధికి తోడ్పాటు నందించవలసిందిగా కార్మిక వర్గాన్ని కోరారు.

భారత రాజ్యాంగంలో ఉన్న ఏ అంశాన్ని త్రోసిరాజనకుండానే, శ్రీ గిరి 40 సంవత్సరాలుగా భారతకార్మికోద్యమంలో తన పాత్రననుసరించి తనకున్న నైతిక బలాన్ని ముందుంచుకొని మాత్రమే, దేశ ప్రయోజనాల కవసరమైన ఈ కోర్కెను కోరారు.

ప్రణాళికా బద్దంగా ఆర్థికాభివృద్ధికి జరుగుతున్న కృషితోపాటు నిరుద్యోగం గూడా క్రమేణా దేశంలో ఎందుకు పెరుగుతున్నదనేది చాలామందిని ఆశ్చర్యపరుస్తున్న సమస్య. మనదేశంలో గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిగా పనిలేకపోవటమనేది ఇందుకు ఒక కారణం. ప్రణాళికాసంఘంలోని ఒక ముఖ్య సభ్యునిగా శ్రీ గిరి ఈ దుస్థితిని తొలగించేందుకు మార్గాలను గురించి ఆలోచించారు. దేశాధ్యక్షునిగా ఉండి ఆయన "లక్షలాదిమంది ప్రజలకు పని కల్పన" ("జాబ్స్ ఫర్ ది మిలియన్స్") అనే పుస్తకాన్ని ప్రచురించారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో ఉన్న సాంప్రదాయం కాని రీతులను ఎత్తిచూపుతూ, స్వయంవృత్తులను, చిన్న పరిశ్రమలను, నిరుద్యోగులైన విద్యావంతులలో ఎక్కువమంది స్థాపించేందుకు ముందుకు వచ్చేలాగు ప్రోత్సాహపరచవలసిందని, తద్వారా ఎక్కువమందికి పనికల్పించ వలసిందని, పూర్తిగా పనిలేనివారికి సంవత్సరమంతా పనిఉండేలాగు దోహదపడవలసిందని ఆయన సూచించారు. "మోడరన్ ఇండియన్ ప్రెజెంట్" అనే నా పుస్తకానికి ముందు మాట వ్రాస్తూ ఆయన, ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అన్ని రకాల వ్యవసాయానికి పిలైన భూములలో 1/4 వంతు భూమిని భూమిలేని వ్యవసాయ కూలీలకు పంపిణీ చేయవలసిందనే నా సూచనను కొనియాడారు. అదనంగా ఉన్న బంజరు భూములను హరిజనులకు, వెనుకబడిన కులాలవారికి, భూమిలేని నిరుపేద వ్యవసాయ దారులకు పంచి పెట్టే కార్యక్రమాన్ని చేపట్టిన అన్ని రాష్ట్ర ప్రభుత్వాల కృషిని ఈ సందర్భంలో ఆయన ప్రశంసించారు.

వ్యవసాయ రంగాన్ని పరిగణించకుండా భారీ పరిశ్రమలకు హెచ్చునిధులను కేటాయించే పద్ధతి మంచిది కాదని మేమిద్దరం అన్నాం. భారత దేశాధ్యక్షులుగా ఉన్నవారు ఆ సందర్భంలో వ్యవసాయానికి, వ్యవసాయానుబంధ పరిశ్రమలకు హెచ్చునిధులను కేటాయించవలసినదిగా ఆయన ప్రత్యేకంగా చెప్పారు.

వ్యవసాయకూలీల కనీస కోర్కెలను గురించి 1946వ సంవత్సరంలో 'సౌత్ ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ పీజంట్స్ అండ్ ఎగ్రికల్చరల్ వర్కర్స్' ద్వారా మేము ఒక శాసనాన్ని తయారు చేసాం. కనీస వేతనాల చట్టాన్ని అమలు జరుపవలసిందిగా దేశాధ్యక్షునిగా ఆయన అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. దానిని వ్యవసాయ కూలాలకు కూడా విస్తరింపజేసేందుకు బాబూ జగ్‌జీవన్‌రామ్ గారి కృషిఫలితంగా నిర్ణయం జరిగింది. దురదృష్టవశాత్తూ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఆయన సంహాను పాటించలేదు. ఎందుకంటే కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలను నిర్ణయించలేకపోయింది.

గిరిగారు మనరైతాంగానికి మంచి ధరలు లభించాలని కోరుకున్నారు. ఆహారధాన్యాలు చౌకలో పొందాలనే పారిశ్రామికవేత్తల, మధ్యతరగతి ప్రజల, ఇతర నగర వాసులైన సామాన్య జనాల అభిమతాలకు ఆయన అడ్డుకట్టవేయలేకపోయారు. ఏది ఏమైనప్పటికి ఈ విషయంలో ఆయన భారత ప్రధానిని వత్తిడి చేసేందుకు ఆయన చేయగలిగిన దంతా చేయగలిగారు. ఆహారధాన్యాల ఉత్పత్తి సేకరణ, లెవీ వసూళ్ళ మీదనే కాకుండా, కనీసం ఉత్పత్తి ఖర్చులకైనా సరిపోయే విధంగా ధరల పెరుగుదలను ఉంచేందుకు తగుచర్యలు తీసుకోవలసిందిగా ఆయన ప్రధానిపై వత్తిడి చేసారు. ఈ కష్టజీవులపై సానుభూతితోనైనా ఇందుకు పూనుకోవలసిందిగా ఆయన కోరారు.

నాకు జ్ఞాపక మున్నంత వరకు, ఆయన తాను మంత్రిగా బాధ్యతలు వహించిన తొలినాళ్లనుంచీ ఆంధ్రరాజకీయాలలో ప్రకాశం పంతులు గారిని తన నాయకునిగా ఎన్నుకొన్నారు. ఆ విశ్వాసాన్ని ఆయన ఏక్షణంలోను వదలుకోలేదు. పూర్వపు మద్రాసు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రాజాజీ గతంలో ఒకమారు ఉన్నారు గనుక తిరిగి వద్దనుకొన్నారు. ప్రకాశంగారిని ఆస్థానంలో ఉంచటానికి గాంధీగారు సుముఖత చూపలేదు. అందువల్ల స్వయంగా సర్దార్ పటేల్ గిరిగారి దగ్గరకు వచ్చి మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉండవలసిందిగా కోరారు. ఆ సందర్భంలో కూడ గిరిగారు ప్రకాశం గారి యెడ తనకున్న విశ్వాసాన్ని వీసమంతైనా సడలించుకోలేదు. తాను తండ్రిలాగా చూసుకొనే ప్రకాశం గారికి బదులుగా తనకు నాయకత్వం అవసరం లేదని అలాంటి ఆలోచన కూడా తనకు రాదని చెప్పారు. ఆ పరిస్థితులలో ఆంధ్రనుంచి ప్రకాశంగారొక్కరే ఉండటంతో ఆయనే కాంగ్రెసు శాసన సభాపార్టీనాయకులుగా మద్రాసు ముఖ్యమంత్రిగా కాగలిగారు. అది నాయకుని యెడల గిరిగారు చూపించిన అసాధారణమైన గౌరవం. మంచి అనుభవమున్నగవర్నరుగా ఎన్నికైన ఉపాధ్యక్షునిగా, తాత్కాలిక రాష్ట్రపతిగా పనిచేసిన తన అనుభవాన్ని పురస్కరించుకొని, రాష్ట్రపతి స్థానానికి అభ్యర్థిత్వాన్ని కోరినప్పుడు కాంగ్రెసుపెద్దలు తిరస్కరించటం జరిగింది. ఆ సందర్భంలో కాంగ్రెసు నాయకుల ఇష్టానికి వ్యతిరేకంగా,

తీవ్రమైన పోటీలో నిలబడేందుకు తన్నుతాను అభ్యర్థిగా ప్రకటింపజేసుకొనేందుకు ఆయన వెనుకాడలేదు.

1937వ సంవత్సరంలో మద్రాసులో కార్మిక, పరిశ్రమల శాఖామంత్రిగా ఆయనను నియమించటం, లేబరుకు సేవ జేస్తూ పరిశ్రమలనభివృద్ధి పరచే కృషికి ఆయనపై విసరిన ఓ సవాల్ లాంటిది. ఆ సందర్భం గిరిగారికి ఓ మంచి అనుభవాన్నందించింది. ఉభయవర్గాల ప్రయోజనాలు దెబ్బతినకుండా, పరస్పరం దేశాభివృద్ధికి సహకరించుకొంటూ, పారిశ్రామిక శాంతిని కాపాడుకొంటూ ఎలా పనిచేయవచ్చో ఈ సందర్భంలో వారు అనుభవపూర్వకంగా తెలుసుకొనేందుకు అవకాశం దొరికినట్లైంది. సంపాదనలోను, నిర్వహణలోను తమతమ కోర్కెలను వదలుకోకుండానే వారివారి బాధ్యతలను వారు నెరవేర్చగలిగేలాగు ఈ సందర్భంలో ఆయన చేయగలిగారు. 1941-43 సంవత్సరాల్లో వెల్లూరు (తమిళనాడు) అమ్రోతి (మహారాష్ట్ర) జైళ్ళలో మేమిద్దరం కలసి ఉన్నాం. రాజాజీ, ప్రకాశంగారలు గూడా వారివారి అభిమానులతో ఆ సమయంలో ఆ జైళ్ళలోనే ఉన్నారు. అక్కడ మేమిద్దరం ప్రత్యేక కవలలుగా పేరు పొందాం. మాకంటే పెద్దలను గౌరవిస్తూ, ఎప్పుడూ చిరునవ్వుతో ఉంటూ, మా ప్రత్యేక వ్యక్తిత్వంతో మేము నడుస్తూ ఉండేవాళ్లం.

సాయంత్రం సమయాల్లో నడుస్తూ మేమిద్దరం, ప్రపంచయుద్ధం, బెంగాల్ కరువు, భారతజాతియోద్యమాలపై బ్రిటీషువారికోపం, గురించి చర్చించుకొంటూ ఉండేవాళ్లం. మేము గ్రామీణ పునర్నిర్మాణం, రైతురక్షణ, మన ప్రజల స్వయంవృత్తుల అభివృద్ధివికాసం, పల్లెలలో పట్టణాలలో ఉద్యోగావకాశాల కల్పనతో కూడిన పారిశ్రామిక అభివృద్ధికోసం పథకాలు తయారుచేస్తూ ఉండే వాళ్లం. అంతకు రెండు దశాబ్దాలకు ముందు గిరిగారి బాల్య స్నేహితులైన వెంగప్పూడి రామకృష్ణగారితో చర్చిస్తూ ఇలాంటి అంశాలలో ఎంతో విలువైన సమాచారాన్ని తెలుసుకోగలిగాను. ఆయన ఆ తరవాత పేరు పొందిన పారిశ్రామిక వేత్తగా ఉన్నత నిర్వాహకునిగా తయారుకాగలిగారు. రామకృష్ణగారి వంటి గొప్పనాయకులు, ముందు మూపుకలిగిన దేశభక్తిపరులు దేశానికి ఎంతైనా అవసరమని శ్రీ గిరి తరచూ అంటుండేవారు.

1934లో మేమిద్దరము కాంగ్రెస్ టికెట్టుమీద జనరల్ అసెంబ్లీకి ఎన్నిక కాగలిగాం. మాతోపాటు కీ.శే .లైన శ్రీ యన్.యం.జోషి గూడ జనరల్ అసెంబ్లీలో ఉంటుండేవారు. మేము ఆ రోజుల్లో కార్మిక త్రిసభ్యులంగా పిలువబడుతుండేవాళ్లం. మేము అంత సన్నిహితంగా మెలగే స్నేహితులం.

శ్రీ జాకీర్ హుస్సేన్ అకస్మాత్తుగా మరణించటంతో రాష్ట్రపతిగురించి అన్ని రాజకీయ పక్షాలు సందిగ్ధంలో పడ్డాయి. కాంగ్రెస్ పార్టీ తన అంతర్గత విభేదాల నధిగమించి ఎలా బయట పడుతుందని ప్రజలంతా ఎదురు చూస్తున్నారు. ప్రతి పక్షాలకు కూడ వాటి సమస్యలు వాటికున్నవి. భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి పార్లమెంటులోని ప్రతిపక్షాలన్నింటిని ఎవరైతే గెలిచేందుకు ఎక్కువ అవకాశాలుంటాయోనని సంప్రదించారు. నన్ను ఆమె అడిగినప్పుడు ఎవరెవరు అభ్యర్థులుగా ఉండాలనుకొంటున్నారని నేనడిగాను. శ్రీ గిరి, శ్రీ మొరార్జీ, శ్రీ

చవాన్, సర్దార్ స్వర్ణసింగ్, శ్రీ జగ్‌జీవన్‌రామ్, శ్రీ సంజీవరెడ్డిగార్ల పేర్లను వరసగా ఆమె చెప్పింది. మా చర్చల్లో గిరిగారికి వ్యతిరేకంగా ఏమీలేదని ఆయన ఉపాధ్యక్షునిగా ఉన్నందున మరికొంతసులువు అని నేను చెప్పాను. ఆయన చాలా పెద్దవారై పోయారని కొందరంటున్నట్లుగా ఆమె చెప్పారు. ఆయనతో నాకున్న 40 సంవత్సరాల అనుభవంలో ఆయన శారీరకంగాగాని, మానసికంగాగాని ఎన్నడూ దుర్బలులుగాలేరని, ఆఖరుకు జైలు జీవితంలోగూడ ఆయన డస్సిపోలేదని, ఆయన విషయంలో వయస్సును గణించవలసిన అవసరం లేదని నేను చెప్పాను. రాజాజీకి ఈ విషయాన్ని నేను వివరిస్తూ ఆమె గిరికి అనుకూలంగా ఉండవచ్చునని చెప్పాను.

అనుకోకుండా కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు ఒక ఓటు మెజారిటీతో సంజీవరెడ్డిగారిని అభ్యర్థిగా నిర్ణయించటం, గిరిగారు స్వతంత్ర అభ్యర్థిగా ప్రకటించుకోవటం జరిగాయి. బెంగుళూరు–ఢిల్లీల నుంచి ఈ ప్రకటనలు వెలువడిన కొన్ని గంటలలోనే హైదరాబాదులో పత్రికా విలేకరులు నన్ను కలుసుకొని నా అభిప్రాయాన్ని అడగటం జరిగింది. వెంటనే నేను స్వతంత్ర పార్టీ అధ్యక్షునిగా నాకున్న పరిధులను గూడా మరచిపోయి. ఓ కార్మిక నాయకునిగా ఆయన, ఓ రైతునాయకునిగా నేను మా మధ్యనున్న స్నేహవాత్సల్యాలను మాత్రమే మనస్సులో ఉంచుకొని నా అనుకూలతను ప్రకటించాను. అనాలోచితంగా నేను చేసిన ఆ ప్రకటన స్వతంత్ర పార్టీలో నాకు ఇబ్బందిని కలిగించింది. మద్రాసునుంచి బొంబాయినుంచి మా పార్టీ మిత్రులు నాకు ఫోన్ చేస్తూ ఇది నా వ్యక్తిగత ప్రకటనగా తెలియజేయవలసిందని పార్టీ చర్చించి తన నిర్ణయాన్ని తరవాత ప్రకటించగలదని తెలుపవలసిందిగా చెప్పారు. మేము ఢిల్లీ చేరుకొన్న తరవాత విఠల్‌భాయ్ పటేల్ హౌస్‌లో కొందరుప్రతిపక్ష నాయకులతో చర్చించాం. నేను గిరిగారి అభ్యర్థిత్వాన్ని సమర్థించగా, బి.కె.డి నాయకులు మూడో అభ్యర్థి కావాలని అన్నారు. పి.యస్.పి నాయకులు మరికొంతమంది, ఇతర సహచరులు, కమ్యూనిస్టులు గిరిగారిని పైనవేసుకున్నారు. గనుక మనం ఆయనను బలపరిచేపనిలేదని అన్నారు. నేను గిరిగారిని సమర్థిస్తున్నానని, నా నిర్ణయం వారికంటే ముందుగానే తీసుకొన్నానని చెప్పాను. భారతదేశాన్ని బలహీనపరచేందుకుగానీ, తాకట్టుపెట్టేందుకుకానీ, ఆయన ఎన్నడూ అనుమతించరని, ఆయనను ఎవరు బలపరిచారనే దానితో నిమిత్తం లేదనీ, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సర్వేపల్లి రాధాక్రిష్ణన్ గార్లవలె, ఆయన అధ్యక్ష స్థానాన్ని స్వతంత్రంగా ఉన్నతంగా దేశభక్తి పూరితంగా నిర్వహించగలరని నేను నా అభిప్రాయాన్ని చెప్పాను. అయినప్పటికీ వారు మూడో అభ్యర్థిని నిలబెట్టాలనే నిర్ణయంవై పే మొగ్గుజూపారు. మూడో అభ్యర్థి విషయంతో నేనంగీకరించక తప్పలేదు. మూడో అభ్యర్థిగా శ్రీ సి.డి.దేశ్‌ముఖ్ గారిని నిర్ణయించాం. స్వతంత్ర పార్టీ నిబంధనావళిలోని 21వ సూత్రాన్ననుసరించి, పార్టీనిర్ణయాలను అంగీకరించలేని సందర్భంలో స్వేచ్ఛనివ్వాలని నేను గట్టిగా సమర్థించాను. పార్టీ కార్యవర్గం, ఇతర నాయకులు ఇందుకు అంగీకారం తెలిపారు. మూడో అభ్యర్థి కోసం పోరాడిన బి.కె.డి. అభ్యర్థి శ్రీ సి.డి.దేశ్‌ముఖ్‌కు తమ ఓటు నివ్వలేదు. శ్రీ గిరి, ఇందిరాజీ అనుచరుల అంతరాత్మప్రబోధపు ఓటుతో గెలిచారు. ప్రముఖ మానవహక్కుల పోరాటకర్త, శ్రమైకజీవుల నాయకుడు రాష్ట్రపతి కాగలిగినందుకు నేను సంతోషించాను. దేశానికి అవసరమైనప్పుడు, జాతికోసం ఆయన చేసిన త్యాగాలు నమ్మిన ఆశయాలకోసం, చివరిదాకా నిలబడే పట్టుదల, స్వరాజ్యం రాకపూర్వం నుంచీ

నేటివరకూ దేశం కష్టాంలో ఉన్నప్పుడు ఆయన చూపించిన దేశభక్తి, ఆయనకు ఈ మహోన్నత అవకాశాన్ని కల్పించాయని చెప్పవచ్చు.

పార్టీలకు, వివాదాలకు అతీతంగా ఆయన అందరి మనిషిగా రాష్ట్రపతి స్థానంలో ఉండి, ఆ పదవిని మహోన్నతంగా నిర్వహించారు. బాబూ రాజేంద్రప్రసాద్‌గారి వలెనే గతంలో అనుసరించిన సాంప్రదాయాలను ఆయన కాపాడారు. ప్రభుత్వాన్ని, నాయకులను హెచ్చరిస్తూ, సలహాలనిస్తూ, నడిపిస్తూ, ఒక మిత్రునిలా, తత్వవేత్తలా, అందరితో కలిసిమెలసి మెలగుతూ సత్సంప్రదాయాలను పరిరక్షించారు. 1971-72 సంవత్సరాలలో, బంగ్లాదేశ్ క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు, ఆయన ప్రధానమంత్రికి ఉన్నతమైన సలహాలనిస్తూ బలపరిచారు. జాతీయ ఐక్యతకు, గౌరవానికి ఆయన ప్రతీకగా నిలిచి, తన స్థానాన్ని ఉన్నతంగా కాపాడారు.

ప్రజారంగంలో ఉన్న అనేకమంది ప్రముఖులకు సహచరులకు, మిత్రులకు వారి వారి సేవలను ప్రస్తుతిస్తూ, ఆయన వ్యక్తిగత సందేశాలను పంపిస్తూ ప్రోత్సహిస్తూ ఉండేవారు. 1974 నవంబరు 7న నన్ను శ్లాఘిస్తూ, ఆయన ఈ క్రింది సందేశం పంపారు. "మనమిద్దరం దేశంలో పరుగున కూలీ, రైతు ఉద్యమాలను నిర్మించాం! ఈనాడు ఈ ఉద్యమాల ఫలితాలు దేశంలో బాగా పాదుకున్నవి".

కుటుంబ విషయంలో కూడా శ్రీ గిరి అదృష్టవంతులు. వారి తండ్రి శ్రీ జోగయ్య గొప్ప న్యాయవాది. ఉత్తమ దేశభక్తులు. ఆయన శాసనసభ్యులు కూడా. ఆయన తన అంతిమ శ్వాసను బెంగుళూరులో గిరిగారిని అభినందించేందుకు ఏర్పాటు చేసిన సభ సందర్భంలో గిరిగారి భుజాలమీదనే వదలిపెట్టారు.

గిరిగారి భార్య శ్రీమతి సరస్వతీ భాయ్ తెలుగు, కన్నడ, తమిళ భాషల్లో పండితురాలు, కవయిత్రి, సంగీతంలో కూడా ప్రవేశంగల విదుషీమణి. పెరుగుతున్న గిరిగారి కుటుంబ సంరక్షణ భారాన్ని ఎంతో ప్రేమతో అనురాగంతో ఆమె నిర్వహించారు. గిరిగారు ప్రజాసేవారంగంలో క్షణం తీరికలేకుండా, గడుపుతుంటే, కుటుంబ బాధ్యతల్లో ఇబ్బందులు ఏర్పడకుండా ఆమె పర్యవేక్షిస్తూ వచ్చారు.

19

శ్రీ గోపీచంద్

పండిత పుత్రుడైన పండితుడు

గత రెండు దశాబ్దాలుగా కిశోరులైన త్రిపురనేని గోపీచంద్ చేసిన నిర్మాణాత్మకమైన సేవలు తెలుగు భాషాభిమానులందరూ ఎరిగినవే. ఆయన రాసిన తెలుగు కథలు నవీన తెలుగు రచనలో సాంఘిక ప్రయోజనాన్ని మేళవించి, దానికొక ఆత్మను గూడ కల్పించి తెలుగు సాహితీ కృషికి పుష్టిని చేకూర్చాయి. ఆయన రచనలు జాగృదావస్థలో ఉన్న ఆలోచనా శక్తిని మేల్కొలిపి, ఒక నూతన భావ ప్రపంచం వైపు పాఠకులను తీసుకెళ్లేవి. ఇది ఒక అసాధారణమైన చర్య.

గోపీచంద్ గొప్ప సాహితీ పరమైన కుటుంబంలో నుంచి వైకి వచ్చారు. ఆయన తండ్రి శ్రీ త్రిపురనేని రామస్వామి, బారిష్టరు, వేరెన్నికగన్న సామాజిక విప్లవకారులు, గొప్పకవి. వచన రచనాశైలిలో ప్రజ్ఞావంతుడైన రచయిత. ఆయన మామలు, కుటుంబ సభ్యులంతా గూడా గొప్ప ఆలోచనాపరులు, కవులు. ఢిల్లీ సుల్తానుల సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా (1320-60లో) వరంగల్ పాలకులైన కాకతీయరాజులు దక్షిణ భారతదేశంనుంచి స్వాతంత్ర పోరాటానికి తలపడినప్పుడు, వీరి పూర్వీకులైన త్రిపురనాయక్ ప్రదర్శించిన అసమాన శౌర్య, ధైర్య పరాక్రమాదులనుంచి త్రిపురనేని రామస్వామి అంధమత విశ్వాసాలపై, అవిశ్రాంతంగా సాగించిన పోరాటం వరకు ఈ వంశం నిర్భయమైన తమ పరాక్రమ సాహసాలను ప్రదర్శిస్తూనే ఉంది. గుంటూరులో ఉన్న ఒక విద్యార్థి వసతిగృహంలో గోపీచంద్ నాకు తొలిసారిగా పరిచయం అయినప్పుడు ఆయన ముఖాకృతిలో ఆయన తండ్రి పోలికలు స్పష్టంగా కనిపించాయి. పెద్దదైన ఆయన తల, స్థిరంగాను, నిశ్చలంగాను ఉన్న దృష్టి, విశాలమైన నొసటి భాగం చిందరవందరగా కనుపించే జుట్టును చూసినపుడు మనకు రామస్వామి తీరే కనిపించినా, చిరునవ్వులు చిందిస్తూ ఉండే ముఖాకృతి, మన హృదయంనిండా పువ్వు పరిమళాలను వెదజల్లే నిష్కల్మషమైన నవ్వులను చూసినపుడు మాత్రం, సైనిక నాయకునిలాంటి ఆయన తండ్రికన్నా మనకు ఎక్కువ సన్నిహితంగా ఉన్నట్లనిపిస్తారు. ఆయనను చూసిన వెంటనే నాకెందుకో ఆయన మీద చాలా ఇష్టమనిపించింది.

అయితే నేను ఆయనను నా రాజకీయ మిత్రునిగా మాత్రం మార్చుకోలేకపోయాను. ఎన్ని సంవత్సరాలైనా మా ఇద్దరి మధ్య ఉండే స్నేహాన్ని, సహకారాన్ని చెడగొట్టుకునే ప్రయత్నాలకు ఎవరమూ పాల్పడలేదు. అనేకమంది ఆయన సమకాలికులైన రాయిష్టులతో గూడ నా అనుభవం ఇదే. ఎందువల్ల? నేను గాంధీజీతోనూ ఆయన సామాజిక సిద్ధాంతంతోనూ ఎక్కువగా ముడివేసుకున్నాను. త్రికరణ శుద్ధిగా గాంధీయిజంలో నాకున్న విశ్వాసం వారికి నామీద విశ్వాసం లేకుండా చేసింది. ఆయన, ఆయన సహచరులైన తెనాలి మేధావులు,

యం.యన్.రాయ్‌గారి హేతువాద ప్రభావంలో పడిపోయేముందు సోషలిస్టులుగా మారారు. గోపీచంద్ రాయిజం వైపు ఎప్పుడు మారారో నాకు తెలియదు. మతము, శాస్త్రపరమైన రాయ్ ఆలోచనా ధోరణి గోపీచంద్‌కు క్రొత్తకాదు. ఆంధ్ర ఆత్మగౌరవ ఉద్యమ పితామహుడు, కవిరాజు అయిన ఆయన తండ్రి శ్రీ త్రిపురనేని రామస్వామి, సాంఘిక సంస్కరణోద్యమాల పరంగా సాగించిన కృషిద్వారా హేతువాదానికి అప్పటికే బాట లేర్పరిచారు. ఆయన తండ్రి ఆత్మగౌరవ ఉద్యమంలో రాయిజం బీజాలను నాటడం గోపీచంద్ చేసి మామూలుపనే.

గోపీచంద్ ఈనాటి నూతన తెలుగు వచన రచనకు ఒక ప్రేరణ కలిగిన సమర్థులైన రచయిత. ఆయన రాసిన చిన్న కథలు, నవలలు బాగా ప్రజాదరణను పొందాయి. సాంఘిక ఇతివృత్తాలను ఎన్నుకోవటంలో, చెప్పే పద్ధతిలో ఆయనకు ఆయనే సాటి. ఈ రెండో అర్ధ శతాబ్దంలో తెలుగు వచన రచనకు ఆయన ఒక చక్కటి బాటను సృష్టించారు.

తెలుగు విమర్శకులు, ఆత్మకథల రచయిత పండిత గొల్లపాటి వారు నవీన తెలుగు చిన్న కథా రచనకు గోపీచంద్ అందించిన పట్టును ప్రశంసించారు. డాకూర్మా వేణుగోపాల స్వామి యం.ఏ.గారు "తెలుగు సాహిత్యం" పై గోపీచంద్‌గారు చేసిన రేడియోప్రసంగాలను అందులో వారు ప్రదర్శించిన సాంకేతిక విలువలను, సామాజిక దృష్టిని బహుధా కొనియాడారు.

చాలాకాలం గడచిన తరవాత సినిమా ప్రపంచంలో ఆయన ఒక కాంతికిరణంగా తెలుగొందటం నేను చూశాను. 'లక్ష్మమ్మ' అనే ఒక మంచి చిత్రాన్ని ఆయన నిర్మించారు. సాహిత్యానికి వెండితెరకు ఆ సినిమా అందించిన విలువలను కొనియాడుతూ "కృష్ణపత్రిక" మంచి సమీక్షను ప్రకటించింది. నేనూ భారతీదేవి ఇద్దరమూ ఆ సినిమాను చూసి రామస్వామి గారి అబ్బాయి ఒక మంచి సినిమాను తీశారని సంతోషించాం. ఆయన విజయవంతమైన దర్శకులు కాగలగటం చూసి ఆనందించాం.

కారణాలేవైనప్పటికీ ఆయన సినిమాల ద్వారా ఎక్కువ డబ్బు ప్రోగుచేయలేక పోయారు. ఆయన తండ్రి లాగే ఆయన కూడా ఆదృష్టసలాన్ని అందుకోలేకపోయారు.

ఆయన ఆలిండియా రేడియోలో చేరుతున్నారనే సంగతి మా ఉభయులకూ మిత్రులైన మోటూరు సత్యనారాయణ యం.పి.గారి ద్వారా నేను తెలుసుకున్నాను. ఆయన్ను ఉపయోగించుకోవటం ద్వారా రేడియో తెలుగు విభాగం మంచి ప్రయోజనాలను పొందగలదని మేమంతా భావించాం. మరొక ప్రక్క ఆంధ్ర మంత్రి వర్గం ఆయన సామర్థ్యాన్ని తమ ప్రచారం కోసం వినియోగించుకోవాలని భావించింది. నేను భయపడినట్టుగానే అక్కడ ఆయన సంతృప్తి చెందలేక బైటకు వచ్చారు.ఆ విధంగా సందర్భవశాత్తూ తిరిగి ఆయన రేడియోకే రావలసి వచ్చింది.

నేను తెలుగురేడియో కేంద్రం వారికి కృతజ్ఞతలు తెలియజేస్తాను. ఎందుకంటే గోపీచంద్ గారున్నందుకే గాదు, జాషువాగారు, కాటూరి వారు, పింగళివారు, దీక్షితులుగారు, ఇంకా ప్రముఖులైనతెలుగు కవులకు రచయితకు భావవేదికగా పనిచేస్తూ దానితో పాటు వారి చిల్లర ఖర్చులకు అవసరమైన అంతో ఇంతో అందిస్తున్నందుకు.

నేను నెహ్రూ నాయకత్వాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ పక్షం నుంచి బైటకు వచ్చిన తరవాత గోపీచంద్ నా ప్రజాహిత కార్యక్రమాల వైపు తన దృష్టిని మరల్చారు. నెహ్రూ సోషలిజం కన్నా వినోభా భావే ఉద్యమం భారతదేశానికి ఎక్కువ ప్రయోజనకారియని ఆయన తలపోశారు. "వాహిని" పత్రిక జన్మదిన సంచికకు తన సందేశాన్నిస్తూ అందులో "నా రాజకీయ రధాన్ని వినోభా భావే మార్గం"లో కలుపవలసిందిగా నాకు సలహా ఇచ్చారు. వినోభాభావేగారి గ్రామదాన ఉద్యమాన్ని వ్యతిరేకిస్తూ నెహ్రూజీతో చేతులు కలిపినపుడు సహకార వ్యవసాయాన్ని గురించిన నాగపూర్ ఉద్యమ సందర్భంలో ఆయన నన్ను అర్థం చేసుకొన్నారు. రైతు స్వామ్యాన్ని పరిరక్షించడంలో భావేయిజం చేసి పెద్ద తప్పు నుంచి రక్షించడంలో నా ఈ కృషి ఎంత ప్రాముఖ్యత కలిగి ఉందో ఆయన గ్రహించారు. దాదాపు శ్రీ ఆవుల గోపాల కృష్ణమూర్తి (మరో ప్రముఖ తెలుగు రచయిత) నాయకత్వంలో ఉన్న రాయిస్టులందరూ, నేను ప్రారంభించిన స్వయంవృత్తుల ఉద్యమం నా రైతాంగ దృక్పథం యుద్ధానంతరం ప్రపంచ పరిణామాల్లో వచ్చిన మార్పులలో రాయిజానికి ప్రాణం లాంటివని భావించారు. ప్రాణరహితమైన కమ్యూనిస్టు ఏకీకృత విధానానికి నిజమైన ప్రతిద్వందిగా నా విధానాలు నిలిచి రాయిజానికి దగ్గరలో ఉండగలవని వారు నమ్మారు. అందువల్ల వారు నాకూ, భారతదేశానికి పెద్ద దిక్కైన రాజాజీకి తమ ఆదరపూర్వకమైన సహకారాన్ని అందించడానికి ముందుకొచ్చారు. నేను ఇప్పుడు వారిలో సమర్థవంతమైన మేధావి వర్గాన్ని పట్టుకోగలిగాను. శ్రీ గోపీచంద్ ఆయన సహచరులైన రాయిస్టులు అనేమంది సమకాలీన తెలుగు సాహితీ క్షేత్రంలో లబ్దప్రతిష్ఠులైనవారు. ఆయన రచనలు అవి ఆలోచనను రేకెత్తించేవి గనుక ముఖ్యంగా మేధావి వర్గాన్ని ఎక్కువగా ఆకట్టుకున్నవి. ఆయన ఇటీవల వ్రాసిన పుస్తకం "పోస్టుచేయబడని ఉత్తరాలు" వస్తు రూపంలోనూ, ఆలోచనా రీతిలోనూ అత్యున్నతమైనదిగా పరిగణించబడ్డది.

2-11-1962న చిన్న వయస్సులోనే గోపీచంద్‌ను విధి తలాలున మననుంచి తీసుకెళ్లడమనేది గొప్ప విషాదకరమైన సంఘటన. ఆయనకు దైవంలో విశ్వాసం కలగటం జరిగింది. తండ్రి మార్గంలో పయనించిన ఆయన ఇటీవల, తన తండ్రి స్వర్గలోకంనుంచి పాపభూయిష్టమైన ప్రస్తుత పాలకుల అవినీతిని ఖండించేందుకు గాను భూలోకానికి దిగి వచ్చినట్లుగా ఒక నాటకం రాశారు. ఆయనకు గుర్తున్నంతవరకు ఇది అసందర్భం కాదు. ఎందుకంటే వారి నాన్నగారితో, భారతదేశంలో మతాతీత దృష్టిని సాధించలేకపోయినందుకు, కులతత్వం అవినీతి వంటి వాటిని దూరంగా నెట్టివేయలేకపోవటం వంటి విషయాలపై నేను సాగించిన చర్చలకు ఆనాడు గోపీచంద్ సాక్షీభూతులుగా ఉన్నారు.

20

గుజరాత్ నాయకులు దాదూభాయ్, భాయ్‌కాకా

మహాత్మాగాంధీ తన సత్యాగ్రహ మంత్రదండం ద్వారా రైతులను ఆత్మగౌరవ పోరాటంవైపు పురికొల్పిన నాటినుంచి అంటే 1917 ప్రాంతంనుంచే గుజరాత్, బీహార్‌లో నేనంటే ఓ ప్రత్యేకమైన ఆకర్షణ ఏర్పడింది. దీర్ఘకాలంగా బాధలనుభవిస్తున్న ఆ రైతులు గాంధీజీ పిలుపు నివ్వడంతోనే ధైర్యంగా ముందుకు వచ్చి ఆయనను తమకు రక్షకునిగా భావించి కృష్ణ భగవానుని గోపాలురు, పాండవులు అనుసరించినట్లుగా అనుసరిస్తూ, నాలో ఉన్న రైతును ఆ రైతులు అభినందించారు.

చాలాకాలం తరవాత ఆ రైతులను కలుసుకొని నా పాత అనుభవాలను నెమరువేసుకొంటూ, కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య సిద్ధాంతంవైపు వారిని నడిపించేందుకు నేను బీహార్ గుజరాత్‌లలో పర్యటించాను. ఈ కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతం ఈ శతాబ్దంలోని మొదటి రెండు దశాబ్దాల కాలంలో చాంపరాన్, కైరా, పోరాటాల ప్రారంభపు దినాల్లో మేము ప్రారంభించిన కేత్ మజ్‌దూర్ ఉద్యమం జాతీయ నాయకులు, రైతు అభిమాని వారి ప్రియతమ నాయకులు అయిన మహాత్మాగాంధీ గారి ఆశీస్సులు పొందినట్టిదే. నన్నూ శ్రీమతి భారతదేవిగార్లను బిహ్తాకు చెందిన స్వామి సహజానంద సరస్వతి, నియమత్‌పూర్ ఆశ్రమానికి చెందిన యదునందన్ శర్మగారలు బీహార్‌లో పర్యటన నిమిత్తమై తీసుకెళ్లారు. 1937-42 సంవత్సరాల మధ్యకాలంలో, జమీందారీ షావుకారీ విధానాలకు వ్యతిరేకంగా విప్లవ ప్రబోధాన్ని చేస్తూ కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యం గురించి వివరిస్తూ మేము అనేక మార్లు బీహారులో పర్యటించాం. ఫతేదార్లను, యాదవులను, క్షత్రియులను, హరిజనులను, ఆదివాసులను, రైతులుగా, కేత్ మజ్దూరులుగా గుజరాత్‌లో ఉంటున్న వీరందరను గాంధీజీ ఆశీస్సులు పొందిన కిసాన్-మజ్‌దూర్-కళాకార్-బుద్ధి జీవి (ప్రజా) రాజ్య సిద్ధాంతం వైపు సమీకరించేందుకు శబరకాంత-అహమ్మదాబాద్‌లకు చెందిన దాదూభాయ్ అమీన్ నన్ను 1951-59 సంవత్సరాల కాలంలో గుజరాత్ రైతుల వద్దకు తీసుకెళ్లారు.

1952వ సంవత్సరంలో ఒక పక్షం రోజులపాటు చేసిన నా గుజరాత్ పర్యటనలో, దాదూభాయ్, నన్ను గుజరాత్ ప్రజలకు గాంధీజీ రైతు వారసునిగా పరిచయం చేశారు. ఆ సమయంలో మిగతా కాంగ్రెస్ నాయకులంతా గాంధీ మహాత్ముడు రైతాంగానికి చెప్పిన సందేశాన్ని మరచిపోయి, ఆయన పేరును మాత్రమే ఉపయోగించుకొని అధికారాన్ని అనుభవిస్తున్నారని ఆయన వారిపై నేరారోపణ చేశారు. నా మాటలను గాంధీజీ మాటలుగానే గ్రహించవలసిందని ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

దాదూభాయ్ సమర్థుడైన మంచి వక్తకాదు. కనీసం చక్కటి భావప్రకటనను అందించగలిగే సామర్థ్యమూ లేదు. అయితే ఖంగుమనే ఆయన కంఠధ్వని, సింహంలాంటి ధైర్యం, కిసాన్

మజ్దూర్ ప్రజారాజ్య స్థాపనలో ఉన్న అచంచలమైన విశ్వాసం ఆయనను వీటితో నిమిత్తం లేకుండానే చాలా గొప్పవాడిగా నిలబెట్టాయి. ఆ గ్రామీణ ప్రాంతాల రైతు జనాల్లో ఆయన పట్ల ఉన్న ఆదరణను, ఆప్యాయతను చూసి నేను సంతసించాను. తను ప్రేమించే గుజరాత్ లో అన్యాక్రాంతంగా రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో తిష్ట వేసి కూర్చున్న వారికి వ్యతిరేకంగా గాంధేయ మార్గంలో సత్యాగ్రహ నిర్వహణకు ఆయన ఇచ్చిన పిలుపును అక్కడి రైతులు ఒక సవాలుగా తీసుకొని ముందుకు రావడం చూసి నేను ముగ్ధుడనై నాను.

అనేకమంది ప్రఖ్యాతి వహించిన రైతు నాయకులు, పత్రికల వారు, ఒకప్పుడు గాంధీజీ సర్దార్ పటేల్ లతో సత్యాగ్రహంలో పాల్గొన్నవారు, ఈనాడు మా పర్యటనలో మాకు లభిస్తున్న స్వాగత సత్కారాలను ప్రజాభిమానాన్ని చూసి నివ్వెరపోయారు. ఆనాడు ఆ సత్యాగ్రహ పోరాటాలు బ్రిటిష్ పరిపాలనకు వ్యతిరేకంగా నిర్వహించబడితే, ఈ నాడు ఈ పోరాటాలు కాంగ్రెస్ పాలకులకు వ్యతిరేకంగా గుజరాత్ గ్రామీణ ప్రజలను ముందుకు నడిపించేందుకు ప్రారంభమయ్యాయి. వాటికీ వీటికీ ఇదే ప్రధానమైన తేడా. అనేకమార్లు గాంధీగారి చేత ప్రశంసించబడి పవిత్రుడిగా పేరుగాంచిన మొరార్జీదేశాయ్ వల్లభాయ్ పటేల్ గారి పేరు మీద అధికారాన్ని పొంది అప్పుడు గుజరాత్ లో కాంగ్రెస్ పార్టీకి నాయకత్వం వహిస్తూ ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో విసుగుచెందిన అనేకమంది కార్యకర్తలకు మా ఉద్యమం హుషారు నిచ్చింది. దురదృష్టవశాత్తూ దాదూభాయ్ తనతో టి సహచర నాయకుల నుంచి సహకారాన్ని సంపాదించుకోలేకపోయారు. అలాగే ఆశావహులైన అనుచరులను ఎక్కువ కాలం అలాగే తనతో నిలిపి ఉంచుకోలేకపోయారు. ఎందుకంటే కృషికార్ లోక్ పార్టీ యూనిట్లకు నేనుగానీ, కేదత్ సంఘానికి దాదూభాయ్‌గానీ కావలసిన నిధులను సమకూర్చలేకపోయాం.

దాదూభాయ్ చాలా చిన్నతనంలోనే, అహమ్మదాబాదు పురపాలకసంఘ ఎన్నికలలో వల్లభాయ్ పటేల్ నాయకత్వానికి ఎదురుగా నిలిచి, ఆయన అభ్యర్థులను ఓడించి మునిసిపల్ కార్పొరేషన్ లో మెజారిటీని సాధించి రాజకీయ ప్రతిష్టను సంపాదించుకున్నారు. అహమ్మదాబాదు మునిసిపల్ రాజకీయాలలో ఎవరు ముందుకు రాదలచినా అగ్గితుఫాను లాంటి దాదూభాయ్ సమర్థనను ముందుగా సంపాదించుకొనేవారు. ఆయన వల్లభాయ్ పటేల్ సోదరులైన విఠల్ భాయ్ పటేల్ అంటే ఎక్కువ ఇష్టంగా ఉండేవారు. వాళ్లిద్దరకూ అహింస అంటే జపతపాదుల పరమైన ఒక సాధనంగా కాకుండా రాజకీయాలకు అవసరమైన ఒక ఆయుధంగా ఉపయోగించుకోడం మంచిదనే అభిప్రాయం ఉండేది. అహమ్మదాబాదు నగరంలో విఠల్ భాయ్ ఫిగ్రహస్థాపనకు దాదూభాయ్ ప్రధానపాత్రను వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయవలసినదన్న నా పిలుపుకు ఆయన ప్రతిస్పందిస్తూ విఠల్ భాయ్ చూపిన మార్గంలోనే తాను ముందుండి పనిచేయగలనని చెప్పారు.

ఫ్రాగ్జీ.భాయ్, కుశల్ భాయ్ పటేల్ 1928-29 సంవత్సరాలలో బార్డోలీ కిసాన్ సత్యాగ్రహంలో వల్లభాయ్ పటేల్ గారితో పనిచేసినవారు, అందరకూ తెలిసిన భాయ్‌కాకా అని పిలువబడే భాయీ లాల్ భాయీ పటేల్ వల్లభ విద్యా విద్యాలయం ఉపాధ్యక్షులు. గుజరాత్ లో

14606
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6.

కృషీకార్ లోక్ పార్టీని ప్రవేశ పెట్టే సందర్భంలో ఆయన మాతో కలిశారు. వారు అప్పటికే కృపలానీగారి కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీనుంచి తప్పుకున్నారు. ఎందుకంటే దాదూభాయ్ తీవ్ర ధోరణితో వారు ఇమడలేకపోవటమే గాకుండా దాదూభాయ్ మొరార్జీ దేశాయ్‌నే కాకుండా వల్లభాయ్ పటేల్ రాజకీయాలను గూడావ్యతిరేకిస్తుండడంతో వల్లభాయ్ పటేల్ గుజరాత్ ముఖ్యమంత్రిత్వాన్ని మొరార్జీకి వప్పజెప్పడానికి ప్రధానకారకులైనారనే భావంతో వారు ఈ నిర్ణయాని కొచ్చారు. నా సలహాలను ఆయన పూర్తిగా పాటించలేకపోయారు. ఆ తరువాత మేము 1959 వరకు దాదాపు ఎనిమిది సంవత్సరాలు వేచి ఉన్న తర్వాత తిరిగి స్వతంత్ర పార్టీ వేదిక మీదికి ప్రముఖులైన గుజరాత్ రైతు బిడ్డలందరిని కలుపుకు రాగలిగాం. ఈ సారి రాజాజీ, గిరి, నాయెక్కి సమిష్టి నాయకత్వంలో ఈ కృషి ఫలించింది. రాజపుత్రులు, ఆదివాసీలు, దాదూభాయ్ ప్రోద్బలంతో అసెంబ్లీ ఎన్నికలలో భాయ్‌కాకాను ఓడించిన వారొకవైపు, ఉభయులు మాతో కలిశారు. భాయ్ కాకా, దాదూభాయ్ పరస్పరం తమ విభేధాలను మరిచిపోయి ఒకరితో మరొకరు కలువగలిగారు. భాయ్‌కాక సర్వ సమదృష్టి, దాదూభాయ్ తీవ్రకాంగ్రెస్ వ్యతిరేకత, నా రైతు తత్వం కలిసి అక్కడ ప్రజాభిమానాన్ని చూరగొన్నాయి.

1952 నాటి నా గుజరాత్ పర్యటన అక్కడ ఒక శక్తివంతమైన గ్రామీణ ఉద్యమాన్ని ప్రారంభించేందుకు బాటను వేసింది. ఆ ఐక్య వేదికను భాయకాకా ఉపయోగించుకొని 1960నాటికి స్వతంత్రపార్టీకి ఒక గట్టి పునాదిని వేయగలిగారు. అది 1967-69 సంవత్సరాలలో కాంగ్రెస్ మంత్రివర్గాన్ని పూర్తిగా పెకలించి వేయగలిగింది. దాదూభాయ్ తన శక్తిని, నిధులను, విస్తృతమైన వనరులతో గూడిన నాయకత్వాన్ని ఇవ్వడం ద్వారా గుజరాత్‌లో కాంగ్రెస్ పార్టీకి ప్రతిగా ఒక శక్తివంతమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని అందించగలిగారు.

దాదూభాయ్, భాయ్‌లాల్ భాయ్‌గార్లు ఇద్దరూ రెండుమార్లు ఆంధ్రదేశం వచ్చి నాతో కలసి గ్రామీణ ప్రాంతాలలో పర్యటించి ఆంధ్రప్రజలపై తమకున్న విశ్వాసాన్ని అభిమానాన్ని చాటుకున్నారు. దాదూభాయ్ 1953లో తెనాలిలో జరిగిన కృషీకార్ లోక్ పార్టీ మహాసభలకు హాజరయ్యారు. భాయ్‌లాల్ భాయ్ 1967వ సంవత్సరంలో శ్రీకాకుళంలో జరిగిన ఆంధ్ర స్వతంత్ర పార్టీ మహాసభకు అధ్యక్షత వహించారు. 1959వ సంవత్సరము వేసవిలో ప్రకాశం జిల్లా మేదరమెట్లలో నాగినేని వెంకయ్యగారిచే నిర్వహింపబడిన రైతాంగ విద్యాలయంలో విద్యార్థుల నుద్దేశించి వీరిద్దరూ ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన సహకార వ్యవసాయ సూత్రాలకు వ్యతిరేకంగా మద్రాసులో వ్యవసాయదారులు జరుపుకున్న సభకు వీరు ఇద్దరూ హాజరైనారు. వారు అక్కడ స్వతంత్ర కిసాన్ విభాగసంస్థాపనలో మాతో కలిసి పాలుపంచుకున్నారు.

దాదూభాయ్ మహాగుజరాత్ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయవలసిందని కోరారు. మహా గుజరాత్ కోసం తొలి ప్రజా ప్రదర్శన పటేల్ సాపై టీలోని ఆయన భవనం నుంచి ప్రారంభమై, చివరకు ఆది ప్రత్యేక గుజరాత్ ఏర్పాటుకు దారి తీసింది. దాదూభాయ్ పూర్వపు బొంబాయి రాష్ట్ర విధాన సభలో యం.యల్.సి.గా ఉన్నారు. ఆయన భారత్ కిసాన్ సమ్మేళనానికి ఉపాధ్యక్షుడుగాను, గ్రామీణ ప్రజాసమ్మాక్కు, స్వతంత్ర పార్టీకి కూడా ఉపాధ్యక్షులుగా పని

చేసారు. ఆ సమయంలో ప్రతి ప్రజా ఉద్యమంలోనూ ముందుండి నడిపిస్తూ ఉండేవారు.

దాదూభాయ్‌జీ రంగా ట్రస్టుకు ఆది ప్రారంభమైన 1956వ సంవత్సరం నుండీ సభ్యులుగా ఉన్నారు. అందులో ఆయన సేవలు నాకూ శ్రీమతి భారతీదేవికి సంతోషాన్ని కలిగించాయి.

దాదూభాయ్ అంత పొడగరీకాక, పొట్టీకాక సామాన్యమైన ఎత్తులో ఉండి కంచు కంఠంతో దృఢమైన శరీరంతో చాలా గట్టిగా ఉండేవారు. ఆయన వ్యాపారం ద్వారా ఎక్కువగా సంపాదించారు. ఆయన తన ముప్పై సంవత్సరాల వయస్సు నుంచీ అహమ్మదాబాదు పురపాలక సంఘ రాజకీయాలలో ప్రముఖంగా పనిచేస్తూ, సర్దార్ పటేల్‌తో గూడ కలిసి పనిచేశారు. గుజరాత్ రాజకీయాలలో రైతులకు ఫలేదారులకు ప్రముఖస్థానాన్ని సంపాదించడానికి ఆయన అన్ని వేళలా కృషిచేస్తూ ఉండేవారు. గత ఇరవై సంవత్సరాల కాలంలో దాదూభాయ్ ఆయన కుటుంబ సభ్యులు నాకు తమ కుటుంబ పెద్దలాగా అత్యున్నత గౌరవాన్ని ఇస్తూ మరచిపోలేని ఆతిథ్యాన్ని అందిస్తుండేవారు. ఆయన వ్యక్తిగత సేవకుడు శ్రీ పండు కూడా కిసాన్ ఉద్యమ అభిమాని, తగని ప్రేమతో ఆయన నాకు సేవలందిస్తుండేవారు. ఆయన భార్య గొప్ప హిందూ మాతృమూర్తి. ఇతరులను ఆదరించడంలో దిట్ట. అంతర్జాతీయ రైతాంగ ఉద్యమ నాయకులు ఫెరిన్ నాగీ, జార్జ్ డిమిట్రో గార్లు, రాజాజీ, క్రిపానియా గార్లు ఆమె ఆదరణకు, సభ్యతకూ ఆతిథ్యానికీ ముగ్ధులైనారు.

ఈ ప్రముఖ భారతరైతాంగ నేతలు దాదూభాయ్‌జీ, భాయకాకా గార్లు ఒకరికి ఒకరు బాగా దగ్గరగా ఉంటున్న వారు, భయం ఎరుగని ప్రముఖులు. దురదృష్ట వశాత్తూ రెండు సంవత్సరాల ఎడంలోనే మనలను వీడిపోయారు. 1971-72 సంవత్సరాల కాలంలో భారత రైతాంగం సామాజిక విప్లవ చైతన్యంతో ముందుకు అడుగేస్తున్నప్పుడు దేశ రైతాంగ నేతలుగా ఉన్న ఈ ప్రముఖులిద్దరూ ఆకస్మాత్తుగా అస్తమించారు.

భాయ్‌కాకా

కైరా జిల్లాకు చెందిన భాయిలాల్‌భాయ్ పటేల్ యీ శతాబ్దంలోని గుజరాత్ ప్రముఖుల్లో ఒకరు. స్వాతంత్ర్యానంతరం ఆయన ఆనంద్‌లో వల్లభ్ విద్యానగర్ నిర్మాత, స్థాపకులుగా ప్రాముఖ్యంలోకి వచ్చారు. రెండు దశాబ్దాల కాలంలో గొప్ప విశ్వ విద్యాలయాన్ని కొద్దిపాటి ప్రభుత్వ సహాయం మాత్రమే వచ్చినప్పటికీ ఎక్కువ ప్రజా సహకారంతో నిర్మించగలిగిన గొప్పవ్యక్తి. ఈ విశ్వ విద్యాలయానికి మొదటి ఉపాధ్యక్షులుగా ఉంటూ నిర్మాణాత్మకమైన తన విజయాల ద్వారా మిగతా ఉపాధ్యక్షులందరకు ఆయన మార్గదర్శకులు కాగలిగారు.

సింధ్ ప్రాంతంలో సుక్కూర్ బ్యారేజీ నిర్మాణాన్ని అతి వేగంగా పూర్తిచేసి సేద్యపు అవకాశాలను అభివృద్ధి చేసుకునేందుకు వీలు కల్పించడం ద్వారా ఆయన ఒక గొప్ప ఇంజనీరుగా ఉత్తమ నిర్మాణ దక్షునిగా పేరుపొందారు. మన ప్రణాళికా సంఘంకన్నా ముందు దృష్టితో

క్రమమైన పద్ధతిలో భాయీలాల్ జీ పథక రచనచేసి వల్లభ్ విద్యానగర్‌ని అతివేగంగా పూర్తిచేసి శాశ్వతంగా జ్ఞాపకం ఉంచుకోదగిన నిర్మాణశైలిని అందులో చూపెట్టారు. ఇలాంటి వాటిని చూసి ప్రణాళికా సంఘంపోటీ పడితే బావుంటుంది.

విశ్వ విద్యాలయ నిర్మాణంలో ఓక్షణం తీరిక లేకుండా పనిచేస్తూనే పాడుబడిన మట్టి దిబ్బల్లో నుంచి చారిత్రాత్మక అవశేషాలను అతి ఆరుదైన వాటిని సేకరిస్తూ ఉండేవారు. ఆయన ఒక మట్టిదిబ్బలో నుంచి సంగ్రహించిన సరస్వతీదేవి, బ్రహ్మల నిలువెత్తు విగ్రహాన్ని చూసి నేను చాలా ముగ్ధుడనయ్యాను. ఆయన తరచు తన బహిరంగ వేదికగా ఉపయోగించుకునే మామిడి చెట్టు క్రింద ఈ విగ్రహాన్ని స్థాపించారు.ఆయనకు బ్రాహ్మలిపిలో ఉన్న చక్కటి ప్రవేశాన్ని చూసి నేను ఆశ్చర్యపోయారు. తరచు ఆయన ఆ లిపి ద్వారా మొహెంజొదారోలోనూ ఆ తరవాత ఇతరచోట్ల లభించిన అనేక శాసనాలు తెలియ జెప్పే రహస్యాలను బయటకు తీస్తుండేవారు. మన ప్రాచీన మధ్యకాలం నాటి చారిత్రకాంశాలలోని విచిత్రమైన సంఘటనలను వెలికి తీసుకురావడంలోఎక్కువ ఆసక్తిని కనబరుస్తూ ఉండేవారు. ఆయనకు గౌరవ డి.యస్.సి.ని ఇచ్చినప్పటికి ఆయన కృషికి అది ఏ మాత్రం సరిపోదు.

1953వ సంవత్సరంలో దాదూభాయ్‌గారితో కలసి నేను విద్యానగర్‌కు వెళ్లి అక్కడ వారిని గుజరాత్ రైతులకు నాయకత్వం వహిస్తూ ప్రజారంగంలో పనిచేయమని కోరిప్పుడు, ఆయన తనకెంతో అభిమాన పాత్రయైన విశ్వ విద్యాలయాన్ని వదలి రావడానికి తన అయిష్టతను ప్రకటించారు. రైతులు పడుతున్న బాధలు, భరిస్తున్న బాధ్యతలు ఆయనను ఎక్కువగా బాధిస్తూ ఉండేవి. ప్రణాళికా సంఘం రైతులకు వ్యతిరేకంగా ఉంటూ పట్టణ ప్రాంతాలకు అనుకూలమైన దృక్పథాన్ని తీసుకుంటున్నదనే వాస్తవాన్ని గుర్తించిన పార్లమెంటుకు వెలుపల ఉన్న విద్యావేత్తలలో, ప్రజాసేవకుల్లో ఆయన మెదటివారు. మొదటి పంచవర్ష ప్రణాళికలో పన్నుల పెంపుదల ద్వారా రైతులపై అదనపుభారాన్ని మోపుతూ గ్రామీణ ప్రాంతపు వనరులను పరిశ్రమాభివృద్ధికి తరలిస్తూ పట్టణాలలో ఉన్న మధ్యతరగతి వారికి ఉద్యోగాలు కల్పించేందుకు చేసే ప్రయత్నాన్ని మీరెలా అంగీకరించారని ఆయన నన్ను ప్రశ్నించారు. అప్పటినుంచి ఆయన పంచవర్ష ప్రణాళికలోని రైతాంగ వ్యతిరేక ధోరణులకు వ్యతిరేకంగా అవిశ్రాంతంగా పోరాటంసలుపుతూ వచ్చారు. ఎప్పుడైనా ప్రణాళికలను గురించి మాట్లాడవలసి వస్తే ఆయన కోపంతో ఊగిపోతుండేవారు.

కాంగ్రెస్ ప్రభుత్వపు అధికారపు రొచ్చుగుంటలోకి విశ్వవిద్యాలయం పడిపోయిన తర్వాత, మేము ఆయనను చారిత్రక పరిశోధన, శిల్ప నిర్మాణం, గ్రామీణ పునర్నిర్మాణం, ట్రస్టుయొక్క పారిశ్రామిక కార్యకలాపాలు వీటన్నిటితోపాటు గుజరాత్ రైతుల నాయకత్వ బాధ్యతను కూడా పైన వేసుకోవలసిందిగా కోరాం. గుజరాత్ సాహిత్యాభివృద్ధి వంటి ఎన్నో బరువు బాధ్యతలు ఆయనపై ఉన్నప్పటికి మేము ఆయనను గుజరాత్ నాయకులకు నాయకత్వం వహించి రాజకీయాల్లో ప్రవేశించమని తిరిగి అభ్యర్థించాం. స్వతంత్ర రైతాంగానికి వారి కమతాలు, ఆస్తి హక్కును కాపాడుకునేందుకు ఉన్న రాజ్యాంగం లోని ప్రాథమిక హక్కును

తొలగించేందుకు నెహ్రూ విసిరిన సవాలును చూసి ఆ బాధలో ఆయనగూడా మాతోపాటు పాలుపంచుకున్నారు. ఆయనకు ప్రేమ పాత్రులైన కేదత్‌లు, ఫలేదారులు, యాదవులు, హరిజనులు, గుజరాత్ భిల్లులు, వారు తరతరాలుగా అనుభవిస్తున్న ఆర్థిక స్వేచ్ఛకు వారి సామాజిక గుర్తింపుకు ప్రమాదం తలెత్తించిందని ఆయన గ్రహించారు. ఒకసారి రైతులు తమ కమతాలపై యాజమాన్యాన్ని స్వయం వృత్తిహక్కును కోల్పోతే, సాహసవంతులైన భిల్లులు, రాజపుత్రులు దేశ సరిహద్దులను కాపాడడానికి జరిపిన వీరోచిన పోరాటాలను, ఆనాటి సాంస్కృతిక సంపదను గమనించి పోటీ పడడానికి భారత ప్రజలకు ఇకముందు అవకాశం ఉండబోదని గత చరిత్రతో బాగా పరిచయమున్న ఆయన గ్రహించగలిగారు. తుదకు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకై ఎక్కువ సమయాన్ని ప్రజారంగంలో గడిపేందుకు ఆయన మాతో అంగీకరించారు.

తిరిగి 1959 ఏప్రిల్, మే నెలలలో దాదూ భాయ్ ఇంట్లోను, ఆనంద్ పట్టణంలోను మేము కలుసుకున్నాం. సహకార వ్యవసాయపు ఏర్పాట్లకై మేము ప్రారంభించిన పోరాట కార్యక్రమంలో మాతో కలసి వచ్చేందుకు ఆయన అంగీకరించేటట్లు చేయగలిగాం. సర్దార్ పటేల్ ఆయనలాంటి ఉత్తమ నాయకుడ్ని మనకందించారు. రైతుల స్వాతంత్ర్యాన్ని హరించేందుకు ప్రభుత్వం చేస్తున్న బాధ్యతారహితమైన, ఆత్మహత్యా సదృశమైన చర్యలను ఆయన గర్హించారు. రాజాజీ ఆశీస్సులతో సర్దార్ లాల్ సింగ్ మద్రాసులో ఏర్పాటు చేసిన మహాసభకు రావలసిందిగా మేము వారిని ఆహ్వానించాం. మా ఈ కృషిలో అన్ని విధాలా మాతో చేతులు కలిపేందుకు ఆయన అంగీకరించారు. మద్రాసు మహాసభలో కేదత్‌ల రక్షణ కోసం రాజకీయాల్లోకి దూకవలసిందిగా రాజాజీ ఆయనను కోరారు. అప్పుడు ఆయనా, దాదూభాయ్‌గారులు స్వతంత్ర పార్టీ వ్యవస్థాపకులుగా మాతో కలసి గుజరాత్‌లో దానికి ముఖ్యనాయకులుగా ఉన్నారు.

భాయీ లాల్‌జీ గొప్ప మేధావి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు కులతత్వాలకు అతీతంగా పరస్పర ప్రయోజనం కోసం ఏకోన్ముఖులై భారతరాజకీయ రంగంలో వేర్వేరుకులాల గ్రామీణ ప్రజలు ఒక్కటిగా పనిచేస్తే ముందుకెళ్లాలని ఆయన కృషి చేసారు. ఆయనకు సాహసంతులైన రాజపుత్ర నాయకులన్నా వారితోటి భిల్లులన్నా ఎల్లప్పుడూ తరగని ప్రేమ. వారి పూర్వగాధలు, సాహస కృత్యాలు ఆయన బుర్రనిండా రంగురంగుల్లో కథలు కథలుగా నిండి ఉంటాయి. ఆ స్మృతులు ఇప్పటికీ వారి అంతేవాసులైన రాజపుత్రులు, భిల్లు అభిమానం నుండి ఆయనను దూరం కాకుండా కాపాడుతూ ఉంటాయి. భాయీకాకా గుజరాత్ ఫలేదారుల నుంచి ప్రభవించినప్పటికి ఈ రెండు గొప్ప తెగల సాహసాల వైపే ఆయనకు మొగ్గు. గుజరాత్ స్వతంత్ర పార్టీ నాయకత్వం అన్నా ఆయనకు అంతే ఇష్టం. విప్లవాత్మకమైన ఆయనను విజయవంతమైన ఈ మార్గంలో ఉంచగలగడం నిజంగా ఒక గొప్ప అదృష్టమే. దీని ఫలితంగా గుజరాత్‌లో స్వతంత్ర పార్టీ అతి పెద్ద ప్రజాస్వామిక ప్రతిపక్షంగా అవతరించగలిగింది. ఆయన అతిశక్తివంతుడైన నాయకునిగా గుజరాత్ శాసనసభలో పని చేయగలిగారు.

గుజరాత్ పల్లె ప్రాంతాలలో భాయ్‌కాకాతో కలసి పని చేస్తుంటే అది ఎంతో

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

ఆనందంగా ఉంటుంది. రాజస్థానీ కథలను వీరోచిత గాథలను ఆయన చక్కని మధురమైన శైలిలో వినిపిస్తూ మనకు కాలక్షేపం కలిగిస్తుండే వారు. పాకుల సామాజిక చరిత్రలో ఆయనకున్న జ్ఞానం చాలాగొప్పది. గతాన్ని వర్తమాన సంఘటనలతో పోలుస్తూ చారిత్రకాంశాలను వివరిస్తూ ఆయన మనలను నిలబెట్టేవారు. ఆయన స్పష్టమైన మాటతీరు మనలను ఆనందతరంగాలో ముంచెత్తుతుండేది. పదాల ప్రయోగంలో సామెతలవాడకంలో చారిత్ర జ్ఞానంలో ఆయన సామర్థ్యం అమోఘం. గుజరాత్, రాజస్థాన్ లు కలిసి ఒక ప్రణయ రంగస్థలంగా ఏకమై, కోటలతో కొండలతో, బయళ్లతో, నాయకీ నాయకులతో, ప్రేమికులు వారి పరిజనంతో ఆత్మధనులైన రైతులు, విశ్వాసపాత్రులైన బిల్ల యోధులు, వితరణ శీలురైన వ్యాపారస్తులతో ఎంతో గొప్పగా ఉంటుంది. భాయ్‌కాకా ఒక క్షణం దివినుంచి భువికి అవతరించిన దూతలా ఉంటారు. మరోక్షణంలో మహాయోధుడైన నాయకునిగా కనిపిస్తారు. ఆ వెంటనే మేధావియైన వ్యాఖ్యాతగా ఉంటారు. గుజరాత్ మైదానంలోఉన్న కంకర రోడ్ల వెంబడి దట్టమైన అడవులలో, ఇసుక ఎడారులగుండా గుజరాత్‌లో ఎక్కువరోజులు తిరుగుచున్నప్పుడు నా శరీరానికి వచ్చే నొప్పుల నుంచి మనసు పొందే అలసట నుంచి భాయీకాకా రాజస్థాన్ ప్రజల జీవితాలను ప్రేమైక గాథలను, అలాగే పఠాన్ ప్రజల గాథలను ఇంకెవరూ చెప్పలేనంత చక్కగా చెప్పుతూ పోగొడుతూ ఉంటారు. గుజరాత్ చరిత్రకు ప్రముఖంగా సేవజేసిన గొప్ప విద్వాంసులు, దేశాభిమాని శ్రీ. మున్షీ అంటే భాయ్‌కాకాకు ఎక్కువ ఇష్టం.

భాయిలాల్ భాయ్‌కి కూడా సంస్కృతంలో చక్కని ప్రవేశముంది. భర్తృహరి సుభాషితాలు, జయదేవుని గీత గోవిందం ఆయనకు కంఠతా వచ్చు. ఆయన సంగీత కారుడేమో నాకు తెలీదు. ఆయన శ్రావ్యంగా సంస్కృత శ్లోకాలను చదివి, వినిపిస్తుంటే సంగీతకారుడు కావాలనుకుంటే ఆయన గొప్ప సంగీత విద్వాంసుడయ్యుండేవాడని నాకనిపిస్తుంది.

చలిని, వేడిని పట్టించుకోకుండా ఎక్కడ ఏదిస్తే దాన్ని భుజిస్తూ వేళా పాళా గమనించకుండా ఆయన చేసే పర్యటనలు చూసినప్పుడు అప్పటికి ఆయనకు డెబ్భయి సంవత్సరాలున్నా నలభై సంవత్సరాల వయస్సేమోననిపిస్తుండేది. ఆయన సన్నని కొనలు దేరిని మీసకట్టు, కొంచెం నలుపుతెలుపులో ఉన్నప్పటికి ప్రాచీన కాలంనాటి ఒక మహాయోధునిలా చూపరులకు కనిపిస్తారు. ఆయన మాట్లాడే తీరు ఎదుటివారిని భయపెట్టే పదగుంభన ఆయనలో ఒక విశ్వామిత్రుని చూపిస్తూ శత్రువులను భయపెడుతుండేవి. భాయ్‌కాకాకు స్వాతంత్ర్యానంతర భారతదేశ నాయకుల మీద కన్న మహాభారత కాలంనాటి నాయకులంటేనే ఎక్కువ ఇష్టం.

ఆయన డబ్బు సంపాదించాలనుకుంటే గుజరాత్‌లో ప్రముఖపారిశ్రామిక వేత్త కాగలిగేవారు. ఆయన పారిశ్రామిక నిర్మాణ సామర్థ్యం అంత గొప్పది. ఆయనకున్న పారిశ్రామిక దృక్పథాన్ని, యాజమాన్య నిపుణతను గ్రామీణాభివృద్ధి పథకాలకు, విశ్వ విద్యాలయ నిర్మాణానికి ఉపయోగించేందుకే ఆయన సంసిద్ధులైనారు. ఇంతటి గొప్ప ఇంజనీరు, దేశాభిమాని 1953 నుంచి నాకు స్నేహితుడిగా ఉండడం ఒక అదృష్టంగానే నేను భావిస్తాను.

అధికారంలో ఉన్నవారిని ఎదుర్కోవడం అంటే ఎంతో సంతోషంగా భాయ్‌కాకా ముందుకు వచ్చేవారు. ప్రజారంగంలో అవినీతి పరులైన వారెవరైనా సరే ఆయనతో తలపడాలంటే వణికి పోయేవారు. ఆ సందర్భంలో ఆయననెవ్వరూ ఆపగలిగేవారుకాదు.

భాయ్‌కాకా సర్దార్ వల్లభాయ్‌పటేల్‌కు అభిమాన పూర్వకమైన సహచరుడు. అహమ్మదాబాదు పురపాలక సంఘ నాయకుడు కావటానికి, ఆ నగర ఆరోగ్య పరిస్థితులను మెరుగు పరచడానికి సర్దార్ భాయ్‌కాకాకు తోడున్నారు. సర్దార్ పటేల్‌కు, భాయ్‌లాల్‌భాయ్ మీద గొప్ప విశ్వాసం. అందువల్ల ఆయన అనేక మంది పారిశ్రామిక వేత్తలకు విశ్వవిద్యాలయ నిర్మాణానికి నిధులందించవలసిందిగా సంపాదించారు.

వల్లభ్ విద్యానగర్‌లో ఆయన కుటీరం ముందు చెట్లకు ప్రేలాడదీసిన చిక్కుపుటయ్యలలో ఆయన ఊగుతూ ఉన్నప్పుడు చూడడం ఎంతో సంతోషంగా ఉంటుంది. మృదువైన ఆయన ఆతిథ్యాన్ని అక్కడ అందుకోవడం ఎవరికైనా అదొక గొప్ప సంతోషకరమైన విషయం. ఆయన అభిమానం చాలా దృఢమైనది. ఆయన సహచర్యం సమర్థవంతమైనది. ఆయనా, దాదూభాయ్ ఇద్దరూ ఉద్రేకంలో ఉన్నప్పుడు చాలా భయంకరంగా కనిపిస్తుండేవారు. నిజంగా రైతుల స్వాతంత్ర్యం కోసం కళాకారుల, కవుల, ప్రవక్తల స్వేచ్ఛకోసం పోరాడుతున్నప్పుడు వారు గుజరాత్ గ్రామీణ ప్రాంతాల నిజమైన విశ్వామిత్రులుగా కనిపిస్తూ ఉండేవారు. రాజాజీ, మున్షీల ఆలోచనలోను, బోధనలలోను భాయ్‌కాకా నిజమైన స్వర్గ సుఖాలను చవి చూసేవారు.

1969వ సంవత్సరంలో, ఆయనకు ఎనభై సంవత్సరాల వయస్సు వచ్చిన తర్వాత కార్డియాక్ అస్వస్థత అనంతరం ఆకస్మాత్తుగా అనువులు బాసి భౌతికంగా మనకు దూరమైనారు.

శ్రీ హనుమంతయ్య

శ్రీ కె. హనుమంతయ్య 1952-56 సంవత్సరాలలో మైసూరు, కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఆ తరవాత 1971-72 సంవత్సరాలలో ఆయన పార్లమెంటు సభ్యునిగాను, కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీ ఉపనాయకునిగాను, రైల్వే మంత్రిగాను పనిచేసారు. 1940వ సంవత్సరంలో మైసూరు విశ్వ విద్యాలయంనుంచి డిగ్రీ పొంది బార్ లో ప్రవేశించారు. పరిపాలనా సంస్కరణల సంఘానికి అధ్యక్షులుగా ఉన్నారు. రాష్ట్రంనుంచి జరిగిన ప్రజా పోరాటాలలో ప్రముఖపాత్ర వహించి ఏడుసార్లు జైలు పాలైనారు. ప్రపంచ మందంతటా పర్యటించారు. 1927వ సంవత్సరంనుంచి కాంగ్రెసు కార్యకలాపాలలో పాల్గొంటూ వచ్చారు. హరిజన సేవ, హిందీ ప్రచారవ్యాప్తి, రాజ్యాంగ పరిపాలనా సంబంధమైన విషయాలలో పరిశోధన పట్ల ఆసక్తి, సహకార వ్యవసాయంపైన వ్యతిరేకత ఆయనకు మెండు. (ఎడిటర్)

ఏదైనా ఒకదానిమీద తన ముద్రను ప్రదర్శించటం ప్రతిరోజు ప్రతి ముఖ్యమంత్రికి సాధ్యమయ్యే పనికాదు. తన రాష్ట్రానికి అంచనా కందనంతటి గొప్పపనిచేసి గౌరవ ప్రతిష్ఠలను సంపాదించిపెట్టడం అందరి ముఖ్య మంత్రులకూ సాధ్యమయ్యేదికూడా కాదు. హరేకృష్ణ మెహతాబ్ నవీనపట్టణం భువనేశ్వర్ ని నిర్మించడంద్వారా ఒరిస్సాకు ఆ గౌరవాన్ని సాధించిపెట్టారు. జవహర్లాల్ గారు ఛండీఘడ్ నిర్మాణం ద్వారా పంజాబ్ లో దాన్ని సాధించారు. ఏకాసా చిత్రాలలాంటి భవనాలకు అక్కడ రూపకల్పన చేయించి కళాప్రేమికులను ఆకర్షింపజేయలిగారు. ఈజిప్టు మధ్య ఆసియా నాగరికతలకు పూర్వమే విస్తరించి ఉన్న భారతీయ నిర్మాణ సాంప్రదాయాలకు ఇది అనుగుణంగా పొలిఉండలేదనే విమర్శ ఉన్నప్పటికీ చాలాగొప్పగా దీని నిర్మాణం జరిగింది. మైసూరు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీ కె. హనుమంతయ్య బెంగుళూరులోని విధానసౌధ నిర్మాణంలో మైసూరు కర్ణాటక ప్రాంతాలకు చెందిన హళబేడు, మేల్కోట్, శ్రావణ బెల్గోళ సాంప్రదాయ రీతులను ప్రయోగించి గొప్పకీర్తి నార్జించారు. మైసూరుప్రాంతమంతా అందమయిన భవనాలతో, భూములతో, వనితలతో పురుషులతోనిండియుండగా మరొక నిర్మాణం కోసం ఎందుకింతఖర్చుపెట్టాలని చాలామంది శాసనసభ్యులు ఆశ్చర్యపోయారు. ఆయనను ముఖ్యమంత్రి పదవినుంచి నెట్టివేయడానికి జరిగిన కృషిలో ఇదికూడా ఒక పావుగా పనిచేసింది.

బెంగుళూరు నగరంలో పార్కులు, అందమైన తోటలు, పూలబాటలు రంగురంగుల దీపాలతో వెలుగొందే ఆ నగరంలో ఈనాడు ఇది విహార యాత్రలకు ఒక గొప్ప ప్రత్యేక ఆకర్షణ. శతాబ్దాల తరబడి వర్థిల్లుతూ వచ్చిన వేర్వేరు కళాస్వరూపాలకు ఇది కూడలి అని, దీని కళాత్మకమైన గొప్పతనాన్ని చాలామంది నిపుణులు కొనియాడుతూ ఉంటారు. లక్షలాది వేర్వేరు ప్రాంతాల భారతప్రజలు తమ ప్రాంతాలలో తాము చూడని ఈ గొప్పనిర్మాణ కౌశలాన్ని చూసి ఇన్ని సంవత్సరాలుగా ఆనందిస్తున్నారు. కొయ్య చెక్కడాల్లోనూ, సిమెంటు పనితనంలోనూ,

గోపుర నిర్మాణాల్లోనూ ఇది అత్యంత విశిష్టమైన ఒక భారతీయ అందాన్ని ప్రస్ఫుటంగా విరజిమ్ముతూ ఉంటుంది. భారతదేశంలోని అందమైన నగరాలలో ఒకటైన బెంగుళూరుకు లభించిన ఒక గొప్ప వరమిది. పరిపాలనా సంస్కరణల సంఘాధ్యక్షులుగా, తన ముందు ఆస్థానంలో ఉన్న సీనియర్ అయిన మొరార్జీ దేశాయ్‌గారు చూపించిన మార్గంలో సమర్థుడైన సోషలిస్టు పరిపాలనావేత్త శ్రీ హెచ్.వి.కామత్ సహాయంతో అభ్యుదయకరమైన లోక్‌పాల్, లోకాయుక్త విధానాలకు ఆయన రూపకల్పన చేశారు. మంత్రులు సెక్రటేరియట్‌లోని ఉన్నతాధికారులమీద వచ్చిన ఆరోపణలపై నిష్పక్షపాతంగా రాజకీయ ప్రమేయం లేకుండా, స్వీడన్, బ్రిటన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా దేశాలలో ఉన్నరీతిలో దీనిని తీర్చిదిద్దడానికి ఆయన ప్రయత్నించారు.

మైసూరు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తాను పొందిన అనుభవంలాంటిదే తిరిగి ఇక్కడ అధికార పక్ష సభ్యులనుంచి తనకు ఎదురైంది. అందువల్ల ఆయన ఆ స్థానం నుంచి మారి రైల్వే శాఖామంత్రి అయ్యారు. కొద్ది కాలంలోనే ఆయన రైల్వే శాఖలో చైతన్యాన్ని కలిగించగలిగి రైల్వేబోర్డు చేత, జనరల్ మేనేజర్లచేత భయంతోనో భక్తితోనో పనిచేయించ గలిగారు.ప్రయాణికుల సౌకర్యాల కల్పనలో, సరైన సైముకి బండ్లను నడిపేందుకు, పనిపై పరిశీలన చేయడంలో, పనిముట్లను సమర్థవంతంగా వినియోగించడంలోనూ దీర్ఘకాలంగా కొనసాగుతున్న నిర్లక్ష్య వైఖరినుంచి ఆ శాఖను బైటవేయగలిగారు. రైల్వేబోర్డు ఛైర్మన్‌తో తను తలపట్లకు దిగవలసి వచ్చినప్పుడు రాష్ట్రంలోలాగా ఇక్కడ అధికారులచేత పనిచేయించలేమని, పార్లమెంటుగాని, పత్రికలుగాని, అధికారులను నేరుగా ఆదేశించలేవని ఆయన గ్రహించారు. గతంలో ఆయన ముఖ్యమంత్రిపదవిని వదులుకున్నట్లుగానే ఇప్పుడు ఢిల్లీలో మంత్రి పదవిని వదులుకోవలసి వచ్చింది.మంత్రుల ఇష్టాఇష్టాలకన్నా అధికారుల నిర్ణయాలపైనే ఎక్కువగా నడిచే ఈ ప్రజాస్వామ్య వ్యవస్థ పరిధులలో ఆయన నర్దుకోలేకపోయారు. "అత్యవసర పరిస్థితి" కాలంలో ఆయన ఎన్నో గొప్ప పనులను సాధించగలిగారు.

ప్రతిపక్ష సభ్యుల ప్రసంగాలను, విమర్శలను, పొగడ్తలను అడ్డుకుంటూ మంత్రివర్గాన్ని సమర్థిస్తూకూడా, పాలక పక్ష సభ్యులైనవారికి సైతం, హితవు చెబుతూ తగుమార్గాలను సూచిస్తూ మంత్రులైనా మంత్రివర్గ విధానాలైనా ఎలా అదుపును సాధించవచ్చో ఆయన ప్రయోగాత్మకంగా నిరూపించారు.

హనుమంతయ్య గొప్ప వక్తకాదుగానీ చక్కటి సంభాషణాచాతుర్యం కలవారు. ఆయన సభను ఊపివేయలేరుగానీ దాని ఆలోచనా ధోరణిని అడ్డుకొని నిలబెట్టగలరు. ఆయన ఇటు స్వపక్షాన్ని గానీ, అటు ప్రతిపక్షాన్నిగానీ దేనినీ సంతృప్తి పరచలేకపోయారు. 1948లో ఆయన పార్లమెంటుకు వచ్చిననాటినుంచి మేమిద్దరం స్నేహితులం. ఆయన మైసూరు ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నప్పుడు నన్నూ, ఆచార్య కృపలానీగారిని తన సన్నిహిత సలహాదారులుగా స్వీకరించవలసిందిగాను, శ్రీ జవహర్లాల్ పరిపాలనలోని వైఫల్యాలను, పార్టీలోని పరిపాటిని మేమిద్దరం తీవ్రంగా విమర్శిస్తున్నప్పటికీ మమ్మల్ని అట్టేపెట్టుకోవలసిందిగాను ఆయన సలహా ఇచ్చారు. ఆయన రాజాజీతో సంబంధాలను కలిగిఉండి, కాంగ్రెస్ నాయకత్వంలో అన్ని

ప్రజాస్వామ్య పక్షాలతో కూడిన యునైటెడ్ ఫ్రంటును ఏర్పాటు చేయాలనే మా డిమాండును అంగీకరించారు.

ఆయన సామ్యవాదంలో గట్టి విశ్వాసం కలవారైనప్పటికి ప్రభుత్వ నిర్వహణలోనే ఉత్పత్తి సంస్థలన్నీ ఉండాలని భావిస్తున్న వారైనప్పటికీ రాజాజీ రంగాల నాయకత్వంలోని స్వతంత్ర పక్షం గాంధీ సోషలిజానికి కట్టుబడి ఉండే ప్రజా ప్రయోజనాల కోసం ఈ రెండు సంస్థలుకలసి పనిచేయవచ్చునన్నారు. చరిత్ర తన గమనంలో ఇలాంటి ఆలోచనలను తనలో ఇముడ్చుకుంది.

ఆయన రైతుల కోసం నిలిచారు. రైతులను స్వయంవృత్తుల నుంచి పడద్రోసే సహకార వ్యవసాయాన్ని గట్టిగా వ్యతిరేకించిన ఆనాటి ఇద్దరు ముఖ్యమంత్రులలో ఆయన ఒకరు. దానివల్ల జవహర్లాల్ జీ బాధపడతారని తెలుసుకున్నప్పటికీ ఆయన లక్ష్యపెట్టలేదు. వ్యవసాయరంగాన్ని అభివృద్ధిచేసేందుకు, అందుకు ఉపాంగాలైన యాంత్రిక వినియోగం, మార్కెటింగ్ నిర్మాణం వంటి పనులను సహకారరంగంలో చేపట్టడానికి ఆయన తనపూర్తి సుముఖతను వ్యక్త పరచారు.

22

శ్రీమతి ఇందిరాగాంధీ

శ్రీమతి ఇందిరాగాంధీ 19-11-1917న అలహాబాద్‌లో జన్మించారు. రవీంద్రుని శాంతినికేతన్‌లోని విశ్వభారతిలోనూ, ఆక్సఫర్డులోనూ విద్యాభ్యాసం గావించారు. 1938లో కాంగ్రెసులో చేరారు. 1942లో జైలుకు వెళ్లారు. పండిట్‌జీతో కలిసికొన్నినాళ్లు, తాను స్వయంగా కొన్నిసార్లు యావత్ప్రపంచాన్ని చుట్టివచ్చారు. కాంగ్రెసు కార్యవర్గ సభ్యురాలిగా 1955లోనూ, అధ్యక్షురాలిగా 1959లోనూ ఉన్నారు. 1959లో కేరళలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని తొలగించడానికి ఆమె ప్రధానకారకురాలిగా ఉన్నారు. 1964-66లో కేంద్రమంత్రి వర్గసభ్యురాలు. 1966, 1967, 1971లో కాంగ్రెసు పార్టీపార్లమెంటరీ నాయకురాలిగా వ్యవహరించారు. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యపోరాటానికి సమర్థనను సంపాదించడానికి, ఆమె అనేక దేశాలు పర్యటించారు. భారతదేశానికి వ్యతిరేకంగా, పాకిస్తాన్ దురాక్రమణను త్రిప్పికొట్టడంలోనూ, బంగ్లాదేశ్‌లో మానవసంహారాన్ని నివారించడంలోనూ ఆమె కృతకృత్యురాలు కాగలిగారు. పేదరికం నిర్మూలన కోసం ఇరవై సూత్రాల పథకం అమలుకు పూనుకున్నారు. 1927 డిసెంబరులో మద్రాసులో కాంగ్రెసు మహాసభలు జరిగినప్పుడు, నేనూ, భారతీదేవి ఆ సభలో గాంధీజీని దర్శించి, ఆయన ఆశీస్సులు అందుకోగలిగాం. మహాత్ముడు అక్కడ జవహర్లాల్‌గారితోనూ, జవహర్లాల్ సతీమణి శ్రీమతి కమలగారితోనూ ఖాదీ ప్రదర్శన ప్రారంభోత్సవ సందర్భంలో నన్ను గురించి మంచిమాటను చెప్పారు. ఆ తరువాత శ్రీమతి కమలగారికి భారతీదేవిని పరిచయంచేస్తూ, శ్రీమతి కమలాదేవి చటోపాధ్యాయ తనలోటి కళాకారిణిగా బహుధా ప్రశంసించారు. అప్పుడు కమలగారు ఇలా అన్నారు "మీ యిద్దరకూ పోలికలు చాలా ఉన్నాయి. మీరు సాధించిన విజయాలు తెలుసుకొని, చాలా ఆనందిస్తున్నాను". అప్పటినుంచి స్వాతంత్ర్య సమరయోధులలోని ఆ గొప్ప కుటుంబంతో మేము అనుబంధాన్ని పెంచుకున్నాం.

ముస్సోలినీ, హిట్లర్‌ల దురోధనంతో నడుస్తున్న ఫాసిస్టు ఫ్రాంకోతిరుగుబాటుకు వ్యతిరేకమైన పోరాటంలో స్పెయిన్ రిపబ్లిక్ గందరగోళపడినప్పుడు, శ్రీ నెహ్రూ యూరపులోనూ ప్రత్యేకంగా స్పెయిన్‌ను సందర్శించి వచ్చినతరవాత, తనకు బాగా సన్నిహితులైన మిత్రులతో, ఆనందభవన్‌లో ఇష్టాగోష్టిసమావేశాన్ని ఏర్పాటు చేసారు. అది 1938వ సంవత్సరం. అప్పుడు నా మేనకోడలు సుశీలాదేవిని తీసుకొని ఆనందభవన్‌లో జరుగుతున్న ఆ సమావేశానికి నేను హాజరయ్యాను. సుశీలను నెహ్రూ కుటుంబానికి నేను పరిచయం చేసినప్పుడు, నెహ్రూ ఆమె భుజాలపై చేతులుంచి ఆశీర్వదిస్తూ "ఇప్పుడు నీవు నాకు మరో కుమార్తెవు" అని అన్నారు. ఆమె బాగా చదువుకుంటుందా అని నెహ్రూ అడిగారు. "అవును! ఆమెను గురించి భారతీదేవి పూర్తి శ్రద్ధ తీసుకుంటుంది" అని చెప్పాను. ఆ పలకరింపులో ఎంతో ఆప్యాయత కనపడుతుంది. ఆ తరవాత కమలాదేవి స్వర్గస్తులైనారు.

తిరిగి 1972 నవంబరులో నేనూ, భారతీదేవిగారి మనుమరాలు విజయలక్ష్మి, నా సోదరుని కుమారుడు నాగేశ్వరరావుగార్లతో కలిసి, భారతీదేవిగారి పవిత్ర అస్థికలను ప్రయాగలోని త్రివేణీ సంగమంలో నిమజ్జనం చేసేందుకు వెళ్లినప్పుడు, తిరిగి ఆనందభవనాన్ని సందర్శించాం. హిమాలయ పర్వతశ్రేణులనుంచి ప్రవహించే, త్రివేణి సంగమ స్థానమైన ప్రయాగలో భారతీదేవి అస్థికలను కలిపే ఆ పవిత్ర సమయంలో, గత నలభై అయిదు సంవత్సరాల నెహ్రూ కుటుంబంతో మాకు గల అనుబంధాన్ని నెమరు వేసుకుంటున్నప్పుడు, ఎన్నో ఎన్నెన్నో బాధాకరమైన జ్ఞాపకాలు, మరచిపోలేని స్మృతులు, నామదినుంచి సుడులుతిరిగాయి.

1948లో ప్రధానిభవనంలోని తోటలో ఆతిథ్యం ఇవ్వడం జరిగింది. ఆ సమయంలో సాయంకాలపు సూర్యకాంతి చాలా ఆహ్లాదాన్ని కలుగజేస్తున్నది. నేనూ, భారతీదేవి టేబుల్‌వైపు వెడుతున్నాం! అప్పుడే ఆయాబల్లల దగ్గర కూర్చుని ఉన్న మిత్రులంతా, గబగబాలేచి నిలబడడాన్ని చూసాము. మాకేం కనిపించింది. జవహర్లాల్ స్వయంగా వికసించిన ముఖంతో మాకు స్వాగతం చెప్పేందుకు, భారతీదేవి గారికి అభిముఖంగా ఎదురు వస్తున్నారు. ఆయన ఎంతో సంతోషంగా మీరు విచ్చేసినందుకు చాలా సంతోషం. మీకు స్వాగతం పలికేందుకు, గుమ్మందగ్గర నేను లేనందుకు బాధపడుతున్నాను" అని అన్నారు. వెంటనే ఆమె ఇలా అంది, "అలా అని ఎందుకనుకోవాలి, ఇది మా యిల్లు, మాకేమీ ప్రత్యేక మర్యాదలు అవసరంలేదు, మిగతా అతిథుల విషయం చూడండి" అని. అప్పుడు తిరిగి ఆయన ఇలా అన్నారు. "మీకు తెలీదు, మీరంటే మా కుటుంబానికి ఎంత ప్రేమో! గాంధీజీ కూడా మీ మీద ఎనలేని ప్రేమను కనపరస్తూ ఉండేవారు."

1955లో సోవియట్ రష్యా, యుగోస్లావేకియా దేశాలలో భారతపార్లమెంటరీ ప్రతినిధి వర్గం పర్యటన జరిపే సందర్భంలో బయలుదేరబోయే ముందు, ఇతర సభ్యులతో కలిసి మేము జవహర్లాల్‌గారి దగ్గరకు వెళ్లాం. శ్రీమతి ఇందిరాగాంధీ అక్కడ మాకు స్వాగతం చెప్పారు. నామీద ఆమె ప్రత్యేకమైన శ్రద్ధ కనపరుస్తూ, దీర్ఘచతురస్రాకారంగా ఉన్నపోలులోకి, నన్ను తీసుకొని వెళ్లి, జవహర్, గాంధీజీ, సరోజినీదేవిగార్ల చిత్రపటాలను చూపిస్తూ, "వాటిల్లోనొకదానిని, ప్రముఖ అణుశాస్త్రవేత్త డాక్టర్ బాబాగారు గీశారని, అది ఎంతటి గొప్ప విషయమో, ఆమె వివరించారు. (ఆయన సంగీతమన్నా చాలా ఇష్టపడతారు. వీణా వాయిద్యం చక్కగా వినిపించగలరు) సోవియట్ భూమిని దర్శించే ప్రతినిధివర్గంలో "నేను కూడా ఉన్నందుకు, ఆమె తన సంతోషాన్ని తెలియజేయడంలో, రాజకీయాల్లో ఆమెకు ఉన్న ఆసక్తిని నేను గమనించాను. ప్రతినిధి వర్గంలో నన్ను చేర్చడానికి, రష్యా అభ్యంతరం తెలుపడంతో, ఆ సందర్భంలో డాక్టర్ రాధాకృష్ణ, పండిట్ నెహ్రూల మధ్య జరిగిన తీవ్రవాదోపవాదాలను గురించి, ఆమెకు బాగా తెలుసునన్న సంగతిని ఆ సందర్భంలో నేను ఊహించగలిగాను.

చివరకు ఆమె పేరును కాంగ్రెసు కార్యవర్గంలో చేర్చేందుకు జవహర్లాల్ గారు అంగీకరించారు. ఆనాటి అఖిలభారత కాంగ్రెసు కమిటీ సమావేశానికి నేనూ పోజరై, ఆమె అభ్యర్థిత్వానికి అనుకూలంగా ఓటు చేసాను. శ్రీమతి ఇందిరాగాంధి అందరికన్నా హెచ్చు

ఓట్లను సంపాదించుకొని, ప్రధమ స్థానంలో కాంగ్రెసు కార్యవర్గ సభ్యురాలిగా ఎంపిక అయినందుకు నేను చాలా సంతోషించాను.

ఆమె కాంగ్రెసు అధ్యక్షురాలైనందుకు, మేము మహదానందభరితులమయ్యాం. ఆమె ఎన్నిక సందర్భంలో కాంగ్రెసు సంస్థలో కొత్తగా సభ్యులైనవారు కొద్దిమంది చేసిన పరోక్షవ్యాఖ్యానాలను విని భారతీదేవి హర్షించలేదు. నెహ్రూగారి వద్ద, ఇతర జాతీయ నాయకులవద్ద, ఆమె నేర్చుకున్న రాజకీయ విజ్ఞానం, నెహ్రూగారితో కలిసి దేశమంతటా పర్యటించిన ఆమె అనుభవాలు, కాంగ్రెసు కార్యవర్గ సభ్యురాలిగా యితర సభ్యులతో గల పరిచయాల వల్ల ఆమె గ్రహించిన అనేక అంశాలు "సౌరాష్ట్రవంటి ఒక చిన్న రాష్ట్ర ముఖ్యమంత్రితో ఆమెను సమానురాలు చేయలేకపోయాయి" అని భారతీదేవి విమర్శలకు ప్రతి విమర్శలను చేసారు. ప్రస్తుతం పాత కాంగ్రెసు నాయకులుగా ఉన్న, అప్పట్లో ప్రణాళికా శాఖలో ఉపమంత్రిగా పనిచేసిన శ్రీ మిత్రాగారు ప్రారంభించిన సోషలిస్టు ఫోరంలో శ్రీమతి ఇందిరాగాంధీతో కలిసి, నేను కూడా పనిచేసాను. సోషలిస్టు పంథాలో ప్రభుత్వాన్ని, కాంగ్రెసునూ నడిపించేందుకు గట్టి ప్రయత్నం చేస్తున్న నెహ్రూగారి విధానాలలో, సోషలిజంలో ఆమెకు పూర్తి విశ్వాసం, గట్టినమ్మకం ఉంది. సోషలిస్టు సమాజానికి అంతర్భాగంగా స్వయంవృత్తులకు చెందిన ఆర్థిక విధానాలను భవిష్యత్తులో ముందుకు తీసుకురావడంలో తనకు విశ్వాసం ఉన్నదనీ, తాను గాంధేయ సోషలిస్టువాదిననీ ఫోరంలోని ఇతర సభ్యులతోనూ చెప్పాను. ఆ సందర్భంలో నా ఆలోచనకు వారు ఎలాంటి ప్రాతికూల్యాన్ని వ్యక్తపరచలేదు. ఆ తరవాత రైతాంగానికి నాగపూర్ తీర్మానం ఒక సవాలుగా ఎదురైంది. మా ఇద్దరికీ మిత్రులైన రఫీఅహమ్మద్ కిద్వాయ్‌గారి ద్వారా, ఫిరోజ్‌గాంధి నాకు బాగా సన్నిహిత మిత్రుడయ్యాడు. నాలోని స్వాతంత్ర్య కాంక్షను గమనించి, ఆయన చాలా సంతోషించారు. ఏదైనా అంశంపై నేనూ, జవహర్లాల్ పరస్పరం తీవ్రంగా చర్చించుకుంటున్నప్పుడు, ఆయన చాలా ఆసక్తితో గమనిస్తూ ఉండేవారు. హిందూ 'లా' సవరణ బిల్లుపై మా ఇద్దరి మధ్యా రాజీ చేయవలసిందిగా, నేను ఒకమారు ఫిరోజ్‌గాంధీ గారిని అడిగాను. అప్పుడు ఆయన ఇలా అన్నారు. "రంగాజీ! ఈ విషయంలో మీరు శ్రీమతిరంగాను, ఇందిరతో మాట్లాడమని చెప్పండి"అని తిరిగి ప్రతిస్పందిస్తూ ఆయన "మీ సతీమణి వాళ్లిద్దర్నీ అంగీకరింపజేయగలదు. ఎందుకంటే ఇది స్త్రీల ఆస్తిహక్కు సమస్యగనుక" అని అన్నారు. 1958వ సంవత్సరంలో కాంగ్రెసు పార్లమెంటరీ పార్టీకి ప్రధాన కార్యదర్శిగానేను ఎన్నిక కావడానికి ఫిరోజ్‌గాంధీ ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు.

ఆ తరవాత ఎంతో బాధాకరంగా 1959వ సంవత్సరం వచ్చింది. అది రైతాంగాన్ని, స్వయం వృత్తులనుంచి, భూమి హక్కులనుంచి నెట్టివేసేందుకు చేసిన నాగపూర్ తీర్మానం కారణంగా, మా రాజకీయ సంబంధాల మధ్య, ఒక పెద్ద అగాధం ఏర్పడింది. అప్పట్లో కాంగ్రెసు అధ్యక్షురాలిగా ఉన్న శ్రీమతి ఇందిరకు నా రాజీనామాను సమర్పించాను. నాటినుంచి 1972 వరకు నేను కాంగ్రెసుకు వ్యతిరేకంగా ప్రతిపక్షంలో ఉన్నాను. పరస్పరం వ్యతిరేకధోరణిలో, రెండు భిన్న రాజకీయ పార్టీల నాయకులుగా మాత్రమే మేము తరచుగా ఆయా సందర్భాలలో ఉంటూ నేను ఆమెను తీవ్రంగా విమర్శించకుండా ఉండిపోయాను. విధేయులుగా మా బాధ్యతలను నిర్వహించుకుంటూనే, పరస్పర గౌరవాభిమానాలను వదులుకోకుండా వ్యవహరిస్తూ ఉండేవాళ్లం.

రైతు సమస్యలపై మా ఇద్దరి మధ్య విభేదాలున్నప్పటికీ జవహర్లాల్ నన్ను కాంగ్రెసు సంస్థలో ఉంచేందుకు గట్టి కృషి చేసారు. భారతీదేవిని ఆంధ్ర మంత్రివర్గంలో చేరవలసిందిగా ఆయన వత్తిడి చేసారు. పండిట్ జీ ఆమెను అంగీకరింపజేయలేకపోయినప్పటికీ, ఒకరోజు "భారతీ! రంగాగారిని ఇప్పుడైనా దారిలోకి తీసుకురా! చూడు! ఇందిర కాంగ్రెసు అధ్యక్షురాలిగా ఆమె మార్గాన్ని ఆమె ఎంత చక్కగా పాటిస్తున్నదో" అని అన్నారు. అప్పుడు భారతీదేవి "పండిట్ జీ, మేమిద్దరం రైతులం! అందువల్ల మేము కలిసి నడవవలసిందే" అని అన్నారు.

శ్రీమతి ఇందిరాగాంధీ తొలిసారిగా భారత ప్రధాని కాగలిగినప్పుడు లాల్ బహదూర్ శాస్త్రిగారు ప్రధాని కాగలిగిన పద్ధతిలోనే, సహజ పరిణామంగానే, నేనూ భావించాను. వీరిరువురూ జవహర్లాల్ గారికి అత్యంత సన్నిహితంగా కలిగిన రాజకీయ వారసులు. అనేకమంది ఇందిరాగాంధీ పిన్నవయస్కురాలని, పరిపాలనా వ్యవహారాల్లో తగినంత అనుభవంలేనిదంటూ వ్యాఖ్యానాలు చేసినప్పుడు, భారతీదేవి తీవ్రంగా వారికి జవాబుచెబుతూ" కెనడీ వృద్ధుడు కాదు, గొప్ప అనుభవంఉన్న వ్యక్తికాదు. అయినప్పటికీ అమెరికాదేశం ఆయన్ని అధ్యక్షుడిగా ఎన్నుకొన్నది" అని అన్నారు. మరొకవైపు "ఆమె, నెహ్రూ కుమార్తె కాకుండా ఉండివుంటే భారత ప్రధాని కాగలిగేది కాదు" అని విమర్శరాగా "అందులో తప్పేముంది? ఆమె మన రాజకీయ కుటుంబంలోనుంచి వచ్చింది. ఆమె మహిళకాకుండా ఉన్నట్లయితే మీరు ఇందుకు అభ్యంతరం చెప్పేవారుకాదు. కేరళలో కమ్యూనిస్టు పాలనను అంతంచేసి, ప్రజా స్వామ్య శక్తుల సమిష్టిపాలనను తీసుకురావడం ఆమె గొప్ప తనంకాదా? అంతటి పట్టుదలతో, ఆమె తండ్రి ఈ పని చేయగలిగి ఉండేవారా? అని శ్రీమతి భారతీదేవి నిగ్గదీసారు.

శ్రీమతి ఇందిర మహిళ అనే కారణంతో ఆమెకు వ్యతిరేకంగా జరుగుతున్న ఈ ప్రచారాన్ని గమనించి, భారతీదేవి చాలా విచారించారు. 13వ శతాబ్దంలో కాకతీయ సామ్రాజ్ఞిగా దక్షిణ దేశాన్నంతా, ముప్పైసంవత్సరాలపాటు రాణి రుద్రమదేవి ఎంత గొప్పగా పరిపాలించిందో గమనించమని ఆమె అనేకమార్లు అంటూ ఉండేది. ఈ సందర్భంలో రుద్రమదేవి సమర్థవంతమైన పాలన ఎలా కొనసాగించిందో, మార్కోపోలో ఆమె పరిపాలనను ఎంతగా ప్రశంసించాడో, తెలియ జెప్పే కాకతీయ పరిపాలకులకు సంబంధించిన గ్రంథం ఇప్పుడే రావడం సముచితం. మనం జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించవలసివస్తే, దానికి నాయకురాలిగా ఇందిర ఉంటేనే బావుంటుంది" అని భారతీదేవి చెప్పారు.

శ్రీమతి ఇందిరాగాంధీ భారత ప్రధానిగా, బాధ్యతల్ని నిర్వహిస్తూ, పార్లమెంటులో భిన్నశక్తులతో మెలగవలసిన తీరు తెన్నులను, ఎవరితో ఎలా మాట్లాడాలో, ఏ విధంగా ఎవరితో సర్దుబాటు చేసుకోవాలో, ఎంతో ఓర్పుతో ఆకళింపు జేసుకున్నారు. కాంగ్రెసు పార్టీలోని ముఠాలను గురించి అవగాహన చేసుకోవడంలోనూ, వేరువేరు రాజకీయ, ఆర్థిక శక్తుల బలాబలతలను, బలాబలాలను, అంచనా వేసుకోవడంలోనూ, శత్రువులెవరో, మిత్రులెవరో గ్రహించడంలోనూ, ఆమె పరిణితి చెందిన స్థితికి చేరుకున్నారు. భారత ప్రభుత్వంతోనూ, బయటా, స్వదేశంలోనూ, విదేశాల్లోనూ నాయకులతో స్నేహ సంబంధాలను ఏర్పాటు చేసుకోవడంలోనూ ఆమె చక్కని

చొరవను కనపరిచారు. ఈ విషయంలో పదిహేడు సంవత్సరాలుగా తన తండ్రితో తిరిగి పొందిన అనుభవం ఆమెకు ఉపయోగపడింది. అనేకమంది ప్రపంచనాయకులు ప్రస్తుతం అధికారంలోఉన్నా, లేకపోయినా ఆమెకు పరిచయంలేని వారుకాదు. అనేక సందర్భాలలో వారిని, ప్రపంచ వ్యవహారాల్లోనూ, ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలలోనూ సన్నిహిత మిత్రులుగా ఉండేలా ఆమె చేసుకోగలిగింది. మిగతా కాంగ్రెసు నాయకులకన్నా, ఆమె వీరితో వ్యవహరించేప్పుడు ఎక్కువ నమ్మకంతో మెలిగేవారు. అమెరికా, రష్యా, చైనాల మధ్య ఉండే విభేదాలను వారి మధ్య పెరుగుతున్న శత్రుత్వాన్ని ఆమె విస్మరించలేదు. ఆఫ్రికా, ఆసియా రాజ్యాలలో సోషలిజానికి వ్యతిరేకంగా అమెరికా సాగిస్తున్న ప్రయత్నాలను పెరుగుతున్న కమ్యూనిస్టు రాజ్యాల ప్రాబల్యాన్ని దృష్టిలో ఉంచుకొని, అంతర్జాతీయ రాజకీయ వేదికపై భారతదేశ పాత్రను తిరిగి, సరిదిద్దేందుకు ఆమెకు అవకాశం కలిగింది.

శ్రీమతి ఇందిర రెండోసారి ప్రధాని అయినప్పుడు 1967 సాధారణ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ తీవ్రంగా దెబ్బతిన్నందునా, ఆమెకు బద్ధశత్రువుగా ఉన్న మొరార్జీ దేశాయ్‌ని ఉపప్రధానిగా నియమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒక్కసారిగా అనుకోకుండా వచ్చిన 'సంయుక్త విధాయక్ దళ్" మంత్రివర్గాలు, ఓటమిపాలైన కారణంగా కాంగ్రెసు వాదుల్లో ప్రవేశించిన స్థబ్దత, భయం, ఆమె రాజకీయ ఆలోచనా ధోరణిని ఏ మాత్రం వెనక్కి త్రిప్పలేదు. ఆమె అతిశయంతో "ప్రధాని పదవికి లభించవలసిన గౌరవం లభించితీరుతుంది" అన్న వాక్యం ప్రధాని పదవిలో కొనసాగుతూ ఆమె ఎంత అసహాయ పరిస్థితుల్లో ఉండిపోయిందో మనకు తెలియజేస్తుంది. ఆ తరవాత ఆమె ఒక నిర్ణయానికి వచ్చారు. స్వయంగా తానుగానీ, రాజకీయ దూరదృష్టి కలిగి ముందుచూపు ఉన్నతన అభిమానులైన వారి సహాయంతోగానీ, పార్టీలో తనకు వ్యతిరేకంగా ఉన్నశక్తులతో పోరాడి అంతులేల్చుకోవాలనుకున్నారు. ఆ తరవాత ప్రతిపక్ష సవాళ్లను ఎదుర్కొనేందుకు సాధారణ ప్రజాస్వీకానికి అవసరమైన విధానాలతో, ఎన్నికలలో వారితో పోరాడాలని అనుకున్నారు.

ఆమె రెండుమార్లు ప్రధాని కాగలిగినప్పటికీ సోషలిస్టు పంథాలో సమాజాన్ని తీర్చిదిద్దేందుకు కావలసిన స్వేచ్ఛను మాత్రం సంపాదించుకోలేకపోయారు. కాంగ్రెసు వర్కింగ్ కమిటీలోను, మంత్రివర్గ సమావేశాలలోనూ అనేకమార్లు గుటకలు మింగుతూ ఉండవలసిన పరిస్థితి ఆమెకు ఎదురైంది. నిస్సహాయురాలైన ఆమె 'భారత ప్రధాని కావడం ఎలా' అని యోచించారు. 1967 సాధారణ ఎన్నికల ఫలితాలు ప్రస్తుతం ఉన్న కాంగ్రెసు వర్కింగ్ కమిటి నాయకులతోనూ, పెత్తనం చేస్తున్న పెద్దలతోనూ, కేంద్రంలోగానీ, రాష్ట్రాలలోగానీ, కాంగ్రెసు ఇంత కన్నా మెజారిటీని సాధించడం సాధ్యంకాదని నిరూపించాయి. నేను ఆమెతో మాట్లాడే సందర్భంలో, ఇందులో ఎక్కువ భాగాన్ని ఆమె అంగీకరించారు. పేరుకు మాత్రమే ప్రధానిగా కొనసాగుతూ అనేకమైన బాధలను, కష్టాలను దిగమ్రింగవలసివస్తున్న ఈ తరుణంలో ఆమె "గరీబీహఠావో" నినాదాన్ని వదులుకోవలసిన పరిస్థితుల్లో పడిపోతుందేమోనని నేను భావించాను. గాంధేయ విధానంలో ఆమె ఆత్మను కదిలించిన దరిద్ర నారాయణులసేవ, తన తండ్రి వ్రాసిన గ్రంథాలు "లెటర్స్‌టుడిడాటర్", 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' ల నుంచి ఆమె పొందిన

అనుభూతుల ద్వారా, పేదప్రజలకు సేవచేయాలనేది ఆమె చిరకాలసంకల్పం. అందుకు నా అభినందనములు.

ప్రతిపక్షంలో ఉండి మేమంతా జాతీయ ప్రభుత్వం కావాలని కోరినప్పుడు ఆమె సరైన సమాధానం ఇవ్వలేకపోయింది. కనీసం దానిని వ్యతిరేకించను గూడాలేదు. ప్రస్తుతానికి పార్లమెంటుకు మీరు మంచి నాయకులని ప్రతిపక్షం వ్యంగ్యంగా అన్నప్పుడు, దానికి ఆమె ఓర్పుతో చిరునవ్వులు చిందిస్తూ కూర్చుందేతప్ప, ఏమీ అనలేదు. భారతీదేవి ఇలా వ్యాఖ్యానించారు. "ఆమె ఎవ్వరితో సంప్రతించాలి. ఈ యిబ్బందులనుండి ఆమెను ఎవరు బయట పడవేస్తారు? తండ్రిలేడు, భర్తలేడు, సోదరుడులేడు, కనీసం నాయనమ్మగానీ, తాతగారుగానీ కూడాలేరు. ప్రధానమంత్రి పదవిలో కూర్చోబెట్టబడి భయంకరమైన ఒంటరితనంతో ఒక సిండ్రిల్లా లాగా ఉన్నప్పుడు ఆమెకు ఇప్పుడుతోడు ఎవ్వరు? ఆ బాధలు ఆమెను "గరీబీహఠావో" నినాదాన్ని అమలు జరిపేందుకుగట్టి నిర్ణయం తీసుకునేందుకు వీలుగా నెట్టివేసాయంటే ఎవరూ ఆశ్చర్య పడరనుకుంటాను. రాష్ట్రపతి అభ్యర్థి నిర్ణయంతో చిన్న పార్లమెంటరీ బోర్డులో, ఒకే ఒక ఓటు తేడాతో, ఆమె ఓడించబడినప్పుడు నిజంగా ఆమె ఒక గరీబీయే! పార్లమెంటరీ బోర్డులోని పెద్దలంతా ఒకే ఒక్క ఓటు తేడాతో తనకు వ్యతిరేకమైన నిర్ణయంచేసి, ప్రతిపాదన పత్రాల మీద బలవంతంగా తనచేత సంతకాలు చేయించినప్పుడూ, ఆమె గరీబీయే! అఖిల భారత కాంగ్రెసు సంఘానికి సంబంధించినంతవరకు, ఆక్షణం ఆమెచేత కన్నీటి బొట్లు రాల్పించగలిగింది. పెద్దలు ఆమెనంతగా వేటాడి వేధించారు. ఆమె భారతదేశంలో ఉన్నకోట్లాది గరీబీలలో ఒకరై గుండెలు పగిలేలా 'గరీబీ హఠావో' అని అరిచింది. అది మొత్తం తన వ్యతిరేకులందరిమీదా, ప్రతిపక్షాలమీదా ఆమె ప్రయోగించిన బ్రహ్మాస్త్రం అనే దానిలో సందేహంలేదు.

భారతీదేవికి కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోటీపడడం, ఏమాత్రం ఇష్టంలేదు. అందుకే ఆమె తరపున ఆనాడు ప్రచారంలో ఉన్న కార్యకర్తలెవ్వరూ ఇందిరకు వ్యతిరేకంగా ఒక మాట అనడానికి కూడా సాహసించలేదు. ఎన్నికల ఫలితాలు వెలువడి, మన ప్రజా స్వామ్యానికి, ఆమెను నాయకురాలిగా, గొప్ప మెజారిటీతో ఎన్నుకుంటూ ప్రజలు ఇచ్చిన తీర్పు స్పష్టంగా బైటపడసాగింది. కానీ మేము వ్యక్తిగతంగా ఓడిపోయినప్పటికీ ఆ బాధను పట్టించుకోకుండానే, ఇందిర విజయానికి భారతీదేవి తన సంతోషాన్ని వ్యక్తపరుస్తూ, మమ్మందరిని, ఆమెతో కలిసి "గరీబీహఠావో" ఉద్యమానికి తోడ్పడుతూ భారత ప్రజలకు తోడ్పడవలసిందిగా కోరారు. నేను శ్రీమతి ఇందిర విషయంలో భారతీదేవిగారి అభిప్రాయాలను, ఆయనకు తెలియజేస్తూ, రాజాజీతో ఈ అంశంపై చర్చించాను. దేశప్రజలు పార్లమెంటులో మూడింటరెండువంతులుకు పైగా మెజారిటీతో ఆమెకు అధికారాన్ని అప్పగించి జాతీయ నాయకురాలిగా ఎన్నుకున్న తరవాత, మనం ఆమె పట్ల ఉన్న వ్యతిరేకతను వదిలివేసి, ఆమెను బలపరిచి, తద్వారా ప్రజలు ఆమెకు ఇచ్చిన హామీలను నేరవేర్చేందుకు ఆమెకు అవకాశాన్ని ఇస్తే బావుంటుందని, ఆయనకు చెప్పాను. ఆయన తల ఊపారు. భారతీదేవి కూడా ఇలాగే చెప్పింది అని అంటే దీనిని గురించి తీవ్రంగా ఆలోచించవలసిందే. ఇందిర కూడా స్త్రీ గనుక, భారతీదేవి ఇలా చెప్పిందని అనుకోను. ఎందుకంటే ఆమె ఆలోచన ఎప్పుడూ అపజయం వైపు ఉండదు. కొన్ని రోజుల తర్వాత

"రాజకీయాలకు మతాన్ని ఆధారం కానివ్వండి" అనే ప్రత్యేక వ్యాసాన్ని రాజాజీ వ్రాసారు. ప్రస్తుత రాజకీయాలు మృత్యువుకు సన్నిహితంగా చివరి అంచుపై నిలిచి ఉన్నాయని, గుడ్డిగా అవి గమ్యం తెలియని స్థితిలో తిరుగాడుతున్నాయని, ఆయన దీని ద్వారా సూచనప్రాయంగా తెలియజేసారు. నేనూ, భారతీదేవి స్వయం వృత్తుల వారినందరినీ, శ్రీమతి ఇందిరతో కలిసి, ప్రజాస్వామ్య పద్ధతులతో ఆమె చేయ తలపెట్టిన సోషలిస్టు సమానా సమాజ నిర్మాణ స్థాపనకు చేయూత నివ్వాలనే సంకల్పానికి వచ్చాం.

గరీబీ హఠావో

(అత్యవసరమైన ఒక నూతన పరిణామానికి అంకురార్పణ)

గరీబీహఠావో అన్నది మన బుద్ధినీ, ఆత్మగౌరవాన్ని అప్పటికప్పుడు జాగృతమొనర్చే, అత్యవసరమైన శబ్దం! శతాబ్దాల తరబడి బుద్ధుడి దగ్గరనుంచి, గాంధీజీ వరకు అనేకమంది సంస్కర్తలు రామానుజులు, బసవేశ్వరుడు గురునానక్‌వంటి విప్లవకారులు కబీరు, చైతన్య, తుకారాం, పోతన, వేమనవంటి కవులు, భక్తులు మానసిక దారిద్ర్యం నుంచి మన ప్రజలను మేల్కొల్పడానికి ప్రయత్నిస్తూనే వచ్చారు. ఇస్లాం, క్రైస్తవ మతాలు కోట్లాది ప్రజలను క్రూరమైన బానిస బంధాలనుంచి, కర్మలు, నమ్మకాలనుంచి బయటపడవేసి, ఆత్మగౌరవంతో బ్రతికేందుకు తోడ్పడ్డాయి. తరతరాలుగా అశేషజనం పోగొట్టుకున్న సమానహక్కుల్ని, సాంఘిక సమానత్వాన్ని, ఆత్మగౌరవాన్ని తిరిగి పునరుద్ధరించేందుకు, వాటిని సమస్త మానవాళికి అందించేందుకు అశోకుని కాలం తరవాత ప్రయత్నాలు జరిగియంటే యదార్థంగా భావించాలి.

చరిత్ర కల్పించిన ఈ దురదృష్టకరమైన విధానాలకు తలవంచకుండా ఆటవికజాతులుగా ఉంటున్నవారు మాత్రమే, కొండలో, లోయలో ఏ సౌకర్యాలులేని అడవులలో జీవిస్తున్నారు. వ్యాపారుల దౌష్ట్యానికి, పౌరోహితుల ఆధిపత్య, అహంకారాలకు తలవొగ్గకంటే, అడవులలో జీవిస్తూ, ఆకులు అలములు తింటూ బ్రతకడమే ఉత్తమమని వారు నిర్ణయించుకున్నారు. ఈ రోజు కూడా ఒరిస్సా అటవీ ప్రాంతాలలో నివసించే మరియా తెగలవారు, ఆంధ్రప్రాంతంలోని సవరులు, మైదాన ప్రాంతాలలో ఉండే వారి చేత దొరలని పిలిపించుకుంటూనే ఉన్నారు. అలా పిలవక పోతే వారు పలకడానికి ఇష్టపడరు. వారికి ఆపేరు సర్వసాధారణమైపోయింది.

దురదృష్టవశాత్తూ, మన విముక్తి జాతులలో ఎక్కువమంది ఇలాలేరు. బాగా నిపుణులై అభివృద్ధి పథంలో పయనిస్తూ, శాశ్వతంగా సుఖభోగాలను అనుభవిస్తున్నవారితో సర్దుకొని బ్రతికేందుకే, వీరిలో ఎక్కువమంది నిర్ణయం తీసుకున్నారు. శతాబ్దాల తరబడి తమ పూర్వీకులు చేస్తున్న పూజలు తమను ఈ స్థితిలో ఉంచాయనే భ్రమలో ఉండి, ఈ దుస్థితికి మౌనంగా తలవంచడం జరుగుతున్నది. ఈ ప్రజలు అనుభవిస్తున్న బాధలను, భగవంతుడు కూడా తొలగించలేకపోయాడు.

భారతదేశం, గతంతాలూకు ఈ క్రౌర్యాన్ని తుడిచి వేయడానికి గాంధీజీ ద్వారా, నూతన చరిత్ర రచనకు నాంది పలికింది. ఆయన భారతదేశంలోని, అణగద్రొక్కబడిన ప్రజలను

బైటికి తీసుకువచ్చేందుకు పండితులకు మహర్షుల సూక్తులను, వివేకానందుని బోధనలను తెలియజెప్పారు. ఆయన భారతదేశ స్త్రీలను ఆర్థిక, సామాజిక, మతపరమైన అసమానతల నుంచి బయటకు తీసుకువచ్చి, స్వేచ్ఛా జీవనంలో ముందుకు నడిపించడానికి అంటరానితనం దుస్ప్రభావం నుంచి అంటరానివారుగా పరిగణింపబడుతున్న వారిని బయటపడవేయడానికి ఏ సామాజిక విప్లవకర్త ఇంతవరకు చేయని మహత్తరకృషి చేసారు. విముక్తిగావించబడిన ఈ ప్రజలనందర్నిని, మొత్తం సమాజంలో దేవుని బిడ్డలుగా పరిగణించాలని, వారే హరిజనులని వారికి ఆయన పేరు పెట్టి పిలిచారు. మన నవీన సాంఘిక విప్లవానికి ఇది గొప్ప ప్రారంభం.

మనలో కొందరు టక్కరుబాబా, వెన్నెలకంటి రాఘవయ్య, టి. కోదండ రామయ్య, వంటి వారలు ఈ కాగడాను కొండగుహలలో ఉంటున్న జాతుల కోసం మోసుకవెళ్లారు. ఫలితాన్ని సాధించారు. నెహ్రూయిజం యొక్క ఆశీస్సులతో, నేరస్థజాతుల చట్టాన్ని రద్దు చేయించి రెండుకోట్లమంది ప్రజలను "విముక్తి జాతులు"గా ముందుకు తీసుకు వచ్చారు.

హరిజనులు, విముక్తి జాతులవారు, హరిజన క్రైస్తవులు ఇతర వైనుక బడిన కులాలవారు, ఆటవిక ప్రజలు, అన్ని మతాలలో ఉన్నవారు, తమ పూర్వ దుస్థితినుంచి, సాంఘిక వ్యత్యాసాల భ్రమలనుంచి, కర్మసిద్ధాంతాన్ని విసర్జించి, ఇప్పుడిప్పుడే తమకుతాము స్వేచ్ఛగా ముందుకు వస్తున్నారు.

భారతదేశచరిత్రలో సంభవించిన ఈ అణచివేయబడే విధానానికి, స్వాతంత్ర్యానంతరం వచ్చిన వయోజన ఓటింగు హక్కు మాత్రమే సరియైన జవాబు అని నేను చాలాకాలం క్రిందట అంటే 1925లోనే ఆలోచించాను. గాంధీ మహాత్ముడు కూడా అలాగే తలంచి, వయోజన ఓటింగు హక్కుకోసం నా ఉద్యమాన్ని ఆశీర్వదించారు. స్వరాజ్యం వచ్చిన తరవాత రాజ్యాంగం ద్వారా వయోజన ఓటుహక్కును కల్పించడమైనది. (నా పుస్తకం "బాపూబ్లెసెస్" 1970 చూడండి) భారతరాజ్యాంగ నిర్మాతలు, భావిభారత పౌరులు పూర్తిగా విద్యావంతులు కావాలనే దానిని గ్రహించి, పది సంవత్సరాలలోపు ఉన్న వారందరకూ ప్రాథమిక విద్యను అందించాలని, వయోజన విద్యా ప్రచారానికి ప్రాధాన్యత నివ్వడం ద్వారా అవిద్యను నిర్మూలించడానికి, రాజ్యాంగంలోని నలభై ఆరో సూత్రం ద్వారా నిర్దేశించారు. మన రాజ్యాంగం కల్పించిన ఈ అంశంలో మన ప్రజాస్వామ్యానికి కూడా పూర్తి విశ్వాసం ఉన్నది.

మా వంటి వారం అనేకమందిమి సామాన్య ప్రజల ఆత్మగౌరవ ప్రతిష్ఠాపనకు కృషి చేస్తూనే, గాంధీజీ నిర్మాణాత్మకమైన సంఘసేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ, వయోజన విద్య ప్రచారాన్ని కొనసాగిస్తూ, స్వయం వృత్తులను ప్రోత్సహిస్తూ, జాతీయోద్యమంలో ముందుండి దేశస్వాతంత్ర్యం కోసం పోరాడాం. మాలాగే గాంధీ, వారి అనుచరులు కూడా తాము తక్కువవారమనే భావాన్నుంచి కొందరు ప్రజలను బయటకులాగడానికి కృషి సలిపారు. బ్రిటిషువారి ముందు, తాము తక్కువ వారమనుకునే భయంనుంచి, "వారు ప్రభువులు, మనం పాలితులం" అనేభావాన్ని దాటి వచ్చేందుకు మేము కొందరికి తోడ్పడి విజయాన్ని సాధించాం.

స్వరాజ్య పోరాటంతోపాటు, ఆత్మగౌరవ ఉద్యమం కూడా సంఘసంస్కరణల ఉద్యమాల మేలుకొలుపులో ముందుండి నడిచింది.. బ్రాహ్మణేతరులైన వారు సంస్కృత భాషను, వేదాలను, అభ్యసించరాదనే పూజారుల నిర్ణయాలను వ్యతిరేకిస్తూ, బ్రాహ్మణేతరులైన వారిని అవమానపరుస్తూ వ్రాసిన పురాణ సాహిత్యంయొక్క నడ్డివిరగగొడుతూ ఈ ఉద్యమం కొనసాగింది. ఆంధ్రనుంచి బారిష్టర్ రామస్వామి, తమిళనాడునుంచి ఇ.వి.రామస్వామి నాయకర్, అన్నాదురై, మహారాష్ట్ర నుంచి అంబేద్కర్‌లు, ఉత్తర భారతదేశంనుంచి ఆర్యసమాజ్, ఇంకా అనేకమంది ఇతరులు యీ మత మౌఢ్యాల నుంచి, ఆచారపు సంకెళ్లనుంచి, జనాలను బయటపడవేసి, సర్వసమానత్వాన్ని సాధించేందుకు కృషిచేసారు.

నేను, నాతోపాటు మరికొంతమంది ఆత్మగౌరవ ఉద్యమాలలో కలిసి పనిచేసాం. వెనకబడిన వర్గాల ఉద్యమవ్యాప్తి కొరకు రాజ్యాంగంలో 46వ సూత్రాన్ని ప్రవేశపెట్టగలిగాం. ఈ సూత్రం షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల, ఇతర బలహీనవర్గాల ఆర్థిక విద్యాభివృద్ధి కృషికై నిర్దేశించబడింది. వెనకబడిన తరగతులకు, రిజర్వేషన్లు కల్పించేందుకు సంబంధించిన 16(4)సూత్రాన్ని ప్రవేశపెట్టించగలిగాం.

తమిళనాడులో ఈ ఆత్మగౌరవ ఉద్యమం పూర్తి ఫలితాన్నిచ్చింది. ఎందుకంటే అక్కడి ప్రజలను వారు ఆత్మగౌరవభావం వైపు ఎక్కువగా ఆకర్షించగలిగారు. దాని నాయకుడు సాధారణ ప్రజలను ఎక్కువ మందిని సమీకరించగలిగి, 1967 లో ఆ రాష్ట్రంలో రాజకీయాధికారాన్ని పట్టుకోగలిగాడు. ఇందుకు అన్నాదురై మేధాశక్తిని మనం అభినందించవలసిందే. అక్కడినుంచి దీర్ఘకాలంగా క్రింద ఉంటున్న ఆ ప్రజలను ఆత్మ విశ్వాసంతో, ఆత్మగౌరవంతో ఆయన ముందుకు నడిపించగలిగారు.

అయితే మిగిలిన భారతదేశమంతటా, సాంఘికంగా అణచబడుతున్న సగానికైగా ఉన్న మిగతా ప్రజలమాటేమిటి? సాంఘిక దాస్యంనుంచి బైటపడవేసే ఆత్మగౌరవ ఉద్యమాలు, ఆ ప్రాంతాలలో కూడా అతి వేగంగా విస్తరించవలసిన అవసరం ఉన్నమాట యదార్థం.

స్వరాజ్యం వచ్చిన తర్వాత 1969వ సంవత్సరం వరకు రాజకీయ రంగంలోముందుకువచ్చిన బ్రాహ్మణేతరులలో ఎక్కువ మంది, ఈ వెనకబడిన వర్గాల ప్రజలు మాత్రంకాదు. బ్రాహ్మణేతరులలోని కొన్ని అగ్రకులాలవారు, ధనవంతులైన వారి నాయకులు, బ్రాహ్మణేతర అగ్రకులాలలో నుంచి వచ్చిన రాజకీయనాయకులు అన్నిరకాలైన మతపెద్దల ఆశీస్సులను పొందుతూ, వారి అనుభవాన్ని, ప్రాభవాన్ని బట్టి వారి సహాయం తీసుకుంటూ క్రింద ఉన్న వర్గాల ప్రజలను నైతికంగా, ఆర్థికంగా, వయోజన ఓటింగు హక్కువరంగా కూడా పైకి రానివ్వకుండా, ఆ ఫలితాలను తామే అనుభవించ గలిగారు.

మతపరమైన, సాంఘికపరమైన ఒత్తిడుల ద్వారా, ఆవరించిన ఈ దురదృష్టకర పరిస్థితులనుంచి, ప్రజలను బయటకు తీసుకురావడానికి అధికారం ద్వారా తమకు లభించిన అవకాశాన్ని పండిట్ నెహ్రూగానీ, వారి అనుయాయులుగానీ సక్రమంగా వినియోగించుకోలేక విలువైన ఆ సమయాన్ని వృధా చేసారు. నా వరకు నేను (1946-51) ప్రాంతాల ఆంధ్రా

కాంగ్రెసులో ఆత్మగౌరవ ఉద్యమపరంగా చేనేత పనివారికి, కుండలు తయారు చేసేవారికి, పళుకాపరులకు, బుట్టలు అల్లేవారికి, తోళ్లు శుద్ధి చేసేవారికి రైతులు, కేత్‌మజ్‌దూర్‌లు, కౌలుదార్లతోపాటు కాంగ్రెసులో ఏ పనికి ఆపనికి సంబంధించిన వారితో ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశాను. ఇది ఒక కొండను ఎక్కిడంలాంటికృషి. నేను అనేకమైన రాజకీయమైన ఇబ్బందులను ఈ సందర్భంలో ఎదుర్కోవలసి వచ్చింది. అప్పుడు కల్లుగీత కుటుంబాలను చూసిన నేను శ్రమజీవుల సమర్థవంతమైన నాయకులు సర్దార్ గౌతు లచ్చన్నగారిని, అందరికన్నా అన్నివిధాలా ఎక్కువ అనుభవం ఉన్న, బాగా చదువుకున్న ఒక ఉన్నత కుల శాసన సభ్యుడ్నికాదని, మద్రాసు అసెంబ్లీలో ఆంధ్రాకృషికార్ లోక్‌పార్టీ నాయకునిగా చేయడం జరిగింది. వెనకబడి బాగా క్రిందకు దిగజార్చబడిన వర్గాల ప్రజల్లో నమ్మకాన్ని ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకై నేను ఈ పని చేసాను. ఆ తరవాత సంభవించిన సంఘటనలలో ఇది కాలానికి చాలా ముందుగా వేయబడిన అడుగు అని నిరూపితమైంది. దీనివల్ల ఉన్నత కులాలుగా భావించే వారిమధ్య నా స్థానం కొంత బలహీనపడింది.

చాలాకాలం గడిచిన తర్వాత పండిత నెహ్రూ హరిజన నాయకులైన దామోదరం సంజీవయ్యగారికి కాంగ్రెసు అధ్యక్ష పదవిని అప్పగించారు. గొప్పదైన ఆ నిర్ణయం కూడా వెనకబడిన బలహీన వర్గాల ప్రజలను భావ దాస్యంనుంచి ముందుకు నడిపించలేకపోయింది. ఎందుకంటే ఉన్నత అధికార శిఖరాలమీద ఉన్న నెహ్రూజీ ఆ సందర్భంలో కూడా తన అధికారాన్ని తగ్గించుకొని వ్యవహరించలేకపోవడమే అందుకు ప్రధాన కారణం.

తనకు అవకాశం లభించినప్పుడు, రామ మనోహర్ లోహియా కూడా క్రింది తరగతులలో ఆత్మ విశ్వాసాన్ని, ఆత్మ గౌరవాన్ని పెంపొందింపజేయవలసిన అవసరం ఉందని యదార్థమైన విప్లవాభిలాషిగా ప్రయత్నించారు. బాగా చదువుకొనకపోయినప్పటికీ, లోక్‌సభలో జూనియర్ సభ్యులైన వెనకబడిన తరగతులకు చెందిన రామసేవక్ యాదవ్‌గారిని, సోషలిస్టు పార్టీ సభానాయకుడిగా ఆయన తీసుకున్నారు. ఆ తరవాత మిగతా పార్టీలు కూడా ఇలాంటి ప్రయత్నాన్ని ధైర్యంతో చేసాయి. ఈ ప్రయత్నం కూడా జనాలలో ఉన్న భయాలను, బలహీనతలను పోగొట్టలేకపోయింది.

కాంగ్రెసు పెద్దల బంధాలనుంచి బయటపడి పార్టీకి, ప్రభుత్వానికి స్వతంత్రమైన నాయకత్వాన్ని, స్థాపించుకున్న తర్వాత, ఎప్పటినుంచో, ఎదురుచూస్తున్న, చరిత్రాత్మకమైన ఆ బంగారు అవకాశం, శ్రీమతి ఇందిరాగాంధీకి లభించింది. శక్తివంతమైన కాంగ్రెసు పార్టీని, ఉన్నతుడైన కామరాజును కూడా త్రోసిరాజని, మద్రాసు రాష్ట్రంలో డి.యం.కె. పార్టీ ప్రభుత్వం చేపట్టిన విధానాన్ని విప్లవమార్గంలో కొత్తగా నడకమొదలుపెట్టినప్పటికీ, శ్రీమతి ఇందిరాగాంధీ అవగాహన చేసుకొంది.

ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో సాంప్రదాయకంగా వస్తున్న కాంగ్రెసు పెత్తందారీ నాయకత్వాన్ని ప్రక్కకు నెట్టి రామమనోహర్ లోహియా వెనకబడిన బలహీనవర్గాల ప్రజలను అనేకమందిని తనవైపుకు రప్పించుకున్న విధానాన్ని ఆమె గమనించగలిగింది. ఆ తరువాత

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

ఇందిర సామాజిక విప్లవ అవసరాలను గుర్తించి, క్రింది తరగతుల ప్రజల ఆర్థిక దుస్థితిని రూపుమాపేందుకు 'గరీబీహఠావో'నినాదాన్ని ముందుకు తెచ్చింది.

తన పార్టీలో ఉన్న స్వార్థపరశక్తులకు వ్యతిరేకంగా పోరాడి, వారు కట్టుకొన్న కంచుకోటలను బద్దలుకొట్టి ముందుకురావడంతో శ్రీమతి ఇందిరాగాంధీ మీద అశేష ప్రజానీకం ఆసక్తిని కనబరిచి విశ్వాసంపెంచుకుంది. దూరంగా ఉంచబడిన వర్గాల ప్రజలంతా ఈ సందర్భంలో ప్రధానమంత్రితో కలిసి నడిచేందుకు ముందుకువచ్చి, అత్యధిక సంఖ్యలో ఆమెకు, ఆమె అభ్యర్థులకు ఓటు నిచ్చారు. కర్మభూమియైన భారత దేశంలో తరతరాలుగా తాము అనుభవిస్తున్న దుస్థితినుంచి, సాంఘిక మత పరమైన అంక్షలనుంచి బైటపడేందుకు ఆశతో వారంతా శ్రీమతి ఇందిరాగాంధీకి అధికారాన్ని అప్పగించారు. ఈ బాధ్యతను ఆమె చిత్త శుద్ధితో స్వీకరించి, సామాజిక విప్లవపరిణామానికి కావలసిన రాజకీయ నిర్ణయం తీసుకునేందుకు పూనిక వహించింది.

పార్లమెంటు, పంచాయతీరాజ్ సంస్థలలోనూ, శాసనసభల్లోనూ, ఇతర ప్రజాప్యామ్య సంస్థలన్నింటిలోనూ, దీర్ఘకాలంగా నిరాదరణకు గురైన ఈ వర్గాలన్నింటికి తగు ప్రాతినిధ్యం కల్పించాలని ఆమె చెప్పింది. ఇంతవరకు రాజకీయాధికారాన్ని స్వంతం చేసుకొని అనుభవిస్తూవచ్చినవారు ఇకముందు దానికోసం వీరి వెనక వుండవలసిన పరిస్థితి వచ్చింది. రాజకీయంగా, సాంఘికంగా అవసరమైన ఈ పద్ధతి తప్పనిసరై, 1971, 73 ఎన్నికలలో గొప్ప ఫలితాలను సాధించింది. ఇంత వరకు తమకు లభించవలసిన దాన్ని ఇప్పుడే సంపాదించుకోవాలనే ఆలోచన తమను కట్టిపడవేసిన బంధాలు తెంచుకోగలమనే ఆత్మవిశ్వాసం వెనకబడిన, బలహీనవర్గాల ప్రజలలో కలగడం ప్రారంభమైనది. వారికున్న సంకెళ్లేమిటి? అవి వారికున్న భయాలు. మానసికంగా తమకు తాము కల్పించుకుంటున్న ఆటంకాలు. శ్రీమతి ఇందిర, పార్లమెంటు, తమకు అండగా ఉన్నాయనే దృఢ విశ్వాసంతో యీ ప్రజలు గంగా ప్రవాహంలాగా తమకెదురైన ఆటంకాలను, అడ్డుకట్టలను త్రోసివేసుకుంటూ, వేగంగా ముందుకు నడకసాగించడం ప్రారంభించారు. ఎక్కడైనా హరిజనులమీదగానీ, గిరిజనులమీదకానీ, వెనకబడిన తరగతులమీదకానీ అత్యాచారాలు జరిగినా, వారు చంపబడ్డా, హింసించబడ్డా, ఇందిర పార్లమెంటు వాటిని ఖండిస్తూ, ప్రభుత్వాధికారులను పూర్తిగా ఈ బాధిత ప్రజల సహాయార్థం ఎక్కడ అవసరమైనా, ఏరీతిగా అవసరమైనా ఉపయోగించసాగింది.

ఈ కులాలనుంచి వచ్చిన ఈనాటి విద్యార్థులు వాళ్ల పూర్వీకులకన్నా, ఎక్కువ ఆత్మవిశ్వాసంతో జీవించడం అలవర్చుకున్నారు. ప్రాధాన్యతతో ఉద్యోగాలు పొందడమే గాకుండా, త్వరితంగా ప్రమోషన్లు పొందుతూ ఉన్నత స్థానంలోకి రాగలిగే అవకాశం తమకు శ్రీ బాబూ జగజ్జీవన్‌రామ్, శ్రీ సంజీవయ్యగార్ల కృషి వల్ల కలిగిందనే సంగతి వారికి తెలుసు. ప్రభుత్వ ఉద్యోగాలలో రాజకీయ, సాంఘిక హోదాను ఇతరులతో సమానంగా పొందగలిగే అవకాశం ఇప్పుడు వారికి కల్పించబడింది.

హరిజనులు మొదలైన వారికి ఈనాడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమవెనుక ఉన్నాయని తెలుసు. ఎవరైనా ఒక ఆఫీసరు, ఆయన అన్యాయం చేయడానికి ప్రయత్నించినప్పుడు

దానికి శాసన సభ ద్వారా ప్రస్తావించేందుకు ఈనాడు తమకు శాసనసభలో బలం ఉన్నదనే విషయం కూడా వారికి తెలుసు. అనేకానేక మార్గాలలో శారీరక, మానసిక దాస్యంలో కొట్టుమిట్టాడుతున్న కోట్లాది ఈ ప్రజలు, ఈ రూపంలో తమకాళ్లమీద తాము నిలబడి ముందుకు రాగలుగుతున్నారు.

ఇలాంటి అనేక విప్లవాత్మక విధానాల ద్వారా ఆత్మగౌరవ ఉద్యమాన్ని ఇందిర దేశంలోని అన్ని మూలలకు ఒక సాంఘిక చైతన్యంగా విస్తరింపజేసింది.

ఒకసారి యీ జనం పైకి రావడమంటూ జరిగితే తిరిగి వారు వెనక్కు వెళ్లడమంటూ జరగదు. ఈ మానసిక సాంఘిక బలహీనతల కారణంగా గతంలో వారి పూర్వీకులు ఇస్లామ్‌మతం క్రైస్తవమతం, సిక్కిజంలవైపు మారవలసిన అవసరం ఇకముందు రాదు. 1971 తరవాత వచ్చిన ఈ నూతనశకం, వారిని ఈ సాంఘిక దుస్థితి నుంచి బైటపడలేని, మరొకరు అధికులు తాము అధములమనుకునే భావదుస్థితి నుంచి, వారిని మేల్కొల్పడంతో ఇప్పుడు ప్రారంభమైన ఈ నూతనశకం గతంలో గాంధీ, నెహ్రూల మానవతావాదం లక్ష్యంగా పెట్టుకొని అధికారులు వీరికి తోడుగా నిలిచి కొత్తదైన సామాజిక విప్లవాన్ని సాధించి, వీరిని సర్వసమానత్వంవైపు తీసుకెళ్లగలదు.

ఈతరం సాంఘిక, రాజకీయ కార్యకర్తలు, పరిపాలకులు శ్రీమతి ఇందిర నాయకత్వంలో నిర్బంధ ఉచిత ప్రాథమిక విద్యను సర్వవ్యాప్తం గావించి, అవిద్యానిర్మూలన కృషిలో విజయాన్ని సాధించగలరు. వెనకబడిన వర్గాల ప్రజలు ఇతరులతో చేతులు కలిపి, నడవడంవల్లనే కాక, భారతదేశ సాంఘిక పరివర్తనా కృషిలో ముందుండి, తమవెనకబడినతనాన్ని అడుగంటా నెట్టివేయగలరు. ఈ విధంగా 1971 తర్వాత భారతదేశంలోని ప్రజాస్వామ్య బద్ధమైన ఒక సాంస్కృతిక విప్లవానికి అహింసా పద్ధతులలో బాట వేయటం జరిగింది.

ఆర్థికాభివృద్ధికి చాలా సమయం కావలసి వచ్చినా, సాంఘిక చైతన్యానికి రాజకీయశక్తి, నాయకుల శ్రద్ధ, నూతన మార్గదర్శక సూత్రాలను, కష్టజీవుల కోసం రూపొందించడం ద్వారా త్వరలోనే సాధించవచ్చు. ఈ ప్రయత్నాన్ని చూసి, పరలోకంలో ఉన్న బాపూజీ ఆత్మ సంతోషిస్తుంది.

మద్రాసు రాష్ట్రంలో డి.యం.కె.పార్టీ అక్కడ ఉన్న బలహీన వర్గాలలో క్రొత్తఆలోచనను, ఆత్మ విశ్వాసాన్ని పాదుకొల్పేందుకు చేసిన కృషిని గురించి నేను వివరిస్తున్నప్పుడు, శ్రీమతి ఇందిరాగాంధి ఆసక్తితో గమనిస్తూ ఉండేది. ఆమె కళ్లు మెరుస్తూ కనిపిస్తాయి. ఆమె అప్పటికే ఈ మార్గంలో ముందుకు పయనించి ఉంది. అయితే ఆమె గాంధేయ పద్ధతుల్లో దీనిని ఇంకా ముందుకు తీసుకువెళ్లేందుకు సిద్ధంగా ఉంది.

ఈ సాంఘిక విప్లవం తర్వాత ఆర్థిక విప్లవాన్నికూడా తీసుకురాగలదనే దాన్ని మనం గుర్తుంచుకోవాలి. ఈ ప్రయత్నాలను స్వార్థపరశక్తులచేత అంత తేలిగ్గా అంగీకరింపజేయగలమా? కానీ దానంతటదే సిద్ధిస్తుందా? ఇప్పటి వరకు తమ క్రింద ఉన్న ప్రజలు ఇక ముందు తమతో సమానంగా ఉండేందుకు వీరు అంగీకరించి, వారికి మంచి ఉద్యోగావకాశాలను కల్పించగలరా?

శ్రీమతి ఇందిరాగాంధీగానీ, మరే విప్లవనేత గానీ అశోక చక్రవర్తి కాలం నుంచి అధమ స్థితిని అనుభవిస్తున్న కోట్లాదిమంది ప్రజలకు యుద్ధానంతరం ప్రపంచ వ్యాప్తంగా విస్తరిస్తున్న సామాజిక విప్లవానికి అనుగుణంగా సాంఘిక న్యాయాన్ని సాధించి పెట్టగలరా? రష్యా, అమెరికా, చైనా దేశాలు తీసుకున్నట్లుగా తమ సామాజిక సంపదను ఉన్నవారికి, లేనివారికి సమంగా పంచిపెట్టగలరా? విశ్వవ్యాప్తంగా ప్రారంభమైన ఈ మహోన్నత విప్లవ ఫలితాలను ఎవరు లెక్కవేసి చెప్పగలరు? ఈ పరిణామం ఫలవంతమైన ఫలితాలను అందిస్తుందని మాత్రం చెప్పగలం.

మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల నుంచి ఆస్తి హక్కును తొలగించడం ద్వారా శ్రీమతి ఇందిరాగాంధీ భారత దేశ చరిత్రకు ఒక గొప్ప బహుమతిని అందజేసారు. 1971-72లో జరిగిన ఎన్నికలలో ప్రజలు ఆమెకు అత్యధికమైన మెజారిటీతో ఈ హక్కును కలిగించారు. 24, 25 రాజ్యాంగ సవరణల ద్వారా ఆమె దీనిని సాధించారు. నిజానికి ఇది గొప్ప చారిత్రాత్మకమైన సంఘటన.

ఈ చర్య ద్వారా సాంఘిక, ఆర్థిక పరిస్థితుల్లో తరతరాలుగా పాందుతున్న ఓ హక్కును తిరగ రాసేందుకు ఆమె పూనుకున్నది. రాజ్యాంగం ద్వారా ఈ మార్పుకు అధికారాన్ని పాందిన తర్వాత, ఆమె పరిమితులకు మించి ఆస్తులు కలిగి అనుభవిస్తున్న వారికి, వాటిని అమ్మే విషయంలోగానీ, మార్పిడిచేసే విషయంలోగానీ మరొకరికి బదలాయింపు చేసే సందర్భంలోగానీ, ఎలాంటి చర్యలకు పూనుకోకుండా నోటీసు జారీ చేసింది. కనీసావసరాలైన తిండి, బట్ట, వసతి, ఉద్యోగం, ఆరోగ్య సౌకర్యాలను తగు విధంగా పాందలేక, దూరంగా ఉంటున్న లేనివారిని కాదని ఆస్తులు కలిగిన వారంతా విచ్చలవిడిగా వాటిని ఇక ముందు అనుభవించకుండా ఆమె కట్టడి చేసింది. ఆ విధంగా పరిమితికి మించి ఆస్తులు కలిగిఉన్నవారు వాటిని సామాజిక అవసరాల నిమిత్తం అప్పగించాలని ఆమె కోరారు.

రాజ్యాంగ పరంగా పంపిన ఈ నోటీసు ఆస్తిపరమైన అధికార పరిధిలో ఒక గొప్ప చెప్పుకోదగిన పరిణామం! ఆస్తి అనేది శాశ్వతంగా కొద్దిమంది చేతిలో మాత్రమే ఉండడానికివీలులేదు. సమాజానికి అవసరమైనప్పుడు వేదరిక నిర్మూలనకు పనికి వచ్చేటప్పుడు దానిని చట్టపరంగా స్వాధీనం చేసుకొనే హక్కును ప్రభుత్వం తీసుకుంది. ఈ నోటీసు నూతన సామాజిక పరిస్థితులకు అనుగుణంగా తమంతట తామ సరిదిద్దుకునేందుకు అదనంగా ఆస్తి ఉన్నవారికి అవకాశం కలిగించింది. 1973లో వచ్చిన ఈ అహింసాయుత విప్లవం మన చరిత్రకు ఒక గొప్ప బహుమతిని ప్రసాదించింది.

ప్రజలు ఆమె కందించిన గొప్ప సమర్థన పార్లమెంటులో కల్గించిన మూడింట రెండు వంతుల మెజారిటీ, ప్రజలకవసరమైన 'గరీబీహఠావో' సూత్రాన్ని అమలు జరిపేందుకు ఆమెకు మంచి అవకాశాన్ని కల్పించింది. ఈ గొప్ప సమర్థన తర్వాత నాలుగు సంవత్సరాలు దాటిన తరువాత 1971లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను పూర్తి చేయడానికి ఆమె ప్రయత్నిస్తున్న తరుణంలో, ఆమె ఆశించినంతగా అన్ని పార్టీలు ప్రజలు తనతో సహకరించనప్పుడు 1975లో

దేశంలో ఆమె అత్యవసర పరిస్థితిని ప్రకటించడంజరిగింది.

భూపరిమితి చట్టానికి కొన్ని సవరణలు చేయడం ద్వారా ఆమె రైతు కుటుంబాలను ప్రోత్సహించింది. వారిని హరిత విప్లవం వైపు నడిపించేందుకు దోహదం కలిగించింది. తద్వారా ఉత్పత్తులలో స్వయంసమృద్ధిస్థాపనకు పాడుగుపింజప్రత్తి ఉత్పత్తి ద్వారా వందకోట్లరూపాయలు విదేశీ మారకాన్ని సంపాదించేందుకు గ్రామీణ ప్రాంతాలలో బ్యాంకుల స్థాపనకు మార్గం ఏర్పడింది.

పట్టణప్రాంతాలలో విధించిన భూపరిమితి చట్టంలో ఉన్న అవరోధాలను పరిశ్రమలు మొదలైన ప్రజోపయోగ నిమిత్తం తీసుకున్న భూములకు వర్తించకుండా ఉండేందుకు 25-26వ రాజ్యాంగ సవరణల ద్వారా సవరించి, అవకాశం కలిగించింది. ప్రజలు కోరుకునే విప్లవపంథాకు ఇవి ఏవీ పూర్తిగా సరిపోవు.

సరిహద్దుల విషయంలో ఉన్న అంతర్రాష్ట్రవిభేదాలు, నదీజలాల వివాదాలు, ముఖ్యంగా నర్మద, గోదావరి నదులపై ఉన్న విభేదాలు ఏవీ పరిష్కారం కాక, ఇంకా నిలిచి ఉన్నాయి.

ఇలా జరగడానికి చాలా కారణాలు ఉన్నాయి. ముఖ్యంగా బంగ్లాదేశ్ విప్లవ పరిణామం నూనె ధరల పెరుగుదల అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా, సంభవిస్తున్న ఆర్థిక దుస్థితి, సమ్మెలు, లాకౌట్లు కార్మికులు వారి యజమానుల మధ్య ఉన్న అసహాయ పరిస్థితి విద్యుచ్ఛక్తి, ఉత్పత్తి, సరఫరాలలో వైఫల్యం, ఎరువులు, క్రిమికీటక సంహారకమందుల సరఫరా సరిగాలేని పరిస్థితి. నల్లధనం ఆడుతున్న నాటకం, అవినీతి, జీతాలు, అలవెన్సులు కోసం వత్తిడి పెడుతున్న ప్రభుత్వ యంత్రాంగం ఈ వైఫల్యాలకు కొన్ని కారణాలు! ఈ విప్లవమార్గంలో ఆమెతో కలిసిరాక, అనేకమంది కాంగ్రెసు శాసనసభ్యులు మంత్రులు. మధ్యతరగతి ప్రజలు పారిశ్రామిక కార్మికులు, యజమానులు, దీని ఫలితాన్ని నిర్వీర్యం చేసారు. మరొకప్రక్క ప్రతిపక్షాలు జయప్రకాశ్ నారాయణ్‌గారి ఆధ్వర్యంలో ఆమెకు ఆటంకాలు కల్పిస్తూ అడుగడుగునా ముందుకు వెళ్లకుండా నిరోధించారు. ప్రజలెన్నుకున్న ఈ నాయకత్వం ఇలాంటి అవనవ్యధోరణులవల్ల నూతన విప్లవానికి ప్రజాస్వామ్యానికి, తగినంతగా విజయం చేకూర్చలేకపోయింది.

ఈ పరిస్థితులన్నీ ఉన్నప్పటికీ, అధికారపక్షం సవ్యంగా తనతో నడిచినాప్రతిపక్షం బాధ్యతాయుతంగా ప్రవర్తించినా ఇంతకన్నా, ఇంకొంచెం అదనంగా ఫలితం సిద్ధించి ఉండేది. ప్రజలు ఒకసారి శ్రీమతి ఇందిరాగాంధీకి అనుకూలంగా తీర్పు చెప్పిన తరవాత, మిగిలినవారు ఈ మార్పును సక్రమంగా గౌరవించగలిగినా, లేదా గెలుపొందిన తర్వాత 71కి ముందున్న సంబంధాలను దృష్టిలో పెట్టుకోకుండా ఆమె అందరి సహకారాన్ని తీసుకొని కృషిసాగించగలిగినా ఫలితం ఇంకా బావుండేది. దురదృష్టవశాత్తూ తమ పార్టీలో ఉన్న అన్ని వర్గాలమధ్య వ్యక్తుల మధ్యనైనా గట్టి అనుసంధానాన్ని ఏర్పాటు చేసేందుకు, ఆమె తీవ్రంగా ప్రయత్నించలేకపోయింది.

1971-75లో ఆమె పొందిన వైఫల్యాల నుంచి బయటపడేందుకు, 1971వ

సంవత్సరంలో ప్రజలకిచ్చిన 'గరీబీహఠావో' నినాదాన్ని అమలు జేసేందుకు అత్యవసరపరిస్థితి ఆమెకు మరో అవకాశాన్ని కలిగించింది.

1970లో పార్టీ కలతలనుంచి బయట పడేందుకు ఆమెకు కలిగినట్టుగానే ఈనాడు విప్లవ లక్ష్యాలవైపు ప్రజలను నడిపేందుకు ఆమెకు ఈ అవకాశం ఎదురైంది. జయప్రకాశ్ నారాయణ్ మొరార్జీ దేశాయ్‌గార్లతో కలిసి ప్రతిపక్షం సాగిస్తున్న అసహాయధోరణినుంచి, అవినీతిపరులైన అధికారయంత్రాంగంనుంచి స్వార్థపరులైన రాజకీయ, వ్యాపారవేత్తలనుంచి ధైర్యంగా బయటపడి, నూతన ఆర్థికవిధానంవైపు దేశాన్ని నడిపించేందుకు ఈ పరిస్థితి ఆమెకు ఒక అవకాశాన్ని కల్పించింది.

జాతీయార్థికాభివృద్ధిని, రాజకీయ ఆర్థికపరిణామాలను సరిగ్గా గణించుకున్న తర్వాతనే ఆమె విప్లవాత్మకమైన 'గరీబీహఠావో' లక్ష్యాన్ని ముందుకు తీసుకువచ్చారు. శ్రీమతి ఇందిరాగాంధి విజయంగానీ పరాజయంగానీ, అన్ని జాతీయవనరులను, ఆమె సమీకరించడం పైననే ఎక్కువగా ఆధారపడి ఉంటుంది. ప్రజలకు 1975 ఎన్నికలసందర్భంలో ఇచ్చిన ఈ సాంఘిక, ఆర్థిక, విప్లవ వాగ్దానాలు నెరవేర్చేందుకు వెనక్కు తిరిగి చూడకుండా ప్రభుత్వం కాంగ్రెసు పార్టీ పనిచేసినప్పుడు మాత్రమే అది సాధ్యమవుతుంది.

23

శ్రీ జవహర్లాల్ నెహ్రూ
60 ఏండ్ల ప్రజాస్వామికద్రష్ట!

శ్రీజవహర్లాల్ 14-11-1889న అలహాబాద్‌లో జన్మించారు. హారోలోనూ, కేంబ్రిడ్జిలోనూ విద్యాభ్యాసం గావించారు. 1912లో బారిష్టరు పట్టాపొంది, బార్‌లో సభ్యులు గాచేరారు. హోంరూల్ ఉద్యమంలో ఆసక్తి కనపరుస్తూ, 1921లో సహాయ నిరాకరణ ఉద్యమంలో ప్రవేశించారు. 1919-20 సంవత్సరాలమధ్య గాంధీగారితో కలిసారు. 1921లో మొదటి సారిగా జైలుకు వెళ్ళారు. ఆ తరువాత పలుమార్లు కాంగ్రెసు సత్యాగ్రహ పోరాటాల్లో జైలు జీవితాన్ని గడిపారు. 1927లో బ్రస్సెల్స్‌లో జరిగిన 'అణచి వేయబడిన ప్రజల సదస్సు'లో కాంగ్రెసు ప్రతినిధిగా పాల్గొన్నారు. రష్యాపై తన అనుభూతుల్ని వ్యక్తపరుస్తూ, రచనలు చేసారు. 1928లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసు అధ్యక్షులయ్యారు. 1929 డిసెంబర్‌లో తొలిసారిగా కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నికైనారు. 1920 జనవరిలో భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని దేశవ్యాప్తంగా జరిగిన ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్నారు. గాంధి-ఇర్విన్ ఒడంబడిక చర్చలలో పాల్గొన్నారు. 1935-36లో యూరపు ఖండంలో పర్యటించారు. 1936లక్నో, ఫైజ్‌పూర్ సదస్సులలో కాంగ్రెసు అధ్యక్షునిగా ఎన్నికైనారు. 1942-46 సంవత్సరాల మధ్య మంత్రి వర్గ సంఘాలను సమావేశపర్చారు. 1946నుంచి 65వరకు భారత ప్రధానిగా ఉన్నారు. 1946-47లో దేశవిభజనకు అంగీకరించారు. 1947లో కాశ్మీరును భారతదేశంలో సంలీనం గావించారు. చైనాదేశం పర్యటించారు. వల్లభాయ్ పటేల్ హెచ్చరికను, నా వ్యతిరేకతను కూడా పట్టించుకోకుండా, టిబెట్టును చైనా స్వాధీనం చేసుకోవడాన్ని బలపరిచారు. 1962లో చైనా దురాక్రమణకు వ్యతిరేకంగా జాతీయాభిప్రాయాన్ని కూడకట్టుకు రాగలిగారు. ప్రణాళికా బద్ధమైన ఆర్థిక విధానానికి రూపకల్పన చేసారు. 1938నాటి ప్లానింగ్ కమిషన్‌కు చైర్మన్‌గా ఉన్నారు. మిత్రరాజ్యాల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్నారు. భారత ప్రధానిగా ప్రపంచమంతటా పర్యటించారు. 'గ్లింప్సెస్ ఆఫ్ వరల్డ్ హిస్టరీ' గ్రంథరచన చేసి విశ్వవిఖ్యాత రచయితగా పేరుగాంచారు. - ఎడిటర్.

పండిట్ నెహ్రూ 1945-46 వరకూ సామాన్య ప్రజలకంటే కూడా, ఎక్కువగా జాతీయ నాయకులకు, రాజ్యాంగ రచనా సభ్యులకు, కాంగ్రెసు పార్టీ కార్యకర్తలకు, మేధావులకు ఒక ఉపాధ్యాయుడిగా ఉంటూ వచ్చారు. జాతీయ ప్రాముఖ్యతగల అంశాలలో ఆయన పార్టీతో విభేదిస్తూ ఉండేవారు. తన ఆలోచనాదృక్పథాన్ని పార్టీలో ప్రవేశపెట్టేందుకు దానితో ఆయన కుస్తీ పడుతూ ఉండేవారు. తన భావజాలాన్ని, పార్టీ సిద్ధాంతాలతో సరిపోల్చుకుంటూ, తన భావాలను పార్టీ స్వీకరించడానికి సిద్ధంగాలేదని అర్థంకాగానే, ఆయన వెనక్కి తగ్గేవారు. తిరిగి పార్టీ

సానుకూలతగా ఉందని అర్థంకాగానే అంతకుముందు తాను ఉపసంహరించుకున్న అంశాలను ముందుకు తెచ్చి, భావోద్రేక పూరితమైన వాగ్ధాటితో అసాధారణ మేధాసంపత్తితో, సకారణంగా పార్టీలో ప్రవేశపెట్టేవారు. ఆ సందర్భంలో ఆయన పార్టీచేత ఆమోదింపజేసేందుకు, హుందాగా, మృదువుగా, అనుచరులను బుజ్జగిస్తూ, తర్కా ప్రావీణ్యతను వినియోగించి హావభావాలతో పార్టీ సభ్యులను లోబరచుకొని, తన ఆలోచనా రీతులను ఏదో ఒక మేరకు అంగీకరింపజేస్తూ ఉండేవారు.

క్రమేణా పార్టీకూడా ఆయన ఆకర్షణలో పడిపోయింది. ప్రతిభావంతమైన ఆయన మేధాశక్తి, వ్యక్తిత్వాన్నీ గమనించి, పార్టీ ఆయనను ప్రేమించసాగింది. అసాధారణమైన ఆయనలోని నాయకత్వ లక్షణాలను చూసి పార్టీ ఆనందించి గర్వపడింది. ఒక్కో సందర్భంలో తనకు, పార్టీపూర్తి వ్యతిరేకమార్గంలో ఉన్నట్టు గమనించగానే, ఆయన వెనకంజవేసి, మౌనాన్ని పాటించేవారు. భిన్న దృక్పథాల మధ్య సమన్వయం సాధించే సందర్భాలలో ఆయనను పరాజయంపాలు జేయడమో, తాము లొంగిపోవడమో జరిగేదానికంటే, నెహ్రూజీ వ్యక్తపరిచే పట్టువిడుపుల ధోరణి, పార్టీకి వెసులుబాటుగానే కనిపించసాగింది.

కొంతకాలం గడిచిన తరవాత, సంస్థాగతమైన మార్పుల విషయంలో, ఒక్కో సందర్భంలో తక్కువ స్థాయిలోనూ, మరోసారి తీవ్రస్థాయిలోనూ పార్టీ స్పందిస్తూ, తన మొండివై ఖరితో పండిట్ జీని ఎక్కువ బాధపెట్టకుండా జాగ్రత్తపడుతూ వచ్చింది. అనివార్యమైన పరిస్థితుల్లో పండిట్ జీ పార్టీకూడా తీవ్రస్థాయిలో ఘర్షణపడిన సందర్భాలు ఉన్నప్పటికీ ముఖ్యమైన జాతీయ సమస్యలపై మాత్రం పట్టుదలలకు పోకుండా, పట్టువిడుపులను వ్యక్తపరిచే స్థితికి రావడం జరుగుతూ వచ్చింది. రాజ్యాంగ సభ విషయ నిర్ణాయక సంఘంలోని, కాంగ్రెసు పార్టీ విభాగం మైనారిటీ వర్గాలలోని రెండింటి ప్రతిపత్తి విషయంలో నిర్ణయం తీసుకోవాల్సి వచ్చినప్పుడు ఏ నిర్ణయాన్ని చేయకుండా తటస్థవై ఖరిని అవలంభించడమే ఇందుకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

పండిట్ జీ పూర్తిగా ప్రజాస్వామిక దృక్పథం గలవారు. కార్యక్రమాలన్నింటినీ సక్రమంగానూ, ప్రణాళికాబద్ధంగానూ, నిర్ణయాత్మకంగానూ నిర్వహించడంలో ఆయనకు సాటిరాగలవారెవరూ లేరని చెప్పడం అతిశయోక్తికాదు. వ్యక్తిగతంగాగానీ, ఒక వర్గంమీదగానీ ఆయనకు ప్రత్యేకమైన శ్రద్ధాసక్తులు ఉండేవికావు. సహజంగా ఆయన అభ్యుదయ దృక్పథంగలవారు. ఆయనలో విప్లవభావాలు మూర్తీభవించి ఉండేవి. కార్యక్రమాలను అమలు జేసేటప్పుడు, ప్రజాస్వామ్యయుతంగా సహజంగా జరిగే కాలవిలంబననుగానీ, ఆటంకాలనుగానీ, నత్తనడకనుగానీ ఆయన సహించేవారుకాదు. అలాంటి స్థితిని ఆయన ఓర్చుకోలేకపోయేవారు.

ప్రజాస్వామిక పద్ధతిలో నిర్వహించబడే, కేంద్ర శాసన సభలలో చర్చలు జరుగుతున్నప్పుడు ఎదురయ్యే అవరోధాలు, విమర్శలు తాను భరించలేనంత బాధాకరంగా ఉన్నప్పటికీ, ఆ విమర్శలను ప్రాతిపదికగా చేసుకొని, ఆయన తన్నుతాను ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉండేవారు. ఎదుటి సభ్యులు ఉపన్యసించేప్పుడు, వాటినుంచి తనకు కావలసిన అంశాలను స్వీకరిస్తూ అంతకు క్రితం తాను ఏర్పరచుకున్న అభిప్రాయాలను, కార్యక్రమాలను

పునరాలోచించుకొని, తిరిగి రూపొందించుకునేవారు. సందర్భాన్నిబట్టి నిర్ణయాలను తీసుకోవలసి వచ్చినప్పుడు వాటిని ముందుగానే వ్యూహాత్మకంగా రూపొందించుకొని, ఉద్ధృతమైన ప్రవాహవేగానికి సైతం తట్టుకొని నిలువగలిగే దృఢచిత్తంతో, మేధాసంపత్తితో, పూర్తి విశ్వాసంతో వాటిని ప్రవేశపెట్టేవారు. ఆయనతో కలిసి పనిచేయడమంటే, నిజానికి అదో గొప్ప అనుభవమనే చెప్పాలి. తాను తీసుకున్న అంశాన్ని, గాంధీ, సోక్రటీసులవలె భిన్న కోణాల్లో పరిశీలించి సరియైన నిర్ణయాన్ని చేయగల ఆయన వ్యక్తిత్వం, ఉన్నత భావావేశానికి ప్రేరకంగా ఉంటుంది. ఆయన తన అనుచరులను అభ్యుదయభావాలతో కూడిన ఆలోచనాపరులుగా, ప్రజా స్వామ్యవాదులుగా రూపొందించేందుకు ఎంతగానో శ్రమించారు.

ద్వంద్వ ప్రవృత్తికి ప్రతీకగా ఉన్న జవహర్‌లో – రాజనీతిజ్ఞుడైన జవహర్, విప్లవభావాలు మూర్తీభవించిన జవహర్‌ల ద్వయం నెలకొని ఉండి, వివిధ అంశాలపై అప్పుడప్పుడూ ఆయనలో పేచీపడే సందర్భాలు తలెత్తుతూ ఉంటాయి. కాంగ్రెసు సంస్థ అత్యంత శక్తి స్వరూపిణిగా, బలోపేతమై, చురుకుగా ప్రజలలో కృషి చేయాలని ఆయన ఆశిస్తూ ఉంటారు. జాతీయ సమస్యలను కఠిన నైఖరితో పరిష్కరించిన సర్దార్ పటేల్ హయాం తర్వాత కాంగ్రెసు పార్టీ కాలక్రమేణా తన దృష్టినంతా పండిట్ నెహ్రూపై నిలుపసాగింది. కాంగ్రెసు సంస్థ తన బాధ్యతనంతటినీ, నెహ్రూజీ భుజస్కంధాలపై ఉంచిన తరవాత దేశవ్యాప్తంగా ప్రజలందరి అభిమానాన్ని సంతరించుకొన్న, ఆయన తన కోసం ప్రత్యేకంగా ఒక ముఠాను గానీ, వ్యక్తిగతమైన అభిమానులను గానీ ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరంలేకుండా పోయింది. ఆయన ప్రారంభించిన ప్రతి ఉద్యమాలు కూడా ఆలోచనల్ని రేకెత్తించేవిగానూ, సంస్కారవంతమైనవిగానూ, పార్టీ అనుచరుల ప్రయోజనాలను పరిరక్షించేవిగానూ రూపుదిద్దుకొని ఉంటాయి. తన పూర్తి కాలాన్ని ఆయన జాతీయవాదిగా, కుల, మత, వర్గ తత్వాలకు వ్యతిరేకంగా పోరాడుతూ గడిపారు. కామన్‌వెల్త్‌లో భారతదేశం ప్రవేశించే సందర్భంలోనూ, న్యాయపరమైన ప్రాథమిక హక్కుల్ని నెలకొల్పటంలోనూ, మైనారిటీలకు ప్రత్యేకమైన హక్కులు, వారి సాంఘిక, సాంస్కృతిక, ఆచార వ్యవహారాలను కాపాడటంలోనూ ఆయన అనుకోకుండానే గొప్ప ఫలితాలను సాధించారు. ఏదైనా ఒక సందర్భంలో అపజయం ఎదురైనప్పుడు ఆయన దానిని హుందాతనంతో స్వీకరించేవారు. ఉదాహరణకు ఎగువ సభకు ఎక్కువ అధికారాలు కావాలని ఆయన పార్టీలో పోరాడి సుముఖతను సాధించలేని సందర్భంలో అపజయం ఎదురైనప్పుడు ఆయన దానిని హుందాతనంతో స్వీకరించి, ఆ అంశాన్ని వదిలేసి మౌనంగాఉండిపోయివారు. ఎగువ సభసభ్యుల వయోపరిమితి 35 నుంచి 30 సంవత్సరాలకు తగ్గించాలని ఆయన తీవ్రమైన పోరాటాన్ని జరిపారు. తద్వారా పాతకాలపు పిడివాదులకన్నా, ఎక్కువమంది యువకులు సభకు ఎన్నిక కావడానికి ఈ తీర్మానం తోడ్పడగలదని ఆయన భావించారు. అలాగే జాతీయ భాషగా ఇంగ్లీషును ఆమోదింపజేయడంలో విఫలమై తుదకు హిందీని అధికార భాషగా అంగీకరించవలసి వచ్చింది. కానీ చివరకు ప్రజలు, పార్లమెంటూ ఆయన త్రిభాషా సూత్రాన్ని అంగీకరించడం జరిగింది.

పండిట్ నెహ్రూకు, రాజ్యాంగ పరిషత్తుకూ ఉండే సంబంధాలు భిన్న సందర్భాలలో ఎదురయ్యే పరిస్థితులను బట్టి మారుతూ ఉండేవి. పార్టీగాని, కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీగానీ

ప్రతి విషయానికీ భూతద్దంలో చూసినట్లు అనవసరమైన ప్రాధాన్యతనిస్తూ, స్థానిక సమస్యకూ, అత్యవసర సమస్యకూ మధ్య ఉండే వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ఛాందసంగా వ్యవహరిస్తూ ఉండేవి. భిన్న మనస్తత్వంగలవారూ, విభిన్న ఆలోచనపరులూ, వివిధ అవకాశాలతో సభ్యులుగా ఎంపికైనవారి మధ్య సమన్వయంలోపించి, చర్చలలో పరస్పరం వాదించుకుంటూ ఏకాభిప్రాయానికి రాలేక, తలలు పగలగొట్టుకుంటూ, మొండిగా వ్యవహరిస్తూ ఉన్న సందర్భంలో, పండిట్ నెహ్రూ వాటిల్లో జోక్యం చేసుకోకుండా, చర్చలకు దూరంగా ఉన్న సభ్యుల మధ్య ఉదాసీనంగా ఉన్నట్టు కనిపించేవారు. తనబట్టతల మీద చేతులు పెట్టి సవరించుకుంటూ, అరమోడ్పు కన్నులతో నోరు మెదపకుండానే, అందరితో మాట్లాడుతున్నట్టే ఉండేవారు. తన చుట్టూ ఆవరించి ఉన్న చర్చల రణగొణ ధ్వనులనుంచి మెల్లిగా తేరుకొని, అప్పటిదాకా తనలోతానే మేధోమథనంచేస్తూ, అప్పటిదాకా జరుగుతున్న చర్చల సమస్యల పరిష్కారానికి స్పష్టమైన ఒక నిర్ణయానికి ఆయన వచ్చిన తరవాత, ఒక్క సారిగా ఆయన కళ్లు పెద్దవిచేసి, తన చుట్టూ ఉన్నవారిని తేరిపార చూడగానే, పార్టీలోగానీ, కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీలో గానీ తన అభిప్రాయాన్ని విసిరేందుకు ఆయన సమాయత్త మైనట్టు గుర్తుపెట్టుకోవాల్సి ఉంది. ఆ సమయంలో ఆయన దరికి చేరాలంటే, చర్చలలో తలమునకలై ఉన్న వారికిగానీ, స్నేహితులకుగానీ కష్టసాధ్యమనే చెప్పాలి. అప్పుడు ఆయన స్థితి ఆకలితో పంజా విప్పిన సింహంలా ఉంటుంది. అలాంటి సమయంలో ఆయనను గమనించడం అవసరం, తన ఉపన్యాసాన్ని మొదలుపెట్టిన కొద్ది క్షణాల్లోనే, తారాస్థాయికి పెంచి తనవాదాన్ని సూటిగా స్పష్టంగా వ్యక్తపరుస్తూ ఎదుటివారి వాదనలను త్రోసిపుచ్చుతూ, నాటకీయంగా తనవాదానికి ఆమోదాన్ని సాధిస్తూ ఉంటారు. ఆ సమయంలో కళ్లలో నిప్పులు చెరగుతూ, విమర్శనా బాణాలను సంధిస్తూ తాను విజయాన్ని సాధించడంగానీ అలాజరగని పక్షంలో నిరాశా నిస్పృహలతో చేతులు త్రిప్పుతూ ఆయోమయ పరిస్థితిని కల్పించి గందర గోళాన్ని సృష్టించి, తుది నిర్ణయాన్ని చివరకు పార్టీకిగానీ, కాన్‌స్టిట్యుయెంట్ అసెంబ్లీకిగానీ వదిలివేయడం జరుగుతూ ఉంటుంది.

ఒకరిని నొప్పించాలనిగానీ, వేరొకరిని మెప్పించాలనిగాకుండా, ఎలాంటి రాగద్వేషాలకు లోనుగాకుండా, దేశానికి, ప్రజలకు మేలుచేయగలదని తాను నమ్మిన అంశాన్ని అనుచరులచేత అంగీకరింప జేయాలని మనస్ఫూర్తిగా, పవిత్ర సంకల్పంతో కృషి చేసే, నెహ్రూజీ వంటి ఉన్నతవ్యక్తిని, గత ఇరవై అయిదు సంవత్సరాల నా ప్రజా జీవితంలో ఇక్కడగానీ, మరేదేశంలోగానీ ఇంతవరకు చూడలేదు. ఆధునిక ప్రజాస్వామిక యుగానికి ఆయన ఒక అద్భుతమైన వ్యక్తి. ఈ ప్రజాస్వామ్య ప్రపంచానికి ఆయన ఒక మణిపూసవంటివారు. ఆయనలోని ఈ విశిష్ట లక్షణాలను గమనించి, మహాత్మాగాంధీ మనదేశానికి నెహ్రూజీని అంకితంచేసి వెళ్లారు. గాంధేయ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆయన ఆలంబనవంటివారు. ప్రపంచంలో శాంతి, సౌభ్రాతృత్వాలను నెలకొల్పేందుకు ముందుగానే దివినుంచి భువికి అరుదెంచిన శాంతిదూత జవహర్.

గాంధీజీ మరణానంతరం ఆయనరోజు రోజుకీ గాంధేయ మార్గంలో ఎక్కువగా సంలీనం అవుతూ వచ్చారు. గాంధీజీ బ్రతికి ఉన్న రోజుల్లో సందేహాలపుట్టగా ఉండే ఆయన మనస్తత్వం, గాంధీజీ మరణానంతరం వాస్తవ పూరితమైన విధానంతో, నిర్మాణాత్మకంగా

రూపుదిద్దుకొన్నది. ఈరోజు ఆయన తరుమగా గాంధీ సూత్రాలను బోధిస్తూ, ఆచరిస్తున్నారు. మీరు ఒక విషయం పట్ల శ్రద్ధాసక్తులను ఉంచితే, దాని ఫలితం కూడా మీపట్ల శ్రద్ధను అందిస్తుంది. ఇతరులకు మనం ప్రేమనీ, విశ్వాసాన్ని అందిస్తే తిరిగి మనకు ప్రేమ, విశ్వాసాలే లభిస్తాయి. మీరు ఇతర పార్టీలను వేధించి, బాధించాలనే సంకల్పాన్ని విడిచిపెట్టి, కొంతమేరకైనా ప్రత్యర్థులను సంతోషపెట్టగలగడం అవసరం. స్వల్పప్రయోజనం కోసం మొండితనంతో ప్రత్యర్థులను నొప్పించేకంటే స్వల్పత్యాగంతో ఎదుటివారికి ఆనందాన్ని కలిగించడం నేర్చుకోవాలి, అనే గాంధీజీ సూత్రం ఆయనలో బలపడసాగింది.

గాంధీ మహాత్ముడు మనమధ్య లేకపోవడం తీరని నష్టంగా భావించే మాలాంటి చాలామందిలాగా, నెహ్రూజీ కూడా తీవ్రమైన మానసిక బాధను అనుభవించారు. ఒక సందర్భంలో ఆయన మాట్లాడుతూ "ఈ విశాలప్రపంచంలో మనం చాలా అల్పులమనీ చట్టుముట్టిన సమస్యల వలయంలో కూరుకుపోయిన ఈ ప్రపంచాన్ని వివిధంగానూ ఉద్ధరించలేకపోతున్నామనీ, ఆయన బాధను వ్యక్తంచేశారు. మనదేశంలోనూ, ఇతరదేశాల్లోనూకూడా, మనిషి ఈర్ష్యాద్వేషాలతో కొట్టుమిట్టాడుతున్నాడనీ, నిరాశాజనకమైన జీవితాల్లో కోట్లాది ప్రజలు నలిగిపోతున్నారనీ, ఆయన ఆవేదనపడ్డారు. గాంధీజీ ఇప్పుడు మన మధ్య జీవించి ఉంటే, ఈ పరిస్థితులకు స్పందించి ఈ సమస్యలనుంచి ప్రజలను విముక్తి చేయటానికి తన ఆశయాలను ఆచరణలో పెట్టి పరిష్కార మార్గాలను చూపేవారని నెహ్రూజీ తన ఆకాంక్షను వెలిబుచ్చేవారు. కేవలం పది సంవత్సరాల వ్యవధిలో తన పథకాలను అమలులోపెట్టి, ఫలితం సాధించవచ్చునని ఏ రాజకీయవేత్త అయినా భావిస్తే అతను గాంధేయవాది కానట్లే పరిగణించవలసి వుంది. ఈ ధోరణిని గాంధేయవాదం అంగీకరించదు. గాంధీజీ విశ్రాంతి, అలసటను దేనినీ ఎన్నడూ ఎరుగరు. ఈ ప్రపంచమానవాళికి సేవ చేసేందుకు మరొక పాతిక సంవత్సరాలు అవసరమైతే బాపూజీ నిరంతర శ్రమతో దానికి సిద్ధపడేవారు. ప్రజాస్వామ్యంపట్ల ఆయన నమ్మిక అంత బలీయమైనది.

జవహర్లాల్ గొప్ప ప్రజాస్వామిక నాయకులు. వందలాది, లక్షలాది సామాన్య ప్రజలకు ఆయన ఉపదేశికుడు. గాంధేయ స్వరాజ్య సమాజ నిర్మాత. ఈ శతాబ్దంలోని నేటి తరం ప్రజలు ఆయనను తమలో ఒకనిగా, తమ నాయకునిగా చెప్పుకోవడానికి గర్వపడడంలో ఆశ్చర్య పడవలసినదేమీ లేదు.

60–75 ఏండ్ల మధ్యప్రాయంలో.....

తన జీవిత కాలంలో 60 నుండి 75 ఏండ్ల మధ్య ప్రాయంలో జవహర్లాల్‌జీ ప్రధానమంత్రిగా మనదేశాన్ని పాలించారు. జాతీయ నాయకునిగా 60ఏండ్లు వయస్సులో సంతరించుకున్న గౌరవ ప్రతిష్టలు చివరివరకు అలాగే నిలిచి ఉన్నాయని చెప్పలేం. ఏ దేశంలోనైనా ఇంతటి గొప్పవ్యక్తులకు లభించిన గౌరవ ప్రతిపత్తి కాలగమనంలో హెచ్చుతగ్గులకు లోనుకావడం సహజం. ప్రధానిగా ఆయన కొనసాగినంతకాలం, ఆ పదవికి కాంగ్రెసు పార్టీలో ఎవరూ ఆయనతో పోటీ పడలేదు. కోట్లాది భారతీయులు ఆయనపట్ల కనపర్చిన ఆరాధనా,

తప్తి, విశ్వాసాల్లో ఏర్పడిన వ్యత్యాసాలు కొన్ని డిగ్రీలు అటూ, ఇటూ, జరిగాయి.

1951 వరకు, తదుపరి 1951-59 సంవత్సరాల మధ్య పార్లమెంటరీ పార్టీ జనరల్ సెక్రటరీగా ఉంటూ, నేను ఆయన సహచరునిగా సన్నిహిత సంబంధాలను కలిగిఉన్నాను. 1951-53 మధ్య, 1959-65ల మధ్య ప్రతిపక్ష నాయకులలో ఒకడిగా, పార్లమెంటులో ఆయన వ్యతిరేకకూటమిలో ఉంటూ వచ్చాను. కాంగ్రెసు సంస్థలో మేముభయులం కలిసినప్పుడు ఏకాభిప్రాయాన్ని కలిగి ఉండే సందర్భాలూ ఉన్నాయి. పార్టీతో నిమిత్తం లేకుండా ఇద్దరి మధ్యా స్నేహం, గౌరవాభిమానాలూ ఆలాగే నిలిచి ఉన్నాయి. భారత్-చైనా యుద్ధం నాటి క్లిష్ట సమయంలో కూడా మా ఇద్దరి మధ్య నెలకొని ఉన్న గౌరవసంబంధాలు దెబ్బతినలేదు. భారత్‌పై దాడిచేసి జాతిగౌరవాన్ని చైనా భంగపరిచినప్పుడు, నెహ్రూజీ అసమర్థ నాయకత్వాన్ని నేను తీవ్రంగా ఖండించిన సందర్భంలో దేశరక్షణకృషిలో ఆయన వైఫల్యం పై పార్లమెంటులో తీవ్రవిమర్శలు వచ్చినప్పుడు ఆయన వాటిని ఓర్పుతో భరించారు.

ప్రధానిగా ఉన్న పదిహేనేండ్లకాలంలో భారతదేశాన్ని పారిశ్రామికవంతంగా రూపుదిద్దుకునేందుకు ఆయన గట్టి పునాదుల్ని వేశారు. ఆర్థిక స్వావలంబనను సాధించలేకపోతే, దేశ స్వాతంత్ర్యం నిలబడజాలదనీ, భారత ప్రజానీకం ఆర్థికాభివృద్ధిని పొందలేరనీ ఆయన గట్టిగా నమ్మారు. మూడు, నాలుగవ పాకిస్తాన్ దురాక్రమణల సందర్భంలో దేశంలో భారీ పరిశ్రమలు నెలకొల్పటంలో నెహ్రూజీ చూపిన దూరదృష్టి ఎంత విశిష్టతతో కూడుకున్నదో మనకు కొట్టవచ్చినట్టు రుజువుచేసింది. ఆయుధకర్మాగారాలకు కావలసిన యంత్రపరికరాలను మన భారీపరిశ్రమలు ఉత్పత్తి చేసి, దేశరక్షణావసరాలకు తోడ్పడ్డాయి.

ప్రణాళికా సంఘం ఏర్పాటులో ఆయనకు పూర్తిగా సహకరించాను. భారత్ సేవక్ సమాజ్, చిన్నమొత్తాల పొదుపు ఉద్యమం, పంచాయతీరాజ్ సంస్థలేర్పాటు, సకలార్థ సాధక సంఘాల నిర్మాణంలో, నెహ్రూజీతో సహకరించి, నా పూర్తితోడ్పాటును అందించాను.

అవినీతిని అరికట్టడంలోనూ, నిధులు దుర్వినియోగం కాకుండా చూడడంలోనూ, అధికార దుర్వినియోగం జరగకుండా నివారించడంలోనూ, ప్రభుత్వ సహాయంతో నడిచే సంస్థలలో రాజకీయశక్తులు ప్రవేశించకుండా జాగ్రత్తపడడంలోనూ ఆయన విఫలులయ్యారు. పంచాయత్‌రాజ్ సహకారసంస్థలలో వాటి ప్రాథమిక లక్ష్యాలకు భంగం కలిగే విధంగా ప్రభుత్వజోక్యం, అదనపు అధికారాలు చెలాయించడం, వ్యక్తిగత దురభిమానాలూ పెరగసాగాయి. పార్టీకార్యకర్తలు, నాయకులూ ఈ సంస్థలలో జొరబడి, తమ అధికార వ్యామోహానికి వీటిని వేదికలుగా ఉపయోగించుకున్నారు. వయోవృద్ధులయ్యేకొలదీ, పెరుగుతున్న బాధ్యతలను నిర్వహించలేక, అలసిపోయి, రాజకీయ నాయకుల అధికార దుర్వినియోగాన్ని ఆయన అరికట్టలేకపోయారు. అందువల్ల ప్రభుత్వ యంత్రాంగంలో అవినీతి విశృంఖలంగా పెరగసాగింది.

ఒక కోణంలో పరిశీలించినప్పుడు ఆయనలోని ఒక పెద్ద దోషం మనకు కనిపిస్తుంది. తోటి రాజకీయ కార్యకర్తలను విశ్వసించకుండా, వారిపట్ల దురుసుగా వ్యవహరించే స్వభావం ఆయనది. అధికార దుర్వినియోగానికి పాల్పడి, ప్రజావిశ్వాసాన్ని కోల్పోయిన వారిపై తగు

చర్యలు తీసుకోలేకపోవడం. చాలాకాలం క్రితం 1948లో అప్పటి ఉమ్మడి మదరాసు రాష్ట్ర మంత్రులలో కొందరి అవినీతి కార్యకలాపాలను గురించి, విచారణ జరపవలసిందిగా, నేనూ, ప్రకాశంగారూ కోరగా అందుకు ఆయన అంగీకరించలేదు. మా కోరికను అనుసరించి విచారణకు పూనుకుంటే, మంత్రివర్గంపట్ల, మంత్రులకార్యకలాపాలపట్ల ప్రజలలో విశ్వాసం సన్నగిల్లుతుందని ఆయన భయపడ్డారు. రాష్ట్రమంత్రులపై వచ్చిన ఆరోపణలను ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రుల అవినీతిని గురించి ప్రధానీ, అంటే తనూ విచారణ జరిపే సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టి, సంవత్సరాల తరబడి విచారణ తంతునుకొనసాగిస్తూ కాలయాపన చేసే విధానాన్ని అవలంబిస్తూ వచ్చారు. తాను సూచించిన అంశాలనుగానీ, అవినీతిని అరికట్టేందుకు సంతానం కమిటీ చేసిన సూచనల్నిగానీ, రైల్వేశాఖలో జరిగే అధికార దుర్వినియోగంపై కృపలానీ కమిటీ సూచనలనుగానీ, ఆయన అమలు చేయకపోగా, వాటి మౌలిక స్వరూపాల్ని కోల్పోయేలా వ్యవహరిస్తూ వచ్చారు. పంజాబ్ ముఖ్యమంత్రి శ్రీ ప్రతాప్‌సింగు ఖైరాన్ పై వచ్చిన ఆరోపణల్ని విచారించేందుకు దాస్ కమీషన్‌ను నియమించి, అదే సందర్భంలో ఖైరాన్ దేశభక్తినీ, సమర్థతనీ ప్రశంసిస్తూ ప్రకటన చేసారు. ఆరోపణలు వచ్చిన వ్యక్తిని ప్రశంసించడంవల్ల కమీషన్ విచారణను నీరుగార్చినట్లయింది. ఈ కారణంగా మంత్రులపై పార్లమెంటు సభ్యులు ఆరోపణలను చేయడమంటే భగీరథ ప్రయత్నంలా తయారైంది. తుదకు నెహ్రూజీ పి.ఎ. (పర్సనల్ అసిస్టెంటు) పట్లకూడా ఆయన ఈ వైఖరినే అవలంభించడం జరిగింది. ఎలాగైతేనేం, తుదకు పార్లమెంటులో తీవ్రనిరసనలు వ్యక్తమైన తరవాత, అసమర్థులైన కొంతమంది సహచరులను ఆయన తొలగించవలసి వచ్చింది. ఈ పరిస్థితి అంతా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోని ప్రభుత్వయంత్రాంగంలోనూ ప్రాకి, నైతిక విలువలు దిగిజారి పోయాయి. సమర్థత, దక్షత లేని ముఖ్యమంత్రుల; ప్రజలకోసం అంకితభావంతో కృషిచేయాలన్న పట్టుదలలేని మంత్రుల, స్వార్థమే పరమార్థంగా ఎంచుకున్న కాంగ్రెసు కార్యకర్తల కారణంగా ప్రజారంగం అవినీతి మయంగా రూపుదాల్చింది. ఈ ఘోరవైఫల్యం నైనా చేతిలో మనజాతి అనుభవించిన పరాజయాన్ని పోలి ఉన్నది.

మొదట్లో ప్రకాశంగారూ, నేనూ తరవాత శ్రీ మున్షీ, రాజాజీ, నేనూ ఈ అవినీతి కల్మషాన్ని అంతం చేసేందుకు "స్వీడిష్ అంబుడ్స్‌మన్" పద్ధతిలో, పార్టీరహితంగా, సక్రమంగా వ్యవహరించగల ప్రత్యేక న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయవలసిందిగా, ఆయనపై వత్తిడి తెచ్చాం. సంతానంకమిటీ సిఫార్సులు కూడా నిర్దిష్టమైన సూచనలను అందించకుండా కేవలం నామ మాత్రమైన అవినీతి నిరోధక సంఘాలను కన్నీటితుడుపు చర్యలుగా నియమించేందుకు తప్ప, మరెట్టి ప్రయోజనాన్ని సాధించేందుకు ఉపయోగపడలేకపోయాయి.

స్వీడిష్ అంబుడ్స్‌మన్ పద్ధతిలో, లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థలను ఏర్పాటు చేయవలసిందిగా "పరిపాలనా సంస్కరణల సంఘం" కొన్నాళ్ల తరవాత సూచించింది. తరవాత ప్రధానిగా వచ్చిన ఇందిరాజీ అవినీతికి వ్యతిరేకంగా చట్టాన్ని తెచ్చి, అమలు పరిచింది. ఈ అంశంలో తండ్రి వైఫల్యం చెందగా ఆయన కుమార్తె చట్టాన్ని తీసుకురాగలిగింది.

రెండు దశాబ్దాలుగా అమెరికా దాని మిత్రదేశాలొకవైపు, సోవియట్ రష్యా దాని మిత్ర దేశాలు మరొకవైపు మోహరించి పరస్పర వైషమ్యాలతో పోరాడుకుంటున్న సమయంలో

ప్రపంచ అలీనోద్యమాన్ని తండ్రిలాగా నెహ్రూజీ పెంచి పోషించారు. నేను కృషికార్ లోక్ పార్టీ నాయకునిగా ప్రతిపక్షంలో ఉన్న సమయంలో, 1952లో అట్టావాలో కామన్వెల్త్ కాన్ఫరెన్స్ జరిగింది. ఆ కాన్ఫరెన్స్‌కు నేను ప్రతినిధిగా హాజరై, విదేశీ వ్యవహారాల్లో తటస్థవిధానమే భారత్ జాతీయ విధానమని ఉద్ఘాటించాను. అంతకుముందే భారత్-చైనా దేశాల మధ్య కుదిరిన ఒప్పందంలో ఆమోదించబడ్డ పంచశీల సూత్రాలను, 1955లో టిబెట్టు సమస్యకు కూడా వర్తింపజేయాలని బాండుంగ్ మహాసభలో పండిట్‌జీ అంగీకరింపజేసారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో నెహ్రూ విధానాలకు ప్రజాస్వామ్యబద్ధంగా రాజకీయ పార్టీలన్నీ తమ ఆమోదాన్ని తెలియజేసాయి.

అపార సైనికసంపత్తితో చైనా, మనదేశంపై దాడి చేసి, భారతజాతిని అప్రతిష్టపాలు గావించినప్పుడు, ప్రతిపక్షంలో ఉన్న నావంటి అనేకమంది రాజకీయనాయకులు "మన తటస్థ విధానమే" దేశాన్ని బలహీనపరిచిందని భావించడం జరిగింది. ఈ సమయంలో పాకిస్తాన్, తన విదేశీ సంబంధాల ద్వారా ఎక్కువ ప్రయోజనాన్ని పొందగలిగింది. తాను కట్టుబడిఉన్న పంచశీల లేదా అలీన విధానాన్నుంచి వైదొలగకుండానే, జవహర్లాల్ అమెరికా, బ్రిటన్ దేశాలనుంచి సైనిక సహాయాన్ని స్వీకరించేందుకు ఆయా దేశాలతో మైత్రీ పూర్వకమైన అవగాహనకు వచ్చినట్లు గాల్‌బ్రైత్‌గారి 'అంబాసిడర్స్ డైరీ' బయటపెట్టింది. అమెరికాతో ఎట్టి మౌలికమైన ఒప్పందంగానీ, అనుబంధాన్ని గానీ కుదుర్చుకోకుండానే దేశ ప్రయోజనాలకోసం నెహ్రూజీ జరిపిన మంతనాలను బట్టి ఆయన మేధాశక్తి ఈనాడు మనకు అర్థమవుతున్నది.ఉపఖండంలో సైనికంగా సమతూకాన్ని కాపాడాలన్న సాకుతో, కాశ్మీరు వివాదంలో పాకిస్తాన్ కొనసాగిస్తున్న ప్రయత్నాలను, అమెరికా, దాని మిత్రదేశాలు మొండిగా సమర్థించడంవల్ల, 1961లో నెహ్రూజీ రష్యాతో స్నేహ ఒడంబికను చేసుకోవలసి వచ్చింది. పాకిస్తాన్, దాని మిత్రదేశాలనుంచి, మనదేశాన్ని రక్షించుకునేందుకు రష్యాతో ఆయన ఈ ఒప్పందానికి రావలసివచ్చింది.

మార్షల్ టిటో, శ్రీమతి ఇందిరాగాంధీగారలు 1974దాకా అలీన విధానంలో తమకున్న విశ్వాసాన్ని పునరుద్ఘాటిస్తూనే అణ్వాయుధాలుగల మూడు శక్తిమంతమైన అగ్రరాజ్యాల మధ్య ప్రపంచం కొట్టుమిట్టాడుతున్న సమయంలో సోవియట్ రష్యాతో భారతదేశంకుదుర్చుకున్న మైత్రీ ఒప్పందానికి భంగంరాకుండానే, అమెరికాతో కూడా సత్సంబంధాలను కలిగి ఉండాలనే నెహ్రూ వ్యూహం నుంచి వస్తున్న విధానాన్ని కొనసాగిస్తూనే ప్రపంచశాంతి సాధనకు, అంతర్జాతీయ స్థాయిలో అలీనోద్యమ వ్యాప్తికి జవసత్వాలను సమకూర్చాలని వారు దృఢంగా భావిస్తూ వచ్చారు.

కమ్యూనిస్టునాయకులైన శ్రీ హీరేన్ ముఖర్జీ "ప్రపంచ శాంతికి కృషి చేసిన అంతర్జాతీయ ప్రముఖులలో పండిట్ నెహ్రూ అగ్రగణ్యులని" అభివర్ణించారు.

తాను గ్రుడ్డిగా నమ్మిన చైనా, మిత్రద్రోహానికి పాల్పడి, భారతదేశాన్ని ఓడించి అపఖ్యాతి పాలుచేసిన తరవాత కూడా ఆయన ప్రధానిగా కొనసాగడాన్ని నేను అధిక్షేపించాను. ప్రపంచశాంతి

కలిసి కృషి సలిపే అవకాశం లభించింది. అంతకు మించిందేమీలేదు.

ఆయనకు మిత్రులూ, సీనియర్ సహచరులూ ఆయన రాజాజీగారి తరపునా, స్వతంత్రపార్టీ తరపునా వ్యక్తిగతంగా ఈ మహాపురుషుని గొప్పతనాన్ని ప్రస్తుతించడమేగాక, ఆయన్నుకోల్పోయి ఈ దేశం, ప్రపంచం పెద్ద నష్టానికి గురి అయ్యాయనే వాస్తవాన్ని నేను మీ ముందు ఉంచుతున్నాను.

మహాత్మాగాంధీజీ జాతికి మిగిల్చిపెట్టిన గొప్ప సంపద వంటివారు జవహర్. గాంధీజీకి తగిన విశ్వాసపాత్రునిగా నమ్మకమైన సహచరునిగా నెహ్రూజీ వ్యవహరించడమేగాక, ప్రపంచ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో మనకు నాయకత్వం వహించి నడిపించారు. భారత ప్రజల స్వాతంత్ర్యపోరాటాన్ని, ప్రపంచ ప్రజల స్వాతంత్ర్యపోరాటాలకు తలమానికంగా నిలిపి నడిపించారు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద శకాన్ని అంతంచేసి దేశదేశాల ప్రజలు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించేందుకు, సమస్తజాతుల నాయకులతోకలిసి వారికి మార్గదర్శకత్వం వహిస్తూ, సహాయసహకారాలనందిస్తూ, విశ్వమానవ స్వాతంత్ర్య సముపార్జన సాధించే బాధ్యత నెహ్రూజీపై ఉంచబడింది. ఆ మహత్తరకృషిలో, భారతదేశం విజయాన్ని సాధించింది. భారతప్రధానిగా తనకు లభించిన అధికారంతో, అవకాశాలతో విశ్వ మానవాభ్యుదయాన్ని సాధించిన ఆ మహామనీషికి భారత ప్రజలు తమ అభినందనల్ని తెలుపుకుంటున్నారు. తన ఆకాంక్షలకు అనుగుణంగా ప్రపంచ శాంతి సాధన కొరకై దీర్ఘకాలంగా ఆయన తన కృషిని కొనసాగించారు. మా వంటి చాలా మంది ఈ కృషిలో ఆయనతో ఏకీభవించి తోడ్పడినాముకూడా. ప్రపంచ శాంతి సాధనా కార్యక్రమాల్లో ఆయన గొప్ప ఫలితాలను సాధించారు. ఆయన కొనసాగించిన కృషికి ఐక్యరాజ్య సమితి సాక్షీభూతంగా నిలుస్తుంది.

మనదేశానికి సంబంధించిన అంశాల్లో ప్రజలను, వారి జీవన విధానాన్ని సుఖసంతోషాలతో ముందుకు నడిపించేందుకు అవలంబించవలసిన మార్గం నియంతృత్వంతోనా, ప్రజాస్వామ్యవిధానాలతోనా అనే అంశం ఆయన ముందుంచబడింది. ఈ సందర్భంలో ఆయన ప్రజాస్వామ్య విధానాన్నే ఎన్నుకున్నారు. నేటి వరకూ ఆయన ప్రజాస్వామ్య విధానాలకే నమ్మకంగా కట్టుబడి ఉన్నారు. గడచిన పదిహేడు సంవత్సరాల ప్రధానమంత్రిత్వంతోపాటు, అదనంగా మరోసంవత్సరం పదవిలో కొనసాగి, ప్రజాస్వామ్య విధానాలకు కట్టుబడి, ప్రజాస్వామిక పంథాను దేశంలో అభివృద్ధి పరిచేందుకు తోడ్పాటు నందించారు. మహత్తరమైన ఈ కార్యక్రమ నిర్వహణలో అధికార పార్టీలో ఉండి, ఆయనతో కృషిచేసిన చాలామంది సాటి అనుచరులకు కూడా ఈ గౌరవం దక్కివలసి ఉంది. ఇదే సమయంలో ప్రతిపక్షంలో ఉండి, పార్లమెంటులో ప్రతిపక్ష స్థానాల్లో కొనసాగుతూ, అనేక సమస్యలమీద విమర్శలు చేస్తూ, ఒక్కొక్కప్పుడు సంతోషం వ్యక్తపరుస్తూ మరొకప్పుడు వ్యతిరేకిస్తూ, మెచ్చుకుంటూ, ఇన్ని సంవత్సరాలుగా ప్రభుత్వం సక్రమంగా నిర్వహించేందుకు తోడ్పడిన మేము కూడా ఈ విజయసాధనలో భాగస్థులమే.

ఆయన ఇక ఇక్కడ పార్లమెంటులో లేరనే అంశాన్ని గుర్తించడానికి ఇంకా చాలాకాలం

పడుతుంది. పదిహేడు సంవత్సరాల సుదీర్ఘకాలంలో మనం పార్లమెంటును ఏ సందర్భంలో తలచుకున్నప్పటికీ, ఆయన ప్రధానమంత్రి స్థానంలో ఉన్నట్లుగానే భావించి, ఆలోచిస్తూ ఉండేవాళ్లం. ఇప్పుడు ఆ ఆశ లేదు. మనం ఇక ఈ పార్లమెంటులో ఉన్నప్పుడు మేము అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చేటపుడు, తన మేధస్సునంతా కేంద్రీకరించి, సహజమైన తన నాయకత్వ లక్షణాలతో, సాధ్యమైనంత సహృదయంతో మమ్మలను నిర్దేశిస్తూ మాట్లాడేవారని నేను భావిస్తున్నాను. ఎల్లప్పుడూ ఆయనపట్ల మేము అనుకూల భావంతో ఉండేవాళ్లమని నేను చెప్పడంలేదు. అయినప్పటికీ విశిష్టమైన ఆయన వ్యక్తిత్వం ఆయన్ని ఆస్థానంలో తన పదవిని కోల్పోకుండా అంగే నిలబెడుతూ వచ్చింది. ఇటీవల గంటసేపు ఆయన ఇచ్చిన మహోన్నతమైన ఉపన్యాసాన్ని వినే అదృష్టం మాకు లభించింది.

ఆయనను గురించి మాట్లాడేందుకు మాకు చాలా విషయాలు ఉన్నాయి. అలాగే ఆయన విధానాలను విమర్శిస్తూ మేము మాట్లాడిన సందర్భాలూ రికార్డులలో ఉన్నాయి. మమ్మలను గురించికూడా ఆయనమాట్లాడిన విశేషాలు ఉన్నాయి. ఇవికూడా రికార్డులో ఉన్నాయి. మేమూ ఆయన కార్యక్రమాలను గురించి మాట్లాడిన విషయాలు రికార్డులో ఉన్నాయి. ప్రపంచంలో విశాలమైన భూభాగంలో విస్తరించి ఉన్న కొన్ని దేశాల్లో ఈ విమర్శలూ, ప్రతివిమర్శలూ, రికార్డులూ ఏమీ లేవు. ఎందుకంటే అక్కడ ప్రజాస్వామ్యం లేదు. ప్రజాస్వామ్య ప్రపంచానికి భిన్నమైన మరొక చోట ఈ రికార్డులూ, చర్చలూ లేవు. అక్కడి ప్రజలకు ఈ ప్రజాస్వామ్య విలువలను గురించి తెలీదు. ప్రజాస్వామ్య వాదిగా, ప్రజాస్వామిక కోణంలో ఆయన సంతరించుకున్న విలువల ద్వారా, ఆయన గొప్ప గౌరవాన్ని పొంది ఉన్నారు. అదే ఆయనకు మానవేతిహాసంలో శాశ్వత గౌరవాన్ని సంతరించిపెడుతుంది.

యల్.యస్.డిబేట్ (29-5-64)

వాల్యూమ్ xxxI I

కాలమ్స్ : 143-145, 148-150, 172-176.

24

శ్రీ జయప్రకాశ్‌నారాయణ్

గత రెండు దశాబ్దాలుగా మనరాజకీయ రంగంలో,అంతర్జాతీయ ప్రముఖులుగా పరిగణించిన వారిలో శ్రీ జయప్రకాశ్ నారాయణ్ ఒకరు. వినోబాభావేగారి సర్వోదయ కార్యక్రమాల్లో పాల్గొని, ప్రచారం చేసినందుకు, ఆయన అనుచరులు శ్రీ జయప్రకాశ్ నారాయణ పట్ల అభిమానాన్ని చూపిస్తూ ఉంటారు. బంగ్లాదేశ్ ఆవిర్భావ సమయంలో, ఆ దేశానికి ఆయన చేసిన సేవ విలువ కట్టలేనిది. ఈ సందర్భంలో ఆయన జరిపిన ప్రపంచ పర్యటన, బంగ్లాదేశ్ స్వాతంత్ర్యసమరయోధులకు అనుకూలంగా ఉండి, శ్రీమతి ఇందిరాగాంధీ, ఇతర కేంద్రమంత్రుల విదేశ పర్యటన లకు కావలసిన ప్రాతిపదికను సిద్ధంచేసింది.

1934లో, పాట్నాలో జరిగిన కాంగ్రెసు సోషలిస్టు సభల సందర్భంలో,ఆయనను మొదటి సారిగా కలిశాను. జాతీయస్థాయిలో ఆయన రాజకీయ కార్యకలాపాలు అక్కడి నుండే ప్రారంభమైనాయి.

పాట్నాసభల్లో అత్యవసరంగా నాయకత్వ లక్షణాలతో తయారుచేసిన యువమేధావుల బృందం బొంబాయి, బెనారస్‌లకు చెందినది, మార్క్సిజం ప్రాతిపదికతో కూడిన తమ అభిమాన పాత్రమైన సోషలిస్టు దృక్పథం మాత్రమే భారతదేశ సమస్యల పరిష్కారానికి సరైన మార్గమని చెబుతూఉంటే, నేనూ, స్వర్గీయ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారూ విని ఆశ్చర్య పోయాం. వ్యవసాయ సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి, రైతాంగాన్ని విప్లవ పోరాటంలో పాల్గొనేలా చైతన్యపరిచి, వారితో ఉద్యమాన్ని నడిపించవలసిందిగా, జయప్రకాశ్ నారాయణ్‌గారి తోనూ, బొంబాయికిచెందిన ఆయన మిత్రులు శ్రీ యుతులు మసానీ, అశోక్ మెహతా, అచ్యుతపట్వర్ధన్, మెహరాలీగార్లతోనూ, బెనారస్‌కు చెందిన శ్రీయుతులు ఆచార్యనరేంద్రదేవ్, నంపూర్ణానంద్‌గార్లతోనూ గట్టిగా వాదించి, పోరాడాను. ఈవాదనల్లోనేను కొద్దిపాటి విజయాన్నిమాత్రమేసాధించినప్పటికీ, శ్రీ జయప్రకాశ్ నా మార్గాన్ని ఆంగీకరించలేదు. ఎందుకంటే, అప్పట్లో మన దేశ సాంఘిక, రాజకీయ ఉద్యమాల్లో అట్టడుగు ప్రజలే ప్రధానపాత్ర వహించగలరన్న మార్క్సిస్టు దృక్పథాన్ని ఆయన దృఢంగా విశ్వసించి ఉన్నందున, నా వాదాన్ని పరిగణనలోకి తీసుకోలేదు, ఉత్తరభారతంనుండి వచ్చిన, ఆ సోషలిస్టులకెవరికీ కూడా రైతువర్గంతో అంత గట్టి సంబంధాలు లేవు. వారికి సమస్యల పై సరిఅయిన అవగాహన లేకపోవడమే గాక, అంతవరకు రైతు ఉద్యమాల్లో ఎక్కడావారు ఎలాంటి కార్యక్రమాల్నీ చేపట్టలేదు.

1934లో జె.పి ఆంధ్రదేశంలో పర్యటిస్తూ, విజయవాడవచ్చేనాటికి, నా ఆలోచనా మార్గంపై ఆయనకు తటస్థ వైఖరి ఉండేది. కారణమేమంటే, దక్షిణభారత దేశంలో నేను

భూస్వామ్య వర్గాలకు వ్యతిరేకంగా, సామాన్య, మధ్యతరగతి రైతులను సమీకరించి, పోరాట మార్గంవైపు నడిపించే, నా కార్యక్రమాలను గురించి, ఆయన అత్యంత అభిమానంగా గౌరవించే డాక్టర్ కుమరప్ప తనతో చెప్పినట్టు శ్రీ జయప్రకాశ్ విజయవాడలో నాతో అన్నారు. ఆ సమయంలో ఈ ప్రాంతంలో విపరీతంగా వర్షాలు కురుస్తున్నాయి. నడవడానికి అనుకూలంగా లేక, దిగబడుతున్న నల్లరేగడి నేల తో, కొద్దిపాటి ఆరోగ్య వసతులుమాత్రమే ఉన్న గ్రామీణవాతావరణంలో, ఆయన, మాగ్రామీణ గృహంలో ఒక్కరోజు కంటే, ఎక్కువగా గడప లేక పోయారు.

అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి, శ్రీ జయప్రకాశ్ నారాయణ్ చాలా సంవత్సరాలు ప్రధానకార్యదర్శిగా పనిచేశారు. అప్పట్లో ఆయన మీద మార్క్సిజం ప్రభావం అధికంగా ఉండేది. ఆసమయంలో మార్క్సిస్టు దృక్పథంతో, ఆయన రచించిన 'సోషలిజం ఎందుకు? ' అనే గ్రంథంలో గాంధేయమార్గాన్ని వ్యతిరేకిస్తూ, గాంధీగారి నిర్మాణాత్మక కార్యక్రమాలు ఎంత వరకు హేతుబద్ధంఅని ప్రశ్నించారు. ఈకారణంగా రాజకీయ, ఆర్థికవిధానాలపట్ల, మా మధ్య అగాధం ఏర్పడింది. నేను అఖిల భారత కిసాన్ సభని నిర్వహణకు పూనుకున్నప్పుడు, ఆయనకంత ఇష్టం లేకపోయినప్పటికీ, తన సహకారాన్ని అందించటానికి వాగ్దానంచేశారు. పైజాపూర్ లో జరిగిన ఆ సభలో అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆయనకు ప్రత్యామ్నాయంగా నేను ఎన్నికై నందుకు ఆయన అసంతృప్తి చెందారు. అయినప్పటికీ ఇద్దరం అఖిలభారత కిసాన్ కౌన్సిల్ల సభలలో తుదకంటా, పరస్పరం సహకరించుకొని, దానిపై ఆధిపత్యం సంపాదించుకోవాలనే కమ్యూనిస్టుల ప్రయత్నాన్ని నిమ్మ చేయగలిగాము.

జవహర్లాల్ నెహ్రూగారు కాంగ్రెస్ సోషలిస్టులను తన చెప్పుచేతలక్రింద ఉంచుకొని, వారికి రక్షణకల్పించి కౌన్సిల్, మంత్రివర్గాల్లో ప్రవేశం కల్పిస్తూ, అధికార, అనధికార సంస్థలలో తన నిర్ణయాలను సాధించేందుకు; రాజకీయసాధనంగా, ఉపయోగించుకుంటూ వచ్చారు. తన రాజకీయలక్ష్యాలకు కాంగ్రెస్ సోషలిస్టులను సాధనంగా ప్రయోగిస్తూ, కాంగ్రెసు సంస్థలో తన అనుచరవర్గంగా వారిని నెహ్రూజీ మలచుకున్నారు. కాకపోతే తన స్వంతవర్గంగా భావించుకున్నారని చెప్పవచ్చు.

నెహ్రూజీ ఇచ్చిన చేయూత, సహకారం ద్వారా కాంగ్రెస్ సోషలిస్టులు రాజకీయ నిర్ణాయకశక్తిగా రూపొందారు, 1936నాటి లక్నో కాంగ్రెస్ సభల తరవాత, శ్రీయుతులు జె.పి.ఆచార్య నరేంద్రదేవ్, అచ్యుత పట్వర్ధన్‌లు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు. 1917-23 లో గాంధీజీ తన అనుచర నాయకత్వాన్ని రూపొందించిన విధంగానే, నెహ్రూజీ కూడా తనకు ఇష్టమైన కాంగ్రెసు సోషలిస్టులతో కూడిన నూతన నాయకత్వాన్ని రాజకీయరంగంలో అభివృద్ధి పరిచేందుకు పూనుకున్నారు. దీని ఫలితంగా డాక్టరు రాజేంద్రప్రసాద్ గారు... జయప్రకాశ్ నారాయణ్‌ను "అత్యవసరంగా తయారుచేయబడిన నాయకుని"గా 1934-36 లో జాతీయ రంగంమీద హఠాత్తుగా ప్రవేశపెట్టారు . అప్పటి కే జాతీయ రంగంలో ప్రముఖులు గా పరిగణింప బడుతున్న నాయకులమాదిరిగా, రైతాంగ ఉద్యమాలలోగాని, గ్రామీణ సమస్యలపై గాని గాంధేయ కార్యక్రమాల్లోగాని, కృషిచేసి తగినంత అనుభవాన్ని గడించవలసిన అవసరం శ్రీ జే.పికి లేకపోయింది. ఇలాంటి చేయూత బాపూజీ

ద్వారా నెహ్రూకు, శ్రీ సి.ఆర్.దాస్ ద్వారా సుభాష్‌కు లభించింది. శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌కు లభించిన ఈ అవకాశం తన సోషలిస్టు వర్గం ద్వారానే గాక, గాంధీజీ తో తగినంత అనుబంధం లేకపోయినప్పటికీ, నెహ్రూజీ పై ఆయన చూపిన ప్రగాఢాభిమానంవల్ల కూడా లభించింది. ఎ.ఐ.సి.సి కార్యవర్గ సభ్యునిగా ఎన్నిక కావడానికి అవసరమైన బలాన్ని, బీహారు ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీలో జయప్రకాశ్ సంపాదించుకోలేకపోయారు. ఆ కారణంగా కాంగ్రెసునాయకులు సహజంగా ఆశించే ఎ.ఐ.సి.సి కార్యవర్గ సభ్యత్వాన్ని ఆయన కోల్పోయారు. అందువల్ల శ్రీ జె.పి దానికి రాజీనామా ఇవ్వక తప్పని పరిస్థితులు ఏర్పడ్డాయి. అదే సమయంలో ఆయన కాంగ్రెసు సోషలిస్టు కార్యదర్శిపదవికి కూడ రాజీనామా చేశారు. శ్రీ జె.పి ఎందుకు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారో ఎవరు చెప్ప గలరు? ఆయన తీసుకొన్న ఈ నిర్ణయం ద్వారా, శాసనసభా రాజకీయ రంగం నుంచే గాక, క్రియాశీల రాజకీయాలనుంచి కూడా ఆయన వైదొలిగినట్లయింది. ఇందుకు కారణమైన ఆయన మానసిక స్థితిని ఎవరూ విశ్లేషణ చేయలేరు. తరువాత త్రిపుర కాంగ్రెసు సభలలో సుభాష్ చంద్రబోసుగారిని సమర్థించకపోవడం వల్ల అప్పట్లో శ్రీ జె.పి రాజకీయ కార్యాచరణలోని వైఖరిని పరిగణనలోకి తీసుకోవలసింది. సర్దార్ వల్లభాయి పటేల్ రాజకీయ ఎత్తు గడలకు వ్యతిరేకంగా అప్పట్లో శ్రీ జె.పి పోరాడుతూ ఉండేవాడు. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు యుద్ధసమయంలో భారతదేశ శక్తినంపదలను వినియోగించుకోవడానికి వ్యతిరేకంగా జాతీయ పోరాటం నడిపేందుకు వామపక్షైక్యసంఘటనను నిర్మించి, తద్వారా ప్రజలను సమీకరించేందుకు శ్రీ జె.పి సుముఖతను వ్యక్తపరచలేదు. అప్పట్లో కాంగ్రెసు పార్టీ అధికార రాజకీయాలకు వ్యతిరేకంగా ఉన్న సుభాష్ చంద్రబోసు, రాజకీయంగా స్థిరపడేందుకు ఇష్టంలేని వర్గం ఆయనకు వ్యతిరేకంగా కార్యకలాపాలను నిర్వహిస్తూఉండగా శ్రీ జవహర్లాల్ నెహ్రూ తటస్థ వైఖరిని అవలంబించినందున, శ్రీ జయప్రకాశ్ నారాయణ్ త్రిపుర కాంగ్రెసు సభలలో సుభాష్‌చంద్రబోసును బలపరచకపోవటం ఒక కారణంగా చెప్పవచ్చు. శ్రీ జవహర్లాల్ నెహ్రూ అనుకూలవైఖరి వల్ల జయప్రకాశ్ నారాయణ్‌గారి రాజకీయనిర్ణయాలు దిశలు మార్చుకుంటూ సాగుతూవస్తున్నప్పటికీ, కేవలం తానా అంటే తందానా అంటూ జవహర్‌జీకి అంతేవాసిగా ఉండడంకూడా శ్రీ జె.పికి ఇష్టంగా ఉండేది కాదు. ఏమైనప్పటికీ 1939-42 సంవత్సరాల మధ్య శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌గారి స్థిరత్వం లేని రాజకీయ నిర్ణయాలు, జాతీయరంగంలో ఆయన సందిగ్ధత కొట్టవచ్చినట్టుకన్పిస్తోంది.

క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో శ్రీ జయప్రకాశ్ ఒకసారి జైలునుంచి తప్పించుకొన్నారు. ఆసమయంలో ఆయన పార్టీకార్యకర్తలతోనూ నాయకులతోనూ సంబంధాలుపెట్టుకొని, రహస్యజీవితాన్నిగడిపారు. అయితే కొన్నాళ్ల తరవాత ఆయన బ్రిటిషు తాబేదార్ల అమానుషమైన చిత్రహింసలకు గురికావలసివచ్చింది. 1936-42 మధ్యకాలంలో ఆయన అనుభవించిన ఈ బాధాకర స్మృతులను, ఇతర జాతీయనాయకులు, దేశభక్తుల లాగే శ్రీ జె.పి కూడా విస్మరించకతప్పలేదు.

వివిధ సందర్భాలలో తానుగానీ, తన సహచరుల సహకారంతోగానీ, దేశ సమస్యల పరిష్కారానికి శ్రీ జె.పి తనదైన స్వతంత్రమార్గాన్ని ఎన్నడూ అందించలేదు. కాంగ్రెసు సోషలిస్టుపార్టీలో ప్రవేశించి, దానిని స్వాధీనంచేసుకోవాలని కమ్యూనిస్టులు ప్రయత్నించినప్పుడు, ఆశోకమెహతా,

మసానీగార్ల తీవ్రనిరసనను కూడా పట్టించుకోకుండా శ్రీ జె.పి ఆ విషయాన్ని ఆవలకునెట్టి, ఆత్మసంతృప్తిని పొందాడు. జిన్నాగారి పాకిస్తాన్ ఏర్పాటుకు బలాన్ని చేకూర్చిపెడుతున్నప్పటికీ, నెహ్రూజీ దురదృష్టకరమైన ఫెడరల్ రాజ్యాంగ విధానానికే పిలుపునిచ్చారు. శ్రీ జె.పి మాత్రంబొంబాయిసోషలిస్టుల పాటలకువంత పాడడమేగాకుండా, ఏ కాన్స్టిట్యూట్ అసెంబ్లీలో అప్పుడు నెహ్రూజీ ప్రధానమంత్రిగా సంతోషంతో కొనసాగుతూ, దానిపై ఆధిపత్యంకోసం తాపత్రయపడుతున్నాడో, అదే కాన్స్టిట్యూట్ అసెంబ్లీని సైతం బహిష్కరించవలసిందిగా కాంగ్రెసు పార్టీకి శ్రీ జె.పి సలహాఇచ్చాడు. తరువాత కార్పొరేషన్ ఎన్నికల్లో యస్.కె.పాటిల్, సర్దార్ పటేల్ గార్లకు వ్యతిరేకంగా బొంబాయి సోషలిస్టులు పనిచేయాలని తీసుకున్న నిర్ణయాన్ని శ్రీ జయప్రకాశ్ నివారించలేకపోయాడు. ఈనిర్ణయం కాంగ్రెసుపార్టీ నుంచి కాంగ్రెసు సోషలిస్టుపార్టీని వేరుచేసింది . శ్రీ జవహర్లాల్ తన కేంద్రమంత్రి మండలిలోనికి శ్రీ జె.పిని తీసుకోవాలని నిర్ణయించుకొని ఆహ్వానించినపుడు, బొంబాయి సోషలిస్టుల చెడుసలహాలతో శ్రీ జె.పి అందుకు నిరాకరించారు. ఈ సంఘటన ఆయన అధికార రాజకీయాల విరమణకు దారి తీసింది .

శ్రీ జయప్రకాశ్ నారాయణ్‌కు కేంద్రమంత్రివర్గంలో స్థానం కల్పించి, ముఖ్యమైన భూమికను అప్పగించాలని శ్రీ జవహర్లాల్ అనుకున్న సందర్భాలు లేకపోలేదు. ఆ తరవాత చాలాకాలానికి శ్రీ కృష్ణమీనన్ ఆస్థానంలోకి ప్రవేశించారు. శ్రీ జవహార్లాల్ తన తరువాత, తన స్థానంలో తన వారసునిగా శ్రీ జయప్రకాశ్‌ను నియమిస్తారని చాలామంది అప్పట్లో భావిస్తూ వచ్చారు. ఆ తరువాత జరిగిన పరిణామాల వల్ల నెహ్రూజీ ప్రధానిగా పదవీ విరమణ చేయకుండా, జీవితాంతమూ ప్రధానిగానే కొనసాగారు. అంతేగాక తనకు వారసత్వాన్ని అప్పగించిన గాంధీజీ అంతటి తిరుగులేని నాయకుడు కాదు శ్రీ జవహార్లాల్. తనకు బదులు తన వారసునిగా మరొకరిని నియమించగల అసాధారణ శక్తివంతుడు కాదు ఆయన.

గాంధీజీ మరణం తరవాత శ్రీ జె.పి తన దృష్టిని గాంధేయమార్గంలో సాంఘిక, రాజకీయ సమస్యల పరిష్కారానికై మళ్ళించాలని నిర్ణయించుకున్నారు. శ్రీ జయప్రకాశ్ గాంధేయ మార్గానికి మరింత సన్నిహితంగా వచ్చేకొద్దీ ,శ్రీ జవహర్లాల్ దానికి దూరమవుతూవచ్చారు. ఆయనలోవచ్చిన ఈ పరిణామం, భూదానం ,గ్రామదానం, సంపత్తిదానంవంటి సర్వోదయ కార్యక్రమాల్లో గాంధీయిజాన్ని పరిపుష్టిగావించాలని కృషిచేస్తున్న వినోబాభావేకి సన్నిహితం చేసింది. వినోబాభావే తరవాత సర్వోదయ నాయకునిగా, ద్వితీయస్థానాన్ని శ్రీ జయప్రకాశ్ ఆక్రమించారు. తనదైన స్వతంత్ర విధానంతో స్వచ్ఛ రాజకీయలక్ష్యంతో నాయకునిగా శ్రీ జయప్రకాశ్ పరిణతిచెందారు. పార్టీరహిత ప్రజాస్వామ్యాన్ని ఒకవైపు, పంచాయతీరాజ్ వ్యవస్థను మరొకవైపు సమాంతరంగా నడిపిస్తూ, ఆయన తన కార్యక్రమాల్నినిర్వహించారు. శ్రీ జె.పిచేపట్టిన ఈ సర్వోదయ ఉద్యమానికి, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అన్నివిధాల వనరులను సమకూర్చి, నిధులనుకల్పించి, విస్తృత ప్రచారాన్నిచేశాయి. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఆయన స్వచ్ఛంద సేవాకార్యక్రమాలకు తమ ప్రాపకాన్ని అందించి వాటిచాటున తమ అవినీతిచర్యలను కప్పిపుచ్చుకునేందుకు, సహాయసహకారాలనందిస్తూ వచ్చాయి.

వినోబాభావే గ్రామదానోద్యమానికి మద్దతుగా యెల్వేల్ సభలో సోషలిస్టులు,కమ్యూనిస్టులు, కాంగ్రెసువారూ కలిసికట్టుగా రూపొందించిన "స్వయంపృత్తులవారికీ, భూమిఉన్నవారికీ"

వ్యతిరేకమైన రహస్య ఒప్పందాన్నిబాహాటంగా ప్రకటించిన సందర్భంలో, శ్రీ జయప్రకాశ్ గ్రామదానోద్యమానికి సంతోషంగా తన ఆమోదాన్నితెలిపి, వినోబాభావేకు తన మద్దతును తెలియజేశారు. సహకార వ్యవసాయరంగాన్ని, గ్రామదానఉద్యమాన్నీ నేను వ్యతిరేంచినప్పుడు, శ్రీ జయప్రకాశ్ రైతులకు అనుకూలంగాఒక్కమాటకూడ మాట్లాడలేదు. కారణమేమంటే, జవహార్లాల్, వినోబాభావేగార్లు చేపట్టిన రైతాంగ వ్యతిరేకచర్యలకు జయప్రకాశ్ ముందుగానే తన అంగీకారాన్ని తెలపడంవల్లనే, నా రైతాంగ అనుకూల ఉద్యమానికి అనుకూలతను వ్యక్త పరచలేదు. గాంధేయమార్గంలో అంకితభావంతో కృషిచేసే కార్యకర్తలెందరో శ్రీ జయప్రకాశ్‌కు సన్నిహితులయ్యారు. వారంతా మహోన్నతమైన సాంఘికసేవ చేశారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, సహాయక చర్యలలోపాల్గొని వారంతా సమాజంలో ఉదాత్తమైన గుర్తింపును సంపాదించుకున్నారు.

1971, 72, 74లలో గరీబీ హఠావో నినాదం ద్వారా కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ ప్రజామోదాన్ని పొందిన నాయకురాలు శ్రీమతి ఇందిరాగాంధీకి వ్యతిరేకంగా ఆయన పనిచేశారు. సర్వోదయ కార్యక్రమాలద్వారా, సేవాభావం, త్యాగనిరతి ద్వారా, క్రమ శిక్షణలోకూడిన సర్వోదయ కార్యకర్తల ద్వారా అకుంఠిత సేవాదక్షతవల్ల లభించిన నైతిక శక్తి యుక్తులను శ్రీ జయప్రకాశ్ నారాయణ్, దుర్వినియోగంచేసి ఆమెను పతనంచేసేందుకు ప్రయత్నించారు.

పార్లమెంటరీ సాంప్రదాయాలతో, రాజకీయపరంగా, ప్రజాస్వామ్యయుతమైన ప్రతిపక్షపార్టీని శ్రీ జయప్రకాశ్ నారాయణ్ రూపొందించడానికి పూనుకుంటే తప్పుపట్టవలసిన అవసరంలేదు, అందువలన మన ప్రజాస్వామిక వ్యవస్థ మరింతబలపడేందుకు, సరిదిద్దుకునేందుకు, సవ్యమైన ప్రమోగాన్ని జరిపినట్లయ్యేది. ప్రజాస్వామ్యపద్ధతిలో దీనినిసాధించాలను కుంటే, ఆయన అందుకు ప్రత్యేకమైన పార్టీని ఏర్పాటుచేయవలసిన అవసరంలేదు. నిర్దిష్టమైన విధానాలు, కార్యక్రమాల సాధనకు అనుకూలంగా నిరసన ప్రదర్శనలు చేయడం, సభలు నిర్వహించడం, ఉపన్యాసాలు ఇవ్వడం, ప్రతిఘటనోద్యమాలు రూపొందించడంవరకూ ఉన్న ఈ చర్యలన్నీ ప్రజాస్వామ్య విరుద్ధాలుకావు. ఇలాంటి కార్యక్రమాల్ని నేను ఎన్నింటినో నిర్వహించాను. భిన్న సిద్ధాంతాలు, భిన్న దృక్పథాలుగల సాంఘిక, రాజకీయ శక్తుల్నీ, పార్టీలనన్నిటినీ అప్రజాస్వామికంగా, ఆయన ఆహ్వానించి, ఏకంచేసి, రెచ్చగొట్టి,ప్రజలు ఎన్నుకొన్న ప్రజాప్రభుత్వాలను కూలదోసేందుకు పిలుపు ఇవ్వడం పార్టీరహిత ప్రజాస్వామిక దృక్పథం కాదు, అది ఆయన పార్టీరహిత నాయకత్వ లక్షణాన్నీ ప్రతిబింబించదు. పార్టీరహిత ప్రజాస్వామ్యవ్యవస్థ కోసం పోరాడిన శ్రీ జయప్రకాశ్, తుదకు సకల రాజకీయపార్టీల సమ్మిశ్రమంగా, భిన్న సిద్ధాంతాల మూసగా, వివాదాస్పద రాజకీయ సిద్ధాంతానికీ, రాజకీయ గందరగోళానికి మాత్రమే దారితీసే ఉద్యమాన్నిచేపట్టారు.

రెండు దశాబ్దాల పాటు, పార్టీ రహిత ఉద్యమంలోనూ, సర్వోదయ కార్యక్రమాల్లోనూ గడిపిన శ్రీ జయప్రకాశ్ తిరిగి క్రియాశీలరాజకీయ కార్యకలాపాల్లోకి ప్రవేశించారు. సాంఘిక, రాజకీయ శక్తులనన్నింటినీ కూడదీసుకొని, ఒకే నినాదంగా ప్రతిధ్వనిస్తూ, అవినీతిమయమైన ప్రజారంగాన్ని, ప్రభుత్వయంత్రాంగాన్ని ప్రక్షాళనం చేసేందుకు ఆయన పిలుపు ఇచ్చారు. ఈ సాములోఆయన ప్రతిపక్షాల అన్నింటి సహకారాన్నిఆశించి, పరస్పర వైరుధ్యం ఉన్న

మార్క్సిస్టుపార్టీ, ఇతరవామపక్షాలనుంచి, అటు జనసంఘంనుంచీ కూడాతోడ్పాటును కోరారు. ప్రజలమద్దతుతో, పలుకుబడితో, అపారమైన ఆర్థికవనరులతో ఎన్నికలలోగెలుపొందిన కాంగ్రెసుపార్టీ పరిపాలన మీద ఆయన తన గురిని లక్ష్యించిపెట్టారు. అవినీతి రొంపిలో కూరుక పోయిన కాంగ్రెసు పార్టీకి శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వం వహిస్తున్నది గనుక ఆమెను కూలద్రోయడానికి తన ప్రయత్నాలను ముమ్మరంచేశారు.

శ్రీ జయ ప్రకాశ్ నారాయణ్ ఆరోపించిన అధికార దుర్వినియోగానికి , అవినీతికార్యకలాపాలకు, ప్రభుత్వ దుష్టవిధానాలకు వ్యతిరేకంగా గత ఇరవై ఆయిదు సంవత్సరాలుగా మా వంటి ఆనేక మంది నాయకులు పోరాటం జరుపుతున్నప్పుడు– ఆయన ఏనాడూమాతో సహకరించేందుకు ముందుకు రాలేదు. అధికార పార్టీకి ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ నాయకత్వాన్ని రూపుదిద్దే మా కృషిలో ఏనాడూ అయన సహకరించ లేదు. ఈనాడు శ్రీ జయప్రకాశ్‌కు అండగానిలిచిన ఈ ప్రతిపక్ష పార్టీలుకూడా, మేము ప్రయత్నించిన నూతన రాజకీయఐక్యసంఘటనా కృషిలో భాగం పంచుకోలేదు. 1959నుంచీ అపారమైన రాజకీయానుభవంగల రాజాజీని అండగాచేసుకొని శక్తివంతమైన ప్రజాస్వామ్యయుతమైన ప్రతిపక్షాన్ని నిర్మించడానికి జరిపిన నూ కృషిలో వీరెవ్వరూ కలిసిరాలేదు.

అనేక సంవత్సరాలుగా ప్రతివక్షాలు తమకున్న విభేదాల్ని విస్మరించి, శ్రీ జయప్రకాశ్ ఆహ్వానాన్ని ఆసరాగా తీసుకొని , ఒకే శక్తిగా,జాతీయ నాయకత్వాన్ని సంతరించుకొన్న ఆయన నేతృత్వం క్రింద ఉద్యమించడానికి సిద్ధం అయ్యారు. దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్నఅపజయాల పర్యవసానంగా, ప్రతిపక్షాలన్నీ ఇనుమడించిన శక్తి యుక్తులతో, శ్రీ జయప్రకాశ్‌ను డాలుగా చేసుకొని, ప్రభుత్వంమీద తిరగబడడానికి రంగం సిద్ధంచేశాయి . ఇట్లాంటి పెద్ద రాజకీయ అగాధంలో పడకుండా, ఆయన తెలివిగా దాని నాయకత్వాన్ని తిరస్కరించి ఉండవలసింది.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి, చట్టబద్ధంగా ప్రజలు ఎన్నుకొన్న ప్రజాప్రతినిధులకు, వ్యతిరేకంగా "బీహార్ నమూనా సంపూర్ణ విప్లవాని"కి కమ్యూనిస్టులు పిలుపు ఇచ్చి, ముందుకు వచ్చిన తరవాత, శ్రీ జయప్రకాశ్ దీనిపై పునరాలోచనచేసి, వెనక్కి తిరిగిఉండవలసింది.

శ్రీ జయప్రకాశ్ పార్టీరహిత ప్రజాస్వామ్య ప్రయత్నాలన్నీనిర్మాణకార్యక్రమాలకు కాకుండా, విధ్వంస వ్యవహారాలకే ఎక్కువగా ఉపయోగపడుతున్నాయని భయపడటంలో తప్పులేదు. ఎన్నికల సంస్కరణల కోసం ఆయన చేసిన ప్రతిపాదనలు కాంగ్రెసు వారి గుండెల్లో ప్రతి ధ్వనించాయి.అయితే ఆయన వీటిని సైతం తన సంపూర్ణ విప్లవంలో భాగంగా చేసినందున వీటిపట్ల ఆకర్షితులైన వారిని కూడా, ఇష్టం లేకపోయినా, ప్రతిపక్షంలోకి ఆయన నెట్టివేసినట్లయింది.

పార్లమెంటు, శాసనభలకు జరిగే ఎన్నికలలో దామాషా పద్ధతిలో ప్రాతినిధ్యంకల్పించే సూత్రాలను ప్రవేశపెట్టాలని ఆయన చేసిన ప్రతిపాదనల్ని చాలామంది కాంగ్రెసు వాదులు శ్రద్ధతో గమనించారు."రీకాల్" విషయంలో కూడా సంతృప్తికరమైన పద్ధతిలో, అంటే కనీస సంఖ్యలో ఓటర్లు కోరినప్పుడు మాత్రమే అమలు జరపడానికి వీలుండే విధంగా రాజ్యాంగసవరణ చేసేందుకు ఆయనతో చేతులు కలపడానికి వారు సిద్ధపడ్డారు. మాలాంటి వాళ్లంతా ఇంకా కొంచెంముందుకు వెళ్ళి పెద్దా,చిన్నా పార్టీలతో సహా అందర్నీ కలుపుకొని శాసనసభలో

వారికున్న సంఖ్యాబలాన్నిబట్టి ప్రాతినిధ్యంకల్పించి, మంత్రివర్గాలను ఏర్పరచి, సమష్టి అంగీకారంతో విధాన నిర్ణయాలను కొనసాగించాలని సూచించాం. గుర్తింపు పొందిన అన్ని రాజకీయపార్టీలకు , వారికి ప్రజలు వేసిన ఓట్లశాతాన్ని అనుసరించి, ఎన్నికల ఖర్చులకుగాను, ఆర్థిక సహాయం చేయాలనికూడా ఒత్తిడి తెచ్చాం. ఇదే వరవడిలో ప్రజాస్వామ్య మార్గాలలోకాంగ్రెసు వారూ, ఇతరపార్టీలవారూ సంయుక్తంగా చర్చించుకొని ఎన్నికల నిబంధనలను సంస్కరించడంద్వారా గుర్తింపు పొందినపార్టీలు అన్నీ కనీస అవసరాలను సమంగాపొందే అవకాశం ఏర్పడుతుంది. ఎన్నికలలో అభ్యర్థులుగా నిలిచేవారిలో కొంతమేరకు పార్టీ అభ్యర్థులకు, కొంతమేరకు స్వతంత్ర అభ్యర్థులకు కనీస అవసరాలను ఏర్పరుస్తూ ,స్వతంత్ర అభ్యర్థులకూ పార్టీ అభ్యర్థులకూ మధ్య ఉండవలసిన గమనికలను రూపొందించుకొని, సహాయం అందించే పద్ధతులను కనుగొనవలసి ఉంది.

ఎన్నికల సంస్కరణలకు, మంత్రివర్గ ఏర్పాటులకు సంబంధించి భారతదేశ పరిస్థితులకు తగినవిధంగా, అధికార, అనధికార పూర్వక రాజ్యాంగ చర్యలను జాతీయ స్థాయిలో రాజకీయ పార్టీలు అన్నీ కలసి చర్చించుకొని, ఏకాభిప్రాయాన్ని సాధించి అభ్యుదయ పంథాలో సంస్కరణలను అమలుచేసుకోవలసివుంది.

నిర్మాణాత్మక ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జయప్రకాశ్ ఉద్యమం కృషిచేయడానికి బదులుగా, విధ్వంసపూరిత కార్యక్రమాలకే చివరకు దారితీసింది. జయప్రకాశ్‌కు జాతిని అభివృద్ధిపథం వైపు నడిపించే కృషిలో ఆసక్తిగానీ, సమర్థతగానీ ఉన్నదా? అలా అని చెప్పలేం. ఆయన ఉద్యమరచనలో వ్యూహాత్మకంగా ఊగిసలాట విధానం, గందరగోళ స్థితి , సాంఘిక కార్యక్రమాల్లో ప్రతిఘాతధోరణి నిండి ఉంది. అందువల్లే కమ్యూనిస్టులతో సహా, అన్నిరకాల రాజకీయపార్టీల మిశ్రమ కూటమిని, కలగలుపుకొని ఆయనకార్యక్రమాల నిర్వహణకు పూనుకోవడం జరిగింది.

జయప్రకాశ్ ఫాసిస్టుగానీ, నియంతగానీ కాదని మనకు స్పష్టంగా తెలిసినప్పటికీ, కొన్ని ప్రజాస్వామ్యవ్యతిరేకశక్తులు ఆయనను, ఆయన కార్యక్రమాలను తమ ప్రయోజనాలకు ఉపయోగించుకున్నాయి. జయప్రకాశ్ గానీ, ఆయన గాంధేయ అనుచరవర్గంగానీ, ఒక విషయాన్ని స్పష్టంగా తెలుసుకొని ఉండవలసింది. వెనకబడిన తరగతుల ప్రజలు, హరిజనులు, ఆటవికతెగలు, రైతులు, రైతుకూలీలు, అశేషప్రజలంతా వీరిలం మాట్లాడే బొమ్మలు కాదని వారుగ్రహించడం అవసరం. శ్రీమతిఇందిరాగాంధీ, ఆమెను బలపరిచే వారుకూడా అత్యధిక సంఖ్యాకులైన మన ఓటర్లనుగురించి మాట్లాడటంలేదు.

శ్రీ జయప్రకాశ్ రక్షణదళాలకు, పోలీసు సిబ్బందికి ప్రభుత్వం ఇచ్చే ఆదేశాలలోని ఉచితానుచితాలను పరిశీలించి , ప్రభుత్వానికి లోబడి ఉండాలా, తిరస్కరించాలా అనేది తేల్చుకొని, అప్పుడు ఆచరణలో పెట్టవలసిందిగా, ఉద్బోధిస్తూవుంటే ఆయన ఆశ్చర్యం వేస్తున్నది. ప్రజలు ఎన్నుకోన్న శాసనసభలను రద్దుచేయవలసిందిగా, ఆయనకోరారు. శాసనసభ్యులను రాజీనామా ఇవ్వమన్నారు. ప్రత్యేకించి కొంత మంది ముఖ్యమంత్రులను రాజీనామా చేయమని అడిగారు. ప్రతిపక్షపార్టీలవారందరినీ ప్రజాతిరుగుబాట్లను నడపమన్నారు.

ఆయన చేపట్టిన ఈ కార్యక్రమాలన్నీ ప్రజాస్వామ్యవ్యతిరేక మైనవేనని స్పష్టంచేయవలసి ఉంది. ఈ అప్రజాస్వామిక ఉద్యమాలన్నిటినీ ఆయన పద్దెనిమిది నెలల పాటు కొనసాగించారు. ఈ ఉద్యమాలు రాజకీయంగా అరాజక పరిస్థితులను కల్పించాయి. దేశమంతా విధ్వంసక సంఘటనలతో, వినాశకర వాతావరణంతో అట్టుడికిపోయింది. ప్రతిపక్ష పార్టీలన్నీ కూడా ప్రజలను రెచ్చ గొట్టి, అశాంతిని సృష్టించి, పార్లమెంటరీ వ్యవస్థకు, ప్రజాస్వామ్య పద్ధతులకు భంగకరంగా, ప్రవర్తించాయి. ఈ చర్యలవల్ల సమాజంలో భద్రతకరువైంది. ప్రజలకు రక్షణ లేకుండాపోయింది. ఈ పరిస్థితి అంతా ప్రభుత్వానికి సవాల్ గా పరిణమించి, తుదకు దేశంలో ఎమర్జన్సీని విధించవలసిన దుర్దశ ఏర్పడింది.

కార్మిక నాయకుడు – శ్రీ యన్.యం.జోషి

సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీకి సంబంధించిన యన్.యం.జోషి 1872వ సంవత్సరంలో జన్మించారు. ఆయన కార్మికనాయకుడు. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వ్యవస్థాపకుడు, సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో పీరు, రంగా, గిరిగార్లు కార్మిక వ్యవహారాలలో త్రిమూర్తులుగా మెలుగుతుండేవారు. 1921–46 సంవత్సరాల మధ్య సెంట్రల్ అసెంబ్లీకి కార్మికుల పక్షాన వీరిని నామినేట్ చేశారు. 1919వ సంవత్సరంలో అంతర్జాతీయ కార్మిక మహాసభలో భారత ప్రతినిధిగా పాల్గొని అప్పటినుంచి ఐ.ఎల్.ఓ పాలక మండలిలో 1946 వరకు కొనసాగారు. 1955లో మరణించారు. లేబరు బిల్లుల మీద సెలెక్టు కమిటీ సభ్యులుగా యూరప్, అమెరికా, దక్షిణ అమెరికాలలో పర్యటించారు. – (ఎడిటర్)

సర్వెంట్ ఆఫ్ ఇండియా సొసైటీకి చెందిన శ్రీ యన్.యం.జోషి భారత పారిశ్రామికోద్యమంలో భీష్మునిగా వెలిగారు. 1935లో నేను సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి వెళ్లేనాటికి ఆయన ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లో శక్తివంతుడైన నాయకుడు. రైల్వే కార్మిక నాయకునిగా మంచిపేరు ప్రఖ్యాతులార్జించిన నా సహచరుడు వి.వి.గిరిగారి కన్నా యన్.యం.జోషి సీనియరు. గొప్ప జాతీయ కార్మిక నాయకుడు.

అంతర్జాతీయ కార్మిక మహాసభలలోను, ఐ.ఎల్.ఓ.లోనూ జోషిగారికి మంచి పేరున్నది. ఐ.ఎల్.ఓ.కి పంపిన భారతీయ త్రిసభ్య ప్రతినిధి వర్గానికి ఆయన ప్రాతినిధ్యం వహించారు. దక్షిణ తూర్పు ఆసియాకు ప్రతినిధిగా ఢిల్లీలో ఐ.ఎల్.ఓ తరపున పనిచేస్తున్న డాక్టర్ పట్టంతాన్ పిళ్లేగారికి వీరు మంచి స్నేహితులు. పిళ్లేగారు లండన్, జెనీవాలలో ఉన్నప్పుడు అక్కడ నేను కార్మిక సంస్థలను గురించి అధ్యయనం చేస్తున్నాను. నాకు డాక్టర్ పట్టంతాన్ పిళ్లే, జోషి లండన్‌లో మంచి స్నేహితులు. గిరి, పిళ్లే, జోషి, నేను మంచి స్నేహితులుగా వుంటూ 1935–40 సంవత్సరాల మధ్య కాలంలో కార్మిక సమస్యలపై పరస్పరం అభిప్రాయాలను తెలియజేసుకుంటూ అధ్యయనం చేస్తుండేవారం. 1930వ సంవత్సరంలో నేను జోషిని మొదటిసారిగా లండన్‌లో కలుసుకున్నాను. అప్పుడు అక్కడ ఆయన రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు వచ్చారు. శ్రీనివాస శాస్త్రి, విజయ్, జోషి ముగ్గురూ తరచు కలసి కనిపిస్తూండేవారు. నేను వారితో చాలాసార్లు మాట్లాడటం జరిగింది. మా స్వాతంత్ర్య నినాదాన్ని ఆయన అంగీకరించేవారు గాని గాంధీజీ సత్యాగ్రహ సమరాన్ని మాత్రం బలపరిచేవారు కాదు. భారతదేశానికి పూర్తి స్థాయి కామన్వెల్త్ హోదాను కోరేందుకు సంస్థానాధీశులను, ముస్లింలను కలుపుకు రావడానికి చేసే ప్రయత్నంలో సప్రూగారితోనూ, జయకర్‌గారితోనూ ఆయన సహకరించేవారు. గాంధీజీ ఆమోదం లేకుండా రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఏ నిర్ణయం చేసినప్పటికీ అది భారతదేశంలో శాంతిని కల్పించదని శ్రీనివాస శాస్త్రిగారు ప్రకటించినప్పుడు జోషి దానితో ఏకీభవించారు. వీట్లే చైర్మన్‌గా ఉన్న లేబర్ కమీషన్‌లో ఆయన సభ్యులుగా ఉన్నారని నాకు

తెలుసు. నేను దానికి సమర్పించిన రాతపూర్వకమైన సాక్ష్యంలో ముఖ్యంగా వ్యవసాయ కార్మికుల రక్షణ కోసం చూపిన అంశాలు తనకు బాగా వచ్చాయని ఆయన నాతో చెప్పారు.

అప్పటి నుంచి రాజ్యాంగ నిర్మాణ సభ మిషన్ల ను ఏర్పాటు చేసేంతవరకు బ్రిటిష్ ప్రభుత్వం వారిచే ఏర్పాటు చేసిన అన్ని సభలలోనూ సంప్రదింపులలోనూ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌నుంచి క్యాబినెట్ మిషన్ల వరకు అన్నింటా ఆయన కేంద్రంగా ఉండేవారు. ఎక్కడున్నా ఏ సమయంలోనైనా జోషి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశస్వాతంత్ర్యాన్ని భారతీయ కార్మికులు గట్టిగా కోరుతున్నారని చెబుతూ స్పష్టమైన వైఖరిని ప్రదర్శిస్తుండేవారు. జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఇంగ్లీషు వారు తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆయితే ఆయనెప్పుడూ నేరుగా మా ఉద్యమాల్లో పాల్గొనలేదు. సమ్మెను ఒక హక్కుగా తీసుకొని యజమానులకు వ్యతిరేకంగా కార్మిక పోరాటాలను నడపడానికి సదా సంసిద్ధంగాఉండే శ్రీ జోషి మాతో సత్యాగ్రహంలో పాల్గొనడానికి ఎందుకు వెనుకంజ వేస్తున్నారని నేను అడిగాను. అప్పుడాయన "అదికాదు రంగా! సత్యాగ్రహం అన్ని సందర్భాలలోను ఆయన అతి మక్కువతో చెబుతున్నట్లు అహింసాయుతంగానే ఉంటుందని చెప్పలేముకదా" అని అన్నారు. దీర్ఘకాలం నడిచే ఉద్యమాలేవైనా ఆఖరుకు కార్మిక పోరాటాలతో సహా కొంత హింస తప్పక పోవచ్చు. అందుకని మీరు అలాంటి సమ్మెలను వ్యతిరేకించడం లేదు గదా! అని నేను అన్నాను. దానికి ఆయన నుంచి సంతృప్తికరమైన సమాధానం రాలేదు. గోఖలే వద్ద పొందిన శిక్షణ ఆయనను గాంధీ మార్గానికి దూరంగా ఉంచిందని అప్పుడు నేను గ్రహించాను.

అయితే గిరిగారూ నేనూ సత్యాగ్రహాల్లో పాల్గొన్నప్పుడు జైళ్లకు వెళ్లినప్పుడు ఆయన మమ్ము ప్రశంసిస్తూ ఉండేవారు. మద్రాసు మంత్రివర్గంలో కార్మికశాఖ మంత్రిగా గిరిగారిని చేరవలసిందిగా రాజాజీ పిలిచినపుడు ఆయన చాలా సంతోషించారు. కాంగ్రెస్ మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసిన ఒక సందర్భంలో కేంద్రంలో నేను మంత్రిని కాగలనని ఆయన ఆశించాడు.

ఒకరోజు "లాహోర్ ట్రిబ్యూన్" పత్రికను, "హిందూస్తాన్ టైమ్స్" పత్రికనూ తీసుకొని ఆయన నా దగ్గరకు వచ్చి ఇందులో ఏమున్నదో చూడమన్నారు. అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి సర్ ఏ. కందర్ హయత్‌ఖాన్ పంజాబులోనికి నేను ప్రవేశించడానికి వీలులేకుండా తానిచ్చిన నిషేధపుటుత్తర్వుపై వచ్చిన వాయిదా తీర్మానానికి జవాబిస్తూ ఇలా అన్నారు. "ఎప్పుడైనా ప్రొఫెసర్ రంగా ఢిల్లీలో కార్మిక శాఖామంత్రిగా ఉంటే అప్పుడు ఆయన రాకకు నా స్వాగతం" అంటూ కార్మికులకు మీరు చిరకాలమిత్రులు కార్మిక వ్యవహారాలలో నాతో కలిసి పనిచేసిన రంగాగారంటే నాకూ చాలా ఇష్టం అని అన్నారు. ఆయనకు నామీద అంతటిప్రేమ. కార్మిక వ్యవహారాలలో పూర్తి అయిదు సంవత్సరాలకాలం మేమిద్దరం కలసి పనిచేశాం.

సంవత్సరానికోసారి భారతీయ ప్రతినిధి వర్గం సమర్పించే నివేదిక మీద ఐ.ఎల్.ఓ.లో చర్చ జరుగుతుంది. చర్చను ప్రారంభించిన వెంటనే మొదటిసారిగా నేను ఐ.ఎల్.ఓ. వ్యవసాయ కార్మికుల జీత భత్యాల గురించి పనికల్పనగురించి, వారనుభవిస్తున్న పరిస్థితుల గురించి ప్రశ్నించాను. రెండోసారి సమీకృతంకాని కూలీల పరిస్థితులు మెరుగు పరచేందుకు బ్రిటిష్

ట్రేడ్ బోర్డుల వంటి త్రిపక్ష సంఘాలను ఏర్పాటు చేసేందుకు ఆయా ప్రభుత్వాలకు సూచించవలసిందని ఐ.ఎల్.ఓను కోరాను. ఈ సందర్భంలో గిరి, జోషిగారలు ఇద్దరూ నన్ను సమర్థించారు. మూడోసారి సమీక్షతంకాని వ్యవసాయ కార్మికుల పరిస్థితులను గురించి ఐ.ఎల్.ఓలో చర్చ జరిగేందుకు ప్రభుత్వం ఎలాంటి కృషి చేయటంలేదని నేను ఆరోపించగా, ఐ.ఎల్.ఓ.విధాన శైలితో బాగా పరిచయమున్న జోషి, ఐ.ఎల్.ఓ మహాసభ ఎజెండాలో చేర్చే అంశాలలో దీనిని చేర్చేందుకు ప్రభుత్వంచే ప్రతిపాదన పంపాలని చెప్పారు. దానిననుసరించి భారత ప్రభుత్వం ఐ.ఎల్.ఓ. కార్యవర్గ సమావేశంలో దీనిని ప్రస్తావించింది. ఆ తరవాత వ్యవసాయ కార్మికుల పరిస్థితులు మెరుగు పరచేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు చేసేందుకు ఐ.ఎల్.ఓ. కార్యవర్గాన్ని స్థాయీ సంఘాన్ని కలిపి ఏర్పాటు చేసింది. ఈ సంతోషకరమైన పరిణామానికి జోషి నన్ను అభినందించారు.

ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో జోషిగారొకరు. జవహర్లాల్ నెహ్రూ, చమన్ లాల్, సుభాష్ బాబు, గిరి, డాంగే, జోషిగార్లు దానికి అధ్యక్షులుగా పనిచేసేవారు. పార్టీ రాజకీయాలకు అతీతంగా దాన్ని ఉంచాలని జోషి తీవ్రంగా ప్రయత్నించారు. అయితే ఆ ఆలోచనలో ఆయన విజయాన్ని సాధించలేదు. జోషి, గిరి, శివరావు గార్లు లేకుండా ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని తాము పకడ్బందీగా ఆట్టిపెట్టలేమని కమ్యూనిస్టులు తెలుసుకొన్నారు. అందువలన వారు గిరిగారి రాజీసూత్రాన్ని అంగీకరించి నేషనల్ లేబర్ ఫెడరేషన్‌ను ఏ.ఐ.టి.యు.సి.లో విలీనం చేశారు. అయితే తిరిగి 1945-46 సంవత్సరాలలో కమ్యూనిస్టుల వైఖరి కారణంగా అది చీలిపోక తప్పనిసరి పరిస్థితులేర్పడ్డాయి. 1942-44 సంవత్సరాలమధ్య కమ్యూనిస్టులు కొనసాగించిన "ప్రజాయుద్ధ" నినాదానికి అనుకూలంగా కార్మిక ఉద్యమాన్ని నడిపించడానికి ప్రయత్నించినప్పుడు ఈ చీలిక తప్పనిసరయింది. అప్పుడు జోషి కమ్యూనిస్టులకు అనుకూలంగా ఏ.ఐ.టి.యు.సి పక్షాన ఉన్నారు. దానిలో పూర్తిగా వారి ప్రాబల్యం పెరగడంతో గిరిగారు, నేను గుల్జారీలాల్ నందాగారు ప్రారంభించిన ఐ.ఎన్.టి.యు.సి.వైపు మొగ్గవలసి వచ్చింది. ఐ.ఎల్.ఓ.లో పాల్గొనే భారతీయ ప్రతినిధి వర్గానికి ఐ.ఎన్.టి.యు.సి.వెళ్లే అంశంపైన కమ్యూనిస్టులు సవాలు చేయడం దానిపై కార్మికనాయకుల మధ్య ఓటింగు పెట్టగా ఐ.ఎన్.టి.యు.సి.కి మెజార్టీ రావడం జరిగింది. 1948వ సంవత్సరంలో శాన్ ఫ్రాన్సిస్కోలో జరిగిన ఐ.ఎల్.ఓ. సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి. పాల్గొనే విషయంలో తిరిగి ఏ.ఐ.టి.యు.సి. వివాదాన్ని రేకెత్తించగా మీరు ఎన్నికలలో ఓడిపోలేదని నిరూపించండని నేను వారిని సవాలు చేశాను. ఈ పోరాటాలు ఇలా కొనసాగుతూ ఉండగానే బొంబాయిలో జోషి అస్వస్థతకు గురై మంచంపట్టి రంగం నుంచి పూర్తిగా తప్పుకున్నారు.

జోషి తన మార్గాన్ని భారతీయ ఉదార వాదంతో ప్రారంభించినప్పటికి శాసనసభలలోను, అంతర్జాతీయ వేదికలపైన భారతీయ స్వాతంత్ర్యం కోసం పోరాడుతూ, ఒక గొప్ప కార్మికనాయకునిగా ప్రపంచ వ్యాప్తమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. తుదకు కమ్యూనిస్టుల ప్రాబల్యంతో ఉన్న ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్‌లో ప్రవేశించి ఆయన ప్రజాజీవిత చరమాంకాన్ని ముగించారు. ఒక అర్ధ శతాబ్దంపైగా పారిశ్రామిక కార్మికుల కోసం

సేవచేసిన ఆయన చరిత్ర ఇలా ముగిసింది.

1921 నుంచి 1945వరకు ఆమోదించిన కార్మిక శాసనాలన్నీ ఆయన ఆమోదాన్ని పొందినవే. వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లోని కార్మిక సభ్యులు ప్రవేశపెట్టబోయే బిల్లుల విషయంలో ముందుగానే ఆయనతో సంప్రదిస్తూ ఆ తరవాత సెలక్టు కమిటీలోను, సభలోను సులభంగా జోషి ఆమోదాన్ని సంపాదించుకొనే వారు. అప్పటి ప్రభుత్వం ఏర్పాటుచేసిన కౌన్సిల్సులో ఆయనమాటకు అంత పలుకుబడి ఉండేది. నేను అనేక సలహాలను ముందుగానే ఆయనకు వివరించి ఆ తరవాత ప్రభుత్వ ఆమోదాన్ని సులభంగా సంపాదించుకొనేవాడిని.

శ్రీ జోషికి ఐ.ఎల్.ఓ.లో గౌరవం, పలుకుబడి ఉండేవి. భారతీయ సామాజిక పురోభివృద్ధికి భారతీయ కార్మికవర్గాన్ని కీలకస్థానంలో ఉంచేందుకు ఆయన చేసిన కృషి చాలా గొప్పది. మా ఇద్దరి రాజకీయ మార్గాలు భిన్నమైనవైనప్పటికి ఆయన స్నేహాన్ని, విశ్వాసాన్ని పొందగలగడం నా అదృష్టంగా భావిస్తాను. ఎప్పుడైనా తొందరపాటు కలిగిన కాంగ్రెస్ ఎం.ఎల్.ఎ లెవరైనా నీవు మాత్రమే కార్మికుల రక్షకుడివైనట్లు ప్రవర్తించడానికి నీకున్న హక్కేమిటి అని ఆయనను ఎదుర్కొన్నప్పుడు ఆయనను సమర్థిస్తూ నేను ముందుకు వచ్చేవాడను. అందుకాయన సంతోషించేవారు.

నిర్బంధ కూలీ పద్ధతికి వ్యతిరేకంగా నేను జరిపిన పోరాటంలో ఆయన నాకు సహకారం అందించారు. లేబరు సభ్యులు సర్ ఫ్రాంక్ నోయిస్ ఆయన సమర్థుడైన కార్యదర్శి అండ్రూక్లూగార్లను తన పలుకుబడి నుపయోగించి నా సలహాలను అంగీకరించేలా చేసి దేశంలో ఎక్కడ ఏ రూపంలో నిర్బంధ కార్మిక విధానం అమలు జరుగుతున్నదో తెలుసుకునేందుకు ఉత్తర్వులు ఇప్పించారు. అప్పుడు కేంద్ర ప్రభుత్వాన్ని నిర్బంధ కూలీ పద్ధతిని నిషేధించవలసిందిగాను, కూలీరేట్లు, అలవెన్సులు, పనివేళలు, రేషన్‌లు కార్మికుల మానవ విలువలకు అనుగుణంగా ఇప్పించేలా రాష్ట్రప్రభుత్వాలను ఆదేశించవలసిందిగాను మేము కోరాం. నిర్బంధంగా కార్మికులతో పనిచేయించే ఈ దౌర్భాగ్య విధానం 1975లో శ్రీమతి ఇందిరాగాంధీ అధికారంలోకి వచ్చి నూతన ఆర్థిక పద్ధతులను అమలు జరిపేంతవరకు ఎంతో కొంత ఉంటూనే వచ్చింది.

జోషి కార్మికనాయకుల మధ్య తటస్థమైన వైఖరిని అవలంబించాడని స్పష్టంగా చెప్పొచ్చును. జోషి అటు కార్మికుల తరపున ఇటు ప్రభుత్వ పక్షాన కూడ అవసరమైన సందర్భాలలో స్పష్టమైన వైఖరిని తీసుకొనేవారు. ఒక విషయంమీద ఆయన వాదం ప్రారంభించినపుడు దానికి అనుకూలంగా, ప్రతికూలంగా వచ్చే వాదాలను పరిగణనలోనికి తీసుకొని అవసరం అయినప్పుడు ఆయన వాదనలో నుంచి కొంత వెనక్కుగాని ముందుకుగాని జరుగుతూ ఉండేవారు. ఇది మహారాష్ట్రుల ప్రత్యేకతైలి శ్రీ గిరి కూడా ఇంతటి సామర్థ్యంతోనూ, విలువలతోను మెలగుతూ ఉండేవారు. జోషి, గిరిగార్లు భారతీయ కార్మిక వివాదాలను పరిష్కరించడంలో వారి పరిస్థితులను మెరుగు పరచడంలో త్రైపాక్షిక సమావేశాలలో భారతీయ యోధుల్లాగా ప్రవర్తించేవారు. గిరి, జోషిగార్లు అవలంబించిన ఈ రీతి భారతీయ కార్మికులకు

గొప్ప విజయాన్ని చేకూర్చింది.వారు రైల్వేలు, గనులు, ఐట్రం పరిశ్రమలోని వారికి వారి పని పద్ధతులలో మెరుగుదలకు, జీతాల పెరుగుదలకే కాక భారతీయ త్రైపాక్షిక కార్మికసమావేశ నిర్ణయాలను ఐ.ఎల్.ఓ. తీర్మానాలను అమలు చేసేందుకు యజమానులను అంగీకరింప చేసేటట్లు తోడ్పడింది. వారు లేబరు ట్రిబ్యునళ్ళను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వాన్ని అంగీకరింపజేశారు. ప్రభుత్వ భాగస్వామ్యంతో కార్మికులు తమతమ స్వయం వృత్తి కేంద్రాలను ఏర్పాటు చేసుకోడానికి యుగోస్లోవేకియా కమ్యూనిస్టు ప్రభుత్వం చర్యలు తీసుకోవటం ద్వారా, కమ్యూనిస్టులు 1974 నాటికి కార్మిక విషయాలలో త్రైపాక్షిక సూత్రాన్ని అంగీకరించక తప్పదనుకొనే పరిస్థితులలో బడ్డారు.

బోసుగారు సెంట్రల్ అసెంబ్లీలో మంచి ఉపన్యాసకులు, మహారాష్ట్ర పద్ధతిలో జరీ తంపాగా నెత్తిన ధరించి బ్లాక్ గ్రేకోటును వేసుకొని ధోవతిని నడుంనుంచి మరో భుజంపై పు గుండెల మీదుగా పైనవేసికొని ఆయన సీటులోంచి లేచి నిలబడినపుడు యుద్ధానికి సిద్ధమైన ఒక మహా యోధునిలా కనిపించేవారు. ఆయన ప్రసంగం ప్రారంభించేటప్పుడు సన్నని ధ్వనితో చిన్నగా ప్రారంభించి క్రమేణా పెంచుకొంటూ తాను చెప్పదలచుకున్న అంశాన్ని బలపరచవలసి వచ్చినప్పుడు సుత్తితో మోగించినట్లు అతి తీవ్రస్థాయిలోకి తీసుకెళ్లి చివరకు తమకు కావలసిన విధంగా ముగించేవారు. అది మహారాష్ట్రులు మాట్లాడడానికి ఉపయోగించే ఒక ప్రత్యేకమైన పద్ధతి. ఆ పద్ధతిని నేను, శ్రీ బాపూజీ అనే, శ్రీ యన్.వి.గాడ్గిల్ గార్లు దగ్గర కూడా గమనించాను. ప్రముఖ లేబరు నాయకునిగా ఆయన ప్రసంగాలు వినడానికి తీవ్రంగా ఉండవుగాని ప్రసంగాల పద్ధతి సమర్థవంతంగా ఉండేది. అన్ని విధాలా ఆయన ఓ మంచి ఉపాధ్యాయునిలా ఉండేవారు. ఆయన శబ్ద ప్రయోగం వెనకటి పండితుల్ని తలపించేది. ఆయన చక్కటి ఆత్మ విశ్వాసంతో తనవాదనను పాండిత్యంతోను, తీవ్రమైన ఆవేశంతోను గట్టి పునాదులు వేస్తూ ముందుకు తీసుకెళ్లేవారు. ఆ విధంగా బాధిత ప్రజానీక ప్రయోజనాలను పరిరక్షించడానికి పార్లమెంటు చరిత్రలో ఆయన ఒక ప్రముఖ వ్యక్తిగా మనకు కనిపిస్తారు.

26

డా॥ హుమయూన్ కబీర్

ప్రజాస్వామ్యం కోసం ప్రాణాలర్పించిన యోధుడు శ్రీ హుమయూన్ కబీర్. అయితే అది ఏరకం ప్రజా స్వామ్యం కోసం? ప్రజాస్వామ్యంపై "యునెస్కో" ప్రచురించిన ఒక సంచికలో తన రచన ద్వారా దానికి ఆయనే జవాబు చెప్పారు. అది పార్లమెంటరీ పద్ధతి ప్రజాస్వామ్యం అయిఉండాలని, అందులో ప్రతి పక్షానికి తగిన ప్రాధాన్యత ఉండి తీరాలని ఆయన చెప్పారు. అయితే అది ఏరకమైన పార్లమెంటరీ ప్రజాస్వామ్యం? ఈ రోజుల్లో ఎక్కువగా మనం చూస్తున్నట్లుగా అది ఏకపక్ష పార్లమెంటరీ ప్రజాస్వామ్యం కాకూడదు. అనేక పార్టీలు ఉండే ఆంగ్లో - అమెరికన్ పద్ధతి పార్లమెంటరీ ప్రజాస్వామ్యమై ఉండాలని కబీర్ అభిప్రాయపడ్డారు. ప్రతిపక్షానికి వాక్స్వాతంత్రం అవకాశం ఉన్నప్పుడే అది రెండు వైపులా ప్రజాస్వామ్యబద్ధంగా ఉంటుందన్నారు. ఏ మార్క్సిస్టు కమ్యూనిస్టు దౌర్జన్యకాండకు ఆయన బలైపోయారో వారికి ఈ ప్రతిపక్ష ప్రజాస్వామ్యంపై విశ్వాసంలేదు. కమ్యూనిస్టుల జులుంను ఆయన వ్యతిరేకించి వారి దౌర్జన్యాన్ని స్వయంగా తనకు తానై ఆహ్వానించి అందుకు బలి అయ్యారు. పశ్చిమ బెంగాల్ మార్క్సిస్టు కమ్యూనిస్టుల దౌర్జన్యకాండ నుంచి కొంచెంకోలుకున్న తరవాత, ఇంకా కట్లు ఊడదీయకుండానే ఆయన అలాగే పార్లమెంటులో అడుగుబెడుతూ ఉంటే ఆయన్ను చూసి మేమంతా నివ్వెరపోయాం.

సంయుక్త బెంగాల్ రాష్ట్రంలో, రైతులతో కూడిన ప్రజా పార్టీని బలపరిచే ప్రయత్నంలోనూ త్రిపురలోనూ, హరిపూర్ లోనూ జరిగిన అభ్యుదయరచయితల సభావేదిక మీదా నేనూ హుమయూన్ కబీర్ పరస్పర సహకారంతో కలసి పనిచేశాం. గొప్ప స్వేచ్ఛా స్వాతంత్ర రక్షకులైన రైతుజనులకు, స్వేచ్ఛా స్వాతంత్రాలనే ఊపిరిగా తీసుకొని పనిచేస్తున్న అభ్యుదయ రచయితలకు ఈ విధంగా ఏకీకృత దృష్టికలగడం, గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చి చేయీ చేయి పట్టుకొని నడుస్తున్న కవులంవలె ఉన్న మా యిద్దరికీ ఎంతో సంతోషం కలిగించింది.

స్వాతంత్రం రాకపూర్వం వ్యక్తిగత కార్యదర్శిగా, వచ్చిన తరువాత విద్యాశాఖలో ఉపమంత్రిగా, శ్రీ మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ వద్ద పనిచేస్తూ ఆయనకు దగ్గరలో ఉండగలగటం శ్రీ కబీరు అదృష్టమనే చెప్పాలి. ఉర్దూ భాషలో మాత్రమే ప్రవేశమున్న శ్రీ ఆజాద్‌కు దుబాసీగా పనిచేస్తూ, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రతిపాదకులుగా తన సామర్థ్యాన్ని రుజువు చేసుకున్నారు. ఆ తరవాత శ్రీ ఆజాద్‌కు ఆయన స్వీయ చరిత్రను ఇంగ్లీషు భాషలో రూపొందించడంలో సహాయపడ్డారు. శ్రీ జవహర్లాల్ కూడా శ్రీ హుమయూన్ కబీర్ మీద చాలా ఆసక్తి చూపేవారు. అందువల్లనే ఆయన ఆ తరువాత శ్రీ హుమయూన్ స్థానాన్ని కేబినెట్ స్థాయికి పెంచారు.

ఆయన పెట్రోలియం ఉత్పత్తుల శాఖామంత్రిగా పనిచేస్తున్నపుడు, ఇరాన్ ప్రభుత్వంలో సంప్రదింపులు జరిపి, పర్షియన్ ముడినూనెను వెలికి తీసే కార్యక్రమంలో ఉభయ ప్రభుత్వాల మధ్య ఒక ఒడంబడికను సాధించారు. ఈ ఒడంబడిక నూనె విషయంలో పెరుగుతున్న క్లిష్టపరిస్థితుల నుంచి మనకు కొంత సహాయాన్ని చేకూరుస్తుంది. భారతీయ సాంస్కృతికాభివృద్ధి కృషిలో ముస్లింల పాత్రను గురించి, భారతదేశ చరిత్రను పరిశోధించి, ఆయన వెలికి తెచ్చిన అంశాలు, రచనలు పండితునిగా ఆయనను ఉన్నతస్థానంలోకి తీసుకవెళ్లాయి. నిజానికి హిందూ, ముస్లిం మతాల సాంస్కృతిక రీతులలోని సంధానాత్మకమైన ప్రయత్నాలను గమనించి తెలియజెప్పటానికే ఆయన ప్రయత్నించారు.

హైదరాబాదు నగరంలోని సాలార్‌జంగ్ మ్యూజియం సంరక్షణ కోసం అందులోని విలువైన కళాఖండాల రక్షణకు, ముఖ్యంగా మధ్య ఆసియా సంస్కృతిని తెలిపే వస్తువులను పరిరక్షించేందుకు ఆయన సాగించిన కృషిలో నేను కూడా ఆయనతో కలిసి పనిచేశాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుకు కావలసిన నిధులను ఆయన సేకరించగలిగారు. నిజాం రాష్ట్ర విభజన జరిగినపుడు మ్యూజియంను కూడా పంచుకోవాలనే మైసూరు ప్రభుత్వ హ్రస్వ దృష్టిని ఆయన వ్యతిరేకించారు. ఈ మ్యూజియాన్ని ఆయన ఒక జాతీయ సంస్థగా మలచి, దానిని సాలార్‌జంగ్‌కు, హుమయూన్ కబీరులకు గూడా గుర్తుగా ఉండే విధంగా చేశారు.

కబీరుగారు నిజమైన జాతీయవాది. హిందూ-మహమ్మదీయ సఖ్యతమీద ఆయనకు విశ్వాసముంది. జిన్నాకు, ముస్లిం లీగుకు వ్యతిరేకంగా ఆయన మౌలానా అజాద్‌గారితో కలసి అప్రతిహతమైన పోరాటం చేశారు. హిందూ, ముస్లిమ్‌లు ఉభయులలో గూడా పరస్పర సహనం లేకపోవటానికి వ్యతిరేకంగా ఆయన పట్టిన పట్టు విడువకుండా ధైర్యంగా పోరాడారు. పాకిస్తాన్ పాలకులలో ముఖ్యమైన స్థానంలో ఆయన సోదరుడుండడంతో, దేశ విభజన సమయంలో తనపై వచ్చిన ఒత్తిడికి తలవొగ్గటం దురదృష్టకరం. దానిని మరచిపోదాం. ఎందుకంటే ఆయన ఒక హిందూ స్త్రీని వివాహమాడితే, ఆయన కుమార్తె మరొక భారతీయ క్రైస్తవుడ్ని వివాహం చేసుకుంది. ఒక మంచి హిందూ లేదా క్రైస్తవుని లాగానే ఆయన నుంచి అన్ని వేళలానేను గొప్ప సహోదరప్రేమను పొందగలిగాను. 1947లో సంభవించిన మతకలహాల దుశ్చర్యల నుంచి దూరంగా ఉన్నందుకు దక్షిణ భారతదేశ ప్రజలను, నన్నూ ఆయన అభినందించారు.

చూడటానికి ఆయన చాలా పొట్టిగా కనుపిస్తారు. మానసిక పరిణితిలో మాత్రం మహా పొడగరి. ఆయన చాలా మర్యాదస్తుడు. నిష్కపటి. మంచివక్త. ఏదైనా చెప్పేటప్పుడు ఉపాధ్యాయునిలా వివరణతో సహా చెప్పుంటారు. చూసేందుకు నల్లగా ఉండి, సభలో అంత ఆకర్షణీయంగా కనుపించరుగానీ, మనుషులను కదలించే తన నిష్కపటమైన ప్రసంగాల ద్వారా సభను ఆకట్టుకొని అందరిని ఆకర్షించేవారు. సజ్జాద్ జహీర్, జడ్.ఎ.అహ్మద్, అసఫ్ వంటి ఆయన సమకాలీనులైన మిత్రులలాగా ఆయన కమ్యూనిస్టు మాత్రం కాలేదు. జవహర్లాల్, అజాద్‌గార్ల సోషలిస్టు పంథాలో రైతులకు, అన్నిమతాల ప్రజలకు సేవజేసేందుకు, భారతీయ సంస్కృతిని పరిరక్షించేందుకు ఆయన ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. మా ఇద్దరి మధ్య చాలా

అంశాలలో ఏకీభావం ఉండేది.

గురుదేవ్ టాగూర్ శతజయంత్యుత్సవాలు ఆఖరుసారిగా ఆయన తన నిర్మాణ సామర్థ్యాన్ని చూపెట్టేందుకు మంచి అవకాశాన్ని కల్పించాయి. తన కాలాన్ని జ్ఞానాన్ని పూర్తిగా ఆపనికై ఆయన అంకితంచేశారు. బెంగాలీ సాహిత్యం పై ఆయనకున్న ప్రేమ దానిని, భారతీయ, ప్రపంచ సాహిత్యాలతో మేళవింపు చేసేందుకు ప్రయత్నించేలా చేయించింది. ఆయనకున్న నిర్మాణానుభవం దేశంలో ఉన్న అన్ని ముఖ్యపట్టణాలలో రవీంద్ర భవనాలను ఏర్పరచేందుకు, అక్కడ సాంస్కృతిక, సాహిత్య కార్యక్రమాలు కొనసాగేలా చూసేందుకు ఉపయోగపడింది. గురుదేవ్ పాటల్లోని పదకైలి, నాట్యవిన్యాసపు చెత్తులు, సంగీతస్వరగతులు తూర్పు బెంగాల్ ప్రజలను మేధావులను, వారి నాయకుడు ముజిబుర్ రెహమాన్ మనస్సును ఆనంద తరంగాల్లో ఓలలాడించాయి. ప్రపంచ వ్యాప్తంగా అంకిత భావంతోను, అతిసామర్థ్యంతోను హుమయూన్ కబీర్ నిర్వహించిన టాగోర్ శతజయంత్యుత్సవాలు, ఆ తరవాత టాగోర్ కంలో 'సోనార్ బంగ్లా'గా, బంగ్లాదేశ్ ఆవిర్భవించడానికి దోహదం చేసింది.

శ్రీమతి కమలాదేవి

కమలాదేవి ఛటోపాధ్యాయది మంగుళూరు. ఆమె 1903వ సంవత్సరంలో జన్మించారు. లండన్‌లో విద్యాభ్యాసం చేశారు. స్వాతంత్ర్య సమరయోధురాలు. అనేకసార్లు జైలుశిక్ష ననుభవించారు. 1946లో కాంగ్రెస్ కార్యవర్గ సభ్యురాలు. అఖిలభారత కాంగ్రెస్ సంఘప్రధాన కార్యదర్శి. అఖిలభారత మహిళా సంఘం, ఆలిండియా సహకార సంఘం న్యూఢిల్లీ వ్యవస్థాపకులలో ఆమె ఒకరు. ప్రపంచ కళల కేంద్రానికి నాయకురాలు. కుటీర పరిశ్రమల ప్రదర్శనాలయాలను ఏర్పాటు చేశారు. ప్రపంచమంతా విస్తృతంగా పర్యటించారు. రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యురాలు, కాంగ్రెసు సోషలిస్టు పార్టీ నాయకురాలు. ఆలిండియా కిసాన్ కాంగ్రెస్ నాయకురాలు. కిసాన్ ఉద్యమాలలో రంగంగారికి సహకారాన్నందిస్తూ కృషి చేశారు. నెహ్రూగారికి, అనేక ఇతర కాంగ్రెస్ నాయకులకు మంచి స్నేహితురాలు. మిత్రరాజ్యసమితి కమీషన్‌లు చాలావాటిలో ప్రతినిధిగా పాల్గొన్నారు. సామాజిక సేవకు గుర్తింపుగా మెగసేసే అవార్డును పొందారు. ప్రపంచ స్త్రీల మహాసభకు ప్రతినిధిగా వెళ్లారు. మానవహక్కుల కోసం పోరాడిన గొప్ప కార్యకర్త. – (ఎడిటర్).

శ్రీమతి కమలాదేవి మన స్వాతంత్ర్య సమర యోధులలో ప్రముఖుల్లో ఒకరు. బొంబాయినగరంలో 1930 సత్యాగ్రహ సమరంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దీర్ఘకాలంగా పోరాటం జరిపి ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకున్నారు. ఆనాటి బొంబాయి పోరాటంలో ఆమె ఆధ్వర్యంలో పనిచేస్తున్న మహిళా వాలంటీర్లను చూసి అప్పటి వైస్రాయ్ లార్డ్ ఇర్విన్ ఒక్కసారి విరుచుకు పడుతున్న ఈ మహిళా కార్యకర్తల జాతీయోద్యమాన్ని తాను నిరోధించలేనని చెప్పాడు. కమలాదేవికి దేశమంతా జయజయ ధ్వానాలు పలికింది. ఒక్కసారిగా ఈ ఉద్యమం ద్వారా విశేష గౌరవ ప్రతిష్టలను ఆమె ఆర్జించుకోగలిగింది. కమలాదేవి కర్నాటక రాష్ట్రానికి చెందిన మంగుళూరులోని సంస్కార వంతమైన మేధావుల కుటుంబంలోంచి వచ్చింది. ఈ శతాబ్దం ప్రారంభంలో ఆమె మద్రాసు విశ్వవిద్యాలయంనుంచి శ్రీమతి రాధాబాయ్ సుబ్బరాయన్, శ్రీమతి కృపానిధి గార్లతో కలసి డిగ్రీ తీసుకుంది. ఆ రోజుల్లో డిగ్రీ పుచ్చుకున్న స్త్రీలు అరుదు. ఆమెకు లలిత కళల్లో శ్రద్ధ ఎక్కువ. ప్రజావేదికల మీద రంగస్థలంలోనూ దక్షిణాది సాంస్కృతిక కార్యక్రమాలలో ఆమెకు మంచి పేరుండేది.

శ్రీమతి భారతీదేవి రంగా 1927 వ సంవత్సరంలో ఊటీలో ఆమెను ఒక వేదికపై నాట్యం చేస్తున్నపుడు చూశారు. అక్కడ ఆమెను కలుసుకొని కవిత్వంలోనూ, చిత్రలేఖనంలోనూ, నటనలోనూ ఆమెకున్న అభిరుచిని అభినందించారు. నేను 1931వ సంవత్సరంలో బొంబాయిలో జరిగిన ఎ.ఐ.సి.సి. సభల సందర్భంలో ఆమెకు బాగా సన్నిహితుణ్ణి అయ్యాను. కరాచీ ప్రాథమిక హక్కుల చార్టరుకు రైతులను సమర్థిస్తూ భూస్వామ్య పద్ధతులన్ను వ్యతిరేకిస్తూ కాంగ్రెసు కార్యవర్గం తరపున జవహర్లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన అనేక తీర్మానాలను ఆమె సమర్థించడం నేను

గమనించాను. మహళల హక్కులకోసం ఆమె ప్రతిపాదించిన కొన్ని తీర్మానాలను ఆ సందర్భంలో నేను బలపరిచారు. జమీందారుల జులుంనుంచి రైతులను కాపాడేందుకు, తాలూకు దార్ల దౌర్జన్యాలను అరికట్టేందుకు, జమీందారులు భూస్వాముల అరాచకత్వంనుంచి మిల్లు యజమానుల దోపిడీనుంచి రైతాంగ రక్షణకు ఈ చార్టరును విస్తృతపర్చడానికి మేమిద్దరం పట్టుదలతో కృషిచేశాం. కమ్యూనిస్టులు, వారి సానుభూతిపరులు దీనిని గమనించి ఏ.ఐ.సి.సి. వేదిక మీద జరిపిన మా సామ్యవాద కృషిగా దానిని అభినందిస్తూ మా ఇద్దరను గౌరవించేందుకు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ప్రజాసమస్యల విషయంలో మా ఇద్దరికి సాంఘిక సామాజిక పురోభివృద్ధిని గురించి ఏకాభిప్రాయం ఉందనే విషయాన్ని మేము గ్రహించాం. ఆ తరవాత కాంగ్రెస్‌లోని అభ్యుదయ వాదులతో పూనాలో అనధికార ఏ.ఐ.సి.సి. సమావేశం జరుపుతున్నప్పుడు పూనాలోని గోఖలే హాలులో నేను సంధానకర్తగా ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశాను. గాంధీజీ జైలునుంచి బైటకు వచ్చిన తరవాత అస్వస్థులుగా ఉన్నప్పుడు ఆమె ఆయనను చూడటానికి వెళ్లినపుడు నేనామెను ఆహ్వానించాను. కాంగ్రెస్ పార్టీ పరిధిలోనే సోషలిస్టు ఫోరమ్‌ను స్థాపించేందుకు చిత్తు ముసాయిదాను తయారు చేయడంలో ఆమె తోడ్పాటును నేను తీసుకొన్నాను.

ఆ తరవాత 1934వ సంవత్సరంలో పాట్నాలో జయప్రకాష్ నారాయణ్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ సోషలిస్టు సభకు మేమిద్దరం హాజరయ్యాం. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ నిబంధనావళిని తయారుచేసేటప్పుడు ఇంతకు ముందు ఆమె రూపొందించిన దానిని వారు ఉపయోగించుకున్నారు. అప్పటినుంచి అది తిరిగి ప్రజా సోషలిస్టు పార్టీలో విలీన మయ్యేంతవరకు దాదాపు పది సంవత్సరాలకు మించి ఆమె దానితో ఉన్నారు. నిజానికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత సోషలిస్టు నాయకులకు విశ్వాసపాత్రురాలిగా ఉన్నందువల్ల రాజకీయంగా నష్టపోయిన వారిలో ఆమె ఒకరు. రాజ్యాంగ నిర్మాణ సభ సభ్యత్వానికి ఆమె రాజీనామా ఇచ్చిన తర్వాత సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ పోటీనుంచి తప్పుకొంది. జవహర్లాల్ నెహ్రూగారిచే కేంద్ర మంత్రి మండలిలోనికి ఆహ్వానించబడే అవకాశాన్ని ఆవిధంగా ఆమె కోల్పోయారు. ఆమె అనుభవాలలోను, ప్రయత్నంలోను ఎంతో గౌరవం ఉన్న నెహ్రూకు ఆమె సహకారంమీద ఎక్కువ ఇష్టం ఉండేది. 1936వ సంవత్సరంలో దక్షిణ కెనరా జిల్లాలో ఆమె ఆహ్వానం మీద కాంగ్రెస్ పార్టీ సోషలిస్టు నాయకులు పర్యటించి అక్కడ చూసిన విశేషాలు, పొందిన అనుభవాలు నెహ్రూజీకి వివరించినపుడు ఆమె పట్ల గౌరవం కలిగింది. 1934లో నేను కూడా అలాగే మలబారు జిల్లాలో శ్రీ శంకరన్ నంబూద్రిపాద్‌గారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని అక్కడ రైతులను సమీకరించి సంఘటిత పరచి ముందుకు నడిపించేందుకు పర్యటించాను. కిసాన్ ఉద్యమంలో ప్రజాస్వామ్యపరమైన ఆలోచనకు ఆమె ఇప్పటికీ అనుకూలంగానే ఉన్నారు. నంబూద్రిపాద్ రైతులను కమ్యూనిస్టులలో కలపాలని ప్రయత్నించారు. మేము ముగ్గురం మూడు మార్గాలలో గమ్యాలవైపు నడుస్తున్నా రైతాంగానికి పూర్తి అభిమాన పాత్రులుగా ఉన్నాము.

ప్రజా సేవారంగంలో ఏ పద్ధతులు కొనసాగుతున్నప్పటికీ ఆమె తన మిత్రులందరికీ ఎప్పుడూ విశ్వాస పాత్రురాలిగా ఉంటూ ఉండేది. 1936వ సంవత్సరంలో అఖిలభారత

కార్యకర్తల సమావేశం మద్రాసులో ఏర్పాటు చేసినప్పుడు ఆమె మాతో సహకరించారు. దానిని రాజేంద్రప్రసాద్ గారు ప్రారంభించగా శ్రీమతి సరోజినీదేవి, శ్రీమతి కమలా దేవిగార్లు అందులో ఉపన్యాసకులుగా పాల్గొన్నారు. ఆమె సంపోప్రకారం ఉత్తర భారతదేశంలోని కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి చెందిన కిసాన్ కార్యకర్తలతో ముఖ్యంగా జయప్రకాశ్ నారాయణ్, మోహన్ లాల్ గౌతమ్, డాక్టర్ రామమనోహర్ లోహియా గార్లతో నేను సంప్రదించి మీరట్‌లో 1935వ సంవత్సరంలో ఆలిండియా కిసాన్ కార్యకర్తల సభను ఏర్పాటు చేశాను. ఆ సభకు 1936వ సంవత్సరంలో ఆమె అధ్యక్షత వహించగా నేను ప్రారంభించాను. కిసాన్ కాంగ్రెస్‌లో చేరి బలపరచవలసిందిగా ఆ సందర్భంలో ఆమె సోషలిస్టులను కోరారు. ఆ తరువాత 1936లో లక్నోసభలో పూర్తి స్థాయి అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌ను నేను ప్రారంభించగా, దానికి నేను అధ్యక్షుడిగా, స్వామి సహజానంద సరస్వతి జయప్రకాశ్ నారాయణ్, మోహన్‌లాల్ గౌతమ్‌గార్లు సెక్రటరీలుగా ఉన్నారు. భారత రైతాంగానికి ఒక అఖిలభారత వేదికను కల్పించేకృషికి కమలాదేవి విలువైన సేవలను అందించగలిగారు.

ఒక గట్టి మహిళా ఉద్యమాన్ని నిర్మించవలసిన అవసరం ఉందని ఆమె గ్రహించి గొప్ప కాంగ్రెసునాయకురాలైన సరోజినీదేవిగారితోను, శ్రీమతి కజిన్ గారితోను, శ్రీమతిరామారావు మరి కొందరితో కలిసి అఖిలభారత మహిళా సంఘానికి రూపకల్పన చేశారు. శ్రీమతి సరోజినీదేవి, ఆమె, భారతస్త్రీలు రాజకీయాలలో ప్రవేశించి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఈ వేదిక మాత్రమే చాలదనుకొని జాతీయ రంగంవైపు దృష్టిని మరల్చారు. శ్రీమతి భారతీదేవి, దుర్గాభాయ్‌గార్లవంటి అనేకమంది గాంధేయమార్గంలో పనిచేస్తున్న సత్యాగ్రహులు ఈ కొత్తబాటలో పయనించేందుకు వారితో కలసి ముందుకొచ్చారు. ఆ తరువాత రాష్ట్రాలలో మహిళల రాజకీయ సభలను నిర్వహిస్తూ గాంధీజీ పిలుపుననుసరించి దేశ స్వాతంత్ర్య సమరంలో పాల్గొనేందుకు ఎక్కువగా మహిళలను సమీకరించగలిగారు. ఆమెతో పాటు ఇతర కాంగ్రెస్ మహిళా సత్యాగ్రహురాండ్రు ఈ విధంగా ఒక పీరోచితమైన నిర్మాణాత్మక కృషికి పూనుకొన్నారు.

కమలాదేవి గుజరాతీ కవయిత్రి శ్రీమతి లీలావతి మున్షీకి తమ తోడ్పాటునందించగా శ్రీమతి రామారావు వారితో పాటు అఖిలభారత మహిళా సంఘానికి చెందిన ఇతరులు హిందూకోడ్ బిల్లును సవరించేందుకు స్త్రీలకు ఆస్తి హక్కును సాధించేందుకు కృషిచేశారు.

ఆమెకు మొదటి నుంచి వున్నట్లుగా లలితకళలు, చేతిపనులపై ప్రత్యేక ఆసక్తి ఉండడాన్ని గమనించిన నెహ్రూ ప్రభుత్వం కుటీర పరిశ్రమలను, అందుకు సంబంధించిన చేతి వృత్తుల వారిని అభివృద్ధిపరచవలసిందిగా ఆమెను ఆహ్వానించారు. చేతి వృత్తులను, వాటికి కావలసిన ప్రదర్శనలను, విక్రయశాలలను బాగా పెంపుదలచేసి చేతివృత్తుల వ్యాప్తికి ఈ సందర్భంలో ఆమె తోడ్పడ్డారు. ఈనాడు మన మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఇళ్లల్లో అలంకారంగా పెట్టుకుంటున్న అందమైన వస్తువులకు ఎంతో విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జించడానికి ఆమె చేసిన కృషే ఆధారం. లక్షలాది మన చేతి వృత్తులవారు సుఖంగా

గౌరవప్రదంగా జీవించడానికి అర్థశతాబ్దంగా శ్రీమతి కమలాదేవి చూపిన శ్రద్ధ, తెలివి ప్రధాన కారణాలు. దేశమంతటి మీద కళాభిమానులైన వారి సహకారంతో ఆమె చేతి కళలను వస్తువులను తయారు చేయించి వాటికి మంచి మార్కెట్‌ను తీసుకురాగలిగారు.

అఖిలభారత కాంగ్రెస్ సంఘానికి మొదటి మహిళా కార్యదర్శిగా చక్కటి రాజకీయ ప్రధానమైన ప్రాముఖ్యాన్ని ఆమె ప్రదర్శించి చూపెట్టగలిగారు. ఈ స్థానం శ్రీమతి సరోజినీ దేవిగారి తరవాత రెండవది. అంతకు ముందే ఆమె కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షురాలు కాగలిగారు. పిరి తరవాత మృదులా సారాభాయ్, సుచేత కృపలాని, మరగతం చంద్రశేఖర్‌లు కాంగ్రెస్ సంస్థకు సాధారణ కార్యదర్శులుగాను, శ్రీమతి ఇందిరాగాంధీ అధ్యక్షురాలుగాను పనిచేశారు.

ఆ విధంగా వారు దేశ నాయకత్వంలో స్త్రీలకు ప్రముఖ స్థానాన్ని సాధించి గొప్ప గౌరవాన్ని సాధించగలిగిన వారైనారు.

శ్రీ హెచ్.వి.కామత్

శ్రీ హెచ్.వి.కామత్ ఇరవై సంవత్సరాలపాటు రాజ్యాంగ నిర్ణాయక సభలోను, పార్లమెంటులోను నాతో సహ సభ్యులుగా ఉన్నారు. వెస్ట్రన్ కోర్టులో మూడు సంవత్సరాలకాలం మేమిద్దరం భోజన సమయంలో పక్కిపక్కినే కూర్చుంటూ వుండేవాళ్లం. ఆయన ముందు వేడివేడి ఆహార పదార్థాలు, సీసాల కొలది ఊరగాయలు, పెట్టివుంచే కాళ్ల బాగా చాపుకొని ఆ సమయంలో ఆయన కూర్చునే పద్ధతి చూస్తుంటే చూడడానికి ఇంపుగా కనిపించేది. సాయంత్ర సమయాలలో కూడ ఆయన భారతీయ యూరోపియన్ అతిధులైన స్త్రీ,పురుషులతో ఎంతో ఆనందంగా గడుపుతూ వుంటే ఉత్సాహకరమైన ఆయన స్వభావం మనకు చూడడానికి పోయిగా ఉండేది.

ఆయనకు దాదాపు భారతీయ భాషలన్నీ తెలుసు. ముఖ్యంగా దక్షిణాది భాషలో పూర్తిగా పరిచయముంది. ఇంగ్లీషు, ఫ్రెంచి భాషలలోను, సంస్కృతం, లాటిన్ భాషలలోను పండితులు. ఆయన నన్ను ప్రతిసమయంలోను 'రంగా గురూ' అని గొప్పగా సంబోధిస్తుండేవారు. మేము ఆయన టేబిలు దగ్గర కలుసుకున్నప్పుడు ఎక్కువగా సంభాషణలతో గడుపుతూ ఆయన చెప్పే అంశాన్ని బిగ్గరగా వివరణాత్మకంగా తెలియజేస్తూ దానిని సమకాలీన ప్రజా సమస్యలపై వాద ప్రతివాదాలలోకి తీసుకెళ్తుండేవారు. ఆయన డిన్నరులో కూర్చున్నప్పుడు నిదానంగా కావలసిన వాటిని తీసుకుంటూ ఓ గంటకు పైగా సమయం తీసుకునేవారు. ఆ విధంగా తమకు కావలసిన విధంగా సంతృప్తికరంగా భోజనం చేసేందుకు తన అతిధులకు కూడా సమయాన్ని కల్పించినట్లే. ఇది పశ్చిమదేశాల మేధావులు, రాజకీయనాయకులు అవలంబించే పద్ధతి. కామత్ గారు డైనింగు టేబిలు వద్ద కూర్చున్నప్పుడు వెస్ట్రన్ కోర్టు హాలు ఒక పర్షియన్ క్లబ్బు లాగా ఉండేది.

స్వామీజీల వలె దుస్తులు ధరించిన కొందరు, శుద్ధ ఖద్దరును ధరించిన కాంగ్రెస్ వారు ఎందరో ఉన్నప్పటికీ పార్లమెంటులో కామత్ బట్టల శైలి ఒక ప్రత్యేకమైనది, అనితరమైనది. మోకాళ్ళ కిందికి వేలాడుతూ ఉండే ఆయన చొక్కాలు, వదులైన పైజామాలు, రంగురంగుల దీర్ఘమైన ఆయన ధరించే తల టోపీలతో ఆయన పార్లమెంటులో నీటుగా నడుస్తుంటే చూడడానికి ఎంతో ముచ్చటగా ఉండేవారు. పార్లమెంటులో ఆ శైలి మాత్రమే ప్రత్యేకమైనదిగా కనిపిస్తుండేది.

ప్రశ్నల సమయంలో అధికారపక్షానికి ఆయనను చూస్తే తరచు భయం కలుగుతుండేది. తమాషా మాటలతో, స్థానిక ప్రయోగాలతో నిర్లక్ష్యంగా ఆయన మాట్లాడుతుంటే సగం మాత్రమే చదువుకున్న పూర్తి సామర్థ్యం లేని మంత్రులు ఆ సమయాన్ని ఎదుర్కోవడానికి జంకేవారు. ఆయనకున్న గొప్ప ఊహాశక్తితో, ఆలోచనా జ్ఞానంతో ప్రవేశపెట్టిన అనేక అంశాల మీద వివరణ

ఇచ్చేందుకు మంత్రులు విఫలమైన అనేక సందర్భాలలో సరిదిద్దుకునేందుకు వీలుగా ప్రశ్నల సమయం తరువాత పార్లమెంటు సాధారణ చర్చ ప్రారంభించడానికి మధ్య విరామాన్ని తీసుకునే పద్ధతికి ఆయనే దారి చూపించేవారు. ఆయన ధోరణి ఒక్కోమారు స్పీకరుకు కూడా హడలెత్తిస్తుండేది. కామత్ ఈ కృషికి లోహియా గ్రూపు కమ్యూనిస్టులు, కూడా తోడు కావడంతో పార్లమెంటులోని జీరో అవర్ ఒక విశిష్టమైన స్థానాన్ని సంతరించుకుంది.

ఆయన మంత్రులతో వివాదాలకు దిగిన కొన్ని సందర్భాలలో అవసరమైనప్పుడు నేను ఆయనను సమర్థిస్తూ ఉండేవాడని. కొన్ని సందర్భాలలో ఆయన ప్రయోగిస్తున్న బాణాలవేడిని నేను తగ్గిస్తూ వుండేవాడిని. నా ప్రమేయాన్ని ఆయనెప్పుడూ కోపగించుకునే వారు కాదు. ఎవరైనా సభ్యులు రంగాగారి విమర్శను మీరెందుకు గట్టిగా ఎదుర్కోరు అని అంటే ఆయన జవాబు చెప్తూ, సుభాష్ బాబు (సుభాష్ చంద్రబోసు)గారి రోజుల్నుండి రంగాగారు నాకు చాలా ఇష్టమైన ముఖ్య స్నేహితులు అని బదులిస్తుండేవారు.

ప్రభుత్వ వైఫల్యాలను ముఖ్యంగా అనేక వేర్వేరు కమిటీలు సమర్పించిన వాటిలో హామీలు, అధికార బిల్లులు, పబ్లిక్ ఎకౌంట్స్, అంచనాలు హామీలను గురించి శ్రీ కామత్ పండితుల లాగా ఆత్రంగా ప్రతి అంశాన్ని చదువుతూ డేగచూపుతో అందులో ఉన్న లోపాలను వెతికి పట్టుకుంటూ వుండేవారు. మంత్రుల వైఫల్యాలకు సంబంధించిన అంశాలపై మేమిద్దరం గట్టిగా మాట్లాడుతూ వుండేవాళ్లం. అయితే ఆయా సందర్భాలలో ఆయన ఆ భారాన్ని నాపై ఎక్కువగా మోపుతూ ఉండేవారు. మధులిమాయే ఆ తరువాత ఈ ప్రయత్నంలో మమ్మల్ని మించిపోయారు. ప్రజా సమస్యల విషయంతో ముందు కామత్, ఆ తరువాత మధులిమాయే సభకు క్షమాపణ చెప్పవలసిందిగా మంత్రులను వత్తిడి చేస్తుండేవారు. శ్రీ కృపలానీ అలవాటు ఆయన వ్యంగ్యోక్తులతో మంత్రులకు భయం కలిగిస్తుంటే కామత్‌గారు నిర్దయతో కూడిన వ్యాఖ్యలతోను పరిశీలనాత్మకమైన అంశాలను వెలికి తీస్తూనో వారిని అంతకంటే హడలు కొడుతుండేవారు. నిరూపణకు నిలబడగలిగిన భయంకరమైన అనేక వాస్తవాలను కామత్‌గారు వెలికితీస్తూనే బయటికి తెస్తుండేవారు. అప్పుడప్పుడు స్పీకర్ "ఆర్డర్, ఆర్డర్" అని ఆయనను హెచ్చరించవలసి వస్తుండేది.

కామత్, లోహియా గార్లు ఇద్దరూ కూడా నెహ్రూ కుటుంబం అంటే పూర్తి వ్యతిరేకంగా ఉంటూ ఉండేవారు. జాతీయ రంగస్థలం మీద ఏ చిన్న పొరపాటు జరిగినా దానిని వారు పూర్తి శ్రద్ధతో బయటికి తెస్తుండేవారు. ఈ విషయంలో రాయబారిగా పనిచేస్తున్న శ్రీమతి విజయలక్ష్మి పండిట్ వారికి ప్రధాన లక్ష్యంగా ఉండేది. నెహ్రూగారి అభిమానానికి పాత్రుడయిన శ్రీ వి.కె.కృష్ణమీనన్ అంటే కూడా కామత్‌గారికి తగని కోపం. కామత్ లోహియా గార్ల ఈ దృష్టితో నేను కలిసే వాడ్నికాదు. వారి విమర్శలను నేను ఎదుర్కొన్నప్పుడు ఎప్పుడైనా వారు నాపై కోపం ప్రదర్శించేవారుకాదు.

జవహర్లాల్ గారికి సంబంధించినంతవరకు కామత్ పూరికినే కోపం తెప్పించే ఒక అకారణమైన శత్రువు. పార్లమెంటు విధానాలకు సంబంధించి నిర్భయంగా ఆయన కోరే

కోర్కెలను అతి శ్రద్ధతో గమనిస్తూ ఉండేవారు. అల్లా ఉంటున్నప్పటికీ కొన్ని సందర్భాలలో నెహ్రూ బాగా ఆసహనంతో చర్చలకు దిగుతుండేవారు. అటువంటి సందర్భాలలో వారిద్దరిమధ్య సంఘర్షణను నివారించడం మానవమాత్రులకు సాధ్యంకాదు. సత్యమూర్తి, భూలాభాయ్ గార్లమేరకు కూడా కామత్ తన ప్రసంగాలను చక్కని ఉపన్యాసధోరణిలో అందించలేరు. మంచి పదాలకోసం ఆయన కుంజ్రూగారివలె తడుముకుంటూ ఉండేవారు. వేగవంతమైన ఆయన ఆలోచనను తెలియజేసేందుకు కొన్ని సందర్భాలలో సగం సగం మాటలను కొన్ని సందర్భాలలో పూర్తి మాటలను ఆయన చెప్పుండేవారు. ఆయన ప్రసంగాన్ని ఒకటికి రెండుసార్లు విన్నవాళ్లు పెద్దగా మాట్లాడే ఆయన ధోరణికి అలసట చెందినట్లు కనిపిస్తుండేవారు. ఒకసారి ఆయన వ్యక్తిత్వాన్ని, పాండిత్యాన్ని పార్లమెంటరీ పద్ధతుల పట్ల అనుసరించే గౌరవ విధానాన్ని ప్రదర్శించే నిపుణత్వాన్ని చూసిన తరువాత ఈయన ఎంత సమర్థుడు, నిపుణుడు అయిన దేశభక్తుడు అని అనుకుంటూ ఉండేవారు. సభ ముగిసిన తరవాత బయట ఆయనను కలిసిన వారందరితోను ఎంతో సంతోషంతో నవ్వుతూ ఆనందంతో మాట్లాడుతూ గొప్ప సంస్కారవంతంగా ఉంటుండేవారు. కామత్‌గారు నేను త్రిపురలో రాజీ లేని పోరాటసభ జరిపినప్పుడు ఇద్దరం పోజరైనాము. ఆ తరువాత 1939 సంవత్సరంలో నాగపూరులో సామ్రాజ్యవాద వ్యతిరేక సభ జరిగినప్పుడు అందులోనూ మేమిద్దరం పాల్గొన్నాము. ఈ రెండు సభలకు సుభాష్ చంద్రబోసుగారు అధ్యక్షత వహించారు. కామత్‌గారు ఐ.సి.యస్.కు రాజీనామా ఇచ్చి బయటికి వచ్చిన తరవాత పండిత నెహ్రూ సుభాష్ చంద్రబోస్‌గార్లు ఇద్దరూ ఆయనను కాంగ్రెస్ కమిటీలోకి ఆహ్వానించారు. అయితే శ్రీ కామత్ మాత్రం నెహ్రూ గారి కన్నా శ్రీ సుభాష్ చంద్రబోస్ గారికి ఎక్కువ సన్నిహితంగా ఉండేవారు. ఆ రోజుల్లో పార్లమెంటులోను, బయటా కూడా మేమిద్దరం మంచి మిత్రులుగా ఉండేవాళ్లం. సుభాష్ చంద్రబోస్‌గారితో కలసి వామపక్ష సంఘటనలో మేమిద్దరం పనిచేశాము. అంతేకాకుండా కామత్ ఫార్వర్డ్ బ్లాకులో ఓ ముఖ్య సభ్యులు కూడా. కామత్‌గారు బోసు పద్ధతి సోషలిస్టులు, నేను గాంధేయ సోషలిస్టును, ఇద్దరం కూడా నేతాజీ మార్గ జాతీయవాదులము. ఆయన సుభాష్‌ను ప్రేమించే బెంగాల్ విప్లవకారులంటే ఎక్కువ ఇష్టంగా వుంటుండేవారు. కాంగ్రెస్ అహింసావాదం మీద నేను ఎక్కువ ఆసక్తి కనబరుస్తూ వుండేవాడిని. కామత్‌గారు సౌత్ కెనరా జిల్లాలనుంచి ఒక గొప్ప విజ్ఞానధనులైన కుటుంబంనుంచి పైకి వచ్చారు. వారి సోదరులలో ఒకరు పేరుపొందిన ఐ.సి.యస్. ఆఫీసరు. కామత్‌లాంటి వారు స్వాతంత్ర్య పోరాటంలో అనేక మంది ఉండవచ్చు. అయితే సుభాష్ చంద్రబోసుగారు చేసినట్లుగానే విలువైన ఐ.సి.యస్.పదవికి రాజీనామాచేసి ప్రతిఫలరహితమైన ప్రజా సేవలో పాల్గొంటూ జైలు జీవితాన్ని అనుభవించి అనేక కష్టాలను పొంది పార్లమెంటరీ ఎన్నికలలో ఓటమిని చవిచూసినప్పటికి అధైర్యాన్ని దరిచేరనీయని ధైర్యవంతులు వీరు ఒక్కరే. ఆయనకు సర్వజన సమానత్వమంటే చాలా ఇష్టం. కులం, హోదా, డబ్బు ద్వారా అధికులమని భావించే మనస్తత్వాన్ని ఆయన పూర్తిగా అసహ్యించుకునేవారు. సమర్థులు, నిపుణులు, మేధావులయిన ఇటువంటి పార్లమెంటు సభ్యులు బహుకొద్దిమందే మనకు కనిపిస్తారు. ఆయనకు స్నేహితుడిని కాగలిగినందుకు నేను గర్వపడుతున్నాను. నిజంగా ఆయన ఓ ఆరుదైన గొప్పవ్యక్తి.

కామత్ మంచి కలంజీవి. భవాన్స్ జర్నల్‌లో జవహర్లాల్‌పై ఆయనచే రచించి ప్రచురించిన వ్యాసం ఆయన పాండితీ ప్రకర్షకు, శైలికి ఓ గొప్ప ఉదాహరణ. రాజాజీగారితో వారు జరిపిన ఇంటర్వ్యూ వారినో పత్రికా రచయితగా, రాజకీయ విజ్ఞానిగా మనముందు ఉన్నతస్థాయిలో నిలబెట్టగలదు.

ఆయన ప్రముఖ పార్లమెంటరీ నాయకుడిగా పేరు తెచ్చుకున్నప్పటికి స్వతంత్రమైన ఆయన ధోరణి పార్లమెంటులో ప్రజా సోషలిస్టు పార్టీనాయకత్వాన్ని చాలాకాలం వరకు ఆయనకు అందకుండా జేసింది. ఏదైనా ఒక అంశంపై గాని కార్యక్రమంపై గాని ఆయన తరచు కొత్తదారులు తొక్కుతూ మారుతూ ఉండేవారు. మాజీ ఫార్వర్డ్ బ్లాకులో ఉన్న సోషలిస్టులందరిలో ఈయన చాలా ముందు చూపున్నవారు. ప్రజా సోషలిస్టు పార్టీ ద్వారా ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తూ వచ్చారేతప్ప ఆయన బాగా ప్రజలలో పాదుకున్న ఏ సంస్థకు అనుబంధింప బడలేదు.

గట్టి ప్రతిపక్ష సభ్యునిగా ఉంటూ కామత్ పార్లమెంటులో నిర్మాణాత్మకమైన సేవలనందించేవారు. నాలాగే ఆయన కూడా పార్లమెంటులో ప్రవేశించడానికి గట్టి పోరాటం జరుపుతూ వుండేవారు. ఆ పోరాటాలన్నిటినీ ఆయన చిరునవ్వుతో స్వీకరిస్తుండేవారు.

ఆయన ప్రతిపక్ష నాయకునిగా ఉంటున్నప్పుడు పరిపాలనా సంస్కరణల సంఘ సభ్యులు కావడం ఆయనకు లభించిన ఓ బంగారు అవకాశమని చెప్పవచ్చు. ఎందుకంటే తనలాగే కచ్చితంగా వుండే శ్రీ మురార్జీదేశాయ్, హనుమంతయ్యగార్లు ఇద్దరూ గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారే. వారితో కలిసి ఆ కమీషన్‌లో పనిచేయగలగడం నిజానికి ఆయనకో గొప్ప సంగతి. ఆ హైపవర్ కమిటీ సమర్పించిన సిఫార్సులలో కామత్‌గారి కృషి ప్రత్యేకంగా ఎన్నదగినది. కమీషన్ సూచనలలోని లోక్‌పాల్, లోకాయుక్త వ్యవస్థల ఏర్పాటుకు సంబంధించి చేసిన నిర్మాణాత్మకమైన సూచనలలో ఎక్కువ బాధ్యతను తీసుకొన్న వ్యక్తి శ్రీ కామత్‌గారే. కామత్ పార్లమెంటరీ స్థానానికి తాను గెలుస్తానా లేదా అనే అంశాన్ని ఎప్పుడూ పట్టించుకోకుండా ఈ కమీషన్ నివేదికను తయారు చేయడంలో పూర్తి ఆత్మ విశ్వాసాన్ని కలిగిఉండి గొప్ప నిర్ణయాలు చేశారు.

రాజ్యాంగ నిర్ణాయక సభలో కామత్‌గారు చేసిన ప్రసంగాలు రాజ్యాంగ చరిత్ర పరిశీలకులైన విద్యార్థులకు ఎంతో ఆసక్తికరంగా ఉండేవి. రాజ్యాంగ ప్రమాణాలు, ప్రాధమిక సూత్రాలు రూపొందించే కృషిలో ఆయన చాలా కష్టపడి పనిచేశారు. స్విట్జర్లాండు పద్ధతిలో ప్రజాభిప్రాయ సేకరణ, తిరిగి పిలవడం వంటి ఉపదేశిక సూత్రాలను రాజ్యాంగంలో చేర్పించాలని ఆయన ప్రయత్నించారు. ప్రకాశం పంతులుగారు, నేను దానిని సమర్థించాను కాని, ఆంగ్లో అమెరికన్ పద్ధతిలో వున్న రాజ్యాంగపండితులు మాత్రం దానిని అంగీకరించలేదు. స్వీడన్ లోవున్న పద్ధతిని అనుసరించి అవినీతిపరులైన మంత్రులు, పరిపాలకులపై చర్య తీసుకునేందుకు ఉద్దేశితమైన లోక్‌పాల్, లోకాయుక్త వంటి వాటికి కూడా ఇదే గతి పట్టింది. స్వీడన్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇంగ్లండు, వంటి దేశాలలో ఉన్న రీతులను పరిశీలించి సూచించిన ఈ సూచనలు కూడా ఇంత వరకు పార్లమెంటులో చట్టం కావడానికి నోచుకోలేదు.

శ్రీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్

1970వ సంవత్సరంలో రెండు నెలలపాటు మనదేశమంతా పర్యటిస్తూ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌గారు గాంధీజీ చూపించిన మానవతావాదంవైపు ప్రజలను తీసుకెళ్తూ మనదేశానికి గొప్ప సేవ చేశారు. ఆయన మన మధ్య వుండడంతో ఇక్కడ ఉన్న వేర్వేరు మతాలమధ్య మరొక్కసారి స్నేహం, సౌభ్రాతృత్వం పెంపుదలకు అది ఎంతగానో దోహదపడింది.

ఆయనను ఫక్తూనిస్తాన్‌కు తిరిగి రావలసిందిగా ఆయన పుత్రుడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, పాకిస్తాన్‌లోని ప్రముఖ ప్రతిపక్ష నాయకులలో ఒకరు, మరొకరు పాకిస్తాన్ ప్రధానమంత్రి భుట్టో, ఆ తరువాత ఆయన పాకిస్తాన్‌లో జైలులో వుంచబడ్డారు. వారిద్దరూ అబ్దుల్ గఫార్ ఖాన్‌గారిని కోరారు. ఫక్తూనిస్తాన్ స్వాతంత్ర్యం కోసం అప్పటికి కొన్ని దశాబ్దాల కాలంనుండి గఫార్‌ఖాన్‌గారు పనిచేస్తూ వున్నారు. – (ఎడిటర్)

ఆయన మనదేశాన్ని వదలిపెట్టిపోతున్న సమయంలో మనదేశ ప్రజలంతా ఒక స్వంత మనిషిని వదులుకుంటున్నట్లుగా భావిస్తూ, ఆ సమయంలో దేశమంతా అలుముకున్న గాంధేయవాతావరణంలో విలవిలపోయారు. ఆ సమయంలో కాంగ్రెస్ పక్షంలో ఉన్న రెండు వర్గాలు అధికారంకోసం, హక్కులకోసం సిద్ధాంతాలను పక్కికునెట్టి ఒకదానితో మరొకటి, ఒకరితో మరొకరు పోరాడుకుంటూ ఉన్నారు. ఆ సమయంలో బాద్‌షా ఖాన్‌రాక, ఆయనతో జరిపిన చర్చలు మన ప్రజను గాంధీజీయే మన మధ్య ఉన్నట్లుగా భావించుకొనేలా చేసి ధర్మచింతనవైపు మనలను లాక్కెళ్లాయి. ఆయన ఏం చెప్పారు అనే దానికన్నా ఆయన మన మధ్య వున్నందువల్లనే మన ప్రజలు ఎక్కువగా ప్రభావితులైనారు.

త్యాగంతో ఆత్మార్పణతో ప్రార్థనలతో నడచిన ఆయన జీవితం ఎంతో గొప్పది. నిజంగా ఆయనో గొప్ప రాజకీయ మహర్షి. ఆయన మనమధ్యవుంటే భారతదేశంలోను, ఇతరులదృష్టిలోకూడా బాపూజీ మనమధ్య ఉన్నట్లే..

గత నలభై సంవత్సరాలుగా ఆయనను ఎరిగివుండడం నాకో ప్రత్యేకత. 1935–36 సంవత్సరాలలో సెంట్రల్ అసెంబ్లీలో బాద్‌షాగారి సోదరుడు డాక్టరు ఖాన్ సాహెబ్ గారు నాకు సహసభ్యులు. వ్యక్తిగతంగా సన్నిహితులు. సెంట్రల్ అసెంబ్లీసభ్యులు ప్రారంభించిన యం.ఎల్.ఏం రైతు విభాగానికి డాక్టర్ ఖాన్ సాహెబ్‌గారు అధ్యక్షులు. 1947వ సంవత్సరంలో కోపెన్‌హెగెన్‌లో జరిగిన ప్రపంచ ఆహార వ్యవసాయ సంస్థ సభలలో గఫార్‌ఖాన్‌గారి పుత్రులు అబ్దుల్‌ఘనీగారు నాతోపాటు సహసభ్యులు. బాద్‌షా ఖాన్‌గారు సేవాగ్రాంలో ఒక కుటీరంలో వసారాలో కూర్చొని బాపూజీ కుటీరంలోకి వస్తుపోతూవుండే మాలాంటి వాళ్లనంతా గమనిస్తుండేవారు. మేము ఆయనకు అభివందనాలు తెలియజేస్తే ధ్యానంలో ఉన్న ఒక మహాభక్తుడు స్వీకరించినట్లుగా హుందాగా స్వీకరిస్తూ ప్రశాంత పద్ధతిలో చిరునవ్వులు

చిందిస్తుండేవారు. నేను ఆయన చాలా అంశాలు చెప్పగలడని భావించేవాడిని. ఆయన మాత్రం చాలా కొద్దిగా మాట్లాడుతూ గాంధేయమతంలో సదాలీనమై జీవిస్తుండేవారు. పాడవైనఆయన రూపాన్ని తెల్లటి గడ్డాన్ని, వెలుగులు చిందుతూవుండే ముఖవర్చస్సును చూసి మేము అట్లాగే నిలబడిపోతూ ఉండేవారము. బాపూ ప్రార్థనలకు వెళ్లేటపుడు మాతోపాటు ఆయన కలసి నడుస్తూవుంటే భగవంతుని సన్నిధికి మమ్మల్ని చేర్చేందుకు ఒక మహర్షి తోడుగా వున్నారన్నట్లుగా నేను అనుభూతికి లోనయ్యేవాడిని.

నేను మొట్టమొదటిసారిగా ఆయనను కరాచీకాంగ్రెస్ సభ సందర్భంలో చూశాను. దృఢకాయులూ, బలవంతులైన కుదైదేవుని సేవకులైన ఆయన సైనికులు, ఆయనా తమకు తాము స్వచ్ఛందంగా ఖడ్గాలను విసర్జించి గాంధేయవాదంలో ఇమిడి పోతారంటే మనకు నమ్మశక్యంగాదు. ఇతర గాంధేయవాదుల లాగానే బాద్ షా ఖాన్ గారుకూడా తనకు తాను అనుసరించడమే గాకుండా తన అనుచరుల చేతకూడా నాలుగు దశాబ్దాలుగా కఠినతరమైన అహింసా వ్రతాన్ని ఆచరింపజేయగలిగారు. ఆ విధంగా ఆయన మన హృదయాలలో ఒక గొప్ప సత్యాగ్రహిగా స్థిరమైనస్థానాన్ని సంపాదించుకున్నారు.

వారిసోదరులు, కుమారులు హిమాలయపర్వత శిఖరాలలోని హిందూ కుష్ పర్వత పాదాలవద్ద చిన్న చిన్న గుట్టలలో లోయలలో ఉన్న తమ తోటలలో పండించిన మధురఫలాలను గురించి చెప్తూ ఉండేవారు. పూర్వం అది వాయవ్య సరిహద్దు ప్రాంతంగా పిలువబడుతూ ఇప్పుడు ఫక్తూనిస్తాన్‌గా రూపొందింది. నాకు ఆ ప్రాంతానికి పోవడం ఎప్పటికో గాని తటస్థపడేదికాదు. నేను 1957 లో ఒకసారి అక్కడికి వెళ్లడం జరిగింది. అప్పుడు కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్సుకు ప్రతినిధిగా నేను అక్కడకు వెళ్లడం జరిగింది. 1920-21 సంవత్సరాలకాలంలో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని బ్రిటిషువారి తుపాకులకు బలయిపోయిన పఠాన్ సోదరుల సమాధులను పెషావర్ నగరం ముఖ్యవీధి కూడలిలో దర్శించే భాగ్యం ఆ సందర్భంలో అక్కడ నాకు కలిగింది. బాద్‌షాఖాన్ అనుచరులైన యోధులు దేవుని సేవకులుగా తెగించి ప్రాణాలొడ్డే పోరాటరీతులను విడనాడి గాంధేయ మార్గంలో అహింసకు అంకితమైన వారుగా త్యాగధనులైన ఆ గొప్ప అమరవీరుల స్మృతి చిన్నమది.

కైబరు కనుమల ద్వారా పూర్వకాలం ఆర్యుల నుంచి మొన్నటి నాదిర్‌షావరకు అనేక మంది మనదేశంలో ప్రవేశించి దేవాలయాలను కూల్చి వేస్తూ ఆస్తులను దోచుకొంటూ హత్యలు గావిస్తూ భయకంపితులను చేస్తూ వచ్చిన ఆ మార్గంలో వున్న ఈ ఫక్తూనులు గాంధేయవాదులైన పఠానులు వారి పూర్వీకుల రక్తదాహాన్ని విసర్జించి అహింసలో విశ్వాసాన్ని పెంచుకొని ఈనాడు మనకు ఆప్తులుగా ప్రేమ పాత్రులుగా వున్నారు. కైబరుకనుమల గుండా ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్లేటపుడు, తిరిగి వచ్చేటపుడు అక్కడి విశాలమైన మైదానాలు, రాతి పర్వతాలు మెలికలు తిరిగినట్లుండే చిన్నచిన్న కొండలను నేను చూశాను. కఠినశిలల లాంటి ఆ పఠాన్ ప్రజలను అహింసాయుత చంద్రశిలలుగా మార్చిన గఫార్‌ఖాన్‌గారి ఔన్నత్యాన్ని కొనియాడడానికి మాటలు రావు.

ఆంజనేయ స్వామిని ఆయన రామభక్తిని భారతప్రజలు ఎక్కువగా గౌరవిస్తారు. బాద్‌షాఖాన్ ఆయన జీవితాన్ని రామభక్త హనుమాన్ లాగ గడిపారు. బొంబాయి నగరంలో మత ఉద్రిక్తతలు కొనసాగుతున్నప్పుడు శాంతి పరిస్థితులు నెలకొల్పేందుకు బాద్‌షాఖాన్ గారిని ప్రసంగించవలసిందిగా గాంధీ మహాత్ముడు కోరగా ఆయన వెనుకా ముందూ చూడకుండా అలాగే చేశారు. ఆరోజు ఆయన ప్రసంగానికి ఆయన పొందిన ఫలితం రెండు సంవత్సరాలజైలు శిక్ష . గాంధీ మార్గాన్ని అనుసరించినందుకు బ్రిటిష్ ప్రభుత్వం ఉక్రోషంతో ఆయనకీ శిక్ష విధించింది.గాంధీజీ విడుదలకై తీవ్రంగా కృషిచేసి దానిని సాధించారు. పరిస్థితులేవైనా వాటితో నిమిత్తం లేకుండా ఆయన గాంధీ మాటనే వేదవాక్కుగా భావించే వారనే దానికి ఇది ఒక ఉదాహరణ.

భారతదేశంలోని అన్ని ప్రాంతాలప్రజలు ఆయనను ఆహ్వానించేందుకు, స్వాగత సత్కారాలనందించేందుకు ఒకరితో ఒకరు పోటీ పడటం నాకు చాలా సంతోషమనిపించింది. విజయవాడలోని గాంధీ పర్వత సంఘం కూడా ఈ అవకాశాన్నుపయోగించుకొని వేలాది ఆంధ్ర ప్రజలకు ఆయన దర్శన భాగ్యాన్ని కలిగించింది. గాంధీ శత జయంత్యుత్సవ సంవత్సర సందర్భంలో మనదేశంలో జరిగిన మరువలేని బాద్‌షాఖాన్‌గారి పర్యటనలో వేలాది మంది ప్రజలతోకలసి నేను, భారతీ దేవిగారు కూడా పాల్గొన్నాము.

1970 జనవరి 30న మహాత్ముడు స్వర్గస్తులైన రోజున ఢిల్లీ లోని రాజ్‌ఘాట్‌లోని మహాత్మాగాంధీ సమాధివద్ద జరిపిన ప్రార్థనలో బాద్‌షాఖాన్ స్వాగతసంఘ సభ్యునిగా పాల్గొనే అవకాశం ఆ రోజు అదృష్టవశాత్తూ నాకు లభించింది. జనవరి 1న ఒక ప్రముఖ హరిజన కాలనీ వద్ద ఆయన ప్రసంగించిన శాంతి సభకు నేను కూడా హాజరైనాను. జనవరి 4న ఢిల్లీలోని 10వేలమంది ప్రజలు ఆయనకు వీడ్కోలు చెప్పడానికి హాజరైన సందర్భంలో నేను ప్రసంగించాను. ఆ సందర్భంలో నేను ఇట్లా చెప్పగలిగాను. మరచిపోలేని ఆ రెండు మాసాల ఆయన పర్యటనలో కోట్లాది భారత ప్రజలు ఆయనలో తిరిగి బాపూనే చూడగలిగారు. ఆయన చెప్పిన ప్రతిమాట బాపూ నుంచి వచ్చిన మాటగానే వారు భావించారు.

మంచి చేయండి, మంచిగా ఉండండి అన్న బాపూ మాటలను ఆయన మనకు తిరిగి జ్ఞాపకం చేశారు. మనలను విలాసవంతమైన జీవితానికి దూరంగా ఉండవలసిందని, ఎంత ఉత్పత్తి చేయగలరో అంతాచేసి సౌభాగ్యవంతమైన సమాజ సృష్టికి పూనుకోవలసిందని ఆయన కోరారు. ఆయన మంచివారిని మన నాయకుడిగా ఎన్నుకోవలసిందని శీలవంతులైన కార్యకర్తలను ప్రతినిధులను గౌరవించవలసిందిగాను కోరారు. మనం ఇలాగే దురదృష్టకరమైన రాజకీయాల్లో పడి తన్నుకుంటూ ఉంటే గాంధీజీకి పోయేదేమీ లేదు గానీ భారతదేశం మాత్రం తన గౌరవ ప్రతిష్టలను పోగొట్టుకుంటుందని ఆయన హెచ్చరించారు. గాంధీలాగే తోటి ప్రజలను ప్రేమించవలసిందని సమాజానికి వీలు చేసేపనులు తలపెట్టవలదని సర్వమానవులకు సమానంగా సేవలందించవలసిందని సరళంగా, మృదువుగా చెప్తూ అతిగట్టిగా మనకు విజ్ఞప్తి చేశారు. అన్నిటికంటె ముఖ్యమైన విషయం ఈ గాంధేయ యుగంలో బాద్‌షా ఖాన్‌గారు మనమధ్య ఉండడం గాంధీయే మన మధ్యకు వచ్చినట్లయింది.

పార్లమెంటులోని (25.2.1970నాటి) రాష్ట్రపతి ప్రసంగంపై నా ఉపన్యాసంలోని ఈ క్రింది వాక్యాలను ముగింపుగా చెప్పనివ్వండి.

".....భారతదేశ మందంతటా, ఆయన ఎక్కడికి వెళ్లినా, అక్కడకు మహాత్మాగాంధీ వచ్చినట్లుగానే అనిపించింది, లక్షలు లక్షల కొలది ప్రజలు.....ఆయన దర్శనం కోసం త్రొక్కినలాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్వహణలో ఆహ్వాన సంఘాలున్నప్పటికీ, మామూలు ప్రజలు, పేదప్రజలు, కష్టపడితాము సంపాదించిన ముప్పై లక్షల రూపాయల రొక్కాన్ని ఆయన పాదాల ముందుంచి సమర్పించుకున్నారు. గాంధీ యుగానికి చెందిన ఈ గొప్ప మహర్షికి, ఇది ఈ సంవత్సరంలో లభించిన గొప్పచెప్పుకోదగిన సంఘటన....."

శ్రీ ఖాసా సుబ్బారావు

ఖాసా సుబ్బారావుగారు నాలుగు దశాబ్దాలుగా స్వతంత్రమైన తన సంపాదక బాధ్యతల నిర్వహణ ద్వారా ఉన్నత ఆశయాలకు అంకితమై మెలగడం ద్వారా పత్రికా రచయితగా ఆయన భారతీయ పత్రికా రచనా వృత్తికి గౌరవ ప్రతిష్టలను తీసుకొచ్చారు. (1922-60)

రచనా శిల్పంలో సాహితీ చిత్ర కారులుగా ఆయన భారతదేశంలోనూ, అమెరికాలోనూ, ఇంగ్లండులోనూ ఉన్న పత్రికా ప్రపంచంలో గొప్ప రచయితగా పేరులో కొచ్చారు. ప్రజలకు సంబంధించిన మనిషిగా జాతీయ సమగ్రత, ప్రజా సంక్షేమం వంటి అంశాలపై అంకితమై కృషి చేయడంలో ఆయనకు మరెవ్వరూ సాటిరారు. గొప్పస్థాయికి ఎదిగినందుకు మాసింగ్ హోమ్‌గారిని ఆయన ప్రస్తుతించేవారు. హెచ్.యన్.బ్రెయిస్ పోర్టు మరియు బ్రూక్‌వే గార్లు ఆయనను గొప్ప ఆశయాలు, ఉన్నత సామర్థ్యం కలిగిన రచయితగా ప్రపంచ వ్యాప్తమైన కీర్తిని సంపాదించారని కొనియాడారు.

ఖాసాకు ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపూర్ణ విశ్వాసముంది. భారతదేశం సాంఘిక ప్రగతిని సాధించాలని ఆయన కోరుకునేవారు. ఆర్థికాభివృద్ధి కృషితో భారతదేశం త్వరితగతిని ముందుకు వెళ్లాలని ఆయన శ్రద్ధ కనబరిచేవారు. అట్టడుగున పడిఉన్న బలహీన వర్గాల సముద్ధరణపై ఆయనకు ఆసక్తి మెండు. స్వార్థం, హ్రస్వదృష్టి కల రాజకీయ నాయకులన్నా, మత కులతత్వ వాదులన్నా ఆయనకు అసహనం జాస్తి. అవినీతిని అధికార దురహంకారాన్ని ఆయన అసహ్యించుకునేవారు. "సైడ్ లైట్స్", "మెన్ యిన్ లైమ్ లైట్" అనే ఆయన రెండు పుస్తక సంపుటాలు మన దేశభక్తులైన ప్రముఖులలో ఎక్కువమందిని అందులో తన కలం చిత్రాలద్వారా ఆయన ప్రదర్శించారు. ఈ రెండు సంపుటాలలోను నా గురించిన తన కలం వ్యాఖ్యలను ఆయన రాసి అందించారు.

సాంప్రదాయకంగా మేధావులైన వారి కుటుంబంలో ఆయన జన్మించారు. ఈ నవీన సమాజంలో ఉన్న మేధావులైన వారిని స్వభావ సిద్ధమైన అభిప్రాయాలను, పాత్రలను, స్థలాలలను, చట్టబద్ధమైన వారి కోర్కెలను అవసరాలను ఇట్టే ఆయన గ్రహించగలిగేవారు.

ఆయన సానుభూతి బహువిశాలమైనది. అది అన్ని తరగతులప్రజలకు సమానంగా అందతూ ఉండేది. ఆయన పూర్తిమానవతా వాది. మానవ హక్కులపై ఆయనకు విశ్వాసంమెండు. అందుకు ఏ రకమైన విఘాతం కలిగినా దానిని ఆయన అసహ్యించుకునేవారు. ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఎలాంటి విఘాతం కలిగినా వాటిని తోసి రాజనేందుకు ఏ ప్రక్కనుండి ప్రయత్నం జరిగినా దానికి ఆయన భరించలేని కోపాన్ని ప్రదర్శించేవారు.

సన్నగా వుండి కష్టించి పనిచేసే ధోరణి గల, జ్ఞానవంతురాలైన తల్లిగారంటే ఆయనకు ఎక్కువ భక్తి. ఆమె మా అందరికి ఎంతో ఆదరంతో ఆతిధ్యమిస్తూ ఉండేవారు. ఆమె అన్ని

కులాల మతాలకు చెందిన అతిథులనందరిని సమానంగా "అతిథిదేవోభవ" అన్నట్లుగా ఆదరిస్తుండేవారు. ఆమె చేసే అంత గొప్ప సేవలు కొద్ది మాటలలో చెప్పడంసాధ్యంకాదు. మేమందరం ఆమెను హృదయపూర్వకంగా అభిమానించే వాళ్లం.

విశ్వాసపాత్రత :

సుబ్బారావుగారు తన అభిమానాన్ని ఒక్కమారు ఒకే వ్యక్తికి ఇవ్వగలిగేవారు. ఆయన ప్రజా సేవారంగంలో తొలిదశలో ప్రకాశం గారిని అనుసరించారు. పూర్తిగా ఇరవై అయిదు సంవత్సరాలకాలంలో ఆయన తిరిగి ఆ స్థానంలోకి ఎవ్వరినీ రానివ్వలేదు. ప్రకాశంగారి చుట్టూ తాను నిర్మించుకున్న ఈ అభిమాన ప్రపంచంలోకి చివరికి మహాత్మాగాంధీ గారిని కూడా అడుగు పెట్టనివ్వలేదు. ప్రకాశం ఎంత తిరస్కార పూర్వకంగా ఉంటుంటాడో ఆయనకు తెలిసినప్పటికీ ఆయన తనలో ఎలాంటి మార్పుకు అవకాశమివ్వలేదు.

దక్షిణాది రాజకీయ క్షేత్రంలో తమతరువాతనే ఎవరైనా అనుకునే రాజాజీ భావంతో ప్రకాశంగారి స్థానంలో ఆయనకు మించి మరొకరిని గుర్తించటం ఇష్టం లేని ఖాసా నాలుగు దశాబ్దాల పాటు అంగీకరించక వివాదపడ్డాడు. ఇప్పటికి కూడా ఆయన ఈ విషయంలో ఎలాంటి మార్పును అంగీకరించడు. అయితే ఆఖరులో రాజాజీ విశ్వాసాన్ని, ప్రేమను పొందగలిగాడు. ఆయన కుప్రతనం ఉద్రేకం, ఆలోచనా పూర్వకమైన పట్టు అంత గట్టివి. సంపంగి సువాసనను విరజిమ్మే ఆయన ఏకాగ్రతా దృష్టి, విశ్వాసం ఆ తరువాత రాజాజీకి ఆయనను అత్యంత అభిమానిగా ప్రేమపాత్రునిగా చేశాయి. నెహ్రూ రైతు ఆర్థిక విధానం మీద చేసిన దాడిని నేను ఎదుర్కొంటున్నప్పుడు ఒక్కమారు త్వరగా ఆయన నాకు సహాయ పడేందుకు వచ్చారు. అదే రాజాజీ జవహర్లాల్ సోవియట్ విధానానికి వ్యతిరేకంగా ముందుకు వచ్చినప్పుడు ఖాసా రాజాజీ వాదనను వ్యతిరేకిస్తూ దులిపి పారేశాడు. రాజాజీ ఖాసాగార్లు ఇద్దరూ కూడా గాంధీ బోధనలలోని సారాన్ని తీసుకొని స్వతంత్ర ఉద్యమానికి నైతిక రాజకీయ ప్రాణప్రతిష్ట చేశారు. రాజాజీ ఆ సమయంలో రాజకీయ అధికారానికి దూరంగా ఉండడంలో ఖాసా ఆయనను మనదేశానికి లభించిన ఉత్తమ మహర్షిగా భావించారు. రామ్‌నాథ్ గోయెంకాగారు, కల్కి సదాశివన్ గారు స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో ఇద్దర ప్రముఖ పత్రికాధిపతులు ఖాసాసేవలమీద ఆపడి ఆయనకు ఏమికావాలంటే దానిని ఇవ్వజూపారు.

వేర్వేరు వర్గాల ముఠాల ప్రజలకు సంబంధించిన అనేక అనుభవాలు, భావనలు ఆయన మనస్సులో నిండి ఉండేవి. ఏదైనా ఒక ఉద్యమ సందర్భంలోగాని కృషి సందర్భంలో గాని అందులో పాల్గొంటున్న కార్యకర్తల, ప్రజాసేవకుల పని విధానాన్ని ఆయన ఆసక్తితో గమనిస్తుండేవారు. ఈనాడు అమెరికాకు చెందిన మొదటి శ్రేణి పత్రికా రచయితలు అనేకమంది ఇలాంటి సమాచార సేకరణకోసం ప్రాణాలకు తెగించి యుద్ధ రంగాలలోనికి, తుఫాను ప్రాంతాలలోకి ప్రవేశించి తమ పరిశోధనల ద్వారా తెలుసుకుంటున్నారు. ఏదైనా ఒక సాంఘిక అన్యాయం వల్ల నష్టపోయి బాధపడుతున్న వారికి ఆయన దేవునిలాగా తోడుండేవారు. ఆలోచనలో ఆయన అన్నీ తెలిసిన యోగిపుంగవునిలాగా కనిపిస్తుంటారు. ఏ సాంఘిక

సమస్యనైనా తెలుసుకోడానికి ఆయన పూనుకున్నప్పుడు దానిని అన్ని కోణాలనుంచి చూస్తూ గొప్ప నేర్పుతో గమనించగలిగేవారు. ఆ చాకచక్యం అప్పటికప్పుడే ఏ విషయంలోనైనా సహాయపడేందుకు ఆయనకు వీలు కల్పిస్తుంది. ఈ నాలుగు దశాబ్దాల కాలంలో నిర్మాణాత్మకమైన ఆయన విమర్శలు, సలహాలు అనేకమందికి ఎన్నోరకాల ఉపయోగపడ్డాయి.

ఆయన నుంచి మరొక ప్రముఖ పత్రికా సంపాదకుడు జి.వి.కృపానిధిగారినుంచి జమీందారీ పద్ధతికి వ్యతిరేకంగా జరుగుతున్న నా పోరాటాలలో 1931-40 సంవత్సరాల మధ్య నేను ఎక్కువ సమర్థనను పొందగలిగాను. స్వరాజ్య దినపత్రిక బాగా ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న తరుణంలో కొంతమంది జమీందారుల నుంచి దానికి ఆర్థిక సహాయాన్ని ఆశిస్తున్న సమయంలో కూడా రైతుల కష్టనష్టాలను గురించి ఆ జమీందారులలోవున్న అధికారుల అక్రమ కార్యకలాపాల గురించి నా రిపోర్టులను ఆపకుండా ఖాసా, కృపానిధిగార్లు ప్రచురిస్తూనే వచ్చారు. వారి సాహసం పట్టుదలలు అలాంటివి. జమీందారీలలో శాశ్వతశిస్తు పద్ధతిని ప్రవేశపెట్టాలని లార్డ్ కారన్‌వాలిస్ చేస్తున్న ప్రయత్నాలను నేను బలహీన పరచ దలుచుకోలేదు. అప్పటి ముఖ్యమంత్రి రాజగోపాలాచారి, రెవెన్యూ మంత్రి ప్రకాశంగారు ఇది ఆ తరువాత శాశ్వత చక్కగా మారుతుందనే కారణంతో బ్రిటిష్ ప్రభుత్వంతో ఈ పద్ధతిని వ్యతిరేకిస్తూ వాదించారు. ఈ సందర్భంలో ఆయన అందించిన సేవలను మరచిపోయికూడా ఖాసాను అభినందించారు. నేను ఖాసాగారికి వారి స్వరాజ్య పత్రికకు నా కృతజ్ఞతలు తెలియజేశాను. "రంగా! నీవెప్పుడూ వెంకటగిరి రైతాంగాన్ని మరచిపోవు అలాగే కె.సంతానంగారిని కూడా మరచిపోవు. ఆయన ఎంతటి దయార్ద్ర హృదయుడు", అని నాతో అన్నారు. 1930-34 సంవత్సరాల మధ్య కృష్ణా, గుంటూరు, గోదావరి జిల్లాలో భూమిశిస్తు పెంపుదలకు వ్యతిరేకంగా ప్రారంభించిన "పన్ను నిరాకరణ ఉద్యమా"నికి అనుకూలంగా వారునాకు సహకరించారు.

వాడియైన కలం :

రైతాంగ ఉద్యమంలో ఉన్న విప్లవ ధోరణులను పసిగట్టిన భారతీయ పత్రికా రచయితలలో ఖాసా మొదటివాడు. అందువల్ల ఆయన తన హృదయపూర్వకమైన సమర్థనను నాకు అందించారు. రాయలసీమ, విశాఖపట్నం, శ్రీకాకుళం జిల్లాలు ప్రతిమూడు, నాలుగు సంవత్సరాలకు ఒకమారు తప్పకుండా కువు వాతకు గురవుతుండేవి. అప్పుడు ఖాసా అక్కడి ప్రజల బాధలను, వ్యధలను, గాధలను తన కలంతో చిత్రీకరిస్తూ సకాలంలో వారికి సహాయం కల్పించడానికి గట్టి ప్రయత్నం చేస్తుండేవారు. కరువు ప్రాంతాలనుంచి నేను వార్తలను రాసి పంపుతూ ఉంటే ఖాసా తన కలంలో వాటికి రూపకల్పన చేసి ప్రచురిస్తూ ఉండేవారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఒక్కసారిగా ఆయన తన సమస్త శక్తులను కేంద్రీకరించి వత్తిడి తెస్తుండేవారు.

1942 సంవత్సరంలో బర్మాను జపాన్ ఆక్రమించుకున్న తరవాత భారత దేశానికి వస్తున్న కాందిశీకుల పరిస్థితిని తెలియజేసేందుకు మీరు తగినంత ప్రచారం ఎందుకివ్వడంలేదని కోపంతో అడగడానికి ఒకసారి నేను ఆయన దగ్గరకి వెళ్లాను. ఎగువ బర్మా, నాగాలాండ్‌లోని

నరసంచారంలేని మార్గాలగుండా, కనుమలగుండా భయంకర పరిస్థితులలో బాధలతో రోగాలతో ప్రయాణంచేసి వస్తున్న వేలాది మంది ఈ కాందిశీకులను గురించి నేను ఆయనకు వివరించినప్పుడు, ఒక్కమారుగా ఆయన ముఖం కోపంతో బాధతో కందిపోయింది.

ఆ తరువాత ఆయన రాసిన సంపాదకీయాలు, ప్రచురించిన కాందిశీకుల కష్టగాథలు, ఇంటర్వ్యూలు ప్రభుత్వాన్ని, శ్రీ యం.యన్. ఆనేగార్ని కదిలించి చక్కటి పునరావాస కృషి వారిచేత చేయించగలిగాయి. ఆ తరవాత 1960-66 సంవత్సరాలలో అనేమంది భారతీయులు బర్మాను వదలి శరణార్థులుగా భారతదేశానికి వచ్చినప్పుడు తగినంత సహాయం అందకపోవడానికి కారణం ఖాసా లాంటి సమర్థులైన సంపాదకులు లేకపోవడమే గదా కారణం అని నాకు అనిపించింది.

ఏదైనా ఒక పోరాట సందర్భంలో తెరవెనుక జరుగుతున్న సంఘటనలను రాస్తున్నప్పుడు కొందరు వ్యక్తులతోగాని, కొన్ని సందర్భాలలోగాని రచయిత ఇబ్బందులపాలు కావలసిరావడం లేదా అపసవ్య మార్గంలోకి పడిపోవడం అప్పుడప్పుడు జరుగుతూ ఉంటుంది. ఖాసాగారు కూడా చాలా సందర్భాలలో ప్రజారంగంలో మా వంటి వారందరి మీదా ఇలాంటి రాతలు రాశారు. ఆ రోజుల్లో జర్నలిజంలో చాలా సర్వసాధారణమైన ఈ చర్య ద్వారా ఆయన నిర్భయంగా అన్ని రంగాలలోని ఎన్నో వాస్తవాలను బయటికి లాగారు.

ప్రభుత్వంగానీ, సంఘ పెద్దలుగానీ అందులో ఉన్నవారి హక్కులు, స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను హరించడానికి పూనుకున్నప్పుడు అటువంటి వారికి అండగా నిలిచి వారి హక్కులను కాపాడేందుకు పోరాడే ఆయన తత్వం అంటే నాకు తగని ప్రేమ. నెహ్రూ హయాం తరవాత వచ్చిన మంత్రివర్గాలు మీసా, అత్యవసర పరిస్థితులు అవసరమైన ఇతర ఆర్డినెన్సులను ఉపయోగించడాన్ని ఆయన అంగీకరించలేదు.

మాలాంటివారు అనేకమందిలాగే ఆయనకూడా ఆంధ్రోద్యమానికి అంకితమైనారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం ఆయన ప్రత్యేక అభిలాషతో కృషి చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్ర విభజన దేశాన్ని ఎట్లా ముక్కలు చెక్కలు చేసి దుష్ట ఫలితాలను ఇచ్చిందో ఆ తరువాత మా అందరిలాగే ఆయన కూడా దాన్ని చూడగలిగారు. శ్రీ సుబ్బారావు గారు సత్యాగ్రహిగా పోలీసుల లాఠీ ఛార్జీలకు గురియై తీవ్రమైన బాధలను భరిస్తూ భారతీయ మహర్షిలాగా క్రైస్తవ త్యాగిలాగా మా ముందునిలిచి అధికారం కన్నా సామ్రాజ్య వాదంకన్నా ఆత్మ నిర్దేశితమైన గాంధేయ వాదం దొడ్డదనే మా నమ్మకానికి దృష్టాంతంగా నిలిచారు. 1931 సంవత్సరంలో మద్రాసులోని చైనా బజారు ప్రాంతంలో యూరోపియన్ సార్జెంటు కొరడాదెబ్బలకు పెట్లుగట్టపోయిన ఆయన శరీరాన్ని నేను చూశాను.

ఆయన దెబ్బతిని పడివున్న సమయంలో తన స్నేహ హస్తాన్ని అందించి ఆయనకు అత్యంత ప్రేమ పాత్రమైన స్వరాజ్య వార పత్రికను బయటకి తీసుకొచ్చేందుకు సహకరించడానికి వాగ్దానంచేసి ఎనభై సంవత్సరాల పెద్ద రాజాజీ ఆయనను ఆ సమయంలో ఆదుకున్నారు.

వారిద్దరూ మంచి స్నేహితులుగా మారి కలసికట్టుగా నెహ్రూయిజాన్ని వ్యతిరేకించారు. ఆ తరువాత వారు వ్యాపార వ్యవహార నిపుణులైన సదాశివంగారిని కలుపుకొని స్వరాజ్యపత్రికను స్వతంత్ర ఉద్యమానికి చక్కటి దీపికగా మలిచారు.

ఆయన స్వర్గస్తులు కావడానికి కొద్ది వారాలముందు నాతో మాట్లాడుతూ తనకు ఇంకా ఎక్కువ కాలం జీవించే కోరిక లేదని, ఎందుకంటే తాను ప్రజా సమస్యలలో ఏ విధంగానూ పనిచేయలేకపోతున్నందువల్ల ఇక ఈ జీవితాన్ని కొనసాగించడం అనవసరం అని చెప్పారు. ఏ విధమైన ప్రయోజనం లేకుండా ఈ శరీరాన్ని ఇలాగే వుంచుకోవాలనే కోరిక నాకు లేదని వారన్నారు. జీవితాన్ని గురించిన ఆయన నిర్ణయం అంతటి ఉన్నతమైనది. భాషా పెంచి పోషించిన బిడ్డ స్వరాజ్య పత్రిక ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు నిర్మాణ పూర్వక చర్చలకు కేంద్రంగా ఉంటూ ఇప్పటికి ఆయన స్మృతి చిహ్నంగా ఉన్నతంగానే నడుస్తున్నది. రాజాజీ ప్రఖ్యాతి గాంచిన ఆయన వారం వారం అందించే "డియర్ రీడర్" రచనాకాలం ద్వారా స్వరాజ్య పత్రికను శక్తివంతమైన మంచి పత్రికగా నడిచేందుకు తోడ్పడుతున్నారు.

సుబ్బారావు గారు మద్రాసునుంచి వెలువడే దినపత్రిక "స్వరాజ్యకు" బొంబాయినుంచి వెలువడే "ఫ్రీ ప్రెస్ జర్నల్" పత్రికకు కలకత్తానుంచి వెలువడే "ఇండియన్ ఫ్యాన్స్" పత్రికకు మద్రాసు నుంచి వెలువడే "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు.

శ్రీ జె.బి.కృపలానీ

ఆచార్య కృపలానీ 1882వ సంవత్సరంలో సింధురాష్ట్రంలో జన్మించారు. సుచేతను ఆయన వివాహమాడారు. ఆమె 1908లో అంబాలాలో జన్మించింది. 1940నుంచి ఇద్దరూ జాతీయ నాయకత్వస్థాయిలో ఉన్నారు. శ్రీ కృపలానీ 1934 నుండి కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పనిచేస్తూ 1946లో అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షులు కాగలిగారు. సుచేతకృపలానీ 1962 నుండి 1967 వరకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు.బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అయిన తరవాత 1922వ సంవత్సరంలో శ్రీ కృపలానీ బాపూజీ ఆశ్రమంలో ప్రవేశించారు. 1917 చంపరాన్ కిసాన్ పోరాటంలో బాపూజీ కాయన సహకరించారు. ఆయన ఓ మంచి స్వాతంత్ర్య సమరయోధుడు; 1950వ సంవత్సరంలో కిసాన్ మజదూర్ ప్రజా పార్టీని స్థాపించారు. గాంధీజీ మీద గాంధేయ తత్వం మీద ఆయన అనేకమైన మంచి పుస్తకాలు రాశారు. ఆయన ప్రపంచ రాజ్యాలన్నింటా పర్యటించారు. అలాగే సుచేతగారు కూడా దశాబ్దాల తరబడి గాంధీ గారితో కలసి పనిచేశారు. నవకాళీ గ్రామీణ ప్రాంతాలలో మతకలహాలు చెలరేగి ప్రాణాలను బలిగొంటున్నప్పుడు ఆయనతో కలసి ఆమె ఆ ప్రాంతాలలో పర్యటించారు. ఈ ఇద్దరూ కూడా ప్రజాస్వామ్య ప్రతిపక్ష నాయకులుగా, స్వాతంత్ర్య సమరయోధులుగా ఉన్నత విలువలను సంతరించుకున్నారు. సుచేత. ం పాత కాంగ్రెస్‌లో ప్రవేశించగా కృపలానీ ఏ పార్టీ ప్రమేయం లేకుండా ఉన్నారు. 1974లో గుండెపోటుతో సుచేతగారు మరణించారు. 1975లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా జనతాఫ్రంటును కృపలానీ సమర్థించారు - (ఎడిటర్)

జాతీయరాజకీయ రంగస్థలంమీద ఇప్పటికి మిగిలిఉన్న గాంధేయవాదులలో ఆచార్య జె.బి.కృపలానీ గారు పెద్దవారు. ఆయన గాంధేయ హేతువాదులలో ప్రముఖులు, గాంధీయుగం మనకందించిన గొప్ప సోషలిస్టు ఇంటా బయటా కూడా గాంధేయవాదం మనిషి అనుసరించదగ్గ ఉత్తమ ధర్మమని ఆయన నమ్మకం. అందంపై ఆకర్షణ, లలిత కళలపై ఆయనకు ఇష్టం ఎక్కువ. ఆయన గొప్ప పండితుడు, చదవడం రాయడంతోపాటు చక్కని సంభాషణా చాతుర్యం కవులపై ఆదరణ ఆయనకు మెండు. ఆయన తన రాజకీయ ప్రత్యర్థులను చూసి వారివంకర మాటలను గమనించి ఎక్కువగా భయపడుతుండేవారు.

మనదేశంలో నాలుగు దశాబ్దాలకు పైగా కృపలానీ ఉన్నత స్థానంలో వున్న నాయకుడు, ఈ శతాబ్దంలోని మొదటి దశాబ్దంలో చంపరాన్ పోరాట సమయంలో గాంధీజీకి సహకరించి ఆతిథ్యమివ్వడానికి ప్రభుత్వం అభ్యంతర పెట్టడంతో అందుకు నిరసనగా ఆయన ముజఫర్ పూర్ ప్రభుత్వ కళాశాలలోని ఆచార్య పదవిని వదిలి వేశారు.

ఆయన 1922-27 సంవత్సరాల కాలంలో గాంధీగారు ప్రారంభించిన సబర్మతి విద్యాపీఠానికి ప్రధానాచార్యులుగా పనిచేస్తూ గాంధీజీ ఉద్యమాలకు కావలసినవిధంగా కార్యకర్తలను

తయారు చేసి పంపిస్తుండేవారు. ఆ కళాశాలలో శిక్షణా తరగతులను నిర్వహించడం ప్రారంభించిన కొన్ని సంవత్సరాలకు ఆయనను కాంగ్రెస్ అగ్రశ్రేణి సంస్థలలో పనిచేయవలసిందిగా కోరడం జరిగింది. ఆనాడు ఆయన నిష్పాక్షికదృష్టిపట్ల నిర్మాణ శక్తి యెడల గొప్ప విశ్వాసాన్ని కలిగినదై కాంగ్రెస్, ప్రధాన కార్యదర్శులలో ఒకరుగా ఉండవలసిందిగా వారిని కోరడం జరిగింది. తనకు లభించిన ఆ ఉన్నతమైన పదవిలో పన్నెండు సంవత్సరాలకాలంఉండి శ్రీ కృపలానీ పార్టీకి గొప్ప సేవల నందించారు.

ఆ సమయంలో గాంధీయుగంలోని అనేకమంది ప్రముఖనాయకులలో ముఖ్యంగా మదన్‌మోహన్ మాలవ్యా, మోతీలాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, జవహర్లాల్ నెహ్రూ, రాజాజీ, రాజేంద్రప్రసాద్, మౌలానా అజాద్, లజపతిరాయ్, సి.ఆర్.దాస్., ప్రకాశంగార్లకు సన్నిహితంగా మెలుగుతూ కొన్ని అంశాలు తనకు నచ్చేవి నచ్చనివి. ఉన్నా వారందరిలో సహనంతో మెలగుతూ అందరి గురించి సమగ్రంగా తెలుసుకోగలిగే అందమైన అవకాశం ఆయనకు లభించింది.

అప్పుడాయన జయప్రకాశ్ నారాయణ్, రామమనోహర్ లోహియా, జహీర్ సోదరులు, అసఫ్, అచ్యుత పట్వర్ధన్, నరేంద్రదేవ్, అశోక్‌మెహతా వంటి నెహ్రూ అభిమానులైన సోషలిస్టులతో కలిసి పనిచేశారు. వారు ఇప్పుడుగానీ, భవిష్యత్తులోగానీ దేశ అవసరాలను తీర్చగలిగేది సోషలిజం మాత్రమేనని విశ్వసిస్తూ ఉండగా, కృపలానీ అందుకు భిన్నంగా గాంధేయవాదం మాత్రమే మన ప్రజల అవసరాలను తీర్చగలిగే నిజమైన సోషలిజాన్ని స్థాపించగలదని నమ్ముతూ ఉండేవారు. ఆ తరువాత ఆయన నెహ్రూ, జయప్రకాశ్ నారాయణ్‌గార్ల సోషలిజాన్ని పాండితీ ప్రక్రియలో చర్చిస్తూ సౌమ్యంగా విమర్శిస్తూ వ్యాసాలు రాశారు. ఆ రోజుల్లో కృపలానీ రాసిన ఆ రచనలు సోషలిస్టులను ఎంతగా కోతకు గురిచేశాయో నాకు తెలుసు.

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో మెజారిటీ సభ్యులైన సీనియర్ నాయకులతో కలసి కృపలానీ అప్పటి కాంగ్రెస్ ప్రెసిడెంటు పండిత నెహ్రూగారికి, ఆయన ప్రారంభించిన ఉద్యమం అహింసాయుత సోషలిస్టు మార్గానికి ఎంతవరకు అనుకూలమో తెలియజేయవలసిందని కోరుతూ రాసిన విరసనలేఖపై సంతకం చేశారు. (ఈ లేఖ ఆ తరువాత జవహర్లాల్ గారి "బంచ్ ఆఫ్ లెటర్స్" పుస్తకంలో ప్రచురితమైంది) దాదాపు పది సంవత్సరాల కాలం జవహర్లాల్ జీ, సుభాష్ బోసుగారు, అజాద్ గారు కాంగ్రెస్ అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నకాలంలో ఆయన సోషలిస్టులకు కొరుకుడు పడకుండా ఉన్నారు.

చివరికి గాంధీగారు, గాంధేయవాద సోషలిస్టు కృపలానీగారికి ఒక అవకాశాన్ని ఇచ్చి చూద్దామనుకున్నప్పుడు 1946వ సంవత్సరంలో ఆయనకు కాంగ్రెస్ అధ్యక్షపదవి లభించింది. గాంధేయ సోషలిజంతో ఆయనకున్న విశ్వాసం ఆధారంగా మీరట్ కాంగ్రెస్ సభ్యులలో ఈ గొప్ప అవకాశం ఆయనకు లభించింది. ఆయన ఆ సందర్భంలో డెమోక్రటిక్ కిసాన్ మజ్‌దూర్ బుద్ధిజీవి, కళాకారుల, ప్రజారాజ్య స్థాపనకు గాంధీజీ ప్రబోధించిన, రంగాగారు కోరిన అభ్యుదయ ప్రజాస్వామ్య పద్ధతులకు, సోషలిజానికి దారి చూపెట్టేందుకు కాంగ్రెస్ అంకితమై

ఉందని ప్రకటించారు. ఛాందస సోషలిస్టులకు ఇది మరింత కోపకారణమైంది. కాంగ్రెస్ రాజకీయ విధానాలకు, సిద్ధాంతాలకు భిన్నంగా కమ్యూనిస్టుల పరిమిత కార్మిక నియంత్రత్వ నినాదంవైపు ఆ తరువాత వారు మొగ్గు చూపారు. ఈ విషయంలో జవహర్లాల్ గారికి గానీ, సర్దార్ పటేల్ గారికిగానీ అంతగా రుచించలేదు. ఆచార్య కృపలానీ ప్రజాస్వామ్య వాదులకోసం కొన్ని మార్గదర్శక సూత్రాలను సూచించారు. మీరట్ కాంగ్రెస్ ప్రకటన గాంధేయ రాజకీయ విధానం అమలుకు ఒక గొప్ప గుర్తించదగ్గ అంశమని భావించిన వారిలో నేనూ ఒకడిని. ఆయన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు నన్ను పార్టీ కార్యవర్గ సమావేశాలకు ఆహ్వానించారు. అక్కడ అత్యున్నత పార్టీ వ్యవహార రూపకల్పన సంస్థ అయిన కార్యవర్గం ఎలా రూపకల్పన చేస్తుందో లోనుండి స్వయంగా గమనించగలిగే అవకాశం అట్లా నాకు లభించింది.

ఆ సమావేశం ముగిసిన తర్వాత కృపలానీ గారు ప్రధాని నెహ్రూగారితోనూ, ఉప ప్రధాని సర్దార్ పటేల్ గారితోనూ కాంగ్రెస్ అధ్యక్షులు, కార్యవర్గం, ప్రధానమంత్రి, మంత్రివర్గాల మధ్య ఎవరిపాత్రఎంతవరకు అనే అంశంపై విభేదించారు. ప్రభుత్వం ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోబోయేముందు వారు తనకు తెలియజేయాలని తమతో సంప్రదించాలని ఆయన గట్టిగా పట్టుబట్టారు. పార్టీ వద్దుల్లోనే ప్రభుత్వాన్ని కూర్చోబెట్టకుండా దానికి స్వేచ్ఛనివ్వాలని వారు కోరారు. నేనూ, ప్రపుల్లఘోష్‌గారు ఇద్దరం ఈ సందర్భంలో కృపలానీగారిని బలపరిచాము. ఆ పరిస్థితులలోంచి బైటపడవేసేందుకు మేము ఒక రాజీ మార్గాన్ని సూచించాము. ఆ మార్గంలో కృపలానీ గారు సంతృప్తి పడలేదు. దానిని ట్రయలుగా చూద్దామనుకొన్నప్పటికీ ఇతరులు దానిని కొంచెం ఇబ్బందిగా భావించారు. చివరికి కృపలానీ రాజీనామాను ఆమోదించవలసిందిగా గాంధీగారు సూచించడంతో ఆ వివాదం ముగిసింది. ఆ విధంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పార్టీ అధ్యక్షుడి అదుపు ఉండాలనే అంశం మరుగున పడిపోయింది. గాంధీగారి ఆమోదం ఆ విధంగా లభించడంతో నెహ్రూ, పటేల్ గార్ల సంయుక్త ఆధిపత్యం ఆ విధంగా నిలదొక్కుకుంది. ఇదే విధంగా ఇంగ్లండులో లేబరు పార్టీ ఛైర్మనయిన లాస్కీగారికి పార్లమెంటు నాయకులయిన అట్లీగారికి మధ్య వివాదం ఏర్పడి ప్రొఫెసర్ లాస్కీగారే తలవంచవలసి వచ్చింది.

పటేల్, నెహ్రూగార్ల అధికారసయోధ్య కూడా ఎక్కువకాలం కొనసాగలేదు. అధికారాన్ని కొంతమేరకు వద్దుల్లో ఉంచాలని మేము ప్రయత్నించాము. కాంగ్రెస్ అధ్యక్షుడు పోయిన తర్వాత నెహ్రూ క్రమేణా తనను కూడా ఎట్లా నిర్లక్ష్యం చేస్తున్నారో 1948-49 నాటికి సర్దార్ గుర్తించగలిగారు. తను చెప్పిన వారిని కాంగ్రెస్ అధ్యక్షులుగా గెలిపించుకొని తద్వారా పూర్తి అధికారాన్ని తన చెప్పుచేతుల్లో ఉంచుకోవాలనే ప్రధానమంత్రి నిర్ణయాన్ని అడ్డుకోవాలని సర్దార్ పటేల్ తలపోశారు. అప్పుడాయన కృపలానీకి వ్యతిరేకంగా అధ్యక్షస్థానానికి టాండన్ గారి అభ్యర్థిత్వాన్ని బలపరిచారు. కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు రాజేంద్రప్రసాద్ గారు, పట్టాభిగారిని ఆస్థానంలో పూర్తిగా బలపడనీయకుండా చేసిన సంగతి చరిత్రకు తెలుసు. జవహర్లాల్‌కు అనుకూలంగా ఉంటూ సర్దార్‌కు వ్యతిరేకమైన కృపలానీ గారిని 1946-47 లో పటేల్ అక్కడ నుంచి తొలగించగలిగారు. అందువల్ల తిరిగి ఈసారి నెహ్రూగారితో సర్దుబాటు చేసుకొని కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి కృపలానీ గారు పోటీపడ్డారు. కాశ్మీరు నుంచి వచ్చిన కాందిశీకుల విషయంలో

తాను ాత్రవహించి అభ్యుదయకరంగా వ్యవహరించగలనన్న నమ్మకంతో వారు ఈ సారి పోటీ ్చారు. టాండన్‌జీని గెలిపించి పార్టీలో తన బలమేమిటో సర్దార్ పటేల్‌గారు నిరూపించుకున్నారు. 1946-47 సంవత్సరాలలో జవహర్లాల్, పటేల్‌గార్లు చెరొకవైపుకు లాగిన కారణంగా పార్టీ ఆటుపోట్లకు గురయింది. ఆ తరువాత కాంగ్రెస్ అధ్యక్షుడు తనకనుకూలంగా వున్న వ్యక్తి అయినప్పటికీ నెహ్రూగారి ముందు పటేల్ అధికారం లేనివాడిగా ఉండిపోవలసి వచ్చింది. కాగా, పోగా రెండు దశాబ్దాలుగా స్నేహితులుగా ఉన్న ఈ యిద్దరు మిత్రులు ఆటు ఆచార్య కృపలానీ, ఇటు సర్దార్ పటేల్ పరస్పరం సంఘర్షించుకొని బలహీనపడిపోగా వారిద్దరి వైనా ప్రధాని గొప్పగా విజయాన్ని సాధించగలిగారు. కృపలానీగారు రాజీనామా ఇచ్చినప్పటి కంటె వినాశకరమైన పరిస్థితులు నెలకొని ఉండడంతో టాండన్‌గారు రాజీనామా చేసేందుకు అంగీకరించారు. ఇంగ్లండు ప్రధానమంత్రి అట్లీకి వ్యతిరేకంగా నిలిచి పార్టీ ఛైర్మన్ హెరాల్డ్ లాస్కీ దెబ్బ తిన్నట్లుగానే ఈ ఇద్దరు గాంధేయసోషలిస్టు వాదులు అసహాయులుగా మిగిలిపోవలసివచ్చింది. ఆయన కాంగ్రెస్‌ను వదలిన చాలా సంవత్సరాల తర్వాత 1952వ సంవత్సరంలో నేను సూచించిన కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని మనసులో ఉంచుకొని సోషలిస్టులను కలుపుకొని గాంధేయమార్గంలో నడిపించాలని ప్రజాసోషలిస్టులను కలుపుకొని కృపలానీగారు కిసాన్ మజ్‌దూర్ ప్రజా పార్టీని స్థాపించారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత గాంధీ కాలంనాటి విలువలు సేవలు రాజకీయ అభిమానాలు అంతరించాయనే సంగతి ఆయన గ్రహించి తనకు తాను ఆ విషయంలో పట్టుదలకు పోకుండా సర్దుకు పోసాగారు. స్వతంత్ర పార్టీని స్థాపించినప్పుడు రా , నేనూ ఆ పార్టీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించవలసిందిగా ఆయనను కోరినప్పుడు గతంలో రుచి చూసిన అనుభవాలను దృష్టిలో పెట్టుకొన్న తరువాత, ఇంక ఎలాంటి కొత్త బాధ్యతలను నేను స్వీకరించలేనని ఆయన చెప్పారు. జయప్రకాశ్ నారాయణ్ గారి పార్టీ రహిత ప్రజాస్వామ్య వేదికలో ఆయన కలువలేదు. భారత ప్రజాస్వామ్యంలో పార్టీరహిత రాజకీయాలు ఏదైనా ఒక రాజబాటను నిర్మించటంగాని లేదా ప్రజా విశ్వాసాన్ని పొందగలగడంగానీ జరగదని, అధికారంలో ఉన్నవిగాని లేనివిగానీ పార్టీలం వలె ప్రజలను అవసరమైన చట్టాలను కూడా అవి తీసుకు రాలేవని, అందువల్ల పార్టీ రహిత విధానం వల్ల ఎలాంటి ప్రయోజనం వుండబోదని ఆయన తలపోయడం వల్లనే ఈ నిర్ణయానికొచ్చారు.

శ్రీ కృపలానీ మనకున్న ప్రజా నాయకులలో ప్రముఖులు. ఆయన స్వదేశంలో ఉన్నా విదేశాలలో ఉన్నా ప్రజల హక్కులకు స్వాతంత్ర్యానికి మంచి రక్షకునిగా పనిచేస్తూ ఉండేవారు. 1912వ సంవత్సరంలో చైనా, టిబెట్, భారతదేశం మధ్య ఒడంబడిక జరిగి ఉన్నప్పటికీ టిబెట్ స్వాతంత్ర్యాన్ని చైనా బలవంతంగా హరించివేస్తుంటే మౌనంగా ఉన్న నెహ్రూను కృపలానీ తీవ్రంగా నిందించారు. చైనా కమ్యూనిస్టు దురాక్రమణలో నుంచి బైటపడి దలైలామా ఇండియాకు వచ్చినపుడు ఆయనకు ఆశ్రయ మివ్వడమే కాకుండా టిబెట్ సమస్యకు రాజకీయ సమర్థనను కూడా అందించవలసిందని జవహర్‌లాల్‌ను వత్తిడి చేసి వారిలో మాతోపాటు కృపలానీ, సుచేత గార్లు కూడా ఉన్నారు. హంగరీదేశాన్ని కృశ్చేవ్ పాలనలో ఉన్న సోవియట్ సైన్యాలు దురాక్రమణ చేసినపుడు వూరికే దానిని ఖండించడంతో సరిపెట్టుకోక

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-3

ఈజిప్టుకు వ్యతిరేకంగా ఫ్రెంచి-బ్రిటిషువారు దురాక్రమణ చేసినప్పుడు కఠినంగా మాట్లాడినట్లుగా మాట్లాడవలసిందని, వ్యవహరించవలసిందని ఆయన జవహర్లాల్‌ను కోరారు. కమ్యూనిస్టు రాజ్యంగానే వుంటూ తమకు తాము స్వతంత్రులుగా వుండాలనే సంకల్పంతో జెకొస్లావేకియా కమ్యూనిస్టులు ప్రయత్నించినప్పుడు దానిని సోవియట్ సైనికులు కర్కశంగా అణచి వేసినప్పుడు నిరసనగా మేము చేసిన ప్రదర్శనలో మాతోపాటు కృపలానీ గారు కూడా పాల్గొన్నారు.

1962-67 సంవత్సరాలలో ఆయన అవిశ్రాంతంగా పని చేశారు. పార్లమెంటులో ఉండి ఆయనతోపాటు మేము పార్లమెంటులోపల, వెలుపల ప్రజాస్వామ్య విలువలను మరచిపోయి దేశాన్ని కాంగ్రెస్ దురదృష్టకర పరిస్థితులలోకి నడిపిస్తున్నదని హెచ్చరించాము. 1967వ సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ అపజయాలను ఎక్కు రుచిచూసిన తర్వాత కాంగ్రెస్ మంత్రివర్గం అనేక చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడింది. (అధ్యక్షతరహాపాలనను ప్రవేశపెట్టడం శాసన సభలు రద్దు చేయడం ప్రతిపక్ష సంయుక్త విధాయక దళ్ మంత్రి వర్గాలను బర్తరఫ్‌చేయడం, మానసికంగా బలహీనులైన శాసనసభ్యులను పార్టీల మార్పిడికి ప్రోత్సహించడం వంటి రాజకీయ దుశ్చర్యలకు పాల్పడడం సాగించింది). ఈ రాజ్యాంగ వ్యతిరేక చర్యలను అధికార దుర్వినియోగాన్ని కృపలానీ పార్లమెంటులో తీవ్రంగా ఖండించారు. సంయుక్త విధాయకదళ్ తాను తవ్వుకున్న గోతిలో తానే పడిపోతుందనే అంశాన్ని మాలాగే ఆయన కూడా గ్రహించలేకపోయారు. ఎందుకుంటే కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ మేర్పడాలనే కోరిక మాలో తీవ్రంగా ఉండడంతో దీనిని మేము పట్టించుకోలేకపోయాము. ఆ తరువాత కాంగ్రెస్ మంత్రి వర్గాలకు సంయుక్త విధాయక దళ్ మంత్రి వర్గాలకు పేరులో తప్ప పాలనలో పెద్ద తేడాలు లేవని ఆయన గుర్తించారు. సంయుక్త విధాయకదళ్ మంత్రివర్గాలు అమలు జరుపుతున్న చాలా వాస్తవ విరుద్ధమైన అంశాలు అయనను ఎక్కువగా కలతపెట్టాయి. ఆయారాం, గయారాంల ద్వారా ప్రభుత్వాలను ఒక ఆట ఆడిస్తున్న కాంగ్రెస్ విధానాలకు కేంద్రప్రభుత్వ బొక్కానికి వ్యతిరేకంగా ఈ ఆయారాం గయారాంల పద్ధతిని సృష్టించిన వారు సంయుక్త విధాయక దళ్ వారే అయినప్పటికీ పోరాడక ఆయనకు తప్పలేదు. నేను పార్లమెంటులో మొదటి బెంచీల్లో ఆయన ప్రక్కనే ఉంటూ ఉండే వాడిని. ప్రధానమంత్రితోపాటు సభలోనికి వస్తూపోతూ వుండే అధికార సభ్యుల్ని గురించి, వారి నడకల గురించి కృపలానీ ఆపకుండా అదేపనిగా తమాషా తమాషా వ్యాఖ్యానాలు చేస్తుండేవారు. మేము ప్రతిపక్షంలో ఉన్నప్పటికి చెప్పింది చేయడానికి సంసిద్ధంగా ఉండాలని ఆయన అభిప్రాయ పడేవారు. మనలో ఆలోచనను రేకెత్తించగలిగే ఆయన పట్ల నాకెక్కువ ఆకర్షణ. ఆయన సుచేతగార్ని బాగా వయసు వచ్చిన తరవాత ఒక జాతీయ నాయకత్వస్థానానికి వచ్చినప్పుడు, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో పని చేస్తున్నపుడు పెళ్లిచేసుకొన్నారు. నా మేనకోడలు సుశీలాదేవి బెనారస్‌స్త్రీల కళాశాలలో తాను విద్యార్థిగా ఉన్నప్పుడు మొదటగా ఆమెను నాకు పరిచయం చేశారు. ఆమె అప్పుడు యువకత్వంతో ఆరోగ్యంగా అందమైన కాంతితో ప్రకాశిస్తున్నారు.

ఆయన కాంగ్రెస్ అధ్యక్షపదవికి రాజీనామా చేసినప్పటికి కార్యవర్గంలో చేరడానికి

ఆమెకు అభ్యంతరం చెప్పలేదు. వారిద్దరూ అధికార సోపానాలనుంచి విడివడిన తరవాత ఆమె కాంగ్రెస్‌లో చేరి ప్రధాన కార్యదర్శియై ఆ తరువాత అయిదు పందల మంది శాసన సభ్యులుగల గొప్పదైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అవుతున్నప్పుడు కూడా ఆమె ఇష్టానికి ఆయన ఏ విధంగాను వ్యతిరేకతను తెలియజేయలేదు. ఆయన అప్పుడప్పుడూ నవ్యుతూ చలోక్తులు విసురుతూ ఆమెకు ఎ.ఐ.సి.సి.సభ్యులకూ, ఉత్తరప్రదేశ్ ఎం.ఎల్.ఏ.లకు కాంగ్రెస్ ఎం.పి.లకు తగు సంహాలనిస్తూ తన సహజమైన హాస్య ధోరణితో వ్యవహరిస్తుండేవారు. ఆయన కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడుగాని ఆయన భార్య శ్రీమతి సుచేత కృపలానీ ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నప్పుడుగాని, ఆయన అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని అన్న వారెవ్వరూ లేరు. కృపలానీ ఎక్కడైనా ఎదురైనప్పుడు ఆయన కళ్లల్లో పడితే తాము చేసిన పాపాల్లను ఎక్కడ అడుగుతాడో అని కొంత మంది కేంద్ర మంత్రులు ఆయన ఎదురైనప్పుడు తప్పుకు తిరుగుతూ ఉండేవారు. కాంగ్రెస్ మంత్రివర్గాలు గాంధేయ మార్గానికి భిన్నంగా తప్పులు చేసినప్పుడు వాటిని ఆయన గట్టిగా ఎత్తిపట్టుకొని అపహాస్యం చేసేవారు. ఆహంభావులైన మంత్రులు సభను లక్ష్యపెట్టకుండా కాంగ్రెస్ విధానాలకు భిన్నంగా ప్రవర్తిస్తున్నప్పుడు వారిని ఆయన నిర్భయంగా చీల్చి చెండాడేవారు. ఆయన ఒక స్వతంత్రసభ్యుడయినప్పటికి ఆయనను అనుసరించేవారు ఎక్కువమంది లేకపోయినప్పటికి ఆయన ఈపని చేయగలిగేవారు. ప్రభుత్వం మీద ఆయన కున్నపలుకు బడిచాలాగొప్పది. నేను ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు అన్ని సందర్భాలలో ఆయననుండి విలువైన సమర్థనను పొందగలిగే వాడిని. నాకు ఆయన ఓ గొప్ప విలువైన స్నేహితుడు.

కాంగ్రెస్‌ను పూర్తిగా బలపరిస్తే శ్రీమతి ఇందిరాగాంధీ మన ప్రజలను పేదరికంలోనుంచి, బాధల్లోనుంచి బయటికి తీసుకు రాగలదని శ్రీమతి సుచేత నాకు ఆమె రాసిన జాబులో భవిష్యత్తును గురించి జోస్యం చెప్పారు. ఆ వెంటనే ఆమె తీవ్రమైన గుండెపోటుకు గురయ్యారు. ఆ సమయంలో కృపలానీ ఆమెకు ఎంతో ప్రేమతో ఆదరంతో సేవలు పందించారు. అప్పుడు కూడ వారి హృదయాలు విడివడకుండా ఒక్కటయ్యే ఉన్నాయి. మన ప్రజలకు ఏమికావాలో దానిని ఒకగూర్చేందుకు జాతికి శ్రీమతి గాంధి ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలని ఆ సమయంలో కూడ ఆమె కోరారు.

మన ప్రజాస్వామ్యానికి రాజకీయ అవలక్షణాలు సంభవించిన ఈ తరుణంలో మా దారులు ఒకదానికొకటి దూరంగా ఉన్నప్పటికి ఒకరికొకరికి మధ్య ఎక్కువ ఎడం మాత్రం ఏర్పడలేదు.

కృపలానీ శ్రీమతి సుచేత గార్లి ద్దరూ చాలా దశాబ్దాలకాలం పాటు నిర్మాణాత్మక కృషిలో ఉండి గుర్తించబడే విధంగా కృషిచేశారు. కృపలానీ గారు బీహార్ భూకంపం సంభవించినప్పుడు గాంధీగారితో కలిసి పని చేశారు. గుజరాత్‌లో వరదలొచ్చినపుడు సర్దార్ పటేల్ గారికి సహకరించారు. మీరట్‌లోని ప్రఖ్యాతమైన గాంధీ ఖాదీ ఆశ్రమంద్వారా గాంధీ ఖద్దరు ఉత్పత్తి లక్ష్యసాధనకు కృషిచేశారు. స్వయంవృత్తుల కార్యక్రమానికి సహాయపడుతూ నిరుద్యోగులైన

మహిళకు ఉద్యోగంతో ఉంటున్నస్త్రీకు కూడా స్వంతంగా ఆర్జించుకునేందుకు దోహదం చేశారు. వందల కొద్ది కార్యకర్తలకు, సహాయకులకు పని కల్పించారు. వార్ధా విద్యాప్రణాళిక లేదా నయాతాలిమి అభివృద్ధికృషిలో శ్రీ జాకీర్ హుస్సేన్, ఆర్యనాయకంగార్లకు ఆయన తోడ్పడ్డారు. ఆయన పుస్తకం "దలెటెస్ట్ ఫాడ్" గొప్ప భావసమన్వితంకల గ్రంథం.

శ్రీమతి సుచేత కృపలానీ, శ్రీమతి మృదులా సారాబాయ్, డాక్టర్ సుశీలా నాయర్ గార్లు ఫ్లారెన్స్ నైటింగేల్ లాగా భారతస్త్రీలలో కాందిశీకుల సహాయం కోసం తాము చేసిసేవల ద్వారా ఆదర్శవంతంగా నిలిచారు. తూర్పు పశ్చిమ పాకిస్తాన్ లనుంచి వచ్చిపడ్డ లక్షలాది కాందిశీకుల ప్రవాహానికి పశ్చిమ ప్రాంతంలోని హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, ఢిల్లీ, యు.పిలలోని సహాయకేంద్రాలలోను తూర్పు ప్రాంతంలో పశ్చిమ బెంగాల్, బీహార్, ఒరిస్సా సహాయకేంద్రాలలో మానవతా దృక్పథంతో, ఆ కాందిశీకుల మధ్య ఉంటూ వీరు ధైర్యంగా చేసిన సేవలు మనకు ఫ్లారెన్స్ నైటింగేల్‌ను గుర్తుకు తెస్తాయి. గాంధీజీ ఢిల్లీ, బీహార్ ప్రాంతాలలో చుట్టి వెల్లిన తరవాత కూడా నవకాలీలో ఉన్న మెజారిటీ ముస్లింలు హిందూ స్త్రీల పట్ల చూపే దౌష్ట్యాన్ని శ్రీమతి సుచేత, సుశీల గార్లు ధైర్యంగా ఎదుర్కొన్నారు. రాజ్యాంగసభలో ఉండి దేశావసరాలకు కృషిచేస్తున్న మాలాంటి వారం చాలా మందిమి ఆ సమయంలో కాందిశీకుల సహాయార్థం వారిలాగా కృషిచేసే అదృష్టం లేకుండా ఉండి పోయాము. శ్రీమతి సుచేత యు.పిలో ఎలాంటి ఆపీసీతి కార్యకలాపాలకు లోనుకాకుండా పరిశుద్ధమైన పరిపాలనను అందించడంద్వారా గొప్ప ఆదర్శాన్ని కూడా మనకు ప్రదర్శించారు. అనేమంది మంత్రులు, మంత్రివర్గాలు ఆమెను ఆదర్శంగా తీసుకోకపోవడం మన దేశం దురదృష్టం. శ్రీమతి సుచేతగారు, కృపలానీగార్లు ఇద్దరూ కూడా పరిపాలనా సంస్కరణల సంఘం సిఫార్సు చేసిన విధంగా లోక్‌పాల్, లోకాయుక్త సంస్థలను ఏర్పాటుచేసి మంత్రులు, శాసన సభ్యులు వంటి ఉన్నత స్థానాలలో వున్న వారిపై వచ్చే ఆరోపణలను విచారించేందుకు తగుచర్యలు తీసుకునేందుకు చేయవలసిన కృషిలో శ్రీమతి ఇందిరాగాంధీ విఫలమైనందుకు విచారించారు.

కృపలానీ శక్తివంతమైన పార్లమెంటరీ స్పీకరేగాక మంచి రచయిత. ఆయన ప్రసంగాలు హాస్యపు మెరుపు జల్లులను విరజిమ్ముతూ ఉంటే ఆయన రచనలు వ్యంగ్యోక్తులతో గుండెలను పిండుతూ వుండేవి. గాంధీజీ బోధనలను, నిర్మాణ కార్యక్రమాలను వివరించడంలో ఆయనకు ఆయనే సాటి. గాంధీ విధానాలను గురించి ఆయన రచనలు ప్రామాణికమైనవి. వాటిని విలువైన తన అనుభవాలతో జతపరచి ఆయన మనకందిస్తూ ఉంటారు. ఆయన గాంధీజీకి మూర్ఖపు అనుచరుడు గాని గుడ్డి విద్యార్థిగాని కాకుండా హేతుబద్ధమైన పరిశీలకుడు కావడంతో ఆయన రచనలు పండితులకు పరిశోధకులకు ఎంతో విలువైన సమాచారాన్ని అందించగలిగేలా ఉంటాయి. ఆయన పుస్తకాలు "ది గాంధీయన్ వే", 2. "ది లెటెస్ట్ ఫ్యాడ్", బేసిక్ ఎడ్యుకేషన్", 3. ది నాన్ వైలెంట్ రివల్యూషన్", 4. "మహాత్మాగాంధీ", (ఆయన శతాబ్ది సందర్భంగా వెలువడింది) గాంధీ మహాత్ముని గురించి వచ్చిన ఆయన రచనలలో ఈ నాలుగు అతి ప్రామాణికమైన గ్రంథాలు.

శ్రీ జి.వి.కృపానిధి

శ్రీ జి. వి కృపానిధి మరణంతో మనం ఒక గొప్ప దేశభక్తుడిని, ప్రముఖ పత్రికా రయితను కోల్పోయాము.

1920 వ సంవత్సరంలో తనకు ఎక్కువ ఆదాయం వచ్చే ఉద్యోగాన్నికూడా వదులుకొని కీర్తిశేషులైన ఫణిక్కర్, ఖాసా, ఈశ్వర్ దత్ వంటి వారితో కలసి దివంగత ప్రకాశం పంతులుగారి నాయకత్వంలో మద్రాసు నుంచి ప్రచురితమవుతున్న "స్వరాజ్య" ఆంగ్ల దినపత్రికలో పనిచేసేందుకు వచ్చారు. నిరంతరం ఎదురయ్యే ప్రభుత్వ వత్తిడులను తట్టుకుంటూ, కనీస వేతనాలపై జీవితాన్ని కొనసాగిస్తూ, బ్రిటిష్ ప్రభుత్వ సెన్సారు షిప్పును భరిస్తూ ఆర్థికంగా దుస్థితిలో ఉన్న ఈ పత్రికను నిలుపుకునేందుకు గట్టి కృషిచేశారు.

కృపానిధి గారి భార్య శ్రీమతి సుశీల ఎంఏ, బి.ఇ.డి గారు తీసుకొచ్చిన టిఫిన్ క్యారియర్‌లోని మద్రాసు శాకపాకాలన్నింటిని మధ్యాహ్న భోజనసమయంలో నేను, కాసా సుబ్బారావుగారూ, మేమంతా కలసి తింటుండేవాళ్లం. 1934వరకు ప్రకాశంగారి ఆర్థిక వనరులన్నీ ఇంకిపోయే చివరిదాకా, కృపానిధి, కాసాగార్లిద్దరూ ఈ జాతీయ సంస్థలో విశ్వాసంతో పనిచేశారు.

ఆ తరువాత కృపానిధిగారు ఢిల్లీలోని ప్రముఖ ఇంగ్లీషు దినపత్రిక "హిందుస్తాన్ టైమ్స్"లో పదిహేను సంవత్సరాల కాలం ఉన్నారు. అది పూర్తిగా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఒక తరం కాలం. ఆ కాలంలో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్లుగా ఉన్నవారు కృపానిధి కలం ఎంతగట్టిదో అయన విమర్శలను చూసినప్పుడు గ్రహించగలిగారు. కాంగ్రెస్‌లోనూ ఇతర జాతీయవాద పక్షాలలోనూ ఉన్న నాలాంటివారం అనేక మందిమి ఆయన స్నేహహస్తాన్ని అందుకొని ఆనందించాము. ఆయన అప్పటికి నాల్గవ ఎస్టేట్‌గా పరిగణన పొందుతున్న పత్రికారంగంలో ప్రముఖవ్యక్తిగా ఎదిగారు.

"ఓవర్ ఏ కప్ ఆఫ్ టీ" శీర్షిక ద్వారా పతాన్ జోసెఫ్‌గారు చేసే వ్యాఖ్యలు, గంట్లు పెడుతున్న శంకర్ కార్టూన్లు, రాజ్యాంగ వ్యవహారాల పరిశీలనా నిపుణునిగా కృపానిధి రోజూ చేస్తున్న సూచనలు, మాకు స్వాతంత్ర్యోద్యమకృషి శాసన సభల ద్వారా ఎంత నిరాశాజనకంగా నిదానంగా ముందుకు వెళుతుందో తెలియజేస్తూ ఉండేవి.

ఆ తరువాత కృపానిధి హిందుస్తాన్ టైమ్స్ దినపత్రిక సంపాదకులుగా వచ్చి భారతదేశ స్వాతంత్రోదయం తరవాత మన మంత్రి వర్గాలకూ, మంత్రులకు నిర్మాణాత్మకమైన సలహాలను, సూచనలను అందిస్తుండేవారు.

ఢిల్లీని ఆయన పూర్తి మర్యాదలతో వదిలిపెట్టి, రాజకీయంగా భౌతికంగా వాతావరణపరంగా కూడా చక్కని స్థితి కలిగిన బెంగుళూరు వెళ్లారు. అక్కడాయన దేశంలోని ప్రముఖ ఆంగ్లదిన పత్రికలలో ఒకటిగా "డక్కన్ హెరాల్డ్" ఇంగ్లీషు దిన పత్రికను రూపొందించారు. శ్రీ కృపానిధి

దాదాపు అర్ధశతాబ్దంపాటు పత్రికారచన ద్వారా దేశానికి తన సేవలందించారు.

ఉన్నత గుణ సంపన్నురాలైన ఆయన భార్య శ్రీమతి సుశీల కమలాదేవికి సహ విద్యార్థిని, లెక్చరరుగా, ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. ఆమె ఢిల్లీలోని నరేంద్ర ప్లేస్‌లోని తమ వసతి గృహంలో ఎందరో మేధావులకు జైళ్లకు వెళ్లిన దేశభక్తులకు చక్కని ఆతిథ్యం ఇస్తూ ఉండేది. ఆరోజుల్లో వారి ఆతిథ్యాన్ని స్వీకరించిన అనేక మంది అతిథులు ఆతరువాత కేంద్రంలోను, రాష్ట్రాలలోను మంత్రులయిన వారిని కృపానిధి గారి కుటుంబం తమకోసంగాని, తమ మిత్రులకోసంగాని ఎన్నడూ ఎలాంటి సహాయాన్ని అర్థించి ఉండలేదు. వారిద్దరూ పూర్తిగా మద్యపానమంటే గిట్టనివారు, అందువల్ల వారెప్పుడూ ఢిల్లీ విలాస కేంద్రాలకు దూరంగావుంటూ వుండేవారు. అధికార వ్యవహారాలకు దగ్గరగా ఉండాలనే తలంపు వారికెప్పుడూ వుండేదికాదు. అధికారరాజకీయాలకు దూరంగాఉండాలనుకునే మాలాంటివారికి వారు సదా జవసత్వాలను కల్పిస్తూఉండేవారు.

కృపానిధి భారతీయ పత్రికారచనకు ఎనలేని సేవలనందించారు. దానిని ప్రజాస్వామ్య వ్యవస్థలో నాల్గవ స్తంభంగా రూపొందించడానికి ఆయన ప్రముఖంగా కృషిచేశారు.

ప్రముఖ స్వేచ్ఛానువర్తి –డాక్టర్ కుంజ్రూ

డాక్టర్ హెచ్.ఎన్. కుంజ్రూ మనకున్న గౌరవనీయులు, అనుభవ పరులు అయిన, ప్రముఖులైన ప్రజాస్వామ్య వాదులలో ఒకరు. గోఖలే, మదన్‌మోహన్ మాలవ్య , శ్రీనివాసశాస్త్రిగార్ల వద్ద చక్కని తర్ఫీదు పొందిన వీరు, మొట్ట మొదటి స్టేట్స్ కౌన్సిళ్లలోను తరవాత రాజ్యాంగ నిర్మాణ సభలోను చక్కని ప్రసంగాలు చేసి గొప్పగా తన సేవల నందించారు. ఆయన ఉపన్యాసకులుగా తమ సామర్థ్యాన్ని ప్రదర్శించాలకునే దానికన్నా తాను చెప్పే అంశాన్ని తగు విధంగా సమర్థవంతంగా చూపెట్టాలనే దానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారు. ఆయన ఇతరుల అభిప్రాయాలను కూడా తగువిధంగా గుర్తించి గౌరవిస్తారు. తాను మంచిపని చేసినపుడు ఇతరులు ప్రస్తుతిస్తే అందుకు ఆయన సంతోషించేవారుకారు. తానుమంచి విమర్శచేసినపుడు ఎవరైన చప్పట్లు కొట్టినా అంతగా పొంగి పోయేవారుకారు. ఆయన ఒక పండితునిగా ఉత్తమ ఉపాధ్యాయునిగా, చక్కని వక్తగా తనకున్న అనుభవాలనన్నింటిని మేళవింపు చేసుకొని ఒక సమిష్టిశక్తిగా మెలుగుతూఉండేవారు.

వైస్రాయ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆంగ్లేయ సభ్యులు ఆయన విమర్శలోని పాండిత్యాన్ని, తర్కాన్ని, సామర్థ్యాన్నిచూసి ఎక్కువగా గౌరవించేవారు. రాజ్యాంగ నిర్మాణ సభలోని చర్చల సందర్భంలోనేకాక చర్చలకుముందు, బయట జరిపే ఆషామాషీ సంప్రదింపులలో కూడ ఆయన సామర్థ్యం, ధైర్యం స్పష్టంగా కనిపించేది. గోఖలేగారి నుంచి బ్రిటిష్ పార్లమెంటేరియన్ల నుంచి నేర్చుకున్నప్రకారం, కొన్ని విషయాలలో మాత్రమే శ్రద్ధ తీసుకొని వాటికి పూర్తిస్థాయిలో న్యాయంచేకూర్చగలిగే విధానాన్ని ఆయన అలవర్చుకున్నారు. కామన్వెల్త్ రాజ్యాలలోను, ఇతర రాజ్యాలలోను ఉన్న భారతీయుల పరిస్థితుల మెరుగుదలకు రక్షణకు ఆయన ప్రత్యేక ప్రాధాన్యాన్నిచ్చి అధ్యయనం చేస్తుండేవారు. రక్షణ విభాగానికి సంబంధించిన అనేక సంఘాలలో ఆయన సభ్యులుగా నియమితులైనారు.

ఇరవై సంవత్సరాల చిన్న వయసులోనే గోఖలేగారి "సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ"లో ఆయన చేరారు. సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ వ్యవస్థాపకులైన గోఖలేగారితోనూ, కామన్వెల్తులోని గొప్పవక్త అయిన శ్రీనివాసశాస్త్రిగారితోనూ భారతీయ కార్మిక ఉద్యమ పితామహులైన యన్. యం. జోషి గారితోను కొండజాతుల నాయకులు టక్కర్ బాబాగారి తోను సొసైటీలోని ఇతర సభ్యులందరితోను కలసి పనిచేసే అదృష్టం ఆయనకు కలిగింది. గత అర్ధశతాబ్ద కాలంలో కుంజ్రూగారు గోఖలే గారు అధికతర ప్రాధాన్యతనిచ్చిన కారణంగా ప్రజారంగంలో ఉన్నత విలువల స్థాపనకు ధైర్యంగా సమర్థవంతంగా పనిచేశారు. గోఖలేగారు ఈ విధంగా ప్రబోధించారు. "ప్రజాజీవితాన్ని పారమార్థిక దృష్టి తో ప్రారంభించాలి. గుండె నిండా దేశభక్తిని నింపుకోవాలి. తదితర మైన అంశాలన్నీ దానితరువాతనే. ప్రజలకు సేవజేయడం ద్వారా దేశభక్తి కలిగిన కార్యకర్త తాను ఆనందాన్ని పొందాలి ". డాక్టర్ కుంజ్రూ

తన జీవితాన్ని ఈ లక్ష్యాలకు అనుగుణంగానే గడిపారు. డాక్టర్ కుంజ్రూ, శ్రీ జోషి, శ్రీ టక్కర్ బాబాగార్లతో కలసి పనిచేసే అవకాశం ఆ రోజుల్లోనాకు లభించింది.

విదేశీ వ్యవహారాలలో, గొప్పతనంకోసం ఎవరు పిలవకుండానే మనంతట మనం ప్రవేశించే అనవసర ధోరణిని విడనాడాలని డాక్టర్ కుంజ్రూకోరారు. మిత్రరాజ్యసమితిలో పశ్చిమరాజ్యాలకు వ్యతిరేకంగా ప్రవర్తిస్తూ వాటి ఆగ్రహానికి గురయ్యే నెహ్రూ విధానాలను ఆయన అంగీకరించలేదు.

డాక్టర్ కుంజ్రూ 1946 వసంవత్సరంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ ఎఫైర్స్ ఏర్పాటు చేసే విషయంలో, సర్ తేజ్ బహదూర్ సప్రూ శ్రీ డి. శివరావు మొదలైన వారితో కలసి పనిచేశారు. అంతర్జాతీయ విషయాలు పరిశీలించడంలో పార్లమెంటరీ సంస్థలకు తోడుగా ఇది ఒక గొప్ప జాతీయ సంస్థగా పనిచేస్తుండేది. సప్రూ మరణంతరవాత కుంజ్రూగారు దీనికి అధ్యక్షులైనారు.దీని ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ కేంద్రాన్ని ప్రపంచపరిస్థితులను తెలుసుకొనేందుకు వీలైన గొప్ప గ్రంథాలయాన్ని ఆయన నిర్వహించారు. ప్రఖ్యాతిగాంచిన "సప్రూ హౌస్"ను నిర్మించడంద్వారా తన నాయకులు, సహచరులయిన సప్రూగారి పట్ల ఆయన తన కృతజ్ఞతలను చాటుకున్నారు.

డాక్టర్ కుంజ్రూ అధ్యక్ష పదవి నిర్వహణలో చక్కటి ప్రావీణ్యాన్ని కలిగి వుండేవారు. రెండు దశాబ్దాల పూర్వం జరిగిన ఒక భారత - అమెరికా సభ సందర్భంలో నేను ఆయన సామర్థ్యాన్ని చూడగలిగాను. రెండు దేశాల నుంచి వచ్చిన ప్రతినిధులకు ఆయన సహాయపడుతూ స్నేహపూర్వక వాతావరణాన్ని పెంచుకునేందుకు సామరస్యపూర్వక ధోరణిలో చర్చలను కొనసాగించుకునేందుకు వీలుగా అప్పుడు అందరికీ ఆయన సహాయపడ్డారు. అలాగే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ ఎఫైర్స్ అధ్యక్ష స్థానంలో ఉండి, అందులో నేను చాలా సంవత్సరాలు వారితోకలసి సభ్యునిగా పనిచేశాను. చక్కటి ప్రజాస్వామ్య పూర్వకమైన రీతులకు ఆయన మార్గ దర్శకులైనారు.రైల్వే యాక్సిడెంట్స్ కమిటీలో ఉన్నప్పుడు కూడా సభ్యులందరి ఆమోదాన్ని ఎక్కువ సందర్భాల్లో పొందుతూ మంచి నిర్వహణకు మార్గ దర్శకులైనారు.

బ్రిటిష్ప్రభుత్వం నుండి వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో చేరవలసిందిగాఆయనకు అనేకమార్లు పరోక్షంగా సూచనలు అందినప్పటికి ఆయన వాటిని తిరస్కరించారు. ఆ సమయంలో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో తాను ప్రవేశిస్తే జాతీయోద్యమం బలహీనపడుతుందని భావించినందువల్లనే ఆయన ఈ నిర్ణయం తీసుకోగలిగారు. దేశం స్వాతంత్ర్యం పొందిన తరవాత ప్రభుత్వ సర్వీసులపై రాజకీయవాదుల ప్రమేయం లేకుండా వుంచాలని తద్వారా ఉత్తమ పరిపాలనను ప్రజలకందించాలని ఆయన కోరారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా డాక్టర్ కుంజ్రూ కాంగ్రెస్ పక్షంలో చేరలేదు. భారతదేశంలో పార్లమెంటరీ సంస్థ సమర్థవంతంగా పని చేయడానికి కృషిచేసిన గొప్ప "లిబరల్" నాయకులలో ఆయన ఒకరు. బ్రిటిష్ ప్రభుత్వం మీద భారత శాసన సభ్యులకు, మంత్రులకు ఎక్కువ అధికారాలను ఇవ్వవలసిందిగాను ప్రభుత్వ సంస్థలలో భారతీయుల ప్రాధాన్యతను పెంచవలసిందిగాను ఆయన గట్టిగా వత్తిడి చేశారు.

ఆయన హృదయం చాలా విశాలమైనది. మనసు బహుమెత్తనిది. అందుకే అన్నివేళలా ఆయన బాధపడే ప్రజల మధ్య ఉంటూ వుండేవారు. ఎక్కడైనా వరదలు సంభవించినా, కరువులు వచ్చినా వారి సహాయానికి నిధులు సేకరించడంలో వారికికావలసిన సామగ్రిని అందించడంలో ఆయన ముందుండేవారు 1946వ సంవత్సరంలో కర్ణాటకలోని బళ్లారిజిల్లాలో కరువు వాతబడిన రైతుల సహాయకృషిలో ఆయన మామధ్య ఉన్నప్పుడు నేను పొందిన అనుభవం మరువలేనిది. 1943 బెంగాల్ కరువు సందర్భంలో కూడ ఆయన గుర్తించదగినంత గొప్పగా సేవచేశారు. బ్రిటిష్ వారి పద్ధతిలో చూడడానికి చాలా ముక్తసరిగా పనిచేసేవారైనప్పటికీ డాక్టర్ కుంజ్రూ తన కృషిలో ఏ కాంగ్రెస్ కార్యకర్తకు తీసిపోరు. అందువల్ల ఆయనను భారత్ స్కౌట్ ఉద్యమానికి నాయకత్వం వహించవలసిందిగా దివ్యజ్ఞాన సమాజికులు ఆహ్వానించారు. స్కౌట్ ఉద్యమాన్ని భారత దేశంలో డాక్టర్ అనీబిసెంట్ ప్రాభవంలోకి తీసుకురాగా దానికి శక్తిని దేశానికి కావలసిన విధంగా రూపాన్ని ఇచ్చి డాక్టర్ కుంజ్రూ భారతదేశంలో ఒక కేంద్ర బిందువుగా వుండే విధంగా రూపొందించగలిగారు. ఈనాడు యువకులకు శిక్షణనిచ్చేందుకు ఏర్పాటుచేసిన ఎ.సి.సి.యన్.సి.సి, వంటివన్నీ, దశాబ్దాల తరబడి డా॥ కుంజ్రూ గారు చేసిన కృషి ఫలితంగా రూపుదిద్దుకున్నాయనటంలో.

మన దేశప్రముఖులలో, దేశభక్తులయినవారిలో డాక్టర్ కుంజ్రూగారుండడం మన అదృష్టం. మార్పిడులను నిరోధించేందుకు ఏర్పాటుచేసిన జాతీయస్థాయి కమిటీలో ఇటీవలికాలంలో ఆయన ప్రక్కన కూర్చోగలగడం నాకు మరువరాని అనుభవం. గెలిచిన సభ్యులెవరైనా ఉన్నత సిద్ధాంతాల కోసం కారణాల కోసం అవసరమైనప్పుడు పార్టీలను మార్చుకునేందుకు అవకాశం ఉండాలని ఆయన వాదించారు. డాక్టర్ కుంజ్రూ బాధితులయిన మనదేశప్రజలకు సహాయపడే కృషిలో ఎన్నో దశాబ్దాల పాటు గోఖలే గారి బాటలో నడుస్తూ సేవలు చేశారు.

ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ వరల్డ్ ఎఫైర్స్‌కు అధ్యక్షులుగా ప్రస్తుతం ఆయన కొనసాగుతున్నారు.

వెనుకబడిన జాతుల నాయకులు – శ్రీ గౌతులచ్చన్న

1930వ సంవ సంవత్సరం నుంచి వెనుక బడిన వర్గాల ప్రజలు , వారి హక్కులను వారు సాధించుకునేందుకై, దేశాభివృద్ధి కృషిలో తమ వంతు పాత్రను నిర్వహించేందుకై, మానవ జాతిలో సమానస్థాయి జీవన విధానం లేని తమ పరిస్థితులను తాము తెలుసుకొని అభివృద్ధిచెందేందుకు, తమకు తాము నాయకులను తయారు చేసుకొని ముందుకురావడానికి ప్రయత్నం పారంభమైంది.

1930-32 సంవత్సరాంలో నేను జైలులో ఉన్నపుడు రాసిన నవల " హరిజన నాయకుడు"లో నేనీ విషయాలను ప్రస్తావించాను. 1952 లో వయోజన ఓటింగ్ హక్కుపై జరిగిన మొదటి సాధారణ ఎన్నికలలో ఉన్నత వర్గాల ప్రజలు అభ్యుదయ మార్గంలో తమ సామాజిక బాధ్యతలను సక్రమంగా నిర్వహించేందుకు సంసిద్ధంగా లేరని తెలుసుకున్న తరవాత రాజకీయాలలోకి వెనుకబడిన తరగతుల నాయకులను తీసుకొచ్చి వారిని నాయకులుగా తయారుచేసుకోవలసిన బాధ్యత ఉందని నేను గ్రహించాను . ఆ తరువాత నాతో కలసి గత 30 సంవత్సరాలుగా అంకితభావంతో పనిచేస్తున్న ఉత్సాహవంతులైన పదిహేడు మందిలో నుంచి అప్పటి మద్రాసు రాష్ట్ర శాసన సభలో ఆంధ్ర కృషీకార్ లోక్ పార్టీ నాయకుడిగా శ్రీ గౌతు లచ్చన్న గారిని తీసుకురావడం జరిగింది. మిగతా వారి నందరిని ఆయన వెనుకనిలిచి పనిచేయవలసిందిగా ఆ సందర్భంలో నేను కోరాను. ఆటు వంటి ప్రయత్నాలలో ఎదురయ్యే ఇబ్బందులు నాకు తెలిసినప్పటికి ఆరంభదశలో ఉన్న భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు నిజమైన నాయకుడిని అందించవలసిన అవసరమున్నదనే తలంపుతో ఆపనికి నిస్సందేహంగా నేను పూనుకున్నాను.

ఆ సందర్భంలో ఆయనతో పోటీపడుతున్న మరొక ఉన్నత కులానికి సంబంధించిన వ్యక్తి. ఆయన కూడా ఆర్థికంగా పేదవాడే, కొద్దిపాటి భూవసతి మాత్రమే ఉంది. ఆయన ఈసందర్భంలో నా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, తనతోటి అగ్రకులాల శాసన సభ్యుల సమర్థనతో నామీద వత్తిడి తీసుకురాసాగాడు. ఆవత్తిడికి ఏ రకంగానూ నేను లొంగలేదు. కరగి వెనుకడుగు వేయలేదు. ఆతరువాత లచ్చన్న గారి ఎంపిక విషయంలో నేనుచేసిన నిర్ణయం సరైనదని గొప్పదని తరువాత జరిగిన సంఘటనలు రుజువుచేశాయి. లచ్చన్న గారు దుస్థితిలో వున్న ఆంధ్ర ప్రజలకు బలాన్ని నైతిక స్థాయిని, శక్తిని ఇవ్వగలిగారు. అదే సమయంలో వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన నాయకుడై ఉండి కూడా తాను అన్ని వర్గాల ప్రజల హక్కులకొసం, అవసరాలకోసం, వీరునిలాగా పోరాడి గొప్పనాయకుడనిపించుకున్నారు. క్రింద వర్గాల ప్రజల మానవ హక్కుల సముద్ధరణ కోసం ఆయన ఆసక్తిని కనబరిచారు. ఆయన శ్రీకాకుళం

జిల్లాలోని బారువాలో సాంప్రదాయకంగా కల్లుగీత వృత్తిలో ఉన్న ఒక కుటుంబంలో జన్మించారు. మద్యనిషేధం అమలుచేయడం జరిగితే దానివల్ల వారి తోపేమీ లేకపోయినప్పటికీ కల్లుగీత పనివారు నిరుద్యోగులు కాగలరను అంశం తెలిసికూడా లచ్చన్నగారు గాంధీజీ లక్ష్యాలకు అనుగుణంగా మద్యనిషేధం కోసంఅవిశ్రాంతమైన పోరాటాన్ని కొనసాగించారు. ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా మద్యనిషేధం కోసం మద్రాసు రాష్ట్రంలో రాజాజీ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా పోరాడారు.ఆయన రాష్ట్ర వ్యాప్తంగా కల్లు గీత పని వారల వ్యక్తి గత సత్యాగ్రహాలను నిర్వహించారు. అన్ని తరగతుల యువకులు ఇందులో మాతో కలిసి పాల్గొన్నారు. ఈ విషయంలో తరతరాలుగా కల్లుగీత వృత్తి లో జీవిస్తున్న గీతకార్మికుల స్వయంజీవన హక్కును కాపాడేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి కొన్ని వెసులుబాట్లను మేము సాధించగలిగాము .లచ్చన్నగారు నా ప్రజా జీవితరంగంలో అతి ముఖ్యమైన సహచరులలో ఒకరు. ప్రత్యేకించి గత 35 సంవత్సరాల నారైతాంగ పోరాటంలో నాతోను, కీర్తిశేషులైన శ్రీ జి.వి సుబ్బయ్యగారిచేతను, అందరి చేత కిసాన్ మేధావిగా పిలిపించుకోబడేవారు. ఆయన తరవాత రెండవ వారుగా ఉండేవారు. శ్రీకాకుళం ,విశాఖపట్నం జిల్లాలు ఎక్కువభాగం జమీందారుల పలుకుబడిలో వుంటూ ఉండేవి. అందువల్ల జమీందారులకు వ్యతిరేకమైన మాపోరాటం దీర్ఘకాలంగా వారనుభవిస్తున్న బాధలకు వ్యతిరేకంగా అక్కడి ప్రజల సానుభూతిని మాకందించి శక్తివంతమైన రాజకీయ ప్రతిపక్షంగా మాకు వూపునిచ్చింది.

జమీందారులపై మేము విజయం సాధించిన తరవాత భూమిశిస్తుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటం ప్రారంభించాము. 1962 సంవత్సరం నాటికి ఆంధ్రప్రాంతంలో భూమి శిస్తు 150 నుంచి 300వరకు అదనంగా పెంచడం ఖరిగింది. అప్పుడు మేము దానిని వ్యతిరేకిస్తూ జమీందారుల కాలంనాటి కన్నా ప్రస్తుత పాలనలోనే రైతులు ఎక్కువ నష్టానికి గురవుతున్నారని మా కోర్కెలతో మేము ముందుకొచ్చాము. ఈకొత్త పద్ధతికి వ్యతిరేకంగా లచ్చన్నగారు ప్రజా సమీకరణను ప్రారంభించారు. లచ్చన్నగారు ఈ సందర్భంలో ప్రజల నిరసనను ప్రకటిస్తూ హైదరాబాదు వరకు కిసాన్ జీనియస్, భారతీదేవి గార్లతో కలసి ఒక రైతుయాత్రను నిర్వహించారు. అప్పుడు ప్రారంభించిన రైతు సత్యాగ్రహంలో 750 మంది జైళ్లకువెళ్లారు. భూమిశిస్తుపెంపుదలకు వ్యతిరేకంగా ఆయన న్యాయస్థానంలో కూడ ఈ సందర్భంలో పోరాడారు. ప్రముఖ న్యాయవాది శ్రీ పి.వి. చౌదరిగారికి , ఈఉద్యమంలో మాతోకలసి పనిచేసిన 6000మందికి పైగా సాహసులైన రైతులకు సకాలంలో ముందుకు వచ్చినందుకు నేను వందనాలర్పిస్తున్నాను. వారి అందరి సహాయముతో భూమిశిస్తు పెంపుదల ప్రయత్నాన్ని హైకోర్టులోను, సుప్రీంకోర్టులోను ఓడించడం ద్వారా ఆప్రయత్నాలనుంచి రాష్ట్ర ప్రభుత్వాన్ని మేము నిరోధించగలిగాము. శాసన సభలో తమ కున్న సంఖ్యాబలాన్ని అడ్డం పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వాలుచేసే అధర్మమైన పనులను ప్రజాస్వామ్య బద్ధంగా ప్రజలు ఎలా ఎదుర్కోవచ్చో లచ్చన్న ఈక్రుషి ద్వారా నిరూపించారు. ఒక గొప్ప నాయకునిగా ఈసందర్భంలో రైతాంగానికి సేవచేశారు . కొన్ని కేంద్రప్రభుత్వ చర్యలను కూడ మేము సత్యాగ్రహాలద్వారా కాకుండా అవి ఎలా రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయో అనే అంశాన్ని

బయటికి తీసుకొచ్చి ప్రతిఘటించి చూపించాము.

మమ్ములను ఒక జమీందారులు మాత్రమే కాకుండా ఇటీవల కాలంలో లైసెన్సుల ద్వారా, పర్మిట్ల ద్వారా సంపన్నులైన వారి సహచరులు కూడ వారి వారి స్వప్రయోజనాల కోసం వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. 1967 ఎన్నికలలో చేసినట్లుగానేరుగాను, మరికొన్నిసందర్భాలలో తమ డబ్బుద్వారాను దుష్ట పథకాలద్వారాను అన్ని ఎన్నికలలో నిరంతరం వీరు, వీరి ఏజంట్లు మమ్ము లను ఎదుర్కొంటూనేవున్నారు. లచ్చన్న గారు, వి.వి.రమణ ఎం.పి, నావద్ద శిక్షణ పొందిన ప్రగడ కోటయ్యగార్ల సహకారంతో వెనుకబడిన వర్గాలకు రాజ్యాంగం కల్పించిన అవకాశాలకు అనుగుణంగా ఉన్నత వర్గాలకు ప్రతిగా వారి హక్కులను వారు పొందడానికివీలుగా గట్టిక్పషిచేశారు. ఈనాడు ముఖ్యంగా నక్సలైట్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉంటున్న శ్రీకాకుళం జిల్లా ప్రజలు శతాబ్దాల తరబడి పేదరికంలో మగ్గుతూ ఉన్నారు. గత 50 సంవత్సరాలుగా వారు బెంగాల్,మధ్యప్రదేశ్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలోకి బ్రతుకుతెరువు కోసం పనులను వెతుక్కుంటూ వెళుతున్నారు.వారు ఆర్థికంగా పేదరికంలో ఉన్నప్పటికీ సాహసవంతులు, ఏదైనా సాధించాలనే పట్టుదలవున్నవారు. భూమి లేని వారైనప్పటికి కష్టించే స్వభావంకలవారైన క్రింది మధ్యతరగతి వ్యవసాయ కూలీలు. వైజాగ్, శ్రీకాకుళం జిల్లాలలోని వైజాగ్ ఓడల నిర్మాణ కేంద్రం, హార్బర్,కాట్రైక్స్ నూనెశుద్ధి కర్మాగారం, జంషెడ్‌పూర్, రూర్కెలా,భిలాయ్‌లలోని ఉక్కుమిల్లులు, హీరాకుడ్ డామ్‌నిర్మాణ పనులు , కరగ్‌పూర్, విశాఖపట్టణాల్లోని రైల్వేవర్క్ షాపులవంటి అనేక జాతీయ ప్రాజెక్టులలో ఈనాడు పనిచేస్తున్నారు. శ్రీ వి.వి గిరిగారిని ఆయన 20 సంవత్సరాల ప్రాయంలో ఈ ప్రాంతప్రజలు ఆహ్వానించి కార్మిక వ్యవహారాలలో నాయకుడిగా ఎదగడానికి ఆయనకు ప్రాతిపదిక ఇక్కడ నుంచే కల్పించారు. లచ్చన్నగారి సేవలను ఈప్రాంతప్రజలు ఎక్కువగా ఆదరించి నందు వల్లనే 1948 సంవత్సరంలో సంయుక్త మద్రాసు శాసన సభకు సర్కారు జిల్లాలకార్మిక ప్రతినిధిగా లచ్చన్నగారు ఎన్నికకాగలిగారు. మేము ఐ.ఎన్. టి,యు.సి,ని నడుపుతున్నపుడులచ్చన్నగారు దానిలో ప్రముఖపాత్రను నిర్వహించగలిగారు. శ్రీ లచ్చన్నగారు ఐ.ఎన్.టి.యు.సి. ఆంధ్రరాష్ట్ర శాఖకు ఆసమయంలో ఉపాధ్యక్షులుగాను, అధ్యక్షులుగాను పనిచేశారు. ఆంధ్రాలోని శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలు ఒరిస్సాలోని హీరాకుడ్, గంజాంజిల్లాలు జనాభాదృష్టిలోనూ, వనరుల సంబంధంగానూ కూడా ఆటవిక ప్రాంతాలుగానే లెక్క. అనేకమంది మా సాంఘిక సేవకులు నిరాదరణకు గురైన ఈప్రాంతప్రజ బ్రిటిమ పాలకుల దోపిడీలు, దౌర్జన్యాలనుంచి కాపాడేందుకు కీర్తిశేషులైన కోదండరామయ్యగారు ప్రారంభించిన ట్రైబల్ వీపుల్స్ అసోసియేషన్ శ్రీ యం. క్రిష్ణమూర్తి, 1933 నుంచి యం. ఎల్.ఏ.గా ఉంటున్న శ్రీ బి. లప్పారావు గార్ల సహకారం పైనేపూర్తిగా ఆధారపడవలసి వచ్చింది. త్యాగధనులైన మా కార్యకర్తలు అనేకమంది అక్కడ సరైన ఆహారం వసతి లేకుండా మలేరియా వంటి జబ్బులను భరిస్తూ, ఆక్కడి ఆదివాసులను సంఘటిత పరుస్తూ, వడ్డీ వ్యాపారస్తులనుంచి, ముఠాదారులనుంచి వర్తకులనుంచి, పైత్తందార్లనుంచి వారిని రక్షించేందుకు పూనుకొని ఆసందర్భంలో ముఠాదారీ విధానాన్ని రద్దుచేయాలనే మా కోర్కెను సూత్రప్రాయంగా

ప్రభుత్వంతో ఆమోదింపజేయగలిగాము. ఈరోజు వరకు కూడ ఈ విధానాలు ఆదివాసులను ఇంకా వేధిస్తూనేవున్నాయి. శ్రీ లచ్చన్న గారికి 1955 సంవత్సరంలోను, 1953- 56 సంవత్సరాలలోను మంత్రిగా పనిచేసే అవకాశం లభించింది. రెండు సందర్భాలలోను హరిజన గిరిజన సాంఘిక సంక్షేమ శాఖను మాత్రమే కోరుకొని ప్రజాసేవకోసం ఆయన తన అంకిత భావాన్ని రుజువు పరచు కున్నారు, ఆయన కృషి ఫలితంగానే ట్రైబల్ పీపుల్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ (గిరిజన ఆర్థిక సహాయ సంస్థ) అవతరించి, మొదటి సారిగా గోడౌన్ల నిర్మాణం చేసి వారి ఆటవిక ఉత్పత్తులలో వ్యాపార వర్గాలవల్ల దగా పొందకుండా ఆటవిక జాతులవారికి సహాయ పడేందుకు పూనుకొంది. నక్సలైట్ల ప్రభావం ఈ ప్రాంతంలో బాగా ఉన్నప్పటికి ఈప్రాంత ప్రజలు నిర్మాణాత్మక కృషిలో బాగా పాల్గొంటూ అటు నక్సలైట్లు ఇటు పోలీసుల నుంచి వచ్చే వత్తిడులు తట్టుకుంటూ నిబ్బరంగా నిలువగలుగుతున్నారు. చివరికి ఈ నాటికి నిర్బంధ కూలీ విధానం చట్టపరంగా అవతరించింది.

హరిజనుల సంక్షేమం, అభివృద్ధి 1920 వ సంవత్సరం నుండే మాకు ప్రేతికరమైన అంశాలు. లచ్చన్నగారు అభ్యుదయ గామి యైన బారువా హరిజన సేవ సంఘానికి చక్కనివారసులు. నాపర్యటనలో 1933వ సంవత్సరంలో బారువా హరిజన కేంద్రంలో తన తోటి సోంపేట హరిజనయువకులతో కలసి పని చేస్తున్న లచ్చన్నగార్ని చూశాను. ఒక బారువా హరిజన యవకుడిని మొదట ప్రాథమిక పాఠశాలలోచేర్చి, ఆ తరువాత హైస్కూలుకు పంపి, తరువాత కళాశాల లోను, న్యాయశాస్త్రాన్ని అభ్యసించేందుకు తోడ్పడి చివరికి ఆయన శాసన సభ్యుడు ఆయేంత వరకు కృషిచేసిన లచ్చన్నగారిని ఎవరైనా అభినందించవలసిందే. ప్రస్తుతం ఆయన హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నారు. ఆయన సోదరులు యం.ఎల్.ఏ.గావున్నారు. లచ్చన్నగారు బారువా పంచాయతీ అధ్యక్షులుగా ఉన్నప్పుడు లేబరు హౌసింగ్ కాలనీ నొక దానిని నిర్మించేందుకు పూనుకున్నారు. దాని ప్రారంభోత్సవం చేస్తూ నేను హరిజనులు, గిరిజనులు, నేతపనివారు, చేపలు పట్టేవారు ఇంతవరకు కూడ తమ దురదృష్టకరమైన పరిస్థితులనుండి బైటపడలేనందుకు వాటి సాధనకు ఉపమోగపడని మన ప్రణాళికలను విమర్శిస్తూ ప్రసంగించాను. ఈనాటి వరకు మన గ్రామాల్లో ఉన్న పల్లెల్లో ప్రతి ఇరవై లో ఒకటి అగ్నికి ఆహుతి అవుతూనే ఉన్నాయి. ఈవిషయంలో పెంకుటిళ్లను కట్టించి వారికి ఎవరు సహాయపడగలరు. వైద్య ఆరోగ్య రంగంలో వైద్యశాలనుంచి అవసరమైనప్పుడు సహాయం పొందడంలో గత 40 సంవత్సరాల కాలంలో గొప్పమార్పు సంభవించింది.. అయినా ఈవేద ప్రజలకు వారికి లభించవలసిన వాటాను కూడా ఈ సందర్భంలో వారు పొందలేక పోతున్నారు. కనీస ప్రాథమిక అవసరమైన దీని విషయంలో కూడ వైద్య సిబ్బందినుండి వీరు తగు సహకారాన్ని అందుకోలేక పోతున్నారు. కోస్తా జిల్లాలో కుమ్మరోగులు ఎక్కువగా వున్నట్లులెక్క, మాజీ ఎం. ఎల్. సి. శ్రీ రాఘవదాసు నాయకత్వంలో మన కార్యకర్తలు వారిని డచ్ మిషన్లవద్దకు తీసుకు వెళ్లేందుకు ప్రభుత్వ కేంద్రాల్లో చేర్పించేందుకు తగు సంపాం నిచ్చేందుకు తీవ్రంగా కృషిచేస్తున్నారు.

ప్రణాళికద్వారా అనేక అవకాశాలు కలుగజేస్తున్న ఈరోజుల్లో కూడ ఉద్యోగం కోసం వేద ప్రజలు పడుతున్న హృదయ విదారకమైన కథలు మనం వింటున్నాం. ఇది రైల్వే

ప్రాజెక్టులోని కూలి పనుల సందర్భం లోను నాల్గవ తరగతి ఉద్యోగాల విషయంలోను మనకు ఎక్కువగా కనిపిస్తుంది. కొంతమంది నిర్మాణ కార్యకర్తలు రాజకీయ వేత్తలు కూడ ఇదే మాదిరి జంకు గొంకు లేకుండా ఆవిషయంలో వారితో కలసి పరిగెడుతున్నారు. శ్రీ లచ్చన్న గారు ఆయన సహకార్యకర్తలు అసహాయులైన ఇలాంటి ప్రజలకు తోడ్పడేందుకు ముందుకు రావడాన్ని నేను చాలా సందర్భాల్లో చూశాను.

1935, 1936 సంవత్సరాలలో రైతాంగ విశ్వవిద్యాలయం నుంచి పట్టా పుచ్చుకున్న వారిలో లచ్చన్న గారు ఒకరు. 1938వ సంవత్సరంలో ఫరగ్‌పూర్‌లో లచ్చన్నగారు వేసవి పాఠశాలలను నిర్వహించారు. కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతంలో ఆయన పూర్తి నమ్మకంకలిగినవారు. ఆయన స్వాతంత్ర్య పోరాటంలో చాలా సంవత్సరాలు జైళ్లలోను, అజ్ఞాత వాసంలోను గడిపారు. ఆయన ఆంధ్రా కాంగ్రెస్‌కు కార్యదర్శిగా పనిచేశారు. అఖిల భారత వెనుక బడిన తరగతుల సమాఖ్యకు కార్యనిర్వాహక అధ్యక్షులుగాఉన్నారు కల్లు గీతవివారణసత్యాగ్రహ సందర్భంలో లచ్చన్న గారిసతీమణి శ్రీమతి యశోదాదేవి జైలుకువెళ్లారు.

శ్రీ గోగినేని లక్ష్మీ నారాయణ

గోగినేని లక్ష్మీనారాయణ ఇరవై సంవత్సరాల పాటు తన విలువైన సమయాన్ని కాంగ్రెస్ పార్టీ కోసం, కిసాన్ ఖేత్ మజ్‌దూర్ ఉద్యమాల కోసం నా పర్యవేక్షణలో అంకితం చేశారు. ఆయన తన పిత్రార్జితాన్ని, వ్యవసాయం ద్వారా లభించిన ఆదాయాన్ని మొత్తం జాతీయ సామాజిక సేవల కోసం వినియోగించారు, ఆయన 1928-33 సంవత్సరాల మధ్య కలకత్తా విద్యార్థి ఉద్యమంలో విప్లవకరమైన పాత్రను నిర్వహించారు. దాని కారణంగా బెంగాల్ విద్యార్థి ఉద్యమంలో విప్లవకరమైన పాత్రను పోషించారు. ఆ కారణంగా బెంగాల్ విద్యార్థి కాంగ్రెసుకు ఆయన ప్రధాన కార్యదర్శి అయినారు. నేను ఒక నెల రోజులపాటు హౌరా, ధండం జైళ్లలో ఉన్నప్పుడు జైలు అధికారులనుంచి నామమాత్రమైన ఆమోదాన్ని పొందుతూ వార్తాపత్రికలు, ఇతరత్రా మాకు కావలసిన వాటిని నాకు, నాతోపాటు జైళ్లలోఉన్న ఇతర నిర్బంధితులకు తెచ్చి అందిస్తుండేవారు, ఆయా గదులు అనేక సార్లు పోలీసులు సోదాచేయడం జరిగింది. నెలల తరబడి ఆయనపై పోలీసు నిఘా ఉండింది. ఆనాటి విద్యార్థులలో ఆయన మొదటి శ్రేణిలో ఎం, ఏ. (ఆనర్సు, ఎకనమిక్స్) డిగ్రీని పొందారు, బి.ఎల్. డిగ్రీ తీసుకున్న తరవాత బార్‌లో సభ్యులయ్యారు. మా కుటుంబంలోని వారు ఆయన కోర్టుల్లో ప్రాక్టీసు పెట్టుకుంటే బాగుంటుందనుకున్నారు. అయితే ఆయన విద్యావంతులయిన మేధావుల సహకారం నాకెక్కువగా కావలసి వుంది కాబట్టి తాను నాతో కిసాన్ ఉద్యమంలో ఉంటే బావుంటుందని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీలోని అనేక మంది నాతో సరిగా సహకరించక జమీందారులు, షావుకారులకు వ్యతిరేకంగా నేను నడుపుతున్న ఉద్యమాలను దొంగచాటుగా గమనిస్తూ దూరంగా ఉండడాన్ని గమనించిన ఆయన ఈ నిర్ణయానికొచ్చారు. అప్పటికి నాకు తోడ్పడుతున్న వారు అప్పికట్లకు చెందిన శ్రీ అచంట నాగయ్యగారు, నా సోదరుడు గోగినేని వెంకటప్పయ్యగారు, నిడుబ్రోలుకు చెందిన శ్రీ యన్. వి.సుబ్బయ్య, శ్రీమతి భారతిదేవి, విజయవాడకు చెందిన శ్రీ.కె. మధుసూధనరావు, నెల్లూరు నుంచి శ్రీ యన్. వెంకట్రామా నాయుడు గార్లు మాత్రమే వారు గ్రామీణ ప్రాంతాలలోని పల్లెప్రజలు అభివృద్ధికోసం నేను సాగిస్తున్న రైతు ఉద్యమం విజయవంతంకాగలదని పూర్తిగా నమ్మినవారు.

వ్యవసాయ కార్మికులను సమీకరించటంలో వెంకటప్పయ్య గారికి మంచి సామర్థ్యంఉంది యన్.వి. సుబ్బయ్యగారు తన సంగీత సామర్థ్యంతో బాగా ప్రచారం చేయ గలిగిన మంచి ప్రచారకులు. ఆయనకు నేను చేస్తున్న పని మీద గొప్ప విశ్వాసం. జి.వి. సుబ్బయ్యగారు, నాగయ్య గారు రైతులతో తమకు ఉన్న సంబంధాల దృష్ట్యా సత్సంబంధాల సాధనకు ప్రయత్నిస్తూ ఉండేవారు. మధుసూధనరావుగారు, వారి కుటుంబంలోనుంచి నలుగురు స్వాతంత్ర సమర యోధులు ముందుకువచ్చారు. ఆ కుటుంబగౌరవం ఆధారంగా కృష్ణా జిల్లాలో మాఉద్యమ వ్యాప్తికి తీవ్రంగా ప్రయత్నిస్తుండేవారు. కవి, పత్రికా రచయిత

శ్రీ యన్. వెంకట్రామానాయుడు జమీందారీ రైతులను సమీకరిస్తుండేవారు. నా సోదరులు లక్ష్మీనారాయణగారు న్యాయస్థానాలలో ప్రాక్టీసు పెట్టి బాగా అభివృద్ధి ని సాధిస్తుండడంతో మాకు బాగా శిక్షణ పొదిన మేధావుల కొరత ఏర్పడింది. ఆయనను దానిని వదలివేసి కిసాన్ ఖేత్ మజ్‌దూర్ ఉద్యమంలో పనిచేయవలసిందిగా నేను కోరాను. మా అమ్మగారు మాపై బ్రిటిష్ ప్రభుత్వం దమననీతి సాగించిన సందర్భంలో అప్పటికే గాయపడి ఉన్నారు . నేనూ, నాసతీమణి శ్రీమతి భారతీదేవి అనుభవించిన జైలు శిక్షలు, మేనల్లుళ్లు, మేనగోడళ్లు అంతా జైళ్లకు వెళ్లిరావడం ఆయనను గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం ప్రారంభించిన మా ఉద్యమంలో ప్రవేశించేందుకు అంగీకరింపజేశాయి . 1930వ సంవత్సరంలో, 1930-31 లో నేను జాతీయ సత్యాగ్రహోద్యమంలో పాల్గొంటున్న తరుణంలో డిప్యూటీ కలెక్టరుగా నేరుగా ప్రభుత్వ సర్వీసులో చేరవలసిందిగా ఆయనకు ఆహ్వానం వచ్చింది. అయినప్పటికీ మా కుటుంబమంతా నా కోర్కెను, మా తమ్ముడి అభిమతాన్ని మన్నించి గ్రామీణ ప్రజా ఉద్యమంలోకి ఒక మేధావిగా ఆయన ప్రవేశించడానికి అంగీకరించింది.

నాతో ఆయన పూర్తి స్థాయి కార్యకర్తగా రైతాంగ ఉద్యమంలో ప్రవేశించడమంటే ఉచితంగా ఆయన సేవలను అందించడమే గాక తన ఆదాయాన్నంతా ప్రజాసేవకై వినియోగపరుస్తూ స్వతంత్రమైన బ్రతుకు తెరువుకు తనకున్న అవకాశాలను వదలుకొని తనతోటి ప్రజాసేవలో గడుపుతున్న కార్యకర్తలకు తగు విధంగా సహాయపడేందుకు కూడా ముందుకు రావడమన్నమాట. అప్పటి వరకు పాత పద్ధతుల్లో కాంగ్రెస్‌లో పని చేస్తున్న చాలా మంది కార్యకర్తలకు ఆయన ఈ త్యాగం అంతగా రుచించలేదు. గాంధీ మార్గంలో పనిచేస్తున్న వారిలో ఎక్కువమంది ఆ సమయంలో మాతో కలసిరాలేదు. అందువల్ల అవసర సమయంలో నాతో పని చేసేందుకు అంగీకరించిన లక్ష్మీనారాయణగారి నిర్ణయం, దానిని బలపరచిన మా కుటుంబఅభిప్రాయాలు రైతాంగ సేవలో గొప్ప విలువైన విషయాలు. నేను అందుకాయనకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను .

లక్ష్మీనారాయణగారు ఆర్థికశాస్త్రంలో నాకు తొలి విద్యార్థి. 1925-26 సంవత్సరాలలో మెట్టగ్రామాలలోని రైతుకూలీల పరిస్థితుల గురించి పరిశోధన సాగిస్తున్నప్పుడు గుంటూరు చుట్టు ప్రక్కల ఉన్న మెట్టగ్రామాలప్రజల నుంచి స్వచ్ఛంద సమాచారం సేకరిస్తూ ఆయన నాకు తోడ్పడుతూ ఉండేవారు. నేను; పనుల మార్పిడి, తాత్కాలికంగా పనిచేస్తున్న వారికి పర్మనెంటు ఉద్యోగాల కల్పన, నిరుద్యోగం, గ్రామీణ ప్రాంత కార్మికులకు బీమా సౌకర్యం, వయోజన ఓటుహక్కు, అంటరానితనం నిర్మూలన, వ్యవసాయ కార్మికుల సాంఘిక ఆర్థిక పరిస్థితుల మెరుదలల గురించి తెలుగు దినపత్రిక ఆంధ్ర పత్రికలో రాస్తూ ఉండే వ్యాసాలను , సిద్ధాంతాలను ఆయన చదువుతూ ఉండేవారు. 1923-27 సంవత్సరాల మధ్యకాలంలో నేను ప్రారంభించి నడుపుతున్న రైతు సంఘాలు, వ్యవసాయ కార్మిక సంఘాల లక్ష్యాలు,సిద్ధాంతాలకు ఆయన ముగ్ధులైపోతుండేవారు.ఆయన కలకత్తాలో విద్యాభ్యాసం చేస్తున్నపుడు ప్రొఫెసర్ రాధా కమల్ ముఖర్జీ గారితో బాగా పరిచయమేర్పరచుకొని ఆయన రాసిన గ్రంథం "ఫౌండేషన్స్ ఆఫ్ ఇండియన్ ఎకనమిక్స్"అనే దానిని బాగా చదివారు , వారి ద్వారా లక్ష్మీనారాయణ "ఎకనమిక్స్ ఆఫ్ ఖద్దర్" పైనా, ఆ సిద్ధాంతంపట్ల ఎంత మంది భారతీయ ఆర్థిక

శాస్త్రవేత్తల అంగీకారం ఉందో తెలుసుకున్నాడు. అప్పటికి భారతీయ ఆర్థిక రంగంలో బాగా ప్రచారంలో ఉన్న "ఇండియన్ ఎకనమిక్ జర్నల్" లో బారతదేశంలో వ్యాపారాయక పరిశ్రమల ఆధునికీకరణ అనే అంశాలపై వెలువడిన నా రచనల ద్వారా, భారతదేశ వ్యవసాయ ఆర్థిక విషయాలలో నా సిద్ధాంతం పట్ల ఆయన విశ్వాసాన్ని పెంచుకున్నారు. ఆప్పకట్లకు చెందిన మా దాయాది సోదరుడు కీ॥ శే॥ జి.వి. సుబ్బయ్య అప్పుడు మద్రాసు లో ఆర్థిక శాస్త్రంలో బి.ఏ. చదువు తున్నారు .అప్పుడు ఎకనమిక్ ఎంక్వైరీ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. 1928-29 సంవత్సరాలలో నేను దానికి కార్యదర్శిని, లక్ష్మీనారాయణ దాని పరిశోధనద్వారా కృష్ణా డెల్టాలో మాగాణి సేద్యం చేస్తున్న రైతులు కూడా చిన్న చిన్న కమతాల నుంచి రుణసౌకర్యం లభించక ఎరువులు, పనిముట్లు, భూమిశిస్తుల భారం హెచ్చుకావడంతో రెండు చేతులు నోట్లోకి రాక ఎలా అవస్థలు పడుతున్నారో గ్రహించగలిగారు. వారు స్థానిక మార్కెట్లో సంభవించే హెచ్చుతగ్గులను, వ్యాపారులు ఎక్కువ లాభాలు సంపాదిస్తూ ఉత్పత్తిదారులకు తగిన ప్రతిఫలం లభించకుండా చేస్తున్న విధానాలను, వారిద్దరూ కలసి పరిశీలిస్తూ మా గ్రామంతోసహా అనేక గ్రామాలలోని రైతుల స్థితిగతులను తెలుసుకొని శాస్త్రీయమైన ఒక అవగాహనను ఆ సర్వే ద్వారా పొందగలిగారు. నా పర్యవేక్షణలో శ్రీ జి.వి.సుబ్బయ్య లక్ష్మీనారాయణ గార్లు చేసిన ఈ సర్వేల పరిశీలనల వల్ల ఆయన కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్, కోఆపరేటివ్ రైసుమిల్లులు, కోఆపరేటివ్ సేల్స్ సొసైటీలను ఏర్పరచి 1933నాటికి వ్యవసాయ ఆర్థిక సిద్ధాంతవేత్తకాగలిగాడు. భూమి కలిగిన లేదా భూమిలేని వ్యవసాయదారులయిన రైతులను పెట్టుబడి దారీ ఆర్థికవ్యవస్థ క్రమేణా ఎలా కృంగదీస్తుందో గ్రహించిన లక్ష్మీనారాయణ నా వ్యవసాయసిద్ధాంతం సరైనదేనని తెలుసుకున్నారు. జాతీయ నాయకులు వాణిజ్య వర్గాలకన్నా రైతులను ఎక్కువగా సమర్థిస్తూ ముందుకు రావలసిన అవసరం ఉందని, జాతీయ సంపదను పెంచే కృషిలో తమకంటె దిగువ స్థాయిన ఉన్న వ్యాపారవర్గాలుతమకంటె ఎక్కువ ప్రాధాన్యతను జాతీయవ్యవహారాలలో పొందుతున్న తరుణంలో రైతులుకూడా దేశవ్యవహారాలలో ప్రముఖ పాత్రనిర్వహించేందుకు ముందుకురావాలని లక్ష్మీనారాయణ భావించారు. గాంధేయ సత్యాగ్రహపోరాటాలతో పాటు అన్ని తరగతుల, అన్నివృత్తులవారి సాంఘిక ఆర్థికాభివృద్ధికి అవసరమైన పోరాటాలను సమిష్టిగాను, విడి విడిగాను నడుపుతూ వారికి న్యాయంగా అందవలసిన దాన్ని అందే లాగ చూడవలసిన అవసరం కలదని లక్ష్మీనారాయణగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని భావించి, అందుకు గాను అన్ని వర్గాల ప్రజల మధ్య ఒక సంధాన కర్తగా వుంటూ కృషిచేశారు.

రైతులను స్వయంవృత్తి హక్కుదార్లుగా గుర్తించక భూములపై వారి శాశ్వత కౌలుదారీ హక్కులను కాంక్షిస్తూ భూమికి చెల్లించవలసిన కౌలును ఎప్పటికప్పుడు పెంచుతూ ఉండే జమీందారీ పద్ధతిని మేము అంగీకరించలేదు,ఎందుకంటే అక్కడ వ్యవసాయ క్షేత్రాలలో పనిచేసే రైతులకు యాజమాన్య హక్కులు లేకుండా వారు చేశారు. వారు ఉత్పత్తిచేసిన వస్తువులకు నగరాలలో వుండే వాడకందార్లకు, ఉద్యోగస్తులకు అనుకూలమైన రీతిలో ప్రభుత్వం నిర్బంధంగా తక్కువ ధరలను నిర్ణయిస్తూ ఉంటుంది. మేము గాంధీజీని జాతీయ నాయకునిగా గుర్తించి గౌరవించాము.ఆయన రచనలు, ఆయన బోధనలు గ్రామీణ ప్రాంతాల

ప్రజలకు సాంఘిక న్యాయం కల్పించేందుకు వారిని దుస్థితినుంచి కాపాడేందుకు ఉద్దేశితమైనవి. లక్ష్మీనారాయణ, సుబ్బయ్య, భారతీదేవి గారలు నా మొదటి అనుచరులు కావటానికి తోడ్పడిన కారణాలివి.

మౌలికాంశాలపైన గాంధీగారి ఆశీస్సులను పొందిన ఈ సాంఘిక విధానాన్ని మేము మా రైతాంగ విద్యాలయం ద్వారా మా తెలుగు వార పత్రిక వాహిని ద్వారా ప్రచారం చేసేందుకు ఆవిధంగా తగిన ప్రాముఖ్యంలోకి తీసుకొచ్చేందుకు నిర్ణయించుకున్నాము. వాహిని పత్రికకు కావలసిన నిధులను శ్రీమతి భారతీదేవి గారు సమకూర్చారు . మేము పెట్టుబడిదారుల వాణిజ్య ఆర్థిక రీతులకు కమ్యూనిస్టుల రైతాంగ వ్యతిరేక ధోరణులకు భిన్నంగా ప్రపంచ రైతాంగ సిద్ధాంతాన్ని ఒక దానిని తయారుచేసేందుకు ఆవిధంగా మేము ముగ్గురము పూనుకున్నాము. లక్ష్మీనారాయణగారిని ఆప్తకల్లకు చెందిన శ్రీ అచంట నాగయ్య శ్రీ ఏ. శేషయ్య మరియు శ్రీ యన్.వి. సుబ్బయ్య, శ్రీ వెంకటప్పయ్య, శ్రీ పి.బి.నాయుడు అంతా డిగ్రీ విద్యలో ప్రవేశించినవారై గాంధీజీ ప్రభావంలో రాజకీయ కార్యకలాపాలలో శిక్షితులైన వారంతా నాకు తోడుగా ఉండి బలపర్చారు, 1921-23 సంవత్సరాల కాలంలో పన్నుల నిరాకరణ, సహాయనిరాకరణ, ఉద్యమాలలో గాంధీజీ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేసేవారు , ఆయన 15 సంవత్సరాలపాటు శ్రీ అచంట శేషయ్య, శ్రీ జి.వి.సుబ్బయ్యగార్లకు మంచి స్నేహితుడుగా మిగిలారు. వారిద్దరూ కూడా వారికి లభించే ఆదాయాన్నంతా రైతాంగ ఉద్యమాలలో ఖర్చుచేశారు.

ఆయన చక్కటి అనుభవపరుడైన రైతునాయకుడు. జమీందారీ రైతులలో పాటు ఈనాందారీ రైతుల యాజమాన్య హక్కుల కోసం ఆయన గట్టిగా కృషిచేసి విజయం సాధించారు. బియ్యం, పొగాకు, నూనె గింజలు ఉత్పత్తి చేసేరైతులకు ప్రత్యేక సంస్థలను వేర్వేరుగా స్థాపించేందుకు ఆయన కృషిచేశారు, యుద్ధసమయంలో డిఫెన్స్ ఆఫ్ ఇండియా నిబంధనల క్రింద ఆయన తీవ్ర కష్టాలను ఎదుర్కొన్నారు. ఆహారధాన్యాలను నిర్బంధంగా సేకరించేవిధానానికి వ్యతిరేకంగా రైతుపోరాటాలు నిర్వహింపజేసి ఆయన డి.ఎ.ఆర్. క్రింద అరెస్టు అయి జైలు శిక్ష ననుభవించారు. యుద్ధసమయంలో అలాంటి శిక్ష ననుభవించిన మొదటి రైతు సత్యాగ్రహి ఆయనే. 1923వ సంవత్సరంలో నేను కాంగ్రెస్ పదవులను స్వీకరించిన తరవాత తిరిగి మాకుటుంబాన్ని జాతీయస్థాయికలిగిన దేశభక్తుల కుటుంబంగా మార్చిన ఘనత ఆయన వల్ల కలిగింది. ఆయన కూడా గాంధీజీ భక్తులే. ఒక గొప్ప జాతీయనాయకునిగా ఆయన గాంధీగారిని ఎంతగానో కొనియాడుతూ ఉంటారు. ఆయన కలకత్తాలో ఉండగా బెంగాల్ విద్యార్థులతో ఆయనకు ఎక్కువగా ఉన్న అనుబంధాలు ఆయనను సుభాష్‌చంద్రబోస్ తీవ్రవాదానికి దగ్గరగా తీసుకెళ్లాయి. కాంగ్రెస్ సంస్థకు, తిరుగుబాటు దారులకు మధ్యనచ్చిన వివాదంలో ఆయన నెహ్రూ విధానంతో ఏకీభవించడం గాని, వ్యతిరేకించడంగాని ఈ కారణంగా చేయ లేకపోయారు. ఆయన కిసాన్ మజ్‌దూర్ కార్యకలాపాలను అంగీకరించి నేను ప్రారంభించిన విధంగా విద్యార్థులకు, యువకులకు, కూలీలకు, రైతులకు, కార్మికులకు, ఆటవిక జనాలకు, చేతివృత్తులవారికి విడి విడిగా ప్రత్యేక సంఘాలను ఏర్పాటుచేస్తూ వాటిచేత పనిచేయించేందుకు కృషిచేస్తూవచ్చారు. కమ్యూనిస్టుల

నియంతృత్వానికి వ్యతిరేకంగా రైతుల, కూలీల, చేతివృత్తులవారి మేధావుల కిసాన్ మజ్‌దూర్ (కళాకారులు,బుద్ధిజీవులు) ప్రజారాజ్య స్థాపన ప్రయత్నంలో ఆయనకు ఎనలేని విశ్వాసముంది. ఆసిద్ధాంతంలో ఆయనకు పూర్తిగా నమ్మకముంది . 1944 లో గాంధీజీ మా కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని అంగీకరించడంతో ఆయన ఎంతగానో ఆనందించారు.

నేను రాసిన అనేక పుస్తకాలకు ఆయన సంపాదకులుగా వున్నారు. వాటిలో ముఖ్యమైనవి "కిసాన్ స్పీక్స్ " , "కిసాన్ మూవ్‌మెంట్", "కిసాన్ హేండ్‌బుక్" కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యం "(ప్రణాళిక)." అంటరానితనం నిర్మూలనకు, నిరక్షరాస్యతను తొలగించేందుకు, మత మూర్ఖత్వాన్ని రూపుమాపేందుకు, కృషీకార్ లోక్ పక్షం చేపట్టిన బోధనా కార్యక్రమాలన్నింటిలోను, ఆయన మాతో సహకరించారు. కుటీర పరిశ్రమలను; స్వయం వృత్తులను; వాటికి ఆధార మైన యితరేతరమైన వాటిని ఆయన మనఃపూర్వకంగా సమర్థించేవారు.

లక్ష్మీనారాయణ, యన్.వి.సుబ్బయ్యగార్లు ఇద్దరూ శెట్టిపల్లిగారి విప్లవగీతాలను శ్రావ్యంగా పాడుతుండేవారు. వెంకటప్పయ్యగారు వీరికి తోడు వాద్యసహకారాన్నందించేవారు. ఈముగ్గురూ కలసి రెండు దశాబ్దాలకు పైగా ఊరేగింపులలోనూ.పాఠశాలలలోనూ, చక్కని భజనలను కొనసాగిస్తూ మంచి వాతావరణాన్ని కల్పిస్తూ ఉండేవారు.

ఆయన ఒక మంచి గాంధేయవాది. నేను ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులుగా పనిచేసిన అయిదు సంవత్సరాల కాలం ఆయన నాకు మంచి సహచరుడుగా పనిచేస్తూ వచ్చారు ఆయన ఎప్పుడూ కూడా తనకోసం గానీ, బందుమిత్రులకోసం గానీ ఇబ్బందులలో ఉన్న తోటికార్యకర్తల కోసం గానీ సహాయంచేయమని అడిగి ఆశ్రితపక్షపాతమంటే సహించని నన్ను ఇబ్బందిపెట్టలేదు. నేను ఎప్పుడూ ఆయనను ప్యారిస్, వాషింగ్టన్ నగరాలలో జరిగే ప్రపంచ రైతుసభలకు గానీ, ఆహార సంస్థల సమావేశాలకు గానీ ప్రతినిధిగా పంపలేదు. ఒక మారు అలా పంపేందుకు నేను సూచన చేసినప్పుడు ఆయన తన కంటె దిగువన వున్నవారి పేర్లను సూచించి వారిని పంపమని చెప్పారు. ఆయన సూచన తనకంటె వెనుక వున్నవారిని ప్రోత్సహించడంద్వారా వారిని మా కిసాన్ ఉద్యమంవైపు ఆకర్షించేందుకు ఎంతగానో ఉపయోగపడింది. ఆయన హృదయం అంత విశాలమైనది.

యఫ్.ఏ.ఓ. తాలూకు మొదటి ఇంటర్నేషనల్ రైస్ కమిషన్లో చేరిన ఆయన ప్రసంగాలు చాలా విలువైనవి. ఆ సభలు రంగూన్‌లో జరిగాయి. ఇరిగేషన్ బోర్డు చైర్మన్‌గా ఉన్నప్పుడు కృష్ణా డెల్టాకు సకాలంలో కాల్వల రిపేరు, సక్రమ నీటి పంపిణీని సాధించి ఆ పదవిలో మంచిసేవలను అందించారు. 1933 నుంచి 1951 సంవత్సరం వరకు కిసాన్ పాఠశాలలలో ఆయన స్థానికోపాధ్యాయుడుగా పనిచేస్తూ నా కార్యక్రమాలకు చేయూతనిచ్చారు. ఆంధ్ర కిసాన్ కాంగ్రెస్‌కు మూడు సంవత్సరాలపాటు ఆయన అధ్యక్షులుగా ఉన్నారు.

లక్ష్మీనారాయణ, వెంకటప్పయ్య, శేషయ్య, నాగయ్యగార్లు మా రైతు యాత్రలను నడిపారు. మద్రాసుకు వెళ్లిన వెయ్యి మైళ్ల రైతుయాత్ర వారు సాగించిన వాటిలో గొప్పది. వారు గుంటూరు జిల్లాలో వేర్వేరు ప్రాంతాలనుంచి ముక్కోణాలలో యాత్రలను నడిపిస్తూ

రైతాంగంలో ఆవేశకావేషాలను రగిల్చారు. శేషయ్య లక్ష్మీనారాయణగారలు అనేక సందర్భాలలో శత్రువుల కోపతాపాలకు గురయ్యారు. అక్కడి సంఘ వ్యతిరేక శక్తుల బారిన పడకుండా ఉండేందుకు స్థానిక రైతులు వారికి ఎక్కువగా తోడ్పాటునందించారు.

ఆయన మన కిసాన్ ల తెలుగు వార పత్రిక వాహినికి సంపాదకులుగా ఉంటూ యుద్ధ సమయంలో భారతీదేవిగారితో కలసి సమంగా నష్టాలను గూడా భరించారు. రామానీడు విద్యాలయస్థాపనలో భూములను, స్థలాలను దానమివ్వడంతో ఆయన నా మరో సోదరుడైన వెంకటప్పయ్యగారితో సహకరించారు. అది ఆ తరువాత రైతాంగ విద్యాలయంగా రూపాందింది.

నిడుబ్రోలు పి.బి.ఎన్.కాలేజి ప్రారంభదినాల్లో, రామానీడు విద్యాలయాన్ని ఆ కాలేజీ అవసరాలకై ఒప్పగించడంలో ఆయన మా అందరితో సహకరించాడు. ఆ కళాశాలకు మా కుటుంబం తన పూర్తి సహకారాన్ని వాగ్దానం చేసింది.

అఖిలభారత కిసాన్ కాంగ్రెస్‌కు (సభ) ఆయన, భారతీదేవిగారు అధ్యక్షులుగా ఉన్నప్పుడు ప్రజా యుద్ధ నినాదం ద్వారా కాంగ్రెసు పక్షానికి వ్యతిరేకమైన కమ్యూనిస్టుల హస్తాలలో పడకుండా దానిని కాపాడుతూ వారిరువురూ చక్కగా నిర్వహించారు. ఆయన. 1942 లో అఖిలభారత కిసాన్ కాంగ్రెస్ కమ్యూనిస్టుల చేతులలోకి పోయిన తరవాత దానిని, వారిని కూడా ధైర్యంగా ఎదుర్కొన్నారు. కిసాన్ సమ్మేళనం పేరుతో జాతీయ వాదంతో కూడిన ఒక ప్రత్యేక రైతు వేదికను ఆ సందర్భంలో ఆయన ఏర్పాటుచేశారు.

కృషీకార్ లోక్ పార్టీ నిర్వహణలో ఆయన నాకు సహాయపడడమే గాక, రైతులకు ఖేత్‌మజ్‌దూరులకు తదితర స్వయంవృత్తుల వారికి ఒక ప్రత్యేక వేదికను స్థాపించుకొనే ప్రయత్నంలో గొప్పగా సహకరించాడు, ఆయన ఓడిపోయిన తరవాత ఆ సమయంలో మేము చాలా మందిమి ఓటమిపాలైనాము. అధికార కాంగ్రెస్ వర్గాల పరోక్ష ప్రోద్బలంతో మనలో ఉంటున్న రైతుఉద్యమ కార్యకర్తలు కొంతమంది ఆయనను బాగా నిందించడంతో బాగా విసుగుదలకు లోనై రాజకీయ రంగంనుంచి ప్రక్కకుతప్పుకోవడానికి నిర్ణయించుకొన్నారు. 1952-53 సంవత్సరం నాకు భారతీదేవి గారికి కూడా దురదృష్టకరమైన సంవత్సరం. ఎందుకంటే నాతో సన్నిహితంగా మెలుగుతూ సహకరిస్తున్న ఒక గొప్ప మేధావి రాజకీయాలనుంచి తప్పుకొని నాకు దూరమైన సంవత్సరమది. అరవై సంవత్సరాలకాలం ఆయన మమ్మల్ని బలపరుస్తూ మాతో కలసి తిరిగి రైతాంగం కోసం తన కాలాన్ని ధనాన్ని వినియోగించారు.ప్రతిరాజకీయ బాధితునికి ఇచ్చినట్టుగా ఆయనకు అయిదు ఎకరాల భూమిని ఇవ్వజూపితే దానిని ఆయన నిరాకరించారు. ఎందుకంటే భూములకోసం, పదవులకోసం తాను రాజకీయల్లో ప్రవేశించి జైళ్లకు వెళ్లలేదు గనుక, అటు వంటి ప్రభుత్వస్థలాలు భూమిలేని నిరుపేదలకు పంచిపెట్టమని చాలాకాలంగా తానుకోరుతున్నందువల్ల అందుకు భిన్నమైన రీతిని ఆయన అంగీకరించలేదు. రాజకీయ బాధితులుగా ఇతరత్రా ప్రభుత్వం ఇస్తున్న అనేక రకాల సహాయాన్ని పొందడానికి కూడా ఆయన అంగీకరించలేదు. ఈరోజు అటువంటి సహాయాన్ని అనేక మంది మాజీమంత్రులు, ధనవంతులైన స్వాతంత్ర్య సమర యోధులు వారికి సహాయం తీసుకోవలసిన అవసరంలేక పోయినప్పటికి తీసుకుంటూనే ఉన్నారు.

నన్ను విడనాడి తమ వర్గంతో చేతులు కలిపితే ఆయనకు అనేక రకాల అవకాశాలను, అధికారాన్ని అధికార కాంగ్రెస్ వారు ఇవ్వజూపినప్పటికి ఆయన తృణీకరించి ఈ రెండు దశాబ్దాలుగా నాకు వ్యక్తిగతంగాను; రైతు ఉద్యమపరంగాను నమ్మకమైన విధేయునిగా పనిచేశారు. 1931 వ సంవత్సరంలో ప్రభుత్వ ఉద్యోగాన్ని, ఆ తరువాత తన దగ్గరకొచ్చిన మంత్రి పదవులుసైతం ఆయన తృణ ప్రాయంగా త్రోసిపుచ్చి త్యాగం చేయగలిగారు. లక్ష్మీనారాయణగారు ఈ రోజుకు కూడా గ్రామీణజనాలకు స్వయంవృత్తులవారికి అభిమానపాత్రులుగా, వారి సేవలకోసం అంకితమైన వ్యక్తిగా తన జీవితాన్ని గడుపుతున్నారు, ప్రభుత్వం ఎక్కడనైనా రైతాంగ వ్యతిరేక చర్యలకు పూనుకొంటే ఆ సమయంలో కావలసిన సంపోలను ఆయన అందిస్తూనే ఉన్నారు. అన్నివిధాలనేను ఆయనకు కృతజ్ఞుడ్ని.

36

శ్రీ రామ మనోహర్ లోహియా

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో శ్రీ ఇ.వి.రామస్వామి నాయకర్ తరవాత శ్రీ రామమనోహర్ లోహియా గారు మాత్రమే తుఫాను వేగంతో పయనించే తీవ్రవాద ధోరణి కలిగిన గొప్పవ్యక్తి. రామస్వామి నాయకర్ చాలా పెద్దవాడు. దేనినీ లక్ష్యపెట్టని గొప్ప సాంఘిక విప్లవవాది. శ్రీ లోహియా గాంధీ, నెహ్రూల యుగంలో జరిగినట్లుగా విశ్రాంతి లేని ఆందోళనను, ఉద్యమాలను నడుపుతూ ఆ రకంగా అవసరమైనపుడు జైళ్లకు వెళ్తూ స్థానిక ప్రజా సంఘాలను శక్తివంతం చేస్తూ వారికి తగు విధంగా బోధలు చేస్తూ మేలుకొల్పాలనే దృష్టితో వుంటుంటారు. అనేకమంది ఈ మార్గంలో పయనిస్తున్నవారు ఉన్నప్పటికీ క్రొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశాలకు లోహియా చూపిన దారులే మార్గదర్శకంగా ఉంటుండేవి. అవిశ్రాంతమైన ఆలాంటి పోరాటాలు ప్రతిపక్షాలకు వేడి పుట్టిస్తూ పార్లమెంటరీ విధానాలతో అవి బలహీన పడకుండా ఉండేపద్ధతికి దోహదం కలిగిస్తాయి.

స్వతంత్ర బ్రిటిష్ లేబరు పార్టీ నాయకులు మాక్స్‌టన్ ప్రజాస్వామ్యంలో సోషలిస్టు ప్రతిపక్షం, స్థానిక కార్మిక పోరాటాలు, రైతాంగ ఉద్యమాలు, పురపాలక వ్యవహారాలలో గట్టి పోరాటాలకు పూనుకోకపోతే, అది సమర్థవంతమైన ప్రతిపక్షం కాజాలదని తీవ్ర వాదియైన సోషలిస్టులాగా చెప్పుండేవారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో సోషలిస్టులు ఎక్కువకాలం దాని పరిమితులకు లోబడి ఉండలేరు. చట్ట సభలలో ఉండే కొద్దిమంది సోషలిస్టులు పాధించే శాసనాలు, నిబంధనలు కల్పించే వత్తిడులను తట్టుకుంటూ సామాన్య ప్రజానీకానికి కావలసిన సేవలందించలేవని లోహియా తలపోశాడు. అందువల్ల ఆయన పార్లమెంటులో వ్యవహరించేటప్పుడు ప్రజల అభిప్రాయాలను, బాధలను ప్రకటించేందుకు దాన్ని ఒక ప్రజా వేదికగానే చూస్తూ, సాంప్రదాయ బద్ధమైన పార్లమెంటరీ పద్ధతులను తోసిరాజంటూ స్పీకరును, మంత్రివర్గాన్ని కూడా ఇరుకులో పెట్టే పద్ధతులను అవలంబిస్తూ, మాక్స్‌టన్ ఎత్తుగడల లాంటి ఎత్తుగడలతో పార్లమెంటును విస్మయంలో ముంచి వేయాలని భావించేవారు.

చిట్ట చివరికి ఆయన తన 63వ సంవత్సరంలో లోక్‌సభలోకి ప్రవేశించారు. గత రెండు సంవత్సరాల కాలంగా పార్లమెంటులో ఉన్న ఆయన అనుచరులు పార్లమెంటరీ సాంప్రదాయాలను గాలికి వదలివేసి నడచిన పద్ధతికి ఆయన తిరిగి ప్రాణం పోశారు. జీరో అవర్‌లో ఆయన చాలా ప్రముఖంగా ఉండేవారు. అది లోక్‌సభ స్పీకరుకు, రాజ్యసభ చైర్మన్‌కు, సభ్యులకు కూడా స్వేచ్ఛగా ఎట్లాబడితే అలా వ్యవహరించడానికి వీలైన సమయం. ఆ రోజు ఉదయం పేపర్లలోగాని, లేదా రేడియోద్వారాగాని లేదా పార్లమెంటు సభ్యులకు అందిన తాజా సమాచారం ద్వారా లభించిన ఏదైనా జాతీయ జీవితంలోని అత్యవసర పరిస్థితులపై మంత్రివర్గాన్ని లేదా మంత్రులను ఈ సమయంలో సభ్యులు నిలదీసే అవకాశం కలుగుతుంది.

అప్పటిదాకా స్పీకరు రూలింగుతోనూ నిర్ణయాలతోను నిర్దేశితమైన నిబంధనలతోను నడుస్తూ ఉండే పార్లమెంటరీ కార్యకలాపాలలో ఈ సమయం వాటికి భిన్నంగా కనిపిస్తుంది. స్వతంత్ర శాసన సభ్యులైనవారు ఈ సందర్భంలో ప్రజలకు సంబంధించిన ప్రత్యేక సందర్భాలలో పార్టీల తోడ్పాటు లేకుండానే తమకు తామై ప్రభుత్వంపై వత్తిడి కలిగించే అవకాశం కలుగుతుంది. తన కున్న సంఖ్యాబలాన్ని చూసుకొని నిర్లక్ష్యంగా ఉండే ప్రభుత్వాన్ని పార్లమెంటులో ఈ సమయాన్ని ఉపయోగించుకోవడం ద్వారా లోహియా గడగడలాడించేవాడు. జీరో అవర్‌లో జరిగే తన ప్రత్యేక ధోరణిద్వారా లోహియా గడగడ లాడించేవాడు. జీరో అవర్‌లో జరిగే తన ప్రత్యేక ధోరణి ద్వారా లోహియా విశేష ప్రాముఖ్యతను సంతరించుకున్నాడు.

లోహియా జర్మనీలో చదువుకుంటున్న రోజుల్లో మిగతా సోషలిస్టు ప్రముఖులైన అశోక్ మెహతా, మసానీ, జహీర్ బ్రదర్స్, జడ్.ఎ.అహ్మద్‌లం గార్లలాగానే తానుకూడా సోషలిస్టుగా మారాడు. ఆ తరువాత ఇందులో కొంతమంది కమ్యూనిస్టులుగాను దేశానికి స్వాతంత్రం వచ్చిన తరువాత కొంతమంది కాంగ్రెస్ పక్షంలోకి మారినప్పటికి నమ్మకమైన సోషలిస్టుగా ఆయన అలాగే ఉన్నారు. మాక్స్‌టన్ లండన్‌లో లేబరు పార్టీతో సర్దుకు పోలేనట్లుగానే లోహియాగారు కూడా కాంగ్రెస్ పక్షంతో సర్దుబాటుతో వ్యవహరించలేకపోయారు. లోహియాగారు నా వలె, ఇ.వి.ఆర్, అన్నా, బారిష్టరు రామస్వామి, అంబేద్కర్ గార్ల వలె భారతదేశంలో ఉన్న సాంఘికరీతులు, కులతత్వాలకు వ్యతిరేకంగా, కులాలమధ్య, జాతులమధ్య మతపరంగా సంభవిస్తున్న వ్యత్యాసాలకు వ్యతిరేకంగా ఆయన తన దృష్టిని సారించి ప్రత్యేకంగా పోరాడారు. మా ఇతర సామాజిక విప్లవకారుల లాగానే ఆయన కూడా ఈ విషయంలో మాకు సన్నిహితమైన అభిప్రాయాలు కలిగి ఉన్నారు. వెనుకబడిన వర్గాల ప్రజలు కులాలు, కర్మసిద్ధాంతాన్ని తోసిరాజని సమాన హక్కుల కోసం పోరాడి సాధించుకోలేనంతవరకు భారతదేశంలో సరైన ప్రజాస్వామ్యం ఏర్పడజాలందని ఆయన భావించారు. మన పల్లెల్లో హెచ్చుగాను, పట్టణాల్లో కష్టజీవులుగాను ఉంటున్న శూద్రులు, అంటరాని కులాలవారికి కూడ ఈ సందర్భంలో జరుగుతున్న అన్యాయాన్ని ఆయన గ్రహించారు. కాంగ్రెస్ పార్టీగాని ఇతర పక్షాలుగాని ఈ జనాన్ని చైతన్యవంతుల్ని చేయలేకపోయాయని వీరిలో ఎక్కువ భాగం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారని ఆయన గ్రహించారు. ఈ ప్రజలను చైతన్య వంతులను చేసి వారిని రాజకీయాలవైపు తీసుకు రావలసిందిగా ఆయన సోషలిస్టు భావాలతో పనిచేస్తున్న కార్యకర్తలను కోరారు. ఈ విషయంలో ఆయన నేను చేస్తున్న ప్రయత్నాలను హరిజనుల రైతుల కోసం నేను చేస్తున్న పనిని చూసి హర్షించి రైతాంగ ఉద్యమ పురోభివృద్ధి కృషిలో నాతో సహకరించేందుకు అంగీకరించారు.

1935-36 సంవత్సరాలలో ఆయన సి.యస్.పి. ఇంగ్లీషు వార పత్రిక సంపాదక బాధ్యతలను చూస్తున్న సందర్భంలో కలకత్తాలోని ఆయన గదిలో ఆయన సహకారం కోసం నేను ఆయనను కలుసుకున్నాను. మేమిద్దరం అక్కడ బెంగాల్‌కు చెందిన కృషిక్ ప్రజాపార్టీ నాయకులైన కీర్తిశేషులు ఫజలుల్ హక్ గారిని కలుసుకున్నాము. ఫజలుల్ హక్‌గారు ఆ తరువాత వచ్చిన ఎన్నికలలో ముస్లింలీగ్‌పై విజయం సాధించారు. దేశస్థాయిలో రైతాంగ

వేదికను ఏర్పాటుచేయాలని శాశ్వత సెటిల్‌మెంటు పద్ధతిని రద్దుచేయించి తద్వారా జమిందారీ విధానం యొక్క రెక్కలు విరిచేయాలని మేము ముగ్గురం అభిప్రాయ పడ్డాము. ఆ తరువాత మా రాజకీయ పక్షాలు విభిన్న మార్గాలలో ప్రయాణం సాగించినప్పటికి లోహియా గారు రైతాంగ కృషిలో మాత్రం ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తూనే వచ్చారు. "క్రెడో ఆఫ్ వరల్డ్ పీజెంట్స్" అనే నా పుస్తకం ద్వారా నేను సూచించిన అంశాలు లోహియాగారి భారత సామాజిక ఆర్థిక దృష్టికి దగ్గరలో ఉన్నాయనే అంశాన్ని ఆయన గ్రహించారు. ప్రపంచంలో కష్టజీవులైన ప్రజలందరిలో రైతులు మాత్రమే ఎక్కువ దుస్థితిలో ఉన్నారని ఎక్కువగా దోపిడికి గురవుతున్నారనే విషయాన్ని కూడ ఆయన గ్రహించారు. నా గ్రంథం "పీజెంట్ అండ్ కో-ఆపరేటివ్ ఫార్మింగ్" లో సూచించినట్లుగా సహకార వ్యవసాయం గ్రామ దానోద్యమాలకు వ్యతిరేకమైన మా సిద్ధాంతాలను ఆయన అభినందించారు.

సోషలిజానికి సంబంధించినంతవరకు ఉన్నత కులాల పట్టణ ప్రాంత ప్రజల అభిమతాలతో ఆయన అంగీకరించలేదు. ఆయన పద్ధతి సహజంగా తొందరపాటు ధోరణితో, కలవానికి కాలుదువ్వే వారుగా ఉండేవారు. అందువల్లనే ఆయన తన అభిప్రాయాలకు అనుగుణంగా ఎక్కడ సర్దుబాటు కాకపోయినా అక్కడ నుండి మరొక చోటుకి మారుతూ ఉండేవారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీనుండి సంయుక్త సోషలిస్టు పార్టీ వరకు ఇట్లా ఆయన అనేక పరిణామాలను చెందవలసి వచ్చింది. ఇవన్నీ బాధాకరమైన అంశాలైనప్పటికి భారత రాజకీయాల్లో అట్టడుగున పడిఉన్న వర్గాల సముద్ధరణ భావానికి ఆయన పూర్తిగా అంకితమై నడచిన మహావ్యక్తి. పురాణ పద్ధతుల్లో అణచివేయబడిన, సాంఘికంగా వెనుకబడిన వర్గాలను పైకితీసుకు రావడానికి, ఆయన మార్క్స్ మార్గాన్ని అనుసరించాడు. ఈ పద్ధతిలో యాదవులను, యు.పి. బీహార్‌లలోని కూర్మితరగతులు, యాదవులు, గూర్జరులు, హర్యానాలోని అహిరులు, జాట్లు, రాజస్థాన్ గూర్జరులు, అహిరులు, భిల్లులు వీరినే గాక వీరితోపాటు హరిజనులను ఆయన ఈ మార్గంలో ముందుకు లాగి ఆయన సోషలిస్టు పార్టీ ద్వారా ఇతర పార్టీల వేదిక పరంగాను వారికి కాలు నిలిపేందుకు వీలు కల్పించారు.

ఈ మార్గంలో ఆయన తననునుసరించిన వెనుకబడిన కులాల శాసనసభ్యులను లోక్‌సభలోను, యు.పి., బీహారు పార్టీల్లోను నాయకులుగా నిలిపారు. లోహియా చేపట్టిన ఈ తీవ్రమైన కృషి ఆంధ్రప్రదేశ్‌లో నేను, బీహారులో కాంగ్రెస్ పార్టీలు సాధించిన దానికన్నా అదనంగా వెనుకబడిన కులాల నాయకులు శాసనసభలలో బాగా ముందుకు రావడానికి వీలు కల్పించింది. 1971 సంవత్సరంలో శ్రీమతి ఇందిరాగాంధీ విజయాన్ని సాధించిన నాటినుండి కేంద్రంలోనే కాకుండా రాష్ట్రాలలో కూడా వెనుకబడిన వర్గాలకు నాయకత్వం లభింపజేసేందుకు ఎక్కువ కృషి చేయతలపెట్టింది. ఇందుకు లోహియాగారిని మనం అభినందించవలసిందే. నెహ్రూ యుగంలోని విప్లవ దృష్టికలిగిన గట్టి యువరాజకీయ వేత్తలను తనవైపు ఆకర్షించుకోవడంలో లోహియా సఫలీకృతుడైనాడు.వారు శాసనసభా వేదికల్లోనూ, కార్మికరంగంలోనూ, ప్రముఖ భూమికలను నిర్వహించారు.పార్లమెంటరీ వ్యూహాలలో అణగద్రొక్కబడిన ప్రజలను మంచి స్థానాలలోకి తీసుకురావడానికి ప్రయత్నించారు.

మధులిమాయే మేధావి. రాజ్‌నారాయణ ఇతరులు ఆపలేని జగడాలకోరు. జార్జి ఫెర్నాండెజ్ కార్మిక నాయకులు, పార్లమెంటేరియన్, పీటర్ ఆల్ఫాన్స్ రైల్వే పనివారం నాయకుడు. వీరేకాక వీరితో పాటు ఇంకా అనేకమంది ఉద్యమకారులు, ఆందోళనాకారులు, కార్యకర్తలు లోహియానుంచి భావస్ఫూర్తిని పొందిన వారై వీరంతా ప్రజావసరాలపై పత్రికలలో తగు ప్రచారం చేయించేందుకు తీవ్రంగా కృషిచేసేవారు. వీరు అమలు జరిపిన రాజ్యాంగ వ్యతిరేక శాసనసభా కార్యకలాపాలు కాంగ్రెస్ పార్టీకి అత్యవసర పరిస్థితివైపు వెళ్లేందుకు దారిచూపించాయనే అంశాన్ని కాదనగలమా?

పార్లమెంటులోను ప్రజావేదికలలోను ఇంగ్లీషు వాడకాన్ని నిషేధించి హిందీని జాతీయభాషగా గుర్తింపజేసేందుకు ఆయన ప్రారంభించిన ఉద్యమం, ఆయన నడిపిన అన్ని ఆందోళనలలోనూ బాగా ఉత్తరాది రాష్ట్రాలలో ఓట్లు సంపాదించే ఉద్యమం. దానికి అనుకూలంగా ఉత్తర భారతదేశంలో వేలకొలది యువకులను, విద్యార్థులను ఆయన సమీకరించారు. ఆయన భావావేశంలో చేసిన ప్రసంగాలు, నిర్వహించిన సభలు రాజాజీ వంటి ప్రముఖులను కూడా నివ్వెర పోయేటట్లు చేశాయి. ఎవరైనా దేశభాషలోగాని, లేదా వారి మాతృభాషలోనైనా ప్రసంగించాలేతప్ప ఇంగ్లీషులో మాత్రం మాట్లాడరాదని ఆయన కోరారు. రైల్వే స్టేషన్లలోను, పోస్టు, టెలిగ్రాఫ్స్ ఆఫీసుల్లోనూ ఉన్న ఇంగ్లీషు బోర్డులన్నింటికి వారు తారుపూసి చెరిపివేశారు. బెంగాల్ ఒరిస్సా మొదలైన హిందీ మాట్లాడని ప్రాంతాల ప్రజలలో దీనికి ప్రతిగా ఉద్యమం ప్రారంభమైన తరవాత ఏమిచేయాలో తోచక వీరు కలవర పడ్డారు.

జనసంఘం, దానికి అనుబంధంగా ఉంటూ దీర్ఘకాలంగా హిందీ భాషకు అనుకూలంగా ఉద్యమం నడుపుతున్న ఆర్.యస్.యస్.వంటి సంస్థలుకూడా ఈ సందర్భంలో లోహియా పటాలాల వేగాన్ని అందుకోలేక పోయాయి. ఈ సమయంలో హిందీ భాష మాట్లాడని ప్రజలనుంచి హిందీ వ్యతిరేక ఉద్యమానికి నాంది పలికించి వారిని ముందుకు నడిపించడంలో అన్నాదురై వారి డి.యం.కె. పార్టీలు విజయవంతమైన కృషిచేశాయి. హిందీ భాషకు వ్యతిరేకంగా ప్రారంభమైన ఈ ఉద్యమాన్ని చూసి టాండన్ గారంతటి వారుకూడా అసహనం చెందారు. లోహియా తొందరపాటుకు లభించిన ఫలితం ఇది.

కాంగ్రెస్‌తో కలసి కాంగ్రెస్ నాయకత్వంలో మిశ్రమ ప్రభుత్వాలను ఏర్పాటుచేసేందుకు కలిసే కంటే చిన్నవి, పెద్దవి అయిన కాంగ్రెసేతర ప్రభుత్వాలను కలిపి వాటి సమిష్టి నాయకత్వంలో ప్రభుత్వాన్నేర్పాటుచేయడం దేశానికి, ప్రజలకు కూడా మంచిదనే ఆయన అభిప్రాయానికి, 1967 సాధారణ ఎన్నికలలో అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓడిపోయి మెజారిటీని కోల్పోవడంతో ఆసరా కలిగింది. ఆయన రాజకీయ లక్ష్యమైన సంయుక్త విధాయక దళ్‌ను అందరూ మామూలుగా దానిని యస్.వి.డి. అని పిలుస్తుండేవారు. లోహియా దానిని ప్రారంభించి నడపడంలో నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ వ్యతిరేకులైన శాసన సభ్యులను కాంగ్రెసేతర సంయుక్త పక్షాలుగా మార్చడంలో ఆయన క్షణం తీరిక లేకుండా పనిచేశారు. ఆ సమయంలో అనేకమంది కాంగ్రెస్ శాసనసభ్యులు యస్.వి.డి.లోకి చేరి లోహియా కృషికి సహకరించారు.

ఆయారాం, గయారాంలుగా పిలువబడే ఈ తరహా శాసనసభ్యుల పార్టీ మార్పిడులు కొంతకాలం అధికతర ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కృత్రిమంగా ఏర్పాటుచేసిన ఈ మిశ్రమ మంత్రివర్గాలు కొద్ది రోజుల్లోనే "గయారాం" ల పాకడలవల్ల దెబ్బతిన్నాయి. ఒకటి, రెండు సంవత్సరాలలోనే పార్టీ సిద్ధాంతాల పట్లగానీ, కార్యాచరణలోగానీ ఎలాంటి విశ్వాసం లేకుండానే ఈ తతంగం నడచింది. ఈ పరిణామాలు తమ ప్రయోగాలు తమ మీదికే తిరిగి దాడి చేసినట్లైంది. యస్.వి.డి. మంత్రి వర్గాలు తమ మెజారిటీని కోల్పోయాయి. భారతీయ క్రాంతిదళ్ ముఖ్యమంత్రులు తమ గద్దెలను దిగిపోవలసి వచ్చింది. ఆ తరువాత ప్రజలు రాజకీయ స్థిరత్వంలోను, నైతిక విలువల విషయంలోనూ, పరిపాలనా సామర్థ్యంలోనూ పీటికంటే కొంతలో కొంత కాంగ్రెసే నయమనుకున్నారు. ఆ తరువాత జరిగిన ఎన్నికలలో ప్రజలు కాంగ్రెస్‌ను శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో మూడింట రెండువంతుల మెజారిటీతో గెలిపించి దానికి అధికారంలోకి వచ్చేలాగా ఓటు చేశారు.

భారతదేశంలో పశ్చిమ దేశాలలో వున్నట్లు అధికార పక్షం ప్రతిపక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం గాక ప్రజలు దామాషా పద్ధతిపై నేరుగా సభ్యులను ఎన్నుకొని, ఎన్నికైన సభ్యులందరిలోనుంచి జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలనే ఒక కొత్త సిద్ధాంతాన్ని భారత ప్రభుత్వానికి ప్రజాస్వామ్యంలో విశ్వాసం ఉన్న వారికి ఆయన ప్రతిపాదన చేశారు. పార్లమెంటును, ఆ మార్గంలో ఆయన దానిస్థాయినుంచి తగ్గించారు.

ఆయన, ఆయన సహచరులు రైతులు కార్మికులు వృత్తిదారులతో పనిచేసేటప్పుడు, కాంగ్రెస్‌లో కలవడం గానీ లేదా సహకరించడం గానీ లేకుండా ఎలా ఎప్పుడు దీనిని సాధించగలం? అనే అంశాన్ని గమనించడం మానివేశారు. అంతకుముందున్న సోషలిస్టు విభాగాలన్నింటిని ఈ సందర్భంలో వారు రద్దుచేశారు. ఏదైనా ఒక పార్టీతో వారు సంబంధాలను ఏర్పాటుచేసుకునే సందర్భంలో దాని కాంగ్రెస్ వ్యతిరేకతను ప్రధానాంశంగా తీసుకున్నారు తప్ప తమ ప్రధాన లక్ష్యమైన సోషలిజానికి వారు ఎంత దగ్గరలో ఉన్నారనే దాన్ని గమనించడం మానివేశారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఇందిరాజీ నాయకత్వానికి పూర్తి సమర్థత నిచ్చి కాంగ్రెస్ నూతన పథకాలను ఆమోదిస్తూ మూడింట రెండువంతుల ఆధిక్యతతో వారిని గెలిపించిన తరవాత కూడా తమ పట్ల కాంగ్రెస్ వ్యతిరేకత లోని లోపాలోపాలను గురించి ఆయనగాని, ఆయన అనుచరులుగానీ పట్టించుకోకుండానే వెనుకటిలాగే పూర్తి కాంగ్రెస్ వ్యతిరేకతనే లక్ష్యంగా పెట్టుకొని పనిచేయసాగారు. సరస్వతీనది త్రివేణీ సంగమంలో నీటిని పూర్తిగా గంగాయమునల కొదిలేసి తాను అంతర్వాహినిగా ఎట్లాపుండి పోవలసి వచ్చిందో లోహియా తత్వం నిపుణుల పరిస్థితికూడా ఈనాడు అలాగే అయింది.

ముగింపు సందర్భంగా 13-11-1967న ఆయనకు నా నివాళులర్పిస్తూ పార్లమెంటులో చేసిన ప్రసంగంలోని ఈ క్రింది వ్యాఖ్యానాలను మీ ముందుంచుతున్నాను.

డా॥ లోహియా మన జాతీయ నాయకులలో ఒకరు. గత మూడు దశాబ్దాలుగా మనదేశంలో ముఖ్యాంశాలుగా కొనసాగిన అన్ని ఉద్యమాలలో ఆయన ప్రముఖంగా పాల్గొన్నారు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో శాఖల నేర్పరచే సందర్భంలో నాకు ఆయన స్నేహితుడు కావడం రైతాంగ ఉద్యమంలో మేమిద్దరం మిత్రులుగా ఉండగలగడం ఒక ప్రత్యేకతగా నేను భావిస్తున్నాను. ఆయన రాజస్థాన్ నుంచి వచ్చినప్పటికి యు.పి. రాష్ట్రంలో ఎక్కువగా ఆయన కృషిచేసినప్పటికి 1935 సంవత్సరం నుంచి ఆయన పశ్చిమ బెంగాల్‌లో కూడా మంచి పలుకుబడిని సంపాదించగలిగారు. ఆ తరువాత గోవాలోను, నేపాల్‌లోను, నేఫాలోను ఇంకా అనేక ప్రాంతాలలోని ప్రజలు స్వాతంత్రం కోసం, స్వేచ్ఛకోసం ఎక్కడ పో రాడుతున్నా అక్కడల్లా ఆయన అభిమానానికి వారు పాత్రులయినారు.

నాలాంటి చాలామందివలె ఆయన కూడా మహాత్మాగాంధీ నాయకత్వం కింద పనిచేశారు. క్రమశిక్షణను ఆయన తు.చ. తప్పకుండా పాటించేవారు. దక్షిణాఫ్రికాకు సంబంధించిన విషయాలలో ఆయన తీర్మానాన్ని మహాత్మాగాంధీగారు ఆమోదించక పోయినప్పటికి అఖిలభారత కాంగ్రెస్ సంఘం దానిని ఆమోదించింది. ఆ తరువాత మహాత్మాగాంధీగారు ఏ.ఐ.సి.సి.ని ఆ విషయంపై పునర్విచారణ చేసుకోవలసిందిగా కోరారు. క్రమశిక్షణ కలిగిన ఒక సైనికునిలాగా లోహియా గాంధీగారి సూచనను ఆమోదించి తమ తీర్మానాలను ఉపసంహరించుకొని ఏ.ఐ.సి.సికి గాంధీగారి అభిమతాన్ని అంగీకరించే వీలు కల్పించారు. నేను దీనిని ఉదాహరణగా మీముందుంచుతున్నాను. అన్ని వేళలా ఆయన తిరుగుబాటు దారులలో తిరుగుబాటు దారైనప్పటికి తనకు తానే స్వచ్ఛందంగా నియమాలను పాటించే నియమబద్ధమైన వ్యక్తి. ఈ సభలో అలాగే ఈ దేశం మొత్తం మీద ఇతరులు ఎవరూ చేయలేనంతగా ఆయన తాను చేపట్టిన అంశానికి ప్రత్యేక ప్రాధాన్యం కలిగేలా పనిచేశారు. ఆయన ఈ సభలోకి ప్రవేశించిన వెంటనే ప్రస్తుతం దేశంలో ఉన్న కరువు పరిస్థితులను గురించి సభను కదలించ గలిగారు. అలాగే శాసనసభలో కూడా కరువు పరిస్థితులేమిటో వారి దృష్టిలోకి తెచ్చివారి దృష్టిని దానివైపు మళ్లించగలిగారు. ఉత్తరప్రదేశ్, బీహార్, ఒరిస్సా రాష్ట్రాలలో క్షామ నివారణ కృషికి ఈ సందర్భంలో ప్రాధాన్యత లభించింది. దీనివల్ల కరువు బాధల ననుభవిస్తున్న ప్రజలకు తక్షణ సహాయం అందేలా ఆయన తోడ్పడగలిగారు.

డాక్టర్ రామమనోహర్ లోహియా కొద్దికాలంలోనే మనలను వదలిపెట్టి వెళ్ళిపోయారు. మన మనస్సులలో ఏమైతే భావిస్తున్నామో దానినే మన ప్రధాన మంత్రి మనందరి తరపున నెహ్రూ. ఆయన మరణించడం ఈ సభకు తీరని లోటు.

37

శ్రీ యం. ఆర్. మసానీ

బొంబాయికి చెందిన శ్రీ యం.ఆర్.మసానీగారు 20-11-1905న జన్మించారు. బారిష్టరు. 1949-52 సంవత్సరాల మధ్య, 1963-70 సంవత్సరాల మధ్య పార్లమెంటు సభ్యులు. 1960-70 సంవత్సరాల మధ్యకాలంలో లోక్‌సభలో స్వతంత్రపార్టీకి ఉపనాయకులు. 1969-70 సంవత్సరాల మధ్య స్వతంత్ర పార్టీకి అధ్యక్షులు. 1974లో సోషలిస్టు పార్టీని భారతీయ లోక్‌దళ్‌లో సంలీనం చేయడాన్ని వ్యతిరేకించారు. 1967-68 సంవత్సరాలలో పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీకి చైర్మన్‌గా ఉన్నారు. మిత్రరాజ్యసమితి మైనారిటీల కమిషన్‌కు చైర్మన్‌గాను, కామన్‌వెల్త్ మహాసభల ప్రతినిధిగాను పాల్గొన్నారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ వ్యవస్థాపకులలో ఒకరు. దానికి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. చక్కటి గ్రంథరచయిత. ఆయన "ఆవరిండియా" "సోషలిజం రికన్‌సైడర్డ్" "ఏస్పైజల్ ఆఫ్ జయప్రకాష్" వంటి పుస్తకాలు రచించారు. (ఎడిటర్)

మసానీ పార్లమెంటులోని ప్రముఖ ఉపన్యాసకులలో ఒకరు. పార్లమెంటులో ప్రసంగించడం ఆయనకు చాలా సులువైన అంశం. ఆయన తేలికగా, సరళంగా, వివరంగా సమర్థవంతంగా మాట్లాడతారు. ఆయన ప్రసంగాన్ని ఆయనే కాల నిర్ణయాన్నుసరించి పూర్తిచేస్తుంటారు. ఒక్కొక్కసారి సభ్యులెవరైనా మధ్యలో జోక్యం కలుగజేసుకున్నా, చప్పట్లు చరిచినా ఒకటి రెండు నిమిషాలు ఆ సమయం ఎక్కువవుతుందిగాని, అంతకు మించి సమయం మాత్రం తీసుకోరు. ఒక అంశం నుంచి ఇంకో అంశానికి వెళ్లేటప్పుడు ఆయన రాసిపెట్టుకున్న నోట్సును చూడరు. ఆయనకి సహజంగా నోట్సు చూసే అలవాటున్నా ఈ సందర్భంలో మాత్రం ఒక అంశం నుంచి ఇంకో అంశంలోకి విరామం తీసుకోకుండానే ముందుకెళ్తుంటారు. ఆయన మాట్లాడుతున్నప్పుడు మధ్యలో ఎవరైనా సభ్యులు జోక్యం చేసుకోడానికి ప్రయత్నిస్తే మసానీ ఆ సమయాన్ని వారికి వదలివేసి అప్పటి వరకు తను సంధించి వదిలిపెడుతున్న వాగ్బాణాలనుంచి ఒక్కసారిగా సభకు విశ్రాంతి కలిగిస్తూ కూర్చుంటారు. మసానీ మాట్లాడిన తరవాత స్పీకర్ పిలుపుమేరకు లేచిన సభ్యులను చూసి మేమంతా జాలిపడే వాళ్లం. ఎందుకంటే మసానీ సృష్టించిన భావ పరంపరలో నుంచి స్థిమితంగా ఆలోచించుకోడానికి సభకు కనీసం ఒక గంట సమయమైనా కావలసి వస్తుంది కాబట్టి.

ఆయన నుంచి పాఠాలు నేర్చుకోడానికి సభ ఎప్పుడూ అంగీకరించదు. అది మసానీకి ఒక బాధాకరమైన విషయం. అటల్ బిహారీ వాజ్‌పేయి ఎలాగైతే తన ప్రసంగాంతో సభను సమ్మోహితుల్ని చేస్తారో మసానీ కూడా అలాగే సభను సమ్మోహన పరచి దానిని నిస్సహాయంగా ఉంచగలరు. అది మంచికి కావచ్చు, లేదా చెడుకు కావచ్చు. పార్లమెంటు సభ్యులలో ఎక్కువమంది కాంగ్రెస్‌వారు, సోషలిస్టులు, కమ్యూనిస్టులు చివరికి భారతీయ క్రాంతిదళ్

మొదలైన వారంతా కూడా కొన్ని స్వార్థపర శక్తులకు పాత తరం సమాజానికి అనుకూలంగా, మసానీ తన మృదువైన ప్రసంగాలతో, చక్కని మాటలతో తమను గారడీ చేస్తున్నాడనే, వాళ్లంతా భావించేవారు. సభలో ఉన్న వారిలో ఎక్కువమంది ఆయన చెప్పే వాటికి వ్యతిరేకంగానే ఉండేవారు. ఆయన చెప్పే అంశాలు దేశ ప్రయోజనాలకు అనుకూలంగా ఉన్నప్పుడు కూడా ఇలాగే జరుగుతూ ఉండేది. ఆయన మాటలు చెప్పే విధానానికి, మాటలను కూర్చే పద్ధతికి ఆసక్తి కలిగించే ఆయన వాదం ముగించే రీతి రాజాజీ అంతటి వారిని కూడా ముగ్ధులను చేసేది. అయితే అదెప్పుడూ సభ ఆమోదాన్ని పొందగలిగేది కాదు. ఆయన చెప్పే అంశాలలో నాకు ఇష్టం కానివి ఉంటున్నప్పటికీ నా హృదయం మాత్రం నిశ్శబ్దంగా సహిస్తుంది తప్ప ఎందుకో కఠినంగా వాటిని తిరస్కరిస్తూ మాట్లాడడానికి ముందుకురాదు.

మసానీ పార్లమెంటులో తనకున్న పూర్తిసమయాన్ని ఉపయోగించుకోడానికి ప్రయత్నించే వారు కాదు. నేను, హెచ్.వి.కామత్,వాజ్‌పాయ్, మధులిమాయే, యస్.యం.జోషీ, హీరేన్ ముఖర్జీలము పార్లమెంటు లోని అన్ని కార్యకలాపాలలో సంతోషంగా పాల్గొంటుండేవాళ్ళము. సభలో సభ్యులను వ్యక్తిగతంగా కలుస్తూ తన విధానంపై వారి ఆమోదాలను పొందుతూ తన ధోరణికి అనుకూల వాతావరణాన్ని ఏర్పరచుకున్న తరవాత ఆయన సభలో మాట్లాడేవారు. అప్పుడు దానిని సభ తోసిపుచ్చినా ఆయన వాదనలు నిరాధారమైనవని భావించేవారు కాదు. మసానీ స్వతంత్రపార్టీలోను, పార్లమెంటులోను మా ఇద్దరి మధ్య ఏర్పడిన పన్నెండు సంవత్సరాల అనుబంధాల కారణంగా నాకు ఒక మంచి మిత్రుడు. నా వలె ఆయన విశ్వాసాన్ని గానీ సహకారాన్ని గానీ అంత ఎక్కువగా పొందిన వారు సభలో అరుదు. నాకు ఇది అనేకసార్లు సంతోషాన్ని కలిగిస్తుండేది. పార్టీలో ఆయన మాటల ద్వారాగాని, మౌనంగాగాని వ్యక్తపరిచే అభిప్రాయాలు తరచుగా నేను వ్యతిరేకిస్తూ ఉండే వాడిని. ఆయన ఇంటి దగ్గర ఉన్నపుడు ఎప్పుడూ కూడ సభ్యులతో సంతోషంగా వ్యవహరించేవారు కాదు. ఎందుకంటే వారి విధానాలను, ఆలోచనలను అంగీకరించక ఆయన చాలా అసహనంగా ఉంటారని అనిపించుకునేలా కనిపిస్తుండేవారు. ఆయన పట్ల మేమంతా సుముఖంగా ఉన్నప్పటికీ ఆయన మా పార్లమెంటరీ గ్రూపులో మెజారిటీ సభ్యుల నుంచి సానుభూతిని గానీ, ప్రేమను గాని పొందలేక పోతుండేవారు. పార్లమెంటులోనూ ఆయన అంతే. ఆయనను మేము ప్రశంసించినా, ఆయన మామధ్య అంత సంతోషంగా మెలగగలిగేవారుకాదు. మా పార్లమెంటరీ పార్టీ గ్రూపు సమావేశాలలో సభ్యుల అభిప్రాయాలకు భిన్నంగా ఆయన వారిని తన ప్రభావానికి లోనుచేస్తున్నప్పుడు ఏకాభిప్రాయ సాధన కోసం నేను ప్రయత్నాలు ప్రారంభిస్తే ఆయన చాలా విసుగుదలతో వ్యవహరిస్తుండేవారు. ఆ సందర్భంలో క్రమశిక్షణ పేరుతో, సభ్యుల నోరు మూయించేందుకు ఆయన అంతకుముందు చేసిన పార్టీ జనరల్ కౌన్సిల్ తీర్మానాలను ప్రస్తావిస్తుండేవారు. ఆ సందర్భంలో ఆయన నామీద కూడ అసహనం చూపించేవారు. ఎందుకంటే ఆయన ఆ అంశాలను పూర్తిగా చదివేంతవరకు గాని వాటి పూర్వాపరాలను పూర్తిగా వివరించేంత వరకు గాని నేను ఆగి వుండేవాడిని కాదు. అయితే ఆయనకు క్రమశిక్షణలో ఉన్న విశ్వాసం చాలా గొప్పది. అలాగే అందరినీ అంగీకరింపజేసి ఒకదారికి తీసుకురాగలననే దానిలో నామీద ఉండే విశ్వాసం కూడా మెండు. అయితే ఆయన

తన పట్టును కొంతవరకు ఆపుకొని సమావేశం ఆఖరిదాకాగాని, లేదా మరు సమావేశం వరకు గాని ఆగివుండేవారు. ప్రజాస్వామ్య పాలనా పద్ధతిపై ఆయనకు పూర్తి విశ్వాసముంది. అందరూ కూడా అలాగే వుండాలని ఆయన గట్టిగా భావించేవారు. జవహర్ లాల్ గారి తొందరపాటు ధోరణులతోనే సర్దుబాటు కాలేని నన్ను చూసి అంతకన్నా తొందరపాటు తనం కలిగి అసహనంతో వ్యవహరించే మసానీ గారితో ఎలా సర్దుకుపోతున్నానో అని చాలామంది ఆశ్చర్యాన్ని వ్యక్తపరుస్తుండేవారు. ఆ సందర్భంలో వారిని గురించి ఇట్లా చెప్పుండేవాడిని. మసానీలో ఉన్న ప్రజాస్వామ్య ధోరణి, నమ్మకమైన మంచి నాయకత్వ లక్షణాలు నన్ను ఆయనకు మంచి స్నేహితునిగా ఉంచుతున్నాయి. ఆయన రాజకీయ జీవితంలో నాలుగు దశాబ్దాలపాటు జయప్రకాష్ నారాయణ గారిపై ఆయనకున్న ప్రేమ, ఆసక్తి అన్ని పరీక్షలను తట్టుకొని నిలువగలిగింది.

ఆయన పార్టీ అధ్యక్షులైన తరవాత, తన అధికారాలన్నిటిని ఒక్కసారిగా ఉపయోగించుకోవాలనే ఆయన కోర్కెను ఆపుకునే శక్తి, అందరి అభిప్రాయాలు సానుకూల ధోరణిలోకి వచ్చిందాకా ఆగే నేర్పు ఆయనకు లేకుండా పోయాయి. ఆయన గుజరాత్ రాష్ట్రంలో అనేకమంది యం.పి.లకు యం.ఎల్.ఏ.లకు కూడా నాయకులైన కీ॥ శ్రీ సి.సి.దేశాయ్ (రిటైర్డు ఐ.సి.యస్. అధికారి, సోషలిస్టు పార్టీ గ్రూపు పార్లమెంటరీ విభాగ కార్యదర్శి) గారిని సంజాయిషీ అడిగేందుకు ముందుకు రావడంలో ఆశ్చర్య పడవలసిందేమీ లేదు. తన అనుచరుల చిత్తశుద్ధి విషయంలో తనకు నమ్మకం చెడనంతవరకు, వారి భావాలలో ఉండే కొద్దిపాటి ఎగుడు దిగుళ్లను కొంచెం ఓర్పుతో సహించడానికి సిద్ధం కావాలి. దురదృష్టమైన విషయమేమిటంటే అతి సులభంగా ఎదుటివారిమీద అనుమానం పెంచుకుంటూ ఇబ్బందుల పాలవుతారు. ఎక్కువసార్లు ఆయన మేధాశక్తిముందు, ఓర్పు లేని తత్వం ముందు చాలా మంది మాట్లాడలేక మూగబోతుంటారు. చాలామంది మా ఇద్దరి మధ్య ఎలా సయోధ్య కొనసాగింది అని సందేహపడుతున్నప్పటికి దశాబ్దకాలంపాటు మా ఇద్దరి మధ్య మంచి సయోధ్యవుంది. అందుకు ప్రధాన కారణాలు మసానీ గారికి రాజాజీ పట్లగల గొప్ప గౌరవం. ఆ రాజాజీ విశ్వాసం తోనే నేను పార్టీ అధ్యక్షుడుగా ఉంటూ ఉండడం, పార్టీ అధ్యక్షుని పట్ల నాయకుని పట్ల మసానీ కున్న అచంచలమైన క్రమశిక్షణతో కూడిన విశ్వాసం.అనేక విషయాలలో మా మధ్య భిన్నాభిప్రాయాలున్నప్పటికీ మా ఇద్దరినీ మంచి స్నేహితులుగా నిలబెట్టాయి. స్వేచ్ఛా వాణిజ్యం, గుత్తాధిపత్యం, పరిమితిలేని వ్యక్తిగత ఆస్తుల పెంపుదల వృత్తిపరమైన సంస్థల పరమైన ఆస్తుల వ్యవహారాల్లో మా ఇద్దరి ఆలోచనా ధోరణులు వేర్వేరు. అయినప్పటికి పార్లమెంటులో బాధ్యతాయుతమైన ప్రతిపక్షాన్ని అందించే కృషిలో మేమిద్దరం ఏకాభిప్రాయులమై కలసి కట్టుగా పనిచేశాం. అందువల్ల మేము బాధ్యతా రహితమైన లోహియా పద్ధతి పార్లమెంటరీ ప్రజాస్వామ్యం వైపు పోలేదు. మసానీ గారు స్వీడిష్ రీతి పార్లమెంటరీ పద్ధతి సామాజిక ప్రజాస్వామ్యాన్ని అంగీకరించారు గానీ ఆయన మనస్సుకు లిబరల్ ఇంటర్నేషనల్ సాంఘిక విధానంపై ఎక్కువమొగ్గు. అయితే నేను ఎప్పుడూ గాంధేయసోషలిజానికి స్వయం వృత్తుల సాంఘిక ఆర్థిక సమాజ రీతికి కట్టుబడ్డ వాడిని.

38

స్పీకర్ శ్రీ మౌలంకర్

అహ్మదాబాదుకు చెందిన శ్రీ జి.వి.మౌలంకర్‌గారు 1888లో జన్మించారు. బాంబే శాసన సభ స్పీకరుగా పనిచేశారు. 1946-47 సంవత్సరాలలో సెంట్రల్ అసెంబ్లీస్పీకరుగా ఉన్నారు. తాత్కాలిక పార్లమెంటరీ స్పీకరుగను, ఆ తరువాత లోక్‌సభకు స్పీకరుగాను 1952-57 సంవత్సరాల కాలంలో వ్యవహరించారు. హరిజన సేవక్ సంఘానికి అధ్యక్షులు. అహ్మదాబాదు కార్పోరేషన్ మేయరు. అహ్మదాబాదులో న్యాయవాది. సర్దార్ పటేల్‌గారికి సన్నిహిత సహచరులు. అట్టావాలో జరిగిన కామన్వెల్త్ మహాసభలో భారతీయ ప్రతినిధి వర్గానికి నాయకునిగా పనిచేశారు. ఈ సభలో రంగాగారు కూడా ప్రతినిధిగా పాల్గొన్నారు. - (ఎడిటర్)

స్పీకర్ శ్రీ జి.వి.మౌలంకర్‌గారు మన లోక్‌సభకు పెద్ద దిక్కులాగా ఉండి అందరి అభిమానానికి పాత్రులయ్యారు. కేంద్రంలోగాని రాష్ట్రాలలోగాని అంతటి గొప్ప స్పీకర్ మరొకరు మనకు లేరు. ఎవరిదగ్గరకైనా ఆయన వచ్చేటప్పుడు గొప్ప ఆత్మవిశ్వాసంతో మంచి హుందాతనంతో వస్తూ ఉండేవారు. చూడడానికి ఆయన ఎల్లప్పుడూ ప్రశాంత చిత్తంతో సౌమ్యంగా కనిపిస్తుండేవారు.

ఆయన సెంట్రల్ అసెంబ్లీకి ఎలా తీసుకురాబడ్డారనే సంగతి ఒక ఆసక్తికరమైన అంశం. ఆయన బొంబాయి అసెంబ్లీలో స్పీకరుగా ఎలాపని చేశారో, ఎంతటి గట్టి పట్టుగల మనిషో బ్రిటిష్ ప్రభుత్వానికి తెలుసు. అయితే 1942 క్విట్ ఇండియా ఉద్యమంతర్వాత కాంగ్రెస్ పార్టీకి ఈ అవకాశాన్ని కలగనివ్వడం బ్రిటిష్ ప్రభుత్వం వారికి ఇష్టంలేదు. కాంగ్రెస్ వారి రక్తాన్ని పీల్చాలనుకునే జిన్నాతో కలిస్తే పరిస్థితులు కొంతవరకు తమకనుకూలంగా ఉంటాయని వారు గ్రహించారు. దానికి తోడు నామినేటెడ్ సభ్యుల తోడ్పాటు ఉంది. దానితో వారు ఆ సమయంలో జిన్నాగారి అభ్యర్థిత్వాన్ని బలపర్చారు. అయితే ఈ సందర్భంలో సర్దార్ పటేల్‌గారు వెనకడుగు వేయడానికి ఇష్టపడలేదు. ఆయన ఢిల్లీ వచ్చి తన పలుకుబడినుపయోగించి ఈ క్లిష్ట సమయంలో మాకు తోడ్పాటు నందించడానికి ముందుకు వచ్చారు. శరత్ బోసుగారు అప్పుడు మా నాయకులు. ఆ సందర్భంలో మౌలంకర్‌గారి అభ్యర్థిత్వం ముందుకు వచ్చింది. పోరాటంలో చివరదాకా వచ్చిన తర్వాత అపజయం పాలుగాకుండా బైటపడగలిగాం. విజయనగరం కుమార రాజాగారు మా కనుకూలంగా మారి ఓటివ్వడంతోను, నవనగర్ హిమ్మత్‌సింగ్‌జీ గారు తటస్థులుగా ఉండిపోవడంతోను ఆఖరి క్షణంలో మాకు విజయం లభించింది. స్పీకరుగా ఎన్నికైన మరుక్షణంనుంచే ఆయన ఉన్నతమైన, సమర్థవంతమైన స్పీకరుగా రుజువుపరచుకొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రూలింగ్ ఇవ్వవలసి వచ్చినపుడు ఆయన చూపించిన సామర్థ్యం చాలా గొప్పది.

శ్రీ మౌలంకర్ తాత్కాలిక పార్లమెంటు స్పీకరుగా తన బాధ్యతలను పూర్తిగా పార్లమెంటరీ సంప్రదాయాలకు అనుగుణంగా నిర్వహించారు. సభ్యుల హక్కులను రక్షించే

విషయంలోనూ, ప్రభుత్వం అధికారాన్ని చేతబట్టుకొని విచ్చలవిడిగా ప్రవర్తించకుండాను, మంత్రివర్గం తాను చెప్పదల్చుకొన్నది స్వేచ్ఛగా పూర్తిగా, సమర్థవంతంగా చెప్పగలిగేలాగు తోడ్పడుతూ ఆయన స్పీకరు బాధ్యతలను గొప్పగా నిర్వహించారు. ఆయన పార్లమెంటును సమర్థవంతమైన, సరియైన విమర్శలతో ప్రభుత్వాన్ని నిలబెట్టగలిగే వేదికగా, ప్రజా హక్కులరక్షకురాలిగా, ధర్మసంరక్షకురాలిగా మంత్రులను, మంత్రివర్గాలను నియంత్రించగలిగే సంస్థగా తయారుచేశారు.

20వ శతాబ్దపు బ్రిటిష్ కామన్స్ సభకు ఉన్న బలహీనతలు ఆయనకు తెలుసు. అందువల్ల అలాంటి బలహీనతలు మన పార్లమెంటును ఆవరించకుండా ఆయన జాగ్రత్తలు తీసుకున్నారు.అది ఆయన సాహసవంతమైన కృషి అయినా దానిని ఆయన సంతోషంగా స్వీకరించారు. మంత్రి వర్గాన్ని అదుపులో ఉంచడం ఒకవైపు సభ్యులను బాధ్యతాయుతంగా ప్రవర్తించుపజేయడం మరొకవైపు. ఈ రెండు బాధ్యతలను నిర్వహించవలసి రావడం నిజానికి అదొక గొప్ప పోరాటం లాంటి చర్యే. ఆయన కృషి ఫలితంగానే శక్తివంతమైన అంచనాల సంఘానికి చైర్మన్‌గా అనధికార సభ్యుడు ఉండే ఆచారం ప్రారంభమైంది. ఆ తరువాత అది ఒక సంప్రదాయంగా పరిణామంచెంది అనేక సంయుక్త సలహా సంఘాలకు కూడా అనధికార సభ్యులు చైర్మన్‌లుగా ఉండే అవకాశం కలిగింది. మన పార్లమెంటులో అతి బలహీనంగా ఉన్న ప్రతిపక్షం అవిశ్వాసతీర్మానం, వాయిదా తీర్మానం వంటి శక్తివంతమైన పార్లమెంటరీ ప్రయోగాలను ఎలా సరిగా వినియోగించుకోలేవో ఆయన గ్రహించి అందుకు బదులుగా ఫ్రెంచివారి ప్రశ్నలడిగే పద్ధతిని, బ్రిటిష్ వారి పేపర్లను సమర్పించమని అడిగే పద్ధతిని ప్రవేశపెట్టి వీటిలో ఒక ముఖ్యమైన ప్రశ్న ఉన్నప్పుడు దానికిగాను చర్చలకు ఒక అర్ధగంట ప్రత్యేక సమయాన్ని కేటాయించే పద్ధతికి వారు శ్రీకారం చుట్టారు.

ఏ మంత్రి అయినాసరే, వారెంత గొప్ప వారైనప్పటికీ జాతీయ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే కృషిలో ఆయన వారిచేత పార్లమెంటు అధిక్యాన్ని అంగీకరించే విధంగా చేయవలసిందేనని తరచు మాకు చెబుతుండేవారు. తన చిత్తం వచ్చినట్లు వ్యవహరించే ఏ మంత్రినయినా ఆయన మందలించినపుడు ఇతర సభ్యులెవరైనా నా ప్రశంసా పూర్వకంగా తనవైపు చూసి చిరునవ్వులు చిందిస్తే, ఆ సమయంలో ఆయన నిర్వికారంగా కనిపిస్తారే తప్ప ఎలాంటి ప్రతిస్పందనకు లోను అయ్యేవారుకాదు. ఆయన దృష్టిలో ఆ విజయం తనదికాదు. పార్లమెంటుది అని వారి ఉద్దేశ్యం. ఆయన పార్లమెంటు స్పీకరుగా వచ్చిన తరవాత ఆయన గొప్పతనాన్ని గురించి ఇతర సభ్యుల ద్వారా వినడం, పత్రికలలో చదువుకోవడం తప్ప నాకు నేరుగా తెలియదు. నేను 1952-56 సంవత్సరాలమధ్య రాజ్యసభలో సభ్యుడిగా ఉన్నాను. 1952 వ సంవత్సరంలో ఆట్టావాలో కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభలు జరిగినపుడు భారతీయ ప్రతినిధి వర్గంలో ఉండి ఆయనతో అనేకమార్లు చర్చించే అవకాశం నాకు కలిగింది. ఆయన పార్లమెంటు అనేది క్రమశిక్షణ కలిగి తనపని తాను సజావుగా జరుపుకు పోయే ఒక సంస్థ అని, అక్కడ సభ్యులు మంత్రులకు సహాయ పడుతూ దారిచూపిస్తూ అవసరమైన సందర్భాలలో వారిని అదుపుచేస్తూ

అత్యవసరమైన జాతీయ బాధ్యతలను పార్లమెంటు ద్వారా సక్రమంగా నిర్వహించేందుకు ప్రయత్నించ వలసిన అవసరం ఉంటుందని అంటుండేవారు. అమెరికాలోని అనేక రాష్ట్రాల పార్లమెంటు హాలులలోను, కెనడా పార్లమెంటు హాలులోను ఆ దేశాల ప్రముఖ చారిత్రకాంశాలను ప్రదర్శించే చిత్రాలతో అలంకరించినట్లుగానే మన పార్లమెంటును కూడ తీర్చిదిద్దాలని ఆయన కోరుతూ ఉండేవారు. ఆయన ఆయా దేశాలు తిరిగి వచ్చిన తరవాత ఈ మార్గంలో చక్కటి కృషి చేశారు. ఆయన అమెరికా, కెనడా దేశాలలో పార్లమెంటు సభ్యులు ఎక్కువ వేతనాలను, దిన భత్యాలను, ఆఫీసు రూములను, స్టేషనరీని, ఉచిత రైల్వే ప్రయాణ సౌకర్యాన్ని, కావలసిన సిబ్బందిని పెన్షన్లతో సహా పొందుతూ ఉండడాన్ని ఆయా దేశాలలో చూసి తెలుసుకొన్నారు. మన దేశంలో ఉన్న ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని తగు విధంగా ఈ సౌకర్యాలను మన పార్లమెంటు సభ్యులకు కూడా కలిగించాలని ఆయన ప్రత్యేకంగా అభిప్రాయపడ్డారు. బ్రిటిష్ వారి సంప్రదాయ రీతిలో మన స్పీకరుకున్న అధిక వేతనం విషయంలో ఆయన కొంత విచారపడ్డారు. అయితే పోల్చుకుంటే సచివాలయంలో ఉన్న ప్రభుత్వోద్యోగులు చాలామంది ఇంతకంటే అధిక వేతనాలను పొందుతున్నారు. అలాగే మన దేశంలో ఉన్న పారిశ్రామిక వాణిజ్య సంస్థలలో ఉన్న మేనేజర్లు పొందుతున్న వాటిని చూస్తే ఇవి గుర్తించడానికి కూడా వనికిరావు. పార్లమెంటు సభ్యుడు ప్రజాసమస్యలపై పూర్తి శ్రద్ధ వహించి అవసరమైన పరిశోధనకు పూనుకొని పాంక వర్గం చెవులు వినగలిగేలా వాటిని మ్రోగించాలని ఆయన అభిప్రాయ పడ్డారు. ఈ పద్ధతిలో శాసనసభ్యులైన వారు ప్రజాసేవకులని వారి విధులను వారు సక్రమంగా నిర్వహించెందుకు వీలుగా వారికి గరిష్ఠ సౌకర్యాలను కల్పించాలని ఆయన అభిప్రాయ పడ్డారు.

పార్లమెంటు సభ్యుల పట్ల మౌలంకర్ గారి ప్రేమ చెప్పనలవికానిది. ఆయన హృదయంలో నాకొకమంచి స్థానమున్నది. నేను మొదటి లోక్‌సభ ఎన్నికలలో ఓడిపోయినప్పుడు నా తాత్కాలిక పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా పంపుకొన్నాను. అయినప్పటికీ కొత్త లోక్‌సభ ఏర్పడేంతవరకు నేను సభ్యునిగా కొనసాగాను. నాలాగే తాత్కాలిక పార్లమెంటు సభ్యులుగా ఉంటూ ఎన్నికలలో ఓడిపోయిన వారు కూడా క్రొత్త పార్లమెంటు ఏర్పడేంతవరకు తాత్కాలిక పార్లమెంటుకు హాజరయ్యారు. శ్రీ మౌలంకర్ ఆ సందర్భంలో నాకు జాబురాస్తూ తాత్కాలిక పార్లమెంటుకు రాజీనామా ఇవ్వవలసిన అవసరం లేదని తెలుపుతూ పార్లమెంటులో అంతకు ముందు నేను కొనసాగుతూ చేసిన సేవలను ప్రస్తుతిస్తూ నాకు జాబు రాశారు. 1952 సంవత్సరంలో అప్పుడు నేను రాజ్యసభలో ప్రతిపక్ష స్థానంలో ఉన్నప్పటికీ ఆయన నామీద ఎంతో అభిమానంతో నన్ను పార్లమెంటరీ ప్రతినిధి వర్గ సభ్యునిగా తీసుకొన్నారు. ఆయనకు నామీద అంత ప్రత్యేక మైన గౌరవం. అట్టావాలో విదేశ వ్యవహారాలపై చాలా ముఖ్యమైన చర్చలలో భారతీయ ప్రతినిధి వర్గానికి నాయకత్వం వహించవలసిందిగా కోరుతూ నాపట్ల అంతకన్నా ఎక్కువైన అభిమానాన్ని ప్రదర్శించారు. అధికార పార్టీలో ఉన్న వారైనా ప్రతిపక్షంలో ఉన్న వారైనా దేశాభిమానుల పట్ల ఆయన చూపించే గౌరవానికి ఇది నిదర్శనం. నేను ఆయనకు ఈ సందర్భంలో చాలా కృతజ్ఞుడనై ఉన్నాను. ఎందుకంటే ప్రజా జీవితంలో గాంధేయరీతులలో ఆయన నాపట్ల చూపించిన అభిమానం అంత గొప్పది. ఆయన చేసిన ఈ నిర్ణయం మంచిదని

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-5

తరవాత జరిగిన సంఘటనలు రుజువు పరచాయి. ఆస్ట్రేలియా ప్రతినిధి వర్గనాయకుడు, ఇతర ప్రజా స్వామ్య దేశాలలో వలే గాకుండా భారత దేశంలో అధికార పార్టీ, ప్రతిపక్షాల విషయంలో చూపెడుతున్న వివక్షను తప్పుబట్టారు. ఆ సందర్భంలో అందులోనే ఉన్న నేను ఆయన వాదాన్ని ఖండిస్తూ మాట్లాడాను. ఆ తరవాత అంతర్జాతీయ వ్యవహారాలలో భారతదేశం అవలంబిస్తున్న తటస్థ విధానాన్ని సమర్థిస్తూ భారతీయ పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకునిగా మాట్లాడాను. దానికి ఆ సభలో గొప్ప ప్రాధాన్యం లభించింది.

అంతర్జాతీయ సమావేశాలలో ఆయన ఎంత హుందాతనంగా వ్యవహరించేవారో మామూలుగా అందరికీ తెలీదు. అట్టావా సమావేశంలో దక్షిణాఫ్రికా గురించి మేము చర్చలు కొనసాగిస్తున్నపుడు కనీస సాంప్రదాయాలను, మర్యాదలను గూడా పట్టించుకోకుండా పాకిస్తాన్ ప్రతినిధులు కాశ్మీర్ సమస్యను, పంజాబ్ నీటి తగాదాలను గురించి ప్రస్తావించారు. ఆ సందర్భంలో శ్రీ మౌలంకర్ గారు చర్చలలో జోక్యం చేసుకొంటూ అవి ఈ సభకు సంబంధించిన అంశాలు కావని కామన్వెల్త్ సంప్రదాయాలను, బాధ్యతలను విస్మరించి పాకిస్తాన్ ఇలా ప్రవర్తించడం మంచిది కాదన్నారు. తానంతట తానుగా పాకిస్తాన్ చేసిన ఈ గందర గోళానికి మొత్తం సమావేశమంతా అభిశంసించింది. భారతదేశ విదేశాంగ విధానమైన అలీన ధోరణి గురించి నేను వివరిస్తున్నపుడు ప్రతినిధులలో నుంచి భిన్నస్వరాలు వినిపిస్తున్నపుడు, మౌలంకర్ నా వెనక ఒక పర్వతం లాగా నిలిచి ఈ విషయానికి భారతదేశం ఎంత ప్రాధాన్యమిస్తుందో ఇతరులు గుర్తించగలిగేలా చేశారు. మౌలంకర్‌గారి కార్యక్రమాలు ఒక్క పార్లమెంటుకు మాత్రమే పరిమితం కాలేదు. ఆయన పార్లమెంటుకు వెలుపల గూడ ప్రజాహిత కార్యక్రమాల్లో పాల్గొంటూ మిగతా పార్లమెంటు సభ్యులకు దానిని ఒక ఆదర్శంగా చూపెట్టారు. ఆయన కస్తూరిబా ఫండ్, గాంధీనేషనల్ మెమోరియల్ ఫండ్ ఏర్పాటు కృషిలో చేసిన సేవలు అనన్యమైనవి. అందులో సేకరించే ప్రతిరూపాయి పూర్తిగా సద్వినియోగం కావాలనే సంకల్పంతో ఆయన వాటికి బాధ్యులుగా విలువ గలిగిన వ్యక్తులనే ప్రతినిధులుగా అట్టిపెట్టారు. ఈ నిధుల సేకరణకోసం ఆయన ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్నపుడు గుండెపోటు సంభవించి మరణించారు. ఆయనను పార్లమెంట్ స్పీకరుగా ఎన్నుకుంటే, బాపూజీ కస్తూరిబా ఫండ్‌కోసం ఎన్నుకొన్నారు, సర్దార్ పటేల్ గాంధీ నిధి కోసం ఎన్నుకొన్నారు. ఆయన అటు బాపూజీకి ఇటు సర్దార్ పటేల్‌గారికి కూడా అంత విశ్వాసపాత్రమైనవారు. భారత ప్రధాని పండిత నెహ్రూతో ఆయన సంబంధాలు ఎంత సంతోషకరంగా కొనసాగేవో తెలుసుకోడానికి లోక్‌సభలో ఆయన స్మృత్యర్థం నెహ్రూగారు చేసిన ప్రసంగాంశాన్ని చూస్తే మనకు తెలుస్తుంది.

భారతీదేవిగారికి నాకు శ్రీమతి మౌలంకర్ గారంటే ఎక్కువ అభిమానం. ఎందుకంటే ఆమె మౌలంకర్‌గారికి వారి కుటుంబానికి హిందూ ధార్మిక పద్ధతిలో చేసిన సేవలు అంత గొప్పవి. ప్రతిరోజు అతిమూత్ర వ్యాధినుంచి రక్షణకు ఆయనకు ఇన్సులిన్ ఇంజక్షన్ చేసుకోవడంలో ఆమె సహకరిస్తుండేది. 1959 సంవత్సరంలో రాజాజీగారు నేనుమౌలంకర్ గారి కుమారుడు అహమ్మదాబాదులో స్థాపించిన లాస్క్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పాలిటిక్స్ చూడడానికి

వెళ్లాం. అప్పుడు జూనియర్ మౌలంకర్ స్వతంత్ర సభ్యులుగా పార్లమెంటుకు ఎన్నిక అయి సమర్థవంతంగా పనిచేస్తున్నందుకు నేను చాలా సంతోషపడ్డాను.

మౌలంకర్ చూపెట్టిన సంప్రదాయ రీతులకు భవిష్యత్తులో అవకాశం ఉందా?

ఈ రోజు ఉన్న లోక్‌సభ అప్పటి మౌలంకర్ నాటి లోక్‌సభకు పూర్తిగా భిన్నమైంది. ఈ కొత్తగా జీరో అవర్‌లో వచ్చిన మార్పులను ఆయన చూస్తే నిజంగా వీటికి ఆయన తల్లక్రిందులై పోతారు. పార్లమెంటరీ ప్రయోగఫలితంగా "జీరో అవర్" కొత్తగా, సర్దార్ హుకుంసింగ్ గారు దానిలో వ్యవహరించిన తీరు, స్పీకర్ సంజీవరెడ్డిగారి కాలంలో దాని పెరుగుదలను చూసినపుడు మౌలంకర్‌గారు ఆశ్చర్యపోక తప్పదు. మౌలంకర్ గారికి సభను ఒక గంటపాటు రద్దు చేయవలసిన అవసరం ఎప్పుడూ కలగలేదు. అయితే స్పీకరు సంజీవరెడ్డి గారికి అది సర్వసాధారణమైన అలవాటుగా మారింది. సంజీవరెడ్డిగారు కొట్టిన గంటను వినిపించుకోకుండా పార్లమెంటు సభ్యులు అదేపనిగా ప్రసంగిస్తూ విసుగు పుట్టిస్తున్నపుడు ఆయన సభను వాయిదా వేయడం లేదా కొద్ది సమయం పాటు రద్దుచేయడం, లేదా ఇవన్నీ రికార్డుల్లోకి ఎక్కించడం లేదు అని అనడం మామూలు అంశాలుగా మారాయి. మౌలంకర్‌గారు స్పీకరుగా ఉన్నపుడు అవిశ్వాస తీర్మానం ప్రస్తావనే రాలేదు. ప్రస్తుతం అది సంవత్సరానికి ఒకమారు లేదా 1964నుంచి ఎప్పుడుబడితే అప్పుడు రావడం అలవాటయిపోయింది. ఆయన రోజుల్లో రాష్ట్రాల బాధ్యతల్లో ఉండే అంశాలపై పార్లమెంటులో చర్చకు అంగీకరించేవారు కాదు. ఇప్పుడు పంచాయితీ రాజ్య వ్యవహారాలు సాంఘిక సంక్షేమం అదీ ఇదీ అనేమిటి రాష్ట్రాలకు సంబంధించిన అనేక అంశాలు పార్లమెంటులో చర్చించడం జరుగుతున్న సమయంలో కూడా రాష్ట్రాల సమస్యలను గురించి పార్లమెంటులో చర్చించకుండా ఆగటంలేదు. ఆ రోజుల్లో స్పీకరు లేదా ఒక పార్లమెంటు సభ్యుడు మాత్రమే ప్రస్తావించి వదిలిపెట్టే అలాంటి అంశాలు ఈనాడు అందరూ అన్ని సమయాల్లో విస్తృతంగా మాట్లాడుతున్నారు. రెడ్డిగారు అనేకమార్లు సభ్యులను కూర్చోవలసిందిగాను, సక్రమంగా ప్రవర్తించవలసిందిగాను హెచ్చరిస్తూ గడపవలసి వచ్చింది. ఆ రోజుల్లో మౌలంకర్ ఈ సభను అంత ముందాతనంగా ఎలా నడపగలిగారో అని ఎవరైనా ఆశ్చర్యపడకమానరు. ఈ పార్లమెంటుకు అప్పటి శక్తివంతమైన జవహర్‌లాల్ గారి నాయకత్వంగానీ, సమర్థులైన ఆనాటి విలువగలిగిన ప్రతిపక్షనాయకులుగానీ ఈనాడు ఈ సభలో లేదు. 1966-67 సంవత్సరాలనాటి ద్వేషాలు, ఘర్షణలు, భావసంఘర్షణలు, సభను మరొక రీతిలోకి మలిచాయి. స్పీకర్ ధిల్లాన్ గారు తరచు హెచ్చరిస్తూ పెద్దగా మాట్లాడక తప్పలేదు. మంత్రులకు, పార్లమెంటు సభ్యులకు వ్యతిరేకంగా హక్కుల తీర్మానాల ప్రతిపాదన ఈనాడు సర్వసాధారణమైన అంశమై పోయింది.

ఆ కాలంనాటి ఆంగ్లో అమెరికన్ పార్లమెంటరీ విధానంలో ప్రధానాంశంగా కొనసాగిన రెండూ లేదా అంతకు మించిన పార్టీలతో కొనసాగిన విధానం అందులో మెజారిటీని సాధించిన ఒక పార్టీగాని లేదా కొన్ని పార్టీల కూటమిగానీ మంత్రివర్గాన్ని ఏర్పరిస్తే మిగిలిన ఒకటి లేదా అన్ని పార్టీలు ప్రతిపక్షంలో ఉంటూ తిరిగి మెజారిటీ సంపాదించుకోడానికి ప్రయత్నిస్తూ అధికారంలోకి

రావడానికి కృషి సాగించే పాతపద్ధతి ఇంకా గౌరవాన్ని పొంద గలిగే పరిస్థితుల్లో లేదు. లాటిన్ అమెరికా రిపబ్లిక్కులలో తప్ప మిగిలిన ఆసియా, ఆఫ్రికా ఖండాలలోని అనేక దేశాలలో పసిఫిక్ ప్రాంత రాజ్యాలలో సోవియట్ తరహా ఒకే పార్టీ పార్లమెంటుతో ఉండే ప్రజాస్వామ్య విధానంవైపు ఎక్కువ దేశాలు మొగ్గుచూపిస్తున్నాయి. ఈ ఏకపార్టీ పార్లమెంటులలో మౌలంకర్ గారి బెత్తానికి పనిలేదు. స్పీకర్ ధిల్లన్ గారు ఈ రోజుకు కావలసిన విధంగా పార్లమెంటులోని "జీరో అవర్" ను పరస్పర విద్వేషపూరితమైన చర్చలను, భుజం భుజం కలుపుకొనే పార్లమెంటరీ హామీలపై చర్చలను తరచు దుమకటానికి సిద్ధంగా ఉండే సభ్యుల ఆకస్మిక ప్రవేశాలనుంచి సభను సజావుగా కొనసాగేందుకు చూసుకొంటూ మౌలంకర్ గారు చూపించిన సభాగౌరవం చెడిపోకుండా ఉండేందుకు ఈనాడు ప్రయత్నిస్తున్నారు.

వీటన్నిటితో పాటు ధిల్లన్ కేంద్రమంత్రి వర్గంలో చేరాలని కోరుకోవడంతో ఆయన రీతి అంతటితో అంతమైంది. 1974-75 సంవత్సరాలలో జయప్రకాష్ లోహియా ప్రారంభించిన గుజరాత్ బీహార్ పద్ధతి శాసనసభా సవాళ్లను ఎదుక్కొనడంలో సమర్థులైన స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ విజయాన్ని సాధించి పార్లమెంటరీ పద్ధతికి తోడ్పాటు నందించగలిగారు.

రాజ్యాంగాన్ని పూర్తిగా మార్పుచేయాలనే వాదన ఉంది. అప్పుడు కూడా ఒక స్పీకరు ఉండక తప్పదు. కమ్యూనిస్టు లేదా ఆఫ్రికా పద్ధతి ఏకపక్ష ప్రజాస్వామ్యాన్ని కాకుండా పార్లమెంటరీ పద్ధతిలో గానీ లేదా అధ్యక్ష తరహా పద్ధతిలోగానీ దేనిని స్వీకరించినప్పటికీ అందులో స్పీకరు ఉండవలసిందే. తరచూ జరుగుతూ ఉండే కొద్దికాలపు పార్లమెంటు సమావేశాలలోని శక్తివంతమైన కమిటీల అధికారాలను కొనసాగించేందుకు అనుమతించవలసి ఉంటుంది. కాని పరిస్థితులలో అమెరికా కాంగ్రెస్ పద్ధతిని భారతదేశానికి అనుగుణంగా అనువర్తింపజేయవలసి ఉంటుంది. అప్పుడు కూడా ప్రజాస్వామ్య బద్ధంగా సభ్యులను నడిపించేందుకు స్పీకర్ "ఆర్డర్, ఆర్డర్" అనవలసి ఉంటుంది. తన దండాన్ని చూపెట్టవలసి ఉంటుంది. 1972-75 సంవత్సరాల మధ్య మౌలంకర్ చూపెట్టిన సంప్రదాయాలను, అనుభవాలను ప్రస్తుత పరిస్థితుల కనుగుణంగా సవరించుకోవలసి వచ్చింది. ప్రతి విషయం స్వయంగా పాటించే క్రమశిక్షణ మీద, పార్లమెంటరీ, పద్ధతుల్లో బాధ్యతలను గుర్తెరిగి ప్రవర్తించడంమీదా భయరహితంగా స్వేచ్ఛగా మన సభ్యులు ప్రసంగించగలగడం పైన, ఆధారపడి మన పార్లమెంటరీ పద్ధతి అభివృద్ధిని అది మనకు చూపెట్టగలదు.

39

అశోక్ మెహతా

అశోక్ మెహతాగారు 24-10-1911 న జన్మించారు. బొంబాయిలో ఆర్థిక శాస్త్రాన్ని అభ్యసించారు. ఆయన రెండున్నర సంవత్సరాల పాటు నిర్బంధంలో ఉన్నారు. 1934వ సంవత్సరంలో పాట్నాలో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీని వారూ, శ్రీ మసానీ, శ్రీ జయప్రకాష్ నారాయణ్, శ్రీ రంగాగారు కలసి ప్రారంభించారు. దానికి జయప్రకాష్ నారాయణ్ గారు కార్యదర్శిగా ఉన్నారు. ఆ తరవాత ఆయన దానికి జనరల్ సెక్రటరీగా ఉండి అది యస్.యస్.పి.లో కలసి పోయేంత వరకు ఆ పదవిలో కొనసాగారు. దాని అధ్యక్షులుగా ఆయన ఆసియా సోషలిస్టు మహాసభలోనూ, సోషలిస్టు ఇంటర్నేషనల్ కాంగ్రెస్‌లోను చేరారు. 1949 లో హిందూ మజ్‌దూర్ సభను స్థాపించారు. 1955వ సంవత్సరంలో ఆహార ధాన్యాల విచారణా సంఘానికి అధ్యక్షులుగా ఉండి ఒక ఆహార ప్రణాళికను తయారుచేశారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ అప్లైడ్ ఎకనామిక్ రీసర్చికి అధ్యక్షులుగా ఉన్నారు. నేషనల్ డిఫెన్స్ కౌన్సిల్‌లోను, సెంట్రల్ సిటిజన్స్ కౌన్సిల్‌లోనూ సభ్యులుగా పనిచేశారు.

లోక్‌సభ సభ్యులు, మిత్రరాజ్య సమితి సర్వసభ్యసభకు భారతీయ ప్రతినిధిగా వెళ్లారు. జాతీయ ప్రణాళికా సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉన్నారు. ప్రణాళికా మంత్రిగా పనిచేశారు. ప్రపంచ దేశాలన్నిటా పర్యటించారు. జెకొస్లావేకియాపై సోవియట్ రష్యా దురాక్రమణ చేసిన సందర్భంలో 1968వ సంవత్సరంలో నిరసనగా కేంద్రమంత్రి వర్గంనుంచి రాజీనామా ఇచ్చి వైదొలగారు. ఆయన కాంగ్రెస్ పార్టీలో అధికార పక్షానికి వ్యతిరేకంగా ఉండే వర్గాలకు నాయకులు.

ఆసియా విషయాలపైన భారతీయ సోషలిజం పైన అనేక గ్రంధాలకు రచయిత - (ఎడిటర్).

రాజకీయాలు, చరిత్ర అవసరమైనప్పుడు ఎలాంటి పరిస్థితులనైనా కలగలుపుతూ ఉంటాయి. శ్రీ యస్.కె.పాటిల్, శ్రీ అశోక్ మెహతాగార్లు కొన్ని దశాబ్దాల పాటు వారిద్దరూ పాత కాంగ్రెస్‌లో ఉన్నపుడు విడివిడిగా ఒకరు కాంగ్రెస్‌లోనూ, మరొకరు కాంగ్రెస్ సోషలిస్టు విభాగంలోనూ ఉన్నప్పుడు పరస్పరం సంఘర్షించుకొంటూనే వచ్చారు. ఒక వైపునుంచి సోషలిస్టు పార్టీ వచ్చి కలిస్తే మరొక వైపున దానికి ప్రధానాధారంగా ఉన్న జనసంఘం, సంయుక్త సోషలిస్టు పార్టీలు, అప్పటికి సోషలిస్టులతో కలసి ఉండకపోయినప్పటి మధూలిమాయే అందరూ కలసి జాతీయ స్థాయిలో 1971 సాధారణ ఎన్నికలలో ఇందిరా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా సంయుక్తంగా నిలబడ్డారు. ఆ తరవాత పాత కాంగ్రెస్, గాంధేయవాదంతో కూడిన మిశ్రమ ఆర్థిక విధానానికి ప్రధాన ప్రచారకులైన యస్.కె.పాటిల్ గారు కాంగ్రెస్ సోషలిస్టు పార్టీకి అశోక్ మెహతాగారు అధ్యక్షులైనారు.

కాంగ్రెస్ సోషలిస్టుల పాట్నా సభ సందర్భంలో అశోక్ మెహతాగారిని నేను కలుసుకొన్నాను. ఆయన శ్రీ మసానీ, శ్రీ అచ్యుత పట్వర్ధన్ మొదలైన వారంతా కాంగ్రెస్‌లో ఉన్న సోషలిస్టులను ప్రత్యేకంగా సమీకరించాలని నిశ్చయించుకొన్నట్లు ఆ సందర్భంలో నేను తెలుసుకొన్నాను. రాజేంద్రప్రసాద్‌గారి బంధువులు జవహర్లాల్ గారికి అభిమాని అయిన శ్రీ జయప్రకాష్ నారాయణ్ వారితో చేతులు కలపడానికి ముందు కొచ్చారు. ఆయన తన పాండిత్యం ద్వారా బొంబాయి రాష్ట్రంలో పార్టీ కార్యకలాపాలలో కష్టించి పనిచేయడం ద్వారా, సరళమైన ఆయన రచనా విధానం ద్వారా కాంగ్రెస్ సోషలిస్టు పార్టీపరంగా ఆయన బాగా గుర్తింపుకు రాగలిగారు. లోహియా, అశోక్ మెహతాగార్లు ఇద్దరూ కలిసికట్టుగా పనిచేయలేకపోయారు. ఎందుకంటే శ్రీ మసానీ, ఆయన ఇద్దరూ బాంబాయికి చెందిన వారే కావడంతో వారిద్దరూ బాగా సన్నిహితంగా ఉంటూ కలసి పనిచేయ గలిగారు. మసానీ గారు జనరల్ సెక్రటరీ పదవికి రాజీనామా ఇవ్వడంతో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఆ బాధ్యతలను అశోక్ మెహతాగారు చేపట్టారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ బొంబాయి శాఖవారు తొందర పెట్టడంతో ఇలా జరిగింది. కాంగ్రెస్ సోషలిస్టు విభాగం విడిపోవడానికి నిశ్చయించుకోవడంతో శ్రీ జయప్రకాష్ నారాయణ్, శ్రీ అశోక్ మెహతాల నాయకత్వంలో 1948వ సంవత్సరంలో సోషలిస్టులు కాంగ్రెసును వదిలివెళ్లారు. ఇక్కడ నుంచి రెండు దశాబ్దాల కాలం అశోక్ మెహతా కాంగ్రెస్ పక్షానికి వెలుపలనే ఉంటూ మొదటి సోషలిస్టు పార్టీలోనూ, ఆ తరవాత ప్రజాసోషలిస్టు పార్టీలోనూ, ఆతరవాత కృపలానీ గారి కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీలోనూ, సంలీనం కావడం ద్వారా కాంగ్రెస్‌కు వెలుపలనే ఉంటూ వచ్చారు. 1955లో అవడి కాంగ్రెస్ మహాసభ సోషలిస్టు తరహా సమాజస్థాపనకు దీక్ష వహించడంతో ఆయన సోషలిజం స్థాపించేందుకు కాంగ్రెస్ పక్షంలోనే ఉండడం మంచిదనే అభిప్రాయానికి క్రమంగా రాసాగారు. తాము తోటి కార్యకర్తల అభిప్రాయాలలో మార్పు వచ్చేందుకు సోషలిజం మీద పూర్తి విశ్వాసం కలిగిన కార్యకర్తలు కాంగ్రెస్‌లో కలిసేందుకు తమ అంగీకారాన్ని తెలిపేందుకు వీలుగా ఆయన 1966వ సంవత్సరం వరకు కాంగ్రెస్ పక్షంలో కలవకుండా వేచి ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరడం మంచిదా కాదా అని తీవ్రంగా చర్చిస్తున్న ఆ దశాబ్ద కాలంలో ఆయన నన్ను, సహకార వ్యవసాయం కంట్రోళ్లు, నిర్బంధ ధాన్య సేకరణ వంటి అంశాల్లో అభిప్రాయ భేదాలున్నప్పటికీ రైతాంగ ఉద్యమ నేతలైన మీవంటి వారు కాంగ్రెస్‌ను వదలడం మంచిదేనా అని ప్రశ్నించారు. ఆ సందర్భంలో అప్పుడు నేను వారికిలా చెప్పాను. 1952లో మద్రాసులోనూ 1955లో ఆంధ్రాలోనూ కాంగ్రెస్ పక్షం మైనారిటీలో పడిపోయినప్పుడు నేను, నా కృషీకార్ లోక్ పార్టీ సహచరులం ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు గాను కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు సహకరించి గొప్పగా త్యాగాలు చేశాం. అప్పుడు సోషలిస్టులైన వారు కనీసం అందుకుగాను విరిగిన పుల్లలను గూడ ఎత్తిపెట్టలేదు. ఆ తరవాత కాంగ్రెస్ రైతాంగ వ్యతిరేక చర్యలకు పూనుకొంది. కృషీకార్ లోక్ పార్టీ శాసనసభ్యులను మంత్రివర్గాలకు వెలుపల ఉంచింది. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ అశోక్ మెహతాగారిని ఆహార ధాన్యాల విచారణా సంఘ చైర్మన్‌గా ఆహ్వానించి వారిని ఆహారాధాన్యాల కంట్రోళ్ల విషయమే కాకుండా రైతాంగ విషయంలో కూడా తగు సూచన లందించవలసిందిగా కోరింది. ఆ సందర్భంలో బీహార్ రాష్ట్రం నుంచి పార్లమెంటు

సభ్యులుగా ఎన్నిక కావడానికి అశోక్ మెహతాకు కాంగ్రెస్ పార్టీ తోడ్పడింది.

తరవాత అశోక్ మెహతాగారు ప్రణాళికాసంఘ ఉపాధ్యక్షులుగాను, ప్రణాళికా శాఖ మంత్రిగాను అయ్యారు. ఈ పరిణామాలకు నేను సంతోషించలేకపోయాను. ఎందుకంటే ఈ సందర్భంలో ఆయన ఆదనపు కంట్రోళ్లను ఏర్పాటుచేయగలరని రైతుల స్వయం ఆర్థిక పరిస్థితులను బలహీన పరచగలరని అప్పుడు నేను భయపడ్డాను.

అంతర్జాతీయ వ్యవహారాలలో అశోక్ మెహతా మానవ హక్కుల పరిరక్షణకు ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తనకున్న పూర్వ నమ్మకానికి పూర్తిగా కట్టుబడి ఉన్నారు. ఆయన ఔవియట్ పద్ధతి లేబరు క్యాంపులను ప్రజాస్వామ్య రహితమైన కమ్యూనిస్టు విధానాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అలాగే ఇండో, చైనాలో అమెరికా దండయాత్రలను గూడా నిర్ద్వంద్వంగా ఖండించారు. జెకొస్లవేకియా కమ్యూనిస్టులు ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడినప్పుడు దానిపై సోవియట్ రష్యా బోక్యం చేసుకోవడాన్ని భారత ప్రభుత్వం ఖండించలేక పోయినందుకు విరసనగా ఆయన కేంద్ర మంత్రివర్గంనుంచి రాజీనామా యిచ్చి వైదొలగారు.

చక్కని పార్లమెంటేరియన్‌గా ఆయన కామత్, లోహియా గార్లకన్నా ఎక్కువగా మసానిని అభిమానించారు. ఆయన పార్లమెంటరీ వ్యవహారాలకు ప్రాధాన్యమిచ్చి చూశారేతప్ప లౌకిక దృష్టితో స్నేహాన్ని సరితూచుకోలేదు. ప్రశ్నసమయంలో ఆయన ఎప్పుడోగాని బోక్యం చేసుకునేవారు కాదు. అదికూడా చక్కటి అవగాహన ఏర్పరచుకొన్న తరవాతనే చేసేవారు. వారి ఇతర సహచరుల కన్నా, మసానీ గారూ ఆయన ఆలోచనా పద్ధతుల్లో ఎక్కువగా కలసి ఉండేవారు. మసానీ గారి జ్ఞానం ఎక్కువగా గ్రంథ పరమైనది. మసానీ చక్కటి రచయిత, అయితే అశోక్ మెహతా ఎక్కువ ఫలితాలను సాధించగలిగే శక్తి ఉన్నవారు. ఇద్దరూ పార్లమెంటరీ ఉపన్యాసకులుగా సమర్థులే. అయితే మసానీ చెప్పే విధానం అందులో ఎక్కువ ఆకర్షణగా ఉండేది. అశోక్ మెహతా సోషలిస్టు సిద్ధాంతం మీద పూర్తి విశ్వాసం కలిగిన వారు. మసానీ స్వేచ్ఛా వాణిజ్యంపై అనురక్తి కలిగిన వారు. వీరిద్దరూ కూడా లోహియాకున్నంత ఉద్వేగం, ఉత్సాహం లేనివారు.

కాంగ్రెస్, స్వతంత్ర, సంయుక్త సోషలిస్టు పార్టీలకు చెందిన ఈ ముగ్గురు ప్రముఖ గాంధేయ వాద వ్యతిరేక స్వాతంత్ర్య సమరయోధులు, వారి పార్టీలు ఇప్పుడు ఇందిరా కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడేందుకు జయప్రకాష్ నారాయణ్ గారి ఆధ్వర్యంలో భారతీయ లోక్‌దళ్, జనసంఘంలతో కలసి ఒక విరుద్ధ భావాల కూటమిని ఏర్పాటుచేసి పోరాటానికి సిద్ధంగా ఉన్నాయి.

40

శ్రీ వి.పి.మీనన్

శ్రీ వి.పి.మీనన్ భారత ప్రభుత్వంలో చాలా చిన్న ఉద్యోగిగా ప్రవేశించి, 20వ శతాబ్దపు బ్రిటిష్ ప్రభుత్వ పరిపాలనలో, ఏ భారతీయునికీ సాధించ సాధ్యంకానటువంటి, భారత ప్రభుత్వ మంత్రివర్గ కార్యదర్శి స్థాయికి ఎదగగలిగారు. ఇన్ని సంవత్సరాల ప్రభుత్వ సేవలో, గత ఆరు సంవత్సరాల కాలంలో, ఆయన చేసిన కృషీ, సాధించిన విజయాలు ప్రత్యేకమైనవి. అది చారిత్రాత్మకంగా, రాజకీయ యంత్రాంగపరంగా, అనితర సాధ్యమైనది, మహత్తరమైన కృషి!

బ్రిటిష్ ప్రభుత్వం చాలా ఉన్నత స్థితిలో ఉన్న రోజుల్లో, ఆయన వారి సర్వీసులో ప్రవేశించారు. బ్రిటిష్ ఇండియా రాజదర్బారుకు పీడ్కోలు చెప్పే కార్యక్రమానికి, పాలనాపరమైన రూపకల్పన చేసిన తుదిశిల్పులలో ఆయన కూడా ఒకరు! ఆయన కేరళ రాష్ట్రంలో ఒక రైతుబిడ్డగా జన్మించారు. శతాబ్దాల తరబడి, భారత రైతాంగంపై పెత్తనం సాగిస్తున్న 550 సంస్థానాధీశులకు వారి పాలనకు ముగింపు చెప్పేందుకు, ఆయన సమర్థవంతమైన కృషి చేశారు. ఒక దశాబ్దానికి పైగా, భారత దేశంలో స్వాతంత్ర్యం నిమిత్తం ప్రజలు అనుభవిస్తున్న కష్టనష్టాలకు రాజ్యాంగ పరంగా పరిష్కారాలను కనుక్కొనే నిమిత్తం ఢిల్లీలోనూ, సిమ్లాలోనూ ఉండి ఆలోచిస్తున్న బ్రిటిష్ ప్రభువులకు ఆయన తగు సలహాలిస్తూ వచ్చారు. అనుకోకుండా, భారత దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వాలనే అభిప్రాయానికి వచ్చి, దానిని త్వరితం చేయ తలపెట్టిన ఆఖరి వైస్రాయి వద్ద పనిచేస్తూ, అందుకు చిత్తు ముసాయిదాను తయారుచేసే అదృష్టం ఆయనకు కలిగింది. దేశీయ వ్యవహారాల మంత్రి, ఉపప్రధాని అయిన సర్దార్ పటేల్ గారి వద్ద కార్యదర్శిగా పనిచేస్తున్న ఆయన, స్వదేశీ సంస్థానాలను రద్దుచేసే కృషిలో పటేల్‌కు బాగా తోడ్పాటును అందించారు. స్వతంత్ర భారత ప్రభుత్వంలో ప్రముఖ పరిపాలనాధికారిగా ఉండి, ఈయన చేసిన మహత్తరమైన కార్యక్రమాల్లో ఇది బహు దొడ్డది. 1938 లో మహాత్మాగాంధీ గారి స్థానంలో, వారికి బదులుగా రౌండ్ టేబిల్ చర్చల్లో పాల్గొనేందుకై, నేను సిమ్లా వెళ్లినప్పుడు, ఆయన అప్పటికే అక్కడ బాగా పైకి ఎదుగుతున్న అధికారి. ఆయన ఉద్యోగ విరమణ చేసిన తరవాత, బెంగుళూరులో స్థిరపడ్డారు. వ్యావసాయిక ఆదాయాలపై, ఆస్తులపై ఎలాంటి పరిమితుల్ని విధించకుండా, వ్యవసాయ భూములపై పన్నులు విధించి, రైతులను సహకార వ్యవసాయ క్షేత్రాలనుంచి, వెళ్లగొట్టాలనే ప్రయత్నంలో, నెహ్రూ ఉన్నప్పుడు, నేను నెహ్రూ విధానాలకు వ్యతిరేకంగా పోరాడేందుకై, సమర్థులైన వ్యక్తుల కోసం వెతుకుతున్న సమయంలో, వీరు నాకు కనిపించారు. 1930 నాటి నేను నిర్వహిస్తున్న బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక పోరాటాన్ని అభినందిస్తూ, 1959 లో నెహ్రూకు వ్యతిరేకంగా సాగించిన నా పోరాటంలో కలిసి వచ్చేందుకు ఆయన సిద్ధమయ్యారు.

ఇంగ్లండును పరిపాలిస్తున్న లేబరు మంత్రివర్గం భారతదేశానికి స్వాతంత్ర్యం ఇచ్చిన

తరవాత, ఇక్కడ కొనసాగుతున్న సంస్థానాల విషయంలో ఎలా వ్యవహరించాలనే ఒక స్పష్టమైన అభిప్రాయాన్ని అప్పటికి కలిగి వుండలేదు. బ్రిటిష్ అధికారులూ దానికి సంబంధించిన ప్రధానమైన రాజకీయ విభాగం బ్రిటిష్ వారి ఆధిపత్యంలోనుంచి భారత దేశం తొలగి పోవడానికి అంత సుముఖంగా లేరని కనీసం ఈ సంస్థానాల పరంగానైనా, ఇక్కడ ఒక గొయ్యి తవ్వాలని ఆలోచించారు. జాతీయ కాంగ్రెసు నాయకులు జరుపుతున్న సమగ్ర భారత రాజకీయ సమగ్రతా ప్రయత్నాలకు వ్యతిరేకంగా ఉండేందుకు సంస్థానాల పాలకులకు తగిన ప్రోత్సాహాన్ని ఇస్తూ, బ్రిటిష్‌వారు, వారు చేయగలిగిన చెరుపు అంతా చేశారని లియోనార్డ్ మొసిలీ, మీనన్ తదితరులు సవివరంగా వివరించారు.

భారత దేశం విభజన ద్వారా అంతకుముందు తాము బ్రిటిష్ వారికి తమపై అందజేసిన అధికారాలనుంచి, స్వేచ్ఛను పొందేందుకు సంస్థానాల పాలకులకు ఒక అవకాశం చిక్కినట్లయింది. అయితే 'సంస్థానాల ప్రజాసభ' ద్వారా, నెహ్రూ గారి తీవ్ర ధోరణి కారణంగా, ఆయా సంస్థానాలలోని ప్రజలు ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్న కారణంగా, సంస్థానాల పాలకులు బాధలను ఎదుర్కోవలసి వచ్చింది. ఇంగ్లండులో రాజకీయ విభాగాన్ని నిర్వహిస్తున్న మొండి పాలకులు ప్రధాని అట్లీని, సెక్రటరీ ఆఫ్ స్టేట్స్ అయిన పెథిక్ లారెన్స్‌ను కూడా పరిగణించకుండా, భారత దేశ స్వాతంత్ర్య ప్రకటనతోపాటు, సంస్థానాలకు కూడా స్వాతంత్ర్యాన్ని ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. పండిట్ జవహర్లాల్ నెహ్రూ, సర్దార్ పటేల్, లార్డ్ మౌంట్ బాటెన్ గార్లకు ఈ పరిస్థితులు ఒక రాజకీయ పరిష్కారాన్ని కనుక్కొనే బాధ్యతను వారి భుజస్కంధాలపై పెట్టినట్లయింది. భారత జాతీయ నాయకులు, ఆయా సంస్థానాల్లో ప్రజా పోరాటాలను సంస్థానాధీశులకు వ్యతిరేకంగా ప్రారంభించేందుకు ప్రోత్సహించారు. అయితే ఇందువల్ల అన్ని రాష్ట్రాలలో దీర్ఘకాల పోరాటాలు ప్రారంభమై, భారతదేశ ప్రజలలో అయిదోవంతుకు పైగా ఉన్న జనాన్ని కష్టాలపాలు చేశాయి. దేశ విభజన తరవాత దేశంలో మతకలహాల, విలయతాండవం ఒకవైపు జరుగుతూఉంటే, మరొక ప్రక్క సంస్థానాలలో సంస్థానాధీశులతో విభేదాలు పాలుగావడం ఆ సమయంలో అంత ఇష్టమైనది కాదు. శ్రీ వి.పి. మీనన్, లార్డ్‌మౌంట్ బాటెన్‌గారిని తనకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి, సంస్థానాధీశుల్ని అంగీకరింపచేయవలసిందని కోరారు. లార్డ్‌మౌంట్ బాటెన్ వైస్రాయి గానేగాక, రాజబంధువుగా, తనకున్న స్థాయిననుసరించి, సంస్థానాధీశులకు నచ్చచెప్పేందుకు ప్రయత్నించారు. మీనన్‌గారు సంస్థానాధీశులను ఆయా సంస్థానాలలో ప్రజా పోరాటాలు రాగలవని హెచ్చరించారు. అంతేగాకుండా వారికి గల సాంప్రదాయిక మైన హక్కుల మీద కూడా ప్రజలు తిరుగుబాటు చేయడం ద్వారానే కాకుండా, వారి కుటుంబాలకు కూడా రక్షణ లేకుండా ప్రజలు వారిని నేలమట్టం చేయగలరని చెప్పారు. సర్దార్ పటేల్‌గారు పట్టుదలతో వారిని హెచ్చరిస్తూ బ్రిటిష్ సామ్రాజ్యమే అంతమై పోయిన నిజాన్ని గుర్తించవలసిందని కూడా హెచ్చరించారు. ఇందుకు గాను సౌరాష్ట్రంలో 1920 నుంచి గాంధీ, పటేల్‌గారలు జరిపిన సంస్థానాల ప్రజా పోరాటాలను, ఒరిస్సా రాష్ట్రంలోని చిన్నచిన్న సంస్థానాలలో ప్రజాపోరాటాలు చెలరేగినప్పుడు, అక్కడ ఉన్న బ్రిటిష్ రెసిడెంట్ అధికారి వాటిని ఎదుర్కోవడానికి సైనిక సహాయాన్ని కోరిన విషయాన్ని వారికి చూపెట్టారు. గాంధీ

గారికి ముఖ్య అనుచరులైన జమన్ లాల్‌బజాజ్, టక్కర్ బాబాగార్లు సీకర్, జైపూర్ సంస్థానాలలో సత్యాగ్రహ పోరాటాలను నిర్వహించినప్పుడు, సాంప్రదాయికంగా పాలకులకు విశ్వాసపాత్రులైన భిల్లులు, ఇతర ఆటవిక తెగల ప్రజలు, రాజపుత్రులు వారికి వ్యతిరేకంగా మారి, భారత ప్రభుత్వానికి సహాయంగా ముందుకువచ్చి, మహారాజులను తలవంచుకునేలా చేయగలిగారనే సంగతిని ఆయన తెలియజేశారు. మాలాంటి వారు అనేకమందిమి ఒరిస్సా, రాజపుటానా, పంజాబ్ రాష్ట్రాలలో అటవీ భూములకు వ్యతిరేకంగా రైతుల పన్నుల నిరాకరణ కార్యక్రమాన్ని ప్రారంభించాం. తిరువాన్కూర్ రాష్ట్రంలో సర్ సి.వి.రామస్వామి అయ్యర్ పాలనకు వ్యతిరేకంగా జరుపుతున్న పోరాటంలో కమ్యూనిస్టులతో, కాంగ్రెసు కార్యకర్తలు కూడా కలిసి పనిచేశారు. స్వామి రామానందతీర్థ, హీరాలాల్ శాస్త్రి వంటివారు నిజాం, రాజస్థాన్ పాలకులను గడగడ లాడించారు. శ్రీ కె.సి.రెడ్డి హనుమంతయ్య, దానప్పవంటి వారు మైసూరు ప్రజాఉద్యమానికి నాయకత్వం వహించి, అక్కడి పాలకులకు క్లిష్ట పరిస్థితుల్ని కల్పించారు. పంజాబ్ రాష్ట్రంలో సిక్కుల సత్యాగ్రహం భూకంపాన్ని సృష్టించింది. మౌంట్ బాటెన్ గారు, సంస్థానాధీశులను ఈ విధంగా హెచ్చరిస్తూ, "తుదకు మీకు సీజరుకు పట్టినగతి పట్టగల"దని చెప్పారు. భోపాల్ నవాబు గారితో ఆయన చక్కని రాజకీయ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. జోధ్‌పూర్, జైసల్మీరు సంస్థానాలను పాకిస్తాన్‌తో కలవకుండా ఆపడం ద్వారా, అక్కడ అధికులుగా ఉన్న ! ందూ ప్రజలలో మతకలహాలు సంభవించకుండా, ఆ సంస్థానాలకు మేలుచేయగలిగారు. మీరు ఈ కోటలు, బురుజులు, ఆభరణాలపై ఇంకా ఆసక్తిని పోగొట్టుకోకుండా ఉంటే, భారత ప్రభుత్వ తోడ్పాటుతో, స్వాతంత్ర్యాభిమానులైన ప్రజలు మిమ్మల్ని చివరికంటా వెళ్లగొట్టకుండా వదలరని తుదకు ఆవిధంగా మీకేమి మిగలకపోవడమే కాకుండా, తీవ్రమైన కష్టనష్టాల నెదుర్కొనగలరనీ, గనుక మీ రాణివాసాలతో కూడా సంప్రతించి, మీ మనస్సులు మార్చుకొని, తద్వారా నవీన భారత ప్రభుత్వాధినేతల, భారత ప్రజల గౌరవాభిమానాలను పొంది మంచిగా జీవించవచ్చునని ఆయన సూచించారు. ఆ క్రమంలో వి.పి.మీనన్, సర్దార్ పటేల్ గార్లు సంస్థానాల పాలకులను, వారి శాసనసభలను గూడా భారత దేశంలో గానీ లేదా పాకిస్తాన్‌లో గానీ, దేనిలోనైనా ఒకదానిలో చేరి, విదేశీ వ్యవహారాలు, రక్షణ, రవాణా, విషయాలు ఆయా ప్రభుత్వాల ఆధిపత్యంలో ఉండేందుకు వీలుగా అంగీకరింపజేయగలిగారు. మీనన్ ఈ ప్రయత్నాలు అన్నీ చేసినప్పటికీ, బ్రిటిషు వారిచ్చిన సలీసును ఆసరాగా తీసుకొని, తిరువాన్కూర్, మైసూరు, హైద్రాబాద్, జోధ్‌పూర్, జైసల్మీరు, భోపాల్, కాశ్మీరు సంస్థాన పాలకులు దీనికి అంగీకరించక తమకు తాము అటు భారత్‌లో గానీ, ఇటు పాకిస్తాన్‌లో గానీ కలవకుండా యూరపులోని లాటిన్ అమెరికా రాజ్యాలవలె, స్వతంత్ర పాలకులుగా ఉండాలని నిర్ణయించుకొన్నారు. మీనన్ వారి చుట్టూ చక్రబంధం చేయసాగారు. నిజాం పరిపాలకులు, భోపాల్, జునాఘడ్, రాంపూర్ నవాబులు, కాశ్మీరు మహారాజా తాత్కాలిక ఒప్పందాల ద్వారా నైనా భారత్‌లో కలవకుండా, పాకిస్తాన్ నాయకుడు జిన్నాగారితో సంప్రతింపులు ప్రారంభించారు. తిరువాన్కూర్, మైసూరు మహారాజులు బ్రిటిషు వారి ఉపసంహరణ తరవాత స్వతంత్ర రాజ్యాలుగా ఉండి పోయేందుకు, పాకిస్తాన్‌కు తమ ప్రతినిధులను పంపించసాగారు. కొన్ని

రాష్ట్రాలు ఆయుధ కర్మాగారాలను, సైన్యాలను పెంచుకునేందుకు ప్రయత్నించసాగాయి. నేను 1948 లో జోధ్‌పూర్ వెళ్లినప్పుడు, అక్కడి కోటలో అలాంటి ఒక ఫ్యాక్టరీని చూడడం తటస్థించింది. బ్రిటీషు మాజీ సైనికోద్యోగి ఒకరు, రాజకీయ శాఖ ముఖ్యాధికారి ఒకరు కలిసి నిధులను, ఆయుధాలను, వాలంటీర్లను బ్రిటన్ నుంచి సమకూర్చి సహాయపడ గలమని హామీనిస్తూ, ఆయా సంస్థానాలలో తిరగసాగారు. మీనన్‌గారి రాజకీయ నిపుణత్వం, సర్దార్ పటేల్ గారి పిడుగులాంటి శక్తి, మౌంట్ బాటెన్‌గారి సూచనలు కార్యరూపం ధరించి, అనేక సంస్థానాలు భారత్ యూనియన్ లో సంలీనం అయ్యేందుకు సహాయ పడ్డాయి. సర్దార్ పటేల్, మీనన్‌గార్ల సమర్థవంతమైన, గట్టి పట్టు కలిగిన ప్రయత్నాలు బ్రిటీషు రాజకీయ విభాగం వారు ప్రబోధించినట్లు, భారత దేశంలో విజయవంతం గాకుండా, భారత దేశంలో మూడో రాజకీయ శక్తి ఏర్పడిఉంటే, ఈదేశం, ఈదేశ ప్రజలు అనేక కష్టనష్టాలపాలై అశాంతికి లోనయ్యేవారు. కాశ్మీరు మహారాజా హరిసింగ్‌కలిన నిర్ణయాన్ని ఖాతరు చేయకుండాను, నిజాంలో మెజారిటీ హిందువులను రజాకార్ల నుంచి రక్షిస్తూను, అతివేగంగా ఆ రెండు రాష్ట్రాలను భారత్ లో సమైక్యం గావించేందుకు సర్దార్ పటేల్, మీనన్‌గార్లు తీసుకున్న చర్యలు ఎంతో ప్రాధాన్యం గలవి. హైదరాబాద్‌కు చెందిన జునాఘడ్‌లోనూ, రాజస్థాన్‌కు చెందిన జోధ్‌పూర్, జైసల్మీరుల్లోనూ, భోపాల్, హైద్రాబాద్, తిరువాన్కూర్‌లలో మనకు వ్యతిరేకంగా జిన్నా కుట్రలు పన్నాడు. అవి ఫలించిఉంటే, పాకిస్తాన్ కాశ్మీరులో రేకెత్తించినట్లుగా మనదేశం అనేక అంతర్జాతీయ సమస్యలను ఎదుర్కొనవలసి వచ్చేది. గాంధేయ దేశభక్తితో శ్రీ పటేల్, జవహర్లాల్, మీనన్ లు కృషిచేసి భారత దేశ సమగ్రతకు ఎక్కువగా తోడ్పడ్డారు. మీనన్ గొప్ప దేశభక్తితో గౌరవ ప్రదంగా, పరిపాలనా సామర్థ్యంతోనూ, హుందాతనంతోనూ, తన పరిపాలనా ప్రావీణ్యాన్ని చూపెట్టారు. అనేకమంది రాజ్యాంగ సభ్యులు మీనన్‌ను మౌర్యుల కాలం నాటి చాణక్యునిగానూ, విజయనగర రాజుల కాలంనాంటి తిమ్మరుసు గానూ కీర్తించారు. సర్దార్ పటేల్‌కు మీనన్ లేకుండా, ఇతరులెవరైనా కార్యదర్శిగా ఉండిఉంటే, ఈ కార్యక్రమాలు ఇంత సులభంగా పూర్తిచేయగలిగి ఉండేవారు కాదు. మనలో కొంతమంది, "మనం సాధించిన ఫలితాలకు చెల్లించినది చాలా స్వల్పం. ప్రాచీన కాలంనుంచి రాజరిక మనస్తత్వంతో, సర్వాధికారాలను అనుభవిస్తున్న రాజరికాన్ని అంతంచేయడానికి జరిగిన ఈ మహత్తరమైన కృషి ప్రశాంతంగా, విజయవంతంగావడానికి మనం చెల్లించిన మూల్యం అతి స్వల్పమైనది" అని అన్నారు.

మీనన్‌గారు అన్ని విధాలా సర్దార్ పటేల్‌గారికి సహాయపడుతూ, ఉదహరించిన ఈ కార్యక్రమం వందలకొద్దీ సంస్థానాధీశులతోనూ, సాంప్రదాయికంగా అనుభవదారులు, సమర్థులైన వారి సలహాదార్లతోనూ, జరిపిన సంప్రతింపులు దీర్ఘకాలంగా కొనసాగుతున్న వారి హక్కుల్ని వదులుకునేందుకు అంగీకరింపచేసిన విధానం అరేబియన్ నైట్స్ కథల్లో లాగా, ఎన్నో అంశాలు మనకు తెలియని వాటిని అందులో దాచుకొని ఉన్నాయి. మీనన్ తనకు తానే స్వయంగా రెండు పుస్తకాల ద్వారా, ఇతర రచనల ద్వారా ఈ విషయాలన్నింటినీ విపులీకరించి, మనముందు పెట్టారు.

బ్రిటీషు లేబరు మంత్రివర్గం నిర్ణయం తీసుకొన్నట్లు 1948 జూన్ నాటికి కాకుండా,

అంతకు ముందుగానే, 1947 ఆగస్టు నాటికి అధికారాన్ని బదలాయించి, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పరచడానికి జరిగిన కృషిలో మీనన్ కృషి బహుధా ప్రశంసనీయమైనది.

– "చరిత్ర అన్ని సందర్భాలలోనూ, ఉన్నత సలహాలమీద ఆధారపడి ఉంటుంది. అందువల్ల నేను నీ సలహాకు రుణపడి ఉన్నాను. అది ఇతరులనుంచి ప్రతికూలాన్ని తగ్గించేందుకు చెప్పిన మాట" (పేజి 14. లాస్ట్‌డేస్ ఆఫ్ది బ్రిటిష్ రాజ్, బై లియోనార్డ్ మొసలీ 1972). నిజానికి మౌంట్ బాటెన్‌గారి "డిక్కీ బర్డ్ ప్లాన్" బ్రిటిష్ మంత్రివర్గం ఆమోదానికి సిద్ధంగా ఉంది. అయితే దాన్ని నెహ్రూగారు పూర్తిగా తిరస్కరించారు. కాంగ్రెసు దీన్ని అంగీకరించదని ఆయన అన్నారు. "ఇది ఏవిధంగానూ భారతదేశానికి ఆమోదం కాదన్నారు". (ఇబిడ్స్ పేజి 135). మీనన్‌గారి తెలివి, చతురతతో కూడిన నైపుణ్యం అంత గొప్పది. ఆయనకున్న దేశాభిమానం కూడా అంత ప్రాముఖ్యమైనది.

భారత పార్లమెంటు, సంస్థానాల ప్రజలు కూడా మీనన్‌గారి పట్ల కృతజ్ఞతను చూపించారు. స్వయం వృత్తి దారులైన రైతుల రక్షణ కోసం, 'స్వతంత్ర పార్టీని స్థాపించి, దానికి నన్ను అధ్యక్షుడిగా ఉండమని రాజాజీగారు ఆహ్వానించినప్పుడు, ఈ గొప్ప మేధావి అయిన మీనన్ దానికి కార్యదర్శిగా ఉండేందుకు మాపై అభిమానంతో అంగీకరించారు. మీనన్ నలుగురితో కలిసిఉండే చతురత గలవారు. సహచరులను, సన్నిహితులను ఏర్పాటుచేసుకోవడంలో ఆయన చొరవ మెచ్చదగింది. బెంగుళూరు నగరంలో కొద్దికాలంలోనే, ఆయన సామర్థ్యంతో ప్రముఖ వ్యక్తులను స్వతంత్ర పార్టీలోకి చేర్పించగలిగారు. రైతుల భూములను స్వాధీనం చేసుకొనేందుకు ఉద్దేశించిన రాజ్యాంగంలోని 17వ సవరణకు వ్యతిరేకంగా నిరసన తెలియచేయడానికి దక్షిణాది రాష్ట్రాల సభ నిర్వహించి, దానికి నన్ను అధ్యక్షునిగా ఉంచారు. ఆయన స్వర్గస్థులయ్యేంతవరకు రైతుజన మిత్రుడిగా, విశ్వాస పాత్రుడైన సహచరుడిగా ఉన్నారు.

41

శ్రీ మౌలానా అజాద్

1940 లో రాంఘర్ కాంగ్రెస్ సభలు జరిగిన నాటి నుంచి భారత జాతీయ వాదులు ఒకే ఒక మౌలానాను ఎరిగిఉన్నారు. ఆయనే మౌలానా అబుల్ కలామ్ అజాద్. ఆయన ఆరు సంవత్సరాల కాలం కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారు. అందులో నాలుగున్నర సంవత్సరాల కాలం నాలాంటి వారు సగానికి పైగా ప్రభుత్వ నిర్బంధంలోనూ, జైళ్లలోను గడుపుతున్న సందర్భంలో జరిగింది. జవహర్లాల్ నెహ్రూ గారితో కొంచెం ఇంచుమించుగా సమవయస్కులైనప్పటికీ చూడడానికి ఆయనకంటె పెద్దవానిగా కన్పిస్తూ ప్రపంచ వ్యవహారాల్లో ఎక్కువ పెద్దరికాన్ని కలిగి ఉన్నారు. నెహ్రూగారు ఆకర్షణీయంగా ఉండే మనుష్యులైతే అజాద్‌గారు ఆయన అరబిక్ అంద చందాలతో, మెలితిరిగిన మీసాలతో, పొడవైన గడ్డంతో ఇంకా చక్కగా కన్పిస్తుండేవారు. ఆయన నెహ్రూ గారికన్నా పొడగరి. అలాగే ఉన్నత పదవులను పొంది విశేషమైన గౌరవాన్ని కూడా సంపాదించుకో గలిగారు. నెహ్రూ, సుభాష్ చంద్రబోస్‌గార్లు తమ సంభై సంవత్సరాల ప్రాయంలో కాంగ్రెస్ గద్దెను అధిష్ఠించ గలిగితే మౌలానా అజాద్‌గారు ముప్పై సంవత్సరాల వయస్సు వచ్చేటప్పటికే దాన్ని పొందారు. ప్రజలు, రాజకీయ నాయకులు కూడా ఈ పరంగానే వారియెడ ప్రత్యేకమైన గౌరవాన్ని చూపిస్తుండేవారు. రాజాజీ గారు ఒకమారు కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఆయన పట్ల చూపించిన ప్రత్యేకత నన్ను ఆశ్చర్యపరచింది. "మౌలానా సాహెబ్‌గారితో విభేదించడం నాకు ఇష్టం కాకపోయినప్పటికీ ఈ విషయంలో మరొకమారు తిరిగి ఆలోచించవలసిందిగా, నేను దీనిని గౌరవ పురస్కారంగా వారి ముందు పెడుతున్నాను". ఆ విధంగా రాజాజీగారు అంత వినయంగా ఎవరితోనూ, ఏ సందర్భంలోనూ మాట్లాడడం నేనెరుగను. అప్పుడు ఆయన గవర్నర్ జనరల్‌గాను, భారత ప్రభుత్వంలో దేశీయాంగ మంత్రిగాను ఉన్నారు.

ముస్లిములంచే పవిత్ర ఖురాన్ గ్రంధ పండితులైన షాకత్ ఆలీ, మహమ్మద్ ఆలీలతోపాటు అనేక మంది మౌలానాలలో ప్రముఖులుగా శ్రీ అజాద్ గుర్తించబడ్డారు. మౌలానా అజాద్ ఆలీ బ్రదర్సుకు అంత ఇష్టం కాకపోయినప్పటికి ఒక గట్టి కాంగ్రెస్ స్వాతంత్ర్య సమర యోధునిగా జీవించారు, మరణించారు. ఉర్దూ, పర్షియన్, అరబిక్ భాషలలో ఆయన పేరెన్నిక గన్న పండితులు. ముస్లిం మతాభిమానులైన వారు ముఖ్యంగా కలకత్తాలో ఉండేవారు. ఆయన ఖురాన్ పఠనాన్ని అందుకు ఆయన చెప్పే వ్యాఖ్యలను వారు చాలా గొప్పగా గౌరవిస్తుండేవారు. జిన్నా పలుకుబడి పెరుగుదల ప్రారంభమైనాక కాంగ్రెస్ పక్షానికి మౌలానా ఒక గొప్ప నిధిగా ఉండగలిగారు. జిన్నా గారికి ఉర్దూ కొంచెం గానే తెలుసు. అరబిక్, పర్షియన్ భాషలలో అంతంత మాత్రంగానే ప్రవేశమున్నది. పవిత్ర ఖురాన్ గ్రంధానికి ఆయన పూర్తి విశ్వాసపాత్రులు. జిన్నా పాకిస్తానీ భారత వ్యతిరేక ప్రచారంతో భారత జాతీయ వాదాన్ని తీవ్రమైన దెబ్బ కొట్టారు. జిన్నా

నాయకత్వంలో భారత జాతీయ వాదానికి దూరంగా జరగడానికి ముస్లిం ప్రజలు తీసుకున్న నిర్ణయం యొక్క మంచి చెడులను గురించి ముందు తరాల చరిత్ర చెప్పవలసి వస్తుంది. 1936-37 సంవత్సరాలలో జిన్నా లీగ్ పార్టీ భారత జాతీయ కాంగ్రెస్‌ను కొంచెం వెనుకగా అనుసరిస్తూ వచ్చినప్పటికీ 1946-47 సంవత్సరాలలో పూర్తి వ్యతిరేకంగా జిన్నాగారు ఎక్కువ మంది ముస్లిం శాసనసభ్యులను తనతో ఉంచుకోగలిగారు. 1936-46 సంవత్సరాల మధ్యకాలం అటు భారత జాతీయ వాదానికి ఇటు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి కూడా దురదృష్టకరమైన దశాబ్దం. ఆ దశాబ్దంలో మౌలానా ఆజాద్ గారు జాతీయ కాంగ్రెసును నడిపిస్తూ రౌండ్ టేబుల్ సమావేశంనుంచి నెహ్రూగారి స్వాతంత్ర్య అభిలాషకు అనుగుణంగా పూర్తి స్వాతంత్ర్యం లభించేంతవరకు ఆయన ఈ బాధ్యతలను నిర్వహించారు. ఈ దశాబ్ద కాలంలోనే జిన్నా మౌలానా ఆజాద్ గారిని కాంగ్రెస్ పార్టీ తరపున ప్రదర్శనానికి పెట్టిన ఒక బొమ్మగా అభివర్ణించాడు. మహాత్మాగాంధీ నాయకత్వంలో జాతీయ కాంగ్రెస్ ఇచ్చిన క్విట్-ఇండియా పిలుపు జిన్నాగారు బలపడేందుకు, పాకిస్తాన్ విభజనకు, బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఇక్కడనుంచి తొలిగేందుకు కూడా దోహద పడింది.

భారతదేశ ఐక్యతను కాపాడేందుకు మౌలానా ఆజాద్‌గారు తమ శక్తివంచన లేకుండా కృషిచేశారు. ఆయన భారత జాతీయవాదాన్ని కాపాడేందుకు ముస్లింలు తదితర మైనారిటీల ప్రయోజనాలను పరిరక్షించేందుకు పాకిస్తాన్ ఏర్పాటును హృదయపూర్వకంగా గట్టి పట్టుతో వ్యతిరేకించారు. ఆయన ఆరోజు పాకిస్తాన్ ఏర్పాటుకు ఏ అభ్యంతరాలు నయితే చెప్పారో అవన్నీ వాస్తవమేనని తరవాత జరిగిన చరిత్ర ఋజువు పరచింది. పాకిస్తాన్ ఏర్పాటు జరగడం ఖాయమైతే ఎలాంటి విపరీత పరిణామాలు సంభవిస్తాయో తెలియజేస్తూ ఆయన మహమ్మదీయ ప్రజలను హెచ్చరించారు. సరిహద్దులకు ఇరువైపులా ఉన్న ప్రజలు కష్టనష్టాల పాలైనాక చిట్ట చివరకు తాను అత్యధికంగా ప్రేమించే జవహర్లాల్ నెహ్రూ గారిమీద కూడా ఆయన విధానాలకు వ్యతిరేకంగా పోరాడారు. దురదృష్ట వశాత్తూ ఈ విషయంలో తమకు అభిమానులుగా ఉంటున్న వారు నెహ్రూ, పటేల్ గార్లను తమ మార్గంనుంచి నిరోధించలేకపోయారు. తనకు ఈ విషయంలో చెప్పుకోదగినంత మంది ముస్లింల సమర్థన లభించినా మైనారిటీ వర్గంలో తనవాదన నిలబడగలిగినా భారత జాతీయతత్వ వ్యతిరేక శక్తులను తను అడ్డుకోగలిగే పరిస్థితులను కల్పించుకోగలుగుతున్నా గూడా దురదృష్టం ఈ విషయంలో ఆయనను ఘోరంగా ఓడించింది. చివరికి భారత జాతీయ తత్వానికి వ్యతిరేకంగా రాక్షసత్వంతో కూడుకున్న ఫాసిస్టు అరాచక శక్తులు విచ్చల విడితనంతో కలకత్తాలో, పంజాబ్‌లో అక్కడ కొనసాగుతున్న స్థానిక ముస్లిం మంత్రుల ఆశీస్సులతో ప్రత్యేక పాకిస్తానీ వాదానికి అనుకూలంగా దౌర్జన్య చర్యలకు, మత కలహాలకు పాల్పడడంతో ఆజాద్ వాదం వాటి అడుగున పడి కూరుక పోయింది.

భారతదేశ సమగ్రతను, ఐక్యతను కాపాడేందుకు వీలుగాఉన్న వేవెల్ ప్రణాళికను ఆయన సమర్థించారు. దాని ప్రకారం కేంద్రంలో ఒక ఫెడరల్ గవర్నమెంట్ ఉండి రాష్ట్రాలపై రక్షణ, వాణిజ్యం విదేశీ వ్యవహారాలపై అది ఆధిపత్యాన్ని కలిగి ఉంటుంది. ఆయనకు అభిమాన పాత్రుడైన జవహర్ ఈ విషయాన్ని నిర్ద్వందంగా త్రోసిపుచ్చారు. ఎందుకంటే కామన్వెల్త్‌తో

ఎలాంటి సంబంధాలు కలిగి ఉండాలన్నా అది ఆయనకు ఇష్టంలేదు. పైగా వేవెల్ మీదకూడా ఆయనకు అయిష్టమే. నెహ్రూ, పటేల్‌గార్లు గమనిస్తూ ఉన్న క్యాబినెట్ మిషను పథకాన్ని గాని, లేదా మౌంట్ బాటన్‌గారి "డిక్కీ బర్డ్ ప్లాన్" ను గాని ఆయన బలపరచి ఉండవలసింది. అప్పుడు వారి అసంతృప్తిని ఆయన కొంతవరకైనా తగ్గించ గలిగేవారు. మహాత్మాగాంధీగారు, జిన్నా ఎవరికీ ఇష్టం కాకపోయినప్పటికీ తనకు ఇష్టం వచ్చిన వారితో మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసుకోమని ఆయనకు పూర్తి అధికారాన్నిచ్చే ప్రతిపాదనలు చేశారు. అప్పుడు మౌలానా అజాద్‌గారు నిస్సహాయులుగా ఉండిపోవలసి వచ్చింది. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఏర్పడిన నాటినుంచి పాడుకుంటున్నట్లుగానే వందేమాతరం గీతాలను ఆలపిస్తూ ఈ సంఘటనలనన్నింటిని ఒక ప్రేక్షకునిగా చూస్తూ అలా ఉండిపోవలసి వచ్చింది.

శ్రీ అజాద్‌గారు తనకు ఇరవై సంవత్సరాల వయసున్నప్పుడే కిలాఫత్ సమస్యపై సహాయ నిరాకరణ ఉద్యమంలో బాపూజీని అనుసరించి గొప్ప సాహసులుగా పేరుపొందారు. 1942లో బొంబాయిలో జరిగిన ఎ.ఐ.సి.సి సభల సందర్భంలో ఆ వేదికపై నుంచి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య పోరాట కృషిని తీవ్రంగా ముందుకు నడిపించడానికి ఆయన పూనుకోవడమనేది దైవ సంకల్పమేనని అనవచ్చు. ఆ తరవాత ఆయన పూర్తిగా భారత మాత సేవలకు అంకితమయ్యారు. దేశ విభజన జరిగిన తరవాత ఉత్తర భారతదేశంలో మత దురహంకారులు రక్తదాహంతో రాక్షసులలాగా విజృంభిస్తున్నపుడు మౌలానా ఎంతో సంయమనాన్ని ఓర్పును పాటించారు. జవహర్లాల్‌కు సర్దార్‌కు తన పూర్తి సమర్థనను అందిస్తూ రాజకీయాల పేరుతో కొనసాగుతున్న ఈ మారణ హోమాన్ని అంతం చేసేందుకు ఇరువైపులా పెరుగుతున్న ఆవేశకావేశాలను తగ్గించేందుకు ఆయన చేయగలిగిందంతా చేశారు. ఆ సందర్భంలో కొందరు జాతీయ నాయకులపై ఆయన అసంతృప్తి చెందినా హుందాతనంగా దానిని బయటకు వెళ్లగక్కకుండా తనలో తానే దిగమింగుకొని, విద్యాశాఖామంత్రిగా ఆయన గొప్ప సేవజేశారు. యూనివర్సిటీలకు నిధులను కేటాయించే విషయంలో ప్రభుత్వ ప్రమేయంగానీ రాజకీయాల ప్రభావంగానీ లేకుండా తమంతట తామే వ్యవహరించేందుకు వీలుగా ఉండే అధికారాలతో ఆ సమయంలో ఆయన ఏర్పాటుచేసిన స్వతంత్రమైన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఆ రోజు ఆయన మనకందించిన ఉత్తమ ఫలాలలో ఒకటి.

ఆయన రాష్ట్రపతి అయివుంటే పశ్చిమాసియా దేశాలనుంచి మనం ఎక్కువ ఆదరణను పొందడానికి వీలు కలిగేది. అయితే ఆయన కంటే పెద్దవారు, అనుభవపరులైన రాజేంద్రప్రసాద్ గారికి ఆ అవకాశం లభించింది. ఆయన ఆఫ్రికా, అరబ్ ప్రాంతాలలోని అనేక దేశాలలో పర్యటించి ఆయా దేశాలలో పాకిస్తాన్ కొనసాగిస్తున్న భారత వ్యతిరేక ప్రచారాన్ని, కాశ్మీరు వివాదాన్ని వివరిస్తూ ఇంకా పూర్తి స్వాతంత్ర్యం పొందకముందే భారత దేశ స్వాతంత్ర్య పరిరక్షణకోసం గట్టి కృషిచేశారు. ఆ యాత్రలలోని శ్రమను ఆయన లెక్కచేయక పాకిస్తాన్ వాదానికి భిన్నంగా భారత విధానాన్ని వారికి వినిపిస్తూ గొప్పగా శ్రమించారు.

వ్యక్తిగతంగా ఆయన గొప్ప ఉన్నత గుణాలు కలిగిన మంచి మనిషి. అన్ని వేళలా ఆయన

మర్యాదగా వ్యవహరిస్తూ ఇతరులకు సహాయపడటానికి సంసిద్ధంగా ఉంటూ ఉండేవారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశాలలో గాంధీగారి సమక్షంలో టీ త్రాగేందుకు, సిగరెట్ ముట్టించేందుకు ఆయనకు ఒక్కరకు మాత్రమే స్వేచ్ఛ ఉండేది. జవహర్లాల్ గారు పూర్తిగా విశ్వసించిన మనిషి ఆయన ఒక్కరు మాత్రమే. పార్టీ కార్యనిర్వాహక సమావేశాల్లో గాని వర్కింగ్ కమిటీ సమావేశాలలో గాని చర్చల మధ్యలో జోక్యం చేసుకునేందుకు ఆయన ఎప్పుడూ తొందరపడేవారు కాదు. మూలాంటి వారం ఎవరమైనా రాష్ట్రాలలో మంత్రులను గురించి ఆరోపణలు చేసినపుడు ఆయన సహాయపడడానికి తక్షణమే ముందుకు వచ్చేవారు. మేము ఏదైనా ఒక కార్యక్రమంపై గాని, ప్రణాళికపై గాని ముందుగా ఆయన ఆమోదాన్ని పొందగలిగితే అప్పటికి మా కార్యక్రమంలో సగం పూర్తి అయినట్లే భావించేవాళ్లం. ఎందుకంటే ఆయన మాటమీద జవహర్లాల్ గారు గొప్ప గౌరవం చూపెట్టేవారు. ఆయన మైనారిటీలకు బంధీన వర్గాలకు రక్షకుడుగా వ్యవహరిస్తున్నప్పటికీ మెజారిటీ వర్గాలకు చెందిన అమాయకులైన ప్రజలపై ఎప్పుడూ ద్వేషాన్ని చూపెట్టేవారు కాదు. ఏవిధంగా చూసినా అజాద్ గారు ఒక పవిత్ర వ్యక్తి. గొప్ప దేశభక్తిపరులు, నిజమైన ధార్మిక చింతనా పరులు.

42

ముదలియార్ సోదరులు

జస్టిస్ పార్టీకి చెందిన ఏ.రామస్వామి ముదలియార్ 14-10-1887న జన్మించారు. న్యాయవాది మద్రాసు నివాసి. 1928-30 సంవత్సరాల మధ్య యం.ఎల్.సి. గా కొనసాగారు. 1930 సంవత్సరంలో కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ సభ్యులుగా ఉన్నారు. 1931 నుండి 1934 వరకు సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యులు. రౌండ్ టేబిలు కాన్ఫరెన్సులో పాల్గొన్నారు. 1939 నుంచి 1945 సంవత్సరాల మధ్య కాలంలో వైస్రాయి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు సభ్యులు. 1942-43 సంవత్సరాలలో ఫసిఫిక్ కౌన్సిలులో ఉన్నారు. 1945 వ సంవత్సరంలో మిత్రరాజ్య సమితి నిర్బంధ కార్మిక విధాన పరిశీలనా సంఘానికి అధ్యక్షులు, యునెస్కోకు అధ్యక్షులు. తిరువాన్‌కూర్ విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగానూ మైసూరు సంస్థానానికి దివానుగానూ పనిచేశారు. బ్రాహ్మణేతరులకు, సాంఘికంగా తోసివేయబడిన వర్గాల ప్రజలకు సమాన హక్కుల కోసం పోరాడారు. మద్రాసు నగరానికి మేయరుగా పనిచేశారు. - (ఎడిటర్)

ముదలియార్ సోదరులు రామస్వామి, లక్ష్మణస్వామి 1920, ఆ ప్రాంతంలో జస్టిస్ పార్టీకి చెందిన బ్రాహ్మణేతరులైన యువకులకు ఆరాధ్యులైన కవలలు. బ్రిటిష్ ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తూ ఈ ఇద్దరు సోదరులు గొప్ప అవకాశాలను, పేరుప్రతిష్ఠలను, విలువలను సంపాదించుకొన్నారు. పౌరాణికంగా భారతదేశంలో ప్రముఖ సోదరులుగా కీర్తించబడుతున్న రామలక్ష్మణ నామాలను ఈ ఇద్దరు సోదరులు ధరించారు. రామస్వామి ముదలియార్‌గారు, యస్. సత్యమూర్తిగారు, మద్రాసుకు చెందిన ఈ ప్రముఖ వక్తలిద్దరూ ఇరవై ఆయిదు సంవత్సరాలపాటు (1915-1940) మద్రాసు నగరంలోని మేధావులను, విద్యార్థులను తమ ప్రసంగాలతో ఉర్రూతలూగించగలిగారు. మృదుమధురమైన స్వరంతో ముదలియార్, కంచుకంఠంతో సత్యమూర్తి ఒకరితో ఒకరు పోటీపడుతూ వారి విభిన్న దృక్పథాలైన అన్ని కులాల, అన్ని వర్గాల ప్రజల సమాన హక్కులపై సాంఘిక విప్లవం కోసం మొదటివారు, జాతీయ విప్లవ ప్రాధాన్యతను గురించి రెండోవారు అనర్గళంగా ఉపన్యాసాల నిస్తుండేవారు. ఈ ఇద్దరూ వారి వారి పార్టీలైన జస్టిస్ పార్టీలో ఒకరు, కాంగ్రెస్ పార్టీలో మరొకరు నాయకత్వం కోసం తీవ్రంగా పోటీపడుతుండేవారు. ఒకసారి వారు ఆస్థానాలను పొంది ముందుకు వచ్చిన తరవాత మద్రాసు శాసనసభలోను, కార్పొరేషన్ లోను రాజకీయ వేదికలపైనను యువకుల హృదయాలను చూరగొనేందుకు తమ తమ ఉపన్యాస చాతుర్యాలను ప్రదర్శిస్తూ, పరస్పరం పోటీపడుతుండే వారు, చివరగా సాధారణ ఎన్నికలలో జరిగిన పోరాటంలో సత్యమూర్తి విజయాన్ని సాధించి సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి యం.ఎల్.ఏ.గా వెళ్లారు.

చూసేందుకు ముదలియార్ అన్ని విధాలా దెబ్బతిన్నాడని అందరూ అనుకొన్నారు. అయితే పార్లమెంటరీ చర్చలలో ఆయన సామర్థ్యాన్ని చూసిన బ్రిటీషు వారు కాంగ్రెస్ వ్యతిరేక

పార్లమెంటరీ పోరాటంలో ఆయన సామర్థ్యాన్ని వినియోగించుకోవాలనుకున్నారు. ఆయనను వైస్రాయి కౌన్సిలులో చేరవలసిందిగా బ్రిటీష్ ప్రభుత్వం ఆహ్వానించింది. మొదట సభ్యులుగా చేరి తరవాత దానికి ఉపాధ్యక్షులైనారు. ఆ పార్టీకి నాయకులు కూడా కాగలిగారు.

ఆయన వైస్రాయి సెంట్రల్ క్యాబినెట్‌లో చేరింతరవాత జాతి గౌరవంపై తనకున్న పూర్వ నమ్మకాన్ని తిరిగి ప్రకటించడం ప్రారంభించారు. యుద్ధానంతరం అనేక అంతర్జాతీయ సభలలో భారత ప్రతినిధిగా పాల్గొంటూ ఆయన తనకున్న వాక్చాతుర్యంతో గొప్ప సామర్థ్యంతో భారత దేశానికి గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించేందుకు మానవహక్కుల సాధనకోసం వాదించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో మిత్రరాజ్య సమితి ప్రారంభమయేటప్పుడు ప్రసంగించిన వారిలో ఆయన కూడా ఒకరు. యుద్ధ విరమణ తరవాత యూరోప్ ఖండంలో తలెత్తిన బానిసలైన పనివారి శిబిరాలను గురించి ఆయన పరిశోధించి మరువలేని సమాచారాన్ని అందించారు. యునెస్కో నిబంధనావళిని తయారుచేయడంలో తన మేధా సంపత్తిని ఆయన చూపెట్టారు.

నేను పచ్చయప్ప కళాశాలలో ఆచార్యులుగా చేరినప్పుడు అందుకు ఆయన అంతగా ఆనందించలేదు. ఎందుకంటే నేను స్వాతంత్ర్యం కోసం జాతీయ పోరాటానికి మొదటి ప్రాధాన్యతనిస్తూ కాంగ్రెస్‌తో ఉన్నాను గనుక. అయితే ఆ తరవాత ఆయన మద్రాసు నగరానికి మేయరయినప్పుడు మురికి పేటలలో ఉన్న ప్రజలకు సహాయపడుతూ నేను చేస్తున్న కృషిని చూసి నన్ను బాగా అభిమానించసాగారు. మేమిద్దరం సెంట్రల్ అసెంబ్లీలో సభ్యులుగా ఉన్నప్పుడు ఎదురెదురు బెంచీల మీద కూర్చొని ఒకరిని ఒకరం అభినందించుకుంటూ ఉండేవారం. ఉప్పు సత్యాగ్రహ సందర్భంలో బ్రిటీష్ వారికి తోడ్పడవలదని నేను బ్రాహ్మణేతర యువకులకు విజ్ఞప్తి చేసినపుడు, నన్ను రాజకీయాలలో పాల్గొనవద్దని కాలేజీ ట్రస్టు బోర్డు చేసిన హెచ్చరికను ఆయన బలపరిచారు. వేరు వేరు రాజకీయ ధోరణులలో ఉంటూ ఉన్నా మేమిద్దరం పరస్పర ద్వేషాలు లేకుండా సంతోషంగానే ఉంటూ వుండేవారం.

1915-45 సంవత్సరాల మధ్య కాంగ్రెస్‌కు వ్యతిరేకమైన పోరాటానికి ఆయన ఎందుకు దిగారు? దేశ స్వాతంత్ర్యం ఒక్కటే అన్ని సమస్యలను పరిష్కరించగలదనుకొనే వారికి ఆయన నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తుంది. భారతదేశం తరతరాలుగా కుల పోరాటాలతోను ఉన్నతుల మనుకునే పూజారి వర్గాలతోను అంటరాని తనమనే దురాచారంతోను అణగారిపోయి అసమానత్వంతో బ్రతుకు తున్న ప్రజలతో కర్మ సిద్ధాంతాలకిందపడి నలిగిపోతున్నది. ఇన్నేళ్లుగా వ్యధల ననుభవిస్తున్న ఈ వర్గాలను ముందుకు తీసుకురావడానికి ప్రారంభించే విప్లవానిదే ప్రథమ స్థానమనుకున్నాడు ముదలియార్. ఆ తరవాత ఆయన చూపిన ఆ బాటలోనే డాక్టర్ టి.యం.నాయర్, శ్రీ ఇ.వి.రామస్వామి నాయకర్ గార్లు నడిచారు. ఆ తరవాత అన్నాదురై దాని ప్రచారాన్ని కొనసాగించారు. ఈ సాంఘిక పరివర్తనా కృషే రాజకీయ స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేయగలదని ఆయన నమ్మాడు. మహాత్మాగాంధీ ముదలియార్‌ను ఆయన మిత్రులను దేశ స్వాతంత్రోద్యమమే సాంఘిక విప్లవాన్ని గూడ సాధిస్తుందని చెప్పి ఒప్పించలేక పోయారు. అంతేకాక బ్రిటీష్‌వారిని పూర్తిగా బయటకు పంపి గాంధీ మహాత్ముడు

దేశ స్వాతంత్ర్యాన్ని సాధించగలరని వారు ఊహించలేకపోయారు. బ్రిటీష్ ప్రభుత్వం ఇచ్చే అవకాశాన్ని తమ అభివృద్ధికి తమ తోటి బ్రాహ్మణేతర వర్గాల అభివృద్ధికి వినియోగించుకోవాలన్న తలంపుతో గుడ్డిగా బ్రిటీష్ ప్రభుత్వంతో సహకరించి, బ్రాహ్మణేతర ప్రజల పక్షాన వారు కోరే సామాజిక విప్లవ కార్యక్రమం కొంత ఆరకంగా వెనక్కు పడిందనే సంగతి వారు గ్రహించలేక పోయారు.

ముదలియార్ సోదరులలో లక్షణస్వామి ముదలియార్ తన సమయాన్ని పూర్తిగా విద్యా విషయాలకే పరిమితం చేసి ముఖ్యంగా వైద్య విద్యమీద దృష్టిని కేంద్రీకరించారు. ఆయన రాజకీయ వివాదాల్లో తలదూర్చక పూర్తిగా నిర్మాణ కార్యరంగాల్లోనే తన పనిని లగ్నం చేశారు. వీరు కూడ రామస్వామి గారివలెనే చక్కని ఉపన్యాసకులు. అయితే ఆ సామర్థ్యాన్ని జాతీయ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఆయన ఉపయోగించలేదు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత భారతదేశం లోను మద్రాసు రాష్ట్రంలోను విద్యాభివృద్ధి కృషిలో ఆయన సామర్థ్యాన్ని కాంగ్రెస్ నాయకులు పూర్తిగా వినియోగించు కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షులుగా నియమించింది. ఆ పదవిలో ఆయన రెండు దశాబ్దాల కాలం పనిచేశారు. ఎడ్యుకేషన్ కమీషన్‌కు చీఫ్‌గా ఉండి సెకండరీ విద్యను సంస్కరించేందుకు ఆయన పూనుకొన్నారు.

అన్నాదురై తనలో ఒకపక్క ఇ.వి.రామస్వామి నాయకర్, వరదరాజులునాయుడు గార్ల ఆత్మగౌరవ ఉద్యమ ప్రభోధాత్మకమైన సాంఘిక విప్లవ కాంక్షను, మరొక పక్క రాజాజీ, సత్యమూర్తి గార్లనుంచి ఉన్నతిని తనలో మిళితం చేసుకొని శతాబ్దాల తరబడి పోరాటాల ద్వారా జైళ్లలో తాను అనుభవించిన బాధల ద్వారా పొందిన అనుభవాలను ఆకళింపులో పెట్టుకొని కార్యదీక్షతో, త్యాగంతో డి.ఎం.కె.పార్టీని తీర్చిదిద్దాడు. అందువల్ల (డి.కె., డి.ఎం.కె) తరతరాలుగా వారు అనుభవిస్తున్న తక్కువ తనం నుంచి తమిళ ప్రజలను పైకి తీసుకొచ్చి 1967వ సంవత్సరంలో మద్రాసు రాష్ట్రంలో అధికారం చేపట్టేందుకు ఆయనకు వీలు కలిగింది. ముదలియార్‌లు వారి పూర్వీకులు కలలుగన్న ఈ రాజకీయ స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వతన్యాన్ని ఈనాడు వారు చూసిఉంటే ఎంతగానో ఆనందించేవారు.

43

శ్రీ హిరేన్ ముఖర్జీ
పార్లమెంటులోని ఆయన మిత్రులు

కామ్రేడ్ యస్.ఎ.డాంగే 10-10-1889 న బొంబాయిలో జన్మించారు. ఆయన తన ఇరవయ్యవ సంవత్సరంలో కార్మికోద్యమంలో ప్రవేశించారు. మీరట్ కుట్రకేసులో జైలుకు వెళ్లారు. ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ సంస్థాపకులలో ఆయన ఒకరు. దానికి అధ్యక్షులు. ఆయన కార్యకలాపాలకు ప్రధాన కేంద్రాలు బొంబాయి, పూనా, షోలాపూర్ లలోని బట్టలు తదితర పరిశ్రమలలోని కార్మికులు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. 1936 వ సంవత్సరంలో ఆలిండియా కిసాన్ కాంగ్రెస్ జైపూర్ సభల సందర్భంలో ఆయన రంగా గారితో సహకరించి పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ పుట్టిన నాటి నుంచి దానిలో పొలిట్ బ్యూరో సభ్యులుగా కొనసాగుతూ వచ్చారు. సోవియట్ రష్యా ఆయనకు లెనిన్ బహుమతి నిచ్చి గౌరవించింది. 1957-62 సంవత్సరాల మధ్య ఎన్నికై పార్లమెంటులో సభ్యులుగా ఉన్నారు. స్వరాజ్యం రాకముందు వచ్చిన తరవాత అనేకమార్లు ఆయన జైలుశిక్షలననుభవించారు.

మలబారుకు చెందిన ఎ.కె.గోపాలన్ గారు 1-10-1904న జన్మించారు. ఆయన ఉపాధ్యాయునిగా తన జీవితాన్ని ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరయోధులు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత, రాకముందు కూడ జైలుశిక్షలనుభవించారు. 1942 వరకు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. కేరళ రాష్ట్ర కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో ఉండి ఆ తరవాత కమ్యూనిస్టు పక్షంలోకి వచ్చారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో పొలిట్ బ్యూరో సభ్యులు కాగలిగారు. 1952 నుంచి పార్లమెంటు సభ్యులు. నంబూద్రిపాద్ గారితో కలసి ఈనాడు వీరు సి.పి.ఐ. మార్క్సిస్టు పార్టీ నాయకులు. మలబారు కిసాన్ కాంగ్రెస్ కార్యకలాపాల్లో రంగాగారితోనూ నంబూద్రిపాద్ గారితోనూ కలసి పనిచేశారు. 1942లో ఘోరంగా చీలిపోయేంతవరకు ఆలిండియా కిసాన్ సభకు అధ్యక్షుడిగా ఉన్నారు. రంగాగారితో కలసి వెల్లూరు జైలులో ఉంటూ అక్కడి నుంచి తప్పించుకొని పారిపోయి కొంతకాలం రహస్య జీవితం గడిపారు. ఆయన భార్య కూడ పార్లమెంటు సభ్యులుగా ఉన్నారు.

హిరేంద్రనాథ్ ముఖర్జీ యం.ఏ.బి.లిట్ 23-11-1907న కలకత్తాలో జన్మించారు. ఆయన కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్యులుగా పనిచేశారు. ఆక్స్‌ఫర్డ్ విశ్వ విద్యాలయం నుంచి ఆయన డిగ్రీ తీసుకొన్నారు. ఆయన ఆంధ్ర విశ్వ విద్యాలయంలో కూడా పనిచేశారు. కొంతకాలం కాంగ్రెస్‌లో ఉండి ఏ.ఐ.సి.సి. సభ్యులుగా ఉన్నారు. ఆయన రాజకీయ జీవితం కాంగ్రెస్ సోషలిస్టు పార్టీతో ప్రారంభమై విద్యార్థినాయకునిగా ఆ తరవాత ఆలిండియా

స్టూడెంట్స్ కాన్ఫరెన్స్ అధ్యక్షులుగా ఉండి కమ్యూనిస్టుగా పరిణామం చెంది 1941-52 సంవత్సరాల మధ్య సోవియట్ యూనియన్ మిత్రమండలి వ్యవస్థాపక సభ్యులుగాను ఇండో సోవియట్ జర్నల్ సంపాదకులుగాను ఉన్నారు. 1952 నుంచి ఆయన పార్లమెంటు సభ్యులు. లోక్‌సభలో సి.పి.ఐ. వర్గానికి ఆయన నాయకుడిగా ఉంటూ గొప్ప ప్రతిపక్ష పార్లమెంటరీ నాయకునిగా గౌరవాన్ని సంపాదించుకొన్నారు. ఆయన ప్రముఖ రచయిత, ఉత్తమ పండితులు. భారతస్వాతంత్ర్య పోరాటంమీద, మహాత్మాగాంధీ గారిమీద ఆయన వ్రాసిన పుస్తకాలు భారతీయ కమ్యూనిస్టు సాహిత్యంలో ప్రథమ శ్రేణికి చెందినవి. 1936లో అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘానికి రంగాగారితో పాటు ఆయన వ్యవస్థాపక సభ్యులు. ఆయన ప్రపంచమంతా చుట్టి వచ్చారు. మంచి పండితులు, చక్కని ఉపాధ్యాయులు (ఎడిటర్)

కమ్యూనిస్టులు 1952 సంవత్సరం నుంచి పార్లమెంటులోకి రాసాగారు. ఉభయ సభల్లోను వారు ప్రముఖమైన భూమికలను నిర్వహిస్తూ వచ్చారు. మొదటి సాధారణ ఎన్నికల సందర్భంలో వేలకొద్దీ కమ్యూనిస్టులను జైళ్లనుంచి విడుదలచేసి భారత ప్రజాస్వామ్యంలో వారిని పాలుపంచుకోవలసిందిగా నెహ్రూజీ కోరారు. వైనా మార్గంలో త్వరిత గతిని అధికారం చేపట్టాలనే వారి ప్రయత్నం తెలంగాణాలో విఫలమైన తరవాత శాసన సంస్థల్లో ప్రవేశించి స్వరాజ్యవాదులతో తలపడాలనే నిర్ణయానికి వారు వచ్చారు. వారు ఆ ఎన్నికలో మధ్య తరగతి వారు చూపించిన సానుభూతిలోను, కంట్రోలుతో విసిగిపోయిన పేద ప్రజల సానుభూతితోను అప్పటికి నాలుగు సంవత్సరాలుగా కొనసాగుతున్న నెహ్రూజీ పాలనపై ప్రజలు పోగొట్టుకున్న నమ్మకాల కారణంగాను గొప్ప విజయాలను సాధించగలిగారు.

ఆంధ్రకు చెందిన శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య గారు 1913 సంవత్సరంలో జన్మించారు. ఆయన మా రైతాంగ విద్యాలయంలో కూడ ఉన్నారు. రైతు సంఘాల కార్య కలాపాలలో సహకరించి పని చేశారు. రాజ్యసభలో సి.పి.ఐ విభాగానికి నాయకులుగా ఉన్నారు. ఆంధ్రా, కలకత్తా విశ్వ విద్యాలయాలలో ప్రొఫెసర్‌గా పనిచేసిన శ్రీ హిరేన్ ముఖర్జీగారు, రహస్య జీవితంలో తీవ్ర కష్టనష్టాలను ఎదుర్కోవడం ద్వారా నాయకులుగా ఎదిగిన శ్రీ ఎ.కె.గోపాలన్‌గారు, ఆపార్టీకి లోక్‌సభలో నాయకులు కాగలిగారు.

శ్రీ గోపాలన్, శ్రీ సుందరయ్య ఇద్దరూ కూడా పార్టీలో పూర్తి స్థాయి నాయకులేకాని వారిద్దరూ పార్లమెంటరీ వ్యవహారాలలో తగినంతగా అనుభవం ఉన్నవారు కాదు. ఆంగ్ల భాషలో ఇద్దరికీ సామర్థ్యం తక్కువే. అయితే సుందరయ్యగారికంటే గోపాలన్ గారు ఎక్కువ మాటకారిగా కనిపిస్తారు. ఆయన పార్లమెంటులో గడిపిన పది సంవత్సరాల కాలంలోను పార్లమెంటరీ సాంప్రదాయాలకు అనుగుణంగా నిపుణత్వం సంపాదించుకోడానికి ఆయన ప్రయత్నించలేదు. పార్టీలో సీనియారిటీ కారణంగా ఆయన యిప్పటికీ నాయకులుగానే కొనసాగ గలుగుతున్నారు.

సుందరయ్య గారు పార్లమెంటుకు కొత్త. ఆంగ్ల భాషలో చెప్పుకోదగినంత ప్రావీణ్యం లేదు. తెలంగాణా పోరాటంలో వీరోచితంగా పోరాడినట్లుగానే ఇక్కడ కూడా కృషి చేసేందుకు ఆయన ఎక్కువగా హైదరాబాద్‌కు చేసి శ్రద్ధ వహిస్తుంటారు. సి.పి.ఐ. పార్టీ కేంద్ర కార్యాలయంవారు

పార్టీ కార్యక్రమాలు, విధానాలపై అనేకమంది ప్రముఖ పార్టీ రాజకీయ పండితులు తయారుచేసిన పేపర్లను, ప్రసంగాలను ఆయన శ్రద్ధగా గమనంలోకి తీసుకొంటుంటారు. ఆయన కూడా చక్కటి విషయ పరిజ్ఞాన మున్నవారు. హిరేన్ ముఖర్జీ గారు ఎంత చక్కటి చిత్త శుద్ధితో, నిజాయితీతో కృషి చేస్తారో సుందరయ్యగారు కూడా అలాగే పనిచేస్తారు. ఆయన గాంధేయవాది కాదు గానీ కాంగ్రెసు వాది. ఆయన సాంఘిక అలవాట్లు కూడా హిరేన్ బాబుగారి లాగే గాంధేయవాదానికి దగ్గరగా ఉంటాయి. కమ్యూనిజంలో ప్రవేశించకముందు ఆయన అనుభవించిన జైలు జీవితం, ఆయనకున్న దేశభక్తి, సభను ఆయన పట్ల గౌరవంతో ఉండేలా చేశాయి. కమ్యూనిస్టు సిద్ధాంతం కారణంగా ప్రజాస్వామ్య సంస్థలకు సంభవించనున్న ప్రమాదాలను ఎక్కువగా ఎరిగిన నాకు అలాంటి సందర్భాలు చాలాసార్లు తటస్థపడ్డాయి. అయినప్పటికీ ఒకే ఒక్కసారి మాత్రమే మేమిద్దరం ముఖాముఖి చర్చలలో పాల్గొనటం జరిగింది. ఆయన పార్లమెంటును వదలివేసి ఆంధ్రాసన సభకు మారిన తరవాత తన తుపాకీ తూటాలంటి మాటలతో సభను విలవెట్టగలిగిన గట్టి నాయకుడు భూపేష్ గుప్తాగారు సుందరయ్య గారి స్థానంలో సి.పి.ఐ. పక్షనాయకులుగా వచ్చారు. ఆయనను రాధాకృష్ణ వంటి గొప్ప వ్యక్తులు కూడా నిలువరించలేకపోయారు. క్రమంగా సభ ఆయన మాటలు వినడానికి, అవగాహన చేసుకోడానికి ఆసక్తిని పెంచుకోసాగింది. కమ్యూనిస్టు విధానాల్లోమిళితమైనప్పటికీ గాంధేయ పద్ధతుల్లో కనిపించే సుందరయ్యగారు తిరిగి వస్తే బాగుండునని చాలా మంది అనుకొంటుండేవారు.

1957-62 సంవత్సరాల మధ్య సి.పి.ఐ. వ్యవస్థాపక అధ్యక్షుడు, దీర్ఘకాలంగా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ నాయకులుగా కొనసాగుతున్న డాంగేగారు లోక్‌సభలో కమ్యూనిస్టు పక్షనాయకుడుగా ఉన్నారు. ఆయన ఇంగ్లీషు మరాఠీ భాషలో మంచి ఉపన్యాసకులు. హిందీలో కూడా కార్మిక వేదికలమీద కొంతమేరకు బాగానే మాట్లాడగలరు. అయితే పార్లమెంటరీ విధానాలకు అనుగుణంగా బోధనా పూర్వకమైన ప్రసంగాలు, ప్రసంగరూపకమైన వాదనలు తన భావాలకు అనుగుణంగా ముగింపు మాటలు చెప్పగలిగే ఉపసంహారశైలిని ఆయన పూర్తిగా అనుసరించలేకపోయారు. అయినప్పటికీ కార్మిక వ్యవహారాల్లో ఆయనకున్న విశేషానుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయన మంచి అలవాట్లకు ముగ్ధుడనౌతూ ఆయన ప్రసంగాలను వినడానికి మేమంతా శ్రద్ధ వహిస్తూ ఉండేవారం. ఒకే ధోరణితో తప్ప రెండో వైపు ఆలోచనకు అవకాశం ఇవ్వకుండా చెప్పే ఆయన ముగింపు మాటలు మమ్ములను మా మార్గనుంచి తిరిగి చూడనివ్వేవికావు. సోషల్ డెమోక్రాట్ అయిన డాంగేగారు నియంతృత్వ లక్ష్యంగల కమ్యూనిస్టుగా మారడాన్ని నేను గ్రహించగలను. సిద్ధాంత పరంగా ఆయన వాదానికి ప్రతివాదాన్ని వినిపించడం ఆ సందర్భంలో నాకు అసహజమేమీ కాదు. ఆ సందర్భంలో గాంధేయ సోషలిజంలో నమ్మకం ఉన్న నేను ప్రజాస్వామ్యసోషలిజాన్ని గురించి వివరంగా మాట్లాడినందుకు సభలోని ఉభయపక్షాల సభ్యులలో చాలామంది అభినందిస్తుండేవారు. ఆ సందర్భంలో నేను వ్యాపారవేత్తల ఆర్థిక సిద్ధాంతానికి ఒక ఉపకరణం లాగా కాకుండా, నేను కోరుతూ ఉండే స్వయం వృత్తి దారుల ఆర్థిక తత్వానికి అనుగుణంగా మాత్రమే ఉంటాననేది వాస్తవం.

కమ్యూనిస్టులకు నిజమైన సమర్థవంతమైన పార్లమెంటరీ నాయకులు హిరేన్ ముఖర్జీయే. 1952 సంవత్సరం వరకు ఆయన పార్లమెంటులో ఉండి ఇటు సభ్యులను, అటు పత్రికలవారిని అందరినీ కూడ ఆకర్షించగలిగేటంత గొప్పగా వ్యవహరించారు. అనుకోకుండా మాకు సంభవించిన అదృష్టం ఏమిటంటే మేమిద్దరం కూడా ఆక్స్‌ఫర్డ్‌లోని సెయింట్ కేథరిన్స్ ఎకాడమీలో విద్యాభ్యాసం కావించి పరిశోధనలలో ఉత్తమ ఫలితాను సాధించిన వారమే. టక్కరి తనంతో ఫోజులు వేసే అధికారపక్షంలోని మంత్రులను ఆయన సహించేవారుకాదు. అయితే అందుకాయన చెప్పే ఆక్షేపణలు చాలా సున్నితంగా ఉండేవి. ఆంగ్లంలోను, సంస్కృతంలోను ఆయన చెప్పే సూక్తులు సభను ఆకట్టుకునేలా ఉండేవి. తన ప్రత్యర్థులను కూడా లొంగ తీసుకునే విధంగా ఆయన ఆంగ్ల, సంస్కృత భాషలలో కూడ తనకున్న ప్రావీణ్యాన్ని చూపిస్తుండేవారు. ఆయన మాట్లాడేటప్పుడు వింటుంటే ఎంతో ఆనందంగా ఉండేది. ఒక్కోమారు ఆయన వ్యతిరేక పక్షంలో ఉన్నవారు కూడా ఆయన మాట్లాడిన తరవాత ఆ ప్రభావానికిలోనై ఆరోజంతా ఆయనకు వ్యతిరేకంగా నోరు మెదపలేకుండా కూర్చుండిపోతుండేవారు. హిరేన్ బాబు తమవాదానికి అనుకూలంగా ఇతరులను అంగీకరింపజేసే ప్రజాస్వామ్య పద్ధతిలో నమ్మకం లేని మిగతా కమ్యూనిస్టుల వలే కాక, ఒకరిని మరొకరు తమ వాదనా బలంతో బోధనల ద్వారా తమ వైపు రాబట్టుకోవాలనే ధోరణితోనే ప్రయత్నిస్తుంటారు. ఆయన పూర్తి స్థాయి పార్లమెంటేరియన్, గొప్ప వక్త. ఒక సందర్భంలో పార్లమెంటులో కమ్యూనిస్టు విధానానికి వ్యతిరేకంగా నేను చేసిన విమర్శను, ఆయన సభలోను, వెలుపల నన్ను కలిసినప్పుడు నా విమర్శలను గురించి ఆదర పూర్వకంగా చర్చిస్తూ, పరస్పరం అభినందించుకుంటూ విడిపోయాం. ఇటీవల సంవత్సరాలలో ఉభయ పక్షాలలో పెరుగుతున్న అరాచక వాతావరణానికి మార్క్సిట్ పద్ధతి ప్రదర్శనలకు, పార్లమెంటరీ విధానంలో పనికిరాని ప్రసంగాలకు ఆయన ఆశ్చర్యపోయేవారు.

అప్పుడప్పుడు కొంత మంది నా అనుచర సభ్యులు కఠినంగా మాట్లాడుతున్న మాటలను మీరెలా అంగీకరిస్తారని ఆయన నన్ను అడుగుతూ ఉండేవారు. ఆ సందర్భాల్లో కమ్యూనిస్టులు కాని సభ్యులపై వారి పార్టీవారు ఎలా విరుచుకు పడుతున్నారో ఆయనకు నేను విప్పి చెప్పేవాడిని. సోలోకోవ్ వంటి ప్రముఖ సోవియట్ రచయితల సాహిత్యాన్ని ప్రేమతో చదివేమీరు, ఈ స్వేచ్ఛా వాణిజ్య మిత్రులతో ఎలా కలిసి ఉండగలుగుతున్నారని ఆయన నన్ను అడిగేవారు. పార్లమెంటులో ఓటు తీసుకునే కొన్ని సందర్భాల్లో ఆయన తన పార్టీకి విశ్వాస పాత్రుడిగానే ఉంటూ నవ్వు ముఖంతో నన్ను, మీరు ప్రజల రంగంగానే ఓటు వేస్తారని అంటుండేవారు. మేమిద్దరం అలా హాస్యోక్తులతో సరసమాడుకుంటూనే వాదనలతో యదార్థాన్ని బయటకు లాగడానికి జగడమాడుకుంటుండేవారం. నా సహచరుని మార్క్సిట్ ఎకానమీ వాదాన్ని ఆయన అంగీకరించలేకపోయినప్పటికీ రైతులు, స్వయంవృత్తుల వారు వేదప్రజల అవసరాల కోసం చేసే నా వాదనలను నవ్వు ముఖంతో స్వీకరిస్తుండేవారు. ఆయన అవిశ్వాస తీర్మానాల విషయంలోను వాయిదా తీర్మానాల విషయంలోను చేసే ప్రసంగాలను నేను ఆసక్తితో గమనిస్తుండేవాడిని. ప్రభుత్వం కొనసాగించిన అక్రమ విధానాలను సమర్థిస్తూ మాట్లాడిన మంత్రిని విజయవంతంగా ఆయన ఎదుర్కొని తలవంచుకునేలా చేయగలిగిన సందర్భాలు

కూడా చాలా సున్నితంగా ఉంటాయి. లోక్‌సభలో ఆయన సభ్యుడుగా కొనసాగడం ద్వారా, ఆయన మాటలద్వారా, ఆయన వాదనా విధాన చాతుర్యం ద్వారా సామ్యవాదంలో ఆయనకున్న నమ్మకమైన విశ్వాసం ద్వారా చాలామంది గొప్ప వారైన మంత్రులకంటె ఎక్కువ స్థాయిని గౌరవాన్ని పొందగలిగారు.

1976వ సంవత్సరంలో పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా ఉండి, పరిపాలనా వ్యవస్థ మీద పార్లమెంటు ఎలా అదుపు చేయవచ్చో ఒక ప్రతిపక్ష నాయకునిగా ఆయన చేసి చూపించారు.

శ్రీ శ్యాం ప్రసాద్ ముఖర్జీ

డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ కలకత్తాలో జన్మించారు. కలకత్తా విశ్వ విద్యాలయపు ప్రముఖ ఉపాధ్యక్షులైన అశుతోష్ ముఖర్జీగారి పుత్రులు. తనకు తానై దానికి ఉపాధ్యక్షులైనారు. 1943లో బెంగాల్ రాష్ట్రంలో మంత్రిగాను, 1947-50 సంవత్సరాల మధ్య కేంద్రమంత్రి వర్గ సభ్యులుగానూ పని చేశారు. యజమానులను పనివారలను పారిశ్రామికాభివృద్ధి కోసం 2-3 సంవత్సరాల కాలం కలసి పనిచేసేలా చేయగలిగారు. కొంతకాలం హిందూమహాసభకు అధ్యక్షులుగా ఉండి, ఆ తరవాత జనసంఘాన్ని స్థాపించారు. కాశ్మీరులో షేక్ అబ్దుల్లా ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యాగ్రహం నిర్వహించి, అక్కడ నిర్బంధంలో ఉండగా మరణించారు - (ఎడిటర్)

మన జాతీయ స్వాతంత్ర్యోద్యమానికి చెప్పుకోదగినంత సేవ జేసిన ప్రముఖులలో శ్యాంప్రసాద్ ముఖర్జీగారొకరు. మత సయోధ్య కోసం ఆయన చేసిన కృషి చెప్పుకోదగినట్టిది. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత వచ్చిన మంత్రులందరిలోను ఆయన ప్రత్యేకంగా తనకు తానై అఖిలభారత పారిశ్రామిక మహాసభను భారత ప్రభుత్వం చేత నిర్వహింపజేసి, అందులో పారిశ్రామికవేత్తలను పాల్గొనేలాచేసి, వారందరిచేతా ఏకగ్రీవంగా రెండు సంవత్సరాల పాటు పారిశ్రామిక శాంతిని పాటించేందుకు అంగీకరింపజేసి, దాని ద్వారా యజమానులు కార్మికులు గూడా పారిశ్రామిక సత్సంబంధాలను కలిగి ఉండేలా చేయగలిగి అందరిలో విశేషగౌరవాన్ని సంపాదించుకోగలిగారు. ఆ విధంగా భారతదేశం పారిశ్రామిక రంగంలో ముందడుగు వేయటానికి ఆయన గట్టి పునాదులను ఏర్పరచగలిగారు. మన ప్రభుత్వ తొలి పారిశ్రామిక విధానం అభ్యుదయమార్గంలోను, యదార్థరీతిలోను ఉండేందుకు జరిగిన ఆ కృషి ఆయన సమర్థతకు ఒక మచ్చు తునక.

మంత్రి పదవికున్న విలువేమిటో ఆయనకు బాగా తెలుసు. 1962వ సంవత్సరం నుంచి కాంగ్రెస్ పక్షపు, ఇతర పార్టీల మంత్రుల లాగా ఆయన అమర్యాద పూర్వకమైన రీతుల్లోను, నీతి బాహ్యమైన పద్ధతుల్లోను దానిని పట్టుక వేళ్ళాడేటందుకుగాని, దాని కోసం పరుగెత్తేందుకు గాని ప్రయత్నించలేదు. మనకు స్వాతంత్ర్యం సిద్ధించక పూర్వం గూడా ఆయన రాజకీయ దూరదృష్టితో బెంగాల్ రాష్ట్రంలో మత ప్రాతిపదికపై ఏర్పడ్డ మంత్రివర్గం నుంచి బైటకు వచ్చారు. ఆ మంత్రి వర్గం జాతీయ ప్రయోజనాలను మరిచిపోయి నడుస్తున్నప్పుడు ఆయన ధైర్యంతో దాని నుంచి రాజీనామా చేసి జాతీయ ప్రయోజనాలను పరిరక్షించే ప్రయత్నంలో జైలుపాలు గూడా అయ్యాడు.

భారత పారిశ్రామికీకరణలో ఆయన పాత్ర

శ్యాం ప్రసాద్ ముఖర్జీగారు ఆ విధంగా సర్దార్ పటేల్ గారి అభిమానాన్ని

సంపాదించుకోవటం సహజంగానే జరిగింది. అందువల్ల ఆయన కాంగ్రెస్ పార్టీకి చెందినవారు కాకపోయినప్పటికీ, జాతీయ ప్రభుత్వంలో చేరేందుకు ఆహ్వానించబడి, ముఖ్యమైన పారిశ్రామిక శాఖ బాధ్యతలను చేపట్టారు. మంత్రివర్గానికి సమర్పించేందుకుగాను పరిశ్రమలకు సంబంధించిన చిత్తుముసాయిదా ప్రణాళికల రూపకల్పనలో సన్నిహితంగా ఉండి సలహాలిచ్చేందుకు తనకు దగ్గర మనిషిగా ఆయన నన్ను ఆహ్వానించారు. పరిశ్రమలు, కుటీరపరిశ్రమలు, బట్టల పరిశ్రమ, చేనేత పరిశ్రమలకు సంబంధించిన కమిటీలలో చేరవలసిందిగా ఆయన నన్ను ఆహ్వానించారు. ఆయన సహచరులందరిలోకన్నాఆయన కోరుకొన్న విధంగా ఎక్కువ సామర్థ్యాన్ని చూపెట్టి నేను ఆయన ఆకాంక్షల కనుగుణంగా నిలవగలిగాను. శాంతికాముకులైన తూర్పుబెంగాల్ హిందువులపై పాకిస్తానీయులు జరుపుతున్న మానవ మారణహోమాన్ని చూసి, ఆ కాంతిశీకుల కోసం ఆయన హృదయం రక్తాన్ని కార్చి ఆ సమయంలో బాగా బలహీన పడిపోయింది. బాగా సహిల్యానులాగా ఉండే శ్యామ్‌బాబు ఆ సమయంలో అతి దుర్బలుడైపోయి పీలబారిపోయిన చేతులతో ఓపిక చచ్చినట్లు వచ్చి కూర్చోసాగారు. పాకిస్తాన్ నుంచి బలవంతంగా వెడల గొట్టబడిన హిందువులకు, వారు పోగొట్టుకొన్న భూములకు సమానమైన భూములను తూర్పు పాకిస్తాన్ భూభాగం నుంచి భారత దేశానికి బదలాయించవలసిందిగాను, దురదృష్టవంతులైన ఆ నిర్వాసితులకు తగు విధంగా పునరావాస సౌకర్యాలు కల్పించవలసిందిగాను, పాకిస్తాన్‌లో వారు కోల్పోయిన ఆస్తులకు తగు పరిహారం చెల్లించవలసిందిగాను, సర్దార్ పటేల్ పాకిస్తాన్‌ను కోరి, కోర్కెల కోసం పోరాడేందుకు నెహ్రూగారు సుముఖంగా లేనప్పుడు, నెహ్రూ విధానాలపై ఆయనకు అసహనం పెరగసాగింది. నెహ్రూతో తనకున్న విభేదాలను బాగా వివాదం రేకెత్తించేందుకు వీలుగా ఆయన వత్తిడి తీసుకరాలేదు. అయితే అక్కడే ఆగిపోలేదు. జవహర్లాల్-లియాకత్ ఆలీ ఒడంబడిక ద్వారా బహిరంగంగా ఆయన మంత్రివర్గం నుంచి రాజీనామా చేశారు. ఆ పరిణామాలకు సర్దార్ పటేల్‌గారు బాగా బాధపడి లక్షలాది మంది శరణార్థులకు తిరుగులేని రక్షకులుగా ఉన్న అటువంటి సమర్థులైన మంత్రి పోవటం, నిజంగా మంత్రివర్గం తన శక్తిని పోగొట్టుకొన్నట్లయిందని ఆయన భావించారు. డా॥ ముఖర్జీ చూపిన ఆ బాటలో ఆ తరవాత డా॥ మత్తయ్, డా॥ అంబేద్కర్‌గారలు కూడా నెహ్రూ మంత్రివర్గంనుంచి రాజీనామాచేసి బైటకు రాగలిగారు. జాతీయ మంత్రివర్గంగా ఏర్పడిన ఆ మంత్రివర్గం ఇప్పుడు నట్టి పార్టీ మంత్రివర్గ స్థాయికి దిగజారిపోయింది.

రాజీనామా ఎప్పుడు చేయాలో ఆయనకు తెలుసు

1951వ సంవత్సరం మధ్యలో నేను కూడా కాంగ్రెస్‌ను వదలివేస్తూ శ్రీ కృపలానీ, శ్రీ పి.సి.ఘోష్ మరి కొంతమంది ఇతరులతో పాటు మాతో కలసి మేము ఏర్పాటు చేయతలపెట్టిన శక్తిమంతమైన ప్రతిపక్ష పార్టీ నిర్మాణంలో మాతో కలసి పని చేయవలసిందిగా శ్రీ శ్యాంబాబును ఆహ్వానించాను. ఏదివిమైనప్పటికి శరణార్థుల సమస్య కోసం కాశ్మీరువంటి ఇతర సమస్యలకోసం పూర్తిగా కృషి చేయాలనే అభిప్రాయంలో ఉన్నందువల్ల 1908నాటి ఆ బెంగాలీ స్వాతంత్ర్య సమరయోధుల రక్త బంధువు శ్రీ శ్యాంబాబు మాతో కలసేందుకు

ముందుకు రాలేదు. అంతేకాక మాకు లౌకిక తత్వంమీద ఉన్నట్లే ఆయనకు హిందూ రాజకీయాలమీద పూర్తి విశ్వాసముంది. అయినప్పటికీ మేము పార్లమెంటులో గాంధేయ విధానాన్ని తప్పి చరిస్తున్న నెహ్రూను ఎదుర్కొంటూ, మన పార్లమెంటులో ఒక ప్రజాస్వామ్య ప్రతిపక్షాన్ని అభివృద్ధి పరిచే కృషిలో ఒకరితో ఒకరం పరస్పరం సహకరించుకొంటూ పనిచేయగలిగాము.

మంత్రివర్గంలోని మొదటి తిరుగుబాటు

శ్యాంబాబు ఎంతగట్టి ఉపన్యాసకుడంటే ఆయన వాదనలు అందరకూ పూర్తిగా అంగీకారం కాకపోయినప్పటికి ఆయన చెప్పే విధానం తమాషా అయిన వాక్చాతుర్యం, ఆయన చెప్పదలచుకొన్నదానికి పూర్తి సమర్థన నందిస్తూ ఉండేది. మేధావిగాను, రాజకీయ నాయకునిగాను శ్యాంబాబు స్థాయి గొప్పది. మంత్రివర్గంలో జవహర్లాల్ నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన మొదటివ్యక్తిగా ఆయన పట్ల వీర్యడిన అదనపు ఆకర్షణ ఆయన పార్లమెంటరీ పరిజ్ఞానానికి, చర్చా సామర్థ్యానికి తోడై ప్రత్యేక స్థాయిని కల్పించింది. జవహర్లాల్‌ను కాంగ్రెస్ మంత్రి వర్గాన్ని ఏకపక్షంగా చేస్తున్నమాలాంటి వారమనేకమందిమి ఆయన మా పక్కనున్నందుకు గర్వపడుతుండేవారం. మన పార్లమెంటరీ పద్ధతిని చర్చలను ధర్మబద్ధమైన విషయాల కోసం పోరాటం ద్వారా శ్యాంప్రసాద్ ముఖర్జీ ఉన్నత స్థాయికి తీసుకెళ్లారని చెప్పటం అతిశయోక్తికాదు.

ప్రతిపక్ష స్థానంలో నూతన జాతీయ నాయకత్వాన్ని తీసుకొచ్చేందుకు మాలాంటి వారందరితో చేతులు కలపటానికి, కాందిశీకులమీద, పాకిస్తాన్‌లో ఉన్న అల్ప సంఖ్యాక వర్గాలమీద ఆయనకున్న సానుభూతి కారణంగాను, స్వాతంత్ర్యం రాకపూర్వమే బెంగాలీ ప్రజానాయకునిగా ఆయన స్థాపించిన విధానం (బెంగాల్లో ముస్లింలీగు మంత్రివర్గం ఏకపక్ష మత రాజకీయాలను వ్యతిరేకిస్తూ) కారణంగాను, మాలాంటి వారందరితో చేతులు కలిపి ఆయనముందుకు రాదలచుకోలేదు. అందువల్ల ఆయన జన సంఘాన్ని స్థాపించి దానికి మొదటి అధ్యక్షులైనారు. పార్టీని అభివృద్ధి పరిచేందుకు శ్రీ దీన్ దయాళ్ ఉపాధ్యాయ, ప్రొఫెసర్ బలరాజ్ మధోక్, అటల్ బిహారీ వాజ్‌పేయి వంటి శక్తిమంతులైన యువ అనుచరులను సంపాదించుకోగలిగే అదృష్టం ఆనాడు ఆయనకు కలిగింది.

జవహర్లాల్‌గారి లాగానే శ్యాంబాబుగారు కూడా తమ కుటుంబాల విషయంలో అదృష్టవంతులు. వారిద్దరి తల్లిదండ్రులు కూడా సమర్థులూ శక్తిమంతులైన దేశభక్తులు. జవహర్లాల్ నెహ్రూ గారి లాగానే ఆయనకూడా మంచి అనుకూలమైన పరిస్థితుల్లో ప్రజా జీవితంలోకి అడుగువేశారు. కలకత్తా హైకోర్టులో ప్రముఖన్యాయాధీశుడైన ఆయన తండ్రి అశుతోష్ ముఖర్జీగారు ప్రభుత్వ సాహాయ్యం లేకుండావిశ్వవిద్యాలయాలు స్వతంత్రంగా ఉండాలని గట్టిగా పోరాడి సమర్థులైన వ్యక్తిగాపేరు తెచ్చుకొన్నారు. జవహర్లాల్ గారు కాంగ్రెస్ అధ్యక్షులైనట్లే చిన్నవయసులోనే తనతండ్రి కున్న ప్రఖ్యాతి కారణంగా ఆయన విశ్వవిద్యాలయంలో సిండికేట్ సభ్యులు కాగలిగారు. తన తండ్రి పట్ల ఉన్న ఆకర్షణ కారణంగా, శ్యాంబాబు తనకెదురైన ప్రతి

అవకాశాన్ని సమర్థవంతంగా వినియోగించుకొని కలకత్తా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షస్థానాన్ని, బెంగాల్ రాష్ట్ర మంత్రివర్గ ఆర్థిక మంత్రి పదవిని, కేంద్ర ప్రభుత్వంలో పరిశ్రమల మంత్రి పదవిని సునాయాసంగా పొందగలిగి తాను చేపట్టిన ప్రతి బాధ్యతను సమర్థతతో నిర్వహించారు. చైనా దురాక్రమణ కారణంగా మనజాతి విపత్తు పాలైనప్పుడు మేమందరము కోరినప్పటికి నెహ్రూ రాజీనామా చేయలేకపోతే, జాతీయ ప్రయోజనాలకు అవసరమనుకొన్నప్పుడు బెంగాల్ రాష్ట్రమంత్రి పదవినుంచిగాని, కేంద్రమంత్రి పదవినుంచి గాని వైదొలగేందుకు శ్యాంబాబు ఏ మాత్రం సందేహించలేదు.

అలాంటి ఉన్నతులు మన శ్యాంబాబు. తన కాలంనాటి గొప్ప కాంగ్రెస్ వారిలాగా శ్యాం ప్రసాద్ ముఖర్జీ విశాల ధృక్పథం కలిగిన వారని రాజాజీగారు అన్నారు.

ఆగ్నేయాసియాలో ఎక్కడో అనుమానాస్పద పరిస్థితులలో నేతాజీమరణం సంభవించినట్లుగానే, కాశ్మీరులో సంభవించిన శ్యాంప్రసాద్ ముఖర్జీగారి మరణం గూడా అనేక అనుమానాలను రేకెత్తించింది. భారతీయ పౌరసత్వం విషయంలో స్థానిక ముస్లిములు అంత సుముఖంగాలేని సమయంలో శ్యాంబాబును కాశ్మీరు వెళ్లవద్దని నాలాంటి వారమనేక మందిమి సలహాయిచ్చాం. ఆ సందర్భంలో ఆయన ఆరోగ్యం కూడా సరిగా లేదనే మాట యదార్థం. అయినప్పటికీ హిందువుల మీద ఆయనకున్న ప్రేమ గొప్పది. అవకాశముంటే మొత్తం కాశ్మీరును గాని కాకపోతే ఏటువంటి పరిస్థితులలోనైనా జమ్ము ప్రాంతాన్ని గాని భారతదేశంలోనే అట్టిపెట్టాలనే ఆయన గట్టి తలంపు కారణంగా ఆ విపత్కర పరిస్థితులోకి ఆయన అడుగు పెట్టారు. జైలులో ఉండగా ఆయన క్రూరమైన చిత్రహింసల పాలైయబడ్డారు. రాజకీయ ఖైదీలకిచ్చే కనీస ప్రాథమిక సౌకర్యాలను కూడా ఆ సందర్భంలో ఆయనకు సమకూర్చలేదు. తీవ్రమైన అనారోగ్యానికి గురైనప్పుడు అప్పటి కాశ్మీరు ప్రధాని శ్రీ షేక్ అబ్దుల్లా ఆయనకు కావలసిన వైద్య సౌకర్యాలను కల్పించేందుకుగాని ఆయనకు ఇష్టమైన డాక్టర్లచేత వైద్యం చేయించుకొనేందుకుగాని అవకాశం కల్పించలేదు. తనకు తాను రాజకీయ ఖైదీగా కొంత జీవితం అనుభవించి ఉన్నప్పటికీ, అంత ప్రముఖ నాయకునికి ఆయన కోరినప్పటికీ తగిన వైద్య సలహాలను, సహాయాన్ని అందించనందువల్ల, కాశ్మీరు ప్రభుత్వ దురంతం కారణంగా శ్యాంబాబు మరణం సంభవించిందనే జన సంఘం వారి ఆరోపణకు బలం చేకూరింది.

భారతదేశ సమగ్రత కోసం ఆయన ఒక యోధునిగా తనువు చాలించారు.

కులపతి శ్రీ కె.యం.మున్షీ

శ్రీ కె.ఎం.మున్షీ 30-12-1887న జన్మించారు. వారు బొంబాయిలో బాగా పేరుపొందిన న్యాయవాది. ఆ తరవాత సుప్రీంకోర్టులో కూడా పని చేశారు. దేశంలో ఉన్న పదిమంది ప్రముఖ న్యాయ శాస్త్రజ్ఞులలో మద్రాసుకు చెందిన అల్లాడి, సేత్నగార్లు, బొంబాయికి చెందిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ గార్లతో పాటు మున్షీ గారొకరు. భారతీయ విద్యాభవన్‌ను ఏర్పరచి దాని శాఖలను దేశమంతటా వ్యాపింపజేశారు. "భవన్స్ జర్నల్" ప్రచురణను ప్రారంభించారు. గుజరాతీ, ఆంగ్ల భాషలలో ప్రామాణికమైన అనేక గ్రంథాలను రచించారు. అందులో వారు వ్రాసిన "కృష్ణావతారం" ప్రముఖమైంది. 1936-39 సంవత్సరాల మధ్య బొంబాయి రాష్ట్రంలో కాంగ్రెస్ మంత్రివర్గంలో సభ్యులుగాను కేంద్రంలో 1948-51 సంవత్సరాలలో మంత్రివర్గ సభ్యులుగాను, 1951-57 సంవత్సరాల కాలంలో ఉత్తరప్రదేశ గవర్నర్‌గాను పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన నిర్బంధ సహకార వ్యవసాయ కార్యక్రమానికి వ్యతిరేకంగా రంగాగారితో కలిశారు. స్వతంత్రపార్టీ ఉపాధ్యక్షులుగా ఎన్నిక అయి రంగాగారు అధ్యక్షులుగా ఉన్నంతవరకు అందులో కొనసాగారు. సంస్కృత పండితులుగా, చరిత్రకారులుగా భారతదేశానికి ప్రామాణికమైన చరిత్రను తయారు చేయడానికి నియమింపబడ్డ సంపాదకవర్గ ముఖ్యులుగా వారు మంచిపేరు సంపాదించుకొన్నారు. 1971వ సంవత్సరంలో మరణించారు. శ్రీమతి లీలావతి మున్షీ కూడా పేరొందిన రచనా వ్యాసంగపరులు. గుజరాత భాషలో కవయిత్రి, పార్లమెంటు సభ్యురాలు, శాసన మండలి సభ్యురాలు. సకలార్థసాధకమైన విద్యాభవన్ నిర్మాణంలోను, జర్నల్ ఏర్పాటులోను ఆయనతో కలసి కృషిచేసిన సహకార్యకర్త

- (ఎడిటర్)

శ్రీ కె.ఎం.మున్షీగారు మనకున్న ప్రముఖ పండితులలో ఒకరు. ఆయన పండితునిగా ఉన్నత శిఖరాల నధిరోహించారు. రాజకీయ నాయకునిగా శ్లాఘనీయమైన కృషి చేశారు. ఆయన బొంబాయి రాష్ట్రంలో హోంశాఖామంత్రిగాను, కేంద్రంలో ఆహార శాఖామంత్రిగాను, ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గాను, ఒక విశ్వ విద్యాలయానికి వైస్ ఛాన్సలర్‌గాను, ప్రో ఛాన్సలర్‌గాను అనేక పదవులు నిర్వహించి తాను పనిచేసిన స్థానాలకు గౌరవం తీసుకొచ్చారు. ఆయన స్త్రీ జనవిముక్తిని దృష్టిలో పెట్టుకొని అనేక మైన నవలలు రాశారు. సర్ వాల్టర్ స్కాట్‌కు సమానంగా చారిత్రాత్మక ప్రణయకథా నవలా సాహిత్యాన్ని తయారుచేశారు.

మహా గుజరాత్‌కు గూర్జర జాతివారు సిద్ధింపజేసిన ఔన్నత్యాన్ని బయటికి తీసుకొచ్చిన గొప్ప చరిత్రకారులాయన. శిథిలమై జ్ఞాపకాలలో నుంచి మరుగున పడిపోతున్న పఠాన్‌కోటలోని రాళ్లకు ఊపిరిపోసి ప్రాణప్రతిష్ఠ చేసిన మహోన్నతులు వారు.

డాక్టర్ కట్జూ గారి లాగానే మున్షీగారికి కూడా సంస్కృత భాష పట్ల అభిమానం

ఎక్కువ. సంస్కృత భాషను అధ్యయనం చేయడంలో జాతీయ స్థాయిలో ఆసక్తిని పెంపొందించడేసేందుకు కృషి చేయాలని విశ్వవిద్యాలయాల్లో దానిని బోధనా భాషగా ప్రవేశ పెట్టేందుకు తగిన సహాయం చేయాలని జాతీయ భాషా స్థాయికి దానిని అభివృద్ధి పరిచి దేశ భాషల మధ్య తగాదాలు లేకుండా చేయాలని ఆయన అభిప్రాయ పడ్డారు. అందుకుగాను ఆయన భారతదేశ చరిత్రలోని వేర్వేరు కాలాలను ప్రత్యేకంగా చారిత్రక దృష్టిలో అనేకమంది పండితులచే పరిశోధింపజేసి ఆ మేరకు ఎన్నో సంపుటాల గ్రంధాలను వెలువరింపజేయగలిగారు. ఆయన భారత దేశంలోని అనేక ప్రాంతాల ప్రజలను గురించి వేర్వేరుగా వారి అభివృద్ధిని గురించి, విజయాల గురించి, ధైర్య సాహసాల గురించిప్రేరేపణతో గూడిన గ్రంధ రచనకు ఆయన మార్గం చూపెట్టారు. గూర్జరల చరిత్రను గురించి ఆయన వ్రాసిన ప్రామాణికమైన గ్రంధం ఆ మార్గంలో "కాకతీయ నాయకుల" గురించి నేను రాయడానికి ప్రోత్సాహకమైంది.

మున్షీగారికి అడవులన్నా, పచ్చిక బయళ్లన్నా ఎక్కువ ఇష్టం. కణ్వ, వశిష్ట, విశ్వామిత్ర మహర్షుల వలె ప్రకృతి పరిసరాలను ప్రేమిస్తూ అభిజ్ఞాన శాకుంతలంలో కాళిదాసు వర్ణనల వంటి ప్రకృతి దృశ్యాలను చూస్తూ ఆయన ఆనందిస్తూ ఉండేవారు. గుడ్డిగా అడవులను నరికి వేయడాన్ని ఆయన ఖండించారు. గంగామైదానంలో తరచు సంభవిస్తున్న వరదలు భరత్‌పూర్, భోపాల్, ఉదయపూర్, జయపూర్‌లలో ఇంకిపోతున్న సరోవరాలు, విచ్చలవిడిగా అడవులు నరికి వేయడం వల్లనే ఏర్పడుతున్నాయని ఆయన దేశాన్ని హెచ్చరించారు. అందుకు గాను ఆయన దేశ వ్యాప్తంగా చెట్లు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి భారతీయ సాంస్కృతిక కైలిలో దానికి వన మహోత్సవమని పేరు పెట్టారు.ఇప్పటికీ అలా నాటిన చెట్లు కోటికి పైగా దేశంలో పెరుగుతూ భారతదేశ వ్యవసాయానికి, సహజసౌందర్యానికి అవి ఆలంకారంగా తయారవుతున్నాయి. మనం సాంస్కృతిక సంప్రదాయానికి పశుపోషణకు సమ్మిళితమైన కార్యక్రమానికి ఆయన అంకితమై "కీవిలేజి" పథకాలను ప్రారంభించి వాటిద్వారా బలిష్టమైన ఆబోతులను ఎంపికచేసి గ్రామాల్లో పెంచి పోషించేందుకు కృత్రిమ గర్భోత్పత్తి సాధన ద్వారా పశుసంపదను నాణ్యమైన విధంగా రూపొందించేందుకు పథకాలను తయారు చేశారు. ఆ పథకాన్ని తరవాత శాశ్వతం చేసినందువల్ల దాన్ని దేశవ్యాప్తం చేయడంవల్ల మన పశు సంపద బాగా పెరిగేందుకు ఉపయోగపడింది. ఆయన వ్యవసాయ మంత్రిగా చేసిన సమయం ఈ రకంగా శాశ్వతంగా గుర్తుంచుకొనేలా నిలిచింది.

సాడ్లర్ కమిషన్ కాలంనాటి నుంచి మన జాతీయ నాయకులు విద్యావేత్తలు మన విద్యా విధానంలో భారతీయత లోపించిందని ఆరోపణలు చేయసాగారు. ఆ తరవాత మన విద్యామంత్రి జస్టిస్ ఛాగ్లాగారు ఏర్పాటు చేసిన కమిషన్ కూడా మన విద్యా సంస్థలను భారతీయ సంస్కృతికి అనుగుణంగా రూపొందించేందుకు తగు సూచనలు చేయలేక పోయారు. 1920 సంవత్సరంలో విద్యాసంస్థలను బహిష్కరించిన తరవాత మన దేశంలో చాలామంది గాంధేయవాదులు ముఖ్యంగా సాధువాస్వాని, కృపలానీ, జి.రామచంద్రన్ గార్లవంటి వారు 1920 నుంచి 1960 సంవత్సరం వరకు వారు స్థాపించిన అనేక జాతీయ విద్యాపీఠాల ద్వారా ఇందుకు గాను కృషి చేశారు. అఖిల భారత స్థాయిలో భవన్స్ ఆధ్వర్యంలో ప్రారంభమైన విద్యా సంస్థలు

అనేక పట్టణాలలో భారతీయ సాంస్కృతిక పురోభివృద్ధి లక్ష్యంగా సామాజిక శాస్త్రీయ విద్యలతో కలుపుకొని పడుగు పేకలాగా కలసి నూతన విశ్వ విద్యాలయ విద్యలలో భాగంగా ఈనాడు అభివృద్ధి చెందుతున్నాయి. బ్రిటిష్ హోం యూనివర్సిటీ లైబ్రరీ మార్గంలో అమెరికా మెంటెల్ పబ్లికేషన్స్ లాగా మున్షీగారికి పూర్తిగా విశ్వాసపాత్రులైన రామకృష్ణగారి సంపాదకత్వంలో భవన్స్ జర్నల్ ప్రారంభించడం ద్వారా భవన్ ప్రచురణలకు మున్షీగారు ఒకగట్టి శక్తి నిచ్చారు. అనుభవ నీయురాలు, సమర్థులు అయిన శ్రీమతి లీలావతి మున్షీగారు, రామకృష్ణగారు వీటిని తమ చక్కని కృషితో భారతీయ విద్యాభవన్‌కు చక్కని ఉపాంగాలుగా రూపొందించారు. రామకృష్ణ మిషన్ శివానంద, సత్యాశాయిబాబాగార్లవంటి వారు, మత దృష్టి కలిగిన పండితులు ఏమి చేయాలనుకున్నారో విశ్వదృష్టి కలిగిన భారతీయ యువతరానికి దానిని అందించాలని భారతీయ విద్యా భవనాలు కృషి చేస్తున్నాయి.

మున్షీగారు మరణించిన తరవాత కూడా విద్యా విషయకంగా వీటి అభివృద్ధి కొన సాగుతూనే ఉంది. భవన్ అభివృద్ధి కృషిలో మొదటి నుంచీ ఉన్న శ్రీ జై శుక్లాల్ హతి, వారి నిర్మాణ నిర్వహణా ప్రముఖులు శ్రీ రామకృష్ణ వంటి వారి తోడ్పాటుతో గుంటూరులాంటి చిన్న కేంద్రంలోనుండి లండన్ వంటి ప్రముఖ పట్టణం వరకు ఈనాడు ఈ సంస్థ శ్రీమతి లీలావతి మున్షీగారి పర్యవేక్షణలో చక్కని అభివృద్ధి సాధిస్తున్నది. ఇందుకు శ్రీ మున్షీగారిని మనం ఒకటికి రెండుమార్లు అభినందించవలసిందే.

ఆయన జీవితం పూర్తిగా స్వాతంత్ర్య దృష్టి కలిగి దేశ భక్తితో నిండి ఉంది. బలమైన కాంగ్రెస్ సంస్థలో ఉండి కూడా ఆయన ప్రజల హక్కులకు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, దేశ సమగ్రతకు భంగం కలిగిందని భావించినప్పుడు ఎప్పుడైనా దానితో విభేదించడానికి వెనకాడలేదు. గాంధీగారు మహమ్మదాలీ జిన్నాగారిని వారి ముస్లింలీగును శాంతింపజేసేందుకు వారి కోర్కెలకు పూర్తి అంగీకారం తెలిపినప్పుడు ఈ అదనపు రాయితీలు చివరకు దేశవిభజనకు దారితీయగలవని భయపడి గాంధీగారి వద్దకు వెళ్ళి అందుకు నిరసనగా కాంగ్రెస్‌ను వదలి వెళ్లేందుకు తనకు అనుమతి నివ్వవలసిందని కోరారు. అఖండ హిందూస్తాన్ ఆర్గనైజేషన్‌ను ఏర్పాటుచేసి ఆయన తన రాజకీయ భవిష్యత్తును ఇబ్బందులలో పడవేసుకొన్నారు. ఒక ప్రత్యేక రాజకీయ పార్టీని ఏర్పాటు చేసి తాను ఎక్కువ తలనొప్పిని కలగజేయడం మంచిది కాదని వారు తరవాత గ్రహించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్ దేశ విభజన కోర్కెకు అంగీకరించే విషయంలో ఆయన అతి సాహసంతో చివరివరకు తన నిరసనను తెలియజేస్తూనే ఉన్నారు. భారతదేశ అదృష్ట దురదృష్టాలకు తలవంచి కాంగ్రెస్ కార్యకర్తలంతా తిరిగి పార్టీలో పనిచేయవలసిందిగా మహాత్మాగాంధీగారు అర్థించిన తరవాతనే ఆయన తిరిగి కాంగ్రెస్‌తో కలిసి పనిచేశారు.

1959 నాగపూర్ మహాసభ తీర్మానం ద్వారా రైతుల ఆర్థిక స్వయం స్వాతంత్ర్యం హరించే విధానాలకు సహకార వ్యవసాయ కృషికి వ్యతిరేకంగా వాటివల్ల భవిష్యత్తులో సంభవించబోయే ప్రమాదాలను జాతికి తెలియజేస్తూ అనుకోకుండానే అటు మున్షీగారు, ఇటు నేను ఒక్కసారిగా మా కోపాన్ని వ్యక్త పరిచాం. దేశంలో అత్యధిక సంఖ్యాకులైన ప్రజలు అనుభవిస్తున్న ఆర్థిక

స్వాతంత్ర్యాన్ని ఇది ఎట్లా హరింపజేసి ఏకీకృతనియంతృత్వం వైపు దారి తీస్తుందో ఆయన శక్తిమంతమైన తన పద్ధతిలో తెలియజెప్పారు. తన సహజమైన ధోరణిలో నెహ్రూ గారు దీనికి ప్రత్యుత్తరం ఇచ్చారు. ఆ తరవాత పన్నెండు సంవత్సరాలకాలం రాజాజీ గారి ఆశీస్సులతో మేమిద్దరం మంచి మిత్రులుగా కొనసాగుతూ రైతాంగం యొక్క స్వేచ్ఛను వారిస్వయంవృత్తులను కాపాడేందుకు కలసికట్టుగా ఉండి పోరాడాం. ఈ ఉద్యమం కారణంగా భవన్ కృషికి దెబ్బ తగులుతుందనే సంగతి ఆయనకు తెలుసు. ఆయినప్పటికి స్వాతంత్ర్య పరిరక్షణకోసం ఆయన అన్నింటినీ త్యాగం చేశారు. దేశంలో జాతి వ్యతిరేక శక్తులు పదే పదే జాతీయ ఐక్యతను దెబ్బకొడుతూ అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గమనించి మున్షీజీ చాలా బాధపడ్డారు. అందుకు అనుగుణంగా జాతీయ సమైక్యత కోసం ప్రత్యేక ప్రయత్నాలను ప్రారంభించాలని ఆయన కోరారు. తెలివైన ఆయన సూచనలో ఉన్న గొప్ప తనాన్ని గమనించిన పండిత నెహ్రూ తక్షణం ఆ సూచనను అమలు చేయ సంకల్పించి "జాతీయాభివృద్ధి మండలిని" ఏర్పాటు చేశారు.

ప్రత్యేకమైన అభిలాషతో స్త్రీ స్వాతంత్ర్యం కోసం మున్షీగారు పోరాడారు. తన వ్యాసాల ద్వారా నవలల్లో పద్యాలలో పురుషాధిక్యం కలిగిన ఈ సమాజంలో స్త్రీలకు ఇవ్వవలసిన ప్రాధాన్యం గురించి ఆయన నొక్కి చెప్పారు. దేవతలుగా వారిని ఆరాధించడమే గాకుండా నిత్యజీవితంలో తమతో చేయీ చేయీ కలిపి నడిచే సహధర్మచారిణులుగా వారిని గుర్తించేందుకు ఆయన కృషి చేశారు.

లీలావతిని ఆమె సాహితీ సంబంధమైన రచనలు చదివిన తరవాత తన అభిప్రాయాలకు దగ్గరైన మనిషిగా భావించి మొదటి శ్రేణి రచయిత్రిగా కవయిత్రిగా ఎదిగేందుకు సహాయపడి ఆయన ప్రశంసించారు. అనుకోకుండా వారి వివాహం భారతీయ పురాణాల్లోని ప్రేమికుల పద్ధతిలో వారి వారి రెండు కుటుంబాల ఆశీర్వచనంతో జరిగింది. ఆ రకంగా మున్షీ కుటుంబం ఏర్పడింది. అగ్రగణ్యురాండ్రయిన నవీన భారతమహిళానాయకురాండ్రలో ఒకరుగా ఎదిగి శ్రీమతి లీలావతి మున్షీగారు తనపై ఉంచిన విశ్వాసాన్ని నిజంజేసింది. హిందూస్త్రీల ఆస్తి హక్కులకోసం ఆమె విజయవంతంగా కృషిచేసి తను కన్న కలలను సార్థకం చేసుకొన్నది. మున్షీగారి మేధాశక్తిలోనుంచి ఆమె కవితా హృదయంలోనుంచి జన్మించిన వేలవేల సంస్థలకు ఈనాడు ఆమె ఉన్నతంగా సహాయపడుతుంది.

గుజరాతీ వచనానికి, పద్య కవిత్వానికి శ్రీ మున్షీగారు, శ్రీమతి లీలావతి మున్షీగార్లు కొత్త అలంకారాలను చేకూర్చారు. అనేకమంది అందులో ముఖ్యంగా నా పాత మిత్రులు భాయ్‌లాల్‌భాయ్ పటేల్‌గారు శ్రీ హెచ్.యం.పటేల్ (ఐ.సి.ఎస్. రిటైర్డ్) గార్లు గుజరాత్ సాహిత్యానికి వీరుచేసిన సేవలను ప్రశంసించారు. గుజరాతీ లలితకళలకు వారుచేసిన కృషి మాత్రమే చాలు వారికి శాశ్వత కీర్తిని అట్టిపెట్టడానికి.

రచయితగా మున్షీ ఆంగ్ల భాషతో సహా చక్కని ఊహాశక్తి కలిగిన మేధావంతుడైన రచయిత. ఆయన సువర్ణాక్షరాలతో వన్నెలొలికించే తన ప్రేమ కథను మనకు మాటలతో

చిత్రించి చూపెట్టారు. అది మనకు భవన్ నిర్మాణ కృషిలో లీలావతిని మన కందించింది. ఆయన తన వచన కవిత్వంలో కృష్ణ భగవానుడి చరిత్రను కృష్ణావతారం అనే పేరుతో గొప్ప నాయకుడైన కృష్ణ భగవానుని కుటుంబ ప్రణయకథాంశరిగా మరొకరు సమీకరించలేని తంత్రజ్ఞునిగా గొప్ప దార్శనికునిగా ప్రేమించే యువకునిగా సర్వభావ సమన్వితంగా రూపొందించి మరువలేని కావ్యంగా మనకందించారు. ఈనాటి సమాజం ఎక్కువగా అభిమానిస్తున్న కృష్ణావతార తత్వం అనేక ప్రాచీన సంస్కృత గ్రంథాలను పరిశోధించి తాను అందించానని ఆయన తన మెరిసే కళ్లతో నా వైపు చూస్తూ అతి శాలిత్యంగా మృదు మధురంగా చెప్పారు.

అలంకరణ విషయంలో ఆయన తీసుకునే శ్రద్ధను గమనించి చాలామంది ఆశ్చర్యపోతుండేవారు. నెత్తిన తెల్లని గాంధీ టోపీ, కింద కాళ్లకు మెరిసే నల్లని చెప్పులు, తెల్లటి పలుచని ధోవతి, పొడవైన వదులుగా ఉండి ముడుతలు పడని లాల్చీ చూసినప్పుడు ఒక్కో వైస్రాయిగారి ముందు తప్ప ఎవరిముందు మోకాలు ముడవని నిజాం నవాబు అంతటివారు ఆయనను చూసి ముగ్ధులై సాదరంగా ఆహ్వానించారు. మున్షీ అలంకారప్రియులు యదార్థవాది. నిజాం నవాబు హైదరాబాదు స్వాతంత్ర్యం విషయమై మొండిగా కోరికోర్కెలకు మున్షీగారు నోరు విప్పలేకపోవడానికి ఇది ఒక కారణమా! ఆయన రాసిన పుస్తకం "ఎండ్ ఆఫ్ మాన్ ఎరా" శ్రద్ధగా చదివితే మనకు దీనికి జవాబు దొరుకుతుంది. నిజాం నవాబుతోను, ఆయన ప్రధాన మంత్రితోను మర్యాదగా ఉంటున్నప్పటికీ విషయ ప్రాధాన్యానికి వచ్చేటప్పటికి ఆయన గట్టిగా నిలబడ్డారు. వైస్రాయినుంచి పటేల్ వరకు మనకు వ్యతిరేకంగా ఉంటున్న వారిపై పండిత నెహ్రూ, సర్దార్ పటేల్ గార్లు తీసుకొన్న నిర్ణయాలకు ఆయన కట్టుబడి పనిచేశారు.

పఠాన్ చారిత్రాత్మకమైన నవలలో గూర్జర హీరోలనుంచి పుణికి పుచ్చుకొన్న ధైర్య సాహసాలతో ఆయన నిజాం రాయబారులను, రజాకార్లను ఎదుక్కొన్నారు. నిజాం రాష్ట్రంలో వారి ఆధిక్యాన్ని నెలకొల్పు కొనేందుకు వీలుగా సరిహద్దుకు ఇరువైపులా ఉన్న హిందూ గ్రామాలలో హైదరాబాదు ముస్లింలతో ఏర్పడిన గెరిల్లాల ముఠా రజాకార్ల పేరుతో మతపరమైన దాడులు సాగించింది. నేను అప్పుడు ఆంధ్రప్రాంతంలో సేవాదళాల పేరుతో ఆత్మరక్షణ దళాలను ఏర్పాటు చేశాను. నిజాం పరోక్ష దళాలుగా పనిచేస్తున్న రజాకార్లపై పోలీసు చర్యలు తీసుకోవలసిందిగా నేను ప్రధాని నెహ్రూను దేశీయాంగ మంత్రి సర్దార్ పటేల్ గారిని కోరాను. ఢిల్లీ ప్రభుత్వ ప్రతినిధిగా హైదరాబాదులో ఉంటున్న మున్షీగారిలో నేను ఒక మంచి స్నేహితుని చూశాను. సరిహద్దుకు రెండు వైపులా దెబ్బతిన్న గ్రామాలను ఒక మారు వ్యక్తిగతంగా చూడవలసిందిగా నేను మున్షీ గారిని కోరాను. అందుకాయనను అనుమతించేందుకు ఢిల్లీ అంత ఇష్టంగా లేదు. నిజాం ప్రభుత్వం ఆయనకు రక్షణ కల్పించడానికి నిరాకరించింది. హైదరాబాదు రాష్ట్ర స్వాతంత్ర్య సమర యోధులలో ఒకనిగా, ఆంధ్రా కాంగ్రెస్ సంఘ అధ్యక్షునిగా ఢిల్లీ, హైదరాబాదు పాలకులు ఇష్టపడక పోతున్నప్పటికీ అత్యవసరమైన ఈసమయంలో భయకంపితమైన గ్రామాలలో నాతో కలసి పర్యటించవలసిందిగా నేను ఆయనను అర్థించాను. నా విజ్ఞప్తులు ఆయన హృదయాన్ని కదలించిన తరవాత రజాకార్ల దౌర్జన్యాలను గురించి ఆ ప్రాంతంలో

సర్వటిస్తున్నానని ఆయన ప్రకటించారు. జవహర్లాల్ గారికి, పటేల్ గారికి ఈ విషయంచెప్పిన తరవాత నేను ఢిల్లీ నుంచి విమానంలో హైదరాబాదు వచ్చాను. పూర్తిగా ఒక రోజంతా నేను, మున్షీగారు ఆంధ్ర సరిహద్దుల్లోని గ్రామాలను సందర్శించాము. మేము వెళ్లిన ప్రతిచోటా ప్రజలు తండోపతండాలుగా మున్షీగారికి ఎదురొచ్చి రజాకార్ల వల్ల వారికి జరిగిన కష్ట నష్టాలను వివరించారు. అక్కడ నుంచి విజయవాడ చేరిన తరవాత ఒక పెద్ద బహిరంగ సభలో ఢిల్లీ ప్రభుత్వం పోలీసుచర్య తీసుకోబోతున్నదని ఆయన ప్రకటించారు. ప్రభుత్వం ఆయన కిచ్చిన సంపోలం ప్రకారం ఆయన అలాంటి ప్రకటన చేయరాదు. స్వాతిశయం కలిగిన మున్షీగారి ప్రత్యేకశైలి అది. ఆ వెంటనే పోలీసు చర్యకు సర్దార్ పటేల్ ఆజ్ఞలు జారీచేశారు. ఒక సందర్భంలో మున్షీగారు ఇలా అన్నారు. "రంగాజీ! మీరు నన్ను సింహంబోనులోకి నెడుతున్నారు" అని. అప్పుడు నేను సంతోషంతో ఇలా అన్నాను. "మున్షీ సాహెబ్, ఈ సింహాలను మీరు వాటి గుహల్లో బంధించగలరు" అని. పోలీసు చర్యల్లో మిలిటరీ చీఫ్‌కు లోబడిపోయే పని లేకుండా నిజాంను కాపాడారు. మిత్రరాజ్య సమితితో చర్చలద్వారా దేశ ప్రతిష్ట దెబ్బతినకుండా కాపాడారు. ఆయన అంతటి సమర్థుడైన రాజకీయ రాయబారి. ఆయన దేశీయాంగమంత్రి అయిన సర్దార్ పటేల్‌గారి గౌరవాన్ని కాపాడి జవహర్లాల్‌గారికి సంతృప్తిని కలిగించగలిగారు.

భవన్ వ్యవస్థాపకులుగా అనేక చారిత్రక ప్రణయ గాధా కథల రచయితగా, మరువలేని కృష్ణుని ప్రణయ కథా సాహిత్యాన్ని మన ముందుంచిన పౌరాణిక కథాకథన శిల్పిగా, సుప్రీంకోర్టులో పేరెన్నిక గన్న న్యాయవాదిగా భారత రాజ్యాంగ రచనకు వెనకఉండి పనిచేసిన న్యాయశాస్త్ర నిష్ణాతులలో ఒకనిగా ఆయన చేసిన కృషి రాబోయేకొన్ని తరాలవరకు మనం మరచిపోతగింది కాదు. బొంబాయి హై కోర్టులో న్యాయవాదిగా ఉంటూ ఆయన గొప్పగా ఆర్జించారు. ఆయన తాను ఆర్జించిన దానిలో కొంత స్వాతంత్ర్య సమరంలో ఖర్చుపెడితే మిగిలిన దానిని అనేక ధర్మసంస్థలకు, విద్యాసంస్థలకు ఖర్చుపెట్టారు.

మొట్టమొదటి సారిగా మన రాజ్యాంగంలో అవినీతిపరులయిన మంత్రులు, అధికారులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోడానికి తగిన నిబంధనలు లేవనే అంశాన్ని గుర్తించిన మొదటి వారు మున్షీయే. అందుకు గాను ఉన్నత హోదాలలో ఉన్నవారిపై వచ్చిన ఆరోపణలపై తగిన విచారణలు జరిపేందుకు వీలుగా స్వీడన్‌లో ఉన్న (అంబుడ్స్ మెన్) పద్ధతిలో ఒక వ్యవస్థను రూపొందించాలని ఆయన ప్రతిపాదించారు. ప్రముఖ న్యాయశాస్త్ర పండితులయిన అల్లాడి కృష్ణస్వామిగారు మానవతావాది సామాజిక విప్లవోద్యమ నాయకులు ప్రముఖ న్యాయ శాస్త్రజ్ఞులయిన తమతోటి సహచరులు డాక్టర్ అంబేద్కర్‌గారు, సామ్యవాద దృష్టి కలిగిన పండిత నెహ్రూ, అనేకమంది ఇతర మిత్రుల సహకారంతో మన రాజ్యాంగంలో నిర్దేశిక సూత్రాలను, ప్రాథమిక హక్కులకు సంబంధించిన అధ్యాయాలను శ్రీ మున్షీ చేర్పించగలిగారు. ప్రజల అవసరాల కోసం కృషి చేయాలనే దృష్టి క్రిందివర్గాల ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలపై ఉన్న కాంక్ష ఆయనను జవహర్లాల్ గారితోను డాక్టర్ అంబేద్కర్‌గారితోను నాలాంటి అనేకమంది గాంధేయవాదులతోను మిత్రులుగా ఉండగలిగేలా చేసింది. ఈ రెండు అధ్యాయాలతో మన రాజ్యాంగానికి ఆయన బలంచేకూర్చాడు. ఈ రెండూ ఒకదానితో మరొకటి వ్యతిరేకమైనప్పుడు

ఏంచేయాలి! అనే అంశం అందులో లేకపోవడం దురదృష్టకరం. దేశ అవసరాలకు అనుగుణంగా తిరిగి 25-26వ రాజ్యాంగ సవరణలను చేయవలసిన అవసరం భారతపార్లమెంటుకు కలిగింది.

శ్రీమతి భారతీదేవికి, నాకు మున్షీ కుటుంబంతో సత్సంబంధాలుండేవి. స్త్రీల ఆస్తి హక్కుల విషయంలో భారతీదేవి లీలావతిగారి ఉద్యమంలో సహకరించి పని చేశారు. అప్పుడు నేను రాజ్యసభలో లీలావతి గారికి సహసభ్యుణ్ణి. ఆహారపదార్థాలపై కంట్రోళ్లను ఎత్తి వేయాలని, పేద ప్రజల కోసం చౌకదుకాణాలను ప్రారంభించాలని మేమిద్దరమూ వాదించాం. ఆలిండియా ఉమన్స్ ఫుడ్ కౌన్సిల్ వారి సహకారంతో అన్నపూర్ణ ఫలహార శాలను ఆమె ఏర్పాటు చేశారు. లాభమూ, నష్టమూలేని పద్ధతిలో చౌకగా విలువైన ఆహారపదార్థాలను ఎలా అందించవచ్చో ఆ సందర్భంలో ఆమె ప్రయోగాత్మకంగా చూపించారు. ఆమె పార్లమెంటులో ఎంత విలువైన కార్యక్రమాన్ని మనకు అందిస్తారో బయట పనులన్నింటిలో కూడా అలాగే కృషి చేస్తుండేవారు. మున్షీగారు గవర్నరుగా పని చేస్తున్నపుడు ఆమె స్టేట్ కౌన్సిల్‌లో సభ్యురాలిగా ఉంటూ శాసనసభా కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. గుజరాతీభాషలో ఆమె ప్రముఖరచయిత్రి.

తమ గృహాన్ని బారులు తీర్చినట్లుండే గదులతో అందమైన అలంకరణలతో మధురమైన సువాసనలతో శోభాయమానంగా ఉంచి, భోజనపు బల్లమీద మంచి రుచికరమైన రకరకాల పదార్థాలను అమర్చి అతిథులకు ఆదరంతో స్వాగతం పలుకుతుండేవారు. 1960 తరవాత చాలా కాలానికి ఒకమారు నేను, రాజాజీ గారు వారింటికి వెళ్లాము. అక్కడ రాజాజీని వారు ఎంతో ఆరాధనతో గౌరవించారు. నన్ను మంచి మిత్రునిగా ఆదరించారు. భారతీయ సంస్కృతీ పరిమళాలు విరజిమ్మే ఆ ఇంటినీ ఆత్మీయతాభావంతో నిండి ఉన్న ఆ మున్షీదంపతులను వదిలి రావాలంటే మాకు ఎంతకూ బుద్ధి పుట్టేదికాదు.

శ్రీ కామరాజ నాడార్

శ్రీ కామరాజ నాడార్ 15 జులై 1903న జన్మించారు. స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ జరిపిన అన్ని పోరాటాలలో ఆయన జైలుకు వెళ్లారు. మహారాష్ట్రలోని అమ్రోతి జైలులో రంగా గారితో కలసి ఉన్నారు. తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి 1940 నుంచి 1952 వరకు అధ్యక్షులుగా ఉన్నారు. 1954 లోను 1962లోను మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1950 నుండి 1964 సంవత్సరం వరకు అఖిల భారత కాంగ్రెస్ కార్యవర్గ కమిటీ సభ్యులు. 1964 నుండి 1967 సంవత్సరం వరకు అఖిల భారత కాంగ్రెస్ సంఘ అధ్యక్షులు967 ఎన్నికలలో లోక్‌సభకు పోటీచేసి ఓడిపోయారు. 1968వ సంవత్సరంలో తిరిగి ఎన్నికయ్యారు. 1970వ సంవత్సరంలో కాంగ్రెస్ పక్షం చీలిపోయి నప్పుడు కాంగ్రెస్ (ఓ) లో చేరారు. 1975 అక్టోబరు 2న స్వర్గస్థులైనారు. 1976 సంవత్సరంలో భారతరత్న బిరుదు నిచ్చి ఆయనను గౌరవించడం జరిగింది. ఆయన ఆఖరి కోర్కెకు అనుగుణంగా ది. 14-2-1976న కాంగ్రెస్‌లోని రెండు విభాగాలు ఏకమయ్యాయి - (ఎడిటర్)

శ్రీ కామరాజ నాడార్, శ్రీ దామోదరం సంజీవయ్య గ్రామీణ ప్రాంతాలలోని రైతు కుటుంబాల నుంచి వచ్చి సాధారణ కార్యకర్తలుగా కాంగ్రెస్‌లో ప్రవేశించి అఖిలభారత కాంగ్రెస్ సంఘ అధ్యక్షులు కాగలిగారు. అలాగే తమిళనాడు ముఖ్యమంత్రిగా శ్రీ నాడార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా శ్రీ సంజీవయ్యగార్లు కావడం గాంధేయమార్గంలో ప్రారంభమైన అహింసాయుత విప్లవానికి విజయకేతనాలు.

శ్రీ నాడార్ తనకు ఇరవై సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు రామనాధ్ జిల్లా వ్యవసాయ ప్రాంతంలో నుంచి వచ్చి కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా ప్రవేశించారు. ఆయన స్థానిక హైస్కూలులో మాత్రమే విద్యాభ్యాసం చేశారు. ఆయన కులం ఒక నేరస్తజాతి కింద వేర్కొన బడింది. మార్వా కులానికి సహకులం అది. మార్వాకుంస్తులు బ్రిటిష్ మహమ్మదీయ పాలకులను వీరోచితంగా అనేకమార్లు ఎదుర్కొన్నవీరుల వంశీకులు. ఆచారపరులైన బ్రాహ్మణులు నాడార్లకు దేవాలయ ప్రవేశం లేకుండా చేశారు. ముత్తురంగ తేవార్ లాగే నాడార్ గారు కూడా కొద్దిపాటి అవకాశాలతో ఎన్నో దురదృష్టాల మధ్య జీవితాన్ని ప్రారంభించారు.

నాడార్ రాజకీయ జీవితం అనుకోకుండా అప్పటికి దేశవ్యాప్తంగా బాగాపేరున్న సత్యమూర్తిగారి నాయకత్వం కింద, సత్యమూర్తిగారి రాజకీయ ప్రత్యర్థి రాజాజీగారు బలపరచిన సి.పి.సుబ్బయ్య గారిని ఓడించి, 1939-40 సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక కావడంతో ప్రారంభమైంది. అక్కడి నుంచి ఎన్నో సంవత్సరాలు వారు మరణించేంత వరకు సత్యమూర్తిగారు నాడార్ గారికి కావలసిన ఉపన్యాసాలను ప్రకటనలను తయారు చేసిపెట్టడం వంటి అన్ని పనులను సంతోషంగా చేస్తూ నాడార్‌ను ఒక మంచి నాయకునిగా

తీర్చిదిద్దారు. ఆ తరువాత నాడార్ 1945వ సంవత్సరంలో దీర్ఘకాల యుద్ధ సమయ నిర్బంధం నుంచి విడుదలయ్యేనాటికి ఆత్మవిశ్వాసంతోనూ, స్వశక్తిమీద నమ్మకంతోనూ ఉండే స్థితికి వచ్చారు. అది రాజాజీ సఖ సత్యమూర్తి గార్ల మధ్యనున్న ఒక విరోధం కారణంతోనే గాక, సత్యమూర్తిగారు ఆ పదవిని పొందే అవకాశం లేకుండువల్ల కూడా నాడార్‌కు లభించింది.

దక్షిణ భారతదేశంలో అనేకమంది రాజకీయ ప్రముఖులు వరుసగా పరాజయం పాలైన తరవాత ఆయనకు ఆ అవకాశం కలిగింది. యుద్ధ సమయంలో కాంగ్రెస్ ప్రారంభించిన క్విట్ ఇండియా ఉద్యమానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కార్యవర్గంలో నుంచి రాజీనామాచేసి బయటికి వొంగిన తరవాత, రాజాజీ తిరిగి కాంగ్రెస్‌లో చేరేందుకు రాష్ట్రకాంగ్రెస్ సంఘం అంగీకరించలేదు. మళ్ళీ రాజాజీగారు చేసిన ప్రయత్నాన్ని తాను వ్యతిరేకించినప్పటికీ లాభం లేదని తెలిసిగూడ నాడార్ గారు వ్యతిరేకించారు. అఖిల భారత కాంగ్రెస్ సంఘం తరువున మౌలానా ఆజాద్, గాంధీజీ, రాజాజీ గారి ప్రవేశాన్ని అంగీకరించి నాడార్ ప్రయత్నాలను వమ్ముచేశారు. అప్పుడు ముఖ్యమంత్రి పదవికి రాజాజీ గారిపై ప్రకాశంగారిని ప్రోత్సహించి రెండవసారి కూడా రాజాజీగారికి ఆ అవకాశం దొరకకుండా చేసి నాడార్ మహాత్మునిపై మరొక రకంగా విజయాన్ని సాధించగలిగారు. బహిరంగంగా ప్రకాశంగారి అభ్యర్థిత్వాన్ని సమర్థించి కాంగ్రెస్ కార్యవర్గం లోనూ, సర్దార్ పటేల్ గారితోనూ, నేరుగా విభేదాలు పెంచుకోవడం ఇష్టంలేక, గెలవరని తెలిసినప్పటికీ ముత్తురంగ ముదలియార్ అనే ప్రముఖ తమిళ నాయకుడిని అభ్యర్థిగా నిలబెట్టి నాడార్ గారు తన లక్ష్యాన్ని సాధించుకున్నారు. ఆ రకంగా రాజాజీని దెబ్బకొట్టి పరోక్షంగా ప్రకాశంగారు ఎన్నిక కావడానికి దోహదం చేశారు. ప్రకాశంగారు అఖిల భారత నాయకులతో ఒకవైపు, శక్తిమంతమైన ఆంధ్రాకాంగ్రెస్ శాసన సభ్యులతో మరో వైపు పోరాడుతూ బలహీనులైనప్పుడు నాడార్ తిరిగి ఆయనకు వ్యతిరేకంగా పనిచేయడం ప్రారంభించారు. శ్రీ ఓ మండూరి రామస్వామి రెడ్డియార్ గారిని అడ్డం పెట్టుకొని శ్రీ నాడార్ ప్రకాశం గారిని ఓడించగలిగారు. శ్రీ రామస్వామిరెడ్డియార్ రాజకీయంగా తన కుంపటి తాను పెట్టుకునేందుకు ప్రయత్నించడంతో తిరిగి అప్పటికే జాతీయ స్థాయిలో ప్రముఖులైన ప్రకాశంపంతులు, డాక్టర్ సుబ్బరాయన్ గార్లకు వ్యతిరేకంగా కుమారస్వామి రాజాగారిని రంగంలోకి తీసుకొని వచ్చి గెలిపించారు.

1952వ సంవత్సరంలో వయోజన ఓటింగుపై జరిగిన తొలి సాధారణ ఎన్నికలో కాంగ్రెస్ ఓడిపోవడానికి తమిళనాడులో నాడార్‌గారు, ఆంధ్రాలో సంజీవ రెడ్డిగారు వారి అనుయాయులు మంత్రివర్గసహచరులు అవలంబించిన ప్రజావ్యతిరేక చర్యలే కారణం. నేను అప్పుడు కృషీకార్ లోక్ పార్టీ నాయకుడిగా ఉన్నాను. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసేందుకు పదిహేడుమంది శాసనసభ్యులు కలిగిన మా పార్టీ సమర్థన వారికి కావలసి వచ్చింది. ఆ సందర్భంలో వారి పాత సహచరులెవరూ ముఖ్యమంత్రిగా ఉండరాదనే షరతు విధించగా సువిశిత జ్ఞానం కలిగిన శ్రీ కామరాజ నాడార్ దానికి అంగీకరించారు. ఆ తరువాత రాజాజీగారు కాంగ్రెస్ పార్టీ శాసనసభానాయకుడుగా ఎన్నిక కావడం జరిగి తిరిగి వారు పార్టీకి శక్తిని తెచ్చారు. రాజాజీగారి పరిపాలన కాంగ్రెస్‌పై ప్రజలకు తిరిగి విశ్వాసాన్ని కలగ జేసింది. అయితే నాడార్‌గారు మాత్రం దానిని సహించలేకపోయారు. సంయుక్త మద్రాసు రాష్ట్రంలోనుండి

ఆంధ్రప్రాంతం చీలి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తరవాత రాజాజీని ముఖ్యమంత్రిగా కామరాజ నాడార్ కొనసాగనివ్వలేదు. ఆయన బైటకు వెళ్లిన తరవాత ఆస్థానంలో పార్టీ నాయకునిగా తాను ఎన్నికై ముఖ్యమంత్రి పదవిని పొందగలిగారు శ్రీ కామరాజ నాడార్.

ముఖ్యమంత్రిగా నాడార్ శకం ఉన్నత సాంప్రదాయాలతో కూడిన చక్కని పరిపాలనను అందించగలిగింది. ఆ తరువాత వచ్చిన ఏ కాంగ్రెస్ మంత్రివర్గమూ ఆ స్థాయినందుకోలేకపోయింది.

ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో భారీ పరిశ్రమలపై పు, వికేంద్రీకృత మధ్యతరహా పరిశ్రమలపై పు, రాష్ట్రాన్ని ముందుకు నడిపించేందుకు ప్రయత్నాలు ప్రారంభమైనాయి. అందుకు సమర్థవంతమైన ఆయన నాయకత్వాన్ని సామర్థ్యాన్ని మనం అభినందించవలసిందే. ఒకసారి ఉప ఎన్నికలో ఓడిపోయిన తర్వాత నాడార్‌గారు కాంగ్రెస్‌వాదులు అధికార దాహానికి, మంత్రిపదవుల కోసం వ్యామోహపడడం తప్ప పార్టీకార్యకలాపాలలో శ్రద్ధ చూపించలేకపోతున్నారనే అంశాన్ని గ్రహించి తనకు తానుగా ముఖ్యమంత్రి పదవికి రాజీనామా ఇచ్చి కింది స్థాయిలోనుంచి పార్టీ నిర్మాణానికి, ప్రచారానికి కృషి చేసేందుకు నిర్ణయం తీసుకొన్నారు. శ్రీ నాడార్ చేసిన అనితర సాధ్యమైన ఈ వీరోచిత చర్య జవహర్లాల్ నెహ్రూ గారిని ముగ్ధులను చేసింది. ఆయన దీనిని జాతీయ స్థాయిలో తీసుకొని "నాడార్ ఫార్ములా" పేరుతో దేశవ్యాప్తంగా అమలు చేశారు. మన పార్లమెంటరీ చరిత్రలో ఇది ఒక గొప్ప ఉదాహరణగా మిగిలిపోయే సంఘటన.

అనుకోకుండా నెహ్రూగారు శ్రీ నాడార్‌ను జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేయవలసిందిగా కోరుతూ ఆయనకు గొప్ప గౌరవాన్ని, హోదాను కల్పించారు. అయితే నాడార్ దానిని అంగీకరించటం తెలివైన పనేనా? కాకపోవచ్చు. అఖిల భారతస్థాయి రాజకీయాల్లో తగినంత అనుభవం లేకపోవడం కారణంగా రాష్ట్రంలో సాధించినంత గొప్ప విజయాలను ఆయన జాతీయ స్థాయిలో సాధించలేకపోయారు. అయితే నెహ్రూ అంతటి గొప్పనాయకుడు తనకిచ్చిన ఈ ఉన్నత గౌరవాన్ని ఆయన తోసిపుచ్చగలరా? అందుకే శ్రీ నాడార్ ఈ గొప్ప అవకాశాన్ని వదులుకోకుండా ఒక్కసారిగా ముందుకు దూకారు. ఆయన కాంగ్రెస్ అధ్యక్షులుగా రావడం, నెహ్రూగారు గుండెనొప్పితో అస్వస్థులు కావడం దాదాపు ఒకే సమయంలో సంభవించాయి. అందువల్ల నెహ్రూ తర్వాత ఆయన వారసుని గురించి నాడార్ ఆలోచించసాగారు. కొంతమంది పశ్చిమ దేశాల రచయితలు "నెహ్రూ తరవాత ఎవరు" అనే విషయంపై పుస్తకాలు వ్రాస్తూ అందులో నాడార్‌గారి పేరును కూడా ప్రస్తావించడం జరిగింది. భారతీయ పత్రికా రచయితలు ఆయనను అధికంగా పొగడడం ప్రారంభించడంతో కేంద్రంలో తాను ఎవరికీ తీసిపోననే స్థితికి ఆయన వచ్చారు. నెహ్రూగారు కూడా తనకు తలనొప్పిగా తయారైన కేంద్ర మంత్రులను, రాష్ట్రాల ముఖ్యమంత్రులను తొలగించేందుకుగాను "నాడార్ ఫార్ములా"ను బైటకు తీసుకొచ్చి నాడార్ స్వాతిశయాన్ని కొంత పెంచారు.

నెహ్రూగారు స్వర్గస్థులైన తర్వాత తక్కిన నాయకులంతా తనకంటే సీనియర్లు తన చెప్పుచేతల్లో ఉండనంతటి శక్తివంతులు కావడంతో నాడార్ లార్ బహదూర్ శాస్త్రిగారిని ఒక్కరిని మాత్రమే నెహ్రూవారసునిగా ఆలోచించారు. అన్ని అర్హతలు కలిగిన మొరార్జీ దేశాయ్

గారిని ఈ సందర్భంలో ఆయన తోసి రాజనగలిగారు. భారత రాజకీయాల్లో జరిగిన ఈ గొప్ప ప్రయోగాన్ని అనేకమంది విదేశీ పత్రికా రచయితలు, రాజకీయ నాయకులు ప్రశంసిస్తూ ఈ ఘనతనంతా నాడార్ గారికి అంటగట్టారు. శ్రీ శాస్త్రిగారు సంవత్సరం తరువాత అకస్మాత్తుగా మరణించడంతో తిరిగి అదే పరిస్థితిని నాడార్ ఎదుర్కోవలసి వచ్చింది. మొరార్జీ దేశాయ్‌గారు మరొక మారు ముందుకొచ్చారు. ఎటువంటి పరిస్థితిలోనూ దేశాయ్‌గారిని ఆస్థానంలోకి రానివ్వడం నాడార్‌గారికి ఇష్టం లేదు. ఆ సమయంలో ఆయన శ్రీమతి ఇందిరాగాంధీని ప్రోత్సహించారు. తన తాతగారి నుంచి తండ్రి గారి నుంచి నేర్చుకున్న గొప్ప అనుభవాలతో సాంప్రదాయాలతో ఈ అవకాశం కోసమే వేచి ఉన్నానని ఆమె ముందు కొచ్చారు. మొరార్జీ దేశాయ్‌ని ఓడించి శ్రీమతి ఇందిరాగాంధీని గెలిపించడం ద్వారా శ్రీ నాడార్ తిరిగి మరొకమారు విజయాన్ని సాధించగలిగారు. శ్రీమతి ఇందిరాగాంధి ఆయనను తన నాయకునిగా ప్రస్తుతిస్తూ ఆయన సలహాల ప్రకారం నడుచుకోగలనని వాగ్దానం చేశారు.

అయితే అటు నాడార్ కఠినమైన వ్యక్తి కావడం ఇటు ఇందిర నెహ్రూగారిలాగే ఉక్కుమనిషి కావడంతో అతి స్వల్పకాలంలోనే ఇద్దరి మధ్య విబేధాలు పొడచూపాయి. అవకాశం కోసం చూస్తున్న ఉత్తర భారతదేశ రాజకీయ నాయకులు ఈ గండిని పెద్దది చేశారు. 1967 లో జరిగిన ఎన్నికలలో నాడార్ గారు ఓడిపోవడమే గాకుండా కాంగ్రెస్ పార్టీ కూడా అనేక రాష్ట్రాలలో పరాజయం పాలైంది. ఆయన స్వరాష్ట్రమైన తమిళనాడులో కాంగ్రెస్ పార్టీని అధికారంలో నుంచి పడగొట్టి డి.ఎం.కె. పక్షం అధికారంలోకి వచ్చింది. ఆయన, పార్టీ పొందిన ఈ పరాజయాలు ఆయనను నైతికంగా జాతీయ నాయకత్వం కోరే స్థితిలో లేకుండా చేసాయి. శ్రీమతి ఇందిరాగాంధీ అధికారాన్ని బలహీన పరచేందుకు ఆయన సిద్దమై మొరార్జీ దేశాయ్ గారిని ప్రోత్సహించడం మొదలుపెట్టి చివరకు వారిద్దరి మధ్య రాజీచేసి మొరార్జీగారిని ఉపప్రధానిగా చేశారు. ఆది ఇందిరాగాంధీ గారిని సంతోష పెట్టలేదు. మరొకమారు కాంగ్రెస్ అధ్యక్షునిగా నాడార్‌గారిని ఉంచి ఆయన పెత్తనంలో నడవడం ఇష్టం లేనందువల్ల శ్రీమతి ఇందిరాగాంధీ తనకు తానై స్వతంత్రంగా ఉండేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. ఉప ఎన్నికలలో అతికష్టం మీద పార్లమెంటుకు నెగ్గిన తరవాత నాడార్‌గారు కేంద్రమంత్రి వర్గంలో చేరాలని అభిలాష పడ్డారు. ఆయన పెత్తందారీతనాన్ని సహించలేని ఇందిరాగాంధీ ఇందుకు సుముఖత చూపలేదు. ఆ విధంగా నాడార్‌గారి నాయకత్వం కేంద్ర నాయకత్వ స్థాయినుంచి కిందికి జారడం ప్రారంభమైంది.

రాష్ట్రపతి ఎన్నికలో తన దీర్ఘకాల రాజకీయ మిత్రుడైన శ్రీ సంజీవరెడ్డిగారి ఓటమితో సంభవించిన పతనావస్థ, క్రిందినుంచి పైవరకు ముక్కలుముక్కలై పోయిన కాంగ్రెస్ పార్టీ దురదృష్టకరపరిస్థితి, వీటితో పాటు నాడార్ గారికి సంభవించిన అపజయ పరంపరలు, 1971 లో శ్రీమతి ఇందిరాగాంధీకి లభించిన తిరుగులేని విజయాలు ఒకదాని వెంట ఒకటి ఒక్కసారిగా వచ్చి పడుతూ గాలిపీల్చుకునేంత విరామం కూడా లేకుండా జరిగిపోయాయి.

నాడార్ గారంటే అనేకమంది ఇతరపెద్దలకు ఇష్టం కాకపోయినప్పటికీ ఆ రాష్ట్రంలో

ఆయన సాధించిన ఆర్థికపరమైన, పరిపాలనా పరమైన విజయాలు, అభివృద్ధి పట్ల అందరికీ మంచి గౌరవముంది. కింది స్థాయిలో నుంచి కార్యకర్తలతో పార్టీ విభాగాలతో ఆయనకున్న అనుబంధాలు చాలా గట్టివి. అందువల్ల తమిళనాడుకు సంబంధించినంతవరకు ఇందిరా కాంగ్రెస్ కన్నా నాడార్ గారి విభాగమే బలమైన శక్తిగా కొనసాగుతూ ఉంది. రెండువైపులనుంచి సమైక్యతకోసం ప్రయత్నాలు జరుగుతూ ఉన్నప్పటికీ పరస్పర విశ్వాసాలు తగినంతగా ఏర్పడకపోవడంతో ఆ ప్రయత్నాలు తక్షణమే విజయవంతం కాలేదు. పునరేకీ కరణ గురించిన నాడార్ గారి కోర్కె ఆయన మరణించిన తరవాత నాలుగు మాసాలకు తీరింది.

నాడార్ గారు సోషలిజంలో సాంఘిక పురోభివృద్ధిలో మంచి ఆసక్తి గలవారు. మేమిద్దరం అమ్రోతి జైలులో ఉండగా సోషలిస్టు సాహిత్యాన్ని ఆయన ఎంత శ్రద్ధగా చదువుతుంటారో నేను చూశాను. వేదవారు అణగారిన ప్రజలపట్ల ఆయనకు అనంతమైన మమతానురాగాలున్నాయి. నెహ్రూగారి సోషలిస్టు తరహా సమాజ పద్ధతి కృషిలో ఆయన మనస్ఫూర్తిగా ముందుండి పనిచేశారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశంలో శ్రీమతి ఇందిర ప్రతిపాదనను శ్రీ మొరార్జీ గేలిచేయడంగాని, యస్.కె.పాటిల్ గారి పెట్టుబడిదారీ ధోరణిని గానీ ఆయన అంగీకరించలేదు. అందువల్లనే ఆయన పాత కాంగ్రెస్‌లో రాజకీయంగా సమాధి పాలయ్యారు.

1971 సంవత్సరంలో ప్రజలు శ్రీమతి ఇందిరాగాంధీకి అనుకూలంగా తీర్పు ఇచ్చిన తరవాత గతంలో తాను ముఖ్యమంత్రి పదవిని అవతల విసిరి పారేసినట్లుగానే ఎలాంటి కోర్కెలు లేకుండా శ్రీమతి ఇందిరాగాంధీతో కలిసేందుకు ఆయన వీరోచితంగా ముందుకువచ్చారు. 1971-74 సంవత్సరాలలో జాతీయ స్థాయిలో ప్రజలిచ్చిన తీర్పును చూసిన తరవాత ఆయన అప్పటివరకూ తనకున్న బంధాలన్నింటినీ ఒక్కసారిగా తోసివేసి శ్రీమతి ఇందిరాగాంధీని సమర్థించదలిచారు. ఆయన చాలా గొప్ప స్థాయిలోకి ఎదిగారు. గొప్ప గొప్ప త్యాగాలు చేశారు. అయినా తన విజయసాధన కోసం తాను తవ్వుకున్న గుంటలోనుంచి ఎక్కి బయటకు రాలేదు.

నాడార్ దక్షిణాది పద్ధతిలో మంచి పొడగరిగా ఉంటారు. ఆచ్చం ఈనాడు మద్రాసు వెల్లింగ్టన్ బ్రిడ్జివద్ద ఉన్న ఆయన కంచు విగ్రహంలో లాగే దక్షిణాది లుంగీ, పొట్టిచేయి చొక్కా, భుజాలపై అంగవస్త్రంతో ఉండేవారు. ఆయనకు ఆస్తి సంపాదించుకోవాలనే మమకారం లేదు. జాతీయ ప్రయోజనాలకోసం, సామాన్యజనం కోసం ఒక కేథలిక్ మత గురువులాగా దీక్షతో జీవించటమే ఆయనకు ఇష్టం.

ఆయనలో ఆటవిక నాయకునిలో కనిపించే సాహసం, శైవ జ్ఞానిలో ఉండే పట్టుదల రెండూ సమపాళ్లలో కలసి మనకు ఆయన రాజకీయ స్వరూపాన్ని చూపిస్తాయి. ఆయనకు మేధావులతో ఎక్కువ సాన్నిహిత్యం ఉండేది కాదు. కానీ కాంగ్రెస్ సంస్థాగత విషయాలలోను, పరిపాలనా సంబంధమైన వ్యవహారాలలోనూ వారి సేవలను వినియోగించుకునే అనుభవం ఆయనలో ఉంది. ఆయన తన అనుయాయులకు విశ్వాసపాత్రంగా ఉండేవారు. అయితే తన అనుయాయులతో గానీ, శత్రువులతోగానీ వ్యవహార నిర్వహణ చేసేటప్పుడు ఆయన చాలా సున్నితంగా ఉంటుండేవారు. డి.ఎం.కె పార్టీ ద్వారా వచ్చిన సవాళ్లను ఎదుర్కొనేందుకు ఆయన

ఎంతో ఓర్పుతో, ధైర్యంతో ఉన్నా, డి.ఎం.కె.నాయకుడు అన్నాదురై గారు సంపాదించుకొంటున్న ప్రజా విశ్వాసాన్నిఆయన ముందుగా పసిగట్టలేకపోయారు. బ్రాహ్మణ రాజకీయ అనుచరులతో తాను కలసి ఉంటున్నప్పటికీ ప్రముఖ ద్రవిడోద్యమ నాయకులు పెరియార్ గారి తోడ్పాటును సంపాదించుకోగలిగారు. అన్నాదురై గారి లాగానే తానుకూడా సామాన్యజనాల్లో బాగా గౌరవంగల నాయకుడైనప్పటికీ, అన్నాదురై కున్న పాండిత్య ప్రకర్షగానీ, నాయకుడిగా ఎదగ గలిగేశక్తిగానీ ఆయనకు లేదు. నాడార్ గారికి ఆయన పార్టీ రాజకీయ వ్యూహాలకు లభించిన సమర్థన పారిశ్రామిక వేత్తలదయ, స్థానిక రాజకీయ నాయకుల మొండి విశ్వాసాలు మాత్రమే. ఇవి మహోత్సాహంతో ముందుకొస్తున్న అన్నాదురై నాయకత్వంలోని వెనుకబడిన తరగతుల ప్రజలనుగానీ, హరిజనులనుగానీ, ఆటవిక జనాలనుగానీ ఏ రకంగానూనిలవరించలేకపోయాయి. మరణించిన సందర్భాల్లో కూడా ఈ ఇద్దరు ప్రజా నాయకులకు తమిళ ప్రజలు ఒకేరీతిలో దుఃఖోద్వేగంతో, బాధతో తమ నివాళు లర్పించారు. ఎంతో గొప్పగా వారిరువురికీ తమిళజాతి శ్రద్ధాంజలి ఘటించింది.

శ్రీ పాతూరి నాగభూషణం

మన జాతీయ జీవన పురోభివృద్ధికి 'నిరక్షరాస్యత' పెద్ద అవరోధంగా ఉందని గాంధీజీ భావించారు. 'ఇండియన్ కౌన్సిల్'లో శ్రీ గోపాలకృష్ణగోఖలే ప్రవేశపెట్టిన 'ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్య' బిల్లుద్వారా దాని ఆవశ్యకత ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. జాతీయ సేవాకార్యక్రమాల్లో పాల్గొంటున్న రాజకీయ కార్యకర్తలకు, విద్యాపరమైన శిక్షణ ఇచ్చి, వారిని విజ్ఞానవంతులుగా తీర్చి దిద్దిన ఘనత ప్రథమంగా శ్రీ లాలా లజపతిరాయ్‌గారికి దక్కింది. ఈ శతాబ్దంలోని తొలిదశాబ్దంలో అంకిత భావంతో, పూర్తికాలం జాతీయోద్యమ కార్యక్రమాల్లో వెచ్చిస్తున్న జాతీయ వాదులందరూ, పౌరగ్రంథాలయాలను వయోజన విద్యా కేంద్రాలను స్థానిక భాషలలో ఆధునిక సాంఘిక రాజకీయ అంశాలతో గ్రంథ ప్రచురణలను వెలువరించకుండా, ప్రజలలో విజ్ఞానాభివృద్ధిని సాధించకుండా మనం స్వరాజ్య వినాదాన్ని, దేశ స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను సమాయత్తం చేయడం సాధ్యం కాదని శ్రీ బాల గంగాధరతిలక్ సాహసోపేతంగా ప్రకటించారు. ఈ సందేశాన్ని వరవడిగా తీసుకొని 1906లో కలకత్తా కాంగ్రెసు మహాసభ ఒక తీర్మానాన్ని ఆమోదించగా, ప్రముఖవృద్ధనాయకుడైన శ్రీ దాదాభాయి నౌరోజీగారి ప్రోత్సాహంతో ఈ కార్యక్రమాలను జాతీయావసరాలుగా గుర్తించడం జరిగింది. ప్రజలు నిరక్షరాస్యులుగా, విజ్ఞాన హీనులుగా ఉన్నంతకాలం గాంధేయ సిద్ధాంతాలను, జాతీయ పోరాట కార్యక్రమాలను, సామాన్య ప్రజల్లో ప్రవేశపెట్టడం సాధ్యంకాదని కాంగ్రెసు నాయకులు గుర్తించారు. బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న జాతీయ పోరాటంలో భాగంగా ప్రభుత్వ విద్యాలయాలను బహిష్కరించాలనే కార్యక్రమాన్ని తీసుకున్నప్పుడు కాంగ్రెసు కార్యకర్తలు ముందుకు వచ్చి, గ్రామీణ ప్రాంతాలలో వయోజనులకోసం రాత్రి పాఠశాలలను, గ్రంథాలయాలను స్వచ్ఛందంగా ప్రారంభించారు. నిర్మాణాత్మక కృషివైపు దేశం ప్రయాణిస్తున్న కీలక సమయంలో, జాతీయ పునర్వికాసానికి అనువైన సాధనంగా గ్రామీణగ్రంథాలయోద్యమం ప్రథమ శ్రేణిలో నిలిచింది.

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం ప్రజా ఉద్యమాల్లో ఒకటిగా, ప్రథమ శ్రేణిలో నిర్వహించబడుతూ స్వాతంత్ర్య సమరపోరాటానికి గ్రామీణ ప్రజానీకాన్ని సమాయత్త పరచడానికి అనువుగా వయోజన విద్యావ్యాప్తికి గణనీయంగా తోడ్పడింది. మన దేశంలో విద్యావ్యాప్తికి జరుగుతున్న కృషిలో మైసూరు రాష్ట్రంలో గ్రంథాలయోద్యమం ప్రముఖ స్థానాన్ని సంతరించుకొంది. అప్పటి బరోడా రాష్ట్రంలో సైతం గ్రంథాలయోద్యమం బాగా అభివృద్ధి చెందినప్పటికీ, ఆ కృషి ప్రజాపరంగా ప్రజాచైతన్యంతో కాకుండా, బరోడా మహారాజావారి ఆర్థిక వితరణతో, వారి సహాయ సహకారాలతో మాత్రమే జరిగింది.

ముఖ్యంగా మన రాష్ట్రంలో గ్రంథాలయోద్యమం గ్రామీణ ప్రాంతాలలో బాగా

విస్తరించింది. శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు 1930 వరకు ఇరవై సంవత్సరాలపాటు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించి, గ్రామీణ ప్రాంతాలలో తమకృషిని కేంద్రీకరించి గ్రామీణులను అక్షరాస్యులను చేయడంలోనూ, గ్రంథాలయాలను స్థాపించడంలోనూ, పఠనాసక్తిని పెంపొందించడంలోనూ గణనీయమైన కృషి చేశారు. అందుకు అవసరమైన శ్రీ పాతూరి నాగభూషణం వంటి సమర్థులు, నిజాయితీ పరులైన కార్యకర్తలు లభించడంవల్ల ఉద్యమానికి మహర్దశ చేకూరినట్లయింది. గాంధీ యుగంలో ప్రభవించిన ప్రముఖ గ్రంథాలయోద్యమకారులలో శ్రీ నాగభూషణంగారొకరు! గత 35 సంవత్సరాలుగా అంకితభావంతో, పట్టుదల, దృఢదీక్షతో నాగభూషణంగారు ఈ ఉద్యమ వ్యాప్తికి ఎనలేని సేవ చేస్తున్నారు. కాలేజీలో విద్యనభ్యసిస్తున్న రోజుల్లోనే, గ్రామీణ ప్రాంతాలలో వయోజనులకు విద్య తప్పనిసరి అని గుర్తించి, శ్రీ నాగభూషణంగారు స్వచ్ఛందంగా "నిరక్షరాస్యతా నిర్మూలన" కేంద్రాల్లో కార్యకర్తగా పాల్గొని, తన సేవలందించారు.

నాగభూషణంగారు స్వాతంత్ర్య సమరయోధులు. 1930-32సంవత్సరాల మధ్యకాలంలో జైలుశిక్ష ననుభవించారు. 1934నాటికి గ్రంథాలయోద్యమానికి తన పూర్తి కాలాన్ని వినియోగించి, సేవ చేయాలనే నిర్ణయానికి వచ్చారు. వారి నిర్ణయం సాహసోపేతమైనది. ఎందుకంటే అప్పట్లో సాంఘికంగా ఆ ఉద్యమానికి గుర్తింపు తగినంతగా ఉండేదికాదు. అందువల్ల శ్రీయుతులు ముదిగంటి జగ్గన్నశాస్త్రి, శనివారపు సుబ్బారావు తదితర పెద్దలు రచించిన గ్రంథాలను ప్రజలకు అందించి విరివిగా గ్రంథాలయాలను స్థాపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన గుర్తించారు. ఈ సందర్భంలో శ్రీ మానికొండ సత్యనారాయణ, రిటైర్డ్ వ్యవసాయ శాస్త్రజ్ఞులైన శ్రీ గోటేటి బోగిరాజు వంటి విద్యావేత్తల చేత ఉత్తమ గ్రంథాలను వ్రాయించేందుకు నాగభూషణంగారు పూనుకున్నారు. అందుకుగాను ముందుగానే చందాదార్లను చేర్పించి, తద్వారా ఆర్థిక వనరులను సమీకరించి, జాతీయ వ్యవసాయరంగంపైన శ్రీ మానికొండ, శ్రీ బోగిరాజుగార్లచేత ప్రామాణికమైన గ్రంథాలను రాయించి, నాగభూషంగారు వెలువరించారు. ఆంధ్రప్రజానీకానికి నాగభూషణంగారు ఒనగూర్చిన గొప్ప సేవగా ఈ కార్యక్రమాన్ని పేర్కొనాలి.

పౌరగ్రంథాలయ శాస్త్రంలో ప్రభుత్వపరంగా శిక్షణ తరగతులను ప్రారంభించక మునుపే, నాగభూషణంగారు స్వీయ కార్యక్రమాన్ని చేపట్టి, గ్రంథాలయాల నిర్వహణకు కార్యకర్తలకు తగు శిక్షణ ఇచ్చి, వారికి డిప్లమోలను అందజేసి, అనేకమంది యువకులను ఉత్తమ గ్రంథాలయ నిర్వాహకులుగా తయారు చేశారు. ఈ శిక్షణాసంస్థను ప్రారంభించడానికి ప్రేరణను మా రైతాంగ విద్యాలయం అందించింది. ఆ శిక్షణాలయంలో నేనూ ఒక ఉపాధ్యాయునిగా ఉపన్యాసాలు ఇచ్చేవాడిని.

1908లో తొలి రాజకీయ ఖైదీగా జైలు శిక్షనుభవించిన ప్రముఖ జాతీయ నాయకుడైన, శ్రీ గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారి పట్ల నాగభూషణంగారికి విశేషమైన అభిమానం వుండేది. శ్రీ హరిసర్వోత్తమరావుగారి పట్ల విమర్శనాత్మకమైన నా విశ్లేషణను

నాగభూషణం గారు హృదయపూర్వకంగా అభినందించారు. గొప్ప దేశభక్తుడైన శ్రీ గాడిచర్లను గ్రంథాలయోద్యమానికి నాయకత్వం వహించాల్సిందిగా ఆయన ఆహ్వానించారు. రెండు దశాబ్దాల కాలం సాంఘిక సేవారంగంలో వారిద్దరి మధ్య నెలకొన్న సహచర్యం, ప్రాచీన కాలంనాటి గురుశిష్యుల సంబంధాన్ని పోలిఉండేది. తండ్రీ తనయుల మధ్య వుండే అనుబంధం, ఒకనాటి గురుకులంలోని గురు శిష్యులమధ్య నెలకొన్న పవిత్ర సంబంధం గుర్తుకు వచ్చే విధంగా ఆ ఇద్దరి మధ్యా సంబంధ బాంధవ్యాలు చెనవేసుకొని ఆంధ్రదేశంలో వయోజన విద్యావ్యాప్తికి ఎనలేని సేవలు అందించాయి. విజయవాడ పటమటలంకలోని కొందరి పెద్దల, మిత్రుల సహాయసహకారాలతో, పటమటలో గ్రంథాలయ సంఘానికి శాశ్వత భవనాన్ని నిర్మించి, దానికి శ్రీ హరి సర్వోత్తమరావుగారి పేరిట "సర్వోత్తమ భవనం" అని నామకరణం చేశారు. దాని నిర్వహణకు ఆంధ్రగ్రంథాలయ ట్రస్టును నెలకొల్పారు. ఆ ట్రస్టు సభ్యుల్లో భారతీదేవిగారొకరు.

ఉభయశాసనసభల్లో దేనిలోకూడా నాగభూషణంగారు సభ్యత్వాన్ని పొందలేకపోయారు. స్వతంత్ర భారతదేశంలో ఎన్నికలు ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నాయి. జటిలసమస్యలతోనూ, కుల, మత, వర్గ ఘర్షణలలోనూ, సాంఘిక అసమానతలతోను రాజకీయ వ్యవస్థ సంస్కరించడానికి సాధ్యంకాని రీతిలో తయారైనందువల్ల, శ్రీ నాగభూషణం వంటి స్వచ్ఛంద సేవకులు విజాయితీతో ఎన్నికలలో గెలుపొందడం దుర్లభమే. నిరక్షరాస్యతా నిర్మూలనకు, అహరహము పాటుబడిన వారి జీవితానుభవాన్ని ప్రజాసేవారంగంలో గడించిన ప్రతిభా విశేషాలనూ శాసన సభలు వినియోగించుకోలేక పోయాయి.

1955లో నూతన రాజ్యాంగాన్ని అమలులోకి తెచ్చినప్పుడు పది సంవత్సరాలలోగా దేశంలో నిరక్షరాస్యతను నిర్మూలించాలని మనంప్రతినబూనాం. అయితే నేటి వరకూ అనగా 1984 నాటికి కూడా మన ప్రణాళికా సంఘ రచయితలు దాన్ని సాధించలేకపోయారు. ఈ వైఫల్యం మన ప్రజాస్వామ్య నిర్వహణకూ, పార్లమెంటరీ వ్యవస్థకూ, ప్రజలకూ ఆశనిపాతంవంటిదని చెప్పకతప్పదు. శ్రీ శనివారపు సుబ్బారావు, శ్రీ జగ్గన్నశాస్త్రి, శ్రీ నాగభూషణం వంటి విద్యానురక్తిగల కార్యకర్తలు లక్షల సంఖ్యలో భారతదేశం నుంచి నిరక్షరాస్యతను పారద్రోలేందుకు అవసరం. ఆల్ ఇండియా రేడియోరోజువారీ ప్రసార కార్యక్రమాల్లో ఈనాడు విజ్ఞాన దాయకమైన సమాచారాన్ని, ప్రాథమిక విద్యకు సంబంధించిన అంశాలను ప్రసారం చేస్తున్నది. ఇది కొంతవరకు హర్షించదగినది. అది మాత్రమే చాలదు. సోవియట్ రష్యాలో లాగా, మావోచైనాలో, టిటోయుగోస్లావియాలో తమ దేశాల్ని తీర్చిదిద్దిన వరవడిలో శ్రీ నాగభూషణం గారివంటి సాంఘిక సేవా కార్యకర్తలు దృఢదీక్షతో ప్రజానీకం చదువు నేర్చేందుకు, ఆలోచించేందుకు చేసిన సేవలను ఆదర్శంగా తీసుకొని యీనాడు మనకర్తవ్యాన్ని నిర్వర్తించవలసి ఉంది. నిరక్షరాస్యతా నిర్మూలనతో పాటు, గ్రంథాలయోద్యమాన్ని, చర్చా గోష్ఠులను కూడా నేడు మన సమాజాభ్యుదయానికి అవసరమైన అంశాలుగా గుర్తించి ప్రజలు కృషి చేయవలసి ఉంది.

శ్రీ పాతూరి నాగభూషణం గారు సాంఘిక సేవా కార్యకర్తల్లో అగ్రగణ్యులు. ఆయన ఒక ఉత్తమ స్నేహితులు. సహచరులు. నమ్మకమైన కార్యకర్త. నేత. తాను ఎలాంటి ప్రతిఫలాన్ని

ఆశించకుండానే, సమాజానికి అకళంకమైన సేవలు చేశారు. ఇందుకు ఆయనను అభినందిస్తున్నాను. ఆయనకంటే గ్రంథాలయోద్యమ కృషిలో ప్రధములైన శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారిని ఉన్నత సేవలందించినందుకు రాష్ట్రపతి 'పద్మ శ్రీ' బిరుదునిచ్చి సత్కరించినందుకు నేను మహోదానందభరితుడనైనాను. ఆంధ్ర విశ్వవిద్యాలయంవారు ఆయనకు గౌరవ డాక్టరేట్ నిచ్చి గౌరవించారు. వారు యిప్పటికీ ఆరోగ్యవంతులుగా వుండి, వయోజనవిద్య, గ్రంథాలయాల నిర్వహణకు సంబంధించిన అమూల్యమైన గ్రంథాలను తెలుగులో రచిస్తూ ఉండడం మన అదృష్టమని చెప్పాలి.

దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు

'దేశోద్ధారక' అనేది ఆయన బిరుదు. మహాత్మాగాంధీగారు ఆయనను అట్లా సంబోధించారు. ఒక దశాబ్దంక్రితం దక్షిణభారతదేశమంతటా, ఢిల్లీలోనూ ఆయన శతజయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రముఖ గాంధేయవాది, దక్షిణాది బ్రాహ్మణులలో ఉన్నతుడూ అయిన శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు జాతియోద్యమానికి చేసిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆయనకు నివాళులర్పించబడ్డాయి.

మొదటి తెలుగు దినపత్రిక ఆంధ్రపత్రికను అరవై సంవత్సరాక్రితం శ్రీ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఒక శతాబ్ద జీవితం కలిగిన ఆంధ్ర సచిత్ర వార పత్రికను ఆయన బొంబాయి నుంచి వెలువరించారు. అప్పట్లో ఆయన బొంబాయిలో నివసిస్తూ, తలనొప్పి నివారణ ఔషధమైన 'అమృతాంజన్'ను తయారుచేస్తూ ఉండేవారు. రెండు దశాబ్దాల కాలం నష్టాలతో నడిచే ఆంధ్ర పత్రికా నిర్వహణకు, అమృతాంజన్ పై వచ్చే ఆదాయాన్ని ఆయన వెచ్చిస్తూ ఉండేవారు.

అనాది నుంచీ ఆంధ్రదేశంలో రాజులు, మహారాజులు, సంపన్నులు ఆస్థాన పండితులతో విద్వద్గోష్ఠులను నిర్వహిస్తూ ఉండేవారు. కానీ వారెవరూ సాధారణ ప్రజల చదువు సంధ్యలను గురించి ఆలోచించలేదు. ఇటువంటి స్థితిలో ప్రజల్లో పత్రిక అమ్ముడుపోగలదా లేదా అని ఆలోచించకుండా, లాభనష్టాలను అంచనా వేయకుండానే, తెలుగు ప్రజలలో పఠనాసక్తిని పెంపొందించేందుకు, వందలు, వేలరూపాయలను తృణప్రాయంగా వెచ్చించి, నష్టాలతోనే తెలుగు దినపత్రికను వెలువరించసాగారు. ఆయన కృష్ణాజిల్లాలోని నున్నంపాడు అనే కుగ్రామంనుంచి కనీసం డిగ్రీకూడా పుచ్చుకోకుండానే, ఎక్కడో సుదూర ప్రాంతమైన బొంబాయికి బయలుదేరి ఉద్యోగాన్వేషణకై తరలివెళ్లారు. అక్కడ ఒక ఇంగ్లీసు ఔషధ నిపుణునివద్ద ఆయన గుమాస్తాగా చేరాడు. తన తెలివితేటలతో, చొరవతో అంకిత భావంతో విధి నిర్వహణ కొనసాగించి, ఆంగ్ల ఫార్మాసిస్టుకు శ్రీ నాగేశ్వరరావు ప్రీతిపాత్రులయ్యారు. ఇంగ్లీషు ఫార్మాసిస్టు భారత దేశాన్ని వదిలి, ఇంగ్లండు వెళ్లిపోతూ 'అమృతాంజన్'ను తయారుచేసే ప్రక్రియను నాగేశ్వరరావుగారికి అందచేశారు. 'అమృంతాజన్' ఔషధాన్ని నాగేశ్వరరావుగారు బారీయెత్తున అభివృద్ధి లోకితెచ్చారు. దానిపై వచ్చే ఆదాయాన్ని ఆయన తన ఆశయ ఆదర్శాల సాఫల్యతకు వినియోగించారు. తద్వారా ఆంధ్ర ప్రజల అభ్యుదయంకోసం ఎంతగానో పాటుపడ్డారు.

బాపట్లలో 1913లో ప్రధమాంధ్ర మహాసభ జరిగింది. అదే సంవత్సరంలో భాషా ప్రాతిపదికపై పునర్విభజనచేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్యమం కోసం, అందుకు ప్రజలను సమీకరించే సాధనంగా నాగేశ్వరరావుగారు తెలుగు దినపత్రికను స్థాపించారు. గుంటూరుకు చెందిన దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు ఆంధ్రోద్యమనాయకులుగా

ఉద్యమాన్ని నిర్వహిస్తూ ఉండేవారు. స్వభాషాభిమాన స్ఫూర్తితో ప్రజలు జాతీయాభిమానాన్ని సంతరించుకుంటున్న రోజులవి. ఆ అవకాశాన్ని ఊతంగా చేసుకొని శ్రీ కొండావెంకటప్పయ్యగారు, ఆయన అనుచరులూ కాశీనాధుని నాగేశ్వరరావుగారితో సహా ఆంధ్ర రాష్ట్ర నిర్మాణానికి ఉద్యమాన్ని ప్రారంభించారు. 1908-11 మధ్యకాలంలో బెంగాల్, మహారాష్ట్రలో సాగిన జాతీయోద్యమ ఘట్టాలను ప్రేరణగా తీసుకొని ఆంధ్రలో రాజకీయ చైతన్యాన్ని కలిగించే ఉద్దేశంతో నాగేశ్వరరావుగారు తెలుగు దినపత్రికను ప్రారంభించారు. ఆంధ్ర వార పత్రికను నేను చదివేందుకు నాలో సంకల్పాన్ని కలిగించిన నా రైతాంగ విద్యాలయం గురువరేణ్యులు శ్రీ జె.ఆంజనేయులుగారికి నేను కృతజ్ఞతలు చెప్ప వలసిఉంది. ఆంధ్ర పత్రికకు మొదటి దశలోనే చందాదారులుగా జేరినవారిలో నేనూ ఒకడిని. మన మాతృభాషలో ప్రారంభింపబడిన మొదటి తెలుగుదినపత్రిక ఆంధ్రపత్రిక అప్పట్లో రాజకీయ పరిజ్ఞానాన్ని చైతన్యాన్ని ప్రజలలో ఎంతగానో కలిగించింది. ఈ విషయాన్ని నేను దృఢంగా చెప్పగలను.

గాంధీజీ బోధనలు, కాంగ్రెసు సిద్ధాంతాలూ ప్రజలలో ప్రచారం గావడానికి వీలుగా, ముద్రించిన ఆంధ్రపత్రిక కాపీలలో పదోవంతు కాపీలను గ్రామీణ ప్రాంతాలలో వుండే గ్రంధాలయాలకు ఉచితంగా శ్రీ నాగేశ్వరరావుగారు తన తుదిశ్వాస విడిచేంతవరకు పంపుతూనే ఉన్నారు. ఆయన విరామమెరుగని గొప్ప ప్రచార వేత్త. తన దినపత్రిక ద్వారా కాంగ్రెసు సిద్ధాంతాలను, రాజకీయ విజ్ఞానాన్ని ప్రజలలో కలిగించేందుకు ఆయన కాంగ్రెసు కార్యాలయాలకూ, స్థానిక కార్యకర్తలకూ విస్తారంగా కాంప్లిమెంటరీ (ఉచిత) కాపీలను పంపుతూ ఉండేవారు. ఆ విధంగా నాగేశ్వరరావుగారు తనకు తానే 'సంచార గ్రంధాలయం'గా వ్యవహరించారు.

సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించినప్పుడు, ఆ ఉద్యమంలో ఒక భాగంగా ప్రజలచే కొనసాగించబడిన బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా ఆంధ్రలో కూడా విద్యార్థులు పాఠశాలను, న్యాయవాదులు కోర్టులను, ఉద్యోగులు ప్రభుత్వ విధులను బహిష్కరించి అకుంఠిత త్యాగాలను చేశారు. వేలాదిమంది కాంగ్రెసు కార్యకర్తలు తమవద్ద చిల్లిగవ్వకూడాలేని సందర్భంలోకూడా, ముందువెనకలు ఆలోచించకుండా ఉద్యమంలోకి దూకారు. ఆ దశలో సంపన్నవర్గాలు, భూస్వాములు బ్రిటిష్ ప్రభుత్వానికి, దానికి విధేయులుగా ఉన్న బ్రాహ్మణేతర నాయకులు నడుపుతున్న జస్టిస్ పార్టీకి తమ మద్దత్తు తెలియజేశారు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మద్రాసు వచ్చి అక్కడ దిన వారపత్రికలను ప్రారంభించి, తన వద్ద అదనంగా ఉన్న ధనాన్ని ఆయన కాంగ్రెసు నాయకులకు, కార్యకర్తలకు సమకూరుస్తూ, జాతీయోద్యమం ప్రజలలో పాదుకునేందుకు ఎంతగానో తోడ్పడ్డారు. ఈ ఆర్థిక సహాయాన్ని రచయితలకు రచనా ప్రతిఫలంరూపేణా, కొందరికి నెలసరి గౌరవవేతనాల రూపంగా, అందజేస్తూ ఈ ధనాన్ని వారు కాంగ్రెసు మహాసభలకు హాజరయ్యేందుకు, రైలు ఛార్జీల కొరకు తదితర అవసరమైన వాటికి ఉపయోగపడు విధంగా, ఎందరో కార్యకర్తలకు ఆయన సహాయపడ్డారు.

సనాతనాచార పరాయణులైన బ్రాహ్మణకుటుంబంలో నాగేశ్వరరావు గారు జన్మించినప్పటికీ, ఆయన సాంఘిక విప్లవాన్ని తెచ్చిన బసవేశ్వర తత్వాన్ని అనుసరించారు.

బసవేశ్వర వాదం అంటరానితనాన్ని, వర్ణవ్యవస్థను, కులతత్వాన్ని, హైందవ దురాచారాలను ఖండిస్తుంది. ఆయన అనుచరులూ, వారిలో సైతం పౌరోహిత వర్గానికి చెందిన వారుకూడా సంఘ సంస్కరణాభిలాషులే. మరోవైపు నాగేశ్వరరావుగారు గాంధీ మహాత్ముని సాంఘిక సదస్కరణలను కూడా మనస్ఫూర్తిగా బలపరిచారు. అంటరానితనానికి వ్యతిరేకంగా హైందవ సంస్కరణలను కూడా మనస్ఫూర్తిగా బలపరిచారు. అంటరానితనానికి వ్యతిరేకంగా హైందవ సమాజంపై గట్టిగా ధ్వజమెత్తారు. ఆంధ్ర హరిజన సేవా సంఘానికి అధ్యక్షులుగా ఉండి, నాగేశ్వరరావుగారు అనేక ప్రాంతాలలో పర్యటించి సర్వసమానత్వాన్ని ప్రభోధిస్తూ, హరిజనులపట్ల సోదరభావంతో మెలగవలసిందిగా, వారిపట్ల గౌరవభావాన్ని అలవర్చుకోవలసిందిగా బ్రాహ్మణవర్గాలకు బోధచేశారు. హరిజనులకు ఆలయ ప్రవేశం కల్పించుటలోనూ, ఊరబావులు, చెరువులూ అన్ని వర్ణాలూ, హరిజనులలో సహ సమిష్టిగా ఉపయోగించుటలోనూ ప్రజలలో ఆయన విజయవంతమైన కృషిచేశారు. హరిజనవాడలలోని బావులను మరమ్మత్తులు చేసేందుకు, త్రవ్వేందుకు అనేకచోట్ల ఆయన ఆర్థిక సహాయాన్ని అందించారు. నాకంటే వయస్సులో పెద్దవారైన శ్రీ నాగేశ్వరరావుతో కలిసి, వారి పర్యటనలో పాల్గొంటూ, గ్రామీణ ప్రాంతాలలో దైన్యస్థితిలో ఉన్న హరిజనుల అభివృద్ధికొరకు, హరిజనేతరులను ఒప్పించుటలోనూ ఆయన కొనసాగిస్తున్న సాంఘిక సమానతను సాధించే కృషిలో పాలుపంచుకునే అవకాశం నాకు లభించింది.

హరిజనులపట్ల నాగేశ్వరరావుగారిలో నెలకొని ఉన్న సమగ్రసంస్కరణల స్థాయిలో కాకుండా, అఖిలభారత హరిజన సేవా సంఘం అధ్యక్షులైన టక్కర్ బాబా, మహాత్మాగాంధీగారలు పరిమితమైన భావాలతో అంటరానితనం నిర్మూలింపబడడంవరకే సంతృప్తి చెందారు. కానీ నాగేశ్వరరావు గారు ఇట్లాంటి పరిమితభావాలతో సరిపెట్టుకోకుండా, మాతోపాటు మురికివాడల పర్యటనలో పాల్గొన్నారు. ఆయన అనుచరులు హరిజనులతో కలిసిమెలసి సంచరిస్తూ, హరిజన సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండేవారు. నాగేశ్వరరావుగారు అన్ని కులాల వారితో కలిసి సహపంక్తి భోజనాల్లో సైతం పాల్గొన్నారు. నేనూ, శ్రీమతి భారతీదేవిగారూ నిర్వహించిన తాళ్లపాలెం సహపంక్తి భోజన కార్యక్రమంలోనూ, వినయాశ్రమంలో కీర్తిశేషులైన స్వామి బసవయ్యగారూ, మేమూ కలిసి నిర్వహించిన కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు. ఈ సహపంక్తి భోజన కార్యక్రమాలన్నిటా కూడా హరిజనులే మా అతిధులు, వంట చేయడం, వడ్డన చేయడంతో సహా కార్యక్రమ నిర్వహణలో భాగస్వాములుగా ఉండేవారు, ఈ సంఘటనలు తదుపరి కాలాల్లో ప్రాముఖ్యతను సంతరించుకొని, ఆంధ్ర ప్రాంతంలో అనేకచోట్ల కాంగ్రెసు కార్యకర్తలు యిదే పరవడిలో సహపంక్తి భోజన కార్యక్రమాలను నిర్వహించడానికి మార్గదర్శకమైంది.

ఖాదీ ఉత్పత్తిని ప్రోత్సహించి, ఖద్దరు వాడకంలో గాంధీజీ అభిప్రాయాలే నాగేశ్వరరావుగారికీ ఉన్నాయి. ఖాదీ ఉత్పత్తి కేంద్రాలకు, గాంధీఆశ్రమాలకు నాగేశ్వరరావు భూరి విరాళాలను అందిస్తూ, ఖాదీ, చేతిపనుల అభివృద్ధికి, నిర్మాణాత్మక ప్రోత్సాహాన్ని చేకూర్చుతున్న నాగేశ్వరావుగారిని, బాపూజీ, రాజేంద్రప్రసాద్ గారలు ఎంతగానో అభినందించారు.

ఆంధ్రుల సర్వతోముఖాభివృద్ధిని నాగేశ్వరరావుగారు వ్యక్తిగతంగా ఆకాంక్షించేవారు. వారి బిలాషల్లో ఆంధ్రాభ్యుదయం ముఖ్యమైన అంశంగా ఉండేది. ఆంధ్ర విజ్ఞాన సర్వస్వాలను ప్రచురించలేక శ్రీ కొమర్రాజు లక్ష్మణరావుగారు ఇబ్బందులకు గురి అయినప్పుడు, నాగేశ్వరరావు గారు వాటి ఆర్థికభారాన్ని వహించారు. సాటి ప్రచురణకర్తలు తెలుగు భాషలో పత్రికా ప్రచురణలను నిలిపివేస్తున్న దశలో, తెలుగు సాహితీ వేత్తల పాండితీ ప్రకర్షణా వేదికగా నాగేశ్వరరావుగారు భారతి మాసపత్రికను ప్రారంభించారు. గ్రామీణ గ్రంథాలయాలకు ఆయన ఉచితంగా గ్రంథాలను అందించి, తోడ్పడ్డారు. కష్టనష్టాలకు గురి అయిన ప్రతి కళాకారునికి, చిత్రకారునికి, శిల్పికి, నటీనటులకు, సినీ ఆర్టిస్టులకు, రచయితలకు, తుదకు వార, మాసపత్రికా సంపాదకులకు ఆయన చేయూత నిచ్చి తోడ్పడినారు. నాగేశ్వరరావుగారి సహాయ సంపత్తులు లేనట్లయితే, ఎందరో కళాకారులు వారి వారి రంగాల్లో ఉన్నతస్థితికి ఎదగ గలిగిఉండేవారుకాదని నిస్సందేహంగా చెప్పవచ్చు. కళాకారులకూ, రచయితలకూ, చిత్రకారులకూ, ప్రజా సేవకులకూ, సహాయపడవలసి వచ్చినప్పుడు, వారిని కించపడే విధంగా కాకుండా, ఆత్మీయంగా వారి బాధలను తెలుసుకొని, సహృదయతతో ఆయన తన సహాయాన్ని అందజేస్తూ ఉండేవారు. శ్రీ నాగేశ్వరరావుగారి యీవి, వితరణశీలతను, దయార్ద్రతను గమనించి గాంధీజీ ఆనందించి, ఆయనను "దేశోద్ధారక" బిరుదుతో ప్రశంసించారు.

నాగేశ్వరరావుగారు తెలుగు సాహిత్యంలో చక్కటి రచయిత. తెలుగు సాహితీ, సంస్కృతులపై ప్రగాఢమైన అభిమానం ఉంది. అనేకమంది తెలుగు కవులకు, రచయితలకు, విరాళాలను యిచ్చి, ఉచితంగా వారి గ్రంథాలను ప్రచురించి పెట్టి, వారి రచనలను ఆంధ్ర పత్రిక, భారతి పత్రికలలో ప్రచురించి, ఆర్థికంగా వారికి తోడ్పడుతూ ఉండేవారు. అలాంటి రచయితలు చాలామంది గొప్పకీర్తి ప్రతిష్టలను సంతరించుకున్నారు. కళా ప్రపూర్ణ శ్రీ తుమ్మల సీతారామమూర్తి కవి, చరిత్రకారులైన శ్రీ చిలుకూరివారు, యం.యస్.కె.శర్మ, జీవిత చరిత్రల గ్రంథ రచయిత పండిత గొర్రెపాటి, చిత్రకారులు శ్రీ అడవి బాపిరాజు, కవి, పండితులైన విశ్వనాథవారు, సమతా సంస్కరణల కవిజాషువా, శ్రీ బోయి భీమన్నగారలు 'దేశోద్ధారకు'ని ప్రోత్సాహాన్ని పొందినవారే

నాగేశ్వరరావు గారు రాజకీయ వాది కూడా! అయితే ఆయన పదవుల కోసం వెంపర్లాడే నాయకుడుకాదు. ఆయన ఏనాడూ అధికార పదవులకోసం వెంపర్లాడలేదు. డంబాచారాలు, ఆడంబరాలు పెత్తందారీ మనస్తత్వం మూర్తిభవించిన నాయకుల ప్రవర్తనతో విసిగిపోయి, కాంగ్రెసు కార్యకర్తలు ముక్త కంఠంతో వారిని బలవంతపెట్టినప్పుడు, కాంగ్రెసు సంస్థ గౌరవాన్ని కాపాడేందుకు ఒకమారు ఆయన రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షపదవిని చేపట్టి సంస్థను సక్రమమార్గంలో నిలబెట్టి, దాని ఉనికిని కాపాడారు. ఆంధ్ర ప్రజలవత్తిడితో ఆయన కేంద్ర శాసన సభ సభ్యులుగా పదవిలో కొనసాగారు. స్థానిక నాయకుల వ్యతిరేకతను కూడా తట్టుకొని, అదే సమయంలో నేను కూడా కాంగ్రెస్ జాతీయ స్థాయి నాయకత్వంలోనికి రాగలిగాను. పదవీ వ్యామోహంతోనూ, అధికార లాలసతోనూ పరస్పర కలహాలతో కాంగ్రెసు నాయకులు పార్టీకి అప్రతిష్టాకరంగా తయారైనప్పుడు, కేంద్రలో బాబూ రాజేంద్రప్రసాద్‌గారు చేపట్టిన వరవడిలోనూ, ఆంధ్రరాజకీయరంగంలో నాగేశ్వరరావు గారు కూడా అట్లాంటి పాత్రనే చేపట్టారు. భాషా

ప్రయుక్త రాష్ట్రాద్యమంతోపాటు, నాగేశ్వరరావుగారికి జాతీయతపై కూడా తిరుగులేని విశ్వాసం ఉంది. కేంద్ర శాసనసభలో ఆయన మూడు సంవత్సరాలు మాత్రమే సభ్యులుగా ఉన్నారు. మంత్రివర్గంలో చేరవలసిందిగా శ్రీ జవహర్లాల్ నెహ్రూ కోరినప్పుడు, ఆయనకు మనస్కరించక, నెహ్రూ కోర్కెను తిరస్కరించారు. అనేక రాష్ట్రాలలో కాంగ్రెసు పార్టీ అధికారానికి వచ్చి, మంత్రివర్గాలను ఏర్పరస్తూ, సుదూరంలో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించబోయే తరుణంలో, ఆయన మరణించడం జాతిదురదృష్టం అని చెప్పాలి.

ఆయనతో ఇరవై సంవత్సరాలు కలిసి పనిచేసిన అదృష్టం నాకు కలిగింది. కిసాన్ పాఠశాలకు, సంస్థాగత వ్యవహారాలకు శ్రీమతి భారతీదేవి గారు నిర్వహించిన మహిళారాజకీయ ఉద్యమాలకు, పాఠశాలలకు ఆయన విరివిగా ప్రచారాన్ని కల్పించిపెట్టారు. ఆయనలో ఒక విరామ మెరుగని కార్యకర్తను తెలివైన కార్యదక్షుని, ఆదరపూర్వకమైన మిత్రుని, నేను కనుగొన్నాను. జైలులో మూర్తీభవించిన దేశభక్తిలో, మహర్షిలా ఆయన ప్రార్థనలలో కాలాన్ని గడుపుతూ ఉండడం నేను గమనిస్తూ ఉండేవాడిని. జైలులో ఆయన గడిపిన విరామ సమయాన్ని శ్రీ కృష్ణుని భగవద్గీతను పారాయణం చేయడానికి, దానికి వ్యాఖ్యానించడానికి వినియోగించారు. రాజకీయ ఖైదీలుగా జైలులో వున్నవారి కుటుంబాలకు విరాళాలు పంపుతూ ఆదుకుంటూ, జైళ్లల్లోని రాజకీయ ఖైదీలకు దుస్తులు, పండ్లు, మందులు పరఫరాచేస్తూ ఉండేవారు. జైళ్లనుండి విడుదలై, బయటకువెళ్లిన రాజకీయ బాధితులకు అవసరమైన వారి ఆర్థిక దుస్థితినుంచి తప్పించడానికి, విరాళాలను అందజేసేవారు. జైళ్లల్లో మగ్గుతున్న రాజకీయ వాదులను, రహస్యజీవితం గడుపుతున్నవారిని అనారోగ్యంపాలైన వేలాదిమంది కార్యకర్తలను ప్రత్యేకంగా తమ సహాయసంపత్తులందించి ఆయన ఆదుకున్నారు. స్వాతంత్రోద్యమంలో నాగేశ్వరరావు గారు వహిస్తున్న ప్రముఖ పాత్రను గురించి బ్రిటిష్ ప్రభుత్వానికి తెలిసికూడా, పవిత్రమైన మత సంస్థపై జోక్యంచేసుకుంటే కలిగే విషపరిణామాలను దృష్టిలో పెట్టుకొని, దేశోద్ధారకునిపై వత్తిడి తెచ్చే సాహసానికి బ్రిటిష్ ప్రభుత్వం పూనుకోలేకపోయింది. ఆయన జీవించినంతకాలం ఆయన ప్రారంభించే ప్రతి కార్యక్రమంకూడా 'ఓం'కారంతోనే మొదలయ్యేది.

49

శ్రీ గుల్జారీ లాల్ నందా

శ్రీ గుల్జారీలాల్ నందా ప్రస్తుతం పశ్చిమ పాకిస్తాన్‌లో ఉన్న సియోల్ కోటలో 4-7-1898న జన్మించారు. సర్దార్ పటేల్ ఆధ్వర్యంలో నడుస్తూ మహాత్మాగాంధీగారి ఆశిస్సులు పొందిన అహమ్మదాబాద్ టెక్స్‌టైల్ లేబరు యూనియన్ కార్యదర్శిగా ఆయన పేరులోకి వచ్చారు. మనకున్న ప్రముఖ స్వాతంత్ర సమరయోధుల్లో ఆయన ఒకరు. 1922-46 సంవత్సరాల మధ్య ఆయన గాంధేయ మార్గంలో కార్మికులకు సేవ చేశారు. 1947 నుండి 1950 వరకు బొంబాయిలోను 1957లో ఢిల్లీలోను ఆయన కార్మిక శాఖామంత్రిగా ఉన్నారు. ఆయన 1950-52 సంవత్సరాలలో ప్రణాళికా సంఘానికి మొదటి ఉపాధ్యక్షులు. 1948-50 మధ్య కాలంలో ఆర్థిక ప్రణాళికకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ స్థాయీ సంఘంలో రంగా గారితో సహ సభ్యులు. జవహర్లాల్ నెహ్రూగారి మంత్రి వర్గంలో ఆయన దేశీయాంగ శాఖ మంత్రిగాను, రైల్వే మంత్రిగాను పని చేశారు. జవహర్లాల్‌గారి మరణానంతరం ఒకమారు లాల్ బహదూర్ శాస్త్రిగారి మరణానంతరం ఒకమారు రెండు సార్లు కొద్ది రోజులపాటు భారత ప్రధానిగా కొనసాగారు. 1971 నుండి రక్షణ వగైరా దేశ అవసరాల నిమిత్తం ప్రజాశక్తిని సమీకరించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ పొరసంస్థకు ఆయన ఉపాధ్యక్షుడు, 1947వ సంవత్సరంలో ది ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐ.ఎన్.టి.యు.సి)ను శ్రీ రంగా, శ్రీ ఆబీద్ ఆలీ వంటి వారి సహకారంతో ఆయన ప్రారంభించారు. 1952వ సంవత్సరంలో జవహర్లాల్ అధ్యక్షుడుగా ఆయన భారత్ సేవక్ సమాజ్‌ను ఏర్పరచారు. రంగాగారు అందులో కార్యవర్గ సభ్యులు. ఆయన భారత సాధు సమాజ్‌ను కూడ ప్రారంభించారు. (ఎడిటర్)

మనకున్న ప్రముఖ దేశ నాయకులలో శ్రీ గుల్జారీలాల్ నందాగారు ఒకరు. నిర్మాణ దక్షత కలిగిన ఒకానొక మిధ్యావాది ఆయన. ఆయన తనకు తాను ఒక గొప్ప నిర్మాణ శక్తి సంపన్నుడనని భావిస్తూ ఉండేవారు. ఆయితే ఆయన ఊహలకు కలలకు తగిన విధంగా ఆయన ఆచరణ మాత్రం ఉండదు. కలలో మాత్రమే జీవించే వూహా వాదుల్లో ఎక్కువ మందికి ఇట్లాంటి అసంగతాలు మామూలే. నిర్మాణ కార్యక్రమాల్లో నందాగారి చొరవను కొద్దిమంది మాత్రమే మెచ్చుకుంటూ ఉండేవారు.

గాంధీగారు ఆయనలో నిజాయితీ పరుడైన ఒక కార్మికశ్రేయోభిలాషిని దర్శిస్తుంటే సర్దార్ పటేల్‌గారు అహమ్మదాబాదు కార్మిక సంఘానికి మనఃపూర్వకంగా పనిచేసే ఒక కార్యకర్తను మంచి నిర్వహణాదక్షుణ్ణి చూస్తుండేవారు.

1944 సంవత్సరంలో నిర్మాణ కార్యక్రమాల విషయమై సేవాగ్రాంలో గాంధీగారితో నేను చర్చలు జరిపినప్పుడు వారి సలహామేరకు ఆ తరువాత బొంబాయిలో కమ్యూనిస్టుల ప్రజాయుద్ధ నినాదానికి వ్యతిరేకంగా పారిశ్రామిక కార్మికులను బయటకు లాగేందుకు

శ్రీ నందాగారిని, బొంబాయిలో కలసి చర్చించాను. కిసాన్ మజ్దూర్ పార్టీ లక్ష్యాలలో ప్రకటించిన రీతి విప్లవాత్మకమైన గాంధేయ సోషలిజం యొక్క అవసరాన్ని ఆనాడు ఆయన ముందుగానే గుర్తించగలిగారు. అయితే ఇది 1944 సంవత్సరంలో గాంధీగారితో ఈ విషయమై నేను జరిపిన చర్చలకు ముందు కాదు, ఆ తరువాతనే జరిగింది. ఆ తరువాత నందాజీ సర్దార్ పటేల్ గారితో సంప్రదించి హిందుస్తాన్ మజ్దూర్ సేవాసంఘం వారిచేత ఇది వారి లక్ష్యంగా ఆమోదింప చేశారు. భారత జాతీయ కార్మికులు తమకు తాము స్వతంత్రంగా ఒక ప్రత్యేక కార్మిక సంఘంగా ఏర్పడవలసిన అవసరం ఉన్నదని ఆ సందర్భంలో మేము అంగీకరించాము. ఒక దశాబ్దానికి ముందు శ్రీ వి.వి.గిరిగారు తీవ్రంగా కృషి చేసి పరస్పర విరుద్ధంగా ఉన్న కార్మిక సంఘాల మధ్య ఐక్యతను సాధించారు. ఈ క్రొత్త ప్రయత్నం వలన ఆయన సాధించిన దేశ భక్తియుత కృషి ఒక్కసారిగా సందేహంలో పడిపోతుంది. అయినప్పటికీ శ్రీ నందా ధైర్యంగా ఇందుకు పూనుకొని కొత్తగా ప్రత్యర్థి వేదికను ప్రారంభించారు. ఆ రకంగా ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐ.ఎన్.టి.యు.సి.) అవతరించింది. అంతటి శక్తిసంపన్నుడాయన.

1949-50 సంవత్సరంలో ప్రణాళికా సంఘ వ్యవహారాలలో మేము జవహర్లాల్ గారితో సహకరించాము. అప్పుడు శంకర్‌రావ్ దేవ్‌గారు దానికి కన్వీనరు. ఆ సందర్భంలో జరిగిన చర్చలలో స్వయం వృత్తులతో జీవనం సాగించే రైతాంగం యొక్క వినాశనాన్ని కూడా లెక్కించక పారిశ్రామిక కార్మికుల పట్టణ ప్రజల అవసరాలను తీర్చేందుకు ఆయన ఎంత స్థిరంగా ఉన్నారో నేను గ్రహించగలిగాను. ఆ ధోరణి ఆయనను జవహర్లాల్ గారికి దగ్గరగా తీసుకెళ్లింది. మా ఇద్దరి మధ్య బాధాకరమయిన పరిస్థితులు నెలకొనడానికి కారణమయ్యింది. వ్యవసాయాభివృద్ధిని వెనక్కు నెట్టి వేసి పారిశ్రామిక అభివృద్ధికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనే నెహ్రూ విధానాన్ని ఆయన మనస్ఫూర్తిగా సమర్థించారు. అందుకు సంతోషించిన జవహర్లాల్ ఆయనను బొంబాయిలోని కార్మిక శాఖామంత్రిత్వం నుండి ఢిల్లీలోని ప్రణాళికా సంఘానికి తీసుకొనివచ్చారు.

అప్పటి నుండి నందా నెహ్రూగార్ల మధ్య స్నేహ సంబంధాలు బలపడి కేంద్ర మంత్రివర్గం లోని నెహ్రూగారి అంతరంగికుల్లో నందాగారు ఒకరవ్వటం జరిగింది. నెహ్రూగారు ఉన్నతమైన వూహల్లో జీవించే వ్యక్తి. నిర్మాణ వ్యవహారాల్లో నందా గారి వంటి సహచరుల అవసరం ఆయనకు ఎంతైనా ఉన్నది. మంత్రి వర్గంలోని మిగతా సహసభ్యులలాగా నందా అధికారం నిలుపుకోవడంతో మాత్రమే తృప్తి చెందలేదు. అందువల్ల ప్రజలతో ఎక్కువగా సంబంధాలు పెట్టుకునేందుకు వీలుగా వేరే సంస్థను ప్రారంభించేందుకు పూనుకొన్నారు. ఆ రోజుల్లో నెహ్రూజీ నందాగారు ఒకటిగానే ఉంటున్నారనే సంగతి అందరకూ తెలిసినదే.

ప్రజా సేవకులను తయారు చేయాలని బాపూజీ అభిప్రాయాలకు అనుగుణంగా ఆయన భారత సేవక్ సమాజ్‌కు రూపకల్పన చేశారు. గాంధేయ ప్రణాళికలకు నందాగారు తగిన రూపాన్ని ఇవ్వగలరనే నమ్మకంతో నేను ఆయనకు నా సహకారాన్నిస్తానని వాగ్దానం చేశాను. పార్టీ ప్రాథమిక లక్ష్యాలకు భిన్నంగా లేనంతవరకూ రాజకీయ విభేదాలతో నిమిత్తం లేకుండా

అందరితో కలసి పని చేయగలిగే మనస్తత్వం ఆయనకుంది. అప్పుడు 1952లో ప్రతిపక్ష కె.ఎల్.పి. నాయకునిగా నన్ను భారత సేవక్ సమాజ్ కార్యవర్గంలోనికి నెహ్రూగారి ఆమోదాన్ని తీసుకొని ఆయన ఆహ్వానించారు. అది కేబినెట్ మంత్రిహోదాకు తగ్గని బాధ్యత. ప్రజాస్వామ్య ప్రభుత్వంలో గూడ మంత్రులకు ప్రజలతో నేరుగా సంబంధాలను ఏర్పరచుకొనేందుకు వీలు లేకుండా ఎట్లాంటి పరిమితులుంటాయో ఆయన గ్రహించారు. కార్మిక సంఘాలలో ఆయనకున్న అనుభవం ద్వారా సివిల్ సర్వీస్ ఉద్యోగులతో నడిచే ప్రభుత్వాల పద్ధతిని ఆయన పోల్చి చూసుకున్నారు. నెహ్రూగారు కూడా ఇట్లాంటి సంస్థలు సివిల్ సర్వీసు ఉద్యోగుల పాలనలో కంటె ప్రజలకు ఎక్కువగా తోడ్పడగలవని భావించి ఈ ప్రయత్నానికి సంతోషించారు. కాంగ్రెస్ సంస్థపైన రాష్ట్రప్రభుత్వాల మీదా ఆయనకున్న పలుకుబడి భారత్ సేవక్ సమాజ్‌ను అభివృద్ధిపరిచేందుకు ఉపయోగపడింది. నందాగారు దానికి ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఆ తరువాత అది ఒక పెద్ద ప్రభుత్వ అనుబంధ సంస్థగా భారతదేశమంతా విస్తరిల్లి తాలూకా పట్టణ ప్రాంతాలన్నిటా శాఖల నేర్పరచుకొని అనేకమంది గాంధేయవాదులు సంతోషంగా అందులో పనిచేసేందుకు ముందుకు వచ్చేలా చేసుకోగలిగింది. దురదృష్ట వశాత్తూ దీనిమీద కూడ రాజకీయ వాదుల దృష్టి పడింది. అంతటితో గొప్పదైన ఈ జాతీయ సంస్థకు విషాద ఘడియలు ప్రారంభమైనాయి.

కార్యకర్తలను సరిగా నడిపించే సామర్థ్యం తక్కువైనందువల్ల ప్రజా సమీకరణ సాధ్యం కానందువల్ల వారి వారి విభేధాలను విస్మరించేలాగా చేసి అందరినూ క్రమశిక్షణ కలిగిన సైనికుల లాగా నడిపించలేకపోవడం వలన కష్టించి పనిచేసే వారిని ముందుకు తీసుకు వెళుతూ, తప్పు చేసేవారిని దండిస్తూ ఉండలేకపోయినందువల్ల అనేక ప్రజాహిత సంస్థల లాగానే నందాగారు ప్రారంభించిన భారతసాధు సమాజ్ కూడా ఆయన వూహించిన స్థాయిని అందుకోలేక అపజయం పాలైంది.

ఆయన అధికార పదవులలో ఉన్నప్పుడు వాటిని వీలైనంత ఎక్కువగా ప్రజలకు మేలు చేసేందుకు వినియోగించుకున్నారే తప్ప పార్టీలో ఆయన స్థానాన్ని కాపాడు కొనేందుకు ఏ విధంగానూ వాడుకోలేదు. అందువలననే ఆయన కోరుకోక పోయినప్పటికీ రెండు మార్లు భారత ప్రధానిగా ఉండే అవకాశం ఆయనకు కలిగింది. ఆయనెప్పుడూ పార్టీ నిర్మాతగానీ నాయకుడుగానీ కాదు.

భారత్ సేవక్‌సమాజ్ అనేకమంది పార్లమెంటు సభ్యుల చేతుల్లో బడి, తీవ్రమైన విమర్శలను ఎదుర్కొవలసి రావడానికి కారణం రాష్ట్రాల ముఖ్యమంత్రుల కాంగ్రెస్ అధ్యక్షుల రాజకీయ దుర్వినియోగమే.

ఆయన హోం శాఖ మంత్రిగా వచ్చిన తరవాత పరిపాలనలో ఉన్నవారి అవినీతిని ఎదుర్కొనేందుకు ప్రజా సేవకులతో మరొక సంస్థను ప్రారంభించారు. ఆయన రైల్వే శాఖ మంత్రిగా ఉన్నప్పుడు టిక్కెట్టు లేని ప్రయాణాలను నిరోధించేందుకుగాను సరుకుల దొంగతనాలను అరికట్టేందుకు గాను ప్రజా సహకారంతో కృషి చేసేందుకు ఇట్లాంటి మరో

ప్రయత్నాన్ని చేశారు. రైల్వే ప్రయాణీకుల సౌకర్యాలు మెరుగు పరచేందుకు కూడా యీ సందర్భంలో ఆయన పూనుకున్నారు.

ఆయన బాధ్యతనెప్పుడూ విస్మరించేవారు కాదు. తాను చేపట్టిన బాధ్యతను మర్యాదపూర్వకంగానూ, పట్టుదలతోనూ పూర్తి చేస్తుండేవారు. అనేకమంది యితర మంత్రులలాగా పూరికే కాలాన్ని గడపడంతో ఆయన సరిపెట్టుకోలేదు. హోం మంత్రిగా రెండు సంవత్సరాల్లో అవినీతిని అంతం చేయగలనని ప్రకటించారు. ఆ ప్రకటన పూర్తిఫలితాన్ని ఇవ్వలేకపోయినప్పటికీ డంబాలు పలికే ఏ ఇతర మంత్రికి కూడా తీసిపోకుండా చాలా ఎక్కువ కృషి చేసి మంచి ఫలితాలను సాధించగలిగారు.

ఆయన యిప్పటికి కూడా ప్రభుత్వ పరమైన ఏ బాధ్యత లేకుండానే పౌరసభలద్వారా మన సామాజిక జీవనానికి నిర్మాణాత్మకమైన తన సేవలనందిస్తూనే ఉన్నారు.

నందా నిరాశావాదికానీ, పగలో పందెం సాధించుకోవాలనుకునే మనస్తత్వం కలిగిన వారు కానీ కాదు. అగ్ర భాగంలో ఉన్న వర్గాల ప్రజలచే కిందికి త్రోసి వేయబడి సాంఘికంగా వెనుకబడివున్న ప్రజల పురోభివృద్ధికోసం ఆయన మనస్సు ఎప్పటి కప్పుడు కొత్త ఆలోచనలు చేస్తూ ఉంటుంది. కొత్త సంస్థలను ప్రారంభిస్తూ ఆయన చేతులు నిరంతరం విరామం లేకుండా పని చేస్తూనే ఉంటాయి. నందాజీ గొప్పగా తన సేవలనందించిన ఈ ముప్పయి సంవత్సరాల కాలంలో ఆయన ప్రజాసేవ కృషిలో ఆయనతో కలసి ఉండగలిగినందుకు నేను నిజంగా గర్విస్తున్నాను.

శ్రీ నార్ల వెంకటేశ్వరరావు – ఆయన మిత్రులు శ్రీ ఆచార్య!

శ్రీ నార్లవెంకటేశ్వరరావు 1-12-1908 లో జన్మించారు. బి.ఎ.డిగ్రీ పుచ్చుకున్నారు. 1930లో జాతీయోద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లారు. 1958 నుంచి 1969 వరకు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. మదరాసు నుండి వెలువడుతున్న ఆంధ్రప్రభ దినపత్రికకు సంపాదకులుగా పని చేశారు. 1968లో విజయవాడలో ఆంధ్రజ్యోతి దినపత్రికను స్థాపించి, దానికి సంపాదకులుగా ఉన్నారు. యునెస్కో సభలకు ప్రతినిధిగా హాజరైనారు. యూరపు, రష్యా, అమెరికా దేశాల్లోని అభ్యుదయ రచయితలతో సంబంధ, బాంధవ్యాలను నెలకొల్పుకునేందుకు ప్రపంచ దేశాలన్నిటా పర్యటించారు. ఆంధ్ర, ఆంగ్ల భాషలలో ఎన్నో గ్రంథాలను రచించారు. ఆయన రచనల్లో 'వీరేశలింగం', 'వేమన', "ఆంధ్రసాంఘిక విప్లవకారులు', 'కవులు' అనే గ్రంథాలను సాహిత్య అకాడెమీ ప్రచురించింది. – (ఎడిటర్)

విభిన్న లక్షణాలు వైవిధ్యంతో కూడిన భారతీయ సాహితీ, సాంస్కృతిక సంపదను పరిపుష్టం చేసేందుకు, భారత దేశంలో చాలామంది అభ్యుదయ సాహితీవేత్తలు ఉండటం అదృష్టమనే చెప్పాలి.

భారతదేశంలో బాగా అభివృద్ధిచెంది, ప్రాచుర్యం పొందిన ఆరుభాషలలో తెలుగుభాష ఒకటి. యూరపు, ఇంగ్లండుల లో షేక్స్పియర్ శకం ప్రారంభంకాక పూర్వమే, శతాబ్దాల క్రితమే తెలుగు భాష ఉన్నతమైన సాహితీ విలువలను సంతరించుకొని ఉంది. శతాబ్దాలుగా జరిగిపోయిన సుదీర్ఘకాలంలో కొద్దిమంది ఛాందసవాదులు కల్పించిన అవరోధాలను మీనహాయిస్తే, ఉత్సాహవంతులైన కవులూ, రచయితలు తమ రచనల ద్వారా దీన్ని బహుముఖంగా సుసంపన్నం చేశారు. 15వ శతాబ్దానికి చెందిన యోగివేమన హైందవ మత దురాచారాలను విగ్రహారాధనను, పుక్కిటి పురాణాల మూఢాచారాలను, అంధ విశ్వాసాలను సమాజాన్ని ఆవరించుకొన్న మతమౌఢ్యాన్ని తొలగించడానికి తన దృష్టిని కేంద్రీకరించారు. బ్రాహ్మణ పౌరోహిత్య వర్గం కల్పించిన కర్మకాండలు, జంతుబలులు, కర్మవాదం, స్వర్గ, నరకాల పేరిట ప్రజలలో ఆవరించుకొని ఉన్న భ్రమల్ని ప్రశ్నిస్తూ దుయ్యబడుతూ, వ్యంగ్యంగా సూటిగా తేలిక భాషలో హేతుబద్ధంగా నిర్భయత్వంతో కవిత్వాన్ని చెప్పారు. వేమనను ఆదర్శంగా తీసుకొని శ్రీ వీరేశలింగంగారు ఆధునిక కాలానికి అనుగుణమైన వచనరచనలతో, మూఢాచారాలపై ధ్వజమెత్తి, సంఘ సంస్కరణలను ఆచరణాత్మకంగా కొనసాగించి, ఆంధ్రుల ఆలోచనలను విశాల ప్రపంచవైపు నడిపించారు. గురజాడకవి మానవతా వాదంతో కూడిన దేశభక్తిని ప్రబోధిస్తూ రచనలు చేశారు.

ఈ శతాబ్దంలో నార్లవారు వ్యావహారిక భాషలో, వచనశైలిలో ఆధునిక ప్రపంచ

సాహిత్యంలో తను సంపాదించిన ఆపారమైన విజ్ఞానదృష్టితో, కందుకూరి, గురజాడ, గిడుగుగార్ల చూపెట్టిన హేతుబద్ధమైన ఆలోచనా మార్గంలో ఛందస్సు, వ్యాకరణాల సంకెళ్లనుంచి పత్రికా వ్యాసంగాన్ని బయటకు తెచ్చి సామాన్య ప్రజలకు సైతం అర్థమయ్యే తేలిక భాషా ప్రయోగంతో, తాను సంపాదకత్వం వహిస్తున్న తెలుగు దిన వార పత్రికలలో తెలుగు సాహిత్యాన్ని ఆధునిక మార్గంవైపు, ప్రజలకు చేరువగా తెచ్చారు. అందుకు శ్రీ నార్లవారికి నా అభినందనలు సమర్పిస్తున్నాను.

తెలుగు సాహిత్యంలో నార్లవారు సృష్టించిన ఆధునిక రచనాపద్ధతి, శైలి, వేగవంతమైన భావవ్యక్తీకరణ, వరవడి మరెవ్వరికీ సాధ్యంకాని తనదైన బాణీలో సాంఘికంగా, రాజకీయంగా తెలుగువారిని చైతన్యపరుస్తూ నూతన ఆలోచనా మార్గంవైపు మళ్లించాయి. నూతన పదాలు ప్రయోగించడంలోనూ, చెప్పే విధానంలోనూ, ఆధునికతను సంతరించుకొని, దేశదేశాల సాహిత్యపరిజ్ఞానాన్ని, చరిత్రనూ, రాజకీయ సంఘటనలనూ హిందీ, ఇంగ్లీషు తదితర భాషలనుండి సేకరించిన విజ్ఞానాన్ని, నూతనపద ప్రయోగాలతో తెలుగు భాషను పరిపుష్టం చేశారు.

రాజకీయ నాయకుల కార్యకలాపాలను, కాంగ్రెసు అగ్రనాయకుల వ్యక్తిగత ద్వేషాలను నార్ల వారు గుడ్డిగా సమర్థించేవారుకారు. అవసరమైనప్పుడు వారిని విమర్శించడానికి ఆయన వెనకడుగు వేయలేదు. శ్రీ నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డిగారలు రాష్ట్రముఖ్యమంత్రులుగా పరిపాలన చేసేటప్పుడు ప్రజాసమస్యలపై, అధికార దుర్వినియోగంపై ఆయన వారితో విభేదించి, వాటిని ఎత్తి చూపారు. అయితే వారి ప్రజా హిత కార్యక్రమాలను బలపరిచే సమయంలో పూర్వపు విమర్శలను దృష్టిలో పెట్టుకోకుండా నిర్వ్యందంగా సమర్థించేవారు. 1952-53లో ప్రభుత్వ భూములను, భూమిలేని నిరుపేద హరిజన, గిరిజన వ్యవసాయకూలీలకు మాత్రమే కేటాయించాలన్న నా వాదనతో ఆయన విభేదించి, స్వాతంత్ర్య సమరయోధులకు భూములిచ్చి కేటాయించే విధానానికి వ్యతిరేకంగా ఆందోళన చేయడానికి పూనుకున్నారు. అప్పట్లో మంత్రులుగా పదవులు నిర్వహిస్తూ, తదుపరి వరుసగా ముఖ్యమంత్రులైన శ్రీ యుతులు బెజవాడ గోపాలరెడ్డి, నీలంసంజీవరెడ్డి వంటి సంపన్నకుటుంబాల నుంచి వచ్చి, భూస్వాములైనవారు కూడా, రాజకీయ బాధితుల పేరిట అయిదెకరాలనుంచి పదెకరాలవరకు ఉచితంగా భూమిని పొందినప్పుడు ఆంధ్రప్రభ దిన పత్రికా సంపాదకులుగా ఉన్న శ్రీ నార్ల, వారికి వ్యతిరేకంగా ప్రచారం చేశారు. ఆంధ్రలో ప్రత్యేకాంధ్రోద్యమం తీవ్ర స్థాయిలో కొనసాగినప్పుడు, ఆ ఉద్యమం ద్వారా జరిగిన హింసాత్మక కార్యకలాపాలను విమర్శించేటపుడు, నన్నిహితులైన వారి విరోధమును సైతం లెక్కచేయకుండా సంపాదకీయాలద్వారా, వార్తల ద్వారా ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ఆంధ్రోద్యమం ప్రతిఘాత చర్యలను ఖండించారు. భారతీయ పత్రికా సంపాదకులలో అరుదుగా కనిపించే స్వతంత్ర విధానాలో, నిర్భయమైన రచనా వ్యాసంగంలో, తనకుతానే సాటి అని శ్రీ నార్ల రుజువు చేశారు.

ఒక సందర్భంలో నా ప్రవర్తనను అర్థంచేసుకొనకుండా, శ్రీ నార్ల నాపై విమర్శలను చేసిన సంఘటన ఒకటున్నది. కానీ అతనికాలంలోనే, నేషనల్ బుక్ ట్రస్టువారు ప్రచురించిన తన ఆంగ్ల గ్రంథాన్ని నాకు అంకితమిచ్చి, తన పొరపాటును తానే సరిదిద్దుకున్న ఉన్నత మనస్కుడు

శ్రీ నార్ల. దేశ స్వాతంత్ర్యం పొందిన తరవాత, మన దేశంలో ప్రచురితమవుతున్న జాతీయ పత్రికా సంపాదకులలో ఆయన విశిష్టమైన స్థానాన్ని సంతరించుకున్నారు. ఆయన ఆ విషయంలో ప్రథమ స్థానాన్ని పొందినారనే చెప్పవలసి ఉంది.

"భారతీయ సంస్కృతిలో సాంప్రదాయిక విలువలు" అనే నార్ల వారి గ్రంథం ఆలోచనల్ని రేకెత్తించేదిగా నేను భావించాను. భారతీయ సంస్కృతిపై ఆయన రచనలు ప్రజల్లో జాగృతిని కలిగిస్తాయి. గాంధీజీ, నెహ్రూలపై సాగించిన పరిశోధనలు ఆ నాయకుల వ్యక్తిగత జీవన విధానాలు, నిర్మాణాత్మక కార్యక్రమాలను విమర్శనాత్మకంగా, ఆలోచనలను రేకెత్తించే విధంగా నార్ల వారు చిత్రీకరించారు. శ్రీ యం. చలపతి రావుగారిలాగే, శ్రీ నార్లకూడా హేతువాది. ఈ ఇద్దరూ గాంధీగారికి ఉన్న జాతీయతా దృష్టిని అభినందిస్తూనే, సనాతన మత చాందస భావాలను ధైర్యంగా ఖండిస్తారు. మా వంటి గాంధేయ వాదులు చాలామంది బాపూజీని అభిమానిస్తూ ఉండగా శ్రీ నార్లవారికి నెహ్రూగారి పట్ల సదభిప్రాయం. ఏదైనా సమస్య చర్చకువచ్చినప్పుడు తన సహజసిద్ధమైన తార్కికవాదంతో తన వాదనకు బలం చేకూర్చుకొని శ్రీ నార్ల సకారణంగా వాదనలో పాల్గొనేవారు.

నాగార్జున కొండ, అమరావతిలోని చారిత్రిక శిల్ప సౌందర్యాన్ని, అజంతా చిత్రాలలోని విశిష్టతను నార్ల గొప్పగా ప్రశంసిస్తూ ఉండేవారు. 34 సంవత్సరాల క్రితం ఒకసారి నేనూ, భారతీదేవి నాగార్జునకొండను దర్శించాము. విశేషించి భారతీదేవి చిత్రకారిణికాగా, నాకు కళల పట్ల అభిరుచి ఉండేది. ఆ పర్యటనలో నాగార్జున కొండ శిల్పాలలో సన్నివేశించిన సిద్ధార్థుని అడవిలో వదిలి కన్నీటితో మెడవంచుకొని శాక్య రాజభవనానికి తిరిగి వచ్చిన కంటక అశ్వం యొక్క కరుణరసపూరితమైన చిత్రాన్ని చ శిల్పి కళా నైపుణ్యానికి ఆశ్చర్య చకితుడనయ్యాను. కొన్ని దశాబ్దాల తరవాత నార్లవారు కూడా, శ్వచిత్రాన్ని చూసి, చిత్రాన్ని మలచిన శిల్పికి తన హృదయపూర్వకమైన అభినందనల్ని తెలిపారు. ఇట్లాంటి విషయాలపై మా ఇద్దరి మధ్య ఏకాభిప్రాయం పెనవేసుకొనుంది. శిథిల బౌద్ధారామాల చుట్టూ నెలకొని ఉన్న పరిసరగ్రామాలలో అక్కడక్కడా నిర్లక్ష్యంగా పడిఉన్న శిథిల శిల్పాలనుగాంచి నార్ల వారి హృదయం ద్రవించేది. వాటి సంరక్షణకు ఆయన ప్రత్యేక బాధ్యతల్ని తీసుకున్నారు. నార్లవారికి పుస్తకాలపట్ల విపరీతమైన ప్రేమ ఉండేది. దానికనుగుణంగా అనేక గ్రంథాలను సేకరించి, ఆయన స్వంతంగా పెద్ద లైబ్రరీని ఏర్పరచుకున్నారు. నార్లవారు మంచి సంభాషణా చతురులు. మాటల్లో ఆయన మనల్ని బాగా ఉత్సాహపరచగలరు. ఆనందింపజేయగలరు. ఓర్పు, సహనంతో ఆయన సహచర్యాన్ని నెరపగలరు. ప్రజా శ్రేయస్సుకు వ్యతిరేకంగా ఎవరైనా పాల్పడితే, వారెంత గొప్పవారైనా, నిర్భయంగా ప్రజావ్యతిరేకులను చీల్చి చెండాడగలమనస్వత్వం నార్లవారిది. ప్రతిభావంతమైన సమయస్ఫూర్తి, పట్టుదలగలిగిన ఉత్తమ పత్రికా సంపాదకులు శ్రీ నార్ల. 'స్వరాజ్య' పత్రికా సంపాదకులైన శ్రీ ఖాసా సుబ్బారావుగారిని ఆదర్శంగా పెట్టుకొని, నార్లవారు పత్రికా సంపాదకత్వాన్ని నిర్వహించారు. నార్లవారు పాశ్చాత్య దేశాలలోనూ, కమ్యూనిస్టు దేశాలలో సైతం విస్తృతంగా పర్యటించి, ఆయా దేశాల్లోని ప్రముఖరచయితలతో, పత్రికా సంపాదకులతో స్నేహసంబంధాలను ఏర్పరచుకున్నారు. తన సాహితీ మిత్రులతో సుదీర్ఘకాలం సత్సంబంధాలను పెంచుకుంటూ, తరచుగా జాబుల

ద్వారా పరస్పరం అభిప్రాయాలను తెలియజేసుకుంటూ ఉండేవారు. అప్పుడప్పుడు మా ఇద్దరి మధ్యా భేదాభిప్రాయాలు తలెత్తినప్పటికీ ఆయన స్నేహితుల్లో నేనూ ఒకడిని కాగలిగాను.

<u>నార్ల వారి ప్రత్యేక సంచిక పరిచయ వాక్యాలనుంచి :</u>

నార్లవారు మద్రాసుకు వచ్చేనాటికి ఆయన జేబులో ఒక రూపాయి పావలా మాత్రమే ఉంది. మదరాసులో ఆయన చెప్పరానన్ని కష్టాలను అనుభవించారు. దుర్భరమైన ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఆ రోజుల్లో వారికి, ఉదాత్తమనస్తత్వంగల, ప్రజాబంధు సంపాదకులు యస్.జి.ఆచార్య గారు స్నేహితునిగా పరిచయం అయ్యారు. ఒకటి, రెండు మాసాల వరకు నార్లవారిని ఆచార్య తన అతిథిగా అట్టి పెట్టుకున్నారు. చివరి రోజుల్లో నార్లవారు అనారోగ్యానికి గురి అయినప్పుడుకూడా, ఆచార్య ఆయనకు అతిశ్రద్ధతో సేవలు చేస్తూ ఉండేవారు.

ఆచార్య గారి వద్ద అతిథిగా ఉన్న రోజుల్లో, నార్ల తన ట్రాం ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతూ ఉండేవారు. ఉచితంగా తిని, నిర్వ్యాపారంగా కాలక్షేపం చేసే బదులు, ఏదైనా ఉద్యోగం సంపాదించుకుందామని నార్లవారు ఒక రోజున నడక ప్రారంభించారు. కొంతదూరం నడిచాక ఆయన యదాలాపంగా జేబులో చేయిపెట్టుకోగానే, అందులో నాలుగణాల కాసు ఉంది. ఆయనకు ఆశ్చర్యం వేసింది. మరుచటి రోజు కూడా మరొక పావలా బిళ్ల జేబులో కనిపించింది. మూడోరోజు కూడా అట్లాగే జరిగింది. ఆచార్యగారే ప్రతిరోజూ పావలాకాసు తన జేబులో ఉంచుతున్నారని నార్లవారికి అర్థమైంది. తనచేతికి ఇస్తే, కించపడతానని, ఆచార్యగారు గుప్తంగా అందజేస్తున్నారని నార్లవారికి అర్థమైంది. అట్లాంటి ఉన్నత భావాలుగల, ఉత్తమ సంపాదకులైన యస్.జి.ఆచార్యగారు జ్ఞప్తికి వచ్చినప్పుడల్లా, నార్లహృదయం ప్రేమతో, కృతజ్ఞతతో నిండిపోయేది.

<u>శ్రీ కొడవటి గంటి కుటుంబరావుగారి నివాళినుంచి :</u>

తెలుగు భాషా శైలిలో వినూత్న మార్పుల్ని తెచ్చి, నార్లవారు పత్రికారచనలో నూతన వరవడికి శ్రీ కారం చుట్టారు. విద్యావంతులైన తెలుగు పాఠకలోకం నిత్యం మాట్లాడుకొనే వ్యావహారిక భాషను ప్రక్రియగా ఎన్నుకొని నార్లవారు పత్రికా వ్యాసంగాన్ని కొనసాగించారు. అందరికీ సులభంగా అర్థమయ్యే శైలిలో వార్తా ప్రచురణను నిర్వహిస్తూ, కొత్త పుంతలు తొక్కారు. ఏ చిన్నవార్తను చదివినా, దానిపై నార్లప్రభావం స్పష్టంగా కనిపించేది. వార్తలను ప్రచురించడంతోనే సరిపెట్టుకోకుండా, వాటిని తన ఆకాంక్షలకు అనువుగా మలిచేవారు. వార్తలను అందించడంలో, ఒక కొత్తబాణీలో, తనదైన ముద్రతో ప్రచురించేవారు. అప్పటివరకు తెలుగు పత్రికా రచనలో కానరాని సరికొత్తపద్ధతిని నార్ల ప్రవేశపెట్టారు. పత్రికా లోకంలో విప్లవ జ్వాలను జ్వలింప చేశారు. పత్రికా నిర్వహణలో జాతీయవాదాన్ని రేకెత్తించి, పాఠకులలో స్వాతంత్రేచ్ఛను కలిగించడం అప్పటికి చాలా పత్రికలు కొనసాగించినప్పటికీ, నార్లవారు నిత్యవ్యవహారాల్లో ఉపయోగించే ప్రజల భాషలోనే తన పాఠకులతో ముఖాముఖిగా మాట్లాడుతున్నట్లు పత్రికా వ్యాసంగాన్ని కొనసాగించారు.సాంఘిక రాజకీయ పరిజ్ఞానాన్ని పత్రిక

ద్వారా ప్రజలకు అందిస్తూ, కలాన్ని సాధనంగా చేసుకొని రాజకీయవేత్త నిర్వహించే పాత్రను, రచయితగా నార్ల నిర్వర్తించారు. తెలుగులో సామాన్య పాఠకునికి అతి సన్నిహితంగా గణుతికెక్కిన తొలి రాజకీయ రచయిత శ్రీ నార్ల.

శ్రీ కె.ఆర్.శేషగిరిరావు యం.ఎ.గారి నుంచి :

ఒక సంపాదకుడిగా నార్లవారి విజయాలను గుర్తుకు తెచ్చుకునేప్పుడు, ప్రజాహిత కార్యక్రమాల నిమిత్తం సేకరించిన సహాయనిధి కార్యక్రమాలను గురించి ఆయన చేసి కృషిని తప్పకుండా చెప్పవలసి ఉంది. 1945-55 సంవత్సరాల మధ్య కాలంలో, ఒక దశాబ్దంపాటు ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రజల సహాయార్థం నార్లవారు రమారమి పదిలక్షల రూపాయల వరకు పోగు చేశారు. ఆయన సేకరించిన సహాయనిధులలో "సర్కారు జిల్లాల తుఫాను సహాయనిధి" "రాయలసీమ కరువు సహాయ నిధి", "గోదావరీ వరదబాధితుల సహాయనిధి" ముఖ్యమైనది. ఈ మూడు నిధులలో రెండింటిని మద్రాసు రామకృష్ణా మిషన్ వారు స్వీకరించి, తమ ఆచార్యుల ద్వారా అందులోని ప్రతిరూపాయకి పూర్తి ఫలితం చేకూరేలా వ్యయం చేసారు. నార్లవారు సేకరించిన వాటిలో బంగ్లాదేశ్ నిధి చివరిది.

శ్రీ యస్.జి.ఆచార్య

మద్రాసుకు చెందిన శ్రీ యస్.జి.ఆచార్య ప్రజా బంధు వార పత్రికకూ, చిత్రగుప్త పక్ష పత్రికకూ వ్యవస్థాపక సంపాదకులు! సమర్థత, దక్షత మూర్తీభవించిన ఆయన సతీమణి శ్రీమతి అన్నపూర్ణ 'చిత్రాంగి' అనే మాసపత్రికకు సంపాదకత్వం వహిస్తూ ఉండేవారు. ఆకస్మికంగా ఆచార్యగారు మరణించిన తరవాత నెల్లూరు నుంచి వెలువడే 'జమీన్ రైతు' పత్రికలో చేరవలసిందిగా ఆమెను శ్రీ యన్.వి.రామానాయుడు గారు ఆహ్వానించారు. తెలుగు పత్రికా వ్యాసంగంలో ఆచార్యగారు అనేక కొత్త శీర్షికలను ప్రవేశపెట్టారు. రాజకీయనాయకులను, సంఘ సేవకులను, వారి కార్యకలాపాలను విశ్లేషణ చేస్తూ, వారి పై విమర్శలు చేయడంలో ఆయన సర్వ స్వతంత్రుడిగా వ్యవహరించేవారు. 1937లో ఒకే ఒక తెలుగు దినపత్రికగా ప్రచురింపబడుతున్న ఆంధ్రపత్రిక సంపాదక వర్గంలో చేరవలసిందిగా పదే పదే నాగేశ్వరరావుగారు కోరినప్పటికీ ఆచార్య అందుకంగీకరించలేదు. తరవాత వెలువడిన రెండవ తెలుగు దినపత్రిక ఆంధ్రప్రభలో ఆయనను చేర్చుకోవాలని శ్రీ రామనాధగోయెంకా ప్రయత్నించినప్పటికీ, ఆయన స్వతంత్రుడిగానే ఉండిపోవాలని నిశ్చయించుకున్నారు. ఆచార్యగారు దేశ స్వాతంత్ర్యపోరాటంలో జైలుకు వెళ్లిన స్వాతంత్ర్య సమరయోధులు. గాంధేయమార్గంలో ఆయనకు విశ్వాసం ఉన్నప్పటికీ, సుభాష్ చంద్రబోసు గారి రాజకీయ విధానాన్ని బలపరుస్తూ ఉండేవారు. ఆయన దృఢమైన సోషలిస్టు అయినప్పటికీ, రైతు, కూలీల అభివృద్ధికోసం నేను సాగించిన అన్ని పోరాటాలలో నాకు మద్దతునిస్తూ వచ్చారు. ఎందరో యువరచయితలకు ప్రోత్సాహాన్నిస్తూ, నార్లవంటి ప్రముఖజర్నలిస్టును, రచయితను ఆచార్యగారు మనకందించారు.

శ్రీ నాథ్‌పాయ్

శ్రీ నాథ్ పాయ్ సముద్ర తీరప్రాంతంలో ఒకటైన గోవా విహార కేంద్రం నుంచి మల్లెల వాసనలాగా మన పార్లమెంటులోకి దూసుకొచ్చారు. సోషలిస్టు నాయకులైన లోహియా గారి నాయకత్వంలో గోవా విమోచనోద్యమం కొనసాగుతున్న రోజుల్లో ఆయన మన పార్లమెంటుకు ఎన్నికైనారు. ఆయన పార్లమెంటులోని అన్ని పార్టీల సభ్యుల హృదయాలను మధురమైన తన కంఠధ్వనితోను, మెత్తని మాటలతోను, తేనె పూసిన కత్తిలాంటి విమర్శలతోను ఆకట్టుకున్నారు. ఆయన ఆంగ్ల భాషా పద ప్రయోగంలో అనుభవం గడించిన మాష్టరు, మాటలను తమాషా తమాషా చిత్రాలుగా మనకు చూపించగలిగే నేర్పరి. స్పీకర్ శ్రీ సర్దార్ హుకుంసింగ్ గారి చుట్టూ తిరుగుతూ తన సహేతుకమైన ధోరణితో ఆయన అభిమానాన్ని పొందుతూ ఉండేవారు. ఏ ఇతర పార్లమెంటు సభ్యుడు కూడా ఆయన పొందిన ఉల్కాపాతం లాంటి ఆకర్షణను సభనుంచి పొందిఉండలేదు. ఏదైనా ఒక విషయాన్ని ముందు కొద్దిగా అంగీకరింపజేసి, ఆ తరువాత దానికి పూర్తి ప్రవేశాన్ని సాధించి కొంత సమయం గడిచిన తరవాత దానినే ఓ ఆయుధంగా ఉపయోగించి, దానితోనే అధికారపక్షం యొక్క గర్వాన్ని ఎదుర్కొనే ఆయన సాధు పలువతత్వాన్ని చూసినప్పుడు మాత్రం అధికార పక్ష సభ్యులంతా ఆయనను ఓ నేరస్తునిగా చూస్తుండేవారు.

లోహియాగారి మొరటు పద్ధతుల్లో కలసి రాలేక కెనుకకు జరిగిన ప్రతిపక్షాలను అనేకసార్లు నాథ్ పాయ్ తన మృదువైన ధోరణితో అంగీకరింపజేయగలిగారు. లోహియాగారు బాగా శ్రమ చేసి ప్రవేశపెట్టిన అనేక అంశాలను తగినంత ఓర్పులేని యం.పి.లు వినలేక నిర్లిప్తంగా ఉన్నప్పుడు నాథ్ పాయ్‌గారు ముందుకు వచ్చి వారిని సుముఖులుగా చేసుకున్న సందర్భాలున్నాయి.

ఆయన అకాల మరణం పాలైన తరవాత అందరూ ఆయన గొప్పదనాన్ని గుర్తించగలిగారు. లోహియా సోషలిస్టు మార్గ అనుయాయి అయినా ఆయన ప్రస్తుతమున్న న్యాయశాస్త్ర పరమైన చిక్కులను అధిగమించి మరొక రాజ్యాంగ సభను ఏర్పాటు చేయడం అంత సులువుకాదు అని గ్రహించారు. గోరఖ్‌నాథ్ కేసుద్వారా సుప్రీం కోర్టు పార్లమెంటును రాజ్యాంగంలో మార్పులు చేయడానికి వీలు లేకుండా నిరోధించిన తరవాత సోషలిస్టు సమాజ స్థాపనకు ఏర్పడిన అడ్డంకులను తొలగించుకోవాలని ఆయన అభిప్రాయ పడ్డారు. రాజ్యాంగాన్ని సవరించేహక్కు పార్లమెంటుకు ఉందనే ఆయన వాదనమీద దాదాపు రెండు సంవత్సరాల పాటు పార్లమెంటు చర్చ జరుపుతూనే వచ్చింది. ప్రాథమిక హక్కులను ఎటువంటి సందర్భంలోనూ మార్చడానికి వీలులేదని నేను పట్టుబట్టాను. రాజ్యాంగ మౌలిక సూత్రాలను ఏ రకంగా మార్పు చేయకుండానే ప్రస్తుతమున్న పరిస్థితుల్లో పార్లమెంటరీ మెజారిటీ ద్వారా ప్రజాస్వామ్య సోషలిస్టులు కోరుకునే విధంగా అభివృద్ధిని సాధించవచ్చునని మేము అనుకున్నాం. ఈ విషయంపై పార్లమెంటులో

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-8


జరుగుతున్న చర్చలు దానిపై నిర్ణయం తీసుకోవడానికి కావలసినంత మెజారిటీ శ్రీమతి ఇందిరాగాంధీకి పార్లమెంటులో లేనందువల్ల 1971 సంవత్సరం వరకు అని అలాగే కొనసాగుతూనే వచ్చాయి. 1970-71 సంవత్సరంలో జరిగిన సాధారణ ఎన్నికలలో ప్రజలు ఆమె ఇచ్చిన "గరీబీ హఠావో" నినాదం వైపు ఆకర్షితులై దీర్ఘ కాలంగా తాము ఎదురు చూస్తున్న సంకల్పాన్ని సాధించేందుకు, రాజ్యాంగంలో ఉన్న ఆటంకాలను తొలగించేందుకు కావలసిన మెజారిటీని ఆమెకు సిద్ధింపచేశారు. రాజ్యాంగ సవరణకు కావలసిన పూర్తి మెజారిటీని ఆమె సంపాదించుకొని నాథ్ పాయ్‌గారి ఆలోచనలను పార్లమెంటు చేత ఆమోదింపజేయగలిగారు. స్వాతంత్ర్యానంతరం ఏ పార్లమెంటు సభ్యులు పొందనంతటి ఈ ఉన్నత గౌరవాన్ని ఆ రీతిగా నాథ్ పాయ్‌గారు పొందగలిగారు.

రాజ్యాంగం పదిహేడవ సవరణకు గాను ఆయన పార్టీ పూర్తిగా జవహర్లాల్ నెహ్రూగారిని సమర్థిస్తున్నప్పుడు, స్వయం వృత్తితో జీవించే రైతుల హక్కులను కాపాడడానికి నేను దానిని వ్యతిరేకిస్తూ తీవ్రంగా పోరాడుతున్నప్పుడు, ఒక సిద్ధాంతం కోసం దీర్ఘకాలంగా పోరాడుతున్న నన్ను ఆయన అభినందించడాన్ని నేను ఎప్పటికీ మరచిపోలేను. సెలక్టు కమిటీ ముందు ఆ సవరణ పరిశీలన కొచ్చినప్పుడు సీలింగు పరిమితులకు దిగువగా ఉన్న అందరు రైతుల రక్షణకు తగు జాగ్రత్తలను ఆ సమయంలో వారు తీసుకున్నారు. కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో కమ్యూనిస్టు పార్టీలు చేసినట్లుగా భవిష్యత్తులో ఎప్పుడైనా పార్లమెంటుగానీ, శాసన సభలుగానీ రైతాంగ వ్యతిరేక ధోరణి నవలంబించి ఈ సీలింగును ఇంకా కుదింప జేయవచ్చునన్న నా వాదనలో ఉన్న బలాన్ని ఆయన, ఆయన సోషలిస్టు మిత్రులు గుర్తించారు. అయితే ఆయన సీలింగు స్థాయిలో మార్పు చేయడానికి అంగీకరించలేదు.

పౌర హక్కులకు సంబంధించిన అంశాల్లో హృదయ పూర్వకంగా మేమిద్దరం ఒకరితో ఒకరం కలిసి పని చేశాము. రాష్ట్రంలో మంత్రులు తమకు లభించిన అధికారం ద్వారా చేస్తున్న ఒత్తిడులను తెలివి తక్కువ పనులను వివరించడానికి శ్రీ నాథ్ పాయ్‌గారు శ్రీ కామత్‌గారు ఎంతో గొప్పగా రాష్ట్రపతిని కరగించే విధంగా ప్రసంగిస్తూ ప్రభుత్వాన్ని కదలించడానికి ప్రయత్నించారు. నేను అప్పటి దేశీయాంగ శాఖ మంత్రి శ్రీ చవాన్ చాలా మంచి మనిషే కానీ అతిచెడ్డ హోమంత్రి అని ఆరోపణ చేసినప్పుడు పార్లమెంటు మనస్సాక్షిని బైటపెట్టారని ఈ ఇద్దరు సభ్యులూ నన్ను ప్రశంసించారు. ఆ పద్ధతిలో నాథ్ పాయ్‌గారూ, నేనూ, పార్లమెంటులో ముఖ్యమైన విషయాలపై కొన్ని సందర్భాలలో అంగీకారంతోనూ, మరి కొన్ని సందర్భాలలో అసంగీకారంతోనూ ఒకరిపై మరొకరు మంచిగౌరవంతో మెలుగుతూ వుండే వాళ్లం. ఆయన అభిమతాలకు అనుగుణంగా ప్రజలతీరు స్పష్టంగా వచ్చిన తర్వాత నేను ఆ విధానం ఆమోదం పొందేందుకు త్వరపెట్టడం ద్వారా ప్రజల అభిమతాలకు అనుగుణంగా ఆయన ఆత్మశాంతికై నా వివేకం ప్రదర్శించాను.

పార్లమెంటు ప్రతి సందర్భంలోనూ ఇంతటి ప్రజామోదాన్ని పొందటం సాధ్యంకాదు. ఆయన మొట్టమొదటిసారిగా గుండె పోటుకు గురైనప్పుడు ఎక్కువ శ్రమ చేయవద్దని

ఆయనను నేను హెచ్చరించాను. స్వాభావికంగా ఆయనది విరామ మెరుగక పోరాడే మనస్తత్వం. ఆయన బతుకు దీపం రెండు పక్కలా వెలుగుతూ ఒకవైపు పార్లమెంటులోనూ మరొకవైపు సోషలిస్టు పార్టీలోనూ మండిపోయి ఆయనకు అకాల మరణం సంభవించింది. ఆయన బిల్లు యొక్క విజయాన్ని ఆయన చూసుకునే అదృష్టం కూడా లేకుండా ఆయన మనలను వదలిపెట్టి వెళ్లిపోయారు.


14606
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6.

2వ భాగము



అన్నమయ్య 14606 అధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6
920

శ్రీ నేతాజీ సుభాష్ చంద్రబోస్

బెంగాల్ జాతీయుడు, కలకత్తాకు చెందిన శ్రీసుబాష్ చంద్రబోసు కటక్‌లో 23-1-1897 న జన్మించారు. 1913లో కలకత్తా కళాశాలలో ప్రవేశించారు. పిన్నవయస్సులోనే తాత్వికచింతనతో, హిమాలయా పర్వతాలలో అన్వేషించి, కొన్నాళ్లకు తిరిగి స్వస్థలంచేరి, విద్యాభ్యాసం కొనసాగించి, 1919లో డిగ్రీ తీసుకున్నారు, ఐ.సి.యస్‌కు ఎంపిక అయినారు. కేంబ్రిడ్జినుంచి డిగ్రీ సంపాదించారు. ఐ.సి.యస్‌కు రాజీనామా ఇచ్చారు. శ్రీసి. ఆర్.దాసుద్వారా కాంగ్రెస్‌లో ప్రవేశించారు, శ్రీసి.ఆర్. దాసు మేయరుగా పదవిలో ఉన్నప్పుడు, శ్రీబోసు కలకత్తా కార్పోరేషన్ కమీషనరుగా నియమితులైనారు. స్వాతంత్ర్యపోరాట కాలంలో బందీగా అనేకసార్లు జైలుకు వెళ్లారు. కాంగ్రెసువాదుల కోసం స్థాపించిన కలకత్తా నేషనల్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. వరదసహాయకచర్యలను చేపట్టారు. 1927 లో డాక్టర్ అన్సారీగారు అధ్యక్షులుగా ఉన్నప్పుడు, అఖిలభారత కాంగ్రెసు ప్రధానకార్యదర్శిగా ఎన్నికైనారు. కలకత్తా, కరాచీ కాంగ్రెసు మహాసభలలో దేశ స్వాతంత్ర్యంకోసం వాదించారు. ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెసుకు అధ్యక్షులయ్యారు. హరిపురాలో 1938 లోనూ త్రిపురలో 1939లోనూ రెండుసార్లు జాతీయ కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. కాంగ్రెసు అధ్యక్ష పదవికి రాజీనామాచేసి, కాంగ్రెసు నుంచి వైదొలగి, ఫార్వర్డ్‌బ్లాకును స్థాపించారు. రంగాగారుకూడా సభ్యులుగా ఉన్న వామపక్ష ఐక్యసంఘటనకు చైర్మన్‌గా ఉన్నారు. 1941లో నిర్బంధంలోనుండి తప్పించుకొని, ఆఫ్గనిస్తాన్‌కు, అక్కడినుంచి జర్మనీకి, యుద్ధసమయంలో జర్మనీ నుంచి సింగపూర్‌కు వెళ్లి ఇండియన్ నేషనల్ ఆర్మీని స్థాపించి నేతాజీగా కీర్తించబడ్డారు. ఐ.యన్.ఎ.ను మణిపూర్ వరకు ముందుకు నడిపించారు. 1945 లో జపాన్,దాని మిత్ర రాజ్యాలు ఓటమి పాలైన తరువాత, సింగపూర్ నుండి విమానంలో వెళ్లి కనిపించకుండకూడ పోయారు 'చలో ఢిల్లీ'నినాదాన్ని,'జైహింద్' అనే అభివాద పదాన్ని మనకు అందించారు. -(ఎడిటర్)

నేతాజీ భారత స్వాతంత్ర్యసమర యోధులు. నక్షత్ర మండలంలో దివ్య కాంతులీనే ధ్రువనక్షత్రం వంటివారు. కొవ్వొత్తిలా ఆయన తన్నుతాను దహించి వేసుకున్నారు. నివురుగప్పిన ఆ నిప్పుకణాలనన్నిటినీ, ఆయన మిత్రులు ఒక చోటికి చేర్చక ముందే, ఆయన చిరకాల స్వప్నమైన, జీవిత లక్ష్యంగా ఉన్న దేశ స్వాతంత్ర్యం సిద్ధించింది. ఆకాశంలోకి తారాజువ్వలా దూసుకుపోయి, నిరాశతో కన్నీటి మక్కరాలి పోయినట్లు, స్వరాజ్యసాధనకోసం దగ్గరి దారులు వెతుక్కుంటూ కోట్లాది భారతీయులగుండెల్లో స్వాతంత్ర్యకాంక్షఅనే మంటలు రగిల్చి, భారతమాత పాదాలచెంత చేరిన వేలాది మంది మృతవీరుల సరసనచేరారు.

కవి బంకించంద్రుని ఉద్వేగభరితమైన కవితా స్వప్నం వందేమాతరం గీతం నేతాజీలో తన ఉచ్చస్థితిని చూపెట్టింది. బాంబులతో, కత్తులతో ముందుకు దుముకుతూ, సముద్రాల మధ్య జలాంతర్గాములద్వారా పయనిస్తూ, దేశ స్వాతంత్ర్యసాధనలో పరస్పరంపోటీపడుతూ,

బెంగాల్ విప్లవకారులు, సుభాష్‌చంద్రబోసు 'నేతాజీ' అయిన తర్వాత, తమ శౌర్యసాహసాలను ఆయనలో చూసుకున్నారు. ఒక కవి కన్నకల, మాతృభూమిపై తీరని దేశభక్తుల మమతాపాశం, జాతి స్వాతంత్ర్యంకోసం ఎంతోకాలంగా తీరని కోరికతో ఎదురుచూస్తున్న ప్రజ, అగ్నిపర్వతాల్లా మండుతున్న దేశభక్తులు,చిచ్చరపిడుగులై సామ్రాజ్యవాద శృంఖలాలను ఒక వైపు పటాపంచలు చేస్తూ ఉంటే, తమకు తామే నిర్దేశించుకున్న గాంధేయ అహింసావాదం మరోవైపు దేశం నలుమూలలా జాతీయ వాదాన్ని నాటుతూ ఉండగా- విదేశీ భూభాగం మీద "భారత జాతీయ సైన్య" స్థాపన జరిపిన సుభాష్ చంద్రబోసును 'నేతాజీ' గా ప్రపంచ ప్రజ జేజేలు పలికింది. బ్రిటిష్ సామ్రాజ్య వాద సంకెళ్లు బ్రద్దలుకొట్టి, బ్రిటిష్ సింహాసనాన్ని కట్టించి విప్లవకిశోరాలుతమకు తామే స్వతంత్రను ప్రకటించుకున్నాయి. భరతమాత స్వాతంత్ర్యసాధనకు స్వీయసంకల్పంతో వారు ముందుకురికారు.

డెవన్‌సిరీలోని ఇల్‌ఫ్రా కోంబాలో జరిగిన సాంవత్సరిక వార్షికోత్సవంలో పాల్గొనే నాటికి, సుభాష్‌బాబు నాకంటే నాలుగు సంవత్సరాలు సీనియరు. మొదటి భారత క్యాబినెట్ సభ్యులు కాగలిగిన ఆయన సోదరులైన శరత్ చంద్రబోసు గారికి, విదేశీరాయబారిగా బాధ్యతలు నిర్వహించి, కేంద్ర ప్రభుత్వ సీనియర్ కార్యదర్శిగా రిటైర్ అయిన శ్రీ.సి.సి. దేశాయ్‌గార్లకు అప్పట్లో కేంబ్రిడ్జి లో సుభాష్‌బాబు జూనియర్ విద్యార్థిగా విద్యాభ్యాసం చేస్తూ ఉండేవారు. శ్రీ కె.పి.యస్ మీనన్ గొప్ప వక్త, కాగా సుభాష్ బాబు మూర్తీభవించిన దేశ భక్తి పరులుగా ఉండేవారు. వీరిద్దరూ కేంబ్రిడ్జిలో 'ఇండియన్ సివిల్ సర్వీసు' పట్టా స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నారు. "సెక్రటరీ ఆఫ్ స్టేట్ సంపాసంఘంలో" ఉన్న భారతీయ సభ్యునితో ఒక అంశపై నేను ఉద్రేక పూరితంగా వాదించిన వుడు, సుభాష్ బాబు నావాదనవిని ఎంతగానో సంతోషించారు.

సుభాష్ బాబు సివిల్ సర్వీసులో చేరిన వెంటనే, అప్పట్లో జరుగుతున్న సహాయ నిరాకరణ ఉద్యమ సందర్భంలో, భారత దేశమంతటా లక్షాలాది ప్రజలు దేశభక్తి తో వందేమాతరం గీతాలను పాడడం ఆయన ఆలకించాడు. చదువుకొనే రోజుల్లో ఒకసారి సుభాష్‌బాబు వై రాగ్యంలో చదువును వదలి వేసి హిమలయాల్లో పర్యటించాడు. ఆత్మసాక్షాత్కారం కోసం విద్యాభ్యాసాన్ని తృణప్రాయంగా త్యజించిన విధంగానే, ఈ నాడు దేశమాత దాస్యశృంఖలాలను తెగగొట్టేందుకు ఆయన ఐ.సి.యస్ పట్టాను సైతం విసర్జించి, దేశభక్తి మూర్తీభవించిన యువకులతో స్వాతంత్ర సమరంలోకి దూకాడు. తన ఉపన్యాసాలతో యువకులను ఉత్తేజపరిచి, కార్యోన్ముఖులనుచేయించగల జాతీయ నాయకులైన శ్రీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలో, జాతీయవాదిగా, గాంధేయవధంలో ముందుకునడిచేందుకు నడుంకట్టారు. దేశభక్తికి మారుపేరైన బెంగాలీప్రజలంతా బోసుబాబు రాజకీయ ప్రవేశానికి ఆనందించి, ఆయన పై కొత్త ఆశల్ని పెంచుకున్నారు. కలకత్తా కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతల్ని స్వీకరించవలసిందిగా, దానికి చైర్మన్ గా ఉన్న చిత్తరంజన్ దాస్ ఆహ్వానాన్ని, బోసుబాబు వినమ్రతతో స్వీకరించాడు. సివిల్ సర్వీసులో బాగా జూనియర్‌గా ఉన్న బోసు బాబు, తన బాధ్యతలను సమర్థత, దక్షతతో నిర్వర్తించగల స్థాయిలో, పరిపాలనా వ్యవహారాలను చక్కదిద్ది, అనతికాలంలోనే సీనియర్ స్థానాన్ని అందుకో గలిగారు. సుభాష్‌చంద్రబోసు లోని ఉత్తర్తవ్య

పరాయణతను గమనించి, శ్రీ చిత్తరంజన్ దాస్ ముగ్ధుడయ్యాడు. తన అనుచరునిగా సుభాష్‌చంద్రబోసును తీర్చిదిద్ది జాతీయనాయకునిగా మలచి, ఒక్కమారుగా ఆయనకు జాతీయరంగంలో ఉన్నతస్థానాన్ని సంతరించిపెట్టారు, సహృదయత, సుందాతనంగల చిత్తరంజన్ ఒక యువకిశోరాన్ని దేశానికి అందించారు,

ఆనాటి నుండి జాతీయ ఉద్యమంలో కృషి చేస్తున్న యువకుల మధ్య, సుభాష్ చంద్రబోసు అభిమాన వర్గంగానూ, గాంధీజీ ఆదరణ ఉన్న జవహర్లాల్ నెహ్రూ అభిమానవర్గంగానూ విభేదాలు పొడచూపసాగాయి.

ఇరవై సంవత్సరాల పూర్తికాలం జాతీయరంగంలో యువ లోకానికి నాయకత్వం వహిస్తున్న వీరిద్దరూ కూడా విప్లవాత్మక భావాలు కల వారే! వీరు ఒక్కొక్కప్పుడు సామరస్యభావంతోనూ ఎక్కువగా భిన్న భిన్న కోణాల్లో స్వాతంత్ర్యసమరంలో పాల్గొంటూవచ్చారు. తన తండ్రి మోతిలాల్‌గారి సరళరాజకీయ ధోరణిని అలవర్చుకొని, జవహర్లాల్ తన సహజగుణమైన ఓర్పులేని మన స్తత్వంతో , అహింసాయుతంగా, గాంధేయ మార్గంలో కలిసి పెనవేసుకొని పయనించారు. సుభాష్‌చంద్రబోసు ఎప్పుడూ కూడా, గాంధేయసిద్ధాంతంతో తన వైఖరిని ముడివేసుకోలేదు, ఆయన భౌతికంగా, మానసికంగా బెంగాలీలకు సహజగుణమైన ఉద్రేక స్వభావాన్ని కలిగి, బెంగాలీల ఆరాధ్యదేవత పవిత్ర కాళీమాత వరప్రసాదంగా భరత మాతకు అందించిన ఆయుధంగా సుభాష్‌చంద్రబోసు రాజకీయజీవితం సార్థకత పొందింది. సుభాష్‌చంద్రబోసు గారి దురదృష్టమూ అన్నట్లు, చిత్తరంజన్ దాస్‌గారు చాలా ముందుగానే మరణించారు. దీనితో మహాత్మాగాంధీ బెంగాల్ రాష్ట్ర రాజకీయాలపై కూడా ఆధిపత్యాన్ని సంపాదించి, బోసుగారికి వ్యతిరేకులైన శ్రీ సేన్‌గుప్తా చేతుల్లో బెంగాల్ రాష్ట్ర కాంగ్రెసు కమిటీని పెట్టారు.

నేను కరాచీ కాంగ్రెసు సభల్లో తిరిగి సుభాష్‌బాబును కలుసుకున్నాను. అక్కడ మేము చాలా విషయాలు మాట్లాడు కున్నాం. గాంధీ- ఇర్విన్ ఒప్పందాన్ని అమలు చేయాలని నేను అన్నాను. సంపూర్ణ స్వాతంత్ర్యానికి తప్ప ఇతరత్రా దేశానికి రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ లో రాజీపడడానికి ఆయన అంగీకరించలేదు, దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత శ్రమజీవులందరికీ సమాన ప్రాధమిక హక్కుల్నీ, రైతులకూ, రైతుకూలీలకూ గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించాలని నేను రూపొందించిన పథకంతో ఆయన ఏకీభవించారు, మేం ఉభయులం సోషలిజాన్ని మనపారా అంగీకరించాం. రైతాంగ రక్షణకు గిల్డ్‌సోషలిజాన్ని అన్వయింప జేయాలని నేను సూచించ గా, దాన్ని పరిశీలించగలనని ఆయన వాగ్దానం చేశారు. కరాచీ సభల్లో బెంగాల్, అస్సాం, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలనుండి వచ్చిన, దేశభక్తులైన ప్రతినిధులందరూ, మా చర్చల పట్ల, సుభాష్‌చంద్రబోసుగారి ప్రతిపాదనల పట్ల సంతృప్తిని వ్యక్తంచేశారు.

'సంపూర్ణ స్వాతంత్ర్యం' కోసం సుభాష్‌చంద్రబోసు ప్రతి పాదించిన తీర్మానం విషయంలో చివరిక్షణాల్లో నెహ్రూగారు పక్కకు తప్పుకున్నప్పటికీ, కలకత్తా కాంగ్రెసు సభల్లో బోసుబాబు తీర్మానికి గొప్ప మెజారిటీ లభించింది.కానీ 1931లో జరిగిన కరాచీ కాంగ్రెసు సభల్లో గాంధీజీప్రభావం బాగా విస్తరించిన కారణంగా, 1930-31 లో గాంధీజీ ప్రారంభించిన

ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొన్న లక్షలాది మంది దేశభక్తుల ఆత్మనిగ్రహం కారణంగానూ స్వల్పమైన మెజారిటీని మాత్రమే సాధించగలిగింది.

బోసువర్గం విడి పోయి ప్రత్యేకంగా ఉండ సాగిన తరువాత, బ్రిటిష్ ప్రభుత్వం తిరిగి బోసుబాబును నిర్బంధించి, ఆ తరువాత దేశ బహిష్కరణ చేయించింది. ఆసమయంలో ఆయన ఎక్కువకాలం యూరపు ఖండంలో సంవత్సరాల తరబడి కాలం గడుపుతూ, ఎక్కువకాలాన్ని వియన్నాలోగడిపారు. దేశ బహిష్కృతుడై, విదేశాల్లో ఉండకతప్పని ఆరోజుల్లో ఆయన యూరపు దేశాలలోని వర్ధమానరాజకీయ నాయకులతో సంబంధాలు పెట్టుకొని, మాతృదేశ స్వాతంత్ర్య సాధనకు మార్గాలను అన్వేషిస్తూ, అవిశ్రాంతంగా కృషిచేస్తూవచ్చారు. బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు ప్రతిద్వందులుగాఉండి సామ్రాజ్యవాదుల గుండెల్లో గుబులు పుట్టిస్తున్న నియంతలైన హిట్లర్, ముస్సోలినీ గార్లను కలసి, భారత దేశ స్వాతంత్ర్య పోరాటానికి సహాయ పడవలసిందిగా కోరి, వారిని ఒప్పించారు, భారత దేశ స్వాతంత్ర్య సాధనకు, సాయుధపోరాటమే మార్గంగా ఎంచుకొని, దేశదేశాల్లో ప్రచారంచేసి , మాతృదేశ దాస్యవిమోచన పోరాటాన్ని ప్రపంచం దృష్టికి తీసుకెళ్లారు. ఆప్పట్లో భారత దేశంలో ఎక్కువ రాష్ట్రాల్లో కాంగ్రెసు మంత్రివర్గాలు ఏర్పడి , పరిపాలన నిర్వహిస్తూ, దేశానికి స్వాతంత్ర్యంలభిస్తే, తరవాత ఏర్పడే జాతీయ ప్రభుత్వంలో ప్రజల సమస్యలు, ఇబ్బందులు తీరగలవని ఆచరణలో రుజువుచేసి నిరూపిస్తున్నాయి. జాతీయ సమరపోరాటాన్ని గురించి బోసుబాబు రచించిన గ్రంధంలో, స్వాతంత్ర్య సముపార్జనకు గాంధేయమార్గాలను గానీ, వేటినైన వినియోగించుకోవచ్చునని తన అభిప్రాయంగా ఆయన మరొకసారి వ్యక్తపరిచారు.

ఆక్సఫర్డుయూనివర్సిటీలో నాకు సహచరవిద్యార్థిగా ఉన్న శ్రీ వి.యస్.కృష్ణా ఆసమయంలో వియాన్న లో డాక్టరేట్ కోసం పరిశోధన చేస్తూన్నారు. వి.యస్ కృష్ణా గారికి రాజకీయాల పట్ల ఆసక్తి ఉండేదికాదు, గానీ అక్కడే నివసిస్తున్న సుభాష్‌చంద్రబోసు గారితో నేను సంబంధాలను కలిగి ఉండేందుకు ఆయన సహాయపడుతూవచ్చారు. కిసాన్ ఉద్యమాన్ని గురించి నేను రాసిన వ్యాసాలను బోసుబాబు చదివి, కిసాన్ఉద్యమంపట్ల శ్రద్ధాసక్తులు కనపరిచేవారు. వంద సంవత్సరాల క్రితం రైతుల నుండి శిస్తు వసూలు చేసేందుకు కారన్‌వాలీస్ జమీందార్లతో ఏర్పాటు చేసుకొన్న 'శాశ్వత శిస్తు పద్ధతి' ఒప్పందాన్ని, కాంగ్రెసు పార్టీవ్యతిరేకించాలని నా అధ్యక్షతన బెంగాల్ కిసాన్ కాంగ్రెసు ఆధ్వర్యాన, బెంగాల్ రైతులు ప్రదర్శనలు నిర్వహించారు. కాంగ్రెసుతోనూ, కమ్యూనిస్టుల తోనూ ప్రమేయంలేకుండా, స్వతంత్ర పంధాలో కిసాన్ ఫ్రంట్ ప్రజాభిమానాన్ని పొందిన సంఘటనలను గమనించి, సుబాష్‌చంద్రబోసు సంతృప్తిని వ్యక్తపరిచారు. ఆ సందర్భంలో ఆయన మాకు మద్దత్తు తెలియపరచి , సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో ఆయన కొనసాగిస్తున్న కృషికి మా సమర్థతను పొందారు. రాజకీయ పరంగా ఆయన నిర్ణయాలు అంత నిర్దుష్టంగా ఉంటాయి.

అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవిని జవహర్లాల్ రెండు పర్యాయములు విజయవంతంగా నిర్వహించారు. కాంగ్రెసు అధ్యక్షపదవికి సుబాష్‌చంద్రబోసును ఎంపికచేయాలని, యువతరం చేస్తున్న ప్రయత్నాలను, గాంధీజీ సన్నిహిత సహచరులలో కొందరు ఆయన చెవిన వేసారు. అంతకు క్రితం జరిపిన తన యూరపు పర్యటనలో బోసుబాబు తో చర్చలు జరిపారు.

అహింసా మార్గంపై బోసుకు ఉన్న భిన్నాభిప్రాయం పట్ల ఆ సమయంలో జవహర్ అంతగా వ్యతిరేకతను చూపలేదు. సుభాష్ చంద్రబోసు భారత దేశానికి తిరిగి వచ్చేందుకు బ్రిటిష్ ప్రభుత్వం అంగీకరించింది. త్రిపుర కాంగ్రెసు సభలకు బోసుబాబు గారు అధ్యక్షత వహించారు. ఆ సభల్లో సర్దార్ పటేల్, బోసుబాబు గారలు పరస్పరం చర్చించు కొని , అవగాహన చేసుకున్నారు. ఆ సందర్భంలో బోసుబాబు రైతాంగవేదికకు ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చారు. మా కిసాన్ యాత్రకు స్వాగతం పలికినప్పుడు సుదీర్ఘకాలం ఎక్కడో దూరమైపోయిన సోదరులిద్దరూ తిరిగి కలుసుకున్నప్పుడు పొందే అనుభూతితో మేమిద్దరం ఆలింగనంచేసుకొని అభినందించుకున్నాం. సుభాష్‌చంద్ర బోసు కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నప్పుడు సోవియట్ ప్రణాళికా విధానాన్ని, అమెరికా లోని టెన్నిసరీవ్యాలీ అథారిటీని పరిశీలించి, వాటిపట్ల ఆకర్షితులై, జాతీయ ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటుచేశారు. జవహర్లాల్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నప్పుడు, అనధికార సభ్యుడైన ఆయనను కనీసమర్యాదకుకూడా ఆహ్వానించలేదు. ఎంతో దూరదృష్టితో ప్రణాళిక లను సిద్ధపరిచి, దేశం స్వయంసమృద్ధి సాధించేందుకు ఆయన బాటలు వేసారు.

ఆరోజుల్లో కాంగ్రెసు అధ్యక్షపదవి గౌరవ ప్రతిపత్తితో నెలకొనిఉండేది. కాంగ్రెసు అధ్యక్షుని హోదా, అధికారం అసాధారణ స్థాయిలోఉండేవి. జాతీయ నాయకులు ఈ పదవిని అందుకోవడానికి ఎక్కువగా తాపత్రయపడుతూఉండేవారు. పండిట్ నెహ్రు తీవ్రకృషిద్వారా, అప్పటికి నాలుగు పర్యాయాలు ఆపదవిని అందుకున్నారు. గాంధీజీ వ్యతిరేకించినప్పటికీ, కాంగ్రెసు అధ్యక్షుడిగా బోసుబాబు తిరిగి ఎన్నికైనందున ఆయన అభిమానులు ఎంతగానో ఆనందించి,వేడుకలు జరుపుకున్నారు. తిరిగి ఆయన ఎన్నిక కావడాన్ని తాను అంగీకరించనని గాంధీజీ అన్నప్పుడు,బోసు రాజీనామా చేయడానికి సిద్ధపడగా, ఆయన అభిమానులు అంగీకరించలేదు. బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని కూకటి వ్రేళ్లతో పెళ్లగించడానికి, తాను చేపట్టిన విప్లవ కార్యక్రమాలు, విధానాలను అమలు పరిచేందుకు అత్యంత శక్తివంతమైన సాధనంగా కాంగ్రెసు అధ్యక్షపదవి ఆయనకు వినియోగపడింది. అనతికాలంలోనే రెండవ ప్రపంచయుద్ధం రానున్నదని బోసుకుతెలుసు , అట్టి సందర్భంలో కాంగ్రెసు సంస్థ సర్వ సన్నద్ధంగా ఉంది .అనివార్యంగా సంభవించనున్న ఈప్రపంచమారణహోమంలో, భారతీయ రుద్రనేత్రంతో సామ్రాజ్యవాదాన్ని భస్మీపటలం చేయాలని సుభాష్‌బాబు సంకల్పించారు. మంత్రిపదవులలో అభిలాషగల కాంగ్రెసు నాయకులూ, సోవియట్‌కు అనుకూలురైన ఫాసిస్టు వ్యతిరేక ఉద్యమంలో బోసుబాబును అపార్థంచేసుకొని, ఆయనను వక్రదృష్టితో నిందించారు. అయినప్పటికీ జాతీయవాదులను, కమ్యూనిస్టులను కూడా త్రోసివేసి, కాంగ్రెసు అగ్రనాయకులను ఆవలకు నెట్టి ,బ్రిటిష్ సామ్రాజ్యవాదులపట్ల ప్రజలలో ఏర్పడిన తీవ్ర వ్యతిరేకత కాంగ్రెసు కార్యకర్తలను స్పందింపజేయగా, త్రిపురకాంగ్రెసు సభ · సుభాస్‌చంద్రబోసును కాంగ్రెసు అధ్యక్షునిగా తిరిగి ఎన్నుకొంది. కమ్యూనిస్టులు అప్పట్లో అవకాశవాదవైఖరిని అవలంభించారు.ఈ సందర్భంలో నేనూ, నావంటి ఇతర కిసాన్ కాంగ్రెసు నాయకులైన స్వామి సహజానంద సరస్వతి, ఇందులాల్ యాగ్నిక్, బోసుగారి పార్శ్వర్డ్‌బ్లాకు, వ్యక్తిగత అనుచరులతో పాటు ఆయనకు బాసటగానిలిచాం. "భారత దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం" కోసం జరిపేపోరాటంతో

కాంగ్రెసు పాత కాపులనుండీ బాధ్యతాయుతమైన సహకారం లేకుండా, తాను కాంగ్రెసు అధ్యక్షపదవిలో కొనసాగడంవల్ల ఎలాంటి ప్రయోజనం ఉండబోదని సుభాష్‌బోసు గ్రహించారు. రెండుదశాబ్దాల క్రితం ఏ ఆశయసాధనకు బోసు ఇండియన్ సివిల్ సర్వీసును తృణప్రాయంగాఎంచి రాజీనామా చేసి బయటకు వచ్చారో, అదే ఆశయ సాధనకు తనదైన మార్గమే లక్ష్యంగా అత్యున్నతమైన కాంగ్రెసు అధ్యక్షపదవికి సైతం ఆయన రాజీనామా చేశారు. బోసు త్యాగం దేశవ్యాప్తంగా నాటి యువతరంలో సంచలనాన్ని సృష్టించింది చారిత్రాత్మక మైన ఈనిర్ణయం తీసుకున్న తరువాత ఆయన మదరాసు పర్యటన కువచ్చినపుడు, మదరాసు బీచ్‌లో లక్షలాది మంది ప్రజలు సమీకృత మై ఆయన పట్ల తమ విధేయతనూ, అభిమానాన్నీ వ్యక్తపరిచారు. ఆ సభకు అధ్యక్షత వహించే గౌరవం నాకు దక్కింది. ఆయన్నూ, ఆయనతో పాటు సామ్రాజ్యవాద వ్యతిరేక కార్యక్రమాల్లో పాల్గొంటున్న నా వంటి మరి కొందరిని కాంగ్రెసు సంస్థ నుండి బహిష్కరించాలని కాంగ్రెసు పెద్దలు ఆలోచిస్తున్న ఆసమయంలో, కోరినవెంటనే వచ్చి సభకు అధ్యక్షత వహించినందుకు , అఖిలభారత కాంగ్రెసు మాజీ అధ్యక్షులు, ప్రముఖజాతీయ నాయకులైన శ్రీనివాసఅయ్యంగార్ నన్ను మనసారా అభినందించారు. అందుకు నేను సమాధానం చెబుతూ "విజయమో వీరస్వర్గమో" అనే బోసు నినాదాన్ని ప్రతి భారతీయుడూ, ఆచరణలో పెట్టవలసిన సమయం ఆసన్నమైందనీ, బ్రిటిష్ సామ్రాజ్యవాదశక్తులతో హిమశిఖరాలంత ఉన్నతస్థాయిలో నిలిచి పోరాడుతున్న బోసుబాబుకు తమ శక్తియుక్తులన్నింటినీ అందించి కాంగ్రెసు అగ్రనాయకులను ఈవిషయంలో ధైర్యంగా ఎదిరించి, గతంలో బోసు పట్ల చేసిన పొరపాట్లు, తిరిగి జరగకుండా జాగ్రత్తపడాలి "అని అన్నాను.

సుభాష్‌బోసు ప్రతి ఒక్కరితో కలిసి మెలసి వ్యవహరించగల రాజకీయచతురులు. తన రాజకీయ కార్యక్రమాల నిర్వహణకు తగు రాజకీయ మిత్రులను సంపాదించుకునేందుకు, ఏస్థాయిలో ఉన్నవారితో నైనా, ఏమేరకైన సన్నిహితంగాచొచ్చుకొని పోయి, స్నేహ సంబంధాలను ఏర్పరచుకోగలుగుతారు. తన అనుచరులను చిన్న చిన్న బృందాలుగా తయారుచేయడంలో ఆయనకు ప్రత్యేక ప్రావీణ్యతుంది. కార్యకర్తల మధ్య అనుసంధానాన్నీ కలిగించి, ఒకరితో మరొకరిని కలుపుతూ, సందేశాన్ని అందిస్తూ, వారిచేత ఉత్సాహంగా పనిచేయించగల నేర్పరితనం ఆయనకు గుత్త సొమ్ము! తన అనుచరులకు, రాజకీయ మిత్రులకు విశ్వసనీయమైన నాయకునిగా వ్యవహరిస్తూ, అవసరమైన తన సమయాన్ని..అండదండల్ని వారికి అందించడానికి బోసుబాసు ఎంతటి కష్టాన్నైనా భరించేవారు. ఈ కారణంగా, తన అనుయాయులను, కాంగ్రెసు కార్యకర్తలను అనాలోచితంగా సమర్థించిన కారణంగానే కలకత్తాలో అగ్రనాయకులవల్ల చిక్కుల్ని ఎదుర్కోవలసివచ్చింది.

రెండు ప్రత్యేక సందర్భాలలో ఆయన నాకు అండగా నిలిచారు. జమీందార్లకు వ్యతిరేకంగా, నేను ఉద్యమాన్ని నడుపుతున్నందువల్ల, నాపై క్రమశిక్షణచర్యలు తీసుకోవాలని కొందరు ఆంధ్రా కాంగ్రెసు నాయకులు, కాంగ్రెసు కార్యవర్గంపై వత్తిడితెచ్చి, తుది నిర్ణయాన్ని గాంధీజీకి అప్పగించినప్పుడు, అప్పట్లో కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్న బోసుబాబు నాకు అనుకూలంగా గాంధీజీతో చర్చించి, ఒప్పించారు.

మరొక సందర్భం ఏమంటే అప్పటికి కాంగ్రెసు పార్టీ ఎట్టి నిర్ణయాలను తీసుకోకముందే, నేను బ్రిటిష ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి, జాతీయ పోరాట కార్యక్రమాల్లో కార్యకర్తలను సమాయత్తపరిచి కృషిచేస్తూ ఉన్నప్పుడు, గాంధీగారే స్వయంగా నన్ను అపార్థంచేసుకోగా, ఆయనలోని సందేహాన్ని నివృత్తి చేసేందుకు బోసుబాబు ముందుకువచ్చారు. ఆ సందర్భంలో బోసు నన్ను సమర్థిస్తూ, గాంధీజీతో యిలా అన్నారు,"రంగాగారు గానీ, నేను గానీ కాంగ్రెసు సంస్థనుకాదని, స్వతంత్రంగా ఎలాంటి కార్యక్రమాలనుగానీ, ఉద్యమాలనుగానీ నిర్వహించబోమనీ, అందుకు తామెటు వంటి నిర్ణయాలు తీసుకొని ఉండలేదనీ, ప్రజలను రెచ్చగొట్టి, భారతీయులను కించపరిచే బ్రిటిషువారి ఆజ్ఞలను ధిక్కరించడం రంగాగారి తప్పుకాదనీ, అందుకు బ్రిటిష ప్రభుత్వమే బాధ్యురాలనీ, రంగాగారి ధిక్కారధోరణి, సామ్రాజ్యవాద ధిక్కారమే గానీ, కాంగ్రెసు సంస్థను వ్యతిరేకించడం కాదనీ " అని బోసుఅన్నారు. ఆసమయంలో నా కార్యక్రమాల్ని బలపరిచిన నాయకులు ప్రకాశంగారొక్కరే!

సుభాష్‌బాబు గారితో స్నేహసంబంధాలు, ఆత్మీయత చిప్పిలుతూ మరచిపోలేని విధంగా ఉంటాయి. ఒకసారి బోసుబాబు మదరాసు పర్యటనలో మాతెలుగువార పత్రిక మదరాసు కార్యాలయాన్ని సందర్శించి, ఆశ్చర్యంతో "ఓహో! ఇది రంగా గారి విప్లవ కర్మాగారం గదా!" అని అన్నారు. 1939లో మదరాసులో జరిగిన గొప్ప బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ "రంగాగారు ఈ ఉద్యమానికి కాంగ్రెసు కార్యవర్గ సభ్యత్వాన్ని కూడా వదలుకొని గొప్పత్యాగంచేసారు. ఆయన సోదరులు లక్ష్మీన్నారాయణగారు ఒకప్పుడు అఖిల బెంగాల్ విద్యార్థి సభకు ప్రధాన కార్యదర్శిగా పనిచేసారు. బ్రిటిష ప్రభుత్వరక్షణ నిబంధనలకు వ్యతిరేకంగా, ప్రథమంగా ఎదిరినిలిచినందుకు ఈనాడు విచారణను ఎదుర్కొంటున్నారు. దేశభక్తి మూర్తీభవించిన రంగా సోదరులు ప్రశంసనీయులు" అని అన్నారు. సభ ముగిసిన తదుపరి ఆయనకు వీడ్కోలు చెప్పేందుకు నేను కూడా సెంట్రల్ స్టేషన్‌కు వెళ్ళాను. "బ్రిటిష్‌పాలనకు నిరసనగా అహింసాయుత పోరాటం నిర్వహించిన నా సోదరులు లక్ష్మీన్నారాయణగారికి తన అభినందనల్ని తెలియ జేయమంటూ " సెంట్రల్‌స్టేషన్‌లో బోసుబాబు నాతో అన్నారు.దేశవ్యాప్తంగా దేశభక్తిపరులతోనూ, జాతీయనాయకులతోనూ బోసుబాబుకు ఉన్న గణనీయమైన సంబంధాలు ఈ సంఘటనల వల్ల రుజువు అవుతున్నాయి. ఆవిధంగా దేశంలోని వేలాది మంది విద్యార్థులు, యువకుల హృదయాలను ఆయన చూరగొన్నారు.

జన్మభూమియైన భారతదేశాన్ని, జాతీయోద్యమాన్ని నడిపిస్తున్న మహాత్మాగాంధీజీని ఆయన ఎంతగానో అభిమానించేవారు కానీ భారతదేశ స్వతంత్ర్య సముపార్జన లో గాంధీజీ మార్గాన్ని ఆయన అంగీకరించలేదు. గాంధీజీని గొప్ప జాతీయ నాయకుల్లాగా అంగీకరించినప్పటికీ, ఆయన దారిన నడవడానికి, బోసు బాబు అంగీకరించలేదు. అందువల్ల బోసుబాబు భిన్నమార్గం పట్ల గాంధీజీకి, కాంగ్రెసు అగ్రనాయకులకు కష్టంకలిగింది . దానితో కాంగ్రెసు అధ్యక్షపదవికి రాజీనామా ఇచ్చేందుకు బోసుబాబు అంగీకరించారు. బోసువిధానాలకు, కాంగ్రెసు నాయకులకు మధ్యేర్పడిన వైమనస్యభావాలవల్ల, బోసు కాంగ్రెసు నుండి వైదొలగవలసిన పరిస్థితులు ఎదురయ్యాయి. ఫలితంగా బోసు ఫార్వర్డ్‌బ్లాకును స్థాపించారు.

అప్పట్లో సమర్థత, శక్తి, సాహసం మూర్తీభవించిన నాయకులుగా బోసుబాబు పరిగణించ

బడ్డారు. త్రిపురలో జరిగిన సంఘటనల్లో కమ్యూనిస్టులు సోషలిస్టుల వ్యతిరేకవై ఖరిని మనసులో పెట్టుకోకుండా, వారిని కూడా వామపక్ష ఐక్యసంఘటనలో చేరవలసిందిగా, బోసు ఆహ్వానించారు. రాజకీయ పార్టీల వాళ్ళందరూ జైలుకు వెళ్ళడమో, రహస్య జీవితంలోకి నెట్టివేయబడడమో జరిగిన తరవాత, వామపక్షఐక్యసంఘటనను (యల్.సి.సి) స్వాధీనం చేసుకోవాలని కమ్యూనిస్టులు ఎత్తుగడవేసి, సరియైన సమయంలో భారత భూభాగంలో ప్రవేశించిన సోవియట్ సైన్యాల సహాయంతో అధికారాన్ని తమ హస్తగతం చేసుకోవాలన్న పధకంతో వేచిఉన్నారు, కమ్యూనిస్టుల ఎత్తుగడను బోసు గమనించి, యల్.సి.సిని రద్దుచేయడానికి, ఆయన ఏమాత్రం సందేహించలేదు.కాంగ్రెసు ఆధ్వర్యంలోనే వ్యక్తిగతంగా స్వతంత్రపోరాటాన్ని ప్రారంభించాలని బోసు తన పధకాన్ని సిద్ధంచేసిపెట్టారు. దేశమంతటా యుద్ధవాతావరణం అలుముకొని ఉంది ప్రజలూ, రాజకీయ నాయకులు ఉద్విగ్న భరితులైవున్నారు. గుండెలను కదిలించే ఆసమయంలో నన్నూ, స్వామీజీని, సుభాష్‌చంద్రబోసును బ్రిటిష్ ప్రభుత్వం అరెస్టుచేసి జైలులో నిర్భధించింది.

అప్పట్లో గాంధీజీతో సయోధ్యతో మెలగి, కాంగ్రెసు నాయకత్వ బాధ్యతలను స్వీకరించడానికి నెహ్రూజీ కూడా సుముఖంగా లేరు. కాంగ్రెసు నాయకత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న బోసువై ఖరిని కాంగ్రెసు పార్టీగానీ, తన కార్యక్రమాలతో సమాధానపడలేని కాంగ్రెసుతో తాను గానీ సర్దుబాటు కాలేక, పరస్పరం వైరుద్యభావాలతోనే నడుస్తూ వచ్చారు. బాబూ రాజేంద్రప్రసాద గారు ఏర్పాటు చేసిన కాంగ్రెసు కార్యవర్గంలో ఉండేందుకు బోసుబాబు అంగీకరించలేదు, గానీ సంస్థతో సహకరించేందుకు బోసుబాబు సిద్ధంగానే ఉన్నారు. నెహ్రూజీకూడా ఈసమయంలో తన పాత్రను సమయోచితంగా నిర్వహిస్తూ, యువకుల్లో తగ్గిన తన పలుకుబడిని, గాంధీజీ సహకారంతో, చైతన్యంతో ప్రజలను ముందుకు నడిపించే జాతీయనాయకత్వంలో ప్రధానపాత్రవహిస్తూ, తన వ్యక్తిత్వం దెబ్బతినకుండా కాపాడుకోగలిగారు.

తీవ్ర నిర్బంధ విధానం అమలు జరుగుతున్న యుద్ధవాతావరణంలో, దేశభక్తులపై దమనకాండ విపరీతం కాగా, సుబాష్‌చంద్రబోసు పోలీసుల కళ్ళు గప్పి, మారు వేషంలో., మాతృదేశాన్ని వదలి, బ్రిటిష్ సామ్రాజ్యవాదంపై ప్రతీకారం తీర్చుకునేందుకు, విశాల ప్రపంచంలో ఎక్కడ, ఏరూపంలో, ఎవరినుండైనా ఏ సహాయంచేసినా స్వీకరించేందుకు మార్గాలను అన్వేషించేందుకు నిశ్చయించుకున్నారు. అప్పటికే బోసుబాబుపై గట్టి పోలీసు నిఘాఉంది.

అయినప్పటికీ, చాకచక్యంతో గృహనిర్బంధంనుంచి తప్పించుకొని, తీవ్రమైన మానసిక బాధతో, దేశాన్ని వదలి , మారువేషంలో సరిహద్దులు దాటి, మొదట ఆఫ్గనిస్తాన్ చేరి, అక్కడి నుంచి యూరప్‌వెళ్లి, తదుపరి బెర్లిన్ చేరి, హిట్లర్‌ను కలుసుకున్నాడు. బెర్లిన్‌లో 'నేతాజీ' గా ఆయన కీర్తికిరీటాన్ని పొంది, బ్రిటిష్,ఫ్రెంచి,డచ్చిసామ్రాజ్యవాదులపై తీవ్రంగా పోరాడుతూ, విజయపరంపరలను సాగిస్తూ, అప్రతిహతంగా ముందుకుదూకుతున్న హిట్లర్, ముస్సోలినీలతో మిత్రత్వాన్నినెలకొల్పుకున్నారు. ఆసియా ఖండంనుండి సామ్రాజ్యవాదాన్ని తరిమి వేయగలమన్న దృఢ నమ్మకంతో, 'తిరోగమనంలో', అపజయాల ఆఖరిమెట్టు మీద సామ్రాజ్యవాదం ఊగిసలాడుతున్న సమయంలో ' ఈ ముగ్గురినాయకుల మధ్య ఈ సయోధ్య

కుదిరింది. యూరపునుంచి సింగపూర్ వరకు జలాంతర్గామి ద్వారా అత్యంత సాహసంతో చేసిన నేతాజీ సముద్రప్రయాణం విశేషాలు ,ఇండియన్ ఆర్మీని స్థాపించి, తద్వారా ఆయన సాధించిన విజయాలు, అనేకమంది రచయితలకు ప్రేరకాలై, ఎన్నో గ్రంథరచనలు జరిగాయి.

సింగపూర్ లో నేతాజీ భారత ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, దానికి విదేశాంగవ్యవహారాల శాఖను, రక్షణదళాలను, స్వంతరేడియో ప్రసారవనరులను ఏర్పరచి, స్వంతకరెన్సీ, బ్యాంకింగ్,తదితర వనరులతో , స్వతంత్ర ప్రభుత్వం నిర్వహించడానికి కావలసిన పరిపాలనా వ్యవహారాల నన్నింటినీ సమకూర్చుకొని, భవిష్యత్తులో ఏర్పడబోయే స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని స్వదేశీయులు సమర్థవంతంగా పరిపాలించగలరన్న ఆత్మవిశ్వాసాన్ని భారతీయులలో నేతాజీ కలిగించి పెట్టారు. సింగపూర్ లో నేతాజీ స్థాపించిన ప్రభుత్వం ఉనికిని, దాని సామ్రాజ్యవాదవ్యతిరేక పోకడలను గురించి బ్రిటిష్ ప్రభుత్వరేడియో పెద్ద ఎత్తున ప్రజలలో ప్రసారంచేసినందువల్ల, భారతీయులకు నేతాజీ ప్రవాస ప్రభుత్వం ఉనికి, దాని నిజస్థితి తెలిశాయి. ఆవిధంగా బ్రిటిష్ రేడియో నేతాజీ ప్రవాస ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన ప్రసార కార్యక్రమాల్లో తలవని తలంపుగా భారతీయులకు సమాచారాన్ని అందించి, వారిలో ఆత్మవిశ్వాసం పెంపొందేందుకు దోహదపడింది. ఈవిధంగా భారతీయులు మరింత ఉద్వేగ భరితులయ్యారు.

స్వరాజ్యసాధన కేవలం ఇండియన్ నేషనల్ ఆర్మీమాత్రమే సాధించ గలదనే నమ్మకం నేతాజీకి లేదు. అందువల్లనే ఆయన భారత ప్రజలను గాంధీ మహాత్ముని, కాంగ్రెసుపార్టీని అనుసరిస్తూ, దేశస్వాతంత్ర సాధనకు పోరాడ వలసిందిగా పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యసాధనకు జరిపేపోరాటంలో తన మార్గంలో తాను ,. దేశం బయటనుండి తన వంతు కృషిని కొనసాగిస్తున్నాననీ, దేశప్రజలను గాంధీమార్గంలో పాలుపంచుకోవలసిందిగా ఆయన కోరారు.

తన ప్రవాస ప్రభుత్వాన్ని గుర్తించవలసిందిగా, నేతాజీ జపాన్, జర్మనీ, ఇటలీదేశాలపై తీవ్రమైన వత్తిడి తెచ్చారు. జనరల్ డిగాలే అనుసరించిన విధానం ప్రకారం , తన ప్రభుత్వంపై విశ్వాసపాత్రులైన భారతీయులందరకూ, ఆయాదేశాల్లో ప్రత్యేక పౌరసత్వహక్కుల్ని కల్పించ వలసిందిగా గట్టిగా ఆయాదేశాలను కోరారు. అప్పట్లో ఐరోపా ఖండంలోని అనేక ప్రవాస ప్రభుత్వాలకు లండన్ ఆవాస కేంద్రంగా ఉండగా, నేతాజీ తన ప్రవాస ప్రభుత్వానికి సింగపూర్‌ను కేంద్రంగా చేసుకొన్నారు.

సింగపూర్ కేంద్రంగా ప్రవాస ప్రభుత్వాన్ని ఏర్పరచి, ఇండియన్ నేషనల్ ఆర్మీని బ్రిటిష్ సామ్రజ్యవాదుల గుండెల్లో గుబులు పుట్టించే విధంగా నేతాజీ తీర్చిదిద్దాడు. ఆయనకు అండమాన్ నికోబార్ దీవులపై కూడా ఆధిపత్యం వచ్చాక, ప్రపంచంలో నేతాజీ ప్రవాస ప్రభుత్వానికి అజేయమైన స్థానం లభించింది, తన ప్రవాస ప్రభుత్వాన్ని నిర్వహించడంలో ఆయన చూపిన పరిపాలనా కౌశలం, ఐ.యన్.ఎ దళాలను సైనిక పరంగా అభివృద్ధిపరచి, వాటికి ఆయుధసేకరణ, వివిధ విభాగాలుగా విభజన ఏర్పాట్లు, అనతి కాలంలోనే ప్రవాస సైనిక ప్రభుత్వాన్ని నడిపిన తీరుతెన్నులను గమనించి ప్రసిద్ధిచెందిన సైనిక దళాధిపతులు సైతం ఆశ్చర్యంపొందారు. నేతాజీ వున్నట్లయితే, స్వతంత్ర భారతదేశానికి సమర్థవంతమైన నాయకత్వం సిద్ధించివుండేదని సర్వత్రా భావించబడింది, కానీ అలాంటి ఆశలు ఫలవంతంకాలేదు.

1920లోనూ, తిరిగి 1945లోనూ భారతదేశ రాజకీయాలు తిరిగిన మలుపుల్ని గమనిస్తే, దాని స్వరూప స్వభావాలు, ఫలితాల పట్ల ఎవరూ ఆశ్చర్యం చెందవలసిన పనిలేదు. 1920లో బాలగంగాధర తిలక్, గాంధీజీ యిరువురుకూడా, పరస్పర విభేదాలతో, రెండు ప్రత్యర్థి వర్గాలకు నాయకులుగా ఉంటూ, జాతీయరంగంలో - వారిలో ఎవరు ముఖ్యులు అనే విషయంలో, వారి అభిమానుల మధ్య పరస్పరం వాదోపవాదాలు ఘర్షణలు జరుగుతూవుండేవి. ఆకస్మాత్తుగా తిలక్ మరణించడంతో, 1920లో ఎలాంటి పోటీలేకుండా, మహాత్మాగాంధీ జాతీయ నాయకులుగా సిద్ధపడ్డారు. అలాగే 1945లో నేతాజీ విమాన ప్రమాదానికి గురికావడంతో, నెహ్రూ తిరుగులేని నాయకునిగా భారతదేశాన్ని పదైనిమిది సంవత్సరాలు ఏకధాటిగా పాలించగలిగారు. ప్రపంచ రాజకీయ రంగంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలుగా కనిపిస్తాయి. మైకేల్ కాలిన్స్ హత్యకు గురయిన తర్వాత, డివెలరా ఐర్లండులో జాతీయ నాయకులుగా పరిపాలన సాగించారు. సోవియట్ రష్యాలో తన నాయకత్వం స్థిరపరచుకొనేందుకు స్టాలిన్ నిర్దాక్షిణ్యంగా ట్రాట్స్కీని దూరంగా నెట్టి వేయడం జరిగింది.

నేతాజీ తన తుది ప్రయాణాన్ని, ఎక్కడో, దూరప్రాంతాల్లో, ఎందుకు జరిపినట్లు? 1941లో అత్యంత ప్రియమైన మాతృభూమిని వదిలి వెళుతున్నప్పుడే, యిలా జరుగుతుందనీ, చివరికి తన జీవితం విషాదపరిణామాలకు గురి అవుతుందని ఆయనకు తెలుసునా? తలచుకుంటే మనకు ఆశ్చర్యంవేస్తుంది. భారతీయుల పరాక్రమ, పౌరుషానికి సాంప్రదాయికమైన "విడ్కోలు సందేశాన్ని " భరతభూమికి ఆనాడే అందజేశారా? ఒక వీరుడిగా పరిస్థితుల వల్ల కలిగే పరిణామాల కన్నింటికీ ఆయన సిద్ధపడివున్నారనే భావించవలసివుంది. అనతికాలంలోనే జపాన్ లొంగిపోగలదనీ కూడా ఆయనకు తెలుసు. తిరిగి భారతదేశానికి, భారతీయ సైన్యంతోనే రావాలని ఆయన తనశక్తి కొలది ప్రయత్నంచేశారు. భారత భూ భాగాన్ని కొంతమేరకు ఆయన విముక్తి చేసి, స్వతంత్రం గావించారు. భారత భూ భాగం మీదగానీ, భారత ప్రజల మీద గానీ జపాన్ సైన్యాలు దాడి చేయడానికి ఆయన అంగీకరించలేదు: జపాన్ సైన్యాలు ఆగ్నేయాసియాదేశాలపై విజృంభిస్తున్నప్పటికీ, ప్రపంచం అంతటా జర్మనీ, ఇటలీ దేశాలు వెనకడుగు వేస్తూ ఉన్న ఆ సమయంలో, బ్రిటిష్ ప్రభుత్వంపై తుది విజయం సాధించాలంటే, 1942 లాంటి మరో ప్రజాఉద్యమంవస్తే తప్ప ఆయన గెలుపొందడం సాధ్యమయ్యే పనికాదు. అప్పట్లో నేతాజీకి పరిస్థితులన్నీ వ్యతిరేకంగా పరిణమించాయి. ఏ ఆశయ సాధనకు ఆయన మాతృభూమిని వదిలి, పరాయి ప్రాంతాలలో, ప్రమాదకరమైన, సాహసవంతమైన కార్యక్రమాల్ని ఎంచుకున్నారో, అదే ఆశయ సాధన మీద విఫల ప్రయత్నాల అంచుల మీద తనకుతాను, మనస్ఫూర్తిగానే ఆత్మాహుతి చేసుకున్నారేమో అని అనిపిస్తున్నది. ఆయన మరణించారా? అది ఆశ్చర్యం కలిగించే ప్రశ్న ! వార్ధక్యంతోనో, వ్యాధిగ్రస్తులయ్యో ఆయన మరణించలేదు. నేతాజీ ఆఖరు ఘడియలు ఎక్కడముగిసాయి? కొంతబాధ..కొంత దుఃఖం...ఆవిషయంతలచుకుంటే మనను విషాదం ఆవరిస్తుంది. పుట్టిపెరిగిన మాతృదేశంలో ఆయన ఒక అంగుళం భూమిని కూడా స్పృజించకుండా, ఎక్కడో ఆనంతవాయువుల్లో ఆయన అవశేషాలు లీనమైపోయాయి. ఆయనను మనస్ఫూర్తిగా అభిమానించేవారు. ఇక ఆయన మనవద్దకు రారేమో అనుకోవడం సహజం. కానీ ఆయనస్మృతి మన చుట్టూ ప్రతిక్షణం ఆవరించుకొవే ఉంది. మనం ప్రతిరోజూ తాకుతున్న ఈ నేలలో, గాలిలో, ఆకాశంలో, జలంలో

అగ్నిలో అన్నింటా ఆయనఉండి, శాశ్వతంగా, ఈభరత భూమిలాగే మనల్ని అంటిపెట్టుకొనేఉన్నారు.

నేషనల్ ఆర్మీ ఉనికి పట్ల నేతాజీ నైతిక విజయాన్నే సాధించారు. గాంధీజీ పూర్తిగా అహింసా వాదానికే అంకితమై ఉన్నప్పటికీ, కాంగ్రెసు పార్టీ, నెహ్రూజీ జర్మన్ నాజీయిజాన్ని, ఫాసిస్టు విజృంభణనూ అంగీకరించక పోయినప్పటికీ, మాతృదేశదాస్యవిముక్తి కోసం నేతాజీ, ఇండియన్ నేషనల్ ఆర్మీ కొనసాగించిన దేశభక్తిపూర్వకమైన కార్యక్రమాలకు భారత ప్రజలు స్పందించి, చూపెట్టిన గౌరవ, ఆదరాభిమానాలను పరిగణనలోనికి తీసుకోకతప్పలేదు. అందువలననే గాంధీజీ సైతం నేషనల్ ఆర్మీ, నేతాజీలపట్ల ఆదరాభిమానాలనే కలిగియున్నారు. బ్రిటీషు ప్రభుత్వం దురహంకారంతో నేషనల్ ఆర్మీపై విచారణకు పూనుకున్నపుడు బ్రిటిషు వారిచర్యను ప్రతిఘటించి, తగు సమాధానాన్ని చెప్పవలసిందిగా గాంధీజీ కాంగ్రెసువారిని ఆదేశించారు. జవహర్లాల్ సంతోషంగా ఐ.యన్.ఎ తరపున వాదించేందుకుముందుకువచ్చారు. కేంద్రశాసన సభలో కాంగ్రెసు పార్టీ నాయకులుగా వ్యవహరించిన ప్రముఖ న్యాయవాది శ్రీ భూలాభాయ్ దేశాయ్ నేషనల్ ఆర్మీతరపున వాదిస్తూ నేతాజీ మాటల్లోనే ఇలా అన్నారు "జాతి స్వాతంత్ర్యం కోసం సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడటం దేశద్రోహంకాదు. అది ప్రతిదేశభక్తుని ప్రధమకర్తవ్యం! "ఇండియన్ నేషనల్ ఆర్మీ సైనికాధికారులు 'నిర్దోషులు' , "అని తీర్పు చెప్పబడింది. నేతాజీ మరణానంతరం , ఆయన పట్ల భారతప్రజల్లో పెల్లుబికిన ప్రజాభిమానపు వెల్లువలోనే, భారత తొలి ప్రధానిగా జవహర్ లాల్ బాధ్యతలు చేపట్టిన సమయంలోనే, నేషనల్ ఆర్మీకి అనుకూలంగా తీర్పురావడంతో ప్రజల ఆనందానికి అవధులు లేకపోయాయి. స్వతంత్ర భారత ప్రభుత్వం 1972-73లో ఇండియన్ నేషనల్ ఆర్మీ యోధులను కూడా, భారత స్వాతంత్ర సమరయోధులుగా గుర్తిస్తూ, వారికి కూడా పెన్షన్ లు, ఇతర జాతీయ గౌరవాలను పొందేందుకు అర్హతను కల్పిస్తూ ప్రకటించినప్పుడు, వారికి నిజమైన గౌరవ ప్రవత్తులను ఏర్పరిచినట్లయింది. నేషనల్ ఆర్మీలో ఉన్న శ్రీ షానవాజ్ ఖాన్, కల్నల్ రాజుగార్లు కేంద్ర ప్రభుత్వంలో మంత్రులుగా చేర్చుకోబడ్డారు. మరి కొందరు యోధులు విదేశీ రాయభారులుగా నియమితులైనారు.

ఫాసిస్టు శక్తులతో కలిసి పనిచేసారని నేతాజీపై వచ్చిన దురదృష్టకరమైన ఆరోపణలకు, మనం చెప్పే జవాబు ఇదే, ఆయన తన తుది శ్వాసను విడిచే సమయంలో కూడా 'జై హింద్' అని భారత జాతీయ గౌరవశబ్దాన్ని ఉచ్చరించాడేగానీ, 'హెయిల్ హిట్లర్' అనే నాజీల నినాదాన్ని ఇవ్వలేదు. సమర్థులూ, స్వాభిమాని అయిన పండిట్ నెహ్రూకూడా తనకు తానే ఉత్తేజం పొంది, నేతాజీ జాతికి అందించిన 'జై హింద్'పదాన్ని ఉచ్చరిస్తూ, దాన్ని ఆనవాయితీగా పలకవలసిన జాతీయ పదంగా స్వీకరించారు. భారత ప్రజలు 'జై హింద్' పదాన్ని జాతి జీవన విధానంలో పవిత్రశబ్దంగా చేసుకున్నారు. భారతమాత నేతాజీ వంటి నాయకుణ్ణి కన్నందుకు గర్వపడుతుంది. మాతృదేశ దాస్య విముక్తి కోసం భరతజాతి సాగించిన పోరాటంలో కర్పూరంలా నేతాజీవెలిగిపోయారు. శరత్ చంద్రుని చామంతిలాగా, మాతృదేశానికి ఆయన మల్లెల సొరభాలతో సేవలందించారు. చంపకంలా అందాలను విరజిమ్మారు. మందారంలా మధురాన్ని పంచిపెట్టారు. ఈగొప్ప దేశభక్తుని స్వర్గారోహణ సందర్భంలో గాంధీజీ అశ్రునయనాలతో, తన ఆవేదనను భరతమాతకు నివేదించారు.

ఒరిస్సా నాయకులు
మాలతీ– నవకృష్ణచౌధురీ–"దేవ్"ద్వయం!

1931 లో కరాచీ కాంగ్రెస్ మహాసభల సందర్భంలో మొదటి సారిగా శ్రీమతి మాలతీ నవకృష్ణచౌధురిగారిని నేను కలుసుకున్నాను. నేనూ, శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారూ జ్వరంతో బాధపడుతున్న ఆమెను చూడడానికి అక్కడ ఒరిస్సా ప్రతినిధుల శిబిరానికి వెళ్లాము, రవీంద్రనాధ్ టాగూర్ గారి శాంతినికేతన్ లో ఆమె, ఆమె భర్త శ్రీనవకృష్ణ చౌధురిగార్లు సహవిద్యార్థులు గాఉండే వారని శ్రీ గోపాలరెడ్డి తెలియజేశారు. ఆదంపతులిద్దరూ అనేకసార్లు సత్యాగ్రహ సమరంలో పాల్గొని స్వాతంత్ర్యపోరాటకాలంలో ఎన్నోబాధలకు గురయినారు. ఒరిస్సాలో ఆమె ప్రముఖరాజకీయ నాయకురాలిగా ఎదిగారు. తన మృదు మధురమైన వాగ్ధోరణితో ఆమెభర్త నవకృష్ణ చౌదరి గారు జాతీయ నాయకునిగా గుర్తింపు పొందారు.

గత నలభై సంవత్సరాలుగా వీరిద్దరూ జయప్రకాశ్ ఆదర్శాల వరవడిలో 'సోషలిస్టులు'గా వ్యవహరించబడుతున్నారు. ఒరిస్సాలో కాంగ్రెస్ సోషలిస్టుపార్టీ నిర్మాణంలో వీరిరువురు ప్రముఖ పాత్ర వహించారు.తదుపరి వీరి అనుచరులలో కొందరు గాంధేయ మార్గానికి భిన్నంగా ప్రవరిస్తూ రావడంతో, ఈ దంపతులిద్దరూ ఆపార్టీని వదలిపెట్టారు. స్వభావరీత్యా శ్రీమతి మాలతి, నేతాజీ సుభాష్‌బోసు అభిప్రాయాలకు సన్నిహితంగా ఉంటూ ఉండేది. నవకృష్ణచౌధురి గాంధేయవాదానికి దగ్గరగా ఉండేవాడు. అయితే ఈ దంపతులిద్దరూ జవహర్లాల్ నెహ్రూగారి ఏకవక్షనిర్ణయాలకు వ్యతిరేకంగా, ఇటీవలవరకూ జయప్రకాశ్‌నారాయణ్‌గారికి అనుచరులుగా ఉండేవారు. 1936-40 ప్రాంతాల్లో నేను కిసాన్ ఉద్యమాన్ని ప్రారంభించిన తొలిదినాల్లో వారు నాతో సహకరించారు. తదుపరి వారి సహచరులైన సురేంద్ర ద్వివేదిగారు 'ఒరిస్సా కిసాన్ కాంగ్రెస్ 'ను అభివృద్ధిచేయడంలో నాకు బాగా తోడ్పడ్డారు. 1938-40 సంవత్సరాల మధ్య ఒరిస్సా ప్రజాఉద్యమాల్లో వీరు ప్రముఖపాత్ర నిర్వహిస్తూ, సారంగధరదాస్ (తదుపరి పార్లమెంటుసభ్యులు),, మరియు పవిత్ర మోహన్ ప్రధాన్ గార్లకు ధెంకనాల్, తదితరచోట్ల సత్యాగ్రహపోరాటాలను నిర్వహించేందుకు తోడ్పడ్డారు.

ఒరిస్సాలోని గాంధేయ వాదులతో వారు విడిపోయినప్పటికీ, ప్రజాసేవలో గాంధేయ మార్గాన్ని మాత్రం వదిలిపెట్టలేదు. రాజకీయాలను త్యజించిన తరువాత మాలతిగారు అంగుర్ లో 'సాంఘిక సేవాశ్రమాన్ని' స్థాపించి, ఆటవిక ప్రజల సముద్ధరణకు పూనుకున్నారు. నవకృష్ణగారు శాసనసభకు ఎన్నికై ప్రజాహిత కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. అంతేకాదు. అప్పటి ముఖ్యమంత్రీ, మాజీ గవర్నరు, గాంధేయవాదీ అయిన శ్రీ మెహతాబ్, అవినీతిపరులైన మెహతాబ్ ప్రత్యర్థులకంటే కూడా నవకృష్ణ చౌధురి అంకితభావంతో ప్రజాసేవ చేసారు.

కాంగ్రెసులో ఉన్న రెండు ప్రత్యర్థివర్గాలు కూడా అవినీతి రొంపిలో కూరుకపోయి, పరస్పరం పోటీపడుతున్న ఒక దశలో, నవకృష్ణ చౌధురి గారిని నాయకత్వ బాధ్యతల్ని చేపట్టవలసిందిగా పార్టీ కోరింది. ముఖ్యమంత్రిగా, పదవీబాధ్యతలు స్వీకరించిన తరవాత కొన్ని సంవత్సరాల పాటు రాష్ట్రాన్ని గాంధేయ సూత్రాలతో, నిష్కళంకమైన పరిపాలనతో నడిపించారు. శాసనసభలో గ్రూపురాజకీయాలు విపరీతంగా బలిసి, పదవీ వ్యామోహంతో పరస్పర విభేదాలతో కూడుకొని ఉన్న వర్గాలను సరిదిద్దలేక, విసుగుజెంది, ఆయన ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసారు. తన ప్రయత్నం లేకుండానే, ముఖ్యమంత్రి పదవి దానంతటదే వరించిన రాజకీయ ప్రముఖులలో ఆయన మొదటివారిని చెప్పవచ్చును. అలాగే అలాంటి అవకాశమే లభించిన వారిలో రెండవవారు శ్రీ కామరాజనాడార్!

వినోబా భావేగారి భూదానయాత్రలోనూ, సర్వోదయోద్యమంలోనూ పాలుపంచుకునేందుకు నవకృష్ణచౌధురిగారు ముందుకు వచ్చారు. తన పూర్వ సన్నిహితులైన శ్రీ జయప్రకాశ్ నారాయణ్ కూడా సరిగ్గా అదే ఉద్యమంలో చేరిఉన్నందున, ఆయన మరింత సంతోషంతో ఈ కార్యక్రమంలో ముందుకు వచ్చారు.

అవిశ్రాంత కార్యక్రమాలను నిర్వహించి, ఒరిస్సా ప్రజాజీవనరంగంలో వాడిని, వేడినీ రగిల్చిన మాలతి, అవకాశవాద రాజకీయాల్లో యిమడలేక, వాటినుంచి తప్పుకున్నారు. తన భర్తకంటే, సమర్థవంతంగానూ, సాహసోపేతంగానూ పనిచేసే చురుకైన కార్యకర్త శ్రీమతి మాలతి. ఆ యిరువురూ పరస్పర అవగాహనతో, అన్యోన్యతతో ప్రజాసేవారంగంలో ఆదర్శప్రాయమైన దంపతులుగా గాంధీయుగంలో ప్రశంసలందుకున్నారు. ఒరిస్సా కాంగ్రెసులో ఉన్న ముఠా తత్వాలను, అవినీతి కార్యకలాపాలను ఆమె ఏమాత్రం సహించలేకపోయారు. అందువల్ల ఆమె, తన భర్తను ఎదుటిపక్షంలో చేరమని సూచించారు. కానీ అలాంటి గందరగోళ రాజకీయాలను భరించే స్థితి ఆయనకు కూడా లేకుండా పోయింది. ఆ కారణంగా వీరిద్దరూ రాజకీయాలకు దూరంగా ఉంటూ, ఒకరు సర్వోదయ ఉద్యమం లోకి, మరొకరు సాంఘిక సేవారంగంలోకి అడుగుపెట్టారు.

ఒరిస్సా సరిహద్దుల్లోని ఆంధ్రరైతు ఉద్యమ నాయకులతో వీరికి స్నేహసంబంధాలు ఏర్పడి ఉన్నాయి. ఆంధ్ర నాయకులు వీరి అభిమానాన్ని, సహకారాన్ని పొందుతూ వచ్చారు. శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల రైతులు. వారి సమస్యల పరిష్కారంకోసం సత్యాగ్రహాన్ని నడుపుతున్న సందర్భంలో, వీరిని ఆహ్వానించగా యీ ప్రాంతాలకు వచ్చి, యిక్కడి ప్రజలతోకలిసి, ఉద్యమాల్లో పాల్గొని తోడ్పడ్డారు. ఎన్నికల సమయంలో కూడా వీరు కాంగ్రెసు పార్టీతో కొనసాగుతున్నా, లేకపోయినా మనప్రాంత ప్రజలకు తమ సహాయ సంపత్తులందించేవారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తదుపరి ఒరిస్సానుంచి అనేకమంది రాజకీయ నాయకులు జాతీయ స్థాయికి ఎదిగివచ్చారు. కానీ వారెవ్వరూ కూడా ఈ దంపతులు పొందిన ప్రజాభిమానాన్ని పొందలేకపోయారు. ఒరిస్సాను పాలించిన మరొక ముఖ్యమంత్రి శ్రీ ఆర్.యన్.సింగ్ ఉన్నత విలువలు, నిజాయితీపరులుగా పరిగణింపబడ్డారు. కిసాన్ కాంగ్రెసు ఉద్యమంలో నాకు సహచరులూ, కాంగ్రెసు పార్టీ వారైన రాష్ట్రముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని పాలించిన శ్రీ విశ్వనాథ దాస్‌గారు కూడా

నైతిక విలువలకు కట్టుబడిన వారే! అయినప్పటికీ నిష్కలంకమైన ప్రజాసేవకులుగా, మాతృభూమికి సేవచేయడంలోనూ, నలభై ఏళ్ళు రాష్ట్ర రాజకీయ చరిత్రలో, ముఠా తగవులకు దూరంగా ఉంటూ ప్రజాభిమానాన్ని పొందిన శ్రీ నవకృష్ణ చౌదరికి వీరెవ్వరూ కూడా తులతూగలేరని చెప్పవలసి ఉంది.

శ్రీ నవకృష్ణచౌధురి, శ్రీమతి మాలతి దంపతులలో ఎవరు గొప్ప త్యాగధనులు, సమర్థులూ అని అప్పుడప్పుడూ తూర్పుకోస్తా రాజకీయ వాదుల మధ్య ఆసక్తి కరమైన చర్చ సాగుతూ ఉండేది. శ్రీమతి మాలతి చొరవ, సాహసాన్ని కొందరు బలపరచగా, మరికొందరు నవకృష్ణ చౌదరిగారి మృదుస్వభావాన్ని, గాంధీతత్వాన్ని ప్రశంసించేవారు. వారిలోని రెండు అంశాలను నేను మెచ్చుకొనేవాడిని. గురుదేవులు రవీంద్రనాథ్ టాగోర్, బాపూజీల ఆశయ ఆదర్శాలకు ప్రతిబింబంగా ఈ దంపతులు జీవించారు. శాంతినికేతన్‌లో ధ్యానపూరితమైన, ప్రశాంత వాతావరణంలో గడుపుతూ రాజకీయ ప్రాముఖ్యతను పొందలేదు. ఆ ఇద్దరూ ప్రజలతో మమేకమై, ప్రజారంగంలో ప్రజలమధ్య సేవచేస్తూ గడిపారు. వృద్ధాప్యంలో సైతం గాంధేయ సూత్రాలతో, సంఘసేవచేస్తూ, ప్రజాసేవాదురంధరులుగా రాణించారు. నిజంగా వారు గొప్ప సంఘసేవా పరాయణులు!

శ్రీయుతులు సింగ్‌దేవ్, పి.కె.దేవ్‌లు, శ్రీ పవిత్రమోహన్

మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ కాంగ్రెసు నాయకులు శ్రీ మిశ్రాగారు ప్రారంభించిన గణతంత్ర పార్టీకి, తదుపరి ఒరిస్సా స్వతంత్ర పార్టీకి దేవ్ ఇరువురూ మూలస్తంభాల వంటివారని చెప్పవలసి ఉంది. ఆ ఇద్దరిలో ఆర్.యన్.సింగ్‌దేవ్‌గారు పెద్దవారు. ఇరువురి మధ్యా బంధుత్వం నెలకొని ఉంది. వారు సమర్థులైన రాజకీయ నాయకులుగా చెలామణీ అయ్యారు. శ్రీ పి.కె.దేవ్ చురుకైనవారు. పార్టీ నిర్మాణ కార్యక్రమాలలో ఆయన ఎక్కువ శ్రద్ధ కనపరిచేవారు. ఆర్.యన్.సింగ్‌దేవ్‌గారు రాజకీయరంగంలో కృషిచేస్తూ, సహచరులతో కలిసి మెలిసి ఉండేవారు. ఇద్దరూ మంచి వక్తలు, సమర్థత, దక్షతగల రాజకీయ నాయకులు! శ్రీ పి.కె.దేవ్ ఉద్రేక స్వభావం గలవారు. కాగా శ్రీ సింగ్ దేవ్ మితభాషి. ఆచి, తూచి మాట్లాడతారు. 'స్వతంత్ర పార్టీ' కార్యక్రమాల్లో వీరిద్దరూ నాకు విశ్వసనీయమైన అనుచరులుగా ఉండేవారు. శ్రీ పి.కె.దేవ్ తన ఉపన్యాసాల సంపుటి. "(1962-66) గ్రంథాన్ని నాకు అంకితం ఇచ్చారు.

శ్రీ సింగ్‌దేవ్ ఒరిస్సా రాష్ట్ర మంత్రిగా, ఉపముఖ్యమంత్రిగా, ముఖ్యమంత్రిగా పదిహేను సంవత్సరాలు వివిధ మంత్రివర్గాల్లో పదవులు నిర్వహించి, సమర్థత, నిజాయితీతో కూడిన న్యాయబుద్ధిగల పరిపాలకునిగా కీర్తి తెచ్చుకున్నారు. సముచిత నిర్ణయాలు చేయడంలోనూ, రాజకీయ సుస్థిరతను సాధించడంలోనూ ఆయన రాజకీయ దక్షునిగా పేరుపొందారు. తన సహచరులైన మంత్రులచేతా, ప్రభుత్వాధికారులచేతా సమన్వయపూర్వకమైన కార్యక్రమాలను, విధులను నిర్వహింపజేస్తూ, అనుకున్న దానికంటే ఎక్కువ ఫలితాలను సాధించి రాష్ట్రాన్ని సమర్థవంతంగా తీర్చిదిద్దారు. నేను స్వతంత్రపార్టీ అధ్యక్షుడిగానూ, ఆయన రాష్ట్రముఖ్యమంత్రిగానూ కొనసాగుతున్న రోజుల్లో మేమిద్దరం కలసి మెలసి కార్యక్రమాలను నిర్వహించడానికి, చక్కని

సయోధ్యను అందించి, ఆయన పార్టీకి మంచిపేరు ప్రతిష్టలను సంపాదించిపెట్టారు. సాటి ముఖ్యమంత్రులకు దీనిని ఒక ఆదర్శంగా భావించేట్టు వ్యవహరించారు.

స్వరాజ్యం వచ్చిన తరువాత, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులందరిలోనూ, పీరొక్కరే భూమిశిస్తును రద్దుచేసి, స్థానిక పన్నులను ఎత్తివేసి ఎన్నికలలో మేం చేసిన వాగ్దానాలకు అనుగుణంగా, రైతాంగానికి పన్ను బాధలేకుండా చేశారు.

1968లో సంభవించిన తుఫాన్ విపత్తు సమయంలో ప్రభుత్వ అధికారులచేత అదనంగా పనులు చేయించి, సహాయక చర్యలను అమలు పరిచి అనితర సాధ్యమైన ఫలితాలను సాధించి, చక్కని పరిపాలనాదక్షునిగా నిరూపించుకున్నారు. ఆ సమయంలో శ్రీరామకృష్ణ మిషన్ వారూ, ప్రభుత్వ యంత్రాంగమూ చేసిన సేవకులకు నేను హృదయపూర్వకమైన సంతృప్తిని వ్యక్తపరిచాను. ఆపదలో ఉన్న ప్రజలకు సేవాకార్యక్రమాలను నిర్వహించడానికి ఆ సమయంలో సింగ్‌దేవ్‌గారు హుకుం జారీచేయగానే ప్రభుత్వ సిబ్బంది ముందుకు దూకుతూ ఉండేది.

సింగ్‌దేవ్‌గారు పార్టీలోని సామాన్య కార్యకర్తల పట్ల కూడా ఆప్యాయతను కనపరిచేవారు. అప్పటికీ కార్యకర్తలలో ఎవరైనా ఆయన చూపిస్తున్న అభిమానాన్ని సక్రమంగా వినియోగించుకోలేకపోతే వారి మానానికి వారిని వదలివేసేవారు. దురదృష్టవశాత్తూ తన ఉదారత్వాన్ని ఎవరైనా సక్రమంగా వినియోగించుకోలేకపోతే, ఉదాత్తమైన తన నిర్ణయాలను తిరగదోడకుండా, హుందాగా ప్రవర్తించేవారు. వారి అభిమానాన్ని, సహకారాన్ని ఆయన ఓర్పుతో సాధించేవారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న మొదటి సంవత్సరంలో తనమీద తీవ్రమైన ఆరోపణలు రాగా, తనకు తానై ఆరోపణలను విచారించే బాధ్యతను ఒక న్యాయమూర్తికి ఆయన అప్పగించారు. అదృష్టవశాత్తూ ఆయన మీద వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని తరువాత రుజువైంది. తమపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపే సాహసం, తమ వ్యక్తిత్వాల్లోని నిజాయితీపట్ల పూర్తి నమ్మకంలేని ఇతర ముఖ్యమంత్రులలో కొద్దిమంది మాత్రమే చేయగలరు.

పి.కె. దేవ్‌గారు భారతీయ లోక్‌దళ్ పార్టీకి పార్టీ నాయకునిగా ఎంపిక అయ్యారు. లోక్‌సభలో భారతీయ లోక్‌దళ్ పార్టీ పార్లమెంటరీ నాయకునిగా ఆయన ఎన్నిక, సంఖ్యాబలంతోగాక, పదిహేను సంవత్సరాలుగా స్వతంత్ర పార్టీ సభ్యులుగా, పార్టీ నాయకునిగా ఉంటూ, చక్కని వక్తగా పరిగణింపబడినందున జరిగింది. విరామ మెరుగని కృషి చేస్తూ, సమర్థతగల నాయకునిగా, వక్తగా, ఆయన పార్లమెంటులో రాణించారు. ప్రతిపక్షాల వాదనను పార్లమెంటులో సమర్థవంతంగా ప్రతిపాదించగల దిట్ట. సాటి ప్రతిపక్ష సభ్యుల తోడ్పాటును కూడా అవసరమైన సమయాల్లో పొందగల నేర్పరి. మహారాజా వంశంలో పుట్టి, సిరిసంపదల మధ్య పెరిగినప్పటికీ, ఆయన ప్రజాస్వామ్య పద్ధతులకు అనుగుణంగా ప్రతి ఒక్కరితో కలిసి మెలసి వ్యవహరించగల స్నేహశీలి. ఆధునిక కాలానికి అనువుగా, నిర్మాణాత్మక కృషితో, ఇతరులతో పనిచేయవలసిన ఆవశ్యకతను గుర్తించిన వాస్తవికవాది. పార్లమెంటుకు ఆయన విలువైన సంపదవంటివారు. ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటులో ఒక సంఘటనా శక్తిగా నిలువలేక,

విఫలంజెందిన తరువాత, ఆయన స్వతంత్ర సభ్యులుగా కొనసాగడానికి నిశ్చయించుకున్నారు.

'కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సు'లో ఆయన పాల్గొని, ప్రపంచమంతటా పర్యటించి, దేశదేశాల్లోని ప్రజాస్వామ్య ప్రియులతో స్నేహసంబంధాలను ఏర్పరచుకొని, అనువంశికంగా వచ్చిన రాజరిక హుందాతనాన్ని సమన్వయ పరచుకొని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో ప్రజాస్వామ్య సమసమాజంలో ఆయన ఒకరుగా కలిసిపోగలిగారు.

శ్రీ పవిత్ర మోహన్ ప్రధాన్

ఆర్.యన్.సింగ్‌దేవ్ గారి చతురత, స్నేహశీలతను గురించి ఎన్నైనా ఉదాహరణలను చెప్పవచ్చును. అయితే వాటన్నిటిలో ముఖ్యమైన సంఘటన ఏమంటే, అప్పట్లో దీర్ఘకాలంగా సంస్థానాధీశులకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన స్వాతంత్ర్య సమరయోధులైన శ్రీ పవిత్ర మోహన ప్రధాన్‌గారిని, తాను 1967-70లో ఏర్పాటుచేసిన మిశ్రమ మంత్రివర్గంలో ఉపముఖ్యమంత్రిగా ఉండేందుకు అంగీకరింపజేయడం గుర్తుపెట్టుకోదగింది. శ్రీ పవిత్ర మోహన్ ప్రధాన్‌గారు స్వాతంత్ర్యానంతరం కాంగ్రెసు వాదులలో పెరిగిన అవినీతిని సహించలేక, దానినుండి వైదొలిగారు. సంస్థానాధీశులకు వ్యతిరేకంగా, ఆయన నాతోనూ, నవకృష్ణచౌధురిగారితోనూ, సారంగధర దాసుగారితోనూ, సురేంద్ర ద్వివేదిగారితోనూ కలిసి కృషిచేసారు. 1939లో ధెంకనాల్ పోరాటంలో ఆయన నిర్వహించిన పాత్ర వీరోచితమైనది. రాష్ట్ర కాంగ్రెసు మంత్రివర్గాలలో పలుమార్లు ఆయన మంత్రిగా ఉండి, ప్రజాసేవకులుగా, పరిపాలనాదక్షునిగా మంచిపేరు తెచ్చుకున్నారు. శ్రీ పవిత్రమోహన్ నిజమైన ప్రజాస్వామ్యవాది. శుద్ధ గాంధేయవాది. శ్రీ సింగ్‌దేవ్ ముఖ్యమంత్రిగా, మూడేళ్లు సాగిన మిశ్రమ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ప్రయత్నిస్తూ ప్రత్యర్థులు తనపై సైతం వత్తిడి తెచ్చినప్పటికీ, పట్టించుకోకుండా, లొంగకుండా మంత్రిగా కొనసాగారు. వీరిలో ఒకరు సంస్థానాధీశులు కాగా, మరొకరు ప్రజాసేవే జీవిత లక్ష్యంగా పెట్టుకొని కృషి చేస్తున్న త్యాగమూర్తి. వీరిద్దరి సయోధ్య ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరినీ కలుపుకొని సహజీవనం సాగించవచ్చుననే అంశాన్ని రుజువు చేసింది.

భారత్‌కిసాన్ సమ్మేళన్ కార్యక్రమాల్లోనూ, రైతాంగవ్యవస్థను నిర్మూలించే రాజ్యాంగంలోని 17వ ఆర్టికల్‌కు వ్యతిరేకంగా మేము ప్రారంభించిన పోస్ట్‌కార్డు ఉద్యమంలో ఒరిస్సా రైతాంగాన్ని ఆ ఇద్దరూ బాగా సమీకరించారు. మా పోరాటంవల్ల ఆ బిల్లులో సీలింగు పరిమితికి దిగువన ఉన్న రైతాంగానికి తగు రక్షణలు సమకూర్చబడినప్పుడు నేను పొందిన ఆనందంలో వారు సైతం పాలుపంచుకున్నారు. మేము 'స్వతంత్రపార్టీ'లో కొనసాగుతున్నప్పుడు, బ్యాంకుల జాతీయకరణ రైతాంగానికి ప్రయోజనాన్ని చేకూర్చగలదనే నమ్మకంతో, దానిని నేను బలపరిచిన సందర్భంలో, వారు కూడా నాతో చేయికలిపారు. బొంబాయి, కలకత్తాలలోని, స్వేచ్ఛా మార్కెట్లకు అధిక ధరలు చెల్లించి ఒరిస్సానుంచి బియ్యాన్ని తరలించే ప్రయత్నాన్ని వారు వ్యతిరేకించిన సందర్భంలో, నేను వారికి అండగా నిలిచాను. ఉత్పత్తి దారులకు గిట్టుబాటు ధరలు లభించేందుకు తగిన చర్యలు తీసుకొని, స్థానికావసరాలకు సరిపోయే విధంగా, వారు వినిమయరేట్లను అదుపులో పెట్టగలిగారు.

వారికిగానీ, వారి సాటివారైన సంస్థానాధీశులకు గానీ తమకుతామై ప్రజలతో కలిసిపోయి, ప్రజాస్వామికంగా ప్రజలకు నాయకత్వం వహించేందుకు అప్పట్లో ప్రజానీకం పూర్తి మద్దత్తు నిచ్చేందుకు ముందుకు రాలేదు. ప్రజలందరూ సమానులేనని, హెచ్చుతగ్గులు లేని సమసమాజాన్ని, ప్రజలే పాలకులన్న ప్రజాస్వామ్య సిద్ధాంతాన్ని వారంతా బలపరిచి, ప్రజాస్వామ్య వాదులుగా ముందుకు వచ్చినప్పటికీ, వారిపట్ల ప్రజలు పూర్తి విశ్వాసాన్ని ప్రకటించి, సహకరించే స్థితి ఇంకా ఏర్పడలేదు. ఆటవిక ప్రజలపట్ల వారికి మంచి ఆదరాభిమానాలు ఉండేవి. ఈ ఇరువులు 'దేవ్'లు ముందు దృష్టికలవారు. 1946-47 లో భారత యూనియన్ లో సంస్థానాలను విలీనం చేయాలని సర్దార్ పటేల్ నిర్ణయించినప్పుడు, వీరు సమ్యగ్దృష్టితో దాన్ని బలపరిచారు. 1975 లో ఆధునిక భారతానికి తన సేవలందిస్తున్న తరుణంలో శ్రీ సింగ్‌దేవ్ ఆకస్మికంగా మరణించారు. ఒరిస్సా మంత్రివర్గం తరపున బొంబాయిలోని ఆయన మృత దేహానికి నివాళులర్పించేందుకు, అప్పటి ఒరిస్సా ముఖ్యమంత్రిగా వున్న శ్రీమతి నందినీ సత్పథి హుటాహుటిన తరలివచ్చారు. అంతటి గౌరవాన్ని సంతరించుకున్న వ్యక్తి శ్రీ సింగ్‌దేవ్!

ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ – మైత్రీ సంబంధాలు.

1920–26 సంవత్సరాల మధ్య ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలో చాలామంది భారతీయ విద్యార్థులతో నాకు మంచి స్నేహ సంబంధాలుండేవి. కానీ విద్యాభ్యాసం ముగిసిన తరువాత, మాతృదేశమైన భారతదేశంలో అర్ధ శతాబ్దం పాటు కొనసాగిన సాంఘిక, రాజకీయ రంగాల్లో నాతోకలసి కృషిచేసిన వారు చాలా కొద్దిమంది మాత్రమే ఉన్నారు.

నాకు సమకాలికులైన శ్రీయుతులు కె.పి.యస్.మీనన్, ఆర్.కె.నెహ్రూ ఇద్దరూ ఐ.సి.యస్ అధికారులే. వారిలో కె.పి.యస్.మీనన్ గారు నాకు సీనియర్ విద్యార్థికాగా, ఆర్.కె.నెహ్రూ నాకు సహాధ్యాయి. జవహర్లాల్ నెహ్రూ గారి హయాంలో విదేశాంగశాఖలో ప్రధాన కార్యదర్శిగానూ, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శిగానూ వారు పదవులు నిర్వహించారు. ఆయా సందర్భాలలో వారి కృషిని గమనించే అవకాశం నాకు లభించింది. పరిపాలనా వ్యవహారాల్లో వారు సాధించిన అభివృద్ధిని చూసి, వారి పరిపాలనా దక్షతకు నేను గర్వించేవాడిని. వీరిరువురూ కూడా భారత-చైనా సంబంధ వ్యవహారాల్లో ప్రభుత్వానికి అనుభవజ్ఞులైన సలహాదారులుగా ఉండేవారు. "ఇండో-చీనీ భాయ్, భాయ్" అనే ఆదర్శంతో, చైనాతో మనదేశానికి ఉన్న మైత్రీ సంబంధాలు చిరకాలంగా కొనసాగడానికిగానీ, 1962 లో చైనా మనపై దాడిచేయకుండా ఉండడంలోగానీ, వీరిసలహాలు ఏమాత్రం ఉపయోగపడలేదు. వారుభయులూ విదేశాల్లో మన రాయభారులుగా బాధ్యతలను నిర్వహించారు. మనకున్న ప్రముఖ రచయితలలో కె.పి.యస్ ఒకరుగా గుర్తింపు పొందారు. శ్రీ ఎ.బి.పాయ్ ఐ.సి.యస్ నాకు ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ నాటినుండి మంచి స్నేహితులుగా ఉండేవారు. భారత ప్రభుత్వ కార్యదర్శిగానూ, రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ గారి వద్ద ముఖ్య కార్యదర్శిగానూ ఆయన బాధ్యతలు నిర్వహించి రిటైర్డ్ అయ్యారు.

శ్రీ డి.యస్.రెడ్డి

ఆక్స్‌ఫర్డ్‌లో నాకు సీనియర్ అయిన భారతీయ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు శ్రీ డి.యస్.రెడ్డి మొదట మదరాసు రాష్ట్రంలోనూ, ఆ తరువాత ఆంధ్రప్రదేశ్‌లోనూ, విద్యాశాఖ డైరెక్టరుగా వచ్చారు. మా గుంటూరుజిల్లాలో ఆయన విరివిగా హైస్కూళ్లను స్థాపించి, విద్యాభివృద్ధికి సహాయపడ్డారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షపదవినుంచి, ఆయనను రాష్ట్ర ముఖ్యమంత్రి తొలగించినప్పుడు, తనకు జరిగిన అన్యాయాన్ని ఆయన న్యాయస్థానంలో సవాల్ చేసిన సంఘటన నన్ను ముగ్ధుడ్ని చేసింది. సుప్రీంకోర్టులో తన వాదానికి అనుకూలంగా ఆయన విజయాన్ని సాధించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీ మేధావి వ్యక్తిత్వం అలాంటి విశిష్టత గలది.

డాక్టర్ దేశ్‌ముఖ్

డాక్టర్ దేశ్‌ముఖ్ సంస్కృతంలో డాక్టరేట్ డిగ్రీ సంపాదించేందుకు ఆక్స్‌ఫర్డు

వచ్చారు. హెచ్.యం.పటేల్ గారికి ఆయన సన్నిహిత మిత్రులు. రైతు ఉద్యమాల్లో మేమిద్దరం పరస్పరం సహకరించుకుంటూ ఉండే వాళ్లం. వాషింగ్టన్‌లో జరిగిన ఆహార, వ్యవసాయ మహాసభలకు ఆయనను 'గ్రామీణ ప్రజాసమాఖ్య' తరపున నేను ప్రతినిధిగా పంపాను. తదుపరి ఈ అనుభవం ఆయన వ్యవసాయ మంత్రి కావడానికి ఉపయోగపడింది. డాక్టర్ దేశ్‌ముఖ్ గారు 'భారత్ కృషిక్ సమాజాన్ని' స్థాపించారు. భారతదేశంలో మొట్టమొదటి సారిగా ఆయన ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనను నిర్వహించారు. రైతు బాంధవుడిగా ఆయన కీర్తి పొందారు.

శ్రీ హెచ్.యం.పటేల్

శ్రీ హెచ్.యం.పటేల్ ఆక్స్‌ఫర్డ్‌లో ఐ.ఎ.యస్ చదివారు. ఆయన నాకు సీనియర్. శ్రీమతి భారతీదేవి, నేనూ శ్రీ ఎ.యస్.క్రిష్ణ, శ్రీ యల్.వి.బి.చౌధురి తదితరులమంతా శ్రీ పటేల్ చాలా గొప్ప వ్యక్తికాగలడని అభిప్రాయ పడుతూ ఉండేవాళ్లం. అనుకున్నట్లే ఆయన భారత ప్రభుత్వ సీనియర్ కార్యదర్శులలో ఒకరుగా ఉన్నత స్థానాన్ని అందుకోగలిగారు. దేశవిభజన సందర్భంలో, భారత, పాకిస్తాన్‌ల మధ్య పంపకాలు జరిగినప్పుడు, శ్రీ పటేల్ భారత్ పక్షాన సమర్థవంతమైన కృషి చేసారు. జవహర్లాల్ నెహ్రూగారికి ఇష్టుడైన క్యాబినెట్ మంత్రి శ్రీ టి.టి.కృష్ణమాచారిపై ముంద్రా కుంభకోణం పేరిట ఆరోపణలు వచ్చినప్పుడు సాహసవంతంగా వ్యవహరించారు. మంత్రిగారి ఆదేశాలకు తలొగ్గకుండా, ఆయన నిర్ణయాలతో విభేదించినప్పుడల్లా, తన అభిప్రాయాన్ని ప్రత్యేకంగా 'నోట్' రాసి ఉంచేవారు. పబ్లిక్ సర్వీసు కమీషన్ డిపార్ట్‌మెంటులో ఉద్యోగనిర్వహణలో ఉండగా, ఒకమంత్రి, కొందరు ఉన్నతాధికారులూ కలిసి పన్నిన కుట్రలో భాగంగా, తనపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరుగుతున్నప్పుడు, నెహ్రూ నిష్పక్షపాతంగా వ్యవహరించనందుకు నిరసనగా, ప్రభుత్వంలో పూర్తిస్థాయి సీనియర్ కార్యదర్శి హోదాను కల్పించినప్పటికీ, ఆత్మాభిమానంతో ఆయన తిరస్కరించడం గర్వకారణంగా భావించాను. సమర్థత, దక్షతగల వ్యక్తిగా ఆయనను గౌరవించి, ఆదశలో నాతోనూ, భాయ్‌లాల్ పటేల్ గారితోనూ కలిసి ఆయనను వల్లభాయ్ విశ్వవిద్యాలయంలో చేరవలసిందిగానూ, స్వతంత్ర పార్టీ కార్యకలాపాల్లో మాతో సహకరించవలసిందిగానూ ఆహ్వానించాను. ప్రముఖులైన భాయ్ కాకాగారి తరవాత, గుజరాత్ రాష్ట్ర స్వతంత్రపార్టీ అధ్యక్షులుగా ఆయన ఎన్నిక కావడం గొప్ప విశేషంగా భావించవలసిఉంది. అంతేకాదు. 1971 లో మాలో చాలామంది ప్రతిపక్ష పార్టీల నాయకులు ఓడిపోయినప్పటికీ, ఆయన పార్లమెంటుకు ఎన్నిక కావడం మరింత విశేషం అని చెప్పవలసి ఉంది. ఆయన వ్యక్తిత్వం ఉన్నత విలువలకు దర్పణం వంటిది.

శ్రీ భాస్కరరావు

శ్రీ భాస్కరరావు ఐ.సి.యస్ చదివారు. తోటివాడైన శ్రీ వెలగపూడి రామకృష్ణ, శ్రీ వెల్లోడి, శ్రీ విజయరాఘవన్, శ్రీ షాబుద్దీన్ వంటి దక్షిణ భారతం నుంచి ఐ.సి.యస్ పట్టా పొందేందుకు వచ్చిన వారివలెనే, ఆయన కూడా నాకు కొంచెం సీనియర్ విద్యార్థి అని చెప్పాలి. యుద్ధానికి ముందు ఐ.సి.యస్‌కు నామినేట్ చేయబడి, ట్రయినింగు నిమిత్తం భారతదేశంనుండి పంపబడిన 50 మందిలో వీరు కూడా ఉన్నారు. భాస్కరరావుగారూ, రామకృష్ణరావుగారు ఇద్దరూ

కూడా ఆంధ్ర నుంచి పంపబడిన ఐ.సి.యస్ ప్రొబేషనర్లు. చిన్న పట్టణమైన బాప్ట్ల హైరోడ్డుకు అడ్డంగా ఉన్న ఎలెన్స్ లాడ్జిలో నేను ఉంటూ ఉండే వాడిని. దానికెదురుగా ఉన్న ఎలెన్స్ ఫారంలో వారు ఉంటూ ఉండేవారు. యల్.వి.బి. చౌదరిగారు, వి.యస్.క్రిష్ణగారూ నాపట్ల ప్రత్యేక అభిమానాన్ని కలిగి ఉండేవారు. భారతదేశంలో డిగ్రీ పొందకుండా అక్కడికి వెళ్లినవారు, అక్కడివారి "స్థాయీ నిర్ణయ ప్రవేశ పరీక్ష" కు హాజరుకావలసి ఉంటుంది. భాస్కరరావుగారు నన్ను సెయింట్ కేథరిన్స్ ఎకాడెమీ ప్రిన్సిపాల్ గారికి పరిచయంచేసి అలాంటి ప్రవేశ పరీక్షకు హాజరయ్యేందుకు నాకు అనుమతిని సంపాదించిపెట్టారు. ఆయనకు పాశ్చాత్య జీవన విధానంపై ఆసక్తి ఎక్కువ. శ్రీ యల్.వి.బి.చౌదరిని ఆయన తన కలం స్నేహితునిగా చేసుకొని తరచు జాబుల ద్వారా పరస్పరం సమాచారాన్ని తెలియబరచుకుంటూ ఉండేవాళ్లు. పాశ్చాత్య అలంకరణ రీతిలో దుస్తులు ధరించే పద్ధతిని ఆయన నాకు నేర్పి సహకరించారు.

జీవన రంగంలో శ్రీ యల్.వి.బి. జిల్లా కలెక్టరుగా ఉద్యోగం నిర్వహించి, మంచి పేరు ప్రఖ్యాతులను సంపాదించారు. దేశంలో రాజకీయంగా అరాచక పరిస్థితులు ఏర్పడినప్పుడు, అటు ప్రభుత్వ చట్టాలను యధాతధంగా అమలు పరుస్తూ, ఇటు రాజకీయ ఖైదీలను బాధించకుండా, ఉదాత్తంగా తన ఉద్యోగ బాధ్యతల్ని నిర్వహించారు. ఏ రాజకీయ నాయకులు కూడా ఆయనపై, ఏ సందర్భంలోనూ ఎట్టి ఆరోపణలను చేయలేక పోయారు.

తరవాత ఆయన రాజకీయాల్లో ప్రవేశించి, స్వతంత్ర సభ్యులుగా రాజ్యసభకు ఎన్నికై, నేను నాయకత్వం వహిస్తున్న 'కృషికార్ లోక్ పార్టీ"లో ఆయన చేరారు. రాజ్యసభలో చైర్మన్ శ్రీ సర్వేపల్లి రాధాక్రిష్ణగారి వద్ద, ఆయన పార్టీలో చేరుతూ "నేను రంగాగారి నాయకత్వాన్ని శిరసా వహిస్తున్నాను. ఎందుకంటే ఆయన జాతీయ నాయకుడిగా ఉన్నత స్థానానికి రావాల్సిన ఆవశ్యకత వుంది గనుక" అని అన్నారు.

శ్రీ యల్.వి.బి.చౌదరి ఆక్సఫర్డ్‌లో న్యాయశాస్త్రాన్ని అభ్యసించి బారిష్టరు పట్టా పొందారు. ఆదాయపు పన్ను అధికారిగా ఆయన ఉద్యోగంలో చేరి అసిస్టెంటు కమీషనరుగా ఉద్యోగ విరమణ చేసారు. తరవాత ఆయన సమకాలీన సామాజిక గ్రామీణ సమస్యలపైన అనేక రచనలు చేసారు. తెలుగు సాహిత్యానికి అవి వన్నె తెచ్చాయి. ఆయనకు లలిత కళలంటే ఎక్కువ ఇష్టంగా ఉండేది. అందులో ముఖ్యంగా 'చిత్రలేఖనం' మీద అభిమానం జాస్తి. ఆ కారణంగా, వాటివల్ల పొందిన అభినివేశం, అనుభవాన్ని పురస్కరించుకొని ఆయన 'ఆంధ్రప్రదేశ్ లలితకళల అకాడెమీ" సభ్యత్వాన్ని పొందగలిగారు. "ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ" లో కూడా అయిదు సంవత్సరాలపాటు ఆయన సభ్యులుగా ఉన్నారు. శ్రీ వి.యస్.కృష్ణగారితోనూ, ఆయనతోనూ ఎన్నో సంవత్సరాలుగా నేనూ, భారతీదేవిగారూ మంచి ఆప్తులుగా ఉంటూ వచ్చాము. జాతీయాభిమానం, సాంప్రదాయిక మనస్తత్వం నాది. కాగా శ్రీ యల్.వి.బి.చౌదరి, మరొక ఆక్సఫర్డ్ సహపాఠి అయిన శ్రీ కె.గోపాలస్వామిగార్లు పాశ్చాత్య సంస్కృతిపై మమకారం కలిగి ఉండేవారు. యూరోపియన్ల జీవన విధానం. వ్యక్తిగత విభేదాలు లేకుండా, కలిసికట్టుగా నిర్వహించే సాంఘిక సేవలు, సమిష్టి దృక్పథాన్ని తెలియజేస్తూ, ఆంగ్ల భాషలో "ట్రాన్సైక్షన్స్" అనే పేరుతో గ్రంధాన్ని రచించారు. దానికి చక్కటి ప్రశంస లభించింది. ఈ

గ్రంథంలోని కొన్ని భాగాలు 1928 లో "త్రివేణి" పత్రికలో ప్రచురించ బడ్డాయి. 1972 లో ఈ గ్రంధం పూర్తి ప్రచురణకు నోచుకున్నది. ఆయనకు బాగా సన్నిహిత మిత్రులైన శ్రీ కూర్మావేణు గోపాలస్వామి దీనికి పరిచయవాక్యాలు రాసారు. గాంధేయవాదినైన నాకు ఈ గ్రంధాన్ని అంకితమిచ్చారు. శ్రీ మున్షీగారు "భవాన్స్ జర్నల్" లో హైందవంలో నవ్యత చోటుచేసుకోవాల్సిన ఆవశ్యకత కొరకు దీనిని ప్రచురించారు. తన జీవిత చరిత్రను 'స్వవిషయం' అను పేరుతో మూడు సంపుటాలుగా ప్రచురించి, జీవిత చరిత్ర రచనా విధానాన్ని ఆయన కొత్త పుంతలు తొక్కించారు. ఒక ప్రభుత్వోద్యోగి జీవితాన్నుండి సమాజంగానీ, సాహితీపరులుగానీ, సంఘ సేవకులుగానీ నేర్చుకోవాల్సిన అంశాలు ఏమేరకు ఉంటాయన్న సంశయాన్ని తొలగిస్తూ, ప్రభుత్వోద్యోగి దైనందిన జీవితంలో కూడా సాంఘిక, సాంస్కృతిక పరంగా స్పందించగల ఘటనలెన్నో ఉంటాయన్న నగ్న సత్యాన్ని ఈ గ్రంధం రుజువుచేసి, సాహితీ లోకానికి 'నజరానా'గా రాణించింది. చాలామంది భారతీయులు పాశ్చాత్య రచనలపట్ల అభిరుచి గల వారన్న విషయం తెలిసిన వారు గనుక, శ్రీ యల్.వి.బి.చౌదరి, జీవన విధానంలోని ఆనందాన్ని, అందాల్ని, మాటల మూటలుకట్టి మనకందించారు. శ్రీ కె.పి.యస్.మీనన్, శ్రీ కరకా, శ్రీ కుష్వంత్‌సింగ్‌గార్లు ఆంగ్లభాషలో ఎంతటి సమర్థవంతమైన రచనలు చేసారో, శ్రీ చౌదరి అంత దీటుగా తెలుగుభాషలో ఈ గ్రంధాన్ని మలచి మనకందించారు. చౌదరిగారు రచించిన స్వీయ జీవితగ్రంధం చదువుతుంటే, ప్రసిద్ధ సంస్కృతాంధ్ర కవివరేణ్యులైన 'శ్రీనాధమహాకవి' జీవితం, పాండిత్యం మనకు జ్ఞప్తికి వస్తాయి.

పశువుల పెంపకం, పాలవుత్పత్తి, వ్యవసాయరంగంలోని కార్యకలాపాలపట్ల ఆయన అభిరుచిని పెంచుకున్నారు. ఆయన స్వగ్రామమైన కృష్ణాజిల్లాలోని పెడసనగల్లులో పశువైద్యశాల, పాలవుత్పత్తి సేకరణ కేంద్రాల స్థాపనకు ఆయన ఆద్యులు. "గ్రామాలకు తిరిగి వెళ్లండి" అనే గాంధీజీ సూత్రాన్ని నిజజీవితంలో ఆయన ఆచరణలో పెట్టారు.

శ్రీ కూర్మా వేణుగోపాలస్వామి

శ్రీ గోపాలస్వామిగారు అంతకు పూర్వమే మద్రాసులో డిగ్రీపుచ్చుకొన్నప్పటికీ, ఆక్సఫర్డ్‌లో నాకు జూనియర్‌గా ఉండేవారు. ఆయన ప్రసిద్ధ జస్టీస్ పార్టీ నాయకులైన శ్రీ కె.వి.రెడ్డినాయుడు గారి కుమారులు. తండ్రీ, తనయులిద్దరూ కూడా మంచి వక్తలు. శ్రీ రెడ్డినాయుడు భారత ప్రభుత్వ ప్రతినిధిగా దక్షిణాఫ్రికాలో తన సేవలందించాడు. గోపాలస్వామిగారు కూడా తండ్రిగారి వరవడిలోనే సభావేదికలపై చక్కగా ఉపన్యసించగల దిట్ట. ఒక దశాబ్దం పాటు ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఎంపిక అయిన రిజిస్ట్రారుగా బాధ్యతలను నిర్వహించారు. తరవాత కావలిలోని ప్రథమశ్రేణి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉన్నారు. ఆంధ్రలలిత కళా అకాడెమీలో ఆయన ప్రముఖ సభ్యులుగా ఉండేవారు.

శ్రీ వి.యస్.కృష్ణ

ఆక్సఫర్డ్ యూనివర్శిటీలో శ్రీ వి.యస్.కృష్ణ నవీన శాస్త్రంలో ఎం.ఏ. పట్టాను,

శ్రీ కె.వి.గోపాలస్వామి చరిత్రలో ఎం.ఏ. పట్టాను తీసికొన్నారు. వీరిద్దరూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒకరు వైస్ ఛాన్సలరుగానూ, మరొకరు రిజిస్ట్రారుగానూ పదిసంవత్సరాలపాటు బాధ్యతలు నిర్వహించారు. శ్రీ వి.యస్.కృష్ణ ఆక్స్‌ఫర్డులో అయిదు సంవత్సరాల కాలం నాకు సహ విద్యార్థిగా ఉన్నారు. విశ్వవిద్యాలయం తాలూకు ఆటలు, సాంస్కృతిక వ్యవహారాలు, ఇతర కార్యక్రమాల్లో మేమిద్దరం కలిసి పనిచేస్తూ ఉండేవాళ్లం యూనివర్శిటీ యూనియన్ కార్యకలాపాల్లో నేను తరచుగా పాల్గొంటూ, ఉపన్యసిస్తూ ఉండేవాడిని. యూనియన్ వ్యవహారాల్లో కృష్ణగారు నన్ను బలపరుస్తూ ఉండేవారు. శ్రీ యల్.వి.బి.చౌదరి, శ్రీ కె.వి.గోపాలస్వామిగార్లు ఇరువురూ సన్నిహిత మిత్రులుగా ఉంటూ, కాస్మోపాలిటన్, ఏషియాటిక్, లోటస్ క్లబ్బుల్లో ప్రధానంగా పాల్గొంటూ ఉండేవారు. శ్రీ కృష్ణగారు ప్రజాసేవారంగంలో ప్రధాన పాత్ర వహించగలరని నేను ఆశిస్తూ ఉండేవాడిని.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లెక్చరర్‌గా చేరకముందు ఆయన శ్రీ వెలగపూడి రామకృష్ణ ఐ.సి.యస్ గారి ప్రోత్సాహంతో బ్యాంకింగ్, జమిందారీ పరిపాలనా రీతులపై అధ్యయనం చేయసాగారు. "అంతర్జాతీయ ఆర్థికాంశాల పరిశోధన"కు కేంద్ర స్థానమైన వియన్నాలో ఆయన పి.హెచ్.డి చేసిన తరవాత, ఆయన ఆర్థిక శాస్త్రంలో 'ప్రొఫెసర్'గా ఉద్యోగ నిర్వహణ చేసారు. ఆయన వియన్నాలో ఉన్నప్పుడు, అక్కడ ప్రవాస జీవితాన్ని గడుపుతున్న సుభాష్ చంద్రబోసుతో నాకు పరిచయాన్ని కలిగించారు. ఆ సమయంలో ఎదురయ్యే ఇబ్బందులను కూడా ఆయన పరిగణలోకి తీసుకోలేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ఉపాధ్యక్షులుగాఉన్న శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణ, సి.ఆర్.రెడ్డి గార్లిరువురూ కూడా, తమ శాఖలను సమర్థవంతంగా నిర్వహించటలోనూ, విద్యార్థులను సత్యమైన మార్గంలో రూపొందించడంలోనూ కృష్ణగారి కృషికీ, దక్షతకూ సంతృప్తిచెంది, రిజిస్ట్రారుగా, తదుపరి వైస్ ఛాన్సలర్‌గా ఆయన ఎన్నిక కావడానికి సహాయ పడ్డారు.

కృష్ణగారు వక్తగాదు. కానీ ఉత్తమ పరిశోధకులు. సమకాలీన ఆర్థిక సమస్యలు, రీతులను పరిశోధించి, ఆచరణ సాధ్యమైన సూచనలందించగల దార్శనికులు. అందువలన ఆయనపట్ల యం.ఎ తరగతి విద్యార్థులకూ, పరిశోధనచేస్తున్న తోటి లెక్చరర్లకూ తగని గౌరవం ఏర్పడింది.

ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్‌గా పదవీబాధ్యతలు స్వీకరించినప్పటినుంచీ, ఆయన శక్తి, సామర్థ్యాలు వెలుగులోకి వచ్చాయి. యూనివర్శిటీలోని ఉపాధ్యాయులతోనూ, యూనివర్శిటీలోనూ, బయటనుండీ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులతోనూ సత్సంబంధాలుకలిగి, వారి పూర్తి విశ్వాసాన్నీ, అభిమానాన్నీ పొంది ఉత్తమ ఉపాధ్యక్షునిగా పరిగణింపబడ్డారు. ఆ రోజుల్లో ఉత్తర భారత దేశంలోని విశ్వవిద్యాలయాలలో చాలావాటిల్లో ఉద్రేకపూరితమైన పరిస్థితులు నెలకొని ఉండేవి. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పదమూడు సంవత్సరాలు ఉపాధ్యక్షునిగా బాధ్యతలు నిర్వర్తించిన శ్రీ వి.యస్.కృష్ణగారిని, మదరాసు విశ్వవిద్యాలయంలో దీర్ఘకాలం ఉపాధ్యక్షులుగా ఉన్న శ్రీ లక్ష్మణస్వామి మొదలియార్‌గారినీ ఉభయవిశ్వవిద్యాలయాల్లో శాంతియుత వాతావరణాన్ని నెలకొల్పి, విద్యనభ్యసించడానికి విద్యార్థులకు అనువైన పరిస్థితులను కల్పించి, వీటిని సక్రమంగా నిర్వహించి నందుకుగాను, కేంద్ర విద్యాశాఖామాత్యులు

హృదయపూర్వకంగా అభినందించారు. ఆక్స్‌ఫర్డులో మా ఇద్దరకూ స్నేహితులుగా ఉన్న శ్రీ గోపాలస్వామిగారి సమర్థత, చాకచక్యం కూడా శ్రీ వి.యస్.కృష్ణా తన పదవిలో కీర్తి ప్రతిష్టలు పొందడానికి చాలావరకు కారణమని చెప్పవలసి ఉంది. స్వాతంత్ర్యం రాకముందు అప్పటి విశ్వవిద్యాలయాల్లో ఉపాధ్యక్షులుగా ఉన్న వారు స్నాతకోత్సవ సభలలో చేసే ప్రసంగాలు భారతీయ మేధావుల రాజకీయ దృక్పథానికి ప్రతిబింబంగా ఉంటూ వచ్చేవి. స్వాతంత్ర్యానంతరం ఉపాధ్యక్షులుగావున్న మొదలియార్ గారికి, కృష్ణాగారికి బాధ్యతానిర్వహణలోనూ, పరిశోధనలలోనూ పూర్వపు స్నాతకోత్సవ ఉపన్యాసాలు మార్గదర్శకంగా తోడ్పడ్డాయి. ఆధునిక కాలంలో ప్రతి దశాబ్దానికి పదికిపైగా కొత్త విశ్వవిద్యాలయాలు స్థాపించబడుతూ, వేలసంఖ్యలో విద్యార్థులు విద్యాభ్యాసం గావిస్తున్నారు. ఇట్టి సమయంలో విశ్వవిద్యాలయాల సక్రమ నిర్వహణకు ఉపన్యాసకులకంటే, ఉపాధ్యక్షులు సమర్థత, దక్షత మూర్తీభవించిన వారిగా ఉండవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఇదే సందర్భంలో శ్రీ వి.యస్.కృష్ణాగారు సమర్థుడైన ఉపాధ్యక్షునిగా పరిగణింపబడ్డారు. తరగతిగదుల్లోనూ, పరిశోధనావిభాగాల్లోనూ, హాస్టళ్లల్లోనూ, చివరికి ఆటపాటల సందర్భంలో సైతం ప్రాంతీయ, కుల, మత, వర్గ భావాలు ప్రవేశించి, విశ్వవిద్యాలయాల వాతావరణం అవాంఛనీయ పరిస్థితులతో, అశాంతిపూరితంగా నేడు తయారయ్యింది. ఇట్టి పరిస్థితుల్లో విశ్వవిద్యాలయంలోని ప్రతి విభాగపు సభ్యులతోనూ, విద్యార్థులతోనూ, స్నేహపూరితమైన సంబంధాలు కలిగి, విశ్వవిద్యాలయాన్ని సక్రమంగా, శాంతియుతంగా నడుపుకు రావడం సామాన్య విషయం కాదు. విశ్వవిద్యాలయంలోని విద్యాభ్యాసానికి అనుబంధంగా ఉండే కవిత్వం, చిత్రలేఖనం, నటన, సాంఘిక సేవలవంటి కార్యక్రమాల్లో విద్యార్థులకు ఆసక్తిని రేకెత్తించి, అభిరుచిని పెంచి, శ్రీ గోపాలస్వామిగారు విశ్వవిద్యాలయం సమగ్రతను సంతరించుకొనే కార్యక్రమాలను రూపొందించుచూ, శ్రీ వి.యస్.కృష్ణాగారి కృషికి తోడ్పాటు నందించారు. ఆక్స్‌ఫర్డు పూర్వ విద్యార్థులయిన ఆ ఇరువురి కృషితో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి, ఆక్స్‌ఫర్డు పూర్వ విద్యార్థుల ప్రతిభకు దర్పణంగా వీరు ప్రతిభావంతమైన గౌరవాన్ని సంతరించి పెట్టారు.

అనుకూలవతియైన సతీమణి లభించడం శ్రీ కృష్ణాగారి అదృష్టంగా భావించాల్సి ఉంది. ఆయన గుండె జబ్బుకు గురిఅయినప్పుడు, ఆమె అత్యంత భక్తిశ్రద్ధలతో ఆయనకు సేవచేసింది.

యూనివర్శిటీ గ్రాంట్సు కమీషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించవలసిందిగా, దాని మొదటి చైర్మన్ డాక్టర్ దేశ్‌ముఖ్, అప్పటి కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖామాత్యులు శ్రీ మాలి శ్రీకృష్ణాగారిని ఆహ్వానించినప్పుడు, అంత గొప్ప బాధ్యతను నెత్తికెత్తుకొనవద్దని ఆయన సతీమణి సలహాఇచ్చింది. అయితే కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖలోని పలువురు పెద్దలు అనేకమంది ఈ పదవికి వి.యస్.కృష్ణాగారే తగిన వ్యక్తులని భావించి, ఆయనపై వత్తిడి తెచ్చారు. డాక్టర్ దేశ్‌ముఖ్‌గారు నెలకొల్పిన ఉన్నత సాంప్రదాయాలను నిలబెట్టగలిగిన సమర్థులు కృష్ణాగారు మాత్రమేనని వారంతా భావించారు. తనకు అయిష్టంగా ఉన్నప్పటికీ కృష్ణాగారు ఈ బాధ్యతను నిర్వహించడానికి అంగీకరించక తప్పలేదు. యూనివర్శిటీ గ్రాంట్సు కమీషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించబోయేముందు ఆయన యాబది వేల రూపాయల విలువైన తన స్వంత

గ్రంధాలయాన్ని ఆంధ్ర విశ్వవిద్యాలయానికి విరాళంగా ఇచ్చారు. తరవాత సతీసమేతంగా ఢిల్లీ వెళ్లి కొన్ని వారాలు మాత్రమే యు.జి.సి. చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. అప్పటి విద్యాశాఖమంత్రి శ్రీమాలి గారితో కూర్చుని చర్చిస్తున్న సమయంలో, గుండెపోటుతో ఆయన బల్లమీదనే ఒరిగి హఠాన్మరణం చెందారు. కొన్ని సంవత్సరాలు ఆక్సఫర్డ్‌లో నాకు అతి సన్నిహితంగా ఉన్న మంచి మిత్రుడు సమస్త గౌరవ లాంఛనాలతో మనల్ని వీడిపోయారు.

కృష్ణాగారి మరణానంతరం ఆయన సతీమణి ధార్మిక చింతనతో తనకున్న ఆస్థిని భర్తగారిపట్ల పూజనీయ భావనతో, తన స్వగ్రామమైన రాజోలులోని ఒక ప్రైవేటు కళాశాలకు, విశాఖపట్నంలోని ప్రభుత్వ కళాశాలకు విరాళంగా ఇచ్చారు. ఈ రెండు కళాశాలలకు గౌరవ సూచకంగా కృష్ణాగారి పేరిట నామకరణం చేయడం జరిగింది.

శ్రీ ఓ. పుల్లారెడ్డి

శ్రీ ఓ. పుల్లారెడ్డి ఐ.సి.యస్‌కు ఎంపిక కాబడి అందుకు సంబంధించిన పోటీ పరీక్షలు భారతదేశంలో జరుగుతున్నప్పటికీ ఆక్సఫర్డ్‌కు వచ్చిన ఆంధ్రులలో ఒకరుగా ఉన్నారు. అక్కడ ఆయన మాకందరకూ సన్నిహిత మిత్రులయ్యారు. ఇండియన్ మజ్లిస్ పట్ల ఆయన ఎక్కువ అభిమానాన్ని చూపిస్తూ ఉండేవారు. శ్రీ సత్యమూర్తి మద్రాసు కార్పోరేషన్ మేయర్‌గా ఉన్న సమయంలో, శ్రీ పుల్లారెడ్డి దానికి కమీషనరుగా వచ్చారు. తరవాత ఆయన రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శిగానూ, ఢిల్లీలో రక్షణ శాఖ కార్యదర్శిగానూ పదవీ బాధ్యతలు నిర్వహించి, తన సమర్థతను నిరూపించుకున్నారు. పదవీ విరమణ చేసిన తరవాత, ఆయన హైద్రాబాద్‌లో రాజేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. మేము ఉభయులం నాటినుంచి నేటివరకు సన్నిహిత మిత్రులుగానే ఉండిపోయాం. నేను పార్లమెంటుకు ఎన్నికై వచ్చిన ప్రతి సందర్భంలో, రాజకీయంగా శక్తివంతుడైన జవహర్లాల్‌కు వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యునిగా వచ్చినప్పటికీ, ఢిల్లీలో ఆయన నాకు స్వాగతం పలుకుతూ ఉండేవారు. కారణం ఏమంటే నేను రైతుసంక్షేమ నాయకునిగా, రైతాంగ ఉద్యమాలు నిర్మిస్తుండేవాడిని గనుక. శ్రీ పుల్లారెడ్డిగారి తలిదండ్రులు స్వతంత్ర జీవనం గడిపే రైతుకుటుంబానికి చెందిన వారు. రైతుల సమస్యలపై పార్లమెంటుకు ఎన్నిక కావడమే పుల్లారెడ్డిగారి అభిమానానికి కారణంగా చెప్పవచ్చు.

శ్రీ యస్.కె.డి. పాలీవాల్

ఉత్తరప్రదేశ్ రాజకీయ రంగంలో తుఫాన్‌లా దూసుకొచ్చిన రాజకీయ నాయకుల్లో ప్రముఖులైన శ్రీ కృష్ణదత్ పాలీవాల్ గారు స్వతంత్ర్యంరాకముందూ, తరవాత కూడా రాజకీయ నాయకునిగా చెలామణీ అవుతూ వచ్చారు. కాన్పూర్‌లో వీరమరణం చెందిన ఓ విద్యార్థి స్మృతి సందర్భంగా ఏర్పాటైన సదస్సులో పాల్గొనడం ద్వారా, ఆయన రాజకీయ జీవితం ప్రారంభమైంది. హిందీభాష లో ఆయన ప్రముఖ రచయితగా గుర్తింపుపొందారు. ఆయన రచనలు హాస్య ధోరణితో, వ్యంగ్యోక్తులతో, చెప్పే విధానంలో ప్రత్యేక శైలిని సంతరించుకొని హిందీ సాహితీ రంగంలో నూతన ప్రక్రియలను ప్రవేశపెట్టాయి. ప్రజాసేవాకార్యక్రమాల్లో ఆయన కెదురు నిలిచే సాహసం శత్రువులు, మిత్రులు కూడా చేయలేకపోయేవారు. రఫీ అహ్మద్ కిద్వాయ్ గారికి ఆయన ముఖ్యమైన అనుచరులుగా ఉండేవారు. అయితే స్వరాజ్యం వచ్చిన తరవాత యు.పి.లో గోవింద వల్లభ్ పంత్ గారు ఆయనకు ముఖ్యస్థానాన్ని కల్పించి, తన మంత్రివర్గంలోకి తీసుకొని, తన అనుచరునిగా చేసుకున్నారు. ఆవిధంగా పాలీవాల్ గారు యు.పి. కాంగ్రెసు అధికార రాజకీయాల్లోకి ప్రవేశించారు.

జాతీయ పోరాటం తీవ్రంగా సాగుతున్న క్లిష్టసమయంలో ఆయన యు.పి. కాంగ్రెసు కమిటీ అధ్యక్షులుగా ఉంటూ 1940-45 సంవత్సరాల మధ్య జాతీయోద్యమానికి గొప్ప సేవలందించారు. అప్పట్లో జరిగిన ముఖ్య పోరాటాలన్నిటా ఆయన చురుకుగా పాల్గొని, అనేకసార్లు జైలుకువెళ్ళి ప్రముఖ జాతీయ నాయకుడిగా పేరుపొందారు. ఆయన సతీమణి కూడా జైలుకెళ్ళింది. శ్రీమతి భారతీదేవి రికి ఆమె సన్నిహిత మిత్రురాలుగా ఉండేది. పాలీవాల్ గారు హిందీలో మంచి వక్త. సమర్థులైన గొప్ప రచయిత. శాసనసభలలోనూ, రాజకీయ సభలలోనూ ఆయన ఉపన్యాసాలు ఉదాత్తంగా ఉండి, ప్రజలను బాగా ఆకట్టుకునేవి.

ఒక్కొక్క సమయంలో ఆయనకు ఆయనే ప్రత్యర్థిగా రూపొందేవారు. ఏదైనా ఒక అంశాన్ని తీసుకొని, దాన్ని సాధించేందుకు ఎన్ని కష్టనష్టాలు ఎదురైనప్పటికీ లెక్కచేయకుండా, ముందుకు సాగిపోతూ ఉంటారు. అవసరాలకు ఆయనను ఉపయోగించుకునే మిత్రులే, ఇబ్బందులెదురైనప్పుడు ఆదుకునేవారు కాదు. వల్లభ్ పంత్ గారి బలోపేతమైన రాజకీయ సౌధానికి, పాలీవాల్ గారు మూలస్థంభంగా ఉంటూ, యు.పి. ఆర్థిక శాఖామంత్రిగా చాలాకాలం పనిచేసారు.

పాలీవాల్ గారి రాజకీయ జీవితం ఆర్థిక ఇబ్బందులతోనే గడిచింది. కేవలం వ్యక్తిగత సామర్థ్యంతోనూ, స్నేహ సంబంధాల ద్వారాను ఆయన నిధులను సేకరించి, 'డెయిలీ సైనిక్' పేరిట పత్రికను ప్రారంభించి తద్వారా రాజకీయ పోరాటాన్ని కొనసాగించారు. అప్పటి బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో సర్ మాల్కం వంటి అనేకమంది గవర్నర్లు ఆ పత్రికకు పూచీకత్తులను చెల్లించవలసిందిగా వత్తిడిచేసేవారు. అయినప్పటికీ దేశసేవకు ఉపయోగపడే పత్రికా నిర్వహణలో

తనకెదురైన ఎలాంటి నష్టాలను సైతం లెక్కచేయకుండా ఆయన ముందుకు సాగారు. శ్రీయుతులు పాలీవాల్ మోహన్‌లాల్ సక్సేనా, నేనూ అప్పటి పార్లమెంటు హౌస్‌పై ఉండే బ్రిటిష్ పతాకాన్ని కిందికి లాగివేసి, స్పీకరు అబ్దుల్ రహీంగారి కోపానికి గురిఅయ్యాం. మేం రాజకీయపరమైన కార్యకలాపంగా ఎట్టి నేరం చేయలేదని సంజాయిషీ ఇవ్వవలసిందిగా మహాత్మా గాంధీజీని వైస్రాయి వత్తిడిచేసాడు. ఆ సందర్భంలో పాలీవాల్, మోహన్‌లాల్‌గారూ వైస్రాయి సూచనను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించవద్దని నాకు చెప్పారు. అలాంటి ధైర్యసాహసాలు మూర్తీభవించిన స్వాతంత్ర్య వీరులు వారు. ఆ సంఘటనతో శాసనసభలో మేం తలవంచని వీరులుగా ప్రశంసింపబడ్డాం. స్వరాజ్యం వచ్చిన తరువాత మా సహచరులైన శ్రీ మోహన్‌లాల్ సక్సేనాగారు కేంద్రప్రభుత్వంలో కాందీశీకుల పునరావాస శాఖామంత్రిగా బాధ్యతలను నిర్వహిస్తూ ఉండేవారు. దేశ విభజన సందర్భంలో ఎదురైన క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న సమయంలో పండిట్ నెహ్రూగారికి ఆయన బాగా తోడ్పడ్డారు.

పాలీవాల్‌గారు రైతులపట్ల ఎక్కువ అభిమానాన్ని కలిగి ఉండేవారు. ఉత్తరప్రదేశ్‌లో బలవంతులైన వ్యాపార వర్గాలు, బ్రిటిష్ ప్రభుత్వ తాబేదార్ల వత్తిడులకు, దోపిడీలకు గురిఅవుతున్న రైతాంగ సమస్యలపై ఆయన ఎక్కువ ఆసక్తిని చూపేవారు. ఆయనలోని ఈ దృక్పథమే, మా ఇద్దరినీ ఏకాభిప్రాయంగల మిత్రులుగా రూపొందించింది. మేమిద్దరం 1935-39 మధ్య కేంద్ర శాసనసభాసభ్యులుగా ఉన్నాం. శాసనసభ్యులతో రైతుసమస్యలపట్ల కృషిచేసే వారితో, 'రైతువర్గం'గా రూపొందడానికి, నేను చేస్తున్న ప్రయత్నానికి ఆయన ఎంతగానో సహాయం చేసారు. అప్పట్లో ప్రముఖ పత్రికగా ప్రచారంలో ఉన్న 'సైనిక్' పత్రిక కిసాన్ సంచికకు సంపాదకులుగా ఉండవలసిందిగా, ఆయన నన్ను ఆహ్వానించారు.

నేను కృషికార్ లోక్‌పార్టీని స్థాపించినప్పుడు, దానిలో చేరిన మొట్టమొదటి ప్రముఖ నాయకుల్లో ఆయన ఒకరు. 1959 లో రాజాజీగారు స్వతంత్ర పార్టీని స్థాపించినప్పుడు, నేను దానికి వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగుతున్న రోజుల్లో, నెహ్రూ నియంతృత్వానికి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్య ప్రతిపక్షంగా రూపుదిద్దుకునేందుకు, పాలీవాల్‌గారు తమ 'గ్రామ స్వరాజ్ పార్టీ'ని, 'స్వతంత్రపార్టీ'లో విలీనం చేశారు. అప్పట్లో ప్రముఖ జాతీయ వాది, దేశభక్తులు, మంకపూర్‌కు చెందిన స్వర్గీయ శ్రీ ప్రతాప్‌సింగ్ గ్రామ స్వరాజ్ పార్టీకి ఉపాధ్యక్షులుగా ఉండేవారు. 1959 జనవరిలో నాగపూర్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెసు మహాసభల్లో, "సహకార వ్యవసాయ" తీర్మానాన్ని వ్యతిరేకించిన ప్రముఖ ఉత్తరప్రదేశ్ రైతు నాయకులు శ్రీ చరణ్‌సింగు మేము ఏర్పాటుచేసిన ప్రతిపక్షంలో చేరలేదు.

1961లో చారిత్రక పట్టణమైన ఆగ్రాలో స్వతంత్ర పార్టీ మహాసభలు పెద్దఎత్తున జరిగాయి. ఆ మహాసభల సందర్భంలో అధ్యక్షుని ఊరేగింపు కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడనైన నన్నూ, పాలీవాల్ గారినీ వేలాది మంది ప్రజలు ఉత్సాహ భరితంగా పాల్గొని, పెద్ద ఎత్తున ఊరేగించి, మాపట్ల తమ గొప్ప గౌరవాన్ని వారు వ్యక్తపరచడం జరిగింది. ఆ మహాసభలో పాలీవాల్‌గారు మాట్లాడుతూ "ఇంత పెద్ద ప్రదర్శన ఇంతకు మునుపెన్నడూ జరగలేదనీ, తమ నాయకుడిపట్ల అభిమానంతో జరిపిన ఈ ఊరేగింపు ఆగ్రా నగర చరిత్రలోనే ముఖ్య సంఘటనగా నిలిచి పోతుందనీ" అని అన్నారు. అదే సందర్భంలో

నగరంలో ఉన్న పెద్ద పబ్లిక్ పార్కును 'పాలీవాల్ పార్కు'గా మార్చి ఆగ్రా నగరం ఆయనను గౌరవించింది.

ఆగ్రా సమావేశంలో, స్వతంత్ర పార్టీ అధికారంలోకి రావడం జరిగితే, రైతులకు వెసులుబాటు కల్పించేందుకు రాజాజీ ప్రతిపాదించిన 'భూమిశిస్తు రద్దు' తీర్మానం ఆమోదితమైంది. రాజాజీ తీర్మానాన్ని "స్వతంత్ర పార్టీ ఆశయాలపంట"గా పాలీవాల్ గారు అభివర్ణించారు. ఈ తీర్మానానికి అనుగుణ్యంగానే ఒరిస్సాలో అధికారానికి వచ్చిన స్వతంత్ర పార్టీ ఆధ్వర్యంలోని ముఖ్యమంత్రి శ్రీ ఆర్.పి.సింగ్‌దేవ్ భూమిశిస్తును రద్దుచేయడం జరిగింది. శ్రీపాలీవాల్ అప్పటివరకు జీవించే ఉన్నారు.

1968 లో కాంగ్రెసు నాయకుల ఆహ్వానం మేరకు ఆయన తిరిగి కాంగ్రెసు సంస్థలో ప్రవేశించారు. చనిపోయే నాటికి ఆయన రాజ్యసభ సభ్యులుగా కొనసాగుతున్నారు.

5

శ్రీ గోవింద వల్లభ్‌పంత్

(శ్రీ గోవింద వల్లభ్‌పంత్ నైనిటాల్‌లో 1888 వ సంవత్సరంలో జన్మించారు. ఆయన లక్నో నివాసి. న్యాయవాది. 1934లో కేంద్ర శాసన సభ్యులుగా ఉన్నారు. 1920 నుండి కాంగ్రెసు నిర్వహించిన ఉద్యమాలన్నింటిలోనూ ఆయన సత్యాగ్రహిగా పాల్గొన్నారు. 1936-39 మధ్య, తిరిగి 1947-54 లోనూ ఆయన ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాణసభ సభ్యులుగా కూడా ఉన్నారు. 1954 నుండి 61 వరకు ఆయన కేంద్ర ప్రభుత్వ హోంశాఖమంత్రిగా సమర్థవంతంగా పనిచేశారు. 1937-59 మధ్య అఖిలభారత కాంగ్రెసు పార్టీ కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. శ్రీయుతులు మహాత్మాగాంధీజీ, రాజాజీ, సర్దార్ పటేల్, నెహ్రూజీలకు సన్నిహిత సహచరులు. 1961లో ఆయన స్వర్గస్థులయ్యారు.
- (ఎడిటర్)

బ్రిటీషు వారి హయాంలో శ్రీ గోవింద వల్లభ్‌పంత్ కేంద్ర శాసనసభలో కాంగ్రెసు పార్టీ ఉపనాయకులుగా ఉంటూ, బ్రిటీషు ప్రభుత్వం కొనసాగించే ఆర్థిక విధానాల మీదా, బడ్జెట్ నిర్వహణపైనా తీవ్రమైన విమర్శలు చేస్తూ ఉండేవారు. భారతదేశ ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ఆయన గట్టిగా పోరాడుతూ ఉండేవారు. బ్రిటీషువారితో పోటీపడుతూ, శ్రీ అవినాశలింగంచెట్టియార్, భారత పారిశ్రామిక వేత్తల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నిస్తూ ఉండేవారు. పారిశ్రామిక వేత్తలపై పన్నులను పెంచినప్పుడు ఆయన తీవ్ర నిరసనను తెలియజేస్తూ ఉండేవారు. బ్రిటీషు ప్రభుత్వం కేవలం పోలీసు ప్రభుత్వమేనని, ఈ ప్రభుత్వం ప్రజల సాంఘిక స్థితిగతులను విస్మరిస్తున్నదని విమర్శిస్తూ, నేను సాంఘికాభివృద్ధిని విధిగా సాధించాలని కోరుతూ ఉండేవాడిని. పంత్‌గారు మా విమర్శనలను సమర్థిస్తూ, నిర్మాణాత్మకమైన సూచనలను, ఆచరణాత్మకంగా వాటిని సాధించేందుకు అనువైన సలహాలను బోధిస్తూ, సమర్థవంతంగా వాటిని విపులీకరిస్తూ ఉండేవారు.

పంత్‌గారు తన ఉపన్యాసాన్ని ప్రారంభించబోయే ముందు, తలపంకిస్తూ ఉంటారు. సైమన్ కమీషన్‌కు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో ఆయన లాఠీఛార్జీకి గురి అయినప్పుడు, ఆయన తలకు తీవ్రంగా దెబ్బతగిలి, మెడనరాల లోపంవల్ల ఈ దుస్థితికి ఆయన లోనుగావలసి వచ్చింది. ఆయన శరీరాకృతి ఆకర్షణీయమైనది కాదు. భారీవిగ్రహం ఆయనది. కిందకు వంగిన పెద్దపెద్ద మీసాలతో, వదులుగా ఉండే కోటు ధరించి, అందం ఆకృతిలేని ఆక్సఫర్డు ట్రౌజర్లతో, పర్వతాకారంతో కనిపిస్తూ ఉండేవారు. అయితే ఆయన వాదనాపటిమ, నచ్చచెప్పే ధోరణి, నిజాన్ని తెలియజెప్పడంలో ఆయనకు ఉన్న చిత్తశుద్ధి ప్రభుత్వంలోని ఉన్నత పదవులలోని వారికి సైతం భయంపుట్టిస్తాయి. ప్రభుత్వ ఉన్నతోద్యోగులలో ఒక ఎగ్జిక్యూటివ్ కౌన్సిలర్ ఇలా వ్యాఖ్యానించారు - "భూలాభాయ్ దేశాయ్, సత్యమూర్తి, పంత్‌గార్లలో ఎవరు ఎక్కువ ఉద్దండులో చెప్పడం కష్టం! వారికి వారే సాటి. ఒకరికి మించి మరొకరు, ఎవరి మార్గంలో వారు;

సమర్థతో ఉద్దండులుగానే పరిగణించాల్సి ఉంటుంది. అయితే మత్తగజంలాగా పంత్ గారు మా ఎదుట నిలబడి, మా బుర్రలను మోగిస్తూ, తొలిచేస్తూ ఉంటే, ఆయన ధాటికి నిలిచి ఉండడం మాత్రం కష్టం అనే చెప్పాలి –"

శ్రీ భూలాభాయ్ దేశాయ్ కాంగ్రెసు అధిష్ఠాన వర్గంలో స్థానం సంపాదించుకునేందుకు దుందుడుకు తనంతో వ్యవహరించినట్లుగా, పంత్ గారు తొందరపడకుండా, నిగ్రహాన్ని చూపెట్టారు. జవహర్లాల్‌ను జాతీయ నాయకునిగానూ, రాష్ట్రవ్యవహారాల్లో సైతం తమ నాయకునిగా పంత్ గారు ప్రతిపత్తినిచ్చి గౌరవించారు. యు.పి. రాష్ట్ర వ్యవహారాల్లో కూడా నెహ్రూగారి ప్రమేయం ఏమిటని, పంత్ గారి అనుచరులు ఆయనను నిగ్గదీసి, శాసనసభలో పూర్తి మెజారిటీగల వర్గంగా నిరూపించగలమని కూడా చెప్పి నెహ్రూగారి జోక్యం సహించరాదని వత్తిడి తెచ్చిన దశలోకూడా, నెహ్రూజీపట్ల ఉన్న గౌరవభావం పంత్ గారు నడలించుకోలేదు. ఇతరుల ప్రాపకం కోసం ఆయన ఎప్పుడూ అర్రులు చాచలేదు. అదే సమయంలో సర్దార్ పటేల్ గారి అభిమానాన్ని కూడా ఆయన పొందగలగడం అదృష్టంగానే భావించాల్సి ఉంది. పార్టీ కార్యకలాపాల్లో పటేల్ గారి సూచనలను ఆయన విశ్వసపాత్రంగా అమలు జరుపుతూ ఉండేవారు. పటేల్ గారు కూడా స్థానిక విషయాల్లో ఏ సహాయం అవసరమైనా పంత్ గారికి తన సహాయాన్ని అందిస్తూ ఉండేవారు. పాలీవాల్ గారి లాంటి యువతరం కాంగ్రెసు నాయకులందరిలో మిన్నగా అభిమానాన్ని సంపాదించుకొన్నారు. నెహ్రూజీకి సన్నిహితుడైన రఫీ అహమ్మద్ కిద్వాయ్ యు.పి. రాజకీయ రంగంలో పంత్ గారికి బద్ధశత్రువుగా ఉండేవారు. రఫీ అహ్మద్ కిద్వాయ్ గారి ఎదురు సవాళ్లను తట్టుకునేందుకు పటేల్ గారు తనకు చేసిన సహాయ సంపత్తులపట్ల పంత్ గారు ఎంతగానో విలువనిచ్చి, గౌరవిస్తూ ఉండేవారు. అప్పట్లో అగ్రనాయకత్వ పోరాటంలో పరస్పరం పోటీపడుతూ, సమయోధులుగా ఉన్న పటేల్, నెహ్రూజీల అభిమానాన్ని యిరువైపులనుండి సమంగా పొందగలగడం పంత్ గారి అదృష్టమేనని చెప్పవచ్చు. రాజకీయ రంగంలో పంత్ గారు నిర్వహించిన పాత్ర, వేదవ్యాస విరచితమైన మహాభారతంలోని భీష్ముని పాత్రతో పోల్చవచ్చును. భారతచరిత్రలో మౌర్యచంద్రగుప్తుని వద్దనున్న కౌటిల్యుడు, కృష్ణదేవరాయలకు మంత్రిఅయిన తిమ్మరుసు రాజనీతి కౌశలంలో పంత్ గారికి ఆదర్శప్రాయులనడంలో అతిశయోక్తి లేదు. భిన్నవ్యక్తిత్వాలుగల నలుగురు అగ్రనాయకుల కనుసన్నలలో, నమ్మకంతో, విశ్వాసంతో పంత్ గారు నెగ్గుకొంటూ వచ్చారు. ఆ నలుగురు పెద్దలెవరో కాదు. మహాత్మాగాంధీ, సర్దార్ పటేల్, నెహ్రూజీలతోపాటు క్షణక్షణానికీ మార్పుకు గురిఅయ్యే కాంగ్రెసు పార్టీ మరియూ దేశప్రజలూ! పంత్ గారి కుమారుడు శ్రీ కె.సి.పంత్ తండ్రిగారి అడుగుజాడల్లో నడుస్తూ, ప్రధాని అభిమానాన్ని పొందగలిగారు.

1937 లో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి అయ్యేందుకు శ్రీ పంత్ కేంద్ర శాసనసభను వదిలిపెట్టారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన ఆ రాష్ట్రంలో ఎదురులేని నాయకునిగా, సమర్థవంతమైన పరిపాలనను నెరిపారు. నెహ్రూజీ ఆహ్వానం మేరకు, తదుపరి శ్రీ పంత్ కేంద్రప్రభుత్వంలో హోంశాఖామంత్రిగా బాధ్యతలు చేపట్టేవరకూ, యు.పి. ముఖ్యమంత్రిగా, యు.పి రాజకీయాల్లో సమర్థుడైన ఏకైక నాయకునిగా గుర్తింపును పొందారు. దేవుని పిలుపు

వచ్చేంతవరకు ఆయన అధికార పదవుల్లోనే కొనసాగుతూ వచ్చారు. యు.పి ముఖ్యమంత్రిగా, ఆయన రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణను సాధించడం గొప్ప కృషిగానే భావించాలి. అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని ఆయన దరికి జేరనివ్వలేదు. జాతీయ సమైక్యతా సాధనకు ముఖ్యమంత్రులతో కూడిన ప్రాంతీయ మండలులను ఆయన ఏర్పాటు చేసారు.

అయినప్పటికీ, స్వరాష్ట్రంలో, సాటి రాష్ట్రాలతో సమంగా పారిశ్రామికాభివృద్ధిని గానీ, వ్యవసాయేతర వృత్తులలో ప్రజలకు జీవనాధారాలను కల్పించడానికి గానీ శ్రీపంత్ ఏమాత్రం కృషి చేయలేదు. బ్రాహ్మణేతరులైన శ్రమజీవుల అభివృద్ధికిగానీ, వెనకబడిన తరగతుల సంక్షేమానికి గానీ ఆయన పాటుపడలేదు. ఆ తెగలను చైతన్యపరచడానికి ఆయన ఎటువంటి కార్యక్రమాన్నీ చేపట్టలేదు. అంతేగాదు. నిరక్షరాస్యతను నిర్మూలించేందుకుగానీ, ప్రాథమిక విద్యాభివృద్ధిలోగానీ, ఆయన చెప్పుకోదగ్గ కృషిని చేయలేదు. ఆయన తదనంతరం పదవులు పొందిన వారుకూడా, అతి ముఖ్యమైన ఇలాంటి సాంఘిక అవసరాల్లో ఎలాంటి ప్రగతినీ సాధించలేకపోయారు.

జమిందార్లను, స్థానిక భూస్వాములను తొలగించడం ద్వారా సాంఘిక పరివర్తనకు శ్రీపంత్ నాందీవాచకం పలికారు. అప్పట్లో బెంగాల్, యు.పి, బీహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో భూస్వామ్య వ్యవస్థ వ్రేళ్ళు దన్నుకొని ఉంది. యు.పిలో భూస్వాములు,బీహార్ జమిందార్లు శతాబ్దానికి పైగా, బ్రిటీషు పాలనలో లభించిన అవకాశాల ద్వారా, అన్ని విధాలా బలిసిపోయి ఉన్నారు. జమిందారీ ఎస్టేట్‌లను రద్దుపరిచేందుకు, ప్రాథమిక కార్యక్రమంగా, భూముల సర్వే, సెటిల్‌మెంటు, ఆసాముల వివరాలతోకూడిన రికార్డులు తయారీ, ప్రతిపట్టాకు విడివిడిగా పన్ను విధింపూ; తదితర చర్యలు తీసుకోవడానికి మదరాసు రాష్ట్రంలో ఒక శతాబ్దానికిపైగా వ్యవధి తీసుకొంది. అప్పటికీ ఎస్టేట్ల రద్దు మిగిలే ఉంది. పంత్‌గారు ఈ అంశంలోగట్టి పట్టుదలతో ఒక దశాబ్ద కాలంలోనే సాధించారు. బీహార్ కాంగ్రెసు ప్రభుత్వం ఈ సమస్యా పరిష్కారానికి రెండు దశాబ్దాలకు పైగా సమయాన్ని తీసుకుంది. అదికూడా మాజీ భూస్వాముల మీద ఆధారపడి, వారి సహకారం తీసికొని గానీ ఈ కార్యక్రమాన్ని పూర్తిచేయలేకపోయింది. అలా కాకుండా పంత్‌గారు భూసంస్కరణల నిమిత్తం, ముందుగానే నిర్దిష్టమైన మార్గదర్శక సూత్రాలను రూపొందించుకొని, గట్టి పునాదితో, నిర్మాణాత్మకమైన కార్యక్రమాలతో సమర్థవంతంగా కృషిచేసారు. ఇతర రాష్ట్రాలలో భూస్వాములకు, తమ భూములను కాపాడుకునేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశాలు కల్పించబడగా, పంత్‌గారు ఈ సందర్భంలో సమయస్ఫూర్తితో, భూస్వాములతో చర్చించి, వారి భూములకు పరిహారం చెల్లింపులో, తదితర కోర్కెలను తీర్చడంలో సానుభూతిని చూపిస్తూ, వారితో గౌరవప్రదమైన అంగీకారానికి వచ్చారు. ఇందువలన రైతులకు భూమి పంపకంలో, కోర్టు ప్రమేయం లేకుండా, ప్రభుత్వం తనకు తానే నేరుగా వ్యవహరించగలిగిన అవకాశం ఏర్పడింది.

కనీస గిట్టుబాటు ధరను చెల్లించాలని, చెరకు ఉత్పత్తి దారుల కోర్కెలపట్ల, ప్రభుత్వ పరంగా, పంత్‌గారు ఎలాంటి సహాయాన్ని చేయలేదు. పైగా ఆయన ఈ అంశంలో అవలంబించిన తటస్థ వైఖరివల్ల, అది కాంగ్రెసుపార్టీకి బాగా నిధులను సమకూర్చే ప్రధానవర్గమైన

పంచదార ఫ్యాక్టరీ యజమానులకు మాత్రం అనుకూలంగా తయారైంది. ఉత్తరప్రదేశ్ రైతులలో రాజకీయ చైతన్యం తగినంతగా లేని దుస్థితం ఇది. చెరుకు అభివృద్ధి సెస్సుకూడా, ప్రభుత్వ సాధారణ ఆదాయంతో కలిపివేయబడి, దుర్వినియోగమై పోయింది. కిద్వాయ్‌గారు ప్రతి సందర్భంలోనూ, రైతులకు, అనుకూలంగానే వ్యవహరించారు. గానీ కేంద్ర వ్యవసాయ శాఖామంత్రిగా ఉన్నప్పుడు కూడా, చెరకు పండించే రైతులకు ఆయన కనీస ధరలను మాత్రమే అందించగలిగారు. పంచదార పరిశ్రమలను జాతీయం చేయాలని, ప్రత్యేక కమిటీలు, మంత్రివర్గాలు, కాంగ్రెసు, కాంగ్రెసేతర ప్రభుత్వాలు కూడా ప్రకటనలు చేస్తూ వచ్చాయి. కానీ ఆచరణలో మాత్రం రాజకీయ పరమైన వత్తిడుల కారణంగా అది సాధ్యం కాలేదు.

కేంద్రంలో హోంశాఖా మంత్రిగా ఉన్నప్పుడు, దేశంలో శాంతిభద్రతలను నెలకొల్పి, కాంగ్రెసు సంస్థలో ప్రశాంతస్థితిని సాధించి, గొప్ప పరిపాలనాదక్షునిగా శ్రీ పంత్ పేరుపొందారు. అప్పట్లో కేరళలో కమ్యూనిస్టు పార్టీ అధికారంలో ఉండేది. అయితే ప్రభుత్వ యంత్రాంగంపై పార్టీ పెత్తనం సాగిస్తూ ఉన్నందున, దానికి వ్యతిరేకంగా ప్రజాఉద్యమం చెలరేగినప్పుడు, పంత్‌గారు రాజకీయ కౌశలాన్ని ప్రదర్శించి, కేరళ కమ్యూనిస్టు మంత్రివర్గాన్ని రాష్ట్రపతి ద్వారా బర్తరఫ్ చేయించగలమని బెదిరించి, బలవంతంగా కమ్యూనిస్టు ప్రభుత్వం తొలగిపోయేలా చేయగలిగారు.

అనేక విషయాలలో మేమిద్దరం ఏకాభిప్రాయంతో ఉండేవాళ్లం. ఉదాహరణకు సహకార సంస్థల ద్వారా రైతుల భూములను స్వాధీనం చేసుకోవాలనే నిర్ణయంలో నెహ్రూగారి అభిప్రాయలతో మేము ఏకీభవించలేదు. అయితే ఆయన నెహ్రూగారి నాయకత్వాన్ని గౌరవించి, ఆయనను అనుసరించడానికే నిర్ణయంచుకున్నారు. నేను 1959 లో రైతుల హక్కుల రక్షణకోసం పోరాటం జరిపేందుకు కాంగ్రెసును వదిలి వెళ్లాను.

భాషా ప్రయుక్తంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘంవారి సిఫార్సులను అమలుజరిపే అవకాశం ఆయనకు లభించింది. నెహ్రూగారు బాహాటంగా తన అభిప్రాయాలను ప్రకటించనందున, ఆ కార్యక్రమంలో నిమగ్నమై ఉన్న పంత్‌గారిని అనేకమంది, అనేక రకాలుగా వత్తిడులకు లోనుచేసారు. ఏమైనప్పటికీ ఆయన హయాంలో మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, సమగ్ర ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక రాష్ట్రాలు రూపుదిద్దుకొన్నాయి.

శ్రీ కె.యం.ఫణిక్కర్‌గారు తెలివిగా సూచించినట్లు, యు.పి, బీహార్‌లలోని కొన్ని ప్రాంతాలను విడదీయాలనే ప్రయత్నం మాత్రం అలాగే నిలిచిపోయింది. ప్రత్యేక తెలంగాణా, ప్రత్యేక విదర్భ రాష్ట్రాల ఏర్పాటును గురించి కమీషను సానుభూతితో స్పందించినప్పటికీ, వాటిని గురించి పట్టించుకోలేదు. కొన్ని దశాబ్దాల తర్వాత ఈ సమస్య తిరిగి రేకెత్తించబడి, వినాశకర పరిస్థితులకు కారణభూతమైంది. సిక్కులు, వారి నాయకుడైన మాస్టర్ తారాసింగ్ కోరిన 'పంజాబీ సుభా" ఏర్పాటులోకూడా, ఆయన వైఫల్యం చెందారు. ఈ సమస్య లాల్ బహదూర్ శాస్త్రి, శ్రీమతి ఇందిరాగాంధీగార్లకు వదిలివేయబడగా, తరవాత కాలాల్లో పంజాబ్ హర్యానా రాష్ట్రాలుగా విభజితమైనాయి. పంత్‌గారి తదనంతరం హోంశాఖా మాత్యులుగా

వచ్చినవారు అస్సాంను అస్సాం, మేఘాలయ రాష్ట్రాలుగా ఏర్పాటు చేయడం జరిగింది. ఇరవై లక్షల జనాభా మాత్రమే గల నాగాలాండ్‌ను, నలభై లక్షల మంది ఉన్న హిమాచల ప్రదేశ్‌ను, ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పరిచేందుకు, అండమాన్-నికోబార్ దీవులకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించేందుకు, ఆయన విజయవంతమైన బాటను వేయగలిగారు.

సర్దార్ పటేల్ గారు చూపిన మార్గంలో, దేశ సమగ్రతను సాధించే కృషిలో, పంత్ గారి నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు మనల్ని విస్మయ పరుస్తాయి. రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ వంటి బృహత్తర కార్యక్రమాన్ని అమలుచేస్తున్నప్పుడు కూడా, పంజాబ్ లో తప్ప, దేశంలో మరెక్కడా, ఎలాంటి అలజడి లేకుండా ఆయన శాంతిభద్రతలను కాపాడారు. ఆ విజయం ఆయన తంత్రాంగానిదా? నైతిక స్థాయిదా? ఆయనపట్ల ఉన్న గౌరవానిదా? ఓ పూర్వకాలపు వ్యక్తి అన్నట్టుగా, సర్దార్ పటేల్ గారి తర్వాత, శ్రీ పంత్ సమర్థత, దక్షత మూర్తీభవించిన 'హోంశాఖామంత్రి' అని నేను గట్టిగా చెప్పగలను.

రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కూడిన ప్రాంతీయ మండలుల ఏర్పాటుకు పంత్ గారు పూనుకున్నారు. అయితే ఆయన ఆ విషయంలో తగినంత విజయాన్ని సాధించలేకపోయారు. ఎందుకంటే నెహ్రూగారి హయాంలోలాగా, ప్రణాళికాసంఘం, ఆర్థికమంత్రిత్వశాఖ తగినన్ని నిధులను అందుకు సమకూర్చగలమని ఆయనకు హామీ ఇవ్వనందున, ఇలా జరిగింది. పంత్ కూడా నదీజలాల పంపిణీ, అంతఃరాష్ట్ర భూగర్భ సంపద, ఇతర వనరుల విభాగం, సరిహద్దుతగాదాలవంటి సమస్యల వల్ల రాష్ట్రాలమధ్య ఏకీభావాన్ని సాధించేందుకు ఎక్కువ సమయాన్ని కేటాయించనందున, కర్ణాటక-మహారాష్ట్ర, అస్సాం-నాగాలాండ్, మణిపూర్ లలో నిప్పురాజుకుంటూనే ఉన్నది. ఇప్పటికీ (1976 నాటికి) కూడా, కర్ణాటక, మహారాష్ట్రల మధ్య, నాగాలాండ్-అస్సాంలమధ్య సరిహద్దు వివాదాలు కొనసాగుతూనే ఉన్నాయి. చండీఘర్ సమస్య యింకా అపరిష్కృతంగానే ఉంది.

హైందవ మతాచార సాంప్రదాయాలను, ఉపవాస దీక్షలను పంత్ గారు నిత్యజీవితంలో పాటిస్తూ ఉంటారు. శ్రీ బాపూజీ అనే దినచర్యమాదిరిగానే, పంత్ గారు కూడా భోజనానికి ముందుగా, విస్తరిచుట్టూ నీళ్లుచల్లి, తొలిముద్ద దైవానికి అర్పించి, తదుపరి భోజనం చేసేవారు. ఆయన పూర్తి శాఖాహారి. భారతదేశ లౌకిక దృక్పథానికి అనుగుణంగా సర్వమతాలను సమదృష్టితో చూస్తూ, ప్రజలందరికీ సమానావకాశాలు కల్పించబడాలన్న నెహ్రూగారి ఆశయాలకు అనుగుణంగా, నడచుకుంటూ, నెహ్రూజీని గౌరవించే వారిలో పంత్ గారు కూడా ఒకరు. ప్రభుత్వ లౌకిక దృక్పథాన్ని ఆయన పూర్తిగా బలపరుస్తూ ఉండేవారు.

అర్హులైన వారికి సహాయాన్ని అందించడంలో ఆయన బాగా శ్రద్ధ కనపరుస్తూ ఉండేవారు. అర్హులైన రచయితలూ, కవులూ, కళాకారులకూ, సాంస్కృతిక వేత్తలకూ కొంత మొత్తంగానీ, నెలసరి వెన్నన్లుగానీ ఏర్పాటు చేయవలసిందిగా, నేను చేసిన సూచనను, పంత్ గారు వెంటనే ఆమోదించారు. గాంధీజీ ఆత్మకథను తెలుగులో రచించిన ప్రసిద్ధ జాతీయ కవి శ్రీ తుమ్మల సీతారామమూర్తిచౌదరి గారికి ప్రభుత్వం ఇవ్వజూపిన ఆర్థిక సహాయాన్ని గాంధీ కవిశ్రీ

తుమ్మల తిరస్కరించారు. శ్రీ తుమ్మల వారి ఆత్మ గౌరవాన్ని తిలకించి, పంత్ గారూ, నేనూ ఎంతగానో సంతోషించాం! తదుపరి శ్రీ తుమ్మల జాతీయ సాహిత్య అవార్డును కూడా పొందారు. సాహితీ వేత్తలకు, కళాకారులకు ఆర్థిక సహాయాన్ని అందించే పథకంవల్ల ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఎందరో కళాకారులు లబ్ధిపొందారు. అలాంటి వారిలో 1921 లో పెదనందిపాడు శిస్తు నిరాకరణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించిన రైతు నాయకులు, సంగీత పారంగతులైన శ్రీ పర్వతనేని వీరయ్య కూడా ఉన్నారు.

అదే పథకం కింద పంత్ గారు అనేకమంది రాజకీయ బాధితులకు కూడా సహాయాన్ని అందించారు. ఇటీవల 1972 ఆగస్టులో స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్లు మంజూరు చేసేంతవరకు పంత్ గారి గ్రాంటు మాత్రమే ఆర్థికంగా వారిని ఆదుకుంటూ ఉండేది.

ప్రజాసేవారంగంలో ఉన్న నాయకులందరిచేతా, పంత్ గారు తండ్రిలా, సోదరునిలా భావించ బడుతూ, గౌరవింపబడుతూ ఉండేవారు. తన వయస్సుకంటే, పది, ఇరవయి సంవత్సరాలు ఎక్కువగా ఉన్నట్టు పంత్ గారు చూపరులకు కనిపిస్తూ ఉంటారు. ఆయన మృదువయిన శరీరాన్ని, మిసమిసలాడే యౌవన చ్ఛాయల్ని గమనించినవారు మాత్రమే, ఆయన నిజమైన వయస్సును తెలుసుకోగలుగుతారు. ఆయన ఎప్పుడూ ఉద్రేకానికి లోనయ్యేవారుకాదు. ఆయన మందహాసం గుబురు మీసాల చాటున కనిపించీ, కనిపించనట్టుగా ఉంటుంది. ఆయన కళ్లు ఆనందంతో మెరుస్తాయి. కానీ దట్టమైన కనుబొమల మధ్య దాక్కుంటాయి. ఆకారణంగా ఆయనను గమనించేవారికి, ఎప్పుడూ, ప్రశాంతంగా, పెద్దరికంగా నైనిటాల్ వయోవృద్ధునిలా కనిపిస్తారు. ఆయన అందరిలో పెద్దమనిషిలా వ్యవహరిస్తారు. అందువల్ల సందర్భవశాత్తూ ఆయన ఏదైనా సలహా ఇచ్చినా, విమర్శచేసినా, ప్రతి ఒక్కరూ దాన్ని గౌరవ భావంతో స్వీకరిస్తారే గానీ, తప్పుగా భావించరు. చర్చల్లో, సమావేశాల్లో ఆయన కటువుగా మాట్లాడినా, అపహాస్యంగా ఎద్దేవా చేసినా ప్రతి ఒక్కరూ మౌనంగా భరించేవారు. ప్రధాని నెహ్రూజీకి ఆయన కొండంత అండగా ఉండేవారు. మనందరి శ్రేయోభిలాషిలా, ఆత్మీయుడైన అనుచరునిగా, పెద్దతలగా వ్యవహరించి, జీవించారు. తుదకు మరణించారు.

ఆయన స్వర్గస్థులైససందర్భంలో 7-3-1961న స్వర్గీయ పంత్‌జీకి శ్రద్ధాంజలి ఘటిస్తూ, పార్లమెంటులో నేను చేసిన ప్రసంగం లోని వాక్యాలతో దీనిని నేను ముగిస్తాను.

– "మేము గత 25 సంవత్సరాలుగా సహచరులుగా, మిత్రులుగా, ఆత్మీయులుగా ఒకే కుటుంబ సభ్యులుగా కలిసి, మెలిసి ఉన్నాం. ఆయన సహచర్యం నాకు లభించిన ప్రత్యేక గౌరవంగా భావిస్తున్నాను. ఆయన చాలా గొప్పవారు. సహృదయులు. అంతేగాదు. సమర్థతతో, దక్షతతో తన బాధ్యతలను నిర్వహించగలవారు. తన ఉపన్యాసాల్లో రాజకీయ పరమైన భేదాభిప్రాయాలను మాత్రమే వ్యక్తపరుస్తారు, గానీ వ్యక్తిగత విభేదాలకు తావు ఇచ్చేవారు గాదు. ప్రతి ఒక్కరినీ ప్రేమించగల విశాల హృదయం ఆయనకు ఉన్నది. మన మహోన్నత నాయకులైన మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ పటేల్, భూలాభాయ్ దేశాయ్‌గార్లను అంకిత భావంతో అనుసరించి, వారికి వారసునిగా నిలిచిన వ్యక్తి. బ్రిటీష్ ప్రభుత్వం కేవలం మొరగడం

తప్ప, అంతకు మించి అది చేయగలిగిందేమీ లేదంటూ, దాన్ని అదుపులో పెడుతూ పార్లమెంటులోనూ, ప్రజల్లోనూ కూడా ధైర్య, స్థయిర్యాలను కలిగించిన శ్రీ భూలాభాయ్ దేశాయ్‌కి పంత్ జీ ఎంతో అండగా నిలిచారు. నేను ఆయనతో కలిసి కాంగ్రెసు సంస్థలో ఉన్నప్పుడూ, కాంగ్రెసును విడిచి బయటున్నప్పుడూ కూడా, అనేక సందర్భాలలో ఆయన సలహాలను పొందగలిగాను. ప్రతి సందర్భంలోనూ, ఆయా విషయాలను గమనిస్తూ, అరమరికలు లేకుండా, అవసరమైన సలహాలను అవసరం వచ్చినప్పుడల్లా ఆయన అందజేస్తూ ఉండేవారు. ఆయనతో కలిసి వ్యవహరించిన, అనేకమంది మిత్రుల అనుభవాలు కూడా ఇలాగే ఉంటాయనడంలో, నాకు ఎలాంటి సందేహమూలేదు".

6

సర్దార్ వల్లబ్‌భాయ్ పటేల్

సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ బార్డోలి తాలూకా కరమ్‌సాద్ లో 1875వ సంవత్సరంలో జన్మించారు. ఆయన బారిష్టరు పట్టా పొందారు. అహమ్మదాబాద్‌లో న్యాయవాద వృత్తిని కొనసాగించారు. బార్డోలీ సత్యాగ్రహాన్ని, కైరాకిసాన్ ఉద్యమాన్ని నిర్వహించారు. 1928లో బార్డోలీ సత్యాగ్రహాన్ని నడిపారు. గాంధీగారు 'సర్దార్' బిరుదుతో ఈయన్ను గౌరవించారు. అహమ్మదాబాద్ పురపాలక సంఘాధ్యక్షులుగా పదవిని నిర్వహించారు. ఆయన సోదరులు విఠల్ భాయ్‌గారు కూడా బారిష్టరే! ఆయన బొంబాయి నగర మేయరుగానూ, కేంద్ర శాసనసభ స్పీకరుగానూ ఉన్నత పదవులను అధిష్ఠించారు. సోదరులిద్దరూ చాలామార్లు జైళ్లకు వెళ్లారు. 1931 లో కరాచీ కాంగ్రెసు సమావేశంలో సర్దార్ పటేల్ కాంగ్రెసు అధ్యక్షులుగా ఎన్నికై అత్యున్నతమైన కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డుకు 1935 నుండి 1948 వరకు చైర్మన్‌గా ఉన్నారు. హిందూస్తాన్ మజ్‌దూర్ సేవాసంఘానికి అధ్యక్షులుగా వ్యవహరించారు. పార్లమెంటు ఎన్నికలలో తన పర్యవేక్షణలో, కాంగ్రెసు సంస్థను ముందుకు నడిపించారు. సుభాష్‌బోసును, కాంగ్రెసు సోషలిస్టులను వ్యతిరేకిస్తూ వచ్చారు. కాంగ్రెసు పార్టీ నిర్మాణ కార్యక్రమాల్లో గాంధీజీకి కుడిభుజంగా ఉండి, కృషిచేసారు. భారత దేశానికి ఉపప్రధాని అయ్యారు. భారత్ రిపబ్లిక్‌లో సంస్థానాలను వీలీనంచేసి, దేశ సమగ్రతను సాధించారు. హైద్రాబాద్‌లో పోలీసు చర్యను నిర్వహించారు. భారత దేశంపై చైనా దురాక్రమణకు పూనుకోగలదని ముందుగానే హెచ్చరించారు. వీరవల్ వద్ద సోమనాధ ఆలయాన్ని పునరుద్ధరించేందుకు శ్రీ కె.యం. మున్షీని ప్రోత్సహించారు. ప్రస్తుతం వల్లభ్ విశ్వవిద్యాలయమని పిలుస్తున్న విశ్వవిద్యాలయ నిర్మాణానికి, భాయాలాల్ భాయ్‌పటేల్ గారికి సహాయపడ్డారు. 1950లో జీవయాత్రను చాలించారు.

– (ఎడిటర్)

సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్‌గారి సాంఘిక, రాజకీయ పునాదులు, కష్టపడి శ్రమించే, ఆత్మగౌరవంగల గుజరాత్ రైతులోకంతో ముడివడి ఉన్నాయి. ఆయనా, ఆయన సోదరులు విఠల్ భాయ్ పటేల్ గార్లు ఇద్దరూ బొంబాయిలో న్యాయవాదులుగా, కీర్తి ప్రతిష్టలు సంపాదించి, బాగా ఆర్జించారు. శ్రీ వల్లభాయ్ అహమ్మదాబాద్ పురపాలక సంఘాధ్యక్షులుగా, నైతిక విలువలతో కూడిన పరిపాలన నందించారు. జాతీయ ఉద్యమంలో, గాంధీజీ అనుచరులుగా, రాజకీయ రంగంలో ప్రవేశించిన తదుపరి, శ్రీ పటేల్ న్యాయవాదవృత్తిని విసర్జించి, సహాయ నిరాకరణ ఉద్యమంలోనూ, త్రివిధ బహిష్కార కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొన్నారు. శ్రీ మోతీలాల్ నెహ్రూ, శ్రీ సి.ఆర్.దాస్‌గార్లను వ్యతిరేకిస్తూ, రాజాజీతో కలిసి, గాంధేయ మార్గాన్ని నమ్మికతో అనుసరిస్తూ, గుజరాత్‌లో గాంధీజీకి క్రమశిక్షణతో కూడిన, విశ్వాసపాత్రుడైన అనుచరునిగా కీర్తినార్జించారు. వైమనస్యంతో కూడిన పద్ధతులపట్ల విముఖతచెంది, రాజకీయ, జాతీయ ఉద్యమాన్ని శ్రీయుతులు మోతీలాల్, శ్రీ దాస్‌గార్లచే నడుపబడుచున్న స్వరాజ్యపార్టీకే వదిలివేయాలని గాంధీజీ నిశ్చయించుకొన్నప్పుడు, శ్రీ వల్లభాయ్ పటేల్ నిర్ద్వందంగా గాంధీజీ నిర్ణయాన్ని శిరసావహించి, తన పూర్తికాలాన్ని, గాంధేయ సంస్థల స్థాపనకు వినియోగించారు.

తదుపరి కాలాల్లో ఈ సంస్థలే గుజరాత్, మహారాష్ట్ర ప్రాంతాలలో కాంగ్రెసుపార్టీ ప్రజలకు నాయకత్వం వహించే దశకు పునాదులుగా ఉపయోగపడ్డాయి. ఇట్టి నిర్మాణాత్మకమైన కార్యక్రమాల్లో పాల్గొంటూనే, శ్రీ పటేల్ 1928-29లో రైతాంగ సత్యాగ్రహ ఉద్యమాలను విజయవంతంగా నిర్వహించి, సమర్థుడైన నాయకునిగా దేశమంతటా గౌరవ ప్రతిష్టలను పొందారు. ఆయన సోదరుడైన విఠల్ భాయ్ కేంద్ర శాసన సభ స్పీకరుగా దేశానికి సేవలు అందించగా, శ్రీ వల్లభాయ్ స్వరాజ్య ఉద్యమంలో సర్దార్‌గా వెలిగారు. సర్దార్‌పటేల్ ముప్పయి సంవత్సరాలకుపైగా, గాంధీజీ నాయకత్వాన జాతీయోద్యమంలో కృషిచేస్తూ, గుజరాత్ జాతీయోద్యమ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి, తదుపరి బ్రిటిష్ పాలనలోని యావద్భారత దేశమంతటా కాంగ్రెసు సంస్థలో క్రమశిక్షణను పాదుకొల్పేందుకు తీవ్రంగా పాటుపడ్డారు. సంస్థాగతంగా కాంగ్రెసు పార్టీని తీర్చిదిద్దే కృషిలో ఆయన నిర్భయంగానూ, నిర్మొహమాటంగానూ వ్యవహరించి, తిరుగులేని నాయకునిగా పేరుగాంచారు. శ్రీయుతులు రాజాజీ, రాజేంద్రప్రసాద్, నెహ్రూలపట్ల గాంధీజీకి అంతే విశ్వాసమున్నప్పటికీ ఉక్కు మనిషి సర్దార్ పటేల్‌గారికి మాత్రమే, సంస్థను పటిష్టపరిచే బాధ్యతను గాంధీజీ అప్పగించారు. క్రమశిక్షణాయుతంగా సంస్థను తీర్చిదిద్దే కఠినమైన కార్యక్రమ నిర్వహణలో, సర్దార్ పటేల్ చేతిలో కాంగ్రెసు కార్యకర్తలు కించపడలేదని గానీ, బాధపడలేదని గానీ ఎవరూ చెప్పజాలరు. సాధారణంగా లోకమంతటా, క్రమశిక్షణను అమలుచేయవలసి నప్పుడు పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు, దేవాలయాలు, చర్చీలు, ప్రజాసభలలో, మంత్రివర్గ నిర్వహణలో ఎక్కడైనా గానీ, కేవలం అభిమానాన్ని మాత్రమే చూపిస్తూ, నియమ నిబంధనలను అమలుపరిచే దశలో నొప్పి కలిగించకుండా ఉండగలరా? ఇనుప పిడికిళ్ల సర్దార్ హస్తాల నుండి ఎవరూ, ఎలాంటి అభిమానాన్ని పొందలేరని నేను గట్టిగా చెప్పగలను. 1936-37 ఎన్నికల సందర్భంలో కాంగ్రెసు ప్రణాళికలకు అనుబంధంగానే, రైతు అభ్యర్థులు కొందరు, ప్రత్యేకంగా రైతు సమస్యలపై వాగ్ధాన పత్రాలమీద సంతకాలు చేసినప్పుడు, తన అధికార దండంతో వారందర్నీ వారించి, ఆయన ఉపసంహరింపజేయగలిగారు.

చాంపరాన్‌లోనూ, గుజరాత్‌లోనూ గాంధీజీ నిర్వహించిన రైతాంగ పోరాట ఉద్యమాలనుండి నేను గొప్ప స్ఫూర్తిని పొందాను. సర్దార్ పటేల్‌కూడా అదే అనుభూతిని పొందారు. బ్రిటిష్ ప్రభుత్వం చేత అన్యాయంగా విధించబడ్డ భూమిశిస్తుకు వ్యతిరేకంగా, తమ న్యాయమైన కోర్కెల సాధనకు సత్యాగ్రహ పద్ధతుల్లో రైతుఉద్యమాలను నిర్వహించేందుకు, పటేల్‌గారికి ఈ పోరాటాలు ప్రేరణను ఇచ్చాయి. రైతు ఉద్యమంలో సాగిన ఆ పోరాట కార్యక్రమాల్లో ఆయన రైతుల శక్తి సామర్థ్యాలను ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చూపెట్టారు. అక్రమమైన బ్రిటిష్ దమన నీతిని పోరాటం ద్వారా ఎదిరించగలమన్న దృఢవిశ్వాసాన్ని ఆయన జాతిలో కల్పించిపెట్టారు. ఆయనకు గాంధీజీ ఇచ్చిన సర్దార్ బిరుదును, దేశమంతా ఆనందంతో అంగీకరించింది.

ఆయన ఎట్టి భావావేశాలకు లొంగని ఉక్కు మనిషి అని చాలామంది భావిస్తుంటారు. రాజాజీగారు అన్నట్లు, ఆయనతో సన్నిహిత సంబంధాలుగల నావంటి మిత్రులం ఆయనది తల్లి

హృదయమని గుర్తించాం. తన అనుచరులతో ఎక్కువ ఆప్యాయంగా, సన్నిహితంగా ఆయన మెలిగేవారు. అయితే వారు దాన్ని అలుసుగా తీసుకొని, వ్యక్తిగత ప్రయోజనాన్ని పొందడానికి ప్రయత్నిస్తే మాత్రం ఆయన సహించేవారుకాదు.

1939లో ఒక సందర్భం ఏర్పడింది. శ్రీ సుభాష్ చంద్రబోసు కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నప్పుడు, ఆయన పట్ల బాగా వ్యతిరేకత ఎదురైన దశలో, త్రిపుర సభల తర్వాత, తాను అధ్యక్షపదవి నుండి వైదొలగడానికి నిశ్చయించుకొని, అప్పట్లో సర్దార్ పటేల్ గారిచే ఏర్పాటు చేయబడుతున్న కాంగ్రెసు కార్యవర్గంలోకి తీసుకోవాలఅందిగా నాపేరును ఒక్కటే, బోసుగారు సూచించారు. ఆవిధంగా తమ మధ్య ఉన్న విభేదాలన్నింటినీ తొలగించుకుందామని ఆయన భావించారు. నన్ను కాంగ్రెసు కార్యవర్గంలోకి తీసుకునేందుకు ఉన్న బాపూజీ అంగీకారాన్ని కూడా పటేల్ ఖాతరు చేయకుండా, నన్ను కార్యవర్గంలోకి తీసుకునేందుకు నిరాకరించారు. పటేల్‌గారి ఈ అధికార నిరంకుశత్వానికి సుభాష్‌బాబుతో పాటు ఆయన అనుచరులమైన మేమంతా బాధపడ్డాం!

1949లో అలాంటిదే మరొక సందర్భం ఏర్పడింది. సుభాష్ బోసు సూచన మేరకు కాంగ్రెసు కార్యవర్గంలోకి నన్ను తీసుకోవడానికి నిరాకరించిన సర్దార్ పటేల్ గారే, తదుపరి డాక్టర్ పట్టాభి కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నప్పుడు నన్ను కార్యవర్గంలోకి తీసుకోకపోతే, తానుకూడా అందులో ఉండడానికి నిరాకరించాడు. ఈ కారణంగా కాంగ్రెసు కార్యవర్గం ఏర్పాటుకు ఒక నెల ఆలస్యం అయింది. పటేల్ గారిలో నాపట్ల ఏర్పడిన మానసిక మార్పులకు నేనుగానీ, ఆయనగానీ ఎలాంటి స్పందనకూ గురికాలేదు. ఉభయులం కూడా రాజకీయంగా మారుతున్న దేశకాల పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తూ, గాంధేయ విధానాలకు అంకితమై, ఎలాంటి కోపతాపాలకు లోనుకాకుండా నడుస్తూ వచ్చాం. శ్రీ పటేల్ ఎవరినైనా తూష్ణీభావంతో చూస్తారా? అంటే, అవును అని సమాధానం చెప్పడం సులభమే. కానీ ఆయన అందర్నీ ప్రేమిస్తారు. అయితే అలా అని మనకు పైకి కనిపించదు. ఏమైనప్పటికీ ఆయన గాంధీజీకి విశ్వాసపాత్రులైన అనుచరులు. గొప్ప క్రమశిక్షణ గల కాంగ్రెసువాది.

స్వర్గీయ రఫీ అహమ్మద్ కిద్వాయ్, సర్దార్ పటేల్ గారలు తరచుగా వాదులాడుకుంటూ ఉండేవారు. గోవింద వల్లభ్ పంత్ గారి పట్ల ఎక్కువ అభిమానాన్ని కలిగి, యు.పి. ముఖ్యమంత్రిగా ఆయన పరిపాలనా వ్యవహారాల్లో ఆయనకు ఎట్టి ఇబ్బందులను కలిగించరాదని, సర్దార్ పటేల్ భావిస్తూ ఉండేవారు. పంత్ గారు సాఫీగా పరిపాలన నెరపడానికి, రఫీసాహెబ్ గారు ఇష్టపడేవారుకాదు. ఈ సందర్భంలో పరిస్థితులు విషమదశకు వచ్చిన తరవాత, జవహర్లాల్ సమక్షంలోనే పంత్ గారిని బలపరచడం గానీ, వ్యతిరేకించడంగానీ తేల్చి చెప్పవలసిందిగా రఫీగారిని పటేల్ నిగ్గదీశారు. అప్పుడు రఫీగారు మౌనం వహించి, మిన్నకున్నారు. ఒక సందర్భంలో కేంద్రకార్యవర్గానికి అప్పీలుచేశారనే స్వల్పకారణంగానే, రఫీ అనుచరులైనవారిని అతివాది పాలీవాల్ గారితోసహా, కేంద్రకార్యవర్గం సైతం బోక్యం చేసుకొనే అవకాశాన్ని కూడా ఇవ్వకుండా, యు.పి. ప్రదేశ్ కాంగ్రెసు సంఘం సస్పెండ్ చేసింది.

భాషా ప్రయుక్తంగా దేశాన్ని పునర్విభజించే అంశంలో, నెహ్రూ, రాజాజీగార్ల అభిప్రాయాలతో సర్దార్ పటేల్ ఏకీభవించారు. భాషా ప్రయుక్తంగా రాష్ట్రవిభజన వివిధ జాతుల మధ్య విభేదాలను సృష్టించగలదని వారు భయపడ్డారు. నాతో సహా అనేకమంది నాయకులు ఈ విషయంలో వారి అభిప్రాయాలతో ఏకీభవించలేకపోయాం. తన అభిప్రాయాన్ని మేము అంగీకరించనందుకు, సర్దార్ అమితంగా బాధపడ్డారు. గట్టి పట్టుదలగల వ్యక్తి అయినప్పటికీ, తుదకు సహేతుకమైన మా వాదనను అంగీకరించి, మమ్మల్ని అభినందించక తప్పలేదు. తరవాత జరిగిన సంఘటనలలో సర్దార్ పటేల్ అపసవ్య మార్గంలో నడిచారు. బొంబాయి నగరాన్ని బహుభాషా నిలయంగా ప్రత్యేక రాష్ట్రంగా అట్టిపెట్టి, సౌరాష్ట్రను ఒక రాష్ట్రంగా నిర్మించడానికి సర్దార్ పటేల్ ఎక్కువ సుముఖతను చూపెట్టారు. మహా గుజరాత్ ఉద్యమం ఫలించలేదు. సర్దార్ పటేల్‌గారు ఆశించినట్లు బొంబాయి రాష్ట్రం మహారాష్ట్ర, గుజరాత్‌లుగా విడగొట్టబడలేదు. ప్రజాభిప్రాయం అందుకు అనుకూలమో, వ్యతిరేకమో నిర్దిష్టంగా లేకుండా, కలగా పులగంగా తయారైంది. అన్నివిధాలా అదో అనిశ్చితమైన విధానం.

మత ప్రాతిపదికమీద ప్రాతినిధ్యాన్ని కల్పిస్తూ దేశాన్ని ఒక సమాఖ్యగా ఏర్పాటుచేయాలనే ప్రతిపాదన, పైకి ఆకర్షణీయంగా కన్పించినప్పటికీ ఉత్తమ విధానం కాబోదని భావించి మేమంతా వ్యతిరేకించాం. తుదకు జిన్నాగారి కోర్కెలకు లొంగిపోయి కాంగ్రెసు పార్టీ దేశ విభజనకు అంగీకరించి, పాకిస్తాన్ ఏర్పాటుకు అవకాశాన్ని కల్పించింది. దురదృష్టకరమైన ఈ నిర్ణయంలో సర్దార్‌గారి పాత్ర ఏమిటి? ఈ నిర్ణయాన్ని ఆయన మనస్ఫూర్తిగానే అంగీకరించారా? శ్రీ జవహర్లాల్, మౌంట్ బాటెన్ ఆయనను తప్పుదారిని బట్టించారా? అందువల్ల సర్దార్ దేశవిభజనకు అంగీకరించారా? ఈ క్లిష్ట సమయంలో తన సమర్థన లభించక, గాంధీజీ నిస్సహాయంగా ఉండిపోయారా? చారిత్రాత్మకంగా, అనివార్యంగా ఉపఖండంలో జరిగిన దేశవిభజన ఘట్టం అంచనా కట్టలేని ఒక విషాద పరిణామం! ఆఫ్రికాలో జరిగినట్లు మనదేశ స్వాతంత్ర్య ప్రకటన కొంతకాలం వాయిదా పడినట్లయితే, ఇంతకంటే సరియైన మార్గం మనకు లభించి ఉండేది. స్వాతంత్ర్యం అనంతరం లభించే అధికార పదవుల నిమిత్తం నెహ్రూజీతోపాటు, పటేల్‌కూడా మరికొంత కాలం ఓపిక పట్టలేక పోయారని ఇప్పుడు మనకు తెలియవస్తున్నది. మౌంట్ బాటెన్ యుక్తియుక్తంగా గాంధీజీకి పటేల్‌కూ మధ్య వర్ధించేందుకు ఎక్కువ సమయం లభించకుండా, బిగింపుచేసారని కూడా అర్థమవుతున్నది. ఈ ఉపఖండంలో జరిగిపోయిన దేశ విభజన ఘట్టం మన అనుభవంలో దొర్లిపోయిన విషాద స్మృతిగా మిగిలిపోయింది. సంకీర్ణ మంత్రివర్గంలో పొందిన అనుభవాలను చూసాక అయినా అప్పటి జాతీయ నాయకులు గాంధీజీ సలహాలను, హెచ్చరికలను పెడచెవిని పెట్టి ఉండకపోతే, ఈ దేశస్థితి మరొక విధంగా మెరుగ్గా ఉండేది. మహర్షులు, కవులు గానంచేసిన పవిత్ర భారతిని, బంకించంద్ర ఛటర్జీ, రవీంద్రనాథ్ ఠాగోర్, సుబ్రహ్మణ్య భారతి వంటికవులు, తిలక్, బాపూజీ వంటి దేశభక్తులు కీర్తించి, తమ సేవలందించిన మహత్తరమైన భారతమాతను, బలోపేతమైన, రాజకీయ శక్తిగా ఈ భారత దేశాన్ని రూపొందించి, శత్రువులు తేరిపార చూడలేని దుర్భేధ్యమైన దుర్గంగా నిలిపిన ఘనత మొత్తంమీద సర్దార్ పటేల్ గారికే దక్కుతుంది. పాకిస్తాన్ పాలన నుండి స్వతంత్రను పొందేందుకు

బంగ్లాదేశ్‌కు ఇండియా ఇందిరాగాంధీ నేతృత్వంలో తోడ్పాటు నందించింది. అంతమాత్రాన ఉపఖండం చక్కబడి, మన ప్రజలు కలతలు లేకుండా, సంతోషంగా జీవించగలుగుతున్నారా? మన దురదృష్టం ఏమంటే, బాపూజీ గతించిన తరువాత, ఈ ముప్పయి సంవత్సరాల కాలంలో ఉపఖండంలో భారత భద్రతకు సైనికపరమైన వ్యయాన్ని బాగాపెంచి కాంగ్రెసు అగ్రనాయకులు ఆర్థికంగా దేశాన్ని దుర్బలం చేసారు.

అప్పట్లో కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్న జవహర్లాల్ దేశాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి పరచాలని ప్రచారం చేస్తూ ఉండేవారు. దేశం సాంఘికంగా, ఆర్థికంగా బలపడాలంటే చేతివృత్తులనుప్రోత్సహించి, వ్యావసాయికంగా తీర్చిదిద్దాలని శ్రీయుతులు రాజాజీ, రాజేంద్రప్రసాద్, కృపలానీ, సర్దార్ పటేల్, తదితరులు ఒక పత్రాన్ని తయారుచేసి విడుదల చేసారు. చారిత్రాత్మకమైన ఆ ఉత్తరం కారణంగా నెహ్రూజీ చేతివృత్తులను, రైతాంగ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే విధానాన్ని 1959 దాకా అమలుపరచడానికి ఆగవలసి వచ్చింది.

అధికారంలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వాలు మన ఆర్థిక వ్యవస్థను ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి పరచాలని మేమంతా కోరాం. సర్దార్ పటేల్ దీనిపై తన సందేహాలను వ్యక్తపరిచారు. "వ్యవసాయ సంస్కరణ సంఘం" లో నేను వంటరివానిగా ఉన్నప్పుడు ప్రణాళికా బద్ధంగా జరిగే కృషివల్ల చేతివృత్తుల వారి ఆర్థిక పరిస్థితులు దెబ్బతినగలవని ఆయన భయపడ్డారు. ప్రజాస్వామ్య యుతమైన రైతాంగ యాజమాన్య హక్కులు సోషలిస్టు ప్రణాళికల అమలువల్ల హరించగలవని ఆయన ప్రణాళికా విధానాన్ని వ్యతిరేకించారు. దురదృష్టవశాత్తూ ఆ సమయంలో ఆయనకు గుండె జబ్బురావడంతో, ఈ అంశం పట్ల శ్రద్ధ చూపలేకపోయారు. ప్రణాళికా సంఘం కార్యక్రమాలను, నెహ్రూజీ విధానాన్నీ ఎదుర్కొని చేతివృత్తులవారిని ఆదుకోలేక నిస్సహాయులమయ్యాం.

సర్దార్ పటేల్ తన విధానాల ద్వారా, ప్రవర్తన ద్వారా చాలామంది కాంగ్రెసు అగ్రనాయకులను సంతృప్తి పరచలేకపోయారు. ఎవరికీ ఆమోదయోగ్యం కాని ఆయన నిర్ణయాల కారణంగా, శ్రీయుతులు కె.యఫ్.నారిమన్, బి.ఖరే, సుభాష్ చంద్రబోసు వంటి స్వాతంత్ర్య సమరవీరులు అసంతృప్తి చెందారు. కాంగ్రెసుపార్టీలో కీలకమైన స్థానంలో ఉండి ఆయన సంస్థ పేరిట తీసుకుంటున్న నిర్ణయాలవల్ల చాలామంది వ్యధచెందారు. క్రమశిక్షణాయుధాన్ని ఆయన నాయకులపై కూడా ప్రయోగించి, కొన్ని పొరపాట్లు చేయలేదని ఎవరూ చెప్పజాలరు. ప్రముఖ నాయకుల పట్ల ఆయన వ్యక్తిగత ద్వేషంతో ప్రవర్తించారని మరికొంత వివరంగా చెప్పడం నాకు సాధ్యపడడం లేదు. వ్యక్తిగత ద్వేషంతోగానీ, తన పదవికి ముప్పు రాగలదన్న భీతితోగానీ, ఆయన ఎప్పుడూ క్రమశిక్షణాయుధాన్ని దుర్వినియోగపరచ లేదని మాత్రం నేను చెప్పగలను. సుభాష్ చంద్రబోసు గారిపట్ల ఆయన అనుసరించిన వైఖరికి నేను చాలా బాధపడ్డాను. సుభాష్‌బాబును కాంగ్రెసు సంస్థనుండి బహిష్కరించినప్పుడు, నేను కోపంతో ఊగిపోయాను. మనస్తాపం కలిగించే ఈలాంటి సందర్భాలలోనూ, ఇతర విషయాల్లోనూ కూడా గాంధీజీ ఆమోదాన్ని పొందుతూ, తన బాధ్యత ఏమీలేనట్లు సర్దార్ పటేల్ వ్యవహరించేవారు.

ఈ ఆరోపణలకు పటేల్‌గారే బాధ్యులని స్వాతివారు నిందించే అవకాశాన్ని ఇవ్వకుండా, లౌకికంగా తప్పుకునేవారు.పంస్థలో తిరుగులేని నాయకునిగా, పటేల్ సంస్థ ప్రయోజనాలతోపాటు, వ్యక్తిగత ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి కూడా పార్టీని వినియోగించుకుంటూ ఉండేవారు.

గాంధీజీని నిర్ద్వందంగా సమర్థించే కొలబద్దతో ఆయన అనేక సందర్భాలలో వ్యవహరిస్తూ వచ్చారు. గాంధీజీని ఎవరు వ్యతిరేకించినప్పటికీ, ఆయన సహనాన్ని కోల్పోయేవారు. ఈ విషయంలో నారిమన్, ఖరే, ప్రకాశం, సుభాష్ బోసుగానీ, మరెవ్వరైనా గాంధీజీని వ్యతిరేకించడం జరిగినప్పుడు, ఆయన వారితో ఘర్షణ పడేవారు. పటేల్ గారి విధానాలతో నేను తరచుగా ఘర్షణ పడుతూ ఉండేవాడిని. గాంధేయ విధానంలో పరస్పరం విభేదించుకోవడం సహజమే. శ్రీకృష్ణుని రాజనీతికూడా ఇదే. వ్యక్తిగత అభిప్రాయాలకు భంగం కలిగినప్పటికీ, ఆయనతో సరుకుపోయేవాళ్లం. ఎందుకంటే సంస్థాపరమైన క్రమశిక్షణను అమలుచేయడంలో ఆయన ఎవరిపట్లా కక్ష వహించేవారుకాదు.

దేశం విపత్కరపరిస్థితులను ఎదుర్కొన్నప్పుడు గొప్ప వ్యక్తిత్వం, ధైర్యం, నిర్మాణాత్మక దృష్టి, సమర్థత గల పటేల్‌వంటి నాయకుడు లభించడం, నిజంగా మన దేశం అదృష్టమనే చెప్పాలి. రెండవ ప్రపంచ యుద్ధంలో ఇంగ్లండు ఈలాంటి లక్షణాలు గల విన్‌స్టన్ చర్చిల్ గారి నాయకత్వాన్ని పొందింది. దేశ సమైక్యత, రాజకీయ సుస్థిరత పొందవలసిన తరుణంలో భారతదేశం సర్దార్ పటేల్ గారి నాయకత్వాన్ని పొందింది.

స్వీయానుభవంలోనేమి, దేశసేవలోనేమి సర్దార్ పటేల్ అపారమైన అనుభవాన్ని గడించారు. ముక్కలు, ముక్కలుగా ఉన్న అయిదు వందల స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో సంలీనం చేసి, సమైక్య భారతాన్ని రూపొందించడంలో ఆయన విశిష్టత, సమర్థత మనకు స్పష్టంగా తెలియవచ్చింది. గాంధీజీ నాయకత్వాన దశాబ్దాల తరబడి పోరాడిన మాలాంటి వాళ్లం. ఐక్యస్వేచ్ఛా భారతదేశాన్ని ప్రపంచ రాజ్యాంమధ్య తలెత్తుకొని ఉండగా చూడాలని కన్న మాకలలు, దేశవిభజన జరిగి పాకిస్థాన్ ఏర్పాటుతో కల్లలయ్యాయి. ముక్కలు చేయబడ్డ భారతదేశం, సర్దార్ పటేల్ సమ్మోహనశక్తితో మూడు సంవత్సరాల స్వల్పవ్యవధిలోనే వందలాది సంస్థానాలను కలుపుకొని శక్తివంతమైన 'నవభారతం'గా రూపుదాల్చింది. ఈ పరిణామం శీఘ్రంగా, ఎవరికీ మనస్తాపంలేకుండా, సర్వాంగీకారంగా జరిగింది. పటేల్ గారిలో మూర్తీభవించి ఉన్న అద్వితీయమైన ఈ శక్తి సామర్థ్యాలను చాలామంది గమనించలేకపోయారు.

భారతదేశంలో పరిపాలన నిర్వహిస్తున్న బ్రిటీష్ ప్రభుత్వ యంత్రాంగం, ఇంగ్లండులో దాన్ని నడిపే లేబర్ పార్టీ మంత్రివర్గమూ పరస్పర విరుద్ధమైన ఆలోచనలతో వ్యవహరించాయి. భారతదేశంలోని బ్రిటీష్ అధికారులు అన్ని విధాలా ముస్లింలీగ్‌ను సమర్థిస్తూ, దేశాన్ని ముక్కలు చేయాలని ప్రయత్నిస్తూ ఉండగా, ఇంగ్లండులోని లేబరు పార్టీ మంత్రిమండలి కాంగ్రెసునూ, లీగ్‌నూ సంధానం చేసి, భారతదేశాన్ని సమైక్యంగా ఉంచాలని ఆలోచించింది. సంస్థానాధీశులకు వారి ఇష్ట ప్రకారం స్వతంత్రంగా ఉండేందుకుగానీ, లేదా భారత్‌లోగానీ, పాకిస్తాన్‌లోగానీ తమకిష్టమైన దేశంలో కలిసేందుకు గానీ స్వేచ్ఛను ఇచ్చి, వారి భద్రతకు హామీ ఇచ్చారు.

తిరువాన్కూరు మహారాజా, హైదరాబాద్ నవాబ్ స్వతంత్ర రాజ్యాలుగా తమ సంస్థానాలను అట్టి పెట్టుకోవాలని నిశ్చయించుకొని, జిన్నాతో రహస్య సంప్రతింపులు సాగించారు. జయసాల్మీర్ మహారాజా, మధ్యప్రదేశ్, రాజస్తాన్‌లకు చెందిన కొంతమంది సంస్థానాధీశులు పాకిస్తాన్‌లో చేరాలన్న అభిప్రాయంతో, జిన్నాకు సన్నిహితుడైన భోపాల్ మహారాజాతో కలిసి కుట్రలు పన్నడం ప్రారంభించారు. జునాఘడ్ మహారాజా పాకిస్తాన్‌తో కలిసేందుకు ఒప్పందంపై సంతకాలు కూడా చేసాడు. సంస్థానాధీశుల కుట్రలన్నిటినీ పసిగట్టి సర్దార్ పటేల్ ఏమాత్రం ఆలస్యంగా చేయకుండా, రంగంలోకి దిగి, తొట్రుపడకుండా ఒక మౌనిలాగా, సంయమనంతో, భారతదేశంపట్ల వ్యతిరేక భావంతో ఉన్న సంస్థానాధీశులను, దివాన్లను అనుకూలం చేసుకొని, అదుపులోకి తేగలిగారు. సంస్థానాధీశులను అంగీకరింపజేసి, భారత్‌లో సంలీనంచేసేందుకు పటేల్ సాగించిన కృషిలో అనుభవనీయులైన శ్రీ వి.పి.మీనన్, మరొక ఐ.సి.యస్ అధికారి శ్రీ సి.సి. దేశాయ్‌గారలు తమ సహాయ సహకారాల నందించారు. నూతనంగా ఏర్పడిన మంత్రివర్గ కార్యదర్శిగా శ్రీ వి.పి.మీనన్ పదవీ బాధ్యతలను నిర్వహించారు.

సంస్థానాలలోని ప్రజలు, ప్రజాసంస్థలపై పటేల్ చిట్టచివరకు తన ఆధిపత్యాన్ని సాధించ గలిగారు. దేశభక్తులైన అక్కడి ప్రజానాయకులు పటేల్‌గారిపట్ల విధేయతతో మెలగసాగారు. సంస్థానాధీశులు మర్యాదగా లొంగి, భారత్‌లో సంలీనం కాకపోతే, అక్కడి ప్రజలచేతనే తిరుగుబాటు చేయించగలనని పటేల్ వారిని బెదిరించారు. బ్రిటిష్ పాలనలో సంస్థానాల ప్రజలపై, అక్కడి ప్రజలు సాగించిన ప్రజా ఉద్యమాలపై బ్రిటిష్ వారి దమనకాండ ఇక ముందుకూడా సాగి, ప్రజా తిరుగుబాట్లను అణచడానికి బ్రిటిష్ వారు ఇక్కడ ఉండబోరనీ, ఇది స్వతంత్ర భారత్ అని గుర్తుచేసారు. సంస్థానాధీశులలో కొందరితో సామరస్యంగా, వారిని బుజ్జగిస్తూ, స్వతంత్రంగా మనుగడ సాగించదలచుకున్న సంస్థానాలు ఎదుర్కోబోయే చిక్కుల్ని, కష్టనష్టాల్ని సవివరంగా తెలియజెప్పి, వారిని ఒప్పించారు. నయానా, భయానా సమయ సందర్భాలను బట్టి సంస్థానాధీశులతో వ్యవహరించి, వారిని దారికితెచ్చి, భారతదేశంలో విలీనం అయ్యేందుకు సర్దార్‌పటేల్ చాకచక్యంతో వ్యవహరించారు. అయిదువందల సంస్థానాలను భారత్‌లో కలిపి, సమైక్యపరచి, సర్దార్ పటేల్ భవిష్యత్తులో భారత్‌ను ఎవరూ విడగొట్టజాలరని ఆచరణ ద్వారా నిరూపించారు. నాకు మిత్రులుగా ఉన్న సంస్థానాధీశులను, ప్రజలను రాజ్యాంగ సభకు, కౌన్సిళ్లకు ఎంపికై, అందరి సమిష్టి క్షేమం కొరకు, మన మాతృభూమి అభ్యుదయం కొరకు కలిసికట్టుగా, కృషిచేయ వలసిందిగా, వారిని నేను ఆహ్వానించాను. పటేల్‌కు దీర్ఘకాలంగా మిత్రులూ, ప్రజానాయకులూ అయిన కతియవార్ సంస్థానాధీశుని, నవనగర్, జామ్‌సాహెబ్ గార్లను, ఆయన హృదయపూర్వకంగా ఆహ్వానించారు. ఆయనకు మిత్రుడైన సంస్థానాధిపతి, సాటి సంస్థాన పాలకులతో "భారతదేశం స్వతంత్రంగా ఉంటే, మనం కూడా స్వతంత్రం పొందినట్లే, భారతదేశం గౌరవాన్ని పొందితే, ప్రతి సంస్థానమూ గౌరవాన్ని పొందుతుంది. భారతదేశమే దెబ్బతింటే, ఇక ఎవ్వరం మిగులుతాం?" అని బోధించాడు. ఈవిధంగా గాంధేయమార్గంలో, గొప్పవాడైన మన సర్దార్ పటేల్ సంస్థానాల సంలీనాన్ని జయప్రదంగా సాధించారు. సంస్థానాధీశులను, అక్కడి ప్రజలను భారతదేశంలో, భారతీయులతో 'భాగం'

చేయగలిగారు. సర్దార్‌పటేల్ సాధించిన ఈ విజయం, గాంధేయ విధానం ఎంత విశిష్టమైనదో, ఆచరణాత్మకంగా రుజువు చేసింది.

సర్దార్ పటేల్ దూరదృష్టితో, సరియైన సమయంలో ఎంతటి గొప్ప విజయాన్ని సాధించిపెట్టారో, మనకు అవగత మవుతూనే ఉంది. ఆఫ్రికా ప్రజలను ఎలా విభజించారో, అరబ్బులచేత ఒకరి చెవులను, మరొకరు కొరుక్కునేలా ఎలా వ్యవహరించారో గమనిస్తే, నిజంగా పటేల్ గారి కృషి, ఆయన విజయం ఎంతటి విశిష్టమైనదో మనం గ్రహించగలం. ఆఫ్రికా, ఆసియా, దక్షిణ అమెరికా ప్రజలకు నామమాత్రపు స్వాతంత్ర్యాన్నిచ్చి, దోపిడీ చేస్తున్న సామ్రాజ్యవాదుల కుతంత్రాలకు అవకాశమివ్వకుండా, సర్దార్ పటేల్ దెబ్బతీయగలిగారు.

ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న మిత్రుడొకరు, ఒకసారి కోపంతో ఇలా అన్నారు. "కేంద్రంలోనూ, రాష్ట్రాలలోనూ జరిగే ప్రతి విషయాలు ఈ ముసలాయనకు తెలుస్తున్నాయి. ఈ సమాచారాన్నంతటినీ, ఈయన ఎలా రాబట్టుకోగల తున్నారో, మరి!" ఆయనతో కేంద్ర నాయకత్వం కొరకు పోటీపడుతున్న మరొక నాయకుడు "ఈయన ఒక తాంత్రికుడు" అని వ్యాఖ్యానించారు. మా అందరి గుణగణాలు ఆయనకు పూర్తిగా తెలుసు. దేన్ని నొక్కితే ఏ ఫలితం, ఎలా వస్తుందో ఆయనకు అవగతమే! సంస్థానాధీశులతో వ్యవహరించేప్పుడు మన పాలనాధికారి శ్రీ వి.పి.మీనన్ కూడా అలాగే వ్యవహరించారు. సత్ఫలితాలను సాధించడంలో సర్దార్ గారికి ఉన్న గొప్పతనం అంతా "ఎవరిని నమ్మవచ్చునో, ఏమేరకు నమ్మాలో" అనే సూత్రంతో అంచనా కట్టడంలోనే ఉంది. ఇంతటి సమర్థుడైన నాయకుని, బాపూజీ, రాజాజీలు ఆలస్యం చేయకుండా మొదటి భారత ప్రధానిగా ఉండవలసిందిగా, కోరి ఉండవలసింది.

ప్రజాభిప్రాయాలను, సమస్యలను గ్రహించేందుకు, ప్రజలతో నిత్యసంబంధాలను ఆయన ఎలా కొనసాగించగలుగుతున్నారో అని ఆశ్చర్యం వేస్తూ ఉంటుంది. ఆయనకు వయస్సు మీరిపోతున్నది. ఆయన్ను కలుసుకోవడం అంత సులభంగా ఉండేదికాదు. ఆయన లోడీ పార్కులో, ఉదయం వాహ్యాళి జరిపేటప్పుడు, ఆ తరువాత ఒక గంట విశ్రాంతి తీసుకొనే సమయంలో అనేక రాష్ట్రాలనుండి, పట్టణాల నుండి వచ్చిన భిన్న రంగాలకు చెందిన దాదాపు ఇరవయి మంది వ్యక్తులకూ, ప్రతినిధి వర్గాలకూ ఆయనతో కలిసి, సంప్రతించేందుకు అవకాశం కలుగుతూ ఉండేది. ఆయనను కలిసేందుకు ముందుగా అనుమతి తీసుకొని గానీ, ఆయన ఎదుటపడిగానీ, ప్రజలు ఆయనను కలుస్తూ ఉండేవారు. ఆయన అనుచరులు ఒకరిద్దరు ఎప్పుడూ అక్కడ సిద్ధంగా ఉండి, ఆయనను చూడవచ్చిన ప్రజలకు తగు సమాచారాన్ని అందిస్తూ ఉండేవారు. ఆయనతో సంప్రతింపులకు వచ్చిన 'ప్రతినిధివర్గం' ఏదైనా మూడు నుంచి అయిదు నిమిషాల పాటు చర్చించి, ఆయన చిరునవ్వు నవ్వి, తల వూపడంతో, దాన్నే అంగీకారంగా భావించి వెళ్లిపోతూ ఉండేది. ప్రతి ప్రతినిధివర్గం కూడా ఆయనవద్ద అరమరికలు లేకుండా చర్చించేందుకు ఆయన అవకాశాలు కల్పించేవారు. వచ్చిన ప్రతినిధివర్గం తమ సమస్యలను ఆయనకు వివరిస్తూ, ఆయన అంగీకారాన్ని పొంది, తమ ప్రాంత సాంఘిక, రాజకీయ సమస్యలను ఆయనకు అందిస్తూ, ఉంటే, ఆయన శ్రద్ధగా వింటూ వారికి కావలసిన సహాయాన్ని చేసిపెడుతూ ఉండేవారు. సందర్శకులు ఆయనతో చర్చించేప్పుడు ప్రసంగాల్లో

అనవసరమైన కబుర్లు, అభ్యంతరమైన విషయాలు మాట్లాడితే, ఆయన అసహనంతో వారించి ప్రజల అవసరాలను గురించిగానీ, మీకు మాత్రమే సంబంధించిన అంశాలు గానీ ఉంటే మాట్లాడి వెళ్లమ"ని చెబుతూ ఉండేవారు. ఒక గంట సమయంలో ఆయన తనను కలిసిన ప్రతినిధివర్గాలతో గానీ, భిన్న వర్గాల ప్రజలతో గానీ జరిపిన సంప్రతింపులు, చర్చలు, ఇతర మంత్రులు తమ కార్యాలయాల్లో, బహిరంగ సమావేశాల్లో అయిదు గంటలు చేసిన కృషి కంటే కూడా, ప్రయోజనకరంగా ఉండేవి. పంత్‌గారు కూడా ఇదే వరవడిలో ప్రజలతో నిత్యసంబంధాలను ఏర్పరచుకునేవారు గానీ ఇంతగా ప్రయోజనాన్ని సాధించి ఉండలేదు. సర్దార్ పటేల్‌గారితో చర్చల సందర్భంలో ఆయన పద్ధతి వినూత్నంగా ఉండేది. ఇతరులు తనతో చెబుతున్న విషయాలను శ్రద్ధగా ఆలకిస్తూనే, ఆయన కేవలం మౌనం పాటించకుండా, మధ్యమధ్య ఎదుటి వారిని రెచ్చగొడుతూ, ప్రశ్నలు వేస్తూ, తనకు కావలసిన సమాచారాన్ని ఆయన వారివద్ద నుంచి రాబట్టుకుంటూ ఉండేవారు. అంతేకాదు. వారికి హితబోధ చేస్తూ, వారిని కార్యాచరణకు పురిగొల్పుతూ, ఆత్మవిశ్వాసాన్ని వారిలో పెంపొందిస్తూ ఉండేవారు. అనుచరులతో, ప్రజలతో నన్నిహిత సంబంధాలను కలిగి ఉండడం. విశ్వాసపాత్రమైన స్నేహసంబంధాలను పెంపొందించుకోవడంలో సర్దార్ పటేల్ గారితో, ఎవరూ సాటిరారేలేదు. జవహర్లాల్‌గారి కృషి కూడా ఈ అంశంలో, పటేల్‌గారు సాధించినంతగా, ప్రయోజనాన్ని పొందలేక పోయింది.

మంత్రులు, కార్యదర్శులు సమస్యల పరిష్కారంలో, పటేల్‌గారివద్దకు వెళ్లి, తమ సమస్యలను తెలియజేసి, అమూల్యమైన ఆయన సలహాలను తీసుకుంటూ ఉండేవారు. ఆయన సలహాలను ఆచరణలో పెట్టిన ప్రతి కార్యదర్శికూడా నిర్భయంగా, తాను రూపొందించిన పత్రాలకు, మంత్రివర్గ ఆమోదాన్ని నిస్సందేహంగా పొందగలుగుతాడు. ఆయన పదవిలో కొనసాగిన ఆ కొద్ది కాలంలోనే తన కార్యదర్శులలో అంతటి నమ్మకాన్ని, ఆత్మవిశ్వాసాన్ని ఆయన కల్పించిపెట్టారు. అప్పట్లో 'వాయిస్ ఆఫ్ అమెరికా' సమస్యలో ఏర్పడిన న్యూనతా భావం, అలజడి తిరిగి మరెప్పుడూ ఎదురుకాలేదు.

కాశ్మీరు సమస్యను మిత్రరాజ్య సమితికి నివేదించ రాదంటూ సర్దార్ పటేల్ ఇచ్చిన సలహా ఎంతటి విలువైనదో, పదిహేను సంవత్సరాలపాటు మిత్రరాజ్య సమితిలో నలుగుతూ, అనవసర కాలయాపన జరుగుతూ మనకు నేటికి తెలియవచ్చింది. "సర్దార్‌పటేల్ సలహా ఇచ్చినప్పటికీ, మనం ఒక ఫిర్యాదిలాగా మిత్ర రాజ్యసమితికి ఎందుకు వెళ్లవలసి వచ్చింది? హైద్రాబాద్ సంస్థానాన్ని మనమే స్వయంగా పరిష్కరించుకున్న విధంగా, కాశ్మీరు సమస్యను కూడా స్వయంగా పరిష్కరించుకోలేక పోయామా?" మనల్ని నడిపేందుకు సర్దార్ పటేల్ జీవించి ఉంటే ఎంత బావుండేది" అని 1962 నాటి చైనా దురాక్రమణ సందర్భంలో శ్రీ రాజాజీ, శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ అన్నమాటలు మనకు ఆశ్చర్యాన్ని కలిగించవు. 1972 నాటి బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాటంలో, భారత సైన్యాలను ముందుకు నడిపించి, శ్రీమతి ఇందిరాగాంధీ భారతదేశ శక్తి సామర్థ్యాలను, గొప్పతనాన్ని లోకానికి ప్రదర్శించి చాటింది.

సర్దార్ పటేల్ తీవ్రంగా ఆలోచిస్తున్న ఒక ముఖ్యమైన సమస్యపట్ల జవహర్లాల్ నెహ్రూ ప్రధాని హోదాలో అనేకమార్లు ఆయనకు అడ్డుతగిలారు. అది హైద్రాబాద్ సంస్థానాన్ని భారత

యూనియన్ లో సంలీనం చేయవలసిన ముఖ్యసమస్య. ఈ విషయంలో జవహర్ ను బలపరిచిన మౌలానా అజాద్, మౌంట్ బాటెన్ గార్లకు వందనాలర్పించాల్సి ఉంది. నిజాం సంస్థానాన్ని వీలైనంత తొందరలో కలుపుకోవాలని పటేల్ అభిప్రాయ పడ్డారు. అయితే జవహర్లాల్ అందుకు అంగీకరించలేదు. మౌంట్ బాటెన్ గారి చాతుర్యం సర్దార్ గారి ప్రయత్నాలను మరికొంత ఆలస్యం చేసింది. సైన్యం సర్దార్ గారిపై పూర్తి విశ్వాసాన్ని చూపి, ఆయన అభిప్రాయంతో ఏకీభవించింది. అంతేకాకుండా నిజాంపై సైనిక చర్య ప్రారంభించిన వారం రోజులకే, రజాకార్ సైన్యాలతో ముఖాముఖి తలపడి, ఓడించి, నైజాంను స్వాధీన పరచుకోగలమని కూడా సైన్యం ఆయనకు హామీ నిచ్చింది. అయితే ప్రధాని జవహర్లాల్ బహిరంగంగా సర్దార్ పటేల్ తో తగాదా పడకుండా లౌకికంగా కాలయాపనచేస్తూ వచ్చారు. రోజు రోజుకీ పెచ్చరిల్లి పోతున్న రజాకార్ల రాక్షసకృత్యాలను గురించి, సర్దార్ కు తెలియపరిచి, మాలాంటి వాళ్లం, నిజాంను స్వాధీనం చేసుకోవాల్సిందిగా వత్తిడి తెచ్చినప్పుడు "ప్రధాని జవహర్ తో కొంత ఓర్పుతో వ్యవహరించడం తప్ప, తొందరపడి మనమేం చేయగలం. నిజాంను స్వాధీనపరచుకోవడం తప్పనిసరి అని నేనూ గుర్తించాను. కానీ ప్రధానిగా జవహర్ సహకారం కావాలిగదా" అని ఆయన అన్నారు. "ఏమాత్రం ఆలస్యం లేకుండానే, నిజాంపై సైనికచర్యలను తీసుకుంటామని, మీరు ఉదాసీనతను వదిలి, ఉత్తేజంగా ఉండవలసిందని" నాకు ఆయన హామీ నిచ్చారు. అప్పటికే కొన్ని వారాలు అలానే గడిచాయి. ఈలోగా రజాకర్ల అరాచక చర్యలు హద్దుమీరి పోయాయి. దేశమంతా ఆందోళన చేసింది. అతికష్టంమీద, అలజడి, ఆందోళనలు పరాకాష్టకు చేరుకున్న మీదట, సర్దార్ పటేల్ తనకు తానుగా నిర్ణయం తీసుకొని, కేవలం రెండురోజుల పోలీసు చర్యతోనే హైద్రాబాద్ను స్వాధీన పరచుకున్నారు. నెహ్రూగారి జాప్యం కారణంగా, సర్దార్ పటేల్ గారి రాజకీయ తంత్రాలోచనతో అయిదు వందల సంస్థానాలను భారత్ లో విలీనం చేసిన సమయంకంటే, నైజాంను కలుపుకోవడానికి ఆయనకు ఎక్కువ సమయం పట్టింది. కార్యదర్శులలో ప్రముఖులైన శ్రీ వి.పి. మీనన్ కార్యనిర్వహణలో సర్దార్ పటేల్ గారి అభిమానాన్ని చూరగొన్నందుకు ఆశ్చర్యపడవలసిన పనిలేదు.

మన ఇరుగుపొరుగు రాజ్యాలైన శ్రీలంక, సిక్కిం, నేపాల్, బర్మా, టిబెట్టులతో సర్దార్ పటేల్ గారు అనుసరిస్తున్న రాజకీయ విధానాన్ని గమనించకుండానే, జవహర్లాల్ కమ్యూనిస్టు చైనాతో గాఢమైన స్నేహానికి ప్రయత్నించడం పటేల్ గారికి ఇష్టంగా ఉండేదికాదు. 1912 నాటి చైనా, టిబెట్, ఇండియాల మధ్య సిమ్లాలో కుదిరిన త్రైపాక్షిక ఒడంబడికను, కొమింటాంగ్ చైనాగానీ, కమ్యూనిస్టు చైనాగానీ అంగీకరించి, ఆ ఒడంబడిక ప్రకారం టిబెట్ను సర్వస్వతంత్ర రాజ్యంగా గుర్తించేందుకు మనం తీసుకున్న నిర్ణయాన్ని చైనా తిరగదోడకుండా చేయగలగాలనీ, టిబెట్ పై చైనా సామ్రాజ్య విస్తరణ దృష్టిని మనం అంగీకరించరాదని మేమంతా భావిస్తూ ఉండేవాళ్లం. అయితే జవహర్లాల్ గారు మా భయాందోళనలను పరిగణనలోకి తీసుకోవడంగానీ, భారత భౌగోళిక స్థితికి చెందిన అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆలోచించడంగానీ, ఉత్తర భారతదేశానికి సరిహద్దులో ఉన్న హిమాలయ రాజ్యమైన టిబెట్టు స్వాతంత్ర్యాన్ని గురించి చైనా నుండి హామీ పొందాలనీ గానీ ఎట్టి ప్రయత్నాలను చేయలేదు.

వాస్తవ పరిస్థితులను గమనంలోకి తీసుకొని, దూరదృష్టిగల సర్దార్‌పటేల్ మాత్ ఏకీభవించారు. అందువల్ల జవహర్ గారిని మా అభిప్రాయాలకు సన్నిహితంగా తీసుకొచ్చేందుకు సర్దార్ చొరవ తీసుకున్నారు. అంతేగాకుండా భారతదేశ భౌగోళిక స్థితిగతులకు తగు రక్షణలు కల్పించేందుకు, చైనాతో శత్రుత్వం లేకుండానే, టిబెట్టు, చైనా, ఇండియాల మధ్య సాంప్రదాయికంగా కొనసాగుతున్న విధానాన్ని యథాతథంగా కొనసాగేట్లుగాను, న్యాయమైన చైనా ప్రయోజనాలకు భంగం కలగని రీతిలో, మనం చైనాతో వ్యవహరించాలని జవహర్‌కు నచ్చచెప్పడానికి ప్రయత్నించారు. ఆయన మరణించబోయే ముందు ప్రధాని జవహర్‌కు రాసిన ఉత్తరాలలో నెహ్రూ అనుసరిస్తున్న పొరపాటు విధానాలను మార్చుకొని, వాస్తవ పరిస్థితులను విశదీకరిస్తూ వేడికోలుగా అభ్యర్థించారు. తదుపరి భారతదేశంపై దండయాత్ర జరిపి చైనా నెహ్రూజీ మనసారా ఆశించిన స్నేహసౌహార్దతను పటాపంచలు చేసింది. దూరదృష్టిగల పటేల్‌గారి సలహాలను పాటించనందుకు, దేశమంతా నెహ్రూజీని తప్పుపట్టింది. దేశానికి తలమానికమైన సర్దార్ అభిప్రాయాల్లో ఇమిడిఉన్న వాస్తవాన్ని మేమంతా ముందే గ్రహించాం. టిబెట్ స్వాతంత్ర్యం కోసం, టిబెట్ దినోత్సవం జరపడానికి చేస్తున్న ప్రయత్నాలను బలపరిచినందుకు, నెహ్రూజీ నన్ను వ్యతిరేకించారు.సర్దార్ పటేల్ గారి సలహాలను, పద్ధతులను అనుసరించకుండా, మేమందరం తప్పుచేసాం! ఆయన మా అందరికంటే అనుభవశాలి .అయితే అప్పట్లో మన దేశపరిపాలనా విధానాలను రూపొందించే హక్కు మాచేతుల్లో లేదు.

మరొక కోణంలో పరిశీలించినప్పుడు, నెహ్రూజీకి మల్లే సర్దార్ పటేల్ అభ్యుదయవాదిగానట్లు కనిపిస్తారు. హిందూ ఆస్తిహక్కు బిల్లు విషయంలో ఈతేడా మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో నెహ్రూ అభిప్రాయాలతో అంబేద్కర్ ఏకీభవించారు. అప్పట్లో హోంశాఖలో సర్దార్ గారికి జూనియర్ మంత్రిగా పదవీబాధ్యతలు నిర్వహిస్తున్న పటాస్కర్ గారు మితాక్షర పద్ధతి ననుసరించి, నాలుగు గోడల మధ్య పరాధీనంగా ఉన్న స్త్రీల ఆస్తిహక్కులను రాజ్యాంగంలో పొందుపరిచే విషయంలో గౌరవప్రదమైన రాజీని కుదిర్చారు. ఒక సమస్యపట్ల అనుకూలురను, ప్రతికూలురను, మధ్యేవాదులనుకూడా సమన్వయంచేసి, ప్రజాభ్యుదయ కృషిలో, ఒకేమార్గంలో నడిపించిన గాంధేయ వాదానికి ఈ ఘనత దక్కింది.

నెహ్రూజీ తిరుగులేని నాయకులుగా చెలామణీ అవుతున్న సమయంలో, మంత్రివర్గంలో చేరడానికి నేను ఇష్టపడనందుకు, ఆయన అమితంగా బాధపడ్డారు. కాంగ్రెసుపార్టీ కార్యవర్గంలోనూ, పార్లమెంటరీ కమిటీలలోనూ, మరికొన్ని కొద్దిపాటి కమిటీల్లోనూ ఉండి, నేను బాధ్యతలు నిర్వహించడానికి అంగీకరించగా, ఎలాగైనా నన్ను మంత్రివర్గంలో చేర్చుకోవలసిందిగా నెహ్రూగారితో పటేల్ పోట్లాడుతూ ఉండేవారు. మంత్రికీ, కార్యనిర్వాహక సభ్యునికీ మధ్య ఉండే ప్రతిపత్తిలోని వ్యత్యాసం ఆయనకు తెలియనిది కాదు. మంత్రిగా ఉంటే, సహచరుడిగా, చెప్పినట్లు నడచుకోవడం, సభ్యుడైతే స్వతంత్ర ప్రతిపత్తితో ఉంటూ, సమానస్థాయిలో వ్యవహరించడం జరుగుతుంది. అయితే ఆయన నాతో ఏకీభవించలేదు. మంత్రిపదవిలో ఉండి రైతులకు సహాయపడే అవకాశాన్ని నేను పోగొట్టుకుంటానని ఆయన భావించారు.

జవహర్‌కూ, పటేల్‌కూ మధ్య జరిగిన ఉత్తరప్రత్యుత్తరాలను గమనిస్తే, అత్యంత

సమర్థతగల ఉపప్రధానివంటి వ్యక్తికూడా, తన విధానాలను అమలుపరిచేందుకు కూడా తుదకు అవకాశంలేకుండా, నెహ్రూ మొండిగా వ్యతిరేకించే వారని పటేల్ నాకు రాసిన జాబులద్వారా నేను గ్రహించాను. తన నిర్ణయాలకు తుది ఆమోదం పొందడానికి ఆయన గట్టిపట్టు పడుతూ ఉండేవారు. (ఎగోనీ అండ్ సాలోస్, పి.పి 206-203, ఉత్తరాలు 159, 160 చూడండి).

రైతులు, చేతివృత్తులవారి, స్వీయ జీవనోపాధిగల సామాన్య, మధ్యతరగతి ప్రజల జీవన విధానానికి ప్రతిపదికగా గల ఆర్థిక వ్యవస్థలో తీవ్రమైన మార్పులు చేయడానికి, నెహ్రూజీ పూనుకుంటున్నాడని, మంత్రివర్గ సమావేశాల్లోనూ, కాంగ్రెసు పార్టీ కార్యవర్గ సమావేశాల్లోనూ ఆయన ఉపన్యాసాలు గమనించినప్పుడు అర్థమైంది. రైతుల, చేతివృత్తుల వారి జీవన విధానాన్ని దెబ్బతీసే కార్యక్రమాన్ని చేపట్టే మంత్రివర్గంలో చేరడానికి నేను అంగీకరించకపోవడం సబబైన నిర్ణయమేనని మీరు అంగీకరిస్తారు. నెహ్రూజీపట్ల నాకు గౌరవం ఉన్నది. ఉభయులం కూడా సోషలిజానికీ, మానవతావాదానికీ కట్టుబడిన వారమే. ప్రభుత్వ విధానాల ద్వారా సోషలిజాన్ని ప్రవేశపెట్టాలని నెహ్రూజీ ప్రయత్నించగా యుగోస్లావియాలో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్న పద్ధతిలో కృషేవ్ సైతం అంగీకరించిన వరవడిలో సామాజిక పరంగా అన్వయించి, మనదేశంలో, సోషలిజాన్ని అమలుచేయాలని నేను భావిస్తున్నాను. మరొక ఆందోళనకరమైన అంశం కూడా తీవ్రంగా ఆలోచించవలసి ఉన్నది. ఈ అంశం నెహ్రూజీ పారిశ్రామిక విధానంపట్ల వ్యామోహానికి సంబంధించి ఉంది. భారతదేశాన్ని శీఘ్రగతిలో అభివృద్ధి చెందించడానికి, రైతాంగం ఏమాత్రం ఉపయోగపడజాలదనీ, పారిశ్రామిక విధానమే దాన్ని సాధించగలదని నెహ్రూజీ అభిప్రాయపడ్డారు. కానీ అందుకు భిన్నంగా భారతదేశ సమగ్రాభివృద్ధి రైతాంగంయొక్క, చేతివృత్తులు, చిన్నచిన్న వృత్తులు అవలంబించే సామాన్య వర్గాల వారి సహకారంతో మాత్రమే సాధించగలమని నేను నమ్ముతున్నాను. మా ఉభయుల మధ్య ఉన్న అభిప్రాయ బేదాలు సర్దార్ పటేల్ గారు ఎరిగినవే. అయినప్పటికీ నామీద పటేల్ గారికి ఉన్న అభిమానం కారణంగా, నేను మంత్రిపదవిని వదులుకోవడం సమంజసం కాదని ఆయన భావించారు.

సర్దార్ పటేల్ గారి దృష్టికి ఎప్పుడైనా రైతు సమస్యలు, వారి ఇబ్బందులూ, ఆయనకు సన్నిహితమైన సహచరుల సమస్యలు ఎదురైనప్పుడు ఆయన ఉదారంగా వ్యవహరించేవారు. కంట్రోలు విధానం వల్ల రైతుల పడుతున్న ఇబ్బందులను ఏకరువు పెట్టి నేను, పటేల్ గారిని ఎంతో వ్యధకు గురిచేస్తూ ఉండేవాడిని. నిర్బంధంగా ధాన్యం వసూలు చేసే విధానాన్ని ఎత్తివేయాలనే అంశంతో పటేల్, నాతో ఏకీభవించారు. తమ ఇండ్లలో స్వంత వాడకానికి, కూలీలకు ఇవ్వడానికి నిల్వఉంచుకున్న ధాన్యం కలిగి ఉండడం ద్వారా కూడా చట్ట ప్రకారం రైతులు నేరస్థులుగా పరిగణింపబడడం, వారి దురదృష్టం, అంటూ ఆయన ఆవేదన చెందేవారు. ధాన్యానికి చెల్లిస్తున్న ధరలు చాలా స్వల్పంగా ఉంటున్నాయనీ, అందువల్ల రైతులు బహిరంగ మార్కెట్‌లో అమ్ముకోవడంలో దోషం లేదనీ ఉత్పత్తి దారులైన రైతులు ఎన్నోబాధలు పడుతున్నారని, రేషన్ షాపు డీలర్లు నాతో అన్నారు అంటూఆయన చెప్పేవారు.

లార్డు కారన్‌వాలీస్‌గారు జమిందారులకు ఇచ్చిన శాశ్వత హక్కులు, భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తొలి దశాబ్దంలో రద్దు అయినాయి. స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో

విలీనం చేసిన సందర్భంలో, సర్దార్ పటేల్ గారిచే ఇవ్వబడిన ప్రివీ పర్సులు, 'గరీబీ హఠావో' నినాదంతో దేశవ్యాపిత ఉద్యమాన్ని ప్రారంభించినప్పుడు శ్రీమతి ఇందిరాగాంధీ చేత రద్దుచేయబడ్డాయి. స్వదేశీ సంస్థానాధీశులకు కారన్ వాలీస్ ద్వారా లభించిన ఆఖరి అవకాశాలను కూడా తుడిచివేయడానికి ఏమాత్రం వెనకాడలేదు. అయితే ఆ కార్యక్రమాన్ని ఆయన ఎలాంటి బాధ కలిగించకుండానే నిర్వహించారు.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత, స్వదేశీ సంస్థానాధీశులకు సర్దార్ పటేల్ కల్పించిన వనరులు రాజ్యాంగంలో చట్టబద్ధం చేయబడినప్పటికీ, తదుపరి ఇరువది అయిదు సంవత్సరాలకే, అవి ఎందుకూ కొరగాకుండా రద్దుచేయడం చూస్తే, సామాజిక విప్లవమార్గానికి అడ్డునిలిచే ఎలాంటి చట్టపరమైన అంశం అయినా త్రోసివేయబడక తప్పదని మనం గ్రహించవలసి ఉంది.

అనేక మాజీ సంస్థానాల్లో పటేల్‌గారి కంచు విగ్రహాలు నెలకొల్పబడ్డాయి. 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా జరిగిన రైతుల ఊరేగింపు, పార్లమెంటు స్ట్రీట్‌లో ఉన్న పటేల్ విగ్రహం ముందు ఆగి, గొప్ప రైతునాయకునిగా ఆయనకు నివాళులర్పించిన నాటినుండి, ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకొంది. అప్పటినుండీ ఆదారివెంట ఏ ప్రదర్శన గాని, ఊరేగింపుగానీ వెళ్లినప్పుడు, అక్కడ ఆగి, పటేల్ విగ్రహానికి వందనాలర్పించి, దాని ద్వారా స్ఫూర్తిని, ధైర్యాన్ని పొందడం ఆనవాయితీగా మారింది. హైదరాబాద్‌లో, జునాఘడ్‌లో, ఆనంద్‌లో, కరమ్‌సాద్‌లో ఉన్న పటేల్ భారీ కంచు విగ్రహాలు కూడా మనల్ని ఉద్వేగ భరితులనుగా చేస్తుంటాయి.

సర్దార్ పటేల్ గారి శతజయంతి ఉత్సవాలను ఢిల్లీ ఎర్రకోటలో అన్ని వర్గాలు వారూ నిర్వహించారు. భారత ప్రధాని, రాష్ట్రపతి, త్రివిధ సైనికదళాలు ఆయనకు గౌరవ వందనాన్ని సమర్పించడం జరిగింది. ఆ సందర్భంలో 1971-72 నాటి బంగ్లాదేశ్ వివాదంలో పాకిస్తాన్ ఓటమిని, స్వతంత్ర బంగ్లాదేశ్ అవతరణను ఆయనకు గౌరవ నివాళిగా సమర్పించటంజరిగింది. ప్రతిపక్షాలు కూడా ఆయనకు తమ గౌరవ వందనాలను సమర్పిస్తూ, సమైక్య భారతదేశ నిర్మాణానికి పటేల్ చేసిన సేవలను ప్రస్తుతించాయి. తెరవెనక ఉండి అమెరికా కుతంత్రాలు పన్నుతూ, మద్దత్తు అందిస్తూ ఉండగా, పాకిస్తాన్ పన్నాగాలను తిప్పికొట్టడంలో యావద్భారతదేశం సమైక్యంగా నిలిచి, భారత సమైక్యతకు మూలస్తంభమైన పటేల్ కు జాతి తన నివాళులర్పించింది.

7

శ్రీ యస్.కె. పాటిల్

మాజీ బొంబాయి నగర మేయరు ప్రముఖవక్త అయిన శ్రీ కె.యఫ్.నారిమన్ నుండి వచ్చిన ప్రతిఘటనను ఎదుర్కోవాలని కాంగ్రెస్ పార్టీ, సర్దార్ పటేల్ అనుకొన్న తరువాత, స్వాతంత్ర్య సమర యోధులు, మొదటి శ్రేణి నిర్మాణ కాంగ్రెస్ కార్యకర్త శ్రీ యస్.కె.పాటిల్ బొంబాయి రాజకీయ రంగం మీద ముందుకు వచ్చారు. 1930-34 ఉప్పు సత్యాగ్రహంలోను, రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులోను ప్రముఖపాత్ర వహించి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడిన యువకుల అభిమాన పాత్రుడయిన నాయకుడు శ్రీ నారిమన్‌ను కాదని, ఆయన జూనియర్ అయిన శ్రీ బి.కేర్‌ను శాసనసభాపార్టీ నాయకునిగా చేయాలని సర్దార్ పటేల్‌గారు ప్రయత్నించినపుడు బొంబాయిలోని మెజారిటీ కాంగ్రెస్ కార్యకర్తలు న్యాయమైన నారిమన్ గారి కోర్కెను బలపరచి పటేల్ గారి నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. ఆ క్లిష్ట సమయంలో శ్రీ పాటిల్ శ్రీ పటేల్‌గారికి తోడునిలచి పార్టీ తన నిర్ణయాన్నుండి వెనుకడుగు వేయకుండా చూశారు. పార్టీలో ఉన్న యువకులకు నచ్చజెప్పి వారిలో ఉన్న ఉద్రేకాన్ని ఆయన తగ్గించగలిగారు. పెద్దదైన చౌపతీ బీచ్ ఫోరమ్‌లో అత్యంత అభిమానాన్ని సంపాదించుకున్న నాయకులను నారిమన్ గారికి జరిగిన ఈ అన్యాయం విషయంలో బాగా కోపంగా ఉన్న దేశభక్తులైన పార్శీలను ఆయన తమాషాగా శాంతింపజేయగలిగారు. పాటిల్ గారుగానీ, ఇతరులుగానీ నారిమన్‌గారి పరంగా ఏర్పడిన వ్యతిరేక భావాన్ని సగాన్ని మాత్రమే తగ్గించ గలిగారు. ఈ విభేదాలు సద్దుమణిగి నగరంలో తిరిగి పూర్తి విశ్వాసాన్ని పొందటానికి చాలా సంవత్సరాల కాలం పట్టింది. పాటిల్ గారు తన సర్వశక్తులను ఈ పోరాటం కోసం వినియోగించినప్పటికీ, 1946 నాటికిగాని ఈ గండిని పూడ్చలేకపోయారు.

ఇందుకోసం ఆయన 1945వ సంవత్సరం వేసవిలో సిటిజెన్ సిప్పు కాలేజిని ఏర్పాటుచేసి దానిని సక్రమంగా నడిపించవలసిందిగా నన్ను ఆహ్వానించారు. ఆయన దీనికోసం యువజన కాంగ్రెస్ నుంచి సహాయం తీసుకున్నారు. అప్పుడు యువజన కాంగ్రెస్ దినకర్ సక్రేకర్‌గారి నాయకత్వంలో యున్నది. ఒక వారం రోజులపాటు మేమిద్దరం కలసి పనిచేసి యువకులకు తగు విధంగా శిక్షణ ఇచ్చాం. బ్రిటిష్ పాలనకు తోడ్పడుతున్న "ప్రజాయుద్ధ" నినాద వాదులను చూసి కలత చెందిన యువకులు అనేకమంది "జాతీయ విప్లవంలో ప్రపంచ పాత్ర", "జాతీయ విప్లవపదం యొక్క సంక్షిప్తస్వరూపం", "కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యం" అను నేను తయారుచేసిన సిద్ధాంతాలను అధ్యయనం చేసేందుకు ఉత్సాహంతో ఈ కళాశాలకు వచ్చారు. ఆ సిద్ధాంతాలు ఆ తరువాత పత్రికల ద్వారా బాగా ప్రచారంలో కొచ్చాయి.

యుద్ధ సమయంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా బొంబాయి నగరంలో జరిగిన గొప్ప పోరాటానికి పాటిల్ గారు ప్రముఖ నిర్వాహకులు. కమ్యూనిస్టులు ఆఖరుకు మధ్య తరగతి నుండి

కూడా ఎక్కువ పాపులారిటీని పొందగలుగుతున్నారని ఆయన గ్రహించారు. చురుకైన, నిర్మాణ పాటవం కలిగిన శ్రీ పాటిల్ ఇతర రాష్ట్రాల కంటే ముందుగా ఈ విషయాన్ని పసిగట్టి సిద్ధాంతపరంగానే కమ్యూనిస్టులను ఎదుర్కోవాలనుకొని, బొంబాయి ప్రదేశ్ కాంగ్రెస్ కమిటి తరపున సిటిజన్ షిప్పు కాలేజిని నిర్వహించారు. 1944 నవంబరులోను, 1945 జనవరిలోను నేను ఆయనకు సమర్పించిన కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని మహాత్మాగాంధీగారు ఆశీర్వదించారు. దాని ప్రాముఖ్యతను గురించి, ప్రజా ప్రయోజనాల విషయంలో కాంగ్రెస్ విధానాల పరిణామాలను గురించి మన యువకులకు వివరించవలసిన అవసరం ఉంది. నెహ్రూగారు భారత జాతీయోద్యమం ద్వారా ఆసియా-ఆఫ్రికా ఖండాలలోని స్వాతంత్ర్యోద్యమాలకు ఎలా మార్గదర్శకంగా ఉండి అండగా పనిచేస్తున్నారో తెలియజేశాను. నేను వలపలు, నల్లజాతి ప్రజల పోరాటాల గురించి వివరించాను. అవి గాంధీజీ ఆశీస్సులను పొందగలిగాయి. పత్రికలలో ప్రముఖంగా ప్రచురించబడ్డాయి. జాతీయ విప్లవం ఎలా సామ్యవాద విప్లవంలాగా అభ్యుదయకరమో, యువకులకు బోధించవలసిన అవసరం ఎక్కువగా ఉందని, ఈ రెండూ వేర్వేరు కాదని పరస్పరం విడదీయరాని సంబంధం కలిగి ఉన్నవేనని, అదే ప్రజాస్వామ్య సామ్యవాద విప్లవమని పాటిల్ గారు గట్టిగా నచ్చజెప్పాలని అభిప్రాయపడ్డారు. యుద్ధానంతర బొంబాయి రాజకీయాలలో ఆవిధంగా పాటిల్ గారు కాంగ్రెస్ పక్ష జాతీయ సామ్యవాద విప్లవానికి మంచి పునాదిని ఏర్పరిచారు. పాటిల్ గారు బొంబాయి కాంగ్రెసుకు, దాని కార్యకర్తలకు, నగర నిర్వహణకు గట్టి రాజకీయ స్వరూపాన్ని ఏర్పరచిన గొప్ప నిర్మాత. నిధులు వసూలే చేయటంలోను, వాటిని సక్రమంగా వినియోగించటంలోను ఆయనకు ఆయనేసాటి. ఉత్సాహవంతులైన యువకులను ఎన్నుకొని వారిని పార్టీ ప్రచారంలోను, నిర్మాణ కార్యకలాపాలలోను, ఎన్నికల పరంగాను సక్రమంగా వినియోగించటంలో ఆయన నేర్పు అనితర సాధ్యం. సర్దార్ పటేల్‌గారు పాటిల్‌గారి ఈ సమర్థతలను గుర్తించి ఆయనకు కావలసిన అధికారాన్ని, మొదాను నిధులను తోడుగా ఉంచి బలం చేకూర్చారు. 1930 ప్రాంతంలోనే పటేల్ గారు పాటిల్ గారి నిర్మాణ దక్షతను విశ్వాస పాత్రతను నిజాయితీని గ్రహించగలిగారు.

పాటిల్ గారు కూడా సర్దార్‌ను తనకు గట్టి అండగా భావించి కమ్యూనిస్టులు, కొన్ని పత్రికలు ఆయన మీద విరుచుకు పడుతున్నప్పుడు గూడా చలించక, ఆయన యెడ విశ్వాసపాత్రంగా నిలిచారు. వారిద్దరి కలయిక దేశ ప్రయోజనాలకు ఉపయోగపడటమే గాకుండా ఎన్నికల సమయాల్లో వచ్చే అన్ని రాజకీయ సంఘర్షణల్లోను కాంగ్రెసుకు గట్టి తోడయింది.

అధికార రాజకీయాల్లో గట్టి ప్రావీణ్యం కలిగిన ఆయనకు అధికారం పట్ల అధిక శ్రద్ధ ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి కాగలిగే అవకాశాన్ని ఆయన కొద్దిలో పోగొట్టుకున్నారు. బొంబాయి నగర రాజకీయాలలోనే ప్రత్యేక శ్రద్ధ వహిస్తుండడం వల్ల జిల్లాలలోని కాంగ్రెస్ నాయకులతో, కార్యకర్తలతో ఆయనకు సరైన సంబంధాలు లేకుండా పోయిన కారణంగానూ, గుజరాత్ మహారాష్ట్రలతో కూడిన సంయుక్త బొంబాయి రాష్ట్రాన్ని ఆయన తెలివి తక్కువగా సమర్థించిన కారణంగానూ, ఆ సమయంలో నెహ్రూజీ, పటేల్‌గారలు ఇద్దరూ ఆయనకు కావలసిన రాజకీయ సమర్థను అందించలేకపోయిన కారణంగానూ ఇది సంభవించింది.

అయినప్పటికీ ఆయన పూర్తిగా పరాజయం చెందలేదు. ఎందుకంటే నగరం ఆయనను మూడుసార్లు వరుసగా మూడు సంవత్సరాలు మేయరుగా ఎన్నుకొంది. ఆ గౌరవం ఇతరులెవ్వరికి లభించలేదు. ఆ సందర్భంలో పౌరసౌకర్యాలను బాగా అభివృద్ధి చేయటం ద్వారా ఆయన తనకున్న నిర్మాణ చాకచక్యాన్ని చూపెట్టారు.

స్వాతంత్రానంతరం ఎన్నికల ప్రచార సందర్భాల్లో ఆయన తన సామర్థ్యాన్ని నిగ్గుతేల్చి చూపెట్టారు. కాంగ్రెస్ వ్యతిరేకత పెరుగుతున్న సందర్భంలో ఆయన, పత్రిక, రేడియో, వేదికలను పూర్తిగా వినియోగించుకున్నారు. ప్రతిపక్ష నినాదాలకు, కార్యకలాపాలకు ఆయన ఎక్కడికక్కడ అప్పటికప్పుడే సమాధానాలు ఇస్తుండేవారు.

ఏ ఎన్నికలలో నయినా కమ్యూనిస్టులకు వ్యతిరేకంగాగాని, సోషలిస్టులకు వ్యతిరేకంగా గానీ ఎవరితో పోరాడవలసి వచ్చినా కాంగ్రెస్ విజయంపై పూర్తి విశ్వాసంతో పనిచేస్తూ తన ప్రచారం ద్వారా ప్రజలలో నమ్మకం కల్పించి ఆయన విజయం సాధిస్తుండేవారు. ఆయన కేరళలో, ఆంధ్రలో, బొంబాయిలో గూడా కమ్యూనిస్టులవారి మిత్రపక్షాల తీవ్ర ప్రయత్నాలను ఈ రకంగా ఎదుర్కొని కాంగ్రెస్ విజయానికి తోడ్పడగలిగారు. 1955 ఆంధ్రా ఎన్నికలలో కాంగ్రెస్ దాని మిత్ర పక్షాలు విజయాన్ని సాధించగలిగినంత గట్టిగా ఉన్నప్పటికి, ఐక్య కాంగ్రెస్ ఓటమికి కమ్యూనిస్టులనుండి ఎదురవుతున్న బెదిరింపు దృష్ట్యా ఆయన తన చాకచక్యమైన ప్రజాసంబంధాలతో విజయ సాధనపై పూర్తి నమ్మకాన్ని కలిగించారు.

ఆయన చేసిన ఈ గొప్ప కృషిని గ్రహించి జవహర్లాల్ నెహ్రూగారు తన మంత్రివర్గంలో ఆయనకు ప్రముఖ స్థానాన్ని కల్పించారు. పాటిల్ గారు ఆ సందర్భంలో అనేక మంత్రివర్గ శాఖలను నిర్వహించారు. ఆయన పార్లమెంటులో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకున్నారు. అయినప్పటికి అంతకు పూర్వం ఆయన పార్టీ వ్యవహారాలలో చూపిన సమర్థతను దృష్టిలో ఉంచుకొని పార్టీ వ్యవహారాల కొరకై శ్రీ నెహ్రూ ఆయనను కొంతకాలం మంత్రివర్గం నుంచి తప్పించారు. తిరిగి శ్రీ లాల్ బహదూర్ శాస్త్రిగారి మంత్రివర్గంలో ఆయన చేరారు. శ్రీ పాటిల్ మంత్రిగా ఉన్నప్పుడు కూడా ఊహాజనితమైన ఆశలు చూపించే గొప్ప ప్రచారకునిగానే పనిచేస్తుండేవారు. సంవత్సర ప్రారంభంలో నూతన ప్రతిపాదనలతోను, పనుల పూర్తికి హామీలతోను ఆయన చాలా మృదువుగా కనిపించేవారు. సంవత్సరాంత చర్చల్లో నిర్మాణాత్మకమైన తన కృషిని వివరించేకంటే, తన ప్రసంగ సామర్థ్యాన్ని కనబరుస్తూ ఉండేవారు. 1955లో శాసన సభకు జరిగిన సాధారణ ఎన్నికలలో కమ్యూనిస్టుల సవాలును ఎదుర్కోవటంలో ఆయన నిర్వహించిన ప్రముఖ పాత్రకారణంగా ఆంధ్రులకు ఆయనంటే ప్రత్యేక గుర్తింపు ఏర్పడింది. అందువల్ల ఆంధ్రులు ఆయనను తమ రైతాంగ నాయకుని నిలువెత్తు విగ్రహావిష్కరణకు ఆహ్వానించారు. అదే విధంగా సర్దార్ పటేల్ గారి అభిమానులు ఆయన నిలువెత్తు కంచు విగ్రహాన్ని న్యూఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ కూడలిలో శ్రీ పాటిల్ గారిచేత ఆవిష్కరింప జేసుకొన్నారు.

1967 సాధారణ ఎన్నికలలో ఆయన ఓటమి ఆయనకు ముందుముందు సంభవించబోయే కష్టాలకు నాందిగా ప్రారంభమైంది. శ్రీమతి ఇందిరా గాంధీ నాయకత్వానికి

వ్యతిరేకంగా అహంభావముతోనూ, అవివేకంతోనూ ఆయన, ఆయన అనుచరులు ప్రదర్శిస్తున్న తొందరపాటు చర్యలు శ్రీమతి ఇందిర అభిమానులను జాగృతమొనర్చాయి. కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు తరపున రాష్ట్రపతి అభ్యర్థిగా శ్రీ నీలం సంజీవరెడ్డిని అంగీకరించవలసినదిగా శ్రీమతి ఇందిరాగాంధీపై ఆయన తీసుకు వచ్చిన వత్తిడి ఆ తరువాత కాంగ్రెసు చీలికకు కారణమైంది. అందులో ఆయన వర్గం, ఆ తరువాత దెబ్బతిన్న వర్గమైంది. 1971 సాధారణ ఎన్నికలలో ఆయనకు ప్రాభవమున్న మధ్యతరగతి రాజకీయ నాయకత్వాన్ని తోసివేసి, అట్టడుగున పడిఉన్న వర్గాలు చైతన్యవంతమై తమకు తాము విజయాన్ని సాధించాయి. ఆ తరువాత సంభవించిన రాజకీయ పరిణామాలలో శ్రీ జయప్రకాశ్ నారాయణ్, శ్రీ మురార్జీ దేశాయ్ గారలు ఆయనను అటు అధికారంలోను, ఇటు జాతీయ రాజకీయ కార్యకలాపాలలోను దూరంగా ఉంచారు. అధికార రాజకీయ కార్యకలాపాలలో నిస్సందేహంగా ఆయన గొప్ప మాటకారి.

8

శ్రీ ప్రగడ కోటయ్య

స్వయం వృత్తితో జీవించే ప్రజల నాయకులు

శ్రీ కోటయ్యగారు తన తండ్రికి గల ఆరుగురు సంతానంలో రెండోవారు. ఆయన తండ్రి శ్రీ ప్రగడ వీరభద్రయ్య అయిదారుగురు సోదరులను, సోదరీమణులను పోషించడంతో పాటు తన తలిదండ్రుల బాధ్యతను గూడ తానే వహిస్తున్నారు. ఆరోజుల్లో పారందరకు పనిచేసుకోడానికి రెండు మగ్గాలు మాత్రమే ఉండేవి. కోటయ్య గారికి అప్పుడు పన్నెండు సంవత్సరాల వయసు. 1929-35 సంవత్సరాల మధ్య దేశంలో తీవ్రంగా ఏర్పడిన ఆర్థిక దుస్థితి కారణంగా రైతులు తదితరులు కూడా బాగా కష్టనష్టాలకు గురవుతున్న సమయంలో మగ్గాలమీదనే జీవితం గడుపుకోవలసిన తండ్రి పెద్ద కుటుంబాన్ని నిర్వహించలేక చేతినిండా పనిలేక చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఆ సమయంలో యాభై రూపాయల వేతనంతో నిడుబ్రోలు గ్రామ పంచాయితీలో ఆయన పనికి కుదిరారు. అది చాలా తక్కువ జీతాన్ని ఇచ్చేదైనప్పటికి వారి కుటుంబానికి లభించిన ఒక అదృష్టంగా వారు దానిని భావించారు.

కోటయ్యగారు ఆరోజుల్లో హైస్కూల్లో చదువుతూ ఉండేవారు. ఆయనకు స్కూలు ఫీజు వగైరాలకు నాలాంటి వారం సహాయం చేస్తుండేవారం. ఎందుకంటే స్వరాజ్యం వచ్చిన తరవాతలాగ ఆరోజుల్లో వెనుకబడిన కులాల వారికి గాని, పేద ప్రజలకుగాని స్కూలు ఫీజు మినహాయింపులేదు. కోటయ్యగారు మరొక ఇద్దరితోపాటు యస్.యల్.సి. పరీక్ష పాసయినారు. ఆ మిగతా ఇద్దరిలో ఒకరైన నిడుబ్రోలుకు చెందిన శ్రీ శ్రీమన్నారాయణ రైతు కుటుంబీకుడు. ఆయన కూడా బాగా పేదరికంలో ఉన్న కుటుంబంలో నుంచి వచ్చిన వారు, తరవాత ఆయన కాలేజి ప్రిన్సిపల్‌గా పనిచేశారు. కోటయ్యగారి చదువు విషయంలో ఆయన తండ్రి నన్ను సంప్రదించారు. నూతన సాంకేతిక విలువలతో కూడిన చేనేత విద్యను గురించి దీని జాతీయ ప్రాముఖ్యాన్ని నేను బాగా గుర్తించే ఉన్నాను. ఒక కోటిమందికి పైగా ఉన్న చేనేత కార్మికులు బాగా తినమరిగిన ఇంగ్లండు భారతదేశ ప్రభుత్వాల నిరాదరణ కారణంగాను బట్టల మిల్లులవారి పోటీ కారణంగానూ బాగా చితికిపోయి దురదృష్టకరమైన జీవితాన్ని గడుపుతున్నారు. చేనేత కుటుంబంనుండి వచ్చిన ప్రముఖులు శ్రీ పి.త్యాగరాజ శెట్టియార్ గారి ప్రయత్నంలో 1910 లో ప్రారంభమైన మద్రాసు టెక్స్‌టైల్ ఇన్‌స్టిట్యూట్‌కు కోటయ్యగారిని పంపవలసిందిగా ఆయన తండ్రికి నేను సలహా ఇచ్చాను.

పచ్చయప్ప కళాశాల ప్రొఫెసర్‌గా, మద్రాసు ప్రభుత్వ తొలి ఆర్థిక సలహాదారుగా నేను నా పలుకుబడి నుపయోగించి శ్రీ కోటయ్యగారికి అందులో ప్రవేశం ఇప్పించడమేగాక వారికి ఉపకార వేతనం లభించేలాగ కూడ చూశాను. ఇందులో ఆ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపల్ గారైన మిస్టర్ అమల్‌సాద్ గారికి ప్రేమపూర్వకంగా వారు చేసిన సహాయానికి నా కృతజ్ఞతలు.

కోటయ్యగారు తాను నేర్చుకున్న బ్యాచ్‌లో సమర్థులయిన విద్యార్థిగా పైకి వచ్చారు. రెండు సంవత్సరాల ఆ శిక్షణ తరవాత నేతలో చక్కని నైపుణ్యాన్ని సాధించడమేగాక చక్కటి నమూనాదారుగా కూడా ఆయనపైకి వచ్చారు. కుటీర పరిశ్రమ ద్వారా స్వయం వృత్తులతో జీవిస్తున్న ఇలాంటి కుటుంబాల స్థితిగతులపై దేశం దృష్టిని మళ్లించడానికి మహాత్మాగాంధీగారు ప్రయత్నిస్తున్న రోజులవి. ఖద్దరును ప్రోత్సహించడం ద్వారా స్వయం గౌరవాన్ని స్వయంవృత్తిని సాధించుకుంటూ తమకు తాము ముందుకు వచ్చేందుకు వీలుగా గృహపరిశ్రమలను ఆయన ప్రోత్సహించారు. ఆర్థిక దుస్థితి కారణంగా దెబ్బతిన్న వ్యవసాయ దారులు తమ భూములను స్వల్పమైన ధరలకు వడ్డీ వ్యాపారస్తులకు దఖలు పరుస్తూ తమ వృత్తులకు ఆధారభూతమైన భూమిని కోల్పోతున్న కాలమది. నేత పనివారు ఆ కరువు పరిస్థితుల్లో నిస్సహాయ పరిస్థితుల్లో ఉండిపోవడం ఆశ్చర్యకరంగాదు.

ఆ సమయంలో నేను ప్రచురించిన పరిశోధనాత్మక గ్రంథాలు "ఎకనమిక్స్ ఆఫ్ ఖద్దర్", "ఎకనమిక్స్ ఆఫ్ హేండ్‌లూమ్ ఇండస్ట్రీ" రెండు సంపుటాలుగా ప్రచురించిన "ఎకనమిక్ కండిషన్స్ ఆఫ్ ఇండియన్ విలేజెస్ అండ్ అగ్రికల్చరల్ ఇండస్ట్రీస్" గాంధీగారి ప్రీతికి పాత్రమై రైతుల చేనేత కార్మికుల పక్షాన నేను సహకార సంఘాలను ప్రారంభించడానికి బాపూజీగారి ప్రోత్సాహం లభించింది. చేనేత కుటుంబాల వారికి సాంకేతిక శిక్షణా సౌకర్యాలను పెంపుదల చేయవలసిందిగా బ్రిటీష్ ప్రభుత్వం వారిపై అప్పుడు నేను వత్తిడి చేశాను. నేను మొదటిసారిగా బ్రిటీష్ వారిచే జైళ్లలో ఉంచబడిన ఆ తరుణంలో, 1933 సంవత్సరం డిశంబరులో గాంధీగారిచే ప్రారంభించబడిన నిడుబ్రోలులోని భారత రైతాంగ విద్యాలయం కోసం గిరిజనుల నుండి, హరిజనుల నుండి, చేనేత పనివారల నుండి రైతులనుండి విద్యార్థుల కొరకై మేం ప్రయత్నిస్తున్న రోజులవి. 1934, 1935, 1936 సంవత్సరాలలో మా రైతాంగ విద్యాలయం విద్యార్థులలో కోటయ్యగారు ఒకరు. మనదేశ ఆర్థికాభివృద్ధిలో చేనేత పనివారికి గౌరవ ప్రదమైన స్థానాన్ని సంపాదించేందుకు నావలెనే ఆయన ఎక్కువ ఆసక్తిని కనబరుస్తూ ఉండేవారు. అయితే పేదరికంలో ఉన్న ఆయన కుటుంబ పరిస్థితులు గౌరవ కార్యకర్తగా కాంగ్రెస్ ఉద్యమంలో పాల్గొనే అవకాశాన్ని ఆయనకు కల్పించే పరిస్థితుల్లో లేవు. అందువలన ఆయనను మేం రాష్ట్రస్థాయిలో క్రొత్తగా ఏర్పాటుచేయబడిన మదరాసు హేండ్‌లూమ్ కో ఆపరేటివ్ సొసైటీలో ఆర్గనైజర్‌గా చేర్పించాం. అది ఆయన సహకారసంఘాలను అభివృద్ధి చేయడంలోనూ, చక్కని నమూనాలను తయారుచేయడంలోనూ, క్రొత్తగా సహకార సంఘాలను ఏర్పాటు చేసేందుకుగాను ఎక్కువ శ్రద్ధ వహించే అవకాశాన్ని కలిపించింది. ఈ ప్రయత్నంలో చేనేత కుటుంబం నుంచి వచ్చిన మరొక ముఖ్యవ్యక్తి, అప్పుడు ప్రభుత్వంలో సహకారశాఖ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీ గంజి పున్నయ్యగారినుండి, ఆయనకు మంచి ప్రోత్సాహం లభించింది.

మద్రాసు రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో చేనేత పనివారి సహకారసంఘాలు ప్రారంభించడం మొదలైంది. ఇందుకు ప్రధాన పాత్ర వహించిన శ్రీ కోటయ్యగారు, చెక్స్‌పైల్ డిపార్టుమెంటుల్లో ఉన్న శ్రీ పున్నయ్యగారు, పెంట్యం వెంకట్రాములుగారు, వాణిజ్య దృక్పథం కలిగిన శ్రీ మాసాని సోమప్పగారు అభినందనీయులు. విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం పూర్తిచేసుకొని వచ్చిన

చేనేత కుటుంబాల వారు శ్రీ దామెర్ల రమాకాంతం, మంగళగిరికి చెందిన శ్రీ శ్రీకంఠం, చీరాలకు చెందిన కాంగ్రెసు కార్యకర్తలు శ్రీ పి. వెంకట్రాములు శ్రీ అక్కల కోటయ్య నర్సీపట్నంకు చెందిన శ్రీ బసవరాజు గార్లు చేనేత సహకారోద్యమం విస్తృతికై మేం సాగిస్తున్న కృషిలో మాకు తోడ్పడ్డారు. రంగులు, నూలు, రుణసౌకర్యాల పెంపుదల, ఉచిత ఆర్థిక సహాయం వంటి వాటిని సహకార సంఘాలకు పెంచవలసిందిగా ప్రభుత్వంపై మేం వత్తిడి చేయసాగాం. 1939 నాటికి రాష్ట్ర చేనేత పనివారం సహకార సంఘాల నాయకత్వాన్ని మా అదుపులోనికి తీసుకొచ్చుకున్నాం. అప్పుడు ఎఫెక్సు సొసైటీకి అధ్యక్షులుగా నేను ఏకగ్రీవంగా ఎన్నికయ్యాను. ఇందుకు ప్రధానంగా కృషిచేసిన శ్రీ పున్నయ్య, శ్రీ కోటయ్యగార్లు అభినందనీయులు. అప్పుడు నేను శ్రీ కోటయ్యగారిని రాష్ట్రస్థాయి నిర్వాహకునిగా నమూనాదారుగా నియమించాను. నేను మా గ్రామమైన నిడుబ్రోలులో యుద్ధ సమయంలో ప్రభుత్వ ఆజ్ఞలను ధిక్కరించి నాలుగున్నర సంవత్సరాలు ప్రభుత్వ నిర్బంధంలో ఉన్నపుడు ప్రఖ్యాత ఎమ్మిగనూరు వీవర్స్ కో ఆపరేటివ్ వ్యవస్థాపకులైన శ్రీ మాసాని సోమప్పగారిని ఎఫెక్స్ సొసైటీకి నిర్వాహక అధ్యక్షులుగా పనిచేయవలసిందిగా కోరారు.

శ్రీ కోటయ్య గారు సహకార సంఘాల నిర్వహణలోను, డిజైన్ల రూపకల్పనలోను మంచి అనుభవమున్న సలహాదారుగా చక్కటి పేరు తెచ్చుకున్నారు. ఆయన జీతం పుచ్చుకుంటూ తన విధులను నిర్వహిస్తున్నప్పటికీ ప్రాథమిక చేనేత సహకార సంఘాల డైరెక్టర్లలోనుండి ముందుకు వచ్చే ఉత్సాహవంతులైన యువకులను బాగా ప్రోత్సహిస్తుండేవారు.

పాతపనిముట్లతో పనిచేసుకుంటూ కులాలపరంగా చీలిఉన్నంతకాలం చేనేత పనివారు, కళాకారులు కాలానికి సరిపోయే విధంగా తగిన మార్పులను పొందలేరనడాన్ని మేం గ్రహించాం. అందువలన ప్రగడ కోటయ్యగారు చేనేత వృత్తిలో ఉన్న వివిధ కులాల పెద్దలను ఒక పెద్ద పారిశ్రామిక సమాజంగా చేనేత పనివారల కాంగ్రెస్‌లో కలిపి వేసేందుకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించారు. ఆ చేనేత కాంగ్రెస్ ప్రారంభం కావడంతో అన్ని కులాలను, హరిజనులను, గిరిజనులను, దేవాంగులను, పద్మసాలీలను, తొగటీలను, పట్టుసాలీలను అందరినీ కలిపి ఒకటిగా నిలిపే విప్లవాత్మకమైన కృషికి పూనుకున్న తరువాత ఆయనకు ప్రగడ అనేపేరు ప్రఖ్యాతమై పోయింది.

యుద్ధ సమయంలో పెరిగిన రంగుల నూలు ధరలు చేనేత పనివారల స్థితిగతులను కష్టనష్టాల పాలు జేశాయి. సొసైటీలో అధికారిగా పనిచేస్తూ చేనేత పనివారలకు తాను ఎలాంటి సహాయాన్ని చేయలేదని కోటయ్యగారు తలపోయడం మొదలెట్టారు. రైతులకు చేనేత పనివారికి మిత్రులమైన మాలాంటి వారం అప్పుడు జైళ్లలో పడి ఉండడాన్ని కోటయ్యగారు గమనించారు. అప్పుడాయన శ్రీమతి భారతీదేవిగారి దగ్గరకు వచ్చి తాను జాతీయోద్యమ పరిధిలో చేనేత పనివారల ప్రయోజనాల కోసం తన ఉద్యోగానికి రాజీనామా చేసి, సనిచేసేందుకు గాను తన తలిదండ్రులను ఒప్పించవలసిందని కోరారు. ఆమె, నేను ఈ విషయమై జైళ్లలో కలుసుకున్న అనేక మార్లు చర్చించుకున్నాం.

కోటయ్యగారి తండ్రి బాగా పెద్దవారై పోతున్నారు. అప్పుడాయన కొడుకులు, కూతుళ్లు, కోడళ్లపరంగా మొత్తం ఎవరికైతేనేం నాలుగయిదు మగ్గాలుండేవి. ఏ విధంగానైనా ఆకుటుంబం కష్టాల నెదుర్కొంటూ ఎక్కువ కాలం నిలువలేదు. అందువలన ఆ కుటుంబాన్ని దారిద్ర్యం బారిన పడకుండా కాపాడాలి. అప్పటివరకు ఆకుటుంబానికి నెలనెలా కోటయ్యగారు అందిస్తున్న నాలుగు వందల రూపాయలను వదులుకోమని వారికి సలహా ఇవ్వగలమా? ఒక్కసారి కోటయ్యగారు పూర్తిస్థాయి ప్రజాసేవకుడిగా మారితే ఆ తరువాత ఆయన ఎలా నిలద్రొక్కుకోగలడు. వారికి ఉపయోగపడే సంస్థలేమైనా ఉన్నాయా! అయితే వాటి ఆర్థిక స్థితిగతులేమిటి, ఇవన్నీ ఆలోచిస్తూ పెద్దవారైన వీరభద్రయ్యగారి హృదయాన్ని గాయపర్చేందుకు మేం పూనుకోలేక పోయాం.

కోటయ్యగారు ఓపిక పట్టలేకపోయారు. ఆయన ఆ ఇబ్బందులన్నింటిని పట్టించుకోదలుచు కోలేదు. చేనేత పనివారల బాధలతో తాను సత్యాగ్రహి కాలేకపోయినందుకు ఆయన చాలా విచారించారు. అందుకుగాను ఆయన ఏమీ పట్టించుకోకుండా ఒక్కసారిగా చేనేత వర్గ ప్రజల పరంగా పూర్తిస్థాయి ప్రజాసేవకునిగా ముందుకు దూకారు.

తన ఖాదీపరమైన, రాజకీయ ఆర్థికపరమైన ప్రచారంతోపాటు, దీనిపై కూడా శ్రద్ధ వహించేందుకు మహాత్మాగాంధీగారు సంతోషంతో అంగీకరించారు. అయితే 1945వ సంవత్సరం వరకు ఖాదీ ఉద్యమంతో సమానంగా మిల్లునుండి వచ్చిన దారంతో మగ్గాలపై పనిచేసే వారికి తన ఆశీస్సులు సమంగా ఇచ్చేందుకు ఆయన ఆగారు. శ్రీ ప్రగడకోటయ్య, శ్రీ వెంకట్రాములుగార్లు చేనేత పనివారల సంస్థలను ఏర్పాటుచేసే కృషిలో అనేకమంది కాంగ్రెస్ వాదులు వారిని నిరుత్సాహపరుస్తున్నప్పటికి లెక్కచేయకుండా నాతో చేతులు కలిపారు.

శ్రీ శ్రీకంఠంగారు, శ్రీరమాకాంతం గారు బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో వారు చదువుకునే రోజుల్లో సోషలిస్టులు కొనసాగించిన కారణంగా మా చేనేత ఉద్యమంలో ప్రవేశించేందుకు వారిని కొన్ని భయాలు అనుమానాలు పీడించాయి. చేనేత వృత్తికి భవిష్యత్తులేదని ఇది కారల్ మార్క్స్ చెప్పిన విధంగా ఆరిపోబోయే ముందు పొందే విరామం లాంటిదేనని అందువలన చేనేత వృత్తుల రక్షణ అనేది అర్థం లేని ప్రయత్నమని వారు అనుకున్నారు. నా పుస్తకం "ఎకనమిక్స్ ఆఫ్ ది హేండ్‌లూమ్" చదువుకున్న శ్రీ పున్నయ్యగారు మా రైతాంగ విద్యాలయంలో శిక్షణ పొందిన శ్రీ కోటయ్యగారు వారి అనుమానాలను నివృత్తిచేసి వారిని మా మార్గంలోకి తీసుకొచ్చారు. బాగా జనాభా కలిగి అభివృద్ధి చెందిన దేశాలలో చేతిపనులకు, కళలకు ఉన్న ప్రాముఖ్యాన్ని వారు ఈ సందర్భంలో వారికి చూపెట్టారు. కోటయ్యగారు మా వాదనలోని యదార్థాన్ని తెలియజేస్తూ యూరోపియన్ అమెరికన్ ఆర్థిక పరిస్థితుల్లో యాంత్రికపరమైన పెట్టుబడి దారీ పరిశ్రమలకున్న ప్రాధాన్యత ఆసియాలో నిరుద్యోగాన్ని కల్పిస్తాయే తప్ప పనికల్పనకు ప్రజల సమిష్టి ఆర్థికాభివృద్ధికి తగు విధంగా ఉపయోగపడలేవన్న గాంధీగారి వాదాన్ని విప్పి చెప్పారు. అదృష్టవశాత్తు జవహర్లాల్‌గారు కూడా ఆ సమయంలో ఎక్కువమందికి పని కల్పించే పరిశ్రమల పట్ల చేతివృత్తులపట్ల నమ్మకాన్ని ప్రదర్శించారు. (ఆయన "డిస్కవరీ ఆఫ్ ఇండియా" 1946 ఎడిషన్) అందువలన చేనేత పనివారల

కుటుంబాలనుండొచ్చిన హైస్కూల్లు, కాలేజీ విద్యార్థులు అనేకమంది చేనేత పనివారల కాంగ్రెస్‌లోనూ సహకార సంస్థలలోనూ మాతో కలసి పనిచేయడానికి ముందుకు వచ్చారు.

అభ్యుదయకరం, స్వయంవృత్తుల వారికి జీవనాధారం అయిన ఈ చేనేత వృత్తిరక్షణ విషయంలో, అధికారంలో ఉన్న బ్రిటీష్ సామ్రాజ్య వాదులతోనూ ఖద్దరును మాత్రమే ప్రోత్సహించాలనే కాంగ్రెస్ సాంప్రదాయ వాదంతో కూడా పోరాడవలసి వచ్చింది. ఆ పోరాటంతో మద్రాసులో తన ఉద్యోగాన్ని వదలుకొని కోటయ్యగారు చేసిన త్యాగం గొప్పది. ఆయనకు శ్రీమతి భారతీదేవిగారు చేనేత పనివారలకు రాజకీయ తరగతులు నిర్వహించడంలోను చేనేత భజనావళి అనే పాటల పుస్తకాన్ని ప్రచురించడంలోను అనేక జిల్లాలలో చేనేత వృత్తుల వారి యాత్రలను నడపటంలోనూ శ్రీమతి భారతీదేవి సహకరించారు. నిడుబ్రోలుకు చెందిన శ్రీప్రగడ కోటయ్యగారు చీరాల వారైన అక్కల కోటయ్యగారు చేనేత ఉద్యమాన్ని రాజకీయ ఉద్యమంలో ఒక ప్రధానమైన దానిగా మలిచారు.

నా పూర్తిస్థాయి కేంద్ర శాసనసభ సభ్యత్వ కాలంలో (1935-45), అనేకమార్లు భారత బట్టల మిల్లులనుండి చేనేత పరిశ్రమకు రక్షణ కల్పించటానికి ప్రయత్నించారు. రైతాంగ విభాగ శాసనసభ్యులు ప్రభుత్వం వారు తక్కువ ధరలో చేనేత పనివారలకు నూలు సరఫరా చేయాలని మిల్లుల పోటీని తట్టుకునేందుకై చీరెలు, ధోవతుల వంటి కొన్ని వస్త్రాల ఉత్పత్తిని పూర్తిగా చేనేత పరిశ్రమకే కేటాయించాలని మిల్లుల వారికి కొత్త మగ్గాల విస్తరణకు అనుమతి ఇవ్వరాదని పట్టుబట్టారు. దీనిని మొత్తం కాంగ్రెస్ పార్టీవారిచేత ఆమోదింప జేయడానికి మాకు చాలాకాలం పట్టింది.

1937-47 సంవత్సరాల మధ్య చేనేత ఉద్యమాన్ని భారతదేశమంతా మేం విస్తరింపజేయగలిగాం. మద్రాసులో రాజాజీగారి మంత్రివర్గం కొనసాగుతున్న రోజుల్లో శ్రీ కంఠంగారు మొట్టమొదటి అఖిలభారత చేనేత మహాసభను నిర్వహించారు. అయితే 1945 సంవత్సరం వరకు మేమంతా నిర్బంధంలో నుంచి బైటపడేదాక వేచి ఉండవలసి వచ్చింది. శ్రీ యన్.వెంకట్రామానాయుడుగారి సహకారంతో బీహార్‌కు చెందిన శ్రీ అన్సారీ, హైదరాబాదుకు చెందిన శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ, షోలాపూర్‌కు చెందిన శ్రీ ఆర్.వి.బెట్, యు.పికి చెందిన శ్రీ సహయోగి, ధియోగర్‌కు చెందిన పానికర్ గారిని, నాగపూర్‌కు చెందిన కుంభారేగారిని, పూనాకు చెందిన శ్రీ కొన్సిగారిని, కరూర్ వారైన శ్రీ గోపాలన్ గారిని కలిసి వివిధ రాష్ట్రాలలో చేనేత కాంగ్రెస్ రాష్ట్ర కమిటీలను ఏర్పాటుచేసేందుకు కృషిచేశాం.

అప్పటికి ఆంధ్రప్రాంతంలో రాష్ట్రస్థాయిలో చేనేత కాంగ్రెస్ సంస్థను శ్రీ ప్రగడ కోటయ్యగారు తమ సమర్థవంతమైన కృషితో ఒక ప్రజాసంస్థగా బాగా అభివృద్ధి లోకి తెచ్చారు. నిడుబ్రోలులో "చేనేత" పేరుతో ఆయన ఒక తెలుగు వార పత్రికను కూడ ప్రారంభించారు. చేనేత వృత్తి పనివారల సభలలో చిన్నచిన్న మొత్తాలలో వసూలు చేసిన విరాళాలను ఆయన ప్రతి పైసాను ఎంతో జాగ్రత్తగా ఖర్చుచేస్తూ ఉండేవారు.

క్రమేణా జిల్లాస్థాయిలో చేనేత సంఘాలు ఏర్పడి అన్ని కేంద్రాలలో జిల్లా సభలు

జరుపుకోవడం ప్రచార సమావేశాలు నిర్వహించడం ప్రారంభమైంది. ఆంధ్రులకు కళాత్మకమైన వారి పనితనంపై నమ్మకం కలిగిస్తూ తమ స్వయంవృత్తుల అభ్యుదయ ధోరణిని వివరిస్తూ ఆయన తమ నిర్మాణ సారధ్యంతో ఈ ఉద్యమాన్ని అన్ని మూలలకు తీసుకువెళ్లగలిగేవారు. ఆ రీతిగా ఆయన రైతాంగం స్వయంవృత్తుల వారి వృత్తిరక్షణకు ఆర్థికాభివృద్ధికి విశేషంగా పాటుపడుతూ, చక్కని నాయకులుగా ఎదిగారు. ఆ తరవాత నాగపూర్‌లోనూ, ఢిల్లీలోను జరిగిన అఖిలభారత చేనేత మహాసభల సందర్భంలో ఆయన సమర్థుడుగా గుర్తింపుపొంది అఖిలభారత సంఘానికి ప్రధాన కార్యదర్శి అయ్యారు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో మన చేనేత కుటుంబాల వారికి నూలు, రంగులకు కొరత ఏర్పడి వాటి ధరలు పెరిగిపోయాయి. మిల్లులవారి దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి సహాయం కొరకు ఎదురుచూడవలసిన పరిస్థితుల్లో పడ్డారు. అందువలన చేనేత కాంగ్రెస్, సహకార నూలుమిల్లులను, రంగుల ఫ్యాక్టరీలను ఏర్పాటు చేయవలసిందిగాను అందులో ఎక్కువ వాటాలు చేనేత పనివారలకు ఉండేలా చూడవలసిందిగానూ, ప్రత్యేక ప్రభుత్వ సంస్థలద్వారా నూలు రంగులు లాభం నష్టంలేని పద్ధతుల్లో చేనేత పనివారల కందించవలసిందిగానూ "చేనేత ఆర్థిక అంశాలు" తయారుచేసి వాటిని ఆమోదించవలసిందిగా ప్రభుత్వాన్ని కోరింది. రైతుల ఉత్పత్తులపై కంట్రోళ్లు విధించడానికి వ్యతిరేకంగా వారు జరిపే పోరాటాల్లో చేనేత కార్మికులు చేయి కలిపారు. బట్టల పరిశ్రమకు సంబంధించిన ప్రభుత్వ కమిటీలలో తమ సంస్థలను గుర్తించి వాటికి తగినంత ప్రాతినిధ్యం కల్పించవలసిందిగా వారు కోరారు. సందర్భ వశాత్తూ భారత ప్రభుత్వం చేనేత అభివృద్ధి సంఘాలను ఏర్పరచి అందుకు నన్ను అధ్యక్షునిగా, కోటయ్యగారిని, మాసాని సోమప్ప గారిని, సభ్యులుగా నియమించింది. ఆ కమిటీ సభ్యులుగా ఉంటూ ఢిల్లీ పెద్దలతో ఎలా వ్యవహరించాలో వారు అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. సోమప్పగారు హేండ్ లూమ్ మార్కెట్ బోర్డు నేర్పాటుచేసి దేశంలోని అన్ని ముఖ్యకేంద్రాలలోను, విదేశాలలోను చేనేత వస్త్ర విక్రయ శాలలను ఏర్పాటు చేశారు. వారిద్దరూ ఆలిండియా హేండ్ లూమ్ బోర్డులో అనధికార సభ్యులుగా చేర్చుకోబడ్డారు.

చేనేత పనివారలు జాతీయ స్రవంతిలో ఒక ముఖ్య విభాగంగా గుర్తింపును పొంది అన్ని ప్రభుత్వ సంప్రదింపుల సంఘాలలోను, రాజకీయ పక్షాలలోను తగిన ప్రాతినిధ్యం పొందగలిగే స్థితికి వచ్చారు. 1946-51 సంవత్సరాల కాలంలో నేను ఆంధ్రా కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేస్తున్న సమయంలో కార్యవర్గంలో వారిని అనధికార సభ్యులుగా నియమించి గౌరవించాను. ఆ తరువాత ఆయన దాని ఆర్గనైజింగ్ సెక్రటరీగాను తరువాత ప్రధాన కార్యదర్శిగాను ఎదగగలిగారు. జాతీయ కాంగ్రెస్ పక్షం పట్ల ఆయనకున్న విశ్వాసం ఎప్పుడూ తిరుగులేనిది. అయితే నాలాగే ఆయన ఇచ్చే మొదటి ప్రాధాన్యం స్వయం వృత్తులతో బ్రతికే జాతి ఆర్థిక సమస్యలకే.

ఆయన చూపించిన రీతులను బీహార్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల లోని ఇరత చేనేత నాయకులు కూడా అనుసరించారు. నిర్మాణాత్మకమైన వీరి సత్యాగ్రహ పద్ధతులు చేనేత పనివారిలో ఆత్మ విశ్వాసాన్ని కలిగించి జాతీయ ఆర్థిక అభివృద్ధి కృషిలో ముందుకు వెళ్లేందుకు

వారిని ప్రోత్సాహ పరుస్తుండేవి.

శ్రీ ప్రగడ కోటయ్యగారు వెనుకబడిన తరగతుల ఉద్యమాభివృద్ధికి కూడా మంచి పూనిక వహించారు. మాలాంటి వారం కొందరం దీని అవసరాన్ని గురించి కొన్ని దశాబ్దాలకు ముందే చెప్పాం.

ఆంధ్ర చేనేత ఉద్యమం అనేక నిర్మాణాత్మకమైన రీతుల్లో భారతదేశమంతా విస్తరించింది. స్వాతంత్ర్యానంతరం వచ్చిన మన ప్రభుత్వం ఈ విషయంలో కనబరచిన ప్రత్యేక శ్రద్ధ అభినందనీయం. ఒక్క ఆంధ్రప్రాంతంలోనే ఆరు సహకార నూలుమిల్లులు ప్రారంభమయ్యాయి. అందులో ఒకటి మాసాని సోమప్పగారి పర్యవేక్షణకింద గుంతకల్‌లోను మరొకటి ప్రగడ కోటయ్యగారి నాయకత్వం కింద చీరాలలోనూ ప్రారంభించబడ్డాయి. పూర్తిస్థాయి రంగుల కర్మాగారాలు కూడ రాష్ట్రచేనేత సహకార సంఘాల ప్రోద్బలంతో నిర్వహించబడుతున్నాయి. చేనేత కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సహాయ సంస్థలు రానున్నాయి. రాష్ట్రస్థాయిలో చేనేత వారికి సహకార మార్కెటింగ్ సొసైటీ నిర్వహణ కొనసాగించబడుతూ ఉంది. అన్ని పట్టణాల్లో చేనేత వస్త్ర విక్రయశాలలు ఏర్పాటుచేయబడి సూపర్ మార్కెట్లలోనికి ఇవి ప్రత్యేకంగా దర్శనమిస్తున్నాయి. మన చేనేత బట్టలను విదేశాలకు ఎగుమతి చేసేందుకు ప్రభుత్వం అన్నిరకాల సహాయాలను అందిస్తోంది. చేనేత పనివారలకు అన్ని వసతులతో గూడిన కాలనీల ఏర్పాటు జరుగుతోంది. అలాంటి ఒక నిడుబ్రోలు కాలనీలో శ్రీ కోటయ్యగారు ప్రస్తుతముంటున్నారు. ప్రతి సంవత్సరం విధిగా చేనేత వారోత్సవాలను ప్రభుత్వ పరంగానూ, సహకార సంస్థల పరంగానూ జరుపు తున్నారు. సహకార సంస్థలలోనూ, మాస్టర్ వీవర్ల వద్దనూ పనిచేస్తున్న చేనేత కార్మికుల జీవన పరిస్థితుల మెరుగుదలకై వేతనాల పెంపుదలకై కోటయ్యగారు ఆశతో ఇంకా పోరాడుతూనే ఉన్నారు. శ్రీమతి ఇందిరాగాంధీ ప్రవేశపెట్టిన ఇరవై సూత్రాల ఆర్థిక కార్యక్రమం వారి ఇబ్బందులను చాలావరకు తొలగించేందుకు తోడ్పడింది.

వధ్నాలుగు సంవత్సరాలకు పైగా ముందు మద్రాసులోనూ, తరవాత ఆంధ్రశాసనసభలోనూ సభ్యులుగా ఉండి మంచి అనుభవనీయులుగా సమర్థులుగా పేరు తెచ్చుకున్నారు. ఏదైనా ప్రజా సమస్యల విషయంలో ఆయన మాట్లాడవలసి వస్తే అందులో ఉన్న వాస్తవాలను వివరిస్తూ ఆయన చెప్పే పద్ధతి మంత్రులను అధికారులనుగూడ ప్రత్యేక శ్రద్ధతో గమనించేలాగ చేయగలిగేది. అందరూ ప్రగడ రీతిగా ఆయన ధోరణులను గుర్తిస్తూ ప్రత్యేక శ్రద్ధతో గమనిస్తుండేవారు. ప్రజలకు ఎక్కడ అన్యాయం జరిగినా ప్రజలకు సంబంధించిన ఏ సమస్యను ఆయన తీసుకున్నా దానిని చాలా గొప్పగా వివరిస్తూ అందరి దృష్టిపథంలో పడే విధంగా చేసేవారు.

1972 సంవత్సరంలో స్వయంవృత్తులతో జీవించే మూడుకోట్ల మంది చేనేత కార్మికుల అవసరాలను గుర్తించాలని కోరుతూ ఆయన సమర్పించిన నివేదికకు, గాంధేయ సోషలిస్టు మార్గంలో స్వయంవృత్తుల వారికొరకై నిర్మాణాత్మకంగా నేను చేసిన సిద్ధాంతాలను నా పుస్తకాలు "సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్" "వరల్డ్ రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్" "నై

ఆర్డిజన్స్ హెయిల్ గాంధియన్ ప్లాన్" అనే నా గ్రంధాలనుండి గ్రహించిన అంశాల ద్వారా ఆయన సమర్ధవంతంగా తయారుచేశారు. ఇంతటి సమర్ధులైన వారు నా దైతాంగ విద్యార్థి కావటం, గ్రామీణ ప్రజలకొరకు, స్వయం వృత్తులకొరకు పోరాడే వ్యక్తికావడం మా అదృష్టంగా నేను భావిస్తాను.

ప్రగడ కోటయ్యగారు చేనేత పనివారల సంక్షేమం కోసం ఎంత అవిశ్రాంతంగా కష్టపడి పనిచేస్తారో అలాగే రైతులకోసం వ్యవసాయ కార్మికుల కోసం కూడా కృషిచేస్తూ ఉంటారు. 1940 సంవత్సరం నుండి ఆయన పోరాడుతున్న దానిని గుర్తించి కేంద్రప్రభుత్వం ఆలిండియా హేండ్లూమ్ బోర్డు నేర్పాటుచేసింది. అందులో శ్రీ కోటయ్యగారు ఒక ముఖ్యులైన సభ్యులు కూడా.

కోటయ్యగారు తన సమయాన్ని కొంతవరకు గుంటూరుజిల్లాలోని వ్యవసాయ కార్మికుల కొరకు కూడ ఉపయోగించారు. ఆయన కృషి ఫలితంగానే రొంపేరు ప్రాజెక్టు ప్రాంతంలో అనేకమంది భూములు లేని నిరుపేద రైతుకూలీలు భూమిని పొందగలిగారు. చీరాల తాలూకాలోని వేల ఎకరాల ఇసుక భూములకు నీటి వసతి కలగడానికి కూడా ఆయన ప్రధాన కారకులు. అదే విధంగా గుంటూరు, కృష్ణా, నాగార్జునసాగర్ మాగాణి ప్రాంతాల్లో మురుగునీటి పారుదల సౌకర్యాల కల్పన కోసం ఆయన ఆందోళన చేశారు. ఈ విధంగా మొత్తం గ్రామీణ ప్రాంతాలలోని అన్నిరకాల సమస్యలకు ఆయన మొదటి శ్రేణి నాయకులు కాగలిగారు.

అర్ధ శతాబ్దంగా స్వయంవృత్తులతో గృహపరిశ్రమల ద్వారా జీవించే ఈ చేనేత పనివారల సమస్యలకోసం నిర్వహించిన పోరాటం శ్రీమతి ఇందిరాగాంధి ఇరవై సూత్రాల కార్యక్రమంలో స్థానాన్ని పొంది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ముందు అమలుచేయటానికే పెట్టబడింది. సోషలిస్టు మార్గంలో పయనిస్తున్న మనజాతి స్వయం వృత్తులతో జీవించే ఈ మూడుకోట్ల మంది ప్రజల అవసరాలను గుర్తించి, జాతీయార్థికాభివృద్ధి కృషిలో వీరిని ఒక భాగంగా గుర్తిస్తూ కొన్ని రకాలైన బట్టలను ప్రత్యేకంగా చేనేత పరిశ్రమకు కేటాయించి వారికి రక్షణ కల్పించింది. గాంధేయ సోషలిజంలో ఈ రీతి ఉత్తమ నాయకుడిగా శ్రీ కోటయ్యగారు గుర్తించబడ్డారు. ఇది ఆయనకు ఏ మంత్రి పదవి ద్వారా పొందలేనంతటి గొప్ప గౌరవాన్ని తెచ్చింది. 1976 ఆగష్టు 15-21 తేదీల సమయంలో మన జాతీయ స్వాతంత్ర్య వారోత్సవాలు జరుపుతున్నప్పుడు చేనేత ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రకాశం జిల్లా చీరాలలోని ఈపూరుపాలెం ఏరియాలో శ్రీ కోటయ్యగారి తైలవర్ణ చిత్రపటాన్ని నేను ఆవిష్కరించ గలగడం నాకు ఒక గొప్ప విశేషంగా నేను భావిస్తున్నాను. 1990 సంవత్సరంలో శ్రీ కోటయ్యగారు రాజ్యసభ సభ్యులుగా ఎన్నికకావడం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. 7-11-1996 వరకూ ఆయన పార్లమెంటులో ఉండి ఒక యోధుడుగా స్వయంవృత్తుల వారికి తోడు నిలబడ్డారు.

9

శ్రీ టంగుటూరి ప్రకాశం

1971వ సంవత్సరంలో ఆంధ్రకేసరి శ్రీ టంగుటూరి ప్రకాశంగారి శతజయంతి ఉత్సవాలను దేశమంతటా సంతోషంగా జరుపుకున్నారు. మహాత్మాగాంధీగారిని దేశభక్తునిగా కీర్తించిన శ్రీ కొండా వెంకటప్పయ్య జన్మించిన గుంటూరుజిల్లాలోనే వీరుకూడా జన్మించారు.

శ్రీ ప్రకాశంగారు ధైర్యసాహసాలలో శ్రీ లజపతిరాయ్, శ్రీ మోతీలాల్ నెహ్రూ, శ్రీ సి.ఆర్.దాస్, శ్రీ దేశ్‌పాండే, శ్రీ శ్రీనివాస అయ్యంగార్, సర్దార్ పటేల్, శ్రీ రాజాజీగార్లతోనూ, లెక్కచేయని తనంలో స్వామి శ్రద్ధానంద, శ్రీ లజపతిరాయ్‌గార్లతోను పోల్చదగిన వాడు. జాతీయోద్యమ కాలంలో సి.ఆర్.దాసు గారిని ఎదుర్కోవడానికి జంకని మనిషి. రెండుతరాలుగా ఆంధ్రప్రజా హృదయాలలో ఆయన ఆరాధన లందుకుంటున్నారంటే అది ఆశ్చర్యంకాదు.

ఆయన మనకు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మద్రాసులో ఒకసారి ఆంధ్రరాష్ట్రంలో మరొకసారి రెండుసార్లు ముఖ్యమంత్రిత్వం వంటి ఉన్నతపదవులను పొందగలిగారు. ప్రజాస్వామ్యం వేసిన పిల్లిమొగ్గలను ఎన్నికల ద్వారా లభించే అదృష్ట దురదృష్టాలను కూడా ఆయన చవిచూడ గలిగారు.

1882 ఆగస్టు 23న జన్మించారు, నలభై సంవత్సరాలు ఆంధ్ర రాజకీయ రంగస్థలంమీద అప్రతిహతంగా నడచిన ఆయన మే 20, 1957న మరణించారు. ఈరోజుకు కూడా ఆంధ్రప్రజల హృదయాల్లో ఒక కేసరిగా ఆయన ఇంకా చిరంజీవిగానే ఉన్నారు.

ఆయన 1920-22 సహాయనిరాకరణోద్యమ సమయంలో గుర్తింపులోకొచ్చి జాతీయ స్థాయికి ఎదగగలిగారు. శ్రీ సి.ఆర్.దాస్, శ్రీ మోతీలాల్ నెహ్రూగార్లవలెనే ఆయన కూడా బాగా ఆదాయమొచ్చే తన న్యాయవాదవృత్తిని వదలివేసి జాతీయోద్యమంలో ప్రవేశించారు. రౌలట్ చట్టం ద్వారా జలియన్ వాలాబాగ్‌లో ప్రజలను సజీవదహనం చేయటం ద్వారా బ్రిటీష్ సామ్రాజ్య వాదులు దేశాన్ని భయకంపితుల్ని చేస్తున్న ఆ సందర్భంలో, అందుకు ప్రతిగా తన వృత్తిని అవతల పారవేసి ధైర్యంగా పేదరికాన్ని ఎన్నుకొని తనకున్న మొత్తాన్ని దేశమాత పాదాలచెంత వదలి తానూ అక్కడ నిలిచాడు. వీరుచేసిన ఈపని అనేక మంది న్యాయవాదులకు, డాక్టర్లకు లెక్చరర్లకు ఆదర్శమైంది.

1901 వ సంవత్సరంలో రాజమండ్రి పురపాలక సంఘ అధ్యక్షులుగా ప్రజలచే ఎన్నిక కాబడినపుడు తొలిసారిగా ఆయనకు అధికారం అనుభవంలోనికి వచ్చింది. ఆ సమయంలో బ్రిటీష్ అధికారులతో కత్తులుదూస్తూ వారిపై ద్వేషాన్ని పెంచుకొని వ్యవహరించవలసిన పరిస్థితులు ఆయనకు కలిగాయి.

ఆయన ఇంగ్లండు వెళ్లి న్యాయశాస్త్రాన్నభ్యసించి, బారిష్టరు కాగలిగి, భారతదేశానికి వచ్చి, మద్రాసు హైకోర్టులో ఈ శతాబ్దపు ప్రారంభ దినాల్లో ప్రాక్టీసును ప్రారంభించారు. అక్కడ ఆయన ప్రముఖ న్యాయవాదిగా పేరుతెచ్చుకొని న్యాయమూర్తులకు, ప్రభుత్వానికి కూడా హడలు పుట్టిస్తుండే వారు. ఏరకమైన వ్యక్తిగత సౌకర్యాలు లేకుండా పూర్తి త్యాగం చేయవలసిన రాజకీయ రంగంలోకి ఈ స్థితిలోనుండి ఆయన ప్రవేశించారు.

ఈ సందర్భంలో అప్పటికే బాగా ప్రముఖులైన రాజకీయ నాయకులు చాలామంది ఆయనతో సహకరించారు. 1915 నుండి పూర్తిగా రాజకీయాలలో పనిచేస్తున్న శ్రీ కొండా వెంకటప్పయ్య, దేశోద్ధారక శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు, డాక్టరు పట్టాభి సీతారామయ్య, శ్రీ బులుసు సాంబమూర్తి, డాక్టరు సుబ్రహ్మణ్యం, శ్రీ జి.సీతారామశాస్త్రి, శ్రీ వి.జోగయ్య, ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అటువంటి వారిలో ముఖ్యులు.

అనేక భాషలకు కేంద్రంగా ఉన్న మద్రాసు రాష్ట్రంలో తనతో సమానంగా పనిచేస్తున్న గాంధేయవాదుల్లో అడ్వకేట్ జనరల్‌గా వనిచేస్తూ దానికి రాజీనామాచేసి సహాయనిరాకరణోద్యమంలో ప్రవేశించిన శ్రీ శ్రీనివాస అయ్యంగార్‌తో ప్రకాశంగారు బాగా స్నేహంగా ఉంటుండేవారు. అయితే తనలాగే న్యాయవాద వృత్తిని విసర్జించి గాంధేయ విధానంలో జీవన మార్గాన్ని నడుపుతున్న రాజాజీ గారితో మాత్రం ఆయన అంత స్నేహంగా ఉంటుండేవారుకాదు.

స్నేహితులను ఎన్నుకోవడంలో అప్పుడు జరిగిన ఆ పొరపాటు ముప్పది సంవత్సరాల గాంధీయుగంలో వాళ్లిద్దరకూ వారి మధ్య సంబంధాలలో కొన్నిసార్లు క్లిష్ట పరిస్థితులు రావడానికి వారి విధానంలో వ్యత్యాసాలు పొడచూపడానికి కారణమైంది తప్ప తిరిగి ఎప్పుడూ సయోధ్యతో మెలగ గలిగేలా తోడ్పడలేదు.

పత్రికా రచయిత :

ప్రత్యేకంగా ఆంధ్రప్రజలకోసం తెలుగు దినపత్రిక ఆంధ్రపత్రికను కాశీనాధుని నాగేశ్వర రావుగారు నడపడాన్ని చూసి ముందు దృష్టితో ప్రకాశంగారు అఖిలభారతస్థాయిలో స్వరాజ్య పోరాటానికి గాంధేయ ఉద్యమానికి తోడ్పడాలనే సంకల్పంతో "స్వరాజ్య" పేరుతో ఆంగ్ల దినపత్రికను ప్రారంభించారు. ఆయన నాగేశ్వరరావుగారిలాగ వ్యాపారం తెలిసిన వారుకాదు. లేదా నిర్వహణానుభవం ఉన్న నాగేశ్వరరావుగారికి తెలివిగా దాని బాధ్యతను అప్పగించిన వారూ కాదు. స్వరాజ్య నిర్వహణలో వచ్చే నష్టాలను పూడ్చేందుకై మద్రాసు, కూనూరులలో ఉన్న విలువైన బంగళాలు భూములతోసహా తనకున్న యావదాస్తిని అమ్మేశారు. ఎప్పుడూ నష్టాలోనే నడిచే ఆ పత్రికను నిల్పటానికి ఆయన ఆంధ్రలోనూ, భారతదేశంలోనూ, ఇతర దేశాలలో కూడా లక్షలకొద్దీ రూపాయల విరాళాలను ప్రోగుచేసారు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శిస్తూ నిర్విరామంగా నిర్భయంగా పోరాడేవారు. ఆనాడు అది ఒక శక్తివంతమైన పత్రికగా నిలిచింది.

శ్రీ జి.వి.కృపానిధి, శ్రీ పున్నారావు, శ్రీరామారావు, శ్రీ కె.కోటేశ్వరరావు, శ్రీ ఈశ్వరదత్, శ్రీ ఖాసా సుబ్బారావు వంటి గొప్ప రచయితలను భారతీయ పత్రికా రంగానికి స్వరాజ్య అందించింది. వీరంతా స్వరాజ్యంలో పనిచేస్తూ దేశస్వాతంత్ర్యం కోసం జరుగుతున్న పోరాటంలో ఆ పత్రిక ప్రముఖంగా నిలిచేలా రచనలుచేసి కృషిచేశారు.

ప్రకాశంగారు ఇంటివద్ద ఉంటూ మోతీలాల్ నెహ్రూ గారితోనూ రాజకీయాలు చర్చిస్తూ ఉండేవారు. శాసనసభారంగంలో కూడా బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడాలనే దృష్టితో 1923వ సంవత్సరంలో శాసన మండలిని బహిష్కరించాలనే వారి నిర్ణయాన్ని ఆయన బలపరిచారు.

కేంద్ర శాసనసభ :

ఆయన కేంద్ర శాసనసభకు వెళ్లినప్పుడు స్వరాజ్యపార్టీలోచేరి అక్కడ మోతీలాల్ గారితోనూ, మాలవీయా గారితోనూ మరికొందరితో కలసి సాహసకృత్యాలు చేయడానికి పూనుకొన్నారు. ఆయన సాంప్రదాయ వ్యతిరేక పద్ధతులు ఉద్రేకపూరిత మనస్తత్వం జిన్నాగారికి సంతోషాన్ని కలిగించాయి. మోతీలాల్ గారు ధానిని అవకాశంగా ఉపయోగించుకొని జిన్నాతో సయోధ్యనేర్పరచుకొని శాసనసభలో అనేకక్లిష్టసమయాలలో జిన్నా సపోర్టుతో కలసి ఓటింగుచేస్తూ అవసర సందర్భాలలో కలసికట్టుగా ఎదుర్కొనగలిగాడు.

జవహర్లాల్ గారి స్వాతిశయాన్ని ఆయన అంగీకరించలేకపోయారు. 1929-30 సంవత్సరాల మధ్య వైస్రాయి ఇర్విన్ గారితో జరిపిన సంప్రదింపులు విఫలమైన తర్వాత శాసనసభలనుండి వైదొలగిపోయేందుకు కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయంతో తరచు జరుగుతున్న బాయ్‌కాట్ల వల్ల అప్పటికే విసుగుచెంది ఉన్న ప్రకాశం కలసి రాలేదు.

అందరితోపాటు ఆయన రాజీనామా చేసినప్పటికీ తిరిగి ఎన్నికఅయి శాసనసభకు వచ్చారు. అప్పుడు జరిగిన బడ్జెట్ సమావేశాలలో ఉప్పుమీద పన్ను విధించడాన్ని గాంధీగారు వ్యతిరేకించడంపై జరిగిన చర్చలో పాల్గొని ప్రకాశంగారు ఒక గంటకుపైగా చేసి ప్రసంగం ఆ శాసనసభ, ఆ సంవత్సరకాల చరిత్రలోనే మరువరానిది.

జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో తాను ముందుండాలని తిరిగి తనకు తానై నిర్ణయం తీసుకున్నారు. దానితో ఆయన శాసనసభకు రాజీనామా చేసి ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైళ్లకు వెళ్లి తన తోటి దేశభక్తులతో కలసిపోయారు.

అసాధారణమైన ధైర్యసాహసాలు

1928వ సంవత్సరంలో సైమన్ కమీషన్ మద్రాసు వచ్చినప్పుడు ఆయన చూపెట్టిన ధైర్యసాహసాలు, చేసిన స్వాతంత్ర్య కృషి ఆయనకు కాంగ్రెస్ వారిలోనూ, మొత్తం దేశ ప్రజలలోనూ గొప్ప గౌరవాన్ని సంపాదించిపెట్టాయి. నాకు ఇంకా గుర్తే. ఆ సాయంత్రం వందలు వేల కొలది ప్రజలు గుంపులు గుంపులుగా మదరాసు బీచ్‌వద్ద సాయుధులైన పోలీసులు

ప్రక్కప్రక్కగా గుంపులు గుంపులుగా గుమికూడారు. ఆ సమయంలో అక్కడే ప్లాట్‌ఫారం మీద ఉన్న ప్రకాశంగారు పోలీసుల దురంతాన్ని ఆపివేయవలసిందిగా చప్పట్లు చరిచారు.

వారు వేదికను సమీపించి ప్రకాశంగారిపైనా, అక్కడున్న ఇతరులపైనా తుపాకులను ఎక్కుపెట్టారు. మీకంతగా రక్తం కావాలనుకుంటే నన్ను కాల్చండని ఆయన తన రొమ్మును వారికి చూపెట్టారు. అక్కడి బ్రిటీష్ అధికారి ప్రకాశంగారి సాహసాన్ని చూచి ఆయన గంభీర స్వరాన్ని విని చలించి సాయుధులైన పోలీసులను వెనుకకు తగ్గవలసిందిగా ఆజ్ఞను జారీచేశారు.

అక్కడ అప్పుడు ఆవిధంగా వారిని వెనుకకు త్రిప్పికొట్టగలిగిన ప్రకాశంగారి సాహసాన్ని చూచి అక్కడున్న ప్రజలందరితోపాటు మేము గూడా ఎంతగానో ఆనందించాం. 1923-24 సంవత్సరాలలో గుంటూరులోని ఒక సభలో ప్రభుత్వ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల బలరామకృష్ణయ్యగారు ప్రకాశంగారిని "ఆంధ్రకేసరి" అని ఆవేశపూరితంగా సంబోధించిన మాట ఆ తరవాత ఆరు సంవత్సరాలకు నిజమైంది. ఆయన ఈ సాహసకృత్యానికి మేమంతా సంతృప్తి చెందాం.

జైలు జీవితం :

శ్రీ ప్రకాశం గారితోనూ, శ్రీ రాజాజీగారితోనూ 1931వ సంవత్సరంలోనూ, 1941-42 మధ్య కాలంలోనూ నేను కూడా కలసి జైలుజీవితాన్ని పంచుకున్నాను. అక్కడ ఉన్న వందల మంది కార్యకర్తల్లో వారిద్దరూ గొప్ప ఆకర్షణీయంగా ఉండి రాజకీయ ఖైదీల నందరను వారిచుట్టూ చేర్చుకుంటుండే వారు. రాజాజీగారు గీత, పురాణకథలకు కేంద్రంగా ఉంటే ప్రకాశంగారు సామ్రాజ్యవాదులను వెడల నడిపే సాహసవంతులైన దేశభక్తులను కేంద్రంగా ఉండేవారు.

1937-39 సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ రాజకీయాలలో మంత్రిత్వ ధోరణి ప్రవేశించి దానిని ఆక్రమించింది. ఆ సమయంలో రాజాజీ మద్రాసు ముఖ్యమంత్రి కాగలిగారు. శాసనసభలో మెజారిటీ సమర్థనను సంపాదించుకోలేనందువలన నాయకులు కాలేకపోయినప్పటికి, మంత్రి వర్గంలో రెండోస్థానంలో ఉంటూ రెవెన్యూ శాఖామంత్రిగా పనిచేసేందుకు గౌరవంగా అంగీకరించారు. జమిందారీ విధానాన్ని రద్దుచేయించటానికి ప్రకాశంగారు అప్పుడు అపూర్వమైన నివేదికను తయారుచేసారు. జమిందారీ పద్ధతి రద్దుకావాలనే ఆ నివేదికలోని ప్రకాశంగారి వాదనను రాజాజీగారు అంగీకరించారు.

గొప్ప తిరస్కారం :

మరల ఒకసారి మదరాసు కాంగ్రెసుపార్టీ తన నాయకుడ్ని ఎన్నుకోవలసిన అవసరం 1946లో వచ్చింది. గాంధీగారు ప్రకాశంగారు నాయకులుగా ఉండకూడదని గట్టిగా తలపోసి ప్రకాశంగారిని పోటీకి నిలబడవద్దని చెప్పారు. ప్రకాశంగారు ధైర్యంగా దానిని తిరస్కరించి పోటీకి నిలిచి నాయకునిగా ఎన్నికై ముఖ్యమంత్రి అయ్యారు. ప్రకాశంగారు మంత్రివర్గాన్ని ఏర్పరచేటప్పుడు అందరిని కలుపుకోలేక గొప్ప తప్పుచేసారు. అప్పుడు రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న నేను

యూరోప్‌నుంచి తిరిగి వచ్చిన వెంటనే వ్యతిరేకవర్గం వారిని కూడా మంత్రివర్గంలోకి తీసుకోవలసిందిగా నాబాధ్యత ప్రకారం సలహా ఇచ్చారు. ఆయన వారు తనకు వ్యతిరేకంగా పనిచేశారనే అంశాన్ని మరచిపోలేకపోయారు. అందువలన వారిమధ్య అగాధం ఏర్పడి చివరికవరకూ కొనసాగింది. ఈచర్య ఆయన మంత్రివర్గాన్ని బలహీన పరచింది.

ముఖ్యమైన సంస్కరణలు :

సంయుక్త మద్రాసు రాష్ట్రంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కొద్ది సమయంలో కొన్ని ప్రత్యేకాంశాలలో ఆయన మిగతా భారతదేశానికి కూడా మార్గదర్శకులు కాగలిగారు.

ఆయన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చి గ్రామీణాభివృద్ధి పథకాలను ప్రారంభించేందుకు సంవత్సరానికి ఒక కోటిరూపాయల వరకు కేటాయించారు. హరిజనాభ్యుదయానికి ప్రాముఖ్యత నిచ్చి దానికి ఒక కోటి రూపాయలు కేటాయించారు. ఖాదీ అభివృద్ధికి మరొక కోటిరూపాయలు కేటాయించారు. రైతులకు తాము పండించిన పంటల్లో కొంత వారు అట్టే పెట్టుకునేందుకు అవకాశం కల్పించి అదనపు ఉత్పత్తులను అమ్ముకునేటప్పుడు మంచి ధరలు ఉండేలా చూశారు. ఉత్పత్తిదారుల, వాడకందారుల సహకార సంఘాలను ఏర్పాటుచేసి మిల్లు యజమానుల దోపిడీనుండి రైతులకు రక్షణ కల్పించారు. నిర్బంధ ధాన్యం వసూలు కంట్రోళ్లకు ఒక నిర్మాణాత్మకమైన ప్రతిక్రియను కనుగొనడానికి ప్రకాశంగారు ప్రయత్నించారు.

సరైన కారణం లేకుండానే ఆ పరిస్థితుల్లో ఆయనపై అవిశ్వాస తీర్మానం తీసుకురాబడింది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులుగా ఉన్న నేను ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయవద్దని శాసనసభ్యులను కోరాను. అయితే ఫలితం కలుగలేదు. సర్దార్ పటేల్, జవహర్లాల్ నెహ్రూగార్లు ఇద్దరూ ఆయన తమకు మొదట్నుండి ఇష్టంలేని మనిషనే కారణం తప్ప సరైన కారణం లేకుండానే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపజేసేందుకు కాంగ్రెస్ సభ్యులకు అనుమతి ఇచ్చి ఒక చెడ్డ సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు.

అలాంటి ప్రయత్నం అన్ని విధాలైన ఉత్తమ సాంప్రదాయాలను పక్కకునెట్టి అవినీతిని, రాజకీయ అస్థిరత్వాన్ని పెంచగలదని నేను వాదించాను. అంతేకాకుండా దేశభక్త కొండా వెంకటప్పయ్య గారూ, నేనూ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో శాసనసభ్యులను యిందుకు అనుమతించడానికి వ్యతిరేకంగా వాదించి ఓటుచేశాం. ఆ దురదృష్టకరమైన సంఘటన మాలాంటి వారందరను ఎంతగానో బాధించింది. ఆ తరువాత ప్రకాశం గారెప్పుడూ అంతటి సాహసంగల నాయకునిగా ఉండలేదు.

పూర్తిస్థాయి

ముఖ్యమంత్రిత్వం నుంచి దిగిపోయిన తర్వాత ప్రకాశంగారు పూర్తిస్థాయిలో బైటపడి అనేకమంది మంత్రులమీద బంధుప్రీతి, అవినీతి, బాధ్యతారాహిత్యం వంటి ఆరోపణలతో బహిరంగ విచారణకోసం పత్తిడిచేసారు. రాష్ట్రకాంగ్రెస్ సంఘ అధ్యక్షులుగా నేనుకూడా జాతీయ

కాంగ్రెస్ సంఘ కార్యవర్గాన్ని విచారణకు ఆదేశించవలసిందిగా కోరాను.

ఈ విచారణ మంత్రుల నైతికస్థాయిని దెబ్బతీయగలదని కాంగ్రెస్ మంత్రివర్గాలపై ప్రజా విశ్వాసం సన్నగిల్లగలదనే కారణంతో జవహర్లాల్ గారు దానికి అడ్డు నిలిచారు. ప్రకాశంగారు ఆ వాదనను అంగీకరించలేదు. శాసనసభ వేదికమీద అవిశ్వాస తీర్మానం ద్వారా ఆయన అవినీతి ఆరోపణలను వివరిస్తూ కొన్ని రోజులపాటు గంటలకొలది మాట్లాడారు. ఎడ్మండ్ బర్క్‌ను ఆయన జ్ఞప్తికి తెచ్చారు. 1965లో న్యూజిలాండ్ లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ సభలలో, స్వరాజ్యం వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాలకే భారతదేశంలో మంత్రివర్గాల అవినీతిని గురించి హెచ్చరించే స్థితికి భారత ప్రజాస్వామ్యం పెరిగిందని నేను చెప్పాను.

అటువంటి గౌరవాన్ని పొందవలసిన మొట్టమొదటి వ్యక్తి ప్రకాశంగారే. ఆయన అవినీతిని గురించి, అధికార దుర్వినియోగం గురించి నిర్భయంగా దేశాన్ని హెచ్చరిస్తూ ముందుకొచ్చిన మొట్టమొదటి వ్యక్తి. అందువలన స్వాతంత్ర్యం రాకపూర్వం వచ్చిన తరవాత గూడా భారత ప్రజలు రుణపడి ఉండవలసినంత గొప్ప కృషిచేసిన ప్రకాశంగారు అభినందనీయులు.

బాధాకరమైన గుర్తులు

అవినీతి పరులైన మంత్రులకు వ్యతిరేకంగా మదరాసు శాసనసభలో ప్రకాశంగారు దాడిచేసినందుకు గాను ఆయనపై కాంగ్రెస్ కార్యవర్గం ద్వారా క్రమశిక్షణా చర్య తీసుకోవాలనే ప్రయత్నం జరిగింది. జవహర్లాల్, రాజన్‌బాబు, సర్దార్‌పటేల్, అజాద్, రాజాజీగార్లవంటి వారందరను కష్టపెట్టవలసి వచ్చినప్పటికి ఆసమయంలో నేను ప్రకాశంగారి తరపున నిలిచి ఎలాంటి తీర్మానం రాకుండా నిరోధించాను. ఆసమయంలో నా స్నేహితులైన ప్రకాశంగారి పట్ల అభిమానంతో నేను చేసిన ఆకృషిని రాజాజీగారు దయతో ప్రశంసించారు.

స్వీడిష్ అంబుడ్స్‌మెన్ పద్ధతిలో మంత్రుల స్థాయిలో ఉన్నవారి అవినీతిపై విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక సంస్థ ఉండాలనే అంశాన్ని ఎట్టకేలకు పార్లమెంటు గ్రహించగలిగింది. ఇందుకు శ్రీ మున్షీగారి కృషిని మనం అభినందించవలసి ఉంటుంది.

1953వ సంవత్సరంలో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కమ్యూనిస్టులు ఏకైక పెద్ద పక్షంగా అవతరించారు. జవహర్లాల్ గారు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ఎలా అనే ఆలోచనలో పడ్డారు. ప్రజాపార్టీ నాయకులైన ప్రకాశంగారికి ముఖ్యమంత్రి పదవినిస్తే మిశ్రమ ప్రభుత్వంలో మా కృషికార్ లోక్ పార్టీని కూడా కలుపుతానని నేను చెప్పాను. అది తనకంత ఇష్టంకాకపోయినప్పటికి నెహ్రూగారు ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా ఉండడానికి అంగీకరించారు. నన్ను మంత్రివర్గంలో చేరి తనకు ద్వితీయస్థానంలో ఉండమన్న ప్రకాశంగారి కోర్కెను ఢిల్లీ పార్లమెంటరీ పరిసరాలను దాటి రావడం ఇష్టంలేనందున నేను అంగీకరించలేక పోయాను.

ఆయన తనకు 50 సంవత్సరాల వయస్సు వచ్చినప్పటికి 1955వ సంవత్సరంలో మాతోచేరి కమ్యూనిస్టులకు వ్యతిరేకమైన ప్రచారంలో పాల్గొని ప్రజాపార్టీ, కృషికార్ లోక్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలతో గూడిన సంయుక్త కాంగ్రెసు వర్గానికి విజయాన్ని సాధించేందుకు కృషిచేశారు.

యూరప్‌నుంచి తిరిగి వచ్చిన వెంటనే వ్యతిరేకవర్గం వారిని కూడా మంత్రివర్గంలోకి తీసుకోవలసిందిగా నాబాధ్యత ప్రకారం సలహా ఇచ్చారు. ఆయన వారు తనకు వ్యతిరేకంగా పనిచేశారనే అంశాన్ని మరచిపోలేకపోయారు. అందువలన వారిమధ్య అగాధం ఏర్పడి చివరికవరకూ కొనసాగింది. ఈచర్య ఆయన మంత్రివర్గాన్ని బలహీన పరచింది.

ముఖ్యమైన సంస్కరణలు :

సంయుక్త మద్రాసు రాష్ట్రంలో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్న కొద్ది సమయంలో కొన్ని ప్రత్యేకాంశాలలో ఆయన మిగతా భారతదేశానికి కూడా మార్గదర్శకులు కాగలిగారు.

ఆయన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చి గ్రామీణాభివృద్ధి పథకాలను ప్రారంభించేందుకు సంవత్సరానికి ఒక కోటిరూపాయల వరకు కేటాయించారు. హరిజనాభ్యుదయానికి ప్రాముఖ్యత నిచ్చి దానికి ఒక కోటి రూపాయలు కేటాయించారు. ఖాదీ అభివృద్ధికి మరొక కోటిరూపాయలు కేటాయించారు. రైతులకు తాము పండించిన పంటల్లో కొంత వారు అట్టి పెట్టుకునేందుకు అవకాశం కల్పించి అదనపు ఉత్పత్తులను అమ్ముకునేటప్పుడు మంచి ధరలు ఉండేలా చూశారు. ఉత్పత్తిదారుల, వాడకందారుల సహకార సంఘాలను ఏర్పాటుచేసి మిల్లు యజమానుల దోపిడీనుండి రైతులకు రక్షణ కల్పించారు. నిర్బంధ ధాన్యం వసూలు కంట్రోళ్లకు ఒక నిర్మాణాత్మకమైన ప్రతిక్రియను కనుగొనడానికి ప్రకాశంగారు ప్రయత్నించారు.

సరైన కారణం లేకుండానే ఆ పరిస్థితుల్లో ఆయనపై అవిశ్వాస తీర్మానం తీసుకురాబడింది. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘాధ్యక్షులుగా ఉన్న నేను ఆ తీర్మానానికి అనుకూలంగా ఓటు చేయవద్దని శాసనసభ్యులను కోరాను. అయితే ఫలితం కలుగలేదు. సర్దార్ పటేల్, జవహర్లాల్ నెహ్రూగార్లు ఇద్దరూ ఆయన తమకు మొదట్నుండీ ఇష్టంలేని మనిషనే కారణం తప్ప సరైన కారణం లేకుండానే అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపజేసేందుకు కాంగ్రెస్ సభ్యులకు అనుమతి ఇచ్చి ఒక చెడ్డ సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టారు.

అలాంటి ప్రయత్నం అన్ని విధాలైన ఉత్తమ సాంప్రదాయాలను పక్కకునెట్టి అవినీతిని, రాజకీయ అస్థిరత్వాన్ని పెంచగలదని నేను వాదించాను. అంతేకాకుండా దేశభక్త కొండా వెంకటప్పయ్య గారూ, నేనూ కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో శాసనసభ్యులను యిందుకు అనుమతించడానికి వ్యతిరేకంగా వాదించి ఓటుచేశాం. ఆ దురదృష్టకరమైన సంఘటన మాలాంటి వారందరను ఎంతగానో బాధించింది. ఆ తరువాత ప్రకాశం గారెప్పుడూ అంతటి సాహసంగల నాయకునిగా ఉండలేదు.

పూర్తిస్థాయి

ముఖ్యమంత్రిత్వం నుంచి దిగిపోయిన తర్వాత ప్రకాశంగారు పూర్తిస్థాయిలో బైటపడి అనేకమంది మంత్రులమీద బంధుప్రీతి, అవినీతి, బాధ్యతారాహిత్యం వంటి ఆరోపణలతో బహిరంగ విచారణకోసం పత్తిడిచేసారు. రాష్ట్రకాంగ్రెస్ సంఘ అధ్యక్షులుగా నేనుకూడా జాతీయ

కాంగ్రెస్ సంఘ కార్యవర్గాన్ని విచారణకు ఆదేశించవలసిందిగా కోరాను.

ఈ విచారణ మంత్రుల నైతికస్థాయిని దెబ్బతీయగలదని కాంగ్రెస్ మంత్రివర్గాలపై ప్రజా విశ్వాసం సన్నగిల్లగలదనే కారణంతో జవహర్లాల్ గారు దానికి అడ్డు నిలిచారు. ప్రకాశంగారు ఆ వాదనను అంగీకరించలేదు. శాసనసభ వేదికమీద అవిశ్వాస తీర్మానం ద్వారా ఆయన అవినీతి ఆరోపణలను వివరిస్తూ కొన్ని రోజులపాటు గంటలకొలది మాట్లాడారు. ఎడ్మండ్ బర్క్‌ను ఆయన జ్ఞప్తికి తెచ్చారు. 1965లో న్యూజిలాండ్ లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ సభలలో, స్వరాజ్యం వచ్చిన తర్వాత కొన్ని సంవత్సరాలకే భారతదేశంలో మంత్రివర్గాల అవినీతిని గురించి హెచ్చరించే స్థితికి భారత ప్రజాస్వామ్యం పెరిగిందని నేను చెప్పాను.

అటువంటి గౌరవాన్ని పొందవలసిన మొట్టమొదటి వ్యక్తి ప్రకాశంగారే. ఆయన అవినీతిని గురించి, అధికార దుర్వినియోగం గురించి నిర్భయంగా దేశాన్ని హెచ్చరిస్తూ ముందుకొచ్చిన మొట్టమొదటి వ్యక్తి. అందువలన స్వాతంత్ర్యం రాకపూర్వం వచ్చిన తరవాత గూడా భారత ప్రజలు రుణపడి ఉండవలసినంత గొప్ప కృషిచేసిన ప్రకాశంగారు అభినందనీయులు.

బాధాకరమైన గుర్తులు

అవినీతి పరులైన మంత్రులకు వ్యతిరేకంగా మదరాసు శాసనసభలో ప్రకాశంగారు దాడిచేసినందుకు గాను ఆయనపై కాంగ్రెస్ కార్యవర్గం ద్వారా క్రమశిక్షణా చర్య తీసుకోవాలనే ప్రయత్నం జరిగింది. జవహర్లాల్, రాజన్ బాబు, సర్దార్ పటేల్, అజాద్, రాజాజీగార్లవంటి వారందరను కష్టపెట్టవలసి వచ్చినప్పటికి ఆసమయంలో నేను ప్రకాశంగారి తరపున నిలిచి ఎలాంటి తీర్మానం రాకుండా నిరోధించాను. ఆసమయంలో నా స్నేహితులైన ప్రకాశంగారి పట్ల అభిమానంతో నేను చేసిన ఆకృషిని రాజాజీగారు దయతో ప్రశంసించారు.

స్వీడిష్ అంబుడ్స్‌మెన్ పద్ధతిలో మంత్రుల స్థాయిలో ఉన్నవారి అవినీతిపై విచారణ జరిపేందుకు ఒక ప్రత్యేక సంస్థ ఉండాలనే అంశాన్ని ఎట్టకేలకు పార్లమెంటు గ్రహించగలిగింది. ఇందుకు శ్రీ మున్షీగారి కృషిని మనం అభినందించవలసి ఉంటుంది.

1953వ సంవత్సరంలో ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు కమ్యూనిస్టులు ఏకైక పెద్ద పక్షంగా అవతరించారు. జవహర్లాల్ గారు కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం ఎలా అనే ఆలోచనలో పడ్డారు. ప్రజాపార్టీ నాయకులైన ప్రకాశంగారికి ముఖ్యమంత్రి పదవినిస్తే మిశ్రమ ప్రభుత్వంలో మా కృషికార్ లోక్ పార్టీని కూడా కలుపుతానని నేను చెప్పాను. అది తనకంత ఇష్టంకాకపోయినప్పటికి నెహ్రూగారు ప్రకాశంగారు ముఖ్యమంత్రిగా ఉండడానికి అంగీకరించారు. నన్ను మంత్రివర్గంలో చేరి తనకు ద్వితీయస్థానంలో ఉండమన్న ప్రకాశంగారి కోర్కెను ఢిల్లీ పార్లమెంటరీ పరిసరాలను దాటి రావడం ఇష్టంలేనందున నేను అంగీకరించలేక పోయాను.

ఆయన తనకు 50 సంవత్సరాల వయస్సు వచ్చినప్పటికి 1955వ సంవత్సరంలో మాతోచేరి కమ్యూనిస్టులకు వ్యతిరేకమైన ప్రచారంలో పాల్గొని ప్రజాపార్టీ, కృషికార్ లోక్ పార్టీ, కాంగ్రెస్ పార్టీలతో గూడిన సంయుక్త కాంగ్రెసు వర్గానికి విజయాన్ని సాధించేందుకు కృషిచేశారు.

ఆ తరువాత ఒక సంవత్సరానికే ఆంధ్ర తెలంగాణాలతో కూడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. దానిని చూసేందుకు గూడా ప్రకాశంగారు బ్రతికే ఉన్నారు.

భాషా ప్రాతిపదికపై ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటుచేయాలని కొండా వెంకటప్పయ్య పంతులుగారు, దేశోద్ధారక నాగేశ్వరరావుగారు, పట్టాభిగారు, శాస్త్రిగారు, ప్రకాశంగారు, సంవత్సరాల తరబడి కృషిచేశారు. రాజకీయ పరిస్థితులు సానుకూలమైన తరుణంలో కూడా మద్రాసు పట్టణాన్ని గానీ, అందులో కొంత ప్రాంతాన్నిగానీ ఆంధ్రరాష్ట్రంలో కలపాలని ప్రకాశంగారు పట్టుబడుతుండటంతో, తమిళ రాష్ట్రనాయకులంతా శక్తివంతంగా దానిని ఎదిరిస్తున్నందువల్లన ఆ కోర్కె నెరవేరకుండా అలాగే నిలబడి పోయింది. శ్రీ పొట్టి శ్రీరాములుగారి ఆత్మత్యాగంతో ఆంధ్రప్రజల మహోద్యోగ చైతన్యంతో చివరికి అది సిద్ధించింది. అప్పటికి ఆంధ్రరాష్ట్ర సంసిద్ధికి అందరి అంగీకారం కలసి వచ్చింది.

10

పంజాబ్ రైతు నాయకులు

చౌధురి చోటూరామ్, కాబూల్ సింగ్, సర్దార్ బహదూర్‌లాల్‌సింగ్ ఉద్దంసింగ్ నగోకి, దర్శన్‌సింగ్ పెరుమాన్, బసంత్‌సింగ్

కిసాన్ ఉద్యమాన్ని నిర్మించేందుకు అఖిల భారత కిసాన్ కాంగ్రెస్‌ను ఏర్పాటుచేసేందుకు 1935 వ సంవత్సరంనుంచి అనేక మార్లు నేను దేశంలోని అనేక రాష్ట్రాలలో పర్యటించాను. అన్నింటిలో నా స్వరాష్ట్రమైన ఆంధ్రప్రాంతంలోకన్నా పంజాబ్‌లో నేను ఎక్కువ ఆదరణ పొందగలిగాను. అది ప్రధానంగా ప్రముఖ జాట్ నాయకుడు చోటూరామ్. హిందువులు, ముస్లింలు, సిక్కులైన అన్ని మతాలకు చెందిన రైతులందరినీ మేలుకొలిపి వడ్డీవ్యాపారులకు, వాణిజ్య వేత్తలకు వ్యతిరేకంగా వారిని సిద్ధంచేసినందువల్ల నాకు లభించింది.పంజాబ్, రాజస్థాన్ ప్రాంతాలలోని ప్రముఖ రైతునాయకులైన చోటూరామ్ మనకు స్వాతంత్ర్యం కన్నా రైతాంగ సంక్షేమమే ముఖ్యమని దానికి ఎక్కువ ప్రాధాన్యత నిచ్చారు. ఎందుకంటే మనకు స్వాతంత్ర్యం లభించినప్పటికీ రైతుల సమస్యలు పరిష్కారం కావని మన నాయకులకు అప్పటికీ సవాలుగానే అవి మిగిలి పోగలవని ఆయన భావించారు. నేను అట్లా కాక స్వాతంత్ర్యం వచ్చిన తరువాత రైతుల రాజకీయ ఆర్థిక సమస్యలు బాగుపడగలవని నమ్మాను.

చోటూరామ్ నేను రైతు సమస్యలపై చర్చించుకునేందుకు లాహోర్ లోనూ సిమ్లా లోనూ కలుస్తూ ఉండేవారం. అయితే మారాజకీయ ధోరణులు మాత్రం వేరు. నేను దృఢ విశ్వాసంకలిగిన కాంగ్రెస్ వాదిని. ఆయన బ్రిటిష్ ప్రభుత్వంతో సహకరిస్తూన్న వ్యక్తి.

1880-1945 సంవత్సరాలలో పంజాబ్ రాష్ట్రంలో జాట్‌లు లేక చౌధురీలు , గుజ్జర్‌లు, యాదవులు వ్యవసాయ దారులుగా ఉంటూండేవారు, లాలాలు సహజంగా వడ్డీ వ్యాపారస్తులుగాను, వాణిజ్యవేత్తలుగాను ఉండేవారు. ఈ రోజుకు కూడా భారతదేశం మొత్తం మీద రైతాంగం తమ ఉత్పత్తులకు తక్కువ ధరలను పొందుతూ,ఆ వచ్చిన పైకాన్ని గూడ వడ్డీ వ్యాపారులకు అర్పించుకోవలసిన దురదృష్టకర పరిస్థితిలోనే ఉంది. వడ్డీ వ్యాపారులుగా ఉన్న పంజాబ్ లాలాలు తిరిగి చెల్లించటానికి వీలుకాని షరతులపై రుణాలను రైతులకు ఇచ్చి ఆ తరువాత ఆ రుణాలకింద భూములనే స్వాధీనం చేసుకొని భూమి యజమానులైన ఆరైతులనే కూలీలుగా, కౌలుదారులుగా మార్చుకొని స్వంతకమతాలతో జీవించే వారి స్వయం వృత్తి హక్కునుంచి వారిని తొలగించి వేస్తున్నారు. చాలాకాలం రైతులు ఈదుస్థితిని గ్రహించి, ఎదుర్కోలేక పోయారు. చోటూరామ్ విజయవంతంగా తన జీవిత లక్ష్యంగా ఎన్నుకొని రైతాంగాన్ని ఇందుకు వ్యతిరేకంగా సమీకరించి వారి హక్కులకోసం పోరాడారు. ఆయన విజయాలలో ఇది ప్రత్యేక అంశం.

ఆయన ఈరైతాంగ ఉద్యమాన్ని ప్రారంభించే నాటికి ఎక్కువ మంది లాలాలు.

దేశభక్తుడు ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడైన లాలా లజపతిరాయ్ గారి పలుకు బడి కింద ఉన్నారు. అందువల్ల వారు కాంగ్రెసులో ప్రవేశించి ధైర్యంగా తమకు వ్యతిరేకంగా ప్రారంభమైన రైతు ఉద్యమాన్ని ఎదుర్కొనేందుకు సం సిద్ధులు కాసాగారు. కీర్తిశేషులైన మిస్టర్ డార్లింగ్ ఐ.సి.ఎస్. పంజాబ్ వ్యవసాయదారుల ఆర్థిక పరిస్థితులను అవసరాలను పరిశీలించిన తర్వాత ప్రామాణికమైన తన పరిశీలనాంశాలను ప్రచురిస్తూ (పంజాబ్ అభివృద్ధికి, రుణ విమోచనకు కొద్దిపాటి చేయూత) అందులో బ్రిటిష్ ప్రభుత్వానికి లాలాలు వారి దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగాన్ని రక్షించేందుకు వెనుకడుగు వేయకుండా సహాయ పడవలసిందని సూచించారు. ఆ విధంగా చోటూరామ్ ఆయనను అభిమానిస్తున్న రైతాంగం బ్రిటిష్ అధికారులవల్ల సహాయాన్ని పొందారు. ఆ విధంగా వారు చేస్తున్న కృషి ఫలవంతం కావడం ప్రారంభమైంది. మద్రాసు, బొంబాయి రాష్ట్రాలలోని బ్రాహ్మణేతర రాజకీయ నాయకుల లాగే చోటూరామ్ నాయకత్వంలో పంజాబ్ ప్రాంత రైతులు వారికి స్వాతంత్ర్యం కావాలనే కాంక్ష ఉన్నప్పటికీ తక్షణ రైతాంగ ప్రయోజనాలను సాధించుకొనేందుకై బ్రిటిష్ వారితో కలసి పని చేయసాగారు. రాజకీయ ఆర్థికరంగాలలో దెబ్బతిన్న కాంగ్రెసు నాయకులు వారి శక్తి నంతా సమీకరించి పరిశ్రమలలో వ్యాపారరంగంలో ఉన్న తమ అనుచరులతో ప్రభుత్వ సేవలలో ఉన్న వారి తాలూకు అధికారులతో కలసి తమను దెబ్బతీయగలరని ఆ సందర్భంలో రైతులు భయపడడం జరిగింది. ఆ కారణంగా వారు లాలాల నుండి విముక్తి చెందేందుకు రాజకీయ నాయకుల వైపు మొగ్గసాగారు.

అధిక వడ్డీలకింద కాల నిర్ణయం లేని హామీ పత్రాలతో వడ్డీ వ్యాపారస్తులైన లాలాల నుంచి రైతుల భూములు ఇప్పించేందుకు వీలుగా ప్రత్యేక పంజాబ్ భూమి చట్టాలను రూపొందించవలసిందని చోటూరామ్ పంజాబ్‌లో ఉన్న బ్రిటిష్ పాలకులను కోరసాగారు. పంజాబ్ శాసన సభలో ఉన్న కాంగ్రెస్ సభ్యులు అవి ప్రభుత్వ శాసనాలైనప్పటికీ తమ కనుకూలంగా ఉన్న లాలాలకు నష్టంకలిగిస్తాయి కనుక వాటిని వ్యతిరేకించేందుకు నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ వారి ఆ నిర్ణయాన్ని చోటూరామ్ తీవ్రంగా గర్హించాడు. ఆసమయంలో నేను రైతాంగ ప్రయోజనాలకు అనుకూలంగా కాంగ్రెస్ విధానాలను రూపు దిద్దగలననే నమ్మక మున్నందువల్ల చోటూరామ్ నాకు బాగా సన్ని హితులయ్యారు, మారాజకీయ విధానాలు వేరు వేరైనా రైతుల ఆర్థిక ప్రయోజనాలను పరిరక్షించే కృషిలో మేమిద్దరము ఒకే రీతి అభిప్రాయాన్ని కలిగి ఉన్నామని అప్పుడు గ్రహించాము. నేను గాంధీగారి తోనూ పంజాబ్ కాంగ్రెస్ నాయకులైన శ్రీ గోకుల్ చంద్ భార్గవ్ తోనూ గుడ్డిగా బ్రిటిష్ వారు ప్రవేశ పెట్టినంత మాత్రాన అన్ని బిల్లులను వ్యతిరేకించరాదని రైతులకు ఉపయోగంగా ఉండే బిల్లులను సమర్థించి పంజాబ్ రైతుల సానుభూతిని కాంగ్రెస్ సంపాదించు కోవాలని వాదించాను. గాంధీగారిని ఒప్పించి ఆయన చేత సర్దార్ పటేల్ గారి కనుసన్నలలో మెలగుతున్న పంజాబ్ నాయకులను ఈబిల్లుకు అనుకూలంగా ఒప్పించటం నాకు ఎంత కష్టమో చోటూ రామ్ కు తెలుసు, ఆఖరుకు పండిత గోపీచంద్ ఆయన రైతాంగ అనుకూలంగా ఉన్న సహచరులు శ్రీ సేథీ, శ్రీ మోహన్ లాల్ గార్గ వంటి కాంగ్రెస్ నాయకులు

శాసనసభలో రైతాంగానికి అనుకూలంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లులను వ్యతిరేకించరాదనే నిర్ణయానికొచ్చారు. దానితో చోటూరామ్ కూడా జాతీయ కాంగ్రెస్ పార్టీ రైతులరక్షణకు కృషిచేయగలదని నమ్మాడు.

అయినప్పటికీ ఆయన కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంకాలేదు. ఆవిధంగా ఆయన ముస్లింలతోనూ, యూనియనిస్టు పార్టీతోనూ తన కలయికను కొనసాగించారు. వారి నాయకులలో ఆయ చాలా ప్రముఖమైన వ్యక్తిగా గుర్తింపుపొందారు. దానికి ఆయన ఉపనాయకులుగా ఉన్నప్పటికీ ఒక పక్క కాంగ్రెస్‌ను మరొకపక్క జిన్నా నాయకత్వం లో ఉన్న ముస్లింలీగును తోసి రాజని ఆయన ఎన్నికలలో విజయంసాధించిన కారణంగా యదార్థానికి దాని పూర్తి బాధ్యతలను వహించి నడిపారు.

ఆయన పార్టీనాయకులైన సర్ సికందర్ హయత్‌ఖాన్ అప్పుడు ముఖ్యమంత్రిగా ఉండి అఖిల భారత ముస్లిం లీగ్ నాయకులైన జిన్నా పై పోటీచేసే బాధ్యతను నమ్మకంతో వీరిపై ఉంచారు. వారిద్దరూ కలసి జిన్నా పాకిస్తాన్ వాదానికి వ్యతిరేకంగా గట్టిగా నిలిచారు, వారు స్వతంత్ర పాలనాధికారాలు కలిగిన రాష్ట్రాలతో కూడిన సమైక్య భారత దేశం కావాలని కోరారు. చోటూరామ్ గారి దేశభక్తి అట్లాంటిది. భారతదేశానికి స్వరాజ్యం సిద్ధించబోతున్న తరుణంలో ఆ తరువాత జరిగిన పరిణామాలను చూడకుండానే దురదృష్టవశాత్తూ ఆయన తనువు చాలించారు.

శ్రీ సర్దార్ కాబూల్ సింగ్

కీర్తిశేషులైన శ్రీ చోటూరామ్ వ్యవసాయదారుల సంస్థకు బదులుగా కిసాన్ ఉద్యమాన్ని అభివృద్ధిచేయవలసిందని 1935 సంవత్సరంలో నాకు సహకారాన్నందించిన పంజాబ్ ప్రాంతంలోని పెద్దరైతు సర్దార్ కాబుల్ సింగ్ యం.ఎల్.ఏ. చోటూలాల్ గారి రైతాంగ సంస్థ, మా రైతాంగ ఉద్యమం ఈరెంటికి వారు కనబరచిన విభేదం ఒకటి బ్రిటిష్ పాలనకు అనుకూలమైనదిగాను, రెండవది రైతాంగ ప్రయోజనాలను రక్షించేదిగాను వారు చూచారు.

మాస్టర్ కాబూల్ సింగ్ మావిధానాలతో ఏకీభవించి పంజాబ్ రాష్ట్రంలో కిసాన్ కాంగ్రెస్‌ను అభివృద్ధిచేసెందుకు నాతోకలిశారు. నేను అనేక రైతాంగ వ్యతిరేకచట్టాలను తిరగ దోడేందుకు కాంగ్రెస్ శాసనసభాపార్టీని అంగీకరింప జేయగలగి రైతాంగ అనుకూల శాసనాలకు సమర్థనను ఇప్పించడం ద్వారా చోటూరామ్‌గారి ప్రయత్నాలలో వారికి సహకరించాను.

మాస్టర్ కాబూల్ సింగ్‌గారు గొప్ప స్వాతంత్ర్యసమరయోధుడు, జాతీయ ఉద్యమాలను సమర్థిస్తూ అనేక మార్లు జైళ్లపాలయ్యారు. కాంగ్రెస్ రైతుల విషయంలో వ్యవహరిస్తున పద్ధతులతో ఆయన సంతృప్తి చెందలేక నాలాగే బాధపడ్డారు, 1935 వ సంవత్సరంనుంచి 1947 వరకు పన్నెండు సంవత్సరాల పాటు ఆయన నాతో కలసి పనిచేశారు. ఆయన కెనడా అమెరికా దేశాలు పర్యటించి మన రైతులు కూడా వారిలాగే ఆర్థికంగా అభివృద్ధిచెంది మంచి రాజకీయశక్తిని కలిగి ఉండాలని ఆయన కోరుకున్నారు. ఆయన శాసన సభలో సభ్యులుగా ఉంటూ వడ్డీవ్యాపారుల నుండి రైతులకు రక్షణ, కల్పించడానికి వీలుగా చట్టాలు తీసుకురావడానికి కృషిచేశారు.

శ్రీ ఉద్దంసింగ్ నాగోకి, శ్రీ దర్శన్ సింగ్ పెరుమాన్

కాంగ్రెస్ పార్టీలో పెరుగుతున్న ఏకీకృత విధానాలనుంచి రైతాంగానికి తగినంత రక్షణ లభించక పోవడం చేతను, మాస్టర్ తారా సింగ్ గారి జాతీయ రాజకీయాలతో సర్దుబాటు కాలేని కారణంగాను, కాంగ్రెస్‌లోనూ, సిక్కుగురుద్వారా రాజకీయాలలోనూ బాగా ప్రఖ్యాతుడైన సర్దార్ జితేందర్ ఉద్దంసింగ్ నాగోకి ఆయనకు వయసులో బాగా పెద్దవారైన స్నేహితులు శ్రీ సర్దార్ దర్శన్ సింగ్ పెరుమాన్ గారు 1957-58 సంవత్సరాల మధ్యకాలంలో నాతోకలిశారు.

రైతులకు కంట్రోళ్ళ కారణంగా వచ్చిన బాధలను తొలగించేందుకు ఆహారధాన్యాలను నిర్బంధంగా వసూలు చేసే పద్ధతి నుండి విముక్తి కలిగించేందుకు వారు పండించిన పంటలకు గిట్టుబాటుధరలు లభింపజేసేందుకు ,చేయవలసిన కృషిలో కాంగ్రెస్ మంత్రి వర్గాలు విఫలమైనందున వారు చాలా బాధ పడ్డారు. దేశవిభజన కారణంగా పంజాబ్ రైతులు అనేక భయంకర మైన బాధలను భరించవలసి వచ్చినప్పటికి పట్టణవాసులు వారిపై యింకా అనేక మైన ఆదనపుభారాల్ని మోపటాన్ని చూసి వారు విస్మయం చెందారు. 1935 వ సంవత్సరంనుంచి రైతుజన శ్రేయస్సు కోసం నేనెలా పోరాడుతున్నానో వారికితెలుసు , అందువల్ల నేనెప్పుడు పంజాబ్ లో ఉన్నా వారు నన్ను కలుస్తుంటారు. నాగపూర్ కాంగ్రెస్ సభ (1959)రైతుల భూమి హక్కులను తొలగించి సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టాలని తీర్మానించడం, అందుకు వ్యతిరేకంగా మేము ప్రజా నిరసనను ప్రకటించడానికి పూనుకొన్నప్పుడు వారు మా పక్కన నిలిచారు. శ్రీ నాగోకి , శ్రీ పెరుమాన్ గార్లు ఇద్దరూ కూడా అప్పుడు రాజ్య సభ సభ్యులుగా ఉండి నెహ్రూగారికి అయిష్టమైన మార్గంలో ప్రవేశించడం తమ రాజ్యసభ సభ్యత్వాలకు ముప్పు అని తెలిసికూడా లెక్కించకుండా రైతాంగ సమస్యలకు తోడు నిలిచారు. వారి సహచరుడైన యువమిత్రుడు సర్దార్ బసంత్ సింగ్ అప్పటి పంజాబ్ ముఖ్యమంత్రి డైరక్టర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ ఉద్యోగాన్ని ఆయనకిస్తామంటే తోసిపుచ్చారు. ఈ ముగ్గురూకూడా కాంగ్రెస్ సహకార వ్యవసాయ ప్రయత్నాన్ని పూర్తిగా ఎదుర్కొవాలని నిశ్చయించుకున్నారు. రైతులను నిర్బంధ సహకార వ్యవసాయంలోకి దించాలనే కాంగ్రెస్ ప్రణాళికను సవాలుచేస్తూ వారు 1959 వ సంవత్సరం ఫిబ్రవరి మాసంలో దోరహాలో బ్రహ్మాండమైన చారిత్రాత్మక రైతుమహాసభను నిర్వహించారు. 1959 జూన్‌లో మేము స్వతంత్రపార్టీని ప్రారంభించిన తరువాత పంజాబ్ నుండి మాపార్టీలో ప్రవేశించిన మొదటి వ్యక్తులు వారు. రైతాంగ ప్రయోజనాలకు రక్షణగా వారు ఆ విధంగా తమకు తామై ముందు నిలిచారు.

శ్రీ సర్దార్ బసంత్‌సింగ్

శ్రీ సర్దార్ బసంత్ సింగ్ ఆయన నాయకుడు దర్శన్‌సింగ్ పెరుమాన్‌గారి లాగే అన్ని విధాలా పనిచేస్తూ వ్యవసాయదారుల ప్రయోజనాల కోసం జరిపే కృషిలో తన జీవితాన్ని అర్పించి అమర వీరులయ్యారు. ఎక్కువమంది సిక్కులాగా ఆయన కూడా అకాలీదళ్‌కు అంకితం అయ్యారు. ప్రత్యేక పంజాబ్ రాష్ట్రాన్ని సమర్థిస్తూ ఆయన దాని కోసం కృషిచేశారు.

అయితే తన పనులను ఎక్కువశాతం ఆయన రైతాంగ సంక్షేమం కోసం వినియోగించారు. సర్దార్ బసంత్‌సింగ్ ఎలాగైతే ప్రజాజీవితంలో ప్రవేశించాడో అలాగే వచ్చి చక్కటి సామర్థ్యాన్ని కలిగి రైతాంగ సమస్యలపై కృషిచేస్తున్న బసంత్ సింగ్ ను అప్పటి ముఖ్యమంత్రి సర్దార్ ప్రతాప్ సింగ్‌కైరాన్‌గారు అభిమానించారు. విదేశాలలో కొనసాగుతున్న వ్యవసాయ పద్ధతులను వ్యవసాయసంస్థలను గురించి తెలుసుకునేందుకు విదేశాలకు వెళుతున్న యువరైతులలో బసంత్‌సింగ్‌ను ఒకరిగా ప్రతాప్‌సింగ్ కైరాన్ గారు ఎన్నికచేశారు. అదృష్టవశాత్తూ నాకు సన్నిహితసహచరులైన నా రైతాంగ విద్యాలయ విద్యార్థి ఆంధ్రకిసాన్ కాంగ్రెస్‌నాయకులు శ్రీ చేగిరెడ్డి బాలిరెడ్డి ఎం.పి, నాకు ఆ తరువాత మంత్రులైన కిసాన్ కాంగ్రెస్‌కు చెందిన శ్రీ కందుల ఓబుల్ రెడ్డి, శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి గార్లతో పాటు అప్పుడు విదేశాలకు వెళ్ళిన యువరైతాంగ ప్రతినిధి వర్గంలో ఉండి ఆయన ఆ గ్రూపు నాయకునిగా బసంత్ సింగ్ గారితో మంచి సంబంధాలను కలిగి రైతాంగ ప్రయోజనాలకోసం రాజకీయ ఉద్యమంలో ఎక్కువ ఆసక్తి తీసుకొని పనిచేయవలసిందని కోరారు. ఆప్రపంచ పర్యటన కారణంగా ఆయన ఎక్కువ ఆత్మ విశ్వాసాన్ని మంచి జ్ఞానాన్ని సంపాదించుకున్నారు. జవహర్లాల్ నెహ్రూగారు సహకార వ్యవసాయ క్షేత్రాలను ప్రారంభించేందుకు జాతీయ స్థాయిలో పూనుకొన్నప్పుడు ఆ వినాశకరమైన ప్రయత్నానికి వ్యతిరేకంగా నేను గళం విప్పిన తరువాత బసంత్ సింగ్ తక్షణమే నాతో సంబంధాలు పెట్టుకున్నారు. అప్పుడు ప్రారంభమైన మాస్నేహం రైతాంగకార్యకలాపాలలో రాజకీయ ఉద్యమాలలో పన్నెండు సంవత్సరాలపాటు మంచిగా కొనసాగింది.

బసంత్‌సింగ్ పాడవుగా ఎల్లప్పుడూ ఉల్లాసంగా ఉంటూ వ్యాపార ఫక్కీలో ఉండేవారు. ఆయన గొప్ప ఆత్మవిశ్వాసం కలిగిన వ్యక్తి. స్వతంత్ర పార్టీలో చేరిన తరువాత నాపట్ల రాజాజీ గారి పట్ల చక్కని నమ్మకంతోనూ, విశ్వాసంతోనూ చివరివరకూ ఉన్న మంచి అభిమాని.

భూపరిమితులకు వ్యతిరేకంగా ముందుకు రాబోయేముందు దాని గురించి చాలా ఎక్కువగా పరిశీలించి అడుగు వేశారు, నాలాంటి అనేక మందిలాగా ఆయనకు భూపరిమితి చట్టంపై అంత వ్యతిరేకతలేదు. ఆయితే ఆయన మా అందరితో కలసి అన్నిరకాలైన ఆస్తులపై గ్రామీణపట్టణప్రాంతాలలోని ఆస్తులపై వ్యవసాయంతో పాటు పారిశ్రామికాదాయాలు వృత్తిపరమైన సంపాదనపై కూడా సమంగా పరిమితులు పెట్టాలని వాదించారు. (ఏ) వ్యవసాయదారులపై మాత్రమే భేద భావంతో ఆ పరిమితులను అమలుపరచడానికి వ్యతిరేకంగాను (బి) జవహర్లాల్ గారు ప్రతిపాదించినట్లుగా చాలా కొద్ది భూమిని మాత్రమే పరిమితిగా పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు సాగిస్తున్న పోరాటానికి తగు సమర్థనను తెలుపుతూ దీనిని రాజకీయ పోరాటంగా మాత్రమే చూడాలని ఆయన అన్నారు. పంజాబ్, హర్యానా రైతుల తరపున ముందు నిలబడి ఆయన తిరుగుబాటు సాగిస్తూ దరోహాలో జరిగిన బ్రహ్మాండమైన రైతుప్రదర్శనకు అధ్యక్షునిగా నన్ను ఆహ్వానించారు. సహకార వ్యవసాయకృషికి వ్యతిరేకంగా స్వయంవృత్తులతో జీవించే రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు దేహతి లోక్ పార్టీ ప్రముఖ సీనియర్ నాయకులతో పోరాడడంలో ఆయన సిద్ధాంత పరమైన

గొప్పచాకచక్యాన్ని కనబరిచారు. ఆయనకు నామీద పరిపూర్ణమైన విశ్వాసముంది. స్వతంత్రపార్టీ కార్యకలాపాలను రైతాంగంతో నిండిన గ్రామీణ ప్రాంతాలలో విస్తరింపజేసేందుకు ఆయన నాకు బాగా తోడ్పడ్డారు. పట్టణవాసులైన మా సహచరులు ప్రైవేటు ఎంటర్ ప్రైజెస్ కోసం వాదులాడుతున్నపుడు అది దోపిడీపరం కానంతవరకు తనకభ్యంతరం లేదని ఆయన అంగీకరించారు. ఆమాట చెప్పడంలో ఆయన చక్కటి వ్యంగ్యాన్నిప్రదర్శించి చూపెట్టారు.

రైతుల కోర్కెలను వివరించడంలోనూ, వారి కోసం పర్యటించడంలోనూ, వారిని సమీకరించడంలోనూ వారి అవసరాలకు కార్యచరణ పధకాలను రూపొందించడంలోనూ ఆయన అన్నింటా సమర్థులుగానే ఉంటుండేవారు. ఆయన చేసిన ప్రపంచ పర్యటన ఆయనకు ఈ సర్వ సమగ్రమైన నాయకత్వంలో తగు అనుభవాలను అందించింది.

బసంత్‌సింగ్ ముందు చూపు కలవ్యక్తి. సిక్కుప్రజల తిరుగులేని ఏకైకనాయకులైన మాస్టర్ తారాసింగ్‌గారికి అనుకూలంగా ఉంటూ ఆయన సానుభూతిని సంపాదించుకుంటూనే ఆయన తరువాత అంతటి ప్రముఖ నాయకులైన అకాలీనాయకులు సంత్ ఫతేసింగ్‌గారినుండి కూడా అభిమానాన్ని సంపాదించుకోగలిగేవారు. తాను, శ్రీ ఉద్దంసింగ్ నగోకి, శ్రీ పెరుమాన్, లాల్‌సింగ్‌గార్లతో కలసి స్వతంత్రపార్టీ పంజాబ్‌శాఖను నడపాలను కున్నప్పుడు తమ రాజకీయకార్య కలాపాలకు అకాలీనాయకులు రైతాంగ దృష్టి కలిగిన స్వతంత్ర పార్టీ కార్యకలాపాలు ఏ విధంగానూ వ్యతిరేక దృష్టి కలిగినవి కావని ఆయన వారికి హామీ ఇచ్చారు. ఆయన సలహా మేరకు మేము మాస్టర్‌తారాసింగ్ గారిని కలసి ఆయననుండి సహకార వ్యవసాయ కృషికి వ్యతిరేకంగా ప్రారంభిస్తున్న మారైతాంగ పోరాటానికి సమర్థనను అర్థించాం. ఆతరువాత సంత్‌ఫతేసింగ్ గారినికలసి 17వ రాజ్యాంగసవరణకు వ్యతిరేకమైన మాపోరాటంలో ఆయన తోడ్పాటును కోరాం. వారిద్దరినుంచి హృదయపూర్వకమైన సమర్థనను పొందడంలో వారితో బసంత్‌సింగ్‌గారికున్న అనుబంధం మాకుబాగా తోడ్పడింది. శిరోమణి అకాలీదళ్‌కు ఒకప్పుడు నాయకులుగా పనిచేసిన ఉద్దంసింగ్ నగోకి రైతాంగ ప్రయోజనాల కొరకై అకాలీదళ్ హృదయ పూర్వకమైన సమర్థనను సంపాదించ గలిగినందుకు బసంత్ సింగ్‌గారు చేసిన కృషిని బాగా మెచ్చుకున్నారు. 1962, 1967 ఎన్నికలలో స్వతంత్రపార్టీ బాగా దెబ్బతిన్నప్పటికి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా రైతాంగప్రయోజనాల కొరకై శక్తివంతమైన అకాలీదళ్ అక్కడ ముందు నిలచి కృషిచేసింది. సిక్కునాయకులందరితో బసంత్‌సింగ్‌గారికి ఉన్న స్నేహం శవిధంగా ఉపయోగపడగలిగినందుకు వారికి మా అభినందనలు.

బాల్యావస్థలో ఉన్న స్వతంత్రపార్టీ కల్పించిన దాని కన్నా ఎక్కువ సామర్థ్యంతో విజయాన్ని సాధించేందుకు బసంత్‌సింగ్‌గారు తెలివిగా చేసిన ప్రయత్నాలకు వందనాలర్పించాలి. ఆయనకు మాస్టర్‌తారాసింగ్ గారితోనూ సంత్ ఫతేసింగ్‌గారితోనూ ఉన్న సంబంధాలు స్వతంత్రపార్టీనాయకులైన నగోకి, పెరుమాన్‌గార్లకు ఎక్కువగా ఉపయోగపడ్డాయి. మాపార్టీకి శాసనసభలో ఆయన ఒక్కరే సభ్యులైనప్పటికి అప్పట్లోకొనసాగుతున్న ముఖ్యమంత్రులు ఇతరనాయకులు ఆయనతో సహకరిస్తూ అవసర విషయాల్లో చర్చిస్తూ ఉండేవారు.

బసంత్‌సింగ్ గారు ప్రత్యేక పంజాబ్ రాష్ట్ర వాదాన్ని బాగా సమర్థిస్తూ మాస్టర్‌తారాసింగ్ సంత్‌ఫతేసింగ్ గార్లలో కలిసి గట్టిగా కృషిచేశారు. లాల్‌బహదూర్‌శాస్త్రిగారు ప్రత్యేక పంజాబ్

రాష్ట్రం ఏర్పాటుకు అంగీకరించినప్పుడు ఆయన గొప్పగా సంతోషించారు.

ఆయనకు వయసుకు మించిన తెలివితేటలు ఉన్నాయి . పుట్టుకతోనే ఆయనకు నాయకత్వ లక్షణాలు వచ్చాయి , బసంత్‌సింగ్ గారు తనకు తాను స్వశక్తితో ప్రముఖ ప్రజానాయకునిగా తీర్చిదిద్దుకున్నారు. స్వయంవృత్తిదారులైన రైతుల ప్రయోజనాలను రక్షించేందుకు కమ్యూనిస్టేతర అనుబంధరాజకీయ వాతావరణాన్ని ఎలా ఉపయోగించుకోవాలో ఆయనకు పూర్తిగా తెలుసు. బాగా సంధి సమయంలో కాలం ఆయనను మననుంచి తీసుకెళ్లింది. ఒక మేధావియైన ఆత్మత్యాగం చేయగలిగిన అఖిలభారత రైతునాయకుడొకరిని భారతదేశం ఈవిధంగా పోగొట్టుకుంది. నాకు కుడి భుజంగా ఉన్న ఓ రైతు మిత్రుడిని నేను పోగొట్టుకున్నాను.

శ్రీ సర్దార్ బహదూర్‌లాల్‌సింగ్

కాంగ్రెస్ తో రైతాంగం కొరకై పోరాడుతున్న మాకు మాజీ పంజాబ్ వ్యవసాయశాఖ డైరక్టరు, భారత ప్రభుత్వ వ్యవసాయశాఖ కమీషనరు అప్పుడు ప్రణాళికారంగంలో సలహాదారుడుగా పనిచేస్తున్న సర్దార్ బహదూర్ లాల్‌సింగ్ గారినే ఉన్నత మేధావి రాజకీయేతర మైన ప్రముఖ వ్యక్తులలో నుండి వచ్చి మాతో సహకరించారు. ఆయనకు ఈ సందర్భంలో మాజీ భారత ప్రభుత్వ చీఫ్ జస్టిస్ అయిన శ్రీ మహాజన్, ఎక్స్ ఎం.పి., మాజీ మదరాసు శాసన మండలి అధ్యక్షులైన శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి, స్వతంత్రపార్టీ ఏర్పడడానికి పూనికవహించిన అఖిలభారత వ్యవసాయదారుల సమాఖ్య ప్రారంభకులలో ఒకరు, మాజీపార్లమెంటు సభ్యులు వ్యవసాయ దారుల సమర్థవంతమైన నాయకులు శ్రీ జినరాజ్ హెగ్డేగార్లు సహకరించారు.

సర్దార్ బహదూర్ గారు తాము పార్లమెంటు సభ్యులుగా ఉన్న అయిదు సంవత్సరాల కాలంలో చక్కని కృషిచేసి మంచి పేరు తెచ్చుకొన్నారు. ఆయన ప్రసంగాలు చక్కటి పాండితీ ప్రకర్షణ కనబరుస్తూ భావావేశంతో ఉండి రైతాంగ ప్రయోజనాల రక్షణకోసం గుర్తింపు ధరల కోసం నిరంతరం పార్లమెంటులో మారుమ్రోగుతుండేవి.

శ్రీ బహదూర్ లాల్‌సింగ్‌గారు చెరకు ఉత్పత్తిదారుల పంచదార ఫ్యాక్టరీ యజమానుల విషయమై స్టాబ్యులరీ షుగర్ డెవలప్ మెంట్ కమిటీ చైర్మన్‌గా ఆయనకున్న అనుభవంతో నూ ప్రఖ్యాత వ్యవసాయశాస్త్రజ్ఞుని అనుభవాలతోనూ కలిపి అప్పటి ప్రజానాయకులైన వ్యవసాయశాఖ మంత్రి శ్రీ రఫీఅహ్మద్ కిద్వాయ్‌గారిపై విరుచుకుపడుతుంటే ఆయన విధానాలను విమర్శిస్తున్నపుడు తట్టుకోలేక శ్రీ కిద్వాయ్ అంతటివారు జంకవలసి వచ్చింది. పంచదార ఫ్యాక్టరీ యజమానులు చెరకు వుత్పత్తిదారులను దోచుకుంటూ ఎలా లాభపడుతున్నారో ఆయన చక్కగా వివరించి చెరకు పంటకు గిట్టింపు ధరలను లభింపజేయాలని కోరారు.

వ్యవసాయదారుల ప్రయోజనాల విషయంలో ఆయనకున్న ఆసక్తిని గమనించి నాకు మూర్ఛ వచ్చినంత పనయింది. అంతకుముందు 25 సంవత్సరాలుగా పార్లమెంటులో ఉన్న నా అనుభవంలో మేధావియైన మొదటి శ్రేణి పార్లమెంటు సభ్యుడెవరూ రైతాంగ ఆవసరాల కొరకై ఇంత గట్టిగా నిలబడిన సందర్భాన్ని నేను చూడలేదు. అందువలన నేను ఆయనస్నేహంకోసం ప్రయత్నించాను. ఆయన తన శక్తియుక్తులన్నింటితో నాకు అండగా నిలచేందుకు ముందుకు

వచ్చారు. వారు, శ్రీ జినరాజ్ హెగ్డేగారు "రూరల్ వాయిస్" ఇంగ్లీషు పక్ష పత్రికను ప్రకటిస్తూ స్వయంవృత్తులతో జీవించే రైతుల హక్కు భుక్తాలను కాపాడేందుకు తీవ్రంగా పోరాడుతూ వచ్చారు. వారి కృషికి నా సమర్థనను అందించాను.

ఆయన గెలిచే వైపు ఉండాలనే రాజకీయ సూక్ష్మాన్ని మరచిపోయి 1957 వ సంవత్సరంలో ఆయన పార్లమెంటు సభ్యులుగా ఎన్నిక కావడానికి ఉపయోగపడేలా అకాలీ నాయకులను, కాంగ్రెస్ పార్టీని వదలి తద్వ్యతిరేక వర్గంలో, ఉండడంవల్ల తిరిగి పార్లమెంటుకు ఎన్నికకాలేక పోయారు. రాజకీయాలలో అవసరాను గుణంగా తమను తాము మార్చుకుంటున్న ఇతర రాజకీయ నాయకుల మార్గాన్ని ఆయన అనుసరించలేకపోయారు. ప్రణాళికా సంఘంవారు తమ సలహాదారుడుగా ఉండవలసిందని పంపిన ఆహ్వానాన్ని అందువల్ల ఆయన సంతోషంగా అంగీకరించారు. దానితో ఆయన సంతృప్తి చెందారా? తన అంతరాత్మను ఆయన ఊరడుకుండా బంధించివేశారా? ఏకపక్షంగా రైతాంగ వ్యతిరేక చర్యలకు పూనుకున్నప్పుడు ఆయన చిత్తశుద్ధితో వ్యతిరేకిస్తే ఒనగూడిన ఫలిత మేమిటో ఆయనకు తెలుసుగనుక ఈసారి ఆయన భూపరిమితులను విధించాలని నెహ్రూగారి నిర్ణయాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు ముందుకురాలేదు . ఇతర తరగతుల ఆదాయాలపై ఆస్తులపై పరిమితులుంచకుండా భారత రైతాంగంపై మాత్రమే పరిమితులను ప్రవేశపెట్టి యువ రైతాంగం భవిష్యత్తును ఎందుకు చెరిపివేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

రాజాజీగారి చేత మొదట ఆయన సందేశాలిచ్చేందుకు అంగీకరింపజేసి ఆ తరువాత ఢిల్లీలో రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసన తెలియజేసేందుకు ఏర్పాటు చేసిన ఒక గొప్ప బహిరంగ సభలో మాట్లాడించి ఆ తరువాత అఖిలభారత వ్యవసాయదారుల సమాఖ్య సారధ్యంలో ప్రత్యేక అఖిల భారత రైతునాయకుల సమావేశాన్ని ఏర్పాటుచేసేందుకు ఆయన ఆమోదాన్ని పొందిన ఘనత శ్రీ సర్దార్ బహదూర్‌సింగ్, శ్రీ జినరాజ్ హెగ్డే గార్లకే చెందుతుంది. ఆ సమావేశం 1959 వ సంవత్సరం జూన్ నెల 4వతేదీన మద్రాసులో జరిగింది. ఆ సమావేశంలో రాజాజీ గారు తాను తిరిగి మరొక మారు రాజకీయ రంగం లోకి ప్రధానంగా రైతాంగ ప్రయోజనాలను పరి రక్షించేందుకు నెహ్రూగారి కంట్రోళ్ల పరిపాలన నుండి స్వేచ్ఛను సాధించేందుకు అడుగుపెట్టగలనని ప్రకటించారు. ఆ విజయానికి కారకులు శ్రీ లాల్‌సింగ్, శ్రీ జినరాజ్ హెగ్డేగార్లు అప్పటి సమావేశం స్వయంవృత్తులతో జీవించే ప్రజల రక్షణ కోసం స్వతంత్రపార్టీని ఏర్పాటు చేసేందుకు దారిచూపింది.

అది ఒక సాహసంతో కూడిన కార్యక్రమం శ్రీ లాల్‌సింగ్ మాప్రయత్నంలో కలసి రావడానికి సిద్ధంగా ఉన్నారో లేదో నాకు తెలీదు. అంతకు ముందు ఒక సందర్భంలో ఒక ఉద్యమంలో నన్ను ప్రముఖంగా పాల్గొనమని ఆయన సలహా యిచ్చినపుడు, ఆయన లాంటి అనుభవం కలిగిన సమర్థులైన వ్యక్తుల సహాయంలేకుండా నెహ్రూ గారి ఆదరాభిమానాలను ఆశించకుండా పనిచేసేందుకు ముందుకురాకుండా ఉన్నంతకాలం ఏకపక్షంగా కాంగ్రెస్ వారు ప్రారంభించిన భూపరిమితులకు వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించి విజయాన్ని సాధించడం అంత సులువు కాదని నేను చెప్పాను. ఆయన అప్పుడు మాతోకలసి పనిచేసేందుకు

స్పష్టంగా తన ఇష్టాన్ని మాకు తెలియజేయలేదు. ప్లానింగు కమిషనరు సలహా దారుణంగా పనిచేస్తూ నెలకు రెండు వేలకు పైగా జీతం పుచ్చుకుంటున్న ఆయనకు అలాగే ప్రభుత్వ పనరులను అనుభవిస్తున్న ఆంధ్ర, బీహార్, పంజాబ్, రాజస్థాన్ పార్లమెంటు సభ్యులకు ఆనాడు మాకందరికీ ఇష్టమైన ఈ విషయంలో తమ తమ విశ్వాసాన్ని ప్రకటించిన వారందరికీ కూడా కాంగ్రెస్ కల్పించే రాజకీయ వత్తిడులను ఎదుర్కొని ముందుకు రావడం ఎంతకష్టమో నాకు తెలుసు.

లాల్‌సింగ్ గారు తన బాధ్యతలను తాను సక్రమంగా నిర్వహిస్తూనే మాతో స్నేహాన్ని కొనసాగించాలని నిశ్చయించుకున్నారు. దానితో విలువైన ప్రభుత్వ సంబంధాలు ఆయన పోగొట్టుకున్నారు. దీర్ఘకాలంగా ప్రభుత్వానికి సేవలు జేసిన అలాంటి ఓ గొప్ప శాస్త్రజ్ఞుడి విషయంలో ఇది నిజంగా మరచి పోలేని త్యాగం.

ఆయన త్యాగం చేసినట్లుగానే ఢిల్లీలో ఉన్న అనేక మంది రైతు పార్లమెంటు సభ్యులు, మంత్రులు రాష్ట్రాల మంత్రులు, శాసనసభ్యులు నాతో కలిగేందుకు గాని, సర్దార్‌లతో కలసి పోరాడేందుకు గాని, కిసాన్‌సమ్మేళన్‌లో గానీ, వ్యవసాయదారుల సమాఖ్యతో గానీ కలసి స్వయం వృత్తిదారుల హక్కుల రక్షణకై రైతుల ప్రాథమిక హక్కులపరిరక్షణకై నెహ్రూ విసిరిన సవాలుకు వ్యతిరేకంగా నిలబడి పోరాడేందుకుగానీ ముందుకురాలేక పోయారు.

డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్

వేదాంతిః రాజనీతిపారంగతులు

(సర్వేపల్లి రాధా క్రిష్ణన్ గారు 5-9-1881న తిరుత్తణిలో జన్మించారు. 1921-39 మధ్యకాలంలో మద్రాసు, మైసూరు, కలకత్తాలలో తత్వశాస్త్రాచార్యులుగా వ్యవహరించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో గౌరవాచార్యులుగా ఉన్నారు. 1936-52 మధ్య ఆంధ్ర, బెనారస్ విశ్వవిద్యాలయాలకు ఉపాధ్యక్షులుగా ఉన్నారు.1952లో యునెస్కో అధ్యక్షులయ్యారు. దాని పాలకమండలికి 1948లో వైస్ ఛాన్సలర్‌గా ఉన్నారు. 1949-52 మధ్యకాలంలో రష్యాలో భారతరాయబారిగా ఉన్నారు. 1962-67 మధ్యకాలంలో భారత రాష్ట్రపతిగా ఉన్నారు. 1963లో బ్రిటిష్ వారి గౌరవపతకాన్ని పొందారు. 1954లో 'భారతరత్న' బిరుదుతో గౌరవం పొందారు. భారతీయ తత్వశాస్త్రంపై ప్రామాణికమైన అనేక గ్రంధాలను రచించారు. శ్రీ ఇ.సి.యం.జోడ్ లో "ఫిలాసఫీ ఆఫ్ రాధాక్రిష్ణన్" అనే సంపుటానికి సంపాదకులుగాఉండి, వెలువరించారు. - ఎడిటర్)

శ్రీ రాధాక్రిష్ణన్ గారు భారత రాష్ట్రపతిగా ఐదు సంవత్సరాలు ఉన్నారు; అంతకు ముందు ఉప రాష్ట్రపతిగా వున్నందున, భారతదేశంలోని ప్రతియింటా ఆయన పేరు సుపరిచితమే! ఆయన ఉపరాష్ట్ర పతిగా ఉన్న రాజేంద్ర ప్రసాద్ గారి తర్వాత, వీరికే ఆ పదవి లభ్యమవుతుందని, దేశంలోని రాజకీయవేత్తలంతా తమ అభిప్రాయాన్ని వ్యక్తపరచి, ఆమోదించారు. శ్రీ రాధాక్రిష్ణన్ ప్రపంచంలోని కోట్లాది ప్రజానీకానికి తెలిసిన విశ్వవిఖ్యాత వేదాంతి. సోవియట్ రష్యాలో రెండవ భారత రాయబారిగా ఉన్నప్పుడు, తొలిసారిగా సుదీర్ఘమైన ఇంటర్వ్యూను రష్యా నియంత జోసెఫ్ స్టాలిన్ నుంచి పొందగలిగారు. భారతదేశం యుద్ధాన్ని ఎదుర్కొన వలసివచ్చినప్పుడు ఎంత నావికాదళాన్ని, ఎన్ని డివిజన్ల పదాతిదళాలను యుద్ధంలోకి దింపగలదని ప్రశ్నించిన స్టాలిన్‌కు, కట్టుకథలతో ప్రసంగాన్ని దాటవేసిన రాజకీయ చతురుడు శ్రీ రాధాక్రిష్ణన్! తాత్విక చర్చలతో, ప్రసంగాలతో స్టాలిన్ అభిమానాన్ని ఆయన చూరగొన్నాడు. భారతదేశ ఎన్నికలలో రాధాక్రిష్ణన్‌ను బలవరిచి గెలిపించవలసిందిగా భారత కమ్యూనిస్టులకు స్టాలిన్ సూచించారు.దీనిని బట్టి రాధాక్రిష్ణన్ గారి మేధా సంపత్తిని గ్రహించవచ్చు.

ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి వంటి ఉన్నతపదవులకు రాజకీయాలతో సంబంధంలేని, అందునా ప్రసిద్ధవేదాంతిని ఎంపిక చేయడంలో భారతదేశం అనుసరించిన మార్గాన్ని ప్రపంచంలో ఒక్క చెకోస్లోవేకియా మాత్రమే చేయగలిగింది. జవహర్లాల్, సర్దార్ పటేల్ గార్లు కలిసి ఈ మహదావకాశాన్ని రాధాక్రిష్ణన్‌కు సంతరించిపెట్టారు ఆ నాయకులు తనపట్ల చూపిన గౌరవ ప్రతిపత్తికి, దేశానికి ఉన్నతమైన సేవలు అందించడంద్వారా తగిన ప్రతిఫలాన్ని శ్రీ రాధాక్రిష్ణన్ అందించారు. ఆయన ఆ పదవిలో ఉన్నంతకాలం పార్లమెంటు ఉభయసభల సభ్యులు హుందాతనాన్ని, విచక్షణా జ్ఞానాన్ని సంతరించుకొని, వ్యవహరించారు.

తమ సమకాలికులైన రాజకీయ నాయకులకు, మంత్రులకు అవలంభించవలసిన రాజకీయ లక్ష్యాలు, ఆదర్శాలకు, ప్రాచీన కాలంనాటి మహర్షులు తాత్వికవేత్తల ప్రవచనాలను మేళవించి,వివరించి చెబుతూ, ఆనందించేవారు. పాడవాటి కోటు , తెల్లని తలపాగా ధరించి, చిరునవ్వులు చిందిస్తూ, నిశ్చలంగా కూర్చునిఉన్న ఆయన వద్దకువెళ్లడమంటే, దైవదర్శనానికి వెళ్లే అనుభూతి మనకు కలుగుతుంది.

శ్రీ రాధాక్రిష్ణన్ తొలుత రాజ్యసభ అధ్యక్షులుగా ఉంటూ, దాని ఘనతను, గౌరవాన్ని పెంపొందించి, దానికో ప్రత్యేకవైఖరిని కల్పించారు. రాజ్యసభకు సహజంగా అంతటి విశిష్టత పూర్వంవుండేదికాదు. నిర్లక్ష్యంగా తన యిష్టంవచ్చినరీతిలో వ్యవహరించే కమ్యూనిస్టు వర్గనాయకులై శ్రీ భూపేష్ గుప్తా సైతం, తోటి సభ్యులకు ఇబ్బంది కలగకుండా, అప్పట్లో నిగ్రహంతో వ్యవహరించేవారు. ఎవర్నిగౌరవించాలో, ఎవరికి ప్రోత్సాహాన్ని అందించాలో ఆయనకు బాగా తెలుసు. సీనియర్ పార్లమెంటేరియన్లు కూడా అప్పుడప్పుడే పైకి వస్తున్న జూనియర్లకు వారి సత్ప్రవర్తనను బట్టి, సభలో తగిన సమయాన్ని కేటాయించి, ప్రోత్సహిస్తూఉండేవారు.

తొలి రాజ్యసభలో డాక్టర్ కుంజ్రూ, డాక్టర్ అంబేడ్కర్, రామస్వామి మొదలియార్, మాల్కాని, సి.జి.కె. రెడ్డి, రుక్మిణీ అరండేల్, నరేంద్రదేవ్, తదితర వామపక్షాలకు చెందిన మావంటివారు సభలోఉండేవారు. ప్రతి అంశాన్ని మొదట రాజ్యసభలో చర్చించాలని పండిట్ నెహ్రూను, మంత్రివర్గ సహచరులను తనపలుకుబడిని ఉపయోగించి, ఆమోదింపజేసారు. ముఖ్యమైన సందర్భాలన్నింటిలోనూ, చర్చల్లోనూ అవసరమైనప్పుడల్లా 'కాల్ ఎటెన్షన్ మోషన్ల' ద్వారాను,స్వల్పవ్యవధి ప్రశ్నల ద్వారాను., రెండుగంటల చర్చల్లోనూ, రాజ్యసభ అభిప్రాయాన్ని ప్రజల దృష్టికీ, పత్రికల దృష్టికీ ఆయన తెచ్చేవారు.

రాష్ట్రపతి పదవిలో ఉన్నప్పుడు, ఉభయసభలలో జరిగే ముఖ్యమైన ప్రసంగాలను, చర్చలను ఆయన శ్రద్ధతో ఆలకించేవారు. ఆయన పడకవద్ద, డెస్క్‌వద్ద అందుకు అనుగుణంగా మైక్‌లు అమర్చబడిఉండేవి, ప్రతిదినమూ పత్రికలలో వచ్చేవార్తలను ఆయన శ్రద్ధగా గమనించేవారు. ఈకార్యక్రమాలనన్నింటినీ సమర్థవంతంగా నిర్వహించే, ఆయన కార్యదర్శులను మనం అభినందించవలసిఉంది. ఆయనను మేము సందర్శించినప్పుడు, పార్లమెంటులో మేము చేసిన ప్రసంగాలను, వాటిల్లో ముఖ్యమైన అంశాలను, అక్కడ మేము వింటుఉండేవాళ్లం! అంటే అక్కడ టేప్ చేసి ఉండేవి. ఆవిధంగా ఆయన వద్దకు వచ్చిన సభ్యులకు, వారు సభలో చేసిన ప్రసంగ భాగాలను వినిపిస్తూ, వారిని ప్రోత్సహిస్తూండేవారు. ఇందువలన సభ్యులు మరింత పట్టుదల, శ్రద్ధతో పార్లమెంటు సమావేశాల్లో, చర్చల్లో పాల్గొని ప్రయోజనకరమైన ఉపన్యాసాలను ఇస్తూ, "రాష్ట్రపతి మాకృషిని, తమప్రసంగాలను వింటూ, ఉన్నారన్న అభిప్రాయంతో ఆనందించేవారు, అనగా రాష్ట్రపతి వద్ద టేప్ అవుతున్న మినీ పార్లమెంటులో తిరిగి తమ ఉపన్యాస సారాంశాన్ని వింటూ ఆశ్చర్యపోతూఉండేవారు. అనేకమంది పాటి సభ్యులలాగే, నేను కూడా, ఆయన మినీ పార్లమెంటులో టేప్ అయిన నా ప్రసంగాలను, నాకే ఆయన ఎత్తిచూపిస్తూంటే, విని నేనూ తోటి సభ్యులు చెప్పే విషయం నిజమేనని గ్రహించాను. ఒకసారి నేను పార్లమెంటులో చైనాదురాక్రమణ సందర్భంలో చేసిన

వ్యాఖ్యానాన్ని శ్రీ రాధాకృష్ణన్, టేపు చేసిన భాగాన్ని నాకు వారి కార్యాలయంతో తిరిగి వినిపించారు. "క్యాన్సర్ వ్యాధిగ్రస్తమైన చైనా హస్తాలు భారతదేశంతో చేతులు కలపనున్నాయి. అయితే అప్పుడు మనంవారితో కరస్పర్శచేయడానికి సిద్ధంగాలేం." మరొకసారి నేను చేసిన వ్యాఖ్య ఇలాఉంది, "అధికారాన్ని కడ దాక అంటిపెట్టుకొని" ఉన్న ప్రధాని నెహ్రూను ఉద్దేశించి నేను చేసిన వ్యాఖ్యను ఆయన వినిపించి, "ఇది సాహసమైన విమర్శ" అంటూ ఆయన వమ్ను మెచ్చుకున్నారు. మరొకసారి మహావీరత్యాగి పార్లమెంటులో మధ్యలో జోక్యంచేసుకొని చేసిన వ్యాఖ్యలను కూడా ఆయన ప్రశంసించారు." నాతలమీద ఒక్క వెంట్రుక కూడాలేదు, అంత మాత్రంచేత నాతలను వదిలివేయమంటారా?" అనే వ్యాఖ్యను శ్రీ త్యాగి చేశారు.

ఆక్సాయ్‌చిన్ ప్రాంతంపై చైనా దురాక్రమణను నిరసిస్తూ, పార్లమెంటులో నేను చేసిన విమర్శనలకు నెహ్రూ బదులిస్తూ ' అక్కడ గడ్డికూడా మొలవదు' అని వాఖ్యానించగా, మహావీర్ త్యాగి పై వ్యాఖ్యలుచేశారు. ఈ విధంగా రాధాకృష్ణన్ గారు పార్లమెంటు సభ్యులను ఉత్సాహపరుస్తూ ఉంటారు. ఉపరాష్ట్రపతిగా ఆయన పదవీ కాల పరిమితి పూర్తి అయిన మొదటి సారి, 'ఢిల్లీవదలి వెళ్లదలిచానని' ఆయన బెదరింపుగా అన్నప్పుడు, శ్రీమతి ఇందిరాగాంధీ ఆయనకు జవాబు ఇస్తూ "మీరు లేకపోతే ఢిల్లీ నగరం వెలవెలబోతుంది". 1967లో ఆయన ఢిల్లీ వదలి వెళ్లినతరువాత, ఈమాటల్నే తిరిగి మేమందరం అన్నాం!

కేంద్రస్థాయిలో నూ, రాష్ట్రస్థాయిలోనూ అధికార పార్టీలో ప్రముఖులైవారిలో సైతం అవినీతి పెరగడం, ప్రజాసేవకులంలో సేవానురక్తి సన్నగిల్లి, నానాటికి నైతిక విలువలు దిగజారిపోతూ ఉన్న పరిస్థితుల పట్ల శ్రీ రాధాకృష్ణన్ తీవ్రమైన వ్యధచెందుతూఉండేవారు. ఇదేఅంశంపై నెహ్రూగారి వ్యక్తిగత కార్యదర్శిని, మంత్రివర్గ సహచరుడ్నీతాలగించవలసిందిగా నెహ్రూపైన తన పలుకు బడిని ఉపయోగించి, శ్రీ రాధాకృష్ణన్ వత్తిడితెచ్చారు. డాక్టర్ దేశ్‌ముఖ్ ఉన్నత స్థానాల్లో పదవులు నిర్వహిస్తున్న వారిలో సైతం అవినీతి పేరుకపోయిందని తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఇదే సందర్భంలో ప్రతాప్ సింగ్ కైరాన్ గారి నిరంకుశత్వాన్ని వ్యతిరేకిస్తూ, పంజాబ్ నుండి విరసనలు పెల్లుబికాయి. వీటి అన్నింటినీ పురస్కరించుకొని, సర్వత్రా అవినీతి దుర్గంధం వ్యాపించి పోయిందనీ, రాజకీయ రంగంలో నైతిక దుస్థితి వీర్రవీగుతున్నదనీ, ఈపరిస్థితి జాతికి ప్రమాద హేతువంటూ శ్రీ రాధాకృష్ణన్ హెచ్చరించారు.

శ్రీ రాధాకృష్ణన్ పదవిలో ఉన్నంత కాలం, రాష్ట్రపతిగా ఆయన నిర్వహించిన పాత్ర, ప్రధానికి పార్లమెంటుకుకూడా శ్రేయోభిలాషిగా, తాత్వికవేత్తగా భాసించింది, చైనాదండయాత్ర సందర్భంలో రక్షణ దళాలకు, వారి కర్తవ్యపరాయణతను గుర్తుచేస్తూ, శ్రీ రాధాకృష్ణన్ ఉద్బోధ చేశారు. పడకమీద కూర్చుని, కాళ్ళవద్దనుంచి భుజాలవరకు చలికంబలి నిండుగా కప్పుకొని, నిశ్చలంగా సలహాలిస్తూఉంటే, యుద్ధరంగంలో శత్రు సైన్యాన్ని , మొహరించి పోరాటాన్నినడుపుతున్న యోధునిలా శ్రీ రాధాకృష్ణన్ కనిపించేవారు. ఆసమయంలో ఆయన మాటలు ఈటెలుగా ఉండేవి, ఆయన చూపులు కరుకుగా, చురుకుగా ఉండేవి, ఆయనలో ఆదేశభక్తి మూర్తీభవించి, ప్రకాశమానంగా వెలుగొందుతూఉండేది. ప్రధాని నెహ్రూనుంచి, కొత్తగా ఎన్నికైవచ్చిన పార్లమెంటు సభ్యునివరకూ, పరస్పర విభేదాలను విస్మరించి, మాతృదేశరక్షణ

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన గార్డెన్స్, గుంటూరు-6

కోసం కలిసి కట్టుగా యుద్ధరంగంలో సైనికులకు మద్దత్తునిస్తూ, కృషిచేయవలసిందిగా మమ్మల్ని అందర్నీ రాధాక్రిష్ణన్‌గారు పురిగొల్పుతూ ఉండేవారు, ఆయనను మేమంతా ఆసరాచేసుకొని, అప్పట్లో రక్షణమంత్రిని, సైనిక దళాధిపతినీ మార్చవలసిందిగా పార్లమెంటులో , ప్రధానమంత్రి నెహ్రూపై వత్తిడితెచ్చాం! చైనా దురాక్రమణ సమయంలో భారతదేశం అపజయంపొందడానికి కారకులైన ప్రధానమంత్రి ని తొలగించడంలో పార్లమెంటులో అధికారపార్టీ విఫలమైనందుకునేను తప్పుపట్టాను.

కోటాలు, లైసెన్సులు, పర్మిట్ల ద్వారా సాంఘిక, నైతికవిలువలు పతనమైపోతున్నాయనే మా విమర్శను అంగీకరించి, హోంశాఖ మంత్రి శ్రీ నందా స్వతంత్రమైన ప్రత్యేకన్యాయవిచారణ సంఘాన్ని, మాకోరికమేరకు నియమించేందుకు అంగీకరించారు, కోటాలు, పర్మిట్ల రాజ్యానికి వ్యతిరేకంగా రాజాజీ ప్రారంభించిన ఉద్యమాన్ని హర్షించి, ఆయన సంతోషించారు. ఈఅంశంపై హోంశాఖ మంత్రిగారు ప్రతిపాదించిన విచారణా సంఘాన్ని నియమించేందుకు శ్రీ రాధాక్రిష్ణన్ ప్రభుత్వాన్ని తొందరచేశారు. అంతేగాకుండా మంత్రులు, ఉన్నతాధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలను శోధించి, పరిశీలించి, తగుచర్యలు తీసుకునేందుకు 'స్వీడిష్ అంబుడ్స్‌మన్ వద్దతి"లో ఒకసంస్థను ఏర్పాటుచేయాలని కోరిన మున్షీగారి అభిప్రాయాన్ని రాధాక్రిష్ణన్ గారు బలపరిచారు. దేశాధ్యక్షులుగా ఆయన ప్రధానమంత్రిని హెచ్చరించగలరు. ఆయనకు అధికారం దత్తంచేశారు. ఆయన సూచనలను, ఆదేశాలను అమలు పరచవలసిన బాధ్యత ప్రధానమంత్రి, ఆయన మంత్రివర్గ సహచరులు, ప్రభుత్వకార్యదర్శులు మీద ఉంది. అదృష్టవశాత్తూ నెహ్రుగారు ఆయనను మనస్ఫూర్తిగా గౌరవిస్తూ, ఆయన సలహాలను స్వీకరిస్తూ ఉండేవారు.

శ్రీ రాధాక్రిష్ణన్ దేశధ్యక్షులుగా అనేక దేశాలలో పర్యటిస్తూ, భారత ప్రభుత్వం అనుసరిస్తున్న అలీన విదేశాంగ విధానాన్ని గురించి వివులీకరిస్తూ, విశ్వశాంతి ఆవశ్యకతను గురించి ప్రబోధిస్తూ, మానవాళి ప్రయోజనాలకోసం మిత్ర రాజ్యసమితి చేస్తున్న కృషికి తగిన బలాన్ని చేకూర్చిపెట్టారు. మన ప్రధానమంత్రికి మిత్రులు కాని వారు సైతం, మన విదేశాంగ విధానం నచ్చనివారు కూడా, శ్రీ రాధాక్రిష్ణన్ గారిపై ఉన్న ప్రత్యేక గౌరవం కారణంగా, మన దేశం ఎదుర్కొంటున్న ప్రత్యేక పరిస్థితులను సానుభూతితో అర్థంచేసుకొనగలమని హామీ ఇచ్చారు. ప్రపంచంలోని ప్రముఖమేధావుల్లో ఆయనకు ఉన్న స్థానం, యునెస్కో అధ్యక్షులుగా ప్రపంచ సాంస్కృతిక పరిరక్షణకు ఆయన కొనసాగించిన కృషి మన దేశానికి గణనీయంగా ఉపయోగపడ్డాయి. నిజానికి మన దేశ తటస్థ విదేశాంగ విధానానికి ఇతరదేశాల లో తగినంత ఆదరణ ఉండేది కాదు. దానికి తగ్గట్టు విదేశీరాయభారుల అలసత్వం, మందకొడి తనంవల్ల సవ్యమైన సంబంధాలు ఏర్పడి ఉండని దశలో కూడా, శ్రీ రాధాక్రిష్ణన్ ఒక మహాయోగి లాగా ప్రపంచ రాజ్యాధినేతలందరి లో సత్సంబంధాలను పెట్టుకొని, భారతదేశ విధానాన్ని వివరించి చెబుతూ వచ్చారు. 1925 నాటికే రాధాక్రిష్ణన్ గారు భారతీయ తత్వ వేత్తగా బాగా పేరు సంపాదించుకున్నారు. అప్పట్లో ఆయన కలకత్తా విశ్వ విద్యాలయంలో ఆచార్యులుగా ఉండేవారు. మదరాసు పచ్చయప్ప కళాశాలలో, తత్వశాస్త్రాచార్యులుగా, అంతకుముందే ఆయన పదవిలో ఉన్నారు. నేను అక్కడ1927 లో ప్రొఫెసరునయ్యాను. కలకత్తా విశ్వవిద్యాలయం

ఉపాధ్యక్షులైన శ్రీ అశుతోష్ ముఖర్జీ మదరాసు నుంచి రాధాక్రిష్ణన్ గారిని కలకత్తా విశ్వవిద్యాలయానికి ఆహ్వానించినప్పుడు ఆయన మైసూరు విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా ఉన్నారు. కాలక్రమంలో భారతీయ తత్త్వశాస్త్రాన్ని ఆయన పాశ్చాత్యదేశాలకు తెలియజెప్పిన గొప్ప వాఖ్యాతగా పేరు సంపాదించుకున్నారు. ప్రాచీనకాలం నాటి వేదాలు, ఋషులు, ఉపనిష్కర్తలు ఆవిష్కరించిన తాత్త్విక బోధనలపై రాధాక్రిష్ణన్ గారి వ్యాఖ్యానాలు, గౌతమబుద్ధుని అష్టాంగమార్గం, త్రిమతాచార్యుల భాష్యాలపై ఆయన రచనలు గొప్ప ప్రశంసల్ని పొందాయి. ఆక్సఫర్డ్ యూనివర్శిటీలో భిన్నమత సిద్ధాంతాలను బోధించే,. గౌరవచార్యునిగా ఉన్నారు. నేను ఆక్సఫర్డు వెళ్లినప్పుడల్లా హృదయ పూర్వకమైన ఆనందాతిశయంతో ఆయన్ను కలుస్తూ ఉండేవాడిని . 1926లో ప్రిన్సిపాల్ జాక్స్ గారి ఆహ్వానంపై మాంచెస్టర్ కాలేజీలో ఆరు ప్రధానమైన ఉపన్యాసాలను ఇవ్వడానికి మొదటి సారిగా శ్రీ రాధాక్రిష్ణన్ వచ్చినప్పుడు, నేనూ, శ్రీమతి భారతీదేవి ఆయనను కలుసుకున్నాం ! అప్పుడు ఆయన మాంచెస్టర్ కాలేజీలో విజిటింగ్ ప్రొఫెసరుగా ఇచ్చిన ఉపన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అక్కడ తత్త్వ శాస్త్రాన్ని అభ్యసిస్తున్న మా మిత్రులు వి.యస్. కృష్ణాగారు కూడా ఆయన రచనల విశిష్టతను గురించి మాకు తెలియజెప్పారు. నేను రవీంద్రనాథ్ టాగోర్ గారి తాత్త్విక గ్రంధాన్ని చదివి ఆయత్తమయ్యాను. అప్పట్లో ఆక్సఫర్డ్ యూనివర్శిటీలో చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఆయనను కలుసుకొని, యూనివర్శిటీలో ఆయనకు లభించిన అత్యున్నతమైన గౌరవంవల్ల తాము ఎంతగానో గర్వపడుతున్నామని అభినందించారు.

ఆయన మొదటి ప్రసంగానికి హాజరైనవారు అంతా కలిసి వందకుమించిలేరు. వారిలోనూ సగంమంది లెక్చరర్లు, ప్రొఫెసర్లు. ఆక్సఫర్డు యూనివర్శిటీ విద్యార్థులు సహజంగా ఇట్లాంటి ఉపన్యాసాలకు హాజరవడం తక్కువ, అందులోనూ అప్పట్లో విద్యార్థులను అమితంగా ఆకర్షించే క్రీడావారోత్సవాలు అక్కడ జరుగుతున్నాయి. అయితే ఆయన అసాధారణమైన శాస్త్ర పరిజ్ఞానం, చక్కని ఆంగ్లభాషా వైదుష్యం కారణంగా " హైందవ జీవన విధానం'గురించి వివులీకరిస్తూ శ్రోతలను మంత్రముగ్ధులను గావించిన కారణంగా, ఆయన ద్వితీయ ప్రసంగానికి శ్రోతలు మూడింతలుగా పెరిగారు. తుది రెండు ప్రసంగాలకు సమావేశపుహాలు సరిపోనందున విశాలమైన మరో హాలుకు మార్చవలసివచ్చింది. రెగెట్టాబోట్ రేస్ లాగ, శ్రీ రాధాక్రిష్ణన్ గారి ఉపన్యాసంకూడా ఆకర్షణగా మారినందున శ్రోతలు ఆశ్చర్యచకితులయ్యారు. స్వామి వివేకానంద, శ్రీ రామతీర్థవంటి ఆధ్యాత్మి కవేత్తల ప్రవచనాలను అత్యంత శ్రద్ధతో పఠిస్తున్న నేను, శ్రీ రాధాక్రిష్ణన్ గారి ఉపన్యాసాలపట్ల ఆకర్షితుడనయ్యాను. నేను గాంధీ అభిమానిని! పోతనభాగవతం నాకు అత్యంత ప్రియమైన కావ్యం! దీన్ని ఆమూలాగ్రంగా చదివాను. కానీ శ్రీ రాధాక్రిష్ణన్ గారి ఉపన్యాసాల స్థాయి నన్ను ఆలోచింప జేసింది. అది కారణంగా ఆయన ప్రసంగాలను గురించి రెండు సుదీర్ఘమైన వ్యాసాలను రాసి, అప్పుడు ప్రచురితం అవుతున్న ఒకే ఒక దినపత్రిక 'ఆంధ్రపత్రిక' కు పంపాను. ఆయన ప్రసంగాలకు 'హిందూ వ్యూ ఆఫ్ లైఫ్' అని శీర్షిక పెట్టినందుకు ఆయన నన్ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రపతిగా ఆయన ఎన్నికైన సందర్భాన్ని పురస్కరించుకొని. 1962లో ఆయనను అభినందించడానికి వెళ్లినప్పుడు,

ఆనాటి నావ్యాసాలను గురించి ఆయన ప్రస్తావించారు.ఆయన ఉదాత్తమైన స్నేహాభావంగలవారు. చక్కని సంభాషణా చతురులు. తత్వవేత్తకు సహజగుణమైన మృదుభాషణంతో, ఆహ్లాదంగా జీవితాన్ని కొనసాగించే మహామనీషి!

సంస్కృతభాషా పాండితీవేత్తలకు ఉండే జ్ఞాపకశక్తి రాధాక్రిష్ణన్ గారిలో ఉంది. మహోరుషుల ప్రవచనాలను. శ్లోకాలను, గ్రంధభాగాలను. వ్యాఖ్యానాలను రాధాక్రిష్ణన్ గారు తన ఉపన్యాసాంలో తడుముకోకుండా, ఉదహరిస్తూ ఉండేవారు. వాటిని సంక్షిప్తంగా, భావగర్భితంగా ప్రస్తావిస్తూ, ఆయన ఉపన్యసిస్తుంటే , వినడానికి సొంపుగా ఉంటుంది. సందర్భం ఎంత అప్రధానమైనదై నా, స్వల్పమైన దైనప్పటికీ, దానిని ఆయన ఉదాత్తంగా రూపొందించి, గొప్పగా వ్యాఖానించేవారు.

ప్రసిద్ధ తత్వవేత్త అయిన శ్రీ రాధాక్రిష్ణన్ ప్రజా ప్రభుత్వంలో ఉన్నత శిఖరాలను అధిరోహించినందుకు రాజాజీ, నెహ్రూగారలు ఎంతగానో సంతోషాన్ని పొందగలరు. అంతటి ఉన్నత స్థాయికి ఎదిగిన ఆయనను రాష్ట్రపతి పదవికి అప్పట్లో, నెహ్రూవంటి ప్రముఖనాయకులు ఆహ్వానించడం సమంజసమైన చర్యే! ఈ సంఘటన భారతదేశానికి గొప్ప గర్వకారణం కాగలదు.

ఈవ్యాసం ముగించేముందు, ఆయన నాపట్ల ఎంతటి అభిమానాన్ని చూపెట్టారో మీకు వివరిస్తాను.

1955లో సోవియట్ రష్యా, యుగోస్లావియా దేశాలకు పార్లమెంటరీ ప్రతినిధివర్గాన్ని పంపించినప్పుడు, రష్యావారి సందేహలను అధిగమించి,ఆప్రతినిధి వర్గంలో నన్ను చేర్చేందుకు. ఆయన జవహర్లాల్‌ను అంగీకరింపజేశారు. అప్పట్లో కమ్యూనిస్టు ప్రపంచం నన్ను తన శత్రువుగా పరిగణిస్తున్నది. ఎందుకంటే 1955 ఎన్నికల్లో వారికి మెజారిటీరాకుండా నేను అడ్డుపడ్డానన్న కోపం వారిలో ఉంది.

బెర్ట్రండ్ రస్సెల్ గారి 'రోడ్ టుఫ్రీడం' గ్రంథాన్ని, టాగోర్, జవహర్లాల్ గారలు తమ సోవియట్ రష్యా పర్యటనానుభవాలు రాసిన 'మోడరన్ రివ్యూ' ప్రతులను చదివి, 1921-22 నాటి నుండి రష్యాను సందర్శించాలనే కోరిక నాలో బలంగా ,చోటుచేసుకుంది. అక్కడ లెనిన్, స్టాలిన్‌లు సాంఘికవిప్లవం ద్వారా రైతులను, వ్యవసాయకూలీల జీవనవిధానాన్ని ఎలా అభివృద్ధిపరచారో పరిశీలించాలని నాకోరిక! వెబ్ గారి 'సోవియట్ కమ్యూనిజం ', అనే గ్రంథం, సోలోకోవ్ గారి ప్రసిద్ధ నవలలు కూడా రష్యాను సందర్శించాలని నాలో వాంఛను రేకెత్తించాయి. రష్యాలో రైతులు సాంఘికస్థితి అట్టడుగు స్థాయికి దిగజారిందనీ, రష్యా వెలుపల వెలువడిన గ్రంధాలు నన్నుహెచ్చరించాయి. ఆగ్రంధాలు చదివాక, రష్యారైతుల హీనస్థితి మనదేశంలోని రైతాంగాన్నికి రాకుండా ఉండాలని . నేను అంతర్జాతీయ రైతు సంఘంతో చేయికలిపి , సమిష్టి వ్యవసాయ విధానానికి వ్యతిరేకంగా, దశాబ్దాలుగా పోరాడుతున్న నా కృషిని ఉద్ధృతం చేశాను. రష్యా ఆహ్వానంమేరకు, భారత పార్లమెంటరీ ప్రతినిధివర్గం అక్కడికి పయనమైనప్పుడు, ఈనేపధ్యంలో నేను మరింత శ్రద్ధను కనపరిచాను.

నా 'రష్యా సందర్శన' అనంతరం, నా నివేదికను చూచి రాధాక్రిష్ణన్ గారు ఎక్కువగా సంతోషించారు. "మొత్తం మీద రంగాగారు కూడా సోషలిస్టుగా మారాడు" అని నెహ్రూ అన్నట్టుగా,

ఆయన నాతో చెప్పారు. దానితో కమ్యూనిస్టులు, సోషలిస్టులు గూడా సంతృప్తి చెందారని ఆయన ఆనందించారు.

పరిపూర్ణమైన జీవితాన్ని అనుభవించి 1973లో ఆయన దివంగతులైనప్పుడు, ప్రభుత్వ లాంఛనాలతో ఆయనకు పూర్తి గౌరవమర్యాదలు లభించాయి. యావత్ ప్రపంచం ఆయన మరణానికి సంతాపాన్ని ప్రకటించింది.

12

శ్రీ రఫీ అహ్మద్ కిద్వాయ్

మనదేశ భక్తులలో రాజకీయనాయకులలో ప్రముఖులైన వారిలో కిద్వాయ్ గారొకరు. స్వాతంత్ర సమరయోధులైన వారిలో ఆయన సమర్థులైన పరిపాలనా దక్షత కలవారు. జవహర్లాల్ నెహ్రూగారు ప్రధానిగా పనిచేస్తున్న రోజులలో కిద్వాయ్‌గారితో అతి సన్నిహితంగా మెలిగారు. రఫీసాహెబ్ గారు అక్బర్ చక్రవర్తి తరహాలో పరిపాలనా సామర్థ్యాన్ని, రాజకీయ వ్యక్తుల నుంచి నాయకులనుంచి ఆయన స్నేహాన్ని పొందగలిగారు. ఎక్కువ మంది హిందువులు ఆయనకు సన్నిహితులుగా ఉన్నారు. వారు ఆయనతో ఎంతో గౌరవభావంతో మెలిగేవారు. ఆయన చిన్నా,పెద్ద వ్యత్యాసం లేకుండా అన్ని కులాల నాయకులను అభిమానంతో చూస్తూ తాను అధికారంలో ఉన్నప్పుడైనా లేదా వారధికారంలో కొనసాగుతున్నప్పటికీ వాత్సల్య పూరితమైన స్నేహంతో మెలగుతుండేవారు. యుద్ధానికి ముందు సమయంలో మేమంతా వృత్తిపరమైన వర్గ సంస్థల పరంగా సుబాష్‌చంద్రబోస్‌గారికి సన్నిహితంగా మెలుగుతున్న కారణాన సర్దార పటేల్ గారు మాకు వ్యతిరేకంగా ఉన్న రోజుల్లో కిద్వాయ్‌గారితో నాకు మంచి స్నేహం ఏర్పడింది. జవహర్లాల్ నెహ్రూగారికి ఆయన ఎల్లప్పుడూ ఓమంచి మిత్రుడే . మోతీలాల్ నెహ్రూగారు గొప్ప అభిమానంతో పెంచిన ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజకీయకవలలుగా కొంతమంది వారిని చూస్తుంటారు. మోతీలాల్ గారికి తన తెలివిపై మంచినమ్మకం. అందువలన ఆయన నెహ్రూగారిని రాజకీయాలలో తొందరపడి ముందుకు దూకకుండా పరిస్థితులను బట్టి నడవడానికి వీలుగా కొంతమేరకు వగ్గాలు పట్టి ఉంచగలుగుతుండేవారు. వెనుకా ముందు ఆలోచిస్తూనడిచే జవహర్లాల్ విధానాలమీదకన్నా నిర్భయంగా ముందుకు అడుగువేసే సుభాష్ రాజకీయ రీతిపైన రఫీఅహ్మద్ కిద్వాయ్‌గారు ఎక్కువ ఆసక్తిని కనబరుస్తుంటారు.

నాతో సైతంగ ఉద్యమంలోనూ యువజన విద్యార్థి రంగాలలోనూ పనిచేసిన పాలీవాల్, మోహన్‌లాల్, సక్సేనా, మహావీర్ త్యాగి, శ్రీమతి సుచేత,శ్రీకృపలానీ, శ్రీసిబ్బన్‌లాల్ సక్సేనా వంటి కాంగ్రెస్‌లో అతివాదులుగా పేరుపడిన వర్గం ఆయనకు బాగా సన్నిహితంగా ఉంటుండేది. అనేక సందర్భాలలో యు.పి. రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలో ఆయన ఎలా నిస్పంకోచంగా కాంగ్రెస్ తీవ్రవాద వర్గాలను ఆదుకుంటూ ఉండేవారో ఆయన మిత్రులు చెప్పుండేవారు. అదే సమయంలో జవహర్లాల్ గారు పార్టీ నాయకత్వానికి భిన్నంగా ఉండేవారి ప్రయత్నాలనుండి వారిని నిరోధించేందుకు గానీ లేదా వారిపై పెద్దల ఆగ్రహాన్ని తగ్గించేందుకు గానీ దేనికీ పూనుకొనేవారు కాదు. శ్రీరఫీ, శ్రీజవహర్ వారిరువురూ మంచి స్నేహితులుగా ఉంటూ తమ స్నేహితుల క్రమశిక్షణా రహిత చర్యలను గురించి నవ్వుతూ చర్చించుకుంటుండేవారు. కాంగ్రెస్ హైకమాండ్ సలహాలను పాటించకుండానే శ్రీకిద్వాయ్ ఒకమారు

బ్రిటిష్ ప్రభుత్వాన్ని ధిక్కరించి జైలుపాలయ్యారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ గారి ప్రయత్నాలను బలపరుస్తూ ఆయన ఓ తుఫానులాగా ముందుకు దూసుకుపోతుండేవారు. 1939 సంవత్సరంలో కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి తిరిగి ఎన్నిక కావడానికి సుభాష్ చంద్రబోసుగారు పూనుకొన్నప్పుడు మహాత్మాగాంధీ సలహాలను తుదకు నెహ్రూ సలహాలను కూడా లెక్కచేయక ఆయన సుభాష్ బోసు తిరిగి ఎన్నిక కావడానికి తోడ్పడ్డారు. సుభాష్ చంద్రబోసు గారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుని ఆయనను కాంగ్రెసు నుండి బహిష్కరించిన తర్వాత కిద్వాయ్ గారు కాంగ్రెస్ హైకమాండ్ సామ్రాజ్యవాదులకు అనుకూలంగా ఉండేమార్గం వైపు క్రమేణా మొగ్గుతున్నదని ఆయన దేశాన్ని హెచ్చరించారు. ఆయన కాంగ్రెస్‌పార్టీలో ఒక గెరిల్లా యోధుడిలా ఉంటుండేవారు. ఆయన అనుచరులు తమపై కాంగ్రెసు పార్టీ క్రమశిక్షణా చర్యలకు పూనుకున్నప్పుడు కూడా వారు కాంగ్రెసును వదలి ప్రతిపక్షాలలో కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీవంటి వాటిలో చేరినప్పుడుకూడా ఆయనపై నమ్మకాన్ని వదలిపెట్టి నడిచేవారుకాదు, ఆయన కేంద్రవర్గంలో శక్తివంతుడైన మంత్రిగా ఉంటున్నప్పుడు కూడా ఆయన అనుచరుల ప్రవర్తనలో విశ్వాసంలో ఏమీ మార్పులేకుండా ఉండేది. 1951 సంవత్సరంలో ఆయన పాట్నాలో జరుగుతున్న ప్రతిపక్ష నాయకుల సమావేశానికి వెళ్లేందుకు మమ్ములను ప్రోత్సహించారు. శ్రీ ఆచార్యకృపలానీ గారి నాయకత్వంలో ఆనాడు పాట్నాలో కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీ ఏర్పడినపుడు తాను కేంద్రమంత్రి వర్గ సభ్యునిగా కొనసాగుతూ కూడా కె.ఎం.పి.పి.లో కార్యవర్గ సభ్యుడిగా ఉండేందుకు అంగీకారం తెలిపాడు. కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న టాండన్ గారు మంత్రి వర్గంలో ఉంటూ కిద్వాయ్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పనిచేస్తున్నందుకు నెహ్రూగారిని ప్రశ్నించినపుడు అతి తేలికగా ఆయన కాంగ్రెసుకు రాజీనామా ఇచ్చారు. కొన్ని మాసాలు గడిచిన తరువాత కిసాన్‌మజ్‌దూర్ ప్రజాపార్టీ తగినంత బలాన్ని సంపాదించుకోలేక పోయిన తరుణంలో ఆయనకు సన్నిహిత మిత్రుడైన జవహర్లాల్ గారు ఆయనను తిరిగి కాంగ్రెస్‌లో ప్రవేశించి మంత్రి వర్గంలో చేరవలసిందని ఆహ్వానించినపుడు దానికి ఆయన అంగీకరించారు. సోషలిస్టులు కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీవారు ఆయన ఈనిర్ణయాన్ని సంతోషంగానే స్వీకరించారు. ప్రదేశ్ కాంగ్రెస్‌పార్టీ చేపట్టిన క్రమశిక్షణా చర్యలకు వ్యతిరేకంగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీకి నివేదనచెయ్యడానికి స్వల్పకారణం మీదనే ఒకసారి పాలీవాల్ జీవంటివారిపై క్రమశిక్షణాచర్యలకు పూనుకోవడం జరిగింది. రఫీసాహెబ్ గారికి వారిపై ఈవందర్భంలో మంచి సానుభూతి ఉంది. పి.సి.సి చేసిన నిర్ణయం సరికాదని అప్పీల్ చేసుకోమని సలహాఇచ్చిన వారైనప్పటికి ఆయన గానీ నెహ్రూగారు గానీ కాంగ్రెస్‌పార్లమెంటరీ బోర్డు కార్యవర్గంలో వారిని రక్షించ లేకపోయారు. అయితే వారెవరూ రఫీగారిని నిందించలేదు. కాంగ్రెసు నుంచి వారు రాజీనామా ఇవ్వవలసివచ్చినప్పటికి వారికి తమ నాయకునిపై ఉన్న విశ్వాసంలో ఏమాత్రం మార్పురాలేదు. కాంగ్రెస పార్టీ క్రమశిక్షణా చర్యలను గురించి ఏమాత్రం జంకులేకుండా నిర్భయంగా ఆయన వారి పట్ల తనకున్నప్రేమను, విశ్వాసాన్ని ప్రకటించారు. అధికార కాంగ్రెసు అభ్యర్థులకు వ్యతిరేకంగా తన మిత్రులు ఎక్కడ నిలిచినా వారు గెలిచేందుకు వీలుగా ఆయన ఆర్థిక

సహాయాన్ని అందిస్తుండేవారు. ఒక సందర్భంలో ఆయన పార్టీ వ్యతిరేక చర్యలను గురించి ఆరోపణలు వస్తే అధికార అభ్యర్థులు ఓడిపోయే పరిస్థితులో ఉన్నప్పుడు తాను ఏమి చేయగలనని ఆయన ధైర్యంగా బదులిచ్చారు. ఆయన ఏంచేసినా ఆయనకు తోడ్పడేందుకు నెహ్రూగారి అండ తోడుగా ఉండేది. అయితే పార్టీలో ప్రముఖులైన సహచరులకు వ్యతిరేకంగా నిలబడడానికి గొప్ప ఆత్మవిశ్వాసం సాహసం కావాలి. అది ఆయన కుంది. బ్రిటిష్ పరిపాలనా కాలంలోని తొలి సంవత్సరాలలోనే రఫీగారు అక్బరుగారి లాగా ఉత్తమ నాయకునిగా తయారయ్యారు. ఆ బాట ఆయన ముస్లిమేతరులైన అనేకమంది సహచరులను, స్నేహితులను సంపాదించుకునేందుకు వీలు కల్పించింది.

నాకు నెహ్రూగారి మీద ఎంత ప్రేమ ఉందో రఫీ గారికి తెలుసు. అయితే ఆహారధాన్యాల కంట్రోళ్లకు నిర్బంధ ధాన్య సేకరణ పద్ధతికి గిట్టింపు కాని ధరలకు ధాన్యాన్ని తీసుకునే పద్ధతికి వ్యతిరేకంగా నేను చేస్తున్న పోరాటాన్ని ఆయన సంతోషంతో స్వీకరించారు. జవహర్లాల్ గారిలాగా నేను కూడా సోషలిస్టు ననే సంగతి ఆయకు తెలుసు. ఆహారధాన్యాలు ఇతర వ్యవసాయో త్పత్తులను పండిస్తున్న రైతులను బ్లాక్ మార్కెటీర్లు, దొంగనిల్వదారుల పరపన నిలబెట్టి శిక్షించడాన్ని నేను అంగీకరించలేనని ఆయనకు తెలుసు, ఆయన జవహర్లాల్ గారి ఆహ్వానం ప్రకారం నన్ను కేంద్ర మంత్రి వర్గంలో చేరి ఆహార శాఖా మంత్రిత్వాన్ని చేపట్టి నెహ్రూగారి కోరిక మేరకు పట్టణ ప్రజలు దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న జనాలను అసంతృప్తి చెందనీయకుండా రైతులను ఎలా రక్షించుకోగలనో చూపెట్టవలసిందని ఆయన నాపై గట్టి వత్తిడి చేశారు. పట్టణ ప్రాంతాల వారికి అనుకూలంగా ఉండే జవహర్లాల్ నేను చేసే ప్రతి పనిని అనుమానించకుండా నీపై చూపించినంత పూర్తి విశ్వాసం నాపై చూపించేలా చేయగలరా అని నేను ఎదురు సవాలు విసిరాను. సందర్భవశాత్తూనేను 1951 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీని వదలిపెట్టి శ్రీ ప్రకాశం గారితో కలసి సంయుక్తంగా 1952 సంవత్సంలో మదరాసు రాష్ట్రంలో కాంగ్రెసు బలాన్ని తగ్గించగలిగాను. అప్పుడు రఫీ సాహెబ్‌గారు నేను కృషీకార్ లోక్‌పార్టీని రద్దుచేసి కాంగ్రెస్‌కు తిరిగి మెజారిటీని తీసుకురాగలిగితే తాను కేంద్రమంత్రివర్గంలో వ్యవసాయశాఖను చేపట్టి ఆహారధాన్యాలపై కంట్రోళ్లను ఎత్తివేయగలనని చెప్పారు. నేను దానికి సంతోషంతో అంగీకరించి కాంగ్రెస్ శాసన సభాపక్షంలో కలసి పనిచేసేందుకు నిర్ణయం తీసుకొని రాజాజీ నాయకత్వంలో కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడేందుకు సహకరించినపుడు రాజాజీగారు కూడా ఆహారధాన్యాలపై కంట్రోళ్లను ఎత్తివేయడానికి తాను సహకరించగలనని చెప్పారు. అంతకు కొన్ని సంవత్సరాల ముందునుంచీ రాజాజీని ముఖ్యమంత్రిగా చేయాలని నెహ్రూగారు శ్రద్ధవహించిన నాటి నుండీ రఫీ రాజాజీ గార్ల సంబంధాలు అంత స్నేహపూరకంగా లేవు. అప్పుడు రఫీగారు అవి అసంగతాలయినప్పటికీ వాటి కొరకై నెహ్రూ గారిపై తమ స్నేహాన్నంతా ఉపయోగించి గట్టి పట్టుబట్టిచూశారు. ఆ సమయంలో నేను తోడుగా ఉండగా రాజాజీగారు ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. రఫీగారు కేంద్ర ఆహారశాఖామంత్రిగా వచ్చారు. ఆ తరువాత పెద్దరాష్ట్రాల ముఖ్యమంత్రుల సహకారంతో అన్ని రాష్ట్రాలకు తగినంతగా ఆహారధాన్యాలను అందించగలనని, ఆకలిచావులు ఏర్పడే పరిస్థితులు రాకుండా చేయగలనని ధరల పెరుగుదల

జరుగకుండా చూడగలనని అందరినీ ఒప్పించి ఆయన కంట్రోళ్లను ఎత్తివేయగలిగారు. జవహర్లాల్ వెనుక ఉన్న గొప్ప తంత్రజ్ఞుడైన రఫీ అహ్మద్ కిద్వాయ్‌గారి పరిపాలనా దక్షత, నైపుణ్యం అలాంటిది.

దేశానికి అత్యంత ప్రధానాంశమైన ఆహారధాన్యాలపై కంట్రోళ్లను ఎత్తివేయడం గొరిల్లా రీతులతో సహజంగా వ్యవహరించే రఫీగారి రీతులకు బాగా అనుగుణంగానే ఉంది. ఆ తరువాత ప్రతిరాష్ట్రం స్థానిక ఉత్పత్తులను తక్కువగా అంచనా వేసుకొని నగరాలలో ఉండే ప్రజలకు కావలసిన పంపిణీని ఎక్కువగా మదింపువేసుకొని సంవత్సర మొత్తంలో గానీ లేదా కరువు మాసాలలోగానీ దిగుమతి చేసుకోలసిన ధాన్యపు అంచనాలను కూడా బాగా ఎక్కువగా అంచనా వేసుకొని చూడసాగింది. దానివలన కేంద్ర ఆహార మంత్రిత్వం తిరిగి నిర్బంధ ధాన్యం వసూలుచేసేందుకు ఒకపక్క, దిగుమతులను పెంచేందుకు మరొకపక్క అంగీకరించింది. అంతేకాకుండా కేంద్రంనుండి రాష్ట్రాలు ఒక దానిపై ఒకటి పోటీపడుతూ సహాయాన్ని అర్థించసాగాయి. రఫీగారు రాష్ట్రం వెంట రాష్ట్రం పర్యటిస్తూ స్థానిక మంత్రులను శాఖాధిపతులను కలుసుకొంటూ వెలవారీ కేంద్రం నుండి వారికి కావలసిన సరఫరాలను ఆర్థికసహాయాన్ని నిర్ధారించుకొంటూ ధాన్యం సేకరణ పద్ధతిపై ఉన్న నిర్బంధాలను వీలైనంత సులభతరం చేసేందుకు ధరల సేకరణపద్ధతులను సరళతరం గావించేందుకు వారిని అంగీకరింపజేయగలిగారు.

హైదరాబాదుకు వెందిన రైతువర్గంనుండి వచ్చిన శక్తివంతుడైన మంత్రి డాక్టర్ చెన్నారెడ్డి గారి మీద ఆయన ఎక్కువ మక్కువ చూపిస్తూండేవారు. కమ్యూనిస్టులు ఇతర పార్లమెంటు సభ్యులు కొంతమంది ఆయన ప్రయత్నాలను పార్లమెంటులో తీవ్రంగా వ్యతిరేకించినపుడు అత్యవసరమైన కంట్రోళ్లేమైనాఉంటే వాటిని నేను ఉపసంహరించడంలేదని రాష్ట్రాలు అంగీకరించిన వాటిని మాత్రమే కొంత సులభతరం చేస్తున్నామని ఆయన సమాధానం చెప్పేవారు. కొన్ని వారాలు నెలలు ఆయన ఢిల్లీలో ఉండకుండా ఇందుకు సంబంధించి అందరి ఆమోదాన్ని సంపాదించేందుకు శ్రమించి సాధించారు. ఆయన నన్ను అభినందించేందుకు నావైపుకు తిరిగిన వెంటనే నేను ఆయన ఈవిషయంలో పూర్తి విజయం సాధించాడని అనుకున్నాను. నెహ్రూగారికి ఆయన ముఖ్యస్నేహితులుగా ఉన్నందువల్ల ఆయనపై ప్రధానికి ఫిర్యాదు చేసేందుకు వీరాష్ట్ర ప్రభుత్వం పూనుకోదు. రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సంప్రదించేందుకు నెహ్రూగారు మీకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ఇచ్చారా? అని నేను వారిని ప్రశ్నించాను. ఆయన నవ్వుతూ "రంగా! మీరు భావావేశంలో జీవిస్తున్నారు. నేను అధికారంలో ఉన్న మంత్రులు, అధికారులతో గూడిన గృహంలో వారి మధ్య సయోధ్యతో మెలుగుతున్నాను". ఎప్పుడైనా నెహ్రూగారు నాతో మాట్లడితే నేను రంగా గారి విధానాలను అనుసరిస్తునాని ఆయనను నవ్విస్తూ, మీ ముఖ్య ప్రతిద్వందియైన రంగాను నేను జాగ్రత్తగా కాపాడుకొంటూ వస్తున్నానని ఆయనతో చెప్తూ ఉంటానన్నారు.రెండు భిన్నాభి ప్రాయాలు కలిగిన వర్గాల మధ్య ఆవిధంగా ఆయన శాంతిని సాధించి ప్రజల ప్రయోజనాలను రక్షించేవారు.

మత విషయాలలో ఆయనపై ఆయనకు పూర్తి విశ్వాసముంది. 1936 సంవత్సరంలో జరిగిన ఎన్నికలలో యు.పి. రాష్ట్రంలో కాంగ్రెసుకు మెజారిటీ లభించేందుకు తనకున్న

ప్రజా సంబంధాలు ముస్లింలనెక్కువగా మనవైపు రాబట్టగలవని చెప్పి దానిని ఆయన జవహర్లాల్‌కు నిరూపించి చూపెట్టారు. అయితే 1937 సంవత్సరంలో యు.పి. మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసినపుడు తమతో పాటు మంత్రి వర్గంలో చేరేందుకు యు.పి. ముస్లింలీగ్ నాయకులైన చౌధురి క్వాలి క్విజ్ జమాన్ గారిని ఆహ్వానించమని తాను ఇచ్చిన సలహాను నెహ్రూగారు సరైన మార్గంలో వినియోగించుకోలేక పోయారు. ఆ తప్పు ఆ తరువాత బాగా కాంగ్రెస్ వ్యతిరేక ప్రచారానికి మూలమై, దేశ విభజన ద్వారా పాకిస్తాన్ ఏర్పాటుకోసం ముస్లింలు అనివార్యంగా పోరాడేందుకు కారణమైంది.

జవహర్లాల్ భారత ప్రధానియైన తరువాత రఫీగారు కేంద్ర మంత్రి వర్గంలో చేరారు. అయితే నెహ్రూగారితో ఉన్నంత స్నేహసంబంధాలను ఆయన రాజాజీతోనూ సర్దార్ పటేల్ గారితోనూ నిలుపుకోలేదు. జవహర్లాల్‌కు ఆయన ఓర్పుతో భరించలేదు. అయితే అదే సందర్భంలో ఇతరులు నెహ్రూకు దగ్గరి వ్యక్తిగా ప్రధానికి నమ్మకమైన వానిగా ఆయనను గుర్తించి చుట్టూ తిరగసాగారు. సర్దార్ పటేల్ గారు తన పెద్దరికాన్ని ఎక్కువగా గౌరవించడంలేదని, శ్రీ రాజాజీ అభిప్రాయపడసాగారు. ఒకరు తరువాత ఒకరు అలాంటి పెద్దలను పోగొట్టుకుంటూ దేశం నష్టపడడం ప్రారంభమైంది. వారి తరువాత అంతటి వారిని తీసుకొచ్చి ఆ నష్టాన్ని రఫీగారు పూర్తిచేయలేకపోయారు. పెరుగుతున్న బాధ్యతలకు అనుగుణంగా వేగంగా పరిపాలనా పరమైన మార్పులను తీసుకొచ్చేందుకు నెహ్రూగారి శక్తి సరిపోవడంలేదని ఆయన గ్రహించారు. జాతీయ నాయకత్వంతో పాటు ఇన్ని అదనపు భారాలను నెహ్రూగారు ఎందుకు భరించాలని ఆయన అనుకోసాగారు. నెహ్రూగారి తరువాత ఎవరు అన్న ప్రశ్నకు ఆయన నేను ఎందుకు కాకూడదు అని తడుముకోకుండా జవాబుచెప్పారు. నెహ్రూగారు దానిని చక్కటి తమాషాగా భావించారు. దేశం ఆయన ఆత్మ విశ్వాసాన్ని ఆశ అని అనుకొంది. రఫీగారి సమయస్ఫూర్తికి ఇదొక ఉదాహరణ. 1954 సంవత్సరంలో ఆయన తన 66 వ యేట దురదృష్టవశాత్తూ మనలను విడిపోయారు. అంతకు ముందే కొద్దిరోజులకు ముందు గుండెపోటు వచ్చిన తరువాత ఆయన విశ్రాంతి తీసుకోకుండా యు.పి. నుండి వెంటనే బయల్దేరి నిర్లక్ష్యంగా ఢిల్లీ వస్తూ మరణించారు. దేశమంతా ఆయన మరణానికి సంతాపంవెలిబుచ్చింది. సహచర సంహారుని పోగొట్టుకొని నెహ్రూజీ ఒంటరిగా మిగిలిపోయారు. డాక్టర్ చెన్నారెడ్డిగారు ఆంధ్రప్రదేశ్‌లోని రాజేంద్ర వ్యవసాయ విశ్వ విద్యాలయం ఆవరణలో రఫీ కాటేజీని నిర్మింప జేశారు. న్యూఢిల్లీ ఒక ముఖ్యమైన వీధికి రఫీమార్గ్‌గా నామకరణం చేసుకొంది. ఆయన స్వాతంత్ర్యసమరయోధులందరి హృదయాలలో ఒక హుషారైన మంచి మిత్రునిగా జీవించారు. బ్రిటిష్‌వారి జైళ్లలోనూ, బయటా, పోరాటాలలో పాల్గొన్న అనేకమంది యోధులలో ఆయన ఒక గొప్ప యోధుడిగా జీవించారు.

తత్వవేత్త శ్రీ రఘుపతి వెంకటరత్నంనాయుడు, వి.సి.,ఎల్.ఎల్.డి.

ఈశతాబ్దంలోని మొదటి మూడు దశాబ్దాల కాలంలో రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు ఆంధ్ర ప్రాంతంలోని బ్రహ్మసమాజీకులలో ప్రముఖులు. ఆయన హిందూ మత చాందస వాదానికి, పురాణాల ద్వారా వ్యాప్తిచెందిన అశాస్త్రీయ విశ్వాసాలకు మానవత్వం అంగీకరించని అలవాట్లకు వ్యతిరేకంగా పోరాడిన మరొక బ్రహ్మసమాజీకులు. విశ్వమానవ దృష్టి కలిగిన ప్రముఖులైన వీరేశలింగం గారితో సమంగా కృషిచేసిన ప్రముఖ మానవతావాది.

ఆ రోజుల్లో భారతీయ విశ్వ విద్యాలయాల్లో ఆంగ్ల భాషను బోధించే భారతీయ ఆచార్యులు ఎక్కడోగాని ఉండేవారుకాదు, ఆంగ్లభాషను బోధించేందుకు ఆంగ్లేయులు మాత్రమే సమర్థులని ఆరోజుల్లో ఉన్న నమ్మకం ఆకొద్దిమంది భారతీయ ఆంగ్ల భాషాబోధకులలోను షేక్స్పియర్‌ను బోధించేవారు మరీకొద్దిమంది. అటువంటి కొద్ది సంఖ్యలో ఉండి గొప్ప గుర్తింపును, స్థాయిని సంపాదించుకున్న అరుదైన వ్యక్తి వెంకటరత్నంగారు ప్రత్యేకించి షేక్స్పియర్ నాటకాలను బోధించటంలో సమర్థులైన ఉపాధ్యాయునిగా ఆంగ్లభాషాచార్యులైన ఆంగ్లేయులచేతనే మన్నింపుపొందారు. ఆయన మాట చక్కిని వాగ్ధోరణితోనూ ఆయన ఆంగ్ల భాషాశైలి మంచి భాషా పాటవంతోనూ ఉండి ఎనభై సంవత్సరాల వయసులో కూడా ఆయన చిరునవ్వులు చిందిస్తూ వేదికలపై ఉపన్యసిస్తుంటే, ఆయన విద్యార్థిప్రముఖతత్వవేత్త, తెలుగు పత్రికా సంపాదకుడు ముట్నూరు కృష్ణారావు గారి లాగా ఆయన విద్యార్థిని కాలేకపోయినందుకు ఆయన ప్రసంగాలను విన్నప్పుడు కృష్ణారావు గారిని చూసి, ఆ అదృష్టం నాకు లభించలేదే అనినేను విచార పడుతుండే వాడిని.

తన సామర్థ్యానికి తోడు ఆయన శ్రీ రామమోహనరాయ్, శ్రీ కేశవచంద్రదేవ్, శ్రీ దేవేంద్రనాథ టాగూర్ వంటి బ్రహ్మ సమాజ ప్రముఖుల బోధనలను ప్రచారం చేస్తూ ప్రత్యేకస్థానాన్ని సంపాదించుకున్నారు. కులతత్వానికి వ్యతిరేకంగా సాంఘిక సంస్కర్త శ్రీ వీరేశలింగంగారి మార్గంలోనే ఆయన అవిశ్రాంతంగా పోరాడారు. వారిద్దరూ ఆంధ్రదేశంలోనూ, దక్షిణభారత దేశంలోనూ ఉన్న పూజారులపై భారతీయ సనాతన ఆచార పరాయణులపై ఒక ఉప్పెనలాగా విరుచుకుపడ్డారు. బాల్యవివాహాలు, అంటరానితనం, శూద్రులు, స్త్రీలు, వెనుకబడిన తరగతులు, అంటరాని కులాలవారు వేదాలను చదవరాదని విధించిన నిషేధాలు యిటువంటి అనేక హైందవ దురాచారాలను వారు తీవ్రంగా అసహ్యించుకున్నారు. వారు భారతీయ మేధావులను కులపెద్దలను హైందవ సమ్మకాల్లోని ప్రతి అంశాలను విడి విడిగా పరిశీలించవలసిందని, వారు చెప్పిన వాక్యాలను వారు విధిం నిషేధాలను వారు ఆచరిస్తున్న ఆచార క్రమాన్ని మానవత్వ దృష్టితో పరిశీలించ కోవలసిందని మనుషులుగా మానవత్వం అంగీకరించని ఆమొత్తాన్ని వ్యతిరేకించవలసిందని వారు ఆర్డించారు. ప్రతిమానవుడు తన

సాంఘిక హోదాతో గాని, ఆర్థికస్తోమత తోగాని నిమిత్తంలేకుండా దైవ స్వరూపుడేనని వారు బోధించారు.

తాను చెప్పున్న ఈ ధర్మాలకు అనుగుణంగా రఘుపతి వెంకటరత్నంనాయుడుగారు, ఆయనకు పిల్లలు లేనందువల్ల ఇద్దరు అంటరాని కులాలకు చెందిన తల్లిదండ్రులకు జన్మించిన అనాథ బాలికలను, మహాత్మాగాంధీగారు ఇంకా కులరహిత వ్యవస్థను గురించి ఇంకా ప్రచారం ప్రారంభించకముందే తమ స్వంత బిడ్డలుగా దత్తత తీసుకున్నారు. వారిని తన స్వీయ సంతానంగా చూసుకొంటూ తన కున్న యావదాస్తిని సాంఘిక హోదాను ఆయన వారికి కల్పించారు. ఆయన వారిని విద్యావంతులైన బ్రహ్మసమాజీకులుగా మారిన అగ్రవర్ణాలకు చెందిన యువకుల కిచ్చి వివాహం జరిపించారు. వెంకటరత్నం నాయుడుగారు సామాజిక నిషేధాజ్ఞల సంకెళ్లను తెంచివేశారు, మత దురాచారాలను నేలమట్టంచేసి భారతీయ హైందవ సాంప్రదాయారణ్యాలను, కొండలను దాటుతూ క్రొత్త బాటలు వేశారు, గాంధేయ వాదులు తమ మార్గాన్ని సులభతరంచేసినందుకు ఆయనకు శాశ్వతంగా కృతజ్ఞులై ఉండాలి.

తన శిష్యుల విషయంలో వెంకటరత్నంగారు అదృష్టవంతులు. తన విప్లవ కృషిలో మొదట రోజుల్లోనే పిఠాపురం మహారాజా వంటి ఉత్తమ శిష్యుడ్ని ఆయన సంపాదించుకోగలిగారు. కాకినాడ లోని తమ ఎస్టేటు కళాశాలలో మహారాజాగారు ఒక గౌరవ పూర్వకమైన కేంద్రాన్ని వెంకటరత్నం గారి కోసం ఏర్పాటుచేశారు. ఒక అనాథ శరణాలయం నిర్మించడానికి నిధులమగూడా మహారాజాగారు సమకూర్చి అందులో వితంతువులకు, ఇతర సాంఘిక దురాచారాల ద్వారా బాధితులైన వారికి రక్షణ, వసతి కల్పించారు. మరొక శిష్యుడు శ్రీ ముట్నూరు కృష్ణారావుగారు ప్రఖ్యాతి వహించిన తెలుగు రచయిత, పత్రికా సంపాదకులు. ప్రముఖ వారపత్రిక కృష్ణాపత్రికకు ఆయన సంపాదకులు గా వని చేశారు. అనేక మంది విప్లవ కాంగ్రెస్ వాదులకు ఆయన గురువుగా మెలిగారు.

శ్రీ వెంకటరత్నం గారిపై ఆయన బ్రహ్మసమాజంలో చేరేనాటి కన్నా కులాన్ని విస్మరించి అంటరాని అనాథ బాలికలను దత్తత తీసుకొన్నాడు. 1910-20 సంవత్సరాలలో, గొప్ప నిరసన వెల్లువ ఆయనపై విరుచుకు పడింది. అప్పుడు ఆయన రాజకీయ సాంఘిక విషయాలతో సహా ప్రతి రంగంలోనూ ప్రముఖస్థానాన్ని ఆక్రమించిన బ్రాహ్మణ ప్రాముఖ్యానికి వ్యతిరేకంగా, దక్షిణభారతదేశంలో బ్రాహ్మణేతరులు సాంఘిక రాజకీయ సమానస్థాయి కోసం ప్రారంభించిన బ్రాహ్మణేతర ఉద్యమానికి బాగా ఆలోచించిన మీదట తన ఆశీస్సు లివ్వాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఆయన కుల దృష్టిలేని బ్రహ్మ సమాజాన్ని స్వీకరించినప్పటికి పరస్పరం కులపోరాటం జరుగుతున్న ఆ సమయంలో ఓ పక్షం వహించడానికి నిర్ణయం తీసుకొన్నారు. అనేకమంది బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమంతో ఆయన చేతులు కలపవద్దని, అది అభ్యుదయ రాజకీయ దృక్పథాన్ని దెబ్బతీయగలదని, రాజకీయ పరిణామాలు ఆలస్యంగా సంభవించేందుకు కారణం కాగలదని, రాజకీగా బాగా అభివృద్ధిచెంది అధిక ప్రాబల్యాన్ని కలిగిఉన్న బ్రాహ్మణులతో స్పర్ధ ఏర్పడి ఇంకా తక్కువ స్థాయికి దిగి పోవడానికి అది బాట కాగలదని చెప్తూ, వద్దని ఆయనను వారించారు.

శ్రీ వెంకటరత్నం గారు బలవంతంగా ఉన్న వారితో కంటె బలహీనులుగా ఉన్న వారితో ఉండాలని నిర్ణయించుకున్నారు. ఎందుకంటే ఆ కారణంతో అణగారిన స్థితిలో ఉన్న వారు పైకి వచ్చి వారికి సమస్థితి సిద్ధించగలదని, ఇప్పుడు బ్రాహ్మణ వర్గాలు అధిక ప్రాబల్యాన్ని అనుభవిస్తున్నందువల్ల వారికి వ్యతిరేకంగా ఉండడమే ధర్మమని భావించారు. ఆయన శిష్యులుగా ఉన్న అనేక మంది బ్రాహ్మణకులంలో జన్మించి వ్యక్తులు వారు బ్రహ్మసమాజికులై కులమతాలను విసర్జించి నప్పటికీ తమ గురువు శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారు అకస్మాత్తుగా కులతత్వంలో రాజీ పడ్డారని భావించారు. కొద్దమంది మాత్రం మానవత్వపు మమకారంతో దిగువ స్థాయిలో ఉన్న బ్రాహ్మణేతరులకు రక్షణ కల్పించేందుకు ఆయన ముందు కొచ్చారని తలచారు. అరుదైన అలాంటి వ్యక్తులలో శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు ప్రముఖులు.

1918 సంవత్సరంలో మద్రాసు లో ఆయన ప్రసంగిస్తున్న ఒక ప్రతినిధుల సభలో నేను విద్యార్థిగా ఉండి పాల్గొన్నాను. ఆసభలో వెంకటరత్నంగారువేదిక మీద ఉండి స్వరాజ్యమంటే నాకూ ఇష్టమేకాని అది సాంఘిక సంస్కరణలు న్యాయంతో రావాలని, సంపూర్ణ విప్లవం సిద్ధించిన తర్వాత సాంఘిక రాజకీయ సమానత్వంతో కూడిన స్వాతంత్ర్యంతో వచ్చినపుడే అది మంచిగా ఉండగలదని చెప్పారు. ఒక శతాబ్ద జీవితం కలిగిన మదరాసు విశ్వవిద్యాలయానికి, తొలి భారతీయ వైస్- చాన్సలర్‌గా వారు వచ్చినపుడు నేను తిరిగి ఆయనకు సహకరించగలిగాను. శ్రీ రఘుపతి వెంకటరత్నం నాయుడుగారిని, శ్రీ రవీంద్రనాథ ఠాగూర్ గారిన గౌరవించడం ద్వారా బ్రిటిషు వారు తాము గౌరవనీయులని పించుకున్నారు. కాకినాడ పట్టణాన్ని సాంఘిక విప్లవానికి, పాండితీ ప్రకర్షకు, మానవత్వానికి ప్రధాన కేంద్రంగా ప్రఖ్యాతి చెందేలా ఆయన చేయగలిగారు.

సాంఘిక విప్లవంలో తన సహచరుడు రాజమండ్రికి చెందిన ప్రముఖులూ అయిన శ్రీ కందు కూరి వీరేశలింగం గారి స్మృతికి నివాళులర్పిస్తూ తనకు ప్రేమ పాత్రమైన గోదావరీ నదీ ప్రవాహంలాగా ఆంగ్ల భాషపై తనకున్న అధికారాన్ని చూపిస్తూ ఈ క్రింది వాక్యాలను ఆయన చెప్పారు.

"మాటను మానవుడు సృష్టించాడనేది యదార్థం. అది అతని జీవనానికి దర్పణం ....అతనిలో, వస్తం, హృదయం ఏకమై తమ నివేదనను బాగా మలచినప్పుడు శతకృషిబలవత్తరమైన శక్తి? బయల్పడగలదు. నివేదనలోని సౌందర్యాన్ని అధికృషికి తోడించి చూపెట్టగలదు".

శ్రీమతి లక్ష్మీరఘురామ్

అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా జరుపుకుంటున్న ఈ సంవత్సరంలో, అంతర్జాతీయ మహిళ సమాఖ్యకు ఉపాధ్యక్షురాలిగా, తమ ఆడపడుచులలో ఒకరైన శ్రీమతి లక్ష్మీరఘురామ్ గారు ఎన్నికైనందుకు ఆంధ్రులంతా గర్వించవలసిఉంది. 1942లో మరొకరైతుబిడ్డ శ్రీమతి బారతీదేవి అఖిలభారత కిసాన్ కాంగ్రెసు అధ్యక్ష పదవిచేపట్టగా , 1925లో శ్రీమతి సరోజినీనాయుడు అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షురాలిగా పదవి నిర్వహించారు. శ్రీ సరోజినీ నాయుడు, శ్రీమతి కమలా దేవి చటోపాధ్యాయ, శ్రీమతి కమలా దేవి చటోపాధ్యాయ, శ్రీమతి రాజకుమారి అమృత కౌర్, శ్రీమతి కజిన్స్, శ్రీమతి రామారావు వంటి ప్రముఖులు అధిష్టించిన అఖిల భారత మహిళా సంఘ అధ్యక్ష పదవి ఒక రైతు బిడ్డ అలంకరించినందుకు భారత రైతులు, స్త్రీలు ఎంతగానో సంతోషిస్తున్నారు.

నేను చాలా పిన్న వయస్సులో ఉన్నప్పుడు, ఆమె తండ్రి స్వర్గీయ శ్రీవెంకటేశం చౌదరి గారిని గురించి విన్నాను. కృష్ణా, గుంటూరు డెల్టా ప్రాంతంలోని వాలుగు జిల్లాల కమ్మవారిలో ఉన్న ఇద్దరు తాసీల్దారులలో ఆయన ఒకరు! అప్పటికి తాసీల్దారు ఉద్యోగం అంటే గొప్ప గౌరవంగా ఉండేది. ఈ డెల్టా జిల్లాలలో అప్పుడే కాలు మోపుతున్న ఆత్మ గౌరవ ఉద్యమానికి, ఆయన బాగా ప్రోత్సాహమిచ్చారు. గ్రామోద్యోగుల కబంధ హస్తాలనుండి రైతాంగానికి స్వేచ్ఛ కల్పించాలనే., మావాదంతో ఆయన ఏకీభవించారు. కొంతమంది రైతు బిడ్డలకు భూమి కొలతలలోనూ, రికార్డు నిర్వహణలోనూ శిక్షణ ఇవ్వడంద్వారా, ఈ సమస్యకు కొంత పరిష్కారం లభిస్తుంది. ల్యాండు రికార్డు అధికారిగా ఆయన ఉన్నప్పుడు, విద్యావంతులైన కొంత మంది రైతు యువకులకు భూమి సర్వే, రికార్డుల తయారీలో ప్రత్యేక శిక్షణా తరగతులను ఆయన నిర్వహించారు. సనాతన , బ్రాహ్మణ పౌరోహితవర్గాల పలుకుబడి నుండి, రైతాంగాన్ని విముక్తి గావించేందుకు మానాయకులు, తెనాలిలో బారిష్టరుగా ప్రాక్టీసు చేస్తున్న స్వర్గీయ కవిరాజు రామస్వామిచౌదరి, మా ప్రయత్నాలతో ఏకీభవించారు.

అప్పట్లో అతి కష్ట సాధ్యమైన విదేశ ప్రయాణాలకు కావలసిన పాస్ పోర్టు, ఇంగ్లండు వెళ్లేందుకు నాకు లభించినందుకు ఆయన చాలా సంతోషించారు. అప్పట్లో నా విదేశయాత్రను పురస్కరించుకొని, నిడుబ్రోలులో ఏర్పాటుచేసిన, నా అభినందన సభకు ఆయన అధ్యక్షత వహించి, తిరిగి నేను భారత దేశం వచ్చి సప్పుడు రైతు కూలీ ఉద్యమాన్ని ప్రారంభిస్తాని చెప్పితే, నన్ను అభినందించారు.

శ్రీమతి మార్గరెట్ కజిన్స్, డాక్టర్ కజిన్స్ పుట్టుకతో ఐరిష్ దేశస్థులైనప్పటికీ, వారు భారత దేశంలో స్థిరపడి, భారతీయులుగా మారారు. ఆ దంపతులిద్దరూ దివ్యజ్ఞాన సమాజీకులు! శ్రీమతి అనిబిసెంట్ అనుయాయులైన శ్రీజె. కృష్ణమూర్తి రిషివాలీ లోని బహిరంగ కళామండపానికి కొద్ది మైళ్ల దూరంలో మాత్రమే ఉన్న మదనపల్లెలోని థియోసాఫికల్ కాలేజీలో

కజిన్స్ దంపతులు భారత యువకులకు విద్యను నేర్పుతూ ఉండేవారు, శ్రీమతి మార్గరెట్ కజిన్స్ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని 1932లో వెల్లూరులో జైలు జీవితం గడిపారు. ఆమెకు శ్రీమతి భారతీదేవి రంగా, నెల్లూరు కుచెందిన కనకమ్మ, మంబారుకుచెందిన కుట్టియమ్మ గార్లతో పాటు దక్షిణ భారతదేశానికి సంబంధించిన అనేక మంది మహిళా మణులతో సంబంధాలు ఏర్పడ్డాయి.

ఆమె జైలులో ఉన్నప్పుడు , శ్రీమతిభారతీదేవిగారికి బాగా సన్నిహితులు కాగలిగారు. యూరపు ఖండంలోని స్త్రీలు ఓటింగు హక్కు కలిగి, విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసాన్ని చేసేందుకు, పార్లమెంటు సభ్యులుగా కూడా ఎంపిక అయ్యేందుకు అవకాశాలూ వారికి ఉండి, చైతన్యంతో పురోభివృద్ధిలో ఉన్న విషయం వీరికి తెలుసు. అందువల్ల భారతదేశంలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్త్రీలను చైతన్యంచేసేందుకు ఇద్దరూ కలిసి కృషిచేశారు.

మదనపల్లె థియోసాఫికల్ కాలేజీకి అనుబంధంగా ఆమెనిర్వహణలో ఉన్న హాస్టల్ 'రుక్మిణీ విహార్' లో విద్యాభ్యాసం నిమిత్తం 'సోదరిసిస్టర్స్' అని పిలిచే లక్ష్మి, రాధలు ప్రవేశంతో శ్రీమతి కజిన్స్‌కు తెరిపి చిక్కింది. ఆమె జైలు నుంచి బయటకు వచ్చిన తరువాత 1932-33లో సాంఘిక సేవా కార్యక్రమాల నిర్వహణను ఆమె చేపట్టింది. మదనపల్లె థియోసాఫికల్ కాలేజీ శ్రీమతి అనిబిసెంట్ గారు స్థాపించారు. శ్రీమతి కజిన్స్ భర్త, ప్రసిద్ధ ఐరిష్ కవి అయిన డాక్టర్ కజిన్స్ ఆకళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. శ్రీమతిమార్గరెట్ ఇద్దరి బాలికల విషయంలో ప్రత్యేక శ్రద్ధతీసుకొని, వారికి స్త్రీ జన సముద్ధరణ కృషి పట్ల ఆసక్తి ని కలిగించింది. మహిళాభ్యుదయ, జాతీయోద్యమ బీజాలను వారి హృదయాలలో గాఢంగా నాటుకునేట్లుచేసింది. అప్పటికే సత్యాగ్రహ సమరంలో పాల్గొంటున్న శ్రీమతి భారతీదేవి, భవిష్యత్తులో నాయకురాలిగా అవతరించమన్న లక్ష్మిగార్లు ఇరువురూ అప్పటికే మహిళాభ్యుదయ కార్యక్రమాల్లో అందివేసిన నాయకురాలిగా ఉన్న ఆమె ప్రభావానికి లోనయ్యారు. సహజంగా ఆమె సౌజన్యాలను లోధించే వద్దతి పట్ల ఆకర్షితురాలై లక్ష్మి ఆమె పట్ల అభిమానాన్ని పెంచుకున్నది. కులం, మతం, రంగు భేదం, జాతిభేదం వంటి సంకుచితభావాలకు అతీతంగా, మానవతా వాదంతో , విశాలభావాలతో ప్రవర్తించే ఆమె జీవనవరిపట్ల, ఆమెలోని ఉన్నతవిలువల పట్ల లక్ష్మి ఆకర్షితురాలయింది.

ఆనాడు వెల్లూరు జైలులో శ్రీమతి మార్గరెట్ కజిన్స్ ఆమెలోటి రైతాంగ మహిళా కార్యకర్తలు మహిళాభ్యుదయానికి కన్న కలలే కార్యరూపం ధరించి, శ్రీమతి కజిన్స్ ప్రారంభించిన అఖిల భారత మహిళా సంఘానికి ఆమె శిష్యురాలైన లక్ష్మి ఈనాడు అధ్యక్షురాలిగా ఎన్నికయి, సమర్థతతో నిర్వహిస్తుంటే, ఆనాటి వారి ఆశయాలకు తగిన ప్రతిఫలం లభించినట్లయింది. వారి ఆశయం ఈ విధంగా నెరవేరి, అప్పటి మార్గరెట్ కజిన్స్, ఈనాడు లక్ష్మిలో ప్రతిఫలించి కార్య సాఫల్యత నెరవేర్చింది అని భావించవలసి ఉంది.

స్వాతంత్ర్య పోరాట కాలంనుంచీ సంఘసేవ ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని, విద్యావంతులైన మహిళా కార్యకర్తలకు ఉత్సాహ, ప్రోత్సాహాలనిస్తూ వచ్చిన ప్రముఖసంఘ సేవకురాలు శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్‌కూడా లక్ష్మికి మహిళా ఉద్యమనిర్వహణలో చక్కటి శిక్షణ ఇచ్చింది.

మద్రాసులోని ఆంధ్రమహిళాసభ, స్త్రీజన కేంద్రాల్లో లక్ష్మిగారు పనిచేవారు. దుగ్గిరాలకు చెందిన ఆమె సన్నిహిత బంధువులైన శ్రీ వి. హనుమంతరావు, వారి సతీమణి ఉదారంగా, వారి ఆస్తివంతా ఈ సాంఘిక సేవాసంస్థలకు దానంగా ఇచ్చారు. ఆవితరణ శ్రీమతి లక్ష్మి గారిని సంఘసేవకు తన జీవితాన్నే అంకితంచేసుకునేందుకు ప్రేరణ ఇచ్చింది.

శారదానికేతన్‌కు చెందిన శ్రీమతి ఉన్నవ లక్ష్మీబాయమ్మ, తెనాలికి చెందిన శ్రీమతి తాయారమ్మ మహిళా సంఘాలను స్థాపించడంలోనూ, మహిళా రాజకీయ, సేవాసంస్థలను నిర్వహించడంలో చూపించిన సాంప్రదాయాలను శ్రీమతిలక్ష్మి ఆదర్శంగా పెట్టుకొని, తన ప్రజాహిత, సాంఘికరంగంలో కొనసాగారు. నెల్లూరు కస్తూరి బాస్కూలు అండ్ కాలేజీకి చెందిన పానకా కనకమ్మ గారు, రాజమండ్రిలోని అనంత శరణాలయం, స్త్రీ సేవాసదనం, శ్రీమతి భారతీదేవి, శ్రీమతి పి. కనకమ్మ, ఏలూరుకు చెందిన శ్రీమతి యం. చుక్కమ్మ, శ్రీమతి యం. అన్నపూర్ణమ్మ గార్ల మహిళావేదికలు, వందలాది మంది మహిళా సత్యాగ్రహబృందాలు, రాజకీయ, సాంఘికరంగాల్లో వారి పిలుపునందుకొని, ముందుకు వచ్చిన వేలాది మంది వారి అనుచర మహిళా కార్యకర్తలు , సాంఘిక సేవాకార్యక్రమాలకు అనువైన వేదికలను అప్పటికే నిర్మించి పెట్టారు. అందువల్ల లక్ష్మీరఘురామ్ గారికి , తన కార్యకలాపాల్లో తక్షణ ఫలితాలు, స్పందన లభించి, ఆమె కృషి ఫలవంతమైంది. ఆంధ్రమహిళా సభ ఆధ్వర్యంలో శ్రీమతి దుర్గాబాయ్ స్థాపించిన నిర్మాణ కార్యక్రమ సేవాకేంద్రాలు, ప్రాథమికంగా అనుభవాన్ని సంపాదించుకునేందుకు శ్రీమతి లక్ష్మిగారికి మహిళా సంఘనాయకురాలిగా రూపొందడానికి కావలసిన పూర్వరంగాన్ని సంతరించిపెట్టాయి. గ్రామీణ ప్రాంతాల్లోని వేదప్రజలు, అక్కడి స్త్రీలు ఆర్థికంగా, సాంఘికంగా వెనకబడి ఉంటూ, నిమ్నస్థాయి చైతన్యం లేక, అమాయకంగా జీవిస్తూ ఉంటారని ఆమె ఆలోచించసాగింది. గ్రామీణ ప్రాంతాలలో భూములు కలిగిన ధనికస్థాయి స్త్రీలు కూడా, సరైన వైద్య సౌకర్యాలులేక, గర్భవతులకు తగిన ప్రసూతి కేంద్రాలు లేక, పల్లెలలోని బాలికలు కనీస ప్రాథమిక విద్యను కూడా అభ్యసించేందుకు అవకాశాలులేక, దైన్యపరిస్థితుల్లో జీవిస్తూ ఉన్న విషయం, తాను పుట్టిపెరిగిన అనుభవం ద్వారా, బాల్యదశనుంచి కూడా ఆమె ఎరిగిన విషయమే! స్వీయానుభవం వల్ల శ్రీమతిలక్ష్మి ప్రేరణ పొంది, శ్రీమతి మార్గరెట్ కజిన్స్ అందించిన స్ఫూర్తి ద్వారా, శ్రీమతిలక్ష్మి గ్రామీణ మహిళా సముద్ధరణకు నడుం కట్టి, దాన్నే లక్ష్యంగా పెట్టుకొని 'గ్రామీణ మహిళా సంఘం' స్థాపనకు కావలసిన పూర్వరంగాన్ని సిద్ధంచేసింది.

చాలా కాలం క్రితం 1956లో ఘంటసాలలో ఆంధ్రమహిళా సభ ప్రారంభకురాలిగా సభను ప్రారంభించేందుకు, ఆగ్రామ సర్పంచ్ అయిన శ్రీమతి జి. మహాలక్ష్మమ్మ గారు ఆమెను ఆహ్వానించారు. శ్రీమతి భారతీదేవి ఆసభకు అధ్యక్షత వహించారు. శ్రీమతి లక్ష్మి సాహిత్యంలో కూడా చక్కని రచయిత్రి గా ప్రసిద్ధిచెందారు . అభ్యుదయకరమైన నవలలు, రచించి ప్రసిద్ధ రచయిత్రిగా ఉన్న ఆమెను , శ్రీమతి దుర్గాభాయ్ దేశ్‌ముఖ్, తాను నడుపుతున్న తెలుగు మాసపత్రిక "ఆంధ్రమహిళ"కు సంపాదకురాలిగా ఉండేందుకు ఆహ్వానించారు. మద్రాసులోని ఆంధ్రమహిళాసభనుంచి, తన కార్యరంగాన్ని ఆమె ఢిల్లీలోని ఆంధ్ర సంఘానికి మార్చుకొన్నారు.

అప్పట్లోజాతీయ ప్రణాళికా సంఘములో సభ్యురాలిగా కొనసాగుతున్న శ్రీమతి దుర్గాభాయ్ ఢిల్లీ లో శ్రీమతి లక్ష్మికి మార్గ దర్శకురాలిగా, తోడుగా నిలిచారు. ఉన్నత భావాలుగల శ్రీ సి.డి. దేశ్‌ముఖ్ తిరిగి ఆమెను సాంఘిక సేవాకార్యక్రమాల్లో పాల్గొనాల్సిందిగా సూచించారు. 1935లో మావంటి కొందరు ఆంధ్రనాయకులచే ఢిల్లీలో స్థాపించిన ఢిల్లీ ఆంధ్ర సంఘంలో చేరి, శ్రీమతి లక్ష్మీరఘురామ్ దానికి అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. దాని తొలి అధ్యక్షులుగా దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు ఉండగా, మొదటి మహిళా అధ్యక్షురాలిగా శ్రీమతి లక్ష్మీరఘురామ్ ఎంపిక అయ్యారు. ఆంధ్రసంఘ కార్యదర్శి, ఉత్సాహవంతుడైన శ్రీ కోదండరామయ్య, ఢిల్లీనగరంలోని మరి కొందరి మహిళా నాయకురాండ్రతో కలిసి, దాని రజితోత్సవ కార్యక్రమాలను శ్రీమతిలక్ష్మి రఘురామ్ నిర్వహించే అవకాశాన్నిపొందింది. ఆకార్యక్రమాలకు అధ్యక్షత వహించవలసిందిగా ఆదరంగా ఆమె నన్ను కోరారు. ఆంధ్రసంఘంలో ఆమె మనస్ఫూర్తిగా చేసిన సేవాకార్యక్రమాలు, సమర్ధత వల్ల ఆతరువాత ఆమె అఖిల భారత మహిళా సంఘాధ్యక్షురాలిగా ఎంపిక కావడానికి తోడ్పడ్డాయి. ఆ స్థానాన్ని పొందిన తొలి తెలుగు మహిళ ఆమె.

అఖిల భారత మహిళోద్యమ నాయకురాలిగా శ్రీమతి లక్ష్మీ రఘురామ్ అవతరించే నాటికి భారత ప్రభుత్వం స్త్రీలకు ఓటు హక్కును కల్పించింది. ఇంగ్లీషు మహిళలు ఈ హక్కుల కోసం, అక్కడ ఐదు దశాబ్దాలుగా పోరాడుతున్నారు. తమ తల్లిదండ్రుల, భర్తల ఆస్తిలో, వాటా కావాలనే మహిళల కోర్కెను, భారత జాతీయ నాయకులు అంగీకరించారు, హిందూ లా కు పటాస్కరు గారు ప్రవేశపెట్టిన సవరణ బిల్లు ఆమోదంపొంది. దాని ద్వారా విడాకులు పొందిన స్త్రీలు, చనిపోయిన తన భర్త ఆస్తికి సహజంగానే వారసులయ్యే అవకాశాన్ని పొందగలిగారు, భారతీయ స్త్రీలు, అన్ని రంగాలలో, సాంఘికంగా రాజకీయంగా కూడా బాగా ముందుకు వచ్చారు. ఈనాడు మంత్రులు, రాయబారులు, ముఖ్యమంత్రిత్వం వంటి ఉన్నత పదవులను నిర్వహించే స్థితిలోనికి వచ్చారు. ఈ మహిళా హక్కుల సాధనకు పశ్చిమదేశాల స్త్రీలు, లేడీ ఆస్టర్, శ్రీమతి పెథిక్ లారెన్స్ వంటి వారు అక్కడ దశాబ్దాలుగా పోరాటం సాగిస్తున్నారు. భర్తను కోల్పోయిన స్త్రీలు పునర్వివాహం చేసుకునేందుకు, విడాకులు పొందేందుకు హక్కులు కల్పించారు. విశ్వవిద్యాలయాల్లో వైద్యం, పరిశోధన వంటి అంశాల్లో సాంకేతిక సంస్థల్లో మనకు స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత స్త్రీలకు మరిన్ని అవకాశాలు కల్పించారు.

పంచవర్ష ప్రణాళికల ద్వారా, చట్ట పరంగా స్త్రీలకు కల్పించి అవకాశాలు, నిత్య జీవితంలో స్త్రీలకు ఇంకా అనుభవంలోకి రాలేదు. ఆర్థిక పరమైన అవకాశాలూ, సాంఘికంగా ఏర్పడిన హక్కులు కూడా పట్టణాల్లో వైతన్యవంతమైన స్త్రీలకు వచ్చినంతగా, సామాన్యస్త్రీలకు ఉపయోగంలోకి రాలేదు. ఇలా కల్పించిన ఈ అవకాశాలు బాగా ముందుకు వచ్చిన స్త్రీలు కూడా గ్రామీణ ప్రాంతాలలో అనుభవించలేక పోతున్నారంటే ఆశ్చర్యపడవలసిన అవసరంలేదు.

శ్రీమతి లక్ష్మీరఘురామ్ సాంఘిక సేవారంగంలో విశిష్టమైన సేవలు చేస్తూనే, తన తండ్రిగారు అభిమానించిన ఆత్మగౌరవ ఉద్యమాన్ని ఆమెకూడా కొనసాగించి, దానికోసం కృషి

చేశారు. బారిష్టరు రామస్వామి గారు కొనసాగించిన శక్తివంతమైన ఈ ఉద్యమాభివృద్ధికోసం, ఆమె కూడా తోడ్పడ్డారు. స్త్రీలందరకూ సమాన ఆస్తి హక్కులు ఉండాలని ఆమె కోరారు. తల్లిదండ్రులుగాని, భర్తగాని, లేదా భూ పరిమితి చట్టాలు గాని ఎవరూ ఏవిధంగా స్త్రీధనాన్ని ముట్టుకోరాదని ఆమె గట్టిగా వాదించారు. స్త్రీలు కూడా వేదశాస్త్రాలను, మంత్రాలను అభ్యసించాలని ఆమెకోరారు. స్కాండినేవియా దేశంలో బాగా ముందుకు వచ్చిన స్త్రీలు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. యూరపుదేశాలలో ఈ సందర్భంలో కనపరుస్తున్న వ్యత్యాసాన్ని తొలగించాలని ఇప్పటికీ పోరాడుతున్నారు. విద్యా ఉద్యోగవిషయాల్లో స్త్రీలకు కూడా సమాన హక్కులు అవకాశాలు ఉండాలని ఆమె కోరారు. కులవిభేదాలు, స్త్రీ పురుష వ్యత్యాసాలు పూర్తిగా అంతరించాలని, అన్ని కులాలు, మతాలు, తెగల ప్రజలు, స్త్రీ, పురుషులంతా సమానమైన గౌరవాలు, అవకాశాల్ని, హక్కుల్ని కలిగివుండాలని ఆమె అభిలషించారు. ఈ ఆదర్శాలన్నీ 'ఆత్మగౌరవం ఉద్యమం' కోరినట్టివే ! సాంఘికంగా ప్రజా స్వామ్యయుతమైన ఈలక్ష్యాలన్నిటినీ గాంధేయ వాదులమైన మాలాంటి వాళ్లం, అనేకమంది స్త్రీలు పురుషులతో సహా ప్రస్తుతించి, గౌరవించాం! శ్రీమతి లక్ష్మీరఘురామ్ మేము చేపట్టిన అభ్యుదయకరమైన ఉద్యమాల్లో పాల్గొని, ముందుకు నడిచి, గాంధీ, నెహ్రూయుగాల్లోని అభ్యుదయ పూరితమైన వాతావరణాన్ని నిలబెట్టేందుకు కావలసిన కృషిని ఉత్సాహవంతంగా, సమర్థవంతంగా నిర్వహించిన ఆమె దీక్షా దక్షతలను నేను అభినందిస్తున్నాను.

ఆంధ్ర మహిళ ప్రత్యేక సంచికలో అఖిల భారత స్థాయిలో పేరు ప్రఖ్యాతులు పొందిన ఆరుగురు మహిళల కుటుంబ జీవితాలను, భర్తలతో కలిసి ఇంటా, బయటా వారు ఎలాంటి సుఖమయమైన జీవితాన్ని గడుపుతున్నారో, యువ మహిళలు తెలుసుకొని, ఆచరించేందుకు అనువుగా ఆమె ప్రచురించింది. ఈ ఆరుగురు శ్రీమతి కస్తూరిబా, శ్రీమతి సరోజినీదేవి, శ్రీమతి సుచేతా, శ్రీమతి దుర్గాబాయ్, శ్రీమతి భారతీదేవి , శ్రీమతి లీలావతి గారలు! విద్యావంతురాండ్రైన బాలికలు సాంఘిక సేవా కార్యక్రమాల్లో ప్రవేశించబోయే ముందు, ఆమెను సంప్రదించి, ఆమెద్వారా ప్రోత్సాహాన్ని పొందుతూఉండేవారు.

పశ్చిమ దేశాల స్త్రీలు కుటుంబ బాధ్యతలను గుర్తించి ప్రవర్తించడం, బాలికలు కుటుంబ వాతావరణంలో ఉండే క్రమశిక్షణ ను గాలికి వదిలి వేసి, ఏచ్ఛలవిడిగా ప్రవర్తించడం జరుగుతోంది. భవిష్యత్తరాలకు ఒక హెచ్చరికలా, పశ్చిమదేశాలు అనేక మార్గాల్లో మిశ్రమ సమాజంవైపు సాగిపోతున్నాయి. అలాంటి వ్యతిరేక మార్గంలో నడవడానికి మనం ఇష్టపడతామా? మన ప్రజలు, స్త్రీలు ముఖ్యంగా బౌద్ధమానవ ధర్మాన్ని, తమ జీవన లక్ష్యంగా ఎంచుకొని నడుస్తున్నారు. మన సామాజికాభివృద్ధికి, సాంఘిక బాధ్యతలు కలిగిన పరస్పర అనురాగ పూరితమైన వివాహ వ్యవస్థ అగత్యాన్ని మనం మరిచిపోలేం. పాశ్చాత్య జిజ్ఞాసపరులకు వారి భవిష్యత్తును గురించి వారికే సందేహాలు ఉన్నాయి. మనం కూడా ఇలాంటి భయాలను కలిగి ఉండవలసిన అవసరంఉందా? తమ భార్యల హక్కులను, వ్యక్తిత్వాన్ని నిర్లక్ష్యపరుస్తూ, వారి పట్ల నిరంకుశంగా వ్యవహరించే హక్కు పురుషులకు ఉన్నదా? భర్తల పట్ల, పిల్లల యెడల తమకున్న బాధ్యతలను విస్మరించి, కుటుంబ జీవితంలో ఉండే మాధుర్యాన్ని మరిచిపోయి, తమ ఇష్టం

వచ్చిన రీతిగా స్వేచ్ఛానువర్తులు గావడం మంచిదికాదు. ఆసియా స్త్రీలు, నవీన సమాజ నిర్మాణంలో, జీవన సామకూల ధోరణితో ఉన్నారు. సంఘంలోను, కుటుంబంలోను స్త్రీ పురుషుల మధ్య పరస్పర గౌరవాదరణలతో కూడిన, అభ్యుదయకరమైన సంబంధాలను కలిగి ఉండేందుకు వారు కృషిచేస్తున్నారు. శ్రీమతిలక్ష్మీరఘురామ్ భారతీయ అర్ధనారీశ్వరతత్వాన్ని పూర్తిగా అవగతం చేసుకొని, ఆచరణ సాధ్యమూ, అభ్యుదయకరమూ అయినా రీతిలో దాన్ని భారతీయ స్త్రీల హక్కుల సాధనకు అన్వయింపజేస్తున్నారు. ప్రపంచ జనాభాలో సగానికి పైగా ఉన్న స్త్రీలకోసం, వారి హక్కుల కోసం ఆమె సాగిస్తున్న ఈ కృషి ఫలప్రదం గావాలని మనం మంతా అభిలషిద్దాం!

శ్రీ పి. రాజగోపాలనాయుడు (రాజన్న)

భారతదేశంలో నానాటికి నైతిక విలువలు దిగజారిపోతున్నాయని, మన రాష్ట్రపతి సర్వేపల్లిరాధకృష్ణన్ గారు ఒకసారి దేశ ప్రజలనుద్దేశించి హెచ్చరిక చేశారు. ఒక్కో సంవత్సరం గడిచే కొద్దీ, కోటాలు, లైసెన్సులు, పర్మిట్లను సంపాదించి, శాసన సభ్యులు, మంత్రులతో సన్నిహిత సంబంధాలను ఏర్పరుచుకొని, తద్వారా సునాయాసంగా లక్షలు గడించాలనే తపన ప్రజలలో ఇనుమడిస్తోందని రాజాజీగారు భయాందోళనను వ్యక్తంచేశారు. మరోవైపు ఇలాంటి అక్రమమార్గాలలో నడవని నిజాయితీపరులు అక్కడక్కడా కొద్దిమంది లేకపోలేదు గానీ, వారి ప్రభావం నేటి యువతరం మీద అంతగా ప్రతిఫలించలేదనే చెప్పాలి.

1920-45 సంవత్సరాల మధ్య దేశ స్వాతంత్ర్యంకోసం తమ సర్వస్వాన్ని వదలుకొని, జైలు శిక్షలు అనుభవించిన త్యాగధనులకు, స్వాతంత్ర్యం లభించిన తరువాత పదవులకోసం, సంపాదనకోసం తాపత్రయ పడుతున్న వారిని చూసినప్పుడు కంపరంపుడుతూ ఉంటుంది, ఈనాడు శాసన సభ్యులకు, మంత్రులకు సైతం ఈ అవినీతి జాడ్యం అంటుకుంది, ఇలాంటి అవినీతి కార్యక్రమాలను గమనించి, వీటి పరిష్కారానికి మార్గంగా లోక్‌పాల్, లోకాయుక్తలను నియమించడానికి మేముచేసిన సూచనలకు, రాజకీయరంగంలో తగిన ప్రతిస్పందన రాలేదంటే ఆశ్చర్యమేస్తున్నది.. కొద్దిమంది మంత్రులు, శాసన సభ్యులు మాత్రమే ఈ అవినీతి దుర్గంధానికి దూరంగా ఉంటూ, నిజాయితీతో తమ ఆస్తుల వివరాలను ప్రకటించారు.

ఇప్పటికీ ఈ దేశంలో, రాజకీయ రంగంలో ఉంటూ తమ జీవితాన్నంతా ప్రజాసేవకే అంకితం చేస్తూ, స్వరాజ్యం వచ్చిన తరువాత పెరిగిన అధికార దాహానికి, ఆస్తుల సంపాదనకీ దూరంగా ఉంటున్న గాంధేయ వాదులు అక్కడక్కడా కొద్దిమంది మిగిలి ఉన్నారు. అట్లాంటివారిలో చిత్తూరు జిల్లా వారైన రాజన్నగా పేరున్న, శ్రీ రాజగోపాలనాయుడు, విశాఖపట్నానికి చెందిన శ్రీ సన్యాసిరావు, పలనాటివాసి శ్రీ కావూరి వెంకయ్య ఉన్నారు. గుంటూరు జిల్లాకు చెందిన శాసన సభ్యులు శ్రీ యడ్లపాటి వెంకట్రావు, శ్రీ కందిమల్ల బుచ్చయ్య (మాజీ శాసన సభ్యులు)గార్లు ఇరువురూ తమ పితార్జితాన్ని వ్యయం చేసుకుంటూ, ప్రజాసేవచేస్తూ, రాజన్న గారికి సరిసమానంగా పేరుపొందారు. సర్వోదయ కార్యకర్తల ప్రజాజీవితం నిష్కళంకమైనదే, అయినప్పటికీ రాజకీయపరమైన ఒత్తిడులు, డబ్బు సంపాదనతో వారికి ప్రమేయం ఉండదు.

రాజన్న ప్రజాసేవారంగంలో, గాంధేయ మార్గంలో పయనిస్తూ, సత్యాన్ని, ధర్మాన్ని అనుసరిస్తూ, ఉన్నత విలువల్ని సంతరించుకున్నారు. గత మూడు దశాబ్దాలుగా ఆయన ప్రజాసేవారంగంలో ఉంటూ గౌరవ ప్రతిష్ఠలను సంపాదించుకున్నారు. ఆయనకు మంత్రి పదవి లభించిఉంటే, సమర్థులైన మంత్రిగా రాణించి ఉండేవారు. కృషికార్ లోక్ పార్టీ, స్వతంత్ర పార్టీలలో కొనసాగుతూ, ఆపార్టీల శాసన సభ్యులలో ప్రథమ శ్రేణిలో గుర్తింపు పొందిన

శ్రీ రాజగోపాలనాయుడుగారు, రాజకీయ కార్యకలాపాల్లో సర్దార్ లచ్చన్నకు విశ్వాసపాత్రునిగా ఉండేవారు.

శ్రీ రాజన్న చిత్తూరు జిల్లా రంగా అగ్రహారానికి చెందినవారు. ఆయన మంచి వక్త. గ్రామీణ సమస్యలపైనా, రైతాంగ విషయాల మీదా ఆయన ప్రత్యేక శ్రద్ధాసక్తులు కన పరిచేవారు. ప్రగడ కోటయ్య గారిలాగే, రాజన్న కూడా అనుభవం గడించారు. శాసన సభ్యులుగా ఇద్దరూ అవిశ్రాంతంగా కృషిచేసేవారు. క్రమశిక్షణ శ్రద్ధాసక్తులతో ప్రజాసేవలో నిమగ్నమై ఉండేవారు. కోటయ్య గారు చేనేత కార్మికులపై సమస్యలపై ప్రధానంగా కృషి చేస్తున్నప్పటికీ రైతాంగ సమస్యలను నిర్లక్ష్యపరిచేవారు కాదు. రాజన్న గ్రామీణ సమస్యల పరిష్కారానికి పూర్తికాలాన్ని వినియోగిస్తూ ఆ ప్రాంతాల రైతుల, చేనేత పనివారి, హరిజనుల, వ్యవసాయ కూలీల సంక్షేమానికి పాటు పడేవారు. రాజన్న పిన్న వయస్కులు. కోటయ్యగారి కంటే, పది సంవత్సరాల వెనుక రైతాంగ విద్యాలయంలోనూ ప్రజాసేవారంగంలోనూ ప్రవేశించారు. వీరిద్దరూ మంచి స్నేహితులుగా ఉండేవారు. స్వార్థరహితంగా ప్రజాసేవ చేయడంలో ఆసక్తి ఉన్నవారు. 1943లో ఆయన డిగ్రీ పుచ్చుకొన్న తరువాత, స్వయంకృషితో తెలుగు సాహిత్యంలో చెప్పుకోదగ్గ స్థాయిని సంపాదించారు. చరిత్ర పఠనంలో ఆయనకు ఆసక్తి ఉండేది. తెలుగులో ఆయన రచించిన "రామానుజా చార్యులు", 'కురుక్షేత్రకాలం నాటి నాగరికత" గ్రంధాలు ఉన్నత శ్రేణికి చెంది ఉన్నాయి. యువకులకు ఆదర్శప్రాయంగా ఉండేట్టుగా, కవి, రచయిత, భక్తాగ్రేసరులూ అయిన శ్రీ కె. సభా, రాజగోపాలనాయుడూ యువకవులకూ, రచయితలకూ అండగా ఉంటూ, రచయిత సహకార సంఘాలు నిర్వహిస్తూ, రచయితలను ప్రోత్సహిస్తూ, వారి గ్రంధాలను ప్రచురిస్తూ, తోడ్పడుతూ ఉండేవారు నక్సలిజం సిద్ధాంతంలో నమ్మకం ఉన్న వారిని మినహాయిస్తే, మిగతా తెలుగు యువరచయితలకు సన్నిహితంగా ఉండే రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకులలో ఆయన ఒకరు.

1960 నుంచీ మన రైతాంగ విద్యాలయాల నిర్వహణా కార్య క్రమాల్లో రాజా ప్రముఖ పాత్ర వహిస్తూ ఉండేవారు. స్థానికంగా వారం వారం, జిల్లా స్థాయిలో కొన్ని వారాలకు ఒక సారి శిక్షణా తరగతులను ఆయన నిర్వహించేవారు. తొలి దశాబ్దాలలో లక్ష్మీనారయణ గారితో దీటుగా, ఉన్నత స్థాయిలో రాజగోపాలనాయుడుగారు కూడా కృషిచేశారు. "రైతాంగ విద్యాలయ' ఆచార్యునిగా ఆయన మా అందరి ప్రశంసల్ని అందుకున్నారు.

రైతాంగ విద్యాలయ వేదిక మీద బోధనా సరళిలో ప్రసంగించినట్లే, 'రాజా' శాసన సభావేదికలో మైక్ ముందుకూడా అదే ఒరవడిలో మాట్లాడేవారు. తాను ప్రసంగించే అంశాలను మృదు మధురమైన శైలితో సభ్యుల హృదయాలను ఆకట్టుకునేట్టుగా ఉపన్యసించేవారు. ప్రతి ప్రశ్నను పండితునిలా అధ్యయనం చేసి, హైకోర్టులో వాదనకు సిద్ధ పరిచినట్టుగా ఆయన వ్యవహరించేవారు. తన వాదనను ఎదుటివారు సమ్మతించేవిధంగా, సంస్కారంతో, నిశ్చలంగా ప్రతిపాదిస్తారు. ఆయన వాదన విన్నప్పుడు మంత్రి వర్యులు కనీసం అర్ధాంగీకారాన్ని తెలియజేయక తప్పేదికాదు. తన వ్యక్తిగత విషయాల్లో ధనాన్ని ఎంత నిర్లక్ష్యంగా వ్యయపరుస్తారో, ప్రజ ధనాన్ని వెచ్చించే సందర్భంలో అంత జాగ్రత్త తీసుకుంటారు. అధిక

14606
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6

మొత్తంలో విరాళాలు వసూలుచేసే, చాలా మంది కార్యకర్తల్లా కాకుండా, ఆయన చాలా పరిమితంగా వసూళ్లు చేసేవారు. ఆ కార్యక్రమాన్ని అరుదుగా మాత్రమే ఆయన చేపట్టేవారు. అందువలన కరువులు, వరదలు సంభవించినప్పుడు, భారతీదేవి సహాయకచర్యలను, అమలుజరిపే బాధ్యతను రాజాకు అప్పగిస్తూండేది. ప్రజా ధనాన్ని చాలా జాగ్రత్తగా, సంస్కార పద్ధతిలో వినియోగించడంలో రైతునాయకులు శ్రీ గొట్రపాటి వెంకట సుబ్బయ్య ప్రథమ శ్రేణిలో ఉంటారు. రాజన్న రెండవ వారుగా లెక్కకు వస్తారు. రాజాకు ప్రజా స్వామ్యంపట్ల అభిమానం మెండుగా ఉండేది. అలాంటి సంస్కారులు వేళ్లమీద లెక్కించ దగినంత మంది కూడా మనకు కనిపించరు. నియంతృత్వ వాదులతో కలిసి ప్రయాణం చేయవలసిన అగత్యం ఆయనకు లేదు. వారి వ్యతిరేక ప్రచారాన్ని ఎదుర్కోవడానికి ఆయన ఎప్పుడూ జంకేవారు కాదు. అలా అని వారితో వివాదపడడానికి కూడా తొందరపడరు.

1969లో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ఉద్యమాన్ని, 1973 లో జరిగిన ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాన్ని, శ్రీ ప్రగడ కోటయ్య, లచ్చన్న గారితో పాటు, ఆయన కూడా బలపరిచారు. మద్యపాన నిషేధాన్ని పూర్తిగా అమలు జరిపినందున కల్లు గీత పనివారు నిరుద్యోగంపాలు కాగలరని, ప్రత్యామ్నాయం చూపకుండా మద్యపాన నిషేధాన్ని విధించరాదని, కల్లు గీత పనివారు ప్రారంభించిన నిరసన కార్యక్రమంలో పాల్గొని 1953లో ఆయన జైలుకు వెళ్లారు. 1962-63లో భూమిశిస్తుపెంపుదలకు వ్యతిరేకంగా, ఆయన సత్యాగ్రహం చేశారు. సుప్రీంకోర్టులో రైతుల పక్షాన నిలిచి, లచ్చన్నగారితో కలిసి పోరాడారు.

ప్రధాని జవహర్లాల్, రాష్ట్ర ముఖ్యమంత్రి సంజీవరెడ్డి సవాళ్లకు ఎదురు నిలిచి, పార్లమెంటు ఎన్నికలలో నేను పోటీ చేసినప్పుడు, శ్రీ రాజన్న, శ్రీ యన్.వి.నాయుడు, తిరుపతికి చెందిన శ్రీ ఈశ్వరరెడ్డి నాకు మద్దత్తునిచ్చి, గట్టిగా తోడ్పడారు. అప్పట్లో కమ్యూనిస్టుల సహకారంతో కాంగ్రెసే పార్టీ నన్ను ఓడించినప్పుడు, చిత్తూరు ఉప ఎన్నికల్లో పోటిచేయవలసిందిగా నన్ను, ఆయన ఆహ్వానించారు. సర్గీయులైన పి.వి.కృష్ణయ్యనాయుడు, వారి అనుచరుల తోడ్పాటుతో రాజన్నగారు నావిజయానికి అవిశ్రాంతంగా శ్రమించారు. ప్రజలలో రాజన్న గారికి మంచి ఆదరణ ఉంది. ఆయన అనుచరులు బాగా చురుకైనవారు. అందువలనే ముఖ్యమంత్రి సంజీవరెడ్డి, ఆయనకు నమ్మకమైన అనుచరుడైన తిమ్మారెడ్డిగార్లకు అనుకూలమైన చోట్లకూడా మాకు వ్యతిరేకంగా మెజారిటీని సంపాదించుకోలేక పోయారు. చిత్తూరు పట్టణంలో 20మంది మంత్రులు ఇంటింటి కీ తిరిగి ప్రచారం చేసినప్పటికీ, ప్రభుత్వపరంగా అధికార దుర్వినియోగానికి పాల్పడినప్పటికీ, నేను ఎన్నికయ్యాను. నియమనిష్ఠతో కూడిన జీవితాన్ని, గాంధేయ పద్ధతిలో ప్రజాసేవాభిలాష, హరిజన, గిరిజన ప్రజలకు హృదయ పూర్వకమైన సేవానురక్తి, కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంత ప్రచారం కొనసాగించి, అవిశ్రాంతంగా కృషిచేసే శ్రీ రాజన్నలో ఇన్ని లక్షణాలు మూర్తీభవించి ఉండి, అపారమైన ప్రజాదరణ పొంది, మేము ఊహించనంత ఫలితాల్ని సంతరించి పెట్టాయి. అవతలి పక్షం లక్షలాది ధనాన్ని ఖర్చుచేసినా, మంత్రుల అధికార దుర్వినియోగం కన్నా, రాజన్నగారి పట్ల ఉన్న ప్రజాభిమానం ఎక్కువ విలువైదిగా నిర్ధారణ పొందింది.

రాజా 1947 లో శివగిరి లోనూ, 1953లో తిరుత్తణిలోనూ, రెండుసార్లు రైతాంగ విద్యాలయ వార్షిక సభలను నిర్వహించారు. 1946లో మద్రాసులో మేము నడిపిన రాజకీయ పాఠశాలకు రాజన్న గారి సతీమణి ముఖ్య మైన నిర్వాహకురాలిగా ఉన్నారు. దురదృష్టవశాత్తూ ఒక బిడ్డను వదలి పెట్టి, ఆమె ఈ లోకాన్ని విడిచి వెళ్లి పోయింది. రాజా తిరిగి వివాహం చేసుకోకుండా కుమార్తెను పెంచి పెద్దచేసి, మా కిసాన్ ఉద్యమ అభిమానియైన ఒక ఇంజనీరుకు ఇచ్చి వివాహం జరిపి, ఉన్నతవిద్యాభ్యాసం నిమిత్తం ఆ దంపతులను అమెరికా పంపారు. వారి ఆహ్వానం మేరకు ఆయన 1974లో అమెరికా వెళ్లి, అక్కడున్న మూడు మాసాల కాలంలో, అమెరికా వ్యవసాయ క్షేత్రాలను గురించి ప్రత్యేక పరిశోధన సాగించారు. అమెరికాలోని రైతులు, అక్కడి ప్రభుత్వం పరస్పరం ఎట్లాంటి సంబంధాలను కలిగి ఉన్నారో, ముఖ్యమైన నాలుగు వ్యవసాయ దారుల సంఘాలు, సహకార సంఘాలు, బ్యాంకులతో, ఎట్లాంటి వ్యవహార సంబంధాలను కలిగివున్నాయో ఆయన ఆమూలాగ్రంగా పరిశీలించారు. అక్కడి వ్యవసాయదారుల నాయకులను, 4 హెచ్ క్లబ్బును, ఫ్యూచర్ ఫార్మర్స్ యూనియన్‌లను, ఆయన సందర్శించారు. అనేక తెలుగు వార పత్రికలలో తన అనుభవాలను రాస్తూ, మన దేశ వ్యవసాయ రంగానికి, వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధికి వివరణాత్మకమైన సూచనలను అందజేశారు.

సమర్థుడైన శాసన సభ్యునిగా, తనకు చెందిన చిన్న కమతంలో వ్యవసాయంచేసిన రైతుగా, బాధ్యతాయుత మైన అనుభవాన్ని గడించిన రైతు నేతగా, ఆయన ఎదిగారు. జాతీయ రంగంలో సంస్కారవంతంగా, రాజకీయంగా, విశిష్ట వ్యక్తిత్వంగల రాజకీయనాయకునిగా రూపొంది, ఆంధ్రప్రాంతంలోనూ, దక్షిణాది రాష్ట్రాల్లోని స్వీయవృత్తులతో జీవనం సాగించే ప్రజలకు మార్గదర్శకుడిగా ఉన్నందుకు రాజన్నను ప్రత్యేకంగా అభినందిస్తున్నాను.

నెహ్రూశకంలోని భారతదేశానికి ఇట్లాంటి ప్రజాసేవానురక్తిగల కార్యకర్తల అవసరం ఎంతైనా ఉంది. ఇట్లాంటి వారు తమకు తాముగా ధనార్జన చేసుకోవడంగానీ, స్వతంత్రంగా ఆర్థిక ప్రతిపత్తిని ఏర్పాటు చేసుకోవడంగానీ, జరగదు.

ఆంధ్రప్రాంతంలోని చిన్న వర్తకుల నాయకులైన శ్రీ కె.రోశయ్య(యం.యల్.సి), శ్రీ యడ్లపాటి వెంకట్రావు(యం.ఎల్.ఎ.), నాగార్జునసాగర్ కృష్ణా డెల్టాలనుండి మాజీ శాసన సభ్యులైన శ్రీ కె.బుచ్చయ్య, శ్రీ యం.నాగయ్య, శ్రీ కొండయ్య, శ్రీ ఈశ్వరరెడ్డి, శ్రీ బి. శివయ్యగారలు, కళింగపేమ నుండి మాజీ శాసన సభ్యులైన శ్రీ సిమ్మాజగన్నాధం, మాజీయం.పి శ్రీ వి.వి.రమణ, తదితరులూ, సీనియరు నాయకులైన శ్రీ గోగినేని లక్ష్మీనారాయణగార్లు ప్రజాసేవలో తమకున్న కొన్ని భూముల్ని, తమ ఆదాయంలో హెచ్చు మొత్తాన్ని, పిత్రార్జితంలో కొంత భాగాన్ని వినియోగించారు. ఇట్లాంటి వ్యక్తులకు సహాయపడేందుకు భారతసేవక్ సమాజ్, అంతకు ముందు ఉన్న గాంధీ సేవా సంఘ వంటి సంస్థలు ముందుకు వచ్చి వారి కనీస అవసరాల నిమిత్తం, వారి కర్తవ్య నిర్వహణకు అవసరమైన నిధుల్ని సమకూర్చ గలిగితే, ఇక ముందుకూడా యీనాయకులు ప్రజా సేవలో మరింతగా రాణించి, ఉత్తమ నాయకులుగా వ్యవహరించే అవకాశం ఉంటుంది. అయితే ఇందుకు ఎవరు పూనుకుంటారు? నిధులు వసూలు చేసేదెవరు? వాటినిసక్రమంగా పంపిణీ చేసేదెవరు? కార్యకర్తలను నడిపించేదెవరు?

కుల, మత, ప్రాంతీయ తత్వాలకు అతీతంగా ఈ నాయకులందర్నీ సమానంగా గౌరవించి, ప్రోత్సహించేవారున్నారా? చాలా కాలం నాటి సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ ఇటువంటి కృషిని సాగించడం అసాధ్యమంటూ అభిప్రాయపడింది. పార్టీ రహితంగా సేవచేసే సాంఘిక, రాజకీయనాయకులకు, మతాధిపతులకు, గాంధేయ, సోషలిస్టు నాయకులకు ఇలాంటి సమస్య ఎదురైతే వారిని ఆదుకోవడం ఎలా అంటూ తీవ్రంగా ఆలోచించవలసి వచ్చింది.

ఇటీవల వివేకానందరాక్ మెమోరియల్ కమిటీ ఈ బాధ్యతలను భుజాన వేసుకోవడానికి ప్రయత్నించింది. ఇట్లాంటి సంస్థల నిర్వహణకు, గొప్పవైన కొన్ని బాధ్యతల నిర్వహణకు రాజన్న గారి వంటి కార్యకర్తల అవసరం ఎంతైనా ఉంది. అట్లాంటి అధికారం లభిస్తే దాన్ని గౌరవప్రదంగా నిర్వహించగలుగుతారా?

బి.యస్.యస్.

1944 నవంబరులో నాతో మాట్లాడుతున్నప్పుడున్నూ, ఆ తరువాత ఆయన రాసిన వాటిలోను, మహాత్మాగాంధీగారు, పార్టీల ప్రమేయం లేని సాంఘిక సేవా కార్యకర్తలను సమీకరించి, ఒక సమాజసేవా సంఘాన్ని ఏర్పరిచి దాని ద్వారా నిర్మాణ కార్యక్రమాలను అమలు జరపాలని తెలియజేశారు. ఆయన కోర్కెలకు జవాబుగా శ్రీ గుల్జారీలాల్ నందా, నేను, మరి కొంతమంది కలసి భారత్ సేవక్ సమాజ్‌ను స్థాపించాలనే అభిప్రాయానికి వచ్చాం. శ్రీ జవహర్లాల్ దానికి వ్యవస్థాపక అధ్యక్షులుగా ఉండేందుకు అంగీకరించారు. నిర్మాణ కార్యక్రమాలకే పరిమితమై, పార్టీరహిత నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొంటున్న. సంఘసేవకులను ఇందుకోసం పోగుచేయాలని మేము తలపెట్టాం. నిర్మాణ కార్యక్రమాలకు పూర్తిగా నిధులు ఇవ్వగలిగిన స్థితిలో లేనందున. గ్రామీణ ప్రాంతాలలో ఈ గాంధేయ కార్యకర్తలు తమ ప్రచారంద్వారా, నచ్చచెప్పడం ద్వారా ప్రజలను ఒప్పించి శ్రమదానం, వస్తుదానం రూపంలో సగం దాకా సమకూర్చుకొనేలాగుచేసి, మిగిలిన నిధులను ప్రభుత్వంద్వారా ఇప్పిస్తూ సామాజిక అభివృద్ధికి అవసరమైన పనులను పూర్తిచేయాలి. ఆ విధంగా మేము దేశవ్యాపితంగా వేలాది మంది కార్యకర్తలను బి.యస్.యస్. యూనిట్లలో చేర్చుకొని వారి ద్వారా మంచి కృషి చేయటానికి పూనుకొన్నాము. శ్రీ రాజన్న, శ్రీ వి.ఎల్. సుందరరావు, శ్రీ జి.సన్యాసిరావు, శ్రీ యం.బాపినీడు, శ్రీ హనుమంతరావు, శ్రీ అప్పారావు గారలు, అలాంటి మరి కొందరు మంచి కార్యకర్తలు జిల్లా స్థాయి, ప్రాంతీయ నిర్వాహకులుగా ఉంటూ సేవజేశారు. ప్రతి రాష్ట్రంలోను అనేక శిక్షణా కేంద్రాలను మేము నడిపాం. సేవాదళ్ అధికారులుగా బాగా పనిచేసిన ఇద్దరు, గుంటూరుకు చెందిన శ్రీ గాదిరెడ్డి హనుమంతరావు, శ్రీ కాకుళంకు చెందిన కెప్టెన్ అప్పారావుగారు, ఇద్దరూ స్వాతంత్ర్య సమరయోధులు, మారైతాంగ విద్యాలయంలో శిక్షకులుగా పనిచేసినవారు, ఈ క్యాంపులలో పూర్తిస్థాయి నిర్వాహకులు గా పనిచేస్తూ, నందాగారికి, బి.యస్.యస్.కు మంచి కార్యకర్తలను సమకూర్చారు. ఇటీవల లోక్‌సభ స్పీకరుగా పనిచేసిన సర్దార్ జి.యస్. ధిల్లాన్ గారు పంజాబ్

రాష్ట్ర కన్వీనరుగాను. కేంద్రమంత్రిగా ఆ తరువాత పనిచేసి శ్రీ యల్. యన్. మిశ్రాగారు బీహారు రాష్ట్ర కన్వీనరు గాను బి.యస్.యస్‌లో పనిచేశారు. గ్రామీణ ప్రజలు ఉత్సాహంతో తమ వంతు విరాళాల నిస్తూ ఈకార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేలా మేము చేయగలిగాం. దురదృష్టవశాత్తూ కొత్తగా వచ్చిన మంత్రివర్గ ముఠా రాజకీయాల కారణంగా బి.యస్.యస్ కార్యకర్తల సాంఘిక రాజకీయ ప్రాభవాన్ని తమ స్వప్రయోజనాలకోసం వినియోగించుకొంటూ, కార్యకర్తల నైతిక స్థాయిని పడగొట్టసాగారు. రోజు రోజుకూ ఈ కార్యకర్తలు పార్టీ రాజకీయాంలో ప్రవేశించటమేగాక. ముఠాలు వర్గాలతో కలుస్తూ, అధికారం కోసం ఆరాటపడసాగారు. రాజకీయాంలో ఆర్.యస్.యస్. లాగా బి.యస్.యస్. గూడా తనను తానే చిక్కులలో పడవై చుకుంది. ఈపరిణామం పై నుంచి క్రింద దాకా కార్యకర్తలను నైతిక దుస్థితిలో పడవేసింది. క్రమేణా బి.యస్.యస్. అధికారంలో ఉన్న కాంగ్రెస్ వర్గానికి అనుబంధం కాసాగింది.

రాష్ట్రాలలో అధికారం నెరపుతున్న కాంగ్రెస్ నాయకులు, రాష్ట్రాల జిల్లాల కన్వీనర్లుగా తాము చెప్పిన వారినే నియమించాలని నిర్బంధింపసాగారు. తుదకు కేంద్రమంత్రులు బి.యస్.యస్. కార్యక్రమాలపైన అవినీతి ఆరోపణలపైన, ప్రజలు ప్రభుత్వం సమకూర్చిన నిధుల వినియోగంపై పరిశీలనకు గాను ఒక ప్రత్యేక విచారణా సంఘాన్ని నియమించక తప్పలేదు. భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకున్న తరువాత ఉన్నత లక్ష్యాలతో ప్రారంభమైన ఈ సంస్థరాజకీయాల ఊబిలో పడి బలైపోవటం గొప్ప విషాదకర సంఘటన.

16

శ్రీ రాజాజీ

రాజాజీ గారు సేలం జిల్లా గోబిచెట్టి పాలెంలో 1878 డిసెంబరు మాసంలో జన్మించారు. 1920లో మహాత్మాగాంధీ గారితో కలిసే నాటికి ఆయన సేలంలో ప్రముఖ న్యాయవాదిగా ఉండేవారు. సహాయ నిరాకరణోద్యమంలో పాల్గొని 1921లో జైలుకు వెళ్లారు.1921-22 సంవత్సరాల మధ్య కాంగ్రెసు పార్టీ ప్రధాన కార్య దర్శిగా ఉన్నారు. 1922-25 ఆయన గాంధీ గారితో కలిసి ఉండి 'యంగ్ ఇండియా' 'నవజీవన' పత్రికలకు సంపాదకులుగా ఉన్నారు. మధ్య మధ్యకొద్దిపాటి విరామాన్ని తప్పిస్తే 1950 వ సంవత్సరందాకా అఖిల భారత కాంగ్రెసు కమిటి కార్యవర్గ సభ్యులుగా కొనసాగారు. 1936-39 సంవత్సరాల మధ్య తిరిగి, 1952-54, మధ్య మద్రాసు రాష్ట్రముఖ్యమంత్రిగా పదవి నిర్వహించారు. 1946-47 మధ్యకాలంలో కేంద్రమంత్రి మండలి సభ్యులుగా ఉన్నారు. 1947-48 కాలంలో బెంగాల్ గవర్నరు గా వ్యవహరించారు. 1945-50లోగవర్నర్ జనరల్ గా అత్యున్నత పదవిని నిర్వహించారు. తిరిగి కేంద్రమంత్రి అయ్యారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభను ప్రారంభించారు. మధ్యనిషేధం కోసం గొప్పగా కృషిచేశారు. వ్యవసాయ రుణాలను, మారు టోరియాన్ని ప్రకటించారు. 1937-38లో తంజావూరు భూమికౌలు దారీ చట్టాన్ని ఆమోదించారు. వీటిన్నింటిలో భారత దేశంలో ఆయనే మొదటి వారు. ప్రపంచ మేధావులలో ఒకరైన బెర్ట్రండ్ రస్సెల్ తో సమంగా గౌరవంపొందారు. 1955లో 'భారతరత్న' బిరుదును పొందారు. మహాత్మాగాంధీ ఆంతరంగికులుగా ఉన్నవారిలో ప్రముఖులుగా పరిగణనకెక్కారు. 1959లో రంగా గారితో కలిసి స్వతంత్ర పార్టీని స్థాపించారు. గాంధీ శాంతి సంఘానికి నాయకత్వం వహించి రోమ్, లండన్, వాషింగ్టన్ నగరాలలో అణ్వాయుధ రహిత సమాజం కోసం కృషిచేస్తూ, అందులో ఒక భాగంగా ఆ నగరాల్లో అణ్వాయుధ ప్రయోగాలను నిషేధించే ఒప్పందం జరగాలని ప్రచారంచేశారు. తను రచించిన "దినాన్ ఇన్ వర్ల్డ్", గ్రంధం ద్వారా, అణ్వాయుధ రహిత సమాజానికి నాయకునిగా, మానవతా వాదిగా విశేష ప్రాముఖ్యాన్ని సంపాదించారు.1960-62 మధ్య భారత దేశమందంతటా పర్యటించారు. రామాయణం, మహాభారతం, ఖురాన్ వంటి మహా గ్రంధాలను చక్కని శైలిలో, ఆంగ్లభాషలో తీర్చిదిద్దిన మహా రచయిత. రంగాగారి 61వ జన్మ దినోత్సవ వేడుకలకు అధ్యక్షత వహించారు. వారి 93వ జన్మ దినోత్సవ వేడుకలు 1972లో జరిగాయి. అదే సంవత్సరం 1972 డిసెంబరులో క్రిస్టమస్ రోజున ఆయన తనువు వీడి, స్వర్గస్తులైనారు.

-ఎడిటర్)

అణ్వాయుధాల ద్వారా ప్రపంచం ఎదుర్కొబోయే ప్రమాదాన్నుండి ప్రపంచాన్ని రక్షించేందుకు నడుంకట్టిన పూజ్యరాజాజీ, పెద్దరికాన్ని సంతరించుకొన్న, మహోన్నత దేశభక్తుడు. ప్రపంచ స్థాయిలో మానవతావాదిగా పేరొందిన ఇద్దరు ప్రముఖులలో ఆయన ఒకరు. రెండవారు బెర్ట్రండ్ రస్సెల్. ఈ ఇరువురూ కూడా వినాశకరమైన అణ్వాయుధాలనుండి,

దుష్ట శక్తులనుండి మానవ సమాజాన్ని రక్షించేందుకు తీవ్రంగా కృషి చేసిన ప్రముఖులు. "సర్వేజనాః సుఖినో భవంతు", 'లోకా సమస్తాః సుఖినోభవంతు' అను మహోసూక్తులను అంగీకరించే వారందరూ రాజాజీ గారిని మహోన్నతునిగా భావిస్తారు.

చైనా ఆటంబాంబును ప్రయోగించి, ప్రపంచాన్ని భయపెట్టిన సమయంలో, రాజాజీ అణుపరీక్షలకు వ్యతిరేకంగా, తన 82 సంవత్సరాల ముదిమి వయస్సులో , 1962లో లండన్,రోమ్, ప్యారిస్, వాషింగ్‌టన్ నగరాలకు తన ధార్మిక ప్రచార యాత్రను నిర్వహించారు. ఆయన కొనసాగించిన ఈ తీవ్రమైన ప్రచారం, 1963లో అణ్వాయుధ పరీక్షా ప్రయోగాల రద్దు ఒప్పందానికి దోహదమైంది. కావాలనుకుంటే భారతదేశం అణ్వస్త్రాలను ఉత్పత్తి చేయగలిగిన స్థితి లోనే ఉందనీ, అయితే అది మానవతా విలువలను గుర్తించి, మహోన్నత లక్ష్యాలను అనుసరిస్తున్నదని అధ్యక్షులు కెన్నడీ అన్నారు.

ఈ శతాబ్దం ప్రారంభంలో మేమంతా ఇంకా పిన్న వయస్సులో వుండి, శాసన సభలలోకి అడుగుపెడుతున్న రోజుల్లో, రాజాజీ జాతీయోద్యమంలో ప్రవేశించారు. 1960లో మేమిద్దరం సూరత్ వెళ్లినప్పుడు ఆయన ఆనందాన్ని పట్టలేక, అక్కడొక వీధిని చూపించి, 1906లో సూరత్ కాంగ్రెసు మహాసభ జరిగినప్పుడు తానూ, శ్రీ తిలక్ గారి అనుచరులూ ఈ వీధిలోనే సమావేశమై, స్వాతంత్ర్య సాధనకు అవసరమైన మార్గాలను గురించి చర్చించామని నాకుచెప్పారు.

మహాత్మాగాంధీ బ్రతికి ఉన్నంతవరకు జవహర్లాల్ నాయకత్వంమీద అభిమానాన్ని చూపిస్తున్న రోజుల్లో, రాజాజీ బహిరంగ సభల్లో మాట్లాడడానికి గానీ, నేరుగా ప్రజలతో సంబంధాలను పెట్టుకొని వ్యవహరించడానికి గానీ, దాటవేస్తూఉండేవారు. రాజాజీ మేధావి మాత్రమేననీ, ఉద్వేగంతో ప్రజలను ముందుకు నడిపించగల సమర్థత గల నాయకులు కాదని ఆరోజుల్లో అనుకుంటూఉండేవారు. అయితే 1960-61లో యావద్భారత దేశంలో రాజాజీ నిర్వహించిన దిగ్విజయయాత్రలు, ఆయన ఎంతగా ప్రజలను ఆకర్షించగలరో, లక్షలాది ప్రజలను ఆలోచింపజేస్తూ, ఉద్రేకపరుస్తూ, ఉర్రూతలూగించే ప్రజా ఉద్యమాలను ఎంత చక్కగా నిర్వహించగలరో, అనుభవ పూర్వకంగా మనకు చూపెట్టాయి. ఆయన మనుమలైన (దేవదాసు గాంధి కుమారులు) పై, నేను ఎంతటి ప్రేమను చూపిస్తానో, ఆయన అంతటి ప్రగాఢాభిమానాన్ని మైసూరుకు చెందిన స్వర్గీయ రామారావు, స్వరాజ్యపత్రికా సంపాదకులు శాసా సుబ్బారావు, సదాశివం కుటుంబానికి చెందిన ప్రముఖసంగీత విద్వాంసురాలు శ్రీమతి సుబ్బలక్ష్మిగార్లపట్ల చూపిస్తూ ఉండేవారు. ఆయన ప్రేమెంతటి మహోదాత్తమైనదో, ఎంతటి ఔదార్యం ఉందో ఇందువల్ల మనం గ్రహించవచ్చు. నాకంటే పెద్ద వాడైన సహచరుడు నన్ను అభిమానించిన రీతిలో, ఆయన నన్ను అభిమానిస్తూ, అభిప్రాయ భేదాలు తలెత్తినప్పటికీ వాటిని సానుభూతితో స్వీకరిస్తూండేవారు. తనతో విభేదించి వారిని సైతం ఆయన సానుభూతితో చూస్తూండేవారు.

పార్టీపట్ల పూర్తి విశ్వాసాన్ని కలిగి ఉన్న సభ్యులు కూడా సహజంగా ఏర్పడే భిన్నాభిప్రాయాలను కలిగి ఉన్న కారణంగా, ఒక్కొక్కప్పుడు కఠినమైన పార్టీ క్రమశిక్షణను ఎదుర్కొవలసిరావడం ఆయన గమనించి, స్వేచ్ఛగా నిర్భయంగా సభ్యులు తమ తమ

అభిప్రాయాలను కలిగి ఉండేందుకు వీలుగా స్వంతంత్ర పార్టీలో 21వ సూత్రాన్ని ప్రవేశపెట్టారు. పార్టీ నిర్బంధాన్ని ఎదుర్కోవలసిన అవసరం లేకుండా, ఎవరైనా స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను ఈ 21వ సూత్రం ద్వారా ప్రకటించుకోవచ్చును, ఎలాంటి భిన్నాభిప్రాయలకు తావులేకుండా, తనతో పూర్తిగా ఏకీభవించి ఉండవలసిన పార్టీ అధ్యక్షుడినైన నాకు కూడా ఆయన ఈ సూత్రాన్ని వర్తింపజేసి, పూర్తి స్వేచ్ఛను నాకు కల్పించి, ప్రేమాభిమానాలతో కూడిన పరస్పర అవగాహనా పద్ధతికి ప్రాణం పోశారు. అయితే శాసన సభ్యులైన వారు ముఖ్య విభేదాలను ఏర్పడినప్పుడు పార్టీ మార్పిడి చేసే హక్కును మాత్రం ఆయన తోసిపుచ్చారు.

ఆయన ఎల్లప్పుడూ రైతుజన శ్రేయోభిషిలాగా ఉండేవారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక దుస్థితి ఏర్పడి, రైతాంగం బాధలకు గురైనప్పుడు, 1937-39లో మద్రాసు ముఖ్యమంత్రిగా ఆయన కొన సాగుతూ, 1937 వ్యవసాయ రుణాలకు మారుచోరియాన్ని ప్రకటించి,1937వ సంవత్సరపు రుణ విమోచన చట్టాన్ని అమోదింపజేశారు. రైత్వారీ కౌలుదారుల బాధలను గమనించి, కౌలుదార్లకు రక్షణ కల్పించేందుకు 1953లో రైత్వారీ కౌలుదారుల చట్టాన్ని అమలు పరిచారు. ఆయన భూమి శిస్తును తొలగించాలని వాదించారు. కంట్రోళ్లను ఎత్తివేసేందుకు జవహర్లాల్ గారిని నేను ఒప్పించలేకపోయినప్పుడు, రెండవమారు రాజాజీ మద్రాసు ముఖ్యమంత్రిగా అధికారంలోకి వచ్చిన తరువాత,1952లో కంట్రోళ్లను రద్దుచేసి, స్వేచ్ఛా వాణిజ్యానికి అవకాశాన్ని కల్పించి, ఆహార ధాన్యాల ధరలు పడిపోకుండాచేసి, ప్రతి ఒక్కరూ ప్రయోజనం పొందేలాచేశారు.

ప్రజా జీవితంలో ఉత్తమ విలువలను కాపాడుకోవాలని రాజాజీగారు ఆశిస్తూ ఉంటారు. మేధావులలో మేధావిగా ఉండడమే గాకుండా ఉన్నత నైతిక సూత్రాలను కూడా అనుసరించే, ఉన్నతులు కావడంతో, రాజాజీని ఎక్కువగా గాంధీజీ అభిమానించారు. ఆనాటి గాంధేయ సమాజంలో ఆయన గొప్ప సత్యసంధుడిగా ఉన్నారు. 1964 డిసెంబరు 2వ తేదీన పోప్‌జాన్ గారు చారిత్రాత్మకమైన బొంబాయి నగర పర్యటన జరిపి వచ్చినప్పుడు, ప్రముఖ క్రైస్తవ పార్లమెంటు సభ్యులైన శ్రీజోకిం ఆల్వా ఆయనకు, రాజాజీ గారి రచనలైన రామాయణ, భారత, ఆంగ్లాను వాదాలను బహుకరించారు. స్వరాజ్య పత్రికలో ఆయన ఇటీవల రాసిన వ్యాసాలు " లెటజ్ ఆల్సో హిందూయిజం" పేరిట వెలువడి, భారతీయ వేదాంతంలోని సందేశాన్ని అర్థంచేసుకునేందుకు మనకు అవకాశాన్ని కల్పించాయి.

స్వార్థపూరితమైన వ్యక్తిగత ప్రయోజనాలకంటే, సామాజిక ప్రయోజనాలు ముఖ్యంగానూ, ప్రాంతీయ వర్గ ప్రయోజాల కంటే, జాతి ప్రయోజనాలు ముఖ్యంగానూ రాజకీయ పార్టీలు స్వీకరించి పనిచేయలేక విఫలమైనప్పుడు రాజాజీ గమనించి "లెట్ రివిజన్ బి ఆవర్ పాలిటిక్సు టుడే" అనే పేరుతో ఆయన తన తుది సందేశాన్ని ప్రకటించారు. రాజాజీ విశ్వజనీనమైన భావాలు గలవారు. మానవత్వం మూర్తీభవించిన మహామనీషి. "ది ఛాలెంజ్ ఆఫ్ ది అన్ ఇన్‌వాల్వ్‌డ్" అనే తన గ్రంధం ద్వారా అణ్వాయుధాలకు వ్యతిరేకంగా ప్రపంచ ప్రజలనుద్దేశించి, తన తీవ్రమైన ఆవేదనను వ్యక్తం చేశారు.

1921-23 సంవత్సరాల మధ్య సహాయనిరాకరణ కొనసాగించాలని రాజాజీ చేసిన

వాదనకు, తగు సమాధానాన్ని ఇవ్వలేక, అప్పటి1922 నాటి గయ కాంగ్రెసు సభ అధ్యక్షులు శ్రీ.సి. ఆర్. దాస్ కాంగ్రెసుకు రాజీనామా, చేసి, దానికి వ్యతిరేకంగా స్వరాజ్యపార్టీని స్థాపించారు. శత్రు రాజ్యాలకు వ్యతిరేకంగా, మిత్ర రాజ్యాలతో జాతీయ ప్రభుత్వం తరపున సహకరించడం మంచిదని భావించినప్పుడు, గాంధీ దాన్ని అతిశయోక్తిగా భావించి, 1940 లో తాత్కాలికంగా జాతీయ నాయకత్వంనుండి తప్పు కొని బ్రిటిష్ వారితో సంప్రతింపులు జరిపేందుకు, రాజాజీకి, జవహర్లాల్ గారికి గాంధీజీ స్వేచ్ఛను కల్పించారు. వలసలను నిర్వహించలేక, తమంతట తామే, వదలు కోవడానికి బ్రిటిష్ వారు సిద్ధపడుతూ ఉండగా., యం.యన్.రాయ్ గారి భవిష్యద్వాణిని గోడలపై రాయడంచూసి, బ్రిటిష్‌పారు అసహనంతో ఊగిపోయారు, జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే భారతదేశం కోర్కెను, ఆకారణంగా బ్రిటిష్‌వారు తిరస్కరించి, ముందు దృష్టిలేని బ్రిటిష్ ప్రభుత్వం పీటోచేసింది. "జయమో-వీరవ్వర్గమో"వినాదంతో 1942-45 నాటి ఉద్యమంలో గాంధీ,నెహ్రూలతో కలసివనిచేయడానికి రాజాజీ తిరస్కరించారు. భారత స్వాతంత్ర్య సముపార్జనలో జవహర్లాల్, పటేల్, రాజేంద్ర ప్రసాద్ గార్ల అభిప్రాయాలను భారత ప్రజలు అసహనంతో వింటూ, చివరకు గాంధీజీ కూడా వారిపైన గల విశ్వాసంతో. ఎటూ చెప్పలేక మౌనాన్ని పాటించిన సమయంలో , రాజాజీ ముందుకు వచ్చి పాకిస్తాన్ విభజనను అంగీకరించడం మంచిదని చెప్పి, అందువల్ల పశ్చిమ బెంగాల్, తూర్పు పంజాబ్ ప్రాంతాలనైనా జిన్నా వినాశకర ధ్వంసంనుండి కాపాడు కోవచ్చునని ఆయన అన్నారు.

రాజాజీ గారు నిర్భయంగానూ, అవిశ్రాంతంగానూ నూతన ఆలోచనలపై పురోగమించే దార్శనిక వేత్త. దక్షిణ భరతదేశం రాజాజీ గారి ఆంగ్ల భాషాభిమానాన్ని అత్యధికంగా గౌరవిస్తున్న సమయంలోనే, ఆయన హిందీభాషా ప్రచారానికి నాంది వాచకం పలికారు, మన ఆర్థికవేత్తలు , పారిశ్రామిక వేత్తలంతా దేశాన్ని పారిశ్రామికీకరణంచేయాలని తపన పడుతున్న తరుణంలో, ఆయన గాంధీ గారికి తోడుగా నిలిచి, ఖద్దరు, చేనేత వంటి గ్రామీణ పరిశ్రమలను ప్రోత్సహించారు. మేమంతా భాషా ప్రయుక్త రాష్ట్రాలు కావాలని పట్టు పడుతున్న సమయంలో ఆయన బహుభాషా రాష్ట్రాలను సమర్థించారు.

రాజాజీ సనాతన సాంప్రదాయ వాది లంటూ ఆయన వ్యతిరేకులు అర్థంలేని విమర్శలు చేయడం కద్దు. అయితే రాజాజీ ప్రాచీనకాలం నుండి ఆచరణలో ఉన్న సాంప్రదాయాలను ధిక్కరించి, తన కుమార్తెను, గాంధీగారి కుమారుడు దేవదాస్ కిచ్చి కులాంతరం వివాహంచేసిన సంస్కరణవాది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత భారతదేశ ప్రధాని కావడానికి తనకు ఉన్న అవకాశాల నన్నింటిని పందెం ఒడ్డి, తమిళనాడులోని అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటాన్ని ప్రారంభించి మధుర మీనాక్షి దేవాలయంలోకి హరిజనుల ప్రవేశానికి కృషిచేసే తన ముఖ్య అనుచరులైన వ్యర్థీయ వైద్యనాథ్ గారికి తోడుగా నిలిచారు.

నాలుగు దశాబ్దాలుగా స్వాతంత్ర సమరంలో పాల్గొన ఆయనకు సమకాలింగా ఉన్న ప్రముఖులందరూ, దేశప్రయోజనాలకు అను గుణంగా రాజాజీ సాగించిన కృషికి నిదర్శనంగా, వీటిని పరిగణిస్తారు,

ఆయన పట్ల కృతజ్ఞతా సూచకంగా భారతజాతి మొదటి, చివరి గవర్నరు జనరల్‌గా వ్యవహరించిన ఆయనను అభినందించి, తొలి 'భారతరత్న' బిరుదాన్నిచ్చి గౌరవించింది.

స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత ఈరెండు దశాబ్దాలకాలంలో ప్రభుత్వయంత్రాంగంలో పెరిగిపోతున్న అవినీతికి వ్యతిరేకంగా పోరాడేందుకు క్షీణిస్తున్న నైతిక విలువల పునరుద్ధరణకు తమకు తోడ్పడ వలసిందిగా గాంధీజీని అంతరాత్మను తమలో ఆవహించవలసిందిగా అనేకమార్లు ఆయన వేడుకుంటూఉండేవారు.

నానాటికి కేంద్ర ప్రభుత్వంలో రాజకీయాధికారం కేంద్రీకృతం అవుతూ, దేశం ఏకీకృత విధానాలవైపు పయనించడాన్ని ఆయన గమనించారు. రాష్ట్రాలకు స్వాతంత్ర్యాధికారాలు అధికంగా లభించేందుకు 'స్టేట్స్‌పార్టీ' అనే గ్రంధంలో అనేక వ్యాసాలను రాసి, క్రోడీకరించి ప్రచురించారు. ప్లానింగ్ కమిషన్, నేషనల్ డెవలప్ మెంటు కౌన్సిల్ వంటి సంస్థలు వాటికి రాజ్యాంగపరమైన ఆధారలేమి లేక పోయినప్పటికీ, రాష్ట్రాల స్వాతంత్ర్యాన్ని గురించి తెలియజేస్తూ రాజాజీ గారిలో, అందుకు అనుగుణమైన ఒక సద్విమర్శికుడ్ని ఆ వ్యాసాలు ఎత్తి చూపాయి.

ఆశావాది అయిన జవహర్లాల్, తాను రూపొందిస్తున్న అభ్యుదయకరమైన ప్రణాళికలను వ్యతిరేకిస్తున్నవారిగా నన్నూ, రాజాజీని పార్లమెంటులోనూ, ఆయన ప్రసంగాలలోనూ దుమ్మెత్తిపోసేవారు. 1960-61 కాలంలో రాజకీయ మేధావులు, కాలేజీ వేదికలనుండి యువజన సంఘాల వరకూ అందరూ కూడా నెహ్రూ గారి ప్రణాళికలే, దేశాభివృద్ధికి సరియైన మార్గాలని ప్రశంసిస్తున్న రోజులవి.

గాంధేయ మార్గంలో ప్రణాళికలను రూపొందించి, దేశాభివృద్ధికి మార్గాలనువేయాలని కోరుతున్న మేము, ప్రణాళికల రూపంలో తీసుకు రాదలిచిన అభివృద్ధిని వ్యతిరేకించడంలేదని, అప్పుడు నేను ప్రకటించాను. వికేంద్రీకృత పారిశ్రామికాభివృద్ధితో కూడిన గృహ పరిశ్రమలు, చేతివనులు, స్వయంవృత్తులకు ప్రత్యేక ప్రాధాన్యతలేని, నెహ్రూగారి స్వంత ప్రణాళికలను మాత్రమే మేము వ్యతిరేకిస్తున్నామని చెప్పాం! రైతుల ఉత్పత్తులకు కనీస ధరలను ఏర్పాటు చేయాలని, కార్మికులకు కనీస జీత భత్యాలను కల్పించాలని వాడకందారులకు వారు వినియోగించు కోవడానికి వీలయిన ఉన్నత స్థాయి దరలను స్థిరీకరించాలని, అందరకీ ప్రయోజనం కలిగే ప్రణాళికా విధానానికి మేము కట్టు బడి ఉంటామని చెప్పాం! అయినప్పటికీ నెహ్రూ గారి అపసవ్యమైన బోధనలు, మాపట్ల అపార్థాన్ని కల్పించిపెట్టి, మాకు వ్యతిరేక ప్రచారాన్ని కలిగించాయి. ఈఅంశాన్ని నేను రాజాజీ గారి దృష్టికి తీసుకవెళ్లినప్పుడు "మన దృక్పధాల మధ్య ఉన్న తేడాలు అలాగే నిలిచి ఉన్నాయని" తార్కికంగా జవాబిచ్చారు. దురదృష్టవశాత్తూ మా ఇరువురి మధ్య ఎప్పుడు సంఘర్షణ తలెత్తినప్పటికీ, ప్రభుత్వ ఏకపక్షంగా వ్యవహరించడం, పత్రికలు, రేడియో వంటి సంస్థలన్నీ మా మీద కంటే, నెహ్రూగారి వైపే మొగ్గు చూపెట్టేవి. ఈ శతాబ్దంలో పారిశ్రామికాభివృద్ధి ద్వారా సాంఘికాభివృద్ధిని సాధించడంలో 'సోషలిజం' ముఖ్యమైన అంశంగా నిలిచి ఉంది. రాజాజీ దాన్ని విజయవంతంగా విమర్శించడానికి ప్రయత్నిస్తుంటే, జవహర్లాల్, కాంగ్రెసు సోషలిస్టులు సోవియట్ రష్యా పద్ధతివైపు మొగ్గుచూపుతూ, ప్రభుత్వ ఆధిపత్యంలో సోషలిజాన్ని ప్రవేశపెట్టాలనే ప్రయత్నంలో

ఉన్నారు. ప్రభుత్వాధికారం ద్వారా, నిర్బంధవిధానాల ద్వారా ఈ అభివృద్ధిని సాధించగలమని వారినమ్మిక. 1936-37లో అప్పట్లోకాంగ్రెసు అధ్యక్షుడిగా ఉన్న నెహ్రూగారికి, మెజారిటీ కాంగ్రెసు కార్యవర్గ సభ్యులు రాజీనామా పత్రాన్ని సమర్పించడంలో రాజాజీ ప్రముఖ పాత్రవహించారు.

సోవియట్ తరహా సోషలిజం సంఘాన్ని హింస ద్వారా మాత్రమే పునర్నిర్మాణం చేయగలదనే అంశాన్ని గాంధీజీ కూడా అంగీకరించి, ఈ విషయంలో రాజాజీతో ఏకీభవించారు. తాము అంగీకరించిన వికేంద్రీకృత ఆర్థిక విధానం అహింసాయుతంగానూ, దోపిడీలేని పద్ధతుల్లోనూ, స్వయంపృత్తుల ఆధారంగానూ సమాజాన్ని పునఃఅభివృద్ధి చేయగలదని ఆయన చెప్పారు. మేము స్వతంత్ర పార్టీని స్థాపించిన తరువాత ప్రభుత్వ యాజమాన్యానికి బదులుగా, వ్యక్తుల యాజమాన్యంలో పారిశ్రామికీకరణానికి పూనుకోవాలనే మసానీ గారి అభిప్రాయాలకు, నెహ్రూగారి ప్రణాళికా విధానం మధ్య యాజమాన్యం ఎవ్వరిదనే అంశం మినహాయిస్తే, పెద్దతేడాలేదని రాజాజీగారు ప్రశంసించారు. కిసాన్‌మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని ప్రచారం చేస్తున్న మా అందరినీ ఈ అంశం సందిగ్ధంలో పడవేసింది. రాజాజీ గారు మా అభిప్రాయాలను గౌరవించి, నెహ్రు హయాంలో చెప్పిన సోషలిజాన్ని స్వయంపృత్తుల ఆధారంగా జీవించే ప్రజల సోషలిజంగానే మనం చెబుతున్నామన్నీ, అంతేగానీ సోవియట్ తరహా పద్ధతిని ఇక్కడ ఏరూపంలో ప్రవేశ పెట్టదలిచినా మనం దాన్ని సమస్త శక్తులతో వ్యతిరేకించి, గాంధేయ ఆర్థికవిధానాన్ని తీసుకరావడమే మన ధ్యేయమని ఆయన చెప్పారు. నేను నా సోషలిజాన్ని గురించి పట్టుబట్టకుండా, నా నమ్మకాలకు నేనే దూరమవుతున్నానని భయపడ్డాను, అందువల్ల చివర్లో అంటే 1965- 69 సంవత్సరాల మధ్య కాలంలో నేను ధైర్యంగా గాంధేయ సోషలిజం పై నా నమ్మకాన్ని ఎలుగెత్తిచాటాను. నా ప్రయత్నాన్ని సకాలంలో జరిగిన ఉత్తమ కార్యక్రమంగా, రాజాజీ అభిప్రాయపడ్డారు.

పరిశ్రమలను జాతీయం చేయాలనే అంశంమీద రాజాజీగారు ప్రభుత్వ నిర్ణయాలతో అంగీకరించలేదు, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత స్థాపించిన ప్రభుత్వ సంస్థలన్నీ అవినీతితోనూ, అసమర్థుల నిర్వహణ లోనూ నిండి ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు, మాలాంటి వాళ్లం కొంత మందిమి పూర్తి అయిష్టాన్ని వ్యక్తపరచకుండా, పరిపాలనా విధానంలో మార్పుతెచ్చి, అవినీతిని రూపుమాపి, పార్లమెంటు అజమాయిషీద్వారా చెడుఫలితాలు రాకుండా, జాగ్రత్తపడాలని అభిప్రాయపడ్డాం.

రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల అధ్యాయం ఆయనకు పరమ పవిత్ర మైనది. ఆస్తి హక్కుతో సహా ఏస్వల్పమైన హక్కును కూడా మార్చరాదని ఆయన గట్టి పట్టుపట్టారు, ఒకవేళ ఆస్తిహక్కును కుదించవలసి వస్తే, ప్రతి రంగంమీద సమాన స్థాయిలో పరిమితులను విధించాలని చెప్పాం. నెహ్రూగారు 1950 నుండే ,అభివృద్ధిని సాధించాలంటే ప్రస్తుత మార్కెట్టు రేటు ప్రకారం నష్టపరిహారం చెల్లించడం ఎట్లాగా అని సందేహాన్ని వెలిబుచ్చుతూనే ఉన్నారు. త్వరితగతిని అధికోత్పత్తిని సాధించడంద్వారా పంపిణీచేయడానికి ఎక్కువ సరుకులు నిల్వఉండి, ప్రజలను బీదరికంనుండి, తప్పించి ఉత్పత్తి రంగం కల్పించే వెసులుబాటులో

దారిద్ర్యరేఖను దాటగలమని రాజాజీ సూచించారు. రాజ్యాంగంలో ఆస్తిహక్కు సంబంధించిన అన్ని సవరణలను కొట్టివేయాలన్న రాజాజీ వాదనతో, నేను పూర్తిగా ఏకీభవించలేదు. కోట్లాది మంది రైతాంగం భూవసతిపై, పరిమితులను ప్రవేశపెట్టిన సందర్భంలో, మిగిలిన అన్నిరకాల ఆస్తులపై కూడా పరిమితుల్ని విధించి, నూతన సామాజిక ప్రయోజనాలకు అనుగుణంగా, 'గరీబీ హఠావో' లక్ష్యాన్ని సాధించేందుకు ప్రయత్నించవలసిందిగా మాత్రమే నేను కోరాను.

రైతుకూలీల ప్రయోజనాల కొరకు దీర్ఘకాలంగా పోరాడుతున్న నాలాంటి వారమంతా, సామాజిక అభివృద్ధిని సాధించే కృషిని శీఘ్రతరం చేయాలంటే క్రమేణా ప్రభుత్వయాజమాన్యం తప్పదని అభిప్రాయపడ్డాము. వ్యాపారస్తుల, పారిశ్రామిక వేత్తల దోపిడినుండి, తుఫానులు, వరదలు, వర్షాభావం వంటి ప్రకృతి వైపరీత్యాలనుండి రైతులు రక్షణను పొందాలి అదేవిధంగా కార్మికులు ప్రభుత్వ సహాయన్ని, రక్షణను పొందాలి, గ్రామీణ, పట్టణ ప్రాంతాలలోని వినియోగదారులు రైతులు, చేతివృత్తుల వారితో సహా, ఆహారధాన్యాలు, కిరోసిన్, సిమెంటు, బట్టల వంటి అన్ని నిత్యావసరవస్తులను క్రమపద్ధతిలో పొందడానికి, పంపణీ వ్యవస్థను ప్రభుత్వం సమర్థవంతంగా నియంత్రిస్తూ ఉండాలి. వ్యక్తులకు, సంస్థలకు కోటాలను ఇవ్వడం, పర్మిట్లను జారీచేయడం వంటి కార్యక్రమాలు, ఆధునిక సమాజంలో ప్రభుత్వం ప్రాథమిక బాధ్యతలు అయి ఉన్నాయి. అన్నిరకాల కంట్రోళ్లు, పర్మిట్లు, లైసెన్సులు పొందే స్వేచ్ఛ తమకు ఉండాలని కరుకొనే, పట్టణాల్లోని మిత్రుల కోర్కెను మేము అంగీకరించం. ఎందుకంటే వాటిని దుర్వినియోగం చేయడానికి మేము అంగీకరించం. అందుకనే వాటిపై ప్రభుత్వ ఆంక్షలు పరిమితంగానైన ఉండాలని మేము కోరుతున్నాం. కానీ అందువల్ల ప్రభుత్వ ఆంక్షలు, కొన్ని వుండాలని మేము చెబుతున్నప్పటికీ, అట్లాంటి అధికారాలు దుర్వినియోగమై, ప్రభుత్వం ద్వారా కొన్ని సాంఘిక, రాజకీయ శక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వీటిని వినియోగించుకుంటారు., గనుక మేము సంపూర్ణంగా బలపరచలేకపోతున్నాం.

ఈసమస్యలన్నింటినీ గమనించి, అన్ని రకాలైన వ్యాపార కంట్రోళ్లను అంటే లైసెన్సుల మంజూరును రద్దుగావించి, పర్మిట్లను, కోటాలను జారీ చేయకుండా, వీటి నిర్వహణా బాధ్యతను ప్రభుత్వ శాఖల సహకారంతో స్వతంత్ర నిర్ణయాలుచేయడానికి వీలుగా అఖిలపక్ష జాతీయ స్థాయి న్యాయ సంఘాన్ని నియమించాలన్న మాకోర్కెను, రాజాజీగారు అవగతం చేసుకున్నారు. రాష్ట్రపతి రాధాక్రిష్ణన్ గారు తన మద్రాసు ప్రసంగంలో, ఆర్థిక రంగంలో కీలకమైన ఈ పంపణీ వ్యవస్థ నిర్వహణను స్వతంత్ర న్యాయవ్యవస్థ క్రింద వుంచాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. కేంద్ర హోంమంత్రి శ్రీ నందాగారు ఇలాంటి జాతీయ సంఘాన్ని నెలకొల్పాలని ప్రయత్నించి, అందుకు తగు సలహాలను నివ్వవలసిందిగా కోరారు. ఈప్రతి పాదనను అంగీకరిస్తే తాను స్వతంత్ర పార్టీని రద్దుచేయగలనని రాజాజీ గారు అన్నారు. అధికారమే పరమావధిగా భావించే ప్రభుత్వ రాజాజీగారి సత్ప్రలితాల నిచ్చే సూచనను స్వీకరించడానికి ఎలా సిద్ధపడగలరు.

పక్షపాతబుద్ధితోనూ, అవినీతి తోనూ, అమర్యాదకర పద్ధతులతోనూ ప్రవర్తించే మంత్రుల సలహాలతో నడిచే ప్రభుత్వం నిజానికి ఉత్తమ సూచలను, సలహాలను స్వీకరించాలని

అనుకున్నా, అట్లాంటి మంత్రులను కాదని పూనుకోగలదా అని రాజాజీ గారు ప్రశ్నించారు. అందువల్ల మంత్రుల స్థాయిలో ఉన్న వారిపై వచ్చిన అవినీతి కార్యక్రమాలను విచారించేందుకు స్వీడిష్ అంబుడ్స్‌మన్ పద్ధతిలో స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటు చేయాలన్న మున్షీగారి వాదాన్ని రాజాజీగారు ప్రశంసించి, బలపరిచారు.

జాతీయ నాయకత్వం, మంత్రివర్గాలు రాజకీయ శక్తిని కోల్పోతున్న కారణంగా, నైతిక విలువలకు దూరమవుతున్న కారణంగా, క్రమేణా బలహీన పడుతున్నాయన్న అంశాన్ని, ఈ సందర్భంలో రాజాజీగారు వివరించారు, పార్టీ ప్రమేయంలేకుండా, సమర్థులైన నాయకులతో జాతీయ ప్రభుత్వాన్ని నెలకొల్పవలసిందిగా రాజాజీ చేసిన సూచనను త్రోసి పుచ్చి, శ్రీమతి ఇందిరాగాంధీ కాంగ్రెసు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసింది, జాతీయ ప్రజాస్వామ్య పక్షాలకు అందులో ప్రాతినిధ్యం కల్పించ లేదన్న అంశాన్ని, ఆయన పట్టించుకోలేదు. ఎందుకంటే కేంద్రంలో గానీ, రాష్ట్రంలోగానీ ఆయన మంత్రి పదవి స్వీకరించి ఉత్తమ పరిపాలనను అందించినప్పుడు కూడా, ప్రజల అనుమతి కోసం ఎప్పుడూ ఆయన ప్రయత్నించలేదు. తదుపరి ఈ అంశాన్ని గురించి ప్రస్తావించినప్పుడు, అది ఆచరణ సాధ్యంకాదని, నేను భావించాను, మాపార్టీతో సహా, అన్ని రాజకీయపార్టీలను రద్దుచేసి, ఒక జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి, ప్రజాభిప్రాయానికి అనుగుణంగా, పరిపాలన సాగిస్తే మంచిదని సూచించాం.

1967 జనరల్ ఎన్నికలలో కాంగ్రెసు పార్టీ ఓటమిని చవిచూసినప్పుడు, దానితో తెగతెంపులు చేసుకొని మాతో కలిసిన అనేక వర్గాల కాంగ్రెసు నాయకులు ఈ విషయంలో కనపర్చిన అయిష్టాన్ని గమనించిన తరువాత, మేము కొంత నిరుత్సాహపడ్డాం! యు.పి, బీహార్, పశ్చిమబెంగాల్, పంజాబ్, హర్యానా, మధ్యప్రదేశ్‌లకు సంబందించిన ఆరుగురు ముఖ్య మంత్రులు కలసి, స్వతంత్రపార్టీతోగానీ ఇతర ప్రజాస్వామ్య ప్రతిపక్షాలతో గానీ కలవకుండా, 'భారతీయ క్రాంతిదళ్' పేరిట నూతన రాజకీయ పార్టీని తమకు తామే ఏర్పాటు చేసుకున్నారు. ఎందుకంటే అధికారం రుచిమరిగిన ఈ రాజకీయ నాయకులు అధికార రాజకీయాల్ని వదలలేక, అధికారాన్ని తమలో తామే పంచుకోవచ్చునన్న ఆసక్తితో , కాంగ్రెసుకు ప్రత్యామ్నాయంగా నిలిచి, రాజకీయ అధికారాన్ని పొందగలిగే స్థాయికి వెరగగలమని భావించారు. ఇక ఇతర నాయకులు ఉత్కళ కాంగ్రెసు, కేరళ కాంగ్రెసు, బీహార్ లోక్‌తంత్రదళ్, బంగ్లా క్రాంగ్రెసు వంటి రాజకీయ పార్టీలను నెలకొల్పుకున్నారు. మతాతీత, ప్రజాస్వామ్య ప్రతిపక్షంగా మేము జాతీయ స్థాయికి ఎదగలేకపోయిన అంశాన్ని రాజాజీ గారు గుర్తించారు. అందువల్ల ప్రజాసామ్య పక్షాలన్నీ కలిసి, ఒకే సంయుక్త ప్రజాస్వామ్య ప్రతిపక్షంగా రూపొందాలనే అభిప్రాయానికి రాజాజీగారు వచ్చారు. శైశవ దశలో ఉన్న మన ప్రజాస్వామ్య వ్యవస్థను రక్షించుకోవటానికి, ఎంతో కష్టపడి నెలకొల్పుకున్న తమ పార్టీని సైతం రద్దుచేయడానికి కూడా వెనకాడని సమయస్ఫూర్తి గలిగిన, త్యాగపూరితమైన మనస్తత్వం రాజాజీది. ప్రముఖ ప్రజాస్వామ్య ప్రతిపక్షంగా ఎదగలేక పోయిన స్వతంత్రపార్టీని రద్దుచేద్దామని ఎప్పుడైనా ఆయనతో నేను ప్రస్తావించినప్పుడు, ఆయన అంతగా సుముఖతను చూపేవారు కాదు. ఎందుకంటే కాంగ్రెసు కానీ, ఇతర ప్రజాస్వామ్యపార్టీలు గానీ దేశానికి అవసరమైనకృషిని, జాతీయ

ప్రజాసామ్యపార్టీని రూపొందించి, ప్రజలకు అందించలేనని ఆయన అభిప్రాయ పడినందున, తాత్కాలికంగా అలా ఉండిపోయారు. 1971 జనరల్ ఎన్నికలలో ప్రజాస్వామ్య ప్రతి పక్షాలతో ప్రజాస్వామ్యబద్ధమైన 'యునైటెడ్ ఫ్రంటు'ను నెలకొల్పి పోటీచేసినప్పుడు, ఈ నాయకులంతా పార్టీ మార్పిడి, అవినీతి కార్య కలాపాల్లో కూరుకపోయిన వారేనని, ప్రజలు తిప్పికొట్టినప్పుడు రాజాజీ గారు బాగా నిరుత్సాహపడి, నాసూచనలను కూడా దాటి, ఇంకా ముందుకు వెళ్లారు ఆయన 22-1-1972 నాకు జాబురాస్తూ " మనం రాజకీయాలను సంస్కరించలేం"అని అన్నారు. "అంతకు ముందు ఉన్న పరిపాలనా పద్ధతిలో ప్రజాస్వామ్యంవచ్చినట్లే, మనం రాజకీయాల స్థానంలో ఘతాన్ని తప్పకుండా ప్రవేశపెట్టవలసి ఉంటుంది, దేవుడిపట్ల విశ్వాసం, పాపభీతి, మన ప్రస్తుత రాజకీయ అంశాలుగా ఉండాలి" అని కూడా ఆయన రాశారు. ఆయన మరణించిన 18 మాసాలలోపుగా, స్వతంత్ర పార్టీతో సహా, ఆరు ప్రతిపక్షాలు కలిసి 'భారతీయ లోక్ దళ్'గా ఏర్పడ్డాయి. ఆతరువాత అది మరొక మలుపు తిరిగి, శ్రీ జయప్రకాశ్ నారాయణ్ ఆధ్వర్యంలో, ఒక ప్రక్క కమ్యూనిస్టులను , మరొక ప్రక్క భారతీయ జనసంఘాన్నికూడా కలుపుకొని, 'విశాల ప్రతిపక్ష ఫ్రంట్' గా ఏర్పడింది. వామపక్షాలు తెలియజేసిన అభ్యంతరాలకు అనుగుణంగా, తమ ప్రకటన లక్ష్యాలను పరిదిద్దుకుంటామని బి.యన్.డి చెప్పినప్పటికీ, 'పాత కాంగ్రెసు' వారితో కలవ నందువల్ల జయప్రకాశ్ నాయకత్వంలో ప్రారంభమైన నూతన ఏకీకరణ ప్రయత్నం సఫలంకాలేదు.(ఆగస్టు 1976).

భారతీయ లోక్ దళ్, లేదా జయప్రకాశ్ నారాయణ్ గారి సారధ్యంలో ఏర్పడిన రాజకీయ పార్టీల ఫ్రంటుగానీ వాటి మధ్యేమార్గ విధానాలను ప్రజలు ఎక్కువ ఓర్పుతో భరించలేక పోయారని నేను అభిప్రాయపడ్డాను. 1971లో ఏర్పడిన " డెమాక్రటిక్ ఫ్రంటు " ప్రత్యామ్నాయ రాజకీయ నాయకత్వాన్ని అందించలేదని కూడా ప్రజలు భావించారు. ఎందుకంటే వీరికి ఇందిరాగాంధీ వ్యతిరేకత అనే ఆశయం తప్ప, ఇతర ప్రజావసర కార్యక్రమం ఏదీ లేనందున, దిగువ స్థాయిలో సహా ఉన్న ప్రజలు, మధ్య తరగతితో సహా ఈ ఫ్రంటు పట్ల విముఖత చూపారు. అందువల్ల ప్రజలు ఇందిరాగాంధీ ఆవుదూడ గుర్తు మీద ఓట్లువేయడానికే నిశ్చయించుకున్నారు. ముందు ఉత్పత్తి, ఆతరువాత సమానమైన పంపిణీ అనే మధ్య తరగతి ప్రజల భావాలకు, సాధారణ ప్రజలు వ్యతిరేకంగా మారారు. వారంతా ఇందిరాగాంధీ కార్యక్రమాలను, నినాదాలను గౌరవించి, తమ కష్టాలను ఆమె మాత్రమే తీర్చగలదని నమ్మారు. ప్రజాస్వామ్య దృక్పధంగల ప్రతిపక్షాల వారంతా ప్రజాభిప్రాయాన్ని గమనించ వలసిందిగా, ఉప్పెన లాగా ప్రజలు శ్రీమతి గాంధీ వైపు తిరగడాన్ని గుర్తుంచుకొని, తమ తమ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల అభిమతానికి' అనువుగా సరిదిద్దుకోవలసిందిగా నేను వారిని కోరాను. రాజాజీగారు 31-10-1971 వరకూ కూడా భారత రాజ్యాంగాన్ని, స్వతంత్రపార్టీ ఒక్కటే రక్షించగలదని అభిప్రాయపడ్డారు. అయితే 22-1-72న ఆయన అన్ని పార్టీలను రద్దుచేసి, మతాను గుణంగా నడవవలసిందిగా చెప్పారు.

కష్టపడి పనిచేయడంద్వారా, పాదుపు ద్వారా మానవుడు తన సాంఘిక, ఆర్థికజీవనాన్ని క్రమంగా నిర్వహించుకోగలడనే అంశాన్ని రాజాజీ ఎరిగిన వాడే అయినప్పటికీ, ప్రజలను

ఆధ్యాత్మికతవైపు తీసుకువెళ్లాలని, నిరంతర విద్యాప్రచారం సాగించడానికి ఆయన పూనుకున్నారు. 1971 లో జాతీయ ఐక్యత కోసం, 1971 ఎన్నికల్లో ఇందిరాగాంధీ విజయంతర్వాత, బంగ్లాదేశ్ క్లిష్ట పరిస్థితుల సందర్భంలో ఆమె అందరకీ విజ్ఞప్తి చేసినప్పుడు, రాజాజీ దానిని అంగీకరించి, సమర్థత, అనుభవంలేని పార్టీలతో సంబంధంలేని వ్యక్తుంచే జాతీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవలసిందిగా, రాజ్యాంగసవరణకు సంబంధించిన ఆలోచనను విరమించుకోవలసిందిగా సూచించారు. నేను అంతకు ముందు చెప్పినట్టుగా, అన్ని ప్రజాస్వామ్య పక్షాలలోను, శ్రీమతి ఇందిరాగాంధీ కాంగ్రెసు పార్టీతో సహా, స్వేచ్ఛను అంగీకరించే వ్యక్తుల దేశభక్తి పరులైన వారిని ఒకటిగా చేసి, ఒక ప్రజాస్వామ్య పార్టీని నిర్మించి, దాని ద్వారా శ్రీమతి ఇందిర నాయకత్వంలో మంత్రి వర్గాలను ఏర్పాటు చేయవలసిందని సూచించారు. ఎందుకంటే ప్రజలు అప్పటికే అంతకు ముందు ఏర్పడి ఉన్న జాతీయ ప్రతిపక్షాల ఫ్రంటును కాదని, శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో ప్రజలు తమ సంపూర్ణ సమర్థనను ఇచ్చారు. నేను చేసిన విజ్ఞప్తుల ఫలితంగా, రాజాజీ గారు పార్టీ కట్టు బాట్లనుండి మాకు విముక్తి కల్పించారు. "మతం ఒక్కదాన్నే మన రాజకీయం కానివ్వండి", రాజకీయాలను ఇప్పుడు వదిలివేసి, అవి అనుకూలంగా క్షేమంగా నెలకొన్న తరువాత, తిరిగి వాటి దగ్గరకు వద్దాం" అంటూ ఎన్నికల ఫలితాల తరువాత కరాకండిగా ఈ మాటలను చెప్పగలిగిన ఒకే ఒక వ్యక్తి ఆయన మాత్రమే.

ఆయన కంటే ఇరవై, ముప్పై సంవత్సరాల తక్కువ వయస్సు కలిగిన రాజకీయ నాయకులనేకమంది, ఉన్నత మైన పదవులను నిర్వహించి, రాజకీయాలనుండి పక్కకు తప్పుకొని, విశ్రాంతి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు, కానీ రాజాజీ జాతీయరాజకీయరంగంలో ప్రముఖులుగా ఉంటూ, తన సలహాలనిస్తూ, ప్రజలను హెచ్చరిస్తూ, తనను విమర్శించేవారిని అభిమానించేవారిని, పట్టించుకోకుండా, దేశానికి తగిన బాటను చూపిస్తూ, ఇప్పటికీ ప్రముఖ వ్యక్తిగా జాతీయ స్థాయిలో ముందునిలబడే ఉన్నారు.

1972 లో పాకిస్తాన్ నియంత యాహ్యాఖాన్ అమలు జరుపుతున్న నిర్బంధ విధానాలను తట్టుకోలేక, బంగ్లాదేశ్ స్వాతంత్ర సమరయోధులు లక్షల కొలది శరణార్థులు దేశాన్ని విడిచిపెట్టి, పారిపోతున్నప్పుడు, వారికి సహాయంచేసే కృషికి ఎక్కువగా ప్రపంచదేశాలు ముఖ్యంగా అమెరికా తోడ్పడంలేదనే విషయంలో, రాజాజీ గారు కూడా మా అందరితో కలిశారు. భారత- సోవియల్ రాజ్యాల మధ్య శాంతి ఒడంబడిక కుదిరిన వెంటనే, రక్తాన్ని ఓడుస్తూ, బాధలననుభవిస్తూ, పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా పోరాడుతున్న బంగ్లాదేశ్ ప్రజల స్వాతంత్ర్యాభిలాషను గుర్తించి, జోక్యం చేసుకోవలసిందిగా, రష్యాను కోరిన తొలివ్యక్తి శ్రీ రాజాజీ. భారత- పాకిస్తాన్ దేశాల మధ్య స్నేహ సంబంధాలకు వేసిన ముందడుగుగా, ఇండో సోవియట్ ఒప్పందాన్ని ప్రస్తుతించిన కొద్దిమందిలో మేమిద్దరం ఉన్నాం. స్వతంత్ర పార్టీలోని కొందరు జనసంఘ్, సోషలిస్టు పార్టీల వారు దీనిపై, తమ భయ సందేహాలను వ్యక్తపరచినప్పుడు, రాజాజీగారు అటువంటి సందేహాలను గురించి, భయపడవలసిన పనిలేదని, ఈ ఒడంబికను మనస్ఫూర్తిగా బలపరచవలసిందని ఆమెకు సలహానిచ్చారు.

పుష్కరం (పన్నెండుసంవత్సరాలు) పాటు కొనసాగిన స్వతంత్రపార్టీ "ప్రస్తుతానికి

మతాన్ని రాజకీయం కానివ్వండి" అని అన్నప్పుడు 'గరీబీ హఠావో' నినాదం వైపు మొగ్గి నేను, నా రాజకీయ అనుచరులతో ఆ వైపు వెళ్లడానికి నిశ్చయించుకొన్నందువల్ల, మరికొందరు జయప్రకాశ్ నారాయణగారి సంపూర్ణ విప్లవంవైపు మళ్లినందువల్ల, అంతరించింది, అయితే మేమందరంకూడా, అవినీతికి, అధికార దుర్వినియోగానికి వ్యతిరేకంగా, నైతిక విలువకోసం పోరాడే విషయంలోనూ అధికారపార్టీ కోటాల, లైసెన్సుల, పర్మిట్‌ల ద్వారా సాగిస్తున్న అవినీతి, అక్రమాలకు ఎదిరించేందుకు, లోక్‌పాల్,లోకాయుక్త వంటి సంస్థల ద్వారా చర్యలు తీసుకొనే విషయంలోనూ ఏకాభిప్రాయంలోనే ఉన్నాం. ఎవరైనా అన్ని సందర్భాలలోనూ, అన్ని విషయాలలోనూ ప్రవర్తించగలరని మనం అనగలమా? నేను ఆయనతో విభేదించిన సందర్భాలు కూడా కొన్నివున్నాయి, అన్ని సమయాల్లో నేను వేసిన అడుగే సరైనదని నేను చెప్పలేను, ఎక్కువసార్లు ఆయన చెప్పిన దాన్ని అంగీకరించే వాడిని. ఇతరుల అభిప్రాయాంకంటే, మా అభిప్రాయాలే సరియైనవనీ, మేముభయులం ఇతరులందరికంటే, ఎక్కువ ఆలోచనకలిగిన వాళ్లమని నేను చెప్పగలనా? ఆయన యెడ నాకున్న పూజ్యభావం కారణంగా, నిజానికి అనేక సందర్భాలలో ఆయన చెప్పిన దాన్ని అంగీకరిస్తూ, మౌనం వహించేవాడిని. మరికొన్ని సందర్భాలలో సంతోషడేవాడినని కానీ, మీకు చెప్పలేను. ఆ మహోన్నత మేధావి ముందు, దశాబ్దాల తరబడి నేను పొందిని అనుభూతి నిశ్శబ్ద సౌందర్యంలాంటిది. శ్రీ మున్షీ గారు కూడా, రాజాజీ గారి ముందు నాలాంటి అనుభూతినే పొందుతూ ఉండేవారు.

1972లో ఆంధ్రోద్యమం నడుస్తున్నప్పుడు, మద్రాసు జనరల్ ఆసుపత్రిలో చివరిఘడియలలో, కొన్ని గంటలు ఆయన పక్కనే ఉండగలిగే అదృష్టం నాకు లభించింది. ఆయనకు అభిమానపాత్రుడైన వైద్యుడు నాకు మంచి స్నేహితుడు అయినందున, అక్కడి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.సత్యనారాయణగారు ఆయన చెవిలో "రంగా మీ దర్శనానికి వచ్చాడని" చెప్పారు. ఆయననిదానంగా కళ్లు తెరిచి, ప్రేమతో కూడిన చిరునవ్వుచిందిస్తు, కొద్దిగా పైకిలేచి, నాముఖంలోకి పరీక్షగాచూసి, తన సహజమైన రీతిలో, ప్రేమపూర్వకంగా నన్ను ఆశీర్వదించారు. "నా రంగా! దేవుడు నిన్ను ఆశీర్వదించుగాక"!

శ్రీ వివేకానంద, శ్రీ తిలక్, శ్రీ గాంధీ, శ్రీ రాజాజీ శ్రీ నెహ్రు, శ్రీ నేతాజీ గారలు, వారి దేశ భక్తి పూరితమై సేవలతో, ఈ శతాబ్దం నాకు కూడా అన్వయించే మాటతో, నన్ను ఆశీర్వదించినట్లు నేను అనుభూతి చెందాను.

17

డాక్టర్ రాజేంద్రప్రసాద్

డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గారు 1884 సంవత్సరంలో జన్మించారు, ఎం.ఏ.బి.ఎల్.డిగ్రీని పొంది కలకత్తా లోనూ, పాట్నా లోనూ న్యాయవాదిగా పనిచేశారు. చాంపరాన్ ఉద్యమ సందర్భంలో 1917వ సంవత్సరంలో మహాత్మాగాంధీ గారితో కలిశారు. 1920వ సంవత్సరంలో సహాయ నిరాకరణోద్యమంలో పనిచేశారు. 1930వ సంవత్సరంలో బీహారులో ఉప్పు సత్యాగ్రహాన్ని నిర్వహించారు. జాతీయవిద్యాబోధన కోసం పాట్నాలో సదాకత్ ఆశ్రమాన్ని ప్రారంభించారు. 1920 నుండి జాతీయ కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు 1934లోనూ తిరిగి 1948లోనూ అఖిల భారత కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నారు.1947-50సంవత్సరాల మధ్య రాజ్యాంగ పరిషత్తుకు అధ్యక్షులుగా ఉన్నారు. 1946-48 సంవత్సరాల కాలంలో కేంద్రప్రభుత్వ ఆహారశాఖ మంత్రిగా పనిచేశారు. 1952నుండి 1962 వరకు తొలి భారత రాష్ట్రపతిగా ఉన్నారు. జాతీయోద్యంలో అనేకమార్లు జైలుకు వెళ్లారు. బీహార్ భూకంపబాధితుల సహాయార్థమై సహాయకార్యక్రమాలు నిర్వహించారు. ఖాదీ హరిజనాభివృద్ధి ప్రచార నిమిత్తమై విస్తృతంగా పర్యటించారు. భారత రాష్ట్రపతిగా ప్రపంచాన్ని చుట్టివచ్చారు. 1962వ సంవత్సరంలో స్వర్గస్తులైనారు, "డి వైడెడ్ ఇండియా" అను తన స్వీయ చరిత్ర గ్రంథాన్ని రాశారు.-(ఎడిటర్).

మహాత్మాగాంధీ గారితో కలసి మన జాతీయోద్యమంలో పనిచేసిన అయిదుగురు ప్రముఖనాయకులలో శ్రీ రాజేంద్రప్రసాద్ గారొకరు. మిగిలినవారు శ్రీజవహర్‌లాల్, శ్రీవల్లభభాయ్ పటేల్, శ్రీమౌలానా అజాద్, శ్రీరాజాజీగార్లు. దేశదాస్య విమోచనం కోసం దీర్ఘకాలం బాధలు అనుభవించారు. వారి జీవితాలను జాతికి అంకితంచేసి తమ సర్వస్వాన్ని త్యాగంచేశారు.రాజాజీ గారు తప్ప మిగిలిన వారంతా ఒకటి లేక రెండుమార్లు అఖిల భారత కాంగ్రెస అధ్యక్షులుగా పనిచేసిన వారే. వారంతా కాంగ్రెస్ కార్యవర్గంలో మొదటినుంచీ కొనసాగుతూ 1920 సంవత్సరం నుంచీ 1948సంవత్సరంలో ఆయన దివంగతుడు కాబోయేవరకూ మహాత్మాగాంధీ గారికి సలహాలనిస్తూ తోడుగా ఉన్నారు. రాజన్‌బాబుగారు బాపూజీ పూర్తి విశ్వాసాన్ని పొందగలిగిన వ్యక్తులు. అటువంటి అదృష్టం అందరికీ కలగదు.

మనకు స్వరాజ్యం రాబోయే ముందరి చివర దినాల్లో పాకిస్తాన్ విభజనను మహాత్మాగాంధీగారు అంగీకరించక పోయినప్పటికి అందుకు భిన్నంగా తామంతా కలసి సమిష్టిగా దానికి అంగీకరించాలనే అభిప్రాయానికొచ్చారు. గారిబాల్డీ రాజకీయరంగాన్ని కేవర్, విక్టర్ ఇమాన్యుయేల్ గార్లకు ఒప్పగించాలని ఇటలీలో భావించినట్లుగానే, గాంధీజీ ప్రధానమంత్రి, రాజ్యాంగ సభ అధ్యక్షులు, శ్రీజవహర్లాల్, శ్రీరాజ్ బాబుగార్ల భుజాలపై ఢిల్లీ భారాన్ని మోపి తాను నవకాలీలో మత కలహాలను నివారించి శాంతిని స్థాపించేందుకు వెళ్లారు. స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు దేశ విభజనను అంగీకరించక తప్పదని యీ అయిదుగురు ప్రముఖనాయకులు

ఒక నిర్ణయాని కొచ్చినపుడు చివరకు మహాత్మాగాంధీ గారికి వారిని ఆశీర్వదించక తప్పలేదు.

జవహర్లాల్ గారు నాలుగు మార్లు కాంగ్రెస్ అధ్యక్షులైనారు. రాజన్ బాబుగారు మూడు దఫాలు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. శ్రీసుభాష్‌చంద్రబోసు కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి రాజీనామా ఇచ్చి వైదొలిగిన తరువాత రాజన్‌బాబు గారు ధైర్యంగా అందులోకి అడుగుపెట్టి కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవీ బాధ్యతలను భుజాలపై వేసుకొన్నారు. తిరిగి మరొక మారు పార్టీ కంట్రోలునుండి తన మంత్రి వర్గానికి విధాన నిర్ణయాలను అమలుచేసే విషయంలో స్వేచ్ఛనివ్వాలని జవహర్లాల్ గారు పట్టుబట్టినప్పుడు దానికి అంగీకరించక అప్పుడు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న ఆచార్య కృపలానీగారు రాజీనామా ఇచ్చారు. అప్పుడు ఆ బాధ్యతలను చేపట్టవలసినదిగా రాజేంద్రప్రసాద్ గారిని కోరినపుడు ఆయన ఆహార శాఖ మంత్రి పదవికి విశ్వాసపాత్రుడైన పార్టీ కార్యకర్తగా రాజీనామా ఇచ్చి కాంగ్రెస్ అధ్యక్షపదవీ బాధ్యతలను చేపట్టారు.

కాంగ్రెస్ అధ్యక్షులందరిలోనూ జవహర్ లాల్ గారి లాగే విస్తృత ప్రజా సంబంధాలుకలిగిన వ్యక్తి డాక్టర్ రాజేంద్రప్రసాద్. 1936 వ సంవత్సరంలో లక్నో కాంగ్రెస్ సభలలో అధ్యక్షులుగా ఎన్నికైన జవహర్లాల్ గారు మూతన పదవీ బాధ్యతలను స్వీకరించడానికి తీవ్రంగా వ్యతిరేకించారు. అయితే అంతకు ముందు అధ్యక్షులుగా ఉన్న శ్రీ రాజన్ బాబు ప్రజలకు సేవచేసేందుకు ఆ బాధ్యతను స్వీకరించక తప్పదని గట్టిగా చెప్పారు. అందుకు ముందు దీర్ఘకాలంగా కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉండి చక్కటి ప్రజా సంబంధాలను కలిగి ఉన్నవ్యక్తి శ్రీ రాజన్ బాబు, ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక దుస్థితి ఏర్పడి ప్రజలు బాధలనుభవిస్తున్న ఈ తరుణంలో వారికి తోడ్పడేందుకు ఈ బాధ్యతను స్వీకరించక తప్పదని చెప్పారు.

ఎక్కువ ప్రజా సంబంధాలను కలిగిన సీనియర్ నాయకులైన శ్రీ రాజన్ బాబు రాజకీయ రంగంనుంచి రాజ్యాంగ సభాధ్యక్ష పదవికి, ఆతరువాత అతి సహజంగా భారత రిపబ్లిక్ అధ్యక్షుల పదవిలోకి రాగలిగారు.

మహాత్మాగాంధీ గారిని, వారి అనుచరులను ఎక్కువ బాధ పెట్టి దేశాన్ని ముక్కలు చేసి స్వాతంత్ర్యాన్ని సంపాదించినందుకు గాను మిగతా వారిలా ఎక్కువ నిందను రాజేంద్ర ప్రసాద్ గారు భరించవలసిరాలేదు.

ఆ అయిదుగురు ప్రముఖనాయకులలో రాజన్ బాబుగారు నాదృష్టికిలోకి అందరికన్నా ముందుగా వచ్చారు. ఉత్తర బీహార్ జిల్లాలలో దాదాపు బానిస చాకిరీ చేస్తున్న ప్రజలు పరంగానూ, చాంపరన్‌లో బ్రిటిష్ తోటల యజమానుల పేరిట గాంధీజీ రైతుల పక్షాన పోరాడడం ప్రారంభించినపుడే రాజన్‌బాబు గారు నా మదిలో మెదిలారు. ఆ ఉద్యమ సందర్భంలో గాంధీజీ ఆయనను ఎంత ప్రేమ పూర్వకంగా ఆహ్వానించారో, కృపలానీ గారు తన సన్నిహిత సహచరునిగా ఆయనను ఎట్లా దగ్గరకు తీసుకొన్నారో, చాంపరన్ రైతులకోసం ఆయన ఎంత గట్టి పోరాటం నడపగలిగారో ఆనాడు మేము తెలుసుకోగలిగాం. ఆయన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉండి భారతదేశమంతా పర్యటిస్తూ ఆంధ్రప్రాంతానికి వచ్చినపుడు నేను., శ్రీమతి భారతీ దేవిగారు గౌరవ పూర్వకంగా ఆయనను విజయవాడలో, నిడుబ్రోలులో , కావూరు

వినయాశ్రమంలో, వేటపాలెం, చినగంజాంలలో కలుసుకున్నాం. రాజేంద్రప్రసాద్ గారికి వ్యతిరేకంగా విజయవాడలో కమ్యూనిస్టులు జరుపతలపెట్టిన నల్లజండాల ప్రదర్శనను నేను వ్యతిరేకించి బుద్ధుని వంటి ఆ జాతీయ నాయకుడికి వ్యతిరేకంగా ఇట్లంటి అమర్యాద పూర్వకమైన కార్యక్రమాలు చేపట్టవద్దని ప్రజలను హెచ్చరించాను.

వార్ధా నుంచి ఢిల్లీ దాకా మూడో తరగతి రైలు పెట్టెలో ఆయనతో కలసి ప్రయాణం చేస్తూనూ, ఆ తరువాత ఢిల్లీలోని మా సమావేశాల సందర్భంలోనూ వారూ మేమూ పరస్పరం సన్నిహితులం కాగలిగాం. భారతీదేవి, ఆయన కూడా ఆస్త్మాతో బాధపడుతూ, ఆ రకంగా ఒకే పడవపై ప్రయాణం చేస్తున్నారు. మూడో తరగతి ఇరుకైన బెంచీ మీద కొన్ని పెట్టెలనుంచి వాటి పక్కనున్న జాగాలో ఆయన విశ్రాంతి తీసుకోవడానికి ఒక పెద్ద బెడ్డింగు ఉంచారు. మేము ఎక్కువ సౌకర్యాలను ఆశించకుండా మా అంతట మేమే కష్టాలను భరించటానికి సిద్ధమై తృప్తిచెందు తున్నప్పటికీ మాతో పాటు అంత గొప్ప జాతీయ నాయకుడు కూడా గాంధేయ విధానాలను ఆచరిస్తూ పేదరికాన్ని అనేక అసౌకర్యాలను భరిస్తూ జీవించడం చాలా గొప్ప విషయంగా మేము భావించాం.

రైతుల కోసం ఒక అఖిల భారత వేదికను ఏర్పాటు చేయాలని నేను చేస్తున్న ప్రయత్నాలను ఆయన సంతోషంతో ప్రోత్సహించారు. ఆ సందర్భంలో 1936 నవంబరు మాసంలో రైతు సంఘాల నిర్వాహకుల అఖిల భారత సమావేశాన్ని మేము మద్రాసులో ఏర్పాటు చేస్తే దానిని ఆయన ప్రారంభించారు. మాప్రయత్నాలకు సర్దార్ పటేల్ గారి వ్యతిరేకతను ఆయన పరిగణన లోకి తీసుకోలేదు. రాజన్ బాబు గారు; శ్రీమతి సరోజినీదేవి నా నాయకత్వంలోని రైతాంగ ఉద్యమం కాంగ్రెసుకు బలంచేకూర్చగలదని గాంధీగారికి చెప్పినందున ఆయన నాప్రయత్నాలను ఆశీర్వదించేందుకు ఇష్టపడ్డారు. రాజన్ బాబుగారు కేంద్ర శాసన సభలో రైతు శాసన సభ్యుల ద్వారా నేను చేస్తున్న ప్రయత్నాలను పారిశ్రామిక పట్టణ ప్రాంతాల ప్రజలకు భిన్నంగా గుర్తించి ఆయన నాప్రయత్నాలలో నన్ను ప్రోత్సహించడం ప్రారంభించారు. స్వామి సహజా నందగారు, నేను ఇదే పద్ధతిలో కాంగ్రెస్ మంత్రి వర్గం ఏర్పడిన తరువాత బీహారు శాసన సభలో ఎం. ఎల్. ఏ.లను సమీకరించి జమీందార్లకు వ్యతిరేకంగా రైతాంగ ప్రయోజనాల కోసం 1936-39 సంవత్సరాలలో కృషిచేయడానికి ప్రారంభించినపుడు మమ్మల్నిక సమర్థించడానికి వీలులేదనే అభిప్రాయానికి ఆయన వచ్చి సర్దార్ పటేల్ గారి వైపు ఎక్కువగా మొగ్గసాగారు, మొత్తంమీద ఆయన సానుభూతి వారి భూములను వారు సాగుచేసు కుంటున్న యదార్థమైన రైతులకు అనుకూలంగనే ఉంది.

1948వ సంవత్సరంలో ఆయన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నపుడు డాక్టరు జె.సి. కుమరప్పగారు అధ్యక్షులుగా వ్యవసాయ సంస్కరణల సంఘాన్ని ఏర్పాటు చేశారు. జమీందారీ పద్ధతిని రద్దుచేసిన తరువాత భూముల యజమానులైన వారి నుంచి పాలాలను కౌలుకు సాగు చేస్తున్న వారి ప్రయోజనాలను కాపాడేందుకై తగు ససూచనలను చేయవలసిందని ఆయన మమ్మల్ని కోరారు. ప్రత్యేకంగా నన్ను ఆ కమిటీలో చేరవలసిందని ఆయన కోరారు. శ్రీ టి.

రాఘవులు ఎం.ఎ.ఎల్.బి. (హరిజనులు) గార్ని వ్యవసాయ కార్మిక ప్రతినిధిగా అందులో నియమించవలసిందన్న నాసూచనను ఆయన అంగీకరించారు, కౌలుదారుల రక్షణకై మేము అనేక శాసనపరమైన మార్గాలను సూచించాం. మేము వారి ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయవలసిందని, వారి వినియోగానికి కావలసిన వస్తువులను సరసమైన ధరలకు లభింపజేయ వలసిందని గూడా ప్రభుత్వానికి సూచించాం. ఆ తరువాత నెహ్రూ గారి ప్రభుత్వం పట్టణ పల్లె ప్రజలను సమానంగా చూడడంలో విఫలమై పట్టణ ప్రాంతాలలోని ఆదాయాలను, వృత్తులలో కొనసాగుతున్న వారి ఆదాయాలను పట్టించుకోక భూములపై మాత్రమే పరిమితులను విధించినపుడు ఆ వికపక్ష రైతాంగ వ్యతిరేక చర్యకు నిరసనగా నేను ప్రారంభించిన తిరుగుబాటుని రాజన్ బాబుగారు మెచ్చుకున్నారు. నెహ్రూగారిని ఆయన మార్గంలో నుంచి మళ్లించగలిగిన స్థితిలో ఆయన లేరు. మా రాజకీయ ప్రయత్నాలకు వారందించే సలహాలకు, సానుభూతితో ఆయన మా కృషిని అర్థంచేసుకోగలుగుతున్నందుకు నేను సంతృప్తిచెందాను.

గాంధీగారి నిర్మాణ కార్యక్రమాలలో ఆయనకు పూర్తి విశ్వాస ముంది. ఆయన కుటీర పరిశ్రమలను బాగా ప్రోత్సహిస్తూ ముఖ్యంగా తన వనరుల నన్నింటిని ఖాదీ అభివృద్ధికై స్వయళ్ళ వృత్తులతో జీవించే ప్రజల రక్షణకై వినియోగించారు.

ఆయన వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు పశు సంపదను అభివృద్ధి చేసేందుకు బాగా కృషిచేశారు. ఆప్రయత్నంలో ఆయన నాసహాయాన్ని ఠాకూర్ దాస్ భార్గవ్ సహాయాన్ని తీసుకొని " గోసంవర్ధన సమితి" ని ఏర్పాటు చేసి తద్వారా బాగా ముసలివై పోయిన ఆవులను అంగవై కల్యం కలిగిన వాటిని గోవధశాలకు తరలింపు పొందకుండా రక్షించి వాటి రక్షణకై కొన్ని గోసంరక్షణ శాలలను ఏర్పాటు చేశారు. ఆయన ఆ విధంగా గాంధీగారి ముఖ్య కోరికలో ఒక దానిని నెరవేర్చారు.

అఖిల భారత వ్యవసాయ ఆర్థిక శాస్త్రజ్ఞుల సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ఆయన మాకు చక్కటి ప్రోత్సాహాన్నందించారు. దానికి ఆయన అధ్యక్షులుగాను నేను ఉపాధ్యక్షునిగాను ప్రముఖ ఆర్థిక శాస్త్రవేత్త శ్రీ నాటు కార్య దర్శిగాను ఉన్నారు. మేము వేర్వేరు వ్యవసాయ పంటల నిమిత్తం పెట్టే ఖర్చుల గురించి, రైతులు వ్యవసాయ కూలీల జీవన వ్యయాన్ని గురించి సమాచారాన్ని సేకరించడానికి పూనుకొన్నాం.

కిసాన్ కాంగ్రెస్, హెండ్ లూమ్ వీవర్స్ కాంగ్రెసు కుటీర పరిశ్రమల, కలంకారీ వృత్తులతో జీవించే ప్రజల కాంగ్రెస్ వంటి సంఘాలన్నింటిని కలిపి గ్రామీణ ప్రజా సంఘాల సమాఖ్యను ఏర్పాటుచేసేందుకు మేము చేస్తున్న ప్రయత్నాలకు ఆయన ఆశీస్సులను సంపాదించు కోగలిగాం. కిసాన్ కాంగ్రెస్‌కు దానికి సంబంధించిన బియ్యం, గోధుమ, వేరుశనగ, పత్తి, కొబ్బరి, వక్కల వంటి వేర్వేరు ఉత్పత్తి సంఘాలకు ప్రభుత్వం గుర్తింపు నిచ్చేందుకు ఆయన సంతోషంతో అంగీకరించారు.

రాజన్ బాబుగారు ఆహార వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బ్రిటిష్ వారు ప్రారంభించిన కంట్రోలు, రేషనింగు, నిర్బంధ ధాన్య సేకరణ వంటి వాటి వలన, అవినీతి కారణంగా దేశం తీవ్రమైన ఆహార కొరతనెదుర్కొంటూ ఉంది. రైతాంగ ఉద్యమంలో ఉన్న

మాలాంటి వారమంతా బ్రిటిష్ వారు ప్రారంభించిన ఈ కంట్రోళ్లను ఎత్తివేయాలని గట్టిగా అరవసాగాం. అధికారంలోకి రాక ముందు వాటిని వ్యతిరేకించిన జవహర్లాల్ గారు అధికారాన్ని చేపట్టిన తరువాత వాటికి అలవాటై పోయి నిర్బంధ ధాన్యసేకరణ విధానాన్ని రద్దుచేస్తే ధరలపై అదుపు ఉండదని రేషన్ షాపుల ద్వారా చౌకగా మనం వాగ్దానం చేసిన విధంగా ప్రజలకు ఎలా ఆహారధాన్యాన్ని అందించగలమని అడగసాగారు. మా మధ్య కొన్ని ఉద్రేక పూరితమైన చర్చలు జరిగాయి. పార్టీ కార్యవర్గ సమావేశాలలోనూ ఇతరత్రా జరుగుతున్న ఆ సంఘర్షణలను పరస్పర భేదాభిప్రాయాలో గూడిన చర్చలను మంత్రిగాఉన్న రాజన్ బాబుగారు తన చిరునవ్వులతో చల్ల బరుస్తూ దాట వేస్తుండేవారు. అవాంఛనీయంగా పైన బడుతున్న పోలీసు చర్యల కారణంగాను కమ్యూనిస్టుల గూండాయిజం కారణంగానూ రేషన్ షాపులలోని అవినీతికార్యకలాపాల వల్ల బ్లాక్ మార్కెట్లో ధాన్యాన్ని సంపాదించుకోవలసిన పరిస్థితుల్లో ఉన్న పట్టణకార్మికుల ఇబ్బందులను గ్రహించి, రైతుల పట్ల సానుభూతితో గాంధీజీ తమ ప్రార్థనా సమయ ప్రసంగాన్ని చేసేందుకు నేను ఆయనను అంగీకరింప జేయగలిగాను, కొన్ని మాసాల పాటు రాజన్ బాబుగారు నెహ్రూగారి అభిమాన పాత్రమైన కంట్రోళ్లను అమలుచేసేందుకు ప్రయత్నించారు. గాంధీగారు ప్రతిరోజూ తన ప్రార్థనా సమయంలో కంట్రోళ్లను ఎత్తివేయమని కోరుతున్నందు వల్ల కంట్రోళ్లను పునఃసమీక్ష చేయవలసిందని పార్లమెంటులో నేను వత్తిడి తెస్తున్నందువల్ల ఆయన ఎక్కువగా మానసిక వ్యధలను భరించవలసి వచ్చింది.

ఆహార ధాన్యాలపై అమలు చేస్తున్న కంట్రోళ్లను తిరిగి సవ్యమైన పద్ధతిలో సమీక్ష చేయకుంటే, రైతులను బ్లాక్ మార్కెట్ దార్లుగా కాకుండా ఆహార ఉత్పత్తిదార్లుగా చూడడానికి అలవాటు చేసుకోపోతే, తాను నిరసన దీక్షకు పూనుకోగలనని గాంధీజీ హెచ్చరించారు. ఆ సమయంలో రాజన్ బాబుగారు ఆహారధాన్యాలపై కంట్రోళ్లను ఎత్తివేయడానికి తనను అనుమతించకపోతే రాజీనామా చేయగలనని అన్నారు, దానితో నెహ్రూగారు దిగి వచ్చి కంట్రోళ్లను ఎత్తివేసేందుకు అనుమతించారు. అప్పుడు రాజన్ బాబుగార్కి గాంధీజీని సంతృప్తి పరచగలిగానన్న ఆనందం ఇద్దరు పెద్దనాయకుల మధ్య నలిగి పోకుండా బైట పడగలిగినందుకు లభించే తృప్తి కలిగాయి.

రాష్ట్రపతి శ్రీ రాజేంద్రప్రసాద్ గారు, మన ప్రధాని శ్రీ జవహర్లాల్ నెహ్రూగారు మన పార్లమెంటరీ విధానానికి విలువను చేకూర్చే విధంగా కొన్ని ఉత్తమ సాంప్రదాయాలు, ఆచారాలతో కూడిన రాజకీయ సంబంధాలను నెలకొల్పారు. ప్రధాన మంత్రి ఒక పద్ధతి ప్రకారం రాష్ట్రపతిని కలుసుకొంటూ ప్రభుత్వ నిర్ణయాలను గురించి ఆయనకు వివరిస్తూ జాతీయ అంతర్జాతీయ వ్యవహారాలపై ఆయనతో చర్చిస్తూ ఆయన సలహాలను పొందుతూ ఉండేవారు. ఆవిధంగా వారు ప్రభుత్వ ముఖ్యుని మధ్య, రాజ్యాంగ పరమైన అధినేత మధ్య పరస్పర సంబంధాన్ని అట్టి పెడుతూ రాజ్యాంగ అధినేతగా ఏనిర్ణయాలైనా తీసుకుంటూ ఉంటే వాటిని గురించి తెలుసు కొంటూ పునరాలోచనకు సూచనలందిస్తూ లేక పునర్విచారణ చేయవలసిందని అడుగుతూ ఆతరువాత తన ఆమోదాన్ని తెలియజేస్తూ దేనిని తాను ఎందుకు అంగీకరించాడో తెలుసుకొని ఆతరువాత ఆ అంశాలు తన ముందుకు వచ్చినపుడు సంతకం

పెట్టకుండా ఉండడానికి వీలులేకుండా ముందు గానే పూర్తి అవగాహనకు వస్తూ ఉండేవారు.

మంత్రి వర్గాన్ని తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవలసిందని లేదా సరిదిద్దుకోవలసిందని లేదా మార్చుకోవలసిందని తాను ఎంత మేరకు ఆదేశించగలననే సందేహం శ్రీ రాజన్ బాబుగారికి వచ్చింది. దానిని ఆయన పరీక్షకు పెట్టాలనుకొని హిందూ వారసత్వ చట్ట సవరణ బిల్లును మంత్రి వర్గం పూర్తిచేయనున్న సమయంలో తన నిర్ణయాన్ని ఒకసారి మళ్లీ సరిదిద్దు కోవలసిందిగా ఆయన కోరారు. మంత్రి వర్గ నిర్ణయాలను ఆటంక పరిచేందుకుగానీ వాటిని తిప్పికొట్టేందుకుగానీ రాష్ట్రపతి జోక్యం చేసుకొనేందుకు ప్రధానమంత్రి అంగీకరించలేదు. తనకు తాను శక్తి వంతుడుగా నిలబడేందుకు అన్ని పందేహాలను పక్కకు నెట్టి జవహర్లాల్ గారు భారత రాష్ట్రపతి పదవి ఇంగ్లండు రాజుగారి లాంటిదేనని ఇంగ్లండు రాజుగారి అధికారాలకు మించిన ఎట్లాంటి అధికారాలు ఆయనకు లేవని ఏవిషయంలోనైనా మంత్రి వర్గం మాత్రమే తుది నిర్ణయం చేయగలదని ఆయన ప్రకటించారు. అనేక మంది బాధ్యత కలిగిన రాజకీయ నాయకులు జవహర్లాల్ గారితో సమానమైన అధికారాలను రాజన్ బాబుగారు సాధించగలిగారని ఈ రోజు వరకు గూడా అభిప్రాయ పడుతుంటారు. అయితే రాజేంద్రప్రసాద్ గారు రాజ్యాంగ సంక్షోభానికి దారితీయకుండా పార్లమెంటును; ప్రధానిని వారంతట వారిని ముందుకెళ్లనిచ్చారు. ఆయన ఓర్పు, సర్దుబాటు తనం, రాజ్యాంగ విషయాలలో ఉన్న దక్షత, పాకిస్తాన్, ఇండోనేషియా అనేక లాటిన్ అమెరిక్కా రాజ్యాలలో జరిగినట్లుగా రాజ్యాంగాన్ని విఫలం కానివ్వకుండా కాపాడగలిగి దానికి బలంచేకూర్చాయి.

రాజేంద్ర ప్రసాద్ గారు చూపెట్టిన సాంప్రదాయాలకు, రాజకీయ పరిమితులకు లోబడి రాష్ట్రపతి రాధాకృష్ణన్ గారు ఆయన చూపిన మార్గానికి పదును పెట్టారు. చైనా దండయాత్ర సమయంలో దేశం పార్లమెంటు కృష్ణమీనన్ గారితో సహా ఆయన మంత్రివర్గ సభ్యులను కొందరిని తొలిగించమని ఒత్తిడి చేసినపుడు, ప్రజాస్వామ్య రాజ్యాలనుండి ఆ సమయంలో అండ లభించడానికి వీలుగా నెహ్రూజీకి సలహా యిచ్చి రాధాకృష్ణన్ గారు రాజేంద్రప్రసాద్ గారి మార్గానికి ప్రత్యేకించి మెరుగులు దిద్దారు. అసహనంతో ఉన్న కొందరు మన పార్లమెంటరీ నాయకులు చెప్పినట్లుగా రాధాకృష్ణన్ గారు విని ఉన్నా లేక అప్రదిష్టపాలైన మంత్రులను తొలగించేందుకు జవహర్లాల్ గారు సిద్దంకాకున్నా ఏమి జరిగేది. అయితే ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండకపోవు. తాము రాష్ట్రపతి అభ్యర్థిగా, పార్లమెంటరీ బోర్డు ఆమోదించిన అభ్యర్థి అని కాకుండా రాజేంద్రప్రసాద్ గారి అడుగు జాడంలో నడిచే శ్రీ వి.వి.గిరి గారిని రాష్ట్రపతిగా, శ్రీమతి ఇందిరాగాంధీ ఆమె అనుచరులు ఎన్నికయ్యేలా చూడడం జరిగింది. ఈ శతాబ్దంలో రాజేంద్రప్రసాద్ గారు ముందు దృష్టితో స్థాపించిన రాజ్యాంగ సాంప్రదాయ విలువలను ఈ చర్య వెలుగులోనికి తెచ్చింది.

బీహార్ బౌద్ధ సాంప్రదాయాలను పదిల పరచుకొంటూ జీవించే ఒక ఉన్నత మానవతా వాది ఆయన. అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడారు. వెనుకబడిన తరగతుల వారికి, ఆటవిక జాతులకు సహాయపడ్డారు. ఆటవిక ప్రాంతాలుగా గుర్తింపు ఉన్న ప్రదేశాలలో నేను నిర్వహించిన ఒక ఆటవిక ప్రజాసభకు ఆయన అధ్యక్షత వహించారు. గిరిజనుల రక్షణకోసం, వారి అభ్యుదయంకోసం రాజ్యాంగ సభద్వారా ఆయన తగు రక్షణ కల్పించారు.

శ్రీ రాజా మహేంద్ర ప్రతాప్

బృందావన్‌కు చెందిన శ్రీ రాజా మహేంద్ర ప్రతాప్ 1-12-1886 న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో అలిఘర్ జిల్లాలోని మార్సన్‌లో జన్మించారు. స్వాతంత్ర సమరయోధులకు ఆయన గురువు లాంటి వారు. 1906నుంచి 1952 దాకా జపాన్ వంటి దేశాలలో ప్రవాస జీవితం గడుపుతున్నప్పటికీ, ఆయన అనధికారికంగా కాంగ్రెస్ సభ్యులే. 1-12-1915 న కాబూల్‌లో ఏర్పాటు చేసిన తొలి హింద్ ప్రభుత్వానికి ఆయన వ్యవస్థాపక అధ్యక్షులు. ఆస్ట్రనిస్తాన్‌లో ఏర్పాటు చేసిన ప్రభుత్వం పక్షాన, ఆయన రష్యా, అమెరికా, జపాన్, చైనా దేశాలను భారతదేశ స్వాతంత్ర పోరాటాలను బలపరచవలసిందిగా అభ్యర్థించారు. జపాన్ దేశంలో 1940లో "ప్రీ ఇండియా" సొసైటీని ఆయన ప్రారంభించారు. బ్రిటిష్ ప్రభుత్వం వారు ఆయన ఆస్తులను జప్తుచేశారు. నాజీవిత కథ అవి ఆయన రాసిన గ్రంథం చాలా ఉత్సాహ భరితమైంది. ప్రపంచరాజ్యాల సమాఖ్యపట్ల ఆయనకు విశ్వాసముంది. ప్రపంచ శాంతి గురించి ఆయన ప్రచారం చేస్తూ ఉండేవారు. బ్రిటిష్ వారు జప్తు చేసిన ఆయన ఆస్తుల నన్నింటిని ఆయకు తిరిగి ఇచ్చివేసేందుకు వీలుగా పార్లమెంటు ప్రత్యేక శాసనాన్ని ఆమోదించింది- (ఎడిటర్).

శ్రీ రాజా మహేంద్ర ప్రతాప్ గారి పేరు వారు శాంతియుత పోరాటాలలోగాని, లేదా హింసాత్మక మార్గాలలోగాని ఎందులో విశ్వాసం ఉన్న వారైనా స్వాతంత్ర సమర యోధులలోని గుండెల్లో ఒక ఆరని జ్యోతి లాగా వెలుగుతూండేది.

మన స్వాతంత్రానికి పూర్వం ఉన్న యువకులందరి చేత శ్రీ నేతాజీ సుభాష్‌చంద్రబోసు ఆరాధన పొందారు. స్వాతంత్ర భారతప్రభుత్వాన్ని గురించి వారు కంటున్న కలలకు ఒక రూప మిచ్చారు. ఆయన ఆజాద్ హింద్ ఫౌజ్, చలో ఢిల్లీ, జై హింద్ నినాదాల నిచ్చి యువకులలో ఉద్రేకాన్ని ఉవ్వెత్తున లేపారు. మన జాతి పిత బాపూకు తోడుగా వెనుక ఉన్న పంచ పాండవులుగా మనం శ్రీ జవహర్, సర్దార్ పటేల్ గారు, శ్రీ రాజన్ బాబు, శ్రీ రాజాజీ, శ్రీ అజాద్ గార్లను గౌరవిస్తాం నేతాజీ గారు అలాకాక ప్రత్యేకంగా మన హృదయాలలో వెలుగొందుతూ ఉంటాడు. అంతకు ముప్పయి సంవత్సరాల ముందే రాజా శ్రీ మహేంద్ర ప్రతాప్ స్వతంత్ర భారత మాతను గురించి ధైర్యంగా కలలుగన్నారు. నేతాజీగారి ఆలోచనలలాగే ఆయన ఆలోచనున్నా, సామ్రాజ్యవాదుల బానిస సంకెళ్లనుండి భారతదేశాన్ని బైటకు లాగేందుకు వీరసావర్కర్ మార్గానికి చాలా దగ్గరలో ఆయన ఉన్నారు. 1856 స్వాతంత్ర ఉద్యమంలో మరచి పోయిన స్వతంత్రభారత ప్రభుత్వ స్థాపనను ఆయన 1-12-1915న పూర్తిచేసి దానికొక ఆవేశాన్ని, నిర్మాణాత్మక దృష్టిని కలిగించారు. ఆయన ఆస్ట్రనిస్తాన్, రష్యా, జర్మనీ దేశాలగుండా ప్రయాణం చేస్తూ అట్లాంటిక్, ఫసిఫిక్ సముద్రాలు రెంటినీ దాటి అనేక దేశాలలో స్వేచ్ఛాభారత దేశానికి గుర్తింపును సంపాదించేందుకు, మిత్రులను కనుగొనేందుకు పర్యటించారు. రాజకీయంగా భాతదేశానికి స్వాతంత్రం సంపాదించాలనే కృషిలో గద్దర్, హర్‌దయాల్

ముఠాలను కామఘట సోదర సంఘాన్ని ఆయన ప్రోత్సహించారు. కొన్ని దేశాల పరిపాలకులు ఆయన చెప్పేవి వినేటట్లు చేసుకొన్నారు. బెంగాలీ బాంబుల తోను, పంజాబ్ కలాలతోను, పిస్టళ్లతోను, కాన్పూర్ బుల్లెట్లతోను జాతీయ స్వాతంత్ర పోరాటంలో పాల్గొనేందుకు దేశభక్తులైన అనేకమంది ప్రజలు పథకాలు తయారుచేసేందుకు, ధైర్యంగా పోరాడేందుకు అవసరమైన ఒక నూతన దృష్టిని ఆయన స్వాతంత్ర్య పోరాటంలోకి ప్రవేశ పెట్టగలిగారు. దీని వలన మానసిక అశాంతి తప్ప ఒనగూడిన ప్రయోజనమేమీలేదు. వీరసావర్కార్‌ను అండమాన్ పంపారు. గద్దర్ వీరులు దుర్మరణం పాలయ్యారు. దీర్ఘకాలం రాజా మహేంద్ర ప్రతాప్ భారతదేశ స్వాతంత్రాన్ని గురించి వివిధ దేశాల నాయకులతో సంప్రదిస్తూ విదేశాలలోనే గడపాల్సివచ్చింది. ఇతరులను భయపెట్టేందుకు ఆయన ఆస్తులను బ్రిటిష్ ప్రభుత్వం జప్తుచేసింది. దేశభక్తులైన అమెరికాలోని భారతీయ సిక్కులను తమకు దొరికి పోయినపుడు, ఆ శిక్షలు మహేంద్ర ప్రతాప్‌గారికి కానప్పటికీ వారిని కఠినమైన ఇబ్బందుల పాలుచేశారు.

చివరకు మహేంద్రప్రతాప్ భారత దేశ స్వాతంత్ర్యం కోసం ఆరని జ్యోతిలాగా వెలుగుతూ 25 సంవత్సరాలకు పైగా జపాన్ దేశంలోనే ఉండిపోవలసి వచ్చింది. దేశభక్తులైన భారత నాయకులు శ్రీపురుషోత్తముడు , శ్రీ చంద్రగుప్త, శ్రీ రాజేంద్ర చోళ, కాకతీయ నాయకులు, శ్రీ రాణాప్రతాప్, శ్రీ శివాజీ, శ్రీ కట్టబ్రహ్మన శ్రీ సీతారామరాజు, శ్రీ భగత్ సింగ్ గార్ల దేశ భక్తిని ప్రదర్శిస్తూ ఆరని ఒలింపిక్ జ్యోతిలాగా తానొక్కడే ఇన్నేండ్లుగా ఈ స్వాతంత్ర్య జ్యోతిని ఆరనివ్వకుండా వెలిగించగలిగి నందుకు దేశభక్తి పరులైన భారతీయులందరూ ఆయనకు రుణపడి ఉన్నారు. ముప్పయి సంవత్సరాలుగా నమ్మకంతో భారతదేశ స్వాతంత్ర్యంకోసం ఎదురు చూస్తూ ఆయన గడిపారు. స్వాతంత్ర్య సముపార్జన ద్వారా భారతదేశం గూడా ఆయన నమ్మకాన్ని నిజంచేసింది. భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత తిరిగి భారతదేశానికి రావలసిందిగా ఆయన్ను ఆహ్వానించింది. స్వతంత్ర భారత పార్లమెంటు జప్తుచేసిన ఆయన ఆస్తులను తిరిగి ఆయనకు ఇచ్చేందుకు ప్రత్యేక శాసనాన్ని ఆమోదించింది. రాజులు, మహారాజులు అంతా తమ ప్రత్యేక అధికారాలను కోల్పోయినప్పటికి రాజా మహేంద్ర ప్రతాప్‌గారు మాత్రం దేశ భక్తి పూరితులైన స్వేచ్ఛా భారత హృదయాలలో ఎప్పటికీరాజే.

వయస్సులో గొప్పవారు, ప్రపంచశాంతి, విశ్వమానవరాజ్యం గురించి బంగారు కలలుగనే ఉన్నత మానవులు, ప్రేమ సామ్రాజ్యపు తపస్వి, అయిన ఆయన మన మధ్య ఉండడం మన తరం పంచుకున్న అదృష్టం. ఆయన అయిదు సంవత్సరాలపాటు మన లోక్ సభలో సభ్యులుగా ఉండడం మన అదృష్టం. నేను పార్లమెంటులో ఆయనతో పాటు సహసభ్యునిగా ఉండే అదృష్టాన్ని పొందాను. మధుర బృందావనంలోని "ప్రేమ మహా విద్యాలయం" లో ఆయన అతిధిగా, మన స్వాతంత్ర సమరయోధుల గౌరవార్థం అక్కడ సభ జరిగిన సందర్భంలో నేనున్నాను.

శ్రీ దండు నారాయణ రాజు

1920-22 సంవత్సరాలలో సహాయ నిరాకరణోద్యమం బ్రిటిష్ ప్రభుత్వ అధికారానికి వ్యతిరేకంగా ఉవ్వెత్తున ప్రారంభమైంది. కొత్తగా పునరుద్ధరించి శాసన సభలలోని ఎక్కువమంది సభ్యులు ఏర్పాటు చేసిన మంత్రి వర్గాలు, అందులో సగానికి పైన లోకమాన్య తిలక్ గారు. ఆ సమయంలో అనారోగ్యంగా ఉన్నప్పటికి ఆయన ఆశీస్సులతో మహాత్మాగాంధీ నాయకత్వంలో ఏర్పడ్డవి కూడా బ్రిటిష్ అధికారపు మూల స్తంభాలను పెకలించడానికి సిద్ధమయ్యాయి. స్కూళ్లు, కాలేజీలు, న్యాయస్థానాలు మాంచెస్టర్ నుంచి దిగుమతైన గుడ్డలను బహిష్కరించటం ప్రారంభించాయి.

అదే సమయంలో సర్ టి. త్యాగరాజ చెట్టియార్, డాక్టరు టి. యం. నాయర్ గార్లు ఆంధ్రప్రాంతంలో ప్రముఖులైన శ్రీ కె.వి.రెడ్డి, పానగల్ రాజాగారు శ్రీ కె. జి. కృష్ణయ్యగారు ఇంతవరకు అడుగున పడి ఉన్న మెజారిటీ ప్రజలైన బ్రాహ్మణేతరులను రాజకీయ రంగంలో ముందుకు తీసుకొచ్చి సమానస్థాయికి పెంచేందుకు గాను బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని ప్రారంభించారు. ప్రతి బ్రాహ్మణేతరుడు అతను న్యాయవాది కానీ, వైద్యుడు కానీ, విద్వాంసుడు కానీ అప్పుడు బాగా ప్రాముఖ్యత వహిస్తున్న కులాలలోనుంచి ముందుకొచ్చి మౌంట్‌ఫర్ట్ సంస్కరణల ద్వారా వస్తున్న నూతన శాసన సభల ఎన్నికలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు సిద్ధంకాసాగారు. నిజానికి అప్పుడు అనేక మంది బ్రాహ్మణ న్యాయవాదులు, డాక్టర్లు మాత్రమే మంచి పేరు ప్రఖ్యాతులు కలిగి చేతినిండా ఆదాయంతో రాజకీయ అధికారం కోసం ఉవ్విళ్లూరుతున్నారు. అయితే వారి నాయకులు అనేకమంది స్వరాజ్యం తప్ప ఇతర ప్రతిపాదన లేవీ ఇష్టంకాదని ప్రకటించసాగారు. సంపూర్ణ స్వరాజ్యం తప్ప ఇతరమైన దానిని దేనినీ అంగీకరించమని, పూర్తి అధికారాలు లేని బ్రిటిష్ సంస్కరణ ద్వారా లభించే రాష్ట్ర ప్రభుత్వాలను గురించి వారి నాయకులనేక మంది అసంతృప్తి చెంది బాగా వ్యతిరేకించసాగారు.

అందువల్ల అనేక మంది బ్రాహ్మణ నాయకులు గాంధీజీ సహాయ నిరాకరణ కార్యక్రమాన్ని బాగా ప్రస్తుతిస్తూ జాతీయ కాంగ్రెసు వారు చేపట్టిన జాతీయ పోరాటాలలో ప్రముఖంగా పాల్గొన సాగారు. బ్రాహ్మణేతర నాయకులు ఎన్నికల పోరాటాలలోకి ప్రవేశించి తమకు దొరికిన ఈ అవకాశాన్ని సరిగా ఉపయోగించుకొని అధికారం చేపట్టాలని ఆరాటపడసాగారు. ఆ సమయంలో భారతదేశాన్ని భాషా ప్రయుక్తంగా విభజించాలనే నినాదంపై ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు కోసం స్థాయి నాయకులుగా పనిచేస్తున్న దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు, వైద్యులు డాక్టర్ పట్టాభి, శ్రీసుబ్రహ్మణ్యంగారు, న్యాయవాదులు శ్రీ బి.సాంబమూర్తి, శ్రీ సీతారామశాస్త్రి, శ్రీ ఓరుగంటి వెంకటసుబ్బయ్యగార్లు, బారిష్టర్లు శ్రీ టంగుటూరి ప్రకాశం శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శ్రీ ఎన్. వి.ఎల్. నరసింహారావుగార్లు, ఎడింబర్గ్‌లో విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకొని వచ్చిన విద్వాంసులు శ్రీ డి. గోపాలకృష్ణయ్య వారి

వారి వృత్తులలో ప్రముఖస్థానాల్లో ఉన్నవారంతా 1910-12 సంవత్సరాల మధ్య ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ గాడిచర్ల హరి సర్వోత్తమరావు ఎం. ఏ. గారితో కలసి ఆంధ్ర ప్రాంతంలో గాంధేయ ఉద్యమానికి మొదటి మేధావి దళంగా ఏర్పడ్డారు. బ్రాహ్మణేతర మేధావులు అప్పట్లో ఉన్న కొద్ది మంది మాత్రమే బ్రిటిషు అధికారులు కల్పించిన అధికార ఆకర్షణల లోనికి జారిపోయారు. ఆ సంధి సమయంలో బ్రాహ్మణేతర మేధావులలో ప్రాభవాన్ని స్థాపించటానికి కాంగ్రెస్ ప్రయత్నించ సాగింది. బ్రాహ్మణేతర మేధావులలో కొంతమంది వెనుదిరిగి వచ్చినప్పటికి ఎక్కువమంది అధికార వ్యామోహపరమైన కారణంతోనే గాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడడం ఇష్టం లేక కూడా ఈ వైపుగా ముందుకు రాలేదు. ఏలూరులో ప్రముఖన్యాయవాదిగా ఉంటున్న దండునారాయణ రాజుగారు, డాక్టరు వరదరాజులు నాయుడుగారు., తమిళనాడు నుండి చిదంబరం పిళ్లేగారు, రాజమండ్రి నుంచి బారిష్టరు కే.వి. రామస్వామిగారు బ్రాహ్మణేతర మేధావులలో నుంచి ధైర్యంగా ముందుకొచ్చి గాంధీజీ సహాయ నిరాకరణోద్యమంలో కాలుమోపారు. వారు వారి వృత్తులను వదలివేసి శాసన సభలలోనికి ప్రవేశించగలిగే బంగారు భవిష్యత్తును గాలికి నెట్టివేసి తమ సర్వస్వాన్ని పోగొట్టు కోవడానికి సిద్ధమై జైళ్లకు వెళ్లేందుకు అన్ని రకాల కష్టాలను ఆహ్వానిస్తూ ముందునిలిచారు.

శ్రీమాగంటి బాపినీడు గారి సతీమణి శ్రీమతి అన్నపూర్ణ, ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికా వెళ్లి అక్కడ కాలిఫోర్నియా విద్యాలయంలో ఉన్న ఆమె భర్తను కలిసే సమయంలో ఆమె విదేశీ వస్తువులను బహిష్కరిస్తూ గాంధీగారి ఉద్యమంలో పాల్గొని విజయవాడలో ఆమెకై సిద్ధంచేసిన విలువైన విదేశీ వస్త్రాలను నడివీధిలో అగ్నికి ఆహుతిచేసిన మొట్టమొదటి ఆంధ్ర మహిళ. ఆ తరువాత ఆమె విదేశీ విద్యాభ్యాసాన్ని గూడ బహిష్కరించింది. బాపినీడు గారు, నేను మహాత్మాగాంధీగారి నాయకత్వాన్ని అంగీకరించి మా విద్యాభ్యాసం పూర్తయ్యేంతవరకు 1923వ సంవత్సరం దాకా వేచి ఉండి భారత దేశం తిరిగి వచ్చిన వెంటనే కాంగ్రెస్ సంస్థలో చేరాం. ఆ విధంగా దండు నారాయణ రాజుగారు శక్తివంతమైన ఆంధ్ర క్షత్రియ వంశంలోనుంచి ముందు వచ్చిన మేధావిగా మొదటి సారిగా కాంగ్రెస్ పక్షంలోనికి వచ్చిన అయిదుగురు ప్రముఖ బ్రాహ్మణేతర న్యాయవాదులలో ఒకరిగా దేశమాత సేవలకై తమకున్న సర్వస్వాన్ని అర్పించి జీవితాంతం జాతీయ సేవలో నిమగ్నులై ఉండి ఉన్నతులుగా నిరూపితులయ్యారు.

రాజుగారు అంత పొడవూ గాకుండా పొట్టిగాకుండా గట్టి శరీర నిర్మాణంతో చూడడానికి చాలా మృదువుగా కనిపిస్తుంటారు. ఆయన పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించిన మధ్యతరగతి క్షత్రియ దండు వంశంలో నుండి వచ్చారు. (దండు అనేపదానికి అర్థం పోరాటానికి సిద్ధంగా వున్న సమూహము అని) కోర్టులో గాని, ప్రజావేదికలపై గాని ఆయన ఏదైన ఒక విషయాన్ని వివరించేటప్పుడు చాలా జాగ్రత్త తోనూ ఎక్కువ స్థాయిలోను ఉండే విధంగా తన ప్రసంగాలను మలచుకుంటూ వినిపిస్తుండేవారు. ఆయన ప్రసంగాలు అదే జిల్లాకు సంబంధించిన ప్రముఖ పండితుడు శ్రీ యం.రామచంద్రరావు గారి ప్రసంగాలను పోలిఉంటాయి. ఆయన కాంగ్రెసు పార్టీ నిర్మాణ కార్య క్రమాల్లో ఎక్కువగా శ్రద్ధవహించారు. ఆయన ఆ జిల్లా

రైతాంగంలో గొప్ప ఆదరణను పొందారు. భూమిశిస్తు పెంపుదల, లోకల్ బోర్డులలో జరుగుతున్న పరిపాలనా పరమైన దోషాలు, రెవిన్యూ శాఖ, పి. డబ్యు.డి., రిజిస్ట్రేషన్, పోలీసు శాఖలలో జరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా శ్రద్ధవహించి పనిచేశారు.

1926 సంవత్సరంలో కాంగ్రెసు వారు బహిష్కరణ కార్య క్రమాలను ఉపసంహరించి శాసనసభలకు వెళ్లేందుకు నిర్ణయించుకున్నపుడు, ఆయన మద్రాసు శాసన సభ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఆయన రామచంద్రరావుగారి లాగానే రైతాంగ విషయాలపై ప్రత్యేక శ్రద్ధ వహించిన ఆయన సిద్ధాంతాలకు నమ్మకమైన వారసుడిగా ఉంటూ తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలలో 18 3/4% భూమిశిస్తును పెంపుదల చేయాలని హోల్డ్స్ వర్త్ గారు ప్రతిపాదన చేసినపుడు హోల్డ్సవర్తు రిపోర్టును ప్రతిపాదనలను పరిశీలించేందుకు శాసన సభ్యులతో కూడిన అఖిల పక్ష సంఘాన్ని నియమించాలని ఆయన ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సాధించారు. రామచంద్రరావు గారి సాంప్రదాయ రీతుల్లో నిజానికి ఇది ఒక ఘన విజయం. ప్రభుత్వం వారు ఆసంఘానికి కార్యదర్శిగా ఒక ఐ.సి.ఎస్. అధికారిని నియమించాలని తలచినపుడు ఆయన దానికి అంగీకరించక ఒక అనధికార ఆర్థికశాస్త్రవేత్తను అందుకు నియమించాలని పట్టుబట్టి ఒప్పించారు. ఆకమిటీ సమర్థవంతంగా కృషిచేయడానికి ఆయన సలహామేరకు నన్ను అందులోకి తీసుకున్నారు. అ అత్యున్నతాధికారులుగల సంఘంలో పనిచేస్తున్న ఆరెండు సంవత్సరాల కాలంలో నాకు రాజుగారితో బాగా దగ్గర సంబంధాలేర్పడ్డాయి. రాజుగారు కాంగ్రెసు పార్టీ వ్యవహారాలలోనూ శాసన సభా వ్యవహారాలలోనూ తగిన విధంగా వ్యవహరిస్తూ కార్యకర్తలతో చక్కటి వ్యక్తిగత సంబంధాలను కలిగిఉంటుండేవారు. ఆయన రీసెటిల్‌మెంట్ ఎకనమిక్ ఎంక్వయిరీ కమిటీకి కన్వీనరు అయినప్పటికీ నేను చేసిన కృషిలోని శాస్త్రీయ దృష్టికి సంతోషించి నాశ్రద్ధను గమనించి ఆయన బాధ్యత లన్నిటిని నాపై వదలిపెట్టారు. ఆయన నలుగురితో కలసి పనిచేసే విషయంలో మంచి కలుపుగోలు తనంతో వ్యవహరిస్తూ, ఇతర పార్టీల వారి నుంచి తోటి ఎం.ఎల్.ఏ, ల నుంచి ఆయన మంచి గౌరవాభిమానాలను పొందుతూ ఉండేవారు. మాకమిటీ సిఫార్సులను సభ్యులందరి చేత స్వరాజ్యపార్టీ, జస్టిస్ పార్టీ, స్వతంత్రసభ్యులు, ఇండిపెండెంటు సభ్యులు, మాజీ మంత్రి రిచైర్డు సూపరింటెండెంటు ఇంజనీరు దానికి చైర్మన్ అయిన ఆరోగ్యస్వామి మొదలియార్ గారిచేత మొత్తం ఏకగ్రీవంగా ఆమోదింప జేయడంలో ఆయన చూపెట్టిన సామర్థ్యం అంత స్వల్పమైనది కాదు.

రాజుగారు ఖాదీ ఉత్పత్తి కార్యక్రమానికి కూడా సమంగా ప్రాధాన్యత నిచ్చి వారి స్వంత జిల్లాలో గాంధీ ఆశ్రమం నిర్వహించారు. 1940 సంవత్సరం నాటికి ఆయన ఆజిల్లాలో కాంగ్రెసు పార్టీ, జిల్లాబోర్డు వ్యవహారాలను చూడడంలో మంచి సమర్థులుగా పేరు తెచ్చుకున్నారు.ఆయన ఎవ్వడూ తొందర పడేవారుకాదు. అయితే ఏదైనా ఒకకార్యక్రమాన్నిచేపట్టినపుడు మాత్రం నిదానాన్ని సహించేవారుకాదు.

కొన్ని స్వల్ప అంశాలలో ఓర్పులేని అసంభావియైన ఓ కాంగ్రెసు నాయకుడు. ఆయనతో వివాదానికి దిగినపుడు ఆరోజుల్లో అత్యంత ప్రాముఖ్యంకలిగిన జిల్లా బోర్డు అధ్యక్ష

పదవిని తృణ ప్రాయంగా ఎంచి నేను రాజీనామా ఇస్తానని ప్రకటించి మమ్మందరిని ఆయన ఆశ్చర్యంలో ముంచివేశారు. దానితో రాష్ట్ర కాంగ్రెసు నాయకులు, హై కమాండ్ వారి ముందు తలవంచవలసిన పరిస్థితి ఏర్పడింది.

సమర్థుడు, ఉత్తముడు, ఆయిన ఈ కాంగ్రెసు నాయకునితో నాకున్న మంచి సంబంధాలకు నేను చాలా గర్వపడతాను. ఆ కమిటీలో నేను చేసిన కృషికి, 18 % భూమిశిస్తు పెంపుదలకు వ్యతిరేకంగా రైతాంగ సత్యాగ్రహాలను నిర్వహించగలమని తెలియజేసి, కమిటీ సిఫార్సులను ఏకగ్రీవంగా ఆమోదించేందుకు తోడ్పడిన నా నాయకత్వ సామర్థ్యాన్ని ఆయన బాగా అభిమానించారు. ఆయన సత్యాగ్రహనాయకులలో ఒకరిగా ఉండి రైతాంగ ప్రయోజనాల కోసం జైలుకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు.

1930-33 సంవత్సరాలలో బాగా ఆర్థిక దుస్థితి ఏర్పడి ఉన్న రోజులలో, భూములకు ఆహార పంటలకు ధరలు లేక రైతాంగం బాగా దెబ్బతిని షావుకారులకు చెల్లించవలసిన అప్పుల కింద భూములను వదలుకోవలసి వస్తున్నపుడు , రైతుల రుణాలపై మారుటోరియాన్ని ప్రకటించాలన్న నాకోర్కెతో ఆయన ఏకీభవించారు. 1931 సంవత్సరంలో బాపట్లలో జరిగిన ఆంధ్రరైతు రక్షణ మహాసభకు ఆయన అధ్యక్షులుగా ఉండి రైతుకూలీల కోర్కెల పత్రాన్ని ప్రకటించారు. ఆ తరువాత జిల్లాలో ఎక్కడ రైతాంగ ప్రదర్శనలు జరిగినా అందులో ఆయన ముందుండి నడవసాగారు. ప్రముఖ లిబరల్ నాయకులైన శ్రీ యం. రామచంద్రరావు జాతీయ కాంగ్రెసు ప్రధాన కార్యదర్శి శ్రీ న్యాయపతి సుబ్బారావు గార్లు ఎక్కువగా అభిమానించి రైతాంగ ప్రయోజనాలను రక్షించేందుకు వారు మాతో కలసి ప్రదర్శనలో పాల్గొనేందుకు అంగీకరించారు.

అప్పటినుండి ఆయన పూర్తిగా నాకు తోడుగా ఉంటూ ఆంధ్ర ప్రాంతంలోనూ అఖిల భారతస్థాయిలోనూ రైతాంగ ఉద్యమ నిర్మాణంకోసం నేను చేస్తున్న కృషిలో నాకు తోడ్పడసాగారు. మరీ ముఖ్యంగా 1938 సంవత్సరం మార్చినెలలో అప్పటి మదరాసు ముఖ్యమంత్రి శ్రీ రాజాజీ గారికి రైతుల కనీస కోర్కెల పత్రాన్ని సమర్పించేందుకు శ్రీ కె. ఎస్. ఎన్. మూర్తిగారి నాయకత్వంలో బయలుదేర దీసిన వెయ్యి మైళ్ల పాడవైన రైతు పాదయాత్రలో ఆయన మాతో కలసి నడిచారు.

రాజుగారు మా అందరికీ జైలు జీవితంలో ఒక మంచి ప్రేమపూర్వకమైన మిత్రులు. జైలులో ఉండగా ఆయన జీర్ణకోశ సంబంధమైన ఇబ్బందులనుగానీ, మానసికోద్రేకాలను గానీ అనుభవించి ఎరుగరు. జైళ్లలో ఉండగా మేము నిర్వహించే విద్యావిషయకమైన గోష్ఠులలో ఆయన మంచి శ్రోతగాను ఉత్తమ విద్యార్థిగాను పాల్గొంటూ ఉండేవారు. ఆ అనుభవంతో జైళ్లలో ఆటలలో మా అందరుకూ ఆసక్తిని కల్పిస్తూ వాటిలో పాల్గొంటూ ఉత్సాహంతో గడిపేలా చేస్తుండేవాగు. తంజావూరు జైలులో ఉండగా గుండెపోటు సంభవించి ఆయ తన తుది శ్వాసను అక్కడ విడిచారు. ఆయన ఇంకొక పది సంవత్సరాలు కాలం జీవించి ఉన్నట్లయితే స్వాతంత్ర్యం వచ్చిన తరువాత మంత్రియై విశ్వాస పాత్రులైన మంచి గాంధేయ వాదిగా రైతుకూలీల ప్రయోజనాల కోసం శ్రద్ధతో కృషిచేసి ఆదర్శప్రాయమైన వ్యక్తిగా

నిరూపణ పొందేవారు. ఆ తరువాత కల్నల్ డి.ఎస్.రాజు గారు కేంద్రంలో మంత్రి అయినపుడు నేను అయనకు, కల్నల్ రాజు గారి లాగే భీమవరం డెల్టాకు చెందిన వెలనాడు చోళ సాంప్రదాయంలో నుంచి బయటకు వచ్చిన నా పాత నాయకులు; స్నేహితులు, సహచరులయిన నారాయణ రాజు గారిని గురించి చెప్పాను.

1975 సంవత్సరం ఫిబ్రవరి మాసంలో పాలకొల్లులో జరిగిన స్వాతంత్ర్య సమరయోధుల అఖిలాంధ్ర మహాసభలో ఆ దేశ భక్తుని కుమార్తెను ఆహ్వానించి శ్రీమతి ఇందిరాగాంధీ ప్రభుత్వం జాతీయసేవలో స్వాతంత్ర్య సమరయోధులైన శ్రీనారాయణ రాజుగారి సేవలకు గుర్తింపుగా తామ్ర పత్రాన్ని బహూకరించింది. ఆయన చూపెట్టిన ఉత్తమ సాంప్రదాయాలకు ఆయన కుటుంబానికి మిగిల్చిపోయిన గౌరవానికి అదొక మంచి గుర్తింపు.

20

కల్నల్ డి.ఎస్.రాజు ఐ.ఎం.ఎస్; ఐ.ఎన్.ఏ.

కల్నల్ డి.ఎస్.రాజాగారు చనిపోయినప్పుడు పశ్చిమ గోదావరి జిల్లాలోని ఆయన స్వగ్రామమైన పోడూరు గ్రామంలో 7-1-1975న ఆయనకు శ్రద్ధాంజలి ఘటించడానికి హాజరైన వారిలో నేను, తెలంగాణా ప్రాంతం వారైన అబిద్ హసన్‌గారు, తమిళనాడుకు చెందిన శ్రీ రాజమన్నార్, శ్రీ ఎస్.ఎన్.సోమయాజులు, శ్రీ టి.కన్నన్‌గార్లు, బీహార్‌కు చెందిన శ్రీ శీలభద్రయాజిగార్లు, ఢిల్లీకి చెందిన డాక్టర్ చోప్రాగారు, కర్ణాటకకు చెందిన శ్రీ ఎస్.ఎన్.గుప్తాగారు, కేరళకు చెందిన మాథ్యూస్‌గారు, శ్రీ వి.ఎల్.సుందరరావుగారు ఉన్నాము. ఆ గ్రామానికి చెందిన స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న మరొక పదిమంది రైతులు బహిరంగ సభలో మాతోపాటు పాల్గొన్నారు. నేతాజీ సుభాష్‌చంద్రబోసుగారి పేరుతో వున్న నేతాజీ భవనంలో ఆయన చిత్రపటాన్ని శీలభద్రయాజిగారు ఆవిష్కరించారు. నాలుగు దశాబ్దాలుగా మా పోరాటంలో పాల్గొన్న అనేక మంది స్త్రీపురుషులు వందేమాతరం గీతాలను ఆలపిస్తూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్న యోధులకు జన్మస్థలమైన ఆ స్థలంలో మాతో కలసి నడిచారు.

నేతాజీ గారికి విశ్వాసపాత్రులుగా వుండి యూరప్‌లో దానిని ఏర్పాటుచేసిన తొలిరోజుల్లో దానికి అధికారిగా పనిచేసి ఆ తరువాత నేతాజీకి కార్యదర్శిగా వుండి చివరకు డెన్మార్క్‌లో భారతదేశ రాయబారిగా రిటైరైన శ్రీ అబీద్ హసన్‌గారు, యూరప్‌లోని ఇండియన్ నేషనల్ ఆర్మీలో పనిచేసిన అప్పారావుగారు ఆ సందర్భంలో నేతాజీగారికి, కల్నల్ రాజుగారికి తమ నివాళులర్పించారు.

కల్నల్ రాజు వృత్తిరీత్యా సైనికపరమైనవారు కాదు. ఆయన ఒక సమర్థుడైన వైద్య నిపుణులు. భారతసైన్య వైద్య విభాగంలో ఆయన చేరారు. బ్రిటిష్ ప్రభుత్వాధికారులు దెబ్బతిని, జపాన్‌వారు సింగపూర్‌ను, మలేషియాను స్వాధీనం చేసుకున్నపుడు ఆయన సింగపూర్‌లో వున్నారు. అప్పుడాయన ఐ.ఎన్.ఏ.లో చేరి సుభాష్ చంద్రబోసు గారి నాయకత్వాన్ని అంగీకరించారు. ఆయన మంచి వైద్యనిపుణులు కావడంతో తరచు నేతాజీగారి దృష్టిలో పడుతూ ఐ.ఎన్.ఏ సభ్యులకు తాను అందిస్తున్న సేవలద్వారా దేశభక్తి పూర్వకమైన నాయకత్వ లక్షణాల ద్వారా నేతాజీకి విశ్వాసపాత్రులు కాగలిగారు. ఆ సమయంలో నేతాజీ ఆయనను తనకు నమ్మకమైన వ్యక్తిగత వైద్యునిగా ఉండవలసిందిగా కోరారు. జనరల్ షానవాజ్ ఖాన్‌గారు చెప్పినట్లుగా "నేతాజీ గారి విషయంలో వైద్యపరంగా డాక్టర్ రాజాగారు చూపిస్తున్న ప్రత్యేకశ్రద్ధ కారణంగానే ఆ తరువాత ఎదురైన తీవ్రమైన పరిస్థితుల్లో గూడ ఆయన ఆరోగ్యం జాగ్రత్తగా వుండగలిగింది". ఆజాద్ హిందూఫౌజ్ ప్రభుత్వం ఏర్పడినప్పుడు నేతాజీగారి మంత్రివర్గంలో ఆయన మంత్రిగా కొనసాగారు.

నేతాజీ విమానంలో జపాన్‌ను వదలిపోతున్నపుడు ఐ.ఎన్.ఏ సైనికుల బాధ్యతను రాజుగారి పైకూడా వుంచారు. జపాన్ ఓటమిపాలైన ఆ సందర్భంలో మిగతా ఐ.ఎన్.ఏ.

సైనికులలాగానే ఆయనను కూడా బ్రిటీష్ మిత్రరాజ్య సైనికులు బందీగా ఢిల్లీలోని ఎర్రకోటకు తీసుకువచ్చారు. ఆ సమయంలో ఢిల్లీలోని యుద్ధఖైదీల శిబిరంలో మొట్టమొదట సారిగా నేను ఆయనను ఇంటర్వ్యూ చేశాను. దేశమంతా ఉవ్వెత్తున లేచిన నిరసనల కారణంగానూ, బ్రిటీష్ సామ్రాజ్య పరిస్థితుల్లో వస్తున్న మార్పుల కారణంగానూ ఆదేశంలో అధికారంలో కొచ్చిన సోషలిస్టు మంత్రివర్గం యొక్క సరళదృష్టివల్లనూ మరణశిక్ష విధించబడ్డ శ్రీ శీలభద్రయాజి గారితో సహా కల్నల్ రాజు, తదితర ఐ.ఎన్.ఏ అధికారులను విడుదల చేయడం జరిగింది. స్వాతంత్ర్య సమరయోధుల్లో మొట్టమొదట వున్న వారిగా ఆ ఐ.ఎన్.ఏ అధికారులను యావద్భారతదేశం అప్పుడు కీర్తించింది.

నేనప్పుడు ఆంధ్ర కాంగ్రెస్ సంఘ అధ్యక్షునిగా జాతీయ కాంగ్రెస్ కార్యవర్గ సభ్యునిగా ఉంటూ, ఆంధ్రప్రజల తరపున ఏలూరులో శ్రీ రాజాగారికి స్వాగతసత్కార కార్యక్రమాలు నిర్వహించి మూడుకోట్ల ఆంధ్ర ప్రజల తరపున ఆయనను నేతాజీ అనుచరుడయిన ఉన్నత దేశభక్తునిగా కీర్తించాను.

రాజాగారు తన పాత కీర్తిప్రతిష్టలతో సంతృప్తిచెంది అట్లాగే ఉండిపోలేదు. నేతాజీ ఆరోగ్య కేంద్రం పేరుతో రాజమండ్రిలో ఒక వైద్యశాలను ప్రారంభించి ఆశ్రమ పద్ధతిలో వేలకొద్ది రోగులకు చికిత్స చేస్తూ ఉండేవారు. ఆయన ప్రాక్టీసు బాగా వృద్ధిచెంది గోదావరి ప్రాంతంలో ప్రజాభిమానాన్ని పొందిన మంచి వైద్యునిగా పేరు తెచ్చుకున్నారు. రోగులకు సహాయం చేయటం పెంచుకున్నారు గానీ రోగులనుంచి ఫీజులు వసూలుచేయడం మాత్రం పెంచుకోలేదు. ఆయన 1957 సంవత్సరంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పార్లమెంటులోకి ప్రవేశించి 1970 వరకు అక్కడ ఉన్నారు. ఈ కాలంలో ఆయన ఒకమారు పోటీలేకుండా ఎన్నిక అయిన ఆ విషయంలో తానే మొదటి వారనిపించుకున్నారు.

ప్రధాన మంత్రులుగా ఉన్న జవహర్లాల్ గారు, లాల్ బహదూర్ శాస్త్రిగార్లు ఇద్దరూ కూడా ఆయన సామర్థ్యాన్ని నిజాయితీని విశ్వాసపూరితమైన మనస్తత్వాన్ని గ్రహించి మొదట ఆయనను రక్షణశాఖలో ఉపమంత్రిగాను తరువాత ఆరోగ్య శాఖలోను తీసుకున్నారు. తనకు అత్యంత ప్రీతిపాత్రమైన వైద్యశాలను చూసుకోవాలనే దృష్టితో ఒకమారు ఆయన మంత్రివర్గంనుంచి రాజీనామా ఇచ్చి వైదొలగి పోవాలను కున్నప్పుడు లాల్ బహదూర్ శాస్త్రిగారు ఆశ్చర్యపోయారు.

మంత్రిగా ఆయన కార్యదర్శులతో స్నేహపూర్వకమైన మంచి సంబంధాలను కొనసాగిస్తూ రక్షణోత్పత్తి కర్మాగారాల స్థాపనలోనూ గ్రామీణ ప్రాంతాల ఆరోగ్యం విషయంలోనూ మంచి అభివృద్ధిని సాధించారు.

ఆయన చేసిన ప్రయత్నాలలో ముఖ్యమైనవి మరికొన్ని, ఒకటి గోదావరీ నదిపై రాజమండ్రి వద్ద ఆసియాలోకెల్లా పెద్దదైన రోడ్ కం రైలుబ్రిడ్జి నిర్మాణానికి సాంకేతికానుమతి నిధుల కేటాయింపు, రెండవది కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజి అభివృద్ధి. కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజి ఒక్క రాజాగారి కృషితోనే కాకుండా దొమ్మేరు రంగారావుగారి భూరి విరాళంతో అంత గొప్పస్థితిని అందుకోగలిగింది. దాని అభివృద్ధి కృషి ఇంకా కొనసాగుతూనేఉంది.

మేమిద్దరం పార్లమెంటులో సహసభ్యులుగా కొనసాగుతున్నప్పుడు ఆయనలో నేను గమనించిన రెండు ప్రత్యేక అంశాలివి. ఒకటి ఆయనకు ఏకొద్ది సమయమైనా విరామం లభిస్తే అక్కడి పార్లమెంటు లైబ్రరీలోకి వెళ్లి చరిత్ర, రాజకీయశాస్త్రం, వేదాంతం వంటి అంశాలపై గ్రంథాలను చదువుతూ ఉండేవారు. రెండవది వీలైనప్పుడల్లా స్వామిజీలతో, సాధువులతో జీవితం గురించి హిందూ తాత్విక దృష్టిని గురించి చర్చలు జరుపుతుండేవారు. ఆయనెప్పుడూ మంత్రిననే అహంభావంతోగానీ, హోదాతోగానీ వ్యవహరిస్తుండేవారుకాదు. యుద్ధసమయంలో యోధుడుగా పనిచేసిన విధంగానే మంత్రి పదవిలో మహర్షిగా కొనసాగుతుండేవారు. ఆయన జీవించి ఉన్న ఆఖరి రోజుల్లో తన వైద్యశాల, ఆస్తులను చూసేందుకు ఒక ప్రజాసంబంధమైన ధర్మసంస్థను ఏర్పాటుచేశారు. ఆవిధంగా రాజుగారు ఒక గాంధేయ సన్యాసిగాను, మరొకవంక నేతాజీ భావసమన్వితమైన గొప్ప ప్రజాసేవకునిగాను జీవితాన్ని కొనసాగించారు.

గోదావరీ ప్రాంత క్షత్రియులను పోల్చి చూసుకుంటే ఆయన కొంచెం పాట్టిగా కనిపిస్తారు. రంగులో ఆయన కొంచెం గోధుమవర్ణం. మనస్సు స్నేహపూరితం. ఆయన కొంచెం బాగా ఉన్న మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. వైద్యవృత్తిలో బాగానే ఆర్జించారు. కానీ దానినంతా ప్రజాసేవకే వినియోగించారు. తన భార్య నలభై సంవత్సరాల వయస్సులో చనిపోయినప్పుడు పిల్లలకు తల్లీ తండ్రీ తానే అయి పెంచాడు తప్ప తిరిగి వివాహం చేసుకోలేదు. వ్యక్తిగత సంపదకానీ వైద్య విజయాలుకానీ, మంత్రిపదవి ద్వారా లభించిన అధికారంగానీ ఆయనను చెడగొట్టలేదు. ఆయన పార్లమెంటరీ పద్ధతుల్లో మంచి వక్త కాకపోయినప్పటికీ బాగా ప్రముఖులైన నాయకులకన్నా సమర్థవంతంగా పార్లమెంటులో ప్రకటనలు చేసేటప్పుడు, సమాధానాలు ఇచ్చేటప్పుడు వ్యవహరిస్తుండేవారు.

ఈ కల్నల్ రాజులో సమర్థుడైన యోధుడ్ని, సున్నితమైన డాక్టర్ని త్యాగధనుడైన ప్రజాసేవకుడ్ని చూసినప్పుడు భారతదేశం గర్వపడుతుంది.

రాజ్యసభ – శ్రీ దయాభాయ్ పటేల్ – శ్రీ రత్నస్వామి

1946వ సంవత్సరంలో రాజకీయంగా చాలా ఎడంగా వున్న ఇద్దరు మంచి వ్యక్తులు కలిసి రాజ్యసభలో స్వతంత్రపార్టీకి ఒకరు నాయకులుగా మరొకరు ఉపనాయకులుగా పనిచేశారు. వారు శ్రీ దయాభాయ్ పటేల్, శ్రీ యం.రత్నస్వామి. 1930 సంవత్సరం నుంచి 1959 సంవత్సరం వరకు నా రాజకీయ జీవితం రత్నస్వామిగారి మార్గానికి దూరమైనది. అయితే ఆ తరువాత మేమిద్దరం కలిసి నేను స్వతంత్రపార్టీ అధ్యక్షులుగాను, ఆయన ఉపాధ్యక్షులుగాను 1959 నుంచి 1969 వరకు పనిచేశాము.

దయాభాయ్‌గారింటి వాతావరణం ఎప్పుడూ బాగా కాంగ్రెస్ వారితో నిండిపోయి కనిపిస్తుండేది. ఆయనకు గొప్ప దేశనాయకులైన తన తండ్రి సర్దార్ వల్లభాయ్‌పటేల్, ఆయన మరో బంధువు మొదటి భారత పార్లమెంటు స్పీకర్ శ్రీ విఠల్ భాయ్ పటేల్, సోదరి మణిబెన్ పటేల్ గార్ల కాంగ్రెస్ రాజకీయాలు తప్ప ఇతరత్రా ఏమీ తెలీదు. ఆయన బొంబాయిలోనూ, అహమ్మదాబాదులోనూ బాగా ప్రజాభిమానాన్ని సంపాదించుకొని బొంబాయి మేయరై ఆ విధంగా నగర ప్రముఖుల్లో ఒకరు కాగలిగారు.

శ్రీ రత్నస్వామి తన రాజకీయాలను బ్రాహ్మణేతర సమాజాన్ని చైతన్యవంతం చేసేందుకు కృషిచేస్తున్న జస్టిస్ పార్టీతో ప్రారంభించారు. కాంగ్రెస్ ప్రధాన ఆయుధంగా చేపట్టిన సత్యాగ్రహానికి ఆయన స్వభావరీత్యా వ్యతిరేకి. రాజ్యాంగ పద్ధతులలోనే స్వాతంత్రఫలం పొందవచ్చునని దయాభాయ్‌గారు ఊహించారు. ప్రజలు తమంతట తామే ముందుకు దూసుకుపోయే పద్ధతిని రత్నస్వామిగారు అభిలషించారు.

స్వాతంత్ర్య పోరాటంలో గాంధేయ కాంగ్రెస్ మార్గంలో నాకు విశ్వాసమున్నదని 1927 సంవత్సరంలో రత్నస్వామి గారితో నేను చెప్పినప్పుడు, ఆయన లా కాలేజి ప్రిన్సిపల్‌గా వెళుతూ ఖాళీ చేసిన పచ్చయప్ప కళాశాలలో చరిత్ర, రాజకీయ, ఆర్థికశాస్త్ర ఆచార్యునిగా నేను చేరేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నానో ఆయన అర్థం చేసుకోలేదు. ఆయన జస్టిస్ పార్టీ శాసనసభ్యులుగా ఉంటూ మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్ ఛైర్మన్‌గాను, పచ్చయప్ప కళాశాల ప్రొఫెసర్‌గాను, ప్రిన్సిపాల్‌గాను ఉండి రెండురకాలైన విధులను ఒకేసారి ఎట్లా నిర్వహించారో నేనుకూడా ఆ మార్గంలోనే నడవదలుచుకున్నా నని చెప్పాను. దయాభాయ్ పటేల్, నేను జైళ్లలో, బైట గడుపుతూ వచ్చిన గత పాతిక సంవత్సరాల కాలంలో రత్నస్వామిగారు పార్లమెంటు రాయితీల ద్వారా భారతదేశానికి స్వపరిపాలనను సాధించడం ఎలా అని ఆలోచిస్తూ పరిశోధిస్తూ గడిపాము.

శ్రీ రత్నస్వామి మనస్తూర్తిగా వెనుకబడిన తరగతుల కోసం రాజకీయంగా దురదృష్టకర పరిస్థితులలో ఉన్న ప్రజల కోసం పనిచేస్తూ, వెంటనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తే శక్తివంతులైన

మతాచారపరాయణులు, పూజారులు, ధనవంతులు, రాజకీయ శక్తిని కలిగివున్నవారు ప్రజాస్వామ్య హక్కులను తమ చేతుల్లోకి తీసుకొని అనుభవించడమే గాక సాంఘిక మతవిషయాల్లో కూడా పెత్తనాన్ని కొనసాగిస్తూ ఇప్పుడిప్పుడే కింది తరగతులలో వస్తున్న సామాజిక పరివర్తనను వెనక్కు నెట్టడం గానీ లేదా చల్లబరచటం గానీ చేయగలరని భావించారు. అందువల్ల ఆయన నాతోగాని, మా అనుచరులతోగానీ స్వాతంత్ర్య పోరాటంలో కలిసి పనిచేయలేదు. ఆయన పూర్తిగా చట్టానికి విధేయులై వుండే మనస్తత్వం కలిగినవారు. స్వాతంత్ర్య ఉద్యమంలోగానీ, బ్రాహ్మణ వ్యతిరేకుల రక్షణ కోసమైన పోరాటంలోగానీ, ఎందులోనైనా చట్టాన్ని త్రోసిపుచ్చే విధంగా ప్రవర్తించడాన్ని ఆయన ఆమోదించలేదు. ఆయన మానసికంగా లిబరల్. అనీబిసెంటుగారి అనుచరులలాగా వ్యవహరిస్తుంటారు. ఆయన తన అభిప్రాయాలకు అనుగుణంగా రాయటం, బోధించటం సాగిస్తుండేవారు. ఆయన జీవితంలో ఆయనకు లభించిన ఏ అవకాశాన్ని ఆయన వదులుకోలేదు.

జవహర్లాల్ గారు 1955 సంవత్సరంలో సోషలిస్టు విధాన ప్రకటన చేసినప్పుడు దయాభాయ్‌గారు నేను కూడా ముందుగానే ఆ రాజకీయ పద్ధతికి దూరంగా జరిగాము. శ్రీ నెహ్రూ కాంగ్రెస్ పార్టీ శక్తినంతా రైతాంగాన్ని తమ స్వంత కమతాలనుంచి నెట్టివేసేందుకు వినియోగిస్తున్నప్పుడు భారత రైతాంగ వ్యవస్థకు వ్యతిరేకమైన ఆయన మూల సిద్ధాంతాన్ని మేము వ్యతిరేకించాము. సోషలిస్టు వ్యతిరేకమైన గాంధేయ మార్గానికి భిన్నమైన ఆ పద్ధతిని మేము అంగీకరించ దలుచుకోలేదు. ఆ సమయంలో మేమందరం ఒకే రకమైన అభిప్రాయాలతో ఉన్నామన్న సంగతిని రత్నస్వామిగారు గ్రహించి రైతాంగాన్ని వినాశనం కాకుండా రక్షించాలనే తలంపుతో మాతో వచ్చి కలిశారు. మేము ముగ్గురం గుజరాత్ రైతాంగం నుంచి దయాభాయ్ పటేల్, ఆంధ్రరైతాంగం తరపున నేను, తమిళనాడు బ్రాహ్మణ వ్యతిరేక రాజకీయాలనుంచి శ్రీ రత్నస్వామి రాజాజీగారితో కలసి భారతదేశ బుద్ధిజీవుల స్వయంవృత్తిదారులైన రైతాంగంతో ఒక రాజకీయ వ్యవస్థను స్థాపించేందుకు పూనుకున్నాము. జవహర్లాల్ నెహ్రూగారు పదవీ విరమణ చేసిన ఐ.సి.యస్. అధికారులను, వైస్ ఛాన్సలర్స్‌ను, గవర్నర్లను స్వతంత్రపార్టీవైపు పోవద్దని చెప్పగా రత్నస్వామి స్పష్టంగా నిస్సందేహంగా యిలాచెప్పారు. "ప్రధానమంత్రిగారు తలపోస్తున్నట్లుగా మేము రిటైరయిన వాళ్లమేకాని టైర్డు అయిన వాళ్లం మాత్రం కాదు".

దయాభాయ్ ఆనంద్‌లోని ఛారోత్తర్ విద్యామండలి ద్వారా విద్యాసంస్థల నిర్వహణలో అనుభవాన్ని సంపాదించుకున్నారు. ఆయన బొంబాయి నగరానికి మేయరై ఆ గొప్ప నగరాభివృద్ధికి శాశ్వతంగా ఉండే పనులు చేశారు. మహాగుజరాత్ ఉద్యమానికి నాయకులుగా పనిచేస్తూ బొంబాయిలోంచి ప్రత్యేక గుజరాత్ రాష్ట్రం ఏర్పాటుకు ఆయన ప్రయత్నించారు. ఆయన కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడి రాజ్యసభ సభ్యులుగా ఎన్నికై స్వతంత్ర గ్రూపులో ప్రారంభ సమయంలోనే వేరి దానికి నాయకులైనారు. ఆయన సత్యాగ్రహాల పరంగా తాను చేసిన త్యాగాన్ని రాజకీయ త్యాగాల ద్వారా తన కుటుంబం సంపాదించిపెట్టుకున్న గౌరవాన్ని రాజ్యసభలో తాను సాధించిన స్థానాన్ని తనకు తోడుగా ఉంచుకొని స్వతంత్రపార్టీలో నిలిచారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ సభలలో ఆయన

పాల్గొన్నారు. స్వతంత్ర జాతుల మధ్య ఇజ్రాయెల్‌కు లభించవలసిన గౌరవ ప్రదమైన స్థానం విషయంలో ఆయన దానిని బలపరిచారు. అన్ని తరహాల నియంతృత్వాన్ని ఆయన వ్యతిరేకించారు.

1959 సంవత్సరంలో మాతో చేరేనాటికి రత్నస్వామి వయస్సురీత్యా, ఆలోచనరీత్యా కూడ పండినవారు. ఆయన వైస్ చాన్సలర్‌గా ఉన్నారు. రాజకీయాలమీద చక్కనిసామర్థ్యం కలిగిన మంచి రచయిత. దయాభాయ్‌గారు భాయ్‌లాల్ భాయ్‌గారితో విద్యారంగంలో కూడ సహకరించి వల్లభ విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పడ్డారు. రత్నస్వామిగారు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ కేథలిక్స్‌కు వ్యవస్థాపక అధ్యక్షులు.

వీరిద్దరూ అనుభవం కలిగిన నాయకులు. ఒక దశాబ్దానికి పైగా రాజ్యసభలో ఉండి భారత ప్రజాస్వామ్యాన్ని బలపరిచేందుకు చక్కటి కృషిచేశారు. వీరిద్దరూ మంచి ప్రజాస్వామిక వాదులు. దయాభాయ్‌గారు మంచి చురుకైన వ్యక్తి. ఏ సందర్భంలోనూ ప్రభుత్వాధికారానికి తలవంచని వారు. రత్నస్వామిగారు నిర్మాణాత్మకమైన విమర్శలను చేస్తూ ఒక గొప్ప అనుభవజ్ఞుడిగా హెచ్చరిస్తూ ఉంటారు. దయాభాయ్‌గారు కోపం వచ్చినప్పుడు భయంకరంగా వుండి తను అసదల్చుకున్నదాన్ని నిర్భయంగా అనేస్తుంటారు. రత్నస్వామిగారు ప్రభుత్వం బలహీనతలను పట్టుకొని నిలువనీయకుండా చేసేవారు. ఆవిధంగా వారిద్దరూ మంచి జోడీ. వీరిద్దరూ కూడా లైసెన్సుల, కోటాల, పర్మిట్ల రాజ్యాన్ని నిరసించారు. పర్మిట్లను, కంట్రోళ్లను రద్దుచేయడానికి లేదా క్రమబద్ధం చేయడానికి ఒక స్వతంత్ర న్యాయవ్యవస్థను ఏర్పాటుచేయాలన్న మా డిమాండును బలపరిచారు.

పార్టీ సభలలో వీరిద్దరూ కూడా నాకు సహకరించారు. రత్నస్వామిగారు నాకన్నా వయస్సులోనూ, పాండిత్యంలోనూ, విశ్వవిద్యాలయాల అనుభవంలోనూ బాగా సీనియరు. దయాభాయ్‌గారు నాకన్నా సీనియరు. నాకు ప్రేమపాత్రులయిన నాయకులు సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి పుత్రుడు. వీరిద్దరూ తమ నాయకునిగా నన్ను గౌరవించడం నాకు గర్వంగా ఉండేది. స్వేచ్ఛా వాణిజ్యం, మార్కెట్ ఎకానమీల విషయంలో నాకు ఇష్టం లేకపోయినప్పటికీ ఆ మార్గంలో వారు మసానీ గారితో సంతోషంగా సహకరిస్తారు. అయితే రైతాంగ హక్కుల కోసం నేను పోరాటం నిర్వహించే అన్ని సందర్భాలలోను వారు నా తెనక నిలిచి ఉంటారు.

సామాజికంగా అణగారిన ప్రజలకోసం సమీక్షతం కాకుండా ఉన్న కలంకారీల కోసం వారి పునరుజ్జీవనం కోసం నేను ఏమి చేయగలనో దానినంతా చేస్తాను. ఈ ఇద్దరికీ కూడ ఈ జనాల ప్రయోజనాలపై ప్రత్యేక అభిమానం ఉంది. రత్నస్వామిగారు సదా మా చర్చలో కింది తరగతి ప్రజలకు ఎక్కువ ఆహారం, బట్ట, గృహవసతి, తాగేనీటి సౌకర్యం, పరిసరాల ఆరోగ్యం, విద్య, ఉద్యోగవసతులను కల్పించాలని అందుకు మేధావులైన పెద్దనాయకులు తమ శక్తియుక్తులను వినియోగించాలని కోరుతూ వుండేవారు.

దయాభాయ్‌గారు, రత్నస్వామిగారు రాజ్యసభలోని అన్ని వర్గాలనుంచి అభిమానాన్ని సంపాదించుకుంటూ వుండేవారు. వారు ఇద్దరూ మంచి ఉపన్యాసకులు. సమర్థవంతమైన

పార్లమెంటరీ ప్రతిపక్ష నాయకులుగా వారు తయారయ్యారు. వారు ఇద్దరూ, ముగ్గురు ప్రధాన మంత్రులకు పాకిస్తాన్, చైనాలు దురాక్రమణకు పూనుకున్నప్పుడు 1962, 1965, 1971 సంవత్సరాలలో ఉభయ సభలలో ఉన్న మా అందరి సభ్యులలాగే తమ సమర్థన నందించారు. 1975 సంవత్సరంలో గుండె ఆగిపోవడంతో దయాభాయ్‌గారు అకస్మాత్తుగా మరణించారు.

22

కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యం

శ్రీ యన్.వి.నాయుడు, శ్రీ ఓబుల్‌రెడ్డి

రైతాంగ విద్యాలయంలో పట్టభద్రులైన వారిలో శ్రీ కందుల ఓబుల్‌రెడ్డి, శ్రీ యన్.వి.నాయుడు, శ్రీ గౌతులచ్చన్న, శ్రీ పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి గారలు స్వయంవృత్తుతో జీవించే ప్రజలకోసం, కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సంకల్పానికి పూర్తిగా అంకితమై రాజకీయ రంగంలో శ్రద్ధ తీసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. శ్రీ ఓబుల్‌రెడ్డి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ, హరిజనులు, వెనుకబడిన తరగతుల వారినుంచి కార్యకర్తలను తయారుచేస్తూ, ప్రజా సంబంధాలను పెంచుకొంటూ వస్తూ చక్కని కృషిచేశారు. జాతీయ జనజీవన స్రవంతిలో సాంఘిక సేవాకార్యక్రమాలలో వారు భాగస్వాములు కాగలిగేలా ప్రయత్నించారు. రాయలసీమలో శ్రీ యన్.వి.నాయుడు, కళింగ ప్రాంతంలో శ్రీ గౌతులచ్చన్న గార్ల తోడ్పాటుతో రాష్ట్ర కాంగ్రెస్ సంఘం బహుజనులకు బలమైన వేదికగా ఉండేలాగా తయారుచేసి ఆత్మ విశ్వాసంతో కాంగ్రెస్ కార్యకర్తలు ముందుకు దుమికేలా ప్రయత్నించారు.

ఆర్థికంగా, సాంఘికంగా ముందున్న కుటుంబాలలోని యువకులకు, రైతాంగ, చేనేత, పౌర పాఠశాలల ద్వారా, బి.యస్.యస్ లేదా విద్యార్థి యువజన శిక్షణా శిబిరాల ద్వారా కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య నాయకులుగా తయారయ్యేందుకు శ్రీ ఓబులురెడ్డి, శ్రీ నాయుడుగార్లు త్వరితగతిని శిక్షణా కార్యక్రమాల నమలుజరిపారు. ఆ పద్ధతి తక్షణ ఫలితాలనిచ్చి, గొప్ప గొప్ప ఊరేగింపులు జరిపేందుకు, బహిరంగసభలు జరిగేందుకు కారణమైంది. కాంగ్రెస్ మంత్రులు, వారి రాజకీయ తాబేదార్లు అవలంబించిన అయిష్టపూర్వకమైన ధోరణి కారణంగా ఇందులో చాలామంది ఆ తరువాత నిరాశకు లోనైనారు. ఆ పరిస్థితుల్లో శ్రీ యన్.వి.నాయుడు కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతం మీద పూర్తి విశ్వాసంతో ఉంటూనే రాజకీయ రంగానికి దూరమై వ్యాపారంలో ప్రవేశించారు. రాజకీయాల్లో ఉంటూ అధికార దుర్వినియోగం చేస్తున్న వారిని ఆయన బాగా అసహ్యించుకున్నారు. ఆ అసహ్యం ఎంతవరకు ఆయనలో ఉందంటే ఏడు సంవత్సరాలు యం.ఎల్.ఏ.గా శాసనసభలో ఉంటూ కూడా ఆయన మంత్రులతో చర్చలు జరిపేందుకు ఏనాడూ ఇష్టపడలేదు.

శ్రీ తిమ్మారెడ్డిగారు ఓబుల్‌రెడ్డిగారి విశ్వాసాన్ని, స్నేహాన్ని కూడ ప్రక్కకుతోసి, కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతంలో ప్రజాస్వామ్య సోషలిజంలో తనతో కలసి ప్రయాణం చేస్తున్న సహచరులను వదలివేసి 1952 సంవత్సరంలో కె.ఎల్.పి. పార్టీని వదలివేసి ఆంధ్ర మంత్రివర్గంలో స్థానం లభించడంతో వెళ్లిపోయారు.

ఓబులురెడ్డిగారు రైతునాయకులు. గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారితోను, కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు కాకాని వెంకటరత్నం గారితోను, డాక్టర్ మర్రి చెన్నారెడ్డిగారితోను కలసి ఆంధ్ర తెలంగాణా ప్రాంతాల్లో ముందు రజాకారుల హింసలనుంచి ఆ తరువాత కమ్యూనిస్టుల దౌర్జన్యాలనుంచి ప్రజలను రక్షించడానికి ధైర్యంగా కృషిచేశారు. ఆ ముగ్గురు రెడ్డి, కాకాని, గొర్రెపాటి గార్లకు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న కమ్యూనిస్టుల నుంచి వాళ్ల ప్రాణాలను తీస్తామని బెదిరిస్తూ ఉత్తరాలు కూడా వచ్చాయి. వాటిని వారు లక్ష్యపెట్టలేదు. అందుకే ఆ తరువాత వారు ఉక్కు మనుషులుగా పేరుపొందారు.

మంత్రులు అవినీతిపరులైనప్పుడు అందుకు వ్యతిరేకంగా ప్రకాశంగారు నేను ప్రారంభించిన పోరాటంలోను, ఆ తరువాత నిష్పక్షపాతమైన విచారణ కోసం మేము పట్టుబడిన సందర్భంలోనూ, ఆయన మాతో గట్టిగా నిలిచారు. కాంగ్రెస్, కె.ఎల్.పి., ప్రజాపార్టీల సంయుక్త మంత్రివర్గానికి ప్రకాశం గారిని నాయకుడుగా ఆహ్వానించవలసిందని నెహ్రూగారిని నేను కోరినప్పుడు ఆయన బలపరిచారు. ఆ రకంగా 1953లో ప్రకాశంగారు రెండవమారు ముఖ్యమంత్రి కావడానికి మార్గం సుగమమయింది. ఆ సమయంలో కె.ఎల్.పి. గ్రూపును తటస్థంగా ఉంచాలని ముఖ్యమంత్రిత్వం కోసం జరుగుతున్న పోటీలో ఏ వర్గాన్ని బలపరచరాదని మేము చేసిన హెచ్చరికను శ్రీ లచ్చన్న, శ్రీ ఓబుల్ రెడ్డిగార్లు మాత్రమే లక్ష్యపెట్టగలిగారు.

ఆయనకు గ్రామీణ ప్రాంతాలమీద, గ్రామీణ ప్రజల మీద మమకారం ఎక్కువ. అందుకు అనుగుణంగా ఆయన పంచాయతి సమితి అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆ తరుణంలో ఆయన రోడ్లు, భవనాలు, స్కూళ్లు, వైద్యశాలల వంటి నిర్మాణాలను చేయించి పేదలకు ఇళ్లస్థలాలను ఇప్పించి, మంచినీటి బావులను త్రవ్వించి, తన నిర్మాణ సామర్థ్యాన్ని ప్రదర్శించి చూపారు.

1934 సంవత్సరంలో మేమిద్దరం ఉన్న కారు ప్రమాదానికి గురైనప్పుడు ఆయన బలమైన గాయాలతో వుండికూడా వాటిని మరచిపోయి నన్ను గురించి మాత్రమే ఆందోళన పడ్డారు. ఆయన మనసులో, ఆయనకు నా క్షేమమే ప్రధానమైన అంశం.

స్వతంత్రపార్టీపై బొంబాయి మిత్రులు తెస్తున్న ఒత్తిడిని సహించలేక ఆయన 1960 సంవత్సరంలో తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ నాయకుల నుంచి వస్తున్న అన్ని వత్తిడులను తట్టుకొని 1962 సంవత్సరంలో చిత్తూరు, 1967వ సంవత్సరంలో శ్రీకాకుళం ఉపఎన్నికలలోను, ఆయన నాకు అనుకూలంగా ప్రచారం చేశారు. అది వ్యక్తిగతంగా నాపై ఉన్న అభిమానంతో మాత్రమే కాదు. పార్లమెంటులో ప్రతిపక్ష స్థానంలో శక్తివంతమైన కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య నాయకులు వుండడం అవసరం అని ఆయన నమ్మినందువల్ల కూడా అలా చేయగలిగారు.

ఓబులురెడ్డిగారు అప్పుడు ఒక సంవత్సర కాలంపాటు మంత్రిగా వున్నారు. కృషీకార్ లోక్ పార్టీ తరపున మంత్రిగా పనిచేస్తున్న లచ్చన్నగారు సంయుక్త కాంగ్రెస్ పక్షంలోని అన్ని పక్షాలు పరస్పర విశ్వాసంతో సహకారంతో కలసి పనిచేయాలని కాంగ్రెస్ పెద్దలపై గట్టి వత్తిడి తీసుకొచ్చారు. ఆ సందర్భంలో 1934 సంవత్సరం నుంచి రైతాంగ ఉద్యమానికి విశ్వాసపాత్రుడుగా

పనిచేస్తూ వస్తున్నా తాను సాధారణ శాసన సభ్యునిగానే ఉన్నాననే ఆసంతృప్తికి ఓబులురెడ్డిగారు లోనయ్యారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఛైర్మన్‌గా వుండి ఉపాధ్యక్షులైన మాజీ ఐ.సి.ఎస్ ఉద్యోగి శ్రీ పుల్లారెడ్డిగారికి బాగా తోడ్పడుతూ ఆ యూనివర్సిటీ బాగా విస్తరించేందుకు ఆయన చేయగలిగినంత కృషి చేశారు.

శ్రీ తిమ్మారెడ్డి

1946-51 సంవత్సరాల మధ్య రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి ఉపాధ్యక్షులుగా ఉంటూ శ్రీ తిమ్మారెడ్డిగారు రాయలసీమ జిల్లాలలో బాగా పేరుపొందారు. 1952-55 సంవత్సరాల కాలంలో అనేకమంది కృషీకార్ లోక్ పార్టీ నాయకులు ఓడిపోయినప్పుడు తాను శాసనసభ్యుడిగా ఎన్నిక కాగలిగారు. కాంగ్రెస్ నాయకుల బోధనలకు లోనై కె.ఎల్.పి.కి దూరమై మంత్రిపదవి కోసం ఆ సమయంలో కాంగ్రెస్‌తో చేతులు కలిపారు. ఆంధ్రరాష్ట్ర అవతరణ సందర్భంలో కృషీకార్ లోక్ పార్టీ నాయకులు సర్దార్ లచ్చన్న మిశ్రమ మంత్రివర్గంలో చేరటానికి ఒక మానం ముందు 1953 వ సంవత్సరంలో ఆయన మంత్రిపదవిని ఆవిధంగా సంపాదించుకున్నారు. ఆ మార్పువల్ల ఆయన రోజు రోజుకూ కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య కార్యకర్తలకు దూరం అవుతూ తనతో కిసాన్ పాఠశాలలో శిక్షణ పొందిన వారినుండి ఇంకా ఎక్కువ దూరంగా జరిగిపోయారు.

ఆయన శాసనసభకు ఎన్నిక కాలేకపోవటం కారణంగా రెండుసార్లు సంభవించిన కొద్దిపాటి విరామాన్ని మినహాయిస్తే 1953 నుంచి 1970 వరకూ మంత్రిగా కొనసాగుతూనే వచ్చారు. పాత స్నేహాలనుగానీ, ప్రేమాభిమానాలనుగానీ పట్టించుకోని ఆయన సహజ మనస్తత్వంతో, మాకు దూరమై కాంగ్రెస్ అధికార వ్యామోహపరులతో కలిసి పనిచేస్తున్నా, రైతుల యెడ ఉన్న సానుభూతిని ప్రేమను మాత్రం విసర్జించలేదు. రైతుల ప్రయోజనాలకు నష్టం కలుగుతున్నదని భావించినప్పుడెప్పుడైనా, శాసనమండలిలో సభ్యురాలిగా ఉన్న శ్రీమతి భారతీదేవి జోక్యం చేసుకొని రైతాంగానికి న్యాయం చేయవలసిందని కోరుతూ ఉండేది. దురదృష్టవశాత్తూ శ్రీ తిమ్మారెడ్డిగారు పదిహేడవ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా గానీ, సహకార వ్యవసాయ నిర్ణయానికి వ్యతిరేకంగా గానీ గ్రామదాన్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూగానీ ఏమీ చేయలేకపోయారు. అనుమతి లేకుండా వ్యవసాయానికి నీటిని వాడుకున్న రైతులపై విధించిన రెండుకోట్ల రూపాయల అపరాధ రుసుము రద్దుచేయించేందుకు వారు ఫలప్రదమైన కృషిచేశారు.

ఆయన రెవిన్యూ శాఖామంత్రిగా పనిచేసిన మూడు సంవత్సరాలకాలంలో భూమిలేని వ్యవసాయ కూలీలకు అడవి ప్రాంతాలు కాని బంజరు భూములను, వ్యవసాయానికి పిలైన ప్రభుత్వ భూములను కూడా ఇప్పించేందుకు చక్కటి కృషిచేశారు. శ్రీ వి.ఎల్.సుందరరావుగారి సలహాతో అన్ని రాష్ట్రాలలో కంటె ముందుగా మన రాష్ట్రంలో స్వాతంత్ర్య సమరయోధుల సంఘాన్ని ఏర్పరచి, స్వాతంత్ర్య సమరయోధులకు భూములను కేటాయించేందుకు చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా వారికి పెన్షన్లను, వారి బిడ్డలకు ఉచిత విద్యావైద్య సదుపాయాలను కలిగించేందుకు నిర్ణయాలు తీసుకొని దేశవ్యాప్తంగా ఇలాంటి చర్యలను అమలు జరిపేందుకు

భారత ప్రభుత్వానికి మార్గదర్శకులు కాగలిగారు.

శాసనసభ్యుడిగా గాని, మంత్రిగాగాని లేకుండా స్వేచ్ఛగా ఉంటున్న సమయం తిరిగి ఆయనలో నిద్రాణమై ఉన్న రైతు అభిమానాన్ని మేలుకొలిపింది. ఆయన 1972 సంవత్సరంలో మైసూరు రాష్ట్రానికి చెందిన గణపయ్యగారు ప్రారంభించిన రైతుసమాఖ్యలో చేరి దానికి ఉపాధ్యక్షులయ్యారు. 1976 సంవత్సరంలో ఢిల్లీలో జరిగిన భారత వ్యవసాయదారుల కాంగ్రెస్ సభల సందర్భంలో ఆయన ముఖ్యమైన భూమికను నిర్వహించారు. వాణిజ్య పారిశ్రామిక సంస్థలను, వుద్యోగస్తులను, వృత్తిపరమైన వారిని మినహాయించి రైతులపై మాత్రమే సీలింగు ఏర్పాటుచేసే విధానాలను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. 1976 వ సంవత్సరం ఏప్రిల్ నెలలో ఢిల్లీలో జరిగిన వ్యవసాయదారుల కాంగ్రెస్ సభలో మాట్లాడుతూ, ఇరవై సూత్రాల కార్యక్రమం ప్రకారం ఒక్కొక్క రాష్ట్రంలో కొన్ని వేలమందిని కట్టుబానిసత్వం నుంచి విముక్తి చేసినంత మాత్రాననే అది సరిపోదని ఇంకా దేశంలో రైతాంగాన్ని ప్రభుత్వాలు, దాని ముఖ్య సర్వీసులన్నీ కూడా పూర్తి కట్టు బానిసలుగానే పరిగణిస్తున్నాయని ఆయన హెచ్చరించారు. ఆయన మంత్రిగా ఉన్న రోజులలో ఇందుకు ఏమి జాగ్రత్తలు తీసుకున్నారని ఎవరైనా తెలుసుకోవడంలో తప్పులేదు.

మంగుళూరుకు చెందిన జినరాజ్ హెగ్డేగారు

మంగుళూరుకు చెందిన శ్రీ జినరాజ్ హెగ్డే స్వాతంత్ర సమరయోధులైన శామ్యూల్ యారన్ గారు రాజీనామా ఇచ్చిన తరవాత 1937-39 సంవత్సరాల మధ్య కేంద్రశాసనసభలో నాకు సహసభ్యులు. ఆయన కన్నడ రైతాంగం కోసం కాఫీ, టీ తోటలను పెంచేవారి ప్రయోజనాల కోసం చక్కటి కృషిచేస్తుండేవారు. ఆయన మా రైతాంగ శాసనసభ్యుల విభాగంలో చేరి అవసరమైన సందర్భాలన్నింటిలో కాంగ్రెస్ పార్టీలో కూడా నాకు తోడుగా నిలబడుతుండేవారు. భూములపై మాత్రమే పరిమితులు విధించాలని జవహర్లాల్ గారు తీసుకున్న నిర్ణయం ఆయనను తిరిగి రాజకీయాలలో ప్రవేశింపజేసింది. సర్దార్ లాల్‌సింగ్, రామచంద్రారెడ్డి గార్లతో కలసి ఆయన అఖిలభారత వ్యవసాయదారుల సమాఖ్య నేర్పాటుచేసి దానికొరకై "రూరల్ వాయిస్" అనే పేరుతో ఒక ఆంగ్ల వారపత్రికను ప్రారంభించారు. ఆయన శ్రీ మంజునాథయ్య, మొదటి భారత సర్వసైన్యాధిపతి జనరల్ కరియప్పవంటి శక్తివంతులైన సహచరులను తోడుతెచ్చుకుంటారు. ఆయన సర్దార్ లాల్‌సింగ్‌గార్లు, అనేకమార్లు రాజాజీ గారిని కలసి వ్యవసాయదారుల రక్షణకోసం తిరిగి ఆయనను ముందుకు రావంసిందిగా వత్తిడి చేస్తూ వచ్చారు.

వ్యవసాయదారుల ఆర్థిక స్వాతంత్ర్యానికి స్వయంవృత్తులతో జీవించే విధానాలకు భంగం కలిగించే రీతిలో నెహ్రూగారి ప్రయత్నాలు ప్రారంభమైన తరవాత, నేను వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నప్పుడు, ఆయన చేసే నిష్కామమైన కృషి రైతాంగం యెడ కనబరుస్తున్న శ్రద్ధ శ్రీ రాజాజీ, శ్రీ కె.యం.మున్షీ, ఒకసారి మంత్రిగా పనిచేసి ఉన్న శ్రీ హెచ్.దాసప్పగార్ల వంటి ప్రముఖులను, ఆయన ప్రయత్నాలలో సహకరించేందుకు ముందుకు వచ్చేలా చేయగలిగింది.

శ్రీ జినరాజ్, ఆయన వ్యవసాయదారుల సమాఖ్య ఆహ్వానం మేరకు 4-6-1959న మద్రాసులో శ్రీ జయప్రకాష్ నారాయణ్ కూడ అక్కడ ఉన్నప్పుడు రాజాజీగారి అధ్యక్షతన మేమందరం సమావేశమై రైతుల, చేనేత పనివారల, స్వయం వృత్తులతో జీవించే అన్ని వర్గాల ప్రజలకు రక్షణను కల్పించేందుకుగాను స్వతంత్ర పార్టీని ఏర్పరచాలని నిర్ణయం తీసుకున్నాము. జినరాజ్ గారు దాని కార్యదర్శులలో ఒకరుగా ఎన్నికయ్యారు. ఈ నూతన రాజకీయ పార్టీని నడిపే బాధ్యత నాకు వప్పగించారు.

ఆయన కర్ణాటక రాష్ట్రంలోని అనేక ప్రాంతాలలో పర్యటించి వ్యవసాయదారుల సమాఖ్యకు, స్వతంత్ర పార్టీకి ప్రజా సమర్థనను ఎక్కువగా సాధించిపెట్ట గలిగారు. కర్ణాటక రాష్ట్రప్రభుత్వం భూపరిమితి చట్టంనుంచి కాఫీ, టీ తోటలను మినహాయిస్తూ నిర్ణయం చేయడంతో చాలామంది కాఫీ, టీ తోటల పెంపకందార్లు మాకు దూరంగా పాయ్యారు. అది జినరాజ్ హెగ్డేగారి మనస్సును బాగా గాయపరచింది. అదే సమయంలో ఆయన ఆర్థికపరమైన వత్తిడులను కూడా ఎక్కువగా భరించవలసి వచ్చింది.

ఆ తరువాత జవహర్లాల్ గారు పదిహేడవ రాజ్యాంగ సవరణ ప్రవేశపెట్టి దాని ద్వారా గతంలో ఎస్టేట్ దారులు, జమిందారులు, తాలూకుదారులువంటి భూస్వామ్య శక్తులకు వ్యతిరేకంగా చేసినట్లే రైతుల గృహాలు, పాలాలు, తోటలు ఏవైనా సరే వాటిని స్వాధీన పరచుకొని నామమాత్రమైన పరిహారాన్ని మాత్రమే ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వాలకు అధికారం కల్పించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఆందోళన ప్రారంభించేందుకు నేను పూనుకున్నప్పుడు జినరాజ్ హెగ్డేగారు అతివేగంగా స్వయం వృత్తులతో జీవించే రైతు స్వామ్యానికి అది ఎంత హానిచేస్తుందో గ్రహించి ముందుకొచ్చారు. ఆయన బెంగుళూరులో దక్షిణాది రాష్ట్రాల రైతుమహాసభను నిర్వహించారు. ఆ సభ జాతీయస్థాయి నిరసనకు బాటలు వేసింది. పార్లమెంటుకు పోస్టుకార్డుల ద్వారా నిరసన తెలియజేసే కార్యక్రమాలకు ఆయన లక్షలాది రైతాంగం నుండి సంతకాలు సేకరించారు. పార్లమెంటు సహకార వ్యవసాయ క్షేత్రాల పరిధినుండి విధించిన పరిమితికి తక్కువగా భూవసతి కలిగిన రైతుల భూములకు మినహాయింపు ఇవ్వడంతో, జినరాజ్, వ్యవసాయదారుల సమాఖ్య తరపున తాము చేసి ఈ ఉద్యమానికి ఫలితం సిద్ధించినట్లయింది.

ఐదు సంవత్సరాలపాటు రక్తపోటుతో మధుమేహంతో తీవ్ర అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొంటూ కూడా విశ్రాంతి లేకుండా కృషిచేసిన శ్రీ జినరాజ్ గారు తాను సాధించిన ఈ ఫలితం లభించిన ప్రారంభదినాల్లోనే మరణించారు. భూపరిమితి విధించటం ద్వారా రైతాంగం పొందనున్న నష్టాల కారణంగా ఆయన ఈ ఉద్యమంలోకి ప్రవేశించినప్పటికి ఆ తరువాత రైతాంగ సమస్యలను పూర్తిగా గ్రహించి అన్నిరకాలైన రైతాంగ సమస్యలపై మొత్తంగా పోరాడేందుకు సమకట్టారు. నేనంటే ఆయనకు చాలా అభిమానం. పంజాబ్‌కు చెందిన శ్రీ లాల్‌సింగ్, శ్రీ ఉద్దంసింగ్‌నాగోకి, శ్రీబసంత్‌సింగ్, యు.పి.కి చెందిన శ్రీ భానూ ప్రతాప్‌సింగ్, ఆంధ్రావారైన శ్రీ లచ్చన్న, శ్రీ రామచంద్రారెడ్డి, శ్రీ రాజగోపాల నాయుడు మరికొంత మందితో కలసి స్వతంత్ర పార్టీ సంయుక్త రాజకీయ వేదికలో మేము స్వయం వృత్తిదారుల,

వ్యవసాయదారుల వేదికను ఏర్పాటుచేసుకున్నాము.

జినరాజ్ నిర్మాణ వ్యవహారాల్లో సాహసి. ఆయన వృత్తిపరంగాను అనుబంధాల పరంగాను మంచి విశ్వాసపాత్రులు.

హసన్‌కు చెందిన శ్రీ గణపతయ్య

కర్ణాటకకు చెందిన హసన్ జిల్లా సభిలేష్‌పూర్ వారైన శ్రీ గణపతయ్య అభ్యుదయ రైతు శ్రీ జినరాజ్ హెగ్డేగారి అనుచరులుగా ఆయన రైతాంగ సమస్యల కోసం తన కాలాన్ని వినియోగించారు. నెహ్రూగారి భూపరిమితి నిర్ణయానికి ఆయన చాలా బాధపడి రైతాంగ ఉద్యమంలోకి ప్రవేశించారు. ఆయన వ్యవసాయదారులకు, వ్యవసాయేతరులకు మధ్య, పట్టణ ప్రజలకు, పల్లె ప్రజలకు మధ్య వుంటున్న ఆర్థిక రాజకీయ వ్యత్యాసాలను గమనించి అందరినీ సమదృష్టితో చూడాలనే మా పోరాటంలో మాకు తోడు నిలిచారు. 1962, 1967, 1971 సంవత్సరాలలో జరిగిన ఎన్నికలలో స్వతంత్రపార్టీ తరపున ఆయన చాలా త్యాగం చేశారు. 1970 సంవత్సరం వరకు పూర్వ మైసూరులో రైతుసంఘాన్ని ఆయన నిర్వహించారు. ఆ తరువాత 1972 సంవత్సరంలో అఖిల భారత రైతు మహాసభ జరిపేందుకు ఆయన ముఖ్యపాత్ర వహించారు. ఆ సభ పాత అఖిల భారత రైతు సమాఖ్యను రద్దుగావించి ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పేరుతో కొత్త సంఘాన్ని ప్రారంభించింది. దానికి యు.పి. రాష్ట్రంలోని "గావోపుకార్" పత్రిక మాజీ సంపాదకులు పార్లమెంటు సభ్యులయిన శ్రీ భానూప్రతాప్‌సింగ్ అధ్యక్షులుగాను శ్రీ గణపతయ్య ప్రధాన కార్యదర్శిగాను ఉన్నారు. ఆరోజు అనేకమంది ప్రజానాయకులు చేసినట్లుగానే ఆయన కూడా వ్యవసాయం ద్వారా తనకు లభించిన ఆదాయంలో ఎక్కువ భాగాన్ని ప్రజాసేవకు వినియోగించారు. నాగపూర్ కాంగ్రెస్ నిర్బంధ సహకార వ్యవసాయ తీర్మానాన్ని స్వయం వృత్తులతో జీవించే రైతాంగానికి వినాశకారి అనే దృష్టితో ఆయన వ్యతిరేకించారు. ఆయన ప్రజాస్వామ్య ప్రతిపక్షంలో వుండడానికి మంచి పూనికతో వ్యవహరించారు. స్వయం వృత్తిదారులైన రైతులు వ్యవసాయ కూలీలు కేత్ మజ్‌దూర్‌ల అభివృద్ధికి ప్రధానమైన కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని దేశావసరంగా దేశప్రజలంతా గుర్తించేటప్పుడు ఆయన నమ్మకంగా మాతోనే వున్నారు.

కుప్పం – బేతప్ప శెట్టిగారు

అరవై ఎనిమిది సంవత్సరాల వయసున్న బేతప్ప శెట్టిగారు చిత్తూరు జిల్లాలోని స్వాతంత్ర్య సమర యోధుల్లో ఒకరు. చల్లటి బెంగుళూరు దాపులోని మైదాన ప్రాంతమైన కుప్పం వాతావరణంలో రకరకాల పూలు పూయిస్తూ అక్కడవుండే పూలను మద్రాసు బెంగుళూరు నగరాలకు పంపుతుంటారు. ఆయన బాగా చదువుకోకపోయినప్పటికీ 1930 సంవత్సరంలో మహాత్మాగాంధీగారిచ్చిన పిలుపుననుసరించి స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైలులో మూడవ తరగతి ఖైదీగా చాలా బాధలను అనుభవించారు. ఆయనకెప్పుడూ మంచి పదవులు లభించకపోయినప్పటికీ ఆయన గాంధీగారి నిర్మాణ కార్యక్రమంపై విశ్వాసాన్ని

వదులుకోకుండా ఉన్నారు. 1962 పార్లమెంటు ఎన్నికల సమయంలో ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామాచేసి కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యంపై నమ్మకంతో, నామిత్రమేమతో ఆంధ్రప్రదేశ్‌లోని ఆ కొండ ప్రాంతంలో నాకోసం ప్రచారం చేస్తూ తిరిగారు. ఆయనకు గుండెజబ్బు ఉన్నప్పటికీ పట్టించుకోకుండా 1959 సంవత్సరం నుంచి ఆయన జవహర్లాల్ నెహ్రూగారి రైతాంగ వ్యతిరేక చర్యలకు వ్యతిరేకంగా పోరాడుతూ కష్టించి పనిచేశారు. ఆయన కుమారుడు నాగభూషణాన్ని "గరీబీ హఠావో" లక్ష్యం కోసం తన డబ్బులు తను ఖర్చు పెట్టుకుంటూ తిరిగే మంచి కార్యకర్తగా తయారుచేశారు.

శ్రీ టి.సి.రాజన్

చిత్తూరు జిల్లా రాయలపేటకు చెందిన శ్రీ టి.సి.రాజన్ గారు సంభయ్యన పడిలో మా రైతాంగ ఉద్యమంలో ప్రవేశించారు. వారు దిగువ మాఘంలోను తిరుత్తణిలోనూ జరిగిన రైతాంగ శిక్షణా తరగతులకు హాజరైనారు. జిల్లా కిసాన్ సమ్మేళనానికి కార్యదర్శిగాను, అధ్యక్షులుగాను ఆయన పనిచేశారు. అన్ని ప్రజాఉద్యమాలలోను రాజగోపాల నాయుడుగారికి ఆయన చురుకైన కార్యకర్తగా తోడున్నారు. భూమిశిస్తుకు వ్యతిరేకంగా చిత్తూరు జిల్లాలో సత్యాగ్రహం చేసినందుకుగాను 1964 సంవత్సరంలో ఆయన జైలుశిక్షననుభవించారు. ఆహారధాన్యాల కంట్రోళ్లకు ఆయన వ్యతిరేకంగా పోరాడారు. నిజాయితీపరుడైన ఆత్మవిశ్వాసంగల మంచి ప్రజాసేవకునిగా ఆయన పేరు తెచ్చుకున్నారు. ఆయన ఒకమారు శాసనసభ్యునిగా ఉన్నారు. ఆ సమయంలో 17వ రాజ్యాంగ సవరణకు సహకార వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించారు.

నెల్లూరు – శ్రీ పెళ్లకూరి రామచంద్రారెడ్డి

నెల్లూరు డెల్టాలో పెళ్లకూరి ప్రజలందరికీ తెలిసిన ప్రముఖ ప్రజాసేవకులు. స్వయం వృత్తుల రక్షణకై రైతులు తీవ్రంగా ఉద్యమం నడుపుతున్నప్పుడు 1956 సంవత్సరంలో ఆయన రైతాంగ ఉద్యమంలో ప్రవేశించారు. అప్పటినుంచి ఆయన అన్నివేళల కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతంలో విశ్వాసంతోనే ఉన్నారు. 1967 నుండి ఆయన శాసనసభ్యుడు. శాసనసభ స్పీకరుగా పనిచేసిన శ్రీ రేబాల దశరథరామిరెడ్డిగారిలాగే రామచంద్రారెడ్డిగారు కూడా బాగా ప్రజాభిమానాన్ని సంపాదించుకున్న మంచి ప్రజానాయకులు.

అప్పికట్ల రంగనాయకులు, నాగయ్యగార్లు

శ్రీ ఆచంట రంగనాయకులు స్వాతంత్ర్య సమరయోధులు. ప్రస్తుతం బాపట్లలో ప్రముఖ న్యాయవాది. ఆయన వైద్యశాస్త్రంలో రెండవ సంవత్సరం కోర్సు చదువుతున్నప్పుడు హఠాత్తుగా నిర్బంధితుడై 1941 సంవత్సరంలో వెల్లూరు జైలులో ఉన్నాడు. మా ఏ క్లాసు నిర్బంధితుల శిబిరంలోకి ఆకస్మికంగా వచ్చిన ఆయనను చూసి అప్పుడు నేను సంతోషానికి ,ఆశ్చర్యానికి లోనయ్యాను. అప్పుడాయన సామ్రాజ్యవాద వ్యతిరేక విద్యార్థినాయకులలో ఒకరు తమ రహస్యాలను అందించడం ద్వారా ఎలా తమ ఉద్యమాన్ని దెబ్బతీసిందీ తాను

నిర్బంధంలోకి తీసుకురాబడిందీ నాకు వివరించారు. కొన్ని మాసాలు అక్కడ మేమిద్దరం కలసి ఉన్నాము. సాయం సమయాల్లో అలా నడుస్తూ వున్నప్పుడు జాతీయ సమస్యలను గురించి తరచు చర్చించుకుంటూ ఉండేవారం. రంగనాయకులు గారి తండ్రి శ్రీరామయ్య, నేను, శ్రీమతి భారతీదేవి, శ్రీ లక్ష్మీనారాయణగార్లు అప్పటికే జాతీయోద్యమంలో పాల్గొంటూ ఉన్నందువల్ల, మా కుటుంబం ఎక్కువ మందిని త్యాగం చేసిన కారణంగా, దానితోపాటు రంగనాయకులు వైద్య విద్యా శిక్షణా కార్యక్రమం పూర్తిగా చెడిపోయినందుకు, ఆ సందర్భంలో చాలా బాధపడ్డారు. రంగనాయకులు ఎప్పుడూ మృదుస్వభావంతో చిరునవ్వులు చిందిస్తూ వుండేవారు. బాపట్లలో మొదటి తరగతి కళాశాలను ప్రారంభించేందుకు ఆయన బాగా కృషిచేశారు. ఆ తరువాత మంచి స్థాయిలో కొచ్చిన ఆ కళాశాలకు ఆయన గౌరవ కార్యదర్శిగా వున్నారు.

భారత రైతాంగ ఉద్యమానికి రంగనాయకులుగారి జన్మస్థలమైన బాపట్ల ప్రధాన కేంద్రంగా ఉంటుండేది. మొట్టమొదటి రైతుకూలీ సమ్మేళనం నా జన్మస్థలమైన నిడుబ్రోలులో జరుగగా తొలి రైతుమహాసభ బాపట్లలో జరిగింది. పక్కా పక్కానే ఉన్న ఈ రెండు గ్రామాలు ఒకదానికొకటి ఎనిమిది మైళ్ళ దూరంలోనే ఉన్నాయి. ఇవి రెండూ కూడా 1923 సంవత్సరంలో జరిగాయి. నిర్బంధితులైన రంగనాయకులు ఆ సాంప్రదాయాన్ని అందిపుచ్చుకొని నవీన రైతాంగ ఉద్యమంలో ప్రవేశించి ప్రజాసేవ చేశారు. శ్రీ రంగనాయకులుగారి బంధువు అయిన శ్రీ ఆచంటనాగయ్యగారు హైస్కూలులో నా సహవిద్యార్థి, స్నేహితులు: అక్కడ నుంచి ఆయన ఈ ఉద్యమాల్లో నాతో కలసి పనిచేస్తూనే ఉన్నారు. మా కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని గాంధీగారు ఆశీర్వదించినప్పుడు, అందుకు అప్పికట్ల, రైతులు అమితంగా ఆనందించారు. 1952, 1962, 1967 సంవత్సరాలలో పార్లమెంటుకు జరిగిన సాధారణ ఎన్నికలలో కాంగ్రెస్ వారు నన్ను ఓడించేందుకు తమ శక్తి యుక్తులన్నింటిని కేంద్రీకరించి ప్రయత్నిస్తున్నప్పటికి నేను గెలిచిన సందర్భాల్లో అక్కడి ప్రజలు జయజయధ్వానాలు పలికారు. 1922 కిసాన్ సభ సందర్భాన్ని పురస్కరించుకొని వారు అక్కడ ఒక రాతిస్తంభాన్ని పాతి దానిపై ఆనాటి ముఖ్య సంఘటనలను రాసి అఖిల భారత కిసాన్ ఉద్యమానికి ఒక అలంకారంగా తమకు గర్వకారణంగా ఆ గ్రామంలో స్థాపించుకున్నారు. ఆ స్తంభం నవీన రైతాంగ ఉద్యమం ప్రారంభమైన నలభై సంవత్సరాల తరవాత 1963లో పూజ్య రాజాజీగారి ద్వారా ఆనాడు అక్కడ ఆ సభ జరిగిన స్థలానికి దగ్గరగా, గుర్తుగా స్థాపించుకున్నారు.

వి.వి.రమణ

మన రైతాంగ ఉద్యమానికి ఆదివాసి ప్రజల సేవకు విశాఖపట్నం జిల్లా అనకాపల్లి ముగ్గురు మంచి కార్యకర్తలను అందజేసింది. వారిలో అత్యంత అనుభవనీయులైన శ్రీ వి.వి.రమణ రైతుకుటుంబంలో నుంచి వచ్చారు. ఆయన ఆంధ్రవిశ్వవిద్యాలయంలో ఎం.ఏ డిగ్రీని పుచ్చుకొని ఒక రైతాంగ కార్యకర్తగా మాతో చేరారు. గత ఇరవై ఎనిమిది సంవత్సరాలుగా తనకొచ్చే వ్యవసాయాదాయంలో ఎక్కువ మొత్తాన్ని ఆయన ప్రజాసేవకోసం వినియోగిస్తున్నారు. ఆయన రెండుమార్లు రాజ్యసభ సభ్యులుగా ఎన్నికయ్యారు. పార్లమెంటులో కృషీకార్ లోక్ వర్గానికి

కార్యదర్శిగా పనిచేస్తూ నాకు తోడ్పడ్డారు. ఆయన స్థానికంగా ఉన్న పంచదార ఫ్యాక్టరీని సహకార రంగంలోకి మార్పుచేసి రైతులను అందులో భాగస్వాములుగా తయారుచేసి దాని ఉత్పత్తి సామర్థ్యాన్ని రెట్టింపుచేసి చెరకు పండించే వారికి బాగా తోడ్పడ్డారు. ఆయన మనీలాలో జరిగిన అంతర్జాతీయ చెరకు ఉత్పత్తిదారుల సభలో నిర్వహణానుభవానికి సహకార రంగంలో పంచదార తయారుచేసే కార్యక్రమానికి, చెరకు ఉత్పత్తికి కృషికి గాను బహుమతిని సంపాదించుకున్నారు.

రామునాయుడు

రమణగారి అనుచరులయిన రామునాయుడు ఆంధ్రవిశ్వవిద్యాలయ గ్రాడ్యుయేటు. ఆయన తన కుటుంబ వ్యాపారాన్ని చూసుకుంటూనే రైతుసంఘానికి సేవలందిస్తూ, ఒక రైతుగా ఉండికూడా ప్రజాసేవలో పాల్గొంటూ రెండు విధులను కూడ ఒకేమారు ఎలా బాధ్యతాపూర్వకంగా నిర్వహించవచ్చో ఉదాహరణగా చూపెట్టారు. ఆయన మొదటి కిసాన్ యాత్రా ట్రెయిన్ సర్వీసును నిర్వహించి వందలకొలది రైతులకు ప్రాచీన చారిత్రక స్థలాలను, నవీన ఉత్పత్తి కేంద్రాలను, నెహ్రూగారు నవీన యాత్రాస్థలాలుగా కీర్తించిన వ్యవసాయ పరిశోధనా కేంద్రాలను చూపెట్టారు. ఆయన అనకాపల్లిలో కిసాన్ హాలు నిర్మాణంచేసి తనకున్న వ్యాపార దక్షతను, సామర్థ్యాన్ని రుజువుచేసుకున్నారు. ఈ కృషిలో రమణ ఆయనకు కావలసిన రాజకీయ సహకారాన్ని అందించారు.

శ్రీ భీశెట్టి

జంషెడ్‌పూర్ ఫ్యాక్టరీలో కార్మికునిగా పనిచేసిన మాజీ శాసనసభ్యులు శ్రీ భీశెట్టి అప్పారావుగారు శ్రీ వి.వి.రమణగారి కోరికపీద ప్రజాసేవారంగంలో ప్రవేశించి రైతాంగ ఉద్యమాలకు గిరిజనాభివృద్ధి కార్యక్రమాలకు తన సమయాన్ని కేటాయించారు. మహేంద్రగిరి ప్రాంతంలోని గిరిజనులకు చాలా సంవత్సరాలు ఆయన సేవలందించారు.

శ్రీ మల్లిపెద్ది

వారిలాగే శ్రీకాకుళానికి చెందిన శ్రీ మల్లిపెద్ది కృష్ణమూర్తిగారు కూడా గిరిజన రైతాంగసేవలో కృషిచేశారు. గిరిజన ప్రాంతాల్లో వుండే అంటువ్యాధులు మలేరియా వంటి వాటితో వారు చాలా బాధలనుభవించారు. సవరులు, మరియా జాతివారికి వ్యాపారస్తుల, ముఠాదారుల దోపిడీ నుంచి రక్షణ కల్పించారు. సర్దార్ లచ్చన్నగారు మంత్రిగా కొనసాగినప్పుడు ఆదివాసుల రక్షణకుద్దేశించిన ప్రభుత్వ పథకాల తయారీలో ఆయన తోడ్పడ్డారు. అప్పారావుగారు ఏడు సంవత్సరాలు శాసనసభ్యునిగా కొనసాగి గిరిజనుల అవసరాలను బాగా ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. మల్లిపెద్ది కృష్ణమూర్తిగారు చాలా నిరాడంబరంగా జీవిస్తుండేవారు. అందువల్ల ఆయనతో ఎవరికీ ఇబ్బంది లేదు. ప్రభుత్వం వారి సలహాలను పట్టించుకోకపోవడంవల్ల, తగినంతమంది కార్యకర్తలు వారిని అనుసరించలేకపోవడంవల్ల తమ స్థావరాలుగా చేసుకోగలిగారు.

శ్రీ యన్.వీరాచారి

శ్రీ యన్.వీరాచారి రామునాయుడు, రమణగార్లనుంచి ప్రత్యేక యాత్రారైళ్లను నిర్వహించే విషయాన్ని గ్రహించగలిగారు. ఆ తరువాత ఆయన దానిని వ్యాపారంగాను, రైతుల విజ్ఞానాభివృద్ధికి దేశంలో ఉపయోగపడేదిగాను తీర్చిదిద్దగలిగారు. అవే ప్రత్యేక కిసాన్ యాత్రా ట్రయిన్లను ఆయన నడిపి ప్రతిసంవత్సరం వేలకొద్ది రైతులకు స్వరాజ్యం వచ్చిన తరవాత భారతదేశంలో సిద్ధించిన వ్యవసాయక, పారిశ్రామికాభివృద్ధిని చూపించి ఆ ఫలితాలనుండి వారు ప్రయోజనం పొందగలిగేలా చేయగలిగారు. కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంత ప్రచారానికి వీరాచారిగారు ఒక ముఖ్య కార్యకర్తగా ఉంటూ శ్రీ లచ్చన్న, శ్రీరమణ, శ్రీ కోటయ్యగార్లకు వెనుకబడిన తరగతుల వేదికమీద సమర్థవంతంగా సహకరిస్తూ వచ్చారు.

ప్రజాసేవకులకు కొత్త బాధ్యతలు

1960 వ సంవత్సరంనుంచి మన గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వాధికారులకు, ప్రజలకు మధ్య సంధానకర్తలుగా పనిచేయవలసిన కొత్త బాధ్యత ప్రజల అవసరాల దృష్ట్యా ప్రజాసేవకులపై త్వరత్వరగా పడసాగింది. పంచాయితీ రాజ్యసంస్థల వ్యవహారంలోనూ, వైద్యం, వ్యవసాయం ఇంజనీరింగు సాంకేతిక విద్యావిషయాలలోను, సీట్లు సంపాదించుకోడంలోనూ జాతీయ వికాస పథకాలలోనూ, స్త్రీ జనాభ్యుదయ కార్యక్రమాలలోను హరిజన, గిరిజన విద్యార్థుల ఉపకార వేతనాలలోనూ వసతి గృహాల విషయంలోనూ సహకార సంస్థలనుండి అప్పులు పొందడంలోనూ ఉపాధికల్పన వంటి విషయాలలోనూ అనేక యితర సాంఘికాభివృద్ధి వ్యవహారాలలోనూ ప్రజల యొక్క అవసరాలు బాగా పెరిగి స్వచ్ఛంద సేవకుల, నాయకుల అవసరం బాగా పెరిగింది. అందుకుగాను గ్రామీణాభివృద్ధి అధికారులను మంచి జీతాలతో నీర్పాటుచేయడం జరిగింది. అమెరికా దేశంలో ఇటువంటి సేవలను ఫారం బ్యూరో ఫెడరేషన్ వారు నిర్వహిస్తూ అందుకు తగు ఛార్జీలను వసూలుచేస్తారు. దురదృష్టవశాత్తూ మన రైతాంగ సంస్థలు ఇందుకు కావలసిన సామర్థ్యాన్ని సంపాదించుకోలేదు. న్యాయవాదులు, ఆడిటర్ల వంటివారు ఇటువంటి సేవలను డబ్బుపుచ్చుకొని కొనసాగిస్తున్నప్పటికి మన ప్రజలు ప్రజాసేవను మరచిపోతున్న ఈ రోజుల్లోకూడ సమర్థులైన వారినుంచి ఉచితంగా కావాలని కోరుతూనే ఉన్నారు. ఇటువంటి సేవల విషయంలో రవాణాఛార్జీలు, వారి దినసరి ఖర్చులను కూడ ఇవ్వకుండా వారు ఎలా అందించగలరనే దాన్ని తెలుసుకోకుండా ప్రజలు తమకు అందించవలసిందిగా కోరుతున్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో ఈ మార్గంలో అనేకమంది తమ కుటుంబాలను కూడ పట్టించుకోకుండా తమకున్న దాన్ని ఖర్చుచేసుకుంటూ పనిచేస్తూ వచ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారిలో ఒంగోలుకు చెందిన శ్రీ నాగినేని వెంకయ్యగారు తన స్వంత ఖర్చులతో ప్రజావసరాల కోసం తిరుగుతూ కొన్ని దశాబ్దాల సేవజేసిన తరవాత ఈనాడు చాలా పేదరికంలో ఉన్నారు.

ఈ పరిస్థితుల్లో ప్రజాసేవారంగంలో పనిచేస్తున్న సాంఘిక కార్యకర్తలనేకమంది క్రమేణా నైతిక విలువలకు తిలోదకాలిస్తూ తమ ఖర్చులకు తమ కుటుంబ అవసరాలకు కూడా

అవసరార్థం వచ్చిన ప్రజలనుంచి వసూళ్లు చేయడం ప్రారంభించారు. వారిలో కొంతమంది పూర్తి దళారీలుగా మార్పు చెందారు.

నా స్నేహితులైన శ్రీ రాజన్న యం.ఎల్.సి., శ్రీ యడ్లపాటి వెంకట్రావు యం.ఎల్.ఎ., శ్రీ కందిమళ్ల బుచ్చయ్య, శ్రీ టి.సి.రాజన్, (మాజీ యం.ఎల్.ఏలు), శ్రీ కె.రోశయ్య యం.ఎల్.సి., శ్రీ బేతపు శెట్టి స్వాతంత్ర్య సమరయోధులు, శ్రీ సి.వి.సిద్దయ్యమూర్తి హరిజన కార్యకర్త, శ్రీ ప్రగడ కోటయ్య యం.ఎల్.సి., శ్రీ కందుల ఓబులరెడ్డి, శ్రీ గొతు లచ్చన్న, శ్రీ మూర్తిరాజు (మాజీ మంత్రులు) కొమ్మారెడ్డి బాపయ్య చౌదరిగార్లు గాంధేయ మార్గంలో నిజాయితీతో ప్రజాసేవ చేస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. వీరు, ఇలాంటి మరికొంతమంది గాంధేయవాదులు తమ రోజువారీ ఖర్చులకుగానీ, కుటుంబ అవసరాలకుగానీ, వ్యక్తిగత వ్యయానికి గానీ ఎవరినుంచి ఎలాంటి ప్రతిఫలాన్ని గ్రహించక, ఇప్పటికీ నిష్కామంగానే తమ సేవలనందిస్తున్నారు. విచారించదగ్గ విషయ మేమిటంటే వీరి సంఖ్య 1955 సంవత్సరం నుండి ఏటికేడూ తగ్గిపోతూ ఉంది.

శ్రీ యడ్లపాటి వెంకట్రావు, శ్రీ కందిమళ్ల బుచ్చయ్య

శ్రీ యడ్లపాటి వెంకట్రావు, శ్రీ కందిమళ్ల బుచ్చయ్యగార్లు అదృష్టవశాత్తూ తమ అవసరాలకు కావలసినంత ఆస్తి ఉంది. శ్రీ యడ్లపాటి వెంకట్రావు పన్నెండు సంవత్సరాలకు పైకాలంనుంచి రెండు జిల్లాల ప్రజలకు విరామమెరుగక సేవచేస్తున్నారు. మంత్రులతో అధికారులతో ఆయన చాలా సౌమ్యంగా తనదైన ఒక బాణీతో వ్యవహరిస్తూ ఉంటారు. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు అమలు చేయించడంలో ఆయన ఇతర శాసన సభ్యులు విఫలమైన సందర్భంలో కూడా వాటిని విజయవంతంగా సాధిస్తారు. అధికారుల మొండివైఖరుల నుంచి ప్రజాసంక్షేమ పథకాలను సాధించడంలో వెంకట్రావుగారి మార్గాన్ని ఇతర శాసనసభ్యులు సాంఘిక సేవకులుగూడ అనుసరిస్తే బావుంటుందని నేను అనుకుంటాను. బుచ్చయ్యగారు కూడ ఇలాంటి సేవలనే కొనసాగించారుగానీ అయితే అంత విస్తృతంగా కాదు. ఆయన కృషి నాలుగు నియోజక వర్గాల ప్రజల అవసరాలకు పరిమితమై నాగినేని వారి సాంప్రదాయంలో నడిచింది. 1976-72 సంవత్సరకాలంలో శ్రీ బుచ్చయ్యగారు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు అప్పటి ఓ హరిజన జిల్లా కలెక్టరు బుచ్చయ్యగారి నియోజకవర్గంలో కనీసం తనవలన సహాయం పొందకుండా వున్న గ్రామంగానీ, ఓ హరిజన పల్లెగాని లేదని చెప్పారు. విద్యుద్దీకరణకుగానీ, నాగార్జునసాగర్ ఆయకట్టు అభివృద్ధికిగానీ లేదా ఒక రోడ్డుకోసం గానీ, బ్రిడ్జికోసం గానీ, స్కూలు లేదా స్కూలు భవనం కోసంగాని, వైద్యశాలకోసంగానీ, లైబ్రరీకోసంగానీ, పశుగణాభివృద్ధికి, ముఖ్య గ్రామంగా ఎంపిక చేయించుకొనేందుకు గానీ ఎవరు తన దగ్గరకు వచ్చినా, హరిజన విద్యార్థికి స్కాలరు షిప్పుకోసం గానీ, స్టైఫండుకోసం గానీ, సీటుకోసంగానీ లేదా ఉద్యోగం కోసం తనదగ్గరకు వచ్చినా, హాస్పిటల్‌లో బెడ్డు సంపాదించుకొనేందుకు ఏ పేద హరిజన వ్యక్తివచ్చినా, వ్యవసాయదారులు పాగాకు పత్తి, వేరుశనగ వంటి పంటల అమ్మకం విషయంలో తనను సంప్రదించినా బ్యాంకుల్లో రుణసాకర్యం విషయంలో వచ్చినప్పటికి శ్రీ బుచ్చయ్య సదా

సిద్ధంగావుండి ఆయా ప్రజలకు తన స్వంత ఖర్చులతో తిరుగుతూ తోడ్పడుతుండేవారు.

శ్రీ కె.రోశయ్య

శ్రీ కె.రోశయ్య యం.ఎల్.సి, మా రైతాంగ విద్యాలయం విద్యార్థి. 1945 సంవత్సరం నుంచి విద్యార్థి కాంగ్రెస్‌లో పనిచేస్తున్నారు. ఆయన సాంప్రదాయ పూర్వకమైన వ్యాపార కుటుంబం నుంచి వచ్చినా కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతమీదా, బోధనలమీదా గౌరవంతో పనిచేశారు. సంస్థలను నిర్వహించడంలో ఆయన క్రమపద్ధతిలో కృషిచేస్తూ అందులో తన వ్యాపార అనుభవాన్ని చక్కగా ప్రదర్శించేవారు. చిన్న వ్యాపారులు (కిరాణా మర్చంట్స్) వారి అవసరాలకోసం ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారిని సమీకరించి బలమైన శక్తిగా రూపొందించారు. తన అవసరాల నిమిత్తమై ఆయన తమకు ఆసవాయితీగా వస్తున్న రైసుమిల్లు పరిశ్రమలో ప్రవేశించారు. స్వయంవృత్తులతో జీవించే ప్రజలు వారు రైతులుకానీ, వ్యాపారస్తులుకానీ, హస్తకళల వారుకానీ వారందరి కోసం ఆయన కృషిచేస్తూనే తాను చేపట్టిన వాణిజ్యంలో కూడా చక్కటి ఫలితాలను సాధించారు. అందువల్ల ఆయన చేనేత పనివారల విషయంలో శ్రీ ప్రగడ కోటయ్యగారితోనూ, రైతుల విషయంలో శ్రీ యడ్లపాటి వెంకట్రావుగారితోనూ గ్రామీణ ప్రజల అభివృద్ధి కృషిలో శ్రీ గోగినేని నాగేశ్వరరావు యం.బి.వి. (యు.ఎస్.ఏ.) గారితోనూ సహకరించి కృషిచేశారు. స్వయంవృత్తిదారులైన రైతుల రక్షణకు మేము చేపట్టిన అన్ని ఉద్యమాలలోనూ ఆయన మాతో కలసి పనిచేశారు.

మధురైకి చెందిన శ్రీ ఆర్.వి.స్వామినాధన్

పది సంవత్సరాలకు పైగా పార్లమెంటు సభ్యులుగా వున్న మధురైకి చెందిన శ్రీ ఆర్.వి.స్వామినాధన్ శక్తివంతమైన రైతాంగనేత. 1935 సంవత్సరంనుండి మేమిద్దరం కలిసి పనిచేశాము. తంజావూరు జైలులో కమ్యూనిస్టు ప్రచారాన్ని మేమిద్దరం కంసి ఎదుర్కొన్నాము. మూడు దశాబ్దాలపాటు జమిందారీ విధానానికి వ్యతిరేకంగా నేను జరిపిన పోరాటంలో ఆయన నాతో కలసి పనిచేశారు. ఆయన తమిళనాడు ఇందిరా కాంగ్రెస్ సంఘానికి అధ్యక్షులయ్యారు. చరిత్రాత్మకమైన కాంగ్రెస్ నాయకుల మధ్య జరిగిన అంతర్గత పోరాటంలో సిండికేట్, శ్రీమతి ఇందిరాగాంధీల మధ్య ఆయన ఇందిరాగాంధీని బలపర్చి కామరాజ్ నాడార్‌గారికి వ్యతిరేకంగా పోరాడి 1971 పార్లమెంటు ఎన్నికలో నాడార్ కాంగ్రెస్ ఓడిపోయి తమిళనాడులో ఇందిరాకాంగ్రెస్ గెలవడానికి కృషిచేశారు. 1950లో జరిగిన ప్రపంచ వ్యవసాయ ఉత్పత్తిదారుల సమాఖ్య సభలకు గ్రామీణ ప్రజల సమాఖ్య తరపున ఆయనను ప్రతినిధిగా పంపాయి. 1965లో న్యూజిలాండ్‌లో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ కాన్ఫరెన్స్‌కు మేమిద్దరం సహసభ్యులము.

శ్రీ హనుమంతరావు, శ్రీ అప్పారావు

1946 నుంచి కాంగ్రెస్ పార్టీకి తరువాత కృషికార్ లోక్ పార్టీకి తర్వాత స్వతంత్ర పార్టీకి సేవాదళ్ అధికారులుగా పనిచేస్తూ మాజీ పోలీసు అధికారియైన శ్రీ హనుమంతరావు, ఐ.ఎన్.ఏ. కెప్టెన్‌గా పనిచేసిన శ్రీ అప్పారావుగార్లు సమర్థవంతమైన కృషిచేశారు. వారి ఉద్యోగాలను వారు

స్వతంత్ర పోరాట కాలంలో త్యాగం చేశారు. వారి శక్తిసామర్థ్యాలను వారు యువకులకు క్రమశిక్షణ నేర్పేందుకు ప్రజాస్వామ్య పద్ధతుల్లో తర్ఫీదు ఇచ్చేందుకు వినియోగించారు. శ్రీ హనుమంతరావు తనకున్న శక్తి సామర్థ్యాలను భారతదేశమంతా ప్రజాస్వామ్య పరమైన కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు, భారత సేవక్ సమాజ్‌లో ఆయన గౌరవంగా పనిచేసిన పది సంవత్సరాల కాలాన్ని వినియోగించుకుంటే, అప్పారావు విశ్వాసపాత్రులైన కార్యకర్తలను తయారుచేసేందుకు వినియోగించారు. గత ముప్పై సంవత్సరాలుగా వీరిద్దరూ నాకు అంగరక్షకులు. నా రాజకీయ పోరాటాలన్నింటిలో నాకు సలహాదారులుగా ఈ ముప్పయి సంవత్సరాల కాలంలో ఉన్నారు.

విశాఖపట్నం శ్రీ అప్పలనాయుడు

శ్రీ వి.అప్పలనాయుడు ఆయన చిన్నవాడిగా ఉన్నప్పుడు ముప్పయి సంవత్సరాలకు ముందు మా రైతాంగ విద్యాలయాని కొచ్చాడు. అప్పటి నుంచి ఆయన రైతుల కోసం పనిచేస్తున్నారు. ఆయన బ్రహ్మచారి. కెప్టెన్ అప్పారావు గారిలాగా చాలా నిరాడంబరమైన జీవితాన్ని కొనసాగిస్తుంటారు. కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతానికి ఆయన అవసరమైన అన్ని సందర్భాలలోనూ అన్నింటా తానై కనిపిస్తుంటాడు. కెప్టెన్ అప్పారావు గారిలాగే ఆయనెప్పుడూ ఆత్మగౌరవాన్ని వదులుకొని నడవడు. అయితే మంచి విశ్వాసపాత్రుడైన కార్యకర్త. కొంతమంది ఆయన బంధువులు ఫిజీ ద్వీపంలో వ్యవసాయదారులుగా బాగా అభివృద్ధి సాధించినా గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, కృష్ణా జిల్లాలలోని రైతులు ఆయనకు ఎక్కువ అభిమానపాత్రులు. ఆయన కావూరి వెంకయ్యగారిలాగా చాలా తక్కువ అవసరాలతో జీవిస్తుంటాడు. ఆయనకు వీరకమైన ఆస్తిమీద ఆసక్తి లేదు.

శ్రీ సిద్దయ్యమూర్తి

చిత్తూరుకు చెందిన శ్రీ సిద్దయ్యమూర్తి వేదహరిజన కుటుంబంనుండి వచ్చారు. ఆయన తల్లి వ్యవసాయపనులకు వెళ్లి సంపాదించిన కూలి డబ్బులద్వారా ఆయనకు కాలేజి స్థాయివరకు చదువు చెప్పించింది. ఆయన తన చిన్నతనం నుండే ఆ జిల్లాకు చెందిన శ్రీ యన్.వి.నాయుడు, శ్రీ రాజగోపాల్, శ్రీ తిమ్మారెడ్డిగార్ల కృషికి ఆకర్షితులై కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య పద్ధతుల్లో కృషిచేయడానికి ముందుకు వచ్చినందుకు నా అభినందనలు. ఆయన 1962, 1967, 1977 సంవత్సరాలలో పార్లమెంటుకు పోటీచేసి కొద్ది లేడాతో అన్నిమార్లు ఓడిపోయారు. ప్రజాసేవారంగంలో ఆయన చేస్తున్న నిరంతర కృషికి డబ్బులెక్కడినుండి లభిస్తున్నాయో ఆపై వానికే ఎరుక. ఆయన బాగా ఆత్మగౌరవమున్న మనిషి. డబ్బుకోసం ఎవరిముందూ ఎప్పుడూ చేయిచాచేవారు కాదు. ఆయన ముప్పయి అయిదు సంవత్సరాల వయస్సు వచ్చేవరకూ కూడా పెళ్లి చేసుకోలేదు. ఎందుకంటే తనకు ఆ ఆర్థిక ఇబ్బందుల్లో మరో అదనపు భారమెందుకని. సిద్దయ్యమూర్తి లాంటి కార్యకర్తను చూసిన తర్వాత అలాంటివారు ఆదివాసులకు, హరిజనులకు, వెనుకబడిన తరగతుల ప్రజలకు సేవచేసేందుకు వీలుగా, భారత సేవక్ సమాజ్, గాంధీ సేవాసంఘ్, సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీ లేదా సర్వెంట్స్ ఆఫ్

ఇండియావంటి సంస్థలు ఇటువంటి వారి ఖర్చుల కోసం కొంత సహాయం చేసేందుకు పూనుకోవాలని పిస్తుంది.

శ్రీ వి.ఎల్.సుందరరావు

బాపట్లకు చెందిన శ్రీ వి.ఎల్.సుందరరావు ప్రస్తుతం అఖిల భారత స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ప్రధాన కార్యదర్శి. మూడు, నాలుగు వేరువేరు సంఘాలుగా పనిచేస్తున్న స్వాతంత్ర సమరయోధుల సంఘాలను ఒక దారిలోనికి తెచ్చి ఈ సంస్థను ఏర్పరచడానికి ఆయన రెండు సంవత్సరాలపాటు కష్టించి పనిచేశారు. నిజానికి ఇదొక గొప్ప విజయం.

శ్రీ టి.తిమ్మారెడ్డిగారు రెవిన్యూ మంత్రిగా ఉన్నప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అప్పటికి అరవై ఏళ్లకుపైగా ఉండి దురదృష్టకరమైన జీవితాన్ని గడుపుతున్న వారికి రూ.300/- తో కూడిన పెన్షన్లు ఇచ్చే కార్యక్రమం, ఆయన ప్రయత్నం వల్లనే ప్రారంభమైంది.

దీనిని రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరిగారి దృష్టికి, భారత ప్రధాని శ్రీమతి ఇందిరగాంధీ దృష్టికి తీసుకొచ్చిన ఘనత శ్రీ తిమ్మారెడ్డి, శ్రీ సుందరరావు గార్లదే. ఆ తరువాత 1972 సంవత్సరం ఆగష్టు 15 నుంచి దేశ వ్యాప్తంగా స్వాతంత్ర్య సమరయోధులను గుర్తించే కార్యక్రమం శ్రీమతి ఇందిరాగాంధీ గారితో ప్రారంభ మైంది.

ఆయన రైతాంగ విద్యాలయం నుంచి పట్టా పుచ్చుకున్నారు. కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య సిద్ధాంతం పట్ల నమ్మకం కలిగి అవనిగడ్డలో తన రక్షక్షరాలతో దానిని లిఖించారు. దేశభక్తులైన విద్యార్థులు కమ్యూనిస్టులు "ప్రజాయుద్ధ" నినాదాన్ని విద్యార్థి ఉద్యమాలలోకి కూడా ప్రవేశపెడుతున్నప్పుడు వారి పలుకుబడిలో ఉన్న విద్యార్థి ఫెడరేషన్ లోనుంచి ధైర్యంగా బయటపడడానికి దారితీసిన మొదటి వ్యక్తి ఆయన. 1942 సంవత్సరంలో భారతీదేవిగారి సహాయంతో ఆంధ్రప్రాంతంలో విద్యార్థి కాంగ్రెస్‌ను ఆయన ప్రారంభించి ఆ తరువాత అఖిల భారత స్థాయిలో శ్రీ దినకర్ సక్రేకర్, శ్రీ యస్.కె.పాటిల్ గార్ల సహకారంతో ఆయన బొంబాయిలో అఖిలభారత విద్యార్థి కాంగ్రెస్‌ను స్థాపించాడు. చైతన్య వంతమైన విద్యార్థి. కాంగ్రెస్, దానిద్వారా నిర్వహించబడిన పోరాటాల పరంగా కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని ప్రచారంచేస్తూ, కమ్యూనిస్టుల కార్మిక నియంతృత్వ లక్ష్యాలను వ్యతిరేకంగా పోరాడారు. (వివరాలకు రంగాగారి "ఫైట్ ఫర్ ఫ్రీడమ్" చూడండి. ఎడిటర్.)

యుద్ధసమయంలోని యువరాజకీయ ఖైదీలలో శ్రీసుందరరావు గొప్ప సాహసవంతుడు. 1940 సంవత్సరంలో ఆయన జైలునుంచి తప్పించుకొని వెళ్లి తరువాత సంవత్సరానికి పట్టుబడ్డాడు. రెండవమారు 1942 సంవత్సరంలో బళ్లారి జైలుకు తీసుకువెళుతున్నప్పుడు రైలునుంచి దూకి పోలీసు కస్టడీనుంచి తప్పించుకోడానికి ప్రయత్నించి తరువాత పోలీసులకు చిక్కిపాయ్యారు.

ఆయనకు, శ్రీ విజయరాజ్ కుమార్‌గార్కి, సుభాష్‌చంద్రబోసు గారంటే గొప్ప

అభిమానం. అందువల్ల వారిద్దరూ ఫార్వర్డ్ బ్లాకులో పనిచేశారు. ఆయన బాపట్లలో ప్రారంభించిన నేషనల్ థియేటర్ తరపున తనలాగే నిర్లక్ష్య స్వభావం కలిగిన మరో సత్యాగ్రహి కీ॥ శే॥ లైన శ్రీ శర్మ సహాయంతో సుందరరావుగారు ఒక నాటక సంఘాన్ని నడిపారు. ఆయన నేతాజీ జీవితంలోని సాహసఘట్టాలను అన్ని ముఖ్యపట్టణాల్లోను, రాజకీయ ప్రాముఖ్యత కలిగిన కేంద్రాలలోను నాటకంగా ప్రదర్శించారు. ఆవిధంగా ఆయన 1946-52 సంవత్సరాల మధ్య దేశభక్తులయిన విద్యార్థుల్లో నైతిక స్థాయిని కల్పించారు.

నా సలహా మేరకు ఆయన, పోలీసు ఆఫీసరుగా రాజీనామా ఇచ్చి 1942 జాతీయోద్యమంలో పాల్గొన్న మరొక దేశభక్తుడయిన జి.వెనుమంతరావుగారి సహకారంతో, భారత సేవక్ సమాజ్‌లో పనిచేస్తూ, వాటి శాఖలను ఏర్పాటుచేసేందుకు, శిక్షణా శిబిరాలను నిర్వహించేందుకు పూనుకున్నారు.

శ్రీ సుందరరావుగారిలో ఉన్న ముఖ్య లక్షణాలలో ఒకటి సోషలిజంలో పూర్తి విశ్వాసం, మరొకటి దేశంకోసం, ప్రజలకోసం త్యాగంచేసిన వారిపై గౌరవం. అలా ఆయన గౌరవించే వారిలో శ్రీ రాజమహేంద్రప్రతాప్, శ్రీ షీలభద్రయాజీ, శ్రీ పృథ్వీసింగ్ ఆజాద్, శ్రీ మద్దూరి అన్నపూర్ణయ్య, శ్రీ అన్నాప్రగడ కామేశ్వరరావు, శ్రీమలయ బ్రహ్మచారి తదితర ఇండియన్ నేషనల్ ఆర్మీ నాయకులు, వారిపట్ల ఆయన చూపే గౌరవం అనన్యం. సోషలిజం పట్ల విశ్వాసం, ప్రజలపట్ల ప్రేమ ఉన్న నిజాయితీ పరులైన ఇలాంటి దేశభక్తులు మనకింకా ఈనాడు ఎంతోమంది అవసరం.

శ్రీ పసుపులేటి

పసుపులేటిగా ప్రజలు పిలిచిన శ్రీ పసుపులేటి కోటేశ్వరరావు యం.ఏ.బి.ఎల్. బాపట్లలో బాగాపేరున్న న్యాయవాది. ఆయన 1944 సంవత్సరంలో విద్యార్థి కాంగ్రెస్‌లో ప్రవేశించి కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతం పట్ల అభిమానంతో ఉన్నారు. దాని తెలుగు వారపత్రికకు సంపాదకులుగా పనిచేశారు. ఆయన, శ్రీ సుందరరావు, కీ॥ శే॥ అయిన విడుబ్రోలుకు చెందిన శ్రీ అమ్మయ్య, శ్రీ యన్.వి.సుబ్బయ్యగార్లతో యువజన కాంగ్రెస్‌లో కలిసి పనిచేశారు. యువజన కాంగ్రెస్ ప్రముఖ నాయకులలో ఆయన ఒకరు. ఆయన ఒక మంచి రచయితగా కృషిచేసి కొన్ని మంచి నవలలు రాశారు. 1944 సంవత్సరం నుంచి ఆయన నాతో ఉంటూ అన్ని రైతుసేవా కార్యకలాపాలలోను పాల్గొన్నారు. కృషికార్ లోక్ పార్టీకి ఆ తరువాత స్వతంత్ర పార్టీకి ఆయన ఒక మూలస్తంభం లాగే పనిచేశారు. పదీ, పన్నెండు మంది ప్రసంగించిన తర్వాత కూడా ఆయన అప్పటికి ఎవరూ చెప్పని కొత్త అంశాలను ప్రస్తావిస్తూ ఆకర్షణీయమైన ధోరణిలో చక్కగా ప్రసంగించేవారు. ఎన్నికల ప్రచార సందర్భంలో ఆయన విజయరాజ్ కుమార్‌గార్లు విలువైన తమ ప్రసంగాలతో ప్రజలను పూపుతూవుంటే వీరాచారిగారు జడివానలాంటి తన మాటలతో గుక్కతిప్పుకోకుండా చేస్తుండేవారు. ఆయన శ్రీ సుందరరావుగారి లాగా పూర్తికాలం పనిచేసే రాజకీయ కార్యకర్త కాకపోయినా, ఆంధ్ర దేశంలో ఉన్న మేధావులలో ఒకరిగా చెప్పుకోదగినంత సేవచేశారు. 1971 పార్లమెంటు ఎన్నికల సందర్భంలో కిసాన్ మజ్‌దూర్

ప్రజారాజ్య సిద్ధాంత పరంగా నేను చెప్పిన అంశాలను ప్రజలకు మరొకమారు వివరిస్తూ "గరీబీ హఠావో" నినాదాన్ని సమర్థించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. "గరీబీ హఠావో" సిద్ధాంతం పూర్తి ఫలప్రదం కావడానికి అన్ని ప్రతిపక్షాలు కొంతకాలం పార్లమెంటులోనూ, బయటా తమ వ్యతిరేక చర్యలను తాత్కాలికంగా వాయిదా వేసుకొని చూడవలసిందిగా ఆయన కోరారు.

శ్రీ సన్యాసిరావు

15-8-1974 న 61వ జన్మదినోత్సవం జరుపుకున్న శ్రీ గడ్డం సన్యాసిరావు గాంధేయ మార్గంలో సాంఘిక సేవచేస్తూ వున్న దేశభక్తుల్లో వేళ్లమీద లెక్కించదగినవారు. లక్షలమంది ఇతరుల్లాగా ఆయన కూడ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని మూడవ తరగతి జైళ్లకు వెళ్లారు. 1930 ప్రాంతంలో వైజాగ్ జిల్లా గ్రామీణ ప్రాంతాల్లో ఇది ఒక ముఖ్యమైన సంఘటన. వందల మంది ఇతరుల లాగే ఆయనకూడా శాసనసభ్యులు కాగలిగారు. అదికూడ రైతుల పరంగా ఆయన ఆ ప్రాతినిధ్యాన్ని వహించారు. జమిందారులు వారి ప్రతినిధులకు వ్యతిరేకంగా కౌలుదారులుగా వున్న చిన్నతరహా రైతుల తరపున ఆయన సాహసంతో పోరాడారు. రాజకీయ నాయకుల్లో పరిపాలనలో పెరుగుతున్న అవినీతికి వ్యతిరేకంగా గాంధేయ సోషలిస్టు విధానాన్ని క్రమేణా వదలివేస్తున్న మంత్రుల శాసనసభ్యులతో విభేదాల కారణంగా, ఆయన తన శాసనసభ్యత్వానికి రాజీనామా ఇచ్చారు. ఇటువంటి చర్యకు పూనుకున్న వారిలో ఆయనే మొదటి వారు. వినోబా భావేగారు దానికో రూపం ఇవ్వకముందే ఆయన సర్వోదయ మార్గాన్ని అనుసరించి నడిచారు. మన రైతాంగం స్వయంవృత్తులతోను, ఆత్మ గౌరవంతోను, స్వయం సామర్థ్యంతోను తరతరాలుగా జీవిస్తున్న పద్ధతిని ఆయన కీర్తించారు. ఒక రైతుగా ఒక గాంధేయ గ్రామీణ కార్యకర్తగా తనకు తానుగా కార్యక్రమం చేపట్టిన సర్వోదయ పురాణ పురుషునిగా గాంధేయవాదులకు ఆయన ఆదర్శంగా నిలిచారు. కిసాన్ మజ్‌దూర్ కళాకార్ బుద్ధిజీవి ప్రజారాజ్య సిద్ధాంతాన్ని ఆయన విశ్వసించాడు. ఆయన రామకృష్ణ మిషన్‌వలె కోయంబత్తూరు అవినాష్ లింగం శెట్టియార్ గారివలె స్వార్థరహితమైన, సామాజిక సేవచేశారు. దారిద్ర్యంలో మగ్గుతున్న ప్రజల పక్షాన నిలిచి పోరాడిన వ్యక్తి ఆయన. అందుకే 1971 సంవత్సరంలో "గరీబీ హఠావో" నినాదాన్ని బలపరుస్తూ ముందుకు సాగారు.

శ్రీ కావూరి వెంకయ్య

"గాంధీయుగంలోను అంతకు ముందురోజుల్లోనూ కూడా నిరాడంబరమైన మామూలు జీవన విధానం చాలా గొప్పదిగా భావించి దానిని మనం బాగా గౌరవించాము. ఈనాడు జీవనస్థాయి అనేది అవినీతి మయమైపోయి మన ఆత్మలను కూడ అపరిశుద్ధం గావిస్తున్నది". రాజాజీ, స్వరాజ్య, 4-5-1963.

ఆంధ్రప్రదేశ్‌లోని అనేకమంది సాంఘిక సేవకుల్లో కావూరి వెంకయ్యగారు ఒకరు. ప్రముఖ నిర్మాణ కార్యకర్త. 1976 లో ఆగస్టు 1వ తేదీన తిలక్ మహాశయుడు మరణించిన రోజునే ఆయన కూడ ఆకస్మికంగా ప్రాణాలు విడిచారు. అందుకే ఆరోజు స్వాతంత్ర్య సమరయోధులందరికీ పవిత్రమైన దినం. ఆయన పల్నాడు ప్రాంతంలోని గురజాలకు చెందిన

వారు. ఆయన హైస్కూలులో చదువు సాగిస్తున్న రోజుల్లోనే కాంగ్రెస్‌లో చేరారు. 1930 నుంచి ప్రారంభమైన అన్ని సత్యాగ్రహాల్లో పాల్గొని మూడవ తరగతి ఖైదీగా జైలుశిక్షలను అనుభవిస్తూ ఎక్కువ బాధలకు గురైనారు. ఆయన చిన్న తరహా రైతు కుటుంబం నుంచి వచ్చారు. వర్షాధారంతో మాత్రమే పండే ఆ భూములనుంచి వచ్చే కొద్దిపాటి ఆదాయంతో కఠినతరమైన జీవితాన్ని నిర్వహించారు. ఆయన జీవించి ఉన్నప్పుడు ఒక అయిదు సంవత్సరాలకు ముందు కొద్దిపాటి భూమి నాగార్జున సాగర్ ఆయకట్టకింద సేద్యంలోకి వచ్చింది. ఆయన గాంధేయ జీవన విధానాన్నెన్నుకొని అలా జీవితాన్ని గడిపారు.

1930 సంవత్సరం నుంచే ఆయన కుటుంబ బాధ్యతలనుంచి పక్కకు తప్పుకొని వచ్చే ఆదాయంలో నాల్గవ వంతుతో మాత్రమే జీవితం గడపటం ప్రారంభించారు. ఆయన తన భార్యతోనూ, వున్న ఒకే ఒక్క కుమారుడితోనూ ప్రత్యేకంగా జీవిస్తూ ఆయన సమయాన్ని శక్తిని అంతా ప్రజాసేవ కోసం వినియోగించారు. పడుకొనేందుకు కనీసం ఒక పరుపుగానీ, దిండుగానీ ఆయన ఉంచుకొని ఎరుగరు. తన ఖద్దరు బట్టలను తానే స్వయంగా వుతుక్కుంటూ వుండేవారు. ఆయన శాకాహారి. అతిథులు, అతి సాదాసీదాగా గడిపే ఆయన జీవనశైలిని చూసి ఆశ్చర్యపోయేవారు. డబ్బు విషయంలో వీమాత్రం ఆయనకు ఆసక్తి లేదు.

ఆయన హృదయం హరిజన గిరిజన ప్రజలకు సేవచేయాలనే గాంధేయధోరణి పట్ల పూర్తి అభిమానంతో నిండివుంది. 1933 మేలో అంటరానితనానికి వ్యతిరేకంగా గాంధీగారు ప్రారంభించిన నిరాహారదీక్ష సందర్భంలో ఆయన నాతోను, మా ప్రచార కార్యక్రమంలోను కలిశారు. సాంఘికంగా వెనుకబడిన పల్నాడు, వినుకొండ మెట్టప్రజలను ఇందుకు ఒప్పించి మా సభలకు తీసుకురావడం అంటే అది అంత సులభమైన పనికాదు. ఆ సందర్భంలో ఆయన ఆ సనాతన ప్రజలతో ఉన్న సంబంధాలను తెగతెంపులు చేసుకొని హరిజన గిరిజన బాలురకోసం పాఠశాలలను, వసతి గృహాలను స్థాపిస్తూ తన కాలాన్నంతా వారి అభివృద్ధి కోసం వినియోగించారు. ఆ తరువాత ఆయన విరామమెరుగకుండా నిర్మాణాత్మకమైన కృషిచేస్తూ సత్ఫలితాలను సాధించారు. ఆయన పదికిపైగా ప్రాథమిక పాఠశాలలను ఒక హైస్కూలును వీరి కోసం ప్రారంభించారు. అన్ని ముఖ్య కేంద్రాలైన మాచర్ల, గురజాల, పిడుగురాళ్ల, దుర్గి గ్రామాలలో ఆయన విద్యార్థి వసతి గృహాలను ప్రారంభించారు. ఇందుకుగాను ఆయన పల్లెల్లోని రైతులనుంచి ధాన్యాన్ని విరాళంగా వసూలుచేస్తూ తన అనుచరుల ద్వారా, విద్యార్థుల ద్వారా కూడా, ఇందుకు సహకారాన్ని తీసుకుంటూ వీటి నిర్వహణకు పూనుకున్నారు.

వెనుకబడిన వర్గాల ప్రజలలో విద్యాభివృద్ధిని సాధిస్తూ ఆ మూడు దశాబ్దాల కాలంలో కోటీశ్వరుడైన ప్రముఖ గాంధేయవాది జమన్‌లాల్ బజాజ్ వంటి వారుకూడా ఆనందించగలిగే విధంగా అభివృద్ధిని సాధించాడు. 1930 తర్వాత దేశంలో అంటరానితనం అనేది అంతకుముందులాగా అంత కఠినమైన శైలిలో లేదు. ఆటవిక ప్రజలు కూడా తమ కొడుకులు, కూతుళ్లను స్కూళ్లకు, కాలేజీలకు పంపించడం ప్రారంభమైంది. గిరిజనులలో చదువుకున్న వారికి ప్రభుత్వ సర్వీసులలో, ఉద్యోగాలు రావడం, వారిలో ఆసక్తిని రేకెత్తించింది. వెంకయ్యగారి ప్రోత్సాహంతో చదువుకున్న వారిలో కొంతమంది డాక్టర్లుగా, కొంతమంది జిల్లా మున్సిఫ్స్‌గా

కొంతమంది జడ్జీలుగా, కొంతమంది పోలీసు శాఖలోనూ, సైన్యంలోనూ అధికారులుగా, మరికొంతమంది ఉపాధ్యాయులుగా వందలకొద్దిమంది అనేక ప్రభుత్వ కార్యాలయాల్లో యన్.జి.వో.లుగా పనిచేస్తున్నారు. వెంకయ్యగారే వారందరికీ ఉపాధికల్పనా కేంద్రం, విద్యావిషయ సలహాదారు, సాంఘిక సేవకులు, మార్గదర్శి అన్నీకూడా వారే.

మేము సహకార వ్యవసాయానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించిన సమయంలో, 1959 కి ముందే వెంకయ్యగారు నిర్వహిస్తూవున్న విద్యాలయాలను, వసతి గృహాలను ప్రభుత్వం తన నిర్వహణలోకి తీసుకుంది. 17 సంవత్సరాలకుపైగా వెంకయ్యగారు ఈ సంస్థలకు సహాయపడుతూ నిర్వహిస్తూ వచ్చారు. ఆ తరువాత ప్రభుత్వం వీటి నిర్వహణకు పూనుకుంది. గాంధేయవాదులు కూడా గర్వించదగ్గ విధంగా ఈ సంస్థల నిర్వహణలో ఆయన కృషి చేశారు.

1930 సంవత్సరం నుంచి అన్ని రైతాంగ ఉద్యమాలలోను రైతాంగ పోరాటాలలోను ఆందోళనా కార్యక్రమాలలోను ఆయన మాలో ముందుండి పనిచేశారు. శ్రీమతి ఇందిరాగాంధీ శకం ప్రారంభం కావడానికి ముందు కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసన తెలియజేస్తూ మేము నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన ప్రముఖంగా పాల్గొన్నారు.

1949-53 సంవత్సరాల మధ్య జిల్లా పరిషత్ సభ్యులుగాను, తక్కార్ బాపాగారి అధ్యక్షతన ఉన్న అఖిల భారత ఆదిమజాతి సేవాసమితి కార్యవర్గ సభ్యునిగాను రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులుగాను నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ కమిటీ సభ్యులుగాను ఆంధ్రకిసాన్ సమ్మేళన్ కార్యవర్గ సభ్యులుగాను 1944 సంవత్సరం నుంచి ఈ పదవీ బాధ్యతలనిచ్చి ఆయనను గౌరవించటమైంది.

నెల్లూరుకు చెందిన ప్రముఖ నాయకులు ఆదివాసీ ప్రజల రక్షకుడయిన శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారి సేవలను ఆయన ఎక్కువగా ప్రస్తుతిస్తుండేవారు.

23

శ్రీ జగ్‌జీవన్‌రామ్

బీహారు రాష్ట్రంలో సహబాద్ జిల్లాలోని చాంద్‌వా గ్రామంలో 5-4-1908 న శ్రీ జగ్‌జీవన్‌రామ్ జన్మించారు. ఆయన గొప్ప హరిజన నాయకులు. 1933 లో బీహార్ హరిజన సేవా సంఘకార్యదర్శి. 1937 లో బీహార్ రాష్ట్ర వ్యవసాయ కూలీసంఘాన్ని స్థాపించారు. కేత్ మజ్దూర్ సభను ప్రారంభించారు. బీహార్ కార్మిక సంఘనాయకులు. మహాత్మాగాంధీగారు ప్రారంభించిన హిందూస్థాన్ మజ్దూర్ సేవా సంఘంలో శ్రీ రంగాగారు, వీరు సభ్యులు. 1946 సంవత్సరంలో పండితనెహ్రూగారి నాయకత్వంలో తాత్కాలిక సంకీర్ణ మంత్రివర్గంలో కేంద్రంలో మంత్రిగా నియమితమయ్యేముందు కాంగ్రెస్ ఆర్థిక ప్రణాళికాసంఘసభ్యులు. 1936 నుండి ఆయన బీహార్ శాసనసభ సభ్యులు. 1937-39 సంవత్సరాల మధ్య బీహార్ రాష్ట్రంలో పార్లమెంటరీ సెక్రటరీగా పనిచేశారు. స్వాతంత్ర్య సమరయోధుడు. 1940 సంవత్సరంలో, 1942 సంవత్సరంలో జైలు శిక్షల ననుభవించారు. అఖిల భారత నిమ్నజాతుల సంఘానికి 1936 నుండి 1946 వరకు అధ్యక్షులు. అఖిల భారత వెనుకబడిన తరగతుల సమాఖ్యకు సహకరించి డాక్టర్ దేశ్‌ముఖ్, లచ్చన్నగార్లకు సహాయపడ్డారు. 1950 నుంచి కాంగ్రెస్ పార్టీ కేంద్ర పార్లమెంటరీ బోర్డు సభ్యులు. ఐ.ఎన్.టి.యు.సి.ని భారత కార్మికుల ఏకైక ప్రతినిధిగా వెలిగేందుకు కృషిచేశారు. షుగర్ ఇండస్ట్రీని జాతీయం చేయవలసిందిగాను, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లభించాలని, వ్యవసాయదారుల మధ్య పట్టణ ప్రజలమధ్య అంతరం లేకుండా చూడాలని, వ్యవసాయ కూలీల జీవన పరిస్థితులు మెరుగువడేందుకు అవసరమైన కూలీరేట్లు లభించాలని ఆయన వాదించారు. - (ఎడిటర్)

మానవ సమాజంలో అతిగా దోపిడీకి గురవుతున్న వ్యక్తి పారిశ్రామిక కార్మికుడేనని మార్క్స్ చెప్పారు. నిజానికి తరతరాలుగా ఇప్పటికి కూడా అత్యధికంగా దోపిడీకి గురవుతున్నది వ్యవసాయదారుడు; అందునా ముఖ్యంగా వ్యవసాయ కార్మికుడు. ప్రపంచ పరిణామంలో సంభవించిన పారిశ్రామిక విప్లవం విస్తరించిన సామ్రాజ్యవాదం పల్లెప్రజలను దోచుకునేందుకు పట్టణ ప్రజలకు అవకాశం కలుగజేసింది. ప్రపంచ వ్యాపార కేంద్రాలు వ్యవసాయదారుల సంపదతో వ్యవసాయేతరులను భాగ్యవంతులుగా తయారుచేశారు.

భారతదేశం ప్రధానంగా వ్యవసాయ పరమైన దేశం, పైగా ప్రపంచంలో బాగా వెనుకబడిన స్థితిలో ఉన్న దేశం. ఇక్కడ వ్యవసాయ కూలీ పరిస్థితి అట్టడుగున పడివుండి ఆర్థికంగా అతి దైన్యస్థితిలో వుంది. భారతదేశ అభివృద్ధిని మనం లెక్కలోకి తీసుకోబోయేటప్పుడు ఇక్కడ వ్యవసాయ కూలీ ఆర్థిక సాంఘికాభివృద్ధిని లెక్కవేసి మాత్రమే చెప్పవలసి ఉంటుంది.

భారత రైతాంగ ఉద్యమం, మాలాంటి వారం అనేకమందిమి ప్రధానంగా వ్యవసాయదారుని వ్యవసాయ కూలీని దోపిడీదారులనుండి రక్షించాలని, పల్లెల సంపద పట్టణాలకు తరలించబడకుండా

అరికట్టాలని ప్రపంచ సంపదనుగానీ జాతీయాదాయాన్నిగానీ వల్లెలు పట్టణాలమధ్య, వ్యవసాయదారులు వ్యవసాయేతరుల మధ్య, సమాజంలో అన్ని వర్గాలకు సమంగా పంపిణీ జరిగేలా చూడాలని మాత్రమే ప్రయత్నిస్తూ వచ్చాము. ఈ మహోన్నతమైన కృషిలో స్వాతంత్ర్య సమరయోధులు, హరిజన నాయకులైన శ్రీ జగ్‌జీవన్‌రామ్ నిర్వహించిన పాత్రకు నేను గర్వపడుతున్నాను. వ్యవసాయ కూలీలకు కనీస వేతనాలను నిర్ణయిస్తూ చట్టం చేయవలసిందిగా నేను బాగా పట్టుదలతో కృషిచేశాను. 1929 ప్రాంతంనుండే ఈ సందర్భంలో నా అభిప్రాయాలను ప్రకటించడం ప్రారంభించాను. అయితే శ్రీ జగ్‌జీవన్‌రామ్‌గారు కేంద్రంలో కార్మిక శాఖామంత్రి అయ్యేంతవరకు ఇందులో జరిగిందేమీ లేదు. అప్పుడు మాత్రమే మాకు ఆ అవకాశం లభించింది. శ్రీ రామ్‌గారు కనీస వేతనాల చట్టంతోపాటు సామాజిక ఇన్సూరెన్స్ పథకాన్ని కూడ వ్యవసాయకూలీల కోసం ప్రవేశపెట్టిన సందర్భంలో సంతోషంతో మేము ఆయనకు సహకరించాము. వ్యవసాయ కూలీలను అప్పుడు మొదటిసారిగా కేంద్ర శాసన పరిధిలోనికి తీసుకురావడం జరిగింది. వ్యవసాయ కూలీలకు ఈమాదిరి కొద్దిపాటి సహాయమైనా లభించినందుకు స్వాతంత్ర్య భారతదేశం కొంతవరకైనా సంతృప్తిని చెందవచ్చు. అయితే పట్టణ ప్రజల దోపిడీ నుంచి గ్రామీణ ప్రాంతాలకు తగు రక్షణ లభించినప్పుడు రైతుకు వ్యవసాయ కూలీలకు మధ్య స్నేహపూర్వకమైన దోపిడీలేని సత్సంబంధాలను ఏర్పాటుచేయగలిగినప్పుడు మాత్రమే వ్యవసాయ కార్మికుడికి సరియైన ప్రయోజనం చేకూరగలదు. బీహార్‌కు చెందిన శ్రీజగ్‌జీవన్‌రామ్‌గారి నాయకత్వం స్నేహం నిజానికి మనకు యిప్పుడు యిక్కడ నుండే కావలసి యున్నది. శ్రీ జగ్‌జీవన్‌రామ్ 1946 సంవత్సరం నుంచి, కామరాజ్ పథకం ద్వారా, నెహ్రూగారు కొందరు మంత్రులను పక్కన ఉంచిన కాలంలో రెండు సంవత్సరాలు మినహాయిస్తే ఇప్పటి వరకు కేంద్రంలో మంత్రిగానే కొనసాగుతున్నారు. ప్రధాన మంత్రులుగా ఎవరున్నప్పటికీ పరిపాలనానుభవం ప్రజాభిమానం కలిగిన ఆయన సహకారాన్ని తీసుకోక తప్పలేదు. ఆయన లేబరు మంత్రిగా ఉన్నప్పటికీ రైల్వేమంత్రిగా ఉన్నప్పటికీ ఆహార వ్యవసాయ మంత్రిగా గాని, రక్షణ మంత్రిగాగాని ఏ శాఖలో పనిచేసినా దానిని విశిష్టంగా నిర్వహించారు. ఆయన ప్రథమ శ్రేణి మంత్రులలో ఒకరిగా వుంటూ సమర్థుడనిపించుకున్నారు.

పార్టీ అధిష్టాన వర్గం వారికి ఆయన విశ్వాసపాత్రుడుగా, నమ్మకస్తులుగా ఉండగలిగారు. ఆయన ఎప్పుడోగాని ఉద్రేకపడేవారుగాదు. అది కూడా అగ్రనాయకులతో వున్నప్పుడు ఎప్పుడూ జరుగకుండా నిగ్రహాన్ని పాటించేవారు. పెద్దపెద్ద విషయాల్లో తలదూర్చి తన మనస్సును పాడుచేసుకునే పద్ధతికి ఆయనెప్పుడూ పూనుకోలేదు. ఆవిధంగా ఆయన ఢిల్లీ పెద్దలకు సన్నిహితులుగా సయోధ్య కలవారిగా నిరూపించుకున్నారు.

ఆయనకు హరిజనుల, వెనుకబడిన వర్గాల ప్రజల అభివృద్ధిమీద ఆసక్తి మెండు. తను చేపట్టిన అన్ని మంత్రివర్గ విభాగాలలోను సాంప్రదాయ పద్ధతులను అతిక్రమించకుండానే తాను చేయదల్చుకున్న దాన్ని ధైర్యంతోను, సమర్థవంతంగాను ఆయన చేస్తుండేవారు. ఆయన రైల్వే, తపాలాశాఖ, రక్షణ, ఆహార, వ్యవసాయ శాఖలు చేపట్టినప్పుడు ఉద్యోగం, ప్రమోషన్లకు సంబంధించి బలహీన వర్గాల వారికి కొత్తనిబంధనలు తీసుకురావడం జరిగింది. ఈ కొత్త

నిబంధనలను గూర్చి ఎవరైనా ప్రశ్నిస్తే వెనుకబడిఉన్న ఈ ప్రజలకు సహాయపడే దెబ్బలాగో మీరే చెప్పండని నిలదీసేవారు. అటువంటి విమర్శకుల నోళ్లు మూయించడమెలాగో ఆయనకు బాగా తెలుసు.

స్వాతంత్ర్య పోరాట కాలంనాటి సత్యాగ్రహాలనుంచి చైనా పాకిస్తాన్ దేశాల భారతదేశ దండయాత్రలవరకు ఆయన ఎప్పుడూ మొక్కవోని ధైర్యంతో దేశభక్తితో ఉండేవారు. పాకిస్తాన్ భారతదేశంపై కాశ్మీరు విషయంలో దండయాత్రకు పూనుకున్నప్పుడు బంగ్లాదేశ్ స్వాతంత్ర్య పోరాట సమయంలోను, ఆయన లాల్ బహదూర్ శాస్త్రిగారికి, శ్రీమతి ఇందిరాగాంధీకి గట్టి అండగా నిలిచారు. కనీసం ఉపప్రధానమంత్రి పదవి అయినా తనకు కావాలని ఆయన కోరుకున్నారు. ఆయన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఉపనాయకుడుగా ఉన్నారు.

1969-70 సంవత్సరాల మధ్య సీనియర్ కాంగ్రెస్ పెద్దలు అనేకమంది శ్రీమతి ఇందిరా గాంధీని దెబ్బతియ్యాలని ప్రయత్నించినప్పుడు ఆయన ఆమెకు పెట్టని కోటలా అండగా నిలిచారు. శ్రీమతి ఇందిరాగాంధీని, జగ్‌జీవన్ రాంగారిని, శ్రీ ఫక్రుద్దీన్ ఆలీఅహమ్మద్‌గారిని కాంగ్రెస్‌నుండి బయటకు పంపేందుకు కూడా అప్పుడు ప్రయత్నం జరిగింది. ఆ రాజకీయ తుఫాను సద్దుమణిగిన తర్వాత శ్రీ ఫక్రుద్దీన్ ఆలీ అహమ్మద్ రాష్ట్రపతి అయ్యారు. శ్రీ జగ్‌జీవన్‌రామ్‌గారు బాబూజగ్‌జీవన్ రామ్‌గా గౌరవాన్ని పొంది కీర్తించబడ్డారు. ఈ బిరుదుతో అంతకు పూర్వం రాజేంద్రప్రసాద్‌గారిని పిలిచేవారు.

మొత్తంమీద ఆయన తన జీవితాన్ని సంతోషంగానే గడిపారు. ఒకసారి ఆయన యూరప్‌నుంచి వస్తున్న విమానం ప్రమాదానికి లోనైనప్పుడు ఆయన తీవ్రంగా గాయాలపాలై కట్టిన కట్లతోనే పార్లమెంటుకు వచ్చారు. అదృష్టవశాత్తూ కొద్ది మాసాల్లోనే ఆయనకు పూర్తి స్వస్థత చేకూరింది. ఆయన ఆహార వ్యవసాయ శాఖామంత్రిగా ఉన్న ప్రతిసారీ రుతువులు సక్రమంగా ఉండి అనుకోకుండానే పంటలు బాగా పండుతూ ఉండేవి. శ్రీ వి.వి.గిరి 1974లో రిటైరవుతున్న సందర్భంలో ఆయనను రాష్ట్రపతిగా చేయాలని శ్రీమతి ఇందిరాగాంధీ ప్రతిపాదించింది. అయితే అది ఒక ఓటు తేడాతో ఆ ప్రతిపాదన వీగిపోవడంతో తిరిగి ఆయన మామూలు గానే మంత్రివర్గంలో కొనసాగడం జరిగింది. పది సంవత్సరాలుగా ఆయన ఆదాయంపన్ను కొన్ని వెట్టుబడులమీద కట్టలేదనే అంశం పార్లమెంటులో చర్చకు వచ్చినప్పుడు ఆయన నిష్కపటంగా అది గొప్ప తప్పేనని, నేను కావాలని చేయలేదని పార్లమెంటుకు చెప్పారు. ఈ సీనియరు మంత్రి సమాధానం విన్న తరవాత ఆయన పట్ల ఉన్న గౌరవంతో పార్లమెంటు మౌనం వహించింది. అట్టడుగున పడివున్న వర్గాల ప్రజలకు సహాయం చేసేందుకు ఆయన మంచి ఆరోగ్యంతో వుండాలని అందరూ కోరుకుంటారు.

1947 సంవత్సరంలో శాశ్వత ఆహ్వానితులుగా ఆ తరువాత పూర్తిస్థాయి సభ్యునిగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ కార్యవర్గ సభ్యునిగా నేను ఉన్నప్పుడు ఆయనను పూర్తిగా గమనిస్తుండేవాడిని. ఈ అన్ని సంవత్సరాలలో విమర్శించేందుకు ఆయనెప్పుడూ తొందరపడటం నేను చూడలేదు. 1948 నుంచి కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాల్లో కూడ ఆయన దురుసుగా ప్రవర్తించిన సందర్భం ఎప్పుడూ కనిపించలేదు. ఏదైనా ఆయనను అడిగిన సందర్భంలో లేదా

ఆయన ఏదైనా చెప్పవలసివస్తే ఎవరినీ విమర్శించకుండా తొందరపాటు లేకుండా చక్కగా తన వాదాన్ని వినిపించేవారు. పార్టీ అగ్రనాయకుల మధ్య జరిగే రాజకీయ పోరాటాల్లో తలదూర్చకుండా ప్రశాంతంగా ఉండగలగడమే ఆయన రాజకీయ విజయానికి ప్రధాన కారణమైంది. ఆయన ప్రధాన మంత్రులందరికీ నమ్మకమైన వ్యక్తిగా ఉపయోగకరమైన నాయకునిగా రుజువు పరచుకున్నారు. అణగారిపోయిన తరగతుల ప్రజలను పైకితీసుకురావటంలో, రాష్ట్ర మంత్రివర్గాలలో వారికింకా తగినంత ప్రాతినిధ్యం లభించక పోయినప్పటికి, నాయకులుగా ఎదగడానికి వారికి మంచి బాట నేర్పరిచారు. శ్రీ జగ్‌జీవన్ రామ్ వారితోపాటే మరొక హరిజన నాయకుడైన కీ॥ శే॥ శ్రీ దామోదరం సంజీవయ్యగార్లు హరిజన వెనుకబడిన వర్గాల ప్రజల పెరుగుదలకు కావలసిన పునాదులను సిద్ధపరిచారు. రాజకీయ దౌర్జన్య పద్ధతులకు వ్యతిరేకంగా గాంధేయ మార్గాన్ని వారంతగా ఉపయోగించుకోలేదు. వయోజన ఓటింగు పద్ధతి వచ్చినప్పటికి డాక్టరు అంబేద్కర్ ఎన్నికలలో విజయాన్ని సాధించలేకపోవడం వల్ల జగ్‌జీవన్ రామ్ గారిపై దృష్టిమళ్లింది. హరిజనులు, గిరిజనులు తదితర అన్ని వర్గాల ప్రజలు జగ్‌జీవన్ రామ్ గారి తెలివైన నాయకత్వం నుంచి ప్రయోజనం పొందారు. నేను ఆయనలో ఒక మంచి స్నేహితుడ్ని, ఒక గొప్ప సామాజిక విప్లవకారుణ్ణి చూడగలిగాను. ఈవాడు ఆయన ప్రజలందరిచేత బాబూజీగా, బాబూ జగ్‌జీవన్ రామ్ గా పిలిపించుకుంటూ ప్రేమ, గౌరవాన్ని పొందుతున్నారు. ఆయన జీవిత సువర్ణాధ్యాయంలో 70 లోకి అడుగిడుతున్న ఆయనకు ఆయురారోగ్యాలు సమకూరాలని ఆయన చేపట్టిన కార్యక్రమాలు నిర్విఘ్నంగా కొనసాగాలని మేము కోరుకుంటున్నాము.

24

శ్రీ గూడవల్లి రామబ్రహ్మం,
సినిమా నిర్మాతలలో రైతాంగనేత

కృష్ణాజిల్లాకు చెందిన శ్రీ గూడవల్లి రామబ్రహ్మం సినిమా పరిశ్రమను పురాణ కథలనుంచి సమకాలీన ప్రజాజీవితాన్ని ప్రతిబింబించే సాంఘిక కథావస్తువువైపు మళ్లించిన తొలి ఆంధ్ర సినీ నిర్మాత. ఆయన చిత్రం "రైతుబిడ్డ" జమిందారుల పాలనలో ఉన్న రైతుల బాధలను, భూమి దున్నకుండానే వాటి ఫలసాయాన్ని పొందుతున్న భూస్వాముల కాఠిన్యాన్ని ఎత్తిచూపెట్టింది. 18వ శతాబ్దానికి చెందిన ఈ భూస్వామ్య వ్యవస్థ శాశ్వత శిస్తువిధానం ఏర్పాటుచేయటం ద్వారా స్థిరపరచబడింది. రైతులమీద రైతు కూలీలమీద, వారి నిత్యజీవన వ్యవహారాల్లో కూడా తమ పెత్తనం కొనసాగించటానికి భూస్వాముల పోలీసు, రెవెన్యూ అధికారులను ఎట్లా ఉపయోగించుకొంటారో శ్రీరామబ్రహ్మంగారు ఈ చిత్రంలో చక్కగా చూపెట్టగలిగారు. గ్రామీణ ప్రాంతాల ప్రజల దైన్యస్థితిని, నిస్సహాయులైన ఆ ప్రజలు సంస్థానాలలో పనిచేసే స్థానిక సిబ్బందిపై ఎట్లా ఆధారపడి ఉంటారో ఆయన ఇందులో చిత్రీకరించి చూపెట్టగలిగాడు. శ్రీ నెల్లూరి వెంకట రామానాయుడిగారి పాటలను ఇందులో వాడుకొన్నారు. కథాంశాన్ని మొదటగా ఆంధ్రప్రాంతంలోను, ఆ తరువాత ఇతర జమిందారీ ప్రాంతాలలోను నడిచిన రైతాంగ ఉద్యమం నుంచి ఎన్నుకొన్నారు. జమిందారీ పద్ధతికి వ్యతిరేకంగా పోరాడే ఒక రైతుబిడ్డను కథానాయకునిగా చూపించారు.

ఆ సినిమా బ్రహ్మాండమైన విజయాన్ని సాధించింది. అది జమిందారులకు వ్యతిరేకంగా మేము ప్రారంభించిన రైతాంగ ఉద్యమానికి బలం చేకూర్చటమేగాక, జమిందారులను రద్దుచేయాలనే మా కోర్కెను ప్రత్యేకంగా ఎత్తిచూపెట్టింది.

ఆ తరువాత శ్రీ రామబ్రహ్మంగారు అదే రీతిలో "మాలపిల్ల" సినిమాను నిర్మించి కొత్తబాటను తొక్కారు. ఈ సినిమా ద్వారా శ్రీ రామబ్రహ్మం, శ్రీ వీరేశలింగం కవిరాజు రామస్వామి చౌదరిగార్ల సాంఘిక విప్లవానికి పూనికను కల్పిస్తూ దురహంకారులైన పూజారుల కఠినమైన వ్యత్యాసాలతో కూడిన కులతత్వాన్ని గేలిచేశాడు. ఆయన కథానాయిక ఒక హరిజన బాలిక. కులాల అంతరాల్లో కూరుకుపోయి వున్న ఒక బ్రాహ్మణ యువకుడు ఆమెను ప్రేమించి వెంటపడి పెండ్లి చేసుకొంటాడు. ఆ తరువా ఆరెండు కులాల పెద్దలు దానికి అంగీకరిస్తారు. తాము తక్కువ వారమని భావించే హరిజనుల భావ దాస్యాన్ని, తాము అధికులమని తలపోసే బ్రాహ్మణుల ఆధిక్యతా భావాన్ని దాటి వారు ఇక్కడ పైకి ఎదిగారు.

ఈ సినిమా ద్వారా శ్రీరామబ్రహ్మం గాంధీగారు ప్రారంభించిన అస్పృశ్యతా నిర్మూలన కార్యక్రమానికి, రామస్వామి చౌదరిగారి ఆత్మగౌరవ ప్రబోధానికి, ప్రతి నాగరిక సమాజంలో తమకు సమాన హక్కులు కావాలనే కోర్కెతో చైతన్యవంతులై ముందుకు వస్తున్న హరిజన,

బ్రాహ్మణేతర ప్రజల భావాలకు వూపునిచ్చి, నవీన ప్రపంచంలో అందరూ సమానులేనన్న ఆలోచనకు బలం చేకూర్చారు.

ఈ రెండు సినిమాలు కూడా విప్లవ ప్రచారాన్ని ముందుకు సాగించాయి. గాంధేయ వాదుల మానవతా దృక్పథం సామాజిక చైతన్యోద్యమాలు, రైతుకూలీ ఉద్యమాలు, రామస్వామి చౌదరిగారి ఆత్మగౌరవోద్యమం ఈ సినిమాలను, వాటి సాంఘిక విప్లవ ధోరణులను ఘనంగా కీర్తించాయి.

శాశ్వత శిస్తువిధానం ద్వారా రక్షణ పొందుతున్న జమిందారులు "రైతుబిడ్డ" సినిమాను వ్యతిరేకించారు. పాత సాంప్రదాయవాదులైన పూజారులు "మాలపిల్ల" ను నిరసించారు. జమిందారులు రాజకీయంగా బాగా పలుకుబడి కలిగి ఉండి మద్రాసు ప్రభుత్వంపై పట్టువున్నవారు కావటంతో ఈ సినిమాను జమిందారీ ప్రాంతాలలో ఆడకుండా నిషేధింపజేయగలిగారు. ముఖ్యంగా 1931 వ సంవత్సరంలో మా రైతాంగ ఉద్యమం కటికినేని కళ్యాణరావుగారి ఇంట్లో ప్రారంభించబడిన వెంకటగిరిలో దీనిని ఆడకుండా చేశారు.

ఆ తరువాత సాంఘిక ఇతివృత్తాలుగల అనేక సినిమాలు నిర్మాణమయ్యాయిగాని, అందులో ఏ ఒక్కటి కూడా ఈ చిత్రాలు ఇచ్చినంత గొప్ప ప్రచారాన్ని ఇవ్వలేదు. మన సామాజిక సమస్యలను కనీస నగం గూడా అవి ప్రతిఫలించలేదు.

మహాత్మాగాంధీగారి మీదా, రామస్వామి చౌదరిగారిమీదా, నామీదా వెంకట రామానాయుడుగారి మీదా తనకున్న విశ్వాసం కారణంగా రామబ్రహ్మంగారు సాంఘిక ఆర్థిక న్యాయం, సర్వసమానత్వం లక్ష్యాలుగాగల ఇలాంటి కథాచిత్రాల నిర్మాణానికి పూనుకొన్నారు. రామస్వామి చౌదరిగారు మా యిద్దరికీ గౌరవనీయులైన సామాజిక తత్వవేత్త. దేశాన్ని దద్దరిల్లజేసిన 1930 నాటి ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని ప్రముఖపాత్ర నిర్వహించిన విశ్వాసపాత్రులైన కాంగ్రెస్ కార్యకర్త శ్రీ రామబ్రహ్మం.

ప్రముఖ కవి, తత్వవేత్త అయిన శ్రీ రామస్వామి చౌదరిగారి బోధనలను ఆయన బాగా ఆకళింపు చేసుకొన్నారు. కవి షెల్లీ భావ స్పందన, గాడ్విన్ గారి విప్లవాభిలాష రెండూ గూడ శ్రీ రామస్వామి చౌదరిగారితో సమంగా మిళితమై ఉన్నాయి. కే.శే. రాలైన శ్రీమతి హనుమాయమ్మ "పీరుగంధము తెచ్చినారము - పీరులెవ్వడో తెల్పుడీ; పూసిపోదుము మెడను వైతుము - పూలమాలను భక్తితో." అన్న శ్రీరామస్వామి చౌదరిగారి పాట "మా కొద్దీ జమిందారీ తనము" అన్న వెంకట రామానాయుడు గారి పాటలను ఎక్కడ పాడుతున్నా విన్నప్పుడల్లా శ్రీరామబ్రహ్మం మైమరచిపోయేవారు. ఆయన హృదయం కవితావేశంతోను, మానవత్వంతోను నిండిపోయేది. ఆయన సినిమా నిర్మాత అయిన తరువాత, తన గురువు విప్లవకవి శ్రీరామస్వామి చౌదరి బోధనలకు, రైతాంగ ఉద్యమంలో తన సీనియర్ సహచరులైన శ్రీ వెంకట రామానాయుడుగారి మార్గానికి, నా మార్గానికి సాధారణ ప్రజలలో ప్రచారం కల్పించేందుకు ఆ రంగాన్ని వినియోగించుకొన్నారు.

1929-33 సంవత్సరాల మధ్య సంభవించిన ఆర్థిక మాంద్యం ఇతర వర్గాల వారికన్నా

వ్యవసాయ దారులను ఎక్కువగా కృంగదీసింది. భూములకు, వారు పండించే పంటలకు ధరలు బాగా తగ్గిపోయి వారు చెల్లించవలసిన రుణభారం ఇబ్బడికి ముబ్బడిగా పెరిగిపోయింది. పారిశ్రామికోత్పత్తులకు నిత్యజీవితావసర వస్తువులకు కూడా ధరలు తగ్గినప్పటికి, వ్యవసాయోత్పత్తుల ధరలు అలా కాకుండా సగానికి సగం పడిపోయాయి. అందువల్ల వ్యవసాయ దారుల, గ్రామీణ ప్రజల ఆస్తులు పట్టణాల్లోని వ్యాపారస్తుల, వడ్డీ వ్యాపారుల, వస్త్ర వసూలు దారుల చేతుల్లోకి సులభంగా పోసాగాయి. ఎక్కువమంది రైతుల భూములు వడ్డీ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లాయి. తక్కువ ధరలకు రైతుల భూములను తీసుకోవటానికి కోర్టులనుంచి కూడా ఎలాంటి వ్యతిరేకత లేకుండా ఉంది. ఆ సందర్భంలో రైతుల పక్షాన, మేము ప్రభుత్వ విధానానికి నిరసన తెలియజేస్తూ ఉద్యమం ప్రారంభించాము. మొదట ఆంధ్రలోను, ఆ తరువాత ఇతర రాష్ట్రాలలోను రైతు రక్షణ సంఘాలను ఏర్పాటు చేసేందుకు అప్పుడు నేను పూనుకొన్నాను. అమెరికాలో ఆ దేశాధ్యక్షులైన రూజ్‌వెల్ట్ గారు చేసినట్లే, భారత దేశంలో భారత రైతాంగానికి కూడా తగు రక్షణ చర్యలు చేపట్టవలసిందిగా మేము వత్తిడిచేశాము.

అనేకమంది న్యాయవాదులు, వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, పెట్టబడి దారులు, చివరికి కొందరు కాంగ్రెస్ నాయకులు కూడా రైతుల రక్షణ కోసమైన మా కోర్కెలు అర్థరహితమైనవని ప్రచారం చేస్తూ ఇది వట్టి స్టంటు మాత్రమేనని మమ్మల్ని పరిహాసం చేయసాగారు. నా కార్యక్రమంలో ప్రాముఖ్యాన్ని యదార్థాన్ని గ్రహించిన వారిలో రామబ్రహ్మంగారొకరు. తన హృదయపూర్వకమైన సహకారాన్ని అందజేస్తూ నా కృషిలో తోడ్పడేందుకు ఆ సమయంలో ఆయన ముందుకొచ్చారు. అప్పుడు మేమందరం తెనాలిలో విదేశీ వస్తుబహిష్కరణ కృషిలో ఉన్నాము. పురుషుల శిబిరాన్ని కీ.శే.లైన శ్రీ కృష్ణయ్య, స్త్రీల శిబిరాన్ని శ్రీమతి భారతీదేవి నిర్వహిస్తూ ఉంటే, ఉప్పు సత్యాగ్రహ సందర్భంలో జైళ్లకు వెళ్ళి తిరిగి వచ్చిన అనేకమంది స్త్రీ, పురుష వాలంటీర్లు వారితో సహకరించి కలసి పనిచేశారు. నేను ప్రారంభించిన రైతు రక్షణోద్యమం, గాంధీ - ఇర్విన్ ఒడంబడికకై కృషి జరుగుతున్న ఆ తరుణంలో, జాతీయ శక్తులను బలహీనపరచగలదని, రెండవ రౌండు టేబుల్ కాన్ఫరెన్సు విజయం కోసం ప్రజాసమీకరణ చేసేందుకుగాని, కాన్ఫరెన్సు విఫలమైతే ఉప్పు సత్యాగ్రహం లాంటి మరో సత్యాగ్రహం దేశస్వాతంత్ర్యం కోసం ప్రారంభించేందుకుగాని ఉపయోగపడకపోగా నష్టాన్ని కలగజేయ గలదని అనేకమంది కాంగ్రెస్ నాయకులు భావించారు. రామబ్రహ్మంగారికి మాత్రం అలాంటి భయాలేమీ లేవు. ప్రపంచ వ్యాప్తంగా ఏర్పడిన ఈ ఆర్థిక దుస్థితి నుంచి రైతాంగానికి రక్షణ కల్పిస్తే, వడ్డీ వ్యాపారుల నుంచి వస్త్ర వసూలు దారులనుంచి వారికి విముక్తి కలిగిస్తే, రైతాంగం జాతీయోద్యమానికి కాంగ్రెస్ పార్టీకి కూడా మనస్ఫూర్తిగా తోడ్పడగలదన్న నా భావాన్ని ఆయన నిస్సందేహంగా అంగీకరించారు. ఆ తరువాత తెనాలిలో జరుగనున్న యావదాంధ్ర రైతాంగ రక్షణ మహాసభ ఆహ్వాన సంఘాధ్యక్షులుగా ఉండటానికి ఆయన అంగీకరించారు. మహోద్యోగంతో ఆ సభలో ఆయన చేసిన ప్రసంగం కవిత్వ ధోరణిలో ఆవేశంతో సమర్థనీయంగా ఉండి, అందరినీ ఆమోదింపజేసి కార్యాచరణకు ముందు కురికేలా చేసింది.

సహకార సంస్థల చెల్లింపులకు వ్యవసాయ రుణాలకు పూర్తిగా మారటోరియం ప్రకటించాలని మేము కోరాము. రుణాలు చెల్లింపుల విషయంలోగాని, అమలు విషయంలోగాని

డిక్రీలు ఇవ్వవద్దని న్యాయస్థానాలను మేము అర్థించాము. పంటల ధరలు ఇంతకంటే ఇంకా తగ్గకుండా చూడవలసిందని, అవసరమయితే కనీస ధరలను నిర్ణయించిగాని, సయాం నుండి బియ్యం దిగుమతిని నిషేధించిగాని ఇందుకు పూనుకోవలసిందిగా మేము ప్రభుత్వాన్ని కోరాము. కోర్టు వేలంలోగాని తమంత తాముగా గాని భూములను తక్కువ ధరలకు వదలుకోవద్దని రైతులకు మేము సూచించాము. పెట్టుబడి దారులకు, వన్ను వనూలుదారులకు తమకున్న భూములను వప్పగించేకంటే, బాకీ తీర్మానం చేయలేనందుకు విధించే జైలుశిక్షలకే సిద్ధం కావలసిందని రైతాంగాన్ని మేము కోరాము.

మా ఈ కోర్కెల ద్వారా ప్రభుత్వాన్ని మేము నేరుగా ఎదుర్కొన్నాము. అధికారులతో మేము నేరుగా ఇలాంటి పోరాటానికి పూనుకోవటాన్ని కాంగ్రెస్ నాయకులు అంతగా హర్షించలేదు. "పీర గంధము తెచ్చినారము – పీరుడెవ్వడో తెల్పుడీ". అన్న రామస్వామి చౌదరిగారి పాటను పాడుకొంటూ స్వాతంత్ర్య సమరంలో పాల్గొని జైళ్లకు వెళ్లవలసిందిగా కాంగ్రెస్‌వారు రైతులను కోరటం ఎలా ధర్మమో, తమకు తాము న్యాయం చేసుకొనేందుకు రైతుబిడ్డ రామస్వామి చౌదరిగారి అదే పాటను పాడుకొంటూ పోరాటానికి సన్నద్ధులు కావలసిందని మేము కోరటం అంతకంటే గూడ సబబైందేనని మేము జవాబు చెప్పాము. దాదాపు ఆ పది సంవత్సరాల కాలం 1937–39 లో మొదటి కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పాటయ్యేంతవరకు రామబ్రహ్మంగారు మాతో వుండి కిసాన్ ఉద్యమం కోసం పనిచేశారు. ఒకదాని వెంట ఒకటి జిల్లా మున్సిఫ్ కోర్టులు సెషన్సు కోర్టులు మా మొరల నాలకించి రైతుల రుణాల చెల్లింపు విషయంలో డిక్రీల నివ్వకుండా ఉండటంతో, ఆచరణలో మారుచోరియం సిద్ధించి నట్టైంది. ఇందుకు రామబ్రహ్మంగారు బాగా సంతృప్తిచెందారు. ఆ తరువాత మారుచోరియంను గురించిన మా కోర్కెను పరిశీలించేందుకై ప్రముఖ సహకార్యకర్త నాయకులు కే.శే. లైన శ్రీ వి.రాందాస్ అధ్యక్షత కింద రాష్ట్ర సహకార మహాసభను నేను నిర్వహించాను. తీవ్ర ప్రయత్నాల తరువాత అఖిల భారత కాంగ్రెస్ సంఘం వారిచేత కూడా మా కోర్కెలను ఆమోదింపజేసి, వాటిని అఖిల భారత కాంగ్రెస్ సంస్థ ఎన్నికల ప్రణాళికలో చేర్పించగలిగాము. మా కోర్కెలను అంగీకరించి ఒకే ఒక్క ప్రభుత్వం, అదీ సెంట్రల్ ప్రావిన్సెస్ రాష్ట్రం, ఒకే ఒక్క మంత్రి కే.శే. లైన శ్రీ ఇ.రాఘవేంద్రరావు రైతుల రక్షణకు ముందుకు వచ్చి రైతాంగ రుణవిమోచన చట్టాన్ని వ్యాసుజేసి ఆ క్లిష్ట సమయంలో రైతులకు తోడ్పడగలిగారు.

ఆ రోజుల్లోనే శ్రీరామబ్రహ్మం "ప్రజామిత్ర" తెలుగువారపత్రికను ప్రారంభించి, ప్రముఖ రచయిత సంపాదకులు యం.ఎ.క్లాసులో నా పాత విద్యార్థియైన శ్రీ జి.లక్ష్మీనరసయ్య, శ్రీ యస్.జి.ఆచార్య గారల సహకారంతో మా కోర్కెలను బలపరుస్తూ మా ఉద్యమ ప్రచారానికి తోడ్పడసాగారు. చిట్టచివరలో మదరాసు ముఖ్యమంత్రిగా ఉన్న శ్రీరాజాజీ మారుచోరియంను ప్రకటించి, రుణ విమోచన చట్టాన్ని ఆమోదించి రైతాంగ రక్షణకు పూనుకొన్నారు. ఆ సందర్భంలో రామబ్రహ్మంగారు తన రెండు సినిమాలు విజయవంతమైన నాటికంటే ఎక్కువగా ఆనందించారు. గ్రామీణ ప్రజలన్నా రైతాంగమన్నా ఆయనకు అంత ప్రేమ. జమిందారీ పద్ధతి సంఘవ్యతిరేకమైనది, రైతాంగ వ్యతిరేకమైనదని, దానిని రద్దుచేయవలసిందిగా, నేనూ, శ్రీ వెంకట రామానాయుడు, శ్రీ విశ్వనాథ్ దాస్ గార్లము చెప్పింది రాజాజీ శ్రీ ప్రకాశం గారలు

అంగీకరించే దాకా ఆయన జీవించే ఉన్నారు. తెనాలి కేంద్రాన్ని రైతాంగ రక్షణ కేంద్రంగా సిద్ధపరచిన రామబ్రహ్మంగారు శ్రీ రామస్వామి చౌదరి, శ్రీ వెంకటరామానాయుడు, శ్రీమతి భారతీదేవి, శ్రీమందేశ్వర శర్మ, పీర గున్నమ్మగారు, శ్రీ శ్యామసుందరరావు, శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, సెట్టిపల్లిగార్లతో, అమరజీవులైన ఇతర ఆంధ్ర సామాజిక విప్లవకారులతో పాటు శాశ్వత గౌరవాన్ని పొందగలరు.

శ్రీ వెలగపూడి రామకృష్ణ

స్వతంత్ర భారతదేశం ప్రణాళికాబద్ధమైన సామాజిక ఆర్థిక పునర్నిర్మాణ కృషిని చేపట్టలోయే ముందు శ్రీ వెలగపూడి రామకృష్ణ ఐ.సి.యస్ (రిటైర్డు), తన ఆలోచనా సామర్థ్యంతో, మనుమలూ, యంత్రాలను పనిచేయించడంలో తనకున్న అనుభవంతో, సమర్థవంతమైన ప్రణాళికతో, అభివృద్ధి నిర్వహణా సామర్థ్యంతో ఎటువంటి చిక్కులనైనా అధిగమించగలిగే సామర్థ్యంతో దేశానికి ఉపయోగ పడేందుకు ముందుకు వచ్చారు.

ఆక్స్‌ఫర్డ్ చుట్టుప్రక్కల ఉన్న పల్లెల రోడ్లవెంట 1920 శీతాకాలంలో మేము ప్రతిరోజూ సాయంకాలం షికారుగా వెళ్తుండేవారు. ఆ సమయంలో మేము భారత దేశానికి స్వతంత్రం రావడమెట్లా, మన గ్రామాల పునర్నిర్మాణం జరిగేదెట్లా అని, విరుద్యోగ సమస్య పరిష్కరించేదెలా అని, పూర్తికాలం పనిలేని వారికి పనికల్పించేదెలా అని ఆలోచిస్తుండేవాళ్లం. వ్యవసాయ రంగంలోనే కాకుండా, పారిశ్రామిక వాణిజ్యాభివృద్ధిని కూడా సాధించి విద్యావంతులైన యువకులకు ఉద్యోగవనతిని కల్పించే విషయం గురించి ఆయన మాట్లాడుతూ ఉండేవారు. రైతులు కూలీల విషయంలో మేమిద్దరం సరియైన అభిమానంతో ఉండేవారం. పారిశ్రామికాభివృద్ధికి మేము ప్రణాళికను వేశాము. ఇంగ్లండులోనూ, యూరప్‌లోనూ మేము చూసినటువంటి ఆర్థిక సాంకేతికాభివృద్ధిని భారతదేశానికి కూడా తీసుకురావాలని భావించాము. బ్రిటీషు ప్రైంచి దేశస్తులు సామ్రాజ్యంపై శీఘ్రంగా ముందుకు వెళుతూ ఉంటే, మన ప్రజల అభివృద్ధిని దానితో పోల్చి చూసుకుని మేము చాలా అసంతృప్తిచెందేవారం. నేను ఆయన కంటే వయసులో చిన్నవాడిని. పాశ్చాత్య ఆలోచనా ధోరణిలో తగినంత అనుభవం గడించిన వాడిని కాకపోయినప్పటికీ ఆ ఒక్క సంవత్సర కాలంలోనే, రోజూ జరిగే మాచర్చల ద్వారా, అభ్యాసంద్వారా ఆయన నేను ఆలోచనా పూర్వకమైన సోషలిస్టుగా ఎదిగేందుకు బాగా తోడ్పడ్డారు.

ఆ కాలంనాటి పారిశ్రామిక వేత్తలలో ఆయనకున్నంత అనుభవం అర్హతలున్నవారు బహుకొద్ది మంది. శ్రీ రామకృష్ణ జిల్లాకలెక్టరుగా పనిచేస్తూ అధికారులతో కార్యాలయాలలో పనిచేయించడమెలాగో ప్రజలకు మంత్రివర్గమధ్య వ్యవహరించడమెలాగో అనుభవపూర్వకంగా గ్రహించారు. ఆయన పెద్ద జమిందారీ సంస్థానమైన జయపూర్‌కు దివాన్‌గా అంటే ముఖ్య పరిపాలకుడుగా వ్యవహరించారు. ఆయన పనిచేసిన ఆ దశాబ్ది కాలంలో అక్కడ అటవీ సంపదను పెంచేందుకు వ్యవసాయక అభివృద్ధిని సాధించేందుకు, అభివృద్ధి చెందని ఆ ప్రాంతంలో వార్తా రవాణా సౌకర్యాలు పెంచేందుకు బాగా కృషి చేశారు.

ఆయన జయపూర్ దివాన్‌గా ఉన్న రోజుల్లో 1925-27 సంవత్సరాలలో బాగా వెనుకబడి ఉన్న దాని అభివృద్ధికి ఒక చిత్తు ప్రణాళికను తయారుచేయవలసిందిగా ఆయన నన్ను అడిగారు. మాచ్‌ఖండ్, సీలేరు, శబరి నదుల నువయోగించుకుంటూ జలవిద్యుత్తు తయారుకు పూనుకోవలసిందని నేను సూచించగా, ఆయన ఆ కార్యక్రమాన్ని చేపట్టారు. 1926 సంవత్సరం

నుంచి ఆయన అందుకు కావలసిన అంచనాలను, ప్లానులను తయారుచేస్తూ మద్రాసు, ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వాలను, ఢిల్లీ ప్రభుత్వాన్ని అందుకు ఆమోదింపజేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. యుద్ధ సమయంలో ప్రభుత్వాలచేత ముందు మాచ్‌ఖండ్ విద్యుత్ పథకానికి ఆ తరువాత అప్పర్ సీలేరు ప్రాజెక్టు ఏర్పడేందుకు ఆమోదాన్ని సాధించగలిగారు. ప్రణాళికా సంఘం ఏర్పడడానికి ముందుగానే ఒక మంచి ప్రణాళికా కర్తగా ప్రాజెక్టు భావకునిగా నిర్మాతగా ఆయన ముందుకు వచ్చారు.

మద్రాసు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టరుగా వుండి ఆయన పంచదార తయారీ పరిశ్రమలను స్థాపించేందుకు, విస్తృతమైన పునాదులను వేసి అవి పూర్తిగా అభివృద్ధి చెందేందుకు తోడ్పడ్డారు. ఆయన ముందుచూపు కారణంగానే మోటారుకారులు, లారీలు కోల్ గ్యాస్‌తో నడిచే కార్యక్రమం ప్రారంభమైంది. యుద్ధ సమయంలో పెట్రోలుకు కొరత ఏర్పడడంతో కోల్ గ్యాస్‌పై ఆధారపడవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. భారత ప్రభుత్వం దక్షిణ భారతదేశానికి "లేబర్ ట్రిబ్యునల్ మరియు ట్రయినింగ్ డిపార్టుమెంటు" ముఖ్య అధికారిగా ఆయనను నియమించింది. ఆయన ఈ ప్రాంతాల్లో విస్తృతంగా సాంకేతిక విద్యాలయాలను ఏర్పాటుచేసి, ఈనాడు మన రాష్ట్రంలో ప్రణాళికల అభివృద్ధి కృషిలో ఉపయోగపడేలా ఆనాడు రూపొందించారు. ఆయన లేబరు కమీషనరుగాను, ఉపాధి కల్పనా సంస్థల ముఖ్య అధికారిగాను, పునరావాస సహాయశాఖ ప్రధానాధికారిగాను వుండి కార్మిక సంబంధాలను పూర్తిగా అవగాహన చేసుకున్నారు. మొదటి కాంగ్రెస్ మంత్రివర్గానికి ఆయన ప్రణాళికా అభివృద్ధి సలహాదారుగా పనిచేసి ఆనాడు ప్రకాశంగారి మంత్రివర్గం ప్రారంభించిన ఫిర్కా అభివృద్ధి ప్రణాళికను ప్రారంభించేందుకు సహాయపడ్డారు. ఆ తరువాత అదే జాతీయ విస్తరణ పథకంగా రూపుదిద్దుకొంది. ఆయన పరిశ్రమల శాఖ డైరెక్టరుగా లేబర్ కమీషనరుగా ఉన్నప్పుడు భావించిన విధంగా రాష్ట్రస్థాయి ప్రణాళికకు రూపకల్పన చేయ ప్రారంభించారు. మద్రాసు ప్రభుత్వానికి ఆయన గొప్ప సలహాదారులు. చట్టాలపట్ల మూర్ఖపు పట్టుదలతో ఉండే అధికారులను, వ్యాపారవేత్తలను, సాంకేతిక నిపుణులను, ఇట్టే ఒప్పించగలిగే ఆయన సామర్థ్యం, ముందుచూపుతో ఆయన చేపట్టే పారిశ్రామిక ప్రణాళికలు, ఆయనలో మనకు కనిపించే ప్రత్యేక అంశాలు. కేంద్ర శాసనసభలోను, రాష్ట్ర అప్పర్ కౌన్సిల్‌లోను సభ్యులుగా వుండి తన ప్రణాళికలను శాసనసభలు ఎలా స్వీకరించగలవో ఆయన చూశారు.

కీ॥ శే॥ శ్రీ కె.వి.రెడ్డినాయుడు కాలంలో ఆమోదితమై ఆ తర్వాత ఉన్న ఎయిడ్ టు ఇండస్ట్రీస్ యాక్ట్‌కు తిరిగి జీవాన్ని ప్రసాదింపజేసి అనేక పరిశ్రమలు బాగా నడిచేందుకు శ్రీ రామకృష్ణ హుషారునిచ్చారు.

జయపూర్ పర్వత ప్రాంతాల్లోని పేదరైతుల సహాయం కోసం శ్రీ రామకృష్ణ చేసిన మరొక అంశాన్ని నేను మీ ముందుంచుతాను. తమ పంటల అమ్మకాల విషయంలో రైతులు వ్యాపారస్తుల వల్ల బాగా మోసపోవటాన్ని గమనించి ఆయన అక్కడి రైతులను "తపియోక" అనే ఒక రకం దుంపను పెంచేందుకు ప్రోత్సహించారు. ఈ దుంప బాగా స్థానికులకు ఆహార పదార్థంగా ఉపయోగపడుతుంది. మార్కెట్లలో ప్రత్యేకమైన డిమాండు ఉండనందువల్ల వ్యాపారస్తులు

కొనుగోలు జేయరు, అందువల్ల ఆ ప్రాంతం రైతులకు ఇది ఇళ్లలో నిలవగా ఉండి స్వంత ఆహార అవసరాలకు బాగా వినియోగం కాగలదు.

పరిశ్రమల స్థాపనలో దురదృష్టవశాత్తు ఆంధ్రదేశం బాగా వెనకబడి ఉన్న రాష్ట్రంలో మొదటిదిశగా ఉంది. సాహసవంతులైన ఆంధ్రపారిశ్రామిక వేత్తలు భారీపరిశ్రమల స్థాపనకోసం ముందుకు వచ్చినా వారి పెట్టుబడులకు మించి ఆ తరువాత వారికి కావలసిన వనరులు లభించడం లేదు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని సాధించే బాధ్యత శ్రీ రామకృష్ణ గారికి అప్పగించడం జరిగింది. ఆయన ఉయ్యూరులో కె.సి.పి షుగర్ ఫ్యాక్టరీని స్థాపించారు. భారతదేశంలోని ప్రముఖ పెద్ద పంచదార మిల్లులలో అది ఒకటి.

ఈ సంస్థ సహకారంతో నాగార్జున సాగర్ నిర్మాణంలో సరఫరా చేసేందుకుగాను మాచర్లలో ఒక భారీ సిమెంటు ఫ్యాక్టరీని ఆయన స్థాపించారు. రాయఘడ్ పరిశ్రమల సహకారంతో చాగల్లులో ఒక పంచదార మిల్లును స్థాపించారు. ఆయన పర్యవేక్షణలో తణుకు, రామచంద్రాపురం, బొబ్బిలి, చల్లపల్లిలలో పంచదార మిల్లులేర్పడ్డాయి. షుగరు మిల్లులకు కావలసిన యంత్రాలను తయారుచేసే కర్మాగారాన్ని ఆయన ప్రారంభించారు. రెండుమూడు ఇనుము, ఉక్కు తయారుచేసే చిన్న ఫ్యాక్టరీలను ఏర్పాటుచేసి జపాను, చైనావారి సాంకేతిక పద్ధతులను మన పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించుకొని ఆంధ్రప్రాంతంలోని ఇనుపరాయితో కొద్ది పెట్టుబడులతో ఈ ఫ్యాక్టరీలను నిర్వహిస్తూ మనకున్న సామర్థ్యాన్ని ప్రదర్శించి చూపాలని ఆయన తలపోశారు. ఈవిధంగా శ్రీ రామకృష్ణ దక్షిణాది రాష్ట్రాలలో పారిశ్రామికాభివృద్ధికి ఎక్కువగా పాటుపడి జాతీయాదాయం పెరుగుదలకు బాగా తోడ్పడ్డారు.

ఆయన అనుయాయి, ఆశ్రితులలో ఒకరైన తణుకుకు చెందిన శ్రీ ముళ్లపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ఆంధ్రప్రాంతంలో పారిశ్రామిక నిర్మాణ కృషిలో గొప్పస్థాయిని సంపాదించుకున్నారు. ఆంధ్రా షుగర్స్‌తోపాటు రసాయనిక అనుబంధ పరిశ్రమలను, ఆంధ్రా పొండివంటి వాటిని ఆయన అభివృద్ధి చేశారు. శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్యగారు ప్రారంభించిన అఖిల భారత ఉత్పత్తిదారుల సంఘానికి రాష్ట్రశాఖ అయిన ఆంధ్రప్రదేశ్ ఉత్పత్తిదారుల సంఘాధ్యక్షులుగా శ్రీ హరిశ్చంద్రప్రసాద్‌గారు ఎన్నికై రామకృష్ణగారు వెలిగించిన జ్యోతిని చేతపుచ్చుకొని ముందుకు నడిచారు. శ్రీ ఎల్.దత్తు, కోయంబత్తూరుకు చెందిన శ్రీ రామకృష్ణ, శ్రీమతి రాజేశ్వరి, కీ॥ శే॥ రామశేషయ్యగార్లు ఒరిస్సా (రాయఘడ్) లోను, తమిళనాడులోను, ఆంధ్రప్రాంతంలోను పరిశ్రమల అభివృద్ధికి విశేషమైన కృషిచేశారు.

మేము ఆక్స్‌ఫర్డ్‌లో ఉన్నప్పుడు రైతులను ఆయన ఎంతగా ప్రేమించేవారో ఇప్పటికీ అలాగే ప్రేమిస్తున్నారు. ఉయ్యూరులోని కె.సి.పి. మేనేజింగు డైరెక్టరుగా ఉన్నప్పుడు చెరకు ఉత్పత్తిదారుల పట్ల ఆయన చూపెట్టిన అభిమానం ద్వారా ఈ విషయాన్ని రుజువు చేసుకున్నారు. చెరకు పండించే రైతులకు గిట్టుబాటు ధరలు లభించాలని నేను ఆందోళన సాగిస్తున్న విషయం ఆయనకు తెలుసు. రైతాంగం ప్రయోజనాలను నిర్లక్ష్యం చేయడం ఆయనకు ఇష్టం లేదు. అందుకుగాను ఆయన పరిశ్రమాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని ఫ్యాక్టరీ యజమానులు, చెరకు ఉత్పత్తిదారులు ఫ్యాక్టరీలో వచ్చే ఆదాయంలో వాటాలు పొందే

పథకాన్ని తయారుచేశారు. ప్రఖ్యాతి వహించిన సిస్మా (సౌత్ యిండియన్ షుగర్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్) పద్ధతిని ప్రవేశపెట్టిన ప్రముఖ వ్యక్తిగా ఆయనకు పేరు వచ్చింది. ఈ పద్ధతి ప్రకారం రైతులకు వారు సరఫరా చేసిన చెరకులోని పంచదార శాతాన్ని అనుసరించి ధరలు లభించగలవు. ఈ పథకాన్ని కేంద్రమంత్రి శ్రీ రఫీ అహ్మద్ కిద్వాయ్, భారత ప్రభుత్వం, సెంట్రల్ షుగర్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అంగీకరించాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఎక్కువ ఆదాయం లభించేందుకు ఆయన కృషిచేశారు.

ఆయన ఇంగ్లండు దేశంలో ఉన్నప్పుడు పొందిన కార్మిక వర్గ సానుభూతి కారణంగానూ, లేబరు కమీషనరుగా ఆయన పనిచేసిన నాటి అనుభవాల పరంగాను ఆయన ఉయ్యూరు ఫ్యాక్టరీలోని కార్మికుల సంక్షేమం కోసం అనేక విధాలైన నిర్మాణాత్మక చర్యలకు పూనుకొన్నారు. కేంద్రంలో తన పాత మిత్రులైన శ్రీ వి.వి.గిరిగారు కార్మిక శాఖామంత్రిగా ఉన్న రోజుల్లో ఆయన ప్రభుత్వ సహాయంతో కార్మికులకు ఒక కాలనీ కట్టించి గృహవసతి ఏర్పాటు చేశారు. అనేక రాష్ట్రాలలో అనేక పరిశ్రమలలో అనేక విభాగాలలో పనిచేస్తున్న వేలాదిమంది కార్మికుల సానుభూతిని ఆయన పొందగలిగారు. వారి పరిశ్రమలలో పనిచేసే కార్మికుల కార్మికోద్యమం ఆయా పరిశ్రమలకు అనుగుణంగా ఉంటుండేది. వారు పరిశ్రమలలో ఇరవై సంవత్సరాలుగా ఎలాంటి సమ్మెలు జరగలేదు. ఉయ్యూరు కె.సి.పి. షుగరు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు ఆయన కంచు విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నారు. మద్రాసు దాపులోని తిరువత్తి యూర్‌లోని కె.సి.పి. హెవీ ఇండస్ట్రియల్ వర్క్‌షాపు కార్మికులు కూడా ఆయన కంచు విగ్రహాన్ని స్థాపించుకున్నారు. ఈ రెండు విగ్రహాలను ఆయనకు అభిమాన పాత్రుడైన స్నేహితుడు శ్రీ వి.వి.గిరి ఆవిష్కరించారు.

ఉన్నత విద్యావ్యాప్తికై ఆయన భూరి విరాళాలు ఇచ్చారు. తెనాలిలో కళాశాల స్థాపనకు ఆయన పెద్ద మొత్తాన్ని దానంగా ఇచ్చారు. ఆ కళాశాలకు ఆయన తండ్రిగారి పేరు పెట్టారు. రేపల్లె తాలూకాలోని నగరంలో కళాశాల భవనాల నిర్మాణానికి ఆయన అయిదు లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. ఆక్స్‌ఫర్డ్ రోజులనాటి మా పాతస్నేహితులు డాక్టరు వి.ఎస్.కృష్ణాగారు వైస్ ఛాన్సలరుగా ఉన్న పది సంవత్సరాల కాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం ప్రత్యేక శ్రద్ధ వహించారు. దాని అభివృద్ధికి జైపూర్ మహారాజాగారితో పదిలక్షల రూపాయలు విరాళాన్ని కూడా ఇప్పించారు.

భారత దేశంలో ఇంతటి శక్తిసామర్థ్యాలు కలిగిన సాంకేతిక వేత్త, పారిశ్రామిక నిర్మాత మరొకరున్నారు. ఆసక్తికరమైన అంశమేమిటంటే ఆయన కూడా దక్షిణ భారతదేశానికి చెందిన వారే. వారు కోయంబత్తూరుకు చెందిన శ్రీ జి.డి.నాయుడు. ఆయన పలురకాలైన పరిశోధనలలో పేరుపొందారు. అయితే శ్రీ రామకృష్ణగారిలాగా ఆయనకు ఎడింబరో, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాల విద్యార్థులతగానీ, విశ్వవిద్యాలయాల శిక్షణగానీ లేదు. తన కాలంనాటి పారిశ్రామిక వేత్తలనుంచి గానీ, పరిపాలకులనుంచి గానీ, మంత్రులనుంచిగానీ ఆయనకు సహకారం లభించలేదు. ఆయన కూడా సాంకేతిక శిక్షణాలయాలు నెలకొల్పి వేలమందికి శిక్షణ నిచ్చారు. వీరిద్దరూ మంచి స్నేహితులుగా వుంటుండేవారు. ఇలాగే అభివృద్ధిని సాధించిన వారిలో రిటైర్డు ఐ.సి.యస్.

మిత్రులు శ్రీ సి.సి.దేశాయ్, ఆయన నాకు పార్లమెంటులో సహచరుడు. సుభాష్ చంద్రబోసు గారితోపాటు కేంబ్రిడ్జి కాలం నాటి విద్యార్థి.

వీటన్నిటితోపాటు శ్రీ రామకృష్ణ సాంకేతిక విద్య పూర్తిచేసుకొని వచ్చిన వేలాదిమంది ఆంధ్ర యువకులకు 1947 నుండి ప్రారంభించిన తమ పరిశ్రమలలో ఉద్యోగావకాశాలు కల్పించారు. యావద్భారత దేశంలోను ఇంతటి ఉన్నత విజయాన్ని సాధించిన వారిలో ఆయనను వేళ్లమీద లెక్కించవచ్చు. ఇంతటి కృషిచేసిన మరొక కుటుంబం ప్రఖ్యాతి వహించిన కోయంబత్తూరు పి.యస్.జి. సంస్థ. పి.యస్.జి ట్రస్టుకు జి.డి.నాయుడుగారి ప్రయోగాలకు నా అభివందనాలు.

రామకృష్ణగారు ఆహార ధాన్యాలపై కంట్రోళ్ళు విధించడం వంటి విషయాలకు వ్యతిరేకంగా నేను ప్రారంభించిన అన్ని రాజకీయ ఉద్యమాలలోను నాకు సహకరించారు. 1951 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీని నేను, నా సహచరుడు వదిలిపెట్టినప్పుడు ఆయన కూడా వదిలిపెట్టారు. శ్రీ జె.బి.కృపలానీ, టంగుటూరు ప్రకాశంగార్లు ప్రజాపార్టీకి కాంగ్రెస్ పద్ధతిలోనే అఖిల భారతస్థాయిలో జాతీయ కార్యవర్గానికి సర్వాధికారాలు ఇస్తూ ఏర్పాటు చేయాలని పూనుకున్నప్పుడు దానికి నాతోపాటు ఆయన కూడా అయిష్టతను వ్యక్తం చేశారు. అలాంటి అధికార ఏకీకృత విధానం భారతీయ రాజకీయాలకు మంచిదికాదన్న మా అభిప్రాయాలతో ఆయన ఏకీభవించి కృషికార్ లోక్ పార్టీని ప్రారంభించే కృషిలో మాకు సహకరించారు. 1951 సాధారణ ఎన్నికలలో అనేకమంది ఆయన మిత్రుల నుంచి నిధులు సేకరించారు. ఎన్నికల ఫలితాలు సంతృప్తికరంగా రాకపోయినప్పటికీ ఆయన నాపట్లగానీ, కృషికార్ లోక్ పార్టీపట్లగానీ విశ్వాసాన్ని కోల్పోలేదు. తిరిగి 1955లో దానిని కాంగ్రెస్‌లో కలిపేంతవరకు ఆయన మాతో చురుకుగా కలిసి పనిచేస్తూనే ఉన్నారు. అప్పుడు ఒక మద్రాసు బహిరంగ సభలో ఆయన ఇట్లా అన్నారు. "ఆక్స్‌ఫర్డ్‌లో నేను రంగాగారికి గురువును. ప్రస్తుతం ఆయన నాకు రాజకీయ గురువు". 1952 సంవత్సరంలో తన పూర్వ మెజారిటీని కాంగ్రెస్ పక్షం కోల్పోయినప్పుడు కాంగ్రెస్ పార్టీకి మంత్రివర్గంలో ఏర్పాటులో సహకరించేందుకు కె.ఎల్.పి. నిర్ణయం తీసుకున్నందుకు ఆయన సంతోషించారు. అప్పటినుంచి ఆయన నాతో విభేదించడం ప్రారంభించారు, ఎందుకంటే కాంగ్రెస్ మంత్రివర్గంలో రెండవ స్థానంలో ఉండడానికి నేను అంగీకరించలేదు. అంతేగాక రాజాజీ నాయకత్వంలో ఏర్పడుతున్న ఆ కాంగ్రెస్ సంకీర్ణ మంత్రివర్గంలో మా శాసనసభ్యులిద్దరిని మంత్రులుగా ప్రవేశించేందుకు నేను అనుమతించలేదు. పడిపోతున్న కాంగ్రెస్ పార్టీకి పునరుజ్జీవనాన్ని కల్పించామనే నిందను ఆ సందర్భంలో నేను పైన వేసుకోదల్చుకోలేదు.

1954 నవంబరులో అవిశ్వాస తీర్మానం ద్వారా ఆంధ్రలో ప్రకాశం పంతులుగారిని దించేసిన తరవాత, 1955 సంవత్సరంలో కాంగ్రెస్ కె.ఎల్.పి. పక్షాలమధ్య జరిగిన సంప్రదింపులలో రామకృష్ణగారు ప్రముఖమైన పాత్ర వహించారు. కీ॥ శే॥ అయిన లాల్‌బహదూర్ శాస్త్రిగారు ఆయనపై మంచి నమ్మకాన్ని ఉంచారు. కృషికార్ లోక్ పార్టీ ప్రజాపార్టీ ఒకవైపు, కాంగ్రెస్ ఒకవైపు అందరూ కలసి ఉమ్మడి కాంగ్రెస్ పక్షంగా ప్రత్యేక ఎన్నికల ప్రణాళికతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆ ఎన్నికలలో కమ్యూనిస్టులను తుడిచిపెట్టి

మేము అఖండ విజయాన్ని సాధించాము. ఆ తరువాత ఆయన తిరిగి తన దృష్టిని తనకు ఇష్టమైన పారిశ్రామికాభివృద్ధివైపు మళ్లించారు. 1963 సంవత్సరంలో ఆయనకు గుండెపోటు సంభవించి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నప్పుడు ఆయనను చూడడానికి నేను వారింటికి వెళ్లాను. ఆ సందర్భంలో చిత్తూరు ఓటర్లు నన్ను గెలిపించి పార్లమెంటులో సేవ చేసేందుకు పంపించినందుకుగాను ఆయన చాలా ఆనందించారు.

రామకృష్ణ సన్నగా పాడవుగా దృఢంగా ఆకర్షణీయంగా రోమన్ యోధునిలా ఉంటాడు. చూసేందుకు మంచి రాజసంతోను, నడిచేటప్పుడు హుందాతనంతోను పనిలో ఉన్నప్పుడు మంచి చట్టులోను ఆయన కనిపిస్తుంటారు. ఆయన గట్టి మానసిక దారుఢ్యంతోను, అమోఘమైన జ్ఞాపకశక్తితోను శాస్త్రీయ సమస్యలను సులభంగా పరిష్కరించగలిగే విధంగా ఉంటారు. ప్రముఖ మేధావులలో ఆయన ఒకరు. ఆయన కేదైనా సంతోషం కలిగితే సముద్రం ఘోషించినట్లుగా విరగబడి నవ్వేవారు. అనేకమంది లాగా ఆయన విలాసమయమైన జీవితంపై శ్రద్ధ చూపెట్టేవారు కాదు. ఆయన తన కుటుంబాన్ని బాగా ప్రేమించేవారు. అయితే దేశ అభ్యుదయాభివృద్ధి పట్ల ఆయన చూపే ప్రేమ అన్నిటికన్నా గొప్పది, అనంతమైనది.

వైస్ ఛాన్సలరు – శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి

కలకత్తా విశ్వ విద్యాలయానికి ఉపాధ్యక్షులైన శ్రీ అశుతోష్ ముఖర్జీ వలెనే, శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్రవిశ్వవిద్యాలయానికి ఖ్యాతి వహించిన ఉపాధ్యక్షులు. ఆంధ్రవిశ్వవిద్యాలయానికి రూపశిల్పి, మొదటి ప్రధానాధికారి ఆయనే. స్వాతంత్ర్యం రాకపూర్వపు ఆ రోజుల్లో, విశ్వవిద్యాలయాంలో పట్టప్రదాన సభలో చేసే ప్రసంగాలు విద్యావంతులమీద ఎక్కువ ప్రభావాన్ని చూపిస్తూ ఉండేవి. రామలింగారెడ్డిగారి ప్రసంగాలు బ్రిటీషు పరిపాలకులను పడంగొడుతుండేవి. సామ్రాజ్యవాద వ్యతిరేక మేధావి వర్గ నాయకులైన ఉన్నది ఉన్నట్లు మాట్లాడే ఆయనంటే విద్యావంతులలో మంచి గౌరవం ఉండేది. ఉప్పు సత్యాగ్రహంమీద చేస్తున్న మితంలేని దురాగతాలకు వ్యతిరేకంగా 1930లో ఆయన ఎన్నిక ద్వారా పొందిన విశ్వవిద్యాలయ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా ఇస్తూ పంపిన లేఖ వైస్రాయి ఇర్విన్ గారికి, గాంధీజీ పంపిన లేఖ లాగే బ్రిటీషు పాలకులకు ప్రాణాంతకమైంది. దేశభక్తులైన వారందరూ తమ తరపున మాట్లాడే ఒక గొప్ప మేధావిగా ఆయనను గౌరవించారు.

ఆ తరం దక్షిణాది మేధావుల్లో ఆయన చాలా ప్రముఖులు. ఈ శతాబ్దంలోని తొలి దశాబ్దంలో ఆయన కేంబ్రిడ్జి నుంచి డిగ్రీ తీసుకున్నారు. తెల్లవారి ఆధిక్యత కొనసాగుతున్న ఆ రోజుల్లో ఆయన కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయ యూనియన్ నాయకులైనారు. ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇంగ్లాండు వెళ్లకముందే ఆయన తెలుగు భాషలో మంచి పండితునిగా, విమర్శకులుగా, కవిగా పేరు తెచ్చుకున్నారు. ఆ విధంగా ఆయన తూర్పుదేశాల శిష్ట బ్రాహ్మణ్యానికి, పశ్చిమ దేశాల పాశ్చిమాత్య ధోరణులకు తీసిపోకుండా ఎదిగారు. భారతీయులకు ఆ అవకాశం ఇవ్వాలనుకున్నప్పుడు మదరాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా శ్రీ రామలింగారెడ్డి కాగలరని ఊహించటం ఆశ్చర్యకరం కాదు. దురదృష్ట వశాత్తూ అందుకు రామలింగారెడ్డిగారిని ఆహ్వానించలేదు. మదరాసులో ప్రజాస్వామ్యం ఈ విషాదకరమైన సంఘటనను ఎందుకు ఎదుర్కోవలసి వచ్చింది? ఉన్నత మేధాసంపత్తి గల ఇటువంటి ప్రముఖుల సేవలను వదలుకొని ప్రజాస్వామ్యం ఎలా ఎప్పుడు ఫలవంతమవుతుంది! సరైన హక్కులూ, అవకాశాలు లేని బ్రాహ్మణేతరులకు సాంఘిక న్యాయాన్ని సాధించడానికి డా॥ టి.యం.నాయర్, శ్రీ పిట్టి త్యాగరాయ చెట్టిగారలు ప్రారంభించిన జస్టిస్ పార్టీలో చేరిఉంటే ఆయన 1921 లోనే ముఖ్యమంత్రి కాగలిగేవారు. తన పదవిని గురించి కానీ, అధికారాన్ని గురించిగాని, అటువంటి ఒక బ్రాహ్మణేతర పక్షం అవసరం గురించిగాని, తమ సమకాలీనులైన మేధావులలో తనకు ప్రత్యేకత లభించాలనిగాని, అటువంటి ఒక రాజకీయ పక్షం బ్రాహ్మణేతరులను ముందుకు తీసుకురాగలదని కానీ ఆయనెప్పుడూ అభిప్రాయ పడలేదు. అంతేగాక సమగ్ర జాతీయ తత్వం మీద ఆయనకు పూర్తి విశ్వాసం ఉంది. కేంబ్రిడ్జి విద్యాభ్యాస కాలంనుంచి ఆయనలో ఉన్న స్వాతంత్ర దీక్ష బ్రాహ్మణేతరులకు సాంఘిక న్యాయం సమకూరేవరకు జాతిస్వాతంత్ర్య పోరాటం వాయిదా పడడాన్ని ఆయన అంగీకరించలేదు. అందువల్ల జస్టిస్ పార్టీ అభ్యర్థనలను ఆయన తోసిపుచ్చారు.

బ్రాహ్మణేతర వర్గాల ప్రజలు, స్త్రీలపై హిందూ పౌరాణిక పూజారి వర్గాలు విధించిన నిషేధాలను రామలింగారెడ్డిగారు అసహ్యించుకున్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత కూడా బ్రాహ్మణులు ఇలాగే ప్రవర్తించగలరనే కారణంతో, జాతీయ పోరాటంతో విభేదించడానికి ఆయన అంగీకరించలేదు. తన వయస్సు కారణంగానూ, అనారోగ్యం కారణంగాను, త్యాగరాయశెట్టి వద్దన్నందువల్ల కడలూరుకు చెందిన న్యాయవాది శ్రీ వెంకటసుబ్బారెడ్డిని బ్రాహ్మణేతర వర్గం ముఖ్యమంత్రిగా ఎన్నుకొంది. అప్పుడు రామలింగారెడ్డిగారు మైసూరు రాష్ట్రంలో విద్యాశాఖ డైరెక్టరుగా ఉన్నారు. అప్పట్లో భారతీయులకు అది చాలా గొప్ప పదవి.

1923 లో మదరాసు కౌన్సిలులో ఎన్నికైన సభ్యులలో తమ బలం తగ్గిపోయిన కారణంగా జస్టిస్ పార్టీ తన బలాన్ని కోల్పోయింది. రామలింగారెడ్డిగారు మైసూరు విద్యాశాఖను వదలివేసి కౌన్సిలు సభ్యులుగా ఎన్నికయ్యారు. జాతీయవాదులతో కూడిన ప్రతిపక్షానికి నాయకులై నెమ్మదియైన పానగల్ రాజాగారి నాయకత్వంలో ఉన్న జస్టిస్ పార్టీని ఆయన సమర్థవంతంగా ఎదుర్కొన్నారు. అప్పటి చర్చలు శ్రీ రెడ్డి వ్యంగ్యోక్తులతో సమర్థవంతమైన విమర్శంతో తిరుగులేని ప్రసంగాలతో సభకు నిండుదనం చేకూరుస్తూ ఉండేవి. తీవ్రంగా చర్చలో పాల్గొనడానికి కొంచెం సిగ్గుపడుతూ వుండే జస్టిస్ పార్టీ మంత్రులమీద, నోరు కట్టివేసుకొని ఉండే బ్రిటిషు సామ్రాజ్యవాద తెల్లజాతి కౌన్సిలర్ల మీద వెంబడి వెంబడి విమర్శనాస్త్రాలను రెడ్డిగారు సంధిస్తూవుంటే, ఆ పరిహాస ప్రసంగాలను వింటూ విద్యా వంతులైనవారు చాలా ఎక్కువగా ఆనందిస్తుండేవారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీ సత్యమూర్తి ప్రశ్నల సమయంలో అధికార పక్షానికి గట్టి శత్రువుగాను, చర్చలలో రెడ్డిగారికి మంచి తోడుగాను ఉంటుండే వారు. ఆ దశాబ్దంలోని ప్రముఖ నాయకులలో ఒకరైన శ్రీ పానగల్ రాజా ఆంధ్ర విశ్వవిద్యాలయంపై చర్చలలో శ్రీ రెడ్డిని బాగా ప్రోత్సహించారు. ఒక దశాబ్దంపాటు చర్చలు కొనసాగిన తరువాత, ఆంధ్ర విశ్వవిద్యాలయం ఏర్పాటుకు అంగీకరించడమైంది. శ్రీ రామలింగారెడ్డి దాని ఉపాధ్యక్ష పదవిని కోరుకొని తనకు తానుగా తిరుగులేని ప్రతిపక్ష నాయకత్వ స్థానం నుంచి తప్పుకొన్నారు.

రామలింగారెడ్డిగారు అట్లా ఎందుకు చేశారు? దీర్ఘకాలం మంత్రిపదవి, విద్యాశాఖ డైరెక్టరు పదవి వంటి వాటిని వదలుకొని ఏమీ లేకుండా దూరంగా ఉండడానికి ఆయనకు ఇష్టం లేకపోవడంతో తన ధోరణిని మార్చుకొని ఉండవచ్చు. జస్టిస్ పార్టీని అధికారం నుంచి కాంగ్రెస్ పార్టీ త్రోసివేయగలిగినప్పటికి కాంగ్రెస్‌కు అధికారం రావడానికి స్వరాజ్యం వచ్చేదాకా బహుశా చాలా కాలం ఆగవలసి ఉంటుందని కూడా ఆయన భావించారు. ఇంగ్లండు నుంచి తిరిగి వచ్చిన తరువాత ఆయన బరోడాలో ప్రొఫెసరుగా పనిచేస్తూ విద్యాశాఖలో డైరెక్టరు అయ్యారు. అందువల్ల ప్రతిపక్ష రాజకీయాల చెత్తకుండీలో నుండి బైటపడినందుకు ఆయన విచారపడలేదు.

తనకు లభించిన ఈ అవకాశాన్ని సంతోషంతో స్వీకరించి దానిని ఉత్తమశ్రేణి విద్యాలయంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేశారు. కే.శే. ప్రొఫెసర్ హుమయూన్ కబీర్, శ్రీ వి.కె.ఆర్.వి.రావు, శ్రీ సూరి భగవంతం వంటి ప్రముఖ విద్యావేత్తలను మేధావులను ఆయన విశ్వవిద్యాలయంలో చేర్చుకొన్నారు. అణుశాస్త్ర విజ్ఞానం, సముద్ర పరిశోధన, మానసిక

తత్వశాస్త్ర పరిశోధనవంటి అంశాలలో విద్యాపీఠాలను ఏర్పరిచారు. సమర్థులైన విద్యావేత్తలను పొందటంలో ఆశుతోష్‌గారితో సంబంధాంనేర్పరచుకొని పద్ధురం మార్చుకొన్నారు. పండితులతో, శాస్త్రవేత్తలతో గడపటమంటే ఆయనకు ఎక్కువ ఇష్టం. ఆయన పాత మైసూరులో ప్రొఫెసరుగా పనిచేస్తున్నప్పుడు, ప్రముఖ తత్వవేత్త రాధాకృష్ణన్ గారిని రామలింగారెడ్డిగారు ఆశుతోష్ ముఖర్జీ గారికి సిఫార్సు చేశారు. కలకత్తాలోని ప్రముఖ విశ్వవిద్యాలయంలోకి వచ్చిన కారణంగా డా॥ రాధాకృష్ణన్ పశ్చిమ దేశాలవారి దృష్టిలో పడ్డారు. అదేవిధంగా దువ్వూరి రామిరెడ్డిగారిని దివ్యజ్ఞాన సమాజీకులైన ఐరిష్ కవి డా॥ కజిన్స్ గారికి పరిచయం చేశారు. ఆ పరిచయం రామిరెడ్డి గారిని ప్రపంచ వ్యాప్తంగా అందరికీ తెలిసేలా చేసింది. నా ఆక్స్‌ఫర్డ్ మిత్రులు డా॥ వి.యస్.కృష్ణగారిని లెక్చరరుగా చేర్చుకొని వారు ఉపాధ్యక్షులు కావటానికి సహాయపడ్డారు. ప్రముఖ చరిత్రకారులు శ్రీ మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఆయనకు రుణపడి ఉన్నారు. 1926 సంవత్సరంలో నేను రాసిన మొదటి ఆంగ్ల గ్రంథం "ఎకనామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియన్ విలేజెస్" అనే దానికి ఆయన రాసిన పరిచయ వాక్యాలు భారత విద్యావేత్తలలో నాకు గౌరవాన్ని కల్పించాయి.

షేక్‌స్పియర్‌కు సమకాలికులైన గొప్ప తెలుగుకవి పింగళి సూరన కవితా మాధుర్యాన్ని ఆయన వెలికి తీసుకొచ్చి, ఈ శతాబ్దంలోని తెలుగు వారు అందులోని సారస్యాన్ని అనుభవించగలిగేలా చేశారు. సూరనగారి ప్రబంధకావ్యం కళాపూర్ణోదయానికి పరిచయ వాక్యాలు రాస్తూ తెలుగు కవితా ప్రబంధాలలో అది మేటియైన రచనేకాక, తెలుగు కవులకు స్వతంత్ర రచనకు బాట చూపింది అని ప్రస్తుతించారు. ఆయన వచనంలో కవితా శిల్పాన్ని, కవిత్వంలో వచన శైలిని చూపెట్టే సమకాలీన అభ్యుదయ కవిత్వానికి బాట వేశారు. నూతనంగా విద్యావంతులైన వారికి గ్రహించటానికి వీలైన రీతుల్లో ప్రజాస్వామ్య రచనా పద్ధతులను పాదుకొల్పారు.

గత నాలుగు దశాబ్దాల తెలుగు కవులకు, రచయితలకు ఆయన ప్రాపకాన్నందించిన మహర్షి. తెలుగు కవితా రీతులను గురించి 1910 లో ప్రచురితమైన ఆయన పుస్తకం ప్రామాణిక గ్రంథమై నూతన కవితా ధోరణులకు లక్ష్యగ్రంథంగా విలసిల్లింది. ఆయన చేత ముందుమాటగానీ, పరిచయ వాక్యాలుగానీ, ప్రశంసా వాక్యాలుగానీ రాయించుకోగలిగిన వారు ఆ రోజుల్లో గొప్ప అదృష్టవంతుల కింద లెక్క. నవతరం తెలుగు రచయితల రచనల విషయంలో ఆయన చాలా సానుభూతితో విర్మాణాత్మకమైన విమర్శలను సూచనలను అందిస్తూ, ఇబ్బందుల్లో ఉన్న చాలామంది రచయితలకు ఆర్థిక సహాయం చేస్తుండేవారు. వీరేశలింగం గారు తెలుగు కవులకు వచన రచనలో మార్గం చూపించడమే గాక రకరకాల రీతులలో విషయాన్ని చూపెట్టే పద్ధతిని ప్రదర్శిస్తే, శ్రీ రామలింగారెడ్డి తెలుగు రచయితలందరికీ ఆంధ్ర సాహితీ పూజారిగా ఉన్నారు. మహాత్మాగాంధీగారి "ఆత్మకథ"ను రాసిన శ్రీ తుమ్మల సీతారామమూర్తిగారినీ, "సౌందరనందము" రచించిన శ్రీ కాటూరి వెంకటేశ్వరరావుగారినీ, "ఆంధ్రవీరులు" రచయిత శ్రీ మల్లంపల్లి గారినీ, రామలింగారెడ్డిగారు సహాయాన్ని అందించడమేగాక ప్రోత్సహించారుకూడా. "కళాప్రపూర్ణ" అనేపేరుతో ఒక డాక్టరేట్ డిగ్రీని ప్రవేశపెట్టి సంస్కృతంలో ప్రాచ్యభాషలలో ప్రముఖ పండితులైన శ్రీ వేదం వెంకటరామశాస్త్రి గారిని, దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావుగారిని మొదటి రెండవ వారలుగా ఆహ్వానించి ఆ సంవత్సరంలో గౌరవ డాక్టరేట్‌లను అందించారు.

ఒక విషయంలో ఆయన అనుకొన్న దానిని సాధించలేకపోయారు. తెలుగును ప్రధాన బోధనా భాషగా ప్రవేశపెట్టాలనే తలంపుతో ఆంధ్రులకు ప్రత్యేక విద్యాలయం కావాలని వాదించి దానిని సాధించిన తరువాత ఆ లక్ష్యాన్ని పూర్తిచేయలేక పోయారు. తెలుగు భాషను, దాని ఆచార్యులను ఆయన ఇంగ్లీషులో సమాన స్థాయిలోనే ఉంచారు. అయితే అనేక ఇతర విశ్వవిద్యాలయాల లాగే సాహిత్య కృషిలోనూ, లైబ్రరీల ఏర్పాటులోనూ, రచయితల, రచనల అభివృద్ధి విషయంలోనూ తన లక్ష్య సిద్ధికి పూనుకోలేదే ముందే ఇంకా బాగా అభివృద్ధి చేయాలని ఆయన తలంచారు. ఆయన ఆంగ్ల సాహిత్యంలోనూ, చమత్కారమైన చాటువులను ఉపయోగించడంలోనూ, భాషా సాంప్రదాయాల లోనూ గొప్పదిట్ట. భారతీయ భాషలను ఇంగ్లీషుతో సమానస్థాయికి తీసుకొచ్చి ఇంగ్లీషు స్థానే వాటిని బోధన భాషలుగా చేయాలని ఆయన తలంచారు.అంతర్విశ్వ విద్యాలయ అధికార వర్గాలలో ఆయన మాటకు తిరుగులేకపోయినప్పటికి ఆయన లొందరపడలేదు.

ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు విశాల హృదయంతో మెలిగినట్లయితే రెడ్డి గొప్ప మంత్రిగాను, ప్రముఖ పార్లమెంటేరియన్‌గాను రుజువు చేసుకొనేవారు. 1936-37 కాలంలో కాంగ్రెస్ శాసనసభలో ప్రవేశించి, మంత్రివర్గాలను ఏర్పాటుచేయాలని నిర్ణయించుకొన్నప్పుడు, జాతీయ స్థాయిలో పేరున్న తనను ఆహ్వానించి కాంగ్రెస్ వారు మద్రాసు శాసనసభా స్థానానికి తనను అభ్యర్థిగా నిలబెట్టగలరని ఆయన భావించారు. దూరదృష్టి లేని అధికార వ్యామోహపరులైన కాంగ్రెస్‌వారు కాంగ్రెస్ టిక్కెట్లు కావాలనుకునే ప్రతివారు అందుకోసం దరఖాస్తు చేసుకొని పార్టీ నిర్ణయం కోసం ఎదురుచూస్తూ ఉండాలని భావించారు.

నాయకుల అటువంటి మొండిపట్టుదల యు.పి.లో "కువాలి కుజమన్" తిరుగుబాటుకు కారణమై పాకిస్తాన్ వివాదం కైలుకు వచ్చేందుకు కారణమైంది. అందువల్ల రెడ్డిగారు 1936-39 శాసనసభకు వెళ్లేందుకు ప్రయత్నించలేదు. శాసనసభ్యుడు కాకుండానే మంత్రివర్గంలో చేరేందుకు ఆయనను ఆహ్వానించకపోవటం అప్పటి ముఖ్యమంత్రి రాజాజీ చేసిన పొరపాటు. ప్రముఖ పార్లమెంటేరియన్ శ్రీ రామలింగారెడ్డిగారిని అనాడు ఆహ్వానించక పోవటం రాజకీయ దృష్టి కలిగిన అనేకమందిని అసంతృప్తికి గురిచేసింది. అయితే తమిళనాడులోను, ఆంధ్రలోను ఉన్న కాంగ్రెస్ నాయకులు తమ స్వప్రయోజనాల కోసం ఆయన శాసనసభలో లేకుండా ఉన్నందుకు ఆనందించారు. ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు రామలింగారెడ్డిగారిని మాత్రమేగాక, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నుంచి బి.ఏ.ఎల్. డిగ్రీని పొందిన శ్రీ కడప కోటిరెడ్డిని, కైలుకు వెళ్లివచ్చిన జాతీయవాది కాలిఫోర్నియా విశ్వవిద్యాలయం నుంచి యం.యస్‌సి పట్టా పుచ్చుకొన్న దీర్ఘకాల జాతీయవాది ప్రముఖ పార్లమెంటేరియన్ శ్రీ యం. బాపినీడు గార్లను గాని రాజకీయ రంగంలోను, జాతీయ సేవలలోను పాల్గొన్న ఏ ఇతర కైతాంగ విద్యావేత్తనుగాని ఆ సమయంలో ఆహ్వానించలేకపోయారు.

దక్షిణ భారతదేశంలో ఆత్మగౌరవోద్యమాన్ని ప్రచారం చేస్తున్న నాయకులు, ఈ పరిస్థితిని కాంగ్రెస్‌వారి హ్రస్వదృష్టికి నిదర్శనంగా ఎత్తి చూపెట్టారు.

ఈర్జా అమెరికాలో వున్న నీగ్రోలు వల్లరంగు ప్రత్యేక అందం ఆకర్షణ కలిగిందనే

వాస్తవాన్ని గుర్తిస్తున్నారు. వేంకట్రెడ్డి సంవత్సరాంకు పూర్వమే భారతీయులు ఈ విషయాన్ని గ్రహించి, తమ పురాణ పురుషులైన రామ, కృష్ణులను వీలమేఘ శ్యాములుగా చిత్రీకరించుకొన్నారు. రామలింగారెడ్డిగారు ఆకర్షణీయమైన చామనచాయతో ఉండేవారు. ఏ రీతిగా చూసినా ఆయన సొంపుగానే కనిపిస్తారు. తల ముందు భాగంలో పగవానికి ప్రకృతి ప్రసాదించిన కుంచెలాగా కనిపించే తలకట్టు ఆయన ముఖానికి ఆకర్షణగా కనిపిస్తూ ఉంటుంది. ఆయన ఒక మోస్తరు ఎత్తులో ఉండి మృదువైన భుజాంతో కనిపిస్తారు. మాట్లలో చూపేందుకు బాగానే కనిపించే ఆంధ్రవాళి కట్టులో బాగా అందంగానే కనిపిస్తారు. ఆయన పైన వేసుకున్న అంగరఖాతో ఉన్నపుడు వుట్టకతోనే వైష్ణవులలా అన్నట్లుంటారు. ఆయన దరహాసం అందిపుచ్చుకున్నట్లుంటుంది. ఆయన మాట మధురమైనది. తిక్కన మహా భారతంలోని అచ్చ తెలుగు కవనం లాగే ఆయన శైలి ఆయనకే ప్రత్యేకం. ఆయన మర్యాద విజయనగర రాజుల దర్బాన్ని కనబరుస్తుంది.

ఆయనతో కలసి ఉండడం సంతోషమనిపిస్తుంది. కొన్ని రోజులు ఆయనతో ఉండటమనేది మనకు ఎంతో సంతృప్తికరమైన అనుభవం. ఆయన దేవుడ్ని ప్రేమిస్తారు. అయితే ప్రాణం అంతకంటే ఎక్కువగా అభిమానిస్తారు. మానవిప్పుపం ఆయనకు అభిమాన పాత్రమైంది. ఆయన ఎక్కడున్నా అక్కడో కవిసమ్మేళనం జరిగేది. జీవితంలో మంచి పనులు చేయాలని ఆయన ఎక్కువగా ఆరాట పడుతుండేవారు. ఆయనకు సంతోషం కలిగించే సందర్భాలేవైనా ఉంటే దాచుకోకుండా వాటిని వెలుతుండేవారు. ఆయన పెళ్లిచేసుకోలేదు. ఎందుకంటే మొదటి ప్రేమ విఫలమైన తరువాత, ఆ ప్రేమను స్మరిస్తూనే ఆయన జీవితాంతం గడిపారు.

శ్రీ నెల్లూరి వెంకట్రామానాయుడు

("మాకొద్ది జమిందారీ పద్ధతి" – గేయ సంకలనకర్త)

స్వరాజ్యం సంపాదించుకున్న తరవాత ఆయిదువందల పైచిలుకు స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసినందుకు, సర్దార్ వల్లభాయ్ పటేల్ గార్ని ఆయా సంస్థానాలలో అశేష ప్రజానీకాన్ని భారతజాతి హృదయపూర్వకంగా అభినందించింది. అంతకంటే ఉన్నతమైన మాలో అభ్యుదయకరమైన చర్య జమిందారీ విధానాన్ని, తాలూకాదారులను, ఇస్తిమదారులను, నవాబులను రాజాలను రద్దుచేయడం!

ఈనాందారులుగా ఉన్నవారు భారతదేశంలో పదిలక్షలమందికి పైగా ఉన్నారు. వారు ప్రజల మధ్యనే జీవిస్తూ, కోట్లాది రైతాంగాన్ని, వ్యవసాయదారులను గ్రామ ప్రజలను నిరంకుశంగా నిరంతరం వేధిస్తూ ఉంటారు. వారు కొన్నిచోట్ల పూర్తిగాను, మరికొన్నిచోట్ల పాక్షికంగాను న్యాయాధికార్లపైన పోలీసులపైన అధికారాన్ని చలాయిస్తూ, మరొక రకంగా రాజరికాధికారాలను అనుభవిస్తుంటారు. గ్రామీణ ప్రజలు వీరిని, పౌరాణిక కాలంనాటి రాజాలను చూసినట్లే, రాజులు కాని రాజులుగా గౌరవిస్తారు. కొన్ని రాష్ట్రాలలో, మద్రాసులో వీరి అధికారాలను ఎప్పటికప్పుడు పన్నులు పెంచేందుకు వీలు లేకుండా మదింపు చేశారు. వీరంతా లార్డ్ కారన్‌వాలీస్ గారి శాశ్వతశిస్తు పద్ధతి ద్వారా రక్షణ పొంద గలిగారు. దానిని 1856 సంలో విక్టోరియా మహారాణి ఆమోదించింది. మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులకన్నా, ఎక్కువ వీలుగా దానిని కాపాడడం జరిగింది.

జమిందారులను, తాలూకాదారులను, వ్యతిరేకించేందుకు, శాశ్వతశిస్తుపద్ధతి నిర్ణయాన్ని ప్రశ్నించేందుకు 1931 వరకు కాంగ్రెసు ముందుకు వస్తున్న తీరు కనుచూపుమేరలో కనిపించలేదు. ఆ రోజుల్లో కాంగ్రెసు పార్టీలో నాయకులుగా ఉంటున్నవారు, ఎక్కువమంది జమిందార్లు, వారి తాబేదార్లు, ముఖ్యంగా బీహారు, ఉత్తరప్రదేశ్, బెంగాల్, మధ్యప్రదేశ్, ఒరిస్సా, రాజస్థాన్ రాష్ట్రాల్లో కాంగ్రెసు నాయకత్వ స్థానంలో జమిందారీ కుటుంబాల వారే ఎక్కువగా వున్నారు.

నెల్లూరు జిల్లాలో సగానికిపైగా, తన ఆధిపత్యంలో వుంచుకున్న వెంకటగిరి మహారాజాకు వ్యతిరేకంగా, పానకాలరెడ్డి వారి కుటుంబం, వారి సలహాదారులైన నెల్లూరి వెంకట్రామానాయుడు పోరాటానికి దిగేందుకు సాహసించారు. వారిమీద సానుభూతి చూపేందుకుగాని, సహాయపడేందుకుగాని, ఏ ఒక్క కాంగ్రెసు నాయకుడు ముందుకు రాలేదు. కష్టాలు నెదుర్కొంటూనే వారు విసుగు చెందకుండా, రాజాగారితో పోరాడారు. ఆ పోరాటంలో పానకాలరెడ్డి వారి కుటుంబం పూర్తిగా చితికి పోయింది. అదే పద్ధతిలో బొబ్బిలికి చెందిన సలా కుటుంబం, మునగాల కరణం, గంపలగూడెం, కొల్లి బుచ్చయ్య కల్లికోట విశ్వనాధదాసు అపజయాలు పొందుతున్నప్పటికీ, గట్టిగా నిలిచిపోరాడారు. అయితే వీటన్నిటినీ స్థానిక పోరాటాలుగా మాత్రమే పరిగణించడం

జరిగింది. సంఘ సంస్కర్తలుగానీ, జాతీయ వాదులుగా వీటిని పరిగణనలోకి తీసుకోలేదు.

భారతదేశంలో బ్రిటీష్ అధికారానికి అంగరక్షకులుగా తోడ్పడుతున్న పలుకుబడి కలిగిన జమిందారీ వర్గంపై పోరాటం సాగించడం జాతీయ ప్రాముఖ్యత కలిగిన అంశంగా గుర్తింపజేసిన గౌరవం వెల్లూరి వెంకట్రామానాయుడుగారికి దక్కుతుంది. ఆయన ఒక కవిలాగా భవిష్యత్తును దర్శించే రైతాంగ ప్రజల బాధలను, కష్టనష్టాలను ప్రచారం చేసేందుకు 1928, 1929 లో "జమీన్ రైతు" అనే తెలుగు వారపత్రికను ప్రారంభించారు. న్యాయవాదులైన పానకాపిచ్చిరెడ్డిగారు కవి, వ్యంగ్య రచయిత అయిన శ్రీ యం.కోదండరామిరెడ్డి గార్లతో కలిసి ఆయన ఈ పత్రికా నిర్వహణకు పూనుకున్నారు. వారిద్దరూ పానకా కుటుంబానికి చెందినవారే; వారు సంపాదకులు, కాగా రామానాయుడుగారు దీనికి చీఫ్ ఎడిటర్.

భూస్వాముల దోపిడీ విధానానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరాన్ని గురించి, ఆ సమయంలో యింగ్లీషు పత్రికలో వ్రాస్తూ ఉండేవాడిని. సర్ థామస్ మున్రోగారు భూస్వామ్య విధానాన్ని రద్దుచేసి రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టి, రాయలసీమలో యదార్థంగా భూములను సాగుచేస్తున్న రైతులకు పట్టాలు ఇవ్వడం ద్వారా, కారన్ వాలీసు కరుణాకటాక్ష వీక్షణాలతో, జమిందారులకు సిద్ధించిన వరాలు అంతరించిపోయాయి. నాయుడుగారు గట్టి కాంగ్రెసువాది. ఆయన కాంగ్రెసు నాయకులనుండి ఎలాంటి సమర్థతను సంపాదించుకోలేక పోయిన తరువాత, మదరాసు పచ్చయప్ప కళాశాలలో అధ్యాపకులుగా పనిచేస్తున్న నావద్దకు వచ్చి, మిత్రునిగా మారారు. అప్పుడు నేను అన్యాయపూరితమైన జమిందారీ విధానాన్ని రద్దుచేయడంలో, పర్మినెంటు సెటిల్మెంటు పద్ధతిని రద్దుచేసి, పట్టా ప్రాతిపదికపై రైత్వారీ పద్ధతి ప్రవేశపెట్టి, అందులో కౌలుదారులుగా కొనసాగుతున్న వారికికూడా రైతులకు కల్పించే హక్కులను కల్పించకపోతే జాతీయస్థాయిలో అభ్యుదయకరమైన పద్ధతిని మనం సాధించినట్లు కాదు", అని నేను ఆయనకు చెప్పాను. నా అభిప్రాయాలతో ఆయన మనస్ఫూర్తిగా ఏకీభవించారు. అప్పటినుంచి అంటే 1929 నుంచి మేమిద్దరం మంచి మిత్రులుగా ఉంటూ దక్షిణాది రాజకీయ రంగంమీద, సాంఘిక విప్లవకారులుగా ఆయన అఖిలభారత స్థాయిలో రైతాంగ నాయకుడిగా, నేనూ పనిచేస్తూ వచ్చాం! ఆయన వ్యంగ్య ధోరణిలో, అద్భుతంగా ప్రచారం చేసేవారు. ఆయన రాసిన పాటలు సంగీత స్వరాలను మీటుతూవుండేలా పలుకుతూ వుండేవి. ఆయన సంగీతం ఒకవక్క సాంప్రదాయ దరువులను పలికిస్తూ వుంటే, మరొకవక్క రాధాకృష్ణులకు నివేదించుకున్నట్లుగా మనస్సును కరిగించే విధంగా శాంతరసంగా ఆలపిస్తూ వుండేవి. గరిమెళ్ల సత్యనారాయణగారు రాసిన "మాకొద్దీ తెల్లదొరతనమూ" అనే పాటను, కాంగ్రెసు జాతీయవాదులు ఎక్కువగా పాడుతూ వుండేవారు. నాయుడుగారు ఆ బాణీని తీసుకొని "మాకొద్దీ జమిందారీ పద్ధతి" అని పాట రాశారు. ఆ పాట ఒక్కసారిగా బాగా ప్రచారంలోకి వచ్చింది. ఎంతగానంటే జాతీయ గీతంకంటే దీనిని ఎక్కువగా పాడుకోసాగారు. ఎందుకంటే ఘోరమైన రైతుల బాధలను వివరిస్తూ, రక్తం గడ్డకట్టుకపోయే విధంగా ఆయన ఈ పాటలోని పదాలను చేర్చి, కూర్చారు. ఆ తరువాత ఆయన మరో రెండు ప్రముఖ ఆవేశపూరితమైన పాటలను రాశారు. అందులో ఒకటి 'తుమ్మెదా!' అనే మకుటంతో రాస్తే, రెండవదాన్ని చిలకా అనే మకుటంతో

రాసాడు. ఈ రెండు పాటలు కూడా రైతాంగాన్ని తమ జీవనావస్థలనుండి మేల్కొల్పడానికి ఉద్దేశితమైనది.

వేలాదిమంది రైతాంగ యువతీయువకులు ఈ పాటను మృదుమధురమైన శైలిలో బృందావనంలో మీరా పాడినట్లు, భద్రాచలంలో భక్త రామదాసుగారు చేసినట్లు, జమీన్ రైతుపత్రిక, ఆ పద్ధతిలో పాటలను ప్రచురించి, బాగా ప్రచారాన్ని పొందింది.

నాయుడుగారు ఆ పాటలను రాయడం తమకోసం కాదు, తన తృప్తికోసం కాదు. 1930-40 లో అన్ని జిల్లాల్లో మేము ఏర్పాటు చేసిన వందలకొద్ది సభలలో ఆయన పాడుతూ ఉండేవారు. ఆయన కంఠం ఎంతో మధురమైనది, ఉద్రేకపూరితమైంది. వినడానికి ఎంతో సొంపుగా ఉంటుంది. అక్కడ ఆయా సభలలో పాడేప్పుడు, కొన్నికొన్ని స్థానిక విశేషాలను, ఆ పాటల్లోకి చేరుస్తూ, వారి కష్టాలను తెలుగులోకి ప్రజా హృదయాలకు ఆయన చూరగొనేవారు. భూమిమీద నిలబడి ఆయన సర్వసన్నద్ధమైన ధోరణిలో పాడుతూ "ప్రజలను తమ ఆత్మరక్షణకు సన్నద్ధం కండి" అన్నట్టుగా చూపిస్తూ ఉండేవారు. నెల్లూరు జిల్లా రైతు మహాసభ, కాంగ్రెసు మహాసభ కలిసి సంయుక్తంగా 1931 లో అల్లూరులో రామానాయుడుగారు నిర్వహించడం జరిగింది. జమిందార్ల ప్రాంతాలలో ఉన్న రైతాంగ పరిస్థితులను, గురించి విచారించేందుకు ఒక సంఘాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఆ తర్వాత ఆంధ్ర మహాసభచేత కూడా అలాంటి ఓ సంఘాన్ని ఆయన ఏర్పాటుచేయించగలిగారు. దానికి కూడా మేమిద్దరం అధ్యక్ష, కార్యదర్శులం! కోవూరుకు చెందిన శ్రీ ఆర్.యం.శర్మ గారొక ముఖ్య సభ్యులు. 1931లో మా కమిటీలు, విచారణ ప్రారంభించి, పెద్ద జమిందారీలు ప్రతిదానికీ విడివిడిగా నివేదికలు తయారుచేసి అప్పటికి బాగా ప్రచారంలోవున్న తెలుగు జాతీయ దిన పత్రికలలో "ఆంధ్రప్రభ", "ఆంధ్రపత్రిక" లలోను, ఇంగ్లీషు పత్రికలైన "స్వరాజ్య", "ఇండియన్ ఎక్స్‌ప్రెస్" ల లోను, ప్రచురించడం ప్రారంభించాయి. బొబ్బిలి రాజాగారి నాయకత్వంలో, మద్రాసు ప్రభుత్వంలో అప్పుడు అధికారంలో ఉన్న జమిందారులు వీటివలన రాబోతున్న ప్రమాదాలను గ్రహించి, మా పర్యటనలు, విచారణలకు పత్రికలలో నివేదికల ప్రచురణలు జరగకుండా చూసేందుకు గట్టి ప్రయత్నాలు చేశారు. వారు మా స్థానిక అభిమానుల ద్వారా ఎక్కువ భూములు కలిగిన పెద్ద రైతులను మా విచారణలో పాల్గొనకుండా నివారించారు. వారిచేత మాకు వ్యతిరేక ప్రదర్శనలు చేయించారు. తమ బాధలను మాకు చెప్పుకున్న రైతులపై వారు ప్రతీకారచర్యలకు పూనుకున్నారు. వారు అనేకమంది న్యాయవాదులను, పత్రికా రచయితలను, ప్రజాసంబంధాల అధికారులతో సమావేశాలు ఏర్పాటుచేసి, వారి ద్వారా మా సమాచారానికి వ్యతిరేకంగా ప్రతివాదాలను వినిపించడం ప్రారంభించారు. కొన్ని దిన వారపత్రికలకు తాము ఇస్తున్న ఆర్థిక సహాయాన్ని ఉపసంహరించుకొని వాటి మీద వత్తిడి తీసుకొచ్చారు. జమిందారుల జులుంను, హెచ్చరికలను నాయుడుగారు లక్ష్యపెట్టేవారు కాదు. నేనుకూడా అన్నిటికి సిద్ధమై, వున్నందుకు ఆయన చాలా సంతోషించారు.

ఒక సంవత్సరంలోగా, దక్షిణ భారత దేశంలోనే కాక, ఉత్తరాది ప్రాంతాలలోనూ, రైతులకు వ్యతిరేకంగా జమిందారులు కొనసాగిస్తున్న చట్టరహిత కార్యకలాపాలను, కఠినచర్యలను,

మేము బాగా ప్రజల దృష్టిలోకి తీసుకొచ్చాం! 1933లో నా రిపోర్టును, నేను ఇంగ్లీషులో "ఎకనమిక్ కండిషన్సు ఆఫ్ జమిందారీ సెజంట్స్" అనేపేరుతో ప్రచురించగా, నాయుడుగారు మా వారపత్రికలో తెలుగులోకి మార్చారు. అనుకోకుండా మాతోటి కాంగ్రెసు కార్యకర్తలు, ఒకరు, కలిసి బాకుపోట్లకు నాయుడుగారు దెబ్బతిన్నారని చెప్పారు. బొంబాయి అఖిల భారత కాంగ్రెసుకమిటీ సమావేశంలో జమిందారీ రైతులను గురించి, నేను మాట్లాడినప్పుడు, కరాచీ కాంగ్రెసు సభలలో ప్రాథమిక హక్కుల్ని గురించి, మేము చర్చించినప్పుడు, వెంకాగారంతటి వారు మమ్మల్ని ఎదుర్కొని, జమిందారులకు వ్యతిరేకమైన పోరాటాలను జరపడం ద్వారా జాతీయ పోరాటానికి ఆటంకాలు కలుగజేయవద్దని అన్నారు. ఎందుకంటే అప్పుడు కాంగ్రెసును సమర్థిస్తున్న వారిలో ఎక్కువమంది జమిందారులు ఉన్నారు.

వెంకటగిరి జమిందారులు ప్రైవేటు ఆస్తులుగావున్న అడవులు, కొండలు, నదులు బంజరులవంటి అస్పాధీన భూముల విషయంలో, ఫారెస్టు అధికారుల జులుంకు వ్యతిరేకంగా వెంకటగిరి రైతుల సత్యాగ్రహాన్ని, మేము నిర్వహిస్తున్నప్పుడు నేను అరెస్టు గావించబడ్డాను. వెంకటగిరి జమిందారులకు అనుకూలంగా ఉన్న, కొంతమంది వెల్లూరుజిల్లాకు చెందిన కాంగ్రెసు నాయకులు, ఈ పోరాటంలో కాంగ్రెసుకు ఏమీ సంబంధం లేదని, కరపత్రాలు వేసి పంచిపెట్టారు. మొక్కవోని ధైర్యసాహసాలతో, ఆ సమయంలో నాయుడుగారు ఆదిమజాతి తెగల నాయకులు, కాంగ్రెసు నాయకులు, ప్రముఖ న్యాయవాది అయిన శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారితోనూ, శ్రీమతి భారతీదేవిగారితోనూ, కలిసివచ్చి ఆ ఉద్యమ విజయానికి కృషిచేశారు. కొన్ని మాసాలపాటు, వెంకటగిరి రైతాంగం చేత, సత్యాగ్రహాన్ని నిర్వహింపజేయగలిగి, జమిందారుల్ని, ప్రభుత్వాన్నిగూడ దిగివచ్చేలా చేసుకొని, అటవీ భూములలో తమ పశువుల్ని స్వేచ్ఛగా మేపుకొనే హక్కుతోపాటు మరికొన్ని ఉపయోగాలనో సాధించుకోగలిగారు. ఆ రోజుల్లో వారి సమావేశాలు మహారాజాగారి ముఖ్యపట్టణమైన వెంకటగిరిలో వుండేవి. జమిందారులు వియమించిన రౌడీలు శ్రీమతి భారతీదేవిగారి తల పగలగొట్టారు. నాయుడిగారిని చితకబాదారు.

ముసగాల జమిందారీ ప్రాంతాలలో మేము విచారణ జరుపుతున్నప్పుడు, మాకు మర్యాదనివ్వకుండాను, సౌకర్యాలివ్వకుండాను, అక్కడి రైతాంగాన్ని జమిందారుగారు అదుపుచేశారు. ఒక రాత్రి ధైర్యంగా తన ఇంట్లో ఉండవిచ్చినందుకుగాను కరణం రంగారావుగారు కొన్ని సంవత్సరాల కాలం ఆ వూరును వదిలిపెట్టి బయట ఉండవలసి వచ్చింది. ఆయన కృష్ణాజిల్లాలోని జమిందారీ ప్రాంతాన్ని పర్యటిస్తున్నప్పుడు, కొన్నిసార్లు ప్రాణానికి హాని కలిగించే పరిస్థితులను ఎదుర్కొనవలసి వచ్చింది. అలాంటి ప్రయత్నాలే బొబ్బిలిలో పర్యటిస్తున్నప్పుడు నాపైన జరిగాయి. ఎందుకంటే అప్పుడు మద్రాసు రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న బొబ్బిలి రాజాగారు నా పర్యటన ఆయన ప్రతిష్టకు గొప్ప భంగకరంగా తలపోసి గూండాలను, బొబ్బిలిలోనూ, చుట్టుప్రక్కల ప్రాంతాలలోను నా సభలు జరగకుండా, ఎన్నో విధాలుగా ఆటంకాలను సృష్టించారు. జమిందారు, అనుచరులు నన్ను వశపరచుకోవడానికి ప్రయత్నాలు, విఫలమైన తర్వాత నన్ను గాయపరిచేందుకు, కాల్చి విరిచేందుకు, నదిలో తోసివేయటకు నేను నదుల గట్లవెంట గ్రామాలకు ప్రయాణం చేసినప్పుడు ప్రయత్నాలు చేశారు. ధైర్యవంతులైన రైతులు

ఆ సమయంలో నాకు తోడుగా నిలిచారు. 1920-22 లో శిస్తు నిరాకరణ ఉద్యమంలో బాగా కీర్తిసంపాదించుకొన్న చావల గ్రామ రైతాంగాన్ని గురించి, సాహసవంతమైన రైతాంగ యోధులైనవారి గురించి నాయుడుగారు చక్కటి పాటలు, పద్యాలు వ్రాసారు. 1920-22 శిస్తునిరాకరణ ఉద్యమంలో నాయుడుగారు రైతాంగాన్ని గురించి, సాహసవంతులైన రైతాంగయోధుల్ని చావల గ్రామరైతాంగం ఉధృతమైన పోరాటాన్ని నడిపింది. ఎక్కడైనా కాంగ్రెసు మహాసభలుగానీ, కమిటీ సమావేశాలుగానీ, జరిగినప్పుడు నాయుడుగారి జమిందారీ రైతుల కష్టనష్టాలకు, కారణమైన జమిందారుల మానవాతీతంకాని చర్యలను గురించి, మాట్లాడుతూ వుండేవారు. రైత్వారీ ప్రాంతంలోఉన్న రైతులు ఒక బ్రిటీషు అధికారుల నుండి మాత్రమే బాధల్ని అనుభవిస్తున్నారు. జమిందారీలో వుండే రైతులు మాత్రం బ్రిటీషుపాలకులకంటే, జమిందారుల నుండి ఎక్కువగా బాధలనుభవిస్తున్నారు. జమిందారీ రైతాంగానికి ఎంతోకొంత సహాయం చేయక తప్పదనే పరిస్థితి ఆంధ్రా కాంగ్రెసు నాయకత్వం రాసాగింది. అయితే యిందులోకి పెద్ద నాయకులెవరూ, ముందుకు రాలేదు. అపుడు 1933-34 లో మహాత్మాగాంధీగారు ఆయన పర్యటనలో భాగంగా ఆంధ్ర దేశానికి వచ్చారు. అప్పుడు నాయుడుగారు ఉపయోగించుకొని, వెంకటగిరి జమిందారులవల్ల దెబ్బతిన్న రైతులను ఆయనకు చూపెట్టారు. శ్రీమతి భారతీదేవి ఆ సమయంలో ఆయనకు గాండీవిగా ఉపయోగపడింది. గాండీవం మహా భారతయుద్ధంలో అర్జునుడు ఉపయోగించిన ఆయుధం, ఆయన రైతు నాయకులు శ్రీ పి.గోవిందరెడ్డి వంటి బాధితులను చూపిస్తే భారతీదేవి బాధితురాలైన రైతాంగ మహిళలను గాంధీజీకి చూపెట్టారు. జమిందారుల దౌర్జన్యాలనుండి రైతాంగాన్ని కాపాడవలసిందిగా, అంతాకలిసి, గాంధీగారిని ప్రార్థించారు. ఆ విషయంపైన దృష్టిని మళ్ళించేందుకు నాయుడుగారు తిరిగి పాటలను పాడారు. గాంధీగారు ఏమిటీ అని అడిగారు. అది రైతుల భజనపాటఅని, తాము అనుభవించే బాధలను తమకు విన్నవించుకుంటున్నామని అన్నారు. అప్పుడు రామనాయుడుగారు ఆ పాటను పెద్దగా పాడమని అడిగారు. నాయుడుగారు హృదయాలను కరిగించే విధంగా పాడారు. రైతుల కోసం పంపబడిన దేవతగా ఆ సమయంలో కనిపించారు. ఆషాట గాంధీజీని కూడ కదిల్చింది. అప్పుడు గాంధీజీ "రంగా! నాయుడు భారతదేశ సత్యాగ్రహ పోరాటానికి విజయం చేకూరుస్తారు" అని అన్నారు. జమిందారీ వద్దని తప్పకుండా అంతరించాలి" అని అన్నారు. నాయుడుగారి విజయానికి అది పరాకాష్ఠ. లార్డ్ విల్లింగ్టన్ గారు ఎన్నికలను ప్రవేశపెట్టడంలో, 1938 లో కేంద్ర శాసనసభకు జరుగుతున్న సాధారణ ఎన్నికలు, కాంగ్రెసు పార్టీకి ఒక సవాల్ గా వచ్చాయి. నెల్లూరు, గుంటూరు జిల్లాలకు కాంగ్రెసు అభ్యర్థిగా నన్ను నిర్ణయించారు. వెంకటగిరి రాజాగారు, ముఖ్యమంత్రిగా ఉన్న టంగుటూరి ప్రకాశంగారు ఏకమై, నామీద అభ్యర్థిని నిలబెట్టారు. ఆ ఎన్నికలలో పత్రికారచయితగా నాయుడుగారు తన ప్రచార సామర్థ్యాన్ని చూపెట్టారు. వారం, వారం ఆయన పాటలలో, పద్యాలతో, కార్టూన్ లతో, జమిందారుల అభ్యర్థికి వ్యతిరేకంగా గట్టి ప్రచారం చేశారు. ఆ ఎన్నికలలో నా గెలుపుకు కవిగా, రైతాంగ నాయకునిగా, ఆయన చేసిన కృషే ప్రధాన కారణం. ఆ సమయంలో మా వారపత్రిక కూడా బాగా ప్రచారంలోకి వచ్చి, శక్తివంతమైన పత్రికగా తయారైంది. జమిందార్లకు వ్యతిరేకమైన మా పోరాటాన్ని, నేను అఖిల భారత స్థాయికి తీసుకెళ్లాను. కేంద్ర శాసనసభ వేదికపైనా, అఖిల భారత కాంగ్రెసు కమిటీలో

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

జమిందారీ పద్ధతికి, వ్యతిరేకంగా నేను పోరాడగలిగాను. ఆ తరువాత 1936-39లో ఏర్పడిన కాంగ్రెసు మంత్రివర్గాలు, అఖిల భారత కిసాన్ కాంగ్రెసు, వెంకటగిరిలో గాంధీగారు చెప్పినమీదట, పర్మినెంటు సెటిల్మెంటుకు వ్యతిరేకంగా పోరాడేందుకు, కాంగ్రెస్ మంత్రివర్గాలకు సంసిద్ధంగావించబడ్డాయి. 1934, 36 ఎన్నికలలో జమిందారులు, వాణిజ్యవేత్తలు, ఉభయులు, కలిసికూడ, విజయాన్ని సాధించలేకపోవడంతో, బ్రిటీషువారు పరిస్థితులను అర్థంచేసుకొని పర్మినెంట్ సెటిల్మెంటుకు అనుకూలంగా వున్నవారి సమర్థనను వదిలి వేసుకున్నారు. అప్పుడు జమిందారీ విధానపు మృదంగాన్ని వినగలిగాం! ఆ గౌరవం అహింసాయుత, సామాజిక విప్లవపరంగా పోరాడిన నెల్లూరు రైతాంగనేత, సాహసవంతులైన, చెన్నానదీ ప్రాంతకవి పానకా కుటుంబం యొక్క్ ప్రముఖ సలహాదారు, భారతీదేవిగారి సహచరుడు, నా స్నేహితులు రామానాయుడి గారిది.

జమిన్ రైతువారపత్రిక కార్యాలయ భవనానికి 'రంగాభవన్' అని పేరువుంచి నన్ను ఉన్నతంగా గౌరవించారు. జమిందారీ పద్ధతి దాని భూస్వామ్యరీతులను, రాజులు, రాజరికాలంగాక, మొత్తంమీద, చరిత్ర పుటలలోకి వెళ్లిపోయాయి. అయితే రామానాయుడు, శ్రీమతి భారతీదేవి, శ్రీమతి పానకా కనకమ్మ, నేనూ మేమంతా చేసిన కృషి, శాశ్వతంగా నిలిచి వుండగలదు. అభ్యుదయం వైపు నడిచే యీ చారిత్రాత్మకమైన గమనంలోకి నన్ను లాక్కొచ్చిన నాయుడిగారికి నేను కృతజ్ఞుణ్ణి!

శ్రీ జవహర్లాల్ నెహ్రూ రాజ్యాంగంలోని, ప్రాథమిక ఎన్నికలలో 30, 31 వ సూత్రాలను సవరించి, రైతుల భూములనుగూడ ఎస్టేట్ రద్దుచట్టపరిధి లోకి తీసుకువచ్చి, రైతులను, వారి వృత్తు లను నష్టపరిచేందుకు చేసిన ప్రయత్నాన్ని నాయుడుగారు కూడా తప్పక వ్యతిరేకిస్తారని నేను చెప్పగలను. రాజ్యాంగం 17వ సవరణ రైతుల భూములన్నింటినీ ఎస్టేటు "అనే నిర్వచనం కిందికి తీసుకొచ్చి జమిందారులు తాలూకాదార్లను రద్దుచేసినప్పుడు వారితో వ్యవహరించినట్లు నాన్, రైతులతో కూడ వ్యవహరించేందుకుగాను వీలు కల్పించింది. దానికి వ్యతిరేకంగా, నేను ప్రారంభించిన పోరాటాన్ని కూడా నాయుడుగారు బలపరుస్తారని నాకు తెలుసు. అలాగే సీలింగు పరిధిలోకి రాని రైతాంగ భూములకు వర్తించకుండా ఉండే విధంగా, రాజ్యాంగ పరిధిలోనే పోరాడి, మార్పు సాధించినందుకు, నన్ను అభినందిస్తారని నాకు తెలుసు. దానిని సాధించడానికి మేము ఎంతో శ్రమపడి, కాంగ్రెసు పెద్దలకు మొరపెట్టుకొని పోరాడి, దానిని సాధించవలసి వచ్చింది. రైతు హృదయంలో నాయుడిగారి స్థానం శాశ్వతమైంది. ఆయన స్వయం వృత్తులు అంటే గౌరవం, అది సోషలిస్టు, ఆర్థిక వ్యవస్థకు మూలము ఆయన నమ్మకం. దాని రక్షణకు సహకరించేందుకు దానిని శక్తివంతం గావించేందుకు అది ఎప్పుడూ బలహీనపడకుండానూ తోసివేయబడకుండాను ఉండాలని నేను కోరుకుంటున్నాను.

28

కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి

సామాజిక విప్లవకం

(కవిరాజు త్రిపురనేని రామస్వామిచౌదరి కృష్ణాజిల్లా అంగలూరు గ్రామంలో 15-1-1887 న ఒక రైతు కుటుంబంలో జన్మించారు. మచిలీపట్నంలో విద్యాభ్యాసం గావించారు. ఆయన చిన్నవయస్సు లోనే పద్యరచన, నాటకరచన చేశారు. డబ్లిన్ లో విద్యాభ్యాసం చేసి, 1917 లో బారిష్టరు పట్టా పుచ్చుకున్నారు. తెనాలిలో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించారు. విదేశాలనుంచి తిరిగివచ్చిన తరువాత 1918 లో ఆంధ్రదేశంలో ఆత్మగౌరవ ఉద్యమాన్ని ప్రారంభించారు. తెలుగుభాషలో అనేక గ్రంధాలు రచించి, "కవిరాజు" బిరుదుతో సత్కారం పొందారు. జాతియోద్యమాన్ని గౌరవించారు. సాంఘిక విప్లవ ప్రముఖస్థానాన్ని పొందారు. 1943 లో తనువు చాలించి స్వర్గస్థులైనారు. ఆయన జ్యేష్టపుత్రులు గోపీచంద్ గారు కూడా తెలుగు భాషలో ప్రఖ్యాత రచయితగా కీర్తిప్రతిష్టలనార్జించారు.

- ఎడిటర్)

గుంటూరుజిల్లా తెనాలి పురపాలక సంఘానికి ఒకప్పుడు అధ్యక్షులుగా పనిచేసిన బారిష్టరు త్రిపురనేని రామస్వామిచౌదరి, ఆంధ్రదేశంలో సామాజిక ఆత్మగౌరవ ఉద్యమానికి, తండ్రివంటివారు. ఆ తరువాత దక్షిణ భారతదేశంలో ఆత్మగౌరవ ఉద్యమ ప్రారంభానికి ఇది బాటలు వేసింది. శ్రీరామస్వామి పలెనే రాజీలేని సైతన్యవంతులైన నాయకులు శ్రీ కందుకూరి వీరేశలింగం, పెరియార్ ఇ.వి.రామస్వామి నాయకర్, శ్రీ అన్నాదురైగారలు దీనిని దక్షిణ భారతదేశంలో బాగా విస్తరపరిచారు. శ్రీ వీరేశలింగం పునర్వికాసోద్యమాన్ని ప్రారంభించి, తద్వారా ఆంధ్రదేశం సాంఘికదృష్టిని రగిల్చి, నాయకులను మేలుకొల్పి, తెలుగుసాహితీరంగంలో జవసత్వాలను నింపి, మత వ్యవహారాలలో హేతువాదాన్ని జొనిపి సాంఘికాభివృద్ధి సాధనకోసం కృషిచేస్తూ ప్రపంచ పరిణామాలకు దగ్గరగా ఆంధ్రులను తీసుకెళ్లారు. రామస్వామి చౌదరిగారు వీరేశలింగంగారికంటే, అనేక అడుగులు ముందుకు వెళ్లారు. సాహితీ ప్రక్రియలను వాడుకొని, హైందవ చాందస వాదులు పూజారులపై, వారి అంధ్రంపై నడవటాన్ని ప్రశ్నిస్తూ, స్త్రీలకు, కీందితరగతులవారికి, అణచివేయబడిన వర్గాలకు, హరిజనులకు సమానంగా సాంఘిక, మతపరమైన హక్కులుండాలని, ధైర్యంతో ఆయనే వాదించారు.

సాంఘిక విప్లవంతోపాటు, అనేక మతసిద్ధాంతాలను వారి బోధనలను ధైర్యంగా ఎదుర్కొంటూ పీరోహిత వర్గాన్ని, పురాణకర్తల ప్రాచీన పుక్కిటి పురాణాలు, దశావతార కధలు, పురాణ పురుషుల చరిత్రలు హేతుబద్ధంగా, మానవతా దృక్పధంతో విడమర్చి, అవి ఎలా యదార్థమో రుజువులతో చూపించవలసిందని, వాటి వాస్తవాలను రుజువుపరచవలసిందిగా ఆయన సవాల్ చేశారు. ఆయనతో సమానులైన వీరేశలింగం గారిలాగా, ఆయన తన కవిత

శిల్పకౌశల్యాన్ని, భావవ్యక్తీకరణ సామర్థ్యాన్ని, తెలుగులో చక్కగా వినియోగించుకొని భాష్యకారులతో, సూత్రదారులతో పోరుసలుపుతూ, మన ప్రాచీన చరిత్రలోని శృంగార గాథలను ఎత్తి చూపి ఎద్దేవా చేశారు. కృత్రిమంగా, స్వార్థ దృష్టితో సృష్టించిన కులాల సంకుచితత్వాన్ని నిరసించారు.

రామస్వామిగారు తమ యూరపు పర్యటనలో బ్రిటీషువారు, ఫ్రెంచివారు, తదితర యూరోపియన్ సామ్రాజ్యవాదులు, మెక్సికో, ఆఫ్రికా, ఆసియా ప్రజలను మోసగించి, ఎలా వారి భూములను స్వాధీనం చేసుకున్నారో, ఆ సందర్భంలోనే తమ కవిత్వాల ద్వారా తమ ఐరోపా నాగరికత సంస్కృతి ఆయా ప్రజల సంస్కృతి నాగరికతలకన్నా ఎంత గొప్పదో, అని తెలియజేస్తూ, క్రమేణా వారి నాగరికత, సంస్కృతిని నాశనం చేసినట్లు తెలుసుకున్నారు. ఇందులో ప్రాచీన ఆర్యుల దండయాత్రల సందర్భంలో అనుసరించిన పద్ధతికి, యిప్పటికీ సామ్రాజ్యవాదులు అవలంభిస్తున్న విధానాలకు చాలా దగ్గరి పోలికలున్నట్లు ఆయన గ్రహించి విస్మయం చెందారు. హేతువాద దృక్పథంతో ఆయన గుడ్డిగా ప్రశ్నించడానికి వీలులేని వాటిగా, హిందూ ప్రజలు నమ్ముతూ అనుసరిస్తున్న పురాణాలను ఆయన తిరిగి పరిశీలించ సాగారు. మనం నమ్ముతున్నట్లుగా శ్రీరాముడు భగవంతుని అవతారంకాదని, ఆయన బలవత్తరమైన శత్రువైన రావణాసురుడు నిజానికి రాక్షసుడు కాదని, మహాభారత వీరులైన పాండవులు అనుసరించిన విధానాలన్నీ నవ్యమైనవి కావని, యుద్ధంలో ఓటమిపాలైన కౌరవులు పూర్తిగా దుష్టులుకాదని ఆయన నిరూపించిసాగారు. ఆ విధంగా ఆయన హిందువులు బాగా విశ్వసించే భారత, రామాయణాలను తిరిగి శోధిస్తూ పునరాలోచింపచేయసాగారు.

చిన్నతనం నుంచి నేను చదివిన పౌరాణిక గ్రంథ పరిచయం ద్వారా, శ్రీరాముడు, శ్రీకృష్ణుడు భగవదావతారులుగా భావిస్తున్న నేను 1918 లో మొదటిసారిగా రామస్వామి చౌదరిగారి పుస్తకాలలో రాముడు, కృష్ణునికి సంబంధించిన కథలను తిరిగి చదివి, మా గురువు బ్రాహ్మణేతరులైన శ్రీ ఆంజనేయులు గారితోనూ, నా హైస్కూలు ఉపాధ్యాయులు బ్రాహ్మణులైన శ్రీ వెంకటయ్యగారితోనూ, చర్చిస్తూ, శ్రీరాముడు పూజారుల పక్షాన నిలిచి జపతపాదులాచరిస్తూ, నిష్క్రమంగా జీవిస్తున్న శంబుక మహర్షిని వధించడం తప్పని గ్రహించాను. ఆవిధంగా హృదయాలను శోధించే అనేక ఆలోచనలను, నాలో రేకెత్తించింది. నా యూరపు యాత్రలు రామాయణ, మహాభారతాలమీద, రామస్వామి చౌదరిగారందించిన వివరణలు, మన నమ్మకాల గురించి, తిరిగి శ్రద్ధతో పునరాలోచించవలసిన అవసరాన్ని నాకు కలిగించాయి. అందువల్ల సాంప్రదాయపండితులు, పూజారులు, పౌరాణికులు, భాష్యకారులు మొదలైన మన పురాణాలను వివరించే వారంతా రామస్వామిగారు 1920, 1930 సంవత్సరాల మధ్యకాలంలో, వారి ప్రధాన నమ్మకాలపైన, బోధనలపైన అవిశ్రాంతంగా చేస్తున్న విమర్శలతో గుక్కతిప్పుకోలేకుండా పోయి, తలక్రిందులైనారు. ఆవిధంగా రామస్వామిగారొక్కరే, ఒకే కంఠంతో, వారినంతా ఎదుర్కొంటూ ఉంటే, మొత్తం బ్రాహ్మణసమాజమంతా, శక్తివంతమైన వారి రాతల ద్వారా, దూషణలతో కూడిన కరపత్రాల ద్వారా, ప్రతిచోటా ప్రజాసభలుపెట్టి, ఒక రాక్షసుడు అవతరించాడని ఆయన్ను నిందించసాగింది. ఆయన్ను శపించవలసిందని అనేకమంది పూజారులు దేవుళ్లను, దేవతలను ప్రార్థించసాగారు. వారిలో కొంతమంది ఆయనను, ఆయన అనుచరులను నాశనం చేసేందుకు

మంత్రోచ్చారణలు చేశారు. అదేవిధంగా శ్రీరాజారామమోహనరాయ్ శ్రీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్, శ్రీ వీరేశలింగంగార్లుకూడా అంతం కావాలని వారు క్షుద్రమంత్రాలను చదవసాగారు.

తనకు ముందున్న ఆ విప్లవకారుల్లాగే, రామస్వామి చౌదరిగారు కూడా పూజారుల శాపాలను, పండితుల ఖండనమండనలను లెక్కించక నిర్భయంగా తన విప్లవాత్మకమైన రచనలను, కృషిని కొనసాగించారు.

1917-18 సంవత్సరాల నాటికి బ్రాహ్మణేతర ఉద్యమం ఆయనకు సహాయపడేందుకు అందుబాటులో కొచ్చింది. రాజకీయ దృష్టికలిగిన ఆ ఉద్యమ నాయకులు అడుగున పడివున్న బ్రాహ్మణేతర వర్గాలను, వారి ప్రయోజనాలను పరిరక్షించాలనే సంకల్పంతో ముందుకు వచ్చారు. అయితే రామస్వామి చౌదరిగారు జస్టిస్ పార్టీవారి రాజకీయ వేదికతో మాత్రం పూర్తిగా కలిసేందుకు ఆసక్తి చూపించలేదు. తన తోటి విద్యార్థిమిత్రులైన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ, శ్రీ వి.వి.గిరి శ్రీ డి.గోపాలకృష్ణయ్య ఇతర భారతీయ విద్యార్థులతో కలిసి, ఇంగ్లండులో వున్న జాతీయ స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛను రుచి చూచిన తరువాత బ్రిష్ స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్న తరువాత, డాక్టర్ అంబేద్కర్ గారిలాగే ఆయన స్వాతంత్ర్యాన్ని అభిమానించారు, ప్రేమించారు. సాంఘిక, రాజకీయ స్వాతంత్ర్యాలు రెండూ ఒకేమారు లభించాలని ఆయన భావించారు. ఆ రెండు విప్లవ లక్ష్యాలమధ్య ఆయన రోజురోజుకూ ఊగిసలాడసాగారు. జస్టిస్ పార్టీ సాంఘిక విప్లవానికి ప్రాధాన్యతను ఇచ్చినప్పుడు, ఆయన కాంగ్రెసువారితో నడిచేందుకు ప్రాధాన్యత నిచ్చారు.

కాంగ్రెసు వారు, వారి మిత్రులు సాంఘిక విప్లవాన్ని ప్రక్కనుంచదలచినప్పుడు ఆయన వారితో విడిపోయారు; అందువల్ల, ఆయన తన ఆత్మగౌరవ ఉద్యమాన్ని కాంగ్రెసుపార్టీ వారిని, జస్టిస్ పార్టీవారిని కూడా కలుపుకొని స్వతంత్ర వేదికగా నిర్మించారు. ఆయన అనేకమంది బ్రాహ్మణేతర స్త్రీ పురుషులకు పురాణాలను పఠించడంలోనూ, హిందూ స్మృతులను, శాస్త్రాలను హేతువాద దృక్పథంతో చదవడంలోనూ శిక్షణ నిచ్చారు. హనుమాన్, ఆయన సహచరులు, కోతులు కాదని, వారు దక్షిణ భారతదేశానికి చెందిన ఆటవిక ప్రజలని, ఆత్మగౌరవ ప్రబోధాత్మకమైన వివరణలతో, పురాణాలను వారికి వివరిస్తూ బోధించసాగారు.

ఆయన ఇంగ్లండునుండి తిరిగి వచ్చిన తరువాత 1917 వ సంవత్సరంలో మా నిడుబ్రోలు గ్రంథాలయ సాంవత్సరికోత్సవానికు అధ్యక్షత వహించవలసిందిగా ఆయనను ఆహ్వానించాం. ఆయన ప్రసంగాన్ని నేను బాగా అభిమానించాను. అప్పటికి ప్రఖ్యాతులైన తిరువతి వెంకట కవుల గారి ప్రఖ్యాత కవిశిష్యులైన, వారి ప్రసంగాన్ని ఆలకించడానికి చుట్టుపక్కల తాలూకాలనుంచి కూడా వచ్చిన పూజారులు, పండితులు కూడా బాగా మెచ్చుకున్నారు. మా హైస్కూలు ఉపాధ్యాయులు, నా ప్రై వేటుమాష్టారు ఆంజనేయులుగారు, వీరేశలింగంగారి బోధనల ననుసరించి, నేను, గ్రంథాలయాలను ప్రారంభిస్తూ బాగా సంఘసేవ చేస్తున్నానని, అంటరానితనాన్ని వ్యతిరేకిస్తూ, అవిద్యా నిర్మూలన కోసం బాగా కృషిచేస్తున్నానని చెప్పటంతో, ఆయన నామీద ఎక్కువ శ్రద్ధ కనపరిచారు.

అనేక సాంఘిక ధోరణులతో కూడిన విమర్శనలతో ఉన్న ఆయన రాసిన గ్రంథాల, నాటకాల రాతప్రతులను నాకు ఇచ్చారు. మన పురాణాలలోని రాతలకు, విశ్వాసాలకు వ్యతిరేకంగా, ఆ రోజుల్లో ఆయన రాస్తున్న రచనలను బాగా చదివాను. ఆ తరువాత గుంటూరు, కృష్ణాజిల్లాల్లో ఆయన అధ్యక్షతన జరిగే అన్ని సభలకు నేను హాజరవుతుండేవాడిని. తెలుగులో ఆయన సామర్థ్యం కలిగిన గొప్ప ఉపన్యాసకులు. చక్కటి వాగ్ధోరణి కలిగిన మంచి పండితులు. గ్రామీణ ప్రాంతాల ప్రజలలో దీర్ఘకాలంగా పేరుకుపోయి ప్రశ్నించడానికి వీలులేకుండా ఉన్న, హిందూ విశ్వాసాలపై ఆయన చేస్తున్న ధైర్యవంత మైన విమర్శనలను చూసి ఆకాలంలోని అందరి యువకుల్లాగే, నేను కూడా వాటి ప్రభావానికి బాగా లోనయ్యాను. నేను యూరపు వెళ్లిన తరువాత అక్కడ ఇంగ్లండు, ఫ్రాన్సు, జర్మనీ, స్విట్జర్లాండు, ఇటలీవంటి దేశాల్లో ప్రజలు జాతీయ వర్ధంతులననుసరించి, వారి మత సాంఘిక విషయాల్లో ఎలా అభివృద్ధిని సాధిస్తున్నారో! ఎందుకంటే అక్కడ అంటరానితనం లేదు. అవిద్య లేదు. స్త్రీలను అణగదొక్కే విధానం ఆచరణలో లేదు. ఇవన్నీ చూసిన తరువాత రామస్వామిగారి బోధనలపై నా విశ్వాసం మరింతగా బలపడింది.

1918 లో మా గ్రామంలో రాష్ట్రస్థాయి సంఘ సంస్కరణల సభ జరిగినప్పుడు, వారు రాసిన నాటకం 'కురుక్షేత్ర' ప్రదర్శించడం జరిగింది. అందులో నేనుకూడా ఒక చిన్నపాత్రను ధరించాను. ఆ నాటకంలోని ప్రధాన కథాంశం శ్రీకృష్ణ భగవానుడు పాండవపక్షం వహించి, అన్యాయమైన రీతిలో వారిని సమర్థించాడని, పాండురాజా రెండవ కుమారుడై నందువల్ల ఆయన బిడ్డలు పాండవులకు రాజ్యభాగం హక్కులేదని, అందువల్ల వారి రాజ్యభాగాన్ని ఇవ్వమని కౌరవులు చెప్పటం సబబైనదేనని చెప్పటం- అప్పటినుంచి ఆంధ్రదేశంలోని అనేకమంది నాటకకర్తలు, కవులు ఆయన మార్గాన్ని అనుసరిస్తూ శ్రీకృష్ణుని ఇష్టసఖుడైన అర్జునునికి వ్యతిరేకంగా కర్ణుని వీరత్వాన్ని శ్లాఘిస్తూ, రచనలు చేయసాగారు. ఆయన నాటకాలకు ముందు రాసిన ప్రస్తావనలను ఆయన బెర్నార్డుషా గారి పద్ధతిలో మంచి పాండితీ ప్రబోధంతో నిండి ఉండేవి. ఆ తరువాత ఆయన ఆంధ్రా బెర్నార్డుషాగా గుర్తింపుపొందారు, గౌరవాన్ని సంపాదించుకున్నారు.

1918-20 సంవత్సరాల మధ్య ఆయన అనుచరునిగానూ, 1930 వ సంవత్సరంలో ఆయనకు సహచరునిగానూ, ఆ తరువాత వారి మిత్రునిగానూ ఉండగలగడం నా అదృష్టంగా నేను భావిస్తాను. కాంగ్రెసులోగానీ, జస్టిస్ పార్టీలోగానీ చేరివుంటే, ఆయన ఎక్కువ ప్రయోజనాలను పొంద గలిగివుండేవారు. ఆయన రాజకీయాలను పక్కకుపెట్టి, తన కవితాశక్తినంతా ప్రజలను, సాంఘికంగా ఉన్నత స్థితిలోనికి తీసుక రావడానికై వినియోగించారు. స్త్రీలు, హరిజనులు వెనుకబడిన తరగతుల వారిని క్రూరంగా అణచివేస్తున్న పూజారుల దౌష్ట్యాలనుంచి, హైందవ మతపరమైన మూఢనమ్మకాల నుంచి బయటపడవేసేందుకు ఆయన తన మానసిక సామర్థ్యాన్నంతా వినియోగించారు.

గాంధేయ సహాయ నిరాకరణోద్యమం, తీవ్రంగా ప్రజలనుకదిలించడానికి ముందు, గుంటూరు, కృష్ణా, గోదావరిజిల్లాలలో రామస్వామి చౌదరిగారి ఉద్యమం మహోధృతంగా కొనసాగింది. గానీ అది పూర్తిగా కాంగ్రెసుకు వ్యతిరేకంగా వుంటూ, పెరియార్ ఇ.వి.రామస్వామి

నాయకర్‌గారి నాయకత్వంలో జస్టిస్ పార్టీ సహకారంతో కొనసాగింది. ఆయన దానితో సంబంధాన్ని కొనసాగించారు. ఆయన రచనలు ఆయన అనుచరులు దానిని విజయవంతం చేశారు. జాతీయోద్యమానికి ప్రాధాన్యతనిచ్చే విషయాన్ని ఆయన విస్మరించలేనందువల్ల, తాను పూర్తిస్థాయిలో అందులో కలిసి పనిచేయలేక పోయారు. 1918 లో విజయవాడలో జరిగిన ఆంధ్రప్రాంత బ్రాహ్మణేతర జాతీయవాద మహాసభకు ఆయన అధ్యక్షత వహించి, కాంగ్రెసు కోరికైన స్వాతంత్ర్య నినాదాన్ని ఆయన సమర్థించారు.

ఆయన భాషావేత్త, సాహితీవరులు. కృష్ణాజిల్లా అంగలూరులోని కవితా సాంప్రదాయంకలిగిన రైతుకుటుంబంలో ప్రభవించి, మచిలీపట్టణంలో ప్రముఖ కవులైన తిరుపతి వెంకటేశ్వరశాస్త్రిగారల వద్ద కవితారీతులను నేర్చుకున్నారు. తెలుగు వచన రచనలోనూ, పద్య కవిత్వంలోనూ ఆయన అగ్రగణ్యులు. ఆంధ్ర నాటకరచనలోనూ, సాహితీ విమర్శనంలోనూ ఉన్నత శిఖరాల నధిరోహించి, ఆయన నవీన రీతుల కనుగుణంగా తెలుగు పద్య కవిత్వాన్ని అభివృద్ధి గాంచారు.

రామస్వామిగారి ప్రభావం బ్రాహ్మణేతర కవులైన శ్రీ గుర్రం జాషువా, శ్రీ వీటుకూరి వెంకట నరసయ్య, శ్రీ తుమ్మల సీతారామమూర్తి, శ్రీ కొండపాటి వెంకటకవి, శ్రీ వీరభద్రాచారి పండిత సత్యనారాయణ, ఆయన కుమారులైన, శ్రీ గోపీచంద్ గార్ల పైనేకాక, సాంఘిక విప్లవకారులైన, బ్రాహ్మణ రచయితలు శ్రీ ఉన్నవ శ్రీ పింగళి గార్లపై కూడా ప్రసరించింది. అనేకమంది ఈ రెండు తరాల విద్యార్థులు ఆయన ప్రభావానికి లోనై, ఆయనలోని హేతువాద దృష్టిని సాంఘిక ప్రజాస్వామ్య దృక్పథాన్ని, ఆత్మగౌరవ ఉద్యమాన్ని అభిమానించ సాగారు.

పురాణాల విశ్వాసాలను పూర్తిగా తిరగదోడుతూ, అశాస్త్రీయమైన, చాందస సాంప్రదాయాల కన్నింటికి వ్యతిరేకంగా పోరాడారు. పౌరాణిక కాలం నాటి వేనమహారాజు కులాల అంతరాలను బ్రాహ్మణుల ఔన్నత్యాన్ని అంగీకరించిన కారణంగా, ఆయనను హత్యచేయడం ధర్మబద్ధమేనని ప్రముఖ తెలుగుకవి విశ్వనాథ సత్యనారాయణగారు రాసిన తరువాత అందులో ఇమిడిఉన్న చాందసతత్త్వ ప్రచారాన్ని చూసి ఆయన విస్తుపోయారు. సాంఘికంగా అతి క్రిందిస్థాయిలో అంబరాని వారిని, అత్యున్నత స్థానంలో బ్రాహ్మణులను ఉంచుతూ వున్న హైందవ మత వర్ణాశ్రమ ధర్మాలను, కులాల విభజనను ఆయన ప్రశ్నిస్తూ, యుగాంతం వరకూ నిలిచే 'ఖానీ' అనే నాటకాన్ని రాశారు. ఆ పుస్తకం హైందవ, బ్రాహ్మణాచార సాంప్రదాయానికి ఒక సవాలు వంటిది. ప్రబోధాత్మకమైన తెలుగు గ్రంథాలలో అది చిరకాలం నిలవగలది. క్రీస్తు, మహమ్మదు అవిర్భవికముందు చాలా శతాబ్దాల నాడే గౌతమబుద్ధుడు హైందవ యజ్ఞయాగాదులను తిరస్కరించి, కులతత్వానికి వ్యతిరేకంగా పోరాడినందుకు రామస్వామిగారు ఆయన్ను ఎంతగానో మెచ్చుకున్నారు. ఎక్కువమంది ప్రజలను కిందికి త్రోసివేసే హైందవ విధానాన్ని ఆయన విమర్శించారు. కొందరిని అణచబడిన కులాలుగానూ, అనేకమందిని అంటరానివారుగానూ, యుద్ధాలలో మత సంఘర్షణలలో పరాజితులైన వారిని ఉంచుతూ, వారిని వంశపారంపర్యంగా హీన వృత్తులలో, సాంఘిక ప్రతిపత్తి లేకుండా, తక్కువ ప్రతిఫలంతో జీవించే లాగా చేస్తున్న హైందవ విధానాలను ఆయన సహించలేక తీవ్రంగా వ్యతిరేకించారు.

బ్రాహ్మణ వ్యవస్థ స్త్రీం పశుక్కులను హరించినందుకు రామస్వామిచౌదరిగారు చాలా చింతించారు. ప్రఖ్యాత ఋషి యాజ్ఞవల్క్యుడు,భరద్వాజులతోపాటు, ఆయన భార్య గార్గి కూడా వేదాభ్యాసాన్ని చేసి, ఉన్నత స్థితిని సాధించినందుకు, ఆమెను కీర్తించిన బ్రాహ్మణ ఋషులు ఇతర స్త్రీలు వేదాభ్యాసం చేయరాదని, వేదమంత్రాలను పఠించరాదని ఎందుకు నిషేధించారు? అంటూ ఆయన తీవ్రంగా ప్రశ్నించారు. సంస్కృతాన్ని, హైందవ వేదశాస్త్రాన్ని పఠించేందుకు అన్ని కులాలకు చెందిన స్త్రీ, పురుషులను ఆయన ప్రోత్సహించారు. తమ ప్రార్థనలలో, మంత్రతంత్రాలలో వారు విశ్వదృష్టిని, ఐకమత్యాన్ని ప్రబోధిస్తూ, మానవజాతిలో నగణ్యం ఉన్న స్త్రీలకు, హరిజనులకు, శూద్రులకు శాస్త్ర జ్ఞానం లేకుండాచేసి, వారిని అజ్ఞానంలో అట్టేపెట్టి హైందవమతం, ఆధ్యాత్మికాభివృద్ధిని ఎలా సాధిస్తుందని ఆయన ఆశ్చర్యపడ్డారు. అందుకు అనుగుణంగా ఆయన తనకు డబ్లిన్ లో విద్యార్థి మిత్రులైన సామాజిక విప్లవకారులు శ్రీ ఉన్నవ లక్ష్మీన్నారాయణ, వారి భార్య శ్రీమతి లక్ష్మీబాయమ్మగారలు, జాతీయ మహిళా పాఠశాలగా, గుంటూరులో ప్రారంభించిన శారదా నికేతనానికి గ్రామీణ రైతు కుటుంబాల నుండి బాలికలనువిద్యాభ్యాసం నిమిత్తమై పంపేందుకు ఆయన నా సహాయాన్ని కోరారు. ఆయన అందజేసిన ఆ ప్రోత్సాహం కారణంగా, ఆయన స్వగ్రామమైన అంగలూరు, కూచిపూడి, గోవాడ వంటి ఇతర గ్రామాలనుంచి అనేకమంది స్త్రీలు విద్యాభ్యాసానికై ముందుకువచ్చి, ఈనాడు మహిళా కవయిత్రులుగా, పండితురాండ్రుగా, రచయిత్రులుగా వున్నారు.

ఆ మహోధృత పోరాటంలో స్వామి దయానంద సరస్వతిగారు, దుగ్గిరాల రామచంద్రయ్యగారు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, విద్యావేత్త ఉన్నవ లక్ష్మీన్నారాయణ గార్ల నుండి, వేదాంత చర్చల రూపంలో ఆయన విలువైన తోడ్పాటును పొందారు. కవిగా, సంఘసంస్కర్తగా యోగివేమనను ఆయన ఎక్కువగా అభిమానించారు. విద్యావంతులైన హరిజన కవులను, గాయకులను, ఆయన బసవ, రామానుజ, వీరబ్రహ్మంగార్ల కీర్తనలను ఆలపించటానికి హరిజనులైన రత్నకవిగారిని, పల్నాటి వారైన వీరభద్రాచారిగారిని, జోసెఫ్‌కవిగారిని యింకా ఎందరినో ప్రోత్సహించారు.

వేమనరీతిలో ఆయన పాటలను, పద్యాలను రాసి, అన్ని మతాల ఆచారాలనుండి, సాంఘిక దురాచారాలనుండి, వాటిని వ్యతిరేకిస్తూ, వాటినుండి బయటపడేందుకు, హైందవులకు వాటి ద్వారా ప్రబోధంచేశారు. బోధనలను ఆయన బాగా ప్రచారం చేశారు. అంగలూరు వారైన శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్య రాసిన "బుద్ధపురాణం" అనే గ్రంధాన్ని 1926 నాటికే ఆంధ్రులు ఆదరించారు.

రామస్వామి చౌదరిగారు చివరివరకూ దేశభక్తునిగా జీవించారు. ఆయన రాసిన పాట "పీరగంధం తెచ్చినారము - పీరులెవ్వరో తెల్పుడీ! పూసిపోదుము, మెడను వైతుము, పూలమాలను భక్తితో", అన్న గీతం 1930 ఉప్పుసత్యాగ్రహం సందర్భంలోనూ, 1942 క్విట్ ఇండియా ఉద్యమంలోనూ జాతీయ వాదులైన కార్యకర్తలను ఉర్రూతలూగించింది. స్వాతంత్ర్య సమరయోధులైన శ్రీమతి వాసిరెడ్డి హనుమాయమ్మ ప్రతి తాలూకాలోను ఈ పాటను పాడుతూ స్వాతంత్ర్య సమరంలోకి యువతీ యువకులను ముందుకు దూకించింది. రామస్వామి చౌదరిగారి పాటలకు, పద్యాలకు ఉన్న అద్భుతశక్తి అలాంటిది.

డాక్టరు యం.చెన్నారెడ్డి

సహజంగా గవర్నర్లయిన వారు ఎటువంటి కార్యక్రమాలను ప్రారంభించటంగానీ, విధానాలను తీసుకోవటంగానీ జరుగదని అటువంటి ప్రధానమైన సందర్భాలలో మంత్రివర్గానికి సలహాలిచ్చేంత వరకే వారి అధికారులు పరిమితమైనవని ప్రజలు భావిస్తుంటారు. శ్రీ ధర్మవీర్ లాంటి శక్తివంతులైన గవర్నర్లు కూడా అంతకన్నా ఏమీ చేయలేకపోయారు. చాలామంది గవర్నర్లు 1967-70 సంవత్సరాలలో అనేక రాష్ట్రాలలో సంయుక్త విధాయక దళ్ మంత్రివర్గాల నేర్పరచినప్పుడు వాటిని తోసివేసే కార్యక్రమాలలో కేంద్ర ప్రభుత్వంతో బాగా సహకరించి ప్రజల నోళ్లలో బాగా నానారు. గవర్నర్ల సమావేశాలు కూడా అనుమానం పేరుతోనో, తమ విశ్వాసం అనే వంచన పేరుతోనో సంయుక్త విధాయక దళ్ మంత్రివర్గాలను గవర్నర్లు తొలగించటానికి చేసే ప్రయత్నాలను ఆగీకరించలేదు..

చెన్నారెడ్డిగారిని ఉత్తరప్రదేశ్ గవర్నరుగా నియమించినప్పుడు దేశవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు, మిత్రులు అయిదు సంవత్సరాలపాటు ఆయనను ఎయిర్ కండిషన్డ్ గదులలో బంధించేందుకు పంపిస్తున్నారని అనంతపస్తి చెందారు. అయితే ఆయన అక్కడ ఉండి వూరికినే కూర్చోక అంతకు ముందటి మంత్రివర్గాలు నిర్లక్ష్యానికి గురిచేసిన కార్యక్రమాలను బయటికి తీసుకురావడమే గాకుండా అనేక ప్రజాహిత కార్యక్రమాలకు పూనుకొని నిర్మాణాత్మక కార్యక్రమాలను చేపట్టి రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడగలిగారు.

అటువంటి కార్యక్రమాలలో ప్రముఖంగా కనిపించేది వందలు వేలకొద్దీ హిందూ మతాల దేవాలయాల, పూజా కేంద్రాల నిర్వహణకై చేపట్టిన సంస్కరణ ప్రయత్నం. 40 సంవత్సరాలుగా దక్షిణ భారతదేశంలో మతాదాయ, ధర్మాదాయ సంస్థలను చట్టప్రకారం ఏర్పాటు చేసిన సంస్థల ద్వారా ఎలా విజయవంతంగా నిర్వహిస్తున్నారో ఆయనకు తెలుసు కాబట్టి ఈ సందర్భంలో ఆయన తనకు తెలిసిన జ్ఞానాన్ని ఇందుకై వినియోగించుకోగలిగారు. ఉత్తరప్రదేశ్ మతాదాయ సంస్థలను, పీఠాలను కంట్రోలు చేయవలసిన అవసరం ఉందని వాటిని వాటి యాజమాన్యాలను తక్షణమే క్రమబద్ధం చేస్తూ దినవారీ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించే విధంగా చూడవలసిన అవసరం ఉందని ఆయన ఆ రాష్ట్ర మంత్రివర్గాన్ని ఒప్పించగలిగారు. ఆయన సలహా మేరకు ఆంధ్రప్రదేశ్, మద్రాసు, కేరళ, కర్నాటక రాష్ట్రాలలోని హిందూ దేవాదాయ చట్టాలను, పనిచేస్తున్న తీరును పరిశీలించేందుకు యు.పి. మంత్రివర్గం పూనుకొంది. కొన్ని వారాలపాటు ఆ రాష్ట్రం అధ్యక్ష తరపు పరిపాలనలో ఉన్నప్పుడు అటువంటి నివేదికలపై వేగవంతమైన చర్యలు తీసుకొనేందుకు ఆయనకు అవకాశం కలిగింది. ఈ ప్రయత్నాల కారణంగా ఒనగూడిన శుభఫలితం ఏమిటంటే హిందూ మతాదాయ సంస్థలకు పాలక మండలులను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణను వనరులను పర్యవేక్షిస్తూ వాటిపై అదుపును కలిగి వుండడం వంటి అంశాలతో కూడిన ఆర్డినెన్సును జారీ చేసేందుకు ఆయన

మంత్రివర్గాన్ని ఒప్పించగలిగారు దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న ఒక గొప్ప కృషికి ఇది విజంగా అనన్యమైన విజయం. దీనిని అందరూ ఆమోదించారు. శ్రీ చెన్నారెడ్డిగారు ఆవిధంగా గవర్నరు పదవి ఒక అలంకార ప్రాయమైనది మాత్రమే కాదని ప్రజాస్వామ్య పద్ధతుల్లో అభ్యుదయకరమైన రీతిలో చురుకైన గవర్నరుగా తనను తాను నిరూపించుకున్నారు.

చెన్నారెడ్డిగారు తాము రాష్ట్రమంత్రిమండలిలో కొనసాగుతున్నప్పుడు ఇందుకోసం తీవ్రంగా ప్రయత్నించి విజయాన్ని సాధించలేక పోయారు. అయితే గవర్నరుగా పనిచేస్తూ ఇంతటి గొప్ప కృషిని విజయవంతంగా సాధించగలగడం తమాషా అయిన విషయం.

కేంద్ర ప్రభుత్వంలో కూడా చెన్నారెడ్డిగారు మంత్రిగా ఉన్నారు. అక్కడ ఆయన శ్రీ సి.సుబ్రహ్మణ్యంగారిని సమర్థుడైన మంత్రిగా తక్షణమే అవగాహన చేసుకొనే వ్యక్తిగా ఎక్కువగా గౌరవించేవారు. వీరిద్దరూ కూడా ఆనవాయితీగా వస్తున్న అధికార అంసత్వాన్ని వృధాకాయాసను ఎక్కువగా అసహ్యించుకునే వారు. అయితే వారిని చట్టాల చట్రం అంత స్వేచ్ఛగా ముందుకు సాగనివ్వలేదు. గనులు, ఉక్కు శాఖామంత్రిగా ఉన్నప్పుడు ఆయన ఈ ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది. ఎమర్జెన్సీ విధించబడడం, మీసా చట్టం ప్రవేశపెట్టడం వంటి విషయాలు ఆయనకు ఉక్కు ఫ్యాక్టరీం మేనేజిమెంట్లతో వ్యవహరించే విషయంలో కొంత పట్టును కలిగించాయి.

ఆయన అంతకు ముందు కొన్ని సంవత్సరాంపాటు ఒక సీనియరు ముఖ్యమంత్రిచేత సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని విడగొట్టి ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్యమ సందర్భంలో జైలుకు వెళ్లారు. ఆ ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి ఆయన ఏకైక శక్తిగా గొప్ప గౌరవాన్ని సంపాదించుకొన్నారు.

ఆ ఉద్యమ ప్రారంభానికి ఆయన బాధ్యులు కారు. ఆ ఉద్యమం హింసాత్మక రూపంలో విజృంభించినప్పుడు దాని నాయకులు ఆయన కారు. ఆంధ్రప్రాంతంలో నుంచి వచ్చి అనేక తెలంగాణా జిల్లాలలో స్థిరపడిన ప్రజలపై కొనసాగిన తీవ్రమైన దాడులు ఆయన వల్ల జరుగలేదు. దాని మధ్యస్థాయి నాయకత్వం దెబ్బతింటున్న తరుణంలో ఆకరు నిమిషాలలో ఆయన ఆ ఉద్యమ నాయకత్వాన్ని స్వీకరించారు. హింసాత్మక కార్యకలాపాలేమీ లేకుండానే ఆయనకు వ్యక్తిగతంగా ఉన్న పలుకుబడి ప్రభావం కారణంగా ఆ ఉద్యమం తిరిగి వూపందుకొంది. రాష్ట్రప్రభుత్వం భయంతో ఆయనను, ఆయన అనుచరులైన లక్ష్మణ్ బాపూజీగారి లాంటి వారిని జైళ్లలో పెట్టింది. ప్రత్యేక రాష్ట్రోద్యమం ఆంధ్రప్రదేశ్‌ను విడగొట్టలేక పోయింది. అయితే శ్రీ చెన్నారెడ్డి 1971 ఎన్నికలలో పార్లమెంటుకు జరిగిన ఎన్నికలలో ఎక్కువ స్థానాలను తాను నియమించిన తెలంగాణా ప్రజాసమితి అభ్యర్థులు గెలుచుకోగలిగేలా చేసి ఒకటిన్నర కోట్ల తెలంగాణా ప్రజలపై తిరుగులేని తన నాయకత్వాన్ని రుజువు చేసి చూపించారు.

శ్రీ చెన్నారెడ్డి 1940-45 నాటి సత్యాగ్రహ సమరకాలంలో ప్రజాజీవితం లోకి ప్రవేశించిన ఆరోజుల్లో ఆయన వైద్యకళాశాలో చదువుకుంటున్న రోజుల్లోనే సామ్రాజ్యవాద వ్యతిరేక భూస్వామ్య వర్గ వ్యతిరేక దృష్టిని సంతరించుకున్నారు. ఆయన వైద్యవృత్తిని కొనసాగించేందుకు డాక్టరు డిగ్రీని పొందిన వెంటనే నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా తెలంగాణా

ప్రజలు సాగిస్తున్న పోరాటం పట్ల ఆకర్షితులై అనేకమంది యువకుల్లాగే దేశభక్తితో ఆ ఉద్యమంలో ముందుకు దూకారు.

నేను ఆయనను పూజ్యులైన ఆయన మామ స్వర్గీయ శ్రీరంగారెడ్డిగారిని అనేకమంది వారి యువసహచర కార్యకర్తలను 1946వ సంవత్సరంలో ప్రపంచ ఆహార వ్యవసాయ సభ సందర్భంలో నా విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన వెంటనే 1946 సంవత్సరంలో తెలంగాణా ప్రజాసభ జరుగుతున్నపుడు నేను కలుసుకున్నాను. అప్పటి హైదరాబాదు రాష్ట్రంలో ఉన్న నాలుగు భాషల నాయకులకు నాయకులుగా వున్న స్వామి రామానంద తీర్థగారి నాయకత్వం కింద రాష్ట్రస్థాయి జాతీయోద్యమాన్ని ప్రారంభించేందుకు వీలుగా కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య పార్టీని ఒకదాన్ని వారు అప్పట్లో నడుపుతున్నారు.

ఆ సమావేశంలో తాత్కాలిక పార్లమెంటులో కాంగ్రెస్ పార్టీ చీఫ్ విప్‌గా పనిచేస్తున్న శ్రీ సత్యనారాయణ సిన్హా డాక్టర్ చెన్నారెడ్డి గారిని ఆయన ఉన్నతమైన ప్రసంగాన్ని విన్న తరువాత ఉత్తమ నిర్వాహకునిగా ప్రస్తుతించటం నాకెంతో ఆనందాన్నిచ్చింది.

అది జరిగిన తరువాత చెన్నారెడ్డిగారు రాజకీయంగా బాగా ఎదుగుతూ హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెసు కార్యవర్గ సభ్యులుగా, తరువాత మంత్రిగా తరువాత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్యాబినెట్ మంత్రిగాను కాగలిగారు.

రజాకారుల అల్లరుల వల్ల హైదరాబాదు రాష్ట్రం గందరగోళపడుతున్నపుడు ఆయన సమర్థవంతమైన పాత్రను నిర్వహించారు. శ్రీ చెన్నారెడ్డి, శ్రీమతి లక్ష్మీ బాయమ్మ, శ్రీ హరిశ్చంద్ర హెడా ఇంకా అనేకమంది జైళ్లకు వెళ్లారు. రజాకారుల క్రూర చర్యలనుంచి తప్పించుకోవడానికి వారు వేంకట్టి కార్యకర్తలకు తోడ్పడ్డారు. ఆయన, ఆయన భార్య రజాకారుల క్రౌర్యం నుంచి తప్పించుకొని విజయవాడ వచ్చి అక్కడ కొంతకాలం గడిపారు. వారంతా కేంద్ర ప్రభుత్వ సౌఖ్యం కోసం ఆందోళన చేస్తూ, కేంద్రప్రభుత్వ సౌఖ్యంతో పోలీసు చర్య జరుపబడి ఆకారణంగా హైదరాబాదు రాష్ట్రంలో నిజాంపాలన అంతరించి అది భారతదేశంలో విలీన మయ్యేంతవరకు వారంతా ఆందోళన చేస్తూనే వచ్చారు.

ప్రజా జీవితంలో ఆయన అసంతృప్తి చెందిన సందర్భాలు కూడా ఉన్నాయి. హైదరాబాదు రాష్ట్రంలో ఆయన ఆహార వ్యవసాయ శాఖా మంత్రిగా చక్కటి కృషిచేసినప్పటికి హైదరాబాదు రాష్ట్రం రద్దు చేసి అందులోని తెలుగుభాష మాట్లాడే ప్రాంతాలతో కలసి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచేసినపుడు ఏర్పడిన మంత్రిమండలిలోకి ఆయనను ఆహ్వానించలేదు. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ సంఘం వారుకూడా సానుకూలం చూపెట్టిన ప్రత్యేక తెలంగాణా ఏర్పాటు కోసం ఆయన దీర్ఘకాలంగా పోరాడుతూ వున్న దాని ఫలితంగా ఆయనను ఇట్లా శిక్షించారని చాలామంది అనుకొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న దమన రీతులకు వ్యతిరేకంగా ఒక ప్రతిపక్ష పార్లమెంటరీ పక్షాన్ని ఏర్పాటు చేయాలని భావించి మేము స్వతంత్ర పార్టీని ఏర్పాటు చేసేందుకు నిర్ణయించుకొని దానిలో చేరవలసిందని చెన్నారెడ్డి గారిని ఆహ్వానించినపుడు ఆయన మాతో

కలవడానికి అంగీకరించారు. ఆ తరువాత కాంగ్రెస్ నాయకులు పశ్చాత్తాపపడి తిరిగి ఆయనను కలుపుకోనేందుకు ఆహ్వానించినపుడు ఆయన మరల వారితో చేరిపోయారు. ఆ తరువాత ముందు హైదరాబాదులోనూ, ఆ తరువాత ఢిల్లీలోనూ క్యాబినెట్ మంత్రిగా ఆయన సేవలను వినియోగించుకున్నారు. సమర్థుడైన, చాకచక్యం కలిగిన మంత్రిగా ఆయన అన్ని సందర్భాలలోనూ నిరూపించుకోబడ్డారు. మొత్తంమీద గవర్నరు వంటి నేరుగా అధికార నిర్వహణలో లేని పదవిలో ఉండికూడా ఆయన తన సృజనాత్మకమైన నిర్మాణ సామర్థ్యాన్ని చూపెట్టి, అందులో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు.

శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి

1973 వ సంవత్సరం మార్చినెల మూడోతేదీన శ్రీ బెజవాడ రామచంద్రారెడ్డి మరణించడంతో రైతాంగం ఒక గొప్ప యోధుడిని కోల్పోయింది. ఆయన 1923 వ సంవత్సరంనుంచి మంచి రైతాంగ నాయకునిగా నాకు తెలుసు. 1928వ సంవత్సరంలో సంయుక్త మదరాసు రాష్ట్రంలో ఆర్థిక విచారణా సంఘ సభ్యులుగా మేమిద్దరం కలిసి పనిచేశాం. భూమిశిస్తుపైన 18 ½ శాతాన్ని పెంపుదల చేయాలని నిర్ణయం చేసిన తరవాత దానిపై రైత్వారీ పద్ధతిని పూర్తిగా పరిశీలించి ఆర్థిక కారణాలను సరితూచి ఒక నివేదికను సమర్పించవలసిందిగా మదరాసు శాసనసభ అప్పట్లో ఆ కమిటీని ఏర్పాటుచేసింది. దురదృష్టకరమైన అంశం ఏమిటంటే ఆ తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు భూమిశిస్తును మూడువందల శాతానికి పైగా పెంచి ఇప్పటికీ ఇంకా వ్యవసాయంపై అదనపు పన్నులు విధించేందుకు కావలసిన మార్గాలను గురించి అన్వేషిస్తూనే ఉన్నాయి.

శ్రీ రామచంద్రారెడ్డి 1930-36 సంవత్సరాల మధ్య మదరాసు శాసనసభలో ప్రముఖ వక్తగా ఉండి ప్రజాస్వామ్య రీతుల్లో చర్చలను కొనసాగించే విషయమై ఆసక్తితో అవగాహన చేసుకొంటూ ఉండేవారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కంట్రోళ్ళు మన ఆర్థిక జీవనంపై తమ పూర్తి ప్రభావాన్ని చూపిస్తున్న తరుణంలో నిర్బంధ ధాన్యం, బియ్యం సమీళ్ళకు వ్యతిరేకంగా భారత్ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షురాలైన శ్రీమతి భారతీదేవికి ఆమె చేస్తున్న రైతాంగ పోరాటంలో రైతులకు గిట్టుబాటు ధరలను ఇవ్వవలసిందిగా ఆదేశించి ఆయన తన హృదయపూర్వకమైన సహకారాన్నందజేశారు. 1952-57 సంవత్సరాలలో లోక్‌సభలో డెమోక్రటిక్ పార్టీకి ఉపనాయకులుగా ఆయన ఉన్నప్పుడు, ఆ తరవాత ఆయన గ్రామీణ ప్రజల ప్రయోజనాల కోసం తీవ్రంగా కృషిచేశారు. ఆ తరవాత సర్దార్ బహదూర్ భాయ్‌పింగ్‌గారి సహకారంతో అఖిలభారత వ్యవసాయ దారుల సమాఖ్యను ప్రారంభించారు. ఏకపక్షంగా పక్షపాత దృష్టితో ప్రభుత్వం భూపరిమితి చట్టాలను ప్రవేశపెట్టేందుకు పూనుకోవడంతో అందుకు వ్యతిరేకంగా ఆయన గట్టిగా పోరాడారు. జవహర్లాల్‌గారు రైతాంగ వ్యతిరేక సహకార వ్యవసాయ ప్రయత్నానికి పూనుకోవడంతో అందుకు వ్యతిరేకంగా ప్రారంభించిన నా ప్రయత్నాలలో నాకు తోడ్పడేందుకు ఆయన ముందుకు వచ్చారు. భారతదేశ రాజకీయ నాయకుల మహాసభను వ్యవసాయదారుల సమాఖ్య తరపున మదరాసులో ప్రారంభించినపుడు ఆయన ప్రధానంగా ముందుండి కృషిచేశారు. ఆ తరువాత ఆ ప్రయత్న ఫలితమే స్వతంత్ర పార్టీగా రూపుదిద్దుకొని రైతాంగ ప్రజల స్వయం వృత్తుల హక్కులను కాపాడడానికి నడుం కట్టింది. అందుకుగాను అఖిలభారత పార్టీ ఉపాధ్యక్షులుగా పది సంవత్సరాలపాటు ఆయన ఉండి ప్రజాస్వామ్య రక్షణకు ఒక దుర్గంగా నిలిచి కృషిచేశారు. 1962 పార్లమెంటు ఎన్నికలలో నేను ఓడిపోయిన తరవాత తిరిగి పార్లమెంటుకు వెళ్లేందుకు చిత్తూరు నుంచి ఉపఎన్నికలలో పోటీచేస్తున్నప్పుడు ఆయన ఒక కొండలాగా నాకు తోడు నిలిచారు. కుల ప్రచారం ఆయనను

వివిధంగానూ లొంగదీసుకోలేక పోయింది. నాకు వ్యతిరేకంగా పోటీచేస్తున్న జవహర్లాల్ నెహ్రూగారు నిలబెట్టిన రెడ్డి అభ్యర్థిని ఓడించేందుకు ఆయన ఎంతగానో సహాయపడ్డారు.

రామచంద్రారెడ్డిగారు 1924 వ సంవత్సరంలో మద్రాసు బార్ లో ప్రవేశించారు గాని న్యాయవాద వృత్తికన్నా ప్రజాసేవవైపే ఆ తరవాత ఆయన ఎక్కువగా మొగ్గారు. ఆయన ఒక చిన్న జమిందారుగా ఉన్నప్పటికీ వెంకటగిరి జమిందారుతోను, జస్టిస్ పార్టీకి సంబంధించిన ఇతరులతోనూ బాగా స్నేహసంబంధాలు కలిగి ఉన్నప్పటికీ రైతాంగ విషయాలలో మాత్రం రైతుల పక్షాన్నే నిలిచారు.

జమిందారులకు వ్యతిరేకమైన పోరాటంలో ఆయన మాతో కలసి పనిచేయలేదు. ఆయన నా గాంధేయ సోషలిస్టు మార్గంలో నాతో కలసి నడవలేదు. మొత్తం మీద అన్ని రకాల ఆస్తులపై సీలింగు ఉంచరాదని ఆయన కోరుతూ సీలింగు పద్ధతినే పూర్తిగా వ్యతిరేకించారు. రైతాంగంపై విధించిన పరిమితుల విషయంలో మాత్రమే నేనాయనతో కలసి పనిచేసేందుకు ఇష్టపడ్డాను. మేమిద్దరం స్వయం వృత్తితో జీవించే ప్రజలకోసం స్వతంత్రమైన వారి హక్కుల కోసం కలసి పనిచేశాం. ఆయన స్నేహం చాలా గొప్పది.

రెడ్డిగారు తెలుగులో మంచి పండితులు. చక్కటి రచయిత, కవి. ఒక దశాబ్దంపాటు తెలుగు వారపత్రిక "స్వతంత్ర" కు ఆయన సంపాదకులుగా ఉంటూ దాన్ని నడిపారు. అనేకమంది తెలుగు కవులను రచయితలను ఆయన ప్రోత్సహించారు. ఆయన ఆంధ్ర ఆంగ్ల భాషలలో మంచి ఉపన్యాసకులు. సంఘంలో సమర్థతతో పనిచేయగలిగిన వారు. 1952-57 సంవత్సరాల మధ్య శాసనసభలోనూ లోక్‌సభలోనూ గూడా ఆయన చేసిన ప్రసంగాలు చక్కని వాదనా పటిమతో సమర్థవంతమైన భావావేశంతో ఉపయుక్తకరంగా ఉండేవి. ఆయన ఒక మంచి స్నేహితుడు, గౌరవనీయమైన సహచరుడు. శ్రీ రాజాజీ, శ్రీ శ్యాం ప్రసాద్ ముఖర్జీ గార్లు ఇద్దరూ గూడా సంతోషంగా ఆయన సలహాలను స్వీకరిస్తుండేవారు. డాక్టరు రత్నస్వామి లాగా స్థాయితో వ్యవహరించి ప్రజాజీవితంలో గౌరవప్రదమైన జీవితాన్ని ఆయన గడిపారు. నాకు ఆయన ఒక ఘనమైన సహచరునిగా తెలివైన సలహాదారునిగా ఉపకరించారు. అనేక సందర్భాలలో ఆయన హెచ్చరిస్తూనో, చక్కటి హాస్యంతో మృదువైన పలుకులతో అలరిస్తూనో, పార్టీలో అన్ని స్థాయిలలోనూ నా ప్రయత్నాలు అంగీకరించబడేందుకు వీలుగా కృషిచేస్తుండేవారు.

డాక్టరు కాసరనేని సదాశివరావు

గుంటూరు జిల్లా తక్కెళ్లపాడులో జన్మించిన డాక్టరు కాసరనేని సదాశివరావు ఎం.బి.బి.ఎస్., ఎం.ఎస్., గారు గుంటూరులో ఉన్న వైద్య ప్రముఖులలో ప్రముఖులు. ఆయన 1955వ సంవత్సరం నుంచి రైతుల అభిమానాన్ని చూరగొంటూ వస్తున్నారు. 1930-60 సంవత్సరాల కాలంలో స్వాతంత్ర్య సమరయోధులైన డాక్టరు ఎ.చలపతిరావుగారు మధ్యతరగతి ప్రజల విశేషాభిమానాన్ని పొందినట్లు గానే వీరు రైతుజనాల ప్రేమను సంపాదించుకున్నారు. ఆయన నిర్వహిస్తున్న వైద్యశాల ఎక్కువమందికి వైద్యసేవలందించ గలుగుతుంది. దానితోపాటు ఉత్తమ బోధకులుగా ఆయన గుర్తింపును పొంది గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో గౌరవ సర్జనుగా పనిచేసేందుకు ఆహ్వానించ బడ్డారు. చీరాలకు చెందిన డాక్టరు ప్రతాప కుమార్ లాగా తెనాలికి చెందిన డాక్టరు వెంపటి సూర్యనారాయణ, డాక్టరు హరిప్రసాద్ గార్లలాగా విజయవాడకు చెందిన డాక్టరు టి.చలపతిరావుగారి లాగా ఆయన ప్రజల డాక్టరుగా విశేషమైన ప్రఖ్యాతిని పొంది గొప్ప గౌరవాన్ని సంపాదించుకున్నందుకు నాకెంతో ఆనందంగా ఉంది.

శ్రీమతిని పొందడం విషయంలోకూడా సదాశివరావుగారు అదృష్టవంతులు. ఆయన భార్య డాక్టరు జయప్రదాంబ పసిపిల్లల వైద్యంలోను, స్త్రీలపరమైన వైద్యశాస్త్రంలోనూ గొప్ప నిపుణులు. వారిద్దరి కలయిక, వైద్యశాల నిర్వహణ, గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని వ్యాధిగ్రస్తులయిన వేలాదిమందికి వరప్రసాదంగా ఉపయోగపడింది.

ఎం.బి.బి.ఎస్., ఎం.ఎస్., ఎం.డి. వంటి ఉన్నత వైద్యశాస్త్ర డిగ్రీలను పొందిన అనేకమంది డాక్టర్లు ప్రభుత్వ సర్వీసులో పనిచేయడానికి ఆసక్తి చూపించడాన్ని చూచి నేనెక్కువ అసంతృప్తి చెందాను. అనేకమంది డాక్టర్లు ఎక్కువగా డబ్బు సంపాదించాలనే కాంక్షతో విదేశాలకు వెళ్లడాన్ని మనం చూస్తున్నాం. కొద్దిమంది మాత్రమే స్వంత ప్రాక్టీసు పెట్టి కష్టనష్టాలను ఎదుర్కోవడానికి ముందుకొస్తున్నారు. ఆరు సంవత్సరాలపాటు ఎంతో వ్యయప్రయాసలకోర్చి అలాంటి శిక్షణ పూర్తిచేసుకున్న తరవాత తిరిగి వైద్యపరికరాలను సమకూర్చుకునేందుకు కాంపౌండర్లను, నర్సులను పోషించేందుకు తొలిదశలో తమకు తాము గౌరవంగా జీవించేందుకు 15 వేలనుంచి 20 వేల రూపాయల వరకు తిరిగి సంపాదించు కోవడం చాలామందికి కష్టమే కావచ్చు. రహదారి సౌకర్యాలు లేకుండా సరైన ఆరోగ్య పారిశుద్ధ్య వసతులు లేకుండా మందుల షాపులు, టెలిఫోన్, పోస్టలు వసతులు లేకుండా ఉన్న గ్రామాలలో ప్రాక్టీసు ప్రారంభించడం మరీ కర్రమీద సాము చేసినట్లుగానే ఉంటుంది. 1923 వ సంవత్సరంలో వీటన్నింటిని గ్రహించిన శ్రీ పానగల్ రాజా ఇలాంటి సందర్భాలలో కొంత సహాయాన్నందిస్తూ ఒక కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆ తరవాత ఎవరు దానిలో చేయి పెట్టవలసి వచ్చినా పంచాయితీ రాజ్యసంస్థలు అందుకు కావలసిన విధంగా స్పందించలేకపోయాయి. మన గ్రామీణ ప్రాంతాలలో పెరుగుతున్న డాక్టర్ల అవసరాన్ని ఈ ప్రయత్నాలేవీ తీర్చలేకపోయాయి. డాక్టరు సదాశివరావు డాక్టరు జయప్రదాంబ వంటివారు ప్రభుత్వ సర్వీసులో పనిచేయాలని కోరుకోకుండా

బయటఉండి ప్రజాసేవ చేయడానికి పూనుకున్న డాక్టర్లలో ముందున్నారు. మన గ్రామాల్లో ఇప్పటికీ అనేక ప్రాంతాలు సరైన వైద్యులుగానీ, మందుల షాపులుగానీ లేకుండానే ఉంటున్నాయి. అక్కడ అవసరమైన మందులుగానీ వైద్యసేవలకు కావలసిన పరికరాలు గానీ అంతంత మాత్రమే. అనేకమంది నిరుద్యోగులైన డాక్టర్లు మన దేశంలో ఉంటున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవ విస్తృతం కాకపోవడం మన దురదృష్టమే. శ్రీ సదాశివరావు వంటి ప్రముఖులైన డాక్టర్లతో ప్రభుత్వం వారు సంప్రదించి నిరుద్యోగులుగా ఉంటున్న డాక్టర్లను, వారి సేవలను వినియోగించుకునేందుకు వారికి కనీస అవసరాలను చక్కటి జీవితాన్ని కల్పిస్తూ వారి నిరుద్యోగాన్ని తొలగించి గ్రామీణ ప్రజాసేవలో వినియోగించుకునేందుకు, ఒక నిర్మాణాత్మకమైన పథకాన్ని తయారుచేయవలసిందిగా అడిగితే బావుంటుంది.

డాక్టర్లు సహజంగా పరస్పరం ఒకరితో ఒకరు పోటీపడుతుంటారు. ప్రైవేటుగా హాస్పిటల్సు నడుపుతున్న వారిలో చాలా ఎక్కువ పోటీఉంది. డాక్టరు సదాశివరావుగారు తన ప్రాక్టీసు ప్రారంభించిన తొలి దినాల్లో వీటన్నింటిని ఎదుర్కొని దానిని దాటి గొప్పగా కీర్తి ప్రతిష్ఠలనార్జించుకొని ఆ రెండు దశాబ్దాల కాలంలో గుంటూరు జిల్లా మొత్తంమీద అనేకమంది జూనియర్ డాక్టర్లకు ఆదర్శంగా నిలిచి వారికోపెద్ద దిక్కుగా ముందున్నారు. అనేకమంది ప్రైవేటు ప్రాక్టీసు పెట్టుకునే కొత్త డాక్టర్లు ఆయన మంచితనాన్ని సంపాదించుకొని ఆయన ఆశీస్సులు పొందటం తమ అదృష్టంగా భావించుకొనే సందర్భాలను చూసి నాకెంతో సంతోషమనిపించేది. ఆవిధంగా బాగా పోటీఉన్న ఈ వృత్తిలో సహకారి అయిన మంచి పెద్దగా ఆయన అందరినుంచి అభినందనలు పొందగలుగుతున్నారు. అందువల్ల ఆయన నర్సింగ్ హోం రజతోత్సవ కార్యక్రమాలకు నేను మహదానందంతో అధ్యక్షత వహించగలిగాను.

32

స్వామి సహజానంద సరస్వతి

1928-48 సంవత్సరాల మధ్యకాలంలో ఆంధ్ర రైతాంగ ఉద్యమంలో నెల్లూరు వెంకట్రామా నాయుడుగారు రైతు నాయకునిగా ప్రకాశించారు. అదే వరవడిలో 1936-42 లో బీహార్‌కు చెందిన స్వామి సహజానంద సరస్వతి, అగ్నికణంలా, తీవ్రవాద విప్లవశక్తిగా, భారత రాజకీయ రంగంమీద వెలుగు కిరణాలను విరజిమ్మారు. బీహార్ రాష్ట్రంలోని వామపక్షవర్గాన్నింటికీ, ఆయన సన్నిహితులుగా ఉన్నారు. కమ్యూనిస్టుల ఎత్తుగడలవల్ల, తిరుగుబాటు శక్తులతో చేయికలిపి, కాంగ్రెసు ప్రభుత్వంకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించారు. వామపక్షాల అండదండలతో స్వామీజీ చేపట్టిన తీవ్రవాద ఉద్యమాలను, తుదకు రాజేంద్రప్రసాద్‌గారు కూడా ఎదుర్కొనవలసివచ్చింది. స్వామీజీ నిర్వహించిన "కర్రలు ధరించిన రైతుల దండయాత్ర"ను ఖండిస్తూ, 'హరిజన్' పత్రికలో వరసగా వ్యాసాలు రాయవలసిందిగా, గాంధీజీ తన కార్యదర్శి అయిన మహదేవ్ దేశాయ్‌ను ఆదేశించారు. దీనిని బట్టి స్వామి సహజానంద నిర్వహించిన రైతుల దండయాత్రలు ఎంతటి సంచలనాన్ని కలిగించాయో అర్థమవుతుంది.

అఖిల భారత కిసాన్ కాంగ్రెసుకు స్వామీజీ అధ్యక్షులుగా ఉన్నారు. దీనికే మరొకపేరు 'అఖిల భారత కిసాన్ సభ' అని కూడా ఉండేది. నేను దీనికి మాజీ అధ్యక్షుడను. తదుపరి స్వామీజీ హయాంలో ప్రధాన కార్యదర్శిగా ఉంటూ, తటస్థ భావాలకు కట్టుబడిఉండే వాడిని! స్వామీజీ, నా భావాలను, ధోరణిని కూడా పట్టించుకోకుండా, రాజకీయ ఆర్థిక రంగాలలో అహింసా పద్ధతులను అనుసరిస్తున్న గాంధీజీ మార్గాన్ని అనుసరించకుండా, దానికి పూర్తి వ్యతిరేకతతో, నిర్దిష్ట ధోరణితో తలపడ్డారు. నేటి నక్సలైట్ల నమూనాలో, బీహార్ జమిందారులకు వ్యతిరేకంగా, స్వామీజీ చేపట్టిన సాయుధ ప్రదర్శనను, ఖండించడం గానీ, అందుకు పశ్చాత్తాపాన్ని తెలపడానికిగానీ, నేను అంగీకరించకపోవడం వల్ల, గాంధీజీ బాగా అసంతృప్తి చెందారు. స్వామీజీ నిర్వహించిన "కర్రలు ధరించిన రైతు దండయాత్ర"ను గురించి, తదుపరి నేను గాంధీజీకి విశ్లేషణచేసి, ఒప్పించాల్సి వచ్చింది. రైతులు కర్రలు ధరించడం సాంప్రదాయకమైన అలవాటేనని, రైతుల నిత్యజీవన విధానంలో పశువులను అదిలించేందుకు, పాలాల్లో పాములవంటి విషజంతువుల నుంచి రక్షణ పొందడానికి, చేతిలో ఎల్లప్పుడూ కర్రలను ధరించే ఉంటారనీ, రైతుల సామూహిక ప్రదర్శనలో పైతం, రైతుల అలవాటు ప్రకారమే కర్రలు ధరించి నడిచారనీ, ఆవిధంగా కర్రలు ధరించడం జమిందారులకు, వారి శ్రేయోభిలాషులపై దండయాత్రలకు మాత్రం కాదనీ, కాబట్టి రైతు ప్రదర్శనలపై ఎలాంటి చర్యలు తీసుకోవడానికి అవకాశం లేదని నేను వివరించినప్పుడు, గాంధీజీ సంతృప్తిచెంది, శాంతించారు.

సుభాష్ చంద్రబోసు కాంగ్రెసునుంచి వైదొలిగి, ఫార్వర్డ్ బ్లాకును స్థాపించిన తదుపరి, కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోరాడేందుకు స్వామీజీని, సహచరునిగా ఎన్నుకున్నారు. స్వామీజీ, నేనూ వామపక్ష ఐక్యసంఘటనలో ఉంటూ సుభాష్ చంద్రబోసుతో సహకరించి నడిచాం!

స్వాతంత్ర సమరంలో గాంధీజీ నాయకత్వం స్థిరపడి, తిరుగులేని శక్తిగా సాగుతున్నప్పుడు, స్వామీజీ వామపక్ష ఐక్య సంఘటనను మాత్రమే గుర్తించి, దానితో సాగిపోయారు. వామపక్ష ఐక్యసంఘటన పతనమయ్యాక, ఆయన సుభాష్‌బోసుతో కలిసి ఉండడానికి నిర్ణయించుకున్నారు. సుభాష్‌బాబు స్వదేశాన్ని విడిచి, విదేశాల్లో నేతాజీగా సాయుధ పోరాటాన్ని చేపట్టారు. జర్మనీ, రష్యామీద యుద్ధప్రకటన చేసినందువల్ల కమ్యూనిస్టులు, తమ సామ్రాజ్యవాద యుద్ధ వ్యతిరేక నినాదాన్ని వదిలి 'ప్రజాయుద్ధ' నినాదంవైపు మళ్లగానే, స్వామీజీ మార్గం, నా మార్గం వేరు అయ్యాయి.

అప్పటికి ఆరు సంవత్సరాలుగా రైతాంగ ఉద్యమంలో మేం సన్నిహితులుగా ఉంటూ, కలిసిమెలసి ఉన్న సమయంలో మా స్నేహం ఆత్మీయతతో వర్ధిల్లింది. మా ఇరువురి మనస్తత్వాలు, సంస్కృతీ సాంప్రదాయాలు భిన్న విధానాలతో ఉన్నప్పటికీ, స్వామీజీ, నేను పరస్పర సహకారంతో కలిసి ఉండేందుకు కావలసిన పరిస్థితులను శ్రీ ఇందూలాల్ యాగ్నిక్ గారు కల్పించి పెట్టారు. మా ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధాలకోసం యాగ్నిక్ గారు ఎంతగానో కృషిచేశారు.

కాషాయవస్త్రాలు ధరించి 'స్వామీజీ' గా పరివర్తన చెందక పూర్వం సహజానంద సరస్వతి, ఉత్తర్ప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలోని జమిందార్ల అధీనంలో ఉన్న ప్రాంతాలలో భూమి దున్నుకొని జీవిస్తున్న రైతులకు నాయకత్వం వహించి రైతులకు అండదండగా ఉండేవారు. అక్కడి రైతులను భూమియార్ లు అని పిలుస్తారు. సహజానంద సరస్వతిగారు 'భూమియార్లు' గా పిలువబడుతున్న యాదవనాయకులలో ఒకరుగా ప్రసిద్ధి చెందారు.

సాంఘిక సేవాకార్యక్రమాల్లోనూ, హైందవ మత పునరుద్ధరణ కార్యరంగంలోను కూడా సహజానంద సరస్వతి పాల్గొని, అలాంటి ఉద్యమాలకు నాయకత్వం వహించారు. భూమియార్ లు, యాదవులు, కూర్మితెగల రైతుల, వ్యవసాయం వృత్తిగాగల కులాలవారి ఆచార, సాంప్రదాయాల పరిరక్షణకు, వాటి సాంఘిక ప్రతిపత్తికోసం ఆయన తీవ్రంగా కృషిచేశారు. భూమియార్ లు, యాదవులు,తదితర శూద్రకులాల చేత జంధ్యాలను ధరింపజేసి, నిత్యకర్మకాండలకు సంబంధించిన వ్యవహారాలలో సంస్కృతంలోని మంత్రశ్లోకాలను వారికి నేర్పి, వారు పఠించేటట్లు జేస్తూ, యజ్ఞయాగాది క్రతువులను సైతం ఈ కులాలవారే నిర్వహించేటట్లు జేస్తూ, అగ్రకులమైన బ్రాహ్మణ కులప్రతిపత్తిని వీరికి సైతం ఆపాదించి, బ్రాహ్మణులతో పాటుగా నిత్యజీవితంలో, ఆచరణాత్మకంగా వ్యవహరింపజేశారు.

ఇట్టి సాంస్కృతిక పునరుజ్జీవన కార్యక్రమాలను నిర్వహించేప్పుడు, ఆయన పల్లకీలో ప్రయాణిస్తూ, నేలయీనినట్లు జనసమూహాలు తన వెంటనడిచిరాగా, ఉత్సాహభరితంగా, అత్యంత వేడుకగా ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి పర్యటిస్తూ, గ్రామ గ్రామాలు తిరగసాగారు. అప్పట్లోనే ఆయనకు జమిందార్ల దోపిడీనుంచి, అమాయకులైన రైతులకు స్వేచ్ఛను కల్పించాలనే సంకల్పం ఆయనలో కలిగింది. అప్పట్లో రైతులకు, తమ స్వంత కమతాలపైనే రుణాలను ఇస్తూ, వారిని కౌలుదార్లుగా పరిగణించి, ఎప్పటికప్పుడు కౌలును పెంచుతూ, ఆర్థికంగా వారిని దోపిడీ చేస్తున్న జమిందార్ల ఆగడాలను చూసి, ఆయన

సహించలేకపోయారు. హైందవ మతంలోని వర్ణవ్యవస్థకు, కులపట్టింపులకు వ్యతిరేకంగా ప్రారంభమైన, ఆయన పోరాటం మలుపుతిరిగి ఆర్థిక దోపిడీకి వ్యతిరేకంగా అతి సహజంగా మార్పు చెందింది. ఈ సంకల్పం స్వామిజీని బీహార్ రైతు ఉద్యమంలోకి ప్రవేశపెట్టింది.

కాంగ్రెసు సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నేనూ, మోహన్‌లాల్ గౌతమ్‌గారూ అఖిల భారత రైతుమహాసభలను లక్నోలో జరుపుతున్న సమయంలో, తొలిసారిగా ఆవేదికమీద, ఇందూలాల్ యాగ్నిక్‌గారితో సహా స్వామిజీని నేను కలుసుకున్నాను. శ్రీ జయప్రకాశ్ నారాయణ్ సలహా ప్రకారం సభకు అధ్యక్షత వహించవలసిందిగా స్వామిజీని, మేం ఆహ్వానించాం! ఆ మహాసభ తదుపరి అఖిల భారత కిసాన్ కాంగ్రెసును స్థాపించాలన్న నిర్ణయాన్ని తీసుకుంది. జాతీయ కాంగ్రెసు మహాసభలు జరిగే సమయంలోనే, ఫైజాపూర్‌లో అఖిల భారత కిసాన్ కాంగ్రెసు మహాసభలను కూడా జరపాలని మహాసభ తీర్మానించి, అందుకు కన్వీనర్లుగా స్వామిజీని, నన్నూ, మోహన్‌లాల్ గౌతమ్ గార్లను ఎన్నుకొంది. తదుపరి జరిగిన ఫైజాపూర్ కిసాన్ కాంగ్రెస్ సభ పూర్తిస్థాయి కలిగిన అధ్యక్షులుగా నన్ను, ప్రధాన కార్యదర్శిగా స్వామిజీని ఎన్నుకొన్నది. ఒకరైతు నాయకునిగా ఆవిధంగా, ఆయన జాతీయ రంగంలో ప్రవేశించారు.

స్వభావరీత్యా స్వామిజీ చురుకైన వ్యక్తి. సాంఘికంగా, సాంస్కృతికంగా హైందవ మతపునరుజ్జీవన ఉద్యమ నాయకునిగా, జవసత్త్వాలు మూర్తీభవించిన నాయకునిగా తనకు తానే ఎదిగారు. ప్రాచీన కావ్యాలను, పురాణేతిహాసాలను ఆయన పుక్కిటబట్టారు. అయితే ఆర్షవాఙ్మయాన్ని, ప్రాచీన సాహిత్యాన్ని మార్క్సిజం అంగీకరించనందున, సోషలిస్టులలోని భిన్న వర్గాల మధ్య సిద్ధాంతపరమైన విభేదాల కారణంగా, ఆయనకు పాండిత్య సంపద అక్కరకు రాలేదు. ఇంగ్లీషు భాషలో ఆయనకు సాధారణ ప్రవేశం మాత్రమే ఉంది. హిందీ బాషా పరిజ్ఞానం కూడా అంతంత మాత్రమే. హిందీలో ఆయన ప్రసంగిస్తూ ఉంటే, కుటుంబ సభ్యులమధ్య మాట్లాడుకుంటున్న తరహాలో, గ్రామీణ ప్రాంత యాసతో ఉంటుంది. బహిరంగ సభలలో ఆయన వేదికమీద ఇంగ్లీషులో ఎన్నడూ ప్రసంగించే వారుకాదు. ఆయన హిందీ ఉపన్యాసాలు నిప్పులు కురిపిస్తూ, నిర్భయంగా, దేనినీ లక్ష్యపెట్టకుండా, ప్రజల పరిభాషలో అనర్గళంగా సాగుతూ, ప్రజలను ఆకట్టుకుంటూ ఉంటాయి. విలక్షణమైన స్వామిజీ స్వరూపం, కాషాయవస్త్రధారణ, ఆయన ఉపన్యాసాలకు మరింత ఆకర్షణను తెస్తాయి. ఇటు భూస్వాములు, జమిందార్లకూ, అటు కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా పోరాడేందుకు, కమ్యూనిస్టులు ఆయనను ఒక ఆయుధంగా వినియోగించుకున్నారు. వామపక్ష ఐక్యసంఘటనలో, స్వామిజీ ప్రవేశించడం వల్ల, చైతన్యవంతమైన ఒక నూతన శక్తి మాలో ఉద్దీపనమైనట్లుగా శ్రీ జయప్రకాశ్ నారాయణ్, ఇందూలాల్ యాగ్నిక్, నేనూ ఉత్తేజాన్ని పొందాం. కానీ స్వల్ప కాలంలోనే, 1936-37 జనరల్ ఎన్నికల తరవాత, కమ్యూనిస్టులు వారి హిందీ, ఇంగ్లీషు పత్రికలలో స్వామిజీకి బాగా ప్రచారాన్ని కల్పించి, తమవైపు ఆకర్షించుకున్నారు. 1938 నాటికి, బెంగాల్, గుజరాత్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, అస్సాం, రాజస్థాన్ ప్రాంతాలలో రైతాంగ సంస్థలు నామమాత్రంగా ఉండేవి. ఫైజాపూర్ రైతు మహాసభ జరగడానికి ఒక సంవత్సరం క్రితం వరకూ చెప్పుకోదగిన రైతు ఉద్యమాలు నిర్వహించలేదు.

అఖిల భారత కిసాన్ మహాసభ అధ్యక్ష పదవి ఎంపిక, పెద్ద తుఫాన్ వచ్చి వెలిసినంత పనైంది. దీని ద్వారా కమ్యూనిస్టులు బలోపేతం కావడం మాకిష్టం లేదు. కాంగ్రెసు సోషలిస్టు పార్టీ నాయకులు, నేనూ కూడా, నూటికి నూరుపాళ్లు రైతుల అభివృద్ధికి కృషిచేసే వ్యక్తిని మాత్రమే ఎన్నుకోవాలనే ఉద్దేశంతో, మధ్యేవాదిగా స్వామీజీ నాయకత్వం వహించడానికి మేం అంగీకరించాం! తదుపరి అధ్యక్ష పదవిని వదులుకొని, నేను ఒక కార్యకర్తగా, సంస్థకు సేవచేయగలనని చెప్పాను. అప్పట్లో ప్రధాన కార్యదర్శిగా ఉన్న స్వామీజీని, కాంగ్రెసుతో సహా, ఏ రాజకీయ పార్టీకి కిసాన్ సభను అనుబంధంగా మార్చరాదని, ఒక స్వతంత్రసంస్థగా దాన్ని నిర్వహించమనీ, ఆయనను కోరాం!

ప్రస్తుత సమాజాన్ని పట్టి పల్లారుస్తున్న సాంఘిక, రాజకీయ దుష్టితికి వ్యతిరేకంగా, ప్రజల జీవన పరిస్థితుల్ని విప్లవాత్మక కార్యక్రమాలతో మార్చుచేసి, వ్యవస్థను తలక్రిందులుగా మార్చేందుకు, వామపక్షసిద్ధాంతాంతోగానీ, మితవాద ధోరణితోగానీ, ఏ మార్గాన్ని అనుసరిస్తామనే దాన్ని పరిగణనలోకి తీసుకోకుండా, స్వామీజీ అప్రతిహతంగా తీవ్రమైన కృషిచేశారు. తీక్షణమైన ఆయన వాగ్ధోరణి, ప్రజల హృదయాలలో జ్వాలలను రగిలించేది. సాహసవంతమైన తన కార్యక్రమాల్లో ఎదురయ్యే కష్టనష్టాల నన్నింటినీ ఆయన ధైర్యంగా ఎదుర్కొనేవారు. గాంధీజీ సన్నిధిలోకూడా, ఆయన జంకూ గొంకూ లేకుండా వ్యవహరించేవారు. ఎల్లప్పుడూ నిప్పులు చిమ్ముతూ, లావాను ఎగజిమ్మే అగ్నిపర్వతంలా ఆయన కనిపించేవారు. బ్రిటిష్ ప్రభుత్వమూ, దాని అనుచరవర్గమైన జమిందార్లు, తుదకు కాంగ్రెసు అగ్రనాయకులు సైతం ఆయన అడుగుల చప్పుడు వింటే బెంబేలు పడిపోయేవారు. కర్రలు ధరించి రైతు సమూహాలు ఆయనవెంట నడిచివస్తూ ఉంటే,బ్రిటిష్ ప్రభుత్వమూ, ఇతర రాజకీయ పార్టీలూ వణికిపోయేవి. స్వామీజీ కనుసన్నలలో, ఆశీర్వాదంతో ముందుకు నడిచే జనసమూహాన్ని చూసి భయపడే పరిస్థితి, అనాటి రాజకీయ రంగంలో అలుముకొని పోయింది.

రైతుల రక్షణ కోసం శాసనం చేయాలని, ప్రభుత్వాన్ని కోరుతూ, లక్షమంది రైతులతో, స్వామీజీ కిసాన్ ప్రదర్శనను పాట్నావరకు నడిపించారు. ఆ ప్రదర్శనను తలకించిన తదుపరి, ఏమాత్రం ఆలస్యం చేయకుండా అప్పటి కాంగ్రెసు మంత్రివర్గం అవసరమైన రైతు రక్షణ చట్టాన్ని రూపొందించేందుకు త్వరపడసాగింది. కౌలుదార్లు తాము సాగుచేస్తున్న భూములను వదలరాదనీ, వాటిని ఆక్రమించుకో వలసిందని స్వామీజీ ఇచ్చిన పిలుపుమేరకు, ప్రభుత్వ హెచ్చరికలను సైతం లక్ష్యపెట్టకుండా, రైతాంగం ముందుకు దూకింది. దిక్కులు పిక్కటిల్లే నినాదాలతో, కర్రలు చేతబూనిన రైతు ప్రదర్శనలు కొనసాగిస్తూ, రైతులపై నిర్బంధ చర్యలకు పూనుకుంటున్న జమిందార్లకు తమ ప్రతాపాన్ని చూపెట్టారు. జమిందార్లకు అండగా నిలిచిన కాంగ్రెసు మంత్రులకు స్వామీజీ అరివీర భయంకరుడిగా కన్పించసాగారు. ఎన్నికల సమయంలో కాంగ్రెసు పార్టీకి తెరవెనుక ఉండి సహాయపడుతున్న ధనిక, భూస్వామ్య స్వార్థపరశక్తులకు స్వామీజీ మేరుపర్వతంలా కనిపించసాగారు.

ప్రజాభిమానాన్ని సంతరించుకుని సామ్రాజ్యవాద వ్యతిరేక రైతు నాయకునిగా, స్వామీజీ జాతీయస్థాయికి ఎదిగిన తరవాత, కమ్యూనిస్టులు ఆయనకు సన్నిహితంగా, తమ

సిద్ధాంత దృక్పథాన్ని ఆయన మస్తిష్కంలో ప్రవేశపెట్టి, ఆయన మనోభావాలపై పట్టును సాధించి, కిందిస్థాయి కార్యకర్తలవరకు ఆయన అనుచరులుగా ప్రవేశించారు. అప్పట్లో కమ్యూనిస్టులతో కలిసి, వామపక్ష ఐక్యసంఘటనలో సుభాస్ బోసు, నేనూ కొనసాగడానికి తిరస్కరించిన తదుపరి, అది పతనమై పోయింది. స్వరాజ్యం వచ్చిన తరవాత అధికారాన్ని హస్తగతం చేసుకొనే తమ ఎత్తుగడలో భాగంగా, కమ్యూనిస్టులు స్వామీజీని అనునయంతో తమ చెప్పుచేతల్లో ఉంచుకోవాలని ప్రయత్నించారు. కమ్యూనిస్టులతో తెగదెంపులు చేసుకోవడం అంత సులభంగాదని స్వామీజీ ఆలోచిస్తున్న సమయంలో, ఆయన అనుచరులలో తమ సిద్ధాంతాలను కమ్యూనిస్టులు నాటసాగారు.

అధికార మంత్రివర్గాలనుంచి, కాంగ్రెసు వైదొలిగి, బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా, శాంతియుత పోరాటాన్ని ప్రారంభించడానికి, మేం నిర్ణయం తీసుకున్నప్పుడు, రైతాంగ సమస్యలపై మా దృష్టిని కేంద్రీకరించలేక, కొంతకాలం వెనకడుగు వేయవలసి వచ్చింది. గాంధీజీ వ్యక్తి సత్యాగ్రహానికి పిలుపు ఇస్తే, మేమంతా అందులో పాల్గొని జైళ్లకు వెళ్లవలసి వచ్చింది. ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా కమ్యూనిస్టులు ఇచ్చిన 'ప్రజాయుద్ధ నినాదం'లో స్వామీజీ కూడా చేయికలిపి, వారితో నడిచారు. అందువల్ల రాజకీయంగా ప్రజాభిప్రాయానికి దూరమైన స్వామీజీపై ఇదే అదనుగా భావించి, కక్షతీర్చు కోవాలని బీహార్ కాంగ్రెసు వాదులు ప్రయత్నించారు. ప్రజలంతా గాంధీజీ ప్రారంభించిన 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొని, బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ ఉంటే, కమ్యూనిస్టులు తీసుకున్న బ్రిటీష్ వారికి అనుకూలమైన ప్రజాయుద్ధ నినాదాన్ని స్వామీజీ బలపరచడంవల్ల, ప్రజలంతా స్వామీజీ వల్ల అసంతృప్తి చెందారు.

జైల్లో ఉన్నప్పుడు ఈ పరిణామాలన్నీ తెలిసి, నాకు మిత్రుడూ, రైతు ఉద్యమ నాయకుడైన స్వామీజీ ప్రజాభిప్రాయానికి దూరమై, ఆయన రాజకీయ జీవితం నిష్ప్రయోజనమైనందుకు నేను ఎంతగానో బాధపడ్డాను. కాంగ్రెసు అగ్రనాయకుల సంపోలను తీసుకొని, కాంగ్రెసు మంత్రులపై వ్యతిరేక వైఖరిని కొంతమేరకైనా విడనాడి ఉన్నట్లయితే, స్వాతంత్ర్య సమరంలో కాంగ్రెసుతో కలిసివనిచేసినా, ఆయన రాజకీయ భవిష్యత్ మరోలా ఉండేది. ఆయన కమ్యూనిస్టులతో సహచర్యాన్ని వెరిపారు. కమ్యూనిస్టులు దేశంతో పాటు కలిసి నడవలేరు. దేశం కమ్యూనిస్టులతో కలిసి సాగలేదు. అయినప్పటికీ కమ్యూనిస్టులు యుక్తిగా తమకు సన్నిహిత అభిప్రాయాలు కలిగిన మేధావులు, ప్రజానాయకుల అభిమానాన్ని చూరగొంటూ తమ స్వార్థప్రయోజనాలకు వారిని ఉపయోగించుకుంటారన్న నగ్న సత్యాన్ని ఆయన గ్రహించలేకపోయారు. ఆవిధంగా ఆయన అర్థంచేసుకోగలిగినా, తన సమర్థతనీ, నిర్మాణాత్మకమైన శక్తియుక్తుల్ని, భారత ప్రజల సాంఘిక పురోభివృద్ధికి వినియోగించి, సార్థకతను పొందగలిగేవారు.

అదృష్టం కమ్యూనిస్టులకు అనుకూలించింది. స్వామీజీ ప్రజలకు దూరమైనారు. 1945 నాటికి కమ్యూనిస్టులు స్వామీజీని, ఆయన అనుచరులను గాలికి వదిలివేశారు. అప్పటికి తాను కమ్యూనిస్టులతో గుడ్డిగా సహచర్యం వెరిపానని స్వామీజీ తెలుసుకున్నారు.

అప్పట్లో, ఇందూలాల్ యాగ్నిక్ గారు కూడా ఇలాంటి అభిప్రాయానికే వచ్చారు.

కమ్యూనిస్టులను వదిలివేసి, తిరిగి కాంగ్రెసులో స్నేహం చేద్దామని ఆయన నిర్ణయానికి వచ్చినప్పుడు, స్థానిక కాంగ్రెసు నాయకులు ప్రతీకార ధోరణితో, ఆ ప్రయత్నాన్ని సాగనివ్వలేదు. స్వామీజీని, ఇందూలాల్ జీని తిరిగి కాంగ్రెసు సంస్థలో చేర్చుకొని, వారి ఆర్హతలకు తగు విధంగా, ఉన్నతపదవులు కేటాయించేటట్లుగా, గాంధీజీని, రాజేంద్రప్రసాద్‌నూ నేను ఒప్పించలేకపోయాను. అవకాశం రాగానే, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షపదవినుంచి స్వామీజీని కమ్యూనిస్టులు తొలగించారు. 1946 నాటికి స్వామీజీ బాగా నిరాశా, నిస్పృహలకు లోనయ్యారు. రాజకీయంగా ఆయన పరాజయాన్ని, ఎదుర్కోవడం, కమ్యూనిస్టులకు, కొందరు కాంగ్రెసు వాదులకు ఆనందాన్ని కలిగించింది. కానీ ఎవరికోసం స్వామీజీ తన జీవితాన్ని ఫణంగా పెట్టి, కష్టనష్టాల్ని సైతం ఎదుర్కొని పోరాడారో, యు.పి., బీహార్‌లలోని ఆ రైతులకు మాత్రం తీవ్రమైన వ్యధను కలిగించింది. ఆయన స్వర్గస్థులైన అయిదు సంవత్సరాల తర్వాత, అత్యంత సాహసంగా, తాను సాగించిన కృషికి తగిన 'సజరానా'గా, జమిందారీ వ్యవస్థ రద్దు గావించబడింది. దీని ఫలితంగా కోటిమంది బీహార్ రైతులు, రెండుకోట్లమంది ఉత్తరప్రదేశ్ రైతులకు ప్రయోజనం కలిగి, స్వామీజీ ఆశయం నెరవేరినట్లయింది. రైతులోకానికి స్వామీజీ అందించిన సేవలకు, రైతులోకం ఆయనకు ఎంతగానో రుణపడి ఉంది. ప్రస్తుతం కొన్ని దశాబ్దాలుగా కాంగ్రెసు ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురిఅయి ఎన్నో కష్టనష్టాలను అనుభవిస్తున్న అక్కడి రైతులు, స్వామీజీ ఈనాడు తమ మధ్య ఉండివుంటే, తాము ఇన్ని బాధల్ని పడిఉండేవాళ్లంకాదని తలపోస్తూ ఉంటారు.

స్వామీజీ మరువురాని మిత్రుడు. నైతిక ప్రవర్తనలోనూ, ప్రజాసేవలోనూ ఆయన నిష్కల్మషంగా దృఢంగా వ్యవహరించారు. దరిద్రులూ, నిస్సహాయులూ అయిన, సామాన్య, పేద ప్రజానీకానికి ఆయన నిండు హృదయంతో సహాయపడ్డారు. వారి అభ్యున్నతికి ఎంతగానో పాటుపడ్డారు. ఆయన హృదయం నవనీతమైనది. ఆయన ప్రజల మనిషి! నిజంగా ఆయన మహోన్నతుడైన నిష్కామయోగి!

బీహార్ ప్రజలు ఆయనపట్ల కృతజ్ఞతా భావంతో, బిహటా ఆశ్రమంలో, అపురూపమైన ఆయన శిలావిగ్రహాన్ని స్థాపించుకున్నారు. అప్పటి బీహార్ ముఖ్యమంత్రి శ్రీ కృష్ణసిన్హా దాన్ని ఆవిష్కరించారు. 1967లో నేను అక్కడికివెళ్లి, ప్రేయమైన ఆ మిత్రునికి పూలమాలను సమర్పించుకున్నాను. అలాగే 1975 మార్చినెలలో, జరిగిన ఆయన 81వ జన్మదినోత్సవ కార్యక్రమాలకు అధ్యక్షత వహించి, నా శ్రద్ధాంజలిని ఘటించాను.

శ్రీ దామోదరం సంజీవయ్య

శ్రీ దామోదరం సంజీవయ్య ది : 14-2-1921 న కర్నూలు జిల్లా పెద్దపాడు గ్రామంలోని ఒక హరిజన కుటుంబంలో జన్మించారు. ఆయన ఎం.ఏ పట్టాను పుచ్చుకొని యల్.యల్.బి డిగ్రీని పూర్తిచేశారు. రంగాగారు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు 1950 లో తాత్కాలిక పార్లమెంటుకు కాంగ్రెస్ ప్రతినిధిగా ఆయనను పంపించారు. ఆ తరవాత 1952-64 సంవత్సరాల మధ్య ఎన్నికై కాంగ్రెస్ శాసన సభ్యులుగా కొనసాగారు. రాజాజీగారి నాయకత్వంలోని మద్రాసు మంత్రివర్గంలో 1953-54 సంవత్సరాల కాలంలో ఆయన మంత్రిగా ఉన్నారు. అప్పటినుంచి 1960 వరకు ఆయన మంత్రిగా కొనసాగుతూనే వచ్చారు. 1960-62 సంవత్సరాల కాలంలో ఆయన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. 1962-64 సంవత్సరాల మధ్య జాతీయ కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. 1964-66 సంవత్సరాలలో కేంద్రప్రభుత్వ మంత్రి. 1971 వ సంవత్సరంలో ఆయన అసువుల బాసే నాటికి కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నారు. తెలుగు భాషలో ఆయనకు మంచి పాండిత్యం ఉన్నది. ఆయన సతీమణి శ్రీమతి క్రిష్ణవేణి, ఆయన సోదరుని పుత్రులు శ్రీ దామోదరం మునిస్వామి గారలు ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ లో మంత్రులుగా కొనసాగుతున్నారు - (ఎడిటర్)

భారతదేశ మంతటా గౌరవాదరాలను పొందిన ముగ్గురు ప్రముఖ హరిజన నాయకులలో సంజీవయ్యగారొకరు. ఆయన డాక్టరు అంబేద్కరు గారిమీద అంత అనురక్తంగా ఉండేవారు కాదుగానీ మరో ప్రముఖ హరిజన నాయకులు జగ్ జీవన్ రామ్‌గారిపట్ల మాత్రం చాలా ప్రేమతో ఉండేవారు. డాఅంబేద్కర్ గారు రాజీలేని పోరాటాన్ని నెరపి తనకు, షెడ్యూల్డ్ కులాలకు అఖిల భారత స్థాయిలో తగిన గుర్తింపును, కేంద్ర ప్రభుత్వంలో తగిన స్థానాన్ని సంపాదించుకున్నారు. శ్రీ సంజీవయ్య, జగ్ జీవన్ రామ్‌గార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను అనుసరించి గుర్తింపులోనికి వచ్చారు. డా॥ అంబేద్కర్ గారు విస్తృతమైన జాతీయాశయాలతో, తన వర్గాల ప్రజలకోసం గొప్ప లక్ష్యాలతో, కాంగ్రెస్‌వారు ఆహ్వానించి నప్పటికి అధికారానికి దూరంగా ఉన్నారు. ఈ ఇరువురు హరిజన నాయకులు అలాకాక కాంగ్రెస్ అగ్రనాయకుల దృష్టిలో మంచివారుగా మెలుగుతూ, ప్రభుత్వ పరంగా తమ వర్గాల ప్రజలకు న్యాయం చేయటానికి పూనుకొన్నారు. ఈ ముగ్గురూ కూడా, షెడ్యూల్డు కులాలు, జాతులకు, అణగారిపోయిన వర్గాలకు సహాయం చేస్తూ, వారిని అభివృద్ధి పధంవైపు నడిపిస్తూ భారత దేశంలో గొప్ప దేశభక్తి పరులైన నాయకులుగా కీర్తి గడించారు. మద్రాసు రాష్ట్రంలో మంత్రిపదవి, ఆంధ్రరాష్ట్ర వర్గాలలో మంత్రిపదవులు,, శ్రీ నెహ్రూ శ్రీమతి ఇందిరాగాంధి కేంద్ర మంత్రివర్గాలు రెండింటిలోను మంత్రిపదవి, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్ష పదవి, జాతీయ కాంగ్రెస్ అధ్యక్షపదవి, ఇన్ని హోదాలను అనుభవించగలిగిన వ్యక్తి శ్రీ సంజీవయ్యగారొక్కరే. బాబూ జగ్‌జీవన్‌రామ్ గారిలాగానే సంజీవయ్య గారు కూడా కాంగ్రెస్ అధ్యక్ష పదవిలోనూ, మంత్రిపదవుల్లోను ఉంటూ జవహర్లాల్ గారికి, శ్రీమతి ఇందిరాగాంధీకి చివరి వరకూ విశ్వాసపాత్రులుగా మెలిగారు.

మహారాజుల్లాగా ఎన్నో గొప్ప అవకాశాలను వారు ఆయనకు కల్పించారు. ఆయనకున్న గొప్ప అదృష్టం కారణంగా ఆయనెప్పుడూ తనకు లభించిన అవకాశాలను దుర్వినియోగ పరచుకోలేదు. తన విధులను సక్రమంగా నిర్వహిస్తూ, తాను పొందిన బాధ్యతలను సక్రమంగాను, సమర్థవంతంగాను నిర్వహించారు. ఆయన తాను పొందిన పదవులను, తనకు లభించిన అవకాశాలను తాను వచ్చిన బలహీన వర్గాల ఆత్మగౌరవ సముద్ధరణకు గాని, వారికున్న సాంఘిక మతపరమైన మూఢవిశ్వాసాలనుంచి వారిని బయటికి లాగేందుకు గానీ ఉపయోగించినట్లుగా ఎవరూ భావించరు. డా॥ అంబేద్కర్, అన్నాదురై, బారిష్టరు రామస్వామిగార్ల మాదిరిగా ఆయన సామాజిక విప్లవవాది కాదు.

స్వతంత్ర భారతదేశంలో అదృష్టం వరించి రాజకీయ నాయకులైన వారు సంజీవయ్యగారు. తనకు అందిన ప్రతి అవకాశాన్ని తన తెలివితోను, లాల్ బహదూర్ శాస్త్రిగారిలాగే చిరునవ్వు మోముతోను అలంకారంగా దిద్దుకోగలిగినవారు శ్రీ సంజీవయ్యగారు. అవకాశాలు అందుబాటులో కొచ్చినప్పుడు వాటితో ఎలా వ్యవహరించాలో గ్రహించగలిగి, భవిష్యత్తుకు చక్కటి మార్గాలు వేసుకోగలిగారు. డిగ్రీ తీసుకున్న తరవాత మద్రాసు పారసరఫరాల శాఖలో ఉద్యోగం కోసం ఎంప్లాయ్‌మెంటు ఎక్స్‌ఛేంజిలో వేచిఉన్న ఆయనను తీసుకొచ్చి తాత్కాలిక పార్లమెంటుకు పంపటం ద్వారా ఆయన భవిష్యత్ రాజకీయాలకు మార్గం వేసిన ఘనత నాకు దక్కింది. ఆ అవకాశం ఆయనకు శ్రీ సంజీవరెడ్డి గారికి సన్నిహితులు కావటానికి తోడ్పడింది. జవహర్లాల్‌తో సన్నిహితంగా ఉండే సంజీవరెడ్డిగారు సంజీవయ్యగారిని తన అనుచరునిగా నెహ్రూగారి వద్ద చేర్చారు. 1952 వ సంవత్సరంలో రాజాజీ గారి మంత్రివర్గంలో హరిజన సభ్యునిగా సంజీవయ్య గారిని నేను సూచిస్తే, శ్రీ సంజీవరెడ్డి కూడా సంతోషంతో ఆ సూచనను బలపరిచారు. ముఖ్యమంత్రులందరిలో అత్యంత సమర్థవంతులైన రాజాజీగారివద్ద పనిచేస్తూ మంచి అనుభవాన్ని సంపాదించుకొనేందుకు ఆ రకంగా సంజీవయ్యగారికి అవకాశం కలిగింది. 1955 వ సంవత్సరంలో సంజీవరెడ్డిగారు తన అనుచరునిగా ఆయనను ఆంధ్రమంత్రివర్గంలోనికి ఆహ్వానించారు. 1959 లో సంజీవరెడ్డిగారు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులైనప్పుడు కొద్ది మాసాల తర్వాత మేం ప్రజాస్వామ్య ప్రతిపక్షంగా స్వతంత్రపార్టీని రాజాజీ నాయకత్వంలో ప్రారంభించాం. అప్పుడు దానికి నేను అధ్యక్షునిగా ఉన్నాను. సంజీవరెడ్డిగారు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పదవినుంచి తప్పుకొన్న తరవాత రాజీ అభ్యర్థిగా సంజీవయ్యగారు ఆ స్థానాన్ని అలంకరించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కావటానికి వీలుగా సంజీవరెడ్డిగారు కాంగ్రెస్ అధ్యక్షపదవిని విసర్జించినప్పుడు నెహ్రూగారి సలహాను గౌరవించి క్రమశిక్షణ కలిగిన వ్యక్తిగా శ్రీ సంజీవయ్య పక్కకు తొలిగారు. అది నెహ్రూగారికి బాగా సంతోషకారణమైంది. అందువల్ల 1962 సంవత్సరంలో నెహ్రూగారు పూర్తి విశ్వాసంతో సంజీవయ్యగారిని అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నిక చేశారు. కొద్దికాలం గడచిన తరవాత కేంద్రప్రభుత్వంలో కార్మిక శాఖామంత్రిగా తీసుకున్నారు. 1967 పార్లమెంటు ఎన్నికలలో ఓటమిపాలైన తర్వాత కొద్దికాలం ఆయన ఎలాంటి ఉన్నతపదవీబాధ్యతలు లేకుండా ఉన్నారు. అదే ఆయన జీవితంలో అసంతృప్తి పాలైన ఆఖరు సంఘటన, మొదటి సంఘటన. కొంతకాలం గడచిన తర్వాత ఆయన రాజ్యసభ సభ్యుడై తిరిగి కేంద్రమంత్రివర్గంలో

ప్రవేశించారు. 1969-70 సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ రాజకీయ అస్థిరత్వంలో పడిపోయినప్పుడు ఆయన శ్రీమతి ఇందిరాగాంధీని మనస్ఫూర్తిగా బలపరిచారు. జగ్‌జీవన్ రామ్‌గారు కాంగ్రెస్ అధ్యక్షపదవిని వదలివేసిన తర్వాత శ్రీ సంజీవయ్యగారు కేంద్ర మంత్రిపదవికి రాజీనామా చేసి తిరిగి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షపదవిని చేపట్టారు. జవహర్లాల్ నెహ్రూగారు, శ్రీమతి ఇందిర ఇరువురూ కూడా రాజకీయ అధికారం కోసం కాంగ్రెస్‌లో క్లిష్ట పరిస్థితులు నెలకొనిఉన్న ఆ రోజులలో శ్రీ సంజీవయ్య గారి ప్రవర్తన విధేయత చూసి చాలా సంతోషించారు. నిర్ణయం ఆయనకు వదలివేస్తే సంజీవయ్యగారు కాంగ్రెస్ అధ్యక్షపదవిలో కొనసాగే కంటే అంతకు ముందు జగ్‌జీవన్‌రామ్, సంజీవరెడ్డిగార్లలాగే మంత్రిపదవిలో ఉండేందుకే ఎక్కువ ఇష్టం చూపెట్టేవారు. అయితే గతంలో లాల్ బహదూర్ శాస్త్రిగారిలాగే అధికారం కన్నా అగ్రనాయకులకు విశ్వాసపాత్రులుగా ఉండడమే మేలని ఆ సందర్భంలో ఆయన తలపోశారు.

సంజీవయ్యగారు బాగా ఓర్పుతోను బాధ్యతాయుతంగాను ప్రవర్తించే వారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తనతో విభేదించిన ఒక మంత్రి పోర్టుఫోలియోలను ఉపసంహరించి ఆయన రాజీనామాచేసే విధంగా ప్రవర్తించినందువల్ల కాంగ్రెస్ పెద్దల అసంతృప్తికి గురైనారు. ఆ తరువాత సంజీవరెడ్డిగారి మంత్రివర్గంలో చేరమని ఆయనను ఆహ్వానించినప్పుడు తన సహచరులయిన సత్యనారాయణ రాజాగారిని ఆహ్వానించనందుకు మంత్రివర్గంలో చేరకుండా ఆయన ఆ సందర్భంలో ఒక సంవత్సరంపాటు ఖాళీగా ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఆయన ఇండోర్ మహాసభలో మంత్రులుగా ఉన్నవారు, బయట ఉన్నవారు గూడా, ప్రధానమంత్రి కాలోయేముందు జాతికి పండిత నెహ్రూగారిచ్చిన వాగ్దానాలను మరచిపోయి నైతిక విలువలకు తిలోదకాలిచ్చి అక్రమ మార్గంలో ధనసంపాదనకు పాల్పడుతున్నారని బహిరంగంగా నిర్భయంగా చెప్పగలిగారు. ఆయన గాంధీగారి వద్ద కొద్దికాలం పనిచేసిఉన్నా, అంబేద్కర్ గారి విప్లవధోరణిని ఆకళింపులోనికి తెచ్చుకొని ఉన్నా, ఇంకా ఇంతకంటే గొప్పగా ఆయన నెహ్రూగారికి, ఇందిరాజీకి ఉపయోగపడుతూ హరిజనుల సముద్ధరణకు, సామాజిక విప్లవ కృషికి ఎక్కువగా ఉపయోగపడగలిగేవారు. సంజీవయ్యగారు లాల్ బహదూర్ శాస్త్రిగారిలాగే ఎలాంటి నిందలు లేని రాజకీయ జీవితాన్ని గడిపారు. ఈ గాంధీ యుగంలోని ఏ జాతీయ నాయకుడికైనా ఆదొక గొప్ప విషయం.

సంజీవయ్యగారు కర్నూలు జిల్లాలో మాలదాసరి కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి హైందవ భక్తిమార్గంలో బాగా ఆసక్తి కలిగినవారు, పండితులు. ఆయన కుటుంబం కొద్దిపాటి భూవసతి కలిగిన వ్యవసాయ కుటుంబం. ప్రతి అయిదు సంవత్సరాలలో రెండు సంవత్సరాలు కరువుతో ఉండే ఆ ప్రాంతంలో ఆ కుటుంబ సభ్యులు రోజా కూలీతో జీవితాన్ని గడవవలసి వస్తుండేది. గాంధేయ తత్వాభిలాషులు హరిజనునిగా ఆయనకందించిన సహాయం ఆయన హైస్కూలు విద్యను కాలేజి విద్యను పూర్తిచేసుకుని డిగ్రీ సంపాదించేందుకు వీలు కల్పించింది. ఆయన ఒక స్థానంలో నుంచి మరొక స్థానానికి ఆడుతూ పాడుతూ తన కథిమానపాత్రమైన తెలుగు పద్యగానంతో పాటల పల్లవితో ముందుకు నడిచారు. ఆయన పండిత నెహ్రూగారివద్ద కార్మిక శాఖమంత్రిగాను, శ్రీమతి ఇందిరవద్ద పరిశ్రమల శాఖ మంత్రిగాను

పనిచేశారు. ఆయన మంత్రిగా పనిచేసే రోజుల్లో గరీబీ హటావో నినాదంతో ముందుకు వచ్చిన అత్యవసర పరిస్థితిలోలాగా ప్రత్యేకమైన అధికారాలు లేవు. అయినప్పటికీ ఆయన మంత్రిగా కొనసాగిన ఆ వెలుపైన సమయంలో రాష్ట్ర ప్రభుత్వంను పత్తిచేసి కేంద్రాధికారాలను వినియోగిస్తూ తన తల్లిదండ్రులు ఉన్న వ్యవసాయ కార్మిక కుటుంబాలకు సహాయపడేవిధంగా కనీసవేతనాల చట్టాన్ని అమలు చేయించారు. పరిశ్రమల మంత్రిగా ఉన్నప్పుడు వెనుకబడిన షెడ్యూల్డ్ కులాల్లోని స్వయంవృత్తిదారులైన యువకుల కోసం పారిశ్రామిక సహకార సంఘాలను ఏర్పాటు చేయించారు.

ఆయన రాజకీయంగా ఉన్నత స్థితిలో ఉండడం కారణంగా హరిజన యువకులలో ఆత్మవిశ్వాసం పెరిగింది. కవులను, కళాకారులను, సంగీత కారులను ఆయన ఆదరించడం ద్వారా ఆంధ్ర యువకులలో లలిత కళలపై అభిమానాన్ని ప్రేరేపించారు. అన్ని కులాల ప్రజలతోను, నాయకులతోను కలసి మెలసి ఉండడం ద్వారా హరిజన యువకుల్లో సమదృష్టిని కల్పించేందుకు తోడ్పడ్డారు. రెండుసార్లు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టి గ్రామీణ ప్రాంత కూలిజనాల్లోనూ, అణగారిపోయిన నిమ్నజాతుల ప్రజల్లోనూ, జాతీయ రాజకీయాలపైన కాంగ్రెస్‌పార్టీ పట్ల విశ్వాసాన్ని పెంచగలిగారు. పక్కలైట్లు విధానాలు, చప్పట్లును నిరాకరించి తిరస్కరించి సాంఘిక బాధ్యతా నిర్వహణలో గాంధేయవిధానాన్ని ఆయన బలపరిచారు. తన సహచరుడికి మంత్రిపదవి లేకుండా తనకు మంత్రిపదవిని ఇవ్వజూపినపుడు దానిని తిరస్కరించడం ద్వారా సాంప్రదాయకంగా బలహీనంగా ఉన్న వర్గాలలో నుంచి వచ్చినప్పటికి మంత్రిపదవిలాంటి దాన్ని ఎంత తృణప్రాయంగా నెట్టివేయగలరో, ఆయన రుజువుచేసి చూపెట్టారు.

కాంగ్రెస్ అధ్యక్షపదవిలో ఉన్నప్పుడు సంజీవయ్యగారు తమవు చాలించారు. 1971 సాంఘిక విప్లవంలో ఆయన ప్రధాన భూమికను నిర్వహించి శ్రీమతి ఇందిరాగాంధీ గరీబీ హటావో నినాదాన్నంగీకరించి దేశావసరాలకు కావలసిన విధంగా గొప్ప కృషిచేశారు. వీటన్నింటిలో ఆయన ఎక్కువగా జగ్‌జీవన్‌రామ్‌గారిని అనుసరించారు. ఆయన మరణించినప్పుడు జాతి యావత్తూ ఆయనకు వీరోచితమైన శ్రద్ధాంజలి ఘటించింది. కాంగ్రెస్‌కు ముఖ్యంగా హరిజనులు, వెనుకబడిన వర్గాలు ఎంతో ఆవేదనతో ఆయనకు శ్రద్ధాంజలి ఘటించాయి. ఒక గొప్ప అనుభవం కలిగిన హరిజన నాయకునిగా ఆయన బాగా అనుభవాన్ని పొంది జీవితంలో మంచి స్థితిని సాధించిన సమయంలో 1971-72 సంవత్సరాలలో ఒక మహత్తర సాంఘిక పరివర్తనకోసం ప్రజలు తమ తీర్పునిచ్చిన సమయంలో ఆయనను మృత్యువు బలిగొనటం మనదేశ దురదృష్టం. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైదరాబాదు నగరంలో ఆయన పేరుతో 'సంజీవయ్య పార్కు" అను గొప్ప పార్కును ఏర్పాటుచేసి దానిని ఆయన స్మృతి చిహ్నంగా నిలిపింది.

34

శ్రీమతి సరోజినీ నాయుడు

ఆంధ్ర, బెంగాల్ ప్రాంతాలకు చెందిన శ్రీమతి సరోజినీ నాయుడు 13-2-1871 న హైదరాబాదులో జన్మించారు. ఇంగ్లండు దేశంలో విద్యాభ్యాసం కావించారు. ఆంగ్ల భాషలో కవయిత్రిగా పేరు సంపాదించుకున్నారు. 1915 వ సంవత్సరంలో స్వాతంత్రోద్యమంలో ప్రవేశించారు. 1920-27 సంవత్సరాలలో గాంధీజీకి, కాంగ్రెస్ పార్టీకి సహచరురాలిగా స్వదేశీపాలన కోసం సహాయ నిరాకరణోద్య మంలో పనిచేశారు. దక్షిణాఫ్రికాలో 1924 వ సంవత్సరంలో విజయవంతంగా పర్యటన ముగించుకొని వచ్చిన తర్వాత 1925 సంవత్సరంలో కాంగ్రెస్ అధ్యక్షురాలైనారు. ప్రపంచమంతా పర్యటించారు. 1946 వ సంవత్సరం వరకు కాంగ్రెస్ కార్యవర్గ సభ్యురాలిగా ఉన్నారు. అఖిల భారత మహిళా సంఘానికి మహిళా ఉద్యమానికి ప్రారంభకురాలు. ఉత్తరప్రదేశ్ గవర్నరుగా పనిచేశారు. 1947 సంవత్సరంలో న్యూఢిల్లీలో జరిగిన మొదటి ఆసియా మహాసభకు అధ్యక్షురాలిగా ఉన్నారు. 1949 వ సంవత్సరం మార్చినెల 2వ తేదీన స్వర్గస్థురాలైనారు - (ఎడిటర్).

డాక్టరు అనీబిసెంటుగారి అరెస్టుకు నిరసనగా మాగ్రామంలో జాతీయ దినోత్సవం నాడు ఉపవాస దీక్షకు పూనుకొని పూరేగింపు జరిపినందుకుగాను 1917వ సంవత్సరంలో మా ఇంటికి పోలీసులు రావడం ద్వారా మాకు పోలీసుపరమైన తొలి అనుభవం జరిగింది. 20వ శతాబ్దంలో ఆమె భారత జాతీయ కాంగ్రెసుకు, భారత స్వాతంత్రోద్యమానికి పితామహులాంటివారు. ఆమె తన దినపత్రిక "న్యూ ఇండియా"లో సామ్రాజ్యవాద వ్యతిరేకతతో స్వదేశీ పరిపాలనకు అనుకూలంగా నిర్భయమైన వార్తలను, సంపాదకీయాలను రాస్తూ ఆ మార్గానికి శ్రీకారం చుట్టారు. 1942 వ సంవత్సరంలో ఎక్కడ ఎప్పుడు "క్విట్ ఇండియా" ఉద్యమం జరుపుతున్నా శ్రీమతి సరోజినీ నాయుడుగారికి పక్కిపక్కినే ఉంటూ నేను గూడా ఆమెతోపాటు కలిసి పాల్గొన్నాను. భారత జాతీయ కాంగ్రెసుకు ఆమె గొప్ప పేరు ప్రఖ్యాతులను పొందిన మహిళా అధ్యక్షురాలు. అప్పటి కాంగ్రెస్ మహాసభ ఫొటో ఆల్బంను ఎంతో ప్రేమతో ఇప్పటికీ నేను భద్రపరచుకున్నాను.

నేను ఆక్స్‌ఫర్డ్‌లో అండర్ గ్రాడ్యుయేట్‌గా విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో మొదటిసారిగా అనీబిసెంటుగారి ప్రసంగాన్ని విన్నాను. ఆమె జీవితంలో అది చాలా అప్రతిష్టాకరమైన సంఘటన. ఎందుకంటే ఆమె మహాత్మాగాంధీగారి సహాయ నిరాకరణ కార్యక్రమాలకు, ముక్కోణపు బహిష్కరణ యత్నాలకు ఆరోజు వ్యతిరేకంగా మాట్లాడారు. భారతదేశ స్వాతంత్రసముపార్జనకోసం జరుగుతున్న కృషిని ఆ సందర్భంలో ఆమె వ్యతిరేకిస్తున్నదనే అభిప్రాయంతో బాధతో ఆ ప్రసంగాలను మేం విన్నాం. అయితే మృదువైన ఆమె కంఠస్వరాన్ని వాక్చాతుర్యాన్ని, భారత మాతృభూమిని గుర్తుకు తెస్తున్న ఆమె సౌందర్యాన్ని నేను మెచ్చుకున్నాను. అదృష్టవశాత్తూ

చాలా సంవత్సరాల తర్వాత తిరిగి అడయార్ లో ఆమె ప్రసంగాన్ని నేను వినడం జరిగింది. మన స్వాతంత్ర్య శక్తులకు ఎలా బలం చేకూర్చుకోవాలా అని మేమంతా ఆలోచిస్తున్న సమయంలో బ్రిటీష్ వారినుంచి స్వాతంత్ర్యాన్ని సంపాదించుకునేందుకు రాజ్యాంగ పద్ధతులను కూడా వినియోగించుకోవలసిందని తన సుమధుర కంఠస్వరంతో ప్రసంగించడమే కాకుండా భారత ప్రజలపట్ల, వారి ఆధ్యాత్మిక సంపదపట్ల ఆమె తనకున్న ప్రేమను, ఉన్నత గౌరవాన్ని నిస్సంకోచంగా వెల్లడించారు.

దక్షిణాఫ్రికా తెల్లవారిని, అక్కడ వారవలంబిస్తున్న వర్ణవివక్షతను, తన ప్రసంగాల ద్వారా ఖండిస్తూ, సరోజనీదేవి వారిని సిగ్గుపడేటట్లు, ఆశ్చర్యపడేటట్లు, తట్టుకోలేనట్లు చేసింది. తాను స్వేచ్ఛగా సంచరించగలిగినట్లే అక్కడి ప్రజలకు కూడా ఆ అవకాశం కల్పించాలని కవితా ధోరణిలో కూడిన వాదనా పటిమతో ఆమె ఇంగ్లీషు వారిని దక్షిణాఫ్రికా డచ్చివారిని, గౌరవంగా మసలుకోవలసిందని చెప్పింది.

ఆమె స్వాతంత్ర్యం వచ్చిన తరవాత 1947-49 సంవత్సరాలలో గవర్నరుగా వెళ్లబోయేంత వరకు కొద్దిపాటి విరామాలను మినహాయిస్తే, ఆ కాలమంతా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యురాలిగా పనిచేశారు. కాంగ్రెస్ కార్యవర్గ సమావేశాలలో కాంగ్రెస్ అభ్యర్థుల ఆర్హతలు శాసనసభలలో ప్రవేశించడం లేదా వాటిని బహిష్కరించడం వంటి అనేక నిరాశాజనకమైన సంభాషణలు జరుగుతున్నపుడు మధ్య మధ్య ఆమె అందించే చక్కని హాస్యం, చలోక్తులు స్త్రీ స్వాభావికమైన క్షమ ఇతర సభ్యులకు ఆ సమావేశాలను ఓర్పుతో భరించడానికి మార్గం చూపెట్టేవి. నా దురదృష్టం ఏమిటంటే నేను ఆ స్థానానికి ఎదిగి వచ్చేటప్పటికి ఆమె అక్కడినుంచి గవర్నరుగా వెళ్లిపోయారు.

మహాత్మాగాంధీగారు భారతస్త్రీలు సాంప్రదాయపరమైన తమ కుటుంబ సరిహద్దులను దాటి తమ భర్తల ఆధిపత్యాన్ని అధిగమించి సత్యాగ్రహ పోరాటంలో పాల్గొనేందుకు ముందుకు రావలసిందని పిలుపు నిచ్చినపుడు అందుకు పూనుకొని ఆదర్శప్రాయురాలిగా నిలిచిన మహిళ సరోజనీదేవి. తాను హాస్యరస ధోరణిద్వారా కవితాశైలితో గూడిన పలుకుల ద్వారా చిన్నచిన్న తేలికపాటి సంభాషణల ద్వారా సత్యాగ్రహులు అనుభవిస్తున్న బాధలను తమాషా తమాషాగా తెలియజేస్తూ విదేశీ పత్రికా విలేకరులకు చాలా అభిమాన పాత్రంగా ఉంటుండేది. గాంధీజీ కార్యక్రమాలపై ఆమె అందించే వ్యాఖ్యలు వారిని ఉత్సాహపరుస్తుండేవి. బ్రిటీష్ దళాలు సత్యాగ్రహంలో పాల్గొంటున్న భారతీయ స్త్రీలను పట్టించుకోకుండా, భారత మహిళలు కొనసాగిస్తున్న కృషిని ప్రపంచానికి అందకుండా జేస్తున్న సమయంలో శ్రీమతి సరోజనీ దేవి అంతర్జాతీయంగా ప్రఖ్యాతి చెందిన ఆమె వ్యక్తిత్వంతోనూ నిరంతరం తమ చెవుల్లో మారుమ్రోగుతున్న ఆమె గీతాలను, కవితాపదాలను వింటూ ఇంగ్లీషు భాష తెలిసిన ప్రజలంతా గుర్తిస్తున్న తనను అరెస్టుచేయక తప్పనిసరి పరిస్థితులు ఇంగ్లీషు వారికే కల్పించి అరెస్టయి, భారత స్వాతంత్ర సమర పోరాటంలో భారతీయ స్త్రీల పాత్రను విశ్వసమాజానికి విప్పి చెప్పింది. ఆ విధంగా 1857 సంవత్సరపు స్వాతంత్ర పోరాటంలో వీరనారిగా ఖ్యాతినార్జించిన ఝాన్సీ లక్ష్మీభాయిని ఆమె తిరిగి జ్ఞాపకాని కొచ్చేలా చేసింది.

మద్రాసులో అఖిల భారత కిసాన్ కార్యకర్తల మహాసభ జరిగినపుడు ఆమె ఆదరంతో అక్కడికి వచ్చి సర్దార్ పటేల్ గారు ఘమ్మాలను బాగా వ్యతిరేకిస్తున్నప్పటికి జమిందారీల రద్దుకై కాంగ్రెస్ పార్టీ కృషి చేయాలనే నా వాదనను ఆమె బలపరచింది. త్రిపుర కాంగ్రెస్ సభలో సుభాష్ చంద్రబోసు గారికి అనుకూలంగా ఓటు చేస్తున్నపుడు ఆమె నన్ను ప్రోత్సహించారు. పంత్, రాజాజీగారి తీర్మానం ద్వారా కాంగ్రెసు సోషలిస్టుల వెన్నుపోటు కారణంగా ఆఖరి క్షణంలో అధ్యక్షులైన శ్రీ సుభాష్ చంద్రబోసు చిక్కులను ఎదుర్కోవలసి రావడం చూసి ఆమె కనపడకుండా కన్నీళ్ళు రాల్చింది. బ్రిటిషు సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా భారతదేశ స్వాతంత్ర్యం కోసం "విజయమో, వీరస్వర్గమో" అనే వినాదాన్ని బొంబాయి ప్రసంగంలో బాపూజీ గారిచ్చినపుడు ఆమె ఆయన ప్రసంగాన్ని భ్రాంతితో తిలకించింది. మహిళా నాయకురాలిగా ఆమె స్థాయిని గుర్తించి సంతోషిస్తూ ఆమె భారతీదేవిగారిని ఎక్కువగాప్రేమించ గలిగింది. భారతీదేవి విజయవంతంగా నిర్వహించిన పికెటింగ్ కార్యక్రమాన్ని ఆమె ప్రశంసించారు. ఎప్పుడైనా అఖిలభారత కాంగ్రెస్ సమావేశాంకు భారతీదేవిగారు వెళ్లినపుడు ఆమె తన వద్దకు వచ్చి కూర్చోవలసిందిగా కోరుతుండేది. ఒకమారు ఆమె నావైపు తిరిగి ఇలా అన్నది. "మీరెంత అదృష్టవంతులు చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. మంచి సమర్థురాలు" అన్నది.

సరోజినీదేవి గారి రెండో కుమార్తె లీల కూడా భారతీదేవి అక్కడ ఉన్నప్పుడు ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకుంటూ ఉండేది. అయితే వారిద్దరూ అంత దగ్గర స్నేహితులు కాలేకపోయారు. ఎందుకంటే లీలకు నవీన అలంకారాలపై ఆకర్షణ ఎక్కువ. భారతీదేవి కుటుంబ పద్ధతిలో భారత స్త్రీగా నమ్రత కలిగిన అలంకరణలకు మాత్రమే అలవాటుపడి జీవిస్తుంటుంది. ఆమె పదినగారు కమలాదేవి 1927 సంవత్సరం నుంచి భారతీదేవిగారి అభిమానానికి పాత్రురాలయ్యింది. కమలాదేవిగారు కాంగ్రెస్ వేదికల మీదను రైతాంగ వేదికల మీదను నన్ను అభిమానిస్తూ చక్కని తోడ్పాటు నందిస్తుండేవారు. సరోజినీ దేవి, కమలాదేవి, భారతీదేవి గారిని అభిమానించినట్లుగా వారిద్దరూ పరస్పరం ఒకరి నొకరు అంత ఎక్కువగా అభిమానించుకుంటారని నేను చెప్పలేను. సరోజినీ దేవిగారి పెద్దకుమార్తె పద్మజగారు కూడా తన తల్లి అభిమానించే వారందరినీ అభిమానిస్తుండేది. అయితే ఆమె మనస్సు మాత్రం పూర్తిగా జవహర్లాల్ గారికి అంకితం అయింది. ఆమె మాట్లాడుతున్నపుడు ఆమె తల్లిగారు మాట్లాడినట్లుగానే మృదుమధురమైన నాదాలు వినిపిస్తుంటే ఆ ధ్వనిలో ఆమె తల్లిగారిని తలుస్తూ నేను కళ్ళు మూసుకొని వింటుండేవాడిని. అయితే ఆమె హైదరాబాదు రాజకీయాలను నేను అంగీకరించలేకపోయేవాడిని. సరోజినీదేవి కాకతీయ వంశానికి చెందిన నాయుడుగారిని వివాహంచేసుకొని మన సాంప్రదాయంలో ఇమిడి పోయింది. ఈ కారణంగానూ అనేక ఇతర కారణాల వల్లనూ మా రెండు కుటుంబాలు దశాబ్దాల తరబడిగా ఒకరికి మరొకరు సన్నిహితులంగా ఉండిపోయాం. ఆమె జీవిత చరిత్రను 1946 వ సంవత్సరంలో తెలుగులో రచించిన పండిత గొర్రెపాటి వారు నా జీవిత చరిత్రను గూడా రాశారు. అది నా అదృష్టం. భారత స్వాతంత్ర్య పోరాటంలో సాహసికురాలైన ఆ గొప్ప జాతీయ నాయకురాలితో సాహచర్యం ఎంత ఉత్సాహాన్నిస్తుందో చెప్పలేం.

ఆమె ప్రైవేటు జీవితంలో నిజమైన గాంధేయ అలవాట్లకు కట్టుబడని వ్యక్తిగా ఉంటూ దేశీయమైన ఆంక్షలను వ్యంగ్యంగా ఎత్తిచూపుతుండేది. మరొకపక్క సాంస్కృతిక సాంప్రదాయాలకు అనవాలుగా ఉంటూ భారతదేశ సార్వజనీనమైన సాంఘిక దృక్పథానికి ఒక ఉన్నతమైన దృష్టాంతంగా కనిపిస్తుండేవారు. ఆ విధంగా ఆమె రెండు అసంగతమైన రీతులను తనలో ఇముడ్చుకొని గొప్ప వ్యక్తిత్వంతో భాసిస్తుండేవారు. ఒక సమయంలో సాహసి అయిన సత్యభామగాను, మరొక సమయంలో తెలివైన పాండవ పత్ని ద్రౌపదిగాను వ్యవహరించేవారు.

రౌండ్ రౌండ్ టేబుల్ సమావేశంలో భారతదేశ స్త్రీల ప్రతినిధిగా ఆమె పాల్గొని గాంధీజీ గారి వాదాన్ని బలపరచి భారతదేశ స్వాతంత్ర్యాన్ని స్త్రీలు, పురుషులు, యావద్భారతజాతి కోరుతున్నదని తెలియజేశారు. ఆమె గాంధీగారికి ఇంగ్లండు దేశంలోనూ, అహ్మద్‌నగర్ జైలులోనూ ఒక సోదరిలాగా పరిచర్యలు చేసింది. జవహర్లాల్ నెహ్రూగారు భారతదేశ భవిష్యత్తు గురించి ఎక్కువ ఆందోళన చెందుతూ తమ గాంధేయ సత్యాగ్రహ మార్గాన్ని విడచి తమ స్వంత మార్గంలో వ్యవహరించ లేకుండా ఆయన వ్యధచెందుతున్నపుడు ఆమె ఆయనకు స్వస్థత చేకూర్చేది. కొన్ని సమయాలలో కాంగ్రెస్ సంస్థపై సర్దార్‌గారి మొండి పట్టు ఆమెకు జగుప్సాకరంగా ఉండి మా వంటి వారిపట్ల ఆయన కఠినంగా ప్రవర్తించడాన్ని సహించలేనపుడు వాళ్ల దృష్టిలోనుంచి మమ్ములను తప్పించేందుకు ఒక మాతృమూర్తిలాగా చిరునవ్వుతో మమ్మల్ని చేరదీసి భుజాన వేయివేసి సానుభూతితో ఒక నిముషం మమ్మల్ని ప్రక్కకు తీసుకెళ్లి హాస్యోక్తులాడుతూ అన్నింటిని మరిపిస్తుండేది. ఒకమారు ఆమె బొంబాయి రైల్వే ప్లాట్‌ఫారం మీద నేను నా మూడోతరగతి పెట్టెలోనుంచి దిగి వచ్చేంతవరకు కొన్ని నిముషాలు వేచిఉండి నన్ను కలుపుకొని నగరంలోని తన క్యాంపు దాకా ఆమెకు తోడుగా రమ్మని తీసుకెళ్ళింది. సర్దార్ పటేల్ గారికి విశ్వాసపాత్రులైన ఆ ఆహ్వాన సంఘ అధ్యక్షులు దానిని చూసి సరోజనీదేవిగారు సర్దార్ పటేల్ గారికి వ్యతిరేకంగా నాతోనూ, నా సహచరులతోనూ కలుస్తున్నారని అనుమానించారు. ఆమె వారిని ఓ పక్కగా గమనిస్తూ యిలా అంది. "వారిని అలా అనుకోనివ్వండి, ఇప్పుడు మనమేం చేయగలం" అన్నప్పుడు ఆమె అప్పుడే వచ్చిన తుఫాను జల్లులాగా ఉంది.

స్వరాజ్యం రాబోయేముందు తాత్కాలిక కేంద్రమంత్రి వర్గానికి ప్రధానిగా ఉన్న జవహర్లాల్ నెహ్రూగారి ప్రోద్బలంతో ఇండియన్ కౌన్సిల్ ఫర్ వరల్డ్ ఎఫైర్స్‌వారు ఏర్పాటుచేసిన అఖిల ఆసియా మహాసభకు దాని నిర్వహణకు ప్రధాన భూమికను వహిస్తూ శ్రీమతి సరోజనీ నాయుడుగారు చేసిన శ్రమ ఆమె సాధించిన వాటిల్లో ఘనమైనది. పూర్తి ఆత్మ విశ్వాసంతో అప్పట్లో ఆమె ఆ కార్యక్రమానికి పూనుకొని ఆ మహాసభ దగ్గర దీర్ఘమైన భుజాలతో నిలబడి పనిచేస్తున్న సందర్భాన్ని చూసి ఆనందించ వలసిందే గాని చెప్పడానికి సాధ్యం కాదు. జవహర్లాల్ గారు "యూరప్ అమెరికా ఖండాలలోని ప్రజలకు మాతోపాటు బాధలనుభవిస్తున్న సోదర ఆసియా వాసులకు స్నేహ హస్తాన్ని అందిస్తూ తలుపులు తెరచి ఆసియా ప్రజలు ఆదరపూరకంగా ఆహ్వానిస్తున్నారు. విశ్వమానవ జాతి స్వాతంత్ర్యం ఏదో ఒక వర్గం వారి గొప్పతనంపై ఆధారపడి నిలబడదు. అది ప్రతిచోటా ఉన్న సామాన్యజనం పూర్తి స్వాతంత్ర్యంతోనూ అభివృద్ధిచెందడానికి పూర్తి అవకాశాలను కలిగి ఉండడం పైన మాత్రమే ఆధారపడి

ఉంటుంది". అన్న మాటలను యథార్థం చేయడానికి నిద్రిస్తున్న తన బిడ్డలను మేల్కొలిపి సంసిద్ధుల్ని చేయనున్న తల్లిలాగా ఆనాడు శ్రీమతి సరోజినీ దేవి వ్యవహరించింది.

నవంబరు 14వ తేదీ నెహ్రూగారి జన్మదినం రోజున ఆయనను అభినందించడానికి నేను తీన్ మూర్తి భవనానికి వెళ్లినపుడు ఆమెను అక్కడ చూశాను. ఆమె అక్కడ ఒక పడక కుర్చీలో ఆసీనురాలై స్టూల్‌మీద పాదాలను పెట్టుకొని నన్నుచూసి శతాయుష్మాన్‌భవ అని ఆశీర్వదించింది. అంతకు ముందు నవంబరు 7న నా జన్మ దినోత్సవ సందర్భంలో ఆమె పంపిన అభినందన టెలిగ్రామును గురించి నాకు జ్ఞాపకం చేసి అది అయిపోయిన వెంటనే ఇక్కడికి రాగిలిగినందుకు ఆమె సంతోషించింది. నేను మనస్ఫూర్తిగా జవహర్లాల్‌ను అభినందిస్తున్నానని ఆమె గ్రహించి కేంద్రమంత్రివర్గంలో చేరడానికి ఎందుకు నిరాకరించారని నన్ను అడిగింది. "రంగా! నేను ఎక్కువ కాలం జీవించను. నీరొచ్చిన నాకాళ్లను చూడు. నేను చాలా అనారోగ్యంగా ఉన్నాను. అతనికీ నీకూ మధ్య సత్సంబంధాలుండేలా చూడడానికి ఇకముందు నేనుండను. ఆయన కంట్రోళ్లను తన స్వంత అవసరాలకై అట్టి పెట్టడం లేదు. ప్రజలందరికీ అందుబాటయ్యే ధరలలో ఆహారాన్నందించడం కోసమే అంత గట్టి పట్టుదలతో ఉన్నారు." అని ఆమె నన్ను హెచ్చరిస్తూ వివరించింది. ఆ తరవాత జవహర్లాల్ గారు మాపైపు రావడాన్ని చూసి ఆమె పెద్దగా నవ్వుతూ ఇలా అన్నది. "చూడు జవహర్, రంగా తన జన్మదినోత్సవం అయిపోయిన వెంటనే ఆంధ్రదేశం నుంచి పరుగెత్తుకుంటూ నీకోసం ఇక్కడికు వచ్చాడు. నిన్ను పూర్తిగా ఆయన ప్రేమిస్తున్నాడని నేను నిస్సందేహంగా చెప్పగలను." నేను ఖద్దరు దండము తీసుకొని జవహర్లాల్ గారి మెడలో వేశాను. ఆమె నవ్వుతూ రంగాకు రైతులన్నా, ఖద్దరన్నా అభిమానం. అందువల్ల నీ కంట్రోళ్ళతో ఆయనను బాధించకు అని అన్నారు. ఆ తర్వాత నాలుగు మాసాలు గడిచాక మార్చి నెలలో ఆమె మనల్ని వీడిపోయింది. ఆమె మరణానికి యావద్భారతదేశం దుఃఖసముద్రంలో మునిగిపోయి ఆమె ఆత్మశాంతికై తన సంతాపాన్ని ప్రకటించుకొంది.

కుమారి పద్మజ

ఆమె ప్రియమైన కుమార్తె పద్మజా నాయుడుగారు పశ్చిమ బెంగాల్ గవర్నరుగా పనిచేసి మంచి పేరు తెచ్చుకొన్నారు. పద్మజగారు పార్లమెంటులో సమర్థురాలైన వక్త. ఆమె ఇందిరకు తోడుగా ఉంటూ నెహ్రూగారి ఇంట్లో వచ్చే అందుల మంచి చెడులను సమర్థవంతంగా సదా గమనిస్తూ ఉండేది. జవహర్లాల్ గారు, శ్రీమతి ఇందిరాగాంధీ వారి మిత్రులంతా గూడా ఆమెను చాలా ఆదరంగా అభిమానిస్తుండే వారు. ఆమె వారి పూర్వీకులనుంచి లభించిన ఆస్తినంతా హైదరాబాదుకు నడిబొడ్డున ఉన్న సుందర భవనంతో సహా 1975 వ సంవత్సరంలో కేంద్రప్రభుత్వం ఏర్పరచిన సెంట్రల్ యూనివర్సిటీకి దానం చేసింది. ఆవిధంగా ఆ తల్లీ కుమార్తెలిద్దరూ యీ దేశానికి వారు చేయగలిగినంత సేవచేశారు.

పుట్టపర్తి స్వామీజీ – శ్రీ సత్యసాయిబాబా

పుట్టపర్తిలో స్వామి శ్రీ సత్యసాయిబాబా నివాసమైన ప్రశాంత నిలయానికి వెనుకగా వున్న చిన్న మట్టిదిబ్బమీద ఉన్న గుండ్రటి గ్రంథాలయ భవనంమీదనుంచి, చుట్టూ చూసేవారికి తూర్పు కనుమలోని మూడు వరుసల నీలికొండల్ని రానుకుంటూ ప్రవహించే చిత్రావతి అర్ధచంద్రాకృతిలో నేత్రానందాన్ని కలిగిస్తూ ఉంటుంది. డిసెంబరు మాసాంతంలో చిత్రావతీ నదీజలాలు మెల్లమెల్లగా సాగిపోతూ ఉంటే చిత్రావతి వెండిజంతారు పాడిగిన చిత్రంలా కనిపిస్తుంది.

లైబ్రరీ ఉన్న మట్టికట్టకు దిగువన భక్తుల కోసం చతుష్కోణాకారంలో ఉన్న మూడంతస్తుల భవన సముదాయానికి మధ్యలో ప్రశాంతి నిలయాన్ని మనం చూస్తాం! ప్రథమ వీక్షణంలో మనకది ఓ విశ్వవిద్యాలయ ప్రాంగణమా అన్న భావన కలిగిస్తుంది. దాని స్వరూపం ఐరోపా వారి కాథలిక్ మత గురువుల శిక్షణాలయంగా స్ఫురిస్తుంది. అక్కడ ధ్యానంలో పూర్తిగా నిమగ్నమై ఉన్న భక్తజనసందోహంతో పాటు, చెట్లపై తిరుగాడుతున్న పక్షుల కిలకిలా రావాలతో ఆ ప్రాంతం సంతరించుకొని, ప్రశాంత వాతావరణాన్ని అద్దంపట్టి చూపిస్తూ ఉంటుంది.

ప్రశాంతి నిలయంలో నేను అడుగుపెట్టేసరికి, అక్కడున్న వేలాదిమంది భక్తులు కేంద్ర భవనానికి అభిముఖంగా ఏకాగ్రతగా నిలిచి ఉండడం కనిపించింది. ఆవరణలో ఒకరి వెనుక మరొకరు వరుస క్రమంలోనూ, కూర్చునిఉన్న భక్తజనం వెనుక నిలబడి మరికొందరు నిశ్శబ్దంతో, క్రమశిక్షణతో వేచిఉండడం గమనించాను. ఇంతలో నివాసస్థానానికి ముందు వరండాలోకి వచ్చి అటూఇటూ పచార్లు చేస్తూ మేడమీద స్వామీజీ భక్తులను ఆశీర్వదిస్తూ వుండడం చూసాను. భుజానుంచి భూమి మీదకు వేళ్లాడుతున్న కాషాయ అంగీని ధరించి గదినుంచి బయట అటూఇటూ తిరుగుతున్న స్వామీజీని అక్కడకు చేరిన భక్తజనం దర్శించుకొని, తమ మనస్సులలో స్వామి ఓ మూర్తిని ముద్రించుకొనే ప్రయత్నంచేస్తూండడం నేను గమనించాను.

మరొకసారి సాయంత్రం నేలమీద బారులుతీరి కూర్చున్న భక్తజనం మధ్యలో బాబా ఒకరి దగ్గరినుంచి మరొకరి దగ్గరకు వెళుతూ వారిని ఆశీర్వదిస్తూ, ఎడంచేతిలో విభూతి పాట్లాలుగల బుట్టను ఉంచుకొని, ఆయన అందరికీ పంచిఇవ్వడం చూశాను. భక్తజనం ఆ విభూతిని 'మహాప్రసాదం' గా భావిస్తారు. బాబా విభూతి పాట్లాలను పంచి ఇచ్చేప్పుడు, పక్కవాడికి ఇచ్చేదాన్ని, లాక్కోవాలనిగానీ, వరుసలోపై వ్యవహరించడంగానీ భక్తులు ప్రయత్నించలేదు. బాబా వేళ్ళు పాట్లాన్ని పట్టుకోకుండా, వట్టినే బయటకువస్తే, మరొకరివద్దకు అడుగువేస్తూనే, బాబా వేగంగా గాలిలోంచి విభూతిని సృష్టించి ఇస్తూ ఉంటారు. ఒక్కోసారి అదృష్టవంతులైన వారికి బాబా హస్తంనుంచి ఒకటికి రెండు పాట్లాలు జారిపడుతూ ఉంటాయి. ఆవిధంగా స్వామీజీ ఒక గంటసేపు భక్తులమధ్య గడుపుతూ, తనకోసం వేచిఉన్న వారిని ఆశీర్వదిస్తూ ఉంటారు.

ఆవిధంగా బాబా తన భక్తులను ఉదయం, సాయంకాలాల్లో, ఆయన ఎప్పుడనుకుంటే అప్పుడు కరుణిస్తూ ఉంటారు.

ఏ ఒక్కరినుంచి ఎలాంటి ఆర్థిక తోడ్పాటును ఆయన తీసుకున్నట్లు తెలియదు. మా కుటుంబ బాలిక శ్రీమతి కె.అచ్చమాంబ, స్వామీజీ భక్తురాలైన శ్రీమతి కమలమ్మ అక్కడ ఉన్న లక్షమంది జనాభాలో ఒక్కరు కూడా స్వామీజీ విరాళాలను ఆడిగినట్లు చెప్పలేదు.

అయినప్పటికీ ఆయన చేతిమీదుగా నిర్మాణం పొందిన కళాశాలు, ఆశ్రమాలు, ప్రశాంతి నిలయం, చతుష్కోణాకారంలో నిర్మించిన మూడంతస్తుల భవన సముదాయం, అందులోని నాలుగు వందల స్వతంత్ర విభాగాలూ, వాటికి అమర్చిన వంటశాల, స్టోరురూం, ఆరోగ్యవసతి సౌకర్యాలతో సహా వాటి నిర్మాణానికి కనీసం ఆరకోటి రూపాయలకు తక్కువ కాకుండా వ్యయం జరిగి ఉంటుంది. ఆలాంటి అనేక నిర్మాణాలు బొంబాయిలోనూ, మద్రాసులోనూ, విజయవాడలోనూ, హైద్రాబాద్‌లోనూ జరిగాయి. వాటి నిర్మాణానికి ఎవరు ఆర్థిక సహాయాన్ని అందించారు? ఆవని బాబా భక్తులు, స్థానికసంఘాలు సేవేర్చాయి. వాటి రూపకల్పన, ఎందుకోసం కేటాయించాలో, ఎందుకు ఉపయోగించాలో వాటి నిర్మాణ సందర్భంలో భక్తులకు స్వామీజీ సంపాదించేవారు. మహాప్రసాదాన్ని స్వీకరించే సందర్భంలో ఎలాగైతే, పూర్తి క్రమశిక్షణతో వేలాది భక్తులు తమకు తామై ఎలా వడచుకున్నారో, అలాగే పరిపూర్ణమైన నిండు మనస్సుతో, భక్తజనం తమ బాధ్యతలను నిర్వర్తించి ఈ కార్యాలయాలను, ఆశ్రమాలను నిర్మించారు.

నవంబరు 29 నాటికి నేను పుట్టపర్తి చేరునప్పటికి, నవంబరు 23న బాబా యాత్రై ఒకటవ జన్మదినాన్ని వైభవోపేతంగా, భక్తులందరూ సుశిక్షితులుగా ఉండి నిర్వహించినట్లు తెలుసుకున్నాను. అక్కడ ఆసౌకర్యం కలిగినట్లుగానీ, తాము అసంతృప్తి చెందినట్లుగానీ ఏ ఒక్కరినుంచి ఆరోపణ వినిపించలేదు.

ఆరోజు అందులో పాల్గొన్న వారు అనేకమంది, అసాధారణమైన అక్కడి ప్రశాంతతకు, స్వయం నిర్దేశితమైన క్రమశిక్షణకు, అంకిత భావంతో, సహకారానికి, సామూహిక భజన కార్యక్రమానికి, విచిత్రంగా తమకు తాము అనుసంధానమై అందులో లీనమై పోయామని చెప్పారు. సహజంగా భారతీయులు పదిమంది ఒకచోట చేరినప్పుడు, తుదకు దేవాలయానికి వెళ్ళే సందర్భంలో కూడా ఆలాంటి క్రమశిక్షణతో మెలిగేందుకు అలవాటు పడలేదు. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిదేవాలయంలో ధర్మకర్తల మండలి అన్ని వేళలా వేంకొలది భక్తులను దర్శనానికి అనుమతించడానికి చక్కటి 'క్యూ'ను పాటిస్తూ ఉన్నప్పటికీ, ఒక దశాబ్దానికి పూర్వం దురదృష్టకర సంఘటన జరిగి, ఆ పర్వతిడిలో 15 మందికి పైగా ఆసువులు కోల్పోయారు. అలహాబాద్‌లోని ప్రయాగవద్ద పుష్కరాల సందర్భంలో కుంభమేళా జరుగుతున్నప్పుడు, గంగా-యమునా-సరస్వతి నదుల త్రివేణీ సంగమంలో స్నానాలు చేస్తున్న భక్తుల ఆవేశాన్ని, పోలీసులు విరోధించలేక పోయినప్పుడు, ఇదేవిధంగా అనేకమంది దుర్మరణం పాలయ్యారు. అయితే పుట్టపర్తిలో మాత్రం అసంఖ్యాకంగా ఉన్న ప్రజానీకం, ఎవరి ప్రమేయం లేకుండానే

తమకు తామే క్రమశిక్షణను పాటిస్తూ ఉంటారు. స్పీకరుతో అవసరం లేకుండానే, రక్షణాధికారి ప్రమేయం లేకుండానే, తమకు తామై స్వయంక్రమశిక్షణతో, ప్రశాంతమైన సభాస్థలి తీర్చినట్లు నడుచుకుంటారు. ఎందుకంటే, అక్కడ స్వామీజీ తమనందర్నీ గమనిస్తూ ఉంటారనీ, స్వచ్ఛందంగా పక్కవారికి ఎలాంటి అవరోధాన్ని కల్పించకుండా, తమ బుద్ధిని ఆ క్షణంలో ఆయన పవిత్రంగా ఉంచుతాడనీ అక్కడి అందరి నమ్మకం! భౌతికావసరాల కోసం, దుఃఖోపశమనం కోసం, ఈశ్వర ప్రేరితజ్ఞానం కోసం తాము చేసే ప్రయత్నాన్ని అంతటినీ బాబా ఆశీర్వదిస్తూ ఉంటాడని నిజానికి అక్కడి భక్తులంతా నమ్ముతూ ఉంటారు. ఆయన కటాక్ష వీక్షణాలను పొందడానికి అక్కడందరూ స్థిరసంకల్పంతో ఎదురు చూస్తు ఉంటారు.

మొదటిసారిగా స్వామీజీని 1956లో న్యూఢిల్లీలో ఒక ఆంధ్రాసన సభ్యుని సూచన మేరకు నేను కలుసుకున్నాను. ఆయనను చాలా దయార్ద్ర హృదయునిగా, వివేకంతో కూడిన భాష్యకారునిగా నేను చూడగలిగాను. సహజంగా బాబాలు ఆచరించినట్టుగానే, ఆయన తన హస్తాన్ని చూపి మహాప్రసాదంగా భావించే 'విభూతి' ని నాకు అందించారు. తిరిగి హైదరాబాద్ లో నేనూ, శ్రీమతి భారతీదేవి, నాగేష్, అతని భార్య మా కుటుంబం అంతా బాబా సమక్షంలో మానసిక శాంతిని ప్రసాదించే భజన కార్యక్రమంలో పాల్గొన్నాం! ఉల్లాసకరమైన ఆయన సంగీతాన్ని మేం విని అనుభూతి చెందాం! ప్రజాకార్యక్రమాలను గురించి ఆయన మాతో మాట్లాడుతూ, మేం చేస్తున్న దేశభక్తియుత కార్యక్రమాలను, సంఘసేవను ఆయన కొనియాడారు. తిరిగి ఆయన మాకు మహాప్రసాదాన్ని అందించారు. మరోమారు కలుసుకున్నప్పుడు,సాంఘికపరమైన పుత్ర, భ్రాతృసంబంధమైన బాంధవ్యాలను గురించి, కుటుంబ సంబంధమైన ప్రేమానురాగాలతో ఉండి, ఉత్తమ పౌరులుగా తయారయ్యేందుకు ప్రజలు చేపట్టవలసిన కార్యక్రమాల్ని గురించి, సేవ ద్వారా దైవత్వాన్ని పొందడాన్ని గురించి ఆయన సుదీర్ఘంగా మాట్లాడారు. ఆయ మాటలు మధురమైన సంగీతస్వరాల లాగా వినిపించాయి.

ఒక ఆస్ట్రేలియా రచయిత స్వామి సత్యసాయిబాబా గారిని గురించి "మాన్ ఆఫ్ మిరికల్స్" అనే గ్రంథాన్ని రాశారు. మిస్టర్ కస్తూరిగారు మరో పుస్తకాన్ని రచించారు. ప్రొఫెసర్ గోకక్ గారు ఆంగ్లంలో మరోగ్రంథాన్ని రాశారు. ఆఖరులో వెలువడిన గ్రంథం అమెరికన్ మానసిక శాస్త్రవేత్త డాll శామ్యూల్ హెచ్.నరిడ్ లెస్ యం.డి. (1975) గారిది. బాబా చూపే అద్భుతాలను గురించి, చాలా మంది శాస్త్రజ్ఞులు పరిశీలనలు చేశారు. కొంతమంది డాక్టర్లు ప్రొఫెసర్లు ఆలాంటి అతీతశక్తులను గురించిన అభిప్రాయాన్ని ఖండించి, తాము కూడా అలాగే విభూతిని సృష్టించి చూపెట్టి, "ఉన్న వస్తువును ప్రదర్శించగలమేగానీ, లేనిదానిని చూపెట్టలేమని" అన్నారు. ఇలాంటి అభిప్రాయాన్ని ప్రస్తుతానికి అంగీకరించినప్పటికీ, 'గైల్స్ ఎఫెక్ట్' థీడబ్ల్యు డైజెస్ట్', 1975 నవంబరు సంచిక నమునరించి వాటివల్ల ప్రయోజనం ఏమిటి? అనే ప్రశ్నలు తలెత్తాయి. ఉంగరాలు, గడియారాలు, లాకెట్లు, వంటి వాటివల్ల సమాజానికి ప్రయోజనం కలుగుతుందా? వ్యక్తులకు దుఃఖోపశమనం కలిగించగలదా? ప్రజలలో భిన్న వర్గాల మధ్య సమన్వయాన్ని సాధించగలదా? యిలాంటి చర్చలు తలెత్తాయి. అయితే ప్రముఖ శాస్త్రవేత్త శ్రీ సూరి భగవంతంగారి మాటల్లో "ప్రతి ఒక్కరిలో దైవాంశతో కూడిన శక్తులున్నాయనీ, ప్రతి

ఒక్కొక్కరూ తమకు తామే మానవాతీతశక్తులను సాధించాలనీ, మూలకారకాన్ని జీవన ప్రేరకాన్ని తెలుసుకునేందుకు, అవసరమైన వేదాంత మార్గాన్ని తెలియజెప్పేందుకు విభూతిని సృష్టించి, తనలోని మానవాతీత శక్తుల్ని బాబా చూపెడుతున్నాడనీ" మనకు తెలుస్తున్నది. జ్ఞానం ద్వారా పరమాత్మలో జీవాత్మను అనుసంధించేందుకు ఆయన కృషి చేస్తున్నారనీ అన్నారు. రమణ మహర్షి అన్నట్టు "నిన్ను నీవు తెలుసుకో" అన్న వేదాంత సారాన్ని, బోధనలను ఆయన తిరిగి తెలియజేస్తున్నారు, అంతా మనమంచికే" అని చెప్పడమే బాబా ప్రధాన లక్ష్యం! ఆయనది సత్సంకల్ప మార్గం! బాబాగారిలోని ఆధ్యాత్మిక శక్తి "బిడ్డకు తల్లిలాగా" ప్రయోజనకరమైంది. సమాజానికి ఆయన ఒక మహర్షిలా మంచి మార్గాన్ని ప్రజలకు బోధిస్తున్నాడు.

అగోచరమైన, అద్భుతమైన కార్యకలాపాలు యుగయుగాలుగా ప్రజలను భ్రమగొల్పుతూనే ఉన్నాయి, రైళ్ళు, విమానాలు, జలాంతర్గాములు, శరవేగంతో ఈ యుగంలో ప్రవేశపెట్టబడిన కంప్యూటర్లు, రేడియోలు, టెలివిజన్లు కూడా మానవుడు ఆయా సమయాల్లో సాధించిన అద్భుత విజయాలు గానే భావిస్తూ ఉంటాం! "కవిత్వం రాయడం, సంగీతాన్ని ఆలాపించడం, చెస్ ఆడడం, ఆర్థికాంశాలను గణించడం వంటి అసాధారణ, సృజనాత్మకమైన చర్యలు. ఈనాటికీ కంప్యూటర్ల వంటి యంత్రాంకు అందుబాటులోకి రాలేదు. అందువల్ల సంధానాత్మకమైన మానవ మేధస్సును సాధించే కార్యక్రమం ఇంకా మనకు సంక్లిష్టంగానూ చాలా దూరంలో ఉంది" అని ప్రముఖ సైన్సు రచయిత డాక్టర్ జగదీష్ సింగ్ చెప్పారు. ఎందువల్లనంటే మానవమేధ జ్ఞానరహస్యం అనాదిగా, మర్మంగానే ఉంటున్నది. దాన్నే తత్వవేత్తలూ, యోగులూ దైవసంకల్పంగా భావించారు. ఆటం, హైడ్రోజన్ బాంబులు ఖండాంతర రాకెట్లు వంటి వాటిని గురించి, ఆలోచించి, ఐన్‌స్టీన్ వంటివారు సైతం, తమ పూర్వీకులు అందజేసిన జ్ఞానాన్ని ప్రాపిపదికగా చేసుకొని, తమ మేధస్సుతో నిక్షిప్తమై ఉన్న ఆలోచనా శక్తిని, బయటకు లాగి, ప్రయోగాత్మకంగా వాటిని సాధించారు. అయితే మెదడు అంటే ఏమిటి? అది ఒక అవయవపదార్థం! అది మేధకొక ఆలంబనం! అనాదిగా వస్తున్న అగోచరమైన విజ్ఞానాన్ని, మానవ వివేకాన్ని పదిలంగా అట్టిపెట్టే సాధన వస్తువు అది.

మనస్సుకూడా పదార్థమేనా? ప్రత్యక్షంగాని రీతుల్లో, పదార్థం కూడా ఒక శక్తేనని ఐన్‌స్టీన్ ద్వారా, మనం తెలుసుకున్నాం. ఎంతోకొంత మార్మికమైన విషయపరిజ్ఞానాన్ని అది మనకు ప్రదర్శిస్తుంది సూర్యకిరణాల్లో ఉష్ణాన్ని పొందినట్లు నీటిలో బింబాన్ని చూసినట్లు, యోగులు దాన్నే దైవంగా భావించారు. మన యోగులైతే, దేన్ని అంగీకరించారో, దాన్నే సత్యసాయిబాబా తన స్మృతి ద్వారా మనకు చూపెట్టారు. స్మృతి లేదా చైతన్యం అంటే ఏమిటి? జంతుజాలానికి లేనిదాన్ని, మానవుడు చిత్ నుంచి సత్ వరకు సాధించిన ప్రస్తుత విజ్ఞానాభివృద్ధిని ఐన్‌స్టీన్ తన పరిశోధన ద్వారా 'శక్తి' అంటే దాని ప్రభావం యం.సి 2కు సమానమని సూత్రీకరించారు. డాక్టర్ జగజిత్‌సింగ్ వాదన ప్రకారం "ప్రపంచం అనాదిగా అగోచరమైన దాన్ని, తన మేధస్సు ద్వారా తెలుసుకొని, తాము వెతుకుతున్న లక్ష్యాన్ని" చేరుకోగలిగిందా? 1958 లో ఢిల్లీలో జరిగిన పట్టప్రదాన సభలో ప్రసంగిస్తూ జవహర్లాల్ ఇలా అన్నారు. "ఈ ఘన విశ్వమంతా కొన్ని నిర్దేశితమైన పద్ధతుల ప్రకారం విడివడుతూ, మాయను చేరుకొనే ప్రయత్నంలో,

భ్రమల్లో విచ్చిన్నమై పోతున్నది."(జవహర్లాల్ నెహ్రూ ప్రసంగాలు వాల్యూమ్ IV, పేజీ 168.) పూజ్యులైన అరవిందోగారు "అతీత మేధస్సును కనుగొని, మానవ మేధస్సులో ఇమిడిఉన్న అగోచరమైన చైతన్యాన్ని కనుగొనే కృషిలో మరొక అడుగు ముందుకు వేశారు. ఈ అతీత చైతన్యం ఏమిటి? చైతన్యం అంటే ఏమిటి? చైతన్యం నుంచి సహజంగా ఏది ఉద్భవిస్తుంది? మహాయోగులంతా దాన్నే "ఆనందం" అని చెప్పారు. అందరి మహర్షుల లాగానే, సత్యసాయిబాబా "ఈ ఆనందమనేది శాశ్వతంగా ప్రతి ఒక్కరి హృదయంలో పదిల పరచబడి, స్వేచ్ఛగా అతను అనుకున్నప్పుడల్లా, అనుభవించడానికి అందుబాటులో ఉంది" అని అన్నారు. దాన్ని తాను పొందవచ్చు, ఇతరులకు అందించ వచ్చు. రామానుజాచార్యులు శ్రీరంగం దేవాలయ గోపురం నుంచి తిరుమంత్రాన్ని ఉపదేశించినట్టుగా, తాను దాన్ని అందరికీ లభ్యమయ్యేట్టు చేయవచ్చు" అని అన్నారు.

- "దయ ద్వారా పరస్పర సేవలద్వారా" మాత్రమే ప్రాధమికంగా, ప్రజలను ఆకట్టుకొని, వారిని ఆనందమార్గంలోకి తీసుక రావలసి ఉందని బాబా సత్యసాయిగారే కాకుండా, సత్యాన్వేషకులైన ఈ యుగంలోని మహర్షులు అరవిందయోగినుంచి రమణమహర్షి, శివానందవరకు, ముక్యానంద మహేష్‌యోగి, చిన్మయానంద వంటి మహాపురుషులవరకు, మానవ శ్రేయస్సుకోసం ఈ విధానాన్ని మనకు బోధించారు. వారి సాధనలోని గొప్పతనాన్ని, వారి బోధనలోని కరుణామృతాన్ని ఆలోచనాపరులైన మధ్యతరగతి ప్రజలలో సైతం ఎక్కువమంది గ్రహించలేకపోతున్నారు. ద్వేషాన్ని, అసూయనీ, కక్షనీ, క్రౌర్యాన్ని, రక్తపాతాన్ని విసర్జించడానికి వీరుసైతం శాస్త్రజ్ఞులు మాదిరిగానే ప్రత్యక్షప్రమాణంపై ఆధారపడుతున్నారు. స్వామి సత్యసాయిబాబా వంటి యోగులు, సాధారణ జనం మధ్యకు వచ్చినప్పుడైనా మానవులంతా ఒకటే అని బోధిస్తూ, సమస్త జీవరాశి సత్, చిత్ స్వభావంనుంచే వచ్చాయని ప్రవచించినప్పటికీ, దీని సారాంశాన్ని గ్రహించలేకపోతున్నారు. ఆలోచనాపరులైన ప్రజలంతా "సామూహిక భజనల ద్వారా, ఆదరపూర్వకమైన స్నేహం ద్వారా యోగపరమైన ఆధ్యాత్మిక సంపదను గ్రహిస్తూ నిదర్శనాన్ని గ్రహించవలసి ఉంది.

ఉన్నత స్వరూపాన్ని సంతరించుకున్న ఆత్మలు, నిరంతరం చైతన్యవంతమైన, విశ్వజనీనమైన శక్తి, అక్షయంగా ఉంటాయి. మహామహులైన యోగిపుంగవులందరూ, తాము సంపాదించిన జ్ఞానాన్ని ప్రజలందరికీ పంచిపెట్టడం సాధ్యమయ్యే పనికాదు. కాలానుగుణ్యంగా కొందరు ప్రజల మధ్యకు వచ్చి, తాము సంపాదించిన పారమార్థిక సత్యాన్ని బహిరంగపరిచి, ఆశ్రమాల ద్వారా, దర్గాల ద్వారా ఆధ్యాత్మిక శక్తిని ప్రజలకు లభింపజేస్తూ ఉంటారు. ఐన్‌స్టీన్ కాలంలో లభించిన విజ్ఞాన శాస్త్రాన్ని దుర్వినియోగ పరుచుకొని, మానవాళి మారణహోమంలో చిక్కుకోవడానికి దారితీసిన ప్రపంచ యుద్ధానంతరం లోకం భయంతో కుంచించుక పోయింది. అందువల్ల రుజాగ్రస్థమైన లౌకిక ప్రపంచానికి ప్రేమ, దయతో కూడిన నిర్మాణాత్మక కర్తవ్య బోధపరచవలసి ఉన్నది. విశ్వమానవ సోదరత్వాన్ని సాధించి, ఆధ్యాత్మిక శక్తిప్రపంచాన్ని ఊరడించగలదు. ప్రపంచంలో నెలకొన్న ప్రతి అణు పరిశోధనా కేంద్రానికి ప్రత్యామ్నాయంగా మనకు ఆధ్యాత్మిక వేత్తలతో కూడిన ఆధ్యాత్మిక పరిశోధనా కేంద్రం నెలకొనవలసి ఉంటుంది.

ఈనాటి శాస్త్రీయ యుగంలోని బలమైన అగ్రరాజ్యాలు అణు, మారణాయుధాలతో విర్రవీగుతూ ఉంటే, భారత దేశంలో అనేకమంది యోగులు మానవాభ్యుదయం కోసం తపస్సులు చేస్తూ, అజ్ఞానం, దురభిమానం, మూఢవిశ్వాసాలు, దారిద్ర్యం వంటి వాటిని, భౌతికంగా, ఆధ్యాత్మికపరంగా తొలగించేందుకు అదృష్టవశాత్తూ పాటుపడుతున్నారు. ప్రత్యేకంగా శ్రీ సత్యసాయిబాబా, ఆధ్యాత్మికశోధకుల సహకారంతో, సర్వమానవ కోటిలో ప్రేమగంగలో కోపకారుంతోడ్పాటుతోనూ, భారత దేశంలోనూ, విదేశాల్లోనూ భక్తి, జ్ఞాన, భజన, యోగంల ద్వారా వేదాంత సారాన్ని సర్వజనులకూ అందుబాటులోకి తెస్తున్నారు.

ఈ సత్యసాయిబాబాగారు ఎవరు? ఆయన మనకు అర్థంకాని, అగోచరమైన వ్యక్తిగాదు. ఆంధ్రప్రదేశ్‌లో నిరంతరక్షామపీడిత ప్రాంతమైన రాయలసీమలోని అనంతపురం జిల్లా పుట్టపర్తి అనే గ్రామంలో భట్రాజులుగా వ్యవహరింపబడే ఒక రైతు తెగలో ఆయన జన్మించారు. బాబాగారి సోదరు లిద్దరూ కూడా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా ఉన్నారు. ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించారు. అనూచానంగా వెనకబడిన ఆ ప్రాంతంలోని పాఠశాలలో తెలుగు, ఇంగ్లీషులో చదవడం, రాయడం నేర్చుకున్నారు. ఆయనప్రాథమిక విద్యనభ్యసిస్తున్న రోజుల్లోనే, ఆకస్మాత్తుగా యూరీగైల్స్ ప్రదర్శించినట్లుగా, మానవాతీత శక్తులను ప్రదర్శించి చూపెట్టసాగారు. గైల్స్ చూపెట్టిన అతీతశక్తులను ఇంగ్లండు, యు.యస్.ఎ. లోని శాస్త్రజ్ఞులు 'గైల్స్ ఎఫెక్ట్సు' అని పేరుపెట్టి పిలువసాగారు. ఆయనతో చదువుకుంటున్న విద్యార్థులు, గొడ్లకాపరులైన యువకులు ఆయనతో సన్నిహితంగా ఉండేవారు. ఆటవస్తువులను, తినుబండారాలను ఆకస్మాత్తుగా సృష్టించి, ఆయన తమ కందిస్తూ ఉంటే, ఆ యువకులు దిగ్భ్రమ చెందుతూ ఉండేవారు. ఆయన తల్లిదండ్రులు, గ్రామస్థులు ఆయననేదో భూతం ఆవహించిందని భయపడి, తమకు దగ్గరలో ఉన్న అనంతపురం తీసుకెళ్లి భూతవైద్యం చేయించడం, శారీరకహింసలకు గురిచేయడం జరిగింది. సత్యసాయి తాను పునర్జన్మ ఎత్తిన శ్రీ షిర్డిసాయిబాబానని అనేకమార్లు పదేపదే చెప్పేవాడు. షిర్డి సాయిబాబా నిర్యాణం చెందిన తరవాత ఏడు సంవత్సరాలకు 1926 నవంబరు 23న పుట్టపర్తిలో సత్యసాయి జన్మించారు. షిర్డిసాయిబాబా తాను సమాధి చెందిన తరవాత ఏడు సంవత్సరాలకు తిరిగి జన్మించగలనని తనకు తానుగా భక్తులముందు ప్రకటించాడు. అప్పట్లో ఎవరూ ఆయన మాటల్ని విశ్వసించకపోగా, వాటిని పిచ్చివాని ప్రలాపాలుగా భావించారు.

ఆ తరవాత సత్యనారాయణ రాజుగా పిలువబడే ఆయన ఆ గ్రామాన్ని వదిలిపెట్టి, ఎందరో సాధువులతో, సన్యాసులతో కలిసి జీవించారు. సాంప్రదాయికంగా భట్రాజులు భావోద్వేగాన్ని కలిగి కవులుగా, పండితులుగా, మేధాసంపన్నులుగా ఉంటారు. అటి భట్రాజ వంశంలో పుట్టినందువల్ల సత్యనారాయణరాజు కూడా ఒకమారు వింటే దాన్ని గుర్తుంచుకొనే ఏకసంధాగ్రాహిగాను, రెండుమార్లువిని మరచిపోకుండా ఉండే ద్విసంధాగ్రాహిగానూ, మూడుమార్లు విన్న దానిని ఎప్పటికీ గుర్తుపెట్టుకొనే త్రిసంధాగ్రాహిగానూ ఉండే ప్రత్యేక ప్రావీణ్యత కారణంగా, భారతీయ వేదాంతుల బోధనలను, వేదాంత సారాన్ని బాగా మనస్సులో ముద్రించుకోగలిగారు. యౌవన దశ అధిగమించేనాటికి, ఆయన సాధువుగా పరివర్తన చెంది, తెలుగులో చక్కని

గ్రామీణశైలిలో, చాటువులతో భక్తిజ్ఞానాన్ని అందించసాగారు. "మానవుడు సంతోషం కోసం సృష్టించబడ్డాడు. అయితే అన్నిచోట్ల అతను దుఃఖంలో మునిగి తేలుతున్నాడు. ఇది దైవ నిర్ణయమా?" అనిన శ్రీ ఆర్.ఆర్.దివాకర్ గారి మాటలను ఆయన ఆశ్చర్యంతో గమనించసాగారు. అమాయకులకు శిక్షలు విధించే కఠినుడా, భగవంతుడు? చాలామంది సన్యాసులు తాము సన్యసించేటప్పుడు, అంతకుముందు తమకున్న అన్ని రకాల బంధనాలను, ఆసవాళ్లను పూర్తిగా తుడిచివేసుకుంటారు. సత్యసాయిబాబా ఆవిధంగా చేయలేదు. చాలామంది యోగులు తిరిగి పూర్వాశ్రమానికి వెళ్లాలని తలంచరు. సత్యసాయిబాబా ఆవిధంగా ప్రవర్తించలేదు. అనేకమంది ప్రముఖుల విషయంలో జరిగినట్లుగానే, సత్యసాయిబాబా గారి సందేశాన్ని, కార్యక్రమాలను గ్రహించడానికి స్థానికులైన ప్రజలకు రెండు దశాబ్దాలు పట్టింది. స్థానిక ప్రజల అంగీకారం కోసం, ఆయనెప్పుడూ తన కార్యక్రమాలనుంచి వెనుతిరగలేదు. తన స్వగ్రామంలోనూ, చుట్టుపక్కల ప్రాంతాలలోనూ బాబా తన బోధనలను వినిపించసాగారు. తదుపరి ఒక జిల్లానుంచి మరో జిల్లాకు, ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి తీవ్రంగా ప్రచార యాత్రను కొనసాగించారు. ఆ తరవాత తన సహచరుల్ని, అనుయాయుల్ని, భక్తుల్ని భజనలు ప్రార్థనలలో పాల్గొనేలా చేసి, తన ఆధిపత్యంలోకి తెచ్చుకున్నారు. బాధలలో ఉన్న జనులకు పరమాత్మకు సంబంధించని పారమార్థిక స్వస్థతను ఆయన చేకూర్చారు. హిమాలయాలవంటి దూరప్రాంతాలకు, గుహలకు, ఇతర యోగుల మాదిరిగా ఆయన తరలిపోలేదు. తన స్వగ్రామాన్నే కేంద్రంగా చేసుకొని, అక్కడ తమ తల్లిదండ్రుల పేదరికాన్ని, కుటుంబ్యాసాలను, ఎరిగిన ప్రజలను, తనపట్ల పూర్తిగా నమ్మకం ఏర్పడిన వారిని, ఆయన తన బోధనల ద్వారా, కార్యక్రమాల ద్వారా తనకు సన్నిహితం చేసుకున్నారు. ఆవిధంగా చుట్టుపక్కల ఉన్న ప్రజల శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ప్రజలందరిలో బాగా వ్యాప్తిలోకి వచ్చారు. క్రమేణా ఆయన బెంగుళూరు, మద్రాసు, హైద్రాబాద్, బొంబాయి, ఢిల్లీ, విజయవాడ వంటి నగరాల్లో పేరు ప్రఖ్యాతుల్ని సంపాదించారు. ధనికులు, విద్యావేత్తలు, బాధలకు గురైనవారు, రాజకీయవేత్తలు, విద్యావేత్తలు వివిధ వృత్తులలో ఉన్నత స్థానాలలో ఉన్నవారు తమ ఇబ్బందులను అధిగమించడానికి, తమ వృత్తి వ్యవహారాలలో ఉత్తమ ఫలితాలను పొందడానికి ఆయన ఆశీస్సుల కోసం తహతహలాడారు. సత్యసాయిబాబా సన్నిధి, ఆయన చిరుదరహాసం, మృదువైన వారి హస్తస్పర్శ, మధురమైన ఆశీర్వచనం, మృదుమధుర సంగీతలహరి, అక్కడి ప్రార్థనలు, వివిధమైన శారీరక, మానసిక రుగ్మతల తో బాధపడుతున్నవారికైనా ఇట్టే మనశ్శాంతిని ప్రసాదించి, స్వస్థతను చేకూరుస్తాయి.

ఆయన సన్నిధిలో భజన కార్యక్రమాలు వందలమంది భక్తులతో ప్రారంభమై, వేలకొంది జనంతో నిండి, క్రమశిక్షణ బాబాపట్ల అంకిత భావంతో విజయవంతంగా, ఆధ్యాత్మిక వాతావరణంతో, ఆనందాన్ని కలిగిస్తూ ఉంటాయి. - "మానవుడు తనలో ఉన్న స్వార్థాన్ని మృగత్వాన్ని విసర్జించి, దైవత్వాన్ని పొందాలి" అని సత్యసాయిబాబా అనేకమార్లు బోధిస్తూ ఉంటారు. తాను అందించిన దేవతా ప్రసాదమైన 'విభూతి'ని తన తోటివారికి అందిస్తూ, భక్తులమధ్య అనుసంధానం కలిగి ఉండాలని ఆయన ఆవిధంగా భక్తగణం మధ్య పరస్పర సహకార ధోరణిని ఏర్పరిచి పెట్టారు.

పాండిత్య ప్రకర్షగలిగిన స్వామీజీల మాదిరిగా కాకుండా, సత్యసాయిబాబా పాండిత్యంతో కూడిన పదప్రయోగంతోకాని, సామాన్యులకు అర్థంకాని రీతిలోగాని ఉపన్యసించేవారు కాదు. బాబాకు బాగా పరిచయం వున్నప్పటికీ, ఆంగ్లంలోగాని, సంస్కృతంలోగాని ఆయన ఉపన్యసించరు. ప్రాచీన స్మృతులనుగాని, శ్లోకాలనుగాని ఉటంకించడంగాని, తన పాండితీప్రకర్షను ప్రదర్శించడానికిగాని పూనుకోరు. తన భక్తుల కోసం దయతో ఆయన అందించే దైవస్వస్థత కార్యక్రమాన్ని, ఆయన ప్రతిరోజూ ఒక దినచర్యగా కొనసాగించరు. పార్లమెంటులో ఒక స్వతంత్ర సభ్యునిగా కొనసాగుతున్న, ఒక కమ్యూనిస్టు మిత్రుని భార్య క్యాన్సరు వ్యాధిగ్రస్థురాలై, అనేక యూరపు దేశాలలోని ప్రసిద్ధి చెందిన వైద్య ప్రముఖులు కూడా నయంకాదని వదిలివేసిన తరవాత, బాబా ఆశీస్సుల కోసం పుట్టపర్తి వచ్చారు. కొన్ని మాసాలపాటు ఆమె ఆశ్రమంలో భక్తిశ్రద్ధలతో గడపగానే, ఎలాంటి శస్త్రచికిత్సలు, మందులతో అవసరం లేకుండానే ఆమె పూర్తి స్వస్థతను పొందగలిగారు. విద్యావంతురాలైన తన భార్య దైవంమీద విశ్వాసం ఉంచి, సాధించిన ఈ మాహాత్మ్యం మిత్రుని ఆశ్చర్యపరిచింది. బాబా ఆశీస్సులతో పూర్తి ఆరోగ్యాన్ని, తన భార్య పొందినందువల్ల, ఆ మిత్రుడు సిద్ధాంత రీత్యా తాను పరాజయాన్ని పొందానని భావించడంలో అబ్బురపడవలసిన పనేముంది? ఆ మిత్రుడు ప్రస్తుతం మానసిక పరివర్తనం చెంది, ఆధ్యాత్మిక భావనతో, మానవాతీత శక్తులపట్ల విశ్వాసాన్ని కలిగి, నిరంతరం బాబా సన్నిధిలో, భజన కార్యక్రమాల్లో గడుపుతున్నారు.

ప్రేమాన్వితుడైన బాబా, దయాభావంతో ఇలాంటి మహత్తుల నెన్నింటినో చూపించినందువల్ల బాబా దివ్యశక్తి యావద్భారత దేశంలో లక్షలకొలదీ స్త్రీ, పురుషులను, హైందవ ధర్మంపట్ల విశ్వాసం ఉండేవిధంగా, ఆధ్యాత్మిక భావంవైపు, అతీతశక్తులపై నా నమ్మకాన్ని పెంపొందించింది.

బహుభాషావేత్త, కవి, రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ బూర్గుల రామకృష్ణారావు. ప్రముఖ శాస్త్రజ్ఞులు, సైనిక శాస్త్రరంగంలో భారత ప్రభుత్వానికి సలహాదారు అయిన ప్రొఫెసర్ నూరి భగవంతంగారు. వైస్‌ఛాన్సలరు అయిన ప్రొఫెసర్ గోకక్, ప్రముఖ న్యాయశాస్త్రవేత్త పాలీవాల్‌జీ తదితర పండితులు, శాస్త్రవేత్తలు సైతం శ్రీ సత్యసాయిబాబా బోధనలలోనూ, కార్యక్రమాల్లోనూ విలువకట్టలేని సాంఘిక ప్రయోజనం కలదని గుర్తించారు. భారతీయ విద్యాభవన్ వ్యవస్థాపకులు ప్రముఖ చరిత్రకారులైన శ్రీ కె.యం.మున్షీ సైతం బాబా ఆశీర్వచనంలోని మహత్తును, ఆయన స్పర్శలోని దివ్యత్వాన్ని అనుభవించగలిగారు.

మాజీ గవర్నరు, కేంద్ర ప్రభుత్వ మంత్రి, ప్రస్తుత గాంధీ శాంతిసంఘాధ్యక్షులైన శ్రీ ఆర్.ఆర్.దివాకర్ 1974 జనవరి 4వ తేదీ సంచికలో రాసిన ఆశ్చర్యకరమైన వ్యాఖ్యానాన్ని చూడండి!

"– వంశపారంపర్యంగా గాని, విద్యావిషయకంగాగాని, వివిధమైన పూర్వచరిత్ర లేకుండానే, తన అంతర్గత మేధాశక్తితో, ఈయన పురుషులను, స్త్రీలను, బాలబాలికలను సహితం, తన సర్వసాధారణమైన ప్రేమభావంతో, తనలో నిక్షిప్తమై ఉన్న ఈశ్వరతత్వంతో, వారి హృదయాలను

నిత్యసత్యమైన అలౌకికమైన ఆనందంవైపు ఎలా ఆకర్షించగలుగుతున్నారు?"

అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రానికి చెందిన, ప్రముఖ మానసిక శాస్త్రవేత్త, డాక్టర్ శామ్యూల్ హెచ్.శాండ్‌విస్ యం.డి గారు సత్యసాయిబాబాను గురించి తన పుస్తకంలో "సాయిబాబా మహనీయుడైన మహామనీషి, ఆత్మజ్ఞాని" అని రాసుకున్నారు. డాక్టర్ శామ్యూల్ నవనాగరికతతో అభివృద్ధి సాధించిన దేశంలో శిక్షణపొంది, చక్కటి సిద్ధాంతాలను రూపొందించిన ఆధునిక విద్యావేత్త, పరిశోధకుడు. ఇలాంటి మేధావులెందరో బాబాపై తమ నమ్మకాన్ని, విశ్వాసాన్ని భక్తిభావంతో తెలియజేశారు.

1975లో బాబా కవితా రీతుల్లో, ఎంతో విలువైన ఈకింది మాటలను చెప్పారు. "ఒక పుష్పంలో ఫలం సిద్ధించి, అందులో మధుర రసాలను నింపి, తుదకు చెట్టు ఏర్పడడానికి కారణమైనట్లుగా, వ్యక్తిత్వమనేది వివిధ దశల్లో పరిణామంచెంది, పరిపూర్ణస్థాయికి చేరుకుంటుంది!

క్రైస్తవులు, పార్సీలు, ముస్లింలు, బౌద్ధులు, హిందువులు మానవజీవితంలో దేవునికి ప్రతి రూపాలుగా మానవత్వం, శాంతి, పరస్పరప్రేమ, సత్యాలను తమతమ మతాలతో తమకు సన్నిహితమైన చిహ్నాల ద్వారా చెప్పినట్లుగానే, రైతాంగ మహర్షి పుట్టపర్తి సత్యసాయిబాబా వ్యవసాయపరంగా చెప్పారు. వినయాశ్రమానికి చెందిన స్వామి సీతారాంగారు కూడా ఆకాశమే అవధులుగాగల సర్వమత సమ్మతమైన ఒక ఆలయాన్ని తూర్పుతీర ప్రాంతంలోని ఇసుక తిన్నెలలో నిర్మించాలని ప్రయత్నించారు.

మహేష్ యోగి దేశవిదేశాల్లో సర్వోత్తమమైన ధ్యానమందిరాలను ఏర్పరుస్తూ తమ జప తపాదులతో ప్రసిద్ధి పొందారు. భారతదేశ ఆధ్యాత్మిక మతంలోని గొప్పతనాన్ని అనేకమంది శాస్త్రజ్ఞులు, విద్యావేత్తలు, పండితులుకూడా మెచ్చుకున్నారు. భక్తమీరా, చైతన్యస్వామి వంటి భక్తులు చేసిన భజన, భక్తి కార్యక్రమాలు, భక్తుల హృదయాలను రంజింపజేయడమే గాకుండా, సామాజిక హితాన్ని కూడా కలిగించగలదని తెలుసుకున్నారు. వ్యక్తిపరంగా కూడా జీవితాన్ని పునీతంగావించడానికి కూడా 'భక్తిభావం' తోడ్పడగలదని తెలుసుకున్నారు. సాయిబాబా భజన కార్యక్రమం ఆవిధంగా అతిశక్తులతో ఆవహింపబడి, ఎవరికి అవసరమైనంత మేరకు, వారికి సహాయపడే విధంగా అలరారుతూ ఉంటుంది. స్వామి చిన్మయానంద గారి భగవద్గీత వ్యాఖ్యాలు, బోధనలు, ఆంగ్లభాషావేత్తలను, విద్యావేత్తలను అలరిస్తూ ఉంటాయి. సాయిబాబాగారి బోధనలు సర్వజన సమ్మతంగా, సామరజనానికి సైతం సులభసాధ్యంగా ఉండి, భగవద్గీత సారమైన, ప్రాచీన ఋషులు ప్రవచించిన 'ఆనందయోగాన్ని' భిన్నత్వంలో ఏకత్వంవైపు, చివరగా సర్వసమ్మిళితమైన ఏకతా సాధనవైపు మళ్లిస్తూ ఉంటాయి.

డాక్టర్ భగవంతంగారు ఇలా వ్యాఖ్యానించారు. – ఒక శాస్త్రజ్ఞుడు తన పరిశోధన ద్వారా అందుకు సంబంధించిన ఫలితాలను గ్రహించినట్లుగానే, దైవంపై విశ్వాసమున్న భక్తుడు, తన భక్తిద్వారా అనుభవంలోకి తెచ్చుకోగలడు". (బ్లిట్జ్ 4-9-1976 సంచికనుంచి)

స్వామి వివేకానంద, గాంధీజీ వంటివారు చెప్పినట్లుగా 'బాబా' కృషే దైవమని చెప్పలేదా! ఈరోజు 'గరీబీ హఠావో' నినాదం ద్వారా 25 సూత్రాల కార్యక్రమం ద్వారా, మన జాతీయ నాయకులు చెబుతున్నట్లుగా 'కృషి'ని గౌరవించలేదా! ఆయన చాలాకాలం క్రితం ది 25-5-1947 న తాను పేదల బాధలను తొలగించేందుకు, వారికి ఏమిలేదో దాన్ని అందించేందుకు కృషి సలిపేందుకు సంసిద్ధంగా ఉన్నా" నని చెప్పారు.

శ్రీ సత్యమూర్తి

హిరేన్ ముఖర్జీ గారి పాండితీ ప్రకర్షణతో కూడిన ఆంగ్లభాషా శైలిని, మధులిమాయేగారి విషయ ప్రాధాన్యతతో కూడిన వాదనాపరమైన ప్రసంగ వర్ధతిని, లోహియాగారి విచక్షణా పూర్వకమైన ఎత్తిపొడుపులను, భూపేష్ గుప్తాగారి తుపాకీ మోతలను, కామత్ గారి సభాసాంప్రదాయాలను అంటి పెట్టుకొని ఉండే రీతిని, వాటికి కొన్ని ప్రత్యేక లక్షణాలను జోడించి, పూర్తి అసహనాన్ని తీవ్రమైన బ్రిటీష్ వ్యతిరేకతను కలుపుకొని మనం ఒక రూపంలో పెట్టుకొని చూస్తే శ్రీ సత్యమూర్తి మద్రాసు కౌన్సిలులో 1930 వరకు, 1935-39 సంవత్సరాలలో కేంద్ర శాసనసభలో ఎట్లా ఉండేవారో మనకు బోధపడుతుంది.

వైస్రాయిగారి ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు, తమకు అనుకూలుడైన జస్టిస్ పార్టీకి చెందిన సమర్థులైన నాయకులు రామస్వామి ముదలియార్ గారు మద్రాసు శాసనమండలిలోనూ, సిటీ కార్పొరేషన్ లోనూ, సత్యమూర్తిగారిని గట్టిగా ఎదుర్కొని ఓడించగలరని భావించింది. సామి వెంకటాచలం శెట్టిగారు ఎన్నికైనట్లుగా సత్యమూర్తిగారు సెంట్రల్ అసెంబ్లీ స్పీకరుగా బ్రిటీష్ పక్షపాతికంకు అభిమాన పాత్రులైన షణ్ముగం చెట్టిగారిని ఓడించి విజయాన్ని సాధించారు. దానితో మద్రాసులో గట్టి కాంగ్రెసు నాయకులైన ఆయనను గురించి వారు భయపడసాగారు.

సత్యమూర్తిగారు వారు భయపడిన దానికంటె ఎక్కువ శక్తివంతులుగా విరూపించుకున్నారు. ఆయన ప్రశ్నలకై వినియోగించుకుంటున్న సమయాన్ని తుపాను సమయంగా చేశారు. అప్పటిదాకా ప్రశాంతంగా కొనసాగుతున్న ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు చర్చలలోని ప్రశ్నాసమయం కాలాన్ని ఆయన మంటలు రేపడానికి వినియోగించుకున్నారు. మాలాంటి వారమైన యువసభ్యులం అనేకమందిమి ఆయన మార్గాన్ని అనుసరిస్తూ ప్రత్యర్థులకు రక్షించుకునే అవకాశం లేకుండా ఆయనకు తోడ్పడసాగాం. ప్రస్తుతం ఇష్టం వచ్చినట్లు గందరగోళంగా నడుస్తుందనుకుంటున్న ప్రశ్నల సమయం ఆనాడు సత్యమూర్తిగారు సాగించిన దానిని మనసులో ఉంచుకుంటే అప్పటి ఆవేశంలో ఇప్పుడు సగం కూడా ఉన్నట్లు మనకనిపించదు. అనుబంధ ప్రశ్నలు వాద ప్రతివాదాలతో వ్యంగ్య భాషణాలతో కళ్లల్లో రక్తపు చుక్కలు కారేదాకా కొనసాగుతుండేవి. అనేకమంది బ్రిటీష్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిలు సభ్యులు సత్యమూర్తిగారి ధోరణికి బాగా ఆగ్రహం తెందుతుండేవారు. అందువల్ల బ్రిటీషువారు అప్పటి న్యాయ శాఖామంత్రి శ్రీ యన్.ఆర్.సర్కార్, శ్రీ గిరిజా శంకర్, శ్రీ వాజ్ పాయ్, శ్రీ టి.ఆర్.రావుగార్ల న్యాయశాస్త్ర సంబంధమైన అభ్యంతరాలపై ఎక్కువగా ఆధారపడసాగారు.

బ్రిటీషువారు ప్రధానమైన ఫైనాన్స్ శాఖనుంచి విన్స్టన్ చర్చిల్ గారికి బాగా విశ్వాసపాత్రుడైన జేమ్స్ గ్రిగ్ గారిని వారికి సహాయపడేందుకు ఇక్కడకు పంపించారు. కాంగ్రెస్ పోరాటానికి ప్రతిగా ఆయన స్వేచ్ఛగా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతూ, తాను చేయగలిగిందంతా చేశారు. అయితే రెండవ ప్రపంచయుద్ధం ప్రకటితమై కాంగ్రెస్‌వారు శాసనసభలను బహిష్కరించడానికి పూనుకొనేంతవరకు ఈ చార్లమెంటరీ పోరాటంలో సత్యమూర్తి గారిదే

పై చేయిగా కొనసాగింది.

వాయిదా తీర్మానాన్ని పార్లమెంటరీ పద్ధతిలో మరో శక్తివంతమైన ఆయుధంగా మనం మలచు కొన్నాం. అటువంటి తీర్మానానికి ఎప్పుడైనా అనుమతి లభించాలంటే అది ప్రతిపక్ష స్థానంలో ఉన్నవారి సూక్ష్మగ్రాహ్య శక్తిపై ఆధారపడి ఉండేది. అప్పుడు బాగా ప్రఖ్యాతి వహించిన హైకోర్టు న్యాయమూర్తిగారైన సర్ అబ్దుల్ రహీంగారు స్పీకరుగా పనిచేస్తున్నందువల్ల ఆయన సహాయాలను తీర్చి ఆమోదాన్ని సంపాదించుకోవడం ప్రతిపక్ష సభ్యులకు అంత సులువైన పనిగాదు. అయినప్పటికి సత్యమూర్తిగారి సమర్థవంతమైన వ్యాఖ్యలతో పార్లమెంటు కొనసాగుతూ ఉండే ప్రతి పదిరోజులకు ఒక వాయిదా తీర్మానానికి మేం అనుమతి పొందగలుగుతుండేవారం. ఒకసారి దానిని అనుమతించాక దానికోసం కేటాయించిన రెండుగంటల సమయం వాదనలతోను వ్యంగ్యోక్తులతోను మొదటి శ్రేణి యుద్ధరంగంగా ఉంటుండేది. ప్రభుత్వం అన్ని వేళలా నైతిక సూత్రాలను గాలికి వదలివేసి ప్రవర్తించడానికి తయారవుతుండేది. ఆ సమయంలో "సభంతా రాజీనామా చేయండి, చేయండి" అని "సిగ్గు, సిగ్గు" అని కేకలతో మారుమ్రోగి పోతుండేది. ప్రభుత్వానికి మెజారిటీ ఉండడంవల్ల ఎప్పుడో జిన్నాగారి గ్రూపు మాత్ కలిసినప్పుడో, లేదా స్వతంత్ర సభ్యులు మమ్ములను బలపరచాలని నిర్ణయించుకున్నపుడో తప్ప సహజంగా వాయిదా తీర్మానానికి మెజారిటీ లభించేదికాదు. ఆ తీర్మానం ముఖ్యమైన విషయాలపై ప్రస్తావిస్తున్నపుడు భూలాభాయ్‌గారు అందులో జోక్యం చేసుకుంటుండేవారు. ముఖ్యమైన ఆర్థికాంశాలపై చర్చ ప్రారంభించినపుడు పంత్‌గారు, మనూ సుబేదార్‌గారు లేదా అవినాశలింగం చెట్టిగారు దానిపై శ్రద్ధవహించేవారు. వాయవ్య సరిహద్దు సంఘర్షణలపై సవాలు వచ్చినపుడు డాక్టరు ఖాన్ సాహెబ్, అసఫ్ ఆలీగార్లు చర్చలలో ప్రవేశించేవారు. సహజంగా మేం ప్రభుత్వానికి వ్యతిరేకంగా సత్యమూర్తిగారు బాధ్యత వహించి మాట్లాడడానికి ఎదురుచూస్తూ ఉంటాం. సత్యమూర్తిగారు ప్రసంగించే సందర్భాలలో చర్చలలో ముందుగా ప్రతి సభ్యునికి 15 నిముషాల కాలం స్వతంత్రంగా మాట్లాడడానికిచ్చిన సమయాన్నుపయోగించుకొని ఆయన ప్రభుత్వ పరాజయాల గురించి, దుర్వడత గురించి ఎక్కుపెట్టిన బాణాలలాగా తన విమర్శనాస్త్రాలను వారిపై వదలిపెడుతుంటే వినడానికి ఎంతో సొంపుగా ఉంటుంది. అందరూ అర్ధగంట సమయంలో మాట్లాడగలిగే విషయాలను ఆయన 15 నిముషాలలోనే అతిచాకచక్యంగా ముగించగలరు. ఆయన తన శరపరంపరలను ముగించేటప్పటికి అధికార పక్ష సభ్యులంతా పెద్ద నాయకులతో సహా ఇంకేమి మిగిలింది మనం విమర్శించడానికి అని విస్తుపోతుండేవారు.

కమిటీలలో ఉన్నపుడు సత్యమూర్తిగారు చాలా సమర్థతతో పనిచేస్తుంటారు. నేను ఆయనతో కలసి పబ్లిక్ అకౌంట్స్ కమిటీలో పనిచేశాను. దాని ఛైర్మన్ గారైన సర్ జేమ్స్ గ్రిగ్ నన్ను ఉద్రేక పూరితంగా మాట్లాడే వ్యక్తిగా భావిస్తుండేవారు. అయితే సత్యమూర్తిగారు వేరువేరు శాఖలలోటుపాట్లను బైటకు తీసుకురావడంలో ముఖ్యంగా ఆర్థికశాఖను గురించి ప్రస్తావించడంలో గొప్ప స్థాయిని ప్రదర్శించేవారు. ఆ రోజుల్లో అనధికార సభ్యులైన అధ్యక్షులు, ఆర్థికశాఖ సభ్యులు అధికార సంబంధమైన అధ్యక్షులు ఆయా శాఖలకు అనుకూలంగా ఉంటూ ఉండడంతో

ఆడిటర్ జనరల్ గూడా వీలైనంతవరకు వారికి మిత్రులుగానే వ్యవహరిస్తూ ఉండడంతో ఆ కమిటీలో మా కృషి విజయవంతమయ్యేది గాదు. ఇవన్నీ ఇలా ఉన్నప్పటికీ ప్రముఖ పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యులైన శ్రీ బి.దాసుగారు సత్యమూర్తిగారు నేను కలసి సర్ జేమ్స్ గ్రిగ్ గారిని తటస్థులుగా ఉంచగలిగాం. అందుకు సత్యమూర్తిగారి వ్యక్తిత్వాన్ని పరిపాలనా సంబంధమైన ఎత్తుగడలను మనం అభినందించవలసిందే. ఆయనతోపాటు కమిటీలో ఉండి నేను చాలా విషయాలను నేర్చుకున్నాను.

బిల్లులపై పరిశీలనకు ఏర్పాటుచేయబడే సెలెక్ట్ కమిటీలో గూడా ఆయన చక్కటి సామర్థ్యంతో పనిచేస్తుండేవారు. కంపెనీ చట్టసవరణ బిల్లు, ఇన్సూరెన్సు చట్టసవరణ బిల్లు వంటి వాటి విషయాలలో ఆయన చేసిన నిర్మాణాత్మకమైన కృషి బహు ప్రశంసలకు పాత్రమైంది. బ్రిటీషువారి అవసరాలకు కాకుండా భారతీయ ప్రయోజనాలకు అనుకూలంగా దేనిని ఎలా రూపుదిద్దాలనే విషయం ఆయనకు పూర్తిగా తెలుసు. తనకున్న పార్లమెంటరీ నైపుణ్యంతో భారతీయ ప్రయోజనాలను పరిరక్షించేందుకు ఆయన గట్టిగా కృషిచేస్తుండేవారు. ఆయన తనకున్న న్యాయశాస్త్ర సంబంధమైన సూక్ష్మ పరిజ్ఞానంతో చట్టాలను తయారుచేయడం మార్చడం వంటి విషయాలలో సెలెక్టు కమిటీలో అతి సామర్థ్యంతో ప్రవర్తిస్తూ గొప్ప చట్టనిర్మాణ కర్తగా పేరు సంపాదించుకున్నారు.

బ్రిటీషు సామ్రాజ్య వాదులపై శాసనసభల ద్వారా పోరాడడం ఆయనకు అయిష్టం కానందువల్ల అనేకమంది గాంధేయ వాదులు శాసనసభలను బహిష్కరించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు ఆయన దానికి అంత అనుకూలంగా స్పందించలేదు. దశాబ్దం పాటు ఆ విషయంలో ఆయన ధైర్యంగా వ్యతిరేకించిన తరవాత తిరిగి అంగీకరించడం జరిగింది. దీర్ఘకాలపు విరామాల తరవాత కాంగ్రెస్ తిరిగి శాసన సభా బహిష్కారాన్ని వదలుకొన్నప్పుడు కాంగ్రెస్ పార్టీవారు తిరిగి శాసనసభలలో ప్రవేశించి సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడేందుకు ఆయన సహాయపడ్డారు. ఆ రంగంలో ఆయన ప్రతి ఒక్కరూ తానే అయి మెలిగారు.

ఆయన తన నోట్లో వెండి చెంచాను పెట్టుకొని జన్మించలేదు. ఏది ఏమైనప్పటికి జీవితంలోని మంచినంతా ఆయన అభిమానించారు. తమిళనాడు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆయన ఉన్నప్పుడు సంస్థాగత వ్యవహారాలకు కావలసిన డబ్బునంతా కాంగ్రెస్ సంస్థే సమకూర్చింది. అఖిలభారత కాంగ్రెస్ సంఘ అధ్యక్షులుగా ఉన్న ఆయన మిత్రుడైన శ్రీ శ్రీనివాస అయ్యంగార్ ఎన్నికలు సంభవించినపుడు కావలసిన నిధులను అందివ్వడంలో ఆయనకు అండగా నిలిచారు. సత్యమూర్తిగారు రాజకీయ స్థిరత్వాన్ని నైతిక విలువలను కాపాడాలని గట్టిగా కృషిచేశారు. మద్రాసు రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఏర్పాటుచేసే అవకాశం కాంగ్రెస్‌పార్టీకి వచ్చినపుడు దానిలో చేరేందుకు సత్యమూర్తి గారిని ఆహ్వానించ లేదు. అది నిజంగా ఒక గొప్ప బాధాకరమైన సంగతి. ఆయనకే కాదు, దేశానికి కూడా.

యుద్ధం ప్రకటించిన తరవాత కాంగ్రెస్ మంత్రివర్గాలు రాజీనామా చేసినప్పుడు బ్రిటీషువారు కాంగ్రెస్ వ్యవస్థపై పూర్తిగా కక్షతో ఉన్నప్పుడు సత్యమూర్తిగారిని మద్రాసు

కార్పొరేషన్ మేయరుగా ఎన్నుకోడం జరిగింది. తన శక్తిసామర్థ్యాలను తెలివిని ప్రదర్శించేందుకు ఆయనకా అవకాశం కలిగింది. సహజంగా కార్పొరేషన్‌లో మేయరు పదవి కౌన్సిళ్ళకు అధ్యక్షత వహించే ఒక నామ మాత్రపు స్థానం మాత్రమే. అయితే సత్యమూర్తిగారు దానిని కార్పొరేషన్‌కు ఒక శక్తివంతమైన పదవిగా మార్చారు. సమర్థుడైన కమిషనరు పుల్లారెడ్డిగారిని దగ్గరగా తీసుకొని ఎన్నికైన కొన్ని వారాలోనే నగరాన్ని పట్టణ సౌందర్యం పేరుతో తీర్చిదిద్దేందుకు తన నిర్మాణాత్మకమైన చురుకైన కార్యక్రమాలతో ముందుకు వచ్చారు. దీర్ఘకాలంగా రెండో మంచినీటి రిజర్వాయరును ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడాన్ని ఆయన నిందించి కొద్ది మాసాల కాలంలోనే పూండీ రిజర్వాయరును శాంక్షన్ చేయించ గలిగారు. ఆయన ముఖ్యంగా మురికి వాడలను బాగుచేసేందుకు గృహవసతి లేని పేదప్రజలకు షెల్టర్లు నిర్మించేందుకు దాతృత్వం కలిగిన ప్రజలనుంచి సహకారాన్ని గూడా తీసుకొని చెప్పుకోదగినంత అభివృద్ధిని సాధించారు. సత్యమూర్తిగారు సాధించిన అభివృద్ధిని చూసి జైళ్ళలో ఉన్న మేమంతా రాజాజీ గారు మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసేటప్పుడు సత్యమూర్తిగారిని మంత్రిమండలిలోకి తీసుకొంటే ఎంతో బాగుండేదని అభిప్రాయపడ్డారు. నిజానికి ఈనాడు కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ మంత్రులుగా ఉంటున్న వారుకూడా సత్యమూర్తిగారి విజయాలను గమనించి నేర్చుకోవలసింది చాలావుంది. సత్యమూర్తిగారు లలిత కళాభిమానులు. ఆయనకు సంగీతమంటే చాలా ఇష్టం. కర్నాటక సంగీత విద్వాంసులను ఆయన బాగా ప్రోత్సహించారు. ఆయన బాగా మతవిశ్వాసాలు కలిగి ప్రాచీన సాంప్రదాయాలపై నమ్మకమున్న మనిషి. ఆయనకు సనాతన సాంప్రదాయాలపై ఉన్న గట్టి విశ్వాసాల కారణంగా కాంగ్రెస్ వ్యతిరేకులైన జస్టిస్ పార్టీమీద వారి బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలపైన కనబరిచే తీవ్ర వ్యతిరేకత కారణంగా ఆయన దక్షిణ భారత స్థాయిని దాటి పైకి ఎదగలేకపోయారు. ఆయన బాగా విద్యావంతులైన మేధావులుగా ఉన్న బ్రాహ్మణేతరులను కూడా అభిమానించేవారు. జాతీయ ఉద్యమంలో రాజీలేని పోరాటాన్ని ఆయన కొనసాగించారు. పార్లమెంటరీ విధానాలలో అనితరసాధ్యమైన శక్తి సామర్థ్యాలను ఆయన ప్రదర్శించి చూపెట్టారు. అందువల్ల ఆయన పట్టభద్రుల నియోజక వర్గం నుంచి అన్ని సందర్భాలలోను అత్యధిక మెజారిటీతో గెలుపొందుతుండేవారు. ఆయనకు సంభవించిన దురదృష్టం ఏమిటంటే మద్రాసు శాసనసభకు పట్టభద్రుల నియోజక వర్గంనుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఆయనను ఎన్నిక చేస్తారనుకుంటున్న తరుణంలో, ఆఖరి క్షణాల్లో ఆయన పేరు తొలగించి అప్పటి దాకా శాసనసభలను బహిష్కరిస్తున్న ఆయనకంటే సీనియరు నాయకులైన రాజాజీ గారిని ఆ స్థానంలో అభ్యర్థిగా నిర్ణయించడం అవిధంగా సత్యమూర్తిగారు మదరాసు రాష్ట్రంలోని మొదటి కాంగ్రెస్ మంత్రివర్గంలో చేరే అవకాశాన్ని పొందగలిగే అదృష్టానికి దూరమైనారు.

ఆయన ఒక మోస్తరు ఎత్తులో ఉండి మంచి రంగుతో చిరునవ్వులు చిందిస్తూ చూపులకు బాగా ఆకర్షణగా ఉండేవారు. అయితే అది ఆయన ప్రసంగించేటప్పుడు మాత్రం కాదు. ఒక్కొసారి శాసనసభలో ఆయన లేచి నిలబడ్డారంటే స్థిరంగా నిలిచి ఒక యోధునిలాగా ప్రతిద్వందులు భయపడే విధంగా మాట్లాడుతూ ఉండేవారు. ఆయన మాటలు సదా ప్రభుత్వాన్ని వణికిస్తుండేవి. ఆయన నిలబడి ఉన్నపుడు చక్కటి రంగులో ఉండే ఆయన చెక్కిళ్ళు నొసట

ధరించిన గంధపు తికలం రొమ్ములపైగా భుజాన వేసుకున్న ధోవతి ఒక చక్కటి చిత్రాన్ని స్మరణకు తెచ్చేవి. కాంగ్రెస్ పార్టీలో పెద్దవారిని ఎదుర్కొవడంలో ఆయన అతి ధైర్యంగా వ్యవహరించేవారు. అనేకసార్లు ఆయన రాజాజీ గారితోనూ జవహర్లాల్ గారితోనూ సర్దార్ పటేల్ గారితోనూ ఘర్షణ పడ్డారు. శాసనసభలను బహిష్కరించి దేశాన్ని ఖద్దరు ధారణ నిర్మాణాత్మక కార్యక్రమంలోనే అట్టి పెట్టకంటే హిమాలయాలకు వెళ్ళి తపమాచరించు కోవలసిందని ఆయన మహాత్మాగాంధీ గారిని నిస్సంకోచంగా అనగలిగారు. మంత్రివర్గం ఏర్పాటుచేసే సమయం కాంగ్రెస్ పార్టీ చేతుల్లో కొచ్చినపుడు కాంగ్రెస్ పెద్దలు ఏ ఒక్కరూ కూడా ఆయనపై సానుభూతిని చూపించి ఆయన సేవలను దేశాభివృద్ధికి వినియోగించుకోవాలని భావించలేదు.

1942 సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంలో బ్రిటీషువారు ఆయనను నిర్బంధించినపుడు అనారోగ్యం పాలయ్యారు. ఆయనను నాగపూర్ తీసుకు వెళ్తున్నపుడు పక్షవాతం వచ్చి ఆయన అంగవికలురైనారు. ఆయనను అక్కడనుండి చాలా దూరంలో ఉన్న అమ్రోతీకి కారులో తీసుకుపోయి అక్కడి జైలులో నిర్బంధించారు. సరైన వైద్యసేవలు లభించక ఆయన అక్కడ కఠినమైన నిరాదరణకు గురయ్యారు. కొన్ని మాసాలపాటు తీవ్రమైన అనారోగ్య పరిస్థితుల్లో ఆయన ఆరోగ్యం క్షణం క్షణం క్షీణిస్తూ వచ్చింది. ఆయన పూర్తిగా అస్వస్థులైనపుడు చిట్టచివరకు మద్రాసుకు మార్చి జనరల్ హాస్పిటల్ లో చేర్చారు. ఆయన షష్ట్యబ్ది పూర్తి (60 సంవత్సరాల వయసుకి) కి చేరుకున్న తరుణంలో తన తుది శ్వాసను విడిచారు. స్వేచ్ఛను అభిమానించే ప్రజల అనన్యగౌరవాన్ని పొందిన ఈ గొప్ప పార్లమెంటేరియన్ ఆ విధంగా మనలను వీడిపోయారు.

డాక్టరు సి.సత్యనారాయణ

కవి, చిత్రకారుడు, శిల్పి, నాట్యాచార్యుడు, డాక్టరు వంటి గొప్ప నిపుణతతో కూడిన సామర్థ్యాన్ని కలిగి ఉండడం వేరువేరు రంగాల్లో ప్రత్యేక ప్రావీణ్యతను సంపాదించుకుంటున్న ఈ కాలానికి ఒక ప్రత్యేక విశేషం. అలాగే కవిత్వం, సంగీతం, పుస్తక పఠనం వంటి అన్ని లక్షణాలు కొద్దిమంది వ్యక్తులకు మాత్రమే ఉంటాయి. అందరికీ సాధ్యంకాని అదృష్టంవారికి ఉంటుంది. ఒక మంచి కుటుంబ స్నేహితుడుగా ఉంటూ అందరితో స్నేహాన్ని చేస్తూ, అందరికీ స్నేహాన్ని అందిస్తూ ఈ రంగాలన్నింటిలో ఎవరికి కావలసిన దానిలో వారికి తోడ్పడగలగడం నిజానికి ఆది ఒక అసాధారణమైన గొప్ప అదృష్టం. వీటన్నింటిలో ఇంకా అనేక అదనపు విషయాల్లో ప్రవేశం ఉండి స్వయంగా తన స్వంతకృషిమీద ఆధారపడి, సమర్థులుగా అందరి అభిమానాన్ని చూరగొన గలగడం అంతర్జాతీయంగా ప్రఖ్యాతులైన చెవి, ముక్కు, గొంతు వైద్యంలో స్పెషలిస్టు అయిన డాక్టరు చిట్టూరి సత్యనారాయణ గొప్పతనం.

డాక్టరు సత్యనారాయణగారు వైద్యరంగంలో ముఖ్యంగా శస్త్రచికిత్సా విధానాలలో కొత్త పద్ధతులను కనుగొనడం ద్వారా మంచి పేరు సంపాదించుకున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఒక డజనుకు మించిన వైద్య సంఘాలు ముఖ్యంగా యు.ఎస్.ఎ., యు.కె., ఫ్రాన్స్, నెదర్‌లాండ్ దేశాలు ఆయనను గౌరవించాయి. అక్కడ తమ ప్రత్యేక వైద్యవిధానాలను ఆయన ప్రదర్శించి చూపెట్టి సహ సభ్యత్వాల్ని పొందగలిగారు. జపాన్‌లో జరిగిన ఎనిమిదవ అంతర్జాతీయ ఇ.ఎన్.టి. మహాసభ సందర్భంలో ఆయనకు గౌరవ సర్టిఫికెట్ ఇవ్వడం జరిగింది.

భారతదేశం ప్రచురిస్తున్న ఒకే ఒక ఇ.ఎన్.టి. పత్రికకు ఒక దశాబ్దానికి పైగా ఆయన సంపాదకులుగా ఉన్నారు.

వైద్య సేవలకు కావలసిన పరికరాలకు గాను సత్యనారాయణగారు తయారుచేసిన నమూనాలను చూచి కేంద్రప్రభుత్వ పబ్లిక్ రంగ సంస్థల సంఘం సంతృప్తి చెందింది. ఆ విధంగా ఆయన పరికరాల తయారీ రంగంలో కూడా తనకున్న నైపుణ్యాన్ని ప్రదర్శించి చూపెట్టారు. ప్రభుత్వం వారు ఈ రంగంలో ఆయన సేవలను వినియోగించుకుంటే బావుంటుందని చెప్పడం నా బాధ్యత.

ఆయన భారతదేశంలోను, ఇతర దేశాలలోను ఉన్న అనేక వైద్యశాస్త్ర సంబంధమైన పత్రికలలోను బ్రిటిష్ క్లినికల్ సర్జరీ పత్రికలలోను అనేక విజ్ఞానదాయకమైన వైద్యశాస్త్ర విషయాలను వెల్లడిస్తూ వ్యాసాలు రాశారు. ఆయనకు ప్రావీణ్యమున్న ప్రత్యేక విభాగాలకు సంబంధించిన అనేక అంతర్జాతీయ వైద్యసభలకు ఆయనను ఆహ్వానించి గౌరవించడం జరిగింది.

ప్రాచీన భారత వైద్యనిపుణులైన చరకుడు, శుశ్రుతుడు చేసిన బోధనలను వివరిస్తూ వైద్యులైన వారు పాటించవలసిన నైతిక సూత్రాలను గురించి ఆయన మాట్లాడినపుడు టోక్యో

మహాసభ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని గొప్పగా కొనియాడింది. ఆయన మద్రాసు జనరల్ హాస్పిటల్‌లో ఇ.ఎన్.టి. విభాగానికి డైరెక్టరుగా ఉండి, ఆ తరవాత దానికి సూపరింటెండెంటు కాగలిగారు.

ఆయన ఇ.ఎన్.టి. స్పెషలిస్టుగా ఉన్నప్పటికి సాధారణ వైద్యంలో కూడా ఆయనకు మిత్రులైన వారు, ఆయన సూచనలు, వైద్యం బాగా ఉంటాయనే నమ్మకంతో తమ వ్యక్తిగత సేవల విషయంలో ఆయన పైనే ఆధారపడేవారు. బాగా విషయపరిజ్ఞానమున్న రాజాజీగారు కూడా వైద్యశాస్త్ర సంబంధమైన విషయాలలో ఆయనతో చర్చిస్తూ ఆయన సలహాలను తీసుకొంటూ తన వైద్య అవసరాల నిమిత్తం పూర్తిగా ఆయననే నమ్ముతుండేవారు. 1962 సంవత్సరంలో రాజాజీగారు ప్రపంచపర్యటనకు బయలుదేరుతున్న సందర్భంలో తన ఆరోగ్యాన్ని సరిచూసేందుకు వ్యక్తిగత వైద్యునిగా సత్యనారాయణగారికి తోడుండాలని తీసుకెళ్లారు. ధన్వంతరి లాగా ఆయన చాలా విశ్వాసనీయమైన వైద్యశిఖామణి. మాలాంటి వారమంతా వైద్య విషయాలలో, ఆయన సలహాలకోసం ఎదురుచూస్తుండేవారం.

కవిగా శ్రీ సత్యనారాయణ కొన్ని గుర్తుంచుకోదగిన రచనలు చేశారు. జీవిత మధురిమ అనే పేరుతో ఆయన రాసిన ఏకాంక నాటిక ఆలిండియా రేడియో ద్వారా ప్రసారమైంది. అది తెలుగు తమిళ భాషలలో కూడా ప్రచురణకు నోచుకుంది. దానిలో ఒక యువ రచయితగా ఆయన ఇద్దరు ప్రేమికుల ప్రణయ భావాలమధ్య ప్రజల కష్టనష్టాలను వివరిస్తారు. పరస్పర ఆకర్షణకు లోనై ప్రేమలో మునిగిన ఆ ఇద్దరు ప్రేమికులు ఆకర్షణతో కూడిన ఆ ప్రేమలోనే సంతృప్తి చెందలేక అందుకోసం దివ్యత్వాన్ని కనుక్కోడానికి వెదుకులాట ప్రారంభిస్తారు. ముగింపు సందర్భంలో తన ప్రియురాలికి జవాబుచెప్తూ ప్రియుడు మనకు కావలసిన పూర్తి సంతృప్తి, భగవంతునితో సంలీనం కావడం అనేది, కష్టాలలో ఉన్న మానవులకు సేవచేసుకోవడం ద్వారానే సాధించుకోగలమని వివరిస్తాయి. అప్పుడు ప్రేమకోసం వెదుకు లాడుతున్న ఆ బాలిక సమాజాన్ని అహింసాయుతపద్ధతుల్లో నడిపించాలని బుద్ధుని రీతిలో అసమానతలను అన్యాయాలను ఎదుర్కొనేందుకు సత్యాగ్రహమే సరైన మార్గమనే గాంధీజీ భావనకు అంకితమై ఆనందిస్తుంది. సౌందర్యాన్ని మానవత్వాన్ని ప్రతిబింబించే ఈ కావ్యానికి ముందుమాట రాసే అవకాశం నాకు లభించింది.

స్నేహితులను తయారుచేసుకోవడం అట్టే పెట్టుకోవడం సత్యనారాయణగారికి వెన్నతో పెట్టిన విద్య. ఆంధ్ర రాజకీయ నాయకులు గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ కాంగ్రెస్ నాయకులైన బారిష్టరు ఉన్నవ లక్ష్మీనారాయణ గారి వంటి పెద్దమనిషితో సత్యనారాయణ చిన్న వయసులోనే స్నేహం చేశారు. లక్ష్మీనారాయణగారిని సత్యనారాయణగారు గొప్పవారైన మంచి స్నేహితునిగాను, కవి, వేదాంతి, పండితులు ఋషితుల్యులైన మహర్షిగాను వెనుకటి భారతీయ ఋషుల కోవకు చెందిన ఉన్నతునిగా భావించి మంచి గౌరవంతో చూస్తుండేవారు. అప్పటికి వారిద్దరకు స్నేహం ఏర్పడేనాటికి సత్యనారాయణగారికన్నా లక్ష్మీనారాయణగారు మూడురెట్లు పెద్దవారు. అయినప్పటికి సత్యనారాయణను ఆయన ఒక మంచి మిత్రునిగా, చేదోడుగా భావించి

చూసుకునేవారు. అప్పటికే లక్ష్మీనారాయణగారు యోగంలో మంచి సాధకులుగా ఉండి ప్రఖ్యాత కవులుగా వైష్ణవ భక్తుడను, శైవ సన్యాసులను అభిమానంతో చూసే తత్వవేత్తగా ఉండేవారు. ఆయన సత్యనారాయణ గారికి ప్రాచీన భారతీయ తాత్విక చింతనలోని అంతరార్థాన్ని వివరించి చెప్పుండేవారు. ఆవిధంగా లక్ష్మీనారాయణ తన ఆధ్యాత్మికాభివృద్ధికి తన మిత్రుని బోధనం ద్వారా మార్గాలను వెతుక్కునేవారు. తనకు పెద్దన్న, తత్వవేత్త ఆయిన లక్ష్మీనారాయణగారి పట్ల సత్యనారాయణ సదా కృతజ్ఞతతో ఉండేవారు.

వేదాంత విజ్ఞాన సారాన్ని గ్రహించేందుకు ఆయన చేస్తున్న కృషిలో ఆయన భార్య శ్రీమతి లక్ష్మీదేవి తన ఆత్మజ్ఞానంతో ఆయనకు సహాయపడుతూ ఉండేది. వారిద్దరూ అరవిందుని బోధనలపై ఒకరితో ఒకరు పోటీపడి చర్చించుకుంటూ ధూర్జటి కవి శివుని ప్రస్తుతిస్తూ రాసిన కాళహస్తి మహత్యం లోఉన్న వేదాంత రహస్యాలను గురించి పరిశీలన చేస్తుండేవారు.

వారిరువురూ శ్రీ రమణ మహర్షి బోధనలపై ఎక్కువ మక్కువ చూపుతుండేవారు. ఆయన స్వామి శివానంద మహేష్ యోగి గార్ల ఆశీస్సులను అందుకున్నారు. స్వామి శివానందగారి భజనలు మహేష్ యోగిగారి యోగవిద్య ప్రజలకు ఎక్కువ మేలు చేస్తాయని ఆయన భావించేవారు. బొంబాయికి చెందిన ఇ.ఎన్.టి. స్పెషలిస్టు కీర్తిశేషులైన డాక్టరు అయేస్యూర్ సాధువుగా మారినప్పుడు వైద్యశాస్త్ర పరమైన ఆయన దగ్గర ఉన్న విలువైన రికార్డులనన్నింటిని ప్రేమతో సత్యనారాయణ గారికి అప్పగించారు.

సత్యాగ్రహ సమరంలో సత్యనారాయణగారు పాల్గొనటం ద్వారాను స్వాతంత్ర్యం కోసం దేశంలో చెర్రరిస్టు కార్యకలాపాలు కొనసాగుతున్నపుడు అందులో తన సర్వస్వాన్ని అర్పించడం ద్వారాను రాజాజీగారితో పాటు రోమ్, పారిస్, లండన్, వాషింగ్టన్ నగరాలకు వెళ్లి ఆయన వెంట తోడుగా ఉండి ఆయన ఆరోగ్యాన్ని శ్రద్ధగా కాపాడడం ద్వారాను మనదేశానికి ప్రజలకు ఆయన సేవచేయగలిగారు.

85 సంవత్సరాల వయసులో పూజ్యరాజాజీ, ప్రధాని జవహర్లాల్ నెహ్రూగారితో డ్యూటీతో గాంధీ శాంతి సంఘం తరపున అమెరికా వెళ్లి ప్రెసిడెంటు కెనడీ గారిని కలుసుకున్నారు. ఆ సందర్భంలో రాజాజీ గారు డాక్టరు సత్యనారాయణగారిని తనకు తోడుగా రావలసిందిగా అభ్యర్థించారు. అతి ప్రాముఖ్యం గల దేశభక్తి పరమైన అక్లిష్టతరమైన బాధ్యతను సత్యనారాయణగారు వహించారు.

అది ఎంత కఠినతరమైన పనో అంత గౌరవాన్ని తెచ్చిపెట్టే కార్యక్రమం. అది ఎంత కష్టతరమైన కృషో ప్రెసిడెంటు కెనడీగారు డాక్టరు సత్యనారాయణ గారికి చెప్పిన మాటల్ని చూస్తే తెలుస్తుంది. "మీ చేతులో ఎంతో విలువైన గొప్ప వ్యక్తి ఉన్నారు. ఆయనను జాగ్రత్తగా చూడండి. మీరు విజయవంతులు కావాలని నా కోరిక."

సత్యనారాయణగారు రాత్రింబగళ్ళు జాగ్రత్తగా ఆయనను కనిపెట్టుకొని ఉండేవారు.

రాజాజీ గారు విమానంలో నిద్రిస్తున్నా గదులలో విశ్రాంతి తీసుకుంటున్నా విమరుపాటుగా ఉండక, బాగా యువకులు, ఉత్సాహవంతులైన దేశాధినేతలతో దీర్ఘకాలం చర్చలు కొనసాగిస్తున్న సందర్భంలోనూ, పోప్‌జాన్ గారినుంచి ప్రైమ్ మినిస్టరు మేక్ మిలన్‌గారివరకు, ప్రెసిడెంట్ కెనడీ, రష్యన్ రాయబారి గ్రోమ్యాకో, ఫ్రెంచి విదేశాంగమంత్రితో చర్చలు జరుగుతున్నపుడు కూడా ఆయన ఆరోగ్యాన్ని అతిశ్రద్ధతో గమనిస్తుండేవారు. ఆహారాన్ని ఇస్తున్నప్పుడు రాజాజీగారు దానిని భుజిస్తున్నపుడు ప్రత్యేకంగా కనిపెట్టుకొని ఉండేవారు. ఆయన నిర్వహించే కార్యక్రమాలకు కావలసిన శక్తి శరీరం నుంచి తగ్గకుండా గమనిస్తుండేవారు.

ఈ పనులన్నింటిని ఆయన ఒక తల్లి బిడ్డకు చేసినట్లుగా చేస్తుండేవారు. ఆ సమయంలో ఆయన తనకు విశ్రాంతిని గాని, సౌకర్యాలనుగాని కోరుకోకుండా అతిశ్రద్ధగా తన బాధ్యతలను నిర్వహిస్తుండేవారు. నిజానికి ఈ కృషి ఒక గొప్ప యోగప్రదర్శన లాంటింది.

రాజాజీగారు పరిపూర్ణ ఆరోగ్యంతో తన బాధ్యతలను పూర్తిచేసుకొని భారతదేశానికి తిరిగి వచ్చినపుడు ఆయనకు సత్యనారాయణ గారికి మిత్రులమైన మేమందరం, ఎంతగానో ఆనందించి డాక్టరుగా వీరు, జాతీయ నాయకులుగా ఆయన తమతమ బాధ్యతలను సక్రమంగా పూర్తిచేసుకొని విజయవంతంగా తిరిగొచ్చినందుకు వారిని మేం అభినందించాం.

ఆ సందర్భంలో డాక్టరు సత్యనారాయణ గారు పొందిన అదృష్టం చాలా గొప్పది. రోమ్‌లో రాజాజీగారికి పోప్‌జాన్ గారికి మధ్య, ఆ తరవాత ఫ్రెంచి రాయబారితోనూ, రష్యన్ రాయబారి గ్రోమ్యాకోతోనూ, లండన్‌లో బ్రిటిష్ ప్రధాని మేక్ మిలన్‌గారితోనూ లేబరు పార్టీ నాయకులతోనూ అమెరికా అధ్యక్షులు కెనడీగారితోనూ జరిగిన సమావేశాలన్నింటిలో తాను ఉండగలగడం పూర్వకందనంత గొప్ప అనుభవం. అణ్వాయుధ దేశాల ద్వారా ప్రపంచ ఎదుర్కొనున్న ప్రమాదాలను గురించి మానవ జాతిని రక్షించేందుకు జరుగుతున్న ఆ చర్చల సందర్భంలో అక్కడ ఉండగలగడం రాజకీయ నాయకులకు అందులోనూ వైద్యులైన వారికి సర్వసాధారణంగా లభించని అవకాశం. అణ్వాయుధ రహితమైన దేశాల ప్రజలు తరపున ప్రశాంతంగా జీవించేందుకు అవకాశం కల్పించమని రాజాజీగారు విశద పరుస్తున్నపుడు వినగలిగే అదృష్టాన్ని ఆయన పొందారు. రాజాజీ గారు చెంఘిజ్ ఖాన్, తైమూర్, కార్టెజ్ లేదా బ్రిటిష్, డచ్చి, ఫ్రెంచి, పోర్చుగీసు, స్పానిష్, జపాన్ సామ్రాజ్యవాదుల చేతుల్లో ప్రపంచం అనుభవించిన బాధల కంటె ఈనాడు అణ్వాయుధాలు కలిగిన రాజ్యాల ద్వారా రానున్న ప్రమాదం ఎక్కువ వినాశకరమైందని రాజాజీ హెచ్చరించటాన్ని ఆయన విన్నారు.

ఆటంబాంబులను ప్రయోగించటం ద్వారా తరతరాలుగా మానవజాతి సంపాదించుకున్న నాగరికత, విజ్ఞానం యావత్తూ ఎలా విధ్వంసమైపోతుందో వివరిస్తూ మానవత్వం, మానవజాతి అభివృద్ధి కోసం వాటికి దూరంగా ఉండవలసిన అవసరాన్ని రాజాజీగారు వివరిస్తుంటే ఆయన ఎంతో భావోద్వేగానికి లోనైనారు. రెండో ప్రపంచ యుద్ధంలో వివిధ దేశాల ప్రజలు అనుభవించిన నష్టాలను ఆ సందర్భంలో జ్ఞప్తికి తెచ్చుకొని పాశ్చాత్య నాయకులు తమ ప్రతిస్పందనలను వినిపించటాన్ని ఆయన ఆనందంతో వినగలిగారు. శ్రీ రాజాజీ వారితో ఉన్న

ఇతర నాయకులు శ్రీ ఆర్.ఆర్.దివాకర్, శ్రీ బి.శివరావ్ గారలు గాంధీ శాంతి సంఘం తరపున మానవ వినాశనానికి ఉపయోగపడే అణ్వాయుధ ప్రమాదానికి వ్యతిరేకంగా అనేక దేశాలలో అనేకమంది నాయకులతో మేధావులైన వారంతా వారాల తరబడి చర్చలు సాగిస్తున్నపుడు అక్కడ ఉండి విలువ కట్టలేని జ్ఞానాన్ని సంపాదించుకోగలిగారు శ్రీ సత్యనారాయణ.

మా కుటుంబ పరిధిలోకి ఆయన 1931 సంవత్సరంలో మంచి యువకత్వంలో అందమైన ఉత్సాహవంతుడైన విద్యార్థిగా, తాను రాసిన పాటలు పద్యాలు చేతబట్టుకొని, దేశభక్తియుత సేవల్లో పాల్గొనేందుకు అవి అర్హతలుగా సత్యాగ్రహ సమరంలో పాల్గొనేందుకు మా వద్దకు వచ్చారు. నిడుబ్రోలులోని మా ఇంటికి ఆయన హరీంద్రనాథ ఛట్టోపాధ్యాయగారి జాతీయవాద దృష్టి కలిగిన నాటకాలకు పద్యాలకు ఆయన చేసిన అనువాదాలను కొన్ని తన స్వంత రచనలను తీసుకొని తరచు వస్తుండేవారు. ఆయన సంపూర్ణ విశ్వాసంగల జాతీయాభిమాని. చురుకైన నాయకత్వానికి కావలసిన ఉత్తమ లక్షణాలు కల వ్యక్తి. ఆయన ఆయన భార్యకూడా మామీద విశ్వాసంతో రాజకీయాల్లో మేం అనేక చిక్కులను ఎదుర్కొంటున్నప్పటికి మా కుటుంబానికి అప్పటినుంచి మంచి మిత్రులుగా ఉంటుండే వారు.

మద్రాసులోని ఆయన గృహం, భోజనశాల నిరంతరం మారాక కోసం ఎదురుచూస్తుండేవి. తన మద్రాసు గృహంలో ప్రేమపూర్వకంగా ఉన్నవ లక్ష్మీనారాయణ గారిని ఆదరించినట్లు ఆయన ఎల్లప్పుడూ మమ్మల్ని అభిమానిస్తూ ఆహ్వానిస్తుండేవారు. మేమిద్దరం రాజాజీ గారి ప్రేమను పొందగలిగాం. రాజాజీగార్ని తన పాలిటి దైవంగా భావించి ఆయనకు పెద్ద కుమారుని లాగా సేవలందిస్తుండేవారు. రాజాజీగారు సత్యనారాయణ గారిని తన కోసం భువిపై అవతరించిన దైవంగా భావిస్తూ సత్యనారాయణగారి సేవలకారణంగా, ప్రేమ కారణంగా తాను ఎలాంటి బాధలు లేకుండా సంతోషంగా ఉండగలుగుతున్నానని భావిస్తుండేవారు.

ఆయన చిత్రలేఖనంలోను, శిల్ప నిర్మాణంలోను సమర్థులేకాక పుస్తక పరిచయంలోనూ గొప్పవారు. ఆయన లైబ్రరీలో చరిత్ర, వేదాంతం, రాజకీయాలకు సంబంధించిన ఆంగ్ల, ఆంధ్ర గ్రంధాలు అనేక సాహిత్య పుస్తకాలు ఇటీవల వెలువడిన వాటి వరకు కూడా ఉండటాన్ని నేను చూశాను. ఆయన సంపాదకత్వ బాధ్యతలోనూ పుస్తక ప్రచురణలోనూ అనుభవనీయులు. నేను 1925-48 సంవత్సరాల మధ్య మహాత్మాగాంధీగారితో వారి జ్ఞాపకాల రూపంలో ఉన్న నా చర్చలను పుస్తక రూపంలో తీసుకురావాలనుకున్నప్పుడు దానిని ఆయన ఒక నూతన విధానంలో చక్కగా బైటకు తీసుకువచ్చి "బాపూ బ్లెస్సెస్" అని దానికి నామకరణం చేశారు. ఆయన అందుకు చేసిన కృషిగొప్ప నైపుణ్యంతో కూడినట్టిది. వెలువడిన నా పుస్తకాలన్నింటిలోనూ అది చక్కగా ఎడిటింగ్ జరిగి ముద్రణ పొందిన పుస్తకమైంది. గొప్ప కళాఖండమైన ఆ గ్రంథాన్ని భారతీదేవి గారికి అంకితమొసంగి తిరిగి ఆమెను స్మృతులలోనికి తెచ్చుకున్నారు.

38

శ్రీ షేక్ అబ్దుల్లా

కాశ్మీరుకు చెందిన షేక్ అబ్దుల్లా గారు 5-12-1905న జన్మించారు. ఆయన 1947 సంవత్సరం నుంచి 1953 వరకు కాశ్మీరు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయన జవహర్లాల్ నెహ్రూగారి తరవాత అఖిల భారత సంస్థాన ప్రజల సభకు అధ్యక్షులుగా ఉన్నారు. కాశ్మీరును ఆక్రమించేందుకు పాకిస్తాన్ వారు పంపిన ఆటవిక శక్తులను బైటకు తరిమివేసే కృషిలో భారత ప్రభుత్వానికి ఆయనా, ఆయన జాతీయ మహాసభ కార్యకర్తలు భారతీయ సైన్యాలకు తోడ్పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయనను అనేకసార్లు జైళ్లలో ఉంచింది. ఆయనను అధికారంలో నుంచి తొలగించిన తరవాత కాశ్మీరు హోదా విషయంలో భారత ప్రభుత్వంతో ఏర్పడిన విభేదాల కారణంగా తిరిగి నిర్బంధించడం జరిగింది. రంగాగారు, మృదులా సారాబాయి ఆయనను విడుదల చేయవలసిందని గట్టిగా కోరారు. వారిద్దరూ 1970 సంవత్సరంలో ఢిల్లీలో ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ గారికి స్వాగత సత్కారాలు జరిపినపుడు సత్కార కార్యక్రమంలో ప్రముఖంగా పాల్గొన్నారు. షేక్ అబ్దుల్లా గారు స్వాతంత్ర సమరయోధులు. నెహ్రూగారి కుటుంబానికి మంచి స్నేహితులు. మతతత్వంతో కూడిన జాతీయవాదనలోనుంచి బైటకు వచ్చి రాజకీయ సందిగ్ధావస్థనుంచి ఆయన స్వేచ్ఛగా వ్యవహరించలేకపోయారు. షేక్ అబ్దుల్లాగారు తిరిగి 1975 ఫిబ్రవరిలో కాశ్మీరు ముఖ్యమంత్రి అయ్యారు. ఈదఫా హృదయపూర్వకమైన సత్సంబంధాలు ఉండాలనే దృష్టితో శ్రీమతి ఇందిరాగాంధీగారు ఇందుకు పూనుకొన్నారు - (ఎడిటర్).

వాయవ్య ప్రాంతంలోని కాశ్మీరు, ఈశాన్య ప్రాంతంలో నాగాలాండ్, వాటి జనాభాతోగాని, విస్తీర్ణంతోగాని నిమిత్తం లేకుండా స్వతంత్ర భారత దేశంలో విశేష ప్రాముఖ్యాన్ని సంతరించుకున్నాయి. అక్కడ కాశ్మీరులో నలభై, యాభై లక్షలమంది జనం, నాగాలాండ్‌లో నాలుగునుంచి అయిదు లక్షలుగా ఉన్న జనం వారి జాతీయ ఆలవాట్లతో గట్టి శౌర్యప్రతాపాలుగల జాతిగా ప్రఖ్యాతులైనారు. ఈరెండు ప్రాంతాల రాజకీయ బాధ్యతను సైన వేసుకోవడం ద్వారా భారతదేశం ఎదుర్కొబోయే ఇబ్బందులను గురించి కాంగ్రెస్ కార్యవర్గంలో ఉన్న మాలాంటి వారం ఎవరమూ కూడా చివరికి ఆయనకు దగ్గరగా ఉండి సలహాలనిస్తున్న మిత్రులు గూడా నెహ్రూగారికి చెప్పలేదు.

మూడు అగ్రరాజ్యాలైన రష్యా, చైనా, భారతదేశాల సరిహద్దులు లడక్ ప్రాంతంలో మంచి వాణిజ్య కేంద్రమైన గిల్గిట్‌ను చుట్టుకొని ఉన్నాయని సర్. ఫ్రాన్సిస్ యంగ్ హస్బెండ్ గారు ప్రపంచాన్ని హెచ్చరించారు. జవహర్లాల్ నెహ్రూగారు గానీ, అప్పటి కాశ్మీరు ప్రజల ప్రముఖ నాయకులైన షేక్ అబ్దుల్లాగారుగానీ, కాంగ్రెస్ కార్యవర్గం గానీ అప్పటి కాశ్మీరుకు మహారాజాగా ఉంటున్నవారుగానీ కాశ్మీరు విలీనం ద్వారా భారతదేశంపై పడనున్న అదనపు భారాన్ని గురించి

ఆలోచించలేదు. వాయవ్య సరిహద్దు ప్రాంతాలలోని కొండజాతుల వారి దాడులను మనం తిప్పికొట్టి షేక్ అబ్దుల్లాను ప్రధాన మంత్రిగా నిర్ణాటు చేసిన తరవాత కూడా పాకిస్తాన్, చైనా, రష్యాదేశాలు అనుసరించబోయే విధానాలను, ఆ పరంగా అంతర్జాతీయంగా కాశ్మీరు ఎదుర్కొనవలసి ఉన్న కీలకమైన క్లిష్ట పరిస్థితిని గురించి మనం సరిగ్గా అంచనా వేసుకోలేదు. పాకిస్తాన్‌ను కొండజాతుల వారి దాడుల ద్వారా బ్లాక్యం చేసుకోకుండా నిరోధించేందుకు మిత్రరాజ్య సమితి సహాయాన్ని కోరుతూ విశ్వశాంతి స్థాపనలో దానిపిద ఆయనకున్న నమ్మకం కారణంగా నెహ్రూగారు త్వరపడి అక్కడకు వెళ్లారు. అప్పుడు ఆంగ్లో అమెరికన్ రాజ్యకూటమి ఒకవైపు, సోవియట్ రష్యా దాని మిత్రరాజ్యాలు మరోవైపు నిలిచి సరిహద్దుల్లో ప్రశాంతంగా జీవిస్తున్న ఈ ప్రజలపై తమ తమ అభిమతాలను సాధించుకునేందుకు వీలుగా ఈ వివాదాన్ని విస్తరింప జేయసాగారు. ఆ తరవాత చైనా దీర్ఘకాలంగా ఎదురు చూస్తున్న సింకియాంగ్‌పై తమ సార్వభౌమాధికారాన్ని నిర్ధారుకొని టిబెట్‌ను తమ రాజ్యభాగంగా చేసుకొంది. ఈ సందర్భంలో భారతదేశం సరిహద్దుల్లో తమకు అవసరమైన కీలక ప్రయోజనాలను మరచిపోయింది.

సోవియట్ రష్యా, తజికిస్తాన్ సరిహద్దులకు దగ్గరగా పాకిస్తాన్ లోని ఫక్తూనిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో కాలుమోపి అమెరికా దేశం రష్యాకు వ్యతిరేకంగా తన శత్రు కార్యకలాపాలను కొనసాగించ సాగింది. షేక్ అబ్దుల్లా స్టీవెన్‌సన్‌గారి ద్వారా కాశ్మీరును ఒక స్వతంత్ర రాజ్యంగా ఉంచేందుకు దానికి మిత్రరాజ్య సమితి పోషిగా ఉండి భారత పాకిస్తాన్ దేశాలు ఆ ఏర్పాటును అంగీకరించేలా చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.

స్వాతంత్ర్యానంతరం మనదేశంలో అతి ప్రముఖులుగా పేరుపొందిన జాతీయ నాయకులలో షేక్ అబ్దుల్లా గారొకరు. జాతీయ ప్రయోజనాలను కాపాడేందుకై బాధలనుభవించిన జాతీయ కార్యకర్తలలో ఆయన ఎక్కువ బాధను పొందినవారు. జవహర్లాల్ నెహ్రూగారు బాగా అభిమానించే కొద్దిమంది నాయకులలో ఆయన ఒకరైనప్పటికి జవహర్లాల్ నెహ్రూగారితో రాజకీయ విభేదాల కారణంగా ఆయన ఎక్కువగా అసంతృప్తిని ఎదుర్కొనవలసి వచ్చింది. దురదృష్టం ఏమిటంటే షేక్ అబ్దుల్లాగారు మృదులాసారాబాయిగారు వారి రాజకీయ జీవితాన్ని జవహర్లాల్ నెహ్రూగారి అభిమానులుగా ప్రారంభించి ఆయనతో పరస్పరం మంచి మిత్రులుగా నడుచుకొంటూ, కాశ్మీరు విషయంపై నెహ్రూగారనుసరిస్తున్న జాతీయ విధానానికి వ్యతిరేకంగా ప్రత్యర్థులై, అంత అభిమానులుగా రాజకీయరంగం లోనికి వచ్చినవారు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనవలసి వచ్చింది. వారిద్దరూ నెహ్రూ ప్రభుత్వం కాశ్మీరు సమస్యపై తీసుకున్న జాతీయ విధానానికి, పార్లమెంటు నిర్ణయాలకు వ్యతిరేకులై నిర్బంధిగా బాధలను భవించారు. 1945 వ సంవత్సరంలో జవహర్లాల్ నెహ్రూగారు సంస్థాన ప్రజల మహాసభాధ్యక్షులుగా ఉండేందుకు పిలిస్తే ఉదయపూర్ వచ్చినపుడు షేక్ అబ్దుల్లాగారితో నాకు అక్కడ సంబంధాలేర్పడ్డాయి. అప్పుడు ఒరిస్సా, హైదరాబాదు సంస్థానాలలో ప్రజాపోరాటాలకు నాయకత్వం వహిస్తున్న వారిలో నేనూ ఒకడను. అప్పట్లో సంస్థానాల ప్రజానాయకులలో అబ్దుల్లా గారు విప్లవ ధోరణి కలిగిన మంచి నాయకులుగా పేరుపొందారు. గాంధేయ సోషలిస్టులమైన మాలాంటి వారమంతా కాశ్మీరు ముస్లిం కాన్ఫరెన్సు

మత రాజకీయాలను గురించి వస్తున్న విమర్శలను వింటూ ఉన్నప్పటికి మేం వాటినేమీ పట్టించుకోకుండా కాశ్మీరు మహారాజాకు వ్యతిరేకంగా ధైర్యంతో పోరాడుతూ సంస్థానాల్లో తీవ్రవాద నాయకుడుగా ఆయన ముందుకు రావడాన్ని చూసి గౌరవించాం. భారత రాజ్యాంగంలో ఒక ప్రాంతంగా ఉన్న కాశ్మీరుకు విశేషాధికారాలు ఉండడాన్ని గూడా మేం వ్యతిరేకించలేకపోయాం. ఆలోచనా రహితమైన పద్ధతి ద్వారా షేక్ అబ్దుల్లా గారిని తొలగించడం ద్వారాగాని, సంవత్సరాల తరబడి ఆయనను నిర్బంధంలో ఉంచటం వల్లగానీ, కాశ్మీరు రాజకీయాలలో వచ్చిన దురదృష్టకరమైన పరిణామాలవల్లగాని, ఇది సంభవించలేదు. అబ్దుల్లా గారిని కేంద్రమంత్రివర్గంలోనికి ఆహ్వానించి ఉన్నా, భారత రాష్ట్రపతిగా చేసిఉన్నా పరిస్థితులు మరో మంచిమార్గంలోనికి మళ్లి ఉండేవి. జవహర్లాల్, షేక్ అబ్దుల్లా, మృదులా సారాబాయి వారి వారి మిత్రులైన ఇతరులు; వారిమధ్య ఉన్న వ్యక్తిగత స్నేహసంబంధాలను పక్కకునెట్టి రాజకీయాల్లో భిన్న వర్గాలుగా దీర్ఘకాలం బాధపడే పరిస్థితి సరైన నిర్ణయాలు తీసుకోలేనందువల్ల ఏర్పడింది. తుదకు భారత ప్రధానిగా ఉన్న శ్రీమతి ఇందిరాగాంధీగారు, షేక్ అబ్దుల్లాగారు, వారి ప్లెబిసైట్ ఫ్రంట్‌ల మధ్య ఒక అంగీకారం కుదరడంతో దీర్ఘకాలంగా తేలకుండా ఉన్న అత్యవసరమైన ఆ సమస్య తిరిగి కాశ్మీరు రాష్ట్ర ముఖ్యమంత్రిగా షేక్ అబ్దుల్లా గారు రావడంతో ఒక కొలిక్కి వచ్చినట్లైంది.

రాజ్యాంగంలో కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించబడింది. పండిట్ నెహ్రూ ఏకపక్షంగా పరిస్థితులు కుదుటబడి శాంతియుత వాతావరణం ఏర్పడినపుడు కాశ్మీరు ప్రజలు ప్లెబిసైట్ ద్వారా తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకోవచ్చని పదేపదే ప్రకటించడం కారణంగా, కాశ్మీరును ఒక ప్రత్యేక పాలిత ప్రాంతంగా పరిగణించేందుకు పాకిస్తాన్ అగ్రరాజ్యాలు మిత్రరాజ్య సమితి పూనుకొన్నాయి. ఆ పరిస్థితుల నేపధ్యంలో మన రాజ్యాంగసభ ఆ తరవాత పార్లమెంటుకూడా కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తి కావాలనే షేక్ అబ్దుల్లా గారి కోర్కెలకు తలొగ్గవలసి వచ్చింది. అందువల్ల ఇతర సంస్థానాల ప్రజలు, పాలకులు భారత యూనియన్‌లో కలిసేటట్లు తమకు ప్రత్యేక రాజ్యాంగాన్ని ఏర్పాటుచేయమని త్వరపెట్టసాగారు. అబ్దుల్లాగారు కేంద్రప్రభుత్వం రక్షణ, వార్తాప్రసారాలు వాణిజ్యం వంటి విషయాలకు మాత్రమే పరిమితమై ఉండి మిగిలిన విషయాలలో రాష్ట్రానికి సంపూర్ణాధికారాలు ఇవ్వాలని పట్టుబట్టడంతో భారత ప్రజలు బాగా అసంతృప్తిచెంది ఆయనతో వివాదపడవలసి వచ్చింది. రాజ్యాంగ రచనా కార్యక్రమం పూర్తికానున్న తరుణంలో తలకిందులు గావలసి వచ్చింది. షేక్ అబ్దుల్లా గారు దేశభక్తితో గూడిన లౌకిక వాదంతో కాశ్మీరులోని విస్తృతశక్తులను జాతీయ మహాసభలోకి ధైర్యంగా ఆహ్వానించడంతో నెహ్రూగారు షేక్ అబ్దుల్లా గారికి భారతదేశ స్నేహహస్తాన్నందించేందుకు హుటాహుటిగా కాశ్మీరు వెళ్లారు. కాశ్మీరులో అడుగుపెట్టకుండా ఆయన ప్రవేశాన్ని నిషేధించిన కారణంగా ఆయన ఆ ఆజ్ఞను ధిక్కరించి కాశ్మీరులో ప్రవేశించి అరెస్టయ్యారు. ఆ సమయంలో అబ్దుల్లా గారికి ఒక జాతీయ నాయకునిగా అఖిలభారతదేశం పోరతులు పట్టింది. ఆ తరవాత మహారాజాగారు మాత్ అంగీకరించి జైలునుంచే షేక్ అబ్దుల్లాను ముఖ్యమంత్రిగా ఆహ్వానించడంతో రాజ్యాంగసభలో ఉన్న మేమంతా భారత స్వతంత్ర్యోద్య మంలో సంస్థానాల ప్రజల తరపున చక్కని పాత్రను నిర్వహించేందుకు నూతనమైన అభ్యుదయకరమైన మార్గం దొరికిందని భావించాం.

ఎప్పుడైతే షేక్ అబ్దుల్లా గారు కాశ్మీరు ప్రజల ప్రత్యేక హక్కులను గురించి కోర్కెలను గురించి మిగిలిన భారతదేశంలో ఉన్న ముస్లిం మైనారిటీల సమస్యలను గురించి మాట్లాడడం ప్రారంభించారో దానిని చూసి మేమంతా ఆశ్చర్యపోయాం. ముస్లింల ప్రత్యేక అవసరాలను గమనించడంలేదని భారత ప్రజలను ఆయన హెచ్చరించి కాశ్మీరులో ఉన్న ముస్లిం మెజారిటీకి అనుకూలంగా స్పందిస్తూ కులమతాలకు అతీతంగా పనిచేస్తున్న లౌకికతత్వంతో ఉన్న దేశభక్తుల చేతులను కట్టివేశారు. వీటి కారణంగాను, ఇటువంటి అనేక ఇతర కారణాలవల్లను, భారతదేశంలో ఉన్న రాజకీయ నాయకులు, దేశభక్తులు ఆయన దీర్ఘకాల కఠిన నిర్బంధంలో గడిపినప్పటికి దానిని మరచిపోయి తమకు తాము పునర్విచారణ చేసుకోసాగారు.

నేనొక్కడిని వ్యక్తిగత స్థాయిలోనూ, బహిరంగంగాను కూడా కాంగ్రెస్ పార్టీలో ఉన్నపుడు, పార్లమెంటులో ప్రతిపక్షనాయకుడిగా ఉన్నప్పుడు, ఆయనను విడుదల చేసి తిరిగి స్నేహపూర్వకమైన సంబంధాలను పెట్టుకోడం మంచిదని వాదించాను. దురదృష్ట వశాత్తూ ఆయన కాశ్మీరులోనూ కాశ్మీరుకు వెలుపల ఉన్న ప్రజా హృదయాలలో నెలకొని ఉన్న భయాందోళనలను తొలగించేందుకు ప్రయత్నించలేకపోయారు. అలాగే పూర్వకాలంలో తాను అనుసరించిన జాతీయవాదంతో కూడిన దేశభక్తిని తిరిగి ప్రదర్శించి, లౌకిక వాదిగానూ, భారతీయ పౌరుని విశ్వాసపాత్రులుగా వ్యవహరించలేక పోయారు. అందువల్ల మా ప్రయత్నాలు నిష్ఫలమై, నిస్పృహకు లోనయ్యాయి.

నెహ్రూగారు స్వర్గస్థులు కాబోయేదానికి ఒక పక్షం రోజుల ముందు రాజాజీగారు సలహాఇచ్చిన విధంగా 1965 వ సంవత్సరంలో మొదటిసారి ఆయనను నిర్బంధం నుంచి ఆయన విడుదలచేసి ఆ తరవాత భారత పాకిస్తాన్ దేశాల మధ్య శాంతి స్థాపన చేసేందుకు ఒక అంతర్జాతీయ నాయకునిగా సోదర పాత్ర నిర్వహించేందుకు ఆయనను వినియోగించుకోవాలని జవహర్లాల్ గారు గట్టి ప్రయత్నంచేశారు. ఆ తరవాత లాల్ బహదూర్ శాస్త్రిగారి మృదువైన భాషణాలను ఆయన బలహీనతగా భావించి ఇంగ్లండు లోనూ పశ్చిమాసియా దేశాలలోనూ కాశ్మీరుకు దాని రాజకీయ ప్రతిపత్తికి అంతర్జాతీయ స్థాయిని తీసుకురావాలని ప్రచారం మొదలు పెట్టారు. దానితో ఆయనను తిరిగి నిర్బంధించటం జరిగి కాశ్మీరు క్షేమాన్ని కోరే మాలాంటి వారందరమూ ఆయన తరపున పనిచేస్తున్న దేశభక్తి పరులైన మృదులా సారాబాయి గారిని ఇంకెంతగానో బలహీనపరచింది.

చిట్టచివరకు అబ్దుల్లాగారిని విడుదల చేసినందుకు మేమంతా చాలా సంతోషించాం. మేమంతా నిర్బంధాలలో ఉన్న నాటికంటె ఆయన నిర్బంధంలో ఉన్న సమయంలో ప్రత్యేక అవకాశాలు అనేక సౌకర్యాలు కల్పించినప్పటికి, ఆయన విడుదల కావడం అవసరం కాబట్టి మేమంతా దానిని ఆహ్వానించాం. ఆయన ఆరోగ్యాన్ని జాగ్రత్తగా కాపాడేందుకు అతిశ్రద్ధ తీసుకొని నిర్బంధ సమయంలో ఆయన తన రాజకీయ కార్యకలాపాలను కొనసాగించుకోనేందుకు, కుటుంబసభ్యులను కలుసుకునే అవకాశం కూడా కల్పించడం జరిగింది. కీర్తిశేషులైన శ్యాం ప్రసాద్ ముఖర్జీగారి విషయంలో ఆయన ప్రవర్తించిన దానికంటే ఎన్నోరెట్లు అదనంగా

స్నేహపూర్వకమైన సంబంధాలను భారత ప్రభుత్వం ఆయనకు కల్పించింది. అంతేకాక కాశ్మీరు మినహా భారతదేశమంతా ఎక్కడికైనా వెళ్లే అవకాశం ఆయనకు కల్పించి అన్ని మర్యాదలనూ ఇచ్చినప్పటికి తనను అధికంగా ప్రేమించే ప్రజలతో మాత్రం కలుసుకునేందుకు వీలు లేకుండా చేశారు. కాశ్మీరు ప్రజలపై తన నియంత్రత్వ ప్రభావాన్ని ప్రసరింపజేయనీయకుండా చేస్తూ స్వేచ్ఛగా తిరిగే హక్కును అవిధంగా భారతదేశం ఆయనకు ప్రసాదించింది. తీవ్రమైన ఆ విద్వేషాన్ని లోనుంచి బైటకురావడానికి సహజంగానే ఆయనకు చాలా సంవత్సరాలు పట్టింది. నిదానంగా సాధురీతిలో క్రమేణా ఆయన భారత పౌరుడుగా తన పూర్వ అఖిల భారత దృష్టివైపు మళ్లుతూ రెండు దశాబ్దాలుగా వారు కోరుతున్న ప్లెబిసైట్ కోర్కెను వదలిపెట్టి రావడం ఆయనకు ఆయన సహచరులకు అంత సులువైన సంగతేమీకాదు. మన చరిత్ర మన కందించిన విలువైన సాంప్రదాయాలను కాపాడుకుంటూ పూర్తిస్థాయి దేశభక్తితో కూడిన జాతీయ సమైక్యత మన అభివృద్ధికి సమిష్టి లక్ష్యంగా కాశ్మీరు భారత రాజ్యాంగ వ్యవస్థలో ఒక భాగంగా ఉంటూ విడువని సోదర ప్రేమబంధాన్ని ముడివేసుకొంటూ, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి వారు క్రమేణా నిజం తెలుసుకోడాన్ని చూచి దేశభక్తులైన భారతీయులందరూ ఆనందించారు. రెండు దశాబ్దాల పోరాటం తరవాత తీవ్రమైన త్యాగాలను, బాధలను అనుభవించిన తర్వాత షేక్ అబ్దుల్లా అప్పుడు తిరిగి తన స్వంత ఇంటికి రాగలిగారు. పాకిస్తాన్ తిరిగి భయంకరమైన దాడులను కొనసాగిస్తున్నప్పటికి, ఆర్థిక దుస్థితి సర్వత్రా పెరిగిపోతూ ఉన్న సమయంలో పాక్ ఆక్రమిత కాశ్మీరులో ప్రజలు దురదృష్టకరమైన జీవితాన్ని గడుపుతూ ఉంటే తాము భారతదేశంతో కలిసి ఎలా తిరుగులేని అభివృద్ధిని సాధించారో కాశ్మీరు ప్రజలు గ్రహించి, కాశ్మీరు ప్రజల ప్రయోజనాలను మిగతా భారతదేశ ప్రయోజనాలను గూడా దృష్టిలో ఉంచుకొని అబ్దుల్లా శ్రీమతి ఇందిరాగాంధీ గార్ల మధ్య వీర్పడిన పునర్విచారణను కాశ్మీరు ప్రజలు తెలివితో అంగీకరించారు. అటు షేక్ అబ్దుల్లా, ఇటు కాశ్మీరు దేశం కూడా వయసుతోపాటు మానసిక దృఢత్వాన్ని గూడా సంపాదించుకొని దేశభక్తిని పెంపొందించుకోసాగాయి.

రెండు దశాబ్దాలుగా భారత ప్రభుత్వానికీ ఈ ప్రముఖ నాయకునికీ మధ్య జరుగుతూ ఉన్న వివాదాన్ని చూసి దేశ ప్రజలంతా బాధపడ్డారు. నేను రెండుసార్లు వ్యక్తిగతంగానూ, బహిరంగంగానూ అబ్దుల్లా గారిని విడుదలచేయవలసిందని వాదించాను. ఆ రెండుసార్లు ఆయనను విడుదల చేయడం జరిగింది. అయితే విడుదలయిన ప్రతిసారీ 1953 నాడు ఆ రాష్ట్రం ఏ స్థితిలో ఉందో ఇప్పుడూ అదే ఉండనిమ్మని ఆయన ఆనందదాయకమైన ఆ పాతపాటనే తిరిగి పాడసాగారు. ఈ రెండు దశాబ్దాల కాలంలో జరిగిన తిరగదోడడానికి వీలులేని అనేక విజయాలను గుర్తించడానికి ఆయనకు చాలా సంవత్సరాలు పట్టింది. మిగతా భారతదేశంలాగే కాశ్మీరు ప్రజలుగూడా వివిధ రకాలైన సమస్యలను ఎదుర్కొంటున్నారు. భారత రాజ్యాంగానికీ లోబడి భారతదేశ ప్రజాస్వామ్య పద్ధతిలో ఆయన ప్రియమిత్రుడైన జవహర్లాల్ గారి పుత్రిక శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో దారిద్ర్యాన్ని నిర్మూలన గావించడానికి కాశ్మీరంతో సహా యావద్భారతదేశం ఈవాడు ప్రయత్నిస్తుంది. అందువల్ల అబ్దుల్లాగారు తాను రెండోసారి ముఖ్యమంత్రి అయిన సందర్భంలో మంచి పరిపాలనను అందిస్తూ విధులను సక్రమమార్గంలో

వినియోగిస్తూ కాశ్మీరు ప్రజల జీవనస్థాయిని పెంచేందుకు ఈ సందర్భంలో కృషిచేయవలసిన బాధ్యత ఆయనపై ఉంది. ఆయనను తిరిగి మామూలు పరిస్థితులను నెలకొల్పడానికి కృషిచేసిన మాలాంటి వారుసంతా భారత పాకిస్తాన్ దేశాల మధ్య ఉన్న వివాదాలకు పరిష్కారాలను కనుగొనే బాధ్యతను అఖిల భారత నాయకత్వానికి వదలిపెట్టి ఆయన, ఆయన అనుచరులు తమ బాధ్యతలను గౌరవనీయంగా నిర్వహించగలరని భ్రాంతి పడ్డాం.

ఈ ఉపఖండంలో ఉన్న మూడు రాజ్యాల మధ్య సత్సంబంధాలను ఏర్పాటుచేసేందుకు గాను షేక్ అబ్దుల్లా కాశ్మీరు భారతదేశంలో అంతర్భాగమని కాశ్మీరు ప్రజలు మిత్రరాజ్య సమితి జోక్యాన్ని ఇందులో ఏరకంగానూ సహించరని తిరిగి ప్రపంచానికి తెలియజేశారు. అనుభవనీయుడైన ఈ ప్రముఖ నాయకుడు చెప్పిన విషయాలను గ్రహించి కాశ్మీరీలను దేశభక్తులైన భారతీయులుగా అభివృద్ధి చెందేందుకు పాకిస్తాన్ ప్రజలు అంగీకరించగలరని ఆశించాం. బాధాకరమైన ఈ కాశ్మీరు అనుభవం ద్వారా జాతీయ నాయకత్వం, రాష్ట్రాల నాయకులు కూడా కొంత వివేచనతో వ్యవహరించవలసిన అవసరం ఏర్పడింది. కాశ్మీరుకు తూర్పున ఉన్న నాగాలాండ్, మిజోరం, మేఘాలయ రాష్ట్రాలు పశ్చిమాన ఉన్న లడక్ జమ్మూ ప్రాంతాలు భారతదేశమంతటా ఉన్న అనేక ఇతర రాష్ట్రాలు దేశభక్తులైన షేక్ అబ్దుల్లాగారు పొందిన ఈ కఠినతరమైన అనుభవాలనుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. భారత జాతీయ నాయకులు, పార్లమెంటు, రాష్ట్రాల నాయకులూ కూడా కాశ్మీరు ఫ్రంట్ పొందిన హృదయాన్ని కదిలించే బాధలనుంచి, దాని వ్యర్థప్రయత్నాలను అనుభవాలను గ్రహించి భారతదేశ సమగ్రతకు చెరుపు లేకుండా ఉండే విధంగా రాష్ట్రాల స్వయం నిర్ణాయక హక్కులను పెంపొందించుకోవడానికి ఒక ఆలోచన చేయవలసిన అవసరం ఏర్పడింది. దీర్ఘకాలంగా చారిత్రాత్మకంగా ఉన్న అనుమానాలను తొలగించుకుంటూ భవిష్యత్తులో రానున్న నాయకుల కోసం ఒక గౌరవనీయమైన నూతన మార్గాన్ని ఏర్పరిచేందుకు కేంద్రం, రాష్ట్రాలు, ప్రజల మధ్య విడివడని స్నేహ సంబంధాలను ఏర్పరచుకొనేందుకు 1974-75 సంవత్సరాల మధ్య శ్రీమతి ఇందిరాగాంధీ షేక్ సాహెబ్‌గార్ల మధ్య దేశభక్తితో కూడిన విజయవంత మైన ప్రయత్నాలు ప్రారంభమైనాయి.

శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి

ప్రపంచ రాజకీయ నాయకులలో ప్రముఖ స్థానాన్ని ఆక్రమించిన, భారత నాయకులలో మహా మేధావి అయిన శ్రీ నెహ్రూగారి స్థానంలోకి గొప్ప పార్లమెంటరీ నాయకత్వ ప్రతిభనుగానీ, శారీరక దృఢత్వాన్ని గానీ కలిగి ఉండని లాల్ బహదూర్ శాస్త్రిగారు రావటం అనేకమంది విదేశీ పరిశీలకులు భారత జాతీయ సాంప్రదాయాన్ననుసరించి దానిని ఒక సహజమైన పరిణామంగానే భావించారు. ఎందుకంటే భారత ప్రజలు రామాయణ కాలంనాటి అభిప్రాయాలతో, ఆచరణలో ఇప్పటికీ విశ్వాసం ఉన్నవారు కాబట్టి. ఈ రోజుకు కూడా శ్రీరాముడి పాదుకను సింహాసనంపైనుంచి పరిపాలన సాగించిన భరతుడిని మనం గొప్పగా కీర్తిస్తాంగానీ, అయూబ్ ఖాన్, భుట్టోల ఆచారాలను ఆదరించలేం. శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి నెహ్రూగారికి విశ్వాసపాత్రుడైన అనుచరుడుగా నాకు తెలుసు. తమ మహోన్నత నాయకుడ్ని పోగొట్టుకున్న సందర్భంలో ఆ స్థానంలోకి తిరిగి ఒక ఉత్తమ గుణసంపన్నుడైన గాంధేయవాదిని ఎన్నుకోగలిగినందుకు అనేకమంది భారత రాజకీయ వేత్తలు పార్లమెంటరీ నాయకులు సంతోషించారు.

అయితే ఆయన ఎక్కడనుంచి వచ్చారు. ఒక పేదమధ్యతరగతి కుటుంబంలోనుంచి ఆయన పైకి వచ్చారు. ఆయన చెప్పుకోదగినంత గొప్ప విద్యావేత్తకాదు. ప్రత్యేకమైన రాజకీయ సామర్థ్యం గాని కోర్కెలుగానీ ఆయనకు లేవు. రెండో తరగతి నాయకత్వంతో ఆయన సంతృప్తిచెందారు. ఆయన తన విశ్వాసపాత్రమైన నిజాయితీ కలిగిన స్వభావం కారణంగానూ, అతి సామాన్యమైన జీవనశైలి కారణంగానూ, అన్ని స్థాయిలలో ఉన్న వారికి పూర్తిగా సేవలందించటంవల్లను, ఒక మంచి మనిషిగా నమ్మకమైన సహచరునిగా ప్రముఖ నాయకులందరూ అంగీకరించిన మొదటి శ్రేణి రాజకీయ వేత్తగా పార్లమెంటరీ నాయకుడుగా ఆయన పైకి ఎదిగారు. నెహ్రూగారు ఒకసారి ఆయనను ఢిల్లీ తీసుకొచ్చిన తరవాత, మంత్రివర్గ సభ్యుల ఎంపిక వంటి అనేక విషయాలతో సహా అన్ని విషయాలలోనూ, ఆయన జవహర్ లాల్ గారికి నమ్మకమైన సన్నిహిత వ్యక్తిగా మెలిగి, తనకంటె శక్తివంతులైన వారు చాలామంది కంటె ఆయన అక్కడ ఉన్నత స్థానానికి ఎదగగలిగారు.

నెహ్రూగారి కుమార్తెకు అప్పటికింకా పెద్దరికం సిద్ధించక పోవడంతో, ఆ తరవాత చాలా దగ్గరగా ఉన్న వారసులు మొరార్జీ దేశాయ్‌గారిని ఎక్కువమంది నాయకులు అంగీకరించకపోవడంతో, లాల్ బహదూర్ శాస్త్రిగారు నెహ్రూగారికి సహజంగానే వారసులు కాగలిగారు. భరతుని సాంప్రదాయాన్ని గౌరవించే భారత ప్రజలు పేదవారైనప్పటికి, పాట్టవారైనప్పటికి లాల్ బహదూర్‌ని సంతోషంతో అంగీకరించారు.

పార్లమెంటులో అధికార కాంగ్రెస్ పార్టీ నాయకునిగా లాల్ బహదూర్ శాస్త్రిగారిని ఎన్నుకున్నందుకు అన్ని రాజకీయ పక్షాల నాయకులు అభినందించారు. మొరార్జీ దేశాయ్‌ని

అంగీకరించేవారు కూడా ఒకసారి ఈ నిర్ణయం జరిగిన తరవాత శ్రీ లాల్ బహదూర్‌గారిని సంతోషంతో అంగీకరించసాగారు.

లాల్ బహదూర్ శాస్త్రిగారు తమ రాజకీయ స్థాయిని క్రమేణా పెంచుకుంటూ వచ్చారు. మొదట ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి పేరెన్నికగన్న ముఖ్యమంత్రి గోవింద వల్లభ పంత్‌గారి మంత్రివర్గంలో సభ్యులు గాను ఆ తరవాత జవహర్లాల్‌గారి మంత్రిమండలి సభ్యులుగాను క్రమగతంగా ఆయన మంత్రిపదవులను పొందారు. భయంకరమైన రైలు ప్రమాదం జరిగినపుడు తన పిబ్బంది చర్యలకు తాను బాధ్యత వహిస్తూ ప్రజాసేవలో ఒక ఉన్నత సాంప్రదాయాన్ని నెలకొల్పుతూ ఆయన మంత్రిపదవికి రాజీనామా ఇవ్వడం ద్వారా జాతీయ స్థాయిలో గౌరవాన్ని సంపాదించుకోగలిగారు. పార్టీ బాధ్యతను వహించేందుకు అధికారాన్ని విసర్జించడానికి ఆయన సదా సంసిద్ధులుగా ఉండేవారు. మంత్రివర్గంలో పోర్టుఫోలియో లేని మంత్రిగా చేరడానికి ఆయన అంగీకరించి తన పూర్తికాలాన్ని జాతీయ బాధ్యతా నిర్వహణలో తమ నాయకుని అభిమతాల కనుగుణంగా వినియోగించేందుకు సిద్ధమైనారు. అందువల్ల పార్లమెంటు ఆయనను మంత్రులలో నెహ్రూగారికి పూర్తిగా అంకితమైన అనుచరునిగానే గాక నెహ్రూగారి పూర్తి విశ్వాసాన్ని సంపాదించుకున్న వ్యక్తిగా కూడా చూడసాగింది.

ఒక దశాబ్దంగా క్షీణదశలో ఉన్న సంబంధాలను మన పొరుగుదేశాల వారితో అభివృద్ధి చేసే విషయంలో ఆయన నేపాల్ రాజుగారితోనూ శ్రీలంక ప్రధానమంత్రితోనూ తన మంత్రాంగ సంబంధమైన నైపుణ్యాన్ని చక్కగా ప్రదర్శించి వారితో ఉండే సంబంధాన్ని పూర్తిగా సరళస్థితికి తీసుకురాగలిగారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత మొదటి ఆయిదు సంవత్సరాల కాలంలో నెహ్రూ, సర్దార్ పటేల్, కాంగ్రెస్ అధ్యక్షులు (కృపలానీ-టాండన్) గోవిందవల్లభ పంత్, రఫీ అహ్మద్ కిద్వాయ్‌గార్ల మధ్య రాజకీయ సంబంధాలు తరచు వివాదగ్రస్తమవుతుండే సందర్భాల్లో లాల్ బహదూర్‌గారు అందరకూ కావలసిన స్నేహితునిగా విశ్వాసపాత్రునిగా అవసరమైనపుడల్లా వారిమధ్య రాయబారాలు నడుపుతూ కాంగ్రెస్‌పార్టీ రాజకీయాలను చిరునవ్వులు చిందిస్తూ నడపడానికి వీలు కల్పిస్తుండేవారు. ఆయన ప్రధానమంత్రి అయినపుడు అనేకమంది కాంగ్రెస్ రాజకీయ నాయకులు పార్టీ స్థిరత్వానికి, అభివృద్ధికి అది ఎంతో అనుకూలమైన నిర్ణయమని భావించడం జరిగింది. శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారు ఒకసారి ప్రధానమంత్రిగా వచ్చిన తరవాత కాలం వివిధ సవాళ్లను ఎదుర్కొనేందుకు వీలుగా తాను ఎదగసాగాడు.

పాకిస్తాన్ ఖచ్‌లోని రాణ్ ప్రాంతంపై ఆక్రమణ చేసినపుడు తగుచర్యలు తీసుకునే అధికారాన్ని సైన్యానికి ఒప్పగించడానికి ఆయన సంకోచించలేదు. చుంబ్ లోయ ప్రాంతంలో పాకిస్తాన్ అంతర్జాతీయ సరిహద్దును అతిక్రమించి కాశ్మీరుకు మనకు మధ్య ఉన్న రవాణా సంబంధాలను దెబ్బతీయాలని ఆలోచిస్తున్నపుడు ఆయన రక్షణమంత్రి శ్రీచవాన్ గారిని అందుకు కావలసిన చర్యలను తీసుకోవలసిందని ఆదేశించి ఆవిధంగా పాకిస్తాన్‌ను తన పాపఫలం తానే అనుభవించేలా చేయగలిగారు. పాకిస్తాన్ అణ్వాయుధ దేశమైన అమెరికా రక్షణ వలయంలో దాగిఉందని తెలిసినప్పటికి అమెరికన్ ప్రెసిడెంట్ జాన్సన్ సూచించిన అణ్వాయుధ రక్షణ

పథకాన్ని ఆయన వ్యతిరేకించదలచుకోలేదు. మానసికమైన ఆ దశను దాటిన తరవాత అణ్వాయుధ యుద్ధ సామర్థ్యాన్ని పెంచుకోవడాన్ని మిగతా అన్ని అణ్వాయుధ రహిత దేశాంతో కలసి ఆయన ఖండించారు.

కామన్వెల్త్ తదితర ప్రపంచ రాజకీయ వేదికలలో యథార్థానికి ఆయన అంత సంతృప్తికరంగా వ్యవహరించలేకపోయారు. అనేక అగ్రరాజ్యాల నాయకులు ఆయనను చిన్న మనిషిగా చూసే దృష్టి వారి హ్రస్వదృష్టి కారణంగా వచ్చినట్టిదే. ఎప్పుడైతే భారత ప్రజలను తన కార్యాచరణ పూర్వకమైన "జై జవాన్ జై కిసాన్" వినాదంతో సమీకరించి పార్లమెంటులో అన్ని పార్టీల సహకారాన్ని సాధించి స్నేహపూర్వకమైన తమ చర్యల ద్వారా యావద్భారత దేశాన్ని ఒకటిగా నిల్పి పాకిస్తాన్ దురాక్రమణను ఎదుర్కొగలిగాడో అప్పుడాయనను చూసి ఇతను నిజానికి గొప్ప నాయకుడని వారంతా గ్రహించ గలిగారు.

పార్లమెంటు చర్చలలో ఆయన మొదట ప్రభుత్వ విధానాలను తెలియజేస్తూ ఒక మిత్రునిలాగా తన ప్రసంగాన్ని ప్రారంభించి వివిధ మంత్రిత్వ శాఖల కార్యకలాపాలను గురించి సహజరీతిలో సాధారణమైన ఆంగ్లభాషలో ఉపన్యసిస్తారే తప్ప జవహర్లాల్ నెహ్రూగారి మాదిరిగా భాషా పాటవంతోనూ, ఉపన్యాస సామర్థ్యంతోనూ, మాట్లాడడానికి ఎప్పుడూ పూనుకోరు. తనను దశాబ్దాల తరబడి అతి సామాన్య రాజకీయ కార్యకర్తగా ఎరిగిన లోహియా వంటివారు వ్యంగ్యోక్తులలో విమర్శలకు పూనుకున్నప్పుడు ఆ విమర్శలను ఆయన అతి సాదాగా స్వీకరించి తాను ఒక గొప్ప పండితుడనుగానీ, పార్లమెంటరీ వ్యవహారాల నిపుణుడను గానీ, కాదని ఆయన ప్రతిపక్షాన్నంతా నోరు విప్పుకుండా చేయగలిగేవారు. ఎప్పుడైనా ప్రతిపక్షాలు విదేశీ నాయకులతో వ్యవహరిస్తున్నప్పుడు ఆయన గట్టిగా ఉండడం లేదని విమర్శకు పూనుకొంటే ఆయన బాగా ఉద్రేకపడి నేను చూసేందుకు చిన్నవాడినే గాని వ్యవహార నిర్వహణలో మాత్రం చిన్నతనంలేదని చర్చలోను, ఎత్తుగడలోను లక్ష్యంలోను వెనుకబాటు ఉండదని గట్టిగా జవాబు చెప్పుండేవారు.

1936 సంవత్సరంలో ఆలిండియా కిసాన్ కాంగ్రెస్‌ను ఏర్పాటుచేసేందుకు నేను అలహాబాదు వెళ్లిన నాటినుంచి ఆయనతో పరిచయం ఏర్పడే భాగ్యం నాకు కలిగింది. నా ప్రయత్నాలకు ఆయన సహకారాన్నందించారు. ఆంధ్ర కాంగ్రెస్ రాజకీయాలలో డాక్టర్ పట్టాభివర్గంతో పోరాటం సాగిస్తున్నపుడు నాకు అనుకూలంగా ఆయన ఒక మంచి మాట చెప్పారు. 1955 సంవత్సరం నాటి మధ్యంతర ఎన్నికల సమయంలో ఎదురైన క్లిష్ట పరిస్థితులలో కమ్యూనిస్టుల సవాలును ఎదుర్కొని ఆంధ్రప్రభుత్వాన్ని చేతబట్టి కునేందుకు లాల్ బహదూర్‌గారి సువ్యూహ పూరితమైన ప్రయత్నాల కారణంగా నెహ్రూగారికి బాగా తోడ్పడి ఆంధ్ర కాంగ్రెస్ కృషికార్ లోక్ పార్టీ ప్రజాపార్టీలతో కూడిన యునైటెడ్ ఫ్రంటు కమ్యూనిస్టులను ఓడించేందుకు ఏర్పాటు కాగలిగింది. తిరిగి నేను కాంగ్రెస్‌లో చేరడానికి ఆయన మీద నాకున్న విశ్వాసం ప్రధాన కారణమైంది. ఆయన, పంత్ గారు నెహ్రూగారికి నాకు మధ్య సహకార వ్యవసాయం విషయంలో తలెత్తిన విభేదాలను ఎరిగినవారు కాబట్టి ఆ విషయంలో

ముందుకు పోవద్దని నెహ్రూగారిని ఒప్పించడానికి గట్టి ప్రయత్నం చేశారు. వేరు వేరు పార్టీ నాయకులతో ప్రధానమంత్రి సమావేశాలు జరిపే అనేక సందర్భాలలో ఆయన గదిలో మేం తరచూ కలుసుకొంటూ దేశానికి సంబంధించిన అనేక ముఖ్యాంశాలపై చర్చించుకుంటూ ఉండేవారం. ఆయన తాను ప్రధాన మంత్రిగా ఉన్నప్పుడు నన్ను ప్రతిపక్ష నాయకునిగా మాత్రమే చూడకుండా తనకు బాగా విశ్వాసపాత్రుడైన ఒక సన్నిహిత మిత్రునిగా సీనియర్ నాయకునిగా చూస్తూ నా ఆలోచనలను సలహాలను సదా సంతోషంతో స్వీకరిస్తుండేవారు. ఆయన తన పార్టీకి సంబంధించిన అనేకమంది వ్యక్తులతో ఇలాగే ఆదరంతో వ్యవహరిస్తూ పార్లమెంటులోని అన్ని పార్టీలలోనూ శక్తులతోనూ బాగా సన్నిహితంగా ఉండగలుగుతుండేవారు.

జవహర్లాల్ గారితో పార్టీ వ్యవహారాలలోనూ మంత్రివర్గ సహచరులను నిర్ణయించుకునే విషయంలోనూ కార్యనిర్వాహక కమిటీలను ఏర్పాటుచేసే విషయంలోనూ అనేకమార్లు శ్రీ లాల్ బహదూర్ శాస్త్రిగారు తీవ్రంగా విభేదించిన సందర్భాలు ఉన్నాయి. అయితే నెహ్రూగారు ఏవిషయం లోనైనా తన సహజ ధోరణిలో ఒకసారి గట్టి నిర్ణయం తీసుకున్న తరవాత ఆయన దానిపై తిరిగి ఎలాంటి చర్చ తీసుకొనిరావడానికి పూనుకోరు. అనేక విషయాలలో ఆయన మాతో ఏకీభవించి మా అభిప్రాయాలను నెహ్రూగారికి వివరిస్తుంటారు. ఆ ప్రయత్నంలో నెహ్రూగారిని ఒప్పించలేక పోతే జవహర్లాల్ గారి నిర్ణయంతో ఏకీభవించ వలసిందని మనస్ఫూర్తిగా మాతో వాదించే వారు. లాల్ బహదూర్ శాస్త్రిగారు మహాభారత కథలో ధర్మరాజుతో, భీష్మునితో చెప్పిన మంత్రం లాంటివారు. ఆయన నెహ్రూగారికి పూర్తి విధేయుడు. సాధారణంగా మా అందరికీ కూడా ఆయన అదేవిధంగా విశ్వాసపాత్రంగా ఉంటుండేవారు. జాతీయ ప్రయోజనాలు ఉన్నత నాయకుడి నిర్ణయాలను రాజకీయ సామర్థ్యాన్ని మనం అంగీకరించినపుడే ఉచ్చస్థితిలో ఉంటాయనేది ఆయన సహజ నమ్మకం.

మహోన్నత స్థాయిలోనూ హేతుబద్ధంగానూ తన ప్రసంగాలతో పార్లమెంటును మంత్రముగ్ధం చేస్తూ జాతిగౌరవాన్ని గొప్పగా పైకి తీసుకెళ్ళిన నెహ్రూగారిని పొల్చుకున్నప్పుడు, లాల్ బహదూర్ శాస్త్రిగారి పార్లమెంటరీ వ్యవహార నిర్వహణ నిజానికి మాలాంటి వారిని అంతగా ఆకర్షించదు. అయితే ఆయనలో ఉన్న నిజాయితీ సహజమైన సరళత్వం అజాత శత్రుత్వం మన అవసరాలకు తగినంత మంచి మనిషిగా ఆయన సామర్థ్యాన్ని మనముందు నిలిపి చూపెడుతుంటాయి.

యావద్భారత దేశాన్నుంచి శుభాకాంక్షలను వెంటనిడుకొని లాల్ బహదూర్ గారు తాష్కెంట్ వెళ్లారు. నేనొకడిని మాత్రం పాకిస్తాన్ నాయకుల నీతిబాహ్యమైన రాయబార కార్యకలాపాలను దృష్టిలో పెట్టుకొని, బలహీనంగా ఉన్న ఆయన గుండెస్థితిని మనసులో ఉంచుకొని, ఆ ప్రయాణ సందర్భంలో జాగ్రత్తని హెచ్చరించాను. ఆయన ధర్మబద్ధమైన మనపద్ధతిపై విశ్వాసంతోనూ, మన సైనికశక్తిపై ఉన్న నమ్మకంతోనూ, సంతృప్తితో వెళ్లారు. ఏదేమైనప్పటికీ దేవునిపై ఆయనకున్న విశ్వాసం కారణంగా అప్పటికప్పుడు సమకూర్చుకున్న అధిక ఆత్మవిశ్వాసంతోనూ తనపై తనకున్న పూర్తి నమ్మకంతోనూ ఆయన అందుకు పూనుకొన్నారు. ఆయన భారతదేశం కోసం తాను విజయుడై తిరిగి వచ్చేందుకు భగవంతుని ప్రార్థించవలసిందని

మమ్మందరినీ కోరారు. మేమంతా ఆయన మాటలను ఆలకించి ప్రార్థనలు జరిపాం. అయితే దురదృష్టవశాత్తూ మా ప్రార్థనలను భగవంతుడు ఆలకించి విజయవంతంగా ఆయనను తిరిగి పంపలేదు.

అయూబ్ ఖాన్ గారు ఏవిధంగానైనా సరే ఒక ఒప్పందాన్ని సాధించేందుకు సాగించిన తీవ్రకృషి, మరొకవైపు రష్యా నాయకుల రాయబారపు వత్తిడి, వేరొక వైపు ప్రాణాలకు తెగించి మన జవాన్లు సాధించిన కీలక స్థానాలనుంచి ఉపసంహరించుకోనని ఆయన ఇక్కడ దేశంలో చేసిపోయిన వాగ్దానం, అన్నీ కలసి ఆయన హృదయాన్ని బలహీనపరచి ప్రాణాలను హరించి వేశాయి. లాల్ బహదూర్ గారు సమాజేపు బల్లమీదనే అసువులు బాసి యుద్ధంలో విజయం ద్వారా భారతదేశ ప్రజలచేత ప్రపంచ దేశాల చేత సంపాదించుకున్న గౌరవంతోపాటు అక్కడ అశాంతి బలిపీఠంపై మృతవీరునిగా అసువులు బాసి అమరవీరులైనారు.

ఈరోజుక్కూడా కొంతమంది ఆయన స్థాయిననుసరించి ఆయన గుండె పరిస్థితినిబట్టి తగు ముందు జాగ్రత్తచర్యలు వైద్యపరంగా తీసుకొని ఉంటే పరిస్థితులు మరొకరకంగా ఉండేవని భావించేవారు చాలామంది ఉన్నారు. దూరదృష్టి లేని కారణంగా కొంతమంది అనేకసార్లు పార్లమెంటులో అనేక సందేహాలను వెలిబుచ్చటం జరిగింది. తాష్కెంట్ ఒప్పందం పాకిస్తాన్‌ను మరింత దురాక్రమణదారుగా మార్చటం తప్ప సాధించిందేమీ లేదని, యాహ్యాఖాన్ భుట్టోలు బెంగాల్‌లో ఆ కారణంగా తమ సర్వావయవ హోమాన్ని తామే నెలకొల్పుకున్నారని మేం ఇప్పుడనుకొంటూ ఉంటాం.

40

శ్రీ బి.శివరావ్

కర్నాటకకు చెందిన శ్రీ బి.శివరావు 26-2-1891 న మంగుళూరులో జన్మించారు. ఆయన అలహాబాదులో డిగ్రీ పుచ్చుకున్నారు. మద్రాసులో కార్మిక రంగంలో కృషిచేశారు. కార్మిక వ్యవహారాలపై ఏర్పాటుచేసిన వైట్లీ కమీషన్‌కు తోడ్పడ్డారు. "మాంచెస్టర్ గార్డియన్", "హిందూ" పత్రికలకు ప్రత్యేక ప్రతినిధిగా పనిచేశారు. యు.ఎన్.ఓ. లోనూ ఐ.ఎల్.ఓ. లోనూ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ధర్మకర్తృత్వ మండలిలో ప్రముఖపాత్ర నిర్వహించారు. ఆయన సోదరులయిన శ్రీ బి.ఎన్.రావుకు రాజ్యాంగ సభ కార్యక్రమాలలోనూ ఆ తరవాత ఆయన తయారుచేసిన పేపర్లన్నింటికి సంపాదకులుగా పనిచేశారు. 1946 నుంచి 1957 వరకు ఎం.పి.గా (లోక్‌సభ, రాజ్యసభ) ఉన్నారు. ఆయన మరో సోదరులు రామారావుగారు రిజర్వు బ్యాంకు గవర్నరుగా పనిచేశారు. భారతదేశంలో పర్యాటకాభివృద్ధికి తోడ్పడ్డారు. 1975 సంవత్సరంలో ఆయన మరణించారు - (ఎడిటర్).

శ్రీ బి.శివరావు నిర్మాణాత్మకమైన దృష్టికలిగిన, జాతీయతా భావం కల మన ప్రముఖ పత్రికారచయితలలో ఒకరు. ఆయన మద్రాసునుంచి వెలువడే జాతీయ స్థాయి కలిగిన ప్రముఖ దినపత్రిక హిందూకు, ఆంగ్లపత్రికా రంగంలో ఇదేమాదిరి గొప్పతనాన్ని కలిగిన ఆంగ్లదినపత్రిక "ది మాంచెస్టర్ గార్డియన్"కు ప్రత్యేక ప్రతినిధిగా ఉంటూ పదవీ విరమణ చేశారు.

భారత ప్రజల లక్ష్యమైన స్వాతంత్ర్య సాధనకు అంకితులై ఒక కాంగ్రెస్ వాదిగా ఆయన ప్రజారంగంలో తన జీవితానికి నాంది పలికారు. ఆయనకు మొదటి నాయకులు డాక్టరు అనీబిసెంటు. సంస్థాపరమైన మొదటి వేదిక హోమ్‌రూల్ ఉద్యమం. బకింగ్‌హాం లేబరు యూనియన్ నాయకులైన వాడియాగారి ద్వారా ఆయన కార్మిక రాజకీయాంలోకి అడుగువెట్టారు.

శ్రీ శ్రీనివాస శాస్త్రి, శ్రీ సప్రూ, అనీబిసెంట్‌గార్ల పద్ధతులతో దగ్గర సంబంధాలు ఉన్నందువల్ల ఆయన సహాయ నిరాకరణ కార్యక్రమం లోనూ సత్యాగ్రహోద్యమాలలోనూ ప్రవేశించలేదు. గాంధీగారి నిర్మాణ కార్యక్రమాలపై గాంధేయ రాజకీయాలపై ఆయనకున్న శ్రద్ధ కారణంగా "భారతీయ వస్తువులను కొనండి" అనే స్వదేశీ ఉత్పత్తులకు సంబంధించిన అభివృద్ధి కేంద్రాలను ప్రారంభించేందుకు ఆయన పూనుకొన్నారు. సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని సాధించేందుకు గాంధేయ పద్ధతులను మొత్తంమీద ఆయన అంగీకరించారు. మన దేశ స్వాతంత్ర్యాభిలాషను అంగీకరించడంలో కాంగ్రెస్‌వారు కోరుకున్న దానికంటె ఎక్కువసమయాన్ని బ్రిటీషువారు తీసుకున్నప్పటికి దానికి వారు అంగీకరించినందుకు ఆయన సంతృప్తి పడ్డారు. ఆరోజుల్లో 1930 ప్రాంతంలో హిందూ పత్రిక అనుసరిస్తున్న రాజకీయ విధానం అలాంటిది.

అలాగే మాంచెస్టర్ గార్డియన్ కూడా. అందువల్ల ఆ రెండు పత్రికలు ఒకదానితో మరొకటి పరస్పరం సహకరించుకునేందుకు అంగీకరించి 1934-35 ప్రాంతంలో న్యూఢిల్లీలో వీరిని తమ రాజకీయ ప్రతినిధిగా ఆ రెండు ప్రముఖ దినపత్రికలు నియమించుకున్నాయి.

నేను 1927-30 సంవత్సరాల కాలంలో మద్రాసు నగరంలో కార్మిక విషయాలపై పరిశోధన సాగిస్తున్నపుడు మద్రాసులోని బట్టలనేత కార్మికులలోని కొంతమంది మంచి మిత్రులు స్థానిక బట్టల మిల్లుల కార్మికుల కోసం ఆయన ఎలా సేవచేశారో చెప్పగా విన్నాను. 1930 ప్రాంతాలలోని భారతీయ కార్మికుల పరిస్థితులను గురించి అవసరాలను గురించి వారి ఆకాంక్షల గురించి వైట్లే లేబరు కమీషన్‌తో కలసి పరిశీలించడం ద్వారా ఆయన ఆరంగంలో ఎక్కువ జ్ఞానాన్ని సంపాదించుకోగలిగారు. ముఖ్యంగా త్రైపాక్షిక సంఘాలను ట్రేడ్‌యూనియన్లను ఏర్పాటు చేయవలసిందిగాను కర్మాగారాల స్థాయినుంచి వైట్లే కౌన్సిల్స్ ఏర్పాటు చేయవలసిందిగాను నిర్మాణ కార్యకలాపాలలో పాల్గొనే కాంట్రాక్టు లేబరు పద్ధతిని,నిర్బంధ విధానాన్ని రద్దుచేయవలసిందిగాను, కార్మికులు పాల్గొనడం ద్వారాగాని, లేదా పరస్పరసంప్రదింపుల ద్వారాగాని కార్మిక వివాదాన్ని పరిష్కరించవలసిందిగాను, ఆ కమీషను ద్వారా నిర్మాణాత్మకమైన సూచనలు ఇప్పించటానికి ఆయన ప్రధాన కారకులుగా ఉండి పనిచేశారు.

నేను 1935 సంవత్సరంలో కాంగ్రెస్ ఎం.ఎల్.ఏ.గా ఢిల్లీ వెళ్లినపుడు రైతులు కార్మికుల వ్యవహారాలకు సంబంధించిన ప్రశ్నలలో ప్రత్యేక ఆసక్తిని కనబరుస్తూ శ్రీ ఎన్.ఎం.జోషి, శ్రీ వి.వి.గిరి వంటి ప్రముఖ కార్మికనాయకులకు సహకరిస్తూ ఐ.ఎల్.ఓ. తాలూకు భారతీయ విభాగంలో డాక్టరు పట్టంతను పిళ్లే గారితో జరిపే సమావేశాలలో శివరావుగారితో వ్యక్తిగత సంబంధాలేర్పడ్డాయి. ఉత్తి ఊహాగానంతోనూ అప్పటి కప్పుడు వేడిపుట్టించే ఆందోళనతోనూ కాలం గడపక గొప్ప దేశభక్తితో నిష్కల్మషమైన సామ్యవాద విప్లవంతో ఉండే శివరావు గారిని చూసి నేను ఎంతగానో అభిమానించాను. నేను మా నాయకులైన భూలాభాయ్ దేశాయ్‌గారితో విభేదించినపుడు, జోషిగారి సరళతరమైన ప్రభుత్వ అనుకూల పద్ధతితో అంగీకరించలేనపుడు, గిరిగారిపైన, శివరావుగారిపైన నా సందేహ నివృత్తి కోసం ఎక్కువగా ఆధారపడుతూ యజమానులకు వ్యతిరేకంగానూ ప్రభుత్వానికి వారి అనుయాయులకు వ్యతిరేకంగానూ పోరాడడానికి శివరావుగారికి బాగా దగ్గరయ్యాను.

కాలం గడిచే కొంది నా నిస్వార్థమైన భయరహితమైన కార్మిక సంక్షేమానికి చేస్తున్న ప్రయత్నాన్ని శివరావుగారు ఎక్కువగా అభిమానిస్తూ బ్రిటన్‌లోని ఇండిపెండెంట్ లేబరుపార్టీ కార్మిక నాయకులైన జేమ్స్ మాక్స్‌టన్ గారితో నన్ను పోల్చి చూసుకుంటుండేవారు. అది నాకు ఒక మంచి ప్రోత్సాహంగాను భూలాభాయ్ జవహర్లాల్ గార్లవద్ద సిఫార్సుగాను పనిచేసింది.

ఆ తరవాత శివరావు బ్రిటిషు వైస్రాయిగార్ల నమ్మకాన్ని, గాంధీజీ జవహర్లాల్ గార్లతో అనుభవనీయునిగా వినయపూర్వకమైన సంబంధాలను శక్తివంతమైన గార్డియన్ పత్రిక ప్రతినిధిగా ఉన్నందువల్ల పొందగలిగారు. సర్వూగారితో శాస్త్రిగారితో ఆయనకున్న దగ్గరి స్నేహసంబంధాలు ఆయన సలహాలకు పరిశోధనకు మరింత బలాన్ని చేకూర్చాయి. తన స్వప్రయోజనాలకోసం

ఏమీ ఆశించకుండానే ఆయన ఆవిధంగా ఒక మంచి గౌరవనీయమైన సంధానకర్త కాగలిగారు. ఆయన పెద్ద సోదరులైన సర్ బి.ఎన్.రావ్ ప్రభుత్వంలో ఉన్నతాధికారాన్ని నిర్వహిస్తుండడంవల్లా ఆయనకు మరో రకంగా ఈ కృషిలో గొప్ప అండ దొరికినట్లయింది. స్వాతంత్ర్యం కోసం నిర్మాణాత్మకమైన కృషి చేసిన వ్యక్తిగా శివరావును అందరూ గుర్తిస్తారు. గాంధీజీ నెహ్రూగార్ల ఇద్దరి నమ్మకాన్ని పొందిన వ్యక్తి ఆయన.

స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఆయన పత్రికా రంగాన్ని వదలిపెట్టి పార్లమెంటులో ప్రవేశించారు. ఆయన భయమెరుగని వ్యక్తి. అయితే ప్రయోజనాత్మకమైన విమర్శలను చేస్తూ, అంతర్జాతీయ వ్యవహారాలపై ఆయన ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకుంటుంటారు. స్థాయి కలిగిన సలహాలిస్తుంటారు. ఆయనను మిత్రరాజ్య సమితికి మన ప్రతినిధిగా పంపడం జరిగింది. ధర్మకర్తృత్వ వ్యవహారాలలో ఆయన ప్రముఖపాత్రను నిర్వహించారు. వలస ప్రజలకు స్వాతంత్ర్యాన్ని సాధించే కృషిలోనూ స్వయం పాలితంగాని ప్రాంతాల పరిపాలనా కొన్నిట్లపై ధర్మకర్తృత్వ వ్యవహారాలలోనూ ఆయన ముఖ్యమైన భూమికను కొనసాగించారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా అన్ని ప్రాంతాల ప్రజలకు జాతీయ స్వాతంత్ర్యాన్ని పొందే హక్కున్నదని గుర్తింపజేయడానికి ఆయన ప్రపంచ వ్యాప్తంగా గాంధేయ లెనినిస్టు పోరాటాన్ని ప్రారంభించి భారతదేశ గౌరవాన్ని విశ్వవ్యాప్తం చేశారు. ఆయన తీసుకున్న ఈ కొత్తమార్గం నన్ను నా మిత్రులైన ఆఫ్రికన్ కాంగ్రెస్ వారిని, ఫెన్నర్ బ్రాక్వే గారిని లండన్ పారిస్ నగరాలలో ఉన్న అనేక ఇతర అంతర్జాతీయ సంస్థలను ఎంతగానో సంతప్తి పరచడమే గాక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తాము చేస్తున్న పోరాటంలో భారత దేశాన్ని ఎంతో ప్రముఖంగా ఆఫ్రికా ఆసియా రాజ్యాలు కీర్తించాయి.

పరిశుద్ధమైన స్నేహతత్వంతోనూ ఇతరులను బాగా అర్థం చేసుకోవడం ద్వారానూ చక్కని కర్నాటక సాంప్రదాయాలతో శివరావుగారు స్వభావరీత్యానే ఒకరాయబారి. అందువల్ల ఆయన నెహ్రూగారి నుంచి సర్దార్ పటేల్ గారినుంచి విశ్వాసాన్ని పొందగలగడమే కాకుండా కాంగ్రెస్ కార్యవర్గంలో ఉన్న నాలాంటి యువకులకు కూడా ఎంతో ప్రేమ పాత్రుడుగా ఉంటుండేవారు. ఒకమారు నెహ్రూగారితో కొన్ని గంటలపాటు డిన్నరులో పాల్గొంటూ అనేకమంది కాంగ్రెస్ రాజకీయ వేత్తల ప్రభుత్వకార్యదర్శుల మంచి చెడుల గురించి నిస్సంకోచంగా నేను మాట్లాడిన తరవాత ఆయన నాతో ఇలా అన్నారు. "రంగా-నెహ్రూ కుటుంబ అనుబంధాలు అభిమానాలు ఎంత గట్టిగా ఉంటాయో మీరు మరచి పోయినట్లున్నారు". అంత నిర్భయంగానూ నిర్దయతోనూ వ్యాఖ్యలు చేసేటపుడు మీరు వాటిని జ్ఞాపకం ఉంచుకోవలసింది. సహకార వ్యవసాయం వంటి వాటిని వ్యతిరేకిస్తూ ప్రత్యామ్నాయ రాజకీయ నాయకత్వాన్ని ఏర్పాటుచేసేందుకు నేను రాజాజీగారు కాంగ్రెస్‌ను వదిలిపెట్టాలని నిర్ణయం తీసుకున్నపుడు అది క్లిష్టతరమైన విషయమైనప్పటికి ఆయన సంతోషాన్ని తెలియజేశారు. ఆయన అనేకమైన మా విధానాలను సమర్థిస్తూ ఆలోచనా పూర్వకమైన వ్యాసాలను రాసి స్వరాజ్య పత్రికకు పంపుతుండేవారు. అయితే నెహ్రూ గారితో ఉన్న తన స్నేహ సంబంధాలను జాగ్రత్తగా

అట్టేపెట్టుకునేందుకు ఆయన ప్రాముఖ్యం ఇస్తుండేవారు.

దురదృష్టవశాత్తూ అనారోగ్యం ఆయనను ప్రజాజీవితంలో మరుకుగా పాల్గొనకుండా చేసింది. ఆయన ఆస్ట్రియన్ భార్య కిట్టీ ఆయన మంచీ చెడులను గమనిస్తుండేవారు. మన రాజ్యాంగ రచనకు తెర వెనుక ఉండి గొప్ప కృషిచేసిన ప్రముఖ రచనా శిల్పి తన సోదరుడైన శ్రీ బి.ఎన్.రావుగారికి ఆ పేపర్లను ఎడిటింగ్ చేసి తోడ్పడుతుండేవారు. ఆయన ఆదర్శవంతమైన పత్రికారచయిత, నిర్వహణా దక్షుడు. ఆయన కార్మిక విషయాలలోనూ దేశభక్తియుతమైన రాతలలోను రెండు విభాగాలలో విశ్వసనీయులుగా సమర్థతతో పనిచేశారు. వాటిని తన బ్రతుకు తెరువుకోసం ఆయన ఎప్పుడూ వినియోగించుకోలేదు. ప్రజాసేవకు అనుగుణంగా హృదయాలను స్పందించే రీతిలో సమర్థవంతంగా వాటిని మలిచి ఉపయోగపెట్టారు. ఇటువంటి గొప్ప పత్రికా రచయితలు స్వాతంత్ర భారతదేశానికి కనీసం ఇంకో రెండు తరాల వరకైనా లభిస్తే బాగుంటుంది. శ్రీరామానంద చటర్జీ, శ్రీ ఖాసా సుబ్బారావు, శ్రీ జి.వి.కృపానిధి, శ్రీ కె.పున్నయ్య, శ్రీ హార్నిమన్, శ్రీ స్టాట్స్ లాంటివారు ఆయన కంటె ఈ రంగంలో ముందు ప్రశ్యాతులైనారు. శ్రీ ఎం.చలపతిరావుగారు ఆయనకంటె జూనియరైన నసహచరుడు. వాళ్ల ఆలోచనలో హృదయాలను నిలిపి భావోద్వేగమైన కలాలను పాండితీ వైభవంతో ప్రయోగిస్తూ పత్రికా రచయితలుగా ఎందుకోసం పూనుకొన్నారో దానిని నిష్కామంగా కొనసాగించిన వారు వీరంతా. ఈనాటి పత్రికా సంపాదకులు ఆయన అనుభవంలోనుంచి ఒక చిన్న దళాన్ని స్వీకరించినా పత్రికల కోసం చట్టాల అవసరం ఉండదు.

శివరావు సోదరులైన బి.ఎన్.రావుగారు హైకోర్టు జడ్జిగా ఉన్నారు. దేశంలో రాజ్యాంగం అమలులోకి వచ్చిన తరవాత మిత్రరాజ్య సమితిలోని భారతీయ ప్రతినిధి వర్గానికి ఆయన శాశ్వత నాయకులుగా ఉండి సేవచేశారు. మిత్రరాజ్య సమితికి సంబంధించిన అనేక తీర్మానాలను తయారు చేయడంలో తాము ఎక్కువగా సర్వప్రతినిధి సభపై ఆధారపడ్డామని మిస్టర్ రూడ్ వెల్ట్ గారు చెప్పారు. హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానానికి శ్రీ బి.ఎన్.రావుగారిని న్యాయమూర్తిగా కూడా ఎన్నుకోడం జరిగింది.

దీర్ఘకాలం అనారోగ్యంలో ఉన్న తరవాత 1975 సంవత్సరంలో శ్రీ శివరావుగారు స్వర్గస్థులైనారు.

41

శ్రీ చౌధురి చరణ్‌సింగ్

శ్రీ చరణ్‌సింగ్ ఇప్పుడు 1976 లో ఆరు, ఏడు చిన్నచిన్న పార్టీలు కలిసి భారతీయ లోక్‌దళ్ ఏర్పడడంతో దాని నాయకులుగా జాతీయస్థాయిలోకి వచ్చారు. దాదాపు ఏడు సంవత్సరాల కాలం ఈ స్థాయిని పొందడానికి భారతీయ క్రాంతిదళ్ ద్వారా ఆయన నిష్పలమైన ప్రయత్నాలను కొనసాగించారు. 1967-70 సంవత్సరాలలో ఆరు, ఏడుగురు ముఖ్యమంత్రులు యస్.వి.డి. తరపున కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బి.కె.డిలో ఉన్నప్పటికీ అది అప్పుడాయనకు ఈ స్థాయిని పొందడానికి ఉపయోగ పడలేదు.

చౌధురి చరణ్‌సింగ్‌గారు 12 సంవత్సరాల కాలం పంత్‌గారి పాలనా కాలంలోను గుప్తాగారి పాలనాకాలంలోనూ యు.పి.లో కాంగ్రెస్ మంత్రివర్గ సభ్యులుగా ఉంటూ సమర్థతకు, మర్యాదకు, ధర్మం తప్పకుండా నడవడానికి పేరుతెచ్చుకొని ముఠాల పరంగాగాని, కులాల పరంగాగాని అధికార దుర్వినియోగానికి పాల్పడకుండా మంచివారనిపించుకున్నారు. ఆయన యు.పి.లో మంత్రిగా నిష్పక్షపాతంగాను పరిపాలనాదక్షులుగాను వ్యవహరించగలిగి ఇతరులకు అసాధ్యమైనరీతిలో ఒక సమర్థవంతుడైన మంత్రిగా ఖ్యాతినార్జించారు.

హైదరాబాదు, నాగపూర్‌లలో జరిగిన ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సమావేశాలలో నిర్బంధ సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టేందుకు జవహర్లాల్ గారు చేసిన ప్రయత్నాలను, ప్రభుత్వ కార్యక్రమానికి అనుగుణంగా దేశవ్యాపితమైన ప్రచారాన్ని కాంగ్రెస్ ద్వారా సాధించాలనుకున్న నెహ్రూగారి తలంపును, ఆయన ధైర్యంగా వ్యతిరేకించి భారత రైతాంగంలో తమకొక రక్షకుడున్నాడనే నమ్మకాన్ని కలిగించారు. ప్రస్తుతం కేంద్రంలో మంత్రిగా కొనసాగుతున్న శ్రీ సి.సుబ్రహ్మణ్యం కూడా హైదరాబాదులో దీనిని వ్యతిరేకించి చరణ్‌సింగ్‌గారి మాదిరిగా నిలువలేక నాగపూర్ సమావేశంలో తిరిగి అందుకు అనుకూలంగా మారారు. చరణ్‌సింగ్ తన వ్యతిరేకతను అతి సాహసంతోనూ వివేచనా పూర్వకంగానూ ప్రదర్శించారు. నెహ్రూగారు సహకార వ్యవసాయాన్ని కాంగ్రెస్ పక్షాన అధికారికంగా ప్రకటించినప్పుడు కాంగ్రెస్ రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా నేను కాంగ్రెస్‌కు రాజీనామా ఇచ్చి బయటికి వస్తున్నపుడు ఆయన నాతోకలసి కాంగ్రెస్‌ను వదలి బయటికి రాలేదు. అయినప్పటికి ఆయన "కో ఆపరేటివ్ ఫార్మింగ్ ఎక్స్-రేడ్" అనే ఆయన పరిశీలనాంశాలను ధైర్యంగా ప్రచురించి శక్తివంతుడుగా నిర్భయంగా యు.పి. మంత్రివర్గంలో నిలువగలిగారు. ఆయనను రాజీనామా ఇవ్వవలసిందని కోరి క్లిష్ట పరిస్థితులను తెచ్చుకోవడం ఇష్టపడక నెహ్రూగారు మిన్నకుండి పోయారు. ఆయన మంత్రిగా సమిష్టి బాధ్యతను వహిస్తూ కాంగ్రెస్ సంస్థలో ప్రముఖస్థానంలో ఉండికూడా స్వంత కుతాంతో జీవించే చిన్న చిన్న రైతును ఒక యోధునిలా ఆదుకునేందుకు నిలబడి మా అందరి గౌరవానికి పాత్రులైనారు. ఆయన అనుసరిస్తున్న ఈ భిన్న ధోరణుల రాజకీయ

విధానం ఆ తరవాత 1967-70 సంవత్సరాలలో భారత ప్రజాస్వామ్యంలో ఏర్పడిన అసంస్థీ రాజకీయ స్థితిని ఈనాడు ఘనకాయనలో అద్దంపట్టి చూపించినట్లయింది.

చరణ్‌సింగ్‌గారు తరతరాలుగా రైతులుగా, సైనికులుగా పనిచేసిన సాంప్రదాయకంగా భూమిని అభిమానించే జాట్‌కులంలో జన్మించారు. ఆయన ధైర్యవంతులు, తమలాగే సమర్థవంతులు అయిన మరొక రైతుకులం యాదవులతో కులాంతర వివాహం చేసుకోవడం ద్వారా చక్కటి సయోధ్య నేర్పరచుకున్నారు. రైతాంగం నుంచి సైకి వచ్చినప్పటికీ, తమ విధానాలను ఆచరణను పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉంచుకుంటూ వారితో సయోధ్యతో వ్యవహరిస్తూ పేరుకు సర్వజన హితవరులుగా పనిచేస్తూ ఉన్న వారి మాదిరిగా కాక, ఈ కారణం ఆయనను నూటికి నూరుపాళ్ళు పూర్తి అభిమానంతో కూడిన రైతునాయకునిగా నిలబెట్టగలిగింది రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే పద్ధతుల్ని రాజకీయాంశాలను రైతాంగ దృక్పథంతో చూపిన గౌరవం చరణసింగ్‌గారికే దక్కింది. ఎందుకంటే భారత ఆర్థికస్థితి ప్రధానంగా వ్యవసాయంపైనే ఆధారపడి ఉందని ప్రజల ఉద్యోగవసతి స్వయం వృత్తుల ఆధారంగా మాత్రమే లభించగలదని వ్యవసాయంలోగాని, చేతివృత్తులలోగాని పారిశ్రామిక కేంద్రాలలోగాని ఎక్కడ అభివృద్ధి జరగాలన్నా దానికి మూలమైనది వ్యవసాయాభివృద్ధి మాత్రమేనని దానితో ఆయన ఏకీభవించారు.

నేను సహకార వ్యవసాయానికి సంబంధించిన నాగపూర్ కాంగ్రెస్ తీర్మానాన్ని వ్యతిరేకించడం మొదలుపెట్టినపుడు చరణ్‌సింగ్ నా ప్రయత్నాలను అభినందించారు. నేను దానికి వ్యతిరేకంగా కాంగ్రెస్‌పార్టీని పదిలపెట్టడానికి నిర్ణయం తీసుకున్నప్పుడు ఆయన దానికి అంగీకరించలేదు. మేం స్వతంత్ర పార్టీని స్థాపిస్తున్నప్పుడు అది కొంతమేరకు పారిశ్రామిక వేత్తలతో కలసి పనిచేస్తుందనే కారణంతో ఆయన మా ప్రయత్నాలకు బలం చేకూర్చలేదు. ఆ తరవాత పది సంవత్సరాలకు నేను ఆయనను బి.కె.డి.ని రద్దు చేసి స్వతంత్ర పార్టీలో కలసి నా స్థానంలో దానికి అధ్యక్షత వహించి రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేయవలసిందని కోరినపుడు స్వేచ్ఛా వాణిజ్యవాదులు అందులో కలిస్తే మా అందరినీ నిర్వీర్యం కావించగలరని ఆయన భయపడ్డారు. 1972 వ సంవత్సరం నాటికి ఒక జాతీయ పార్టీగా అభివృద్ధిచెందలేక బి.కె.డి. విఫలమైనపుడు స్వతంత్రపార్టీ తదితర పక్షాలతో సయోధ్య సాధించడం అవసరమనే అంశాన్ని ఆయన గుర్తించి స్వతంత్రపార్టీ మిత్రులైన నగరాలలోని స్వేచ్ఛా వాణిజ్యవాదులతో కొంతమేరకు సర్దుబాటు చేసుకునేందుకు ఆయన ముందుకొచ్చారు. ఆయన ఆ తరవాత కమ్యూనిస్టులకు ఇతరులకు జయప్రకాష్ నారాయణ్‌గారి నాయకత్వంలో ఒక రాజకీయ ఐక్యవేదికను ఏర్పాటుచేసే కృషిలో భాగంగా బి.ఎల్.డి. తన అభిప్రాయాలను కొంతమేరకు ఇతరులతో సర్దుబాటు చేసుకోగలదని చెప్పినపుడు ఆయనలో మెరిసిన ఈ మార్పు మనకు కనిపిస్తుంది. 1968-69 సంవత్సరాలలో రాజాజీగారితో నేను కలిసి పనిచేయాలని ప్రయత్నిస్తున్నపుడు, పది సంవత్సరాలకు పూర్వం అప్పుడాయన మా బాంబే మిత్రులను, తమకు తాము పునర్విచారణ చేసుకొని మాతో కలవవలసిందని చెప్పడం ద్వారా నాకు సహాయపడ్డారనే విషయం ఎక్కువమందికి తెలియదు.

సహకార సేవా సంస్థలు సహకార వ్యవసాయ పరిశ్రమల సముదాయాల తోడ్పాటుతో స్వయం వృత్తులతో జీవించే దోపిడీకి పాల్పడని రైతు కూలీలతో గూడిన సామ్యవాద సమాజం మీద ఆయనకు పూర్తి విశ్వాసముంది. ఆయన భూస్వాములైన పెద్దపెద్ద రైతులకు సంబంధించిన మనిషి అని చెప్పడం పూర్తిగా తప్పు. భూములమీద వ్యవసాయేతర సంపదలమీద రెండింటిమీద పరిమితులు విధించాలని ఆయన కోరడం ద్వారా ఆయన ఏరంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అంగీకరించలేదు. ఏ వామపక్ష నాయకునిగాని, కాంగ్రెస్ వ్యక్తికిగాని తీసిపోని విధంగా ఆయన ఓ ఉత్తమ సోషలిస్టుగా సర్వజన సమానత్వాన్ని ప్రతిపాదించాడు. జయప్రకాష్ ఉద్యమం ద్వారా భారత రాజకీయ రంగంలో ఆయన ఒక ప్రముఖపాత్రను నిర్వహించగలిగితే, అందరూ అంగీకరించగలిగిన నాయకుడు కాగలిగినప్పుడు, బి.ఎల్.డి. ద్వారా ఆయన వ్యవసాయ పూర్వకమైన సోషలిజాన్ని స్థాపించగలరు.

చరణ్‌సింగ్‌గారు సామాన్యజనాల నాయకులుకారు. ఆయన ఎలాంటి ప్రచారాలను, ప్రదర్శనలను, సత్యాగ్రహ పోరాటాలను నిర్వహించి ఉండలేదు. అయినప్పటికి యు.పి. రైతాంగంలో అందులోనూ ముఖ్యంగా పశ్చిమ జిల్లాలలో ఆయన తిరుగులేని నాయకులుగా ప్రజాభిమానాన్ని పొందగలిగారు. అందువల్ల స్వాతంత్ర్యం వచ్చిన తరవాత సంవత్సరాలలో ప్రతిసారీ ఎన్నికలలో ఆయన నిరాటంకంగా విజయాన్ని సాధించగలిగారు. ఢిల్లీ నాయకులు వారి డబ్బుద్వారా పత్రికల ద్వారా అధికార ప్రచారం ద్వారా అధికారాన్ని అడ్డంపెట్టుకొని ఎంతగా ప్రయత్నించినప్పటికి ఏ ఎన్నికల సమయం లోనూ ఆయనను ఓడించలేక విఫలమైనారు.

నిజానికి చరణ్‌సింగ్‌గారు జాట్‌లు, అహిరులు, ఘుర్జరులు మనస్ఫూర్తిగా బలపరిచే ఒక గొప్ప దేశభక్తియుతమైన స్వాతంత్రయోధుడు, ఆయనకు పంజాబ్, హర్యానా, రాజస్థాన్ రాష్ట్రాల ప్రజలలో గూడ గట్టి పునాదితో గూడిన ఆదరం ఉన్నది. ఆయనకు భారతీయ రక్షణదళాలు సమర్థవంతంగా ఉండాలనే గట్టి పట్టుదల ఉంది. పాకిస్తాన్ దేశాలతోఉన్న భారతదేశ సరిహద్దుల రక్షణకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలనేది ఆయన తలంపు. భారతదేశం రష్యా చైనా, అమెరికా దేశాలలో దేనికి పావుగా ఉండడాన్ని ఆయన అంగీకరించలేదు. ఈ పద్ధతిలో గూడిన ఆయన విదేశాంగ విధానం రక్షణ కార్యకలాపాలు భారతదేశంలోని ఈశాన్య రాష్ట్రాల ప్రజలకు ఎక్కువ సంతృప్తిని కలిగించాయి.

కాంగ్రెస్ పక్షానికిగానీ శ్రీమతి ఇందిరకుగానీ చరణ్‌సింగ్ శాశ్వత శత్రువుకాదు. అది ఆయన 1969 వ సంవత్సరంలోనూ 1970 వ సంవత్సరంలోనూ వారితో సయోధ్యను ఏర్పరచుకోవడం ద్వారా నిరూపించారు. రాజకీయ వ్యవహారాలలో పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాటు కాగలిగిన శక్తి ఆయనకుంది. అందువల్లనే ఆయన 1969 వ సంవత్సరంలో శ్రీ గిరి గారి ఎన్నికను సమర్థించారు. శ్రీమతి ఇందిరాగాంధీని కాంగ్రెస్ పార్టీని వారి నీతిబాహ్యమైన అధికార రాజకీయాల కారణంగా నియంతృత్వ చర్యల కారణంగా వదలిపెట్టి ఆయన జయప్రకాష్ నారాయణ్‌గారివైపు వెళ్లగలిగారు. ఆయన రాజకీయాలలో ఏవైనా కొత్తమార్పులు సంభవిస్తే అందుకు ప్రధాన లక్ష్యాలుగా ఆయన జాతీయతా భావాన్ని చిన్న మధ్య తరగతి రైతాంగ

ప్రయోజనాలను మనస్సులో ఉంచుకొని మాత్రమే అందుకు పూనుకొంటారు.

చరణ్‌సింగ్‌గారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన సహచరులతో సర్దుబాటు చేసుకొని నడవడం కంటె పూర్తి స్వతంత్రంగా వ్యవహరించడం మీదనే ఎక్కువ ఆసక్తి కనబరుస్తూ ఉంటారు. యు.పి.లో సంయుక్త విధాయకదళ్ సంకీర్ణ మంత్రివర్గానికి బాధ్యత వహిస్తునప్పుడు ఆయన రెండుసార్లు మిశ్రమ మంత్రివర్గం లోని ఇతర పక్షాలతో సర్దుబాటు చేసుకోలేక వైఫల్యం చెందారు. ఆయన కమ్యూనిస్టు కాదు. అయితే సంకీర్ణ మంత్రివర్గంలో కలిసి పనిచేసేందుకు వారిని చేర్చుకోగలిగారు. జనసంఘం సామాజిక మతపరమైన దృక్పథ మంటే ఆయనకు గిట్టదు. అయినప్పటికి యస్.వి.డి. సంకీర్ణ మంత్రివర్గంలోనికి వారిని ఆహ్వానించాడు. తన మార్గాన్ని అనుసరించేందుకు వీలుగా మిశ్రమ మంత్రివర్గంలోని ఇతర వర్గాలకు ఆయన అవకాశం కల్పించడంగానీ లేదా వారి విధానాలలో ఉండే కొద్దిపాటి లేడాంతో తాను సర్దుబాటు చేసుకోవడానికిగానీ ప్రయత్నించరు. తన సామర్థ్యంపై ఆయనకున్న నమ్మకం బహుగొప్పది. రైతుల అభివృద్ధికి వారి ప్రయోజనాల కోసం పనిచేసేందుకు ఆయనకున్న ఆసక్తి అనన్యం. ఆ కారణాలతో ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఎక్కువ ప్రయోగాలకు అవకాశం ఇవ్వకుండా నడిచారు. ఈ మార్పులన్నీ అవినీతి పరులు గాకుండా గౌరవనీయులుగా సమర్థతతో కాంగ్రెస్ అధికారాలలో ఆయన మంత్రిగా ఉన్నప్పుడు సంపాదించుకున్న గౌరవాన్నంతా నిష్పలంగావించాయి. ఒక విభాగానికి చెందిన సాంఘిక రాజకీయ శక్తులకు చరణ్‌సింగ్‌గారు ఇప్పటికీ తిరుగులేని నాయకుడు. బి.కె.డి.ని పదలివేసి భారతీయ లోక్‌దళ్‌ను ఏర్పాటుచేయబోయేముందు స్వతంత్రపార్టీతోనూ ఇతరపక్షాలతోనూ ఒక ఒప్పందానికొచ్చేందుకు ఆయన గట్టి కృషిచేశారు. గతంలో ఆయన యస్.వి.డి. మంత్రివర్గానికి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పొందిన అనుభవాల దృష్ట్యా భారతీయ లోక్‌దళ్‌లో కలిసేందుకు ఆయన జనసంఘాన్ని ఒప్పించలేకపోయారు. చివరలో భారతదేశం మొత్తాన్ని ఇందిర నాయకత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయమని ప్రజలను కోరే సందర్భంలో ఆయన తనలాగే రాజీ ఎరుగని తన మార్గమే నరైనదిన నమ్మే మొరార్జీ దేశాయ్‌గారితో చేతులు కలిపారు. ఆవిధంగా ఆయన పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి భరతవాక్యం పలికి ప్రభుత్వాన్ని పార్లమెంటును రెచ్చగొట్టడం ద్వారా అత్యవసర పరిస్థితిని ప్రకటించేందుకు అవకాశం కల్పించారు. ఆయన పొందిన రకరకాల ఈ అనుభవాలన్నీ ఆయన జీవితాంతం అత్యధికంగా ప్రేమిస్తున్న రైతులు, వారి స్వయంవృత్తులను అభివృద్ధి పరచేందుకు యదార్థమైన అన్ని ప్రజాస్వామ్య పక్షాలను దగ్గరకు చేర్చి ఒక సంయుక్త ప్రజాస్వామ్య వేదికను నిర్మించేందుకు ఆయనకు తోడ్పడగలవా? స్వల్పంగా భూవసతి ఉన్న చిన్న తరగతి రైతుల కోసం వారి స్వయంవృత్తుల రక్షణకోసం అన్ని ప్రజాస్వామ్య శక్తులను సమర్థనను ఆయన సాధించగలిగితే నిజానికి అది ఒక గొప్ప విషయం.

43

శ్రీ శ్రీ ప్రకాశ

1971 సంవత్సరంలో శ్రీ శ్రీ ప్రకాశ మరణించడంతో యావద్భారతదేశం ఒక గొప్ప వ్యక్తిని కోల్పోయినట్లయింది. నెహ్రూ, మాలవీయులు, సప్రూలాగే వీరి కుటుంబం కూడా మన దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఈ శతాబ్దం ప్రారంభం నుంచీ ప్రముఖంగా కృషిచేసింది. వారి తండ్రి శ్రీ భగవాన్ దాస్‌గారూ, ఆయనా, తమ ఉత్తమ కుటుంబ జీవిత పరంగానూ ఆంధ్రాంగ్ల భాషలో వారు రచించిన ఉత్తమ రచనల ద్వారాను భారతీయ సంస్కృతికి పుష్టిని చేకూర్చారు. ఆ తండ్రి కొడుకు లిద్దరితో కలసి కేంద్రశాసనసభలో పనిచేయడం నా అదృష్టంగా నేను భావిస్తాను. భగవాన్ దాస్‌గారు భారతీయ ధర్మాన్ని తప్పు చరించవద్దని మాకు బోధిస్తూ ఉండేవారు. ఆయన మా కంటె పెద్దవారైన మహాత్మాగాంధీగారు, అనీబిసెంటు మాలవీయ టాండన్‌జీ, మోతీలాల్‌జీ, రాజన్‌బాబు, జవహర్లాల్, సర్దార్ పటేల్, రాజాజీ, మున్షీగార్లవంటి వారితో చక్కటి స్నేహ సంబంధాలను నిర్వహిస్తూ తిరుగుతుండేవారు.

శ్రీ శ్రీ ప్రకాశగారు మద్రాసులో గవర్నరుగా ఉన్నపుడు రాజాజీగారిని ముఖ్యమంత్రిగా ధైర్యంగా ఆహ్వానించడం ద్వారా దక్షిణ భారతదేశంలో ప్రజాస్వామ్యం స్థిరంగా నిలబడటానికి నిర్మాణాత్మకమైన కృషిచేశారు. ఆయన రాజాజీ గారిని పిలిచినందువల్ల మా రైతువర్గం కాంగ్రెస్‌కు తోడ్పాటు నందించి కమ్యూనిస్టుల ఆధిపత్యంలో ఉన్న సంయుక్త విధాయకదళ్ అధికారంలోకి రాకుండా కాంగ్రెస్ పరిపాలన రావడానికి తోడ్పడగలిగింది.

ప్రజల ప్రాథమిక హక్కులపై ఆయనకు పూర్తి విశ్వాసం ఉంది. అందువల్ల 1931 సంవత్సరంలో కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్నప్పుడు, ప్రాథమిక హక్కుల అధ్యాయాన్ని సూత్రీకరించారు.

శ్రీ శ్రీ ప్రకాశగారు కాంగ్రెస్ ముఠాతగాదాలలోకి ప్రవేశించకుండా అందరితో ఎప్పుడూ సరదాగా గడిపే మంచి మనిషి. యు.పి. కాంగ్రెస్ సభ్యులలో పరస్పర విభేదాల కారణంగా ఏకాభిప్రాయాన్ని సాధించలేక పోయినప్పుడు వారు అందరికీ ఇష్టుడైన శ్రీ శ్రీ ప్రకాశవైపు చూసేవారు. అందువల్లనే 1936 సంవత్సరంలో జరిగిన లక్నో కాంగ్రెస్ మహాసభలకు అందరూ కలసి ఆయనను ఆహ్వాన సంఘాధ్యక్షులుగా కోరుకొన్నారు.

కాశీ విద్యాపీఠం వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. దాని అభివృద్ధి కోసం సాగించే కృషిలో శివప్రసాద్ గుప్తాగారితోనూ, ఆచార్య నరేంద్రదేవ్ గారితోనూ ఆయన సహకరించి కలిసి పనిచేశారు.

జవహర్లాల్‌గారికి తాము కేంబ్రిడ్జిలో చదువుకొనే రోజులనుంచి మంచి మిత్రులు కావడంతో నెహ్రూగారి రాజకీయ విధానాలకు ఆయన బాగా సన్నిహితులుగా ఉండగలిగారు.

సిఫార్సు చేసినప్పుడు జైపాల్‌సింగ్ తన దురభిప్రాయాలను పోగొట్టుకొని కళ్లు తెరిచారు. గిరిజన ప్రాంతాలలో వలస దారులుగా ఉన్న బీహార్ కాంగ్రెసువారికి నాయకులైన రాజేంద్రప్రసాద్ గారు మహాసభ ఆమోదించిన ఈ తీర్మానాన్ని అంగీకరించి వలసవాదులనుంచి ఆదివాసులకు తగు రక్షణ కల్పించాలన్న ఈ తీర్మానానికి అంగీకారం తెలపడంతో ఆయన చాలా సంతోషించారు.

ఆయన, భారతదేశం మొత్తంమీద ఆదివాసులను, ఆదివాస ప్రాంతాలను రాజ్యాంగసభ గుర్తించి, వారి రక్షణ కోసం సూచనలివ్వడానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక ఉపసంఘంలో, నా మరొక సహచరుడైన శ్రీ టి.కోదండరామయ్యగారితో కలసి ఆదివాసుల పునరుద్ధరణ కోసం కృషిచేశారు. ఆదివాసీ ప్రాంతాల ప్రజలకు సంబంధించిన విషయాలలో రాజ్యాంగంలో ప్రత్యేక అధ్యాయాన్ని తయారుచేసేందుకు రాజ్యాంగసభ ఈ ఉపసంఘం నివేదిక పైనే ముఖ్యంగా ఆధారపడుతుంది. రాజ్యాంగం కోసం ఆ ముఖ్యమైన నిర్మాణాత్మక కృషిచేయడంలో జైపాల్ గారు చూపెట్టిన చొరవ గుర్తించదగినట్టిది. జైపాల్ గారు కాంగ్రెస్ వారిని గురించి భయపడుతున్నందువల్ల ఆ తరవాత రెండు దశాబ్దాల కాలంలోనూ తమ సామాజిక ప్రయోజనాల కోసం జవహర్లాల్ గారు, రాజేంద్రప్రసాద్‌గారు ఇద్దరూ కూడా టక్కర్ బాపా గారిచ్చిన సూచనలను అంగీకరిస్తూ వచ్చారు.

సంవత్సరాల తరబడి ఉత్తర భారతదేశంలోని ఆదివాసుల ప్రజలకు ఆయన పార్లమెంటులో అత్యంత ముఖ్యమైన ప్రతినిధిగా ఉంటూ వచ్చారు. స్వరాజ్యం వచ్చిన తరవాత ఒరిస్సా బీహారు రాష్ట్రాలలో మంత్రివర్గాలను ఏర్పాటుచేయడంలోనూ పడగొట్టడంలోనూ ఆయన ప్రముఖపాత్ర వహిస్తూ వచ్చారు. దురదృష్టవశాత్తు వారూ, వారి అనుచరులూ ఆదివాస ప్రజల సాంఘికార్థికాభివృద్ధి కోసం ప్రత్యేకశ్రద్ధ వహించలేకపోవడంతో వారి కార్యక్రమాలు పార్టీ రాజకీయాల వరకే పరిమితమై వారి విధానాలు అంతగా ప్రజాభిమానాన్ని సంపాదించుకొని విజయవంతం కాలేకపోయాయి. అయినప్పటికీ ఒరిస్సాబీహార్ రాష్ట్రాలలో ఆదివాస శాసనసభ్యుల ముఠాలు ప్రముఖ స్థానం వహించి ఆ రాష్ట్రాల మంత్రి వర్గాలలో మంత్రులుగా బాగా రాజకీయమైన గుర్తింపును సంపాదించుకోగలిగారు. ఈ రోజుకు కూడా ఈ రాష్ట్రాలలోని ఆదివాసులు తరతరాలుగా వారనుభవిస్తున్న సాంఘిక దుస్థితినుంచి ఆర్థిక దాస్యం నుంచి బయటపడటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ ప్రయత్నంలో జైపాల్‌సింగ్ గారి కృషి చెప్పుకోదగినంత ప్రాధాన్యం సంపాదించుకోలేదు. ఆక్స్‌ఫర్డ్‌లో శిక్షణ పొందిన, బాగా ఉదారస్వభావం ఉన్న జైపాల్‌సింగ్ గట్టి స్వాతంత్ర్యేచ్ఛ ఉన్న వ్యక్తి. ఆదివాసులు కనివారు, ఆ ప్రాంతాలలోని వలస వచ్చిన వారు ఎలాంటి ఆధిక్యతాభావం చూపించినా ఆయన దాన్ని సహించకుండా నాగాల మాదిరిగా బాగా తిరగబడుతుండే వాడు. ఆదివాసులైన ప్రజలెక్కడున్నా వారికోసం ఆయన మనస్సు పరుగులు తీస్తుండేది. అందువల్ల ఆయన ఆఫ్రికా జనపోరాటాలకూ, భారతదేశంలోని కొండ ప్రాంతాలలో, లోయల్లో నివసిస్తూ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజలకు తన స్నేహహస్తం అందిస్తుండేవారు.

ఆదివాసులకు ప్రత్యేక పరిపాలనా విభాగాలను ఏర్పాటుచేయడం ద్వారా మాత్రమే,

పాఠశాలలు, రోడ్లు, వంతెనలు, వైద్యశాలలు, క్రమబద్ధమైన వ్యాపారకేంద్రాలు, సహకార సంఘాలు, కుటీర, చిన్న తరహా పరిశ్రమలు వంటివి ఏర్పడి, వ్యాపారస్తులనుంచి, అప్పుదారులనుంచి, పారిశ్రామిక వేత్తలనుంచి ఆదివాసులు కానివారి దోపిడీ నుంచి వారికి బాగా అండ ఏర్పడగలదని ఆయన భావించారు. ఆదివాసుల ఆచార వ్యవహారాలపై బాగా గౌరవం ఉన్న ఆయన, ఆదివాసులకు ప్రత్యేక రాజకీయ ప్రతిపత్తి ఉండి తీరాలని అభిప్రాయపడ్డారు. జార్ఖండ్ పార్టీని, అఖిలభారత ఆదివాసి మహాసభలను ఆయన నిర్వహించారు. ఆదివాసులకు ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని ఆయన దశాబ్దాల పాటు శ్రమించారు. ఒరిస్సాలోని, చోటా నాగపూర్, జైపూర్ కోరాపుట్ ప్రాంతాలకు అస్సాంలోని కొండ ప్రాంతాల ఆదివాసులకు ప్రత్యేక రాష్ట్రాలను ఏర్పరచాలని ఆయన గట్టిగా కోరారు.

అస్సాంలోని ఆదివాసులు తమలో విద్యావంతులైన క్రైస్తవులు నాయకులు కావడం ద్వారా అదృష్టవంతులయ్యారు. స్థానిక కాంగ్రెసు నాయకులతో కొన్ని సందర్భాలలో సహకరిస్తూ, వారు గాంధేయ విధానాన్ని బాగా ఉపయోగించుకొన్నారు. మేఘాలయ, త్రిపుర, మణిపూర్, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పడేంతవరకు, రెండు దశాబ్దాలపాటు వారు తెలివిగా ఈ విధానాన్ని అవలంబించారు.

తమ స్వాతంత్ర్య పోరాటానికి తగిన మంచి నాయకుడుగా జైపాల్ సింగ్‌ను నాగాలాండ్ ప్రజలు తలపోశారు. స్వయంపోషకత్వ స్థితిలో లేని నాగా రాష్ట్రానికి, హెచ్చు మొత్తంలో కేంద్రం నుంచి ఆర్థిక సహాయం, మొదలయిన సహాయాలు లభిస్తున్నందువల్ల ఆదివాసుల అభివృద్ధిపట్ల ఆసక్తి ఉన్న మాలాంటి వారందరితో కలసి, భారత సార్వభౌమత్వాన్ని అంగీకరించవలసిందనీ, భారతదేశాన్ని తమ మాతృభూమిగా భావించి పూర్తిగా మమైక్యం కావలసిందనీ నాగాలాండ్ ప్రజలకు ఆయన సూచించారు.

మేఘాలయ, మణిపూర్, త్రిపుర, మిజోరం, అరుణాచల్ ప్రదేశ్, అస్సాంలోని నాగాలాండ్ ప్రత్యేక రాష్ట్రాలుగా ఏర్పడటంలో దీర్ఘకాలంగా తాను కన్నకలలు ఈనాటికి యథార్థమైనందుకు ఆయన చాలా సంతోషించారు. అయితే ఆయన జన్మస్థలమైన చోటా నాగపూర్ ప్రత్యేక రాష్ట్రస్థాయిని సంపాదించుకోలేక పోయినందుకు ఆయన అసంతృప్తితోనే అసువులు బాశారు.

ఆయనకు క్రీడారంగంలో మంచి ఆసక్తి ఉండేది. అంతర్జాతీయ హాకీ పోటీలలో భారతదేశ జట్టుకు నాయకత్వం వహించారు. ఆయనలోని అణువణువు ఒక ఉన్నత ఆదివాసీ నాయకత్వపు స్థాయిని ప్రసరింపజేసేది. పాక్ పశ్చిమ సంస్కృతుల సమ్మేళనంతో చక్కగా కనిపించేవారాయన. ఆయనకున్న ఖరీదైన అలవాట్లనుంచి గాంధేయ మార్గానికి మారిపుంటే స్వాతంత్ర్యానంతర భారత రాజకీయాలలో ఒక ప్రముఖమైన పాత్రను వహించగలిగి ఉండేవారు. షావుకారులు, ఉక్కు కర్మాగారాల అధికారులు, సాంఘిక రాజకీయాధిపతులకు వ్యతిరేకంగా ఆదివాసుల క్షేమంకోసం కష్టించి పనిచేయడంలో ఇప్పటికీ మేము హృదయపూర్వకమైన మిత్రులుగానే కొనసాగుతున్నాం.

ఆయన లోక్‌సభలో (1952-67) సీనియర్ సభ్యులుగా ఉన్నారు. చమత్కారంతో

కూడిన ఆయన చక్కటి సంభాషణా చాతుర్యాన్ని వేదప్రజలకోసం ఆయన చేసే వాదనలను అందరూ అంగీకరించేవారు. మంత్రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తునప్పుడు వారిని ఎదుర్కొనేందుకు ఆయన ఒంటి కాలిపై లేస్తుండేవారు. ప్రభుత్వ వైఫల్యాలను ఆయన ఎత్తిచూపుతున్నప్పుడు దాన్ని భరించవలసిన స్థితిలో ఉన్న అధికారపక్ష సభ్యులు కూడా ఆయన చెప్పే విధానాన్ని చూసి మెచ్చుకొంటుండేవారు. చక్కని హాస్యంతో చలోక్తులతో పార్లమెంటును ఆయన ఆనందంలో ముంచెత్తుతూ సభ్యులందరూ ఆయన సభలో ఉండాలని కోరుకొనేట్లుగా చేస్తుండేవారు.

నిజానికి జైపాల్‌సింగ్ గౌరవనీయులైన ఆదివాసీనాయకుడుగా ఉత్తమ సంస్కృతి కలిగిన వ్యక్తిగా స్వతంత్ర స్వభావిగా ఆదివాస నాయకులలోనే తనకు తాను విశిష్ట వ్యక్తిత్వమున్న గొప్ప వారుగా ఉండేవారు.

శ్రీ జైపాల్ సింగ్

మన దేశంలో పూర్తిగా వెలికి గురయిన ప్రాంతాలోను, కొంతమేరకు వెలికి గురయిన ప్రాంతాల లోను అభివృద్ధిని సాధించే విషయంలో ఆసక్తి ఉన్న రాజ్యాంగ నిర్మాణసభ సభ్యులు 1947 సంవత్సరంలో న్యూఢిల్లీలో నా నివాస స్థానంలో సమావేశమైనప్పుడు జైపాల్ సింగ్ గారు ఆ సమావేశాని కొచ్చారు. బాబూ రాజేంద్రప్రసాద్ గారు దానికి అధ్యక్షత వహించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని మేము వదలిపెట్టిన తరవాత రెండు దశాబ్దాలకు ఆయన తిరిగి కలవడం నాకు సంతోషంతో కూడిన ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ దీర్ఘకాల విరామ సమయంలో ఆయన ఒక ఆఫ్రికన్ కాలేజిలో ప్రొఫెసర్‌గాను బీహారులో యం.యల్.సి.గాను, బికనీర్ సంస్థానంలో మంత్రిగాను రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్‌లో సభ్యుడుగానూ, బీహారులో ప్రముఖ కాంగ్రెస్ వ్యతిరేక నాయకుడుగానూ అనేక అనుభవాలను గడించారు. నేను ఆ సభ సమావేశ కన్వీనర్లలో ఒకడిని కావడం వల్ల, 1936 సంవత్సరం నుంచి ఆటవిక ప్రజల కోసం నేను చేస్తున్న కృషి తెలుసు గనుక అందులో పాల్గొంటున్న తన తోటి బీహారు సభ్యులపై తనకు సందేహాలున్నప్పటికీ ఆ సమావేశానికి రావాలని తాను నిర్ణయించుకొన్నట్లు ఆయన చెప్పారు. నా సహచరులైన కన్వీనర్లలో ఒకరు రాంఘడ్‌నుంచి వచ్చిన ఆదివాసి రామనారాయణ సింగ్‌కాగా మిగిలిన వారు ఆదివాసులు కాకుండా ఆ ప్రాంతాలలో వలస ఉన్నవారు.

జైపాల్ సింగ్‌గారు హాకీలో ప్రావీణ్యం కలిగి, సంప్రదాయ బద్ధమైన ఇంగ్లీషు ఉచ్చారణతో భారతీయ నవాబులాగా దీప్తితో భాసిస్తూ ఉండే ఒక పూర్తిస్థాయి ఆక్స్‌ఫర్డ్ రిటర్న్‌డ్. ఆయన ఆటవిక ప్రజలను బాగా అభిమానించే మత ప్రచారకుల సహాయంతో పైకి వచ్చారు. 19వ శతాబ్దంలో తన పూర్వీకులు అనేకమార్లు తిరుగుబాటు చేసినట్లుగా ఆయన రాజకీయాలలోకి ప్రవేశించినప్పుడు బ్రిటీషు వ్యతిరేకి కాలేదు. ఆయన పూర్వీకులు లాగానే ఆయన కూడా వడ్డీ వ్యాపారస్తులను తీవ్రంగా వ్యతిరేకించారు. ఎందుకంటే వారు అధిక వడ్డీలను పొందడమే గాకుండా ఆటవిక ప్రజలను వారి భూములనుంచి వెళ్లగొడుతుంటారు గనుక. ఆక్స్‌ఫర్డ్‌లో శిక్షణ పొందిన ఆయనకు మిగతా ఆటవికేతర రాజకీయ నాయకుల మాదిరిగా కూడా ఆటవిక ప్రజల అభివృద్ధిపట్ల ఉన్నతమైన ఆకాంక్ష ఉండటం సహజమే. అందువల్ల ఆయన హైందవ పూజారి వర్గాల ఆధిక్యతకు వ్యతిరేకంగా సాంఘికాభివృద్ధి కోసం ఉన్నతమైన కృషి చేశారు. ఆటవిక ప్రాంతాలలో ప్రవేశించి అక్కడ ఉండే వడ్డీ వ్యాపారులకు గిరిజనుల భూములను ఆక్రమిస్తూ కష్టాలపాలు జేస్తున్న హిందూ వలసవాదులకు వ్యతిరేకంగానూ, సామాజిక ఆర్థిక పరిస్థితులపై నా ప్రభుత్వ పరిపాలనలో వారికున్న ఆధిపత్యంపైన కూడా పోరాడి అక్కడున్న ఆటవిక జనాలు స్వేచ్ఛను పొందాలని కూడా ఆయన ఎక్కువ పట్టు జూపించారు.

ఆనాటి ఆసభ ఆ ప్రాంతాలకు మిగిలిన ప్రాంతాలతో సమానమైన రాజకీయ హక్కులనూ హోదానూ కల్పించడానికి ఆ ప్రాంతంలోని సంస్కృతికి, ఆర్థిక హక్కులకు తగు రక్షణ కల్పించడానికి మాతన జాతీయ ప్రభుత్వం అవసరమైన రక్షణలు కల్పించాలని తీర్మానించి

అందువల్ల కాశీ విద్యాపీఠానికి చెందిన తన మిత్రులు సంపూర్ణానంద్ గారితో సహా ఆయన కాంగ్రెస్ సోషలిస్టులతో కలవగలిగారు. అయితే ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ తరపున కేంద్ర శాసనసభకు వారు వెంటనే అభ్యర్థులుగా నిలబడ్డారు. ఆ విధంగా శ్రీశ్రీ ప్రకాశ కేంద్ర శాసనసభకు సభ్యులుగా ఎన్నికై అదే సమయంలో నాతోపాటు కేంద్రశాసనసభలోకి వచ్చారు. కౌన్సిల్ లో ప్రవేశించేందుకు అప్పుడు నెహ్రూగారు సుముఖులుగా లేకపోయినప్పటికీ శ్రీ శ్రీ ప్రకాశ నిర్ణయాన్ని నెహ్రూగారు వ్యతిరేకించలేదు.

కేంద్ర మంత్రిగా మద్రాసు, అస్సాం, బొంబాయి రాష్ట్రాల గవర్నరుగా నెహ్రూగారి హయాంలో చక్కటి సామర్థ్యంతోనూ, చాకచక్యంతోనూ ఆయన వివిధ పదవులను ఒకదానివెంట ఒకటి నిర్వహించారు. మంత్రిపదవుల కోసం పరిగెత్తకుండా దూరంగా ఉన్న నాలాంటి ప్రజాసేవకులను ఆయన మరిచిపోకుండా ఎప్పటిలాగే ప్రేమిస్తూ వచ్చారు. ఆయన పాకిస్తాన్ కై కమీషనరుగా వెళ్లవలసిందిగా నాపై గట్టి వత్తిడి తెచ్చారు. కేంద్ర శాసనసభలో మా సహసభ్యులుగా ఉన్న జిన్నా, లియాఖత్ అలీఖాన్ గార్లు కూడా దానికి అంగీకరించారని వారు కూడా నా విషయంలో బాగా ఆసక్తి కనబరుస్తున్నారని ఆయన నాకు తెలియ జేశారు. ఆవిధంగా ఆయన, నెహ్రూగారు ఇద్దరూ కూడా నన్ను కరాచీ పంపాలని అభిప్రాయ పడ్డారు. అయితే నేను పార్లమెంటును వదలిపెట్టి పోవడానికి ఇష్టపడక జాతీయ రాజకీయాలలోనే కొనసాగాలని నిశ్చయించుకొన్నప్పుడు ఆయన ఎక్కువగా బాధపడక జవహర్లాల్ గారితో ఇలా అన్నారు. "చూడు జవహర్, తాను లేనప్పుడు నీవు ఆయన రైతులను ఎక్కువగా నిర్లక్ష్యం చేస్తావని ఆయన భయపడు తున్నారు."

స్నేహం చేయటంలోనూ, చేసిన స్నేహం చెడిపోకుండా అట్టిపెట్టుకోడం లోనూ ఆయనకు మంచి సామర్థ్యముంది. ఆయన స్నేహితులను గురించి ఆయన చాలా గర్వపడుతుంటారు. వారికేవైనా ఉన్నత అవకాశాలు లభించినప్పుడు అవి తనకు లభించినట్లుగానే ఆయన భావిస్తుంటారు. ఒకమారు ఆయన సంతోషంతో తనకు అత్యవసరమైన పేపర్లతోపాటు కలసిఉన్న కలకత్తాకు చెందిన "ఆనంద బజార్" పత్రిక కటింగ్సును నా ముందుపెట్టి నాకు చూపించినప్పుడు నేను ఆశ్చర్యపోయాను. అందులో కలకత్తాలోని శ్రద్ధానంద పార్కులో విశేషంగా పోగైన రైతుల ఫోటోతో కూడిన విశేషాలను నేను చూశాను. ఆ సభకు నేను అధ్యక్షుడిని. సుభాష్ బాబుగారు ప్రత్యేక ఉపన్యాసకులు. అక్కడ వేదిక ముందున్న బ్యానరు మీద "రంగా, సుభాష్‌కు బెంగాల్ రైతుల స్వాగతం" అని పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు.

ఆయన మద్రాసు రాష్ట్రంలో గవర్నరుగా పనిచేస్తున్నప్పుడు 1952 సంవత్సరంలో మద్రాసులో రాజాజీ గారిని సమర్థించడానికి ఆ తరవాత 1953 సంవత్సరంలో ప్రకాశం గారిని సమర్థించడానికి నేను తీసుకొన్న నిర్ణయాన్ని ఆయన బాగా హర్షించారు. అయితే పార్లమెంటును వదలివేసి రాష్ట్ర రాజకీయాలలో ఉప ముఖ్యమంత్రిగా రావడానికి నేను అంగీకరించనందుకు ఆయన బాగా విచారించారు. అయినప్పటికీ మేమిద్దరం సన్నిహిత మిత్రులుగానే కొనసాగుతూ వచ్చాం.

ఆయన కేంద్ర మంత్రివర్గంలో జలవనరుల శాఖామాత్యులయినప్పుడు అందుకు ఆయనకున్న అర్హతలేమిటని అడిగారు. ఆ ప్రశ్నా పత్రానికి జవాబు చెప్తూ మంత్రివర్గ సదవులు ఆయా రంగాలలో సాంకేతిక నైపుణ్యం ఉన్న వ్యక్తులకు లభించవని బ్రిటీష్ నావికాదళానికి తొలి లార్డ్‌గా హొషెన్‌గారిని ఇంగ్లండులో నియమించినప్పుడు మొదట్లో ఆయనకు సముద్రాలను గురించి ఏమీ తెలియదని ఉదాహరణ పూర్వకంగా చెప్పారు. ఆయన వాస్యాక్తులు అంత సరసమైనవి.

తనకు తెలిసి ఎవరికీ ఏ అన్యాయం జరిగినా ఆయన సహించరు. ఒకమారు తమిళ రాజకీయ వేత్తలు, ఇంజనీర్లు కలసి కృష్ణానదీజలాలను మద్రాసు నగరానికి తరలించుకు పోయేందుకు ఒక తమిళ ఇంజనీరుతో త్రైపాక్షిక సంఘాన్ని ఏర్పాటుచేసినప్పుడు ఆ విషయమై వారి కుతంత్రాలను గురించి నేను ఆయనను హెచ్చరించాను. దానిమీదట ఆయన దక్షిణ భారతదేశానికి సంబంధించిన ఏ ఇంజనీరు సభ్యత్వం లేకుండా భోస్లా కమీషన్ ఏర్పాటుచేశారు. ఆ కమీషన్ నాగార్జున సాగర్ ప్రాజెక్టులాంటి ఒక బహుళార్థ సాధక ప్రాజెక్టు నిర్మాణానికి సిఫార్సు చేసింది.

ఆంధ్రులు విడిపోవాలని ఎంత పట్టుదలతో ఉన్నారో ఆయన తెలుసుకోగలిగారు. పొట్టి శ్రీరాములుగారు ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం ప్రారంభించిన దీక్ష విషయంలో ఆయన బాగా అసంతృప్తి చెందారు. ఎందుకంటే తనకు మంచి మిత్రులైన రాజాజీగారు మద్రాసు నగర విభజనను అంగీకరించ నందువల్ల ఆయన ఏమీ చేయలేక అసంతృప్తి పాలయ్యారు. ఎప్పుడైతే ఆంధ్రరాష్ట్ర స్థాపన కోసం నిర్ణయం జరిగిందో అప్పుడాయన బాగా సంతోషించారు. మా ఉభయులకూ మిత్రుడైన ప్రకాశంగారు దానికి ముఖ్యమంత్రిగా వచ్చారు.

నిడుబ్రోలు లోని పి.బి.ఎన్. కళాశాలకు, గోవాడలోని పి.వెంకయ్య ఉన్నత పాఠశాల భవనాలకు ఆయన శంఖుస్థాపన చేయడం నాకు చాలా ఆనందం కలిగించింది. ఎందుకంటే అందులో మొదటి దానిని నా మేనల్లుడు, రెండో దానిని మా మామగారు స్థాపించడం వల్ల ఆ కృషిలో నేను ప్రత్యేక శ్రద్ధను చూపెట్టవలసి వచ్చింది. ఆయన నా మనుమలలో ఒకరైన చిరంజీవి కమలేంద్ర కుమార్‌కు అక్షరాభ్యాసం కావించారు. ఈ పద్ధతిలో దేశమంతటా ఆయన అనేకమంది ప్రజాసేవకులతో వ్యక్తిగత సంబంధాలను నిర్వహిస్తూ మరచిపోలేని మధురమైన జ్ఞాపకాలను వారికి మిగుల్చుతూ వచ్చారు.

ఆయన అస్సాం గవర్నరుగా ఉన్నపుడు అస్సాం భౌగోళిక రాజకీయ స్వరూపాన్ని గురించి బాగా పరిశీలించారు. ఆయన తన దూరదృష్టితో రోడ్లు, వంతెనలు, రవాణా సౌకర్యాలు వంటి వాటిని ఆదివాసీ ప్రాంతాలలో బాగా అభివృద్ధి పరచవలసిన అవసరం ఉందని సూచించారు. ఆదివాసుల మానసిక జాతీయవాద కోర్కెలను అస్సాం ప్రజలు అంగీకరించకపోతే గట్టి చిక్కులను ఎదుర్కొవలసి రావచ్చునని ఆయన భయపడ్డారు. ఆ తరవాత సంభవించిన ఫలితాలు ఆయన ఆలోచనలూ, హెచ్చరికలూ యదార్థమేనని రుజువు చేశాయి.

పితృ దేవోభవ అనే ఆసియా దేశాల ఆర్యోక్తిపట్ల ఆయనకు సంపూర్ణ విశ్వాసముంది.

ఆయన పూజ్యులైన తన తలిదండ్రుల పట్ల అత్యంత అభిమానాన్ని ప్రదర్శించారు. ఆయన స్వీయ చరిత్రలో తండ్రిని గురించి ఆయన రాసుకొన్న అంశాలను చదివితే ఉన్నతులైన ఆయన తండ్రి డాక్టరు భగవాన్‌దాస్ గారిపట్ల ఆయనకు ఎంత గౌరవాభిమానాలున్నాయో మనకు తెలుస్తుంది. ఆయనకు తన కుటుంబం పట్ల మంచి శ్రద్ధాసక్తులున్నాయి. అయితే తన తండ్రిగారి లాగానే తానుకూడా పూర్తి కుటుంబ సౌఖ్యాన్ని పొందేందుకు నోచుకోలేకపోయారు.

శ్రీ ప్రకాశ రిపైరయిన తరవాత ఆరు సంవత్సరాల కాలంలో ప్రజాస్వామ్య పద్ధతుల సక్రమ అభివృద్ధికి, సాంఘిక సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన అనేక నిర్మాణాత్మకమైన సూచనలు అందించారు. అవినీతితో అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న కాంగ్రెస్ వాదులపై ఆయనకున్న అసంతృప్తిని ఆయన తనలో దాచిపెట్టుకోలేదు.

గత 50 సంవత్సరాల కాలంలో ప్రజాసేవలోనూ, రాజకీయ రంగంలోనూ జీవించిన వారందరి లోనూ ఆయన తనదైన ప్రత్యేక శైలిలో జీవిస్తూ సరసతతోను, దేశభక్తితో కూడిన విశ్వాసంతోను, ధర్మబద్ధమైన మార్గాలను తప్పకుండా అనుసరిస్తూ తన ప్రత్యేకతను నిలుపుకోగలిగారు.

44

రైతు నాయకుడు
శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య

ఒకరోజు రాత్రి నిడుబ్రోలు లోని మాయింట్లో నేను నిద్రలో కలవరిస్తూ ఉండగా, భారతీదేవి నన్ను నిద్రలేపింది. నిద్రలో కూడా రైతు మహాసభలను గురించి మీకు మీరే మాట్లాడుకొంటూ ఉంటే, మీకు మనశ్శాంతి ఎలా లభిస్తుందని, ఆమె అడిగారు. మీరు ఇంతకు ముందు గొర్రెపాటి వెంకటసుబ్బయ్యగారిని ఎప్పుడు కలిశారో మరి ఆ విషయాన్ని గురించి, దివిసీమ రైతుసభను గురించి మాట్లాడుతూనే ఉన్నారు. నేను, లేచి ఆమె చెప్పినదాన్ని విని నవ్వుతూ ఉంటే బయట ఎవరో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. పెద్ద పోలుగుండా భారతీదేవి బయటికి వెళ్లి, తలుపు తెరిచి కిరోసిన్ దీపం చేతబుచ్చుకొని, ఎవరా అని చూసింది.ఆ మె ఆశ్చర్యపడేట్లు ఆ గొర్రెపాటి వారు, అప్పుడే చిరునవ్వులు చిందిస్తూ ఆమెకు వందనాలంటున్నారు. ఆ తరవాత అయిదు నిమిషాలపాటు అనుకోకుండా జరిగిన ఈ అసంకల్పిత చర్యకు మేము ఇంకా దిగ్భ్రాంతిలోనే ఉన్నాము. ఆయనతో అది మా మూడో సమావేశం. సంతోషంగా ప్రారంభమైన మా స్నేహానుబంధం, ఆయన స్వర్గస్థులు కాబోయేవరకు నలభై సంవత్సరాల పూర్తికాలం, అంటే 1970 దాకా దేశసేవలో, రైతు కూలీ సేవలో ఆహ్యాయతతో కొనసాగింది.

ఆయన 1943 లో ఆంధ్ర కిసాన్ సమ్మేళన్ అధ్యక్షులుగా ఉండి, ఆంధ్రదేశమంతటా రైతుల చేత ప్రేమపూర్వకంగా కిసాన్ గొర్రెపాటి అని పిలిపించుకొంటూ ప్రఖ్యాతులయ్యారు. యుద్ధసమయంలో ప్రవేశపెట్టిన కంట్రోళ్లకు వ్యతిరేకంగా స్వరాజ్యం వచ్చిన తరవాత ఏర్పడిన కోటా, పర్మిట్ లైసెన్సు రాజ్యానికి వ్యతిరేకంగా అప్పుడప్పుడు పెరుగుతున్న భూమిశిస్తుకు వ్యతిరేకంగా రైతు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. సర్దార్ లచ్చన్నగారి తోడ్పాటుతో అనేక రైతు సత్యాగ్రహాలలో ఆయన ప్రముఖులుగా పాల్గొన్నారు. 1944-45 సంవత్సరాల మధ్య మహాత్మాగాంధీగారితో, నేను సంప్రదింపులు జరుపుతున్నప్పుడు ఆయన నాకు సహకారాన్నందజేసి కిసాన్ మజ్దూర్ ప్రజారాజ్య సిద్ధాంతానికి అనుకూలంగా గాంధీగారిచ్చిన సందేశాన్ని, భారత రైతుజనాలకు అందించారు. ఆయన 1952, 53 లోనూ, తిరిగి 1957 సాధారణ ఎన్నికల సందర్భంలోనూ కృషికార్ లోక్‌పార్టీ తరపున మా సిద్ధాంత ప్రచారంలో పాల్గొని ఆయన మాకు సహాయపడ్డారు. డెల్టా రైతాంగానికి కొల్లేరు, బుడమేరు సరస్సుల నుంచి, వచ్చే వరదలనుంచి మురుగునీటి నుంచి రక్షణ కల్పించేందుకు మేము ప్రారంభించిన పోరాటంలో ఆయన ముందుండి పనిచేశారు. రైతు నాయకులైన శ్రీ నాగినేని వెంకయ్య, శ్రీ వి.యస్.ఆర్.కె. ప్రసాద్ యం.యల్.ఎ, గార్లతో కలిసి దీర్ఘకాలం కృషిచేసి, తుంగభద్ర అభివృద్ధికి నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రభుత్వ ఆమోదాన్ని సాధించి విజయవంతులు కాగలిగారు. కృష్ణా గోదావరి జిల్లాల నిర్మాణం కోసం, ఆయకట్టు సాగు అభివృద్ధికోసం ఆయన

పోరాడారు. కృష్ణా, గోదావరి నదులపై బ్యారేజీలను పునర్నిర్మించడం ద్వారా ఆ ప్రాంతంలోని రైతులకు రక్షణ కల్పించేందుకు, ఆయన గట్టి కృషిచేశారు. ఎక్కడ పంటలు దెబ్బతిన్నప్పటికీ, అక్కడ ఆయన భూమిశిస్తును రద్దుచేయించారు. గత ఇరవై సంవత్సరాల్లో ప్రకృతి వైపరీత్యాలేర్పడి, కరువులు సంభవించినప్పుడు మేము ప్రారంభించినక్షామ సహాయక చర్యలలో, ఆయన, నాతోనూ, శ్రీమతి భారతీదేవిగారితోనూ బాగా సహకరించారు.

ఆయన పట్టణ, పల్లె ప్రాంతాల మధ్య సౌకర్యాలు, ఆర్థిక అవకాశాలు సమానంగా ఉండాలనే దృష్టితోనూ, వినియోగ వస్తువులకు పండించే పంటలకు ధరల విషయంలో పొంతన సాధించాలనే దృష్టితోనూ ఏర్పాటు చేసిన 'గ్రామీణ ప్రజాసమాఖ్య' కు ఆంధ్రప్రదేశ్ శాఖను ఆయన ఏర్పాటు చేశారు. కనీస వేతనాల ఆధారంగా ధరల స్థాయి ఉండాలని, గ్రామీణ ప్రాంతాలలో నిర్బంధంగా తక్కువ ధరలకు ధాన్యాన్ని వసూలుచేసి, దాన్ని తిరిగి ఫుడ్ కార్పొరేషన్ వారు చౌకధరల దుకాణాల ద్వారా, చాలా ఎక్కువ రేట్లకు వ్యవసాయ కార్మికులకు విక్రయించడాన్ని గమనించినప్పుడు ఆయన దిగ్భ్రాంతి చెందారు. అలా సేకరించిన ధాన్యంలో కావలసినంతమేరకు ఆయా గ్రామాలలోనే అట్టిపెట్టి స్థానిక కూలీలకు లాభం, నష్టం లేని రీతిలో విక్రయించాలని ఆయన కోరారు. శ్రీ యడ్లపాటి వెంకట్రావు యం.యల్.ఎ, శ్రీ నాగినేని వెంకయ్య యం.యల్.ఎ, శ్రీ జి.యల్.నారాయణ, శ్రీ జి.వి.అప్పయ్య, శ్రీ ఎస్.హెచ్.నాగభూషణం గార్లవంటి ప్రముఖ రైతునాయకుల సహకారంతో, అనేక గ్రామాల్లో స్వచ్ఛంద ఆహారధాన్యాల పంపిణీ సంస్థలను ఏర్పాటుచేసి రైతుల ద్వారా వాటిని స్థానిక కూలీలకు మామూలు రేట్లకే ఆయన ఇప్పించారు.

రైతుల యాజమాన్య హక్కులను రక్షించే ప్రాథమిక హక్కుల రంగంలో, ఆయన ప్రముఖంగా పనిచేశారు. 17వ రాజ్యాంగ సవరణకు వ్యతిరేకంగా ఆయన ఆంధ్ర రైతాంగానికి నాయకత్వం వహించి వారిని నడిపించారు. గత 35 సంవత్సరాలుగా ఆంధ్రప్రాంతంలో హరిజనులు, వెనకబడిన తరగతులు గ్రామీణ ప్రజల ప్రయోజనాలను రక్షించేందుకు ప్రారంభించిన అన్ని ఉద్యమాలలోనూ ఆయన శక్తివంతుడైన నాయకుడుగా ముందుండి పనిచేశారు.

1957 లో ఆయన మచిలీపట్టణంలోనూ, గుడివాడలోనూ బ్రహ్మాండమైన రైతు సభలను నిర్వహించి, సహకార వ్యవసాయానికి సంబంధించిన నాగపూర్ కాంగ్రెసు తీర్మానానికి వ్యతిరేకంగా రైతాంగాన్ని మేలుకొల్పి, వారి నిరసనను చక్కగా వ్యక్తం జేయగలిగారు. స్వయంవృత్తుల నుంచి, స్వంత కమతాలనుంచి రైతాంగాన్ని వెళ్లగొట్టే నెహ్రూగారి సహకార వ్యవసాయ ప్రయత్నానికి నిరసనగా మేమిద్దరం కాంగ్రెసుకు రాజీనామాచేసి, బయటికి వచ్చాం.

కమ్యూనిస్టులు, సోషలిస్టులు, వినోబాభావే అనుయాయులు, రైతుల భూమి హక్కును హరింప జేసేందుకు, కాంగ్రెసు ప్రారంభించిన కృషిలో చేతులు కలిపేందుకు, ఎల్వాల్ సమావేశంలో ఒక అంగీకారానికొచ్చిన తరవాత, స్వయం వృత్తులతో జీవించే రైతాంగ ప్రయోజనాలను కాపాడేందుకు, కాంగ్రెసును నిలవరించడం కోసం చేస్తున్న ప్రయత్నాలలో రైతు సంస్థలు మాత్రమే అందుకు చాలవని, మేము గ్రహించాం. అందువల్ల రాజకీయ శక్తుల

తోడ్పాటు మాకు అవసరమైంది. మతరాజకీయాలకు మేము వ్యతిరేకం. పట్టణ ప్రాంతాలలోని పారిశ్రామికుల, వాణిజ్యవేత్తల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని సాగించే గుత్తాధిపత్య శక్తులకు కాంగ్రెసు పాలన ద్వారా వచ్చిన లాభార్జన పరులతో పాత్తులేకుండా స్వతంత్రంగా ఉన్న రాజాజీ గారి సహాయం కోసం, మార్గదర్శకత్వం కోసం మేము ఆయనను అర్థించాం. లెక్కలను మాత్రమే చూపించే లైసెన్సు, పర్మిట్, కోటాల పాలనకు వ్యతిరేకంగా, నెహ్రూగారికి ప్రతిద్వంద్విగా ఉండేందుకు ఒక ప్రజాస్వామ్య ప్రతిపక్షాన్ని ఏర్పాటుచేస్తే బావుంటుందన్న ఆలోచనలో ఆయన అప్పటికే ఉన్నారు. ఆయన చేయూతతో, మార్గదర్శకత్వంతో అన్ని బలమైన రాజకీయేతర శక్తులను కలుపుకొని ఒక శక్తిమంతమైన రాజకీయ పార్టీని ఏర్పాటుచేయగల మని మేము అనుకొన్నాం. రాజాజీగారు కూడా అనేకమంది జాతీయస్థాయి నాయకులతో, ముఖ్యంగా శ్రీ జయప్రకాశ్ నారాయణ్, శ్రీ కృపలానీ, స్వర్గీయ మున్షీ, సర్దార్ బహదూర్, లాల్‌సింగ్, జనరల్ కరియప్ప గార్లతో ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ ప్రయత్నాలన్నింటి కారణంగా శ్రీ లాల్‌సింగ్, శ్రీ రామచంద్రారెడ్డి, శ్రీ జిన్‌రాజ్ హెగ్డే గార్లు మద్రాసులో అఖిల భారత వ్యవసాయదారుల సమాఖ్య ఆధ్వర్యంలో ది 4-6-1959 న ఏర్పాటుచేసిన మహాసభలో స్వతంత్రపార్టీ ఆవిర్భవించింది. శ్రీ జయప్రకాశ్ కూడా దానికి హాజరయ్యారు. ఈ కొత్త పార్టీకి అధ్యక్షత వహించవలసిందిగా రాజాజీగారు నన్ను కోరారు. జయప్రకాశ్ నారాయణ్‌గారు తన పార్టీరహిత మార్గాన్ని విడిచివచ్చి దీనికి నాయకత్వం వహించడానికి అంగీకరించలేకపోయినప్పటికీ అధికార కాంగ్రెసు పార్టీకి వ్యతిరేకంగా, ఒక స్వతంత్రమైన ప్రజాస్వామ్య పక్షంగా మా ఉద్యమం అభివృద్ధి చేయడానికి, ఆయన తోడ్పడగలవని చెప్పారు. నాకు సంబంధించిన ముగ్గురు సహచరుల అభిప్రాయం తెలుసుకొనేందుకు, వీలుగా కొద్దిరోజుల సమయం కావాలని మేము అడిగాం. నా సహచరులైన శ్రీయుతులు శ్రీ జి.వి.సుబ్బయ్య, యన్.వి.నాయుడు యం.యల్.ఎ. శ్రీ పి.రాజగోపాలనాయుడు యం.యల్.ఎ, స్వయంవృత్తులతో జీవించే రైతులు, ఇతర ప్రజల ప్రయోజనాలకు అట్లాంటి ఉద్యమం తోడ్పడగలదని అభిప్రాయ పడ్డారు. అయినప్పటికీ ఇతర అనుచరుల అభిప్రాయాల కోసం కూడా కొంత సమయాన్ని అడిగాం. మేము శ్రీ నాగినేని వెంకయ్య యం.యల్.ఎ గారు 20 రోజుల్లో మేదరమెట్ల గ్రామంలోని మా రైతాంగ పాఠశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఈ విషయమై చర్చించుకొన్నాం. గుజరాత్ రైతు నాయకులు శ్రీ దాదూభాయ్, బాబూలాల్‌భాయ్ పటేల్ గార్లుకూడా ఈ ఉద్యమంలో మాతో కలిశారు. మేము అంతకుముందు 1952-55 సంవత్సరాల మధ్య కృషికార్ లోక్ పార్టీని స్థాపించినప్పుడు తగినంతగా సభ్యులు లేక పట్టణ ప్రాంతాల ప్రజలనుంచి, పల్లె ప్రాంతాలలో రైతులు కాని వారినుంచి తగిన సామర్థ్యం సంపాదించుకోలేక, ఎలా దెబ్బతిన్నామో అప్పటి అనుభవాలను తిరిగి నమిక్షించుకొన్నాం. మేధావులలోనూ, పట్టణ ప్రాంతాలలోని మధ్యతరగతి ప్రజలలోనూ బాగా విశ్వాసం ఉన్న రాజాజీగారి నాయకత్వంలో ప్రధానంగా గ్రామీణ ప్రజలు రైతాంగంపై ఆధారపడిన, ఒక విశాలమైన రాజకీయ పార్టీని నిర్మాణం చేయవచ్చునని మేము తలపోశాం. రైతాంగ రక్షణకోసం, అభివృద్ధికోసం, ప్రయోజనాత్మకమైన రాజకీయ పక్షాన్ని ఈ సందర్భంలో మనం ఏర్పాటుచేయగలమని, కిసాన్ గ్రాపాటి వారు విశ్వసించారు. అందువల్ల మేము

రాజాజీగారితో చేతులు కలిపి, రైతుకూలీల ప్రయోజనాల కోసం స్వతంత్ర పార్టీ స్థాపనకు పూనుకొన్నాం. ఆంధ్రప్రాంతపు బాధ్యతలు స్వీకరించవలసిందిగా దీర్ఘకాలంగా నాకు అనుచరులుగా ఉన్న శ్రీ జి.వెంకటసుబ్బయ్యను ఆహ్వానించాను. ఆ విధంగా ఆయన పార్టీకి అధ్యక్షులయ్యారు. మా పార్టీ ఏర్పడిన మొదటివారంలోనే మా అభ్యంతరాలన్నింటినీ కూడా పరిగణనలోకి తీసుకోకుండానే జవహర్లాల్ గారు మా పార్టీని ఒక మితవాద పార్టీగా పేరుపెట్టి పిలిచారు. ఎక్కువగా పట్టణ ప్రాంతాల ప్రజాభిప్రాయానికి దగ్గరగా వుండే పత్రికలు దాన్ని ఆమోదించి ప్రచారం చేయ పూనుకొన్నాయి. ఆయన చెప్పింది సరికాదని, మా పార్టీ గాంధేయ, సోషలిస్టుల, స్వేచ్ఛావాదుల ప్రజాస్వామ్య పరుల ధర్మకర్తృత్వం లక్ష్యంగాగల గాంధేయ విధాన శీలుర వేదిక అని మేము ఎంతగా చెప్పినప్పటికీ గ్రహించక మా ప్రయత్నాలను వమ్ముచేశారు. ఈ అన్యాయ ప్రచారాన్ని చూసి, వెంకటప్పయ్యగారు బాగా కోపపడి రైతాంగ రక్షణ కోసం ఇంకా అధిక పట్టుదలతో కృషి ప్రారంభించారు.

ఒకానొక సమయంలో నిర్మాణాత్మక కార్యక్రమాల్లో ప్రభుత్వ జోక్యాన్ని మేము వ్యతిరేకించక పోవడాన్ని ఆయన నిరసించాడు. మరొకపక్క రైతులకు కనీస గిట్టుబాటు ధరలను లభింపజేసే విషయంలో, కరువు, వరదలు, తుఫాను వంటి వాటికి పంటల బీమా సౌకర్యాన్ని కల్పించే విషయంలోనూ, పశువుల అంటువ్యాధులు, గ్రామాల్లో అగ్ని ప్రమాదాలకు రక్షణ కల్పించే విషయంలోనూ, ప్రభుత్వం జోక్యం చేసుకోలేక పోతున్నందుకు రైతుసంఘం తరపున ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. గ్రామీణ ప్రజలందరికీ ఆరోగ్య బీమా సౌకర్యం విషయంలోనూ, వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలను లభింపజేసే విషయంలోనూ, మా ప్రయత్నాలన్నీ నిరర్థకమవుతున్నప్పటికీ, తిరిగి మేము అడుగుతున్నామంటూ ఆయన ప్రభుత్వాన్ని సవాలు చేశారు. అధిక వడ్డీలకు వ్యతిరేకంగానూ, అప్పులపై తిరిగి వడ్డీలు వసూలు చేసే దానికి వ్యతిరేకంగానూ, కౌలురేట్లు స్థిరీకరణ జరపవలసిందిగానూ, మేము ఎంతగా మొరపెట్టుకొన్నప్పటికీ, వినిపించుకోవడం లేదు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, వ్యవసాయ పరికరాలు, ప్రభుత్వమే పంపిణీ చేయాలని మేము కోరకూడదా? అని ప్రభుత్వాన్ని నిలదీశాం.

దీర్ఘకాలంగా మా రైతాంగ ఉద్యమం, స్వతంత్రపార్టీ చెప్పిన వాటిని బలపర్చడమే కాకుండా ఏ రాష్ట్రప్రభుత్వమైనా, ఎప్పుడైనా, ఎక్కడైనా రైతుల, కూలీల అభివృద్ధికోసం అభ్యుదయ కార్యక్రమాలపై ఎలాంటి ప్రయత్నాల నైనా ప్రారంభించిందా లేదా తెలియజేయవలసిందిగా ఆయన కోరారు. రైతులు తమ రైతునాయకులు కోరుతున్నట్లు గాకుండా, కాంగ్రెసుపార్టీ, దాని అనుయాయులు ఏవిధంగా అభ్యుదయ సమాజాన్ని నిర్మించుకో గలరో చెప్పవలసిందిగా ఆయన కోరారు. మేము కోరేది సోషలిస్టు సమాజాన్ని కాక, మరేమిటో చెప్పవలసిందిగా ఆయన కోరారు. స్వతంత్ర పార్టీలో ఉన్న కృషికార్ లోక్‌వర్గం దీర్ఘకాలికంగా వారు కాంగ్రెసులో ఉన్నప్పటినుంచీ కోరుతున్నట్లుగా పల్లెప్రాంతాలలో సొంత ఇల్లులేని వ్యవసాయ కూలీల చేతివృత్తుల వారికీ గృహవసతిని కల్పించేందుకు ఇల్లస్థలాలు మంజూరు చేయడం కోసం ఒక జాతీయస్థాయ గ్రామీణ గృహనిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టవలసిందని

తిరిగి ఆందోళన చేయసాగారు. వారు ఈ సందర్భంలో భూములున్న రైతులను పేదల గృహ నిర్మాణం కోసం భూములను దానం చేయవలసిందనీ గ్రామీణ ప్రజలందరూ సంవత్సరానికి 12 నుంచి 18 రోజులవరకు ఇటుకల తయారీ, గోడల కట్టుబడి వంటి పనులలో స్వచ్ఛంద సేవలందించి, 5-10 సంవత్సరాల కాలంలో గ్రామప్రాంతాలలో గృహవసతిలేని పేదలందరికీ, గృహవసతి ఏర్పాటుచేసుకోవలసిందని ఆయన సూచించారు. ప్రభుత్వంవారు గృహనిర్మాణ వస్తువుల కోసం స్థలసేకరణ కోసం ఒక ఏభై శాతం ధనసహాయం చేస్తే సరిపోతుంది. శ్రీ నందాగారితో కలిసి, వారి నాయకులు ఈ నిర్మాణాత్మక సలహాను స్వీకరించి భారత్ సేవక్ సమాజ్ ద్వారాను, పంచాయతీలు ప్రభుత్వం ఒకవైపు, మరొకవైపునుండి బాధ్యత వహిస్తూ గ్రామీణ ప్రాంతాలలో భూవసతి లేని నిరుపేదలకు తోడ్పడేందుకు ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్సు ద్వారా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు పూనుకొన్నారు. మాజీ కృషికార్ లోక్ పార్టీ వారు, ఆ తరవాత స్వతంత్ర పార్టీలో చేరిన రైతు నాయకులు, భూములపై పరిమితులు విధించడాన్ని వ్యతిరేకించలేదు. అయితే దానితోపాటు అన్నిరకాల ఆదాయాలమీద, అన్నిరకాల ఆస్తులపైన వృత్తిపరమైన ఆదాయం మీద కూడా పరిమితులను విధించి సమాన సాంఘిక న్యాయాన్ని సాధించి, అన్ని తరగతులను ఒకే రీతిలోకి తీసుకురావలసిందని వారు కోరారు. బాగా అభివృద్ధి చెందిన బట్టల మిల్లులతో పోటీపడలేక చేనేత పనివారల వంటి బలహీన వర్గాలు యిబ్బందులపాలై వారికి రక్షణ కావలసి వచ్చినప్పుడు, రాజాజీ, రంగాజీలు తగినంత ప్రభుత్వ రక్షణను వారికి కల్పించమని పట్టుబడుతున్న సందర్భాలలో, గోరెపాటివారు ఈ విషయాలను కూడా చేర్చి చెప్పేవారు. స్వతంత్ర పార్టీలో ఉన్న రైతువర్గ అభిమానులు ఊరికే కంట్రోళ్లను వ్యతిరేకించక కంట్రోళ్లను అమలు జరపదలచుకుంటే దుర్వినియోగం కాకుండా లైసెన్సులు, కోటాలు, పర్మిట్ల వంటి వాటిని క్రమబద్ధంగా సక్రమంగా వినియోగించుకొనేందుకు వీలుగా ఒక పార్టీ రహిత న్యాయవ్యవస్థ ద్వారా ప్రభుత్వం దానికి తగిన సహకారాన్నందించి సక్రమ పర్యవేక్షణకు పూనుకోవలసిందని మేము కోరాం. అప్పటి హోంశాఖామంత్రి శ్రీ నందాగారు ఈ విషయాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించేందుకు అంగీకరించినప్పటికీ లైసెన్సు, పర్మిట్లు, కోటాల ద్వారా తమ రాజకీయ ప్రయోజనాలను కాపాడుకొనేందుకు అలవాటుపడిన మిగిలిన కాంగ్రెసు నాయకులు అందుకు అవకాశ మివ్వలేదు. ఆవిధంగా రాజకీయపాలన సాంఘిక సంక్షేమానికి వీడ్కోలు పలికింది. అధికారంలోఉన్న మంత్రివర్గాల పార్టీ రాజకీయాల ప్రమేయం లేకుండా పంచాయితీలు దేవాదాయ సంస్థలపై ఉన్నట్లుగానే వీటి పరిశీలన అజమాయిషీ కూడా కొన్ని స్వతంత్ర సంస్థలను ఏర్పాటు చేయవలసిందని, అందరితోపాటు గోరెపాటి వారు కూడా స్వతంత్ర పార్టీ తరపున కోరారు. అలాంటి నమ్మకాల కారణంగా గోరెపాటివారు స్వతంత్ర పార్టీలోనూ కిసాన్ వేదికలోనూ గట్టి ఉత్సాహంతో కష్టపడి పనిచేశారు. కాంగ్రెసుపార్టీ, ఆ పార్టీ నాయకుడయిన నెహ్రూగారు వారి ప్రణాళికలను సాధించుకోడం కోసం పారిశ్రామికవేత్తలను పెట్టుబడి దారులు అధిక లాభాపేక్షాపరులు, గుత్తాధిపతులతో కలసి పనిచేస్తూ ఉంటే, ఈనాటి సమాజంలో ఎక్కువ నిర్లక్ష్యానికి గురవుతున్న రైతులకు, కార్మికులకు తగిన రక్షణ కల్పించడంకోసం అభ్యుదయకరమైన అన్ని జాతీయ శక్తులతోను కలిసి ఎక్కువగా దోపిడీదారులు కాని చిన్న

చిన్న వ్యాపారస్తులతోను పట్టణ ప్రాంతాలలోని కిందిస్థాయి మధ్యతరగతి ప్రజలతోను కలసి రాజకీయ చక్రాన్ని బలపరచుకొనేందుకు మేం చేసే ప్రయత్నంలో తప్పులేదనుకొంటాను.

అనేకమంది లాభార్జనా పరులు దొంగవ్యాపారస్తులు నిల్వదారులు పర్మిటుదారులు లైసెన్సుదారులు కోటాదారులు కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి చెందడాన్ని, మహారాజాలు, కోటీశ్వరులైన వారు ఆ సంస్థకు డబ్బు ముట్టజెప్పడాన్ని, అమాయకులైన ఓటర్లు తిరిగి తిరిగి వారినే గెలిపించడాన్ని, డబ్బు, కులం, రాజకీయ ఎత్తుగడలతో అధికారాన్ని అడ్డంపెట్టుకొని మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థులు గెలుస్తుండడాన్ని చూసి ఆయన చాలా బాధపడ్డారు. ఎక్కువమంది రైతులకు కులాభిమానం తప్ప వర్గదృష్టిలేదు. దానివల్ల అధికారంలో ఉన్న తమ కులం అభ్యర్థులకు అనుకూలంగా ఓట్లనిస్తూ తమకోసం త్యాగం చేసే వారిని తమకు తామే ఓడించారు.

రైతుల చేతిపనివారల కలంకారీ జీవుల ప్రయోజనాల కోసం దశాబ్దాల తరబడి కష్టించి పనిచేస్తూ గాంధేయమార్గంలో నిజాయితీగా కృషిచేస్తున్న మాలాంటి వారం అనేకమందిమి ఎన్నికలలో ఓడిపోవడాన్ని చూసి ఆయన దిగ్భ్రాంతికి లోనయ్యారు.

ధర్మబద్ధమైన మా రైతాంగ ఉద్యమంపై ఆయనకున్న తిరుగులేని నమ్మకం కారణంగా అప్పటికీ ఆయన నిరాశ చెందలేదు. ఆ తరవాత ఆయన 1962 సంవత్సరంలోను 1967 సంవత్సరంలోనూ సర్దార్ లచ్చన్న, రాజగోపాల్‌నాయుడుగార్లతో కలసి ఎన్నికలలో నా విజయం కోసం తీవ్రంగా కృషిచేసి రైతులను సమీకరించారు. ఆయన శౌర్యం అంతగొప్పది. స్వయం వృత్తుల ప్రజలకోసం ఆయనకున్న విప్లవకాంక్ష అంత దృఢమైంది. ఆయన యథార్థమైన ఒక గాంధేయవాద సోషలిస్టు.

మా నాయకుడు చెప్పినట్లుగా బ్యాంకులను జాతీయం చేసి బ్యాంకులపై ప్రభుత్వ అదుపును తీసుకొచ్చి వాటిద్వారా రైతు కూలీలను సులభ పద్ధతుల్లో అప్పులిస్తూ అభివృద్ధికి ఉపయోగపడేలా చేయాలని ఆయన ఒకానొక తన ప్రసంగంలో గట్టి విశ్వాసంతో చెప్పారు. మేము పంచదార మిల్లులను రైసుమిల్లులను ప్రతి మిల్లులను నూనెతీసే పరిశ్రమలను ప్రభుత్వ యాజమాన్యంలోకిగానీ లేదా సహకార సంస్థల నిర్వహణలోకి గానీ తీసుకురావాలని కోరగా తమ ఎన్నికల నిధులకోసం కాంగ్రెస్ మంత్రివర్గాలు అందుకు పూనుకోలేదు. అందువల్ల రాజాజీ గారు చెప్పినట్లుగా మా పార్టీ ప్రధానంగా రైతుజనశ్రేయస్సుకోసం పనిచేయగలదని గొర్రెపాటివారు సరయిన అవగాహనతో గ్రహించారు. కిసాన్ గొర్రెపాటి వారు రైతుల కోసం శ్రద్ధతో పోరాడేందుకు ఒక్క తెలుగుదినపత్రిక కూడా లేకపోవడాన్ని, రైతాంగాన్ని తాము కష్టించి శ్రమపడి సంపాదించుకున్న భూములనుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వ ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రతికారంగం ప్రతిస్పందించలేకపోవడాన్ని, చూసి విచారించసాగారు. రైతాంగానికి తాము కొనుగోలు చేయవలసిన వాటి సరఫరా విషయంలో కనీస సహాయం కూడా ప్రభుత్వం నుంచి లభించకపోగా తాము కష్టించి అధిక వ్యయప్రయాసలకోర్చి పండించుకొన్న ధాన్యాన్ని నిర్బంధ ధాన్యసేకరణ పద్ధతి ద్వారా ప్రభుత్వం తీసుకెళ్తూ ఉంటే పత్రికలు సమర్థించడాన్ని చూసి ఆయన నివ్వెరపోయారు. శ్రీమతి భారతీదేవిగారు 1936-37

సంవత్సరాలలో ప్రారంభించిన మా ఒకే ఒక కిసాన్ వారపత్రిక "వాహిని" మంచి సర్కులేషన్ లేక దానిపై అది ఆధారపడి నడవటమే కష్టంగా ఉంది. ఆ ఆర్థిక చిక్కులలోనుంచి భారతీదేవిగారిని తప్పించాలనే దృష్టితోనూ దాని నిర్వహణా బాధ్యతను తన భుజాలపై వేసుకొన్నారు. ఆయనకూడా దాన్ని స్వయంపోషకంగావించ లేకపోయారు. తన వ్యక్తిగత ఆదాయాన్ని ఎక్కువ భాగం దానికోసం వెచ్చించారు. జపాన్ రైతులు 30 లక్షల సర్కులేషన్ ఉన్న "ఐ-నో-హి కారి" వారపత్రికను అభివృద్ధి చేసుకొన్నట్లుగా భారత రైతాంగం తమకోసం ఒక స్వతంత్రమైన ఆర్థిక స్తోమతఉన్న పత్రికను అభివృద్ధి చేసుకోలేకపోవడాన్ని గురించి నేను ఇచ్చిన వివరణను వెంకటసుబ్బయ్య సంతోషంగా స్వీకరించారు. నాలుగు పంచవర్ష ప్రణాళికలను అమలు జరిపినప్పటికీ భారతదేశం సరైన అభివృద్ధిని సాధించలేకపోతే యుద్ధంలో సర్వనాశనమై పోయికూడా జపాన్ దేశం అధిక ధనవంతమైన ప్రపంచ రాజ్యాలలో ఒకటిగా వెలగడానికి కారణం అక్కడ జ్ఞాన సంపన్నమైన రైతాంగమనేదాన్ని ఆయన గ్రహించగలిగారు. ఆయన మరణించ బోయేముందు తన ఆరోగ్యం కన్నా ఈ రైతాంగ వారపత్రికకు నిధులు ఎలా సమకూర్చాలనే విషయమై మాత్రమే ఎక్కువ ఆందోళన పడ్డారు. ఆయన తుది కోర్కెను నెరవేర్చడానికి లేకుండా శ్రీమతి భారతీదేవి కూడా ఆ తరవాత ఒకటిన్నర సంవత్సరాల కాలానికి స్వర్గస్థులు కాగా, మా సోదరులు శ్రీ వెంకటప్పయ్యగారి పుత్రుడు జి.నాగేశ్వరరావు యం.బి.ఏ.(యు.ఎస్.ఎ) ఈ ప్రధానమైన బాధ్యతను ఆ తరవాత తన భుజాలపై వేసుకొన్నారు.

ఆయన ఆంధ్ర కాంగ్రెసు మాజీ అధ్యక్షులు. శాసనమండలి మాజీ అధ్యక్షులు అయిన శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యకు, తెలుగుభాషలో అనేకమంది జాతీయ నాయకుల జీవిత చరిత్రలు అందించిన ప్రముఖ రచయిత గొర్రెపాటి వారికి బాల్యస్నేహితులు. సత్యాగ్రహ పోరాటాలలో సహచరుడు. ఆయన జాతీయ స్వాతంత్ర్యం కోసం పోరాడాడు. ఆయన, వారి సతీమణి స్వరాజ్య పోరాటంలో జైళ్లకు వెళ్లిన స్వాతంత్ర్య సమరయోధులు; దశాబ్దాల తరబడి ఖాదీ ఉద్యమంలోనూ, కుటీర పరిశ్రమల అభివృద్ధిలోనూ, సేవలోనూ గాంధీజీ ఆశయాలకు అనుగుణంగా ఆయన పనిచేశారు. ఇట్లాంటి వికేంద్రీకృత పరిశ్రమలలో ఎక్కువమందికి ఉద్యోగావకాశాలు లభించగలవని ఆయన నమ్మి అందుకనుగుణంగా చేనేత పనివారు, కుండలు తయారుచేసేవారు, కలపపనివారు, తమ కాళ్లపై తాము నిలబడటానికి వీలుగా సహాయపడ్డారు. శ్రీ ప్రగడ కోటయ్య యం.యల్.ఎ గారు చేనేత పనివారల కాంగ్రెసును ఏర్పాటుచేసే కృషిలో ఆయన తోడ్పడ్డారు. 1931 లో జమిందార్లకు వ్యతిరేకంగా మేము పోరాటాన్ని ప్రారంభించినప్పుడు, ఆయన జమిందారీ విధానం రద్దుచేసేంతవరకు, నాకు తోడుగా నిలిచి కృషిచేశారు. ప్రభుత్వం నుంచి, వ్యాపారస్థులనుంచి జరుగుతున్న రైతాంగ దోపిడీని అరికట్టడం కోసం ఆయన ఒక యోధుడిలా పోరాటాన్ని సాగించారు. పెట్టుబడి దారుల దోపిడీకి బదులుగా రైతాంగ వ్యతిరేక చర్యలకు పూనుకొన్న కమ్యూనిస్టుల నియంతృత్వ విధానాలను ఆయన పూర్తిగా ప్రతిఘటించారు.

కృష్ణాజిల్లా పరిషత్తు ఉపాధ్యక్షులుగా పనిచేస్తున్న ఆయన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సౌకర్యాలను పెంపొందించేందుకు విద్యావసతులను కల్పించేందుకు చిత్తశుద్ధితోనూ,

సామర్థ్యంతోనూ, నిజాయితీతోనూ పనిచేశారు. స్థానిక రైతులనుంచి విరాళాలను సేకరించి ఆయన గ్రామీణ వైద్యశాలలను పశువుల ఆస్పత్రులను, ప్రసూతి వైద్యకేంద్రాలను ఏర్పాటుచేయించగలిగారు. దివి తాలూకాలో స్థానిక రైతులను ప్రోత్సహించి వారి విరాళాల ద్వారా ఆయన అనేక ఉన్నత పాఠశాలను స్థాపించారు. ఆ రైతు నాయకుడు చేపట్టిన కృషికారణంగా జమిందారీ పాలనలో ఉన్న ఒక గ్రామంలో ఒక మంచి ఉన్నత పాఠశాల, వైద్యశాలవంటి అనేక వసతులు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రాంతంలో కిసాన్ కార్యక్రమాలకు శిక్షణ ఇచ్చేందుకు వారిని విద్వాంసులుగా చేయడానికి, అనేక రైతాంగ రాజకీయ విద్యాలయాల నిర్వహణలో ఆయన నాకు తోడ్పడ్డారు. 1953 లో చల్లపల్లిలో రైతుకూలీ, హరిజన యువకుల కోసం ఆరు వారాలపాటు నడిపిన రైతాంగ విద్యాలయానికి ఆయన ముఖ్య సంధానకర్త.

కిసాన్ వెంకట సుబ్బయ్యగారు, పండిత వెంకట సుబ్బయ్యగారు ఆయనలోని ఇరువురూ కూడా గ్రామీణ మహిళాభ్యుదయ కృషి పట్ల బాగా అభిమానమున్నవారు. గ్రామీణ మహిళా ఉద్యమాభివృద్ధికోసం శ్రీమతి భారతీదేవిగారు సాగిస్తున్న కృషిలో వారు తోడ్పడ్డారు. కిసాన్ వెంకటసుబ్బయ్యగారు, వారి భార్య శ్రీమతి సరస్వతమ్మగారిని ప్రోత్సహించి 1930 లో సత్యాగ్రహ సమరంలో పాల్గొనేందుకు ముందుకు తీసుకువచ్చారు. ఆనాటి సత్యాగ్రహ స్వాతంత్ర్య సమర పోరాటంలో ఆమె జైలుకు కూడా వెళ్లారు. గ్రామ పంచాయితీ బోర్డులో ఆయనకు మెజారిటీ ఉన్నప్పటికీ, సర్పంచ్‌గా శ్రీమతి జి.మహాలక్ష్మమ్మ ఎన్నిక కావడానికి తోడ్పడి, సనాతన ఆచారాలతో నిండిఉన్న భారతదేశంలో స్త్రీలకు అపూర్వమైన ఒక అవకాశాన్ని లభింపచేశారు. శ్రీమతి మహాలక్ష్మమ్మ, సరస్వతమ్మగార్లకు ఘంటసాలలో రాష్ట్రస్థాయి మహిళా మహాసభను నిర్వహించేందుకు వారికి కావలసిన సమయాన్నంతా ఆయన అందించారు. దానికి శ్రీమతి భారతీదేవి అధ్యక్షత వహించగా అఖిల భారత మహిళా సంఘాధ్యక్షురాలైన శ్రీమతి లక్ష్మీరఘురాంగారు దాన్ని ప్రారంభించారు. ఆవిధంగా ఆయన రైతాంగ ఉద్యమం, గ్రామీణ ప్రాంతాలలో స్త్రీల అభివృద్ధికోసం ఎలా కృషిచేస్తుందో చూపెట్టారు.

ప్రముఖ బౌద్ధకేంద్రమైన ఘంటసాలలో ఒక రైతుకుటుంబంలో ఆయన 15-6-1903న జన్మించారు. ఆయన 30 సంవత్సరాల వయస్సు వచ్చేంతవరకు పాలంలో కష్టపడి పనిచేశారు. జాతీయోద్యమంలోనూ, రైతాంగ ఉద్యమంలోనూ శ్రద్ధవహించి పాల్గొనేంతవరకూ, వ్యావసాయిక పనిపాటలలో అచ్చమైన రైతులానే కష్టపడి జీవితాన్ని గడుపుతూ ఉండేవారు. స్వయం వృత్తులతో జీవించే రైతాంగానికి ఉన్న స్వాతంత్ర్యం ఆయనకు బాగా తెలుసు. గనుక రైతాంగ ఉద్యమం పట్ల ఎక్కువ ఆసక్తిని ప్రదర్శించారు. స్వయంవృత్తుల వారిద్వారా తమ ఆర్జన ఆగిపోతే, రైతులు కూడా సామ్రాజ్యవాద దోపిడీకి గురయి, పారిశ్రామిక కార్మికుల్లాగా నిస్సహాయులై పోగలరని ఆయన భావించారు. వారి స్వయంవృత్తుల కారణంగానే బార్డోలీలోనూ ఆంధ్రప్రాంతంలోనూ రైతాంగం బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిలబడగలగిలిగి శిస్తు నిరాకరణ సత్యాగ్రహాలను ప్రారంభించి విజయవంతం కాగలిగింది.

ఆయన మానసికంగానూ, శారీరకంగానూ స్థాయి కలిగిన గట్టి మనిషి. దృఢమైన శరీరంతో, చామచాయలో హుందాగా ఉండేవారు. ఏదైనా ఒక ఆలోచన ఆయన మనస్సులో కొచ్చినప్పుడు సహజంగా ఆయన పెద్దరికంతో కనిపిస్తున్నప్పటికీ, మనస్ఫూర్తిగా నోరువిప్పి నవ్వుతూ కనిపిస్తారు. ఆయన చూడటానికి ఒక ప్రజా నాయకుడుగానూ, నడిచేప్పుడు ఒక మహాయోధుడుగానూ ఏదైనా ఒక కార్యక్రమంలో పాల్గొనేటప్పుడు పెద్దమనిషిగానూ కనిపిస్తారు.

ఆయన మచిలీపట్టణంలో మెట్రిక్యులేషన్ వరకు చదువుకున్నారు. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా, 1908 లో జాతీయోద్యమం ప్రారంభమైన రోజుల్లో స్థాపించిన బందరు జాతీయ కళాశాలను నిర్వహిస్తున్న ప్రముఖుల ప్రభావానికి, ఆ రోజుల్లో ఆయన లోనయ్యారు. బాగా విద్యావంతుడైన ఓ పండిత ప్రకాండుడు వెంకటసుబ్బయ్యగారిని కొన్ని దశాబ్దాల తరవాత చూసి గ్రంథపఠనంలోనూ, ప్రజావ్యవహారాల్లోనూ తమకు తామై, శ్రద్ధగా ఓపికతో విద్యాభ్యాసాన్ని సాగించి, వెంకటసుబ్బయ్యగారు ఎంత గొప్ప వారయ్యారో అని ఆశ్చర్యపడ్డారు.

గాంధేయ ప్రజాసేవా కార్యక్రమాల్లో ఆయనకు చక్కటి అవగాహన ఉంది. తన వ్యవసాయం ద్వారా ఆదాయాన్నంతా గాంధేయవాదిగా ప్రజాసేవకోసం వినియోగించారు. విశ్వాసపాత్రులైన ఆయన భార్య, కుమారులు కూడా తమకు అందే ప్రతిఫలాన్ని అంతా కూడా ఆయనకే అప్పగించారు. ఆయన తేలికపాటి శుభ్రమైన ఖద్దరు బట్టలను ధరించి ఆ బట్టలలో అతి పవిత్రంగా కనిపిస్తూ ఉండేవారు. ఆయన విజయవాడలో ఉన్నప్పుడు స్వయంగా వంట చేసుకొంటూ తనతోపాటు ఒకరిద్దరి ప్రజాసేవకుల కూడా భోజనం పెట్టేవారు. ఈ కాలంలో ప్రజాసంస్థలమీద ఆధారపడకుండా, అతి నిరాడంబరంగా సత్సంప్రదాయాలతో, సేవాభిలాషతో జీవించడం అందరివల్లా అయ్యేపనికాదు.

రైతులకు, దేశానికి ఆయన జీవితాంతం చేసిన సేవలకు కృతజ్ఞతగా, కృష్ణాజిల్లాలోని ఆయన స్వగ్రామంలో, ఆ జిల్లా రైతులు ఆయన విగ్రహాన్ని స్థాపించి, తమ కృతజ్ఞతను ప్రకటించుకొన్నారు. బొద్దస్థూపంఉన్న ప్రముఖ కేంద్రంలో గాంధీజీ కస్తూరిబా వంటి జాతీయ నాయకుల విగ్రహాల సరసన ఆయన విగ్రహాన్ని స్థాపించి, ప్రజలు ఆయనపట్ల తమకున్న సముచితమైన గౌరవాన్ని ప్రకటించుకొన్నారు. ఆయన స్వర్గస్థులైన తరవాత తొలి సంవత్సరీకం నాటికి పండిత గొర్రెపాటి వారూ, నేనూ కలిసి ఆయన జీవిత చరిత్రను తెలుగులో రాసి ప్రచురించాం!

45

శ్రీమతి సుచేత కృపలానీ

శ్రీమతి సుచేత కృపలాని 1908 వ సంవత్సరంలో జన్మించారు. రంగా గారితో కలసి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యవర్గంలో సభ్యులుగా కొనసాగారు. ఆమె కాంగ్రెస్ సంస్థకు ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1974 డిసెంబరులో మరణించారు - (ఎడిటర్).

శ్రీమతి సుచేత కృపలాని ఉన్నతురాలైన స్త్రీ. చక్కని సహధర్మచారిణి. గొప్ప నాయకురాలు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తూ ఆమె మంచిపేరు సంపాదించుకొన్నారు. ఆచార్య కృపలానీగారు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు ఆయనకు సమర్థవంతురాలైన సహచరిగాను, కార్యదర్శిగాను, ఆమె బాగా తోడ్పడ్డారు. జవహర్లాల్ గారితో, సర్దార్ పటేల్‌గారితో విభేదాలు ఏర్పడిన కారణంగా కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి రాజీనామాచేసి కృపలానీగారు తొలగిపోయినప్పుడు ఆ స్థానాన్ని భర్తీ చేసేందుకు ఆమెను కార్యవర్గంలోకి ఆహ్వానించినప్పుడు ఆమె దృఢమైన ఆత్మవిశ్వాసంతో నిలిచి పనిచేశారు. పురుషోత్తమదాస్ టాండన్‌కు వ్యతిరేకంగా కృపలానీగారు కాంగ్రెస్ అధ్యక్షపదవికోసం పోటీపడి లెక్కింపులో చేసిన ట్రిక్కు కారణంగా ఓడిపోయినప్పుడు ఆమె దానిని నిబ్బరంగా స్వీకరించింది. కాంగ్రెస్‌లో పెరుగుతున్న అవినీతికి రాజకీయ దురంవాట్లకు నిరసనగా 1951 సంవత్సరంలో మేమంతా కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చినప్పుడు ఆమెకూడా కాంగ్రెస్‌ను వదలిపెట్టింది. ఆమె కృపలానీ గారితో కలసి కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీలోనూ, తరవాత ప్రజాసోషలిస్టు పార్టీలోనూ నమ్మకంతో పనిచేసి 1952, 57 ఎన్నికలలో వచ్చిన దురదృష్టకరమైన ఫలితాలకు బాగా అసంతృప్తి చెందారు. సోషలిస్టుగా ఉంటున్నవారు సిద్ధాంతాల పరంగా కాకుండా వ్యక్తుల పరంగా ఎక్కువ పేచీలకు దిగుతుంటారని గ్రహించి భార్యాభర్తలిరువురూ రాజీనామాచేసి వారినుంచి వైదొలగారు. ఆ తరవాత కృపలానీగారు ఏ రాజకీయ పార్టీతోనూ అనుబంధం పెట్టుకోకుండా ఉంటే మేమంతా చేరిన కొద్ది సమయం తరవాత ఆమె కాంగ్రెస్‌లో చేరడానికి నిశ్చయించుకొంది. ఆ తరవాత ఆమె భర్తలాగే, ఆమె కూడా పార్లమెంటు సభ్యులు కాగలిగారు. పార్లమెంటులో వారిద్దరూ భిన్నధ్రువాలుగా ఉన్నప్పటికీ ఇంటివద్ద ఒకటిగా కలసి సంతోషంగా జీవిస్తూ ఉండేవారు.

ఆమె రాజకీయ జీవితాన్ని పేరొందిన అఖిలభారత కాంగ్రెస్ కార్యదర్శి భార్యగా ప్రారంభించినప్పటికీ ఒక సాధారణ కార్యకర్తగా గాంధేయ నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొంటూ బాధలను లెక్కచేయక చక్కటి కృషిచేయడానికే ఆమె ఎక్కువ శ్రద్ధ తీసుకున్నారు. గాంధీజీ, నవకాళీయాత్రలో డాక్టర్ సుశీలా నయ్యర్, మృదులాసారాబాయి గార్లతోపాటు ఆమె కూడా బాపూజీని అనుసరించి ఆ ప్రాంతంలో నెలకొనిఉన్న అసహ్యకరమైన పరిస్థితులనుంచి అనేక

కష్టాలను ఎదుర్కోడానికి సిద్ధమై నడిచారు. పాకిస్తాన్ నుంచి శారీరకంగా మానసికంగా అనేక రకాలైన బాధలకు గురై వలసవచ్చిన కాందిశీకులకు పునరావాసం కల్పించేందుకు ఆమె మాసాలతరబడి కష్టించి పనిచేశారు. సుశీల, మృదులాసారాబాయిగార్ల వలె ఆమె కూడా ఒక కరుణారసపూరితమైన దేవత.

శ్రీమతి కమలాదేవి, మృదులా, సుశీల, భారతీదేవిగార్లు స్వతంత్ర సమరంలో జైళ్లకు వెళ్లినట్లుగానే ఆమె కూడా అనేకమార్లు జైలు శిక్షలను అనుభవించింది. శ్రీమతి అరుణా ఆసఫ్ ఆలీలాగా ఈమె కూడా ప్రచ్ఛన్నంగా ఉంటూ గొప్ప కృషిచేసింది. ఆ రోజుల్లోని అన్ని కార్యక్రమాల్లో ఆమె సమర్థమైన పాత్రను నిర్వహించింది.

తమ భర్తలకున్న రాజకీయ అనుబంధాలతో నిమిత్తం లేకుండా నూటికి నూరుపాళ్లు రాజకీయాల్లో తమ ఇష్టాన్ని అనుసరించి వ్యవహరించే స్వేచ్ఛ భార్యలకుండాలని శ్రీ కృపలానీగారు ఒకమారు లోక్‌సభలో సంతోషంగా అనుమాన రహితంగా ప్రకటించారు. శ్రీమతి సుచేత కాంగ్రెస్‌లో కొనసాగుతున్నప్పుడు శ్రీ కృపలానీ ప్రతిపక్ష సభ్యుడుగా ఉండి కాంగ్రెసును అదిచేసే అపసవ్య చర్యల కారణంగా నిందిస్తూ ఉంటే ఆయన పక్కనే కూర్చొని ఆమె కన్నీటి చుక్కలు రాల్చటం తప్ప ఏమీ చేయలేని దృశ్యాన్ని మనం తరచూ పార్లమెంటులో చూడవచ్చు. వారిద్దరూ నిజాయితీపరులే, వారి వారి మార్గాలలో వారిద్దరూ పూర్తి బాధ్యతతో విశ్వాసంతో మెలుగుతున్నవారే. అయితే ఇద్దరూ కూడా నిజాయితీ పరులైన గాంధేయ మార్గావలంబికులు.

అతివేగంగా గుక్కతిప్పుకోకుండా ఉపన్యసించగలిగే మంచి వక్త ఆమె. ఆమె చెప్పే అంశాలను ఆమె స్పష్టంగా వివరించగలదు. ప్రసంగాలు చేయడంలో ఆమె దిట్ట. ఆమె నిర్మాణాత్మకమైన సూచనలు చేయడానికి ఎక్కువ శ్రద్ధ చూపిస్తుంది. ఎప్పుడైనా ఉద్రేకంగా ఉన్నా నైతికస్థాయిని మాత్రం వదలిపెట్టేది కాదు. పార్లమెంటులోని అన్ని పక్షాల వాదాలను ఆమె గౌరవంతో ఆలకించేది. ఆమె కాంగ్రెస్‌లో ప్రవేశించిన వెంటనే 1958-60 సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసేందుకు జవహర్లాల్ నెహ్రూగారు ఆమెకు అవకాశమిచ్చారు. అంతకు ముందు 1946-47 సంవత్సరాల కాలంలో మృదులా సారాబాయ్‌గారికి కూడా ఆయన ఇలాంటి అవకాశం కల్పించారు. ఇరువురూ తమకు అప్పగించిన బాధ్యతలను సామర్థ్యంతో నిర్వహించారు. ఇలాంటి మరో అవకాశాన్ని శ్రీ ఎ.బి.గుప్తాగారు కామరాజ్ పథకం ప్రకారం బాగా సీనియరు మంత్రులయిన వారు మంత్రి పదవులను వదలి పార్టీ కార్యకలాపాలలో పాల్గొన వలసి వచ్చినప్పుడు ఆమెను ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ శాసనసభా పక్ష నాయకురాలుగాను ఆవిధంగా (1963-67) ముఖ్యమంత్రిగాను చేశారు. ఆ అవకాశాన్ని ఆమె సి.బి.గుప్తాగారి సహకారంతోనూ ప్రముఖులైన తన భర్త నైతిక సమర్థనతోనూ చక్కగా వినియోగించుకొని మూడు వందలకు పైగా కలిగిన ఆ శాసనసభా విశ్వాసాన్ని చక్కగా పొందగలిగారు. కేంద్రంలో నెహ్రూగారి రాజకీయాలకు వ్యతిరేకంగా ఉంటున్న శ్రీ కృపలానీ గారు రాష్ట్రంలో నెహ్రూగారిని సమర్థిస్తూ కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా కొనసాగుతున్న శ్రీమతి సుచేతగారికి తగు సలహాలిస్తూ శాసనసభ్యుల విశ్వాసాన్ని పొందుతూ గౌరవ ప్రదమైన ముఖ్యమంత్రిగా ఆమె కొనసాగగలిగేలా

చూడటం భారత ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక ప్రత్యేకమైన అనుభవం. అనేక రాష్ట్రాలలో ఉన్న ఇతర ముఖ్యమంత్రులలాగా యు.పి. రాష్ట్రంలో ఆమె వారసుడుగా వచ్చిన ఇతర ముఖ్యమంత్రులలాగా అవినీతి ఆరోపణలకు లోనుగాక పోవడం రాజకీయ ఆరోపణం పాలుగాకపోవడం ఆమె సాధించిన గొప్ప విజయంగా మనం చెప్పుకోవచ్చు. రైతులు గ్రామీణ ప్రజలు పారిశ్రామిక కార్మికుల కష్టనష్టాలను తొలగించే విషయంలో ఆమె సత్వర చర్యలను గైకొనేది. రైతు కూలీలను దోపిడీ చేసేందుకు ఫాక్టరీ యజమానులను గానీ పంచదార ఉత్పత్తిదారులను గానీ ఆమె అనుమతించేది గాదు.

ఆమె తిరిగి పార్లమెంటుకు 1967 ఎన్నికలలో వచ్చింది. ఇందిర మంత్రివర్గ సభ్యులతో ఆమె ఆ సమయంలో తలపట్లు పట్టవలసి వచ్చింది. రాష్ట్రపతి ఎన్నికల సందర్భంలో శ్రీమతి ఇందిరాగాంధీ విభేదించి ఆ తరవాత ఆమెకు దూరమై పాత కాంగ్రెస్‌లో కొనసాగింది. విభేదాలతో కొనసాగిన ఆ దురదృష్టకరమైన ఆ రెండు సంవత్సరాల కాంలోనూ ఆమె తనకు తాను వ్యక్తిగత విమర్శలకు పూనుకోక హుందాతనంగా నడచుకొంది.

దేశం దురదృష్టం కారణంగా 1972 వ సంవత్సరంలో గుజరాత్‌లో ప్రచారంచేస్తూ పర్యటిస్తున్న సందర్భంలో ఆమె గుండెపోటుకు గురైంది. తిరిగి మళ్లీ 1-12-1974 న ఆమెకు గుండెపోటు వచ్చింది. ఆచార్య కృపలానీగారు ఇంకా ఇప్పటికీ ప్రతిపక్ష స్థానంలో ఉండి, ఉత్సాహంతో తన ప్రయత్నాలను కొనసాగిస్తూనే ఉన్నారు. ఆమె మరణించబోయే ముందురోజు వరకూ కూడా ఎలాంటి విభేదాలు లేకుండా ఆయన ప్రయత్నాలను ఆనందంతో చూస్తూనే ఉంది. శ్రీమతి సుచేత సాంఘిక సేవలో నిజాయితీతోనూ, సామర్థ్యంతోనూ గౌరవప్రదమైన కృషిని కొనసాగించారు. రాజకీయాలలో నైతికంగా విలువైన ఆచారం నెలకొల్పి సామర్థ్యంతో ప్రవర్తించారు. ధర్మపత్నిగా ఆత్మ గౌరవాన్ని విడనాడకుండా విశ్వాసపూరితమైన ప్రేమతో అభ్యుదయకరమైన మార్గంలో నడిచి ఆదర్శవంతురాలిగా నిరూపించు కొన్నారు.

46

శ్రీ జి.కె.సుందరం

శ్రీ జి.కె.సుందరంగారు నేటి సమాజంలో మనకు లభించని ఓ మంచి మనిషి. ఆయన 1914 సంవత్సరంలో పీలమేడులో జన్మించారు. సంపన్నులయిన వారు తమ కదనంగా ఉన్న సంపదను ప్రజాహిత కార్యక్రమాలకు వినియోగించాలనే గాంధీగారి మాటలకు ఆయన ఆదర్శంగా నిలచి తనకున్న దానిలో ఎక్కువ భాగాన్ని సమాజ ప్రయోజనాలకోసం వినియోగించారు. నేను ఆయన గ్రంధాలయంలో బిర్లాగారి "ఇన్ ది షాడో ఆఫ్ మహాత్మా" నా గ్రంథం "బాపూ బ్లెస్సెస్" రాజాజీగారి "సత్య-మేవ-జయతే" అనే మూడు సంపుటాల గ్రంథాలను రామాయణ మహాభారతాలను నెహ్రూగారి జీవితచరిత్రను చూశాను. ఆయన ఒక పారిశ్రామిక వేత్తగా లాభాలకోసం మాత్రమే శ్రమించక ప్రజాసేవను కూడా దృష్టిలో పెట్టుకొని పనిచేశారు. ఆయన కార్మికుడుగా, మేనేజరుగా, నిపుణుడుగా అన్ని బాధ్యతలను తనపైన వేసుకొని అధికోత్పత్తిని సాధించేందుకు కార్మికుల సంక్షేమం కోసం జాతీయాదాయాన్ని పెంచేందుకు కష్టించి పనిచేశారు. లక్ష్మీమిల్స్, దానికి అనుబంధ సంస్థలు ప్రభుత్వానికి కార్మికులకు యజమానులకు ప్రయోజనకరంగా ఉండే రీతిలో పనిచేస్తూ గొప్ప పేరు సంపాదించుకొన్నాయి.

సుందరం గారు ప్రత్తి ఉత్పత్తికి, మిల్లుల నిర్వహణకు ధర్మసంస్థల యాజమాన్యాలకు పేరుపొందిన రైతాంగ కుటుంబంలో నుంచి పైకివచ్చారు. ఆయన తన సాధారణ విద్యనూ ఉన్నత విద్యాభ్యాసాన్ని ఇంగ్లండు, అమెరికా దేశాలలో కొనసాగించారు. ఆయన యుద్ధానంతరం పశ్చిమ దేశాల్లోనూ, జపాన్ దేశంలోనూ బాగా అభివృద్ధి చెందిన నూతన సాంకేతిక విలువలను అతి శ్రద్ధతో అధ్యయనం చేశారు. భారతదేశం అన్ని రంగాలలో స్వయంసమృద్ధిని సాధించవలసిన అవసరాన్ని ఆయన గుర్తించి కోయంబత్తూరు పరిసరాలలో బట్టల మిల్లుల తయారీ యంత్రాల కోసం నైపుణ్యంతో కూడిన కర్మాగారాన్ని నెలకొల్పారు. తమ జ్ఞాతులైన సోదరులు శ్రీ దామోదరం, శ్రీ రామకృష్ణగార్లుచే నడుపుతున్న పి.యస్.జి. ఛారిటీస్ ఇండస్ట్రియల్ ట్రైనింగ్ సెంటర్ వారి రెండు ఇంజనీరింగ్ కళాశాలల సహకారంతోనూ, జి.డి.నాయుడుగారి సాంకేతిక పాఠశాల సహకారంతోనూ ఆయన కంపె పనిచేస్తూ తనకు కావలసిన సాంకేతిక సిబ్బందిని ఆ సంస్థలనుంచి తీసుకొంటూ ఉండేవారు. శ్రీ సుందరంగారు ఉత్సాహవంతుడైన వ్యవసాయదారుడు, నిర్వహణాదక్షుడు, ప్రజాసేవపట్ల ఆసక్తి ఉన్న మనిషి. యదార్థానికి ఆయన భారతదేశానికి అన్ని విధాలా కావలసిన మనిషి.

స్వయం వృత్తిపట్ల ప్రజాసేవపట్ల ఆయనకున్న విశ్వాసం ద్వారా ఆయన గురించి నేను తెలుసుకొన్నాను. స్వతంత్ర పార్టీలో చేరిన కొద్దిమంది పారిశ్రామిక వేత్తలలో ఆయన ఒకరు. ఆయనకు రాజాజీగారిపట్ల ఉన్న ఆకర్షణ కారణంగా ధర్మకర్తృత్వ సిద్ధాంతంపై ఉన్న విశ్వాసం

కారణంగా నామీద ఉన్న ప్రేమ కారణంగా స్వతంత్రపార్టీలో చేరారు. ఆయన స్నేహాన్ని తమిళనాడు స్వతంత్రపార్టీ నిర్వహణా బాధ్యతను నేను ఆయనతో కలసి పది సంవత్సరాలుగా రుచి చూశాను. పరిశ్రమలలో అలజడి లేకుండా, ముఠాలు లేకుండా, సమ్మెలు లేకుండా ప్రతి ఒక్కరినీ తగురీతిలో ప్రోత్సహిస్తూ ఆయన నిర్వహించినట్లే ఆయన సొంత పరిశ్రమల బాధ్యతతోపాటు పార్టీ బాధ్యతను కూడా పైన వేసుకొని తమ చక్కటి నిర్వహణా సామర్థ్యాన్ని మాకు చూపెట్టారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించని కాంగ్రెస్ శక్తులన్నీ ఏకమై నన్ను ఓడించేందుకు ప్రయత్నం చేస్తున్నప్పుడు 1962 వ సంవత్సరం చిత్తూరు ఉప ఎన్నికలోనూ ఆ తరవాత 1967 ఎన్నికలలోనూ ఆయన నా ఎన్నిక ప్రచారం కోసం సకాలంలో ఎంతో హృదయపూర్వకమైన సహాయాన్నందించి గొప్పగా తోడ్పడ్డారు.

ఆయన ఎం.పి.గా కొనసాగినప్పుడు రాజ్యసభలోన తమ నాయకులైన దయాభాయ్ పటేల్ గారికి బాగా సహాయపడ్డారు. పారిశ్రామిక ఆర్థిక విషయాలకు సంబంధించిన చర్చలలో ఆయన పాల్గొంటూ ప్రభుత్వ దృష్టిని తమవైపు మళ్లించుకోగలిగే వారు. ఎందుకంటే ఆయన ఏది చెప్పినా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని అందుకు సంబంధించిన పూర్తి సమాచారంతో మాత్రమే ముందుకు వచ్చి మాట్లాడతారనే విషయం వారికి తెలుసు గనుక. చర్చలలో ఆయన రాజకీయ సంఘటనలపై అంత మక్కువ చూపెట్టేవారు కాదు. అయితే ప్రభుత్వం ఏవైనా అసహ్యమార్గాలకు పూనుకొన్నప్పుడు ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించకుండా మాత్రం ఉండేవారు కాదు.

ప్రజారంగంలో ఆయన ఉన్నతులుగా ఉంటారు. గానీ రాజకీయ మల్లయుద్ధాలలో మాత్రం వేలు పెట్టరు. తీవ్రంగా రాజకీయ వర్గాలు విభేదాలతో కొనసాగుతున్న ఈ రోజుల్లో కూడా స్థానికంగా ఉండే వేర్వేరు రాజకీయ పార్టీల నాయకులుగానీ కార్యకర్తలు గానీ ఆయనపై దాడిచేయడానికి గానీ నిందించడానికి గానీ ఎప్పుడూ పూనుకోరు.

సుందరంగారు దక్షిణ భారతదేశంలో జౌళి మిల్లుల పరిశ్రమ బాగా దుస్థితికి లోనైనప్పుడు ఆ పరిశ్రమల లోని ప్రముఖులను నూతన యంత్రాలను ప్రవేశపెట్టవలసిందిగాను తమకు వీలైనంత మొత్తాన్ని సేకరించుకొని వాటిని ఆధునీకరణ చేయడం ద్వారా సాంకేతిక సామర్థ్యాన్ని సాధించవలసిందని కోరి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మిల్లుల నిర్వహణకు కావలసిన సహాయ సహకారాలను సాధించి, ఆయన ఆ దశాబ్ద కాలంలో దక్షిణ భారత బట్టల మిల్లుల పరిశ్రమకు ఎనలేని సేవజేశారు. బట్టల మిల్లులలో పనిచేసే కార్మికులు కూడా ఆ సందర్భంలో తమ ఉద్యోగాలు పోకుండా కాపాడగలిగినందుకు ఆయనకు ఎంతగానో తమ కృతజ్ఞతలు తెలుపుకొన్నారు. భారతదేశంలో ఉన్న ఆరు ప్రముఖ పారిశ్రామిక వర్గాలలో సుందరంగారి లక్ష్మిమిల్స్ కాంప్లెక్స్ ఒకటిగా నిర్వహణా సామర్థ్యానికీ చక్కటి కార్మిక సంబంధాలకూ చట్టబద్ధమైన నిర్వహణకూ ప్రభుత్వంతోనూ, ప్రజలతోనూ, కార్మికులతోనూ గౌరవప్రదమైన సంబంధాలున్న సంస్థగా పేరుపొందింది. పరిశ్రమ, ప్రభుత్వం మధ్య బాగా అవినీతి రాజకీయ

ఆర్థిక లావాదేవీలు నడుస్తున్న ఈ రోజుల్లో సుందరంగారి నైతిక ప్రవర్తన దేశం మొత్తానికే గర్వకారణమైంది.

ఆయన ప్రతి ఉత్పత్తిదారుల సంక్షేమం పట్ల కూడా శ్రద్ధ చూపించారు. ప్రతి ఉత్పత్తి దారులకు గిట్టుబాటుధరలను అందించగలిగినప్పుడే తాము సుఖప్రదంగా జీవించగలరని ఆయన కార్మికులను పరిశ్రమల యజమానులను ఒప్పించగలిగాడు. ఆవిధంగా ఆయన కాటన్ కార్పొరేషన్ బోర్డులో మాతో సహసభ్యులుగా ఉండి దాని అధ్యక్షులైన ఐ.ఎన్.టి.యు.సి. కార్మిక నాయకుడు శ్రీ రామానుజం గారితోనూ నాతోనూ సహకరిస్తూ ప్రతి ఉత్పత్తి దారులకు గిట్టుబాటుధరలు అందజేయాలనీ ప్రతి పరిశ్రమ అభివృద్ధికీ సరయిన మార్కెట్ విధానానికీ అవసరమైన సహకార మార్కెటింగ్ ఉండాలనీ ఆయన మాతో కలసి కృషిచేశారు.

14-9-1974 న కోయంబత్తూరులో జరిగిన ఆయన షష్ట్యబ్ది పూర్తి వేడుకలోను ఆనాటి పూజాసాంప్రతి కార్యక్రమాలలోనూ నేనెంతో సంతోషంతో పాల్గొన్నాను.

47

శ్రీ పురుషోత్తమ దాస్ టాండన్

శ్రీ పురుషోత్తమ దాస్ టాండన్‌గారు 1882 సంవత్సరంలో జన్మించారు. భారత రాష్ట్రపతి చేతిమీదుగా 'భారతరత్న' బిరుదు పొందిన కొద్దిమందిలో ఆయన ఒకరు. గంగానదీ ప్రాంతంలోని దేశభక్తులు ఆయనను రాజర్షిగా కీర్తిస్తూ ఉంటారు. ప్రముఖ దేశభక్తులు లాలా లజపతిరాయ్‌గారు ప్రారంభించిన సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీకి ఆయన అధ్యక్షులు. వీరికి ముందు లజపతిరాయ్‌గారే దానికి అధ్యక్షులుగా ఉన్నారు. అలహాబాదు వారైన టాండన్‌లు సప్రూలు కుంజ్రూలు, కట్జూలు, నెహ్రూల మధ్య ఆయా కుటుంబాలలో ప్రజాసేవలో నిరంతరం పోటీ కొనసాగుతూ ఉండేది. నెహ్రూలు, మోతీలాల్ జవహర్లాల్‌గార్లు ఇతరులందరినీ కాంగ్రెస్ రాజకీయాలనుంచి బయటికి పంపగలిగారు గానీ టాండన్‌గారు మాత్రం వారికి తీసిపోకుండా సమాన స్థాయిలో వస్తూ రెండుసార్లు అఖిలభారత కాంగ్రెస్ అధ్యక్షస్థానానికి పోటీ పడగలిగారు. మొదటి మారు ఆయనను జవహర్లాల్ గారి తోడ్పాటుతో డాక్టరు పట్టాభిగారు ఓడించారు. రెండోమారు నెహ్రూగారు సమర్థించగా తాను కృపలానీపై విజయం సాధించారు. అప్పుడు టాండన్‌గారు అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులుగా జాతీయ రాజకీయ రంగం మీద నెహ్రూగారికి సమానమైన హోదాను పొందారు. అనుకోకుండా కాంగ్రెస్ కార్యదర్శులను తొలగించకపోతే తాను దానితో సహకరించనని ప్రకటించి నెహ్రూగారు కాంగ్రెస్ కార్యవర్గ సభ్యత్వానికి రాజీనామా ఇవ్వగలనని ప్రకటించటంతో టాండన్‌గారు దానికి తలవంచక తానే కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామాచేసి కాంగ్రెస్ అధ్యక్షుడిపై ప్రధానమంత్రి జవహర్లాల్ అధికృతకు అడ్డులేకుండా చేసి ఆయన గొప్పతనానికి బాటవేశారు. అప్పటినుంచి కాంగ్రెస్ అధ్యక్షపదవి ప్రధానమంత్రి తరవాత రెండో స్థానంలోకి దిగజారి పోయింది. దీనిపైన ఏవైనా కొద్దిపాటి సందేహాలుంటే వాటినికూడా 1970 సంవత్సరంలో శ్రీమతి ఇందిరాగాంధీ తన అఖండ విజయం ద్వారా తుడిచిపెట్టింది.

టాండన్ గారికి 'భారతరత్న' బిరుదు ఇచ్చే సందర్భంలో సెంట్రల్ హాలులోని పార్లమెంటు సభ్యుల సమావేశానికి ఆయనను ఆహ్వానించినప్పుడు, నెహ్రూగారు వ్యక్తిగతంగా టాండన్ గారికి జాతీయస్థాయిలో తన పూర్తి మర్యాదలను ప్రకటించుకొన్నారు.

టాండన్ గారికి హిందీ భాషాభిమానం ఎక్కువ. దానిని జాతీయ భాషగా చేయడానికి ఆయన ప్రధాన పాత్ర వహించారు. గాంధీగారి హిందీ ఉర్దూ భాషల సమ్మిళితమైన హిందూస్తానీని జాతీయ భాష చేయాలనే కోర్కెను ఆయన అంగీకరించక సంస్కృతానికి తత్సంబంధమైన భాషలకు దగ్గరగా ఉండే హిందీని జాతీయ భాషగా చేయాలని ఆయన ఉద్యమాన్ని నిర్వహించారు. ఈ ప్రయత్నం ద్వారా ఆయన జాతీయ స్థాయి రాజకీయాలలో ప్రముఖులుగా ముందుకొచ్చారు. 1936 సంవత్సరంలో కాంగ్రెస్ సంస్థ యు.పి.లో ప్రభుత్వాన్ని చేపట్టే తరుణం వచ్చినప్పుడు,

టాండన్ గారు సర్వెంట్స్ ఆఫ్ పీపుల్స్ సొసైటీకి అధ్యక్షులుగా ఆయనకున్న అనుభవం కారణంగాను, పీపుల్స్ సొసైటీకి చెందిన అనేక మంది పంజాబ్ లోనూ, యు.పి.లోనూ, బీహార్ లోనూ, మధ్యప్రదేశ్ లోనూ ప్రముఖ రాజకీయ స్థానాల్లో ఉన్న కారణంగాను, రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి ముఖ్యమైన అభ్యర్థిగా నిలిచారు. అయితే గాంధీ నెహ్రూలు ఆ స్థానానికి గోవింద వల్లభ పంత్ ని సూచించి, టాండన్ గారిని మంత్రివర్గంలో రెండో స్థానాన్ని చేపట్టవలసిందని కూడా చెప్పక స్పీకరు స్థానాన్ని చేపట్టవలసిందని కోరారు. రాజకీయాలలో ప్రధానపాత్ర నిర్వహించేందుకు తనకు స్వేచ్ఛనిస్తే స్పీకరు పదవిని అంగీకరించగలనని ఆయన చెప్పారు. అఖిల భారత కాంగ్రెస్ సంఘం, టాండన్ గారి షరతును అంగీకరించింది. భారతదేశం మొత్తంలోనే ఇలాంటి అవకాశం లభించిన ఏకైక స్పీకరు ఆయన. జాతీయస్థాయిలో ఆయనకున్న గుర్తింపు అంత గొప్పది. ఆ తరవాత ఆయనకు తిరిగి జాతీయస్థాయిలోకి ఎదిగి కాంగ్రెస్ నాయకత్వాన్ని చేపట్టేందుకు 14 సంవత్సరాల సమయం పట్టింది.

1934 సంవత్సరంలో తేలిక ఖద్దరు బట్టలతో కోలముఖం మీద చక్కటి గడ్డంతో ఆయన చూడటానికి బాగా ఆకర్షణీయంగా ఉండేవారు. పొడవైన ఆయన ముక్కు చెక్కిళ్లకు అందాన్నిస్తుండేది. ఆయన వేదికపై ఉన్నప్పుడు చక్కగా మాట్లాడుతూ ప్రజలను ఆకర్షించగలిగేవారు. ఆయన పెద్దవారైపోయేకొద్దీ వాగ్ధోరణి కొంత తగ్గింది గానీ ఆయన చూపులు చిరునవ్వు ఒక ప్రత్యేక ఆకర్షణగా ప్రజలను ఆకట్టుకొంటుండేది. ఆయనలోని ప్రతి అంగుళం ఒక రాజకీయ మహర్షిగా కనిపిస్తూ ఉంటుంది. ఆయన తన శత్రువుల, స్నేహితులపట్ల నిజానికి ఒకేలాగా ప్రవర్తిస్తుంటారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఆయన ఓ ప్రత్యేకమైన గౌరవాన్ని సాధించిపెట్టారు.

ప్రధానమైన హిందీ సాహిత్య పరిషత్తుకు టాండన్ గారు అధ్యక్షులుగా పనిచేశారు. దీర్ఘకాలం జాతీయ భాషపై వివాదం కొనసాగిన తరవాత రాజ్యాంగసభచేత హిందీని ఆమోదింపజేయడానికి ఆయన ప్రధాన కారకులు. ప్రముఖ హిందీనాటక రచయిత స్వాతంత్ర్య సమరయోధుడైన సేత్ గోవిందదాసు ఆయనకు ఈ విషయంలో బాగా సహకరించారు. అయితే ఈ విజయం సత్ఫలితాల నిచ్చిందని నేను చెప్పలేదు. ఎందుకంటె తమ తమ భాషలపై ప్రధాన జాతీయ భాషగా హిందీని ప్రవేశ పెట్టడాన్ని వ్యతిరేకిస్తూ దక్షిణ భారత దేశంలోనూ, పశ్చిమ బెంగాల్ లోనూ, ప్రజలు ఎక్కువగా తిరుగుబాటు చేశారు. టాండన్ గారు హిందీ భాషను అభివృద్ధి చేసి దాన్ని విస్తృతంగా ప్రచారం చేయడానికి చాలాకాలం పడుతుందనే సంగతి అప్పుడు గ్రహించగలిగారు. ఆయనకు రైతులపై చాలా అధికమైన ప్రేమ. ఆయన 1923 సంవత్సరంలో యు.పి. రాష్ట్రంలో కాంగ్రెస్ సందేశాన్ని గ్రామీణ ప్రాంతాలలో వ్యాప్తిచేసేందుకూ ఆ రాష్ట్రంలో కౌళ్ల తగ్గింపు, కౌళ్ల శాశ్వత కాలనిర్ణయం వంటి విషయాలపై పోరాడేందుకూ కర్షక సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఆయన అఖిల భారత కిసాన్ కాంగ్రెస్‌ను ఏర్పాటుచేసేందుకు నేను చేస్తున్న ప్రయత్నాలను అభినందించి కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని ఆశీర్వదించారు.

క్యాబినెట్ మంత్రుల స్థాయిలో కూడా అవినీతి విస్తరిస్తున్నందుకు ఆయన ఆశ్చర్యపడ్డారు.

పార్లమెంటులోనూ పత్రికలలోనూ అధికార దుర్వినియోగం అవినీతి గురించి వినిపిస్తున్న విషయాలపై నిష్పక్షపాతమైన విచారణకు పూనుకోవలసిందని పార్లమెంటులోనూ, కాంగ్రెస్ కార్యవర్గంలోనూ మేము చేస్తున్న వాదనలను ఆయన అభిమానించారు. కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆయన మంత్రులపై విచారించేందుకు జంకుతున్న నెహ్రూగారిని దానికి ఒప్పించి అట్లాంటి విచారణ జరపవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అయితే ఆ తరవాత ప్రధానమంత్రికి అప్పగించిన ఆ బాధ్యతను అమలుచేసేందుకు సర్దార్ ప్రతాప్ సింగ్ కైరాన్ విషయంలో స్వతంత్ర న్యాయసంఘాన్ని దాస్ కమిషన్ రూపంలో ఏర్పాటుచేయడానికి దాదాపు 10 సంవత్సరాల కాలం పట్టింది.

రైతులు, కాందిశీకులు, అవినీతి వ్యతిరేక ఉద్యమం వంటి విషయాలలో, మంత్రివర్గాన్ని, కాంగ్రెస్ సంస్థను ప్రశ్నించడంలో, నేను ఆయనకు బాగా దగ్గరగా ఉన్నాను. అందువల్ల టాండన్ గారితో నాకు మంచి సంబంధాలేర్పడ్డాయి.

పశ్చిమ పాకిస్తాన్ నుంచి వచ్చిన కాందిశీకులకు భారత ప్రభుత్వం వారు అక్కడ వారు నష్టపోయిన ఆస్తులకు ఎలాంటి పరిహారాన్ని ఇవ్వలేమని ప్రకటించి పునరావాసం కోసం చిన్న చిన్న మొత్తాలను నెలసరి భత్యాలను మాత్రమే ఇవ్వడానికి నిర్ణయించుకొన్నప్పుడు వారి బాధలను చూసి ఆయన హృదయం ముక్కలైంది. ఆయన కాంగ్రెస్ అధ్యక్షులుగా తగు పరిహారాన్ని ఇవ్వవలసిందన్న మా కోర్కెలను బలపరుస్తూ నెహ్రూగారిని కాందిశీకుల ఆస్తులకు పరిహారం ఇచ్చే విషయంలో పాకిస్తాన్ ఎలా వ్యవహరించినప్పటికీ మనదేశం ఈ భారాన్ని కూడా భరించి వారికి సహాయం చేయవలసిందేనని ఆయన ఒప్పించారు. ఈనాడు పంజాబ్ లో ఆనాటి శరణార్థులు బాగా అభివృద్ధి చెందడానికి అప్పుడు టాండన్ గారు చేసిన కృషే ప్రధాన కారణం.

ఆయన కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్నప్పుడు అఖిల భారత కాంగ్రెస్ కార్యదర్శిగా ఉన్న కళా వెంకట్రావుగారి అమర్యాద పూర్వకమైన గాంధేయ వ్యతిరేకమైన పద్ధతుల కారణంగానూ మా మెజారిటీని మైనారిటీగా మార్చిన ఆంధ్రమంత్రుల చర్యకు విరసనగానూ, నేనూ ప్రకాశం గారూ కాంగ్రెస్ సంస్థనుంచి రాజీనామా చేశాము. ఆయన నా పరిస్థితులను, నా విరసనలను సానుభూతిలో అర్థంచేసుకోగలిగి నప్పటికీ, కాంగ్రెస్ సంస్థ పనితీరులో, ఆనాడు తాము ఏరకంగానూ జోక్యం చేసుకోలేక నిస్సహాయులై, మా విషయంలో తన సంతృప్తిని మాత్రం ప్రకటించారు. నా రాజీనామాను ఆయన అంగీకరించక కాంగ్రెస్ కార్యవర్గంలో నా సభ్యత్వాన్ని ఏప్రిల్ నుంచి అక్టోబరు దాకా అంటే ఆయన కాంగ్రెస్ అధ్యక్షపదవికి రాజీనామా చేసేదాకా అలానే అట్టేపెట్టి ఉంచారు. మిత్రులపట్ల ఆయన ప్రేమ అంతటి ఉదాత్తమైనది. మోహన్ లాల్ గౌతమ్ కీర్తిశేషులైన శ్రీ లాల్ బహదూర్ శాస్త్రి గారివంటి ప్రముఖులు మిత్రులు గావడం ఆయన అదృష్టం. ఉత్తరప్రదేశ్ లో పంత్ గారి మంత్రివర్గంలో హోంశాఖ మంత్రిగా శాస్త్రిగారిని నియమించినప్పుడు ఆ తరవాత నెహ్రూగారి మంత్రివర్గంలో సమర్థులైన మంత్రిగా పనిచేస్తున్నప్పుడు చూసి ఆయన చాలా సంతోషించారు. ఆయన గాంధేయ మార్గంలో నిజాయితీగా ఆర్థిక బలహీనతలు లేకుండా అతి సామాన్యుడుగా జీవిస్తుండేవారు. ఆయన ఉన్నత రాజకీయ

విలువలను కాపాడగలిగారు. కాంగ్రెస్ దుర్గంలోకి గాంధేయ సంప్రదాయాలను ప్రవేశపెట్టారు.

1960 సంవత్సరంలో ఆయన అస్వస్థులై ఉన్నప్పుడు అంహోబాదులో రాజాజీగారూ నేనూ ఆయనను చూశాము. తన ఆరోగ్యం తిరిగి కుదుట పడదని ఆయనకు బాగా తెలిసినప్పటికీ చిరునవ్వులు చిందిస్తూ హుషారుగా రాజాజీగారితో కలసి గత స్మృతులను నెమరు వేసుకొంటూ నెహ్రూగారికి సంబంధించిన ఎన్నో రాజకీయ సరసోక్తులను వివరిస్తూ గడిపారు. రైతాంగ ఆర్థిక వ్యవస్థ కోసం స్వయం వృత్తులతో జీవించే వారికోసం వారి అభ్యున్నతి కోసం పోరాడుతున్నందుకు మమ్మల్ని ఆయన అభినందించారు. ఆఖరి క్షణం వరకు ఆయన తన జీవితాన్ని ఒక గాంధేయ సోషలిస్టుగా గడిపారు.

48

స్వరాజ్య వాదులు
జలియన్ వాలాబాగ్ మృతవీరులకు శ్రద్ధాంజలి

మైకేల్ ఓ డయ్యర్, జనరల్ డయ్యర్‌లు, తమ నీచపు తలంపుతో భారతదేశంలో సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాటాన్ని తుడిచిపెట్టాలనుకొన్నారు. భారతదేశ భక్తులను భయకంపితులను చేయాలని జలియన్ వాలాబాగ్‌లో, 13 ఏప్రియల్ 1919 న భయంకరమైన మారణహోమాన్ని జరిపించారు.

ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలలో అభేద్యంగా కొనసాగుతున్న తెల్లదొరతనానికి, మానవత్వాన్ని మరచిపోయి చేసిన ఈ మూర్ఖపు చర్య, తమకు తాము కొట్టుకొన్న తొలిగండి అయ్యింది.

1919 సంవత్సరం ఏప్రిల్ నెల 13వ తారీఖున జనరల్ డయ్యర్, జలియన్ వాలాబాగ్‌లో, చుట్టూ గోడలు, ఇండ్ల మధ్య ఉన్న ఒక బహిరంగ స్థలంలో, వెళ్లేందుకు ఒకేదారి ఉన్నచోట, ప్రశాంతంగా శాంతియుతంగా జరుగుతున్న సమావేశ సందర్భంలో, అమృతసర్‌లో ఎలాంటి సభలూ జరపరాదని వారు 12వ తేదీన చేసిన ప్రకటన సాకుగా కనిపించిన వారినెల్లా కాల్చివేయవలసిందనే ఆజ్ఞ జారీచేశారు. హంటర్ కమిషన్ ముందు సాక్ష్యమిస్తూ జనరల్ ఇట్లా చెప్పారు. "నేను కాల్చాను, గుంపు కనుమరుగయ్యేంత వరకు కాలుస్తూనే ఉన్నాను." గుంపును చెదరగొట్టటమనేది మాత్రమే ప్రధాన సమస్యకాదు. సైనిక కోణంలో నుంచి తిలకిస్తే అక్కడ పోజరైన వారిమీద మాత్రమే కాకుండా మొత్తం పంజాబు ప్రాంతమందంతటా అతను ఇలాంటి చర్యలకు తలపడ్డాడు. అనేక వేలమందిని హత్య చేశారు. ఈ దారుణకాండలో మరెందరో అంగవికలురయ్యారు. ఈ కటికతనం ఆ తరవాత నాజీల దుష్కృత్యాలకు మార్గదర్శకమైంది. సర్ మైకేల్ ఓ డయ్యర్, జనరల్ డయ్యర్, వైస్రాయి చైల్మ్స్‌ఫోర్డు గారలు ఇలాంటి భయంకరమైన నరమేధం ద్వారా రక్తపాతం ద్వారా భారత స్వాతంత్ర్య పోరాటాన్ని తుడిచిపెట్ట గలమని భావించారు.

ఇది సామ్రాజ్యవాదానికి చెందిన గుడ్డిచూపు మాత్రమేనని చరిత్ర రుజువు చేసిందాకా వారు ఎదురుచూడలేదు. భారత దేశమంతా రోషావేశాలతో పొంగి పారలింది. విశ్వ విఖ్యాత కవి, నోబుల్ బహుమతి గ్రహీత రవీంద్రనాథ్ టాగోర్ భారతదేశానికి వ్యతిరేకంగా నిరంకుశంగాను, అధికార దుర్మదంతోను చేసిన ఈ దుష్కృత్యానికి నిరసనగా బ్రిటీషువారు ఆయన కిచ్చిన బిరుదును తిరస్కరించి తిప్పికొట్టారు. మహాత్మాగాంధీగారు కూడా బ్రిటీష్ రాజరికం తన కొసంగిన అత్యంత విలువైన "కైజర్-ఎ-హింద్" మెడల్‌ను వెంటనే వదలుకొన్నారు. స్వామీ శ్రద్ధానంద మిగిలిన బాధితుల సహాయంకోసం ఇచ్చే నిధులను అసహ్యంతో తిప్పికొట్టారు.

గాంధీజీ "జలియన్ వాలాబాగ్ స్మారక నిధి" ని స్థాపించి భారత జాతీయతత్వం అగ్నిశిఖలను విరజిమ్ముతుందని ఆది భూకంపాలను సృష్టించగలదని నిరూపించారు.

బ్రిటన్, వారి మిత్రపక్షాలు మొదటి ప్రపంచ యుద్ధపు విజయోత్సవాలు జరుపుకొంటున్నపుడు, భారతీయులు, దేశాభిమానులైన నాయకులు బాపూజీ చెప్పినట్లుగా, భారతదేశంలో బ్రిటీషువారి నరమేధానికి నిరసనగా ఆ సందర్భంలో ఉపవాసదీక్షను ప్రారంభించారు. అంతకు మూడు సంవత్సరాలకు ముందుగా పంజాబ్ కేసరి లాలా లజపతిరాయ్‌గారు అన్నమాటలు యదార్థాలని చరిత్ర రుజువు చేసింది. భారత జాతీయోద్యమం "జైళ్లు, మరణశిక్షలు, వత్తిళ్ల కారణంగా ఇంకా పెరుగుతుందే కాని మరొకలా జరగదు." (యంగ్ ఇండియా. పేజి 192) గాంధీజీ, లోకమాన్య తిలక్, సి.ఆర్.దాస్, మోతీలాల్ నెహ్రూగార్లు మౌంట్‌ఫర్ట్ సంస్కరణల ద్వారా ఒనగూడిన అవకాశాల పరంగా శాసన సభలలో ప్రవేశించేందుకు దేశం సిద్ధంగా ఉన్న ఆ తరుణంలో జరిగిన ఈ ఘోరహత్యాకాండ, క్రూరమైన రౌలట్ చట్టాన్ని ప్రవేశపెట్టడంచూసి దిగ్భ్రాంతి చెందారు. వారు శాసనసభలను బహిష్కరించటమేగాక, ఈ సైతాన్ ప్రభుత్వంతో ఏరకంగా కలసి పనిచేయరాదని సహాయ నిరాకరణోద్యమాన్ని ప్రారంభించారు.

భారత యువకులు సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెసు చేపట్టిన ఈ చర్యలతో సంతృప్తి చెందక ఇంకా సత్తాగల చర్యలకు పూనుకోవాలనే నిర్ణయానికొచ్చారు. ఆ దుశ్చర్యకు కారకులైన వారిపై వ్యక్తిగతంగా పగతీర్చుకోవాలనే నిర్ణయానికి చాలామంది వచ్చారు. ఒక భారత యోధుడు వీరు సర్దార్ ఉద్ధంసింగ్, ఆ నరహంతకచర్య జరిగిన పంజాబు ప్రాంతం నుంచే వచ్చిన దేశాభిమాని, ఇందులో విజయాన్ని సాధించాడు. కొన్ని సంవత్సరాల కాలం నిరీక్షించి మైకేల్ ఓ డయ్యర్ లండన్‌లోని కాక్‌స్టన్ హాలునుంచి బయటికి వస్తున్న సందర్భంలో కాల్చివేశాడు. భారత యువరక్తం శౌర్యప్రతాపాలను ఆయన ఆరకంగా ప్రదర్శించి చూపెట్టాడు. స్వతంత్ర భారతదేశం సంప్రదింపులు జరిపి ఆయన అస్థికలను భారత భూభాగంలోకి తీసుకొచ్చి ఆయనను గౌరవించింది. జలియన్ వాలాబాగ్ మృతవీరులను, వారికి సరయిన వారసుడైన యోధుడు, దేశభక్తపరుడు ఉద్ధంసింగ్ గారిని మనం అభినందిద్దాం.

సామ్రాజ్యవాద శక్తుల అణచివేత కార్యకలాపాలను, తుపాకులను ఎదిరించేందుకు కాంగ్రెసును ఇంకా శక్తివంతమైన కార్యకలాపాలవైపు మళ్లించాలనే దేశభక్తుల ఉత్సాహాన్నుసరించి దానిలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చారు. మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ చర్యల ద్వారా, దేశమంతటా సత్యాగ్రహ పోరాటాలు నిర్వహించడం ద్వారా, నిర్మాణాత్మకమైన కార్యకలాపాలు చేపట్టి సంపూర్ణ స్వరాజ్య పోరాటం వైపు దేశాన్ని ముందుకు నడిపించారు. ఆవిధంగా కాంగ్రెసుకు తిరిగి జీవశక్తిని ప్రసాదించారు.

రెండో ప్రపంచయుద్ధం మన "క్విట్ ఇండియా" ఉద్యమం ప్రారంభం కావడానికి దారిచూపింది. ఆ విధంగానే "క్విట్ ఆసియా, ఆఫ్రికా" నినాదాలనూ పోరాటాలనూ ప్రారంభించడమైంది. జలియన్ వాలాబాగ్ సామ్రాజ్యవాదం ప్రదర్శించిన దమననీతికి, వారు

కన్నకలలకు ప్రపంచం మొత్తంమీద ప్రజా వ్యతిరేక వెల్లువ ఈ రూపంలో ప్రారంభమై సామ్రాజ్య వాదాన్ని తుడిచిపెట్టేందుకు పూనుకొంది.

నా పుస్తకం "కలోనియల్ అండ్ కంర్ట్ పీపుల్ ఫ్రీడమ్ స్రంచ్" 1946 లో సమీక్షించబడింది. ఆ తరవాత 1946-47 లో ఢిల్లీలో మొదటి ఆసియా మహాసభ జరిగినప్పుడు "ఫాన్ ఆఫ్రికా" జర్నల్ లో దాన్ని తిరిగి ప్రచురించడం జరిగింది. అప్పటికింకా కొంతమంది సోషలిస్టు నాయకులు కూడా ఆఫ్రికా - ఆసియా దేశాలు స్వాతంత్ర్యాన్ని పొందేందుకు సిద్ధంగా ఉన్నాయా అని ఆశ్చర్యపోతూ, వీరంతా జాగ్రత మయ్యేటప్పటికి కొన్ని తరాల కాలం పట్టవచ్చునని భావిస్తున్న రోజులవి. అయితే నా గ్రంథాన్ని అప్పటి పరిస్థితులను చూసి సామ్రాజ్యవాదపు కుళ్లుకంపులో పడి దొర్లుతున్న యూరోపియన్లు ఒక్కసారిగా గుండెలు బాదుకొన్నారు.

నేను అమృతసర్ వెళ్లిన ప్రతిసారీ, 13 ఏప్రియల్ న జలియన్ వాలాబాగ్ లో మృతవీరులైన భారతీయ యోధులను స్మరించి శ్రద్ధాంజలి ఘటించి వస్తూ ఉండేవాడిని. జలియన్ వాలాబాగ్ లో విషాదాంత సంఘటన ఫలితం సామ్రాజ్యవాదాన్ని భారతదేశం నుంచేకాకుండా, ఆసియా ఖండంనుంచి, ఆఫ్రికా ఖండంనుంచి, లాటిన్ అమెరికా దేశాలనుంచి కూడా 1960 నాటికి తుడిచిపెట్టగలిగింది. దీని ఫలితంగా నూతనంగా స్వాతంత్ర్యం పొందిన దేశాలు మిత్రరాజ్య సమితిలో జేరి అక్కడ మెజారిటీని సంపాదించుకో గలిగాయి.

అండమాన్ ద్వీపాలలోని సెల్లులర్ జైలు

1970వ సంవత్సరంలో పార్లమెంటరీ కమిటీ లోని ఇతర సభ్యులతోపాటు నేను అండమాన్‌కు వెళ్లినప్పుడు అక్కడ సెల్లులర్ జైలులోని ప్రదర్శనను నేను చూశాను. మన స్వాతంత్ర్య పోరాట సమయంలో అక్కడ జైలులో ఉన్న దేశభక్తుల పేర్లతో ఉన్న పటాలను మాకు అక్కడ చూపించారు.

ఇండోనేషియా, మలేషియా దేశాలకన్నా భారత దేశానికి దూరంగా బంగాళా ఖాతం మధ్యలో విసిరేసినట్లుగా ఉన్న, ఆ ద్వీపాలలో భారత విప్లవ కారుల హృదయాల్లో భీభత్సాన్ని సృష్టించేందుకు బ్రిటిష్ పాలకులు వందలకొద్దీ మన దేశభక్తులను అక్కడి భయంకరమైన జైళ్లలో పడవేశారు. మరొక రకంగా తీవ్రవాదులైన విప్లవ కారులను భయకంపితులను చేసి, వారిచేత తీవ్రవాద కార్యకలాపాలను మాన్పించేందుకు కూడా బ్రిటిష్‌వారు ఈ పనికి తలపడ్డారు.

ఈ శతాబ్దంలోని ఆ మొదటి నాలుగు దశాబ్దాల కాలంలో స్వాతంత్ర్య సాధనకు సత్యాగ్రహమా సమరమా, ఏది దగ్గర దారి అని మా అందరి మధ్య చాలా తీవ్రంగా చర్చలు జరుగుతూ ఉండేవి. అలాగే 1960-70 సంవత్సరాల మధ్యకాలంలో గాంధేయ సోషలిస్టులు, సోవియట్ అనుకూల కమ్యూనిస్టు వర్గాల మధ్య, సామ్యవాద సమాజం ప్రజాస్వామ్య రీతుల్లో సిద్ధిస్తుందా లేదా విప్లవ పోరాటం ద్వారా వస్తుందా అని చర్చలు జరుగుతుండేవి.

భారతజాతి యావత్తూ ఆయనను రక్షించమని ప్రార్థించినప్పటికీ, ఆగకుండా బ్రిటీషువారు ఉరి తీసిన శ్రీ భగత్‌సింగ్ సంస్మరణార్థం 1931 లో కరాచీలో సమావేశం జరిగినప్పుడు ఒక రోజంతా మేము ఈ విషయమై చర్చించాము. ఆ సందర్భంలో నేను గాంధేయ విధానాలకు కట్టుబడి ఉన్నాను. మహోద్రేకంగా ఉన్న ఆ సమావేశంలో యువకులు అనేకమంది నా అభిప్రాయాలను వ్యతిరేకించారు. ఆ సందర్భంలో నేను, జైళ్లను, ప్రభుత్వ ఉత్తర్వులను లక్ష్యపెట్టకుండా మన ప్రజలు దండి సత్యాగ్రహ సందర్భంలో ఎలా ముందుకు వచ్చారో, లక్షలాదిమంది ఎలా సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్నారో ఉదాహరణంగా వారికి చూపించాను. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులో చర్చలు ఎలా వాయిదా పడ్డాయో, గాంధీగారు లేకుండా భారత సమస్యకు పరిష్కారం కనుగొనటం సాధ్యం కాదని బ్రిటీషువారు గ్రహించిన సంగతిని కూడా వారికి వివరించాను. గాంధీ-ఇర్విన్ ఒడంబడిక బ్రిటన్-భారతదేశాల మధ్య సమతౌల్యాన్ని చూపెట్టగలిగిందని చెప్పాను. విప్లవయోధుడు శ్రీ భగత్‌సింగ్‌ను ఉరితీయటం ద్వారా బ్రిటీషువారు గాంధీని, కాంగ్రెస్ పార్టీని చెంపలు పగిలేలా కొట్టారని వారు అంతకంటె తీవ్రస్వరంతో బదులిచ్చారు. సుభాష్ చంద్రబోస్ గాంధీగారితో కలసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నానని భావోద్వేగంతో చెప్పారు. వారు రష్యా విప్లవ రీతులను ఉదహరిస్తే నేను కరాచీ కాంగ్రెస్‌లో అప్పుడు రూపొందించిన సూత్రాలను జ్ఞాపకం చేసి గాంధేయ సోషలిజంపై నాకుగల దృఢ నమ్మకాన్ని ప్రకటించాను. మామధ్య వీర్పడిన ఈ విభాగాలు ఆ తరవాత మన ప్రజలను భూస్వాముల, పెట్టుబడిదారుల నుంచి విముక్తి గావించడంలో తీసుకోవలసిన చర్యలలో కూడా ప్రవరించాయి.

వారి విశ్వాసం

ఆ తరవాత నెల్లూరు జైలులో ప్రముఖ బెంగాలీ విప్లవకారులు, శ్రీ ప్రతుల్ గంగూలీ, శ్రీ చక్రవర్తి ఇద్దరూ అప్పుడు అక్కడ నిర్బంధితులుగా ఉన్నారు. నేను రాజకీయ ఖైదీగా ఉన్నాను. అక్కడ నేను వారిని కలుసుకొన్నప్పుడు గాంధీగారి అహింసాయుత పోరాటం ప్రజలను చైతన్యవంతులను చేయగలదని దానిని ఉగ్రవాదం సాధించలేదని వారంగీకరించారు. అయితే భారత దేశానికి స్వాతంత్ర్యం మాత్రం ఇలాంటి వాటివల్ల సంపాదించలేమని, బెంగాల్‌లోని అనుశీలనకులు, జుగంతర్లు వంటి సంస్థలు, శ్రీ భగత్‌సింగ్, శ్రీ జతిన్‌దాస్, శ్రీ సావర్కర్, శ్రీ భాయీ పరమానందవంటి విప్లవకారుల ద్వారా మాత్రమే అది రాగలదనే గట్టి నమ్మకంతో వారున్నారు. నా వాదంతో వారికి గాని, వారి వాదంతో నాకుగాని అంగీకారం కుదరలేదు. అయితే వారి దృఢమైన విశ్వాసాలను చూసి నేను చలించాను. నిరంతరాయంగా దశాబ్దాల తరబడి వారు తమ ప్రాణాలను త్యాగంచేస్తూ, ప్రతి సంవత్సరం, ప్రతి క్షణం, జైళ్లలో గడుపుతూనో లేదా రహస్య జీవనం గడుపుతూనో, భారతమాత సేవలకు అంకితమై కొనసాగించిన పోరాటానికి నేను ముగ్ధుడనై పోయాను. వారు, వారితోపాటున్న ఇతరులు కూడా వారి కార్యక్రమాలకు బాపూజీ కార్యక్రమాలకు లభించినంతగా ప్రజాదరణ లభించక పోయినప్పటికీ వారు విచారించలేదు. అసూయపడలేదు. వారు భరతమాత దాస్యశృంఖలాలను విడగొట్టడంకోసం ఒకరి వెంట ఒకరు విలువ కట్టలేని మహోన్నత త్యాగాలను గట్టి విశ్వాసంతో చేస్తూ వచ్చారు. అది వారి విశ్వాసం.

అనుసరించిన మార్గం. శ్రీ వీర సావర్కార్, మరి ఇతరులు, లజపతిరాయ్‌గారూ, శ్రీ మాండలే, శ్రీ తిలక్, శ్రీ సుభాష్ చంద్రబోస్, సీతారామరాజు మన్యం తిరుగుబాటులో నాయకులైన కోయదొరలు మల్లుదొర, మోపేలాల్ వంటి కైదీలకు అండమాన్ యాత్రాస్థలమైంది. స్వాతంత్ర్యం సంపాదించుకొన్న తరవాత కృతజ్ఞతతో భారతదేశం మరచిపోలేని ఆ యోధుల చిత్రపటాలను అక్కడ పెట్టింది.

లజపతిరాయ్ 1916 లో అమెరికా నుంచి ప్రచురించబడిన "యంగ్ ఇండియా" లో ఇలా రాశారు. ఎక్కువమంది బెంగాలీ జాతీయ వాదులు "దేశభక్తులైనవారు తమ దేశభక్తిని ఒక మత విశ్వాసం లాగా ఎంచుకొన్నారు. తాము జీవించియున్న ప్రతి క్షణాన్ని వారు అందుకోసం వినియోగిస్తూ, ఏమి చెయ్యడానికైనా, ఎలాంటి కష్టాలను భరించడానికైనా వెనుకాడకుండా వారు తమ బాధ్యతలను కొనసాగిస్తూ ఉండేవారు.

వారు జీవితాన్ని గురించి ఇలా తలపోసేవారు "జీవితానికి అర్థం- గౌరవంతో మర్యాదతో కూడిన జీవనం - అభివృద్ధికి ఆదాయానికి అనువైన జీవితం - అభ్యుదయాన్ని పురోభివృద్ధిని కల్పించే జీవనం - అదే రాజకీయ స్వాతంత్ర్యం." అన్ని ప్రణాళికల లక్ష్యం సామాజిక సంస్కరణంవైపు, స్వయం అభివృద్ధివైపు, అంతేకాని పరస్పర విభేదాలను రేకెత్తించే వ్యాపార ప్రయోజనాలవైపు కాకూడదు. అందుకే అన్నింటా మన మొదటి లక్ష్యం విదేశీయులను వెళ్లగొట్టడం.

మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతున్నప్పుడు కూడా లజపతిరాయ్‌గారు దేశభక్తితో ధైర్యంగా ఇలా వ్యాఖ్యానించారు. తాను ఇంతవరకు అన్ని వర్గాల అన్ని అభిప్రాయాల ప్రజలను, చదువుకొన్న వారిని, చదువులేని వారిని, రాజును, రైతును, మితవాదిని, అతివాదిని, అనుకూలురను, వ్యతిరేకులను, చూసి ఈ యుద్ధం ముగియడానికి వారు మనస్ఫూర్తిగా విచారిస్తున్నట్లు తెలుసుకొన్నాను. ఇక బ్రిటీషు సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా నాజీలనుంచి, రష్యన్లనుంచి సహాయాన్ని స్వీకరించేందుకు నేతాజీ చేసిన ప్రయత్నాలను చూసి మనం విస్తుపోవలసిన అవసరం ఉందా?

నేను గాంధేయ వాదిగా ఉంటూ కూడా భారతీయ తీవ్రవాదులను అభిమానించడాన్ని, వారితో సంబంధాలు పెట్టుకోడాన్ని గమనించిన వారెవరైనా ఆశ్చర్యపడటం సాధారణమైన విషయమే. 1916 లో "యంగ్ ఇండియా" పుస్తకం ద్వారా శ్రీ లజపతిరాయ్ చెప్పిన వాక్యాలు 1920-30 సంవత్సరాల మధ్య మా చెవుల్లో మార్మోగుతూనే ఉన్నాయి. "జాతీయ వాదమన్న విత్తనాన్ని మృతవీరుల రక్తంతో తడిపి నాటడమైంది. నైతిక వాదులు న్యాయవేత్తలు చట్టానికి అనుకూలురూ అందరూ కూడా వారి పేర్లను తమ హృదయ పీఠాలపై ప్రతిష్ఠించుకొని పూజచేసుకోవాలి" అని ఆయన చెప్పారు.

శ్రీ కపూర్, భయంకరాచారి గార్లు

ప్రముఖులైన ఆ బెంగాలీ తీవ్రవాదులతోపాటు, పంజాబులోని లాహోరు కుట్ర కేసులో నిందితులైన కపూర్ గారిని 1933 సంవత్సరంలో వెల్లూరు జైలులో నేను కలుసుకున్నాను.

భారత దేశాభివృద్ధికి ఏరకమైన సోషలిజం బాగుంటుందనే విషయమై మేము అనేకమార్లు చర్చించుకొన్నాం. మేమిద్దరం అక్కడ మంచి స్నేహితులమయ్యాం. ఆయన శారీరకంగాను మానసికంగాను దృఢమైన మంచి యువశాస్త్రవేత్త. మన దేశ స్వాతంత్ర్యం కోసం జతిన్ దాస్‌గారు ఎలా అసువులు బాశారో ఆయన నాకు తెలియజెప్పారు. ఆంధ్ర జాతీయవాది శ్రీ ప్రతివాది భయంకరాచారి గారి పేరు కూడా నేను అక్కడ చూశాను. ఆయన కూడా వెల్లూరులో 1941-42 సంవత్సరాల కాలంలో నాతో కలసి జైలులో ఉన్నారు. ఆయన సంస్కృతం లోనూ, తెలుగులోనూ, భక్తిసాహిత్యంలోను బాగా ప్రవేశమున్నవారు. 1941 నాటికి ఆయన గాంధేయ అహింసావాదతికి మారారు. 1972 వ సంవ్సరం ఆగస్టు 15న, రాష్ట్రపతి శ్రీ వి.వి.గిరి గారి ద్వారా తామ్ర పత్రాన్ని అందుకొంటున్న స్వాతంత్ర్యసమరయోధులలో ఆయన ఉండటాన్ని చూసి నేను చాలా సంతోషించాను.

శ్రీ వీర సావర్కార్

మమ్మల్ని అక్కడ ఒక మారు మూలగదికి తీసుకెళ్లారు. అది మా స్వాతంత్ర్య సమరయోధు లలో, తీవ్రవాదులలో సహితం సంహమైన శ్రీ వీరసావర్కార్‌ను జీవిత ఖైదీగా 10 సంవత్సరాలకు పైగా ఉంచినగది. దానికి చాలా పై భాగంలో పూర్తిగా ఇనుప కడ్డీలతో కప్పిన ఒక చిన్న చతురస్రాకారపు వెంటిలేటర్ ఉంది. ఆయనను రోజూ రెండు మూడు సార్లు మాత్రమే, అదీ సాధారణంగా భోజన సమయాల్లో వరండాలోకి రావడానికి అనుమతించేవారు. ఆ సమయంలో వరండాలో 20-24 చదరపు మీటర్ల ప్రాంతంలోనే అందునా మిగతా వరండాలో వేరుగా ఉన్న ఆ వరండాలో మాత్రమే ఆయనను సంచరించ నిచ్చేవారు. పేర్లు లిఖించిన ఆ పలకల మీద శ్రీ వీరసావర్కార్ శ్రీ భాయీ పరమానంద వంటి మహోన్నతులతో పాటు నా మిత్రులైన శ్రీ తివారి, శ్రీ సిన్హా, శ్రీ కపూర్, శ్రీ ఛటర్జీ ఆంధ్రులైన శ్రీ భావనాచారిగార్ల పేర్లు ప్రముఖంగా ఉండటాన్ని నేను గమనించాను. వైజాగ్, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన శ్రీ అల్లూరి సీతారామరాజు అనుచరులైన కోయదొరలను ముఖ్యంగా శ్రీ మల్లుదొరను నేను చూశాను. ఆయన ఆ తరవాత పార్లమెంటు సభ్యులయ్యారు. వీళ్లందరి పేర్లూ చూసిన తరవాత నా మనస్సు వారి జ్ఞాపకాలతో, చరిత్రలతో, సాహసాంతో పూర్తిగా నిండి పోయింది. నిజానికి నాకదో గొప్ప అనుభూతి.

నేను మద్రాసులో అలాంటి ఓ చిన్నగదిలోనే ఆరుమాసాలపాటు నిర్బందానికి గురయ్యాను. అయితే 50 చదరపు గజాల దూరం వరకు నేను వరండాలో తిరుగాడవచ్చు. కింద అంతస్తులోకి దిగి వెళ్లవచ్చు. అక్కడ మరో 50 గజాల దూరం తిరగవచ్చు. కొన్ని మాసాలపాటు నాకు కూడా అక్కడ ఏకాంత వాస జైలుశిక్షే. ఆ ఒంటరి తనంలో అక్కడ ఎంత బాధాకరంగా గడిపానో నాకు తెలుసు.

ఒక దశాబ్దానికి పైగా శ్రీ సావర్కార్ అనుభవించిన మానవ విహితం కాని జీవితంతో పోల్చుకొంటే నేనున్నది ఒక స్వర్గం అని చెప్పవలసి ఉంటుంది. ఆయన అక్కడ ఎలా జీవించారో అని ఆశ్చర్యం గొలుపుతుంది. అప్పుడు ఆయన సత్యాగ్రహాల్లోనే కాకుండా

తీవ్రవాదుల్లో కూడా వీరకేసరి అనే సంగతి నా మదిలో మెదులుతుంది.

పంజాబ్ కేసరి శ్రీ లజపతిరాయ్, శ్రీ వీరసావర్కార్ ఉత్తమ గుణాలున్న మహోన్నత నాయకులని మాకు చెబుతూ ఉండేవారు. ఆయన తన ప్రాణాలను ఎప్పుడూ లక్ష్యపెట్టేవారు కాదు. పూర్వకాలపు మహాయోధుడిలాగా ధైర్యంతో అన్ని వేళలా అపాయానికి అడ్డునిలుస్తూ ఉండేవారు.

"ఆయన శ్రీ అరవింద ఘోష్, శ్రీ హర్ దయాళ్‌గార్లలాగా చాలా నిరాడంబరులు. త్యాగంలో ఆయన వారిద్దరికన్నా ఉన్నతులు".

మేమంతా నిశ్శంకమూ నిర్భయమూ అయిన ఆయన అసాధారణ కార్యకలాపాల గురించి, ఆయన ఇంగ్లాండులో ఉండి కూడా తీవ్రవాద కార్యకలాపాలను నిర్వహిస్తున్న తీరు గురించి, తిరిగి భారత స్వాతంత్ర సమరాగ్నిని రగిల్చేందుకు చేస్తున్న ప్రయత్నాల గురించి చాలా చదివాము. ప్రముఖ గాంధేయవాది స్వాతంత్ర్య సమరయోధులు శ్రీ ముదిగంటి జగ్గన్న శాస్త్రి తెలుగులో రచించిన ఆయన జీవిత చరిత్రను నేనూ, శ్రీమతి భారతీదేవి 1930 లో చదివాము. శ్రీ జగ్గన్నశాస్త్రి ఇతర దేశభక్తుల జీవిత చరిత్రలు కూడా రాశారు. ఆ తరవాత నేను భారత స్వాతంత్ర్య పోరాటం "ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్" అనే ఆయన గ్రంథాన్ని చదివాను. అందులో ఆయన బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా 1857 లో జరిగిన సిపాయిల తిరుగుబాటులో పాల్గొన్న యోధుల లక్ష్యాలు, అభిప్రాయాలు, బాధలు, త్యాగాలు విపులంగా ఉద్వేగ భరితంగా చూపెట్టారు.

మహారాష్ట్రకు చెందిన అండమాన్‌లో జీవించిన శ్రీ వినాయక్ దామోదర్ సావర్కార్ 28-3-1883 న జన్మించారు. ఆయన "ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్" అనే ప్రముఖ గ్రంథ రచయిత. దాన్ని బ్రిటీష్‌వారు నిషేధించినప్పటికీ అది అనేక భాషల్లోకి అనువదితమై రహస్య మార్గాన బాగా ప్రచారంలో కొచ్చింది. ప్రముఖ పంజాబ్ విప్లవకారులు హరదయాళ్ గారితో ఆయన పనిచేశారు. ఆయన 1910 లో లండన్‌లో అరెస్టయి, మార్గమధ్యంలో ఫ్రెంచి భూభాగం మీద మార్‌సెల్లీస్ వద్ద స్టీమరు నుంచి తప్పించుకొని, ఫ్రెంచి వారికి పట్టుబడి తిరిగి బ్రిటీష్ అధికారుల చేతుల్లో పడ్డాడు. అప్పుడు ఆయనకు జీవిత ఖైదు విధించింది. అండమాన్‌లోని సెల్లులర్ జైలుకు పంపారు. బ్రిటీష్ పరిపాలనను త్రోసిపుచ్చేందుకు సావర్కార్ హిందూ జాతీయ వాదాన్ని విశ్వసించారు. దురదృష్ట వశాత్తూ గాంధేయశకం ఆయనను విస్మరించింది. గాంధేయ మార్గంలో భారతదేశానికి స్వాతంత్ర్యం లభించింది. దేశవిభజనను ఆయన అంగీకరించలేకపోయారు. జిన్నాకు లొంగిపోయినందుకు కాంగ్రెసును ఆయన క్షమించలేకపోయాడు. ఆయన 1953 లో స్వర్గస్తులయ్యారు.

ఈ దేశభక్తుడు అండమాన్ దీవులలో శిక్షను ఎలా అనుభవించారా అని మనకు ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆ దీవి చాలా అందమైనది. అక్కడ కావలసినంత వర్షం, సూర్యరశ్మి, అడవులు. అది ప్రతివారికీ ఎంతో ప్రేమపాత్రంగా కనిపిస్తూ ఉంటుంది. అయితే మలేరియా, సముద్రజ్వరాలు, వాతావరణం వల్ల సంభవించే వ్యాధులు ఎక్కువగా ఉంటాయి. వారు అక్కడ ఎన్నో

సంవత్సరాలుండి పోవలసి వచ్చింది. నిజానికి ఆ సెల్లులర్ జైలులోనూ, అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకొని కొద్దిమంది మాత్రమే జీవించగలిగారు. అది వారి మండుతున్న దేశభక్తి ఫలితం. జాతీయ స్వాతంత్ర్యం కోసం స్వాతంత్ర్య సమర పోరాటం సాగించటంలో, వారికున్న తిరుగులేని, నమ్మకం కారణంగా, వారెవరూ ఈ కష్టాలను గురించి పట్టించుకోనే లేదు.

శ్రీ భాయీ పరమానంద్

యావజ్జీవ కారాగారవాస శిక్షనుభవిస్తున్న భాయీ పరమానందగారు కూడా అక్కడ ఉన్నారు. ఆయనకు సంబంధించినంతవరకు నేను చాలా అదృష్టవంతుణ్ణి. శ్రీ సావర్కార్ గారితో వారు విడుదలైన తరవాత గూడా వారితో కలసి పనిచేసే అదృష్టం నాకు కలుగలేదుగానీ, శ్రీ పరమానందగారు విడుదలై కేంద్ర శాసనసభ సభ్యులుగా ఎన్నికైన తరవాత వారితో కలసి పనిచేసే అదృష్టం నాకు కలిగింది. ఢిల్లీలో జరిగిన ఆయన శతజయంతి ఉత్సవ సందర్భంలో ఆయన సేవలను ప్రస్తుతిస్తూ ఆయనకు శ్రద్ధాంజలి ఘటించే అదృష్టం కూడా నాకు కలిగింది. పార్లమెంటులో నా సహసభ్యులైన ఆయన పుత్రుడు చెప్పిన ఒక మాట నన్ను కుదిపివేసింది. ఆ మాట తనకు విధించిన మరణశిక్షను రద్దుచేయమని ఎవరూ కోరరాదని భాయీ పరమానంద్ గారు కోరిన విషయం.

అయితే ఆయన సహధర్మచారిణి, ఆయనకు విధించిన మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చమని కోరే విజ్ఞప్తిపై సంతకం చేసింది. బ్రిటీషువారి బానిసత్వం కింద దీర్ఘకాలం బతికే కంటే ఒక్క క్షణం తన కంఠాన్ని ఆ ఉరికంబానికి అర్పించడం మేలని, ఈ బాధలనుంచి విముక్తి చెందనివ్వకుండా తననెందు కడ్డుకుంటారని ఆయన ప్రశ్నించారు. ఆయన భార్య ఒక ఉన్నత హైందవ సంప్రదాయ రీతిలో ఇలా చెప్పింది. ఏదో ఒక రోజు నా భర్త తిరిగి వస్తారనే ఆశతో నేనెందుకు తుడిచివేసుకోవాలి? వైధవ్యానికి వ్యతిరేకంగా నేను పోరాడటంలో తప్పేమిటి? అని ఎదురు ప్రశ్నించారు. ఒక హైందవ ఆర్యసమాజ వాదిగా ఆమె కోర్కెను ఆయన అంగీకరించారు. ఆ తరవాత ఈ శిక్షనుంచి ఆయన బయట పడటం, కేంద్ర శాసనసభకు వచ్చి మా అందరితో కలసి పనిచేస్తూ తిరిగి బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడటం జరిగింది. అదేవిధంగా మళ్లు దొరగారు ఫదమూడున్నర సంవత్సరాలు అండమాన్‌లో జైలు జీవితం గడిపి మనకు స్వాతంత్ర్యం లభించిన తరవాత తిరిగి వచ్చి పార్లమెంటు సభ్యులుగా ఎన్నికై మహోన్నత మైన తన దేశభక్తిని ప్రదర్శించి చూపెట్టారు.

శ్రీ జె.సి.ఛటర్జీ

ఉత్తర ప్రదేశ్‌కు చెందిన యువ విప్లవకారులు శ్రీ జగత్ చంద్ర ఛటర్జీ గారుకూడా అలాగే బ్రిటీషువారి ఉరికంబాన్నుండి తప్పించుకొని బైటపడ్డారు. ఆయనకు 1927 కకోరి కుట్రకేసులో శిక్ష పడింది. ఆయన కూడా పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. దేశానికి స్వరాజ్యం వచ్చిన తరవాత కూడా ఆయన ప్రతిపక్షంతో కలసి స్వాతంత్ర్యేచ్ఛతో పోరాటం నిర్వహించారు. ఆయన కార్మికుల ప్రయోజనాల కోసం అంకితమై తన కలాన్ని సామ్యవాద సమాజ నిర్మాణంకోసం వినియోగించారు.

విజయ కుమార్ సిన్హా

శ్రీ విజయ కుమార్ సిన్హా బీహారీ యువకవి, రచయిత. ఆయన కూడా తీవ్రవాదంతో కలసి పనిచేసి బైటపడిన తరవాత ఆంధ్రప్రాంతంలోని ఒక స్వాతంత్ర్య సమరయోధుని కుమార్తె మా రైతాంగ విద్యాయలంలో చదువుకొన్న ఆమె, శాంతినికేతన్ లో డిగ్రీ పుచ్చుకొన్న బాలిక రాజ్యాన్ని పెళ్లి చేసుకొన్నారు. శ్రీ సిన్హా, శ్రీ కపూర్, శ్రీ తివారీ, మొదలైన వారందరికీ అభిమాన పాత్రులైన మంచి మిత్రులు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఆయన ప్రముఖ సోషలిస్టుగా మారారు. సోవియట్ రష్యాలో ఆయన పర్యటనానుభవాన్ని తెలియజేస్తూ రాసిన గ్రంధానికి "సోవియట్ ల్యాండ్" పత్రిక వారూ అత్యున్నత నెహ్రూ అవార్డు ఇచ్చారు.

శ్రీ పృధ్వీసింగ్ ఆజాద్

ప్రస్తుతం శ్రీమతి ఇందిరాగాంధీ ప్రధాన పోషకురాలుగా ఉన్న అఖిల భారత స్వాతంత్ర్య సమర యోధుల సంఘానికి శ్రీ పృధ్వీసింగ్ ఆజాద్ అధ్యక్షులుగా ఉన్నారు. 1976 వ సంవత్సరం ఫిబ్రవరిలో బెంగుళూరు స్వాతంత్ర్య సమరయోధుల మహాసభలో క్రూరమైన బ్రిటీషువారి నిర్బంధ విధానం అమలు జరుగుతున్న ఆ కాలంలో 16 సంవత్సరాలకు పైగా వారికి దొరకుండా రహస్య జీవితం గడపగలిగినందుకు ఆయనను అభినందించడం జరిగింది. అతివాద కార్యకలాపాలలో పాల్గొంటున్నందుకు గాను ఆయన అరెస్టయ్యారు. ఆయన అనేక చిత్రహింసలను భరించారు. అండమాన్ లో ప్రభుత్వ వేధింపు శిబిరాల్లో ఆయనను ఉంచడం జరిగింది. 155 రోజులు అండమాన్ లో కఠిన నిర్బంధాన్ని భరిస్తున్నప్పుడు కూడా ప్రాణాలు పోగొట్టుకోకుండా ఉండగలిగారు. ఆయన చేతులకు బేడీలు వేసి రైలులో తీసుకు వెళ్తున్నప్పుడు ఆంధ్ర ప్రాంతంలో రైలు నుంచి దూకి తప్పించుకోగలిగారు. ఆయన కోసం అనేక రాష్ట్రాలలో పోలీసులు వెదికారు. ఆయన తనకు తాను దేశాన్ని పదలివేసి తిరుగు తున్నప్పుడు అమెరికాలో గద్దర్ ఉద్యమ ప్రారంభకులుగా ఉన్నారు. ఆ తరవాత మాస్కో విద్యాలయంలో చేరి మార్క్సిస్టు లెనినిస్టు సిద్ధాంతాలపై అధ్యయనం కొనసాగించారు. ఆయన దేశంలోని విభిన్న భిప్రాయాలున్న రాజకీయ నాయకులందరితోను సంబంధాలు పెట్టుకొన్నారు. శ్రీ చంద్రశేఖర్ ఆజాద్, శ్రీ భగత్ సింగ్ గార్లతో కూడా ఆయనకు సంబంధాలున్నాయి. దేశభక్తులైన వేలకొద్ది యువకులకు తాలింఖానాలలో అటస్థలాల్లో శిక్షణ ఇస్తూ ఆయన కొన్ని సంవత్సరాలపాటు అనేక రాష్ట్రాలలో గడిపారు. ఆయనను సజీవంగాగాని, నిర్జీవంగాగాని పట్టి ఇచ్చిన వారికి గొప్ప బహుమానం ఇవ్వగలమని ప్రభుత్వం ప్రకటించినప్పుడు, ఆయన 16 సంవత్సరాల కాలం ప్రవాసంలో గడిపారు. సౌరాష్ట్రలో వ్యాయామ పాఠశాలనొకదానిని నెలకొల్పి యువకులకు క్రీడలలో చక్కటి శిక్షణ ఇస్తూ యువకుల సంక్షేమానికి, వ్యాయామవిద్యకు, ప్రాముఖ్యం ఇస్తూ దాన్ని అభివృద్ధి పరచారు.

ఆయన బ్రిటీషు సైన్యానికి స్వాధీనం కాకుండా తనకు తాను మహాత్మాగాంధీగారికి లొంగిపోయారు. దేశ స్వాతంత్ర్య సముపార్జనకు తీవ్రవాదం కన్నా గాంధేయ సత్యాగ్రహ విధానం

ఎక్కువగా ఉపయోగపడుతూ ప్రజలను చైతన్యవంతులను చేయగలుగుతుందని నమ్మినందువల్లనే ఆయన ఇందుకు పూనుకొన్నారు. గాంధీగారు చట్టపరమైన చర్యల నిమిత్తమై బ్రిటీషు వారికి లొంగిపోవలసిందని కోరిన తోడనే ఆయన ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్‌గారి లాగానే భారతీయ బ్రిటీషు చట్టాలను ఆమోదించి వారు విధించిన శిక్షను అనుభవించడానికి పూనుకొన్నారు. ఆ తరవాత చాలాకాలానికి ఆయన క్రమశిక్షణకు అహింసా మార్గంలో చూపెట్టిన విశ్వాసానికి ముగ్ధులైన గాంధీజీ అనేకమార్లు పట్టుదలతో చేసిన విజ్ఞప్తుల తరవాత ఆయన విడుదలయ్యారు.

శ్రీ వృధ్వీసింగ్ ఆజాద్ 'తరతరాలుగా సామాన్య భారతప్రజలు అనుభవిస్తున్న దురదృష్టకరమైన పరిస్థితులనుంచి వారికి విముక్తిని ప్రసాదించటంపై దృష్టి కేంద్రీకరించి పేదరికం, సాంఘిక అసమానతలనుంచి వారిని బైటకు లాగేందుకు కృషిచేస్తూ భారతదేశం లోని అనేక ప్రాంతాలలో సామాన్య ప్రజలతో కలసి తిరిగారు. ప్రజల ఈ కష్టాలను తొలగించే ప్రయత్నంలో ఆయన గాంధీయిజాన్ని, కమ్యూనిజాన్ని కూడా గౌరవించారు. ఆయన అజ్ఞాతవాస జీవితం గడుపుతున్న రోజుల్లో అమెరికా రష్యా దేశాలు పర్యటించారు. ఆ పర్యటనలో ప్రజా సంక్షేమంకోసం సోవియట్ యూనియన్ సాగిస్తున్న కృషిని ఆయన తెలుసుకొన్నారు. ఈరోజు శ్రీమతి ఇందిరా గాంధీ 'గరీబీ హటావో' నినాదం ద్వారా పేదరికాన్ని పారద్రోలేందుకు చేస్తున్న కృషిని చూసి ఆయన ఆనందిస్తున్నారు.

ఆయనకు ఇప్పటికి 85 సంవత్సరాల వయస్సున్నప్పటికి ఆయన క్రమశిక్షణతో, సాధారణ ఆహారపు టలవాట్లతో, దృఢంగా ఆరోగ్యకరంగా చూడముచ్చటగా ఉంటారు. 1976 సెప్టెంబరు నెల 15వ తేదీన ఢిల్లీలో ఆయన 85వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయస్థాయిలో ఒక ఉత్సవం జరగనున్నది.

శ్రీ శీలభద్రయాజి

శ్రీ శీలభద్రయాజి పాట్నా జిల్లాలోని భక్తియార్‌పూర్‌లో 2-3-1916 న జన్మించారు. పాట్నా కళాశాలలో చదువుకొన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ కార్యదర్శిగాను, అఖిల భారత కిసాన్ సభ కార్యదర్శిగాను పనిచేశారు. రాజ్యసభలో మాజీ సభ్యులు. అఖిల భారత స్వాతంత్ర్య సమరయోధుల సంఘానికి ఉపాధ్యక్షులు. నేతాజీకి, స్వామి సహజానంద సరస్వతి గారికి, భారతీదేవిగార్లకు విశ్వాసపాత్రులైన వారు. యుద్ధసమయంలో రహస్య కార్యకలాపాలను నిర్వహిస్తూ పదిసార్లుకు పైగా జైళ్లకు వెళ్లారు - (ఎడిటర్).

శ్రీ శీల భద్రయాజి నిగర్వి. అయితే బీహార్ నుంచి వచ్చిన ఆయన మహోధీరుడైన స్వాతంత్ర్య సమరయోధుడు. సామ్రాజ్యవాదాన్ని తూష్ణీభావంతో తిరస్కరించడానికి ఆయన ఓ ఉదాహరణ. ఆయన బీహార్ ప్రముఖ రైతునాయకులైన స్వామి సహజానంద సరస్వతిగారి ద్వారా మాకు పరిచయమై అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ కార్యకలాపాల్లో మా అందరితో కలసి అతి విశ్వాసంతో పనిచేశారు.

త్రిపుర, రాంఘర్ కాంగ్రెస్ మహాసభలకు పూర్వం నుంచే మేమందరం సుభాష్

బాబుగారితో అతి సన్నిహితంగా ఉంటూ కృషిచేసిన వారం. కాంగ్రెస్ పార్టీ సుభాష్‌బాబు గారిపై క్రమశిక్షణ చర్యలకు పూనుకొన్నప్పుడు శ్రీ శీలభద్రయాజి, మేమందరం కూడా అందుకు నిరసన తెలియజేస్తూ సుభాష్ బాబుగారికి తోడుగా నిలబడ్డాం. భారతదేశంలో బ్రిటీష్ యుద్ధ ప్రయత్నాలను వ్యతిరేకించేందుకు సుభాష్‌బాబుగారు ఫార్వర్డ్ బ్లాకును ఏర్పరచినప్పుడు దానికి సంతోషాన్ని వ్యక్తం చేయడమే గాక శ్రీ శీం భద్రయాజి బోసుబాబుగారితో కాంగ్రెసును వదలి బయటికి వెళ్లి ఫార్వర్డ్ బ్లాకును ఓ స్వతంత్ర శక్తిగా రూపొందించేందుకు కృషిచేశారు.

శ్రీ సుభాష్ బాబు దేశాన్ని వదలివెళ్లే ప్రయత్నంలో ఉన్నప్పుడు ఆయన ఇక్కడనుంచి ఆఫ్ఘనిస్తాన్‌కు ఆ తరవాత యూరోప్‌కు వెళ్లడానికి ధైర్యంగా సహాయపడిన వారిలో శ్రీ శీలభద్రయాజి గారొకరు. అప్పటినుంచి కక్షతో సామ్రాజ్యవాద ప్రభుత్వం ఆయన కోసం వెదకసాగింది. ఆయనను పట్టిచ్చిన వారికి పెద్ద మొత్తాన్ని బహుమతిగా ఇస్తామని బ్రిటీష్ ప్రభుత్వం ప్రకటించింది. ఆయనను కనిపించిన తోడనే కాల్చివేయవలసిందిగా ఉత్తర్వులు ఇచ్చింది. అయినప్పటికీ ఆయన అఖిల భారత కిసాన్ కాంగ్రెస్‌లో దాని అధ్యక్షురాలైన శ్రీమతి భారతీదేవి రంగాగారితో భుజం భుజం కలిపి పనిచేశారు. ఆయన ఆమెతోను మా సోదరులు అఖిల భారత కిసాన్ కాంగ్రెస్ మరో కార్యదర్శియైన శ్రీ గోగినేని లక్ష్మీనారాయణ తోను కలసి కమ్యూనిస్టుల ప్రజాయుద్ధ నినాదాన్ని (ఆ రోజుల్లో వారు దానిని కిసాన్ వేదికల మీదకు కూడా తీసుకు వచ్చారు.) ఎదుర్కొనేందుకు గట్టి కృషిచేశారు.

ఆయన బీహారు నుంచి, ఉత్తరప్రదేశ్ నుంచి యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలను తన అనుచరులతో కలసి నిర్వహించారు. బ్రిటీష్‌వారు భారతదేశ స్వాతంత్ర్యాన్ని అంగీకరించనంతవరకు హిట్లర్‌తో వారు చేస్తున్న యుద్ధాన్ని భారత ప్రజా యుద్ధంగా పరిగణించబోమని చెప్పారు. అప్పటినుంచి 1942 వ సంవత్సరం బిహాత మహాసభల వరకు ఆయన కమ్యూనిస్టుల ప్రయత్నాలకు వ్యతిరేకంగా శ్రీమతి భారతీదేవిగారితో సహకరిస్తూనే వచ్చారు. 1942 ఆగస్టు, అక్టోబరు మాసాల తరవాత కమ్యూనిస్టులు కిసాన్ మహాసభను స్వాధీనం చేసుకొని ఆ వేదికను యుద్ధ అనుకూల ప్రచారానికి వినియోగించు కొన్నారు. అప్పుడు ఆయన అఖిల భారత స్థాయిలో ఉన్న మాలాంటి రైతు నాయకులందరితో కలసి నన్ను బందీగా పట్టుకు పోయేంతవరకు వారి ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ పోరాడుతూనే వచ్చారు. అప్పట్లో రెండు రకాలైన బాధ్యతలు ఆయన పైనబడ్డాయి. ఒకటి కమ్యూనిస్టుల ప్రచారపు ఎత్తుగడలనుంచి కిసాన్ వేదికను రక్షించడం, రెండోది యూరోప్‌లోను ఆ తరవాత సింగపూర్‌లోను, కౌలాలంపూర్‌లోనూ, అండమాన్స్‌లోనూ ఎక్కడెక్కడో ఉంటున్న సుభాష్‌బాబుగారితో సంబంధాలను పెట్టుకొంటూ ఉండటం. బ్రిటీష్ అధికారానికి వ్యతిరేకంగా ఆ రోజుల్లో అలాంటి కృషిచేయడం గొప్ప విషయమే అయినప్పటికీ నిశ్చలంగానూ, నిర్భయంగానూ కృషిచేస్తున్న ఆయన హృదయాన్ని ఏవీ కదలించలేకపోయాయి. ఆయన ఆంధ్రదేశంలో పర్యటిస్తున్నప్పుడు మా ఇంట్లో ఆతిథ్యాన్ని స్వీకరించి భారతీదేవిగారు అందజేసిన ఆర్థిక సహాయానికి ఆప్యాయతకు తన కృతజ్ఞతలు తెలుపుకొన్నారు. ఫార్వర్డ్ బ్లాకు ద్వారా నేతాజీ గారితో సంబంధాలు పెట్టుకొంటూ కృషిచేసినందుకుగాను ఐ.ఎన్.ఎ కైదీలతోపాటు ఆయనను కూడా చేర్చి విచారణకు నిలబెట్టారు.

ఐ.ఎన్.ఎ యోధులపై జరిగిన ఆ ప్రఖ్యాత ఎర్రకోట విచారణలో ఐ.ఎన్.ఎ. సభ్యుడు కాకుండా ఉంచిన ఒకే ఒక భారతీయుడు ఆయనే.

1947 సంవత్సరం ఆగస్టు 15వ తేదీ సాయంత్రం తొమ్మిది గంటలకు భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తరవాత ఈ గొప్ప యోధుడిని గౌరవిస్తూ బొంబాయి జైలునుంచి విడుదల చేశారు. దేశానికి స్వరాజ్యం వచ్చిన తరవాత ఆయన పది సంవత్సరాల పాటు ఫార్వర్డ్ బ్లాకును కొనసాగించి, కాంగ్రెస్ మహాసభలో పండిత నెహ్రూ కాంగ్రెస్ పక్షాన ప్రజాసోషలిజం నినాదాన్ని ప్రవేశ పెట్టిన తరవాత దానిపట్ల ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరారు. అప్పటినుంచీ ఆయన కాంగ్రెస్ పక్షంలో చురుకైన, విశ్వసపాత్రమైన నాయకుడుగా పనిచేస్తూ వస్తున్నారు.

మణిపూర్‌లోని ఇంఫాల్‌లో శ్రీ నేతాజీ, ఐ.ఎన్.ఎ స్మారకార్థం ఆయన ఒక గొప్ప నిర్మాణాన్ని చేపట్టారు. ఆయన అక్కడ ఒక స్మారక మందిరం, స్థూపం, గ్రంథాలయం, నేతాజీ కాంస్య విగ్రహాలను ఏర్పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వాలనుంచి, కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టారు. ప్రజాధనాన్ని వినియోగించడంలో ఆయన గొప్ప నిజాయితీతోనూ శ్రద్ధతోను, సమర్థతతోనూ వ్యవహరించారు. ఆ నిర్మాణం పూర్తికానున్న తరుణంలో నేను అక్కడకు వెళ్లి దానిని చూసి నా స్నేహితులైన శీలభద్రయాజి నిర్మాణ చాతుర్యాన్ని గమనించి ఆనందించాను.

1970 సంవత్సరంలో త్యాగాలుచేసి కష్టాలలో ఉన్న లక్షలాది స్వాతంత్ర్య సమరయోధులకు సహాయపడేందుకు, తాను గతంలో 1946 నుంచి ఐ.ఎన్.ఎ. యోధులకు సహాయపడుతున్నట్లుగా వీరికోసం కూడా కృషిచేసేందుకు ఒక అఖిల భారత సంఘాన్ని ఏర్పాటుచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఆయన అభిప్రాయానికి శ్రీమతి ఇందిరాగాంధీ ఆమోదాన్ని సంపాదించగలిగారు. నెలకు రూ.200 లు జీవితాంతం స్వాతంత్ర్య సమరయోధులకు పెన్షన్ ఇచ్చే ఒక పథకం అప్పుడు ప్రభుత్వ ఆమోదాన్ని పొందింది. అయితే నిజానికి రూపాయి విలువ బాగా పడిపోయిన ఈ రోజుల్లో ఈ మొత్తం ఒక వ్యక్తి పోషణకు కూడా చాలదు. అందువల్ల శ్రీ శీలభద్రయాజిగారు వృత్వీసింగ్ ఆజాద్‌గారితోనూ, నాతోను, సుందరరావుగారితోను అనేకమంది ఇతరులతోను కలసి స్వాతంత్ర సమరయోధులపై ఆధారపడిన వారి కుటుంబ సభ్యులకు విద్యావసతులు కల్పించేందుకు వారికి ఇతర సౌకర్యాలను ఏర్పరచేందుకు ఇంకా ఎక్కువ మొత్తంలో పెన్షన్లను ఇప్పించేందుకు ప్రయత్నించసాగారు. ఇట్లాంటి కార్యక్రమాలన్నింటిలో ఆయన అతి చురుకుగా సదా అవిశ్రాంతంగా పనిచేస్తుంటారు.

మన స్వాతంత్ర్య సమరయోధుల్లో ఇట్లాంటి ఉన్నత భావసంపత్తి కలిగిన దేశభక్తుడు ఇంకా మిగిలిఉండి సేవచేస్తూ ఉండటం మన దేశం అదృష్టం.

ఆయనకు అధికారంపై ఆసక్తి లేదు. అయినప్పటికీ దశాబ్దాల తరబడి ఆయన కృషిచేసిన ఆటవిక జాతుల ప్రజల సంక్షేమ కృషి విషయంలో, అన్ని గిరిజన ప్రాంతాలలోను ఆయన మాట అధికార వాక్కుగా ఇంకా చలామణి అవుతూనే ఉంది. ఆయన ఢిల్లీనుంచి నా 75వ జన్మదినోత్సవ సందర్భంలో 7-11-1974న నన్ను అభినందించేందుకు శ్రీమతి భారతీదేవిగారి సంస్మరణార్థం మేము నిర్మించిన భారతీ కుటీరానికి అక్కడనుంచి చిలకలూరిపేటకు ప్రత్యేకంగా అనేక శ్రమకోర్చి వచ్చారు.

శ్రీ కమలవాధ్ తివారి

వారి మిత్రులు శ్రీ కపూర్‌ను నేను జైలులో కలుసుకొని వచ్చిన తరవాత శ్రీ సిన్హా, శ్రీ కె.ఎన్.తివారీగార్లు ఇద్దరూ నాకు దగ్గరి స్నేహితులయ్యారు. వారు బాగా చిన్న వారుగా ఉన్నప్పుడే తీవ్రవాదులంతో కలిశారు. శ్రీ తివారీని సత్యాగ్రహోద్యమాల ప్రారంభదినాల్లో వెల్లూరు జైలుకు తీసుకురాగా అక్కడ మా మిత్రులు బారిష్టరు, ప్రముఖ తెలుగు రచయిత అయిన శ్రీ ఉన్నవ లక్ష్మీ నారాయణగారితో కలిసి ఉన్నారు. ఆ సమయంలోనే వారు పరస్పరం ఆలోచనలను అభిప్రాయాలను మార్చుకోగలిగారు. శ్రీ తివారిగారు పార్లమెంటుకు ఎన్నికైన తరవాత మేమిద్దరం తిరిగి అక్కడ కలుసుకొని మాంపల్లి రచయిత శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ కాలంనుంచి మేము పరస్పరం స్నేహితులమని తెలుసుకొన్నాం. మాంపల్లి నవలలో ఉన్నవగారు చిత్రించిన రెండు ప్రధానమైన పాత్రలు ఒకటి రామరాజు. హరిజన సత్యాగ్రహి, వేదాంతి. రెండోది ఆయన కుమారుడు వెంకట ప్రముఖ తీవ్రవాది. అలాగే మహాత్మాగాంధీగారిని, తివారీగారిని నేను పోల్చుకొన్నాను. ఆయన పార్లమెంటు సభ్యుడుగా ఎన్నికైన తరవాత ఆయనకు పక్షవాతం వచ్చి ఎడమకాలు కొంచెం కుంటుతూ నడవవలసి వచ్చింది. ఆయన దీర్ఘకాలం జైళ్లలో ఉండి శారీరకంగా మానసికంగా దెబ్బతిన్నందువల్ల ఇలా జరిగింది. ఆయనలా నిదానంగా నడుస్తూ ఉంటే నాకు చాలా బాధనిపిస్తూ ఉండేది. అయితే ఆయన మాత్రం సంతోషంగా నవ్వుతూ కళాకాంతులతో కన్పిస్తూ నాతో మాట్లాడుతూ నాలో కన్పించే బాధను మరపిస్తూ ఉండేవారు.

శ్రీ తివారీ ఆయన పార్లమెంటులో ఉన్న పూర్తికాలం ఒక దశాబ్దం పాటు రైతాంగ సమస్యలను బలపరుస్తూ ఉండేవారు. రైతుల ప్రయోజనాలకు భంగం కలిగినప్పుడెప్పుడైనా మేమిద్దరం ఒకటిగానే ఉంటూ ఉండేవాళ్లం. వెరుకు ఉత్పత్తిదారులకు గిట్టుబాటు ధరలు లభించాలని మేమిద్దరం వత్తిడి చేశాం. స్వయంవృత్తులతో జీవించే రైతాంగం కోసం నేనెప్పుడూ పోరాడుతూ ఉండేవాణ్ణి.ఆయన నాకు తోడ్పాటు నందించేవారు. నాగపూర్ కాంగ్రెస్ తీర్మానమైన సహకార వ్యవసాయాన్ని అమలుచేయటంపై జవహర్లాల్ గారూ, నేనూ ఘర్షణ పడుతున్నప్పుడు ఆయన నన్ను బలపరచి, నన్ను వదులుకోవద్దని నెహ్రూజీని అర్థించారు. చివరికి నేను కాంగ్రెస్‌ను వదలివెళ్లాలని నిర్ణయించుకొన్నప్పుడు అందుకాయన చాలా విచారించి తాను కాంగ్రెస్‌లో ఉంటూనే రైతాంగ ప్రయోజనాలను పరిరక్షించేందుకు పాటుబడగలనని హామీ ఇచ్చారు. రైతులపట్ల కాంగ్రెస్‌పార్టీపట్ల యువతరం అభిమానానికి పాత్రులైన నాయకులు జవహర్లాల్ నెహ్రూగారిపట్ల ఆయనకున్న విశ్వాసానికి నేను సంతోషించాను. ఆ తరవాత రైతాంగ సమస్యలపై పోరాడేందుకు ఆయనతో విభూతి మిశ్రాగారు కలిశారు.

నానాటికీ పెరుగుతున్న అవినీతిని రాజకీయంగా అమర్యాదల పాలవుతున్న మంత్రులను కంట్రోలు చేయలేక పోయినందుకు పరిపాలనా యంత్రాంగంలో పెరుగుతున్న లంచగొండితనాన్ని అరికట్టలేకపోతున్నందుకు ఆయన తన ఆందోళనను వ్యక్తం చేశారు. హిందీ, ఆంగ్ల భాషలలో ఆయన చేసే విమర్శలు నెహ్రూగారిని, శాస్త్రిగారిని, శ్రీమతి ఇందిరాగాంధీని విలవిల్లాడిపోకుండా ఉంచుకొనేలా చేస్తుండేవి.

బ్రిటీషు ప్రభుత్వాన్ని ఏరకంగానైతే తలవొడ్డి ఎదుర్కొన్నారో, అలాగే ఆయన ఏ పక్షంలో ఉన్నా గట్టిగా నిలబడి పోరాడేవారు. చరిత్రాత్మకమైన కాంగ్రెస్‌పార్టీ విభజన సంభవించినప్పుడు ఆయనకు ఈ పరిస్థితి తిరిగి ఎదురైంది. కాంగ్రెస్‌లోని ఉభయవర్గాలు గాంధేయ ధోరణులను విడనాడు తున్నందుకు ఆయన అసంతృప్తి చెందారు. అయితే ఆయన చివరికి శ్రీమతి ఇందిరాగాంధీని సమర్థిస్తూ ఆమె విజయానికి తోడ్పడాలని నిర్ణయించుకొన్నారు. ఆ సందర్భంలో ఆమె ప్రజాపరాలను కాపాడగలదని ఆయన నమ్మారు.

సైతుల, కేత్‌మజ్‌దూరుల మిత్రులయిన శ్రీ తివారి, శ్రీ విభూతి మిశ్రాగార్లు సంతోషంతో ఇందిర వెంట ఉన్నారు. 1971 జులైలో నేను, శ్రీమతి భారతీదేవి, శ్రీమతి ఇందిరాగాంధీ ఇచ్చిన 'గరీబీ హఠావో' నినాదాన్ని బలపరచడం బాగుంటుందని రాజాజీ గారితో వాదించిన సంగతిని తెలుసుకొని వారిరువురూ చాలా సంతోషించారు. వ్యవసాయదారుల ప్రయోజనాలను కాపాడేందుకు మూడింట రెండు వంతులకు పైగా పార్లమెంటు సభ్యులున్న కాంగ్రెస్ సంస్థ ఎక్కువ ప్రయోజనకరంగా ఉండగలదని వారు వత్తిడి చేశారు. ఆ తరవాత మేము కాంగ్రెస్‌లో చేరేందుకు నిర్ణయించుకోవడంతో వారు మహదానంద భరితులయ్యారు. ఆఖరుసారిగా నేను తివారీగారిని 1974 జనవరిలో కలుసుకొన్నాను. ఆ తరవాత ఒక పక్షం రోజులకే వారు జీవితాన్ని చాలించినట్లు రేడియో ప్రకటన వినవలసి వచ్చింది. ఈదేశం ఒక గొప్ప దేశభక్తుడిని కోల్పోయింది. భారతరైతాంగం ఒక మహాయోధుడిని పోగొట్టుకొంది. నేను నాకు అభిమాన పాత్రమైన మిత్రుడిని పోగొట్టుకొన్నాను.

శ్రీ అరుణ్ చంద్ర గుహ

బెంగాల్‌కు చెందిన శ్రీ అరుణ్ చంద్ర గుహ మరొక ప్రముఖ తీవ్రవాది. ఆయన నాలుగుమార్లు నిర్బంధానికి గురయి ఇరవై సంవత్సరాలకు పైగా జైలు జీవితాన్ని గడిపారు. ఆయన తీవ్ర వాదానికున్న పరిమితులను ఒక గొప్ప అనుభవపరునిగా గుర్తించి స్వాతంత్ర్య పోరాటంలో గాంధేయ నాయకత్వాన్ని కూడా గౌరవించారు. దేశబంధు శ్రీ పి.ఆర్.దాస్, శ్రీ సేన్ గుప్తా, శ్రీ సుభాష్ చంద్రబోసు గార్లకు ఆయన ముఖ్య అనుచరులు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తరవాత ఆర్థిక శాఖలో ఉపమంత్రిగా పనిచేయ వలసిందిగా ఆయనను నెహ్రూగారు ఆహ్వానించారు. వ్యవసాయిక ఆర్థిక సహాయసంస్థను ఏర్పరచాలని పార్లమెంటులో నేను ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని ఆయన సంతోషంగా అంగీకరించారు. పార్లమెంటు నుంచి రిటైరయిన తరవాత ఆయన "ఫార్వర్డ్", "లిబర్టీ" అనే ఇంగ్లీషు వారపత్రికలకు సంపాదకులుగా పనిచేస్తూ బెంగాల్ విప్లవకారుల చరిత్రను రాసే కృషిలో నిమగ్నులయ్యారు. బెంగాలీ తీవ్రవాదులను గురించి రాసిన ఆ పుస్తకం ఉన్నతమైన విలువను సంపాదించుకొంది. మేమిద్దరం పార్లమెంటులో పదిహేను సంవత్సరాలు కలసి పనిచేశాం. ఆయన అభిమాన పాత్రులైన మంచి మిత్రులు. మంత్రివర్గం నుంచి తప్పుకొన్న తరవాత ఆయన అనేక విద్యాసంస్థలను ప్రారంభించి చక్కగా నిర్వహించారు.

శ్రీ చక్రవర్తి

నాకు శ్రీ చక్రవర్తిగారు కూడా అభిమాన పాత్రమైన మంచి మిత్రులేగాని, చాలా పెద్దవారు. ఆయన బెంగాల్‌కు చెందిన 1905-07 కాలం నాటి తీవ్రవాది. ఆయన యావజ్జీవ శిక్ష ననుభవిస్తూ జైళ్ళలో ఉన్నారు. వారు, శ్రీ ప్రతుల్ గంగూలీగార్లు తీవ్రవాదానికి ఆనవాళ్లుగా ఉన్నారు. వారు 1932 సంవత్సరంలో వెల్లూరు జైలులో నాకు సహచరులు. స్వరాజ్యాన్ని సాధించేందుకు తగు మార్గాలను గురించి మేము అనేకమార్లు సంప్రదించుకొన్నాము. వారిద్దరూ అప్పుడు అక్కడ నిర్బంధితులుగా ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఆయన తూర్పు పాకిస్తాన్ వెళ్లి అక్కడ పాకిస్తానీ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారు. తిరిగి అక్కడ ఆయన జైలుపాలయి, పాకిస్తానీ పరిపాలనలో ఎక్కువ కష్టాలకు లోనయ్యారు. మైనారిటీ హిందువుల ప్రయోజనాలను కాపాడేందుకు వారి ప్రాథమిక హక్కుల కోసం ఆయన గట్టిగా నిలిచి పోరాడారు. ఆయన అన్ని వేళలో జాతీయ దృక్పథమున్న ఒక విప్లవవాది. తూర్పు బెంగాల్ లో విప్లవాన్ని తీసుకొచ్చేందుకు ఆయన గట్టి పట్టుదలతో కృషిచేస్తూ అక్కడి ముస్లిం విప్లవకారులకు తీవ్రవాద కార్యకలాపాలలో జాతీయస్థాయిలో తగుశిక్షణ ఇచ్చారు. రెండు దశాబ్దాల తరవాత ఆయన ఆఖరు సారిగా తిరిగి ఢిల్లీ వచ్చినప్పుడు అక్కడ నన్ను కలుసుకొన్నారు. నాతోపాటు ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీగారిని, ఆమె మంత్రివర్గ సహచరులను కలుసుకొని సంప్రదింపులు జరిపారు. త్వరలో తూర్పు బెంగాల్ ఎన్నికలు ముగిసిన వెంటనే అక్కడి పాకిస్తాన్ నియంతృత్వాన్ని ప్రజలు అంతంచేయగలరని ఆయన మాకు నమ్మకంగా చెప్పారు. ఓటుద్వారా ఓడించిగానీ లేదా సాయుధ తిరుగుబాటు ద్వారాగానీ పశ్చిమ పాకిస్తాన్‌ను త్రోసివేయగలమని ఆసయమంలో ఆయన అన్నారు. ఆ తరవాత ఢిల్లీలో ఒక మూడురోజుంకే ఆయన తన రాయబార కృషిని పూర్తిచేసుకొన్న తరవాత మరణించారు.

శ్రీ సురేంద్ర మోహన్ ఘోష్

బెంగాల్‌కు చెందిన శ్రీ సురేంద్ర మోహన్ ఘోష్‌గారు 22-4-1883 న జన్మించారు. ఆయన జగంతర్ వర్గానికి చెందిన గొప్ప విప్లవకారులు. ఆయన అనేకసార్లు జైలుకు వెళ్లి ఇరవై సంవత్సరాలకు పైగా జైళ్లలోనే గడిపారు. 1930 సంవత్సరం నుంచి కాంగ్రెస్ పక్షం ద్వారా ఆయన దేశానికి సేవచేశారు. బెంగాల్ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఆయన పనిచేశారు. అలాగే దశాబ్దాల తరబడి ఏ.ఐ.సి.సి.లో కొనసాగారు. ఆయన 1946 నుంచి రాజ్యాంగ నిర్మాణ సభలోను లోక్‌సభలోను, రాజ్యసభలోను సభ్యులుగా ఉన్నారు. కామన్వెల్త్ పార్లమెంటరీ మహాసభలకు ప్రతినిధిగా హాజరయ్యారు. రాంఘర్ లో రాజీలేని పోరాటం కోసం సభలు జరుగుతున్నప్పుడు ఆయన సుభాష్ చంద్రబోసుగారితో కలసి పనిచేశారు. తూర్పుపాకిస్తాన్‌నుంచి శ్రీ చక్రవర్తిగారిని భారతదేశానికి ఆహ్వానించి ఆయన భారతదేశానికి, బంగ్లాదేశ్‌కు గొప్ప సేవచేశారు. శ్రీ చక్రవర్తిగారిని భారత పార్లమెంటు నాయకులతోను, కేంద్ర మంత్రులతోను కలిపేందుకు ఆయన ఏర్పాటుచేశారు.

త్వరలో రానున్న ఎన్నికలలో పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ ప్రజలు పోరాడే సందర్భంలో తగు విధంగా స్పందించడానికి వీలుగా తయారు కావడానికి అవిధంగా మనకు అవకాశం కల్పించారు. నిజానికి బంగ్లాదేశ్ ప్రజలు ముజిబుర్ రెహమాన్‌గారి అవామీ పార్టీకి పూర్తి మెజారిటీ ఇవ్వడం ద్వారా, సోనార్ బంగ్లాకు పూర్తి స్వాతంత్ర్యం కావాలని నినదించడం ద్వారా ప్రముఖ బెంగాల్ విప్లవకారులు, త్యాగజీవి అయిన శ్రీ చక్రవర్తి కన్న కలలకు రూపాన్నిచ్చారు. పాకిస్తాన్ సైన్యాలు చేస్తున్న ముష్కర యత్నాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న సోనార్ బంగ్లా ప్రజల కోర్కెకు, అప్పుడే 1971 సంవత్సరంలో నూతనంగా ఎన్నికైన భారత పార్లమెంటు సభ్యులు తమ హృదయపూర్వకమైన సమర్థనను అందించడం నిజానికి గొప్ప సంగతే.

ఒకదాని వెంట ఒకటి సంభవిస్తున్న బంగ్లాదేశ్ విప్లవ ఫలితాలు, విముక్తి సేనద్వారా బంగ్లాదేశ్ ప్రభుత్వం ఏర్పాటుకు జరిగిన ప్రయత్నాలు పశ్చిమ పాకిస్తాన్ సామ్రాజ్యవాద ధోరణిని ప్రతిఘటిస్తూ చేసిన బంగ్లాదేశ్ ప్రజల స్వాతంత్ర్య ప్రకటన భారతదేశాన్ని బంగ్లాదేశ్ విప్లవ నుడిగుండంలో పడవేశాయి. ఢిల్లీలో శ్రీ జయప్రకాష్ నారాయణ్ అధ్యక్షతన మాలాంటి వారం అనేకమందిమి బంగ్లాదేశ్ దేశభక్తుల కృషికి ప్రపంచ సానుభూతిని సంపాదించేందుకు ఒక అంతర్జాతీయ సభను ఏర్పాటుచేయడం జరిగింది. బంగ్లాదేశ్ విప్లవ వాదులకు అనుకూలంగా ప్రపంచ ప్రజాభిప్రాయాన్ని సాధించడంలో భారత ప్రభుత్వం తన వంతు కృషి తాను చేసింది. సోవియట్ రష్యా భారతదేశానికి, బంగ్లాదేశ్‌కు తోడుగా నిలిచింది. భారత, బంగ్లాదేశ్ సైన్యాలు కలసి సంయుక్తంగా బంగ్లాదేశ్ ప్రజల స్వేచ్ఛకోసం నిలిచాయి. శ్రీ చక్రవర్తి, శ్రీ ప్రతుల్ బాబు, శ్రీ నేతాజీ గారల ఆత్మలు వందలు వేలకొద్ది బెంగాల్ విప్లవకారులు, మా మిత్రులయిన శ్రీ సురేంద్ర మోహన్, శ్రీ అరుణ్ గహ గారలు సోనార్ బంగ్లా ఏర్పాటుకోసం భారత ప్రభుత్వం తీసుకొన్న శ్రమను అభినందించగలిగారు. సోనార్ బంగ్లాదేశ్‌లో స్వాతంత్ర్యం ప్రకటించుకొన్న ఆ రాత్రి జరిగిన చీకటి వర్యలో ఆ పోరాటంలో ప్రముఖంగా పాల్గొన్నవారనేకమంది దుర్మరణం పాలుగావడం మొత్తం ఆసియా ఖండానికే విషాదకర సంఘటనలుగా మనం భావించవచ్చు.

నక్సలైట్ల తీవ్రవాదం ప్రజాస్వామ్యానికి ప్రతిబంధకం

ఆఖరుసారిగా మనదేశంలో వచ్చిన తీవ్రవాదం – నక్సలిజం – సామ్రాజ్యవాద వ్యతిరేక దృష్టితో వచ్చిందికాదు. 1971 లో ఓటు ద్వారా ప్రశాంతంగా వచ్చిన సామాజిక విప్లవ పరిణామాన్ని ఇంకా తీవ్రం చేసేందుకు పూనుకొన్న కార్యక్రమం ఇది. శ్రీమతి ఇందిరాగాంధీ భారతదేశంలో సామాజిక విప్లవాన్ని ప్రజాస్వామ్య పరిధులకు లోబడి అహింసాయుత పద్ధతుల్లో సాధించేందుకు తీవ్రమైన కృషి చేస్తున్నారు. అందువల్ల నక్సలైట్ల తీవ్రవాదం ఏరకమైన అభివృద్ధిని సాధించేందుకు తోడ్పడుతుందని చెప్పలేము. అది మన ప్రజాస్వామ్య పద్ధతిని భంగపరచగలదు. మన ప్రజాస్వామ్య సంస్థల పురోభివృద్ధిని అది అడ్డుకోగలదు. దీనివల్ల రానున్న పెద్ద ప్రమాదం స్వయం వృత్తులతో జీవించే ఆర్థిక వ్యవస్థను అయోమయంలో పడవేయడం, శ్రీమతి ఇందిరాగాంధీ మన విప్లవకృషిని మనకున్న రాజ్యాంగ పరిధిలోనే అహింసాత్మకంగా ప్రజాస్వామ్య పద్ధతుల్లో సాధించేందుకు ముందుకు వెళుతున్నారు.

శ్రీ ముత్తు రామలింగ తేవార్

19వ శతాబ్దం నాటి శ్రీ కట్టబ్రహ్మన్న లాగా శ్రీ ముత్తురామలింగతేవార్ ధైర్యసాహసాలున్న గొప్ప స్వాతంత్ర్య సమరయోధుడు. ఆయన విద్యార్థిగా ఉన్నప్పుడే స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారు. మహాత్మాగాంధీగారి నాయకత్వాన్ని ఆయన అంగీకరించినప్పటికి అహింసాయుత పోరాట పద్ధతులతో ఆయన సంతృప్తి పడలేకపోయారు. తమిళనాడులోని ప్రముఖ నాయకులైన శ్రీ రాజాజీ, శ్రీ సత్యమూర్తి గార్ల పార్లమెంటరీ విధానాలు ఆయనను ఆకర్షించలేకపోయాయి. ఆయనకున్న రాజకీయ సందేహాల కారణంగా జవహర్లాల్ నెహ్రూగారిని అభిమానించలేదు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అవిశ్రాంతమైన పోరాటాన్ని సాగిస్తున్న శ్రీ సుభాష్ చంద్రబోసుగారంటే ఆయన అభిమానాన్ని చెంచుకొన్నారు. ఆవిధంగా ఆయన సుభాష్ చంద్రబోసుగారి నాయకత్వం పట్ల అనురక్తులై అన్ని విధాల ఆయనను అనుసరించడానికి నిశ్చయించుకొన్నారు. మొట్టమొదటి కాంగ్రెసు మంత్రివర్గాన్ని తనకు రాజాజీ పట్ల కొంత సానుకూల ధోరణి ఉన్నప్పటికీ అది బ్రిటిష్‌వారి చట్టపరిధికి లోబడి పనిచేస్తుందనే కారణంతో వ్యతిరేకించారు.

శ్రీ సుభాష్ చంద్రబోసు అధ్యక్షతన 1939-40 సంవత్సరాలలో రాంఘర్‌లో జరిగిన రాజీలేని పోరాట సభలోను నాగపూర్‌లో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక సభలోను మేమిద్దరం కలుసుకొన్నాం. అయితే కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాన్ని అంగీకరించేందుకు ఆ సమయంలో సుభాష్ బాబుగారు సిద్ధంగా లేకపోయినందువల్ల నేను ఆయన ఏర్పాటుచేసిన కార్యాచరణ కమిటీలో చేరలేదు. శ్రీ తేవార్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాటమే ముఖ్యమని మిగతా విషయాలన్ని ఆ తరవాత పరిశీలించ వచ్చుననే అభిప్రాయంతో ముందుకు నడిచారు.

1939 వ సంవత్సరంలో కలకత్తాలో తేవార్ గారి ఫార్వర్డ్ బ్లాకులో చేరి దాన్ని లాంఛనంగా బొంబాయి సభలో ప్రారంభించిన తరవాత దానికి జాతీయ కార్యవర్గ సభ్యులైన సుభాష్‌బాబుగారు, తేవార్‌గారు మా సహకారం విషయంలో తమ సంతోషాన్ని ప్రకటించినప్పటికి నేను కిసాన్ కాంగ్రెస్ వాదిగా కొనసాగుతూ నా సహకారాన్ని ఒక తోటి సోదరుడుగా వారికి అందిస్తూ ఉండగలనని చెప్పాను.

శ్రీ సుభాష్‌గారు భారతదేశాన్ని వదలిపెట్టి ఇండియన్ నేషనల్ ఆర్మీని ఏర్పాటుచేసిన తరవాత ఆయన కృషిని యుద్ధ సమయపు బ్రిటిష్ వారి దౌర్జన్య చర్యలను కూడా లెక్కచేయకుండా ధైర్యంగా ప్రశంసించి, నేతాజీని తన నాయకుడుగా నిర్ద్వంద్వంగా చెప్పుకొన్న భారతీయ నాయకులలో శ్రీ తేవార్ ఒకరు.

ఆయనను నిర్బంధించి పట్టుకువెళ్లి మొదట వెల్లూరు జైలులోను ఆ తరవాత మధ్యప్రదేశ్‌లోని దామోహ్ జైలులోనూ ఉంచారు. ఆ సందర్భంలో మేమిద్దరం ఒకేచోట ఒకే ఆవరణలో ఒకే గదిలో ఒక సంవత్సర కాలం కలసి ఉండగలిగాము.

నిజానికి అది ఆయనను భయపెట్టడానికి బ్రిటీషువారు చేసిన ఒక ప్రయత్నం. ఆయన ఎల్లప్పుడూ నవ్వుతూ ఆనందంగా కనిపించేవారు. మధ్య భారతదేశంలోని చలిగాలులలో కూడా ఆయన ఒట్టి చొక్కా మాత్రమే ధరిస్తుండేవారు. అదికూడా లేకుండా యోగాభ్యాసాలు చేస్తూ ఆయన చలినీ వేడినీ కూడా లెక్కచేయకుండా గడుపుతుండేవారు, ఆయన గొప్ప మతాభిమాని. పద్మాసనం వేసుకొని ప్రార్థనలు జరుపుతున్నపుడు ఆయనను చూస్తుంటే ఎంతో ముచ్చటగా ఉండేది. ఆయన చిరునవ్వులు చిందిస్తూ ఉంటే చూడటానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది. నొసట, గుండెమీద విభూతి రేఖలను దిద్దుకొని ఆయన నేతాజీని గురించి చెబుతూ ఉంటే దేవతలకు కూడా ఆయనను ఆ సందర్భంలో చూడాలనిపిస్తూ ఉంటుంది.

శ్రీ తేవార్ తమిళంలో గొప్ప సమర్థులైన ఉపన్యాసకులు. శ్రీ రాజాజీ, శ్రీ పెరియార్, శ్రీ ఇ.వి.రామస్వామి నాయకర్‌లు మాత్రమే పోలికలతోను, చిన్నచిన్న తమాషాలతోను, పిట్టకథలతోను సంప్రదాయ తమిళ పురాణ కథలనుంచి ఉదాహరణలను అందిస్తూ మధురమైన స్వరాలను పలికిస్తూ ఆయనలాగా మాట్లాడగలిగేవారు. ఆయన 1937-39 సంవత్సరాలలో శాసనసభ్యులుగా ఉండి కాంగ్రెస్ మంత్రివర్గాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తూ సమర్థమైన శాసనసభ్యుడుగా గుర్తింపు పొందారు. ఆయన పార్లమెంటులోకి కూడా ప్రవేశించారు. ఆయన జీవించి ఉన్నంతవరకు ఏ సభకు వెళ్లాలనుకొంటే ఆ సభకు ప్రజలు ఆయనను పంపించేవారు. ఆయనను అత్యంత గౌరవంతో ఆరాధించేవారు రామ్‌నాథ్ జిల్లా ప్రజలు. మేమిద్దరం న్యూఢిల్లీలోని నార్త్ ఎవెన్యూలో ఉంటూ తరచూ కలుసుకొంటూ ఉండేవాళ్లం. అక్కడ పచ్చిక బయళ్లలో ఆయన చొక్కా గూడా ధరించకుండా కూర్చొని యోగంలో నిమగ్నులై ఉంటే అనేకమంది ఉత్తరాది పార్లమెంటు సభ్యులు ఆయనను చూసి అబ్బురపడుతుండేవారు.

పార్లమెంటు సభ్యులుగా ఆయన అంత ప్రముఖంగా చర్చలో పాల్గొనేవారుకారు. ఎప్పుడైనా సాధారణ చర్చలోకాని, రాష్ట్రపతి ప్రసంగంపైగాని, బడ్జెట్‌పై చర్చలోగాని పాల్గొన్నప్పుడు జవహర్లాల్ నెహ్రూగారి నాయకత్వంపై అసంతృప్తిని వ్యక్తపరుస్తూనో పరిపాలనపై ప్రజల అసంతృప్తిని తెలియజేస్తూనో, మాట్లాడుతుండేవారు.

నేతాజీ ఇంకా సజీవులుగానే ఉన్నారని ఆయన పూర్తిగా నమ్ముతుండేవారు. ఆయన యోగధ్యానంలో ఉన్నప్పుడు నేతాజీ గారితో మాట్లాడ గలుగుతున్నానని చెప్పుండేవారు. నేతాజీ కోసం వెతకడంలోనూ ఆయనను కనుగొనడంలోనూ విఫలమైందని నెహ్రూ ప్రభుత్వాన్ని ఆయన నిందిస్తుండేవారు. ఆయన జీవించి ఉన్నంతవరకు ఫార్వర్డ్ బ్లాకుకు ఒక మూలస్తంభంగా కొనసాగారు. ఆయన అంతేవాసులైన శ్రీ శివనతేవర్ శ్రీ మూకూతేవార్ గార్లు అధికారంలో ఎవరు కొనసాగినప్పటికీ వారికి వ్యతిరేకంగా ఉంటూ ఆయన చూపిన ఆచారాన్ని కొనసాగించారు.

శ్రీ కామరాజనాడారూ, ఆయనా తమిళనాడు రాజకీయాల్లో కలిసి పనిచేయలేకపోవడం అదృష్టం ఆడుకొన్న ఓ ఆట అని చెప్పవచ్చు. మరవ, కల్లర వంశాలైన వారి వంశాలు ఒకే నాణానికి చెందిన రెండు ముఖాల్లాంటివి. వారి పూర్వీకులు పాండ్యరాజ్య పాలకులు. ఇరు వంశాలనూ బ్రిటీషువారు అణగదొక్కి నేరపు జాతులుగా ప్రకటించారు. సంప్రదాయ బద్దులైన

పూజారులు ఇరు వంశాలను ఆలయ ప్రవేశానికి అనర్హులుగా ప్రకటించారు. దీర్ఘకాలంగా ఆరెండు వంశాలు వెట్టియార్‌లతోను స్థానిక పాలకులతోనూ బ్రిటీషు అధికారానికి వ్యతిరేకంగానూ పోరాడుతూనే ఉన్నాయి. తేవార్ గారు తన సహ మరవ కులస్తులను బ్రిటీషువారికి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడుతూ పైకివచ్చేలా చేశారు. నాడార్ గారు కల్లరలను కాంగ్రెస్‌లో కలిపి సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడేటట్టు చేసి పైకి తీసుకొచ్చారు. శ్రీ తేవార్ తమ మధ్య ఉన్న వ్యత్యాసపు చాలోచనల కారణంగా రాజాజీగారి మద్దతును సంపాదించుకోలేక పోయారు. అయితే నాడార్ ప్రముఖ పార్లమెంటరీ నాయకులైన సత్యమూర్తిగారినుంచి హృదయపూర్వకమైన ఆదరణను సంపాదించుకోగలిగారు. ఆవిధంగా వారిరువురూ స్వరాజ్యం రాకముందు, వచ్చిన తరవాత కూడా శత్రుత్వం కలిగిన రెండు రాజకీయ విభేదాలు. చెరొక కోణంగా ఉన్న ఈ రెండు కులాలు కూడా వీరిద్దరూ చేసిన కృషి కారణంగానూ అభివృద్ధి పథంలోకి ప్రవేశించాయి. వారిద్దరూ పరస్పరం కలహించుకోకుండా కాంగ్రెస్ పార్టీలో కలసి పనిచేసినట్లుయితే వారు తమతోపాటు ఇంకా అట్టడుగున పడిఉన్న అనేక కులాలకు, వర్గాలకు ఎక్కువగా సహాయపడగలిగేవారు. శ్రీ నాడార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శ్రీ తేవార్‌ను జైలుకు పంపి ఈ విభేదాన్ని మరింత పెంచారు. దాంతో మరవలు నాడార్‌పై బాగా పగబట్టారు. నాడార్ మద్రాసు ముఖ్యమంత్రి కావడం వల్ల, అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షులు కావడం వల్ల కల్లర జాతివారు రాజకీయ ఆర్థిక రంగాలలో బాగా ముందుకొచ్చారు. మరవలు మహోన్నతులాంటి తేవార్ వ్యక్తిత్వంతో ఆత్మవిశ్వాసంతో అభివృద్ధి పథంలోకి అడుగుపెట్టారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నంత కాలం వారి సామాజిక పరివర్తనా సిద్ధాంతంలో తన కంగీకారమున్నప్పటికీ ద్రవిడ కజగాన్నిగానీ, ద్రవిడమున్నేట్రకజగాన్ని గానీ ఆయన బలపరచలేక పోయారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత వారి స్థానిక నాయకులకు, రాష్ట్ర నాయకులకు ఆయన నైతికంగా మద్దతు అందించసాగారు. ఆ పార్టీలు ఆర్థికంగా అవినీతి చర్యలకు పాల్పడవని ఆయన గ్రహించి ఆ తరవాతనే వాటికి తన హృదయపూర్వకమైన మద్దతు అందించారు.

నేను స్వతంత్ర పార్టీ తరపున తమిళనాడులో పర్యటిస్తున్నపుడల్లా ఒక స్నేహితుడిగా ఆయనను కలుసుకొంటూ ఉండేవాణ్ణి. 1959 నాటికి రాజాజీ గారు నెహ్రూజీ పాలనను వ్యతిరేకిస్తున్న కారణంగా తేవార్ ఆయన పట్ల అభిమానం పెంచుకొన్నారు. రాజాజీగారు నేను కలసి ఒక సమర్థమైన పార్లమెంటరీ ప్రతిపక్ష నిర్మాణానికి కృషిచేస్తున్నామని తెలుసుకొని ఆయన సంతోషించి తన నైతిక సమర్థనను మాకు అందివ్వడానికి ముందుకు వచ్చారు. ఆయన మరణించడానికి ఒక సంవత్సరం ముందు తన అనుచరులను మా పార్టీలో సహసభ్యులుగా చేరవలసిందిగా సలహా ఇచ్చారు.

శ్రీ కామరాజ్ నాడార్ ఆయనను జైలుకు పంపేనాటికి ఆయన మంచి ఆరోగ్యంతో ఉక్కు కండరాలతో దృఢంగా ఉన్నారు. అయితే జైలునుంచి బైటపడేటప్పటికి శారీరకంగా దుర్బలులై వచ్చారు. వైద్యులు కూడా ఈ మార్పునుచూసి ఆశ్చర్యపోయారు. ఈ నేలను వదలివేసే తరుణంలో ఆయన ఒక యోగిలాగా నిశ్చలస్థితిలో ఉండి మరణానికి తనకు తాను

సన్నిహితమయ్యారు అన్నట్లున్నారు. దేశప్రజల స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరుడాయన. మద్రాసు రాష్ట్రంలో ఉన్నత కులాల నాయకత్వాన్ని తోసిపుచ్చి అన్నాదురై అధికారాన్ని చేపట్టేంతవరకు ఆయన బ్రతికుంటే అందుకు ఆయన ఎంతో ఆనందించేవారు. అన్నా వారసులై మంత్రి వర్గంలో ఉన్నవారు కాంగ్రెస్ కన్నా అధమస్థితికి దిగజారి తమ దూరదృష్టిలేని ప్రయత్నాల కారణంగా రాజకీయ అవినీతికి బంధుప్రీతి పాతానికి పాల్పడిన విషయాన్ని కూడా ఆయన చూసి ఉంటే తప్పక దుఃఖపడేవారు. తేవార్ మరణంతో భారత స్వాతంత్ర్య సమరయోధుల మణిమాల ఒకగొప్ప విలువైన వజ్రాన్ని కోల్పోయింది.

49

శ్రీ మహావీర్ త్యాగి

శ్రీ మహావీర్ త్యాగి డెహ్రాడూన్‌కు చెందిన వారు. ఆయన 31-12-1899 న జన్మించారు. తొమ్మిదిసార్లు ఆరెస్టయి ఏడు సంవత్సరాలు జై లుశిక్షల ననుభవించారు. మొదట బ్రిటీష్ సైన్యంలో చేరి జలియన్ వాలాబాగ్ అత్యాచారాలకు నిరసన తెలియజేసినందుకుగాను బర్తరఫ్ అయ్యాడు. యు.పి. శాసనసభ్యులుగాను రాజ్యాంగసభ సభ్యులుగాను పార్లమెంటు సభ్యులుగాను ఎన్నికయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ సభ్యులుగా కొన్ని దశాబ్దాల పాటు కొనసాగారు. అనేకమార్లు మంత్రి పదవిని చేపట్టారు - (ఎడిటర్).

శ్రీ మహావీర్ త్యాగి అంటే అటు బ్రిటీష్ ప్రభుత్వానికి ఇటు స్వతంత్ర భారత ప్రభుత్వానికి కూడా ఆయన తీవ్రవాది కాకపోయినప్పటికీ తీవ్రమైన భయం. మొదటి ప్రపంచ యుద్ధసమయంలో ఆయన సైన్యంలో పనిచేస్తూ తొలి అనుభవాన్ని పొందారు. ఆయన కాంగ్రెస్ తరపున రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరవాత బ్రిటీష్‌వారిపై ఒక సైనికుడి లాగా పోరాడారు. ఆయన సైన్యంలో ఉండి తను నేర్చుకొన్న శిక్షణను ఆధారం చేసుకొని స్వతంత్ర భారత ప్రభుత్వ ప్రారంభ దినాల్లో దానికి తోడ్పడేందుకు గాను ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ సేవాదళ్‌ను మేము స్థాపించినట్లుగానే ఉత్తరప్రదేశ్‌లో త్యాగిసేవాదళ్ (సేవ) ను ఏర్పాటు చేశారు.

శ్రీ గోవింద వల్లభ పంత్‌గారి నాయకత్వం కింద యు.పి. కాంగ్రెస్‌పార్టీలో శ్రీ సి.బి.గుప్తగారు నడుపుతున్న వర్గకలహాలను శ్రీ త్యాగి అంగీకరించలేదు. అందువల తన సేవాదళ్ సహాయంతో వాటిని వ్యతిరేకిస్తూ ఆయన పోరాడారు. సందర్భవశాత్తూ సేవాదళ్‌ను రద్దుచేయవలసిన పరిస్థితి ఆయనకు ఎదురైంది. దానితో శ్రీ సి.బి.గుప్త విజయులయ్యారు. నిరసనగా శ్రీ త్యాగి కాంగ్రెస్‌కు రాజీనామా ఇచ్చారు. అయితే ఆయన వర్గనాయకులూ నెహ్రూగారి సన్నిహిత మిత్రులైన శ్రీ రఫీ అహ్మద్ కిద్వాయ్ ఆ సందర్భంలో ఆయనను ఆదుకొన్నారు. యు.పి. రాష్ట్ర ముఖ్య రాజకీయాల ఊబిలోనుంచి ఆ కాలంలో అవిధంగా రక్షించబడ్డ వారిలో ఆయన ఒకరు.

కమ్యూనిస్టులకు చెందిన శ్రీ ఏ.కె.గోపాలన్ గారంటే ఆయనకు కొంత ఇష్టం. ఇద్దరికీ ఆంగ్ల భాషా ప్రకటనా కౌశలం తక్కువేనా వారు చెదలుపుకొన్న వాటిని బిగ్గరగా చెప్పుండేవారు. ఇద్దరూ నిజాయితీ పరులైన విప్లవకారులు. స్వాతంత్ర్య పోరాట సమయంలో తమ తమ ధోరణులలో శ్రద్ధగా పనిచేసిన వారు. విప్లవ పోరాట కెరటాల లాగా ఉంటూ ఇద్దరూ స్వయం కృషితో విద్యాజ్ఞానాన్ని సంపాదించుకొన్నారు.

శ్రీ త్యాగి గొప్ప చతురుడు, సమర్థుడైన తీవ్రవాది. కొన్ని సందర్భాలలో ఆయన

సాదాసీదాగా అన్న మాటలు ఇతరులను బాధపెడుతుండేవి. కేంద్ర సచివాలయాన్నంతా మీనన్‌లు తమ అధికారంలోకి తెచ్చుకొని పరిపాలిస్తున్నారని ఎలాంటి ప్రత్యేక అభిప్రాయాలు లేకుండా ఆయన అన్నమాట కేరళ వారిని బాధపడేలా చేసింది.

ఆయన ఏదైనా ఒక విషయాన్ని గొప్పగా వివరణాత్మకంగా చెప్పగలరు. అందుకు ఉదాహరణగా ఆక్సాయ్ చిన్ మొదలైన వాటిపై ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నేను దాడి చేసినప్పుడు "అక్కడ గడ్డిపరక కూడా మొలవదు" అన్న తరవాత మేము ప్రతి విమర్శకు పూనుకొన్నప్పుడు నెహ్రూజీ నిస్సహాయంగా ఉండిపోవలసి వచ్చిన సమయంలో శ్రీ త్యాగి నున్నగా ఉన్న తన బట్టతలను తడుముకొంటూ వెడ్డగా "ఇక్కడ నా తలమీద ఒక్క వెంట్రుక కూడా లేదు అయినా ఏమీ నష్టం లేదు ఎందుకంటే అది విలువ లేనిది గనుక" అని అన్నారు. ఆవిధంగా ఆ సందర్భంలో నెహ్రూగారికి తోడ్పడ్డారు.

1962 సంవత్సరంలో చైనా వారి దురాక్రమణ జరిగినప్పుడు దేశప్రజలు పార్లమెంటు ఎక్కువ ఆందోళన చెంది క్రిష్ణమీనన్‌ను రాజీనామా చేయించవలసిందని చెడ్డగా కోరినప్పుడు శ్రీ క్రిష్ణమీనన్‌ను రక్షణ మంత్రిత్వ శాఖనుంచి తొలగించడం నెహ్రూగారికి ఇష్టం లేదు. ప్రభుత్వ విధానాలకు తాను బాధ్యుడిని గనుక ఆ ప్రశ్న తననే అడగాలని నెహ్రూగారు అన్నప్పుడు శ్రీ త్యాగి ఇలా చెప్పారు. "అప్పుడు మీరైనా బైటకు వెళ్లాలి లేదా ఆయననైనా బైటకు పంపండి". జవహర్లాల్ గారు తక్షణమే పార్టీ అభిప్రాయాన్ని అర్థం చేసుకొని మీనన్‌ను తప్పించి, పరిస్థితులనుంచి బైటపడ్డారు.

శ్రీ త్యాగి పార్లమెంటులోనూ బయటా మొత్తంమీద ఒక అలవాటుగా హిందీ పదాలతో కూడిన భారతీయ మైన ఆంగ్లభాషను వాడటం మొదలు పెట్టారు. ఆర్థిక మంత్రిత్వం లోను, జాతీయాదాయ విభాగాలలోను రక్షణశాఖలోను ఎందులో ఉన్నప్పటికీ ఆయన తానుచేసే ప్రతి విషయాన్నీ స్పష్టంగా వివరించేవారు. ఆయన మాట్లాడుతూ ఉంటే గోఖలే, శ్రీనివాసశాస్త్రిగార్ల స్కూలుకు చెందినవారు, ఆయన ఇంగ్లీషులో మాట్లాడుతున్నారా లేదా ఏదైనా ఇతర భాషలో మాట్లాడుతున్నారా అని నన్ను ప్రశ్నిస్తుండేవారు. మొత్తంమీద ఉభయసభల్లోను ఉన్న ఏడువందలమంది సభ్యులకూ ఇంగ్లీషును శ్రద్ధగా నేర్చుకొని వ్యాకరణ దోషం లేకుండా మాట్లాడటం సాధ్యంకాదు. దక్షిణ భారతదేశం నుంచి వచ్చిన పార్లమెంటు సభ్యులు శ్రీ లోహియా, శ్రీ మధులిమాయే శ్రీ వాజపేయి మొ॥ వారు పూర్తిగా హిందీలోనే ప్రసంగించినట్లుగా కాక కొద్దిగా హిందీపదాలు కలిసినప్పటికీ, అవగాహనకు వీలైన ఆంగ్లభాషలో మాట్లాడుతున్నందుకు అభినందిస్తుండేవారు.

శ్రీ త్యాగి మంత్రిగా డంబాచారాలకు, లేనిపోని గొప్పలకు పోక, సామాన్యంగా ఉంటూ నిజమైన ప్రజల మంత్రిగా పనిచేశారు. కొన్ని మాసాల పాటు తాను తిరిగేందుకు ఒట్టి జీపును మాత్రమే వాడుకొన్నారు. అవినీతిగాని కులతత్వంగాని ఆయనకు ఎలాంటి కళంకాన్ని తీసుకురాలేదు. ఆయన పదవులకు పలుకుబడులకు పొంగిపోక చాలా సాదాగా జీవించారు. ఆయన దగ్గరి బంధువొకరు అధికారులమధ్య తన పేరును వాడుకొంటున్నారని తెలుసుకొన్న

తరవాత ఆయన తనకు తానై ఆ మంత్రిత్వ శాఖనుంచి మరొక శాఖకు బదలాయించవలసిందిగా జవహర్లాల్ గారిని కోరారు. ఫైనాన్స్ కమీషన్ అధ్యక్షుడుగా తక్కిన సభ్యులతో సమానంగా, ఆయన విద్యావంతులు కాకపోయినప్పటికీ తాను స్వీకరించిన బాధ్యతలను విజయవంతంగా పూర్తిచేశారు.

ఆయన హోదాను నిర్లక్ష్య పరచినప్పుడు ఆయన సహించేవారు కాదు. దానికోసం దేనినైనా నిర్లక్ష్యంతో వదలుకొనేవారు. నెహ్రూగారు ఆయన పేరును డిప్యూటీ ఉపమంత్రుల లిస్టులో పెట్టినప్పుడు వెంటనే నెహ్రూ వద్దకు వెళ్లి దశాబ్దాల తరబడి మిత్రులుగా ఉంటూ సేవజేస్తున్నందుకు మీరు చేసిందేమిటని గట్టిగా నిలదీశారు. అనేకమంది మంత్రులు ఢిల్లీని వట్టుకొని వ్రేళ్లాడుతూ ఉంటే శ్రీ త్యాగి మంత్రిపదవంటే లెక్కలేకుండా ప్రవర్తించగలిగారు. సోవియట్ రష్యాలో భారత పాకిస్తాన్‌ల మధ్య తాష్కెంట్ ఒడంబడిక జరిగి సైనిక ప్రయోజనాల దృష్ట్యా కీలకమైన కొన్ని ప్రాంతాలను వదులుకునే ఒడంబడికపై తనకు సన్నిహిత మిత్రులైన శ్రీ లాల్‌బహదూర్‌శాస్త్రి సంతకం చేసిన కొన్ని గంటలకే ఆయన రాజీనామా ఇచ్చి కేంద్రమంత్రివర్గంనుంచి వైదొలగారు. అలా మంత్రిపదవంటే తృణప్రాయంగా భావించి తొలగిపోయిన ప్రముఖులు శ్రీ జాన్‌మత్తై, డా॥ అంబేద్కర్, అశోక్‌మెహతాగార్లు మాత్రమే. బెంగుళూరు కాంగ్రెసు పార్లమెంటరీ బోర్డు నిర్ణయాల తరవాత దేశంలో క్లిష్ట పరిస్థితులేర్పడిన సమయంలో శ్రీ మొరార్జీ దేశాయ్ ఆయన మిత్రులు రాజీనామా ఇచ్చేందుకు నిర్ణయం తీసుకొన్నారు గానీ ఆ నిర్ణయం శ్రీ త్యాగి నిర్ణయమంత గొప్పది కాదు.

శ్రీ త్యాగి ఒక ఉన్నత సహచరుడు. మంచి స్నేహితుడు. ఆయన జవహర్లాల్ గారికి విశ్వాసపాత్రులు. ఆయనను అపార్థం చేసుకోకుండా పరిహసించగలిగే ధైర్యం శ్రీ త్యాగికున్నది. ఆయన నాపల్ల, ఆగ్రాకు చెందిన యస్.కె.డి.పాలీవాల్ గారిపల్ల బాగా ప్రేమలో ఉంటారు. రెండు దశాబ్దాలకు పైగా మేమిద్దరం మంచి స్నేహితుల్లాగా కలసి పనిచేశాం. ఆయన ముస్లిములకు మంచి మిత్రులు. ఒకప్పుడు ఆయన ఖలీఫత్ ఉద్యమ నాయకులు. అయితే పాకిస్తాన్ దుష్టభావాలపట్ల ఆయన విధానం చాలా కఠినంగా ఉండేది. సామాన్య జనాలపై ఆయన ప్రేమ చాలా గొప్పది. ఆయన శరీరంలోని ప్రతి అంగుళానికి సోషలిజంపై నమ్మకం ఉంటుంది. ఆయన మంచి విశ్వాసాలతోనూ క్రమశిక్షణతోనూ ఉత్తమ గాంధేయవాదిగా జీవించారు. 1969–70 సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీలో ఏర్పడిన చీలిక ఆయనను ప్రతిపక్షంలో కూర్చోబెట్టింది. 1970 సంవత్సరపు ఎన్నికలలో ప్రతిపక్షాలన్నీ ఘోరంగా దెబ్బతిన్నప్పటికీ ఆయన తన సీటును సంపాదించుకోగలిగారు. ఈరోజు పార్లమెంటులోని ప్రతిపక్షానికి ఆయన ఓ నిధిలాంటివారు.

శ్రీ ఉన్నవ లక్ష్మీన్నారాయణ

తమ జీవితాన్ని పెనవేసుకొన్న శ్రీ ఉన్నవ లక్ష్మీన్నారాయణ బారివ్వరు. 1916-46 సంవత్సరాల మధ్య దక్షిణ భారత దేశంలో సాంఘిక, రాజకీయ రంగాలలో కృషిచేసి ఉన్నత గౌరవాన్ని సంతరించుకొన్న ఆంధ్ర ప్రముఖులు! ఆయన శాసన సభ్యుడిగా గానీ ఎప్పుడూ ఎట్టి పదవులను నిర్వహించలేదు. అయినప్పటికీ పదవులలో ఉన్న వారి కంటే, ప్రజలలో 'ఉన్నవ' వారికే ఎనలేని గౌరవ, ప్రతిష్టలు నెలకొనిఉన్నాయి. సామాన్య ప్రజలతో కలిసి కార్యక్రమాల్ని నిర్వహించ లేకపోయినప్పటికీ, శ్రీ లక్ష్మీన్నారాయణ గారు అనేక మంది నాయకులకు ఆయన నాయకుడుగా ఉండి, వారిని తీర్చిదిద్దారు. లోకందృష్టిలో ఆయన ధనవంతుడు కాక పోయినప్పటికీ, అక్రమంగా డబ్బు సంపాదించి, సంపన్నుడు కాక పోగా, పూర్వీకులనుంచి తనకు లభించిన భూములతో సహా తనకున్న యావదాస్తిని ప్రజాసేవలో వినియోగించిన త్యాగధనుడు. శ్రీ ఉన్నవ వారు గొప్ప కవి. నాటక రచయిత. నవలాకారుడు తను రచించిన గ్రంధాలద్వారా వ్యాపార ప్రయోజనాలు పొందడం గానీ, వారికిని ఏ కళాపోషకునికో అంకిత మిచ్చి, లబ్ధి పొందాలని గానీ ఆయన ఎప్పుడూ ప్రయత్నించలేదు.

దక్షిణ భారతదేశంలో స్త్రీ జనోద్ధరణ కోసం కంకణం కట్టుకొని, బాల్యవివాహాలను వ్యతిరేకించి, వితంతు పునర్వివాహాలను జరిపించడం, స్త్రీ విద్యను ప్రోత్సహించి, పురుషులతో పాటు సమానంగా అన్నిరంగాలలో సమానావకాశాలకోసం కృషిచేస్తూ, సాంఘిక దురాచారాలపై మూఢ నమ్మకాలపై ధ్వజమెత్తిన సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం కార్యక్రమాలవల్ల స్ఫూర్తిపొంది.ఆయన ఆశయాల పరపడితో ఉన్నవ లక్ష్మీన్నారాయణ తన ప్రజా సేవా కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీ వీరేశలింగం ఆదర్శాలకు అనుగుణంగా ఉన్నవ వారు హైందవ సనాతన పరుల నెదిరించి. కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. సనాతన , ఛాందస వర్గాల ఆగ్రహాలకు గురి అయ్యారు. తనను కులం నుంచి వెలివేసినా లెక్కచేయకుండా, తను నమ్మిన ఆదర్శాలకు, శ్రీ ఉన్నవ కడదాక నిలబడ్డారు. 1905-10 నాటి జాతీయ భావాలు మొలకెత్తు తున్న తొలి దశ లోనే, కుల, మత, రాజకీయశక్తులకు వ్యతిరేకంగా, వారిని నొప్పించినప్పటికీ, లెక్కచేయకుండా మన స్ఫూర్తిగా సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం గారికి తోడ్పడుతూ వచ్చారు. వితంతువులు పునర్వివాహం చేసుకునేందుకు సిద్ధపడితే, ఆయన చొరవతీసుకొని, వారి కుటుంబ పెద్దలు కల్పించే ఆటంకాలను లెక్కచేయకుండా, వధూవరుల ఆమోదాన్ని పరిగణలోకి తీసుకొని, ధైర్యంగా వారి వివాహం జరిపించేవారు. ఉన్నవ వారి సతీమణి శ్రీమతి లక్ష్మీబాయమ్మ సాంఘిక సేవాకార్య క్రమాల్లో ఆయనకు పూర్తిగా బాసటగా నిలిచింది. బ్రాహ్మణ కుల పెద్దలు ఆ దంపతులను అనేకమార్లు కులం నుంచి బహిష్కరించారు. అప్పట్లో సమాజంలో కుల బహిష్కరణ ఎంత కఠినంగా చిక్కుల్ని తెచ్చి పెట్టగలదో నాకూ, శ్రీమతి భారతీదేవి గారికి

బాగా తెలుసు. గాంధీ యుగం ఆరంభం కావడానికి ఇరవై సంవత్సరాల ముందుగా, కరుడు గట్టిన ఆచార సంప్రదాయాలకు నిలయమైన ఛాందస బ్రాహ్మణ సమాజాన్ని ఎదిరించడమంటే, హైందవ మత సనాతన, ఛాందస వర్గాల కఠినమైన ఆంక్షలను భరించడం సాహసంతోకూడుకొన్న నిర్ణయమని చెప్పనక్కరలేదు. అయినప్పటికీ ఉన్నవ దంపతులు బ్రాహ్మణ సమాజం విధించిన కుల బహిష్కారాన్ని తట్టుకొంటూ, వీరోచితంగా నిలిచి, సాంఘిక విప్లవానికి మూల స్తంభాలుగా నిలిచి, రాబోయే గాంధీయుగానికి బాటలు వేశారు.

అంగలూరు వాస్తవ్యులైన శ్రీ తిపురనేని రామస్వామి., ఉన్నవ లక్ష్మీన్నారాయణగారూ ఇరువురు కూడా విద్యాభ్యాసం నిమిత్తం ఇంగ్లండు దేశం వెళ్లి, అక్కడ డబ్లిన్‌లో నూ, లండన్‌లోనూ న్యాయ శాస్త్రాన్ని అభ్యసించి, ఇద్దరూ బారిష్టరు డిగ్రీలను పొంది, ఒకేసారి భారతదేశానికి తిరిగి వచ్చారు. తెలుగు సాహిత్యంలో వచనంలోనూ, కవిత్వంలోనూ ఇరువురూ ప్రసిద్ధ రచయితలుగా పేరు గాంచారు. వారిలో ఒకరు బ్రాహ్మణ సమాజం నుంచి రాగా, మరొకరు స్వీయవృత్తిలో జీవించే, రైతాంగం నుంచి వచ్చారు. ఇద్దరూ హిందువులే! తత్వశాస్త్రాన్ని బాగా శోధించినవారు. ఆ ఇద్దరూ యూరపులో నివసించినప్పుడు, పూర్తి శాకాహారులుగా ఉంటూ, తలపాగాలు ధరించి, భారతజాతీయతకు ప్రతిబింబంగా వ్యవహరించారు. శ్రీ యుతులు, సావర్కార్, తిలక్, హరదయాల్ చేపట్టిన జాతీయ ఉద్యమాన్ని వారిరువురూ అభిమానించి, గౌరవించారు. ఆంధ్ర, ఆంగ్లభాషలలో గొప్ప ఉపన్యాసకులయిన శ్రీ దుగ్గిరాల బలరామ కృష్ణయ్య గారికి వీరిద్దరూ ఆత్మీయులుగా ఉండేవారు. గదర్ పార్టీకి చెందిన దర్శిచెంచయ్య గారితో వీరిరువురికీ మంచి సంబంధాలు ఏర్పడ్డాయి. ప్రపంచ యుద్ధం జరుగుతున్న సమయంలో శ్రీ చెంచయ్య అరెస్టయి, సింగపూర్‌లోనూ, మద్రాసులోనూ, లాహోర్‌లోనూ జైలు అయ్యారు. జాతీయోద్యమంలో గాంధీజీ నాయకత్వ స్థాయికి రాక ముందే, ఆఇరువురూ లండన్‌లో గాంధీజీని కలుసుకొన్నారు. బర్లండు సాంఘికోద్యమం నుంచి వారు స్ఫూర్తిని పొందారు. జాతీయోద్యమ లక్ష్యాన్ని కూడా అధిగమించి, భారత ప్రజాజీవన విధానంపై ఆ ఇరువురి కృషి విస్తరించి, అభ్యుదయకరమైన సాంఘిక సంస్కరణోద్యమ దిశగా ఆఇరువురి కార్యక్రమాలు ముందుకు నడిచి, సాంఘిక పునరుజ్జీవన సాధనకు అనువుగా నిలిచింది.

మాతృదేశ దాస్యవిమోచనంకోసం గట్టి కృషిచేయాలని దృఢ దీక్షతో, దేశభక్తి మూర్తీభవించిన వీరుల్లా వారు లండన్‌నుంచి తిరిగి భారతదేశానికి వచ్చారు. అయితే రామస్వామిచౌదరి తన కాలాన్ని ఎక్కువగా సాంఘిక విప్లవం సాధించేందుకు కృషిచేశారు. ఆ ఇరువురి స్నేహవాత్సల్యాలు, ఒకే ఆలోచనా ధోరణులు. జీవితాంతం మొక్కపోకుండా ఇద్దరి మధ్యా అనుబంధం పెనవేసుకొని, చారిత్రాత్మకమైన విలువను పొదుచేసిపెట్టాయి.

ఉన్నవ వారు న్యాయవాద వృత్తిని విసర్జించి, మద్రాసు లోని తన కార్యాలయాన్ని మూసివేసి, సహాయనిరాకరణ ఉద్యమంలో పాల్గొని, మెట్ట తాలూకాలయిన పలనాడు, సత్తెనపల్లి రైతు జనంలో కృషిచేయసాగారు. శ్రీ ఉన్నవ పలనాడులో పుల్లరి సత్యాగ్రహంలో జైలుకు వెళ్లగా, ఆపోరాటంలో రైతునేత శ్రీ కన్నెగంటి హనుమంతును కాల్చివేయడం

జరిగింది. గ్రామాల్లో నెలకొని ఉన్న వివిధ కులాల మధ్య ఉన్న వ్యత్యాసాలు, వైరుధ్యాలు కారణంగా, తరచుగా ఘర్షణలు పడుతున్న రైతాంగాన్ని చైతన్యపరిచి, వారిలో ఐక్యత సాధించాల్సిన అవసరం ఉందని, అయితే అది అంత సులువైన పనికాదనీ ఆయన గ్రహించారు. ఆకృషిలో అంతకు ముందు పొందిన అనుభవాలను పురస్కరించుకొని, అనేక మంది కాంగ్రెసు నాయకులు మా ఉద్యమంలో కలసి రావడానికి తలపడుతున్న తరుణంలో, శ్రీ లక్ష్మీన్నారాయణగారు మా రైతాంగ ఉద్యమాన్ని అభినందించారు.

ఆయన జైలు నుంచి విడుదలైన తరవాత, కడపలో జరిగిన ఆంధ్రరాజకీయ మహసభకు అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సహాయ నిరాకరణ ఉద్యమం విఫలమయిన తరవాత, దాన్ని రద్దుచేయవలసిందిగా , ధైర్యంగా ఆయన కాంగ్రెసు పార్టీకి సలహాఇచ్చారు. గాంధీజీ ప్రత్యక్ష పోరాటాన్ని నిలిపివేశారు. కౌన్సిల్ ప్రవేశాన్ని ఆయన సమర్థించారు. అత్యంత సాహసంతో ఆయన చూపెట్టిన మార్గాన్ని , శ్రీమోతీలాల్ నెహ్రూ, సి.ఆర్.దాసు గార్లు స్వీకరించి, తమ స్వరాజ్య పార్టీ కార్యక్రమాలలో వినియోగించుకొన్నారు. దురదృష్టవశాత్తూ ఆంధ్రకాంగ్రెసు నాయకులలో ఎక్కువమంది, తాము అలవాటు పడిన సంప్రదాయికమైన మార్గానికే తల వొగ్గి, గాంధేయ సూత్రములనుంచి అంగుళం కూడా దాటి వచ్చేందుకు సిద్ధంకానందువల్ల ఆయనను ఎవరూ అనుసరించలేదు. ఆసమయంలో ప్రముఖ నాయకులైన టంగుటూరి ప్రకాశం గారు మాత్రమే ఉన్నవ వారిని అనుసరించి స్వరాజ్య పార్టీలో చేరారు. శ్రీ లక్ష్మీన్నారాయణ తన వద్ద ఆర్థికంగా తగినన్ని నిధులు లేనందువల్ల శాసన సభ వంటి ఎన్నికలలో పాల్గొనదలచుకోలేదు. అప్పట్లో కనీసం స్వాతంత్ర్య సమరంలో కూడా పాల్గొనని శ్రీ వి. రామదాసును బలపరిచి, కేంద్రశాసనసభకు ఎంపిక చేయించడానికి ఉన్నవ వారు ప్రయత్నించినప్పుడు, స్వాతంత్ర్య సమరంలో ఎనలేని కృషిచేసిన మీరెందుకు శాసన సభకు పోటీచేయడంలేదని నేను అడగ్గా, తన వద్ద తగినన్ని ఆర్థిక వనరులు లేవని ఆయన సమాధానం చెప్పారు. ఎన్నికల ప్రచారానికి డబ్బు ఎంతగా అవసరం కాగలదో గుర్తించి, తనకు తానుగా అలాంటి చిక్కులకు గురిగావడం ఇష్టంలేక, మరొక అవకాశాన్ని కల్పించిన సహృదయుడు ఉన్నవ! డబ్బులో చెన వేసుకొని పోయిన రాజకీయరంగంలో కాలాన్ని వినియోగించడం ఇష్టంలేక, ఆయన సామాన్యప్రజలకు సేవచేయడమే ఉత్తమమని నిర్ణయించుకొన్నారు. ఆయన స్వతంత్ర భావాలుగలవారు. అందువల్ల కాంగ్రెసునాయకుల మద్దతును ఆయన సంపాదించుకోలేక పోయారు. తనపై ఇతరుల పెత్తనం చేయడాన్ని ఆయన సహించేవారుకాదు. ఆకారణంగా రాజకీయాల్లో ఎవరి పాత్రను ఆయన సంపాదించులేకపోయారు. అయినప్పటికీ అందుకు ఎవరినీ నిందించకుండా, తనకుతానై ఎన్నికరంగం నుంచి వైదొలిగారు. రాజకీయంగా ఆయన అవగాహన అంత ఉదాత్తంగా ఉండేది. అంతేగాదు బాధ్యతాయుతమైనదికూడా! అంతకంటే పరోపకార పరాయణ తనకు చెందిఉంటుంది. 1923లో శాసన సభకు జరిగిన ఎన్నికల్లో, తన మిత్రులైన శ్రీ రామస్వామి చౌదరి గారిని గెలిపించేందుకు, ఉన్నవారు తీవ్రమైన ప్రచారం చేశారు.

నెల్లూరు జైలులో ఉండగా శ్రీతివారీ యం. పి గారితో ఆయకు పరిచయం

ఏర్పడింది. స్వాతంత్ర్య పోరాటంలో తివారి గారి పాత్రను, ఆయన త్యాగపూరితమైన కృషి, దేశభక్తిని ఉన్నవ వారు ఎక్కువగా అభిమానించేవారు. మన్యంలోని కోయజాతి ప్రజలను సమీకరించి, గెరిల్లా యుద్ధపద్ధతిలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులతో పోరాటం నడిపిన అల్లూరి సీతారామరాజును గురించి ఆయనకు బాగా తెలుసు.

ఉన్నవవారు రాజకీయ రంగంలో తనకు గురుతుల్యునిగా బాపూజీని ఎంచుకొన్నారు, గాంధీజీ ప్రవచించిన అహింసా సిద్ధాంతాన్ని సాంఘిక, రాజకీయ సమస్యల పరిష్కారానికి ఉత్తమ సాధనంగా భావించి, ఉన్నవ వారు అనుసరించారు. సీతారామరాజు వంటి తిరుగుబాటు దార్ల త్యాగమయ జీవితాలను ఆయన ప్రస్తుతించారు. రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని ఎదురించి పోరాడిన అల్లూరి సీతారామరాజు ధైర్యసాహసాలను ఆయన మెచ్చుకొన్నారు.

ఉన్నవ వారు తెలుగు సాహిత్యంలో పేరొందిన రచయిత. తెలుగు గద్య, పద్యరచనలను జాతీయోద్యమ భావాలను సామాన్యప్రజలలో ప్రచారంచేసేందుకు, కందుకూరి వీరేశలింగంగారి వరవడిలో, ఉన్నవ కూడా తెలుగు సాహిత్యాన్ని అందుకు వినియోగించుకొన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రజలకు అర్థమయ్యే సరళమైన పదజాలంతో, సాంఘిక సమస్యలు ప్రధాన అంశంగా నవలను రాయాలని సంకల్పించారు. అహింసాయుతమైన గాంధేయ మార్గాన్ని, విప్లవాత్మకమైన అల్లూరు సీతారామరాజు అవలంభించిన సాయుధ పోరాట మార్గాన్ని కూడా దృష్టిలో ఉంచుకొని, ఈరెంటినీ సమన్వయంచేసుకొని తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు.

తన కథాంశానికి రంగస్థలంగా గ్రామీణ భారతదేశాన్ని ఆయన ఎన్నుకొన్నారు. గ్రామీణ జీవితాన్ని ఆలంబనగా చేసుకొని, నవలలో భూమి లేని వ్యవసాయ కూలీలు, భూస్వాములకు మధ్య ఉండే వర్గ వైషమ్యాలను, అగ్రకులాలకు, నిమ్నకులాల మధ్య జరిగే ఘర్షణలనూ ప్రధానాంశాలుగా తీసుకొని, కథనం నడిపించారు. కుల ఘర్షణలు, వర్గ పోరాటాలను సమాంతరంగా ఉంచి, సమాజానికి జన్మించిన కవలలుగా వాటిని చిత్రీకరించి తన నవలను రచించారు. గ్రామీణజీవితంలో సాంఘిక అసమానతలు, కుల ఘర్షణలు, పరస్పర వైరుధ్యాలు, సహజీవనాన్ని, సంఘంలో అందరూ కలిసి మెలసి జీవించివలసిన పరిస్థితిని ఎలా దెబ్బతీస్తున్నాయో, అంటరానితనం, అగ్ర, నిమ్నకులాల పేరిట సమాజంలో ఏర్పడిన అడ్డుగోడలు మానవుల మధ్య చీలికలు తెచ్చి, గ్రామజీవనాన్ని ఎంతటి హీన స్థితికి దిగజారుస్తున్నాయో, ఉన్నవ వారు తన నవలల్లో హృదయానికి హత్తు కొనేలా చూపెట్టారు.

లెనిన్ నాయకత్వంలో రష్యాలో ఏర్పడిన కమ్యూనిస్టు సమాజం ప్రపంచమంతటా ఆలోచనలను రేకెత్తించి, సామాజిక పరిణామానికి స్ఫూర్తినిచ్చి, వెల్టుబడి దారీ కొండలను. సోషలిస్టు బాంబులతో బద్దలు కొట్టి ఎగసి వచ్చిన చారిత్రాత్మక విప్లవం ఉన్నవ వారిలో ఆలోచనలను పాదుకొల్పింది. రష్యాలో వచ్చిన విప్లవం సమూనాలోనే నేడు గాని, రేపుగాని భారతదేశంలో సైతం వర్గదోపిడీకి వ్యతిరేకంగా వచ్చి తీరుతుందని, జాతీయ వాదులు, కవులు, ఆలోచనాపరులైన అనేక మంది మేధావుల లాగే ఆయన కూడా ప్రగాఢంగా విశ్వసించారు. టాల్‌స్టాయ్ నవలలు 'రిసరెక్షన్', "అన్నాకెరినా"లు, ఇంగ్లీషు నవల 'సిలాస్ ది మేరినర్", హెచ్.జి. వెల్స్ గారి నవల "న్యూవరల్డ్ ఫర్ ది ఓల్డ్" ఆయన చదివారు. బ్రిటిష్ సోషలిస్టు మార్గం గురించి కూడా ఆయన అవగతం చేసుకొన్నారు. స్వరాజ్య సాధనకే గాకుండా, ఆంధ్రా

కాంగ్రెసు కార్యకర్తలు, ప్రజలు తక్షణావసరాలైన ఆర్థిక, సాంఘిక సమస్యల పరిష్కారానికి, కులాలతో, వర్గాలతో నిమిత్తం లేకుండా, కలిసి కట్టుగా, ఏకోన్ముఖంగా కృషిచేయ వలసిందిగా ఆయన పిలుపు ఇచ్చారు. ఈ లక్ష్య సాధన ప్రధాన కర్తవ్యంగా లక్ష్మీనారాయణ గారు నవలను అల్లుకొంటూ వచ్చారు.

సంఘ సంస్కరణ ప్రధాన ధ్యేయంగా ఉన్న తన నవలకు ఆయన "మాలపల్లి" అని పేరు పెట్టారు. అంటరాని కులాల ప్రజలను 'మాల'లు అని పిలుస్తారు. ఈ అస్పృశ్యులను గ్రామానికి దూరంగా, అగ్ర వర్ణాలు వెలివేయడాన్ని ఆయన నిరసించారు. పూర్వకాలంలో ఆర్యుల చేతిలో ఓడిపోయిన పారిపోయిన దస్యులకూ జాతులలో, కాలక్రమంలో అంటరాని కులాలనే ముద్రవేసి, చరిత్రకు దూరంగా ఉంచారు. అనాది నుంచీ భారతదేశంలో స్థిరనివాసం ఏర్పరుచుకొన్న ఆటవిక జాతులు, విజేతలైన ఆర్యులకు భయపడి దూరంగా, తదుపరి కాలాల్లో ఏర్పడిన గ్రామ వ్యవస్థలో తగిన ప్రతిపత్తిలేకుండా, అన్యాయంగా హరించివేసిన వారి సాంఘిక హక్కుల పునరుద్ధరణకు, వారి జీవన విధానాన్ని సరయిన, సాటి ప్రజలతో సమానంగా రూపుదిద్దుకొనే సంస్కరణాయతమైన భావాలకు ఆయన తన 'మాలపల్లి' నవలలో చోటు కల్పించారు. కరుడుగట్టిన సాంఘిక అసమానతలను తన నవలలో ఎత్తి చూపెట్టారు.

కథానాయకుని తండ్రి రామదాసు. గాంధీ సిద్ధాంతాల పట్ల అనురక్తి గలవాడు. సంఘదాసు సోదరుడు వెంకటదాసు. ఇద్దరూ భిన్న ఆలోచనా ధోరణులు గలవారు. ఒకరు గాంధేయ మార్గంలో విశ్వాసం ఉంది. కాగా రెండోవారు కమ్యూనిస్టు అభిమాని. అవసరమైతే హింసామార్గాన్ని ఆచరణలో పెట్టాలని ఆలోచించేవ్యక్తి. ఈ రెండుపాత్రల మధ్య సంభాషణలను, పరస్పర విభేదాలనూ, వైరుధ్యాలను, సాహిత్యవిలువలతో, సమర్థవంతంగా ఆయన చిత్రించారు. ఉన్నవ వారు హృదయం గాంధీ సూత్రాలకు అంకితమయింది. ఈ విధమైన సాంఘిక సమస్యతో, ఉన్నతమైన సాహితీ ఖండంగా, ఉన్నవ వారు తన 'మాలపల్లి' నవలను వేయి పేజీలతో చక్కగా అల్లారు. 'మాలపల్లి' నవల సర్వసమగ్రంగానూ, మతం, సాహిత్యం, పాటలు, కుటుంబ సంబంధాలను చర్చిస్తూ, ప్రీ పాత్రలను మృదుమధురంగా, సౌందర్యవంతంగా చిత్రించి, చూపెట్టడమైంది. సమకాలీన సమజానికి అద్దంపట్టి, విలువైన సాహితీ సంపదగా ముందు తరాల వారికి అందించడమైంది. ఈనవల హిందీ, ఇంగ్లీషు, రష్యన్, కన్నడభాషలలోకి అనువదింపబడింది.

మనిషిని, దోచుకొనే పద్ధతిని గురించి, సాంఘిక అసమానతలను గురించి, పేదరికాన్ని గురించి, ఆయన దేవుడిని ప్రశ్నించారు. ఉన్నవ వారు దైవంపట్ల నమ్మకంగలవారు. ఒంగోలులో గొప్ప ఉపాసనాపరులైన తన గురువు గారి దేవుడిలో ఐక్యం కాగలిగారని, ఆయన నమ్ముతూ ఉండేవారు. ఉన్నవ వారి అభిమానులు చాలామంది, ఆయనను సిద్ధపురుషుడిగా తల పోస్తు ఉండేవారు. ఉన్నవ వారు 'బాపూజీ' ని అవతారపురుషుడిగా భావిస్తూ ఉండేవారు. ఉన్నవ వారిని, నేను మన ప్రాచీన సాంప్రదాయిక మహర్షిగా భావించి, అభిమానిస్తూండేవాడిని.

ఉన్నవ వారు తన ఆలోచనలకు అనుగుణంగా, సంఘ సంస్కరణాయతమైన కృషిని కొనసాగిస్తూ ఉండేవారు. ఆయనకు అత్యంత సన్నిహితులూ, మిత్రులైన శ్రీ రామస్వామి

సోదరిగారు, అసెంబ్లీ ఎన్నికలో స్వరాజ్య పార్టీ అభ్యర్థులకు వ్యతిరేకంగా నిలిచి పోటీచేసినపుడు, రామస్వామి గారిని సమర్థించారు. గాంధీజీ అంబరాటినానికి వ్యతిరేకంగా ఉద్యమం ప్రారంభించి నప్పుడు, ఆయన దానితో కలిశారు. తనకు అత్యంత ప్రీతిపాత్రమైన శారదా నికేతన్‌లో హరిజన బాలికలను చేర్చుకోడమే గాకుండా, మిగతా అగ్రకులాల వారితో పాటు కలిసి భోజనము చేయడానికి, ఒకే చోట కలిసిఉండటానికి ఆయన తగు ఏర్పాట్లు చేశాడు. ఆనాడు శారదానికేతన్‌లో సహపంక్తి భోజనపు ఏర్పాట్లలో, ఆయకు ఎదురైన వత్తిడుల నన్నించినీ, ఎదుర్కొడానికి ఆయన సిద్ధ పడ్డారు. అప్పట్లో కాంగ్రెసు సంస్థలో ఉన్న అనేక మంది బ్రాహ్మణులు, మాలపల్లెల్లో ఏర్పాటు చేసిన సహపంక్తి భోజనాలకు వచ్చేందుకు వెనుకాడుతున్న తరుణంలో ఉన్నవ వారు సంతోషంతో మాతో కలిసి వచ్చేవారు. వారితోపాటు శ్రీమతి భారతీదేవి, శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావుగారు కూడా మాతో కలిశారు.

1923లో నేను ఆక్సఫర్డు నుంచి తిరిగి వచ్చిన తరవాత, దాదాపు ఆంధ్రా కాంగ్రెసు నాయకులందరినీ కలిశాను. వారందరలోనూ సంఘ సంస్కరణ వేత్తగా, ఉన్నతాదర్శాలు గల వ్యక్తిగా నాకు ఉన్నవ వారు కనిపించారు. నిడుబ్రోలులోని మా ఇంట్లో మేము ఉభయులం చాలా సార్లు సమావేశమయ్యాం. గుంటూరులో వారు నిర్వహిస్తున్న శారదానికేతన్ కళాశాలో గ్రామీణ ప్రాంతాల నుంచి, వయోజనులైన బాలికలను విద్యనభ్యసించడం కోసం పంపించవలసిందిగా, ఆయన ఒకసారి నన్ను అడిగారు. నానాటికీ ప్రజలలో విస్తరిస్తున్న గాంధీజీ సిద్ధాంతాల్లో సమ సమాజలక్ష్యం, ప్రతిఒక్కరికీ సాంఘిక నాయ్యం చేకూరేలా ఉండవలసిన అవసరాన్ని మేముభయులం గుర్తించాం. పరస్పరం ఏకాభిప్రాయంతో ఉండేవాళ్లం. సామాజిక చైతన్యాన్ని సాధించినప్పుడే, స్వరాజ్య పోరాటానికి అర్థవంతమైన ప్రయోజనం ఏర్పడగలదని గుర్తించాం. రైతులను, వ్యవసాయకూలీలను సమీకరిస్తూ, చైతన్యవంతం చేసే నాక్షితో ఆయన ఏకీభవించారు. తన నవలను గురించి వివులీకరిస్తూ, కుందురహంకారంతో మిడిసిపడే విషయాలు కాటు వేయగలవనీ, అభ్యుదయ దృక్పథంతో నడిచే మీ బాటలో ముళ్లుచల్లి, అవరోధం కలిగించగలరనీ ఆయన నన్ను హెచ్చరించారు. అఖిలభారత సాహిత్య అకాడమీ. ఆంధ్రప్రదేశ్ అకాడెమీ రెండూ కూడా మాలపల్లి నవలను గౌరవించి, సత్కరించాయి. ఈశతాబ్దంలో ప్రపంచంలో వెలువడిన ఉత్తమ సాహితీ సంపదలో అది ఒకటిగా నిలిచింది. తీవ్రవాద భావాలున్న అభ్యుదయ రచయిత లనేక మంది, ఉన్నవవారి నవలలోని భాగాలను నాటకంగా మలిచి, ఆంధ్ర రంగస్థలం మీద ప్రదర్శించారు. ఉన్నవ వారు 1916-40 నాటి సాంఘిక సంస్కర్త. అయితే 1960-80 నాటి విప్లవ కవులు ఆయనను సాహితీ పితామహుడుగా గుర్తించారు. విజానికిది గొప్ప సత్కారం!

మానవతావాది, సాంఘిక విప్లవవాది అయిన ఉన్నవ వారు అనేక మార్లు గ్రామీణ ప్రాంతంలోని మా ఇళ్లల్లో మాకు అతిధిగా ఉంటూ ఉండేవారు. మద్రాసు లోని డాక్టర్ సత్యనారాయణ గారికి మిత్రుడిగా, మార్గ దర్శకులుగా, అతిధిగా ఉన్నవారు ఆయన గృహంలో ఆనందంగా గడుపుతూ ఉండేవారు. పట్టణాలలో ఉన్నప్పుడయినా, మావల్లెటూరి ఇళ్లల్లో ఉన్నప్పుడయిన. ఒకే మన స్తత్వంతో, ఒకే రకమైన స్నేహంతో, సంతోషంతో కాలం

గడుపుతూ ఉండేవారు. ఆయన మితాహారి! గ్రామీణ ప్రాంతాల్లోని పంటపొలాలను పచ్చిక బయళ్లను ఆయన మెచ్చుకొనేవారు. ఆయన సహృదయతతో కూడిన స్నేహ పాత్రులు. ఎల్లప్పుడూ చిరునవ్వులు చిందిస్తూ, సరసోక్తులతో తోటివారిని నవ్విస్తూ ఉండేవారు. ఆసమయంలో అయినా, ఎవ్వరికయినా తనకుచేతనైన సహాయం చేయడానికి సిద్ధంగా ఉండేవారు. ఏదైనా సందర్భంలో తాను ఎదుటివారిని నొప్పించానని భావిస్తే, మరుక్షణమే తనను తాను సంబాళించుకొని, వారి అభిమానాన్ని తిరిగి పొందడానికి ప్రయత్నించేవారు.

శారదా నికేతన్

1922-23 లో జైలు నుంచి తిరిగి వచ్చిన తరవాత, శ్రీ ఉన్నవ లక్ష్మీన్నారాయణ, శ్రీమతి లక్ష్మీబాయమ్మ దంపతులిరువురూ గ్రామీణ ప్రాంతాలలోని మహిళలకు చక్కటి శిక్షణ ఇచ్చి, వారిని చైతన్యపరచే లక్ష్యంతో గుంటూరులో "శారదానికేతన్" పేరుతో, వసతి సౌకర్యంగల కళాశాలను ప్రారంభించారు. పల్లెసీమలలోని రైతు కుంటుబాలు వయస్సు వచ్చిన ఆడపిల్లలను, దూరంగా పట్టణంలో చదువుకొనేందుకు అప్పట్లో పంపడానికి సందేహించేవారు. ఈకార్యక్రమంలో సంతోషంతో నేను. ఆయనతో చేతులు కలిపాను. మాప్రాంతంలో రైతులను అంగీకరింపజేసేందుకు ముందుగా, మాకుటుంబమే ముందుకు వచ్చింది. భారతీదేవి, ఇద్దరు చెల్లెండ్రను, ముగ్గురు మేనకోడళ్లను, అరుంధతినీ శారదానికేతన్ లో విద్యాభ్యాసం కోసం పంపాను. ఉన్నతమైన ఈ విద్యాలయం ద్వారా ముందుతరాలవారికి రైతునేతను, కాంగ్రెసు నాయకురాలిని, దక్షిణ భారత మహిళా ఉద్యమనాయకురాలిని, ఉన్నవ వారు అందించారు. స్త్రీజనాభ్యుదయం కోసం నిర్మాణాత్మక కార్యక్రమాంతో, శ్రీ వీరేశలింగం ఆశయ, ఆదర్శాలను ఉన్నవ వారు ముందుకు తీసుకెళ్లారు.

దక్షిణ భారతంలో మహిళాభ్యుదయానికి, చైతన్యానికి శారదానికేతన్ మాననీయమైన సేవలుచేసింది. ఉన్నవ దంపతులు అవిశ్రాంతమైన కృషిసలిపి ఎందరో ప్రజాసేవకురాండ్రను మహిళా ఉద్యమ నాయకురాండ్రను శారదానికేతన్ లో రూపుదిద్దారు. కర్ణాటకకు చెందిన పార్లమెంటు సభ్యురాలైన శ్రీమతి అన్నపూర్ణమ్మ తెలంగాణాకు చెందిన పార్లమెంటు సభ్యురాలూ, ఉపమంత్రిణిగా పదవి నిర్వహించిన శ్రీమతి లక్ష్మీబాయి, ఆంధ్రప్రాంతానికి చెందిన ప్రముఖ చిత్రకారిణి పుష్కరాంబ, మొదలు మహిళామణులెందరో విభిన్నరంగాలలో పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. శారదా నికేతన్ లో శిక్షణ ఇచ్చిన శ్రీమతి సంగం లక్ష్మీబాయి హైద్రాబాద్ లో ఉన్నత పాఠశాలను, హాస్టలును, విద్యాసంస్థలను బాలికల కోసం నడుపుతూ, అనాధలైన వెనకబడిన వర్గాల బాలబాలికల కోసం ఒక ఆశ్రమాన్ని నిర్వహిస్తూ, వెనకబడిన తెలంగాణాలో విశిష్టమైన సాంఘిక సేవలందించింది. ఆమె తన జీవితాన్ని ఉన్నవ దంపతులు చూపెట్టిన సేవారంగంలో అంకితచేసుకొని, అభాగ్యులైన బడుగుజీవుల ఉద్ధరణకు మహిళాభ్యుదయానికి ఎనలేని సేవలు చేశారు.

వాహిని

కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంత ప్రచార తెలుగు పత్రిక

కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య సిద్ధాంతాలకు గాంధేయ నిర్మాణ కార్యక్రమాలకు ముఖ్య వేదికగా ఉండి పనిచేస్తున్న మా తెలుగు వారపత్రిక "వాహిని" పట్ల నేను ఎక్కువ అభిమానాన్ని, ఆసక్తిని పెంచుకొన్నాను. 1936 సంవత్సరం నుంచి మేము ఎదుర్కొన్న అన్ని రాజకీయ క్లిష్ట పరిస్థితులలోను వాహిని పత్రిక మీద రైతునాయకుడు గొర్రెపాటి గారి మీద ఎక్కువగా ఆధారపడి భారతీదేవి గారు, నేను నడిచామని చెప్తే లౌకిక దృష్టితో ఆలోచించేవాళ్లకు అది తమాషాగా చెప్పినట్లుంటుంది. 1971-72 ఎన్నికలలో ప్రజల తీర్పు వెలువడిన తరవాత వాహిని పత్రిక తన ముందుమాటతో తన మార్గాన్ని "గరీబీ హఠావో" నినాదానికి అనుకూలంగా సరిదిద్దుకొంది. గాంధేయ ధోరణిలోను కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య లక్ష్యాలను రూపాంతరం చేయడంద్వారా ఏర్పరిచిన 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమాన్ని, నాలుగు అంశాల పథకాన్ని పేదరికాన్ని నిర్మూలించే దృష్టితో ముందుకు తీసుకువచ్చినప్పుడు వాహినిపత్రిక తన పేజీలను వాటికోసం కేటాయించి భారతీయ ప్రజాస్వామ్య పురోభివృద్ధికి దోహదంచేసింది.

కమ్యూనిస్టులు కార్మిక నియంతృత్వానికి, కిసాన్ మజ్‌దూర్ కళాకార బుద్ధిజీవి ప్రజారాజ్య సిద్ధాంతానికి మధ్యనున్న తారతమ్యాలను చూపెట్టి, వాహిని వార పత్రిక ద్వారా తొలిసారిగా మేము పూర్తి ప్రజాస్వామ్యం తో కూడిన కిసాన్ మజ్‌దూర్ కళాకార్ బుద్ధిజీవి ప్రజారాజ్య సిద్ధాంతంపైమా విశ్వాసాన్ని ప్రకటించాం. మేధావులతో నిండి ఉన్న కాంగ్రెస్ నాయకత్వాన్ని స్వాతంత్ర్యం వచ్చిన తరవాత భారత ప్రజలు అమెరికా తరహా బూర్జువా ప్రజాస్వామ్యాన్ని అంగీకరించరని "వాహిని" హెచ్చరించింది. "ప్రపంచ కార్మికులారా ఏకంకండి" అన్న కమ్యూనిస్టుల నినాదానికి ప్రతిగా "వాహిని" పత్రిక "ప్రపంచ రైతులారా ఏకంకండి" అని ధైర్యంతో నినదించింది. బొంబాయి పెట్టుబడిదారుల పథకాలకు, పరిశ్రమలకు నగర ప్రజలందరు అనుకూలంగా, స్వాతంత్ర్యా నంతరం భారత ప్రభుత్వం అమలు జరిపిన నాలుగు పంచవర్ష ప్రణాళికలకు బదులుగా, గాంధేయ పథకాలను బయటికి తీసుకురావాలని స్వయంవృత్తి దారులైన రైతులు, చేతి పనివారల అభివృద్ధికి పథకాలను సిద్ధంచేయాలని వాహిని పత్రిక చాటి చెప్పింది. వెనుకబడిన తరగతులవారు హరిజనులు, గిరిజనులైన అసంఖ్యాక ప్రజానీకానికి పునరుజ్జీవనాన్ని ప్రసాదించాలని మత పెద్దల వ్యత్యాస ధోరణుల నుంచి దోపిడీ దారుల నుంచి వారికి రక్షణ కల్పించాలని ("వాహిని") కోరింది.

కమ్యూనిజాన్నిగాని, సోషలిజాన్నిగాని దేన్నయినా సరే ఆయా జాతుల చరిత్రకు, పరిస్థితులకు, అవసరాలకు సర్దుబాటయ్యే విధంగా పునర్నిర్మించాలని అల్లాంటి జాతీయ విప్లవకృషిని విజయవంతంగా నెరవేర్చడంలో రైతులు, చేతివృత్తులవారు స్వయం వృత్తులతో జీవించే కష్టజీవులు ప్రముఖమైన పాత్రను నిర్వహించగలరని "వాహిని" పత్రిక సాహసంతో ప్రకటించింది.

1976 సంవత్సరంలో బెర్లిన్‌లో జరిగిన ప్రపంచ కమ్యూనిస్టు మహాసభ, కమ్యూనిస్టులైనవారు. ఆయా దేశాలలో ఆయా దేశకాల పరిస్థితులకు అనుకూలంగా రూపుదిద్దుకోవాలని ప్రకటించినందుకు "వాహని" దానిని సంతోషంతో స్వీకరించింది. అప్పుడు జరిగిన కమ్యూనిస్టు మహాసభ సోషలిజం స్థాపనకు కార్మిక నియంతృత్వం అవసరం లేదని పార్లమెంటరీ ప్రజాస్వామ్యం ద్వారా కూడా దానిని సాధించవచ్చునని అచ్చం మాకిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్య ధోరణిని ప్రతిబింబించింది.

1976 వ సంవత్సరంలో కొలంబోలో జరిగిన అలీన దేశాల మహాసభ మిత్రరాజ్య సమితిలోని మూడో ప్రపంచ రాజ్యాలవర్గం గ్రామీణ ప్రజలకోసం, వ్యవసాయదారులకోసం ఒక వేదిక నేర్పాటుచేసి, పారిశ్రామికంగా, వాణిజ్యపరంగా బాగా అభివృద్ధిచెందిన దేశాలు, వర్గాలు, తమ కంటె దిగువ ఉన్న వారి కోసం సులభమైన షరతులతో వాణిజ్యం చేయాలని కోరాయి. వివిధ దేశాలలోను, జాతులలోను ఉన్నవారికి, లేని వారికి సంపదను సమంగా పంపిణీ చేయవలసిన అవసరం ఉందనే అంశాన్ని కూడా వారు గుర్తించారు. బాధలలో ఉన్న మానవ సమాజం పక్షాన వాహని పత్రిక ఈ కోర్కెలను బలపరచింది.

ప్రపంచ రైతాంగ మంతా ఏకమై ప్రపంచ రైతాంగ వేదికను ఏర్పాటు చేసుకోవాలన్న మా ప్రకటనకు కొంచెం దగ్గరలో ఉండేటట్లుగా మాస్కోలో సోవియట్ యూనియన్ స్వర్ణోత్సవాలు జరిగినప్పుడు పలుదే కమ్యూనిస్టు దేశాలకు సంబంధించిన రైతు సంఘాలు, పార్టీలు సమావేశమై వారంతా కలసి ఒక ప్రపంచ సంఘంగా రూపొందాలనుకొంటున్నారని తెలుసుకొన్నప్పుడు వాహని పత్రిక సంతసించింది. సంప్రదాయంగా మేధావులైన వారు, నూతన మేధావివర్గంలో చేరి, వారితో కలసిన వారు ఏకమై రాజకీయ రంగంలో గుత్తాధిపత్యాన్ని సంపాదించుకోగలరని, అందుకు ప్రతిగా సాంఘిక రాజకీయరంగాలలో బాగా వెనుకబడి ఉన్న ప్రజలు ఏకమై ఒక యునైటెడ్ ఫ్రంటునేర్పాటు చేసుకొని కాంగ్రెసు కు వ్యతిరేకంగా పోరాడాలనే నిర్ణయంలో ఆత్మగౌరవాదులు ఉన్నప్పుడు "వాహని" పత్రిక వారితో ఆ దృష్టి సబబైనది కాదని వాదించింది. బాగా ఉన్నత స్థితిలో ఉన్న వర్గాలు బాగా దిగువన ఉన్న వర్గాలకు తగిన సహాయాన్నిందిస్తూ వారిని తమతో సమానమైన స్థాయికి తీసుకొని రాకపోతే మనజాతి ఐక్యత చెడిపోవడమే కాకుండా దేశం దెబ్బతినగలదని గాంధీజీ చెప్పిన హెచ్చరికను వాహని పత్రిక తిరిగి చూపెట్టింది. ఈనాడు "గరీబీ హఠావో" నినాదం ద్వారా స్వయం వృత్తులలో జీవిస్తున్న వారి ఆర్థికాభివృద్ధికి సామాన్యజనుల సంక్షేమానికి చిన్నచిన్న కుటీరాలు, వర్క్‌షాపులు, మగ్గాలు ఉన్నవారి జీవనాధారం కోసం జరుపుతున్న అన్నిరకాల ప్రయత్నాలను చూసి వాహని సంతృప్తి చెందింది.

యుద్ధసమయంలో దానిని సజీవంగా నిలబెట్టేందుకు శ్రీమతి భారతీదేవి, శ్రీ గోగినేని లక్ష్మీనారాయణగార్లు తమ వనరులనన్నింటిని వినియోగించారు. ధరావత్తులను కోరి స్వాధీనం చేసుకొంటామని బ్రిటిషువారు బెదిరిస్తుంటే "క్రాంతి" "గోభూమి"లాంటి కొత్తపేర్లతో ఆ పత్రిక విజయవంతంగా నిలబడటం గొప్పసంగతి. దానిని ప్రింటింగ్ ప్రెస్‌ను కూడా రెండుసార్లు ఎత్తివేసుకోవలసివచ్చింది. ఒక జాయింట్ స్టాక్ కంపెనీ కూడా దాన్ని నిలబెట్ట లేనంత కష్టాలు దాని కోసం పడవలసి వచ్చింది. అనేక మంది కార్యకర్తలు దాని కందించిన

సహాయ సహకారాలను గురించి పడవలసివచ్చింది. అనేక మంది కార్యకర్తలు దానికందించిన సహాయ సహకారాలను గురించి చెప్పాలంటె ఆ విషయం కొన్ని సంపుటాలవుతుంది. శ్రీ పి.శ్యామసుందరరావు, అమరకవి శ్రీ కెల్లిపల్లి, శ్రీ రాఘవదాసు, శ్రీ యన్.వి.సుబ్బయ్య, శ్రీ పసుపులేటి, మాజీశాసనసభ్యులు శ్రీ బ.వి. శివయ్య, మాజీ మంత్రి శ్రీ తిమ్మారెడ్డి, ప్రముఖ న్యాయవాది రచయిత శ్రీ ఆవుల గోపాలకృష్ణమూర్తి, విద్యావేత్త శ్రీ వై.రంగనాయకులు, కవి శ్రీ బాపయ్య, శ్రీ సి.హెచ్. నాగభూషణం బి.ఏ., శ్రీ కొర్ల హరికృష్ణ, శ్రీ భరద్వాజ, శ్రీ చంద్రపాల్ ఇంకా ఎందరో ఇంలాంటి ప్రముఖులైన వ్యక్తులు కొందరు పూర్తికాలం పనిచేసి, కొందరు అప్పుడప్పుడూ పనిచేస్తూ, గిరిజనులు గ్రామీణ ప్రజలు, చేతివృత్తులవారు, చేనేత పనివారు, రైతులు, కేత్‌మజ్‌దూర్‌ల కోసం వాహని పత్రిక నిష్కామంగా చేస్తున్న సేవలపై గౌరవంతో అభిమానంతో దానికి తోడ్పడ్డారు.

ఈ నాలుగు దశాబ్దాలుగా వాహని పత్రికను శ్రీమతి భారతీదేవి, కిసాన్ శ్రీ గొర్రెపాటి, సర్దార్ శ్రీ గొతులచ్చన్న, శ్రీ గోగినేని ఉమా మహేశ్వరరావు, శ్రీ రాజన్న, ప్రస్తుతం శ్రీ గోగినేని నాగేశ్వరరావుగార్ల పర్యవేక్షణలో దేశభక్తి అభ్యుదయ దృష్టిగల సంపాదకులు నిర్వహించారు.

శ్రీ పండితారాధ్యులు, న్యాయపతిః శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు వాహని పత్రికకు తొలి సంపాదకులు. ఆయన శ్రీమతి భారతీదేవిని శ్రీ లక్ష్మీనారాయణ గారిని, శ్రీ బుచ్చినాయుడు గారిని వాహని పత్రిక ప్రారంభించాలని పట్టుబట్టి ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు తెలుగు రచయిత శ్రీ న్యాయపతి నారాయణ మూర్తి గారి ప్రధాన సంపాదకత్వంలో దానిని ప్రారంభించారు. ఒక దశాబ్దంపాటు ఆయన ఆ పత్రికను ఎంతో విశ్వాసంతో శ్రద్ధలు మాత్రమే తీసుకొంటూ నడిపారు. ఆ తరవాత ఆయన ప్రముఖ తెలుగు దిన పత్రికలు ఆంధ్రపత్రిక, ఆంధ్రప్రభకు సంపాదకులుగా పనిచేశారు. ఇటీవల ఆయన పత్రికల నుంచి రిటైరయినప్పుడు పుచ్చుకొంటున్న పెన్షను వాహని పత్రికలో ఆయన గ్రహించినదానికంటె పదిరెట్లు ఎక్కువగా ఉంటుంది. శ్రీ న్యాయపతి నారాయణ మూర్తిగారు వాహనిలో అయిదు సంవ్సరాల కాలం పనిచేసి ఆ తరవాత ఆంధ్ర ప్రభ సంపాదకులై మంచి గౌరవం సంపాదించుకొన్నారు. ఆయన కేంద్రశాసన సభ సభ్యులుగా కూడా పనిచేస్తూ రైతు సమస్యల కోసం వీరుడిలాగ పోరాడారు. శ్రీ పండితారాధ్యుల నాగేశ్వరరావు గారు కిసాన్ మజ్‌దూర్ ప్రజారాజ్యంపై రాసిన "గోభూమి" అనే పాట బాగా ప్రచారంలో కొచ్చింది.

శ్రీ గోగినేని ఉమామహేశ్వరరావు (జి. యు. రావు) బి. ఎస్. సి.ః

1952 వ సంవత్సరపు ఎన్నికలలో మేము బాగా దెబ్బతిన్న తరవాత, శ్రీ జి. యు. రావు "తెలుగు స్వతంత్ర"లో మేనేజరు గాను, సంపాదకులుగాను ఎలాంటి గౌరవ వేతనాన్ని గాని శ్రద్ధలను గాని పుచ్చుకోకుండా పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన పద్య ఖండికలను కూడా రాస్తుండేవారు. ఆయన సారధ్యంలో ఒక దశాబ్దంపాటు "వాహని" గొప్పగా నడచింది. ఆ సందర్భంలో మాకు ఎలాంటి నష్ట రాలేదు. ఆయన "టువార్డ్స్ వరల్డ్ పీస్", క్రెడో ఆఫ్ వరల్డ్ పెజంట్రీ", "వరల్డ్‌రోల్ ఆఫ్ నేషనల్ రివల్యూషన్", "ఫోటో ఆల్బమ్" అనే

నా గ్రంధాలకు తాను సంపాదకత్వం వహించి ప్రచురించి వాటి అమ్మకాలను బాగా అభివృద్ధిపరచారు. వాహిని సారధ్యంలో ఆయన గ్రామీణ పత్రికా విలేఖరుల కోసం శిక్షణా తరగతులను నిర్వహించారు.

శ్రీ కె. సభా : చిత్తూరుకు చెందిన ప్రముఖకవి శ్రీ కె.సభా పద్యరచన లోనూ నాటక రచనలోనూ మంచి పేరు తెచ్చుకొన్నారు. ఆయన కొన్ని సంవత్సరాలు " వాహిని " కోసం పనిచేశారు. ఆ తరవాత ఆయన ఆంధ్రప్రభ సంపాదకత్వంలో చేరి దాని తరవాత చిత్తూరు నుంచి "దేవదత్తం' అనే పేరుతో ఒక సాంత వార పత్రికను ప్రారంభించారు. ఆయన సామాన్యప్రజల కోసం కృషిచేస్తూ మంచి పేరు తెచ్చుకొన్నారు.

శ్రీ కె. వి. సుబ్బయ్య. బి.ఏ. : ఒంగోలుకు శ్రీ కె. వి. సుబ్బయ్య గారు కూడా " వాహిని" పత్రికలో పనిచేశారు. ఆయన కలం మంచివాడి గలది. కిసాన్ యాత్రా స్పెషల్ లో భారత దేశ మంతా పర్యటించిన తరవాత ఆయన యాత్రానుభవాలతో రాసి ప్రచురించిన తెలుగు గ్రంధం "భారతదర్శనం" తెలుగు సాహిత్యానికి పుష్టిని చేకూర్చింది.

శ్రీ బి. ఎన్.ఆర్. క్రిష్ణ: కర్షక పత్రిక సంపాదకులుగా పనిచేసిన శ్రీ బి. ఎస్. ఆర్ క్రిష్ణ గారు కూడా వాహినిలో పనిచేశారు. ఒకవైపు కిసాన్ మజ్ దూర్ ప్రజారాజ్యం మరోవైపు కార్మిక నియంత్రత్వం శ: రెంటినీ పోలుస్తూ ఆయన ఒక మంచి పద్య ఖండిక రాశారు. మద్రాసులో జరుగుతున్న తెలుగు సాహిత్య చర్చావేదికకు ఆయన ప్రముఖ సంధానకర్త.

శ్రీ జి. విశ్వనాధం: తిరువూరు చెందిన శ్రీ.జి. విశ్వనాధం వాహిని పత్రికకు స్వయం రచయితగా సహాయ రచయితగా సహాయపడేందుకు వచ్చి ఆ తరవాత దానికి సంపాదకులయ్యారు. కాలక్రమంలో ఆయన వ్యాపార వేత్తగా మారి ఒక ముద్రణాలయంలో భాగస్వామి కాగలిగారు. ఆయన రాసి వాహినిలో సీరియల్ గా ప్రచురితమై ఆ తరవాత గ్రంధంగా వెలువడిన "నాలో నేను" అనే పుస్తకం మంచి ఆలోచనలను రేకెత్తించేదిగా ఉంది.

వాహిని పత్రికలో పనిచేసేందుకు ఎవరు వచ్చినప్పటికీ వారంతా గొప్ప త్యాగంతోనూ, కష్టపడి పనిచేస్తూనూ వాహిని పత్రిక ఉన్నతాశయాలకు తోడ్పడుతూ ఉండేవారు. ఎప్పుడైనా ఎవరైనా దానిని వదలి వెళ్ళవలసి వస్తే దాని అభిప్రాయాలపై లేదాలో గాక దీర్ఘకాలంగా అక్కడే ఉండి త్యాగాలు చేయలేని కారణంతోనే వెళ్లిపోతుండేవారు. నిజానికి ఇక్కడనుంచి వెళ్లినవారు ఎవరైనా ఏ స్థితిలో, ఏ హోదాలో, ఎక్కడ పనిచేస్తున్నా అక్కడ కూడా "వాహిని" ఆశయాల ప్రచారానికి పాలుపడుతుండేవారు. అది వారికీ " వాహిని" పత్రికకు కూడా గౌరవం చేకూర్చిన ఒక గొప్ప విషయం.

వెలుగు –రైతునిధి శ్రీ వెలగా సుబ్బయ్య

నా స్వగృహం "గోభూమి"ని ఒక విలువైన రైతునిధి కాపాడింది. అది ఒక సైనికుని చేతిసంచి. ఆసైనికుడు ఏ ప్రభుత్వం లోనూ ఉద్యోగం చేయలేదు. ఆ చేతి సంచి ఎలాంటి తూటాలను గానీ, ఆయుధాలను గానీ పెట్టుకునేందుకు ఉద్దేశించింది కాదు. అది ముతక బట్టతో తయారు చేసింది. అది కాకతీయ విజయనగర సాంప్రదాయాలను రంగరించుకొని పుట్టింది. దేశభక్తి కలిగిన ఒక రైతుచే ధరించబడ్డ కాకీరంగులో ఉన్న చేతిసంచి. ఆంధ్రకాంగ్రెస్ కమిటీ నాయకులైన స్వామి సీతారామ్ (సీతారామశాస్త్రి) గారి నాయకత్వాన పాన్నూరులో జరిగిన రైతు సత్యాగ్రహుల మహాసభలో ఇవ్వబడిన సంచి అది. 1921 సంవత్సరంలో కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో మహాత్మాగాంధీగారు సూచించినట్లుగా పన్నుల నిరాకణోద్యమానికి తలపడడానికి ఆ సభ నిర్ణయంతీసుకొంది. ఆ తరువాత ఆ పోరాటం పెదనందిపాడు శిస్తు నిరాకరణోద్యమంగా బాగా ప్రఖ్యాతి వహించింది. ఆ ముతక ఖద్దరు సంచులను ఆనాడు శ్రీశాస్త్రిగారు శ్రీమతి భారతీదేవిగారి జన్మస్థలమైన మాచవరం గ్రామానికి చెందిన అనేక మంది రైతులకు అందజేశారు.

ఆనాడు ఆ సంచిని అడ్డంగా ధరించి కాంగ్రెస్ సూచించిన విధంగా చట్టాలను ధిక్కరించి ప్రభుత్వ శిక్షలకు సంసిద్ధమై మేము పన్ను చెల్లించమని ప్రమాణాలు చేసేందుకుగాను. వారికి ఇవ్వడం జరిగింది. శక్తివంతమైన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేందుకు ఉద్దేశించిన ఆ సంచిని ధరించటానికి వెయ్యికి ఒకరిద్దరు మాత్రమే ముందుకొచ్చారు. నిడుబ్రోలులో యువకులైన చౌధురిగారు రాజకీయ ఆవేశంతో జస్టిస్‌పార్టీ కొనసాగితే తనకు లాభకరంగా ఉండగలదని తెలిసికూడా కొన్ని తరాలుగా తాము అనుభవిస్తున్న గ్రామ మునసబు బాధ్యతలను విస్మరించి ముందుకు వచ్చి ఆ సంచిని ధరించారు. కాంగ్రెస్ తో కలసి పనిచేయడానికి ఆ సమయంలో కొద్దిమంది రైతులు మాత్రమే ధైర్యంగా ముందుకు వచ్చారు. ఆ కొద్దిమందిలో మరీ కొద్దిమంది మాత్రమే నమ్మకంగా ఆ తిరుగుబాటు సంచిని సైన వేసుకున్నారు.

ఆ కాంగ్రెస్ ఖద్దరు సంచులు మాచవరానికి చెందిన ఇద్దరు సోదరులు శ్రీ వెలగా సుబ్బయ్య, శ్రీనరేంద్రగార్లకు అప్పుడు ఇచ్చారు. మన ప్రస్తుత దృష్టిలో వారు బాగా చదువుకున్నవారు కాదు. సుబ్బయ్య గారు పదిమందిలో తిరగడం తెలిసిన వారు. ఆయనకు స్వయంగా సంపాదించుకున్న భూపతి కావలసినంత మేరకుంది. ఆయన పది సంత్సరాలపాటు తమ చుట్టు ప్రక్కల గ్రామాల రైతులకు నాయకత్వం వహించి స్థానిక మురుగు కాల్వల ద్వారా వృధాగా పోతున్న అదనపు జలాలను వినియోగించుకుంటూ కృష్ణా, పశ్చిమ డెల్టా ఆయకట్టులో ఉన్న తమ భూములో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలని కృషిచేశారు. ఆయన ప్రభుత్వ ధోరణితో విసుగుచెందారు. పి.డబ్యు.డి.శాఖ ఎలా అవినీతిమయమై

పోయిందో చూసి ఆయన నిరాశపడ్డారు. (ముఖ్యమంత్రిగా ఉన్న రాజాజీ, 1953 వ సంవత్సరంలో పబ్లిక్ వర్క్స్‌శాఖను, పబ్లిక్ ఎనిమిగా ప్రకటించారు-ఎడిటర్) పబ్లిక్ వర్క్స్ శాఖ, రెవిన్యూ అధికారులనుంచి కనీస ప్రాథమిక అవసరాల కొరకైన సేవలను పొందేందుకయినా రైతులను సమీకరించి కృషి చేయవలసిన అవసరం ఉందని అప్పుడాయన గ్రహించారు. ఆయనను, ఆయన మిత్రులను వారి రైతు సంఘం ద్వారా పోరాడవలసిందని నేను సంప్రోక్షించాను. మహాత్మాగాంధీగారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని రాక్షస ప్రభుత్వంగా అభివర్ణించినప్పుడు పదిసంవత్సరాల తన అనుభవంతో పోల్చుకొని శ్రీ సుబ్బయ్యగారు ఇంకింతకంటె ఎలా చెప్పగలరులే అని సంతృప్తిపడ్డారు. అప్పుడు ఆయన జిల్లా కాంగ్రెస్ నాయకులైన శ్రీ వీరయ్య చౌదరిగారి చేత ఖాదీ సంచిని తగిలించుకున్నందుకుగాను అభినందించబడ్డారు. జాతీయ పోరాట దీక్షను చేబూని ఉద్యమ నాయకులుగా పనిచేస్తున్న వీరయ్య చౌదరిగారు ప్రభుత్వానికి తోడ్పడలేదని గ్రామకరణాలు, మునసబులు అదిరించి, బెదిరించి, లాలించినా గూడా లొంగిరాలేదు. బ్రిటిష్ సైన్యాలు తమ గ్రామాలెంట నడుస్తూ బెదిరించినా గూడా వారు లెక్కచేయలేదు. పెదనందిపాడు ప్రాంతం బ్రిటిష్ సామ్రాజ్య ఎల్లల నుంచి విడివడినట్లయింది. మా తండ్రి గారికి స్నేహితులైన చందోలు గ్రామకరణం (10-12 శతాబ్దాలనాటి వెలమాటి చోళుల పాలనలో అది ముఖ్యపట్టణంగా ఉండేది.) గారు ముందుకు వచ్చి పెదనందిపాడు తూర్పు ప్రాంత రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించారు.అనేకమంది గ్రామకరణాలు, మునసబులు పలుకుబడి కలిగిన రైతులు కలసికట్టుగా ఈ ఉద్యమంలో పనిచేస్తుండడంతో బ్రిటిష్ వారికి వారి అనుయాయులైన జస్టిస్‌పార్టీ వారికి భూములు ఎవరెవరి పేరుతో ఉన్నాయో భూమి శిస్తు ఎంతెంత రావాలో ఏవీ పట్టాలలో ,ఎవరికి ఎంత భూమి ఉందో కనుక్కోవడం కష్టమై పోయింది. అనేక సందర్భాలలో సైనికులకు ఒక గ్రామం నుంచి ఇంకొక గ్రామానికి ఎలా వెళ్లాలో దారులు తెలియలేదు. కొన్ని రోజులలో, కొన్ని సందర్భాలలో వారికి త్రాగేందుకు మంచినీరు; నిత్యావసర వస్తువులు కూడా లభించలేదు. అప్పటికి కాంగ్రెస్ సాధించిన పట్టు అలాంటిది. అందుకుగాను దేశభక్తులయిన రైతు సుబ్బయ్య గారిని కరణం రామమూర్తి గారిని వారి సహచరులను మనం కొనియాడవలసిందే.

శ్రీ సుబ్బయ్యగారు నల్లగా ఉండి బలంతోనూ, ధైర్యంతోనూ, బారు చేతులతోనూ గొప్పగా కనిపించేవారు. కుదురైన ముఖంతో, వంపులు తిరిగిన జుట్టుతో బాగా ఆకర్షణీయంగా కనిపించేవారు. సత్యాగ్రహంలో పాల్గొనే నాటికి ఆయన వయస్సు యాభై సంవత్సరాలకు పైబడింది. పాలాలలో శారీరకంగా కష్టించి పనిచేసిన ఆయన చేతులు గట్టిగా ఉండేవి. ఆయనకు వ్యవసాయం అన్నా, పశువుల పెంపకం అన్నా మంచి ఇష్టం. పశువైద్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. తన చుట్టూ ఉండే జనంతోనూ, తన కుటుంబ సభ్యులతోను ఆయన చాలా సంతోషంగా మెలుగుతుండేవారు. తన దగ్గర పనిచేసే కూలీలపై ప్రేమతో, ఆప్యాయతతో మెలుగుతూ ఒక ఆదర్శరైతుగా జీవిస్తుండేవారు. రైతుగా సేద్యం చేసుకుంటూ తనకు తాను స్వయంగా జీవించగలుగుతున్నందుకు ఆయన ఎంతగానో గర్వపడేవారు.

ఆ ఖద్దరు సంచిని పైన వేసుకొన్న ఆ సుబ్బయ్యగారు, పెదనందిపాడు శిస్తునిరాకరణ పోరాటంలో విశ్వాసంతో పాల్గొన్న వారు, బ్రిటిష్ ప్రభుత్వం వారు విధించిన అపరాధపు

పన్నును చెల్లించ నిరాకరించిన వారు ఎవరో కాదు శ్రీమతి భారతీదేవిగారి తండ్రి గారు. ఆ సమయంలో నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదువు కొనసాగిస్తున్నాను. 1921-22 సంవత్సరాలలో జరిగిన ఇండియన్ మజ్లిస్ ప్రసంగాలలో నేను రైతునాయకులు వెలగా సుబ్బయ్యగారి ప్రాంతం నుంచి వచ్చిన వాడినని గర్వంగా చెప్పుకొన్నాను. 1924వ సంవత్సరంలో నాకు, శ్రీమతి భారతీ దేవి గారికి వివాహమైంది. 1931-33 సంవత్సరాలలో మేమిద్దరం కలసి కాంగ్రెస్ పోరాటంలో ప్రవేశించాం. అప్పుడు శ్రీమతి భారతీ దేవి రహస్యంగా ఉంటూ సత్యాగ్రహం కోసం మహిళా కార్యకర్తల్ని సమీకరించేందుకు పూనుకొన్నారు. 1931లో తెనాలి పట్టణంలో విదేశీ వస్తువులను అమ్మరాదని, విదేశీ బట్టలను ధరించరాదని విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో ఆమె తీవ్రంగా కృషిచేస్తున్న రోజులలో ఆమె తండ్రి వెలగా సుబ్బయ్యగారు వారి కుటుంబపరంగా జరిగిన ఒక వేడుకలో ఎంతో విలువగా, ఒక నిధిలాగా ఆయన దాచి పెట్టిన ఆ ఖద్దరు సంచిని ఆమెకు బహుమతిగా ఇచ్చారు. అప్పుడామె ఆ సంచిని భుజాలకు తగిలించుకొని ఎంతో గొప్పగా ఉన్నతంగా అనుభూతిని పొందుతుండడం చూసి ఆయన తన దేశభక్తి పరమైన, సాహసవంతమైన ఆ సంపదను తన కుమార్తెకు అందించగలిగినందుకు, తన కుటుంబ వారసత్వాన్ని పోగొట్టుకోకుండా జాతీయసేవలో పాల్గొనేందుకు ఆమె దానిని స్వీకరించినందుకు గొప్పగా గర్వపడ్డారు.

1941వ సంవత్సరంలో నేను జైలులో ఉన్నప్పుడు ఆయన తన అఖరు ఏడు సంవత్సరాల జీవితాన్ని శ్రీమతి భారతీదేవిగారికి చిన్న వ్యవసాయ కుటుంబాన్ని సాగుచేయటంలో సహాయపడుతూ గడిపి మమ్ములను వీడి స్వర్గస్తులైనారు. యుద్ధ సమయంలోని నా తొలి నిర్బంధంనుంచి బైటపడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేయాలని రైలు ఎక్కుతున్న సమయంలో తిరిగి నిర్బంధ ఉత్తర్వులను తీసుకొచ్చి బ్రిటిష్ అధికారులు నన్ను తీసుకెళ్లి నెల్లూరులో నిర్బంధించారు. అప్పుడు కూడా భారతీదేవిగారే నా బాధ్యతలను పూర్తి చేయవలసి వచ్చింది. నా రైతాంగ పోరాటాల్లోనూ, అనేక జాతీయ సమావేశాల సందర్భాలలోను ఆమె ఆ సంచిని గౌరవంగా ప్రదర్శించి చూపెడుతూ ఉండేది. కాంగ్రెస్ పార్టీ సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి ఆమె తండ్రి లాంటి చిన్న చిన్న రైతులను అనేక మందిని స్వయం వృత్తుల నుంచి ఆర్థిక స్వాతంత్ర్యం నుంచి వెడలగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్న తరుణంలో ఆనాడు ఆమె తండ్రిలాగే తిరిగి నేను పోరాటానికి ఉద్యుక్తుడ నైనప్పుడు 1958వ సంవత్సరంలో ఆ ఖద్దరు సంచీని ఆమె నాకు గర్వంగా బహుమతిగా ఇచ్చింది.

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

పోయిందో చూసి ఆయన నిరాశపడ్డారు. (ముఖ్యమంత్రిగా ఉన్న రాజాజీ, 1953 వ సంవత్సరంలో పబ్లిక్ వర్క్స్‌శాఖను, పబ్లిక్ ఎనిమీగా ప్రకటించారు-ఎడిటర్) పబ్లిక్ వర్క్స్ శాఖ, రెవిన్యూ అధికారులనుంచి కనీస ప్రాథమిక అవసరాల కొరకైన సేవలను పొందేందుకయినా రైతులను సమీకరించి కృషి చేయవలసిన అవసరం ఉందని అప్పుడాయన గ్రహించారు. ఆయనను, ఆయన మిత్రులను వారి రైతు సంఘం ద్వారా పోరాడవలసిందని నేను సంపోషించాను. మహాత్మాగాంధీగారు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని రాక్షస ప్రభుత్వంగా అభివర్ణించినప్పుడు పదిసంవత్సరాల తన అనుభవంతో పోల్చుకొని శ్రీ సుబ్బయ్యగారు ఇంకింతకంటె ఎలా చెప్పగలరులే అని సంతృప్తిపడ్డారు. అప్పుడు ఆయన జిల్లా కాంగ్రెస్ నాయకులైన శ్రీ వీరయ్య చౌదరిగారి చేత ఖాదీ సంచిని తగిలించుకున్నందుకుగాను అభినందించబడ్డారు. జాతీయ పోరాట దీక్షను చేబూని ఉద్యమ నాయకులుగా పనిచేస్తున్న వీరయ్య చౌదరిగారు ప్రభుత్వానికి తోడ్పడలేదని గ్రామకరణాలు, మునసబులు అదిరించి, బెదిరించి, లాలించినా గూడా లొంగిరాలేదు. బ్రిటిష్ సైన్యాలు తమ గ్రామంచెంట నడుస్తూ బెదిరించినా గూడా వారు లెక్కచేయలేదు. పెదనందిపాడు ప్రాంతం బ్రిటిష్ సామ్రాజ్య ఎల్లల నుంచి విడివడినట్లయింది. మా తండ్రి గారికి స్నేహితులైన చందోలు గ్రామకరణం (10-12 శతాబ్దాలనాటి వెలనాటి చోళుల పాలనలో అది ముఖ్యపట్టణంగా ఉండేది.) గారు ముందుకు వచ్చి పెదనందిపాడు తూర్పు ప్రాంత రైతాంగ పోరాటానికి నాయకత్వం వహించారు.అనేకమంది గ్రామకరణాలు, మునసబులు పలుకుబడి కలిగిన రైతులు కలసికట్టుగా ఈ ఉద్యమంలో పనిచేస్తుండడంతో బ్రిటిష్ వారికి వారి అనుయాయులైన జస్టిస్‌పార్టీ వారికి భూములు ఎవరెవరి పేరుతో ఉన్నాయో భూమి శిస్తు ఎంతెంత రావాలో ఏవీ పట్టాలలో ,ఎవరికి ఎంత భూమి ఉందో కనుక్కోవడం కష్టమై పోయింది. అనేక సందర్భాలలో సైనికులకు ఒక గ్రామం నుంచి ఇంకొక గ్రామానికి ఎలా వెళ్లాలో దారులు తెలియలేదు. కొన్ని రోజులలో, కొన్ని సందర్భాలలో వారికి త్రాగేందుకు మంచినీరు, నిత్యావసర వస్తువులు కూడా లభించలేదు. అప్పటికి కాంగ్రెస్ సాధించిన పట్టు అలాంటిది. అందుకుగాను దేశభక్తులయిన రైతు సుబ్బయ్య గారిని కరణం రామమూర్తి గారిని వారి సహచరులను మనం కొనియాడవలసిందే.

శ్రీ సుబ్బయ్యగారు నల్లగా ఉండి బలంతోనూ, ధైర్యంతోనూ, బారు చేతులతోనూ గొప్పగా కనిపించేవారు. కుదురైన ముఖంతో, వంపులు తిరిగిన జుట్టుతో బాగా ఆకర్షణీయంగా కనిపించేవారు. సత్యాగ్రహంలో పాల్గొనే నాటికి ఆయన వయస్సు యాభై సంవత్సరాలకు పైబడింది. పాలాలలో శారీరకంగా కష్టించి పనిచేసిన ఆయన చేతులు గట్టిగా ఉండేవి. ఆయనకు వ్యవసాయం అన్నా, పశువుల పెంపకం అన్నా మంచి ఇష్టం. పశువైద్యంలో మంచి ప్రావీణ్యం ఉంది. తన చుట్టూ ఉండే జనంతోనూ, తన కుటుంబ సభ్యులతోను ఆయన చాలా సంతోషంగా మెలుగుతుండేవారు. తన దగ్గర పనిచేసే కూలీలపై ప్రేమతో, ఆప్యాయతతో మెలుగుతూ ఒక ఆదర్శరైతుగా జీవిస్తుండేవారు. రైతుగా సేద్యం చేసుకుంటూ తనకు తాను స్వయంగా జీవించగలుగుతున్నందుకు ఆయన ఎంతగానో గర్వపడేవారు.

ఆ ఖద్దరు సంచిని పైన వేసుకొన్న ఆ సుబ్బయ్యగారు, పెదనందిపాడు శిస్తునిరాకరణ పోరాటంలో విశ్వాసంతో పాల్గొన్న వారు, బ్రిటిష్ ప్రభుత్వం వారు విధించిన అపరాధపు

పన్నును చెల్లించ నిరాకరించిన వారు ఎవరో కాదు శ్రీమతి భారతీదేవిగారి తండ్రి గారు. ఆ సమయంలో నేను ఆక్స్‌ఫర్డ్‌లో చదువు కొనసాగిస్తున్నాను. 1921-22 సంవత్సరాలలో జరిగిన ఇండియన్ మజ్లిస్ ప్రసంగాలలో నేను రైతునాయకులు వెలగా సుబ్బయ్యగారి ప్రాంతం నుంచి వచ్చిన వాడినని గర్వంగా చెప్పుకొన్నాను. 1924వ సంవత్సరంలో నాకు, శ్రీమతి భారతీ దేవి గారికి వివాహమైంది. 1931-33 సంవత్సరాలలో మేమిద్దరం కలసి కాంగ్రెస్ పోరాటంలో ప్రవేశించాం. అప్పుడు శ్రీమతి భారతీ దేవి రహస్యంగా ఉంటూ సత్యాగ్రహం కోసం మహిళా కార్యకర్తల్ని సమీకరించేందుకు పూనుకొన్నారు. 1931లో తెనాలి పట్టణంలో విదేశీ వస్తువులను అమ్మరాదని, విదేశీ బట్టలను ధరించరాదని విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో ఆమె తీవ్రంగా కృషిచేస్తున్న రోజులలో ఆమె తండ్రి వెలగా సుబ్బయ్యగారు వారి కుటుంబపరంగా జరిగిన ఒక వేడుకలో ఎంతో విలువగా, ఒక నిధిలాగా ఆయన దాచి పెట్టిన ఆ ఖద్దరు సంచిని ఆమెకు బహుమతిగా ఇచ్చారు. అప్పుడామె ఆ సంచిని భుజాలకు తగిలించుకొని ఎంతో గొప్పగా ఉన్నతంగా అనుభూతిని పొందుతుండడం చూసి ఆయన తన దేశభక్తి పరమైన, సాహసవంతమైన ఆ సంపదను తన కుమార్తెకు అందించగలిగినందుకు, తన కుటుంబ వారసత్వాన్ని పోగొట్టుకోకుండా జాతీయసేవలో పాల్గొనేందుకు ఆమె దానిని స్వీకరించినందుకు గొప్పగా గర్వపడ్డారు.

1941వ సంవత్సరంలో నేను జైలులో ఉన్నప్పుడు ఆయన తన ఆఖరు ఏడు సంవత్సరాల జీవితాన్ని శ్రీమతి భారతీదేవిగారికి చిన్న వ్యవసాయ కుటుంబాన్ని సాగుచేయటంలో సహాయపడుతూ గడిపి మమ్ములను వీడి స్వర్గస్తులైనారు. యుద్ధ సమయంలోని నా తొలి నిర్బంధంనుంచి బైటపడి ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు సంతాపాన్ని తెలియజేయాలని రైలు ఎక్కుతున్న సమయంలో తిరిగి నిర్బంధ ఉత్తర్వులను తీసుకొచ్చి బ్రిటిషు అధికారులు నన్ను తీసుకెళ్లి నెల్లూరులో నిర్బంధించారు. అప్పుడు కూడా భారతీదేవిగారే నా బాధ్యతలను పూర్తి చేయవలసి వచ్చింది. నా రైతాంగ పోరాటాల్లోనూ, అనేక జాతీయ సమావేశాల సందర్భాలలోను ఆమె ఆ సంచిని గౌరవంగా ప్రదర్శించి చూపెడుతూ ఉండేది. కాంగ్రెస్ పార్టీ సహకార వ్యవసాయాన్ని ప్రవేశపెట్టి ఆమె తండ్రి లాంటి చిన్న చిన్న రైతులను అనేక మందిని స్వయం వృత్తుల నుంచి ఆర్థిక స్వాతంత్ర్యం నుంచి వెడలగొట్టేందుకు ప్రయత్నం చేస్తున్న తరుణంలో ఆనాడు ఆమె తండ్రిలాగే తిరిగి నేను పోరాటానికి ఉద్యుక్తుడ నైనప్పుడు 1958వ సంవత్సరంలో ఆ ఖద్దరు సంచీని ఆమె నాకు గర్వంగా బహుమతిగా ఇచ్చింది.

అన్నమయ్య గ్రంథాలయం
బృందావన్ గార్డెన్స్, గుంటూరు-6

దేశభక్త – శ్రీ కొండా వెంకటప్పయ్య

నేను దేశ భక్త కొండా వెంకటప్పయ్యగారి గురించి, మా గ్రామమైన నిడుబ్రోలుకు 14 మైళ్ల దూరంలో ఉన్న బాపట్ల లో ఆంధ్రమహాసభలు జరుగుతున్నప్పుడు, మా మామగారైన రామస్వామిగారి ద్వారా, నా సాంస్కృతిక బోధకులైన ఆంజనేయులుగారి ద్వారా తెలుసుకున్నాను. వారిద్దరూ ఆయనను చాలా గొప్పగా ప్రశంసించారు. గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తూ బాగా ఆదాయం వస్తున్న తన న్యాయవాదవృత్తిని ఆంధ్రోద్యమం కోసమై ఆయన వదలి వేశారు. అది జరిగిన తరువాత 7-10 సంవత్సరాలకు మహాత్మాగాంధీగారు ఈ పద్ధతిని అనుసరించవలసిందిగా ఎలాంటి ప్రతిఫలం లేకుండా పూర్తికాలం ప్రజాసేవలో పాల్గొనవలసిందిగా ప్రజాసేవకులను కోరారు. అలాంటి త్యాగాల ద్వారా లభించగల పూర్తి త్యాగఫలాన్ని గురించి అప్పుడు నేను తెలుసుకున్నానని చెప్పలేను. 1930 తరవాత దేశభక్త వెంకటప్పయ్య గారు చూపించిన దారిలో 50 సంవత్సరాలకు పైగా ధైర్యంతో ఇలాంటి కఠినతర మైన మార్గంలో ప్రయాణం చేసిన తరవాత ఆత్మత్యాగం విలువ ఎంత గొప్పదో ఈనాడు నా అనుభవం ద్వారా నేను మీ ముందుంచగలను. 1921 వ సంవత్సరంలో ఆంధ్ర ఉద్యమాన్ని విస్తృతమైన దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మాగాంధీగారి పై విశ్వాసముంచి ఆయనను కలిసి దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాతనే ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేసుకోగలమని ధైర్యంతో ప్రకటించి, తన త్యాగాన్ని మరొక మారు ప్రదర్శించి చూపారు. అనేక మంది నాయకులు ఇలాగే భాషాప్రయుక్త రాష్ట్రాలకై పోరాడుతున్నవారు మహారాష్ట్ర, విదర్భ, ఒరిస్సా, సింధురాష్ట్రాలకు సంబంధించిన వారు శ్రీ వెంకటప్పయ్యగారిలాగే గాంధీ గారితో కలవడానికి వారి సంకుచిత దృష్టి కారణంగా యిష్టపడలేదు. బ్రిటిషు వారితో సహకరించి వారు సింధు, ఒరిస్సా, అస్సాం, నార్త్ వెస్ట్ ఫ్రాంటియర్ రాష్ట్రాలను ఏర్పరచుకోగలిగారు. అయితే ఆంధ్రులు మాత్రం ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత 1953 వ సంవత్సరం వరకు వేచి ఉండవలసి వచ్చింది.

1917వ సంవత్సరంలో నెల్లూరులో జరిగిన ఆంధ్ర మహాసభకు నేను హాజరయ్యేనాటికే ఆంధ్ర ప్రజలు ఆయనను "దేశభక్త"గా గౌరవంతో పిలుచుకొంటున్నారు. ఆయన ఆ సభకు అధ్యక్షత వహించి ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారిని ఆంధ్రుల గౌరవ చిహ్నంగా ఆహ్వానించారు. అనేక మంది ఆయన సహచరులు సర్ బి.ఎన్.శర్మ, సర్ ఎం.రామచంద్రరావు, సర్ కె.వి. రెడ్డినాయుడు వంటివారు ఆతరువాత ప్రభుత్వ ఉద్యోగాలలోకి వెళ్లారు. అయితే ఆయన మాత్రం అలాకాక ఒక విప్లవోద్యమంలోనుంచి మరొక దాని లోనికి పయనిస్తూ జాతీయ నాయకులలో ఒకరుగా పెరిగారు.

ఆంధ్రసంఘం, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ సంఘంలో విలీనమైపోయిన తరువాత ఆయన సహజంగానే దానికి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. అప్పుడు శ్రీ టంగుటూరి ప్రకాశం, సాంబమూర్తి,

శ్రీ సీతారామశాస్త్రి, ఆంధ్రరత్న , డాక్టర్ పట్టాభి, యం. క్రిష్ణారావు, దేశోద్ధారక నాగేశ్వరరావు, కాళేశ్వరరావు, ఉన్నవ, రాఘవయ్యనాయుడు, చెరుకువాడ, నారాయణరాజు, న్యాయపతిగార్ల వంటి ప్రముఖులైన ఆయన సహచరులంతా ఆయన చుట్టూజేరి ఆయనతో కలసి సహాయ నిరాకరణోద్యమంలోనూ పన్నుల నిరాకరణోద్యమంలోనూ 1921-22 నాటి అన్ని సత్యాగ్రహ పోరాటాలలోనూ ఆంధ్రులకు ఒక సమర్థవంతమైన నాయకత్వాన్ని సమకూర్చగలిగారు. మహాత్మాగాంధీగారు దేశభక్త కొండా వెంకటప్పయ్యగారు తనకు ఇస్తున్న విశ్వాసపాత్రమైన సమర్థనను ప్రాథమికంగా విజయవంతమైన వీరయ్యచౌదరిగారి పెదనందిపాడు శిస్తు నిరాకరణోద్యమాన్ని గురించి ఆంధ్రరత్న శ్రీ దుగ్గిరాల గోపాలక్రిష్ణయ్య చీరాల పురపాలక సంఘ వ్యతిరేకపోరాటాన్ని గురించి తెలుసుకొని సంతోషించారు.

1920 వ సంవత్సరానికి ముందున్న మద్రాసు లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో సభ్యులుగా ఉంటూ ఆయన అప్పుడు ప్రారంభిస్తున్న ప్రజాగ్రంథాలయాలకు నిధులు చేకూర్చే కృషిలో విజయులైనారు. తిరిగి ఆయన 1936 వ సంవత్సరంలో శాసన సభ్యులైనారు. అప్పుడు పేద ప్రజల కోసం, రైతుజన సంక్షేమంకోసం ప్రజాజీవితంలో ఉన్నత విలువలను స్థాపించాలని ఆయన కృషిచేశారు.

రైతాంగ ఉద్యమం విప్లవ ప్రాధాన్యాన్ని మొదట గుర్తించిన వారిలో ఆయన ఒకరు. నిడుబ్రోలు లో 1934 సంవత్సరంలో మా రైతాంగ విద్యాలయం ప్రారంభ సమావేశానికి అందువల్ల ఆయనను అధ్యక్షులుగా మేము ఆహ్వానించాం. అప్పటి నుంచి సానుభూతితో నా రైతు ఉద్యమాన్ని గురించి, విద్యాలయాన్ని గురించి ఆయన ఎప్పుడూ తెలుసుకొంటుండేవారు.

ఆయన ఆంధ్రప్రజలు బాగా విద్యావంతులు కావాలని రాజకీయ సమస్యలను చక్కగా గ్రహించగలగాలని అందుకుగాను తెలుగులో మంచి పుస్తకాలురావాలని కోరుకుంటుండేవారు. ఆ రీతిలో ఆయన డాక్టరు పట్టాభిగారితోనూ, ముట్నూరు కృష్ణారావుగారితోనూ చేయికలిపి మచిలీపట్టణం నుంచి కృష్ణా పత్రికను ప్రారంభించి దానికి తొలి సంపాదకులుగా ఉన్నారు. ఆయన ఉద్యమం పై ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించి అందులో స్థానిక భాషల సాహిత్యాన్ని అభివృద్ధిపరచటం ద్వారా బాల్కన్ దేశాల ప్రజలు తమ జాతులను ఎలా అభివృద్ధిపరచుకున్నారో వివరించారు. నూతన రాజకీయసంస్థలు అనే నా తెలుగు గ్రంథాన్ని 1934వ సంవత్సరంలో ఆయనకు అంకితం ఇచ్చి ఆయన పట్ల గౌరవాన్ని ప్రకటించుకొన్నాను.

ఆంధ్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరవాత ఆయనకు అభినందనలు తెలుపుకొనేందుకు ఆయన దగ్గరకు వెళ్లే అదృష్టం నాకు కలిగింది. వృద్ధాప్యంలో ఉన్నప్పటికీ ఆయన కళ్లు ఎంత చక్కగా వెలిగాయి. ఆయన చిన్న కంటి అద్దాల ఫ్రేం ఉద్రేకంతో ముందుకు వస్తే ఆయన మంద్రస్వరం పెద్దవారని తెలియజేసింది. రాష్ట్ర కాంగ్రెస్ సంఘం తరపున స్వరాజ్యం వచ్చిందని నేను ఆయనకు తెలియజేశాను. జాతీయ పోరాటంలో మా అందరికీ ముందు నడుస్తూ మాకు నాయకులుగా ముందు నిలిచిన ఆయనకు, తన అనుచరులు, సహచరులైన మానుంచి అలాంటి గౌరవాన్ని పొందగలిగే అర్హత ఉంది.

దేశభక్త స్వభావరీత్యా ఆపుకోలేని ఆవేశం కలిగిన ఆంధ్రులు. అప్పటి మదరాసు రాష్ట్ర

ముఖ్యమంత్రి శ్రీ టంగుటూరి ప్రకాశం గారిని దించివేయాలనే ప్రయత్నంలో అనేక మంది ఆంధ్రా కాంగ్రెస్ సభ్యులున్నప్పుడు ఎనభై సంవత్సరాల వయస్సులో ఉండి ఆయన ఎకాఎకిన ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ నాయకులైన నెహ్రూగారిని, సర్దార్ పటేల్ గారిని అందుకు అంగీకరించవద్దని ఎలాంటి ఆరోపణలు లేకుండా ఊరికే తమకు యిష్టం లేదనే కారణంతో ప్రకాశం గారిపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి అనుమతించడం అప్రజాస్వామికమని ఇటువంటి ఈర్ష్యా పూరిత చర్యలు ముందు ముందు దుష్ట సాంప్రదాయాలను నెలకొల్పగలవని, వారు వినిపించుకోరని తెలిసినప్పటికి ఆయన చెప్పారు.

నెల్లూరు జైలులో ఆయనతో సహ ఖైదీగా ఉండడం నా అదృష్టం. దేశభక్త, దేశోద్ధారకులు ఇద్దరూ కూడా జైళ్లలో గడిపిన సామాన్య జీవనాన్ని చూసి కఠిన నియమాలను నేను ఆశ్చర్య పోయేవాడిని. వారెప్పుడూ ఎవరేది చెప్పినా ఓర్పుతో వినేవారేగానీ, అసహనంతో గొణగడాన్ని నేను చూడలేదు. అందరిలో దేవుడున్నాడని చిన్నవారైనా, పెద్దవారైనా అందరినీ సమానంగా భావించాలనే దృష్టిని వారెప్పుడూ వదలి వ్యవహరించేవారుకాదు.

ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు జాతీయ నాయకత్వం ముందుగా చర్యను తీసుకోలేక పోయినందుకు ఆయన ఎక్కువగా అసంతృప్తి చెందారు. ఆయన 1936-39 సంవత్సరాలలో మద్రాసులో మొదటి కాంగ్రెస్ మంత్రివర్గం ఏర్పడినప్పుడే ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని వత్తిడి చేశారు. అయితే ఆ మంత్రివర్గ అధివేతల ప్రవర్తనకు ఆ సందర్భంలో ఆయన చాలా బాధపడ్డారు, ఆ తరువాత శ్రీ జవహర్-శ్రీ వల్లభాయ్-శ్రీ పట్టాభిగార్లతో ఏర్పడిన కమిటీ ఆంధ్రరాష్ట్ర ఏర్పాటుకై తమ నివేదికలో పూర్తి మద్రాసుతో గాని, లేదా మద్రాసులోని కొంత ప్రాంతాన్ని ముఖ్య పట్టణంగా ఉంచిగానీ, ఆంధ్రరాష్ట్రాన్ని ఏర్పరిచేందుకు చోటు కల్పించక పోవడంతో, ఆయన అనారోగ్య పరిస్థితులలో బెడ్‌పై ఉండికూడా లేచి పట్టుదలతో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉండి విజయవాడలో నేను ఏర్పాటుచేసిన నిడుమ సభకు అధ్యక్షులుగా ఉండడానికి విజయవాడ వచ్చారు. 84 సంవత్సరాల వయస్సులో ఉండి ఆయన తాను బ్రతికున్న ఆఖరు క్షణాల్లోనైనా ఆంధ్రరాష్ట్రం స్థాపకులుగా ఎలా గౌరవిస్తామో అలాగే అఖిల భారత స్థాయిలో భాషా ప్రయుక్త రాష్ట్రాల పితామహునిగా శ్రీ వెంకటప్పయ్య గారిని మేము ప్రశంసిస్తూ ఆయనలో ఆంధ్రుల గొప్పతనాన్ని చూసుకొంటాం.

దేశభక్త శ్రీ వెంకటప్పయ్య గారు బాగా ముందు చూపు కలవారు, దయార్ద్ర హృదయులు, తన అనుచరులు జాతీయ నాయకులుగా ప్రత్యేక గౌరవాన్ని పొందటాన్ని చూసినప్పుడు ఆయన పరమానందాన్ని పొందుతుండేవారు. 1934 వ సంవత్సరంలో నేను, దేశోద్ధారక, ఉన్నవవారు, కేంద్రశాసన సభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థులుగా నిలబడినప్పుడు ఆ దశాబ్దంలో అది అసాధారణమైన గౌరవం, అందరికీ లభించేది కాదు. ఆయన మాకోసం మహోత్సాహంతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆ రోజుల్లో జాతి అగ్రసభగా భావించే కాంగ్రెస్ కార్యవర్గ సభ్యత్వానికి 1946-47 సంవత్సరాలలో నన్ను గాంధీగారు ఆహ్వానించినప్పుడు తాను 30వ దశకంలో అధిరోహించిన ఆస్థానంలోకి రాగలిగినందుకు

నన్ను గొప్పగా ఆయన అభినందించారు. బాపూజీ సీతారామశాస్త్రిగారిని తన నిర్మాణ కార్యక్రమ కృషిలో ఆంధ్ర ప్రతినిధిగా ప్రకటించి నప్పుడు వినయాశ్రమానికి తన హృదయ పూర్వకమైన పూర్తి సమర్థనను అందించటానికి వెంకటప్పయ్యగారు ముందుకొచ్చారు.

ప్రజా జీవితంలో కొనసాగుతున్న మన మంత్రులు, రాజకీయనాయకులు ధర్మకర్తలుగా ప్రవర్తిస్తూ ప్రతివారితో స్నేహితులుగా, ప్రజాసేవకులుగా ఉంటూ ఉన్నత నైతిక విలువలను స్థాపించాలని ఆయన గట్టి పట్టుదలతో ఉండేవారు. దేశభక్తుడు గౌరవంతో పెన వేసుకొన్న గాంధేయ విలువలు అటువంటివి.

కాంగ్రెస్ అధికారంలో కొచ్చిన రెండు సంవత్సరాల తరవాత అధికారాన్ని ఒక మంత్రి స్వప్రయోజనాలకు వాడుకున్నాడని తెలిసినప్పుడు అనేక మంది మంత్రులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విన్నప్పుడు ఆయన హృదయం వేదనతో ముక్కలు చెక్కలైంది. బ్రిటిషు వారిచే ప్రారంభించబడి జవహర్లాల్ గారిచే కొనసాగించబడుతున్న ఆహారధాన్యాలు, తదితర జీవితావసర వస్తువులపై కంట్రోళ్లకు వ్యతిరేకంగా నేను పోరాటంలో ఉన్న న్యాయాన్ని ఆయన గుర్తించారు. అప్పుడు ఆయన బాపూజీకి శాశ్వతంగా గుర్తుంచుకోదగిన ఒక ఉత్తరం రాస్తూ అందులో కంట్రోళ్ల పద్ధతికి వ్యతిరేకంగా నైతికపరమైన తమ నిరసనను తెలియజేస్తూ అవినీతి, అవసవ్య విధానాల కారణంగా ప్రజాపాలనలో సంభవించనున్న నష్టాలను ఆయన ఎత్తిచూపెట్టారు. మహాత్మాగాంధీగారు దానితో ఏకీభవించి తన సాయంకాలపు ప్రార్థనా సమావేశంలో ఆ లేఖలోని కొంత భాగాన్ని చదివి వినిపించారు. అప్పటినుంచి అంటే 1948 గడచిపోయిన తరవాత 26 సంవత్సరాలకు కూడా ఈ కంట్రోళ్ల లైసెన్సుల, పర్మిట్ల రాజ్యపాలన ప్రజాజీవితాన్ని వివిధంగా క్రిందకు దిగజారుస్తుందో మహాత్మ, దేశభక్తులు కోరిన ఉన్నత విలువలను వీరకంగా నేలపాలవుతున్నాయో చూడండి.

దేశభక్త శ్రీ కొండా వెంకటప్పయ్యగారి కుమార్తె శ్రీమతి పార్వతీదేవి అనేక కేంద్రాలలో మహిళా సంఘాలు, అనాథసేవా కేంద్రాలను, స్త్రీ సంక్షేమ కేంద్రాలను అభివృద్ధి పరచేందుకు ఒక దశాబ్దానికి పైకాలం నుంచి కృషిచేస్తున్నారు. ఆమె నిష్కామంగాను, గౌరవంగాను జరిపే ఈ కృషిని అఖిల భారత మహిళాసంఘం, సెంట్రల్ ఉమెన్స్ వెల్ఫేర్ బోర్డులు ప్రశంసించాయి. ప్రస్తుతం ఆమె ఆంధ్ర ప్రదేశ్ లో శాసన మండలి సభ్యురాలిగా ఉన్నారు.

సాంఘిక విప్లవకారుడు

శ్రీ కందుకూరి వీరేశలింగం

రాజమండ్రి వాస్తవ్యులైన శ్రీ కందుకూరి వీరేశలింగం 16-4-1848న జన్మించారు. ఆయన శతజయంతి ఉత్సవాలను 1948లో ఆంధ్రులు ఘనంగా జరుపుకున్నారు. ఆయన జ్ఞాపకార్థం ఆ సందర్భంలో ప్రత్యేక తపాలా బిళ్ళ విడుదల చేశారు. డిగ్రీ తీసుకోకముందే ఆయన చదువు మానివేసినప్పటికీ, సంస్కృత, ఆంగ్ల, ఆంధ్ర భాషలలో ఉద్దండపండితులు. ప్రతిష్టాత్మకమైన మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో ప్రధాన తెలుగుపండితులుగా పనిచేసి, అక్కడే ఉద్యోగవిరమణ చేశారు. తెలుగు ప్రజలు నిత్యం ఉపయోగించే వాడుక భాషలో, ఆయన నూరుకుపైగా చక్కని గ్రంథాలను రచించారు. 19వ శతాబ్దంలో దక్షిణ భారతదేశంలోని, సాంఘిక విప్లవోద్యమాలకు ఆయన నాయకత్వం వహించారు. ఆయన బ్రహ్మసమాజికులు. స్త్రీల హక్కుల కోసం, వితంతు పునర్వివాహం కోసం, స్త్రీలకు పురుషులతో సమానమైన హక్కులకోసం ఆయన వీరోచితంగా పోరాడారు. దక్షిణభారత దేశంలోని సంస్కరణోద్యమాలకు ఆయన ఆద్యుడయ్యాడు. ఆంధ్రప్రాంతంలో సామాజిక జీవనంలో సమూలమైన మార్పులు తెచ్చేందుకు, ఆయన వయోజన విద్యావ్యాప్తికి పాటుపడ్డారు.

1920లో ఆక్స్‌ఫర్డులో చదువు కొనసాగించడానికి నేను బయలుదేరే నాటికి, నా కార్యక్రమాల మీద, ఆలోచనలమీద వీరేశలింగంగారు గొప్ప ప్రభావాన్ని చూపెట్టారు. ఆయన రచనలు నన్ను గ్రామీణ వాతావరణం నుంచి ఒక్కసారిగా జాతీయాభిప్రాయాలవైపు, సాంఘిక ఉద్యమాలవైపు నడిపించాయి. 1915-20 సంవత్సరాల నాటి అయిదు సంవత్సరాల కాలం, నా జీవితంలో 'వీరేశలింగం శకంగా' చెప్పుకోవచ్చు. ఆ తరవాత మహాభారతంలోని ద్రోణాచార్యుడికి ఏకలవ్య శిష్యరికంలా నేను వీరేశలింగం గారి శిష్యుడిగా ఎదిగాను.

మన జాతి పునరుద్ధరణ కోసం వీరేశలింగంగారు చూపెట్టిన అనేక మార్గాలలో పయనిస్తూ, నేను ఆయకు రుణపడి ఉన్నానని సంతోషంతో అంగీకరిస్తాను. మహాత్మాగాంధీగారిలా, ఈ శతాబ్దంలోని సామాజిక, రాజకీయ రంగాలలో ప్రముఖంగా కృషిచేసిన మహాత్ముడాయన!

భారతదేశంలో బ్రిటిష్ పాలన మొదలయిన తరవాత, దేశంలో ఇంగ్లీషు భాష ప్రవేశపెట్టబడింది. ఆ కారణంగా 19 వ శతాబ్దపు భారతీయ మేధావులపై ఇంగ్లీషు భాష గొప్ప ప్రభావాన్ని కలిగించింది. శ్రీ వీరేశలింగం. శ్రీ గురజాడ ఈ కొత్త ప్రభావం ద్వారా వై తన్యవంతులై, దానిని భారతీయ సాంప్రదాయాల్లోకి ప్రవేశపెట్టారు. కవులు, రచయితలు, స్వాతంత్ర్యాభిమానులైన ప్రజలనేకమంది ఈ కొత్త సవాలును స్వీకరించి తెలుగు వారి జీవనంలో నవశకాన్ని ఏర్పరిచారు. మూఢాచారాలతో నిండి ఉన్న హైందవ మత సనాతన ధోరణి అభిప్రాయాలకు కందుకూరి, గురజాడలు వ్యతిరేకులు! ఇద్దరూ కూడా గ్రాంథిక భాషా వలయాన్ని ఛేదించి, సామాజిక

జీవనంలో, సాహితీరంగంలో నూతన ప్రక్రియలతో కొత్త దారులు తొక్కారు.

ప్రపంచ రాజకీయాల్లో సంభవిస్తున్న నూతన ధోరణులకు అనుగుణంగా ఎదగడానికి వీలు కల్పించిన, ఆంగ్లభాషా ప్రభావానికి ఆ ఇద్దరూ కృతజ్ఞతల్ని అందించగలిగారు. భారతదేశంలోని జిజ్ఞాసాపరులు, సంఘసంస్కరణాభిలాములు అయిన శ్రీ రాజా రామ్‌మోహనరాయ్, శ్రీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్, ఠాగోర్ గారి కుటుంబసభ్యులు శ్రీ బంకించంద్ర ఛటర్జీ, శ్రీ రానడే, శ్రీ గోఖలే, శ్రీ కార్వే, ఐరోపాదేశాలలో తలెత్తిన నూతన పరిణామాలకు అనుగుణంగా వ్యవహరించినట్లే, శ్రీ వీరేశలింగం కూడా ప్రతిస్పందించారు. తీవ్రమైన విప్లవాభిప్రాయాలను కలిగి, నిర్మాణాత్మకంగా వాటిని త్వరితగతిని సాధించాలని శ్రీ వీరేశలింగం గారు ప్రయత్నించారు. అందువల్ల ఆయన భారతీయ ప్రజాజీవితంలో గాంధీశకం ఆరంభం కాకముందే, సాంఘికంగా విప్లవాత్మకమైన మార్పులకోసం తన కాలాన్నంతా వినియోగించారు. జాతీయ కాంగ్రెసు సంస్థ సహకారంతో నిర్వహింపబడిన అఖిల భారత సాంఘిక సంస్కరణం మహాసభలో ప్రముఖంగా కృషిచేసిన నాయకులలో ఆయన ఒకరు.

అవినీతిపరులైన అధికారులను నిర్భయంగా, నిర్దాక్షిణ్యంగా విమర్శించినవారిలో ఆయన ప్రథములు. ఈ విమర్శలలో న్యాయాధికారులను సైతం విడిచిపెట్టకుండా, మెజిస్ట్రేట్ గానీ, జడ్జిగానీ ఎక్కడైనా అవినీతి చర్యలకు పాల్పడినట్లు సంఘవ్యతిరేక కార్యక్రమాల్లో ఉన్నట్లు కనుగొన్న వెంటనే వారిపై ఆయన విరుచుకుపడేవారు. అనేక సందర్భాలలో అధికారులు శ్రీ వీరేశలింగంగారి పట్ల బాగా కోపాన్ని పెంచుకొని ఉండేవారు. అయినప్పటికీ ఆయన వారి ఆగ్రహానికి గురి కాకుండా క్షేమంగా బయటపడుతూ ఉండేవారు. నేటికి 70సంవత్సరాల క్రితమే ఆయన సంఘ వ్యతిరేకశక్తులందరికీ వ్యతిరేకంగా పోరాటాన్ని నిర్వహించాడని విన్నప్పుడు, మనకు ఆశ్చర్యంవేస్తుంది. ఈనాడు ప్రభుత్వరంగంలో అన్ని స్థాయిలలోనూ పెల్లుబుకుతున్న అవినీతిని అరికట్టలేక గ్రుడ్లప్పగించి చూస్తున్న రాజకీయ కార్యకర్తలను. ప్రజాప్రతినిధులను గమనించినప్పుడు, ఆనాడే వీరేశంగారు కొనసాగించిన సాహసకృత్యాలు ఎంత గొప్పతనాన్ని సంతరించుకున్నాయో మనం గ్రహించవలసిఉంది.

శ్రీ వీరేశలింగంగారు బ్రాహ్మణులలో శైవ సాంప్రదాయానికి చెందినవారు. మధ్య యుగాల్లో ప్రముఖ శివభక్తులు. వీర బసవ కొనసాగించిన విప్లవ ప్రబోధాలను తిరిగి ఆయన ప్రచారంగావించారు. వీరబసవేశ్వరులు కులతత్వాన్ని వ్యతిరేకించారు. మతాధిపతుల, పూజారుల ఆధిక్యతను అంగీకరించక స్త్రీలకు, క్రింది తరగతి ప్రజలకు సమానావకాశాలు, అర్హతల్ని కల్పించాలని ప్రచారం చేస్తూ, తెలుగు, కన్నడ భాషలలో, సామాన్య జనానికి అందుబాటైన పదజాలంతో, చక్కని శైలిలో ఉత్తమ రచనలు చేశారు. ఆంగ్లకవులు కూడా ఇలాగే మానవతా లక్ష్యాలతో కూడిన ప్రజాస్వామ్య సిద్ధాంతాలను ప్రచారంచేస్తూ, మంచి ఫలితాలను సాధించినట్లు వీరేశలింగం గారు గ్రహించారు. అందువల్ల సనాతన, సాంప్రదాయికంగా వచ్చే మూఢ విశ్వాసాలపై ధ్వజమెత్తి, పూర్వం సాగించిన విప్లవాన్ని తిరిగి కొనసాగించి, గుడ్డిగా ఆచరిస్తున్న మూఢవిశ్వాసాలను విమర్శిస్తూ ప్రజలకు స్వేచ్ఛను ప్రసాదించాలని తలపోసి ముందుకు వచ్చారు.

ప్రతి చోటా కుల సంఘాలతో నిండి ఉన్న రోజులవి! అయితే వీరేశలింగం గారు కుల కట్టుబాట్లను త్రెంచివేయవలసిందని, మాకు బోధించారు. అట్టి కుల సభలు కూడా పరోక్షంగా వీరేశలింగంగారు ప్రచారం చేసిన బాల వితంతువుల పునర్వివాహం, వరకట్న దురాచారం, స్త్రీవిద్య బాల్యవివాహాలు, అంటరానితనం, జంతుబలుల నిషేధం వంటి వాటిపై ఆయన సాగించిన కార్యక్రమాలకోసం కృషిచేయసాగాయి. ఆ తరువాత ఈ అభిప్రాయాలన్నింటిని సమర్థిస్తూ, గాంధీగారి ఉద్యమం మొదలైంది. అయితే కాంగ్రెసు పార్టీ తన రాజకీయ ప్రచారంలో ఒక భాగంగా దీనిని కొనసాగించటంలో విఫలమైంది. ఎన్నికల ప్రయోజనాల కోసం కుల సంఘాలతో సర్దుబాటు చేసుకొనవలసిన అవసరం వచ్చింది. ఫలితం దురదృష్టకరంగా పరిణమించింది. వరకట్నం, అవినీతి కార్యకలాపాలు నిరాటంకంగా విస్తరించసాగాయి.

వీరేశలింగంగారు విగ్రహారాధనను వ్యతిరేకించారు. సమాజంలో నిత్యం జరుగుతున్న మతపరమైన దురాచారాలను, జంతుబలులను, మూఢ విశ్వాసాలను ఆయన అంగీకరించలేదు. దేవుడు ఒక్కడేనని, ఆయన నిరాకారుడని ఆయన ప్రచారం గావించాడు.

అణగారిపోయిన, అణచివేయబడుతున్న వర్గాల ప్రజల సముద్ధరణకు ఆయన సాగిస్తున్న ప్రచారం మాలాంటి అనేక మందిని మేల్కొలిపింది. శ్రీ వీరేశలింగంగారి రచనల ద్వారా నేను చైతన్య వంతుడినయ్యాను. అప్పట్లో విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే నేను అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడాను. సహపంక్తి భోజనాలను, స్త్రీ విద్యను, ప్రోత్సహించాను. తెలుగులో నేను రాసిన, నా నవల 'హరిజన నాయకుడు' ఆయన చేపట్టిన కార్యక్రమాన్నే కొనసాగించింది. స్త్రీలపట్ల వీరేశలింగంగారి ఆశయాలకు నేను ముగ్ధుడినయ్యాను. స్త్రీ జనాభ్యుదయం కోసం నేను సాగించిన కృషి శ్రీ వీరేశలింగంగారి స్ఫూర్తితో లభించిందే. ఆయన రచనలు, ఆయన భార్య శ్రీమతి రాజ్యలక్ష్మి గారి విషయంలో ఆయన వ్యక్తపరిచిన మహోన్నతమైన ప్రేమ నన్ను చలింపజేసింది. పశ్చిమ దేశాలలో పర్యటిస్తున్నప్పుడు అక్కడి స్త్రీలు అనుభవిస్తున్న గౌరవాన్ని గ్రహించడం కారణంగా నాలో సంభవించిన మానసిక పరిణామాల ఫలితంగా నేను ఈ నిర్ణయానికి వచ్చాను. ఆయన రచనల ద్వారా, కార్యక్రమాల ద్వారా, బోధనల ద్వారా, ఆంధ్రదేశంలోని అనేక మంది మహిళా కాంగ్రెసు నాయకీమణుల్లాగా, శ్రీమతి భారతీదేవి కూడా ఎక్కువ నైతిక ధైర్యాన్ని, ఉద్వేగాన్ని పొందింది. ప్రపంచ మేధావి శ్రీ జాన్ స్టార్ట్ మిల్ తన భార్య పట్ల ప్రదర్శించిన గౌరవాభిమానాలను, చూపిన ప్రేమనీ పొల్చి చూపిన తరవాత, శ్రీ వీరేశలింగం తన సతీమణి రాజ్యలక్ష్మి గారిపై, చూపిన గౌరవాభిమానాల్ని నేను ఎంతగానో కొనియాడాను.

వీరేశలింగంగారి పద్ధతి హిందీ భాషాభిమాని అయిన శ్రీ మదన్ మోహన్ మాలవ్యా గారి పద్ధతి వంటిదిగాదు. అభివృద్ధిచెందని బ్రాహ్మణేతర వర్గాల సాంఘిక రాజకీయాభివృద్ధిని కోరుతూ, అంటరానివర్గాల ప్రజలను, బానిసలుగా మగ్గుతున్న స్త్రీలను ఉద్ధరించడానికి వీరేశలింగంగారు ప్రయత్నించారు, సాంఘిక సంస్కరణ జరగడం ముఖ్యం! సాంఘికాభివృద్ధి, స్వాతంత్ర్యానికి ముందు సాధింపబడాలని వీరేశలింగంగారు భావించారు. అయితే ఇదే అభిప్రాయాన్ని వ్యక్తపరిచే జస్టిస్ పార్టీతో వీరేశలింగం గారు చేతులు కలపలేదు. అయితే ఆయన

సాంఘిక సంస్కరణల వరకే పరిమితమై ఉండడాన్ని, రాజకీయ వేదికలపై కొందరు యువకులు గట్టిగా నిలదీసారు. 1-5-1918న ఆయన వివేచనతో ఇలా చెప్పారు. "మన సాంఘిక పరిస్థితులను మత సంస్కరణలను సమూలంగా మార్చకుండా. స్వాతంత్ర్య ఫలితాలను రాజకీయాధికారాన్ని మనం పూర్తిగా అనుభవించలేం." అలాంటి దీక్షతో వీరేశలింగం గారు దక్షిణ భారతీయులను నిర్మాణాత్మక మైన తన సాంఘిక సంస్కరణల కృషిద్వారా, రాజకీయ రచనల ద్వారా కాంగ్రెసు సంస్థవైపు తిప్పగలిగి, కాంగ్రెసు వాదులతో పాటు, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా సాగుతున్న గాంధీజీ నాయకత్వాన్ని బలపరిచేలా చేయగలిగారు. అంటరానితనం నిర్మూలన, మహిళాభ్యుదయం, వేదలకు జీవనభృతి వంటి గాంధీజీ ఆదర్శాలను, ఆయన మరింతగా ముందుకు నడిపించారు. ప్రస్తుతం యువజన కాంగ్రెసు వారు చేపట్టిన షట్సూత్ర ప్రణాళిక, ఆనాటి వీరేశలింగం గారి ఆదర్శాల సాధనలో మిగిలిన భాగమే.

తెలుగులో శాస్త్రజ్ఞులు, సంఘ సంస్కర్తలు, ఉత్తమ పరిపాలకులు, ప్రజాస్వామ్య నాయకులైనవారి జీవిత చరిత్రలను వివిధ దేశాలనుంచి ఎన్నుకొని, తెలుగులో రాసిన జీవిత చరిత్రల గ్రంథ రచయితగా శ్రీ వీరేశలింగం సుప్రసిద్ధులయ్యారు. అతి చిన్న ద్వీపమైన ఇంగ్లండు సువిశాల భారతదేశాన్ని ఎలా పరిపాలించ గలుగుతున్నదో, తెలుసుకోవాల్సిందిగా, ఈ గ్రంథాలను ప్రచురిస్తూ, ప్రజలకు సూచించారు. ఫ్లారెన్స్ నైటింగేల్ జీవితచరిత్రను గొప్పగా రాసి ప్రచురించారు.

ఆయన రచించిన ఆంధ్ర కవుల చరిత్ర ఆ తరువాత బలుకూరు వీరభద్రరావుగారు ఆంధ్రుల చరిత్ర రాయడానికేకాక, ఇటీవల వెలువడిన ఆరుద్ర గారి తెలుగు సాహిత్య చరిత్ర వరకు భూమికగా నిలిచింది. నవీన శాస్త్రాంశాలు, విజ్ఞానంపై ఆయన అనేక గ్రంథాలను రాసి ఆంధ్ర ప్రజల విజ్ఞానాభివృద్ధికి హృదయ పూర్వకమైన కృషిచేశారు.

తెలుగు భాషను సులభ శైలిలో, ప్రజల వాడుక భాషలో పామర జనానికి సైతం అర్థమయ్యేవిధంగా తీర్చిదిద్దారు వీరేశలింగంగారు. ఆయన శైలి దివ్యమైనది, ఆయన వాక్యాలు హృదయాన్ని కరిగించేవిగా ఉంటాయి. నా శక్తికొద్దీ నేను ఆయనను అనుసరించాలని ప్రయత్నించాను. ఆయన రచనా విధానాన్ని స్వీకరించి "మోడరన్ పొలిటికల్ ఇన్‌స్టిట్యూషన్స్", "హరిజన నాయకుడు' వంటి పుస్తకాలను రాసాను. ఆయన్ని ఆదర్శంగా పెట్టుకొని, వల్లెటూరి గ్రంథమాల తరపున "శ్రీ ముదిగంటి జగ్గన్నశాస్త్రి రాజకీయ సమస్యలపై అనేక పుస్తకాలను రాసారు. పండిత గొర్రె పాటి వెంకట సుబ్బయ్య ప్రముఖ జాతీయ నాయకుల జీవితగ్రంథాలను రాసారు.

శ్రీ వీరేశలింగంగారు ప్రజలకోసం, సాంఘిక, ఆర్థిక రంగాలలో పరిస్థితులను సానుకూలపరచుకొని, ముందుకు వెళ్లడానికి వీలుగా తమ అభిప్రాయాలను తెలియజేస్తూ, తరచు రాస్తూ ఉండేవారు. ప్రజలను విద్యావంతులను చేయడానికి వీలుగా ఎక్కువగా తెలుగులోనే రాస్తూ ఉండేవారు.

తెలుగు వచన గానీ, పద్యరచనగానీ, వారి అభిప్రాయాలు సరియైనవి కావనీ, అభ్యుదయకరమైనవి కావనీ, ఆయన భావించినప్పుడు శక్తివంతమైన, సంఘ పెద్దలతో గానీ, గొప్పవారితో

గానీ, తలపడడానికి జంకేవారు కాదు. ఓర్వలేని వారి విమర్శను చూసి, ఆయన అనేక సందర్భాలలో బాధపడ్డారు. మూఢవిశ్వాసాల కారణంగా, దుష్టసాంప్రదాయాల కారణంగా, సాంఘిక అవరోధాల కారణంగా, బాధపడేవారికి ఆయన నిరంతరం ప్రత్యేక శ్రద్ధతో సేవచేస్తూ ఉండేవారు, మాలాంటి వారమంతా ఆంధ్ర ప్రజలకు శ్రీ వీరేశలింగం గారు చేస్తున్న సేవలను ఆదర్శంగా పెట్టుకొని, గాంధీగారు చూపించిన రాజకీయ ధర్మపథంలో ముందుకు వెళుతూ ఉండేవాళ్లం.

1917 వ సంవత్సరంలో వీరేశలింగంగారి పై, ఆయన విజయాలపై నేను ఇరవై అయిదు పేజీల వ్యాసాన్ని రాసి విద్యార్థులు హైస్కూలు సాంస్కృతిక సమావేశంలో చదివాను. అప్పుడు దానిని నెల్లూరు నుంచి వచ్చిన వెంకయ్యగారు అనే మా ఉపాధ్యాయులు చూసి నన్ను బాగా ప్రశంసించారు. ఆ తరవాత ఆయన నాపై ప్రత్యేక శ్రద్ధ వహించి ప్రజాజీవితంలో బాగా పైకి వచ్చేందుకు, వీలుగా శిక్షణ ఇచ్చారు. అందులో నేను బాగా అభివృద్ధిచెందగలనని ఆయన విశ్వసించారు.

సామాజిక విప్లవాన్ని కోరుతూ, అందుకు తీవ్రమైన కృషి చేసిన కవి, కీర్తి శేషులైన శ్రీ త్రిపురనేని రామస్వామి చౌదరి ఆత్మగౌరవ ఉద్యమం ప్రారంభించినప్పుడు, దానికి శ్రీ వీరేశలింగం బోధనలతో ఒకేలాంటి అనేక పోలికలు ఉండడాన్ని నేను గ్రహించాను.

నేనెప్పుడు రాజమండ్రి గుండా వెళ్లడం తటస్థించినా, 1917 లో పుస్తకాల నిమిత్తం నేను ఆయన వద్దకు వెళ్లినప్పుడు ఆయన కుర్చీలో కూర్చుని ఉన్నట్టుగానే, భావిస్తూ ఉండేవాడిని. ఆయన ఇంకా జీవించి ఉన్నట్టే నాకు భావన కలిగేది. ఆయన చాలా ప్రేమ పాత్రులు, ఆశావాది. మా లైబ్రరీకి ఆయన పుస్తకాలను ఇవ్వమన్నప్పుడు ఆయన చాలా సంతోషించారు. అందమైన గోదావరీ ప్రాంతపు చిరునవ్వులు చిందిస్తూ, పల్లె పదాలను పలికిస్తూ గోదావరి యాసలో, నుడికారంతో, ఆయన రాసిన ప్రహసనాలను చదువుతూ ఉంటే, నాకు నా చిన్నతనంనాటి వ్యక్తులు, స్థలాలు స్మృతిలో మెదిలేవి. శ్రీ వీరేశలింగంగారితో ఉన్న సంబంధాలను ఆయన నివశించిన ప్రాంతాలను జ్ఞాపకానికి తెచ్చుకున్నప్పుడు, ఛార్లెస్ డికెన్స్, వర్డ్స్‌వర్త్, రవీంద్రనాథ్ టాగోర్ గారి విశ్వభారతి, అనిబిసెంటు గారి అడయారులను దర్శించినప్పుడు పొందినంత అనుభూతులను పొందుతూ ఉండేవాడను.

శ్రీ వీరేశలింగంగారు, ఇప్పటికీ జీవించి ఉన్నట్లే నేను అనుభూతి చెందుతూ ఉంటాను. ఈనాడు మేము సాధించగలిగిన అనేక విజయాలలో, ఆయన ప్రభావం స్పష్టంగా గోచరిస్తూ ఉంటుంది. ఈనాటి భారత మహిళా ఉద్యమం, ఆయనకు ఎంతగానో రుణపడిఉంది. ఆయన చూపెట్టిన మార్గదర్శక సూత్రాలను, అది అనుసరిస్తూ వుంది. శ్రీ వి. ఆర్. నార్ల ఆంగ్లంలో రాసిన "వీరేశలింగం గారి జీవిత కథ"ను నేషనల్ బుక్ ట్రస్ట్‌వారు ప్రచురించారు. కమ్యూనిస్టులు కూడా, వారి శతాబ్ది ప్రత్యేక సంచికలో ఆయనను 'కామ్రేడ్ వీరేశలింగం" అని ప్రశంసించారు. తమిళనాడు ఆత్మగౌరవవాదులు కూడా ఆయన బోధనలకు గౌరవ వందనాలర్పించారు.

శ్రీమతి విజయ లక్ష్మీ పండిట్

నెహ్రూ కుటుంబానికి చెందిన శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ 18-8-1900 తేదిన అలహాబాద్‌లో జన్మించారు. 1936-39 సంవత్సరాలలో ఆమె మొదటి మహిళా మంత్రిగా ఉన్నారు. 1947- 61 మధ్య యు.ఎస్. ఆర్., యు.ఎస్. ఎ., యు.కె. లకు వెళ్ళిన మొదటి మహిళా రాయబారి ఆమె. 1962-64సంవత్సరాలకు మధ్య బొంబాయి రాష్ట్రానికి గవర్నరుగా పనిచేశారు. పార్లమెంటు సభ్యురాలిగా ఉన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో మిత్రరాజ్య సమితి చార్టరును తయారుచేసిన ప్రపంచ సమావేశాలలో ఆమె భారత దేశానికి ప్రాతినిధ్యం వహించారు. 1947 నుంచి మిత్రరాజ్య సమితి సర్వ ప్రతినిధి సభలో ముఖ్య ప్రతినిధిగా ఉంటూ, 1953-54 సంవత్సరాలలో మిత్రరాజ్య సమితికి మొదటి మహిళా అధ్యక్షురాలిగా ఎన్నిక కాగలిగారు. స్వాతంత్య్ర సమరయోధురాలు, ఆమె బ్రిటిషు వారిచే జైలు శిక్ష విధించబడి అనుభవించింది- (ఎడిటర్).

ఆడవారికి సంబంధించినంతవరకు భారతదేశం అనేక ఇతర దేశాలకన్నా ఊహించనలవికాని వ్యత్యాసాలతో కూడిన బాధలతో మిళితమై ఉన్న దేశం. మన దేశంలో ఒక రాష్ట్రం నుంచి యింకొక రాష్ట్రానికి వెళుతూ ఉంటే అక్కడ కనిపించే కుటుంబాలు, ఆ కుటుంబాలలోని స్త్రీలు అవిద్యతోను, తమ చుట్టూవున్న పరిస్థితులలో సంభవిస్తున్న మార్పులను గ్రహించకుండాను, ఇతర కులాల్లో వస్తున్న అభివృద్ధిని చూడలేకుండాను, తమ కుమార్తెలను కళాశాలకు పంపి ఎక్కువ త్యాగం చేస్తున్న వారి గురించి తెలుసుకోకుండాను వివాహాల ద్వారా ఒక రాష్ట్రం నుంచి ఇంకో రాష్ట్రానికి వెళుతున్న వారి సాహసాలను చూడకుండాను విశ్వమానవ దృష్టిని పెంపొందించుకొని విదేశాలకు సైతం వెళుతున్న వారి గురించి ఆలోచించకుండాను, అజ్ఞానంలో కూరుకుపోయి ఉండటాన్ని మనం చూస్తూ ఉంటాం. అయినప్పటికీ తమ సాంఘిక అలవాట్లలో మార్పులు తెచ్చుకునేందుకు వారు ఇంకా సిద్ధం కావటంలేదు.

కేంద్రం లోను రాష్ట్రాలలోను ఈ రోజు స్త్రీలు మంత్రులుగా ఉంటున్నారు. మహిళలు గవర్నర్లుగా కూడా పనిచేస్తున్నారు. కొంతమంది ముఖ్యమంత్రులు కూడా కాగలిగారు. శ్రీమతి ఇందిరాగాంధీ పది సంవత్సరాలు భారతదేశ ప్రధానిగా కొనసాగారు. గొప్ప శక్తివంతమైన కాంగ్రెస్ నాయకురాలిగా ఆమె మూడుసార్లు ఎన్నికయ్యారు. అయినప్పటికీ అనేక మంది హిందూ, ముస్లిం స్త్రీలు పరదాలలో, ఘోషాలలో గర్వంగా తమ భర్తలు వెంబనడుస్తూ వారి భర్తల కనుసన్నలలో ఓట్లు వేయడానికి పోలింగు కేంద్రాలకు వెళుతున్నారు. రకరకాల రత్నాల హారాలను ధరిస్తూ అందమైన చీరలతో బ్లౌజులతో ప్రేమ ఉట్టి పడేటట్లు అలంకరించుకొంటూ మన యువతులు స్వీడిష్- ఇటాలియన్- అమెరికన్ రీతులలో తమను తాము ప్రదర్శించుకుంటున్నారే తప్ప తమ వ్యక్తిత్వాలను ప్రదర్శించుకొనేందుకు ప్రయత్నించడంలేదు.

గ్రామీణ ప్రాంతాలలోని, నగరాలలోని అభివృద్ధిచెందిన మధ్య తరగతి కుటుంబ స్త్రీల

మధ్యగూడా మనం కొంత వ్యత్యాసాన్ని చూడగలుగుతున్నాం. 1923 వ సంవత్సరంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, గ్రంధకర్త, సామాజిక సంస్కర్త అయిన శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణ అప్పుడే ఇంగ్లండు నుంచి తిరిగి వచ్చారు. రైతులలో బాగా పేరున్న నేను గుంటూరులో వారు ప్రారంభించిన మహిళా నివాస కళాశాల శారదా నికేతన్‌కు చదువు కొనేందుకు పెద్దవారైన తమ ఆడపిల్లలను పంపవలసిందని గ్రామాలలో చెప్పి ఒప్పించటం బహుకష్టమైంది. ఆ జాతీయ విద్యాసంస్థకు తమ కుమార్తెలను పంపించిన కొద్దిమంది తల్లిదండ్రులు అభ్యుదయ వాదులుగాను సాహసవంతులైన సంస్కర్తలుగాను కీర్తించబడ్డారు. మరొక పక్క సాంప్రదాయకంగా విద్యావంతులైన వారి కుటుంబాలలోనుంచి స్త్రీలు ప్రభుత్వ లేదా ప్రైవేటు విద్యాసంస్థలలో విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ డిగ్రీలు పుచ్చుకొంటూ సమర్థవంతమైన విధానంలో అప్పటికే తమ పాత్రలను కొనసాగించడం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాలనుంచి వచ్చిన భారతీదేవి లాంటి వారిని పట్టణాల్లోని హైస్కూళ్లకు పంపటానికి జంకితే, శ్రీమతి విజయలక్ష్మి, కమలాదేవి, సుచేత, లీలావతి, అరుణ, రాధాభాయ్ లాంటివారులు అప్పటికే తమ విద్యాభ్యాసాన్ని పూర్తిచేసుకొని ప్రజారంగంలో ప్రవేశించి సామాజిక సేవలో అధికార కార్యకలాపాలలో పాల్గొనడం ప్రారంభించారు. స్వతంత్ర భారతదేశం బాగా శక్తివంతులై ముందుకు రాగలిగిన స్త్రీలందరకు తగు అవకాశాలు కల్పించింది. ప్రపంచంలో కెల్లా గొప్ప ప్రజాస్వామ్య దేశమైన భారతదేశపు ఓటర్లు శ్రీమతి ఇందిరాగాంధీని ప్రధాన మంత్రిగా ఎన్నుకొని ఆమె నాయకత్వాన్ని గౌరవించారు. ఉన్నత స్థానాలను అధిష్టించిన ఈ గొప్ప మహిళలు దేశంలో ఉన్న మహిళల కందరకు ఉత్తేజాన్ని కలిగిస్తూ ఎక్కడ ఏసందర్భంలో ఉన్నప్పటికీ తమకు లభించిన అవకాశాలను పూర్తిగా వినియోగించు కొని ముందుకు వచ్చేందుకు మహిళలకు ఉత్తేజకారకులుగా ముందు నిలిచారు.

శ్రీమతి విజయలక్ష్మి పండిట్, శ్రీమతి కమలాదేవి, శ్రీమతి రాధాభాయ్ గారు తమ కన్నా ముందువారైన శ్రీమతి సరోజినీనాయుడు, శ్రీమతి రుక్మిణిదేవి అరండేల్ గార్లు బాగా చదువుకొని రాజకీయంగా చక్కటి అనుభవాన్ని సంపాదించుకున్న పురుషులతో పాటు బాధ్యతలను పంచుకొంటూ పోటీపడి రాష్ట్రాలలో తొలిసారిగా కాంగ్రెస్ మంత్రి వర్గాలు ఏర్పడిన 1936-39 సంవత్సరాల నాటికే ఉన్నతులుగా నిలవగలిగినందుకు వారి కృషి పట్ల అభిమానాన్ని పెంచుకున్నారు. ఆరోజుల్లో ఆ పరిస్థితుల్లో 1936-39 సంవత్సరాలకాలంలో శ్రీమతి విజయలక్ష్మిపండిట్ మంత్రి కాగలిగారు. మిత్రరాజ్యసమితి ఏర్పాటు నిమిత్తమై 1946 వ సంవత్సరంలో జరిగిన సభలకు భారత ప్రతినిధిగా హాజరు కాగలిగారు.

స్టాలిన్ ప్రభుత్వం భారత వ్యతిరేక ధోరణులనవలంబిస్తున్న కారణంగా శ్రీమతి విజయలక్ష్మి పండిట్ సోవియట్ రష్యా రాయబారిగా ఎలాంటి ప్రత్యేక ప్రభావాన్ని చూపెట్టలేకపోయారు. పశ్చిమ దేశాలలోను, రష్యాలోనూ అప్పుడున్న రాజకీయ నాయకులు, విదేశాంగ మంత్రులు, రాయబారులు స్త్రీలను రాయబారులుగా స్వీకరించడంలో వారిలో ఉన్న భేషజాన్ని ఇంకా పూర్తిగా వదులుకోక పోయినప్పటికీ మూడు గొప్పరాజ్యాల రాయబారిగా పనిచేస్తూ ఆమె మన ప్రయోజనాల కోసం కృషిచేయటమే కాకుండా విదేశీరాయబారుల శ్రేణిలో ప్రపంచ వ్యాప్తంగా మహిళల ప్రాధాన్యతను ఎత్తిచూపించగలిగారు. ఆమె తనకన్నా

ముందు తన తరవాత పనిచేసిన వారికన్నా గూడా ముందా తనంతోను, చక్కటి అలవాట్ల తోను, ఎక్కువ సమర్థవంతంగా కృషిచేయగలిగింది. భారతదేశంతో బ్రిటిన్, అమెరికాల సంబంధాలు అంత స్నేహ పూర్వకంగా లేక పోయినప్పటికీ ఆమె తన స్వచ్ఛమైన స్నేహపద్ధతితోను, సహజమైన రాయబార లక్షణాల తోను ఓర్పుతో ఆదేశాలకూ మనదేశానికి మధ్య కొంత సన్నిహిత్వాన్ని పెంచటానికి కృషిచేసింది.

నెహ్రూ కుటుంబం నుంచి వచ్చిన ఆత్మవిశ్వాసాన్ని, ప్రసంగ ధోరణిని, ఇతరులతో మర్యాదగా వ్యవహరించే పద్ధతులను ఆమె సహజంగానే కలిగిఉంది. ఆలోచనా పూర్వకంగాను, వినసొంపుగాను ఆమెగొప్పగా మాట్లాడ గలదు. నెహ్రూ కుటుంబంలో ఆమెకున్న స్థానాన్ని ఆమె ప్రపంచ సంస్థలలో భారత దేశ ప్రాముఖ్యతను సమర్థతతో కాపాడడానికి వినియోగించింది. నేను ఆమెను మిత్రరాజ్య సమితిలో, టోక్యోలోను కలుసుకున్నాను. ఆమె మిత్ర రాజ్యసమితి సర్వప్రతినిధిసభ అధ్యక్షురాలిగా ఎన్నికైనప్పుడు నేను అధ్యక్షుడుగా ఉన్న విదేశీ వ్యవహారాల సంఘం టోక్యోలో ఆమె గౌరవార్థం ఒక సభ జరిపి అభినందించింది. లోక్‌సభలో కూడా ఆమె ప్రసంగాలను నేను విన్నాను. ఆమె చేసే స్వల్పకాల ప్రసంగాలు గాని, దీర్ఘమైన ప్రసంగాలు గానీ సభ వాతావరణాన్ని ఆహ్లాదకరంగా ఉండేటట్లు చేసి ఆయా సమావేశాలు ఉపయోగపడేటట్లుగా ఉండేవి.

ఆమె విసంఘంలో ఉన్నా తన బాధ్యతలను చక్కగా పూర్తిచేస్తుండేవారు. ఇతరుల మాటలు శ్రద్ధగా ఆలకించేవారు. తన దృష్టిలో ఉన్న అంశాలను చెప్పదల్చుకున్న అంశాలను ప్రవేశ పెట్టేందుకు ఆమె తొందరపడేవారుకాదు. ఆమె వంతు వచ్చినపుడు తాను చెప్పదల్చుకున్న అంశాలను సమర్థవంతంగా ప్రవేశ పెట్టి ఇతరుల ఆమోదాన్ని పొంద గలుగుతుండేవారు. నెహ్రూరీతి తమకు మాత్రమే బాగా తెలుసుననుకునేవారు. అందులోంచి మారేందుకు ఇష్టపడక ఆమె ప్రసంగాలతో సంతృప్తి చెందే వారుకాదు. నెహ్రువిధానాలు విస్పారంగా ఉన్నప్పుడు ఆ విషయాన్ని ఆమె వినయంగా ఆయన చేత అంగీకరింపజేయడానికి ప్రయత్నించేది. ఎవరినీ కూడా బాధ పెట్టకుండా, అసహ్యకరమైన రీతిలో ప్రవర్తించకుండా ఆమె చివరకు తాను చెప్పే అంశంపై విభేదాలు రాకుండా అంగీకరింపజేసేను కోగలుగుతుండేది.

శ్రీమతి విజయలక్ష్మీ పండిట్ ఆలోచనా సామర్థ్యానికి, ఆమె అలవాట్లలో ఉన్న ఉత్తమ సంస్కృతి సాంప్రదాయాలకు, గొప్ప గొప్ప పదవి బాధ్యతలను తన భుజస్కంధాలపై పెట్టుకొని సమర్థవంతంగా నిర్వహించిన తీరుకు, ముఖ్యకారకులైన ఆమె తండ్రి ప్రముఖజాతీయనాయకులు పండిత మోతీలాల్ నెహ్రూ గారిని మనమందరం సంతోషంతో మెచ్చుకుందాం. మిత్రరాజ్యసమితి సర్వ ప్రతినిధి సభకు అధ్యక్షురాలిగా ఉండి ఆమె భారతదేశానికి ఉన్నత గౌరవాన్ని సాధించి పెట్టింది.

దురదృష్టవశాత్తూ తను దీర్ఘకాలం దూరంగాఉన్న, ఎక్కువగా అనవసరమని భావించిన పార్లమెంటరీ రాజకీయాలు పరిధిలోకి ఆమె ప్రవేశించింది. దూరదృష్టిలేని ఆమె మిత్రులు ఆమెను పార్లమెంటులో ప్రవేశించి మంత్రి వర్గంలో ప్రముఖపాత్రను వహించవలసిందని సలహా ఇచ్చారు. ఆమె పార్లమెంటులో ప్రవేశించేనాటికి భారతప్రధానులుగా కొనసాగుతున్నవారు తన సోదరుడు శ్రీజవహర్లాల్ వంటి శక్తివంతులు కారని ప్రపంచ వేదికపై ఆయన కున్నంత

స్థాయివారికి లేదని కేంద్రమంత్రివర్గాంలోను కమిటీం లోనూ తమ స్థానాలను బలపరచుకొనేందుకే వారెక్కువగా కృషిచేస్తున్నారని ఆతరవాత ఆమె గ్రహించగలిగింది.

ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఈ గొప్ప నాయకురాలు తనకుతానుగా అభ్యర్థినిగా ప్రకటించుకొన్నప్పటికీ ఆమెను కాంగ్రెస్ పార్టీ ఉపనాయకురాలిగా ఉండేందుకుగానీ, లేదా మంత్రిమండలిలో పనిచేసేందుకు గానీ ఆహ్వానించలేదు. ఆమె లోకసభలో శాస్త్రిగారి ప్రభుత్వాన్ని పనిచేయలేని ప్రభుత్వంగా అభివర్ణించినపుడు పార్టీ సమావేశాలలో ఎక్కువ విమర్శంపాలైంది. మన విదేశాంగ విధానం ప్రజాస్వామ్య రాజ్యాలకు వ్యతిరేకంగా ఉంటున్నదని ఆమె హెచ్చరించినపుడు సాంప్రదాయంగా వస్తున్న మన ఆరోపణలు వచ్చాయి. బాగా విసుగుదలతో ఆమె పార్లమెంటు నుంచి రాజీనామా చేసి విశాలదృష్టితో కొనసాగే బొంబాయి, ముస్సోరీలలోని తన యిళ్లలో విశ్రాంతిగా ఉండాలని నిర్ణయం తీసుకొన్నారు.

ఈనాడు కళాశాలలలోను, హైస్కూళ్ల లోనూ చదువుకుంటున్న బాలికలు అనేకమంది శ్రీమతి సరోజినీదేవి, శ్రీమతి విజయలక్ష్మి పండిట్, శ్రీమతికమలాదేవి, శ్రీమతి మృదుల, శ్రీమతి అరుణ, శ్రీమతి భారతీదేవి, శ్రీమతి దుర్గాభాయ్ గారలు మన స్వాతంత్ర్య సమరంలో చేసిన పోరాటాలను, సాంఘిక సంస్కరణోద్యమాలలో వారు చేసిన కృషిని తెలుసుకోవడం ద్వారా వారి విజయాలు, సేవలను గ్రహిస్తూ, ఇప్పటికి రెండుతరాల మహిళలు ఉత్తేజితులై ఆవిధంగా ప్రయోజనాన్ని పొందగలుగుతున్నారు. శ్రీమతి విజయలక్ష్మిగారు భారతమహిళలకు ఆమె అంతర్జాతీయ సంస్థలలో చేసిన కృషిపరంగాను అనేక కార్యక్రమాంలోని ఆమె అనుభవాల పూర్వకంగాను, ఆమె ప్రదర్శించిన త్యాగాలను, చూపెట్టిన సామర్థ్యాన్ని, ప్రపంచవేదికనుంచి ఆమె విశ్రాంతి తీసుకుంటున్నప్పటికీ కూడా ఆమె సమయంలో కొంత సమయాన్నైనా తిరిగి వాడుకునేందుకు ప్రయత్నించి, ఫలితాన్ని పొందవలసిన అవసరంఉంది. శ్రీమతి సరోజినీదేవి ప్రారంభించిన కృషిని క్రింద స్థాయిలోనుంచి రాష్ట్రస్థాయి లోను దేశస్థాయిలోను మహిళలు ముందుకు రావడానికి తగు వాతావరణాన్ని కల్పించే ప్రయత్నంలో ఓర్పుతో ఇప్పుడు గూడా శ్రీమతి విజయలక్ష్మి కృషిచేస్తూనే ఉంది.

56

వినయాశ్రమమ్

శ్రీ సీతారామ్ - శ్రీ బసవయ్య

1920-22 సంవత్సరాల కాలంలో సహాయనిరాకరణోద్యమం ప్రారంభమైనప్పుడు బ్రిటిష్ వారి పాఠశాలలను బహిష్కరించి అందుకు ప్రత్యామ్నాయంగా గాంధీగారి అనుచరులు అనేక పాఠశాలలను ఆశ్రమాలను స్థాపించారు. అవన్నీ సబర్మతీ ఆశ్రమాన్ని నమూనాగా పెట్టుకొని తమారైనాయి. నెల్లూరుజిల్లా పల్లెపాడులో శ్రీమతి పానకా కనకమ్మ గారు, సీతానగరంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన డాక్టరు సుబ్రహ్మణ్యం గారు, చాగల్లులో శ్రీ ప్రకాశరావుగారు, ఏలూరులో డాక్టరు నారాయణరాజుగారు, పెదపాలెంలో హనుమంతరావుగారు, గుడివాడలో రామచంద్రుడుగారు, ఆంధ్రప్రాంతలోని అనేక జిల్లాలో చిన్న చిన్న సంస్థలనేకం 1921-31 సంవత్సరాల మధ్య స్థాపించబడ్డాయి. ప్రతి ఆశ్రమం ప్రాథమిక విద్య నుంచి విద్యావకాశాలను కల్పించే ఒక పాఠశాలను తనకు అనుబంధంగా స్థాపించుకొంది. ప్రతి ఆశ్రమం జాతీయసేవలో పాల్గొనే కార్యకర్తలను కోసం భోజన వసతి సౌకర్యాలను ఏర్పాటు చేసింది. ఖాదీ, ఇతర కుటీర పరిశ్రమలను ఆ ఆశ్రమాలు నిర్వహించాయి. వారు గాంధేయ సూత్రాలను, సేవలను ధర్మాచరణలను గురించి బోధించారు. హరిజన, గిరిజన సముద్ధరణ దరిద్ర నారాయణుల సేవలను వారు ఆదర్శంగా పెట్టుకున్నారు. వారు సబర్మతీ ఆశ్రమాన్ని అనుసరించటానికి తమకు తామై విశ్వాసంతో పూనుకొన్నారు. 1925వ సంవత్సరంలో గాంధేయ విద్యావేత్తల ఆంధ్ర సంఘంలో నేను చేరి 1930-33 సంవత్సరాల మధ్య ఈ ఆశ్రమ ప్రాథమిక ఉన్నత పాఠశాలల విద్యార్థులకోసం పాఠ్యప్రణాళికను తయారు చేశాను. బ్రిటిషువారు తమ దమనరీతితో ఆసంస్థలను నిషేధిస్తూ వారి గ్రంధాలయాలను, రికార్డులను, ఫర్నిచరువంటి వాటిని విధ్వంసంచేశారు.

1973 వ సంవత్సరంలో శ్రీ సీతారామ శాస్త్రి, శ్రీ తుమ్మల బసవయ్యగారు వారి ఆస్తులన్నింటినీ దాని కోసం అర్పించి గుంటూరు జిల్లా కావూరులో వినయాశ్రమాన్ని స్థాపించారని తెలుసుకున్నాను. శ్రీ బసవయ్యగారికున్న మొత్తం భూమిని దానికోసం సమర్పించారు. శ్రీ సీతారామశాస్త్రిగారు ఆ తరవాత స్వామి సీతారామ్‌గా పిలవబడ్డారు. వారు యాభై ఎకరాల ఇసక పర్ర భూమిని 90 సంవత్సరాలకు ఆశ్రమం కింద కౌలుకు తీసుకొని యంత్రాలు లేకుండానే అభ్యుదయ పద్ధతుల్లో వ్యవసాయంచేయడానికి పూనుకొన్నారు. రాత్రి పాఠశాలలద్వారా వయోజన విద్యా వ్యాప్తికి కృషిచేస్తూ దానికి తోడుగా ఆయుర్వేద మందులను తయారు చేసే కుటీర పరిశ్రమలు వారు ప్రారంభించారు. శ్రీ సీతారామ్ గారు శతీష్‌చంద్రదాస్ గుర్తుగా కొమిల్లా ఆశ్రమంలాగా గానీ కాక పోతే సబర్మతీ ఆశ్రమ స్థాయిలోకి గాని దానిని తీసుకెళ్లాలని గట్టి పట్టుదలతో కృషిచేశారు.

శ్రీ సీతారామ్ గారు ఎప్పుడో 1914 వ సంవత్సర ప్రారంభం లోనే జాతీయోద్యమంలో కొండా వెంకటప్పయ్య గారి అనుచరుడిగా ప్రవేశించి భారతదేశంలో భాషా ప్రయుక్త ప్రాతిపదికపై ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రారంభించిన ఉద్యమాభివృద్ధికై కృషిచేశారు. వారు రేపల్లె న్యాయవాద సంఘ నాయకులుగా ఉన్నారు. గుంటూరులో కూడా ప్రముఖ న్యాయవాదిగా పనిచేస్తూ ఆరోజుల్లో నెలకు వెయ్యిరూపాయలు ఆదాయాన్ని తెస్తున్న విలువైన ప్రాక్టీసును కొనసాగిస్తూ గాంధీగారి పిలుపు విన్నంతనే కోర్టులను బహిష్కరించి న్యాయవాద వృత్తిని వదలిపెట్టారు. నేను ఆయనను మొదటిసారిగా విజయవాడలో, ఆతరవాత లక్నోలో ముస్లిం లీగ్‌తో సహా అన్ని పార్టీలు సంతకం చేసిన సమిష్టి జాతీయ ప్రణాళికను ఆమోదించేందుకు ఏర్పాటు చేసిన జాతీయ సభ సందర్భంలో 1915 వ సంవత్సరంలో కలుసుకున్నాను. మీరెంత గొప్ప ఉపన్యాసకులని అప్పుడాయనకు నేను చెప్పను. అయిదు అడుగుల మూడంగుళాల కంచె ఎత్తు లేకుండా పాట్టిగా ఉండి ముఖ మంతా స్ఫోటకపు మచ్చలతో ఉన్న ఆయనను చూసినప్పుడు నా కంత నచ్చలేదు. అయితే గొప్ప వాదనా పటిమతో దృఢమైన కంఠస్వరంతో ఆయన మాట్లాడడం ప్రారంభించిన తరవాత అక్కడ వున్న మేమందరం విస్మయంగా ఒక్కసారి ఆయన ఆకర్షణలో పడిపోయాం.

1920-21 సంవత్సరాలనాటి పెదనందిపాడు శిస్తు నిరాకరణోద్యమంలో ఆయన ప్రముఖపాత్రను నిర్వహించి జైలుపాలయ్యారు. ఆయన గాంధేయ పద్ధతుల్లో జీవితాన్ని కొనసాగించటం అలవర్చుకొన్నందున మిగతా రాజకీయ నిర్బంధితులను బాధించినట్లు కఠినమైన మూడో తరగతి జైలుశిక్ష ఆయన నెక్కువగా బాధించలేదు. ఆయన జైలు నుంచి విడుదలైన తరువాత గాంధీగారి నిర్మాణ కార్యక్రమాలను చక్కగా అమలు జరుపుతూ 1965 వ సంవత్సరంలో తాను స్వర్గస్తులయ్యేంతవరకు గాంధీగారి సర్వోదయ కార్యక్రమంలో పాల్గొంటూ జీవితాన్ని కొనసాగించారు.

శ్రీ సీతారాం గారికి శ్రీ బసవయ్య, శ్రీ యం.రంగయ్య నమ్మకమైన అనుచరులు. శ్రీ బసవయ్యగారు సబర్మతీ ఆశ్రమ ధర్మాలను అనుచరించి తనకున్న యావదాస్తినీ ఆశ్రమ సాంఘిక సేవలకోసం అర్పించారు. శ్రీ రంగయ్యగారు మాత్రం తన వ్యాపారంలో వచ్చే ఆదాయంలో కొంతభాగాన్ని మాత్రమే దాని కోసం ఇచ్చారు

శ్రీ సీతారాంగారు మాత్రం శ్రీ కొండా వెంకటప్పయ్యగారి సూచన లను అనుసరిస్తూ, చాలా సంవత్సరాలు ఆంధ్రప్రాంతంలో ఖాదీ నిర్మాణ కృషికి ప్రధాన సంధానకర్తగా పనిచేస్తూ, ఆరోజుల్లో ప్రముఖులైన కాంగ్రెస్ కార్యకర్తలు ఎక్కువ మంది ఆయన నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక సంఘంగా ఏర్పడి కృషిచేస్తుండగా, ఖాదీ వుత్పత్తి కార్యక్రమాలను ఆయన నాయకత్వంలో కొనసాగించారు. డాక్టరు పట్టాభి ఆయన అనుచరులు ప్రధానమైన ఈ కార్యక్రమ బాధ్యతలనుంచి ఆయనను తప్పించవలసిందని గాంధీగారికి నచ్చచెప్పి ఒప్పించారు. శ్రీ సీతారాం, శ్రీ వెంకటప్పయ్య ఇందుకు వారి నిరసనను వ్యక్తపరుస్తూ స్వతంత్ర సంస్థగా గుంటూరు జిల్లా ఖాదీ ప్రతిష్ఠాన్‌ను ఏర్పరిచి ఇతర జిల్లాలలో కూడా దాని బ్రాంచీలను ఏర్పాటు చేసి ప్రధానమైన ఖాదీసంస్థకు పోటీగా ఉత్పత్తిని, అమ్మకాలను సాగించారు. ప్రధాన ఖాదీ సంస్థ బాధ్యతలు శ్రీ పట్టాభిగారి అనుచరులకు అప్పగించడం జరిగింది.

శ్రీసీతారాంగారు గాంధీగారి నిర్మాణ కార్యక్రమాలకు తనను తాను హృదయ పూర్వకంగా అంకితం చేసుకున్నారు. గాంధీగారు 1935వ సంవత్సరంలో అఖిల భారత గ్రామీణ పరిశ్రమల సంస్థను ప్రారంభించడానికి పూర్వమే సీతారాంగారు అనేక గృహోపకర వస్తువులైన సబ్బులు, కాగితం వంటి వాటిని తయారుచేసేందుకు స్థానికంగా లభించే ముడి సరుకులతో గ్రామాలలో ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లాలో గృహ పరిశ్రమలపై పరిశీలనపై ఒకనివేదికను సమర్పించవలసిందిగా శ్రీశరణురామస్వామి చౌదరికి ఆయన బాధ్యతల నప్పగించారు. ఆయన వినయాశ్రమంలో ఉన్న పరిశ్రమలలో తయారయ్యే ఉత్పత్తులను ఎడ్ల బళ్ళ మీద చుట్టు ప్రక్కల ఉండే గ్రామాలకు తీసుకెళ్లి ప్రదర్శించవలసిందని ఆ బాధ్యతను నేతి చలపతిరావు గారికి అప్పగించారు.

గాంధేయ నిర్మాణ కార్యక్రమాలలో శ్రీసీతారాం కొనసాగిస్తున్న ఈ కృషిని ఉత్పత్తి కార్యక్రమాలను చూసేందుకు ఉత్సాహంతో అనేక తాలూకాల నుంచి, గ్రామాల నుంచి ప్రజలు వినయాశ్రమానికి వచ్చేవారు. అక్కడ వారు తమ గ్రామాలలో సాంఘికంగా వెనకబడి ఆర్థికంగా బలహీన స్థితిలో ఉన్న చేతివృత్తులవారు కొనసాగించే ఆ పనులను ఆశ్రమంలో సాగిస్తున్న రీతులతో పోల్చిచూసుకునేవారు. నేను భారతీదేవి గారు శ్రీసీతారాం, శ్రీబసవయ్య, చలపతిరావుగార్లు సాగిస్తున్న ఈకృషిలో వారితో కలసి ఖాదీ, చేతితో తీయబడ్డ వంటనూనెలు, నేత బట్టలను గర్వంగా ప్రజల ముందు ప్రదర్శించటానికి గ్రామాల వెంటతిరుగుతూ గ్రామస్తులకు స్వామి సీతారాం గారి కృషి సందేశాన్ని వివరిస్తూ ఉండే వాళ్లం జాతీయ నిర్మాణ కార్యక్రమంలో ప్రముఖ కేంద్రాలలో ఒకటిగా పేరు తెచ్చుకున్న వినయాశ్రమాన్ని చూడడానికి మహాత్మాగాంధీ గారు వచ్చారు. అనేక సార్లు ఆయన దాన్ని చూశారు. శ్రీసీతారాం, శ్రీబసవయ్య, బసవయ్యగారి భార్య శ్రీమతి దుర్గాంబగారు సాధించిన విజయాలను చూసి గాంధీ గారు బాగా సంతృప్తిచెందారు. వినోబా భావే గారు, రాజేంద్ర ప్రసాద్ గారు కూడా దానిని సందర్శించారు. గాంధీగారు సంపూర్ణ విప్లవానికి దీక్ష వహించారు. అందువల్ల నేరుగా కాకపోయినప్పటికీ రాజకీయాలతో పాటు సాంఘిక ఆర్థికరంగాలకు కూడా ఆయన తన సహాయాన్ని కేటాయించారు. ఆంధ్రలో రాజకీయోద్యమాలను నిర్వహించేందుకు డాక్టరు పట్టాభిగారికి, ప్రకాశం గారికి ఆయన అనుమతి లభించింది. అయితే స్వామి సీతారాం, శ్రీవెంకటప్పయ్య గార్లను వారితో పాటు ఇతర ఆశ్రమ నాయకులను అంటరానితనం నిర్మూలనకోసం, హరిజన హోస్టళ్ల పాఠశాలం ఏర్పాటు కోసం, గిరిజన హరిజన అభివృద్ధికోసం కృషిచేసేందుకు, ఖాదీ గ్రామీణ పరిశ్రమల అభివృద్ధికి, చేతి వృత్తుల వారి పునరావాస కృషికి, వాటితో పాటు గ్రామీణ స్త్రీల విద్యావ్యాప్తికై సాంఘిక విప్లవసాధన కోసం వారు చేస్తున్న కృషిని అంగీకరిస్తూ అభిమానించారు.

ప్రతి పోరాటంలోనూ వారు జైలు శిక్షలనుభవించారు. వారు జైళ్లలో ఉన్నా తమ గదులలో ఉన్నా తాము ఉన్న చోటునే సత్యాగ్రహ శిబిరాలుగా మార్చి చోటా గాంధీలుగా జీవించారు. వారు జీవించి ఉన్న కాలంలోని ఆఖరి సంవత్సరాలలో శ్రీసీతారాం, శ్రీబసవయ్య ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకోసం ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొని తమ ఆరోగ్యాన్ని బాగా కోల్పోయారు. 30 రోజుల పాటు వారు సాగించి నిరాహారదీక్ష ప్రజలలో బాగా ఉద్రేక పరిస్థితిని

తీసుకురాగా పండిత నెహ్రూగారు వినోబాభావే దగ్గరకు వెళ్లి స్వామి సీతారాం చేత నిరాహార దీక్షను ఉపసంహరింప జేయవలసిందని ఆయననర్థించారు. శ్రీ వినోబాభావే పరిస్థితులు సర్దుబాటైన తక్షణమే తాను జోక్యంచేసుకొని ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు కృషి చేయగలనని శ్రీ సీతారాం గారికి హామీనిస్తూ వారిరువురి చేత ఆదీక్షను విరమింప జేయగలిగారు. ఒక సంవత్సరం గడచిన తరువాత శ్రీ సీతారాం గారి ముఖ్య అనుచరులయిన ప్రముఖ హరిజన సేవా నాయకులైన శ్రీ పాట్టి శ్రీరాములు, ఢిల్లీనాయకులు సీతారాం గారికి ఇచ్చిన వాగ్దానాన్ని అమలుచేయనందున ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొని అమరులైనారు. శ్రీ పాట్టి శ్రీరాములుగారి నిరాహార దీక్ష ఆంధ్రరాష్ట్రాన్ని సాధించడమేగాక అఖిల భారతస్థాయిలో భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు మార్గాన్ని వేసింది. స్వామి సీతారాం గారికి జీవితాంతం ఆయన చేసిన ఒక కృషి విజయవంతమైన 30 రోజుల దీక్షతో, ఆయన ఆరోగ్యం బాగా నష్టపోవడం వల్ల ఈ సందర్భంలో ఆయన తిన్న దెబ్బనుంచి తిరిగి కోలుకోలేదు.

మహోన్నత త్యాగధనులైన శ్రీ సీతారాం, శ్రీ బసవయ్య, శ్రీ పాట్టి శ్రీరాములు గారు గాంధేయ విప్లవానికి తమ జీవితాలను అంకితం చేయడమే గాక జాతికి, మానవత్వానికి గాంధేయమార్గంలో గొప్ప సేవలందించి అమరులయ్యారు. వారు ప్రాచీన మహర్షులలాగా వారి జీవితాలను కొనసాగించారు. నేనూ, భారతీదేవి 1972వ సంవత్సరం సెప్టెంబరు నెల 21వ తేదీన సీతారాం గారికి, బసవయ్య గారికి మాశ్రద్ధాంజలిని ఘటించాం. ఆసమయంలో వినయాశ్రమంలో శ్రీమతి భారతీదేవి ఆమె ఆశ్రమప్రవేశాన్ని చేస్తూ 1931వ సంవత్సర పోరాటంలో శ్రీమతి దుర్గాంబ శ్రీ బసవయ్యగార్లతో కలసి తాను చేసిన కృషిని ఆనాటి మధుర స్మృతులను ప్రస్తావించారు. తిరిగి 3-9-1976న వినయాశ్రమంలో వారి విగ్రహాలకు పూలమాలలను సమర్పించుకోగలిగే అదృష్టయోగం నాకు కలిగింది. ఆ సందర్భంలో నేను శ్రీమతి భారతీదేవి, కొండా వెంకటప్పయ్యగారు వందల కొద్దీ దేశభక్తులైన కార్యకర్తలతో కలసి గాంధీగారి వెంట వచ్చి గాంధీగారి చేత వినయాశ్రమం శంఖుస్థాపన చేయబడిన నాటి మధుర స్మృతులను తిరిగి జ్ఞప్తికి తెచ్చాను. అప్పుడు శ్రీమతి భారతీదేవి వందల కొద్దీ రైతు, కేత మజ్‌దూర్ స్త్రీలను గాంధీజీ కార్య క్రమాలలో పాల్గొనేందుకై ఆనాడు బాపూజీకి సమర్పించింది. తన సందేశంలో గాంధీగారు భారతీయ స్త్రీలను తమ యావదాస్తని సామాజిక సేవకు అర్పించేందుకై తన భర్తను ప్రోత్సహించిన దుర్గాంబగారిని ఆదర్శంగా పెట్టుకోవలసిందని అన్నారు. స్త్రీలు సహజంగా ఆస్తిపాస్తుల పట్ల ఎక్కువ మమకారాన్ని కలిగి ఉండేవారయితే శ్రీమతి దుర్గాంబ అందుకు భిన్నంగా ప్రాచీన ఋషి పత్నిలాగా వ్యవహరించింది. ఆరోజు గుంటూరు జిల్లా వాసుల మైన మాకు నిజంగా అది ఓగొప్ప పర్వదినం. గాంధీగారు గుంటూరులోను, నిడుబ్రోలులోను, తాళ్లపాలెం లోను, రేపల్లెలోను, తెనాలిలోను అనేక బహిరంగ సభలలో పాల్గొని గొప్ప ఉపన్యాసాలు చేశారు. నిడుబ్రోలులో మారైతాంగ విద్యాలయాన్ని కిసాన్ ప్రచారణలను ప్రారంభించారు. కావూరులో సర్వజనులకు పూజనీయమైన వినయాశ్రమానికి శంఖుస్థాపన చేశారు. అప్పటి నుంచి (23-12-1933 వినయాశ్రమం ఒక దర్శనీయ స్థలంగా వెలుగొందుతూ సత్యాగ్రహులకు, విప్లవ మార్గాలను అనుసరించేవారికి యాత్రాస్థలంగా కొనసాగుతూఉంది.

శ్రీ తెన్నేటి విశ్వనాధం

శ్రీ తెన్నేటి విశ్వనాధం గారు స్థిరమైన తన రాజకీయ విశ్వాసాల కారణంగానూ, ప్రజారంగంలో ప్రదర్శించిన ఉన్నత విలువల కారణంగానూ, తన తోటి కార్యకర్తల తోనూ అన్ని పార్టీల వారితోనూ పక్షపాతరహితంగా ప్రేమపూర్వకంగా వ్యవహరించటం వల్లనూ, సత్సంబంధాలను కలిగి ఉన్నందువల్ల, ఆంధ్రరాజకీయ నాయకులలో ఆయన ఒక అరుదైన విశిష్ట లక్షణాలు కలిగిన ప్రముఖ వ్యక్తి.

ఆయన గత 50 సంవత్సరాలుగా ఆంధ్ర ప్రాంతంలోనూ, అఖిల భారత స్థాయిలోనూ మొదటి శ్రేణి నాయకులలో ఒకరుగా నాకు తెలుసు. అఖిల భారత కాంగ్రెస్ సమావేశాలలోనూ మద్రాసు ఆంధ్రాసన సభలలోనూ ఆయన శక్తి వంతమైన గొప్ప వక్త. ఆయన మాట్లాడేతీరు అందులో చూపించే సున్నితమైన హాస్యం పార్లమెంటరీ సాంప్రదాయాలను దాటని మర్యాద పద్ధతి స్వాతంత్ర్యానంతరం శాసన సభలలో ప్రవేశించిన నాయకులలో ఆయనను ఉన్నతుడిగా మనకు చూపెడతాయి.

ఆయన అఖిల భారత కాంగ్రెస్ నాయకులపట్ల, ఆంధ్ర కాంగ్రెస్ నాయకులపట్ల కూడా అభిమానంతో ఉంటుండేవారు. శ్రీ టంగుటూరి ప్రకాశం ఆయన సేవలను ఎక్కువగా వినియోగించుకున్నారు. ఆయనను తన కుడి భుజంగా ప్రకాశం గారు భావించారు. అదే రీతిలో విశ్వనాధంగారు కూడా తన నాయకుడైన ప్రకాశంగారి పట్ల తిరుగులేని విశ్వాసాన్ని ప్రదర్శించారు. ముఖ్యమంత్రికి, ప్రధాన మంత్రులకు దగ్గరి వ్యక్తిగా చలామణీ అవుతున్నప్పుడు కూడా ఆయన తనకున్న వ్యక్తి గత సంబంధాలను, ప్రాభవాన్ని తన స్వప్రయోజనాల కోసం గాని, లాభంకోసం గాని వినియోగించుకోకుండా మంచి నిజాయితిపరునిగా పేరు తెచ్చుకొన్నారు. ప్రకాశంగారు వారి సేవలను పొందినట్లు గానే ప్రముఖులైన శ్రీ రాజాజీ, శ్రీ నెహ్రూ, శ్రీ శాస్త్రి ఆయన సహకారాన్ని సంపాదించుకొని తమ మంత్రివర్గ సహచరులు కల్పించిన తత్తర పాటు నుంచి బైటపడ్డారు.

యుద్ధం రాక పూర్వం 1936-39 కాంగ్రెస్ మంత్రి వర్గంలోనూ స్వరాజ్యం రాబోయే ముందు 1946- 47 లో ఏర్పడిన మంత్రి వర్గంలోనూ ముఖ్య మంత్రిగా ఉన్న శ్రీ ప్రకాశంగారి మంత్రి వర్గంలో ఆయన పార్లమెంటరీ సెక్రటరీగా (ప్రస్తుతం డిప్యూటీ మంత్రిస్థాయి) పనిచేశారు. అప్పుడాయన సమర్థులు, విశ్వసపాత్రులు, స్థాయికలిగిన వ్యక్తిగా ఆనాటి ముఖ్యమంత్రుల దగ్గర గౌరవాన్ని సంపాదించుకోగలిగారు. బాగా ప్రముఖులైన అప్పటి రెవిన్యూ మంత్రుల వద్ద పనిచేసే ఐ. సి. ఎస్. కార్యదర్శులు ఆయన రాజకీయ సామర్థ్యాన్ని, పార్లమెంటరీ పద్ధతుల్లోని నేర్పును మాత్రమే కాక పరిపాలనా సామర్థ్యాన్ని గూడా ఎక్కువగా గౌరవించారు.

ఒకమారు అది కూడా ఒక సంవత్సర కాలం మాత్రమే, ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన మొదట్లో ఆయన రెవిన్యూ శాఖా మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలో ఆయన కేంద్ర వనరుల నుంచి ఆంధ్ర వాటాకు ఎక్కువ వనరులను (నిధులను) రాబట్టగలిగారు. అంతకు ముందు 20

సంవత్సరాలుగా పనిచేసిన ఏ రెవిన్యూ మంత్రి సాధించలేని ఫలితాన్ని ఆరోజున ఆయన సాధించారు.

ఆయన కేంద్రప్రభుత్వంలో రెండు మూడు సంవత్సరాలపాటు కంపెనీలా అడ్మినిస్ట్రేషన్‌ను సరిచూస్తూ పరిశ్రమల యజమానులతో వ్యవహరించగలిగే అవకాశాన్ని పొందగలిగారు. ఆ సమయంలో ఆయన చట్టాలను సిద్ధంచేయడంలో ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా రాజకీయ లాభాపేక్షకు గానీ, స్వార్థ దృష్టికిగానీ ఏ మాత్రం అవకాశమీయకుండా కంపెనీ యాజమాన్యాల వారి ప్రమేయాన్ని దగ్గరకు చేరనివ్వకుండా గౌరవంగా పనిచేసె గొప్ప మర్యాదను సంపాదించుకున్నారు.

ఆయన ప్రకాశంగారితోనే ఎక్కువ విశ్వాస పాత్రంగా ఉండేవారు. అందువల్ల ఆయన కాంగ్రెస్ ను వదలి బైటకు వచ్చినప్పుడు ప్రకాశంగారితోనూ, నాతోనూ కలిశారు. ఆ కారణంగానే ప్రకాశంగారు మద్రాసు శాసనసభలో 1952 సంవత్సరంలో కమ్యూనిస్టులతో కలసి పని చేయడానికి నిశ్చయించుకున్నప్పుడు విశ్వనాధం గారుకూడా ఆయన ననుసరించి సంయుక్త ప్రతిపక్షంలో చేరి, రాజాజీ గారికి తను మంత్రివర్గం లోనికి ఆహ్వానించే అవకాశం రాకుండాచేశారు. ప్రకాశంగారు ముఖ్యమంత్రి కావడానికి వీలుగా కిసాన్ మజ్‌దూర్ ప్రజాపార్టీకి రాజీనామా చేసినపుడు ఆయన కూడా దానిని అనుసరించి ప్రకాశంగారి మంత్రి వర్గంలో మంత్రిగా చేరారు. తనకు అత్యంత విశ్వాస పాత్రుడైన ఈ సహచరుడ్ని ప్రజాపార్టీ నాయకులుగా కొనసాగేందుకు ప్రకాశంగారు అనుమతించారు.

ఆయన పార్లమెంటు సభ్యులుగా వచ్చినపుడు నేను అక్కడ ఉండే అవకాశం కలిగింది. ఆనాలుగు సంవత్సరాలు పార్లమెంటులో స్వతంత్ర సభ్యులుగా ఆయన పనిచేసే తీరును నేను గమనించగలిగాను. ఆయన శాసన సభలలో లాగా పార్లమెంటులో ప్రముఖస్థానాన్ని పొందగలిగాను. ఎందుకంటే అప్పటికాయన బాగా పెద్దవారై పోయారు. మరొక ప్రక్కి క్రొత్తగా స్వీకరించిన నెహ్రూ వ్యతిరేక మార్గాన్ని ఆయన సమర్థవంతంగా నిర్వహించలేక పోయారు. అయితే ఆయన చేసే నిర్మాణాత్మక మైన సూచనలను ప్రభుత్వం అనుసరించింది. అప్పుడు సభలో ఉన్న ప్రతిపక్ష నాయకులలో పెద్దవాడిగా ఆయనను అన్ని పార్టీలు గౌరవంతో చూశాయి. ఆయన అక్కడ ఉండడం కారణంగా నేను మానసికంగా ఎక్కువ సంతోషడ్డాను.

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం, ఓడల నిర్మాణకేంద్రం, రేవుల అభివృద్ధి, కాల్ చెక్స్ నూనెఖర్మి కర్మాగారం, ఎరువుల ఫ్యాక్టరీ వంటి వాటి అభివృద్ధిలో ఆయన సేవలు చెప్పుకోదగినంతగా ఉన్నాయి. అయినప్పటికీ ఆయన వాటిలో వేలు పెట్టేందుకు ఎప్పుడూ ఏవిధంగానూ ప్రయత్నించలేదు. మాపార్టీలో చేరడానికి ఆయన అంగీకరించనప్పటికి నాతో ఎప్పుడూ సంతోషంగా వ్యవహరిస్తూ మంచి సలహాలనిస్తూ అన్ని వేళలా ఒక కుటుంబ మిత్రుని లాగా వ్యవహరిస్తుండేవారు. మంత్రివర్గం ప్రజాస్వామ్య వ్యతిరేకచర్యల గురించి, పరిపాలనలోని అవినీతికి వ్యతిరేకంగా మేము సాగించే పోరాటంలో ఆయన ఒక దగ్గరి మిత్రునిలాగా సలహాలిస్తూ సహకరిస్తుండేవారు. 1971 సంవత్సరంలో ఆయన ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసి తనను శ్రీమతి ఇందిరాగాంధీ బలపరిచినప్పటికీ దురదృష్ట వశాత్తూ ఓడిపోయారు.

శ్రీ తెన్నేటి విశ్వనాధం

ఆంధ్రోద్యమంలో విశ్వనాధం గారి పాత్ర జగమెరిగింది. కేంద్రం, తెలంగాణాలతో ఆంధ్ర తెలంగాణా సంఘర్షణ సందర్భంలో ఆంధ్రుల నాయకుడిగా ఆయన ప్రవర్తించిన తీరు విశిష్టమైది. విశాఖలో ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన కున్న పార్లమెంటరీ విధాన నైపుణ్యంతోనూ ఆయన ఒప్పించగలిగారు. తెలంగాణా నుంచి విడదీసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని ఏర్పాటు చేసేందుకు భారత ప్రభుత్వం అంగీకరించకపోయినా తరవాత ఆయన ప్రతిపక్షంలో చేరి ఆంధ్ర ఫ్రంటును ఏర్పరిచారు. దేశంలో అత్యవసర పరిస్థితి విధించబడినపుడు ఆయన ఒక సంవత్సరంపాటు నిర్బంధంలో ఉన్నారు.

శ్రీ గిరి గారు, నేను అమ్రోతి జైలులో ఆయనతో కలసి ఉన్నాం. ఆయన తన హాస్యోక్తులతోనూ, మృదుభాషణలతోను ఎప్పుడూ మా అందరితో ఉల్లాసంగా గడుపుతూ ఉండేవారు. ఆంధ్ర ముఠా రాజకీయాలకు దూరంగా ఉన్న కారణంగా ఆయనెప్పుడూ మామూలు సబ్ జైళ్లకు వెళ్లలేదు. స్వాతంత్ర్య సిద్ధించిన తరవాత మనకున్న రాజకీయ నాయకులలో ఇంతటి మృదు స్వభావి, మర్యాద పూర్వకమైన పద్ధతి కలిగిన వారు చాలా కొద్దిమందే కనిపిస్తారు.

స్వాతంత్రోద్యమ సమయంలో శ్రీ విశ్వనాధంగారు గొప్ప త్యాగాలు చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తరవాత కూడా అధికారంలో ఉన్నప్పుడు గాంధేయ పద్ధతులలో గౌరవప్రదంగా జీవించి ఆయన గొప్పవారనిపించుకున్నారు. ఆయన ప్రతిపక్ష నాయకులుగా ఉన్నప్పుడు గూడా అసంతృప్తికి గానీ విద్వేషానికి గానీ లోను గాకుండా ప్రజాసేవకులకు ఆదర్శంగా మెలిగారు. (నిజానికి మన శతాబ్దంలోని ప్రముఖ గాంధేయ నాయకులలో ఒకరిగా ఉంటూ 82 సంవత్సరాలు (1976 సెప్టెంబరు) ఈ వయసులో కూడా ఆయన మనకు ఆదర్శప్రాయమైన రాజకీయ నాయకునిగా పనిచేస్తున్నారు.) 1972 వ సంవత్సరంలో ఇవ్వజూపిన స్వాతంత్ర్య సమరయోధుల జీవన భృతికి మేమిద్దరం అర్హుల మయినప్పటికి దానిని గ్రహించలేదు. 1975 సంవత్సరంలో మాజీ శాసన సభ్యులు శ్రీ కందిమళ్ల బుచ్చయ్యగారు నిర్వహించిన నా జన్మ దినోత్సవ కార్యక్రమానికి ఆయన అభిమానంతో వచ్చి అధ్యక్షత వహించారు. అనుకున్న లక్ష్యాల మేరకు పంటలను ఉత్పత్తి చేయలేని రైతులకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ప్రణాళికా సంఘ నిపుణులు ప్రతిపాదనలు చేసినపుడు దానిని నేను వ్యతిరేకిస్తున్న సందర్భంలో శ్రీ విశ్వనాధంగారు పెరోల్ పై జైలునుంచి తిరిగి వచ్చి తిరిగి జైలుకు వెళుతూ తన హృదయ పూర్వకమైన సమర్థనను నాకు తెలియజేస్తూ సందేశాన్ని పంపించారు. స్వయం వృత్తులతో జీవించే వేద రైతాంగ ప్రయోజనాల పట్ల ఆయన కనబరచిన శ్రద్ధకు నేను అమితంగా ఆనందించాను. గడచిన ఈ దశాబ్దాలన్నింటిలో ఆయనకు సహచర రాజకీయ నాయకుడిగా సహమిత్రునిగా ఉండ గలిగినందుకు నేను ఎంత గానో గర్వపడుతున్నాను.

శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య

శ్రీ విశ్వేశ్వరయ్య, శ్రీ కార్వేగార్లు మన జాతీయ నాయకులలో నూరు సంవత్సరాలకు పైగా జీవించి వారి వారి రంగాలలో విశిష్టమైన సేవలనందించి ప్రఖ్యాతి చెందారు. దేశం యావత్తూ వారి శత జయంతి ఉత్సవాలను జరుపుకొంది. శ్రీ జవహర్లాల్ నెహ్రూ జాతికి వారందించిన సేవలకు జాతి తరపున వారికి అభినందనలు తెలుపుకొన్నారు. ఈ తరానికి చెందిన మాలాంటి వారమంతా వారి జీవితాల ద్వారా వారు సాగించిన కృషిద్వారా ఉత్తేజాన్ని పొందాం. శ్రీమతి భారతీదేవి ఆమె కంటే మహిళా ఉద్యమంలో ముందున్న శారదా నికేతన్ లక్ష్మీబాయమ్మ, నేషనల్ సోషల్ వెల్ఫేర్ బోర్డులో అనన్యమైన కృషిచేసిన శ్రీమతి దుర్గాబాయమ్మ, అనేక ఇతర మహిళా నాయకురాళ్లు ఆంధ్ర సాంఘిక సంస్కరణోద్యమానికి ప్రముఖ నాయకులైన శ్రీ కందుకూరి వీరేశలింగం గారికి గౌరవ సహచరునిగా భారత మహిళా ఉద్యమానికి పితామహునిగా శ్రీ కార్వేగారిని భావించేవారు.

ఇరవయ్యవ దశకంలో జాతీయోద్యమంలోనికి కార్యకర్తలుగా వచ్చిన మాలాంటి వారందరకు గాంధీగారు, తిలక్ గారు, లజపతిరాయ్ గార్ల లాగానే విశ్వేశ్వరయ్య గారు కూడా ఒక గొప్ప పురాణ పురుషుడిగా కన్పించేవారు. అప్పటికే ఆయన ప్రముఖ భారతీయ ఇంజనీరుగా, దేశాభిమానిగా, కృష్ణరాజసాగర్ హైడ్రో ఎలక్ట్రికల్ వర్క్స్, భద్రావతీ ఐరన్ వర్క్స్, మైసూర్ పారిశ్రామిక ప్రదర్శన వంటి గొప్ప నిర్మాణాలను పూర్తిచేసి, ఆ తరం భారతీయ ఇంజనీర్లలో ప్రముఖుడిగా పేరుపొందారు. అప్పటి వరకు ఏభారతీయ ఇంజనీరుకు తమ స్వంత పర్యవేక్షణలో ఇంతటి గొప్ప నిర్మాణాలను చేపట్టే అవకాశాన్ని బ్రిటిష్ వారు ఇవ్వలేదు. అదృష్టవశాత్తూ విశ్వేశ్వరయ్యగారు ఆకాలంలో మైసూర్ మహారాజాగారి దగ్గర పనిచేస్తూ ఈ గొప్ప నిర్మాణ కార్యక్రమాలను చేపట్టి తన శక్తి సామర్థ్యాలను చూపెట్టగలిగారు.

మహారాజా గారి దగ్గర దివాన్ గానూ, ముఖ్య పాలనాధికారి గానూ ఆయన బాధ్యతలను చేపట్టి ఇంజనీరుగా ఆయనకున్న ముందు దృష్టితో ఉత్తమ పరిపాలకుడిగా తనకు తాను నిరూపించుకున్నారు. అయితే బ్రాహ్మణ వ్యతిరేక నాయకులు ఆయనను అంగీకరించక పోవడంవల్ల సర్వాధికారాన్ని కలిగి ఉన్న బ్రిటిష్ పాలకులు ఆయన పట్ల అసూయతో ప్రవర్తించిన కారణంగా దివాన్ పదవికి అప్పట్లో ఆయన రాజీనామా చేశారు. దేశం అన్ని ప్రాంతాల నుంచి జాతీయ వాదులైన వారు దానికి తమ విరసనను తెలియజేశారు. జాతీయాభివృద్ధి కార్యక్రమాలలో తాను నిర్విరామంగా కృషిచేయగలనని అందుకు ఆయన ప్రకటించిప్పుడు యువకులుగా ఉన్న మేమంతా గర్వంతో పొంగిపోయాం.

చాలా మంది గొప్పవారు నిర్బంధంగానీ, స్వచ్ఛందంగా గాని పదవీ విరమణ చేసిన సందర్భాలు అరుదు. దీనిని మేము కేంద్ర మంత్రులుగా పని చేసిన మా అనుచర ప్రముఖ రాజకీయ నాయకులలో ప్రత్యేకంగా చూడగలిగాం. అయితే శ్రీ విశ్వేశ్వరయ్యగారు అలా కాకుండా 1917-18 సంవత్సరాలలో మైసూరు నుంచి ఉద్యోగ విరమణ చేసిన తరవాత ఎన్నో

మహత్తర విజయాలను సాధించగలిగారు.

ఒక ప్రముఖ ఇంజనీరుగా ఆయన తోటి ఇంజనీర్లు మధ్య చివరి వరకు ఉన్నత గౌరవాన్ని పొందుతూనే వచ్చారు. దక్షిణ భారత దేశం బొగ్గు నిల్వలు తగినంతగా లభించని కారణంచేత జలవిద్యుత్తును ఎక్కువగా ఉత్పత్తి చేసి వేగంగా పారిశ్రామికాభివృద్ధికి తలపడాలని అందుకు మార్గాన్ని ఆయన చూపెట్టారు. చిన్న చిన్న ఇనుప కర్మాగారాలను ఆయన ఏర్పాటు చేయించి వాటి ద్వారా భారత భూగర్భంలో ఎక్కువగా నిల్వ ఉన్న ఇనుప ఖనిజ నిల్వల వినియోగానికి ఆయన దారి చూపెట్టారు. నాగపూర్‌కు దోమలతో, మలేరియా వ్యాధులకు కారణమయ్యే క్రిములతో కూడిన మురుగునీటి పారుదల సమస్య ఉంది. ఆ సమస్య పరిష్కారానికి శ్రీ విశ్వేశ్వరయ్య సమర్పించిన నివేదిక ప్రధానాధారమైంది. విశాఖపట్నం ఓడరేవు ఇనకతో నిండి పోతూ ప్రమాదంలో చిక్కుకొంది. ఆయన నివేదికను అమలుచేయటం కారణంగా ఆ ఇబ్బంది నుంచి బైట పడడం జరిగింది. ఆ పద్ధతుల్లో ఎక్కడ ఎప్పుడు సాంకేతిక ఇబ్బందు లెదురైనా ఆయనను పిలిపించుకొని పరిష్కార మార్గాలను వెదుక్కొంటూ ఉండేవారు. ఎంతటి కఠినతరమైన, సాంకేతిక పరమైన యిబ్బందైనా విశ్వేశ్వరయ్య గారు వేలుపెడితే ఇట్టే పరిష్కారమై పోయేది.

భారత పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికకు విశ్వేశ్వరయ్య గారు తండ్రి లాంటి వారు. గత నలభై సంవత్సరాలుగా ప్రముఖ భారత జాతీయ నాయకుడైన శ్రీ ఫిరోజ్ షా మెహతా, రేనడే నుంచి గోఖలే వరకు, శ్రీ లజపతిరాయ్ వంటివాళ్ళు భారతదేశంలో పెరుగుతున్న దారిద్ర్యాన్ని ఎదుర్కొనేందుకు పారిశ్రామికాభి వృద్ధిని సాధించడం ప్రధాన అవసరమని ప్రచారం చేస్తూ వస్తున్నారు. ఖద్దరు గృహ పరిశ్రమలు గ్రామీణ పునర్నిర్మాణ కృషి కోసం బాపూజీ ప్రత్యేక శ్రద్ధ వహించడంతో అంతకు ముందు కాలం నుంచి పారిశ్రామికీకరణ కోసం చేస్తున్న ప్రచారాన్ని అది చల్లబరిచింది. టాటా ఐరన్ వర్క్స్ అనే భారీ ఇనుప కర్మాగారానికి కేంద్రశాసన సభలో స్వరాజ్య పార్టీ తరపున మోతీలాల్ నెహ్రూగారు బాగా సమర్థించడంతో అది తీవ్ర విమర్శలకు గురయింది. విశ్వేశ్వరయ్యగారు సోవియట్ యూనియన్ వారు అమలుచేస్తున్నట్టు గా ఒక ప్రణాళికా బద్ధమైన విధానం ద్వారా భారతీయ పరిశ్రమలను అభివృద్ధి చేయాలని దేశం దృష్టిని ఈ వైపు మళ్లించారు. ముఖ్య పరిశ్రమలకు ఒక దేశ వ్యాప్త మైన పథకం ద్వారా తగు ప్రాధాన్యతను కల్పించాలని ఆయన చెప్పారు. ఆసమయంలో (1933) పెద్ద, భారీ పరిశ్రమల ప్రాముఖ్యాన్ని గుర్తించి ఆ వైపు తమ దృష్టిని మళ్లించవలసిందని అప్పుడే దేశంలోకి ప్రధాన స్థానంలోకి వస్తున్న కాంగ్రెస్ నాయకత్వాన్ని ఆయన ధైర్యంగా కోరారు. జాతీయ ప్రణాళికలను గురించిన తన విధానాలను ఆయన సిద్ధం చేశారు. రష్యా ప్రణాళిక విజయవంతం కావడం ఒక ప్రక్క అమెరికాలోని టెన్నిస్సీ వ్యాలీ అథారిటీ అదే పద్ధతుల్లో విజయవంతం కావడం గమనించిన తరవాత ఆయన ప్రకటించిన ఆప్రణాళికా పుస్తకానికి దేశవ్యాప్తమైన ప్రాముఖ్యత లభించింది. బాగా వెనకబడి వున్న టెన్నిస్సీ వ్యాలీ అభివృద్ధికోసం జరిగిన బహుళార్థక సాధక పునర్నిర్మాణ కృషిని చూసి శాసన సభలలోని కాంగ్రెస్ సభ్యులు ఎక్కువగా ఉత్తేజం పొందారు. తరవాత కాంగ్రెస్ పార్టీ కేంద్రశాసన సభలో భారతదేశ సర్వతోముఖాభివృద్ధికోసం ఒక జాతీయ ప్రణాళికను సిద్ధపరచవలసిందిగా, తీర్మానాన్ని

ప్రవేశపెట్టింది. శ్రీ గిరిగారు ఆ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. శ్రీ అవినాశ లింగం చెట్టియార్ బలపర్చారు. విశ్వేశ్వరయ్యగారు ప్రణాళికా బద్ధమైన ఆర్థిక కార్యక్రమాన్ని ప్రవేశపెట్టాలనే సంకల్పంతో తెచ్చిన ఆ తీర్మానాన్ని నాలాంటి వారం అనేక మందిమి సమర్థించాం.

అనేక మంది కాంగ్రెస్ శాసన సభ్యులు ఈ విషయమై తమలో తామే చర్చించుకున్నారు. అటువంటి జాతీయ ప్రణాళికాపరంగా భారీ, పెద్ద, మధ్యతరహా పరిశ్రమలను ఒకవైపు, గృహ పరిశ్రమలు చేతివృత్తులను, చిన్న తరహా పరిశ్రమలను మరొకవైపు, పరస్పర విరుద్ధం కాకుండా కలిపి అభివృద్ధిచేయడం ఎలా అనే విషయాన్ని కాంగ్రెస్ వారు అలోచించసాగారు.

ఈ చర్చలలో కాంగ్రెస్ వారిలో విభేదాలు ఏర్పడ్డాయి. గాంధేయ కార్యకర్తలమైన నేను, శ్రీ కుమరప్ప, శ్రీ సతీష్ బాబు వంటి వార్లం 1934వ సంవత్సరంలో ఏర్పాటు చేయబడిన అఖిలభారత గ్రామీణ పరిశ్రమల సంఘాన్ని అభివృద్ధిచేయాలని 1920-34 సంవత్సరాలమధ్య జాతీయ పోరాటంలో పాల్గొన్న కార్యకర్తలమందరం ఒకవైపు, 1930 తరువాత శాసన సభలలో కొచ్చిన వారు నెహ్రూ సోషలిస్టు మార్గావలంబికులైన వారు పట్టణ ప్రజల దృక్పథంతో కూడిన పారిశ్రామికాభివృద్ధిని కోరుతూ మరొక వైపు ప్రణాళికలోని ప్రాముఖ్యతను గురించి తొందర పడసాగాం. మేము గాంధీజీని ఆదర్శంగా పెట్టుకోగా వారు విశ్వేశ్వరయ్య గారిని ఉదాహరణగా చూపెట్టారు. అయితే ఇరువైపులా కూడా ఆర్థికాభివృద్ధికొరకై జాతీయ ప్రణాళికను ఏర్పాటు చేసుకోవాలనుకునే విశ్వేశ్వరయ్యగారి ప్రధాన లక్ష్యంతో అంగీకారం కలిగి ఉండడం జరిగింది.

తిరిగి శ్రీ విశ్వేశ్వరయ్య గారు జాతీయ రంగం మీదకి వచ్చారు: అనేక రాష్ట్రాలలో కాంగ్రెస్ మంత్రివర్గాలేర్పడడంతో (1937-39) అప్పుడు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉన్న శ్రీ సుభాష్ చంద్రబోసుగారు జాతీయ ప్రణాళికా సంఘాన్ని ఏర్పాటు చేయాలనే నిశ్చయానికొచ్చి దానికి చైర్మన్‌గా "విధర్ ఇండియా" గ్రంథకర్త పండిత నెహ్రూను నామినేషన్ ద్వారా నియమించారు. గాంధేయ మార్గావలంబికులైన అఖిల భారత గ్రామీణ పరిశ్రమల సంస్థకు సంబంధించిన డాక్టరు జె. సి. కుమరప్పను కుటీర పరిశ్రమల కోసం, చిన్న తరహా పరిశ్రమల కోసం ప్రచారం చేస్తున్న నాలాంటి వారిని కూడ అందులో సభ్యులుగా నియమించారు. అదంతా ఒక వాసన లేని పుష్పంలాంటిదని నాలాంటి వారు చాలామందిమి అందులో చేరడానికి నిరాకరించాం.

ఆ కమిటీ భారాన్నంతా శ్రీ విశ్వేశ్వరయ్యగారు మోస్తే జవహర్లాల్ నెహ్రూగారు దానికి రాజకీయ స్థాయిని కల్పిస్తే శ్రీ కె. టి. షా దానికి కార్యదర్శిగా ఉండి అనేక పరిశ్రమలకు సంబంధించిన ప్రణాళికలకు కమిటీలలో రూపకల్పన చేశారు.

అనేక సంస్థల పనితీరుపై ఆయన సంతృప్తి చెందలేదు. భారత వ్యాపారవేత్తలు వారి సంస్థలైన చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండియన్ మర్చంట్స్ ఫెడరేషన్ వంటివి తమకు లభించే అవకాశాలు వాడుకొని విపరీతంగా డబ్బును ప్రోగుచేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా ప్రవర్తిస్తుండడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. శ్రీ విశ్వేశ్వరయ్యగారు భారత పారిశ్రామిక వేత్తలు తమ స్వంత లాభంకోసం మాత్రమే కాకుండా దేశ ఆర్థికాభివృద్ధిని కూడా ప్రధాన లక్ష్యంగా పెట్టుకొని పనిచేయాలని కోరారు. అందుకు అనుగుణంగా ఆయన 1941వ సంవత్సరంలో

అఖిలభారత ఉత్పత్తిదారుల సంఘాన్ని ప్రారంభించారు. అదృష్టవశాత్తూ ఆయన ఈ కార్యక్రమంలో పనిచేసేందుకు దూరదృష్టి కలిగిన దేశభక్తి ఉన్న పారిశ్రామిక వేత్త శ్రీ మొరార్జీ వైద్యగారిని అంగీకరింపజేయగలిగారు. ఈ సంస్థకు శ్రీ వైద్య మొదట కార్యదర్శిగా పని చేసి తరవాత దానికి చైర్మన్ అయ్యారు. ఈ ఇద్దరూ కలసి ఈ సంస్థకు దేశభక్తి తో కూడిన ఉన్నత లక్ష్యాలతో మంచి స్థాయిని తీసుకురాగలిగారు. భారత పరిశ్రమ లను అభివృద్ధిచేయడంలో అభ్యుదయకరమైన మార్గాలను అవలంబించాలని యువ పారిశ్రామిక వేత్తలను వారు ఒప్పించగలిగారు.

ఈ సమయంలో ఆయనతో కలసి పనిచేయడానికి నేను ముందుకు వచ్చి భారీ పారిశ్రామిక ఉత్పత్తులకు అనుబంధంగా, గృహ పరిశ్రమలకు, చిన్న పరిశ్రమలకు ఏమేరకు ఎంతవరకు అవకాశం కల్పించవచ్చో ఆమేరకు వాటికి అవకాశం ఇచ్చేందుకు ఆయన చేత అంగీకరింప జేయగలిగాను మైనరు యిరిగేషను, డ్రైనేజీ నీటి పారుదల వంటి కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యాన్ని సంపాదించేందుకు నేను చేస్తున్న కృషిలో ఆయన నాకు తోడ్పడ్డారు.

ఆయన సర్వసమర్థుడైన ఉన్నతాధికారి. చాలా స్నేహ పూర్వకంగాను, సహకారంతోను వ్యవహరిస్తుండేవారు. తమ సహచరుల నుంచి మంచి ఫలితాలను రాబట్టడానికి ఆయన ఎంతో తెలివితో ప్రయత్నిస్తుండేవారు. ఆ తరవాత తనకు గౌరవ కార్యదర్శిగా పనిచేసిన శ్రీ మొరార్జీ వైద్య, ఉత్పత్తి దారుల సంస్థ అయిన అఖిల భారత ఉత్పత్తిదారుల సంఘానికి తన తరవాత అధ్యక్షులు కాగలిగినందుకు ఆయన ఎంతగానో సంతోషించారు.

ఉత్పత్తి, వ్యాపార నిర్వహణలలో ఉన్నత నైతిక విలువలు ఉండాలని ఆయన ఎక్కువగా నమ్మారు. అవినీతి, కల్తీవంటి తప్పుడు పద్ధతులు ఉత్పత్తిదారుల విలువలను పడగొట్టడమే గాకుండా దేశాన్ని గూడా అవినీతి మార్గం వైపు నడిపించ గలవని ఆయన గట్టిగా అభిప్రాయడ్డారు. ఆయన తరవాత వచ్చిన వారు కూడా శీఘ్ర పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలవంటి వాటిలో విశ్వేశ్వరయ్య గారు చేపట్టిన మార్గాన్ని అనుసరించారు. అఖిలభారత ఉత్పత్తిదారుల సంస్థ ఆశీస్సులతో ఇండో, యు. ఎస్. ఎస్. ఆర్ చాంబర్ ఆఫ్ కామర్స్, ఆంగ్లో, సోవియట్ చాంబర్ మార్గాలలో ఏర్పాటు చేశారు, శ్రీ విశ్వేశ్వరయ్య, వారి అభిమానులు భారతదేశాన్ని ఆర్థికంగా స్వయంసమృద్ధి కలిగిన దేశంగా తయారు చేసేందుకు ఎక్కడ ఏమంచి కన్పించినా దానిని తీసుకున్నారు. ఇది 1971వ సంవత్సరం తరవాత దేశాన్ని స్వయం సమర్థవంతమైన దేశంగా తయారుచేసేందుకు శ్రీమతి ఇందిరాగాంధీ చేపట్టిన కార్యక్రమాలకు నిజానికి ఇది ఆలంబనమైంది.

శ్రీ విశ్వేశ్వరయ్య నిలువెత్తు కంచు విగ్రహం ఆయన జన్మస్థలమైన బెంగుళూరు లోనే కాకుండా తెలుగు ప్రజల ముఖ్య పట్టణమైన హైదరాబాదులో కూడా స్థాపించడం జరిగింది. శ్రీ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి పూర్వీకులు ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా మోక్షగుండం నుంచి జీవించేందుకు మైసూరు రాష్ట్రం వలసవెళ్లిన వారని ఆంధ్రులు ఆయన గురించి గర్వపడుతుంటారు.

ఆయకు నూరు సంవత్సరాలు నిండిన సందర్భంలో జరిగిన గొప్ప ఉత్సవంలో పాల్గొనేందుకు, ఆయన దర్శనం చేసుకొనేందుకు శ్రీమతి భారతీ దేవి నేను అప్పట్లో

బెంగుళూరు వెళ్లాం. ఆయన తను నిద్రలేచేంతవరుకూ మమ్మల్ని బయట నిలబెట్టకుండా అలవాటుగా ఉన్న తన ఆచారాన్ని కూడా పక్కకు నెట్టి పడకమీది నుంచిలేచి గౌను వేసుకొని మమ్ములను ఆదరంతో లోపలికి తీసుకువెళ్లారు. శ్రీమతి భారతీదేవి ఆయనకు భారతీయ సాంప్రదాయ పద్ధతిలో ప్రణామాన్ని చేసేందుకు ముందుకు వంగినపుడు ఆయన ఆమెను వారించారు. ఆవయస్సులో గూడ ఆయన సమకాలీన సంఘటలకు దూరంగా ఉండలేదు. సహకార వ్యవసాయాన్ని ప్రారంభించాలనే నెహ్రూ ప్రయత్నానికి వ్యతిరేకంగా పోరాడుతున్న నన్ను ఆసమయంలో అభినందించారు. నాకు తోడు నిలబడినందుకు శ్రీమతి భారతీదేవిని గౌరవించారు. మేము ఆయన నుంచి శెలవు తీసుకొని బైటకు వస్తున్నప్పుడు మాతో కలసి బైట గేటు దాకా వచ్చి తిరిగి మమ్ము ఆశీర్వదించారు. సన్నగా బాగా పొడవుగా ఇత్తడి వంటి తెల్లటి మేని ఛాయతో, దృఢమూ, దీర్ఘమైన ముఖంతో స్పష్టమైన నోటితో విశాలభాగంతో చిరునవ్వులు చిందిస్తూ ఉండే ఆ కావేరీ ప్రాంతపు త్యాగధనుడు ప్రదర్శించే మర్యాద అంత గొప్పది.

శ్రీ ఇందూలాల్ యాగ్నిక్

ప్రఖ్యాతి చెందిన మహ గుజరాత్ నాయకుడు, శ్రీ ఇందూలాల్ యాగ్నిక్ కేంద్ర, రా ష్ట్ర ప్రభుత్వాల మంత్రులందరి చేతా గౌరవాన్ని స్వీకరిస్తూ, 1972 లో మన లనందర్నీ వీడి పోయారు. అహమ్మదాబాద్ నగరం ఆయన పట్ల చూపెట్టిన శ్రద్ధాంజలి ఎంతో గొప్ప నాయకులే గానీ, సాధారణంగా ఇతరు లెవరూ పొందలేనంత గొప్పది.

సర్దార్ వల్ల భాయి పటేల్ గారికి, ఆయన సబర్మతి ఆశ్రమంలో సహచరుడు. అయితే వారిద్దరికీ అక్కడ పరప్పరానుబంధంలేదు. ఆయన ఆశ్రమాన్ని వదిలి పెడుతున్నపుడు "గాంధీయాజ్ ఐనోహిమ్" అనే పుస్తకాన్ని రాసి, అక్కడ ఆశ్రమ వాసులను విడిచి పెట్టి వెళుతున్నప్పుడు, వెళ్లిపోతున్నందుకు ఎంతగానో బాధపడ్డాడు. ఆయనకు ఆపుస్తకం ఎక్కువ పనిచేసింది. గాంధీజీ, పటేల్ గార్లపై ఉన్న ప్రజావిశ్వాసాన్ని అది ఏరకంగానూ మార్చలేక పోయయింది.

ఆయన రాజకీయాలకు దూరంగా ఇరవై సంవత్సరాల పాటు గడిపి, ఆసమయంలో పత్రికారచన, చిత్రనిర్మాణం, వ్యాపారం వీటి విషయాలలో పూర్తిగా నిమగ్నమై గడిపారు.

1936లో ఆయన బొంబాయిలో 'కిసాన్ బులిటెన్' అనే గుజరాతీ దినపత్రికను ప్రారంభిస్తూ, హఠాత్తుగా నారాజకీయ మార్గం లోకి వచ్చారు. కాంగ్రెస్, సోషలిస్టు పార్టీనాయకత్వం భేదాభిప్రాయంలో ఉన్న కారణంగా, కమ్యూనిస్టు పార్టీ ప్రతిపక్షంలో ఉన్నందున., నేను రైతాంగ ఉద్యమానికి ఒక అఖిలభారత వేదికను తయారు చేసుకోవాలనే సంకల్పంతో, అఖిల భారత కిసాన్ కాంగ్రెస్‌ను ప్రారంభించాను. బాగా కష్టపడుతున్న రోజుల్లో బొంబాయి నుంచి వచ్చిన ఆ సమర్థనను, చూసి, నేను చాలా సంతోషించాను. ఆతరవాత లక్నోలో జరిగిన కిసాన్ కాంగ్రెస్ వేదికపై మేమిద్దరం కలుసుకున్నాం. ఆయన సంపాదకుడిగా ఉంటూ, ఆకిసాన్ బులిటెన్‌ను మాన పత్రికగా నడిపాలనే మా ప్రతిపాదనను ఆయన అంగీకరించారు. ప్రముఖ బీహార్ రైతునాయకులు స్వామి సహజానంద సరస్వతి గారు కూడా ఆయన స్నేహాన్ని బాగా అభినందించారు. భారత సామాజిక విప్లవ కృషిలో సాధారణ ప్రజల పాత్రను పెంచేందుకు కృషి చేస్తున్న ఒక మంచి పత్రికా రచయితగా మాత్ర మే ఆయన మాకు తెలుసు, అంతకు ముందు ఆయనకున్న రాజకీయాల అనుభవాల గురించి, నాకే మాత్రం తెలియకపోయినప్పటికీ, నేను వాటిని గురించి ఏమీ ఆలోచించలేదు. ఆయన వంటి మిత్రులు అవసరం ఆనాడు నాకు ఎంతగానో అవసరమై ఉంది.

ఇందులాల్ యాగ్నిక్ నిర్మాణ కౌశలాన్ని ప్రజా ఉద్యమాల నిర్వహణలో, ఆయన ప్రదర్శించే చొరవను స్వామి సహజానంద సరస్వతి గారూ, నేనూ బాగా వినియోగించుకుంటూ, శక్తివంతమైన బొంబాయి పత్రికా ప్రపంచ సంబంధాల కోసం, ఆయన పై ఎక్కువగా ఆధారపడసాగాం. మాసంబంధాలు త్వరలోనే బాగా అభివృద్ధి చెంది స్నేహంగా మారాయి. ఆతరువాత మేము ఆయనను కిసాన్ కాంగ్రెస్ సహాయకార్యదర్శిగా నియమించి, మాలో —

కలుపుకున్నాం. ఆయన ఆంధ్రప్రదేశ్ లోని మన గ్రామాల కొచ్చారు. ఇక్కడ మన కిసాన్ పాఠశాలలోని కార్మికులతో కలిసి చాలా స్నేహపాత్రంగా ఉండేవారు. మా గోభూమిలో ఆయన ఉండి నిర్మాణ కార్యక్రమాల్లో భారతీదేవిగారు చేపడుతున్న చొరవను ప్రశంసించారు. అదేవిధంగా ఆయన బీహారులో కూడా పనిచేసి, అక్కడ స్వామీజీకి బలం చేకూర్చారు. నేను అధ్యక్ష పదవిని, శ్రీస్వామీజీకి అప్పగించే నాటికి ఆయన కూడా తన కార్యదర్శి పదవిని మరొకరికి అప్పగించారు. నేను స్వామీజీకి అధ్యక్ష పదవిని అప్పగించిన తరవాత యుద్ధంలో జైళ్లకు వెళ్ల వలసివచ్చింది. ఆకారణంగా ఆతరవాత నేనుకూడా అధ్యక్ష, కార్యదర్శి పదవులను ఇతరులకు బదలాయించ వలసివచ్చింది. కమ్యూనిస్టులు తమ ప్రజా యుద్ధనినాదాన్ని రైతాంగం లోకి ప్రవేశపెట్టాలని ప్రతిపాదిస్తున్న ఆ తరుణంలో శ్రీమతి భారతీ దేవి అఖిల భారత కిసాన్ కాంగ్రెసు అధ్యక్షురాలు గానూ, శ్రీ జి. యల్. నారాయణ కార్యదర్శిగానూ ఆయ్యారు. శ్రీమతి భారతీదేవి తన సామర్థ్యంతోనూ, ఓర్పుతోనూ వారి ప్రయత్నాలనన్నింటినీ విజయవంతంగా అడ్డుకున్నారు. 1942లో భారతదేశానికి మొదటిసారిగా క్రిప్పు మిషన్ వచ్చినప్పుడు మేమంతా విడుదల అయ్యాం.

ఆసమయంలో కమ్యూనిస్టులు స్వామీజీని, ఇందూలాల్ జీని తమ పక్షానికి త్రిప్పుకొని, మేమువారి ప్రజా యుద్ధ నినాదాన్ని వ్యతిరేకించిన కారణంగా, ఇందూలాల్ జీని అధ్యక్షుడిగా ప్రతిపాదించారు. మేము ఇందూలాల్ యాగ్నిక్ గారిని అంగీకరించాం. ఎందుకంటే ఆయన పూర్తిస్థాయి కమ్యూనిస్టు కాదు కనక. ఆయన బిహతా సభలలో మధ్యేమార్గాన్ని అవలంభించారు. ఆయన కమ్యూనిస్టులపైన కొంచెం మొగ్గ చూపించి నప్పటికీ, వారి ప్రజా యుద్ధ నినాదాన్ని ఆనాటి కిసాన్ సభ అంగీకరించలేదు. ఆ తరవాత కాంగ్రెసు 'విజయమో-వీరస్వర్గమో' అన్న నినాదాన్నిచ్చి, 1942లో గాంధీజీ క్విట్ ఇండియా ఉద్యమం ద్వారా బ్రిటిషు వారిని నవాలు చేశారు. రైతాంగ విప్లవ కార్యకర్తలమైన మేము జాతీయ వాదులమైందున గాంధీజీ పిలుపు నంగీకరించాం. అయితే ఇందూలాల్ జీ అధ్యక్షులుగా ఉన్న అఖిల భారత కిసాన్ కాంగ్రెసు కమ్యూనిస్టు లతో కలసి పని చేయటానికే నిశ్చయించుకొంది. ఆ సమయంలో ఇందులాల్ యాగ్నిక్ గారితోనూ, స్వామీజీ తోనూ నాకు ఉన్న సంబంధాన్ని వదులుకొని, ఆరు సంవత్సరాలుగా సన్నిహితులుగా మెలిగిన మాస్నేహ సంబంధాలను తెగతెంపులు, చేసుకున్నాం వారితో నాస్నేహ సంబంధాలు సజావుగానే సాగుతున్నప్పటికీ, ఎప్పటికైనా నేను జాతీయ కాంగ్రెసు తోనూ, వారు రష్యా అనుకూలురైనా కమ్యూనిస్టులతోనూ వ్యవహరిస్తుండేవారం. వారితో నాకున్న స్నేహం సర్దార్ పటేల్ గారికి నామీద అయిష్టం ఏర్పడడానికి కారణమైంది. అది నా చేతుల్లో లేకపోయినప్పటికీ ఇందూలాల్ యాగ్నిక్ గారి పనులపై సర్దార్ పటేల్ గారు ఎక్కువ అయిష్టంగా ఉండేవారు. శ్రీమహాదేవ దేశాయ్, శ్రీరాజేంద్ర ప్రసాద్‌గార్లు, క్రిచేబూన్ స్వామీజీ ఎక్కువగా ఇష్టపడేవారు కాదు. ఆతరవాత ఆరీతికి నక్సలైట్లు తమ మార్గంగా తీసుకున్నారు. అందువల్ల స్వామీజీతో ఉన్న నా స్నేహం వీరికి అయిష్టంగా ఉంటుంది.

కమ్యూనిస్టులతో వారు కలిసి నడవ గలిగింది కొద్ది కాలం మాత్రమే. కమ్యూనిస్టులు

శ్రీ కార్యానందశర్మ, శ్రీ యదునందన శర్మ గార్లను నాయకులుగా ప్రవేశపెడుతూ, ఎలా తనకు గోతులు తీస్తున్నారో, ఆతరవాత స్వామీజీ గ్రహించగలిగారు. పూర్వకాలంలో ఆయన సబర్మతి ఆశ్రమంలో ఉన్న రోజుల్లో పెంచుకున్న జాతీయభిమానాన్ని ఇందూలాల్ యాగ్నిక్ గారు విడిచి పెట్టలేకపోయారు. అందువల్ల ముందు గా స్వామీజీ, ఆతరవాత ఇందూలాల్ గార్లు కమ్యూనిస్టుల నుంచి దూరంగా వెళ్లి స్వతంత్రంగా ఉండేందుకు ప్రయత్నించసాగారు. గాంధీగారి సంపోమేరకు 1945లో తిరిగి అందరం కలిసి పనిచేసేందుకు గాను చర్చల నిమిత్తమై వారు బొంబాయిలో నన్ను కలుసుకున్నారు. గాంధేయమార్గంలో ఉన్న నాయకులలో తమ కున్న విభేదాలను సర్దుబాటు చేసుకునేందుకు నన్ను మధ్యవర్తి గా వ్యవరించవలసిందని ఇందూలాల్ యాగ్నిక్ గారు కోరారు. స్థానికంగా ఉండే కాంగ్రెసు నాయకులు తమ పై విశ్వాసంతో ఉండనందున ఈ ప్రయత్నం విజయవంతం అవుతుందని వారు అనుకోలేదు. ఆ విధంగా రైతాంగ వేదికపై మేందరం కలిసి పని చేసేందుకు కలిగిన ఆ ఆఖరు అవకాశం స్థానిక కాంగ్రెసు నాయకులు విముఖత కారణంగా విఫలమైంది.

ఆ తరవాత 15 సంవత్సరాల పూర్తికాలం ఇందూలాల్ యాగ్నిక్ గారు రాజకీయాల నుంచి దూరంగా ఉండి, తన స్వంతపట్టణమైన నాడియాద్ ఆశ్రమంలో అనేక మంది కార్యకర్తలతో ఉంటూ వారికి శిక్షణ నిస్తూ అహమ్మదాబాద్ నగరంలో మంచి సంబంధాలను పెట్టుకొని నడుస్తూ కార్మిక సంఘాలపై కొంత పట్టును కలిగి ఉంటూ, గాంధేయ విధానంలో ఉపవాసం, నిరసన దీక్ష నిర్మాణ వ్యవహారాల వంటి వాటిల్లో కార్యకర్తలకు శిక్షణ నిస్తూ గడిపారు.

కాలక్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా విశ్వాసాన్ని కోల్పోవడం కారణంగా కాంగ్రెసు సంబంధ బాంధవ్యాలను కలిగి ప్రవర్తించలేని కారణంగానూ, ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక శాసనాలు రైతులను దూరంచేసుకున్నందువల్ల ఒక రకమైన స్తబ్ధత ఏర్పడింది. ప్రజలు సంయుక్త బొంబాయి రాష్ట్రం నుంచి భాషా ప్రాతిపదికపై విడిపోవడమే దీనికి సరియైన మార్గమని ఆలోచించసాగారు.బాగా రాజకీయ దూరదృష్టి కలిగిన శ్రీ ఇందూలాల్ యాగ్నిక్ ఈ అవకాశాన్ని వినియోగించుకొని మహా గుజరాత్ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు.

ఆనాడు ఆ ఉద్యమ నాయకులు, నా సహచరులు కౌదల్ నాయకులైన శ్రీ దాదాభాయ్ ఆమీన్ గారింట్లో సమావేశమై సంయుక్త బొంబాయి రాష్ట్ర కాంగ్రెసు నాయకులకు వ్యతిరేకంగా దీర్ఘకాలంగా పోరాటం నడుపుతున్న ఇందూలాల్ జీని తమ నాయకునిగా ఎన్నుకున్నారు.

ఇందూలాల్ జీ ఈ అవకాశాన్ని చక్కగా వినియోగించుకొని మహా గుజరాత్ ప్రజలకు, అందులో ముఖ్యంగా శక్తివంతమైన అహ్మదాబాదు నగరజనాన్ని దీర్ఘకాలంగా తాము ఎదురు చూస్తున్న ప్రత్యేక రాష్ట్ర పోరాటంలో ముందుకు నడిపించారు.

మహోన్నతంగా సాగిన ఆ ఉద్యమ ఫలితంగా శ్రీ ఇందూలాల్ అనేక మంది ఆయన అనుచరులతో నూ, అందులో ఎక్కువ మంది మాజీ కాంగ్రెస్‌వాదులు. కాంగ్రెస్‌లో ఉన్న రైతు, కూలీ నాయకులతో పార్లమెంటు వేదకమీద కలుసుకోగలిగాం. నా కిసాన్ సహచరులైన మెహసానాకు చెందిన షరుబాయ్ పటేల్ అహమ్మదాబాద్ కు చెందిన నాధూభాయ్

కమిన్, సమర్‌ఖండ్ గారలు ఇంకా మహాగుజరాత్ ఉద్యమం తరపున శాసన సభలోకి వచ్చారు. మొహోద్భటంగా కొనసాగిన ఆ ఉద్యమం ఫలితంగా శ్రీ ఇందూలాల్ యాగ్నిక్ చాకచక్యంగా బృహత్ మహారాష్ట్ర నాయకులతో సంప్రతించి, వాతో సయోధ్య సాధించిన కారణంగా, జవహర్లాల్ నెహ్రూగారు, అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చవాన్, కేంద్రహోంశాఖ మాత్యులు మొరార్జీదేశాయ్ గారు, బొంబాయి రాష్ట్రాన్ని విడగొట్టి గుజరాత్, మహారాష్ట్రలను ఏర్పాటుచేయడానికి అంగీకరించక తప్పలేదు. దానితో ఇందూలాల్ యాగ్నిక్‌గారు గుజరాత్ రాష్ట్ర ఏర్పాటుకు నాందీవాచకం పలికిన ఉత్తమ నాయకుడిగా గౌరవాన్ని సంపాదించుకున్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడుతుందని తేలిపోవడంతో, పూర్వం నాయకులుగా కొనసాగుతున్న కాంగ్రెసు పెద్దలు ఇందూలాల్ యాగ్నిక్ గారిని తిరిగి వెనక్కిపెట్టి, రాజకీయంగా ప్రయోజనకరంగా ఉంటుందనుకొన్న ఆ అవకాశాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నారు అయితే ఇందూలాల్ దీనితో అసంతృప్తి చెందక, అహమ్మదాబాద్ దగ్గర పారిశ్రామిక, కార్మిక సంబంధాల్లో ప్రత్యేక శ్రద్ధవహిస్తూ, కష్టించి పనిచేసే ప్రజలతో విజయవంతమైన సంబంధాలను పెట్టుకోసాగారు. ఆప్రయత్నంలో అంతకు ముందే కార్మిక వ్యవహారాలపై తమ ఆధిపత్యాన్ని కోల్పోయిన కమ్యూనిస్టులు తనకు అందించిన అనుభవాలేమిటో, శ్రీ ఇందూలాల్, శ్రీ మొరార్జీదేశాయ్‌ని వ్యతిరేకిస్తున్న కారణంగా గుజరాత్ రాష్ట్రంలో మొరార్జీదేశాయ్ పాత కాంగ్రెసు అధికారాన్ని త్రోసివేసేందుకు ముందుచూపుతో, ఆయన శ్రీమతి ఇందిరాగాంధీతో చేతులు కలిపి, కొత్త కాంగ్రెసులో ప్రవేశించారు. నూతనంగా, శక్తివంతమైన కాంగ్రెసు నాయకత్వా స్థానానికి అనేక క్లిష్ట పరిస్థితులను అధిగమించి, ఆయన చేరుకోగలిగారు.

మా అదృష్టవశాత్తూ మేమిద్దరం అనేక మార్గాలలో పయనించినప్పటికీ, ఆఖరుకు నూతన సామాజిక విప్లవంలో ఆదిలో మేము అభిప్రాయపడి, అభిమానించిన రాజకీయ వ్యవస్థలో తిరిగి కలుసుకునే అదృష్టాన్ని పొందగలిగాం.

ఇందూలాల్ గారు బాగా, బలంగా, పాడవుగా ఆర్యసంతతి వ్యక్తిలాగా, అందంగా, పాడవైన చేతుంతో, గత కాలంనాటి ఒక యోధునిలాగా ఉండేవారు. ఆశ్రమాలలో ఉండి అన్ని సుఖాలను విసర్జించి, జీవిస్తున్నప్పుడు కూడా, ఆయన చూడ ముచ్చటగా కనిపిస్తూండేవారు. మాకు పరిచయమయ్యే నాటికి ఆయన వయస్సు 50 సంవత్సరాలు. అప్పటికికూడా ఆహారం తీసుకుంటూ ఎంతో అందంగా పోయిగా గడుపు తుండేవారు. నేను, నా భార్య శ్రీమతి భారతీదేవి అందించే ఆతిథ్యాన్ని ఆయన ఎక్కువగా మెచ్చుకుంటూ ఉండేవారు.. మాశాఖాహార భోజనాన్ని ఆయన ఆనందంతో స్వీకరించేవారు. ఆయన ఢిల్లీకి వచ్చినప్పుడు నాతోనే ఉంటూ ఉండేవారు. నాడియాద్ ఆశ్రమంలో, విశ్రాంతి తీసుకున్న తరవాత, అక్కడ దీర్ఘకాలపు ఉపవాస దీక్షలలో, ఆత్మశక్తితో, ఆయన పునరుజ్జీవించిన కొత్త శక్తితో అక్కడి నుంచి బైటికి వచ్చారు. వదులైన పాడవుగా ఉండే ఖద్దరు ట్రౌజర్లతో, దాని పైన ముతక ఖద్దరు షర్ట్‌తో, భుజాలకు అడ్డంగా ధరించిన బెల్టుతో బాగా లోపలకు పీక్కుపోయిన బుగ్గలతో, విశాలమైన నుదుటి భాగంతో, ఛామన ఛాయతో ఒక గొప్ప వేదాంతి లాగా ఉండేవారు. ఇందూలాల్ మన గ్రామీణ ప్రాంతాలలోని ప్రాచీన సన్యాసులు మనకు కనిపించేవారు.

శ్రీ ఇందూలాల్ యాగ్నిక్

పార్లమెంట్‌లో శ్రీ ఇందూలాల్ యాగ్నిక్ గుజరాత్ ప్రజలు మహా నాయకుడిగా, ఆయన సంపాదించుకొచ్చిన గౌరవానికి తగినంత స్థానాన్ని పొందలేదు. ఎందు కంటే అప్పటికే ఆయన బాగా పెద్దవారై పోయారు. మాట పటుత్వం తగ్గిపోయింది. ఆయన మాట్లాడే హిందీ భాష అంత శక్తి వంతమైంది కాదు. ఆయన నలుగురితో కలిసి, తిరిగేందుకు అంత ఉత్సాహాన్ని ప్రదర్శించేవారు కాదు. శారీరకంగా ఆయన అనుభవిస్తున్న అనారోగ్యం ఆయనను అంతకు మించి ముందుకు నడవనివ్వలేదు. ఆయన తన జీవనంలోని ఆఖరు పన్నెండు సంవత్సరాలు పార్లమెంటులో ఉండ గలిగినందుకు ఆసమయంలో నాయకులైన వారందరితో సహకరిస్తూ తన అభిప్రాయాలను, ఆలోచనలను, నలుగురితో పంచుకుంటూ, జీవించగలిగినందుకు నాకు చాలా సంతోషం కలిగింది.

చిత్రకారులు – శ్రీ యలవర్తి లక్ష్మయ్య

భారతీదేవిగారు చిత్రకారులలో మాకు స్నేహితులుగా ఉండే, పలనాటి గుర్రం మల్లయ్యగారిని, మచిలీపట్టణం జాతీయ కళాశాలకు చెందిన అడివి బాపిరాజుగారిని, దృఢ చిత్తం కలిగిన గాంధేయవాది, సంజీవదేవ్ గారి పట్ల ఉదారబుద్ధిగల సమర్థులైన చిత్ర కారులు పచ్చల తాడి పర్రుకు చెందిన శ్రీ యలవర్తి లక్ష్మయ్యగారిని సంతోషంతో కలుస్తూ ఉండేవారు.

శ్రీ యలవర్తి లక్ష్మయ్యగారు మద్రాసు చిత్ర కళాశాల నుంచి డిగ్రీ పుచ్చున్నారు. ఆయన కున్న అనుబంధాలు చాలా గొప్పవి. ఒక చిత్ర కారుడిగా, శిల్పిగా ఐరోపా కళలకు కాణాచియైన రోమునగరానికి వెళ్లటానికి ఆయన నిర్ణయం తీసుకొన్నారు. సెయింట్ పీటర్సు చర్చి తాలూకు ప్రముఖ శిల్పి, చిత్ర కారులైన శ్రీమైకేల్ ఏంజలో గారి అద్భుత చిత్రకళా కల్పనలోని సౌందర్యాలను ఆయన ఆస్వాదిస్తుండేవారు. యూరోపులో గడపిన రోజుల్లో ఆయన చిత్ర కళలో సాంప్రదాయ రీతుల్లోనూ, నవీన పద్ధతుల్లోనూ ప్రత్యేక శిక్షణను పొందారు. రోమ్ నగరంలో యలవర్తి లక్ష్మయ్యగారు ఉన్నత గౌరవాన్ని పొందారు. రోమ్‌లోను పరిసరకళా కేంద్రాలలోను, తన చిత్రకళ ప్రదర్శనలను జరిపేందుకు ఆహ్వానించబడ్డారు. అక్కడ చిత్రకళను గురించి వ్యాఖ్యానించగలిగిన ప్రముఖ కళాకారులు, పత్రికలవారు ఆయన చిత్రాలు కొనియాడారు.

శ్రీ యలవర్తి లక్ష్మయ్యగారు భారతదేశం తిరిగి వచ్చిన తరవాత నిడుబ్రోలులోని ప్రఖ్యాత పి. బి. యన్. కాలేజీకి చెందిన శ్రీ పాములపాటి బుచ్చి నాయుడుగారి ఆదరణను, ఆంధ్ర క్రైస్తవ కళాశాలలోని అనేక మంది అమెరికన్ల ఆదరణను, ఆంధ్ర విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుల ప్రోత్సాహాన్ని పొందగలిగారు.

నిడుబ్రోలు పి. బి.యన్. కళాశాల దాతలలో ఒకరైన శ్రీమతి మంగమ్మ కంచు విగ్రహాన్ని తయారుచేయడంలో ఆయన ప్రదర్శించిన శిల్ప కళారీతి హైందవ స్త్రీ ఔన్నత్యానికి దర్పణం పట్టేదిగా ఉండి యలవర్తి చిత్రాలు రంగులను చూపించడం మాత్రమే గాకుండా ఆయా చిత్రాలలో భావవ్యక్తీకరణ ను గూడా ప్రదర్శిస్తూ ఉండేవి.

భారతీదేవి గారు, నేనూ మా గోభూమిలోని మధ్య చావడిలో కూర్చున్నపుడు, సేవాగ్రాంలో మహాత్మాగాంధీ గారితో నేనున్న చిత్రాన్ని ఆయన ప్రత్యేకంగా గీసిన దానిని చూస్తూ చాలా సంతోష పడేవాళ్లం. ఆ చిత్రంలో 1939- 40 ప్రాంతంలో మహాత్మాగాంధి గారు సాయం సమయ వ్యాహ్యాళికి బయలుదేరటానికి ఉద్యుక్తు లౌతున్న సందర్భంలో నేను చేసిన ప్రణామాన్ని ఆయన స్వీకరిస్తున్న దృశ్యాన్ని వారు చిత్రీకరించారు. సూర్యాస్తమయం కానున్న ఆ సంధ్యాసమయంలో బాపూ తన పాదాన్ని ముందుకు వేస్తూ తన చేతి కర్రను సరంగా మోసారు. లక్ష్మయ్య గారి చిత్రీకరణలో బాపూ, స్వామి వివేకానంద, 'నాయకుడు యిలా

ఉండాలని కోరుకున్న రీతిలో "రక్తంలో శక్తి, నరాలలో పటుత్వం యినువ కండరాలతో" కనిపిస్తుంటారు. నన్ను బావూతో నాకున్న సన్నిహిత సంబంధాల సంతృప్తి తోను అయన వట్ల నాకున్న ఆరాధనా భావం ప్రస్ఫుటంగా కనుపించే రీతితోనూ చిత్రికరించారు. సాయం సంధ్యా సమయంలో నీలి ఆకాశంలో దిగజారుతున్న వెలుగు రేఖలను ప్రస్ఫుటంగా చూపిస్తూ మా వెనక సన్నివేశాన్ని చిత్రికరించారు. మాచర్ల సందర్శంలో మేము దానిలో లీనమైపోయి ఒక దివ్యమైన అనుభూతిని పొందుతూ ఉండే వారం. మా ఇద్దరి చిత్రికరణలోనూ ఒక గొప్ప భావ సమన్వితమైన, భవిష్యత్తు కోసం కృషి చేయాలనే గొప్ప తలంపుతో కూడిన పట్టును అయన ప్రదర్శించి చూపించారు. ఈ చిత్రకారుని ఊహా జనిత సంకల్పమైన ఈ ఉన్నత చిత్రాన్ని ఒక ప్రెస్‌గ్రాఫర్ తీసుకొని "ఆంధ్రపత్రిక" దినపత్రికలో ప్రచురించారు. ఆ తరవాత మా తెలుగు వారపత్రిక వాహినిలోనూ ప్రచురితమై అది గోగినేని ఉమామహేశ్వరరావుగారి ఫోటో ఆల్బంలోకెక్కింది. ఎంతో గొప్ప చిత్రకారుడైతేనే గాని ఇంతటి గొప్ప చిత్రాన్ని చిత్రికరించలేరని శ్రీమతి భారతీదేవి చెప్పారు. మాచెట్స్, అమెరికాలో స్థిరపడిన ఫ్రెంచి దేశంలో జన్మించిన కెనడా వారైన శ్రీ 'రెనెపెర అనే ప్రముఖ చిత్రకారులు చిత్రించి మా కిచ్చిన ప్రముఖ చిత్రాలతో పాటు దీనిని కూడా ముందు హాలులో పెట్టి ఆ చిత్రం ప్రాముఖ్యాన్ని అత్యంత గౌరవంగా భద్రపరుచుకొంటూ ప్రదర్శనకు పెట్టాం.

14606
అన్నమయ్య ఆధ్యాత్మిక గ్రంథాలయం
అన్నమయ్యవీధి, గుంటూరు-6